శ్రీ విష్ణు సహస్రనామము

(చతుర్థ భాగము 302-401 నామ వివరణ)

మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

శ్రీ విష్ణు సహస్రనామము

(చతుర్థ భాగము 302-401 నామ వివరణ)



మాస్టర్ కె. పార్వతికుమార్

ధనిష్ఠ



ధనిష్ఠ

స్వచ్ఛంద సేవా సంస్థ

"ధనిష్ఠ" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"ధనిష్ఠ" మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"ధనిష్ఠ" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్దోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, 1993 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ e-Books రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ చతుర్థ భాగము

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ E.K. గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణుసహస్రనామములో నామ విభజనను ప్రాతిపదికగా తీసుకునుట జరిగినది.

ఈ ప్రయత్నములో పాల్గొనుచున్నవారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి మాస్టరుగారి ఆశీస్సులు అందాలని మాస్టరు గారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ క్రోధినామసంవత్సర విశాఖపట్టణ గురుపూజలలో శ్రీ విష్ణు సహస్రనామ వివరణ చతుర్థ భాగము- 302 నుండి 401 నామములకు- శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ట

ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకొనేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్ఠమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ప్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము,

ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్టాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే!. 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు

తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు, వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేసారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకొని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేసాం, కీర్తనలు చేసాం, స్తోత్రం చేసాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేసాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా 'స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే ! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి

శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకొని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete

కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని "విశ్వం విష్ణుర్వషట్కారో" అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ,"విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు" అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటో? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పారపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకొనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ fresh గా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే

వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పుకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష్య అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పుడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పుడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can

understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పుడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పుడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశ్రుతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశ్రుతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పుడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పుడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు

చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పుడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు. నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్ఠానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్ఠానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్వం గూర్చి రాసామా, భగవత్ తత్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో

జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్డు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్ఠానము ముఖ్యము. అన్నింటోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతి కుమార్

విషయ సూచిక

302, 303, 304, 305, 306, 307, 308, 309 భూత భవ్య భవత్, నాథః, పవనః, పావనః, అనలః, కామః, కామప్రదః, ప్రభుః 1

310, 311, 312, 313, 314, 315, 316 యుగాదికృత్, యుగావర్తః, నైకమాయః, మహాశనః, అదృశ్యః, అవ్యక్తరూపశ్చ 12

317 సహస్రజిత్ 12

318 అనంతజిత్ 27

319, 320 ఇష్టః, అవశిష్టః 30

321 శిష్టేష్టః 34

322, 323, 324 శిఖండి, నహుషః, వృషః 43

325, 326 క్రోధః, క్రోధకృత్ 43

327 కర్తా 57

328 విశ్వబాహుః 59

329 మహీధరః 63

330 అచ్యుతః 65

331 ప్రథితః 71

332 ప్రాణః 80

333 ప్రాణదః 87

334 వాసవానుజః 92

335 అపాంనిధిః 106

336, 337 అధిష్ఠానం, అప్రమత్తః 111

338 ప్రతిష్ఠితః 114

339, 340 స్కందః, స్కందధరః 116

341, 342, 343 ధుర్యః, వరదః, వాయువాహనః 124

344 వాసుదేవః 124

345 బృహద్భానుః 131

346 ఆదిదేవః 134

347 పురందరః 137

348, 349, 350 అశోకః, తారణః, తారః 143
350 తారః 150
351, 352 శూరః, శౌరిః 163
353 జనేశ్వరః 176
354 అనుకూలః 182
355 శతావర్తః 185
356 పద్మీ 187
357 పద్మనిభ ఈక్షణః 189
358 పద్మనాభః 191
359 అరవిందాక్షః 201
360 పద్మగర్భః 208
361 శరీరభృత్ 210
362 మహర్ధి 216
363, 364 బుద్ధః, వృద్ధాత్మా 226
365 మహాక్షః 231
366 గరుడధ్వజః 235
367 అతులః 237
368 శరభః 245
369 భీమః 251
370 సమయజ్ఞః 252
371, 372 హవిః, హరిః 261
373 సర్వలక్షణ లక్షణ్యః 265
374 లక్ష్మీవాన్ 267
375 సమితింజయః 271
376 విక్షరః 277
377 రోహితః 284
378 మార్గః 287
379 హేతుః 294

380 దామోదరః 297
381 సహః 299
382 మహీధరః 302
383 మహాభాగః 320
384 వేగవాన్ 322
385 అమితాశనః 325
386 ఉద్భవః 330
387 క్షోభణః 334
388 దేవః 339
389 శ్రీగర్భః 340
390 పరమేశ్వరః 348
391, 392, 393 కరణం, కారణం, కర్తా 359
394 వికర్తా 365
395 గహనః 378
396 గుహః 384
397 వ్యవసాయః 386
398, 399 వ్యవస్థానః, సంస్థానః 391
400 స్థానదః 396
401 ధ్రువః 397

302, 303, 304, 305, 306, 307, 308, 309 భూత భవ్య భవత్, నాథః, పవనః, పావనః, అనలః, కామః, కామప్రదః, ప్రభుః

ఇందులో కొన్ని కాలానికి సంబంధించిన నామాలు, కొన్ని కామానికి సంబంధించిన నామాలు,ఈ రెండూ కాకుండా పవనుడు, పావనుడు, అనిలుడు అనే నామాలు. ఈ మూడూ మూడు భాగాలు. కాలానికి భూత భవ్య భవన్నాథః, కామం కాముడు, కామః అంటే కామాన్ని హరించేవాడు. కామప్రద అంటే కామాన్ని కలిగించేవాడు, కామప్రభువు, కామానికి అధిపతి. కాలం ద్వారా కామాన్ని కలిగించటం, ఈ రెండిటినీ అనుసంధానం చేసుకోవడానికి పవనుడు, పావనుడు, అనిలుడు. ఇలా ఒక పద్ధతిలో ఈ శ్లోకం గోచరిస్తుంది. మనకి కాలం చాలా విచిత్రమైనది, దుస్తరమైనది, ఎవరికీ తెలియటానికి అవకాశం లేని మహిమ కలది గా కనిపిస్తుంది. అందుకని సృష్టి మొత్తం అంతా కూడా కాలానికి లోబడి ఉంది. కాలాన్ని అధిగమించి ఉన్నవాడు కాలాతీతుడైన భగవంతుడొక్కడే! ఎవరి నించి కాలం వ్యక్తమైందో, ఆయనకి ఒక్కడికి మాత్రమే లోబడి ఉంటుంది, బ్రహ్మ దగ్గర నుండి మిగతా అందరూ కాలానికి లోబడి ఉండటమే! అందుకనే మనకి భగవంతుడు సర్పం మీద నృత్యం చేస్తున్న ఒక సంకేతం ఆరాధనకు ఇచ్చారు. కాళీయమర్దనం చేస్తున్న శ్రీకృష్ణమూర్తి యొక్క ధ్యానం చేసుకున్నట్లయితే, మనకు కాలం యొక్క ప్రభావం వల్ల ఇబ్బంది కలిగినప్పుడు, ఆ పట్టు తగ్గి మనకి సుఖాన్నిస్తుంది. అందుకని కాలనాధుడు భగవంతుడు. వేదంలో కాలానికి సర్పం సంకేతంగా ఇచ్చారు. ఆ సర్పం మీద నృత్యం చేస్తున్న ప్రజ్ఞగా భావన చేసుకుంటే, మనము కాలం రూపం లో, జీవితంలో రకరకాలైన ఇబ్బందులకు గురి అవ్వవలసివచ్చినప్పుడు, దాన్ని అధిగమించటానికి, ఆ భగవంతుని సహాయం లభిస్తుంది. సర్పం యొక్క పడగల మీద నృత్యం చేస్తున్న సంకేతం గ్రీకు దేశీయుల్లో కూడా ఉన్నది. వాళ్లు కూడా అపోలో అనే సూర్యవంశమునకు సంబంధించిన ఒక ప్రజ్ఞ (అంటే ఆదిత్యుల్లో ఒకాయన అన్నమాట) ఈ విధంగా సర్పం మీద నృత్యం చేస్తున్న సంకేతాన్ని పెట్టుకుని ధ్యానం చేసుకుంటారు. మనం కాలాన్ని అధిగమించలేము కాబట్టి, కాలాన్ని అధిగమించిన అంతర్యామి అయిన భగవంతుడ్ని, ఈ మొత్తం లోపలా, బయటా కూడా వ్యాపించిన భగవంతుణ్ణి ధ్యానం చేసుకోవాలి. అయితే లోపల వ్యాపించిన భగవంతుడు కూడా కాలానికి లోబడి ఉంటాడు. సృష్టిలో ఉన్న భగవంతుడిని పురుషుడు అంటారు. దానికి

అతీతంగా కూడా ఉంటాడు భగవంతుడు, అవ్యక్తమైనవాడు, అనిర్వచనీయమైనవాడు, అందులోంచే అన్నీ పుట్టుకొస్తూ ఉంటాయి, అప్రతర్క్యం, అవిజ్ఞేయం, దాన్ని గురించి తెలుసుకోలేము అంటాం. దాన్ని గురించి తర్కించలేము అంటాం. అందులోంచి పుట్టుకొచ్చిన కాలంలో మొత్తం అంతా కూడా, కాలానికి అధీనమై నడుస్తూ ఉంటుంది. కాలం యొక్క పట్టు మనమీద తొలగాలంటే, కాళీయ మర్దనం చేస్తున్న శ్రీకృష్ణుని ధ్యానం చేసుకుంటే మంచిది. కొంత తెరలు తొలుగుతాయి. భూతము, భవిష్యత్తు, భవ్యము అంటే వర్తమానము ఇలా మూడు కాలాలుగా కనిపించేది ఒకటే కాలం! ఒకటే మూడుగా గోచరిస్తూ ఉంటుంది, ప్రతిదీ అంతే! The one in three, the three in one. అని చెప్తారు. ఒకరే ముగ్గురు గా త్రిమూర్తులుగా దిగి వస్తారు. ఈ ముగ్గురిలో ఉన్నది మళ్లీ ఒకటే! మనలో ఒక సంకల్పం వచ్చి, ఆ సంకల్పానికి వృద్ధి కలిగి, ఆ సంకల్పం పరిపూర్తి కలిగి, మళ్లీ ఇంకొక సంకల్పం వచ్చి, దానికి వృద్ధి, దానికి పరిపూర్తి అంటే దాని మొదలు, దాని వృద్ధి, దాని తుది, ఇట్లా మనకి అంతా కనిపిస్తూ ఉంటుంది మూడుగా! ఈ మూడుగా ఉన్నదానికి ఏది ఆధారమో, దాని నుంచే కాలం కూడా వ్యక్తమవుతుంది. భగవంతుని యొక్క సృష్టి సంకల్పం ఏర్పడినప్పుడు కాలం కూడా మొదలవుతుంది. అంటే సంకల్పం రావటమే కాలం రావడం కూడా! ఇద్దరూ ఒక్కసారే వస్తారు. సంకల్పం అమ్మవారిగ దిగి వస్తుంది, కాలం అక్కడనించి వ్యక్తం ఔతుంది. కాలానికి నిర్వచనం ఏమిటి అంటే, రెండు సంఘటనల మధ్య ఉన్న సమయము! Time is the interval between two events. Space is the interval between two objects. రెండు వస్తువుల మధ్య కనిపించేది Space. రెండు సంఘటనల మధ్య కనిపించేది Time. సంఘటనలు లేకపోతే కాలం ఉండదు. మనం నిద్రలో ఉన్నప్పుడు మనకి కాలం ఉండదు. మనం లేచిన దగ్గర నుంచి మనకి కాలం ఉంటుంది. కానీ మనం లేవకపోయినా కాలం ఉంటుంది. మనకి లేదు అంతే!, మనం లేచినప్పటినుంచి కాలం లెక్క వేసుకుని పనులు చేసుకుంటాం. ఘటనలను అన్నిటినీ కూడా ఘటికలుగా, ఘడియలు గా లెక్క వేసుకుంటాము. అసలు మనం లేని స్థితిలో కాలం ఏదీ? అట్లాగే సృష్టి కూడా సంకల్పం గా భగవంతుడి నుంచి వ్యక్తం కాకముందు కాలం వంటిది లేదు. ఎప్పుడు కాలం మొదలైంది అంటే సంకల్పం రావటం నించి మొదలైంది. సంకల్పం వచ్చేసరికి కాలం మొదలయ్యి, కాలం నుండి సంకల్పం నెమ్మదిగా వృద్ధి చెందుతుంది. అందుకని కాలానికి బద్ధమై ఉంటుంది మొత్తం సృష్టి అంతా. తనకి వచ్చిన సంకల్పం లో నుంచి తను అంటే భగవంతుడు దిగివస్తాడు. సముద్రంలో ఉండే అలలో ఉండేది సముద్రమే కదా! అలలో సముద్రం లాగా, సృష్టిలో భగవంతుడు ఏర్పడతాడు. సృష్టిలోకి దిగివచ్చిన భగవంతుడిని

పురుషుడు అంటారు. అంటే పురములు ఏర్పరచుకోవడం మొదలు పెడతాడు అన్న మాట. అది ఎప్పటినుంచి మొదలౌతుందో ఆ మొదలు, కాలమునకు మొదలు. ఆ కాలానికి ముందు ఉన్న వాడు ఎవరు? తానే! నిద్ర లేవకముందు మనం కూడా ఉన్నాం. మనం లేచిన దగ్గర నుంచి మన కాలం మొదలౌతుంది. మన కాలంలోకి మనమే చొచ్చుకుని వెళ్తాం, పని చేసుకుంటాము. మనం లేచిన తరువాత, లేవక ముందు, లేచిన సమయం అని ఉంటుంది. అసలు లేవలేదు అనుకోండి. కాలం లేదు కదా! మన వరకు అర్థం చేసుకుంటే సృష్టి కూడా అర్థం అవుతుంది. అందుకే మానవుడు తనను పరిపూర్ణంగా అవగాహన చేసుకుంటే సృష్టిని అవగాహన చేసుకోగలుగుతాడు. అదే మనకు law of correspondence లేక పిండాండ బ్రహ్మాండ సమన్వయము అంటారు. ఆయన లోంచి సంకల్పం రావటం అమ్మవారు రావటంగా చెప్తారు. మనలోంచి సంకల్పం వచ్చేసరికి మనలో మన కాలం పుడుతుంది. ఇక్కడ మన సంకల్పం అంటే మనం లేవడమే. లేచిన తరువాత అక్కడ నించి ఒక్కొక్క event జరుగుతుంటే, అయిపోయిన కాలం కొంత జరుగుతూ ఉంటుంది. ప్రస్తుతం ఒకటి ఉంటుంది, అయిపోవటం ఒకటి ఉంటుంది, ప్రస్తుతం అయిపోవటంగా ఉంటూ ఉంటుంది ఎప్పుడూ. అందుకని భవిష్యత్తు వర్తమానం లోకి నడిచి వస్తూ ఉంటుంది, వర్తమానం భూతంలోకి వెళ్ళిపోతూ ఉంటుంది. మనం రైల్లో వెళ్తూ ఉంటే, కొంత వెనక్కి వెళ్ళిపోతూ ఉంటుంది, కొంత ముందు నించి మన దగ్గరకి వస్తూ ఉంటుంది కదా. అనిపించటమేగా అది, అట్లా వస్తుందా ఏమన్నా. ఏమీ రావట్లేదు కదా. చెట్లన్నీ మన నించి అట్లా వెళ్ళిపోతున్నట్లుగా ఉంటుంది, అట్లా ముందు నించి వచ్చి వెనక్కి వెళ్ళిపోతున్నట్లుగా ఉంటుంది. కొండలు ముందు నించి వచ్చి వెనక్కి వెళ్ళిపోతూ ఉంటాయి, ఊళ్లు వస్తూ ఉంటాయి, వెళ్ళిపోతూ ఉంటాయి. అనకాపల్లి వచ్చిందా అంటాం. అనకాపల్లి రాదు. కానీ నిజానికి వచ్చింది, వెళ్ళిపోతుంది రెండూ అనిపిస్తుంది కదా. అది నిజమా, భ్రమా? భ్రమే అయినా నిజంగానే అనిపిస్తుంది. భ్రమ అని తెలిసినప్పటికీ నిజంగానే ఉంటుంది. అనకాపల్లి వెళ్లిపోయిందండీ అంటాడు నిద్రలేచినవాడు. అనకాపల్లి దాటి నిద్ర లేస్తే. ఎక్కడ ఉన్నాం అంటే తుని వస్తోంది అంటాం. తుని రావటం ఏమిటి, అనకాపల్లి వెళ్ళిపోవటం ఏమిటి. అవన్నీ అక్కడే ఉన్నాయి. వీడు ప్రయాణీకుడు కదా! అట్లాగే మనం సృష్టిలో ప్రయాణీకులం. ప్రయాణీకులు అవటం వల్ల మనకేవో కొన్ని అయిపోయినట్టుగానూ, కొన్ని వస్తున్నట్టు గానూ ఉంటాయి. అయిపోవటం, రావటం, ఇవన్నీ కూడా, ఆ వెనక ఉండే అంతర్యామి స్థితి నుండి చూస్తే ఏమీ లేదు. ఉన్నట్టుగా ఉంటాయి. అది కాలం యొక్క మడతలు. మనని భ్రమలో పెడుతుంది. ఏదో time అయిపోతున్నట్లుగా పరిగెడుతూ వుంటాం ప్రతి దానికి. అయిపోవటం

ఏమిటి, అయిపోవటం ఏమీ ఉండదు. ఎందుకిట్లా అవుతోంది అంటే, తనలోంచి సంకల్పం వచ్చినప్పుడు అందులోంచి కాలం పుట్టి, ఆ కాలం అనుసారంగా ఈ సంకల్పంలోకి తను దిగి వచ్చి, కార్యక్రమాలన్నీ త్రిగుణాత్మకంగా నిర్వర్తిస్తూ ఉంటాడు. త్రిగుణాత్మకం అంటే రజస్సు, తమస్సు, సత్వం అంటాం. లేకపోతే రజస్సు అంటే బ్రహ్మ అంటాం. సత్వం అంటే విష్ణువు అంటాం. తమస్సు అంటే శివుడు అంటాం. అదే అమ్మవారి పరంగా అయితే ఒకటి ఇచ్ఛాశక్తి అంటాం. రెండవది జ్ఞాన శక్తి అంటాం. మూడవది క్రియాశక్తి అంటాం. ఇట్లా త్రిభుజాకారంగా ప్రకృతిలోకి మనం దిగి వస్తూ ఉంటే ప్రకృతి, కాలం కలిసి మొత్తం అంతా నడిపిస్తూ ఉంటాయి. ఆయన ఊరికే సహకారం అందిస్తూ ఉంటారు. కాలము, ప్రకృతి, ఒకదానితో ఒకటి అనుసంధానం చెంది ఉంటాయి. అనుసంధానం చెంది ఉండి మొత్తం కార్యక్రమం అంతా త్రిగుణాత్మకంగా నడిపిస్తూ ఉంటే కాలం కూడా మూడు భాగాలుగా కనిపిస్తుంది. అన్నీ మూడు భాగాలుగా కనిపిస్తుంటాయి. ఈ మొత్తం సృష్టి అంతా, ఏది చూసినా మూడు భాగాలుగా కనిపిస్తుంది. ఇప్పుడు మనం చెప్పుకుంటూ ఉంటే ఈ చెప్పేవాళ్ళు ఒకరు, వినేవాళ్ళు ఒకరు, చెప్పటం అనేటువంటిది ఒకటి ఉంది కదా! మూడుగా మనకి అనిపిస్తుంది కానీ ఇందాక రైలుపెట్టెలో వెళ్తున్నవాడికి సత్యం ఎంతో ఇది కూడా అంతే సత్యం. ఏకాత్మ భావం పొందినటువంటి వాడికి, ఇంక చెప్పటానికి ఏమీ ఉండదన్నమాట. అంతా అది అయిపోయి కూర్చున్న వాడికి ఇంక మాట్లాడటానికి ఏమీ ఉండదు. దక్షిణామూర్తిలా అట్లా కూర్చుంటాడు. అంతే! అంతా ఒకటే కాబట్టి వీడిలో ఉన్నది అవతల వాడిలోకి అందిపోతూ ఉంటుంది. మనకి బాగా వెలుగు తగ్గటం వల్ల చెప్పుకుంటున్నాం. ఇంకొంచెం వెలుగు పెరిగితే చెప్పుకోవక్కర్లేదు అట్లా కూర్చుంటే, ఒకరిలోకి ఒకరు అట్లా చూసుకుంటూ ఉంటే, భావాలు అందిపోతాయి. భావం కూడా లేకుండా భావానికి ఉండే బీజాలు అందించేస్తే అవి వాళ్ళు లోపల నానేసుకుని అందులోంచి తెలుసుకుంటూ ఉంటారు. ఇట్లా రకరకాలుగా ఉంటుంది. ఎంత ఏకాత్మ భావం చెందుతూ ఉంటే అంతలా తెలుస్తూ ఉంటుంది. ఇప్పుడు మన ఒంట్లో ఒక చోట ఏదన్నా జరుగుతూ ఉంటే మొత్తం అంతా తెలియట్లా? అట్లా అంతా తెలిసిన స్థితి, ఒకటి నించి మూడు అవుతూ ఉంటాయి అన్నీ. ఈ మూడు అయినప్పుడు కాలం కూడా మూడుగా ఉన్నట్టు తయారైపోతూ ఉంటుంది. ఈ ప్రకృతి, కాలం అల్లే అల్లికలో భగవంతుడి యొక్క సహకారం ఉంటుంది. వాటికి లోబడినట్లు ఉంటాడు కానీ, దానికి అతీతుడుగా ఉంటాడు. ప్రకృతిలోనూ పని చేస్తూ ఉంటాడు, కాలంలోనూ పనిచేస్తూ ఉంటాడు. అందుకని భగవంతుడిని కాలస్వరూపుడు అంటారు. ప్రకృతిలో పనిచేసే భగవంతుడిని అంతర్యామి అంటారు. అంతర్ అంటే లోపల ఉన్నటువంటి స్థితి. బహిర్, అంతర్

అనేవి రెండు లేనటువంటి స్థితి ఒకటి ఉంది. ఇల్లు కట్టిన తరువాత ఇంట్లో చోటు, ఇంటి బయట చోటు ఉంది. ఇల్లు కట్టకపోతే? ఒకటే చోటు. ఆవరణలు ఏర్పడినప్పుడు కదా, లోపల, బయట వచ్చినాయి. అంతర్యామి అంటే లోపల తిరుగుతూ ఉంటాడట. 'ప్రజాపతిశ్చరతి గర్భే అంతః'. లోపల తిరుగుతూ ఉంటాడంటే, బయట, లోపల ఉన్నట్లేగా! ఆ బయటవాడు ఎవడు? భగవత్ తత్వం! ఇక్కడ భగవత్ తత్వం ఏమిటంటే కాలానికి బయట ఉన్నవాడు, సృష్టికి బయట ఉన్నవాడు ఒకటే. Plane of playground లో ఉన్నప్పటికీ, లేడుట. కొంత ఉన్నాడు, కొంత లేడు. అది సత్యం! అది ఒక్క కృష్ణుడే! యుద్ధంలో ఉన్నాడు, లేడు. యుద్ధం చేశాడు, చేయలేదు. చక్రం పట్టాడు, పట్టలేదు. ఇట్లా అది పరాకాష్ట. అలా ఇంకెవరూ ఉండటానికి అవకాశం లేదు. చేశాడు అంటే చేశాడు అనటానికి లేదు. చేయలేదు అంటే చేయలేదు అనటానికి లేదు. మనం అట్లా జీవిత సన్నివేశాలని అధిగమించి ఉన్నట్లయితే, కాలాన్ని అధిగమించి ఉన్నట్లు. మనం మామూలుగా సన్నివేశంలోకి వెళ్ళిపోతాం. భగవంతుడు సృష్టి లోపలికి వెళ్ళినప్పటికీ కూడా, బయటగా ఉంటాడు. పడవ ఉందనుకోండి. కొంత నీళ్ళల్లో ఉంటుంది, కొంత నీళ్ళ పైన ఉంటుంది. నీళ్ళల్లో ఉందా? అంటే ఉంది. నీళ్ళల్లో ఉందా? అంటే లేదు. భాగవతంలో శ్రీకృష్ణుడు గురించి ఉద్ధవుడు అటువంటి ఉదాహరణ ఇచ్చాడు. ఎంత మంచి ఉదాహరణ అది. మనలో ఒకడుగా ఉన్నాడు కానీ మనలో ఒకడు కాదు. వాడూ, దివ్యపురుషుడు! ఒకటిగా చూస్తే మనలో ఒకడే. కానీ మళ్ళీ మనలో ఒకడు కాదు. దివ్య పురుషుడు దిగీ, తేలినట్టు ఉంటాడు. మనం మునిగివుంటాం. అదీ తేడా! భగవంతుడు కాలానికి, సృష్టికి అతీతుడుగా ఎట్లా ఉన్నాడో జీవుడు, కాలానికి సృష్టికి లోబడి ఎట్లా ఉన్నాడో చెప్పటానికి నీళ్లలో తేలుతున్న పడవా (భగవంతుడు) నీళ్ళల్లో ఉండే చేపా(జీవుడు)ఉదాహరణ గా చెప్పకోవాలి. పెద్ద పడవ లేదా ఓడ కనపడితే, దాని కింద భాగం చూసి అబ్బో ఏదో పెద్ద చేప అని చేపలన్నీ అనుకున్నాయిట, మనం అంతా కూడా శ్రీకృష్ణుని గురించి అట్లాగే అనుకున్నాం, కానీ మనలో ఒకడు కాదు ఆయన, మనలో ఒకడుగా ఉన్నాడు, అని చెప్తాడు ఉద్ధవుడు. అదీ అతీతంగా ఉండటం అంటే! లోబడినట్లు ఉంటాడు కానీ లోబడడు. అతడికి దిగిరావటం తను, కాలము, సంకల్పము/ ప్రకృతి, కాలము, భగవంతుడు గా ఉంటుంది. కాలం ఆధారంగా ప్రకృతిలోకి భగవంతుడు ఆకర్షింపబడుతూ ఉంటాడు. ఎట్లా ఆకర్షింపబడతాడు? మనలోంచి మనకి ఒక సంకల్పం వచ్చినప్పుడు దాంట్లోకి మనం ఆకర్షింప బడతాం కదా! మనలో ఒక సంకల్పం వచ్చింది. విష్ణు సహస్రనామం చెప్తామని, విందామని. మన సంకల్పం లోకి మనని లాక్కుంది, అయితే రా అని. ప్రతి సంకల్పం కూడా మనని అట్లా పుంజుకుంటుంది. సంకల్పం ఏర్పడిన తరువాత సంకల్పం మనని పుంజుకుందే,

ఆ పుంజుడునే కామం అంటారు. భగవంతుడి లోంచి సంకల్పం రాంగానే, ఆ సంకల్పం భగవంతుడి లోంచి భగవత్ శక్తిని పుంజుకుందన్నమాట. ఆ పుంజుకోవడం వల్ల, ఆ సంకల్పానికి బలం వస్తుంది. పుంజుకోలేదు అనుకోండి సంకల్పం రాలిపోతుంది. అదీ కామేశ్వరి అంటే! ఆయనని తనలోకి జుర్రుకుని, ఆయన బలం చేత, ఆయన జ్ఞానం చేత అన్నీ చేస్తూ ఉంటుంది. అట్లా నిర్మాణం చేస్తూ ఉంటుంది. అట్లాగే మన సంకల్పం కూడా. ఒక సంకల్పం వచ్చిందంటే ఊరుకుంటుందండీ మనల్ని? చావగొట్టి చెవులు మూస్తుంది. ఒద్దు, అన్నా కూడా లాక్కెళ్ళిపోతుంది కదా, ఎన్ని చోట్లకి అట్లా వెళ్లిపోలేదు మనం? అక్కర్లేని చోట్లకి వెళ్ళామా లేదా? అదీ కామం అంటే! మనకి బాగా అర్థం అవటం కోసం ఇలా చెప్పుకుంటున్నాం. ఆయన కామేశ్వరుడు, ఆమె కామేశ్వరి. ఆయనలోంచి బయటకి వచ్చి, ఆయన ముఖంలోకి చూడగానే ఆయన అందులోకి ఆకర్షింపబడతాడు. పెళ్లి చూపులు అవగానే పెళ్ళికొడుకు నేను ఇక్కడే ఉంటాను నాన్నా అని చెప్పినట్టుగా ఉంటుంది మనపని. ఎప్పుడూ? ఆయనలోంచి సంకల్పం రావటానికి కాలం నిర్ణయం అయితే. లేదనుకోండి, కాల్చేస్తాడు ఆయన. మన్మధుడి బాణాలంటే ఏమిటి, పంచేంద్రియాలలోంచి పుట్టుకొస్తాయి, సంకల్పాలు. అందుకని ఆ బాణాలు పట్టుకుని తిరుగుతుంటాడుట. ఐదు ఇంద్రియాలు, ఐదు బాణాలు. ఐదు బాణాల తోటి పీకుతూ ఉంటాడు అక్కడికి పోదాం రా, ఇక్కడికి పోదాం రా, వాళ్ళని చూద్దాం పద, అది తిందాం పద. అది తినటం కోసం ఎంత దూరమైనా పోతాం. ఎప్పుడో ఏదో ఊరు, పదేళ్ల క్రితం వెళ్తే, మళ్లీ అదే ఊర్లో అక్కడికే వెళ్లి అదే తిందాం అనిపించదూ? చూడటం, తినటం, వినటం, వాసన పీల్చడం. అలవాట్లు ఏర్పడి, వాటి ద్వారా అవి పీకవు మనని? అట్లా పుంజుతూ ఉంటాడు. అది కామం. మనకి, వచ్చిన సంకల్పానికి మనం సహకరించటం వేరు, అది మనని పట్టుకుపోవటం వేరు. భగవంతుడి విషయంలో కామం ఏమిటంటే సహకారమే! మన విషయంలో కామం ఏమిటయ్యా అంటే, అది మనని ఎత్తుకుపోతుంది. ఇట్లా జేబులో వేసుకొని శుభ్రంగా అడ్డమైన బజార్లు తిరగేసిన తరువాత, మళ్లీ మనం నిస్త్రాణగా ఉన్నప్పుడు అక్కడ పారేసి పోతుంది. మళ్లీ మనం కాస్త ఓపికగా ఉంటే మళ్లీ వస్తుంది, ఇంకొకటి. అది కామం! కామం ద్వారా, భగవంతుడు సహకరించటం వలన, ప్రకృతి వ్యక్తమవుతుంది. అలా పుడతాడు బ్రహ్మ. అట్లా అన్నీ పుట్టుకొచ్చి పెరిగి వృద్ధి చెందటం, మళ్లీ వెనక్కి తెచ్చుకోవటం, అట్లా మొదలవగానే ఏమవుతుంది అంటే కాలం మొదలయింది అంటారు. సృష్టి కి మొదలు వచ్చింది అంటారు. ఆ మొదలు అంటే బ్రహ్మగారు పుట్టారు అంటారు. ఆయనకి వంద సంవత్సరాలు అంటారు. అవి అయ్యే లోపల ఒక సృష్టి పూర్తి అవుతుంది. ఒక సృష్టి పూర్తి అయితే ఆగిందా, ఇంకో సృష్టి వస్తుంది. ఒకటి

జరుగుతుండగానే ఇంకొకటి వస్తూ ఉంటుంది. మనం ఒక పని చేస్తూ ఉంటే సగం పనిలో ఇంకొక పని కూడా మొదలు పెట్టం? ఒక industry పెట్టినవాళ్లు అది సగంలో వుండగానే ఇంకొక industry పెడుతూ ఉంటారు. ఏమిటంటే అంతే. ఒక పిల్లవాడు పెరుగుతూ వుండగానే, ఇంకొక పిల్లవాడిని పుట్టించుకుంటున్నాము కదా. పిల్లల్ని పుట్టించటం లాంటిదే సంకల్పాలు పుట్టించడం కూడా. ఆ సంకల్పాలకి మన శక్తే ధారపోయాలి. ఎవరి సంకల్పానికి వారే ఊపు ఇవ్వాలి కదా! అందరికీ భోజనం పెడదామని ఒక సంకల్పం ముందు వచ్చింది అనుకోండి. భోజనం పెట్టడం అనే సంకల్పం బావుంటుంది. కానీ చేసేటప్పుడు ఉసురుమంటారు. ఎన్నో పనులు మనలోంచి వచ్చి మనని ఎత్తుకుపోతుంటాయి. సగంలో ఆపలేము. అట్లా more luggage less comfort లాగా చేసుకుంటాం. భగవంతుడికి, మనకి తేడా ఏమిటి అంటే ఆయనలోంచి వచ్చే సంకల్పాలలోకి ఆయన ప్రవేశించినప్పటికీ, అందులో ఇరుక్కుపోకుండా తను అందులో ఉంటాడు, దాన్ని అధిగమించి కూడా ఉంటాడు. అతిక్రమించి ఉంటాడు అంటారు పురుషసూక్తంలో. 'అన్యక్రామత్.' అంటే దాటినాడు అని. అట్లా మనం దాటి, దానికి సహకారం ఇస్తూ, దాంట్లోకి ఇమిడిపోకుండా ఉన్నట్లయితే, మనకి బంధాలు ఉండవు. అప్పుడు కాలంలో మనం తేలుతూ, అంతా అనుభూతి చెందచ్చు. కానీ మనం ఏమి చేస్తాం అంటే మనలోంచి వచ్చిన దాంట్లోకి మనం వెళ్ళిపోతాం. అప్పుడు ఏం జరుగుతుంది అంటే చేసే పనుల్లో ధర్మ సమ్మతం కానటువంటి కామాలు తయారవుతాయి. అవి మనకి బంధాలు వేస్తాయి. వేసి Our past is our future అన్నట్టుగా తయారవుతుంది. అంటే ఇంతకు ముందు చేసిన చెత్త విషయాలు అన్నీ కూడా, మళ్లీ కర్మగా మన దగ్గరకి వస్తూ ఉంటాయి. ఇవి ఒకపక్క తీర్చుకుంటూ ఉంటే, మళ్లీ కొన్ని చేస్తూ ఉంటాం. మళ్లీ వస్తూ ఉంటాయి. అవి తీర్చుకుంటూ ఉంటే మళ్లీ వస్తూ ఉంటాయి కదా. ఆ కర్మలన్నీ ఎప్పటికీ తీరవు. వ్యక్తిగతంగా మనం ధర్మం నించి ఎడబాటు చెంది చేసిన కర్మలన్ని కూడా మనకి సొంత జీవితం ఒకటి తయారు చేసి పెడితే, మనం చేసినవన్నీ మనమే విప్పుకోవాలి. సృష్టిలో ఎవరినించి ఏమి వచ్చిందో, అది ధర్మ సమ్మతం కాకపోతే దాంట్లోంచి కొన్ని కొత్త కారణాలు పుడతాయి. ఆ పుట్టినవాటిని, మళ్లీ మనమే తీసేయాలి. అది మనం, సృష్టిలో మళ్లీ మన సృష్టి చేసుకుంటాం. మాస్టారు దానికి మంచి example 'జంధ్యం విప్పి వేసుకోరా అంటే చిక్కు వేసుకున్నాడు' అని చెప్పారు. చిక్కు జంధ్యంలో లేదు కదా! ఏం చేయాలి? చిక్కు విప్పుకోవాలి అంతే! విప్పడానికి కావలసిన know how ఇస్తాడు తప్ప, ఎవడూ విప్పిపెట్టడు. ఆ విధంగా మనం చేసే పనుల్లో ధర్మాన్ని అతిక్రమించి పనిచేయటం వలన, మనకి కర్మల యొక్క బంధనం ఏర్పడుతుంది. కామం, ధర్మ సమ్మతమైన కామం అయితే, ఎక్కువ భవిష్యత్తు, భూతం అనేవి రెండూ

లేకుండా తేలుతూ అనుభవిస్తూ వుంటాం జీవితం. లేకపోతే మనకంటూ ఒక జీవితం ఏర్పరచుకుని, పాత కర్మలన్నీ మళ్లీ సంస్కారం చేయడానికి మళ్లీ జన్మలెత్తుతూ వుంటాం అంటే ఇప్పుడు గబగబా మనం అప్పులు చేసుకుంటూ బోలెడు అనుభవించాము అనుకోండి. అవన్నీ తీర్చుకుంటూ రావాలి కదా. అందుకని, చేసే పనుల్లో కార్యం కర్మ అని చెప్తాడు భగవద్గీతలో శ్రీకృష్ణుడు. ఎవడైతే కార్యంకర్మ చేస్తాడో, వాడికి కొంత తెరిపి ఉంటుంది. కార్యం కర్మ అంటే చేయవలసినవి మాత్రం చేయటం. చేయవలసినవి అంటే ధర్మ సమ్మతంగా జీవించటం. శరీరంలో మనం ఉన్నందుకు, కొన్ని మానవ ధర్మాలు ఉన్నాయి. ధర్మ సమ్మతంగా శరీరాన్ని ఎట్లా పోషించుకోవాలి, శరీరాన్ని ఎట్లా వాడుకోవాలి, దీంతో సంఘం లో ఎట్లా పని చేయాలి, దీనికి ఎలా ఆహారం ఇవ్వాలి ఇలా-- . సరైన పద్ధతుల్లో ఆహారం ఇవ్వలేదు అనుకోండి, ఏవేవో రోగాలొచ్చేస్తాయి. రోగాలు మనవల్ల పుట్టినవే! మన ప్రవర్తన వల్ల రోగం పుట్టింది తప్ప, ఇంక వేరే రోగాలు ఉండవు. అన్నీ మన ప్రవర్తనలోంచే మనం ఏర్పరచుకుంటాం. అది ధర్మానికి సమ్మతంగా ఉన్న ప్రవర్తన అయితే, మనని బంధించదు. అదే 'మా కర్మ ఫల హేతుర్భూ:' అంటాం. మళ్లీ అందులోంచి కొత్త పనులు పుట్టేట్టుగా పనులు చేయబోక, అంటాడు. Train లో వెళ్తున్నామనుకోండి, మామిడి తాండ్ర కనపడగానే కాముడు పుడతాడు. కాముడు పుట్టగానే తింటాం. బాగానే ఉంది. ఎంత తినాలి? ఎప్పుడు తినాలి? ఎటువంటిది తినాలి? దాని మీద శుభ్రంగా పైన మనకి జాం రాసినట్లుగా దుమ్ము, ధూళి అన్నీ పడి, ఈగలు ముసురుతూ ఉన్నాయనుకోండీ, తినేసాము అనుకోండి. కలరా వచ్చింది. కలరా రావటం రైల్లో వెళ్ళటంలో భాగం కాదుకదా. మరి వచ్చింది కదా! చలి కాలం వచ్చింది, చలికాలంలో ఎట్లా ప్రవర్తించాలో, ఒక ధర్మం ఉంటుంది. ఎండాకాలంలో ప్రవర్తించినట్టుగా చలికాలంలో ప్రవర్తిస్తే ఏం జరుగుతుంది? రోగాలు వస్తాయి. అట్లాగే పురుషుని విషయంలో స్త్రీ, స్త్రీ విషయంలో పురుషుడు, ఇద్దరు కలిపి పిల్లల విషయంలో, అందరూ కలిపి సంఘం విషయంలో, ఇలా అన్ని విషయాలలో కొన్ని ధర్మాలు ఏర్పరిచారు. ఆ ధర్మబద్ధమైన జీవితమే మన ఋషులు మనకిచ్చింది. భారతీయులకి ఎప్పుడూ కూడా సనాతన ధర్మమే తప్ప మతం లేదు. ఏమిటా ధర్మం అంటే చెట్టుతో ఎట్లా ఉండాలి, పుట్టతో ఎట్లా ఉండాలి, పురుగుతో ఎట్లా ఉండాలి, జంతువుతో ఎట్లా ఉండాలి, మనిషితో ఎట్లా ఉండాలి, పంచభూతాలతో ఎట్లా ఉండాలి, దేవతలతో ఎట్లా ఉండాలి, వాక్కుతో ఎట్లా ఉండాలి, పంచేంద్రియాలతో ఎట్లా ఉండాలి, ఇట్లా అన్నీ, ఎట్లా ఉండాలో చెప్పారు. అట్లా ఉంటే, ఇబ్బంది పడరు. అట్లా ఉండకపోతే, అందులోంచి వేరే పుడుతుంది. ఆవు దగ్గరకి వెళ్లి పాలు పితుకుతున్నాము అనుకోండి. బాగా పితికితే నురుగు వస్తుంది. నురుగు కావాలని

పాలు పితకం కదా, అయినా కూడా నురుగు వస్తుంది. అదే కృష్ణుడు 'నువ్వు చేసిన దాంట్లోంచి కొత్తగా ఒకటి పుడుతూ ఉంటుంది. సృష్టిలో అగ్నికార్యం జరుగుతూ ఉన్నప్పుడు అందులోంచి కొంత మలినం పుడుతూ ఉంటుంది, అది తుడుచుకుంటూ ఉండాలి రోజూ, నువ్వు ఎంతవాడివైనా, ఎంత మహాత్ముడైనా, తుడుచుకోకపోతే అదే నిన్ను మింగటం మొదలుపెడుతుంది' అని చెప్తాడు. సృష్టి అనేది ఒక అగ్నికార్యం. ఈ అగ్నికార్యం జరుగుతున్నంత సేపు లోపల్నించి, కొన్ని మలినాలు బయటికి వస్తూ ఉంటాయి. రోజూ తెల్లారేసరికి మన శరీరంలో మలినాలు చేరవూ? అన్నం తినటం శరీర పోషణ కోసమే మనం చేస్తున్నప్పటికీ కూడా, మరి మలం కూడా ఏర్పడుతోంది కదా. మలం ఎందుకు ఏర్పడాలి అంటే ఏర్పడుతుంది. Combustion, లోపల అగ్నికార్యం జరగటం వల్ల, అంతా అయిపోయిన తరువాత మిగిలిన పిప్పి అంతా బయటికి వచ్చేస్తుంది. అట్లాగే కళ్ళల్లోంచి వస్తుంది, చెవుల్లోంచి వస్తుంది, ముక్కుల్లోంచి వస్తుంది. వస్తున్న దీనిని, తుడుచుకుంటూ ఉండాలి. ఎందుకొస్తుంది అని అడగబోక అది అంతే! అంటారు. అట్లా వచ్చేవన్నిటినీ కూడా తుడుచుకుంటూ ఉండు, అది ఒక ధర్మం. అద్దం కావాలంటే, దుమ్ము కూడా ఉంటుంది, తుడుచుకోవాలి. అద్దం తుడుచుకుంటే, కనిపిస్తుంది బాగా. అద్దం పెట్టుకోవటం మన కార్యక్రమం, దుమ్ము పడటం? అంతే అన్నీ. అన్నం వండుకుంటాం. తప్పేలాకి మసి అంటుతుంది కదా. కడుక్కోవాలి కదా దాన్ని. నీ పనిలో ఎప్పుడూ కూడా ఒకటి extra ఉంటుంది. ఆ extra ని ఎప్పటికప్పుడు clean చేసుకోవాలి. ప్రతి పనిలోనూ ఉంటుందది. Industry పెట్టాము అనుకోండి. By-products, effluents వస్తూ ఉంటాయి. దాంట్లోంచి pollution వస్తూ ఉంటుంది. దాన్ని ఏం చేయాలి అనేది కూడా చూడాలి. అది తెలియకపోతే అది కమ్మేస్తుంది. అట్లాగే, మాట్లాడుతూ వుంటాం. అవసరమైనది మాట్లాడకుండా మాటల్లోనే మునిగి ఉంటే అనవసరమైన మాటలు వచ్చేస్తాయి. ఊరికే కూర్చుని తీరికగా సరదాగా కబుర్లు చెప్పుకుంటే, మాటలన్నీ కూడా పోట్లాటల్లాగా తయారవుతాయి చాలామందికి. కాలం తప్పదు, సృష్టిలో కామం తప్పదు, కాలంలో, కామంలో జీవిస్తున్న వాళ్ళకి, కార్యం తప్పదు, ఆ కార్యం కనుక ధర్మసమ్మతమైతే ఇరుక్కోకపోవటం అనేది ఉంటుంది. అట్లా కాకపోతే ఇరుక్కోవడం ఉంటుంది. ఇరుక్కున్నవాడికి, అయిపోయినకాలం, ఉన్న కాలం, రాబోయే కాలం ఉంటుంది, ఇరుక్కోని వాడికి ప్రయాణంగా ఉంటుంది, ఇరుక్కున్న వాడు అక్కడే తిరుగుతూ ఉంటాడు చక్రంలో. ప్రయాణం ఉండదు. ప్రయాణంలో ఉన్నవాడు మొత్తం అంతా అనుభూతి చెంది మళ్లీ ఎక్కడనుంచి బయలుదేరాడో అక్కడికి వెళ్తాడు అన్నీ చూసి. ప్రయాణంలో లేనివాడు అక్కడే గిరగిరగిరా తిరుగుతూ ఉంటాడు. చస్తూ ఉంటారు, పుడుతూ ఉంటారు, చస్తూ ఉంటారు. ఎందుకు

పుట్టాల్సొస్తుంది అంటే అంతకుముందు చేసిన పనులన్నీ సరిదిద్దుకోవటం కోసం. అందుకనే మనకి ఋషిప్రోక్తమైన మార్గంలో 'ఉద్యోగం చేసినా వ్యాపారం చేసినా, ఇంకేదన్నా వృత్తి చేసినా, అది మనకి సంఘానికి ఋణం తీర్చుకోవటంగా చేయమన్నారు తప్ప మళ్లీ అందులోంచి ఋణాలు ఏర్పరచుకోవద్దు' అని చెప్తారు. ఎంత ఋణపడితే అంత చేయాల్సి ఉంటుంది. అందుకనే, మనిషి మహాత్ముడు అయిన సందర్భంలో వాళ్ల వచ్చే ఋణం అంతా ఒక జన్మలో కొట్టేస్తారు. మళ్లీ ఏమీ అగ్గి వ్యాపించకుండా. అది సంఘం, త్యాగం త్యాగం త్యాగం అంటుంది. త్యాగం కాదు వాళ్ళ వరకు savings. ఇట్లా మనకి indebtedness పెంచుకుంటూ వెళ్లే పద్ధతి ఒకటి ఉంది. మన future అంతా కూడా మన past బట్టి ఉంటుంది. మధ్యాహ్నం బాగా తిన్నామనుకో, మర్నాడు ఏమైందండీ అంటే అరగలేదండీ, అంటాం. ప్రతిదీ కూడా past decides the future, when we do not follow the dharma. అది బద్ధ జీవితం. దాన్నే విధి, విధి అంటాం. మనమేమీ చేయలేము, ఎవరూ ఏమీ చేయలేరు, అట్లా ఉంటారు. నువ్వు గనుక ధర్మాన్ని అనుసరించడం మొదలుపెడితే, ఇక ముందు పుట్టించడం ఉండదు. కానీ మనం పుట్టించ్చిందల్లా మనమే పూర్తి చేసుకోవాలి. శ్రీకృష్ణుడు 'నా నుంచి పుట్టిన దాన్ని నేను నాలోకి తీసుకోగలను, absorb చేసుకోగలను, నీ లోంచి నువ్వు పుట్టించావే, దాన్ని అట్లాగే నువ్వూ absorb చేసుకో' అని చెప్తాడు. అర్జునుడు యుద్ధంలో ఆయన చెప్పినట్టు కాకుండా స్వంతం గా చేసినప్పడల్లా వేరే ఫలితాలు వచ్చాయి. విధి అనటానికి అప్పుడు వీల్లేదు. ఎందుకట్లా అవుతున్నాయి అంటే ధర్మాన్ని అనుసరించలేదు. నువ్వు చెప్పినట్టు నేను వింటాను అని చెప్పిన తరువాత, చెప్పినట్టు వినలేదు. మనకి తెలియకపోతే తెలిసినవాడు చెప్పింది చేయాలి. అసలున్నది తెలిసిన వాళ్ళు, తెలియని వాళ్ళు. మనకొచ్చేవన్నీ కూడా మనం ఇదివరకు చేసినవే! Whatever is due is given. What is not due is never given. నీది కానిది నీకు ఇవ్వరు మంచి కానీ, చెడు కానీ. సృష్టి ఒక యంత్రం లాగా అట్లా పెట్టేశారు. ఆ యంత్రం అట్లాగే పనిచేస్తుంది. Weighing machine మనం ఎక్కితే, ఎంత బరువు ఉంటే అంతే చూపిస్తుంది తప్ప, ఎక్కువ, తక్కువ ఎందుకు చూపిస్తుంది? లావుగా ఉన్నవాళ్లు machine ని తిట్టుకుంటారు, ఎప్పుడూ ఇంతే చూపిస్తుంది అని. తప్పు machine దా? నువ్వు తగ్గాలి. నీలో ఏం మార్పు ఉంది తగ్గటానికి అక్కడ? నువ్వేమీ తగ్గలేదు అని చెప్తుంది అంతే. నీ ప్రవర్తన నువ్వేమీ మార్చుకోలేదు అని చెప్తుంది weighing machine. అట్లా ఉంటుంది సృష్టిలో ధర్మాలు. నేను చాలా మంచివాడిని, చాలా మంచి పనులు చేశాను అని వేలు పెట్టాము అనుకోండి మంటలో, కాలుతుంది. ఏ మంచిపని చేయని వాడు వేలు పెట్టినా కాలుతుంది. అదేంటండీ మంచివాడినీ కాల్చి, చెడ్డవాడినీ కాలిస్తే ఎలా అంటే,

అది అగ్ని ధర్మం. ఆ ధర్మం అది నిర్వర్తిస్తుంది. మనం ధర్మానికి లోబడి జీవితం అంతా జీవిస్తూ ఉంటే ఇందాక చెప్పినట్టుగా నావ వలె క్లిష్టమైన సాగరంలో కూడా తేలి వెళ్తున్నట్టుగా ఉంటుంది ప్రయాణం. లేకపోతే, మునిగిపోతుంది. సృష్టిలో కాలం నది యొక్క ప్రవాహం లాగా ఉన్నప్పుడు, ప్రవాహం లో ఉన్న నావలో ఉన్నవాడికి ఈ మూడూ ఒకటే అని తెలుసుకునే అవకాశం ఉంటుంది. రైల్లో ఉన్నవాడికి తెలియట్లా? అట్లా తెలిసే అవకాశం ఉంది. సృష్టి మొత్తం అంతా కూడా కాలానికి లోబడే ఉంటుంది. కాలానికి లోబడి ఉండటం వల్ల, సృష్టి లో ఉన్న 24 తత్వాలు కూడా కాలంలో ఇమిడి ఉన్నాయి. అందుకని, కాలాన్ని అనుసరించి గాయత్రీ మంత్రం చెప్పుకోవాలి.

310, 311, 312, 313, 314, 315, 316 యుగాదికృత్, యుగావర్తః, నైకమాయః, మహాశనః, అదృశ్యః, అవ్యక్తరూపశ్చ

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

317 సహస్రజిత్

సహస్ర అనే పదం ఒక మంత్రం. పురుష సూక్తం 'సహస్ర శీర్ష్ణా పురుషః' అనే వాక్యంగా ఉచ్చరింపబడుతుంది. సహస్ర అనే పదం చాలా మహత్తరమైన మంత్రం. అందుకని అన్ని సహస్ర నామములుగా మనకి ఇవ్వడంలో ఉద్దేశ్యం కూడా అదే. సహస్ర అంటే మనకి తెలిసినటువంటి ఒక అర్థం వేయి నామములని. వెయ్యి నామములంటే అర్థమేమిటంటే భగవంతుడికి వెయ్యి నామములే ఉన్నాయని కాదు. 1000 సంఖ్య, ఒకటి తరువాత మూడు సున్నాలుగా కనిపిస్తుంది. మూడు సున్నాలు మనం మూడు లోకములుగా తీసుకుంటే భూః, భువః, సువః లోకములుగా తీసుకుంటే ఈ మూడు లోకాల అవతల ఒకడుగా వెలుగుతున్న వాడే ఈ మూడు లోకాల్లోనూ వ్యాపించి వెలుగు ప్రకాశిస్తూ ఉంటాడు కాబట్టి, మూడు లోకములు దాటి ఉన్న పురుషుడు, మూడు లోకములు ఆవరించి ఉన్న పురుషుడు, మూడు లోకములుగా ఉన్న పురుషుడు, వేలాది పురుషుడిగా ఉన్న ఒకే ఒక పురుషుడు గురించి గుర్తు తెచ్చుకోవడానికి సహస్ర అనే పదం ఇచ్చారు. అందుకని భగవంతుడికి వెయ్యి తలకాయలు అని అన్నప్పుడు వెయ్యేకాదు చాలా తలకాయలు ఉన్నాయి. మన తలకాయలన్నీ భగవంతుడివే! మనవని మనం అనుకుంటున్నాం. మన్ని అనుకోనిచ్చాడు కాబట్టి మనం అనుకోవడం జరుగుతోంది తప్ప, మొత్తం ఆయనదే కాబట్టి, వెయ్యి అని చెప్పడంలో ఉద్దేశ్యమేమిటంటే మూడు లోకములలో వ్యాపించిన శీర్షములన్నీ ఆయనవే. కానీ ఆయన ఈ మూడింటికి అతీతంగా, ఒకడుగా ఉంటూ ఉంటాడు. ఆయన అతీతుడై, తననుంచి సృష్టి వ్యక్తమైతే, ఆ సృష్టిలోకి తను వ్యాపించి ఉన్నప్పటికీ కూడా దాన్ని అతిక్రమించి ఉంటాడు. అదే 'అన్యక్రామత్' అని పురుష సూక్తం లో చెప్పుకుంటాం. ఈ అతిక్రమించిన వాడిని గురించి చెప్పుకోవడం కోసం 'సహస్ర' అంటాం. 1000 దాటి ఉన్నాడు కాబట్టి 'సహస్రజిత్' నామానికి ఒక అవగాహన, అంటే సృష్టిలో ఉండే సమస్తమైన రూపములకు ఆధిపత్యం వహించి, దానికి అతీతంగా కూడా ఉన్నాడు. 'జిత్' అంటే జయించినవాడు అని అర్థం. 'ఇంద్రజిత్' అంటే ఇంద్రుని జయించిన వాడని కదా! మనం ఎప్పుడు వెయ్యనుకున్నా కూడా గుర్తుపెట్టుకోవాల్సిందేంటంటే సున్నాలని లోకాలుగా గుర్తించాలి. కోటి సంఖ్య

కూడా మనకి చాలా ముఖ్యమైన సంఖ్యగా చెప్పారు. ఎందుకంటే ఏడు సున్నాలకు ముందు ఉండే ఒకటి. అందుకని మిలియన్స్, ట్రిలియన్స్ మన ఆధ్యాత్మిక మైన మార్గంలో పనికొచ్చే అంకెలు కావు కాబట్టి, కోటి అనేదే correct. ఎందుకు సరియైనదంటే ఏడు లోకములకు అవతల ఉన్న ఒకే ఒక తత్వం, ఏడు లోకములలోను వ్యాపించి ఉన్నదానికి కోటి సంఖ్య. "సహస్ర కోటి యుగధారిణే నమః" మళ్ళీ ఇందులో సహస్రం, మళ్ళీ ఇందులో కోటి. పది లక్షలు అనే అంకె విలువలేదు. మిలియన్ కి విలువలేదు. బిలియన్ అట్లా అవన్నీ కలియుగ లెక్కలు. అలాగే రూపాయికి 100 పైసలు కూడా దురదృష్టం. రూపాయికి 16 అణాలు సరి అయినటువంటి అవగాహన. 16 అణాలు, 16 కళలు, మళ్ళీ అణాకు నాలుగు, 'చతుర్వర్గఫలం జ్ఞానం కాలావర్తం చతుర్యుగే'. నాలుగు పావలాలు, నాలుగు అణాలు, అణాకు నాలుగు కాణీలు. ఇట్లా నాలుగు నాలుగు నాలుగ్గా, ఇవన్నీ spiritual numbers- అలాగే ఒక కాణీకి 3 చేగాణీలు. అలా 3, 4, 12, 16. ఆ అవగాహనలతో పెట్టుకున్నవన్నీ మనకేదో గుణకాలకు సులభంగా ఉంటుందని decimal system లోకి మార్చాము. అంగుళాలు ఎక్కువ correct సెంటీమీటర్ల కన్నా. దశాంగులం-పది అంగుళములు. అట్లాగే మూడు అడుగులు ఒక గజం. అడుక్కి 12 అంగుళాలు కదా! ఇవన్నీ చూసుకున్నట్లయితే, వాటి అన్నిటికీ కూడా ఒక చక్కని అవగాహన ఉన్నది. సృష్టిలో ఉండే అంకెలతోనూ, సంఖ్యలతోనూ అనుసంధానం చేసి వచ్చినవే నిజమైన Mathematics. మనకి అనుకూలంగా మార్చుకున్నవన్నీ కూడా మన్ని ఆ కేంద్ర స్థానం నుంచి తప్పించినవి అవుతాయి కాబట్టి, తప్పడు లెక్కల్లోకి వెళ్ళిపోతూ ఉంటాం. ఒకటి నుండి తొమ్మిది వరకు అంకెలు అనాలి. 10 నుంచి సంఖ్యలు అనాలి. అంకె, సంఖ్య తేడా తెలుస్తుండాలి. మూడు లోకములకి అవతల ఉన్న వాడు, మూడు లోకములు వ్యాపించి ఉన్న వాడు, మూడు లోకములుగా ఉన్న వాడు, మూడు లోకములలో ఉండే జీవులలో ఉండే వాడు వీళ్ళందరూ గుర్తు రావాలి సహస్ర అంటే. సహస్ర అనే నామాన్ని సుదర్శన మంత్రం అంటారు. ఇది మనకి మనకుండే బంధాల్ని విముక్తి చేస్తూంటుంది. ఛేదిస్తుంది. సుదర్శనం దేన్నైనా ఛేదించగలదు కదా! మనకి మన చుట్టూ రకరకములైన పరిమితములు, పరిమితత్వాలు మనం ఏర్పరచుకున్నవి ఉంటాయి మన మనసులో. తరువాత మనం ఉండే సంఘ పరిస్థితులనండీ, దేశ పరిస్థితులు, కాల పరిస్థితులు ఇవన్నీ ఒక రకమైనవన్నీ, మనలో ఉండేవీ మన్ని బంధిస్తూంటాయి కదా! ఈ బంధన లోంచి బయటపడాలంటే మనం కుడి చేతిలో గిరగిరా తిరుగుతున్న భగవంతుని యొక్క సుదర్శనాన్ని దర్శనం చేస్తూ, ఈ 'సహస్ర' నామాన్ని చెప్పుకోవాలి. మనం మామూలుగా జగద్గురు పీఠం యంత్రంగా వాడుతూ ఉంటాం. ఒక వృత్తం, వృత్తంలో ఒక నిలువు రేఖ, అడ్డం రేఖ, వాటిని కలుపుతున్నటువంటి నాలుగు రేఖలు కలిపి మనం ఒక యంత్రం గా చూస్తున్నాం. అది సుదర్శన చక్రం. అది సుదర్శన యంత్రం. ఇది పరమ గురువుల మాటలో మంత్ర రాజము. యంత్ర రాజము. అందుకని అది మొట్టమొదట పరమగురువులు Madam Blavatsky కి దీనిని

ఉపదేశించారు. మాస్టర్ గారికి కూడా దాని యొక్క ఉపదేశం పరిపూర్ణంగా ఉండటం వలన ఆయన ఈ దివ్య ప్రణాళికను చక్కగా నడిపించారు. అందులో భాగంగా ఈ యంత్రాన్ని మనకిచ్చి, ప్రతిచోటా దాన్ని ప్రతిష్టించారు. అది సుదర్శనయంత్రం. ఈ సుదర్శన యంత్రాన్ని దర్శనం చేయడానికి రకరకాల మార్గాలున్నాయి. అందులో ఒకటేమిటంటే చతుర్భుజుడైన విష్ణుమూర్తి కుడిచేతి చూపుడు వేలికి ఆ చక్రం ఉన్నట్టు, అది మనం ఊహించగలిగినంత వేగంతో తిరుగుతున్నట్టుగా, అందులోంచి కాంతి కిరణాలు వెదజల్లుతున్నట్లుగా భావన చేసుకుంటూ, ఆ మంత్రాన్ని స్మరణ చేసుకునే పద్ధతి ఒకటి ఉంది. దానివల్ల మనకి కలిగే శుభములేంటయ్యా అంటే ముందు భయం పోతుంది. మనకి రకరకాల భయాలుంటాయి కదా! ఆ భయాలన్నీ మాయం చేస్తుంది. తరువాత మనకు వచ్చే ఆపదల నుంచి రక్షిస్తుంది. మనకి కలిగే విఘ్నాలను తొలగిస్తుంది. మనలో ఉండే పరిమితత్వాన్ని క్రమశః తీసేస్తుంది. అందుకని ఇవన్నీ ఎవరియందు పరిపూర్ణంగా జరిగినాయో వాళ్ళకి పరిమితత్వం పోవడం వలన దర్శనం బావుంటుంది. అదీ సుదర్శనం! పరిమితత్వం అంటే మనం ఏర్పరచుకున్న భావం. కానీ భావానికి పునాదిగా, మూలం గా మనమే ఉన్నాం. మనం భావం లోకి దిగినప్పుడు, మన భావమే గోచరిస్తూ ఉంటుంది. భావానికి అతీతంగా మనం ఎట్లా ఉన్నామో తెలిస్తే, అది సుదర్శనం అవుతుంది. అప్పుడు చక్కగా ఉన్నది గోచరిస్తుంది. చక్కటి దర్శనాన్ని ఇవ్వగలిగినదే 'సుదర్శనము' అన్నారు. అది దొరికినప్పుడు అంబరీషుడు లాగా తయారవుతాడన్నమాట సాధకుడు. అంబరీషుడికి సుదర్శనమే ఇవ్వబడింది అని చెబుతారు. అంటే చక్కటి దర్శనం చేయడం మొదలు పెడతాడు. ఏదైనా అదే ఇంకోటి లేని స్థితి ఏర్పడుతుంది. అనన్యస్థితి అంటామే. ఆ అనన్యస్థితిలో జీవితాన్ని నడిపించుకునే వరకు కూడా సుదర్శన చక్రం మనకి చక్కగా ఉపయోగపడుతుంది.

'ఓం క్ష్రౌం సహస్రార హుం ఫట్ స్వాహా, సుదర్శన చక్రరాజాయ స్వాహా
సుదర్శనచక్రరాజాయ ఇదం నమమ'

అనే మంత్రాన్ని మనం హోమంలో చేస్తూ ఉంటాం. అప్పుడు ఈ యంత్రం మన యందు భాసించాలి. భాసించి అది మన్ననుగ్రహించినట్లుగా భావన చేసుకోవాలి. Mechanical గా నోటితో చదివేస్తుంటే అవదు. ప్రతి మంత్రానికి ఒక యంత్రం ఉన్నది కదా! ఆ మంత్రం చదివేటప్పుడు దాన్ని దర్శనం చేసుకోవాలి. విష్ణు సహస్రనామం చదివేప్పుడు విష్ణు యొక్క రూపాన్ని ఆపాద మస్తకం అంటే పాదముల నుంచి శిరస్సు వరకు ఒక్కొక్క అంగాన్ని దర్శనం చేసుకుంటూ చక్కగా చదువుకోవాలి. ఆ విధంగా దర్శనం చేసుకుంటూ ఉంటే ఆ మంత్రానికి, ఆ యంత్రం ద్వారా వెలుగు మనకి అవతరణం చెందుతూ ఉంటుంది. తద్వారా మనం ఊర్ధ్వగతి చెందుతూ ఉంటాం. ఊర్ధ్వగతి చెందడం అంటే ఏమిటో నాకు అవగాహన కాలేదు. పార్వతీ కుమార్ గారు చెప్పారు అని మొన్న ఒక వాక్యం వేశారు పెద్దాయన. ఊర్ధ్వగతి అంటే ఉత్తరగతా? తూర్పుగతా? ఉత్తరం అయితే ఊర్ధ్వమా? తూర్పు అయితే ఊర్ధ్వమా? ఊర్ధ్వగతి అంటే ఎటు? క్రింద నుంచి పైకా? ఊర్ధ్వగతి అంటే పరమ గురువులు ఇచ్చిన రహస్యం

ఏంటంటే 'స్థూలము నుండి సూక్ష్మంలోకి వెళ్ళడం'! పరమ గురువుల మార్గంలో దొరికినంత స్పష్టంగానూ, వికాసవంతంగానూ ఎక్కడా దొరకడానికి అవకాశం ఉండదు. మనం అంతా కూడా బాగా భౌతికమైన ఈ ప్రపంచంలో భౌతికమైన చైతన్యంతో ఉంటాం. ఈ భౌతికానికి బలంగా నిలబడ్డటువంటి సూక్ష్మ లోకముల యొక్క దర్శనం మనకు లేదు కదా! సూక్ష్మలోకముల దర్శనం అంటే వెలుగులోకముల యొక్క దర్శనం అని అర్థం. వెలుగులోకం యొక్క దర్శనం జరిగినప్పుడు సుదర్శనం జరిగినట్లు. సుదర్శనం అంటే మంచి దర్శనాన్ని ఇచ్చేది. అందుకని ఏ మంత్రాన్నైనా మనం ధ్యానం చేసేటప్పుడు ఆ మంత్రమునకు సంబంధించిన యంత్రం మన హృదయమునందు గానీ, నుదుటి యందు గానీ భావన చేస్తూ, దాని యొక్క వెలుగు పెరుగుతున్నట్లుగా, అది వెలుగు విరజిమ్ముతున్నట్లుగా భావన చేసుకోవాలి. ఆ వెలుగు ఎక్కడిది? ఎక్కడినుంచో వచ్చి ఇక్కడ లేదు. లోపల ఉంది మనకి. దానిమీద బాగా కప్పెట్టేసాం. విపరీతం గా అట్లా పేరుకు పోతుంది మందం. జిడ్డు పేరుకున్నట్లు, మడ్డి పేరుకున్నట్లు, మలినం పేరుకున్నట్లు అట్లా పేరుకుపోయి అసలు వస్తువు మరుగున పడిపోతుంది కదా! మనమే అసలు వస్తువు. మనము సహజంగా ప్రకాశం కలిగినటువంటి వాళ్ళం. స్వయం ప్రకాశమే. ప్రకాశం పేరు ఉంటుంది తప్ప మనిషి ప్రకాశవంతంగా ఉంటాడని అనుకోలేము కదా! మన ప్రకాశమే మనకి ఒక్కోసారి లోపలి నుంచి గోచరించడానికి మనం ఈ శబ్ద తరంగాలను ఆధారంగా, (అవే మనకి పెద్దలు తయారు చేసి ఇచ్చిన మంత్రాలు) పట్టుకొని, చెప్పినటువంటి పద్ధతుల్లో ఆ యంత్రం మీద మనం ఆపాదించుకుంటూ, దాన్ని వెలుగుగా దర్శనం చేయాలి. విష్ణుమూర్తి యొక్క దర్శనం చేస్తూ విష్ణు సహస్రనామం చదువుకుంటూ ఉంటే చతుర్బాహువులు ఉన్న విష్ణుమూర్తి, ధగ ధగ మెరిసే ఆయన ఆభరణములు, అలాగే ఆయన కాంతి విరజిమ్ముతున్న కన్నులు మన హృదయం లో భావన చేయాలి. ఆయన కాలి గోళ్ళ దగ్గర నుండి reflective light వస్తున్నట్లుగా చూస్తుండాలి. ఆ బంగారు కిరీటం, వజ్రాలు, మణులు, ముత్యాలు అవన్నీ మనలో ఉన్నాయి. వెలుగుకు సంబంధించిన సమస్తమైన లక్షణములు మనలో ఉన్నాయి. అవి అంతర్గతంగా దర్శనం చేయడం అంటే మనం జీవుడుగా దేవుని యొక్క అంశ కాబట్టి అవన్నీ మనలో ఒక్కసారిగా భాసించడం మొదలు పెడతాయి. ఆ వెలుగు ఎక్కువగా వ్యక్తమవుతున్న కొద్దీ మలినాలు తగ్గిపోతాయి. ఆ వెలుగుని మనం కనక ఎక్కువ చేసుకోకపోతే మలినాలు బాగా పేరుకుంటూ ఉన్న కాంతిని ఆర్పేస్తాయి. ఉన్న దీపం కొడిగట్టుకోవడంఒక పద్ధతి. కొంచెం దీపాన్ని పెంచుకొని కొడిని తీయించేసుకోవడం ఒక పద్ధతి. అందుకనే ఈ సుదర్శన మంత్రం చాలా శక్తివంతమైన మంత్రంగా చెప్తారు. ఎందుకంటే దాని యొక్క వేగం మన అవగాహన కి మించి ఉంటుంది. అందుకని మన అవగాహన మేర వరకు దాన్ని మనం ఊహించుకుంటూ మంత్రం చేసుకుంటూ ఉన్నట్లయితే, అది చిమ్మేటి కాంతులు, మనం దీపావళికి వాడే విష్ణు చక్రం, భూ చక్రం కాంతులు చిమ్ముతున్నట్లుగా, మన

శరీరం అంతా కాంతితో నింపినట్లుగా భావన చేసుకోవాలి. ముందు భావనే కానీ అందులో ఒక సత్యం ఉంది. ఏమిటా సత్యం అంటే మనం వెలుగు కాబట్టి, భావన చేత వెలుగు మనలో ప్రజ్వలింపబడుతుంది. ఈ మంత్రాల ద్వారా సులభంగా ప్రజ్వలింపబడుతూ ఉంటుంది. అట్లా మనం ప్రజ్వలింప చేసుకుంటూ ఉంటే మనలో ఉండే పరిమితత్వం తగ్గుతూ వస్తుంది. పరిమితత్వం అంటే స్థూలంలో బంధింపబడడమే! సూక్ష్మంలోకి వెళితే అంతా వెలుగు. వెలుగులో మనకి బంధన ఉండదు. చాలా ఎక్కువ స్వతంత్రం ఉంటుంది. ఈ శరీరంలోనే ఉన్నామనే భావన, ఈ రూపాలే అంతా అనే భావన కాకుండా ఈ రూపానికి మూలంలో ఉన్న వర్ణములు/ రంగులు, దానికి పునాదిగా ఉన్న శబ్ద తరంగములు, దానికి పునాదిగా ఉన్న చైతన్యము మనకి గోచరిస్తూ ఉంటాయి. అందుకని ఎంతసేపూ, ఏం చేసినా స్థూలము నుంచి సూక్ష్మంలోకి వెళ్ళడానికే ఈసాధన. మన సాధన అంతా కూడా స్థూలపరంగానే అయిపోతూ ఉంటుంది. కనిపించిన దాన్ని ఇమిడి ఉన్న దాన్ని చూడటమనేది సాధన. 'త్రిపాదస్య అమృతం దివి' మూడు పాదములు దివ్యముగా ఉన్నాయి లోపల. అంటే వెలుగులోకాల్లో ఉన్నాయి అని అర్థం. దేవతలు అని పేరు, దివి అనే పేరుకి మూలమైన శబ్దం వెలుగు, దివ్యము. దివ్యత్వం కలిగిన వాళ్ళు దేవతలు. దివ్యత్వం అంటే వెలుగు. కాబట్టి ప్రతీ రూపంలోనూ ఇవన్నీ ఉంటాయి. రంగులు ఉంటాయి. ఆ రంగుల వెనకాల శబ్ద తరంగాలు ఉంటాయి. దాని వెనకాల అస్తిత్వం ఉంటుంది. వీటి దర్శనం చేయించడానికి పనికొస్తుంది సుదర్శన మంత్రం. ఎంతసేపూ మనం స్థూలానికి సంబంధించిన కార్యకారణాలు వెతుక్కుంటూ ఉంటాం. మనకొచ్చే కష్టాలు కానీ, మనకొచ్చే నష్టాలు కానీ మనం ఏం చేస్తాం అంటే బయట కారణాలు వెతుక్కుంటూ ఉంటాం. స్థూలంలో జరిగే అన్ని సన్నివేశాలు నిమిత్తమైనట్టి కారణాలు తప్ప. అసలు కారణాలు సూక్ష్మంలో ఉంటాయి అని మనకి పెద్దలు చెప్తారు. అందుకని సూక్ష్మ లోకాల్లో దర్శనం జరిగితే ఈ బయటవి లోపలవి ఉన్నాయో అవగాహన అవుతుంది. కాబట్టి మొత్తం అవగాహన మనకివ్వడానికి ఈ సుదర్శన మంత్రం చాలా పని చేస్తుంది. సుదర్శన మంత్రం, బాగా గుర్తుపెట్టుకోండి! దానికి ముందు సంఖ్య మనకి 'వేయి' గానే కనబడుతుంది. తరువాత ధ్యానానికి మంత్రం ఉన్నది. చేసుకునేటటువంటి పద్ధతి ఉన్నది. అదిగాక ఋగ్వేదము, సామవేదము రెండూ కలిపిన మంత్రము 'సహస్ర' అనే మంత్రము. ఋగ్వేదం యొక్క సారాంశము, సామవేదం యొక్క సారాంశము రెండూ అందులో ఉన్నాయి. అందుకని ' సహస్ర' మంత్రం చేసుకుంటే మన్ని మనం ఆత్మజ్ఞానం వరకు నడిపించుకోవచ్చు. మనకి 'సహ' అనే రెండు అక్షరములు చాలా అత్యంత పవిత్రమైన అక్షరములుగా ఇచ్చారు. ఎందుకంటే 'స' అనే శబ్దము పురుషునికి సంబంధించినది. 'హ' అనే శబ్దము అమ్మవారికి సంబంధించినది. అందుకని 'సహస్ర శీర్ష్వా పురుషః' అనే 'స' శబ్దంతో పురుషసూక్తం మొదలవుతుంది. 'హిరణ్య వర్ణాం హరిణీం' అనే 'హ' శబ్దంతో శ్రీ సూక్తం మొదలవుతుంది. 'స' శబ్దము 'హ' శబ్దము ' రెండు కలిపితే, ఈ సహ శబ్దము మనలో ఆజ్ఞ నుంచి విశుద్ధి వరకు ఉండే ప్రజ్ఞగా చెప్తారు. ఆజ్ఞ అంటే దీని

రహస్యము లలితా సహస్రనామం లో ఉంది. శాకినీ ఉన్నది. హాకినీ ఉన్నది. మళ్ళీ సహస్త్ర లో ఉండే రేత్వానికి రాకినీ ఉంది. ఇలా ఎవరన్నా సాధన చేసుకోవాలంటే సాధన చేసుకోవచ్చు. 'స' అనే శబ్దం పురుషునికి సంబంధించింది. అది మనలో ఉచ్ఛ్వాసకి సంబంధించిన శబ్దం. 'హ' అనే శబ్దం నిశ్వాస కి సంబంధించిన శబ్దం. 'హ' అనడంలో మనని మనం బయటికి వ్యక్తం చేసుకుంటాం. 'స' అనే శబ్దంతో మనని మనం మళ్ళీ అంతర్గతం చేసుకుంటాం కదా! అందుకని ఉచ్ఛ్వాస, నిశ్వాసాలకి 'సహ' శబ్దాలకి చాలా చక్కని అనుసంధానం ఉన్నది. చక్కని సమన్వయం ఉన్నది. అందుకనే 'సోహం' అనే మంత్రం అందులోంచి పుట్టింది. మనం ఈ 'సహ' శబ్దానికి ' ఓం' కనుక చేర్చినట్లయితే అది 'సోహం' అవుతుంది. ఓంకారమే ఉచ్ఛ్వాసగా వచ్చినప్పుడు 'సో' అనే శబ్దం వస్తుంది. నిశ్వాసగా తీసుకున్నప్పుడు 'హం' అనే శబ్దంగా వస్తుంది. అందుకని ఈ 'స' 'హ' శబ్దములతో కలిసిన ఓంకారం సోహంగా మనకి జరుగుతుంది. మనం ఉచ్ఛ్వాస చేసేటప్పుడు, మనం అనక్కర్లేదు, వింటూ ఉంటే మనం ఉచ్ఛ్వాస యొక్క శబ్దం 'సో' అని వినిపిస్తూ ఉంటుంది. నిశ్వాస శబ్దం 'హం' అని వినిపిస్తూ ఉంటుంది. ఈ సోహం శబ్దం మనకి ప్రకృతి, పురుషుల యొక్క సమ్మేళనంగా గోచరిస్తుంది. అందుకని 'సోహం' మంత్రం ఇస్తారు. అది సహజంగా మనలో జరుగుతుంది. మనం ప్రత్యేకంగా దాన్ని ఆపాదించుకోక్కర్లా. ఈ జరుగుతున్నప్పుడు మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు జరుగుతున్నాయి. ఈ ఉచ్ఛ్వాస నిశ్వాసాలు స్పందన కారణంగా జరుగుతుంటాయి. అందుకని స్పందనలో ఉండే రెండు భాగములు అంటే విచ్చుకోలు, ముడుచుకోలు భాగంగా స్పందన జరుగుతూ ఉంటుంది. వికాసం మళ్ళీ ముకుళింపు. పురోగమనం, తిరోధానం అంటారు. అవి స్పందనానికి ఉండే centripetal, centrifugal forces అంటారు. అంటే సృష్టిగా ఒక పక్క వికసిస్తుంది, మళ్ళీ ఎక్కడ్నుంచి వికసించిందో అందులోకి ముకుళించుకుంటూ ఉంటుంది. అందుకనే ప్రతిదీ మనకు అమావాస్య నుంచి పౌర్ణమి వరకు వికసించుకోవడం, పౌర్ణమి నుండి అమావాస్య వరకు ముడుచుకోవడం. ఉత్తరాయణం అంతా విచ్చుకోవడం, దక్షిణాయనమంతా ముడుచుకోవడం. ఇట్లా మనకి ప్రతిదీ వికసించడం మళ్ళీ తిరిగి ఎక్కడ్నుండి వికసించిందో ఆ స్థానంలోకి ముడుచుకోవడం. అది రోజు దగ్గర నుండి సంవత్సరం దగ్గర వరకు, సంవత్సరం దగ్గర నుండి యుగాల వరకు, యుగాల నుంచి బ్రహ్మ కాలం అంత వరకు ఆ విధంగా మనం చూస్తాం. ఈ మొత్తంలో కనిపించేదేంటయ్యా అంటే, expansion and compresion. వికాసం కలగడం, మళ్ళీ తిరోధానం చెందడం. స్పందనం చెందడం కూడా 'సోహం' అనే శబ్దం ఆధారంగానే పనిచేస్తుంటుంది. దాని వెనకాల 'ఓం' అనేది ఉండడం వలన, ఆ ఓంకారం వ్యక్తమైనప్పుడు సోహంగా మనకి స్పందన లోను, స్పందన నుంచి ఉచ్ఛ్వాస నిశ్వాసాలని గా వ్యక్తమవుతూ ఉంటుంది. ఈ వ్యక్తమయ్యే శబ్దాన్ని మనం మళ్ళీ కంఠం నుంచి వ్యక్తం చేస్తూ ఉంటాం. వ్యక్తం అయ్యే శబ్దం మనం కంఠంలోంచి వ్యక్తం చెయ్యకపోయినప్పటికీ కూడా మనలో ఉన్నది అదే. దాన్ని మనం కంఠం నుంచి వ్యక్తం చేస్తూ ఉంటాం. వ్యక్తం చేసినప్పుడు అది కంఠంలో రేఫం

ఉండడం వలన అది శబ్దంగా బయటికి వ్యక్తమవుతుంది. అంతకుముందు ఉన్నది అది వైఖరిగా వ్యక్తం అవుతుంది. దాన్ని రేఫం అంటారు. వ్యక్తమయ్యే ఒక స్వభావం అది. ఈ వ్యక్తం అయ్యేది కేవలం కంఠంలోనే వ్యక్తమవ్వడం కాదు. కంఠంలో వ్యక్తం కాకముందు భావాలలో వ్యక్తం అయి ఉంది కదా! అదికూడా ఋగ్వేదంలో భాగమే. మనమే వ్యక్తమయ్యాం కదా! అది కూడా ఋగ్వేదంలో భాగమే. ఏదైనా వ్యక్తమవడం అంటే ఉచ్చరింపబడడం అంటారు దాన్ని. దాన్నే Utterance అంటారు. ఏది ఉచ్చరణ అంటే వాక్కు వ్యక్తమవటం. అది మనకి "పరా పశ్యంతీ మధ్యమా వైఖరీ" వాక్కుగా చెప్పుకుంటూ ఉంటాం. మొట్టమొదట సంకల్పం వచ్చి, అది భావంగా మారి, దానికి భాష ఏర్పరచుకొని, భాష ద్వారా బయటికి వ్యక్తం చేస్తాం. బయటికి వ్యక్తం చేసేవి నాలుగు వస్తాయి. అంతకుముందు మూడు స్థితులు ఉన్నాయి. ఈ మూడు స్థితులుగా ఎవరు వ్యక్తం అవుతున్నారు? ఉచ్చరించేవాడు ఒకడుండగా మనలో ఉచ్చరింపబడేది ఒకటుంటుంది. బ్రహ్మ ఉన్నాడు. బ్రహ్మ నుంచి సృష్టి ఉచ్చరింపబడ్డది కదా! బ్రహ్మవాహికగా సృష్టి ఉచ్చరింప బడ్డది తప్ప మూల పదార్థం, ముడి పదార్థం లేకుండా బ్రహ్మ తయారు చేయలేడు. పిండి లేకుండా రొట్టె రాదు కదా! అట్లాగే సృష్టి అనే ఈ రొట్టె తయారవ్వాలంటే దానికి పిండిగా ఒకడున్నాడు. ఆ పిండిలోంచే ఈ బ్రహ్మ వచ్చాడు. వచ్చిన తరువాత అందులోంచి మళ్ళీ పిండి రకరకాల రూపాలలో బయటికి వస్తుందన్నమాట. దేంట్లోంచి తను వ్యక్తమయ్యాడో, అది వాడిలోంచి మళ్ళీ వ్యక్తమవుతోంది. మనలోంచి కూడా అలాగే వ్యక్తమవుతోందది. మాటిమాటికి idea లు ఎక్కడనుండి వస్తున్నాయి? Idea లన్నిటికీ మనమే మూలం అనుకుంటే! మనం అనుకున్నట్టుగా idea లు రావుగా. ఒక్కోసారి idea లు late గా వస్తాయి. ఇట్లా చేసుకుంటే బావుండేది, అనే సన్నివేశాలు మన జీవితంలో కొన్ని వందలు ఉంటాయి. ఇట్లా ఇప్పుడొచ్చిన ఆలోచన ఇంకొంచెం ముందు వస్తే బావుండేది అనే స్థితి ఎన్నిసార్లు లేదు? అంటే idea లు రావడం మీద మనకి స్వామిత్వం లేదుగా! సంకల్పాలు మనలోంచి పుడుతున్నాయి తప్ప, మనం పుట్టించట్లా. మనలోంచి సంకల్పాలు పుట్టించే ప్రజ్ఞ ఏదైతే ఉందో దాన్ని గాయత్రి అని ధ్యానం చేస్తున్నాం. పూజలుగావచ్చు, అభిషేకాలు కావచ్చు, హోమాలు కావచ్చు ఏం చేసినా అసలు ఈ చేస్తున్న వాడు లోపల నుంచి ఎట్లా వ్యక్తమవుతున్నాడో చూస్తే ఆశ్చర్యం వేస్తుంది. వాడు వ్యక్తమై, అన్నీ అట్లా జరుగుతూ ఉంటే మనమే ఏదో చేస్తున్నట్లుగా ఉంటుంది. మనం చేయడం కాదు, వాడు చేస్తున్నాడు. మనలోంచి ముందు సంకల్పం వ్యక్తం అవుతుంది. దాన్ని అబ్బ, ఇప్పుడే వెలిగింది అంటాం కదా! ఎవరు వెలిగించారు? వెలిగిందానికి మనం భావన క్రింద వివరించుకోవడానికి భాషిస్తాం. భాషణం మాట్లాడతాం. అసలు దానికి మూలం ఏమిటి? దాన్ని వాక్కు అన్నారు. ఆ మొదట ఉచ్చరింపబడిందే అది 'ఉత్, చరణ' అంటే వ్యక్తమవడం. ఉచ్చారణ. ఉచ్చారణ అంటే ఏదో గొంతులో నుంచి వచ్చిందే అనుకుంటాం. కాదు. గొంతులో నుంచి వచ్చేది నాలుగో స్థితిలో. అంతకుముందు ఏమీ లేనటువంటి స్థితిలోంచి ఒకటి ఉబుకుతుంది అట్లా. Spring up అవుతుంది అంటారు. చటుక్కున మేల్కాంచడం. మనకి ఆలోచనలన్నీ అట్లాగే

వస్తాయి. అంతవరకు బానే ఉంటాం కదా! ఒక్క ఆలోచన రాంగానే దానిలో నుండి ఎంత అయిపోతుందో మనకి. ఒక్కోసారి ఈ ఆలోచన రాకుండా ఉంటే మనకి ఈ పీడ ఉండేది కాదు కదా, అని అనిపించదూ? కొన్ని కొన్ని ఆలోచనలు అట్లా వచ్చి మన్ని ఎంత దూరం పట్టుకుపోతాయి? అప్పుడు వచ్చింతర్వాత ఏం చేస్తాం? దాని వెంట మనం పరిగెడతాం. పొరపాటున వ్యాపారం అని ఒక ఆలోచన వచ్చిందనుకోండి, అది మన్ని ఎంత తిప్పుతుంది? ఇప్పుడు వాక్కు మన్ని తిప్పతోందా? మనం వాక్కును తిప్పుతున్నామా? సంకల్పం మన్ని తిప్పతోందా? మనం సంకల్పాన్ని తిప్పుతున్నామా? ప్రతివాడు వాడి సంకల్పముల చేత తిప్పబడుతూ ఉన్నాడు. ఒకటే ఆరాటం! ప్రాణి అట్లా లేచిందగ్గర నుంచీ ఆరాటపడుతూనే ఉంటుంది. వచ్చిన సంకల్పాలు పట్టుకొని అట్లా పరిగెడుతూ ఉంటాడండీ! కదా! రామాలయం చూద్దాం అనిపిస్తుంది. ఒకడు పరిగెడతాడు. ఇంకోసారి ఇంకో ఏదో విష్ణు ఆలయం చూద్దాం అని పరిగెడతాడు. శ్రీశైలం బావుంటుందని పిస్తుంది పరిగెడతాడు. ఆ తరువాత అక్కడ ఎవరో చెప్తారు వెంకటేశ్వర స్వామి అని. అక్కడికి పరిగెడతాడు. ఈ లోపల ఇంకోళ్ళు వచ్చి కేదార్నాథ్ అంటారు అక్కడికి పరిగెడతాడు. ఇంకొకళ్ళు బదరీనాథ్ అంటారు. అక్కడికి పరిగెడతాడు. ఈ పరిగెత్తి పరిగెత్తి, ఈ పరిగెత్తడాలన్నీ ఎక్కడి నుండి జరుగుతున్నాయి? మన సంకల్పం మన్ని పరిగెత్తింప చేస్తుంది. అట్లా పరిగెడుతూ పరిగెడుతూ పరిగెడుతూ పరిగెడుతూ ఎక్కడో అక్కడ పడిపోవడమే కదా! లేచిన దగ్గరనుంచి ఒకటే పరుగులాట. Busy! 6.30 కే వెళ్లిపోయారండీ అంటారు. గొప్ప అన్నమాట 6.30 కి వెళ్లిపోవడం. అంటే ఏమిటి? 6.30 నుంచే తిప్పతోందన్నమాట నీ సంకల్పం నిన్ను. తెగతిప్పి, తెగతిప్పి కింద పడేస్తుంది సాయంత్రానికి. అట్లాగే సరస్వతి బ్రహ్మ నుంచి వ్యక్తమై, సరస్వతీ దేవి పరిగెత్తడం జరుగుతుంటే బ్రహ్మ ఆమె వెంట పరిగెత్తడం మొదలుపెట్టాడుట. అంతే మనం కూడా! తనలోంచి పుట్టినటువంటి సరస్వతి వెంటపడ్డాడు బ్రహ్మ అని చెప్పి ఒక రకమైన అలంకారంగా ఒక వాక్యం చెప్తారు. ఆశ్చర్యం గా కనిపిస్తుంది కానీ, మన జీవితమంతా అదే! అది సత్కార్యం అవ్వచ్చు, దుష్కార్యం అవ్వచ్చు, తిరగడం అనేది ఎక్కడినుండి జరుగుతుంది మనలో? సంకల్పమేనా తిప్పతోంది? ఆ ప్రవాహం సరిగ్గా ఉంటే బావుంటుంది. ఆ ప్రవాహం సరిగ్గా లేకపోతే కోసేస్తూ ఉంటుంది. అటూ ఇటూ ఒడ్డు కోసేసినట్టు శరీరాన్ని కోసేస్తుంది. There is the Utterance. ఏమిటీ Utterance? దాన్నే వాళ్ళు, వాళ్ళ భాషలో 'The word' అన్నారు. దాన్నే మన భాషలో 'బ్రహ్మము' అన్నాము. బ్రహ్మము వేరు, బ్రహ్మ వేరు. బ్రహ్మము, బ్రహ్మ నుండి వ్యక్తమవుతూ ఉంటే సృష్టి అవుతూ ఉంటుంది. బ్రహ్మ బ్రహ్మమునకు వాహికగా ఉంటాడు. మనం చేసే సృష్టి మనలోంచి వ్యక్తం అవుతూ ఉంటుంది. దానికి మనం దేవుడు అంటాం. గాయత్రి, విష్ణువు, శివ ఇలా ఎన్ని పేర్లు కావాలంటే అన్ని పేర్లు పెట్టుకోవచ్చు. అది మనలోంచి వ్యక్తం అవుతోంది కదా! అది వ్యక్తమవుతుంటే, ఆ వ్యక్తం అయ్యే దానిని ముందుకు తీసుకు వెళుతూ ఉంటుంది స్పందనం! స్పందనం ఎక్కడి నుంచి వచ్చిందంటే

అందులోంచే వచ్చింది. అందులోంచి వ్యక్తమయిందే స్పందనం. స్పందనలోంచి మళ్ళీ వ్యక్తమవుతూ ఉంటుంది వాక్కు. వాక్కులోంచి స్పందనం వ్యక్తమై, స్పందనంలోంచి వాక్కు వ్యక్తమై, ఇట్లా ఒకదానికొకటి కలిసి పనిచేస్తూ ఉంటాయి. ఈ రెండిట్లో ఏది గొప్ప అనడానికి వీలు లేదు. రెండూ గొప్పే! ఎందుకంటే వాక్కు వ్యాపించాలంటే స్పందనం కావాలి. అసలు స్పందనం అంటూ ఉండాలి అంటే అంతకు ముందు వాక్కు ఉండాలి. ఋషులు కొన్నిచోట్ల ముందు ఋగ్వేదం పుట్టి తరువాత సామవేదం పుట్టింది అని చెప్పారు. కొన్నిచోట్ల ఏం చెప్పారంటే సామవేదం ముందు పుట్టి, ఋగ్వేదం తర్వాత పుట్టినదని చెప్పారు. మన బోటి తెలివైన వాళ్ళు, చదువుకుని, పాశ్చాత్య దేశాల నుంచి వచ్చి 'consistency' లేదు ఈ ఋషులకి ఒక్కోచోట ఒక్కోటి రాశారు అంటారు. Reference to the context చూసుకోవాలి తప్ప ఒకచోట ఒకటి, ఒకచోట ఒకటి రాశారని కాదు అక్కడ. ఈ రెండిట్లో ఏది గొప్ప? చెప్పండి. బండి లేకపోతే మనం కదలలేం. ఎవరికి తెలుసు మనము ఉన్నాం అని. ఏ ముడి పదార్థమయితే వ్యక్తమవ్వాలో, వ్యాపించాలో అది వ్యాపనం చెందాలంటే దానికో vehicle కావాలి కదా! ఆ వాహనమే స్పందనం! స్పందనం లేకపోతే దానికి వ్యాపనం లేదు. ఉన్నట్లు కూడా ఎవరికీ తెలియదు. అసలు స్పందనం ఎక్కడి నుంచి వస్తుంది? ఆయనలోంచి వ్యక్తమయిన సంకల్పమే స్పందనంగా ఉంది. అదే మనకు విష్ణువు, గరుత్మంతుడు. గరుత్మంతుడు లేకపోతే విష్ణువు ఎక్కడికి కదలలేడు అంటాం. మనం చూడండి vehicle లేకపోతే, ఇవాళ ఎలా అంటాం. ఏమిటో కాళ్ళు మర్చిపోయి ఏదో ఒక vehicle లేకపోతే అన్ని పనులు ఆగిపోతాయి మనకి. Vehicle 'వాహిక'! ఇప్పుడు మనకి శరీరం అనే వాహిక లేదనుకోండి ఈ జరుగుతున్నదంతా ఏం లేదు కదా! అందుకని మొదటి వాహికగా మనకి స్పందనం కనిపిస్తుంది. ఆ స్పందనాన్ని మనవాళ్ళు సామవేదం అన్నారు. ఈ వ్యక్తమవడం అనేటువంటిది ఉన్నదే, దాన్నే ఋగ్వేదం అన్నారు. అవి రెండూ మనలోనే ఉన్నాయి. మాటిమాటికే వ్యక్తమవుతూ ఉంటాయి కదా! ఈ వ్యక్తమయ్యే దానిని రోజూ కూర్చుని ఇంత వ్యక్తం అవ్వాలా అని చూసుకోమన్నారు. ఎందుకంటే అక్కర్లేనివి, కావలసినవి కలిసి వ్యక్తమయిపోవడం వలన వ్యర్థమైపోతూ ఉంటుంది జీవితం. రోజూ సంకల్పాలు ఏ విధంగా ఉన్నాయో చూసుకోవడం కోసమే పొద్దున ధ్యానం. వాటికొక alignment పట్టుకు రావాలి. ఒక అనుసంధానం తీసుకురావాలి. ఒక సమన్వయం పట్టుకు రావాలి. ఊళ్ళో ఉండే అన్ని మంచి పనులూ మనమే చేద్దాం అనుకోకూడదు. ఊళ్ళో చాలా మంచి పనులు జరుగుతుండచ్చు. అన్ని మంచి పనులలోను నేనుండాలి, నా పేరుండాలి అనుకున్నాం అనుకోండి, చచ్చూరుకుంటాం కదా! అది రజస్సు అవుతుంది. సత్యం ఏమిటయ్యా అంటే మన దగ్గరికి వచ్చిన పని మనదా? కాదా? చూసుకొని, లోపలికి వెళ్ళి verify చేసుకొని దానికి మనం స్పందిస్తూ ఉండాలి. Respond చెయ్యాలి తప్ప ఊరికే react అయిపోకూడదు వచ్చిందానికల్లానూ. React అయిపోయేవాడు బంధింపపడడమే కాకుండా cut అయిపోతాడు. Respond అయ్యేవాడు అందులో తన కర్తవ్యం మేరకి

స్పందిస్తాడు. మనం మంచి పనులు చేద్దాం అనుకున్నాం అనుకోండి. ఊరి నిండా చాలా మంచి పనులు ఉంటాయి. అన్నీ మనం చేయగలమా? చేయలేం కదా! దానివల్ల మనకేమవుతుంది? Cut అయిపోతుంది. అందుకని ప్రతి ఉదయం సంకల్పాలన్నీ ఒక రకమైన గాడిలో పెట్టుకోవాలి. పట్టాల మీద బండి ఉందో లేదో చూసుకోవాలి రోజూ. అందుకు ధ్యానం. What am I to do? అని అనుకోవాలి ప్రతివాడు వాడిని వాడు. ఇంకోళ్ళని అడుక్కోవడం వద్దు. నేనేం చేయాలి? నేనేం చేస్తున్నాను? నేను చేయవలసినవి చేస్తున్నానా? నేను చేయదలచినవి చేస్తున్నానా? కదా! మామూలుగా చేయవలసినవి చేయడం మర్చిపోయి, చేయదలచినవన్నీ చేసుకొని, అవే చేయవలసినవి కింద భావన చేసుకుంటూ చాలా ఆయాస పడిపోతూ ఉంటాం. దాంతో ఏమవుతుంది? ఆయాస పడిపోవడం వలన స్పందనం ఖర్చయిపోతూ ఉంటుంది. స్పందనం ఖర్చయిపోతే వాహిక cut అయిపోతుంది. వాహిక cut అయిపోతే వ్యక్తమవడానికి ఇంకేం ఉండదు. One is vehicle, the another is owner of the vehicle అండీ. ఒకడు రథికుడు. ఇంకోడు రథం. స్పందనం అనేటువంటిది రథం అయితే దాన్ని ఎక్కి తిరిగే వాడు owner. 'పతగేంద్రుడు యొక్క మూపురము నందు అష్టబాహువులతో కూర్చున్న నారాయణునికి నేను నమస్కరిస్తున్నాను' అని మొదలు పెడతాం నారాయణ కవచం. మనలో జరుగుతున్న స్పందనం గరుత్మంతుడుగా దర్శనం చేసుకోవాలి. మనలో వ్యక్తమయ్యేటటువంటి సంకల్పాలన్నీ కూడా విష్ణుమూర్తి లాగ, ఆయన గరుత్మంతుడిని ఎక్కి తిరుగుతున్న విధంగా, మనం కూడా వచ్చిన సంకల్పానికి ఈ వాహనాన్ని అంటే శరీరాన్ని ఎక్కేసి రోడ్డు మీద తిరుగుతూ ఉంటాం. ఇక్కడా అక్కడా రకరకాలుగా భావమయ లోకంలో తిరుగుతూ ఉంటాం. కామమయ లోకంలో తిరుగుతూ ఉంటాం. భౌతికమైన లోకంలో తిరుగుతూ ఉంటాం. మనకి మూడు రకాలుగా తిరుగుళ్ళు ఉంటాయి. ఈ తిరుగుళ్ళలో ఏమవుతుందంటే, అసలు వ్యక్తం అవ్వాల్సింది తప్ప వ్యర్థమైనటువంటిది వ్యక్తం అవుతూ ఉంటే, ఈ వాహిక అంటే ఈ శరీరము క్షీణించిపోతూ ఉంటుంది. మనలో ఉండే స్పందనం ఆధారంగా మన శరీరం అంతా ఏర్పడి ఉన్నది. స్పందనం వల్ల ప్రాణ ప్రవృత్తులు, దానివల్ల ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, దానివల్ల గుండె కొట్టుకోవడం, దానివల్లనే రక్త పరిశుద్ధి, మంచి రక్తం చెడు రక్తం చేసేస్తూంటే, చెడు రక్తం మంచి రక్తం అవుతుండడం. ఇవన్నీ స్పందనం వల్లనే! ఇది మనలో ఉండే వాహిక! దాన్ని నడిపించడానికి సంకల్పం! ఆ సంకల్పాలు మనకి ఋగ్వేదం అన్నారు. సంకల్పాలు ఋగ్వేదం అయితే, స్పందనం సామవేదమే! ఈ రెండు కలిసినప్పుడు ఏమవుతుందంటే విజయం మనదే! తప్పదు. ఎందుకంటే జరిగేది యజం అవుతుంది. అది యజుర్వేదం. సృష్టిలో జరిగేదంతా యజమే! యజం అంటే ఏమిటయ్యా అంటే ఫలితములు ఆశించక నిర్వర్తించు కర్తవ్యములు. అవి యజములు. మీరు ఎప్పుడూ వినే భాషలో చెప్పాలంటే 'నిష్కామ కర్మ' అంటారు. చేయవలసిన దాంట్లో ఉండటం. మనం ఏం చేయాలో అది చేస్తూ ఉండాలి. చేయవలసిన దానికి ఫలితం చూసేదేం లేదు. తల్లి పిల్లవాడికి చేసే చాకిరి లో ఏం

ఫలితం చూస్తోంది? రేప్పొద్దున వాడు తిరిగి చూస్తాడో లేదో మనకి తెలియదు కదా! తండ్రి పిల్లవాడికి ఇచ్చే దాంట్లో ఏమిటి ఫలితం అని ఆలోచించి ఆశించి చేస్తున్నాడు? తోటమాలి వందలాది చెట్లను పెంచడంలో ఏమిటి ఫలం అని ఆశించి చేస్తున్నాడు? ఆశించి చేసిన చోట అడుక్కుతిన్నట్టు ఉంటుంది జీవితం. ఆశించక చేయడంలో, మనలో ఉండేటువంటి ప్రజ్ఞల మధ్య సఖ్యత ఎక్కువ అవుతూ ఉంటుంది. వాడి జీవితం యజముగా సాగుతుంది. యజ్ఞముగా సాగుతుంది. యజ్ఞము జరుగుతున్న కొద్ది జయం వస్తూ ఉంటుంది. యజము వలన జయము అని చెప్తారు. యజము ఎంత జరుగుతూ ఉంటే జీవితం అంత జయముగా ఉంటుంది. జయము గా ఉండడం అంటే ఆస్తులు పెరగడం కాదు. ఆనందం పెరగడం. ఆత్మ యందు తృప్తి కలిగి ఉండడం. భావముల యందు సమృద్ధి కలిగి యుండడం. వృద్ధి కలిగియుండడం. బుద్ధి కలిగి యుండడం. బుద్ధి, వృద్ధి, సమృద్ధి, సిద్ధి ఇవన్నీ ఉంటాయి యజము చేస్తూ ఉంటే! అట్లా యజము చేస్తూ ఉంటే అప్పుడు మనకి యజుస్, సామల వలన సృష్టి అట్లా మొదలైంది. సృష్టిలో వ్యక్తమయ్యేటటువంటి సంకల్పం, దానిలోంచి స్పందనం పుట్టింది. The space pulsates. చోటులో ఈ సంకల్పం పుట్టగానే స్పందన మొదలైంది. ఆ సంకల్పం పుట్టకముందు చోటు ఎట్లా ఉందయ్యా అంటే స్పందనం లేమిగా ఉన్న, ఏమీ లేనటువంటి చోటుగా ఉందన్నమాట. ఏమీ లేనటువంటి చోటులో ఒక స్పందనం పుట్టింది. మనలో కూడా ఏమీ లేనటువంటి స్థితి నుండి ఒక భావం మేల్కాంచుతూ ఉంటుంది. మనకి అది ఎలా ఉద్భవిస్తుందని చూసేటటువంటి అవకాశం కోల్పోయి ఉన్నాం. ఎందుకంటే ఎప్పుడూ భావాలు మనకి మూకుమ్మడిగా, ఉమ్మడిగా వస్తూంటాయి ఎప్పుడూ బొమ్మ పడే ఉంటుంది తెరమీద. కానీ తెరంటూ ఉంది బొమ్మ లేకుండా అనే ఒక స్థితి మనకి లేదు. ఎందుకంటే భావములు గుంపులు గుంపులుగా, గుంపులు గుంపులుగా అట్లా తోసుకొచ్చేస్తూంటాయి కాబట్టి. కానీ నిజానికి ఒక్కొక్క భావము ఉబికి అది మన్ని బయటకి తీసుకెళ్తూ ఉంటుంది కదా! బ్రహ్మనే పట్టికెళ్ళినట్లు సరస్వతి. మనలో వచ్చిన భావమే సరస్వతి. మన సరస్వతి బావుంటే మన జీవితం బావుంటుందండీ! మన సరస్వతి బావుందా? లేదా? అని తెలుసుకోవాలంటే మనలో సంకల్పాలు ఎట్లా పుడుతున్నాయి, చూసుకోవాలి. 'సావిత్రీం తర్పయామి సరస్వతీం తర్పయామి', ఇలా గాయత్రి అమ్మవారిని ప్రార్థన చేసేటప్పుడు చెప్తాం. మనలో ప్రవహించే వాక్కుని భగవంతుడన్నారు. నీ పుట్టుక స్థానమేది? అని కృష్ణుడ్ని అడిగితే ఒక గోపిక పెదవుల మీద ముద్దు పెట్టుకున్నాడు అనేటువంటి ఒక ఘట్టాన్ని మనకొక సంకేతాన్ని అందిస్తుంది కదా! అర్థమేమిటంటే వాక్ స్థానం నేనని చెప్పడం అని చెప్పకున్నాం కదా! మనం. వాక్కు ఎక్కడ నుంచి వచ్చిందంటే నాలుక దగ్గర నుంచి వచ్చింది కాదు. నాలుక దానికి చివరి మెట్టు. నాలుక ముందు కంఠం, కంఠం ముందు హృదయంలో భాసించడం, లేకపోతే మనసులో భాసించడం, అంతకుముందు అసలు భాసించే స్వభావంగా ఉన్నదే అది నేను అని చెప్పడం. నీలో ఈ ప్రశ్న పుట్టింది చూశావా? ఆ ప్రశ్న నేనని చెప్పడం. ఎవరిలో ఏ సంకల్పం కలిగినా, ఆ సంకల్పం కలగడం అనే తత్వం ఉన్నదే, ప్రజ్ఞ ఉన్నదే అది భగవంతుడు యొక్క వ్యక్త

స్వరూపం. అది పుట్టకముందు ఉన్నాం కదా! అది నిజస్వరూపం. అది అదృశ్యస్వరూపం. భావం వ్యక్తం కాకముందు మనం ఉన్నాం. తరువాత భావంగా వ్యక్తమవుతూ ఉంటాం. వ్యక్తమైన భావం గురించి ఆరాటపడుతూ ఉంటాం. వ్యక్తమైన భావం ఎట్లా నిర్వర్తించటమనేది యజస్సు అవుతుంది. యజుర్వేదం. యజుర్వేదం అంటే plan of work. సామవేదం అంటే song of breath. ఋగ్వేదం అంటే sound of breath. ఒకటి ఉచ్చరింపబడడం అవుతుంది. ఉచ్చరింపబడిన దానిని వ్యక్తం చేయడానికి స్పందనం ఆధారంగా ఉంటుంది. ఈ రెండూ కలిసి నిర్మాణం చేస్తున్నటువంటి కార్యక్రమం నడిపించుకోవడం యజుర్వేదంగా ఉంటుంది. ఈ రెండిటికీ మధ్య సఖ్యతతో కూడినటువంటి పద్ధతుల్లో మనకి వచ్చినటువంటి సంకల్పం పనిచేస్తూ ఉంటే, అంటే ప్రజ్ఞ యజ్ఞార్థంగా జీవితం జరుగుతూ ఉంటే అది అవతరణం చెందడం చాలా కళ్యాణప్రదంగా ఉంటుంది. శుభప్రదంగా ఉంటుంది. లేకపోతే ఏడ్చినట్లుంటుంది. అది నాలుగో స్థితి. మన వల్ల రూపుదిద్దుకున్న జీవితంలో, మన వల్ల రూపుదిద్దుకుంటున్నవన్నీ కూడా, దాన్నిబట్టి మనం ఎట్లా ఉన్నామో తెలుస్తుంది. మన్ని వెక్కిరించేట్టుగా ఉన్నాయా అవి? లేకపోతే మనకి ఆనందాన్ని కలిగించేట్టుగా ఉన్నాయా? చాలా మటుకు వెక్కిరించేట్టుగా ఉన్నప్పుడు బాధపడుతూ ఉంటాం. ఎందుకు బాధ పడుతున్నాం? నీ వల్లే అది! నీలో వచ్చిన సంకల్పం, దానికి నువ్విచ్చినటువంటి రూపకల్పన కదా! సృష్టిలో కూడా ఇలాగే సంకల్పం వ్యక్తమై, చోటులో స్పందనం ఏర్పడి ఆ రెండింటిలోంచి పుట్టిన ప్రణాళికలోంచి ఈ సృష్టి అంతా జరుగుతోంది. వాటికి సృష్టితో ఘర్షణ లేదు. మానవుడ్ని కూడా భగవంతుడు తనంతటి వాడ్నిగా చేసి వదిలేశాడు కాబట్టి 'నువ్వు కూడా నాలాగా చేసుకో' అని చెప్పాడు. మంచి సంకల్పం వచ్చిందనుకోండి. చేయటానికి కావలసిన వనరులేం కావాలి దీనికి? What are the resources? యజ్ఞం చేద్దాం అనుకుంటే దానికి ద్రవ్య సమీకరణ ఉన్నది. ఎటువంటి ద్రవ్యం సమీకరణ చేయాలి? ఎట్లా పడితే అట్లా ఉండే ద్రవ్యం వాడటానికి వీలు లేదు. ద్రవ్యం అంటే పదార్థం అని. ఎటువంటి ధనంతో దాన్ని కొనుగోలు చేశావు? ఎటువంటి ద్రవ్యాలతో పదార్థాన్ని కొనుగోలు చేశావు? ఎటువంటి ప్రదేశంలో దాన్ని వినియోగం చేశావు? ఎటువంటి మనుషులు దానికి వినియోగింపబడ్డారు? దీన్ని బట్టి ఉంటుంది అక్కడ సిద్ధి అనేది. డబ్బున్న వాళ్ళు ప్రతివాళ్ళూ మంచి పని చేయలేరు. డబ్బు లేకుండా, వనరులు లేకుండా, ఉత్తుత్తి సంకల్పం ఉన్నవాళ్ళూ చేయలేరు. అంటే ఎక్కడికక్కడ పవిత్రత ఉన్నచోట దాని యొక్క అవతరణం చక్కగా జరుగుతుంది. లేకపోతే రొష్టుగా జరుగుతుంది. ఒక పని రొష్టుగా జరుగుతున్నదంటే మనుషుల్లోనో, పదార్థంలోనో, ప్రదేశంలోనో, సంకల్పంలోనో ఎక్కడో తేడా ఉందని అర్థం. అది సాఫీగా జరుగుతుందనుకోండి అప్పుడది according to the natural plan. ప్రకృతి ఏ విధంగా జరిపిస్తుందో అట్లాగే దానికి అనుసంధానం చేసి, చేసినట్లవుతుంది. బ్రహ్మ ని ఎట్లా చేయాలి అని అడిగితే 'ప్రకృతిని చూసి నేర్చుకోండి' అని చెప్పాడు. 'నేను సృష్టిస్తున్నా కదా, అది చూసి మీరు కూడా నేర్చుకోండి', అని

చెప్పాడు. 'సహ యజ్ఞా ప్రజా సుస్వా' మీరు కూడా చేయండిరా యజ్ఞం, అన్నాడు. మీరూ నా అంతటి వాళ్ళే! అన్నాడు. ఎందుకంటే మీలోంచీ ఉచ్చరింపబడుతోంది. నాలోంచి ఉచ్చరింపబడుతోంది. ఎవరైతే ఉచ్చరింపబడుతున్నాడో మనలోంచి, వాడినే 'The whom The Creator uttered' అంటాం. ఎవరినైతే బ్రహ్మ ఉచ్చరిస్తున్నాడో అని. ఎందుకంటే వాడికి పేరు లేదు. వాడికి రూపం లేదు. పేరు, రూపం లేనివాడు మనలోంచి మన సంకల్పంగా వ్యక్తమవుతాడు. సంకల్పాలు కొంచెం భయంకరంగా ఉంటే స్పందనం కొంచెం అల్లల్లాడిపోతూంటుంది. మీకు మీరే చూసుకోండి. పని అవట్లేదుట అంటే వచ్చే భయాల వల్ల గుండె దడ పెరుగుతూ ఉంటుంది. అంటే అవన్నీ Unworthy of being entertained. మన్ని రొష్టు పెట్టే పని మనకెందుకు? పని వల్ల సుఖపడాలి. కదా! ఏ పని చేసినా అందులోంచి ఆనందం రావాలి. సుఖం రావాలి. ఎందుకంటే సృష్టి అంతా కూడా రసానుభూతిని చేశానురా, ఏడవడం కోసం కాదురా, అని చెప్తాడు. మామిడి చెట్టు పెంచుకుంటూ వెధవ మామిడి చెట్టు పెంచకపోయినా బావుండేది అని ఏడుస్తున్నామనుకోండి, అదా మామిడి చెట్టు పెంచే పద్ధతి? మామిడి చెట్టు ఎందుకు పెంచమన్నారు ఆయన? మామిడి చెట్టు పెంచుకుంటే ఆ పెరగడంలోనూ ఆనందం ఉంది. ఆ పండొచ్చినప్పుడు చూట్టంలోను ఆనందం ఉంది. తింటంలోనూ ఆనందం ఉంది. అన్ని రకాలుగా ఆనందం ఉంది. లేచిందగ్గరనుంచీ మనకన్నీ హింస పాదమే! పప్పులో పడ్డమే! ఆ పప్పులో పడ్డదాన్ని వదిలేసి మళ్ళీ కొత్తగా మొదలు పెట్టుకుంటే హాయిగా ఉంటుంది. మాస్టర్ గారు ఎవరినైతే అనుసరించి వెళుతుంటారో వారు, ఆయనకి ఒక ఆదేశం ఇచ్చారు. ఒక్కోసారి మనం అనుకున్న పనులు అనుకున్నట్టు అవవు. అవకపోగా వాటి అన్నిటికీ ముళ్ళు పడిపోతుంటాయి. చిక్కులు పడిపోతాయి. పడిపోతే ఆయనకు ఒక సందేశం వచ్చింది. Leave the confused plan and start a fresh అని. జంధ్యం, జంధ్యాల పౌర్ణమి రోజున ఇవ్వగానే రకరకాల ముళ్ళు పడిపోయాయి అనుకోండి. మనకి చిరాకు వచ్చేసి, పీకి, కోపం వచ్చి, పళ్ళు బిగించి ఇవన్నీ చేసే బదులు అది ఆ పక్కకి పారేసి ఇంకో జంధ్యం ఇవ్వడం మొదలు పెడితే better కదా! ఇది అవదని తెలియడం వల్ల అది వదిలేసి, మళ్ళీ మొదలు పెడితే సుఖం కదా! అట్లా కూడా చేయగలిగి ఉండాలి అవసరమైతే! ఈ అవతరణం చేయడమనేదాన్ని ఇంగ్లీషులో white magic అంటారు. దానిక్కావాల్సిందేంటయ్యా అంటే ఈ త్రిభుజం. ఏంటయ్యా ఈ త్రిభుజం అంటే సంకల్పం. అది యజ్ఞార్థంగా ఉంటే స్పందనం cooperation ఉంటుంది. లేకపోతే స్పందనం దెబ్బతింటుంది. మిమ్మల్నందరినీ మోసం చేసి, ఏదన్నా సంపాదిద్దాం అనే భావన పెట్టుకున్నాననుకోండి, ఎప్పటికప్పుడు నన్ను నేను కాపాడుకుంటూ ఉండాలి కదా మీ నుంచి. మీకు తెలియకుండా ఉంచుకోవాలి కదా! నేను Clandestine deals చేసుకున్నప్పుడు వాడికి వాడినే, లోపల వాడికి వాడికే భయం వేస్తూ ఉంటుంది వాడికి తెలిసిపోయిందేమో నేను చేసిన మోసం అని. ఇవన్నీ ఎందుకు? అందుకని సంకల్పం లో స్పష్టత, పవిత్రత, దాన్ని నిర్వర్తించడంలో కావలసినటువంటి సామర్థ్యం ఉండాలి. సామర్థ్యం ఎక్కడినుండి వస్తుంది?

అంగబలం, మనుషుల్ని బట్టి, వనరులను బట్టి,కాలం బట్టి, దేశం బట్టి ఉంటుంది. పవిత్రమైన ద్రవ్యం ఉన్నా, మంచి మనుషులు మన చుట్టూ ఉన్నా, కాలం cooperate చేయకపోతే అవదు. అదే అంటాడు భీష్ముడు, ఆ ధనస్సు యొక్క ఝుంకారము వింటేనే ఎదుట శత్రు సైన్యంలో అవతలి నుంచి పోరాడేవారు గుండెలు పగిలిపోతాయట. అటువంటి గాండీవం ట అర్జునుడిది. గాండీవం నారి అర్జునుడు ఒకసారి లాగి మోగిస్తే ఎదుటి మనిషి గుండె దడ దడ దడ దడా కొట్టుకొని ఇంక పడిపోతానా అనిపిస్తుందిట. అటువంటి శబ్దం చేస్తుందిట. ఇంకోడెవడయ్యా అంటే సరాసరి వాయుదేవుడికి పుట్టాడు. వాడు గద విసిరాడంటే ఏదైనా పచ్చడయిపోతుంది. మరొకరెవరయ్యా అంటే, వాడు తలుచుకుంటే ఈ సృష్టి అంతా వాడి లోపలికి అట్లా ఒక లడ్డు వెళ్ళినట్లు వెళ్ళిపోతుందిట. అది కృష్ణుడు. 'ఇంతమంది ఇటువంటి వాళ్ళు ఉన్నారు కదా మీకు, అయినా ఆపద కలిగింది, నాకు ఆశ్చర్యంగా ఉంది' అంటాడు భీష్ముడు ధర్మరాజును చూసి. అంటే కాలం కలిసి రాలేదని అర్థం! అంటే మనకన్నీ ఉన్నా కూడా time dimension ఒకటి ఉంటుంది. కాబట్టి కాలం కూడా చూసుకోవాలి. కాలం, దేశం బాగున్నా వనరులు లేవనుకోండి, వనరులు ఉన్నా మనలో సామర్థ్యం లేదనుకోండి, ఇవన్నీ యజుర్వేదంలోకి వస్తాయి. Time, place సరైనవా కాదా చూసుకోవడం. మంచి time అయినా, మంచి place లేకపోతే అవదు. తిప్పలు పెట్టేస్తుంది. మంచి place అయినా, మంచి time లేకపోతే అవదు. ఇవన్నీ కలిసి రావాలి. కాలం, కర్మం కలిసి రావాలి అంటారు కదా మనవాళ్ళు. అట్లాగే చేసే వాళ్ళలో సంకల్పం బావుండాలి. వాళ్ళు తెచ్చి ఇచ్చే వనరులు బావుండాలి. ఒక మంచి సూక్తి ఉంది ఇంగ్లీషులో. Bad money cannot help good deeds. చెడ్డగా సంపాదించిన వాళ్ళు ఆ డబ్బుతో మంచి పనులు చెయ్యలేరు. Good money is rare to find to do good deeds. అది ఇంకోటి. ఇది కలియుగం. అంటే మంచి డబ్బు కరువు కాబట్టి పనులు కావు. చెడ్డ డబ్బు వలన ఎలాగూ మంచి పనులు కావు. కాబట్టి మంచి పనులు కావడం చాలా కష్టం కలియుగంలో. ఇదంతా యజస్సుకు సంబంధించిన మాట. ఆ బుక్, ఆ సామం మధ్య ఉండే అనుసంధానాన్ని ఈ యజస్సు చక్కగా ఇతరుల ఉపయోగం కోసంగా తయారు చేసుకోవాలి. యజ్ఞార్థం అంటే అందులో మనకి పేరొస్తుందని చేయకూడదు. గుట్టుచప్పుడు కాకుండా చెయ్యాలి. ఒక చిన్న పని చేస్తూ ఊరంతా మోత మోగించారనుకోండి అది యజ్ఞార్థం అవదు. నువ్వు చేస్తేనేమి, నువ్వు చెయ్యకపోతే ఏంటట? రెండూ లేవు. నువ్వు చెయ్యకపోతేనే తప్పు తప్పుగా ఉండేది, నువ్వు చేయడం వల్ల ఊరికే తప్పు పెరిగిపోయి, noise ఎక్కువైపోయింది అంటాం. మహత్తరమైన కార్యాలు అత్యంత నిశ్శబ్దంగా జరగాలి. శబ్దం పెరిగిన కొద్దీ అడ్డంకులు ఎదురవుతాయి. మన జీవితం మనకి అద్దం పట్టినట్టు కనిపిస్తుంది మనం చేసే పనుల్లో. అయ్యే పనులు అవడం, అవకపోవడం వీటన్నిటికీ, యజ్ఞార్థమా? కాదా? దేవుడు పనులు అయినంత సులభంగా మన పనులు అవుతాయాండీ? అవ్వవు. ఎందుకనంటే అక్కడ ఎవరికీ వారికోసం అని ఉండదు కాబట్టి. అందులో

వాడికి ఏదో కావలసి వచ్చి. పేరు ప్రతిష్టలు, డప్పు మోయించుకోవడాలు ఉన్నాయనుకోండి ఆగిపోతుంది. రెండింటినీ సరిగా అనుసంధానం చేసుకొనడం ఈ నామానికి, ఇవన్నీ చెప్పకుంటున్నాం. సోహం అనే శబ్దం అందులో ఉన్నది. 'సా హా' ఓంకారంతో స్పందనం కలగడం వల్ల సోహం శబ్దం, అది మనలో ఉండేటువంటి సామవేదం. ఆ సామవేదానికి జోడించిన ఋగ్వేదం 'రేఫం' 'సహ' 'స్ర' మళ్ళీ రెండో 'స' లో 'ర' వస్తుంది. 'రేఫం' అంటే ఋక్, సామ వేదముల యొక్క సారాంశముగా 'సహస్ర' అనే మంత్రం ఇవ్వబడింది. ఈ రెండూ కలిసుంటే విష్ణుమూర్తి, గరుత్మంతుడు కలిసినట్టండీ! వాళ్ళిద్దరూ ఎప్పుడు కలిసొస్తారయ్యా అంటే యజ్ఞార్థమైన కర్మ జరుగుతూ ఉంటే కలిసొస్తారు. సంకల్పం బావుండినప్పుడు co-operation వస్తుంది. అప్పుడు అది యజ్ఞార్థంగా ఉండాలి. ఉంటే దానికి తిరుగుండదు. అలా వెళ్ళిపోతుంది చక చక చక చక చకా. విష్ణువు గరుత్మంతుడిని ఎక్కి యుద్ధానికి వచ్చాడుట అంటే ఇంక అయిపోయింది యుద్ధం అని అర్థం కదా! రక్షించడానికి వచ్చాట్టయ్యా అంటే split సెకన్లలో అక్కడ ఉంటాడు. అంత శక్తివం తమైనటువంటిది ఈ సహస్ర అనే నామం. 'సహస్రజిత్' అంటే ఋక్, సామ, 'జిత్' అంటే జయము. కదా! అది యజము ద్వారా ఏర్పడుతుంది. కాబట్టి యజుర్వేదం కూడా అందులో ఇమిడియున్నది. ఈ మూడు వేదములే ముఖ్యమైన వేదములు. దాని యొక్క పర్యవసానంగానే మనకి అధర్వణ వేదం! దాన్నుంచి వచ్చే అవతరణం! కాఫీ బావుంది. డికాషన్ మంచిది. పాలు fresh గా ఇప్పడే పితికి తీసుకొచ్చాం. పంచదార ఉన్నది. కాబట్టి మంచి కాఫీ దొరుకుతుంది అనడానికి అవకాశం ఉందా లేదా ? కలిపే వాళ్ళు ఉంటే! అట్లా ఈ మూడు కలిసొస్తే ఋక్, యజు, సామ, ఈ మూడు కలిసున్న చోట అవతరణ అనేది దివ్యంగా ఉంటుంది. ఈ మూడు కలిసిరానిచోట అంతంత మాత్రమే ఉంటుంది. అందుకనే మనకి ఆ మూడింటిని చెప్పడానికి త్రికోణం చెప్తారు ఆరాధనలో. ఈ త్రికోణము, సమకోణ త్రికోణంగా ఉంటే, దాని నుంచి వ్యక్తం అయ్యేదంతా కూడా చక్కని చతురస్రం ఏర్పడుతుంది. అదే గుడి క్రింద ఏర్పడటం అంటే. చతురస్రం మీద త్రికోణం అదీ దేవాలయం. కదా! అది నెంబర్ ౭. ఏడు లోకములు ఆ విధంగా ఏర్పడినాయి. త్రికోణం నెంబర్ 3. చతురస్రం నెంబర్ 4. 3+4=౭. అందులో qualities ఉంటాయి. అంటే పరిపూర్ణమైన అవతరణం చెందిన దాంట్లో 3×4 qualities ఉంటాయి. 3+4 creation లో 3×4 qualities ఉంటాయి. 12 భావాలు. మూడు లోకాలుగా దిగివచ్చి 12 భావాలుగా తనే నిండి ఉంటాడు. ౭,12 కలిపి 84 భావాలుగా వస్తాడు. అదే మనకి 84 అంకె ప్రాముఖ్యత. ఈ 'సహస్రజిత్' అనే నామం ద్వారా పరిమితత్వం పోగొట్టుకోవడం, భయం పోగొట్టుకోవడం, విఘ్నాలు పోగొట్టుకోవడం. అందుకని దీన్ని ఇందాక చెప్పిన పద్ధతులుగా ధ్యానం చేసుకోవాలి.

318 అనంతజిత్

అనంతజిత్ అంటే అంతం లేనటువంటి, జయము కలిగినవాడై ఉన్నాడు భగవంతుడు. అంతమయ్యేటటువంటి తత్వం మనలో ఎక్కువ. అన్నీ అయిపోతాయి అనుకుంటాం. ప్రతీదీ అయిపోతుంది అనుకోవడం అనేది మనకి సహజమైన స్వభావం. కానీ అవకపోవడం అనేది సృష్టి స్వభావం. ఏదీ అయిపోదు సృష్టిలో. ఇది అయిపోతుంది అని చెప్పండి సృష్టిలో. అక్షరం అనేది ఆయన తత్వం! అయితే అదే మనం అయ్యుండి కూడా, మనకుండే జ్ఞానం లేమి వలన ప్రతీదీ అయిపోతుంది కదా, అని మన feeling. అయిపోతుంది అని భయంతోనే కదా జీవిస్తుంటాం. ఏదీ అవదబ్బాయ్. అన్నీ ఉంటాయి. అనంతంగా ఉంటాయి. అంటే అంతం కాకుండా ఉంటాయి. అది భగవత్తత్వంలో కనిపిస్తుంది. ఎందుకంటే ఆయన లోంచి వచ్చిన ప్రతిదీ ఒకటి లోపలికి వెళ్ళే లోపల ఇంకోటి బయటికొస్తుంది. తనలోంచి కొడుకొస్తే, కొడుకులోంచి మనవడిని చూసుకొని తాత వెళ్ళిపోతాడు. ఇంకా ఓపిక ఉంటే ముని మనవడ్ని కూడా చూసి వెళ్తాడు. చెట్టు లోంచి విత్తనం పుట్టి అందులోంచి చెట్లు పుట్టట్లా? పశువులోంచి పశువులు పుడుతూనే ఉన్నాయి. మనిషిలో నుంచి మనుషులు పుడుతూనే ఉన్నారు. శాస్త్రజ్ఞులు ఇన్నేళ్లకి ఈ భూమిలో ఇది అయిపోతుంది అది అయిపోతుంది అని చెప్తారు. మనం చక్రవర్తి వాళ్ళ వంటింట్లోకి వెళ్ళాం అనుకోండి. అక్కడ బియ్యం బస్తా చూసామనుకోండి. వాళ్ళింట్లో మనుషుల్ని చూశామనుకోండి, ఐదుగురు మనుషులు ఉంటారు. ఒక బియ్యం బస్తా సగం వరకు ఉంది. 50 kg లది. రోజుకి ఇన్ని గ్రాముల చొప్పున తింటారు. మనిషి 100 గ్రాములు తింటే 500 గ్రాములు తింటారు. రెండు పూటలా తింటారు 1000 గ్రాములు. Kg అయిపోతుంది. 50 రోజులు తింటే బియ్యం అయిపోతుంది. ఇంక అంతే? అయిపోయిందండీ చక్రవర్తి పని! 50 రోజులు తర్వాత ఇంకేం లేదు. అంటే బియ్యం ఉండవు. కానీ 50 రోజుల తర్వాత వెళ్ళి చూస్తే ఇంకో బస్తా ఉంటుంది. అలా చాలా బస్తాలు తిన్నాం. అయినా బస్తా తింటుంటే బస్తా వస్తోంది కదా! ఇట్లా fixed గా ఇంత అక్కడ ఉంది అని అనుకోవడమనేది భౌతికమైన బుద్ధి ఉండడం వల్ల శాస్త్రజ్ఞులకి ఇన్నాళ్ళికి oil అయిపోతుంది. ఇన్నాళ్ళికి ఈ gold అయిపోతుంది. ఇన్నాళ్ళికి ఆ Iron అయిపోతుంది. ఇవన్నీ అయిపోతాయి అనిపిస్తుంది. అది వీడి లెక్క. కానీ తయారవుతున్నది సూర్యకిరణాల వల్ల. అది చూడడు కదా! సూర్య కిరణం ద్వారా ఒక ప్రక్కనుంచి తయారవుతుంటే, ఒక ప్రక్కనుంచి అయిపోవడటం అంటూ ఉంటుంది. మనింట్లో బియ్యం బస్తా లాగానే ఒకపక్క అయిపోతూ ఉంటుంది. మళ్ళీ

వస్తుంటాయి. అది సృష్టిలో చాలా సత్యమైనటువంటిది. అందుకనే అక్షరుడని పేరు భగవంతునికి. క్షరం అయిపోవడం ఏం లేదు. మన దరిద్రం తప్ప మనసులో. ఏదీ అయిపోదు. అయిపోయేట్టుగా చేసుకోకూడదు పనులు అంతే. పెరుగుతున్నట్టుగా చేయాలి. ఎప్పుడు పెరుగుతుంటుందంటే అది కూడా చెప్పాడు భగవంతుడు ఎనిమిదవ అధ్యాయంలో. ఎట్లా వస్తాయి? ఊరికే కూర్చుంటే వస్తాయా? మనం అడుగుతాం కదా! అందుకని ఆ ప్రశ్న పుట్టకుండానే ఆయన 'చేసుకునే వాడికి వస్తూనే ఉంటుంది' అన్నాడు. 'కృషితో నాస్తి దుర్భిక్షం'. చక్రంలో, ఒక ప్రక్కనుంచి చేసుకుంటూ వెళ్తుంటే నీకు వచ్చేవి నీకు వస్తూంటాయి. నీ కోసం చేసుకోవడం దరిద్రం. నువ్వు చెయ్యవలసినవి చేస్తూ ఉండడం అనేది ధనం. అదీ 'ధనమగ్నిర్ధనంవాయుర్' అంటే! వాళ్ళూ అటువంటి ధనం కలిగిన వాళ్ళు. ఎందుకయ్యా అంటే వాళ్ళు చెయ్యాల్సినవన్నీ చేస్తుంటారు కాబట్టి వాళ్ళకెప్పుడూ లోటు ఉండదు. మనం చేయాల్సినవి మనం చేస్తుంటే మనకి లోటుండదు. మనం చెయ్యవలసినవి చెయ్యక ఇంకేవో చేస్తుంటే లోటు వస్తుంది. ఎందుకంటే గుర్తు చేయడానికి! మనం చేయవలసినవి చేయట్లేదని చెప్పడానికి! ఏదీ అయిపోదు. ఈ భూమ్మీద ఉండే నీళ్ళు అయిపోవు. మన ఊళ్ళో అయిపోవచ్చు. ఎందుకంటే మనం అంత చక్కగా తయారు చేసుకున్నాం ఊళ్ళు. భూమి అయిపోదు. వాయువు అయిపోదు. అగ్ని అయిపోదు. ఆకాశం అయిపోయే ప్రశ్న లేదు. ఏది అయిపోదు ఇక్కడ. మామిడి చెట్లు అయిపోతే కొన్నాళ్ళు పోయిన తర్వాత ఈ భూమి మీద మామిడి చెట్లు ఉండవు అనడానికి వీలు లేదు. మనింట్లో ఉండకపోవచ్చు. మన బట్టి! భూగోళమే అయిపోతోందిట అనే లోపల ఇంకో భూగోళం వస్తుంది. చాలా గొప్ప విషయం ఇది. భూగోళం అయ్యే లోపల ఇంకో భూగోళం అక్కడ వస్తుంది. Substitute. ఒకడైపోతుంటే వాడైపోయేలోపల ఇంకోడు వస్తాడండీ! Ready గా ఉంటాడు. చూడండి మనం మామూలుగా శ్రాద్ధం పెట్టేటప్పుడు ఎప్పుడూ ముగ్గురికి పెడుతుంటాం. తండ్రి, తాత, ముత్తాత! అయిపోవడం ఉండదు కదా! వీడందులోకి వెళతాడు వీడి కొడుకు పుడుతూ ఉంటే! వాడు ఎవడో నిచ్చెన ఎక్కుతుంటే కింద నుంచి ఇంకోడొస్తుంటాడు. వంశం అయిపోవడం ఉండదు కదా! ఎందుకయిపోదు అంటే సృష్టి తత్వాన్ని పరిపాలించే వాళ్ళకి అయిపోదు ఏదైనా. అదే విధానాన్ని అనుసంధానం చేస్తూ, అనుసరిస్తూ ఉండే వాళ్ళకు అయిపోవడం ఉండదు. వంశం అయిపోదు. సంపద అయిపోదు. ఏదీ అయిపోదు. ఎందుకయిపోదు అంటే సృష్టిలో ఏదీ అయిపోదు కాబట్టి. అయిపోయేలోపు ఇంకోటి వస్తుంది. బట్ట అయిపోయే లోపు బట్ట ఎలా వస్తుందో, ఒక గోళం అయిపోయేలోపు ఇంకో గోళం వస్తుంది. ఒక సూర్య మండలం అయ్యేలోపు ఇంకో సూర్య మండలం వస్తుంది. ఒక సృష్టి అయిపోతుంటే ఇంకో సృష్టి వస్తూ

ఉంటుంది. ఒక అమావాస్య రాగానే అయిపోయినట్టేనా? చంద్రుడు ఇంక లేడా? అట్లా cyclical గా వస్తూనే ఉంటాయి. కాబట్టి అయిపోవటం అనేది లేని స్థితి కలిగినటువంటివాడు భగవంతుడు కాబట్టి అనంతుడు అనేటువంటి పేరున్నది. 'అనంతజిత్' ఈ అనంతత్వాన్ని జయించడం అనేది ఉన్నది. వాడికి నిర్భీతి ప్రపంచంలో. భగవంతుడికున్న నిర్భీతి భగవద్భక్తుడికి, భాగవతుడికి ఉంటుంది. అయిపోతుందేమో అన్న భయం ఉండదు. శరీరం కూడా అయిపోతుందన్న భయం లేదు. ఎందుకంటే మళ్ళీ వస్తుంది. నీకు ఏది వచ్చిందో అది అయిపోతుంటే మళ్ళీ వస్తుందండీ. ఇంకెందుకండీ మనం భయపడాలి? కానీ మనకి మనం ఏర్పరచుకున్నటువంటి భావాలు కారణంగా మనకి రకరకాల భీతి ఉన్నది కాబట్టి, 'సహస్రజిత్' అనే నామం చేత భీతి పోగొట్టుకుని, 'అనంతజిత్' అనే నామంతో సమృద్ధిలో జీవించడం మొదలు పెట్టినట్టయితే, ఈ నామాలకి చాలా ఫలితం ఉంది మనకి. ఫలశ్రుతి ఉన్నది. ఒక్కొక్క నామం, ప్రతీ నామం కూడా మనల్ని పూర్ణత్వం వరకు పట్టుకుపోతుంది. అదీ నామాల్లో ఉన్నటువంటి పవిత్రమైన విశేషం.

319, 320 ఇష్టః, అవశిష్టః

ఇష్టో, అవశిష్ట: అంటే ఇష్టమైనవి, ఇష్టం లేనివి అని అర్థం. ఈ రెండు రూపాల లోను భగవంతుడే ఉన్నాడు. ఇలా చెప్పినవాడు సామాన్యుడు కాదు కదా! సమస్తమును నారాయణుని గా దర్శించిన వాడు. మనకు ఇష్టమైన వాటికైనా భగవంతుని అస్తిత్వమే ఉంటుంది. మనకి ఇష్టము లేని వాటికైనా భగవంతుని అస్తిత్వమే ఉంటుంది కాబట్టి, ఏమిటి ఇష్టం లేదు నీకు? ఒక మనిషి అంటే ఇష్టము లేదనుకోండి, ఆ మనిషిలో ఏమిటి నీకు ఇష్టం లేదు? అంటే నిజంగా మనల్ని మనం పరిశీలించి చూసుకుంటే ఆ మనిషి ప్రవర్తన ఇష్టము లేకపోయి ఉండవచ్చు. స్వభావము ఇష్టము లేకపోయి ఉండవచ్చు. స్వభావము ఇష్టం లేకపోతే ఆ స్వభావమును నువ్వు నిరాకరించవచ్చును గాని జీవుడిని నిరాకరించక్కర్లేదు. ప్రతి జీవికి కూడా వాడి స్వభావం ఉంటుంది. కుక్కకి ఒక స్వభావం ఉంది, పందికి ఒక స్వభావం ఉంది, పిల్లికి ఒక స్వభావం ఉంది, ఎలుకకి ఒక స్వభావం ఉంది. ఎలుక స్వభావమును బట్టి మనం ఇది మాటి మాటికి అక్కడ చిల్లులు పెట్టి దొంగతనం చేస్తూ ఉంటుంది కాబట్టి దీని నుంచి మనము రక్షించుకోవటం అనే ఒక ఉపాయము తెలుసుకోవడము యుక్తి, కౌశలము. పిల్లి తిరుగుతున్నది అంటే పిల్లికి అందకుండా పాలు దాచుకోవటం అనేది యుక్తి, కౌశలం. కుక్క, పంది ఇవే స్వభావాలు మనిషిలో కూడా కనిపిస్తుంటాయి. ఎలుక లాగా దొంగతనం చేసే వాళ్ళు ఉంటారు. అలా 5, 10, 15 తింటూ ఉంటారు ప్రక్క నుంచి. వీడి స్వభావము తెలిసినప్పుడు అవి అందకుండా దాచుకుంటే వాడిని మనము ద్వేషించక్కరలేదు. అట్లాగే పాము స్వభావం వుండవచ్చు. కాటేసే జంతువుని మనము దూరముగా ఉంచుకుంటున్నాం కదా ద్వేషించక్కర్లేదు. అట్లాగే తేలు స్వభావము ఉన్నది. ఎద్దు స్వభావము అంటే అందర్నీ తొక్కుకుంటూ వెళ్ళిపోతూ ఉంటుంది. ఎద్దు వస్తుందంటే ఏం చేస్తాం? తప్పుకుంటాం కదా. అలాగే ఎద్దు లాంటి మనిషి వచ్చాడు అనుకోండి తప్పుకుంటే పోలేదా. అంటే స్వభావం నుండి తప్పించుకుని జీవుణ్ణి అంగీకరించటం సాధనలో ఉన్న ఒక సులువు. మనము స్వభావాన్ని పట్టుకుని జీవుడ్ని ద్వేషిస్తూ ఉంటాము. మనకు ఉండే ఇష్టములు, అయిష్టములు మన స్వభావమునకు సంబంధించినవి, ఇతరుల యొక్క స్వభావమునకు సంబంధించినవి. స్వభావముతో కాకుండా నాతో కనుక నువ్వు యోగము చెంది ఉన్నట్లయితే అందరిలో ఉన్న వాడినే చూస్తున్నట్లయితే వాడి స్వభావము నిన్ను అంటదు. వాడి స్వభావము నిన్ను కలత పెట్టదు. మనందరికీ కూడా ఎదుటి వ్యక్తి యొక్క స్వభావము బాగా కలత పెడుతూ ఉంటుంది. ఎందుకంటే ప్రతి ఒక్కళ్ళము కూడా మనము చాలా మంచి వాళ్ళము అనుకుంటూ, మన చుట్టూ ఉండే

వాళ్ళలో కొంతమంది మంచి వాళ్ళు కాదు, మనము చేసిన మేలు వాళ్ళు మరిచారు, మనల్ని ఏదో అంటున్నారు, లేకపోతే మనల్ని వాళ్ళు లెక్కపెట్టడంలేదు, ఇటువంటివన్నీ ఆలోచించుకుంటూ మనము బాధపడుతూ ఉంటాము. అంటే మన మనసులో భగవంతుడు బదులు వీళ్లంతా ఉంటారు, కదా! వాళ్లు కూడా జీవస్వరూపముగా భగవంతుడే వాళ్ల స్వభావములో నీవు ఇరుక్కున్నట్లయితే, నీ స్వభావంలో నీవు ఉండటం వల్ల వాళ్ళ స్వభావములో నీవు ఇరుక్కుంటున్నట్లు. అందుకని ఎవరెవరి స్వభావములు ఎట్లా ఉన్నాయో అవి మార్చలేవు. అవి వాళ్లకు సంబంధించినవి. కుక్క కుక్కలాగా పనిచేస్తుంది. పంది పందిలాగే పని చేస్తుంది. గాడిద గాడిదే, గుర్రము గుర్రమే కదా. ఒకదాని లాగా ఇంకొక దాని స్వభావం ఉండదు. మన చుట్టూ ఉండే వాళ్ళు ఇట్లా ఉంటే హాయిగా ఉంటుంది అనేది అవివేకం. మన చుట్టూ ఉండే వాళ్ళు అట్లాగే ఉంటారు. వాళ్ల స్వభావంతో మన స్వభావము వేసి రాపిడి చేసుకోకుండా మనకి ఒక ఏకాంతము ఏర్పరుచుకోవాలి లోపల, మౌనము ఏర్పరచుకోవాలి. ఏకాంతము అంటే "అందరిలో ఒక్కడిగా ఉండటం ఏకాంతమని" అన్నారు మాస్టారు గారు. అందరిలో ఒక్కడుగా ఉన్నవాడు ఒక్కడే! సత్యమే కదా అది. అది నేను అనే అంతర్యామి తత్వముతో అనుసంధానం చెందినప్పుడు మనకు అది లభించడానికి అవకాశం ఏర్పడుతుంది. లేకపోతే ఈ స్వభావములలోనే జీవిస్తూ, మనం కూడా మన స్వభావములోకి దిగజారుతాము. ఎదుటి వ్యక్తిలో ఉన్న జీవాత్మ తత్వాన్ని గమనించామో, మనము కూడా జీవుడులా ఉద్ధరింపబడతాము. ఎదుటి వ్యక్తి లో ఉన్న దివ్యత్వము ఎప్పుడు దర్శిస్తామో మనం కూడా దివ్యత్వములోనికి ఉద్ధరింపబడతాము. మనము దేన్ని చూస్తే, ముందు ఆ పొరలోకి, ఆ లోకంలోకి మనము వెళ్ళడం జరుగుతుంది అందుకని మనకు సాధన పరంగా ఏం చెప్పారంటే 'ఎదుటి వ్యక్తిలోని సద్గుణాలను చూసి కొనియాడటము అనేది నేర్చుకుంటూ ఉండు. అప్పుడు నీలో కూడా ఈ సద్గుణములు ఎక్కువ ప్రేరేపింపబడతాయి' అని. కాబట్టి విశ్వరూపసందర్శనం అనే అధ్యాయంలో కూడా భగవద్గీతలో శ్రీకృష్ణుడు అదే చెప్తాడు. 'నీలో ఏమి ఉందో, దాన్ని బయట చూస్తూ ఉంటావు'అని. నీలో అసహ్యము ఉంటే ఎదుటి వ్యక్తిలో దాన్ని చూస్తావు, నీలో రాగ ద్వేషాలు ఉంటే ఎదుట వ్యక్తిలో అవి చూస్తూ ఉంటావు. అందుకని ఈ కనబడే వన్నీ కూడా ఆ వెనక ఉండే వాసుదేవ తత్వము నుండి వుబికినవే తప్ప అందులో సత్యం లేదు. ప్రవాహము సత్యము గాని ప్రవాహం మీద తేలేవి శాశ్వతం కాదు. గంగా ప్రవాహము, గోదావరి ప్రవాహము చూస్తూ ఉంటే అది ఎప్పుడూ అక్కడ ఉన్నది. కానీ ప్రవాహం మీద ఆధారంగా పరిగెత్తున్న నీళ్లు చూస్తూ ఉంటే ఒకసారి చూసిన నీళ్లు ఇంకొకసారి లేవు. మన పెద్దలు ఒక వాక్యం చెప్పారు ఇంతవరకు ఏ వ్యక్తి కూడా అదే నదిలో రెండుసార్లు

అడుగుపెట్టలేదట. మనము అనుకుంటాము మేము రాజమండ్రిలో ఉండేవాళ్లం అదే గోదావరి రోజూ స్నానం చేస్తున్నాం. అదే గోదావరి ఏముంది నీవు ఇలా చూస్తే కన్నురెప్ప ఆర్పి తెరిచేలోపున ఆ నీళ్ళు వెళ్ళిపోయి ఇంకొక నీళ్లు వచ్చినాయి. అట్లా దాటి వెళ్ళిపోతూ ఉంటుంది. కానీ ప్రవాహము సత్యముగా ఉండటం వలన నీళ్లు అట్లా దాటి వెళ్ళిపోతూ ఉంటాయి. దాటి వెళ్ళిపోయే వాటినే కాకుండా గోదావరిలో దూలాలు వెళ్తూ ఉంటాయి పడవలు వెళ్తూ ఉంటాయి, శవాలు వెళ్తూ ఉంటాయి ఏవేవో వెళ్తూ ఉంటాయి కదా! ఈ వెళ్లేవన్నీ కూడా వచ్చి పోయేవే తప్ప, అక్కడ ఎప్పుడూ గోదావరి నదిగా ఉన్నది ఏమిటంటే అంతర్వాహిని లాగా, under current, ఆ ప్రవాహమే ! అది సత్యం! అట్లాగే ప్రతి మనిషిలోనూ మంచివాడిలో మంచి ప్రవర్తన, చెడ్డవాడిలో చెడ్డ ప్రవర్తన బేరీజు వేయక, లోపల ప్రవర్తకుడు ఒకడు ఉన్నాడు కదా, ఆ ప్రవర్తకుడుతో లగ్నం అయితే వాడి ప్రవర్తన మనల్ని బాధించదు. వాడి ప్రవర్తన వాడిని బాధిస్తుంది. మనల్ని ఎందుకు బాధించాలి? ఎవడో ఒకడు మంచి పని చేయలేదనుకోండి, వెధవ పని చేశాడనుకోండి, దాని గురించి మనం బాధపడడం ఏమిటి? వాడు చేసిన దానికి వాడు బాధపడతాడు ఎప్పుడో ఒకప్పుడు. మన పెద్దలు చెప్తూ ఉంటారు పాపము చాలా ఆనందంగా చేస్తాడుట, కష్టం వచ్చినప్పుడు ఏడుస్తాడట. అందుకని ఇష్టాయిష్టములుగా నేనే ఉన్నాను సుమా అని ఇక్కడ మనకి చెప్తున్నారు. మనకి కొన్ని సన్నివేశములు ఇష్టము, కొంతమంది మనుషులంటే ఇష్టము, కొన్ని ప్రదేశాలు ఇష్టము, ఇట్లా ఉంటుంది కదా. ఎప్పుడైతే కొన్ని ఇష్టమో, కొన్ని అయిష్టములు అక్కడే ఉంటాయి. అందుకని ఇష్టములకు, అయిష్టములకు అతీతుడుగా ఉన్న భగవత్ తత్వంలో ఇమిడి ఉన్నట్లయితే చిత్త ప్రవృత్తులకు లోబడి ఉండక ఉండే ఒక స్థితి మనకు ఏర్పడుతుంది. ఎప్పుడైతే ఇష్టములు, అయిష్టములు మనకి బాగా ఉన్నాయో, రజస్సు, తమస్సు బాగా ప్రకోపించి పనిచేసి, సత్వము అనేది మరుగుపడిపోతూ ఉంటుంది. సత్వగుణము బాగా అభివృద్ధి లోకి రావాలి అంటే భగవత్ తత్వము మనకు అనుభూతిలోకి రావాలి అంటే ఇష్టములు, అయిష్టములు అవతల ఉన్న కర్తవ్యమును దర్శనం చేస్తూ ఉండాలి. కర్తవ్యం ఉన్నచోట ఇష్టములు, అయిష్టములు ఉండవు. కర్తవ్యము లేని చోట ఇవన్నీ వస్తూ ఉంటాయి. అందుకని కర్తవ్యం కాని దానిలో ఎక్కువ భాగము జీవించడం చేయకూడదు. సాధకుడికి కర్తవ్యం సమస్తము. కర్తవ్యంలో ఉన్నప్పుడు ఇష్టము లేదు, అయిష్టము లేదు. మాస్టర్ గారు శంఖారావంలో ఒక మంచి ఉదాహరణ ఇస్తారు. మామూలుగా పగలు రాత్రి రెండు మూడు రోజులు పని చేయమంటే మనకు చాలా కష్టంగా ఉంటుంది. నిద్ర పోగొట్టుకోవాలంటే చాలా కష్టం! ఎవరికైనా ఇంట్లో పెళ్ళయి వాళ్ళు 2 గంటల 40 నిమిషాలకు ముహూర్తం పెట్టుకున్నారు రాత్రి

అనుకోండి, మనకి చాలా కష్టంగా ఉంటుంది. ఏమాత్రం వీలున్నా వెళ్ళము. వెళ్ళినా, పెళ్లి భోజనము ఇష్టము కాబట్టి ఎనిమిది గంటలకి భోజనం చేసేసి, 'వస్తామండి' అంటాం. ముహూర్తము తెల్లవారుజామున కదా, వాళ్లకీ తెల్లవారుజామున ఎట్లా వస్తార్లే అనిపిస్తుంది. మన ఇంట్లో పెళ్లి 2 గంటల 40 నిమిషాలకు అనుకోండి, అప్పుడు ఎట్లా ఉంటుంది? నాకు ఇష్టం లేదు అని అనరు కదా! ఎందుకనరు? కర్తవ్యం ఉంది కాబట్టి ఇష్టాయిష్టాలు అక్కడ పనిచేయవు. పరీక్షకి వెళ్లే పిల్లవాడు తెల్లవారుజామున నిద్ర లేవటము కష్టంగా ఉండదు. పరీక్షలు అయిపోయిన తర్వాత లేవటం కష్టం కదా! ధనుర్మాసం పూజలు చేసే వాళ్ళు మూడున్నరకే లేచిపోతారు. మరి సంవత్సరం అంతా ఎందుకు లేవలేరు? కర్తవ్యం లేదనిపిస్తుంది కాబట్టి. కర్తవ్యం ఉన్నచోట ఇష్టము, అయిష్టము పనిచేయవు. మన ఇంట్లో వాళ్లకే ఎవరికో బాగోలేదు హాస్పిటల్లో ఉన్నారు అనుకోండి. అక్కడ ఆ హాస్పిటల్లో, వాడికి తోడుగా ఆ మంచం పక్కన నేల మీద పడుకోవాలి అనుకోండి. నాకు ఇష్టం లేదు అని ప్రశ్న లేదు కదా! ఎందుకు లేదు? అంటే కర్తవ్యం! కాబట్టి ఎక్కడైతే కర్తవ్యం ఉంటుందో అక్కడ ఇష్టాయిష్టములు ఉండవు. అందుకని సాధకుడు తన్ను తాను అహర్నిశలు కర్తవ్యమునందు నియమించుకోవాలి ప్రారంభ దశలో. నియమించుకుంటే మనకు ఇష్టము, ఇష్టము లేదు అనే వ్యవహారం అంతా వెనకాల పడిపోయి కర్తవ్యం లో ఇష్టాయిష్టములు దాటడం జరుగుతుంది. అప్పుడు ఇతరులలో కనిపించే ఇష్టములు, అయిష్టములు భగవంతుని యొక్క వ్యక్తరూపములుగా దర్శనం చేస్తూ ఆనందం చెందుతూ ఉంటారు. శ్రీకృష్ణుడు, శ్రీరాముడు అట్లా ఆనందం చెందేవారు. భాగవతోత్తములు అట్లా ఆనందము చెందుతూ ఉంటారు. అంటే మనము ప్రకోపనము చెందినట్లుగా ఎదుటి వ్యక్తిని చూసి ఒక మహాత్ముడు ప్రకోపించడు. మనకు ఇష్టమైన వాళ్ళు కనబడగానే మొహము మరో రకంగా అయిపోతుంది. ఎందుకు అయిపోతుంది అంటే మనము స్వభావంలో ఉన్నాం కాబట్టి. కానీ ఎదుటి వ్యక్తిలో ఉన్న భగవంతుని దర్శనం చేస్తే ఉదాసీనంగా ఉంటాం తప్ప, విముఖంగా ఉండము. అంటే కనబడ్డప్పుడు విప్పారి కౌగిలించుకోవడం, ఇష్టం లేకపోతే మెటికలు విరిచేసి ముఖం తిప్పేసుకోవడము రెండూ ఉండవు. అందుకని ఇక్కడ భగవంతుడు 'ఇష్టం రూపంలో నేనే ఉన్నాను. నీకు ఇష్టం లేని రూపములో కూడా నేను ఉన్నాను' అని చెప్తున్నాడు. నీకు ఇష్టం లేని సన్నివేశములుగా కూడా నేనే ఉన్నాను అని చెప్తున్నాడు. ఇష్టమైనవి ఉండగా ఇష్టం లేనివి కూడా, రెండింటినీ అవగాహన చేసుకున్నట్లయితే ఏమిటి అని తర్వాతి నామం లో చెప్తాడు.

321 శిష్టేష్టః

శిష్టేష్టులు అంటే భగవంతుడు మెచ్చుకున్న వారు, మహాత్ములు. భగవంతుని మనం మెచ్చుకోవడం వేరు, భగవంతుడు మనల్ని మెచ్చుకోవటం వేరు కదా! మనకు అవసరము కాబట్టి భగవంతుని మనము చాలా ప్రశంసిస్తూ ఉంటాము, స్తోత్రము చేస్తూ ఉంటాము, ఆరాధిస్తుంటాము. ఏదో రకరకాలుగా బాధలు పడుతూ ఉంటాము. కానీ మనము భగవంతుని మెచ్చుకోవడానికి, భగవంతుడు మనల్ని మెచ్చుకోవడానికి ఎంత తేడా ఉంది. రాజుగారు మనల్ని మెచ్చుకోవడానికి, మనం రాజుగారిని మెచ్చుకోవడానికి ఎంత తేడా ఉంది. ప్రతివాడు మెచ్చుకుంటాడు రాజుని తప్పదు, మరి రాజు మెప్పు పొందిన వాని పరిస్థితి ఎట్లా ఉంటుంది? మొత్తము సృష్టికే రాజు అయిన వాడి పరిస్థితి ఎట్లా ఉంటుంది? వాడి చేత మెప్పు పొందిన వాడి పరిస్థితి ఎట్లా ఉంటుంది? అందుకని శిష్టులు అంటే భగవంతుని చేత రక్షింపబడే వాళ్లు. వాడికి ఇష్టమైన వాళ్ళు. 'నాకు మేలుగోరి నా భక్తులకు గాని' అని అంటాడు విష్ణుమూర్తి దుర్వాసుడితో. అంబరీషుడు విషయంలో దుర్వాసుడు అపచారము చేసినప్పుడు " నా తత్వము నీకు తెలియదేమో చెప్తున్నాను విను, నా గురించి నేను ఎప్పుడూ బాధపడను, నా భక్తుల మేలు మాత్రం ఎప్పుడూ నేను కోరుతూ ఉంటాను సుమా, వాళ్లకి ఏమైనా తేడా వస్తే తోలు తీసేస్తాను" అంటాడు. ఇక్కడ తాట తీసేసాడు కదా! అందుకని భగవంతుడు మహాత్ముల రూపంలో బాగా ప్రకాశిస్తూ ఉంటాడు. మామూలు మనుషుల్లో చూడలేకపోతే కనీసము మహాత్ములలోనైనా ముందు భగవంతుడిని దర్శనము చేయాలి. వాళ్లకి బాగా సేవ చేసుకోవాలి, వాళ్లను కోరి దర్శించాలి, వాళ్లకి పాద నమస్కారములు చేసుకోవాలి, వాళ్ల హృదయాన్ని రంజింప చేసుకోవాలి. హృదయము రంజింప చేయడం అంటే భగవంతుని యొక్క ఆశీర్వచనము పొందటమే! అందుకని అట్నుంచి ఇటు వస్తే మనకి సాధనకు సులభం. మాస్టర్ గారికి అందరూ సేవ చేస్తారు, ఎందుకంటే ఆయన మాస్టర్ గారు. మనకి ఆయనతో బోలెడన్ని పనులు ఉంటాయి ఆయన మన పనులు చేసి పెట్టగల సామర్థ్యం కలవారు. ఎలా ఉందంటే ఆ సామర్థ్యం ఆయన అంతర్యామితో అనుసంధానము చెందినటువంటి వారు! కాబట్టి ఆయనను అందరము ప్రేమించవచ్చు. కానీ ఆయన ఎవరిని ప్రేమించారు? ఆయన దృష్టిలో ఎవరిని ఎక్కువ ఆయన అంతరంగంలోకి తీసుకుని ఆదరించారు? అందరికీ ప్రేమ పంచుతారు గాని, ఎదుట వ్యక్తి యొక్క సంసిద్ధతను బట్టి ఎక్కువ అక్కడ ప్రకాశిస్తూ ఉంటారు. మాస్టర్ గారు లాంటి వాళ్ళని మనము సేవ చేసుకుంటామనుకోండి, మాస్టర్ గారు లాంటి వాళ్ళు ఇంకెవరూ లేరు

అనుకోవటము అహంకారం కదా! భగవంతుడు ఏదో ఒక్క రూపములో నుంచి మాత్రమే అంతా ప్రకాశించాడు. మిగతా రూపాలలో అంత ప్రకాశించడు అనుకోటం వలననే మతాలు పుట్టాయి, కదా! ఎక్కడ దివ్యత్వము మనకి గోచరిస్తుందో అక్కడ మనము కోరి దాని సాన్నిధ్యము పొందుతూ ఉండాలి. మహాత్ముల యొక్క సాన్నిధ్యంలో జరిగేది ఏమిటంటే సత్వము పెరుగుతూ ఉంటుంది. రజోగుణము ఉన్నవాళ్ళతో తిరుగుతూ ఉంటే మనకి బాగా రజోగుణము పెరుగుతుంది. తమోగుణము ఉన్నవాళ్ళతో బాగా తిరిగామనుకోండి ఏమి చేయక్కర్లేదు అనిపిస్తుంది. ఏమి చేసినా waste అనిపిస్తుంది. Prayer చేస్తేనేనా అనిపిస్తుంది, పూజ చేస్తేనేనా అనిపిస్తుంది, సేవ చేస్తేనేనా అనిపిస్తుంది, సత్సాంగత్యము చేయకపోతే ఏమి? అనిపిస్తుంది. ఒకరిద్దరు తమోగుణ సంపన్నులతో కలిసి తిరిగితే నాలుగో రోజు నుండి మనకి ఒక వింత తర్కము వస్తుంది. Prayer చేయకపోతే ఏం? గ్రంథ పఠనము చేయకపోతే ఏం? సత్కర్మ ఆచరణము చేయకపోతే ఏమి? ఇటువంటివన్నీ వస్తాయి. రజోగుణం వాడితో చేరితే ఈ ప్రపంచాన్ని మనము దున్నేయాలి, ఈ ప్రపంచమును మనము బాగు చేయాలి, ఇది బాగా భ్రష్ట పట్టిపోయింది అని చెప్పి వీడు అహర్నిశలు నిద్రపోకుండా, చుట్టూ ఉండే వాళ్ళని కూడా నిద్రపోనీకుండా ఒక రకమైన అలజడిలో జీవిస్తూ ఉంటాడు. మామూలుగా మన విశాఖపట్నంలో ప్రశాంతముగా జీవించే మనలాంటి జీవులందరూ కూడా ఏ హైదరాబాదో, బొంబాయో వెళితే అక్కడ ఒక ఐదు రోజులు గడిపితే, అక్కడ ఉండే వాళ్ళతో గట్టిగా పని చేస్తుంటే, మనకి ఏమనిపిస్తుంది అంటే, ఏమిటి మన ఊళ్లో మనము ఏమీ చేయట్లేదు, నిద్రపోతున్నామా అనిపిస్తూ ఉంటుంది. అది సత్యం కాదు ఇక్కడ మనము ఎక్కువ సత్వగుణంగా ఉంటాము. ఆ ఊళ్ళలో రజోగుణము విపరీతంగా ఉంటుంది. ప్రతివాడు లేచినప్పటి నుంచి పరుగులే! ఇటు పరిగెత్తి అటుపరుగెత్తి, అక్కడకెళ్ళి, ఇక్కడకెళ్ళి చేస్తుంటే, ఆ పరుగులో మనము కూడా భాగం అయిపోయి మనకు ఏమనిపిస్తుంది అంటే, ఇట్లా మన ఊర్లో మనము పరిగెత్తట్లేదు కదా అనిపిస్తుంది. ఇట్లా పరిగెడుతుంటే ఏమనిపిస్తుంది అంటే విశాఖపట్నంలో ఏముందండి నా బొంద, బొంబాయిలోనే ఉంది అనిపిస్తుంది. అందుకని రజోగుణ సంపన్నులు ఎక్కువమంది మహానగరాలలో బాగా చోటు చేసుకుంటారు. ప్రశాంతమైన ప్రదేశాలు వాళ్లకు నచ్చవు. అలాంటి వాళ్ళను మనము ఏదో ఒక అరకులోయలోకి తీసుకెళ్లి కూర్చోబెట్టాము అనుకోండి నాలుగు రోజులు, వాళ్లకి పిచ్చెక్కిపోతుంది. కూర్చోరా కాసేపు అంటే కూర్చోలేక కూర్చుని ఏమి చేయాలి? అంటాడు. కూర్చోవటము అంటే ఏమీ చేయకుండా ఉండడమే! కూర్చుని ఏం చేయాలి? వాడికి ఎప్పుడూ చేయాలి చేయాలి అనిపిస్తూ వుంటుంది. ఎప్పుడూ ఏదో

ఒకటి చేయాలి చేయాలి అనే వాడితో మనము తిరుగుతూ ఉంటే మనము కూడా చెయ్యవలసినవి కాకుండా, చెయ్యదలచినవి విపరీతంగా చేయడం, అది రజోగుణము. ఆదివారం పూట ఇంట్లో ఉండబుద్ధి కాదు ఒక్క క్షణం. తిరగాలి, ఊరు మీదికి వెళ్లాలి ఏదో పాడు పని చేయాలి, ఏదో పని చేస్తుండాలి, అదే రజోగుణంలో ఉంటే అట్లా ఉంటుంది. సత్వగుణములో ఉండే వాళ్లను మనము కలిసాము అనుకోండి, కోరి కలవాలి అనే చెప్తారు మనకి సాధనలో భాగంగా. కోరి కలిస్తే ఎట్లా ఉంటుంది అంటే మనకి ముందు ప్రశాంతత దొరుకుతుంది వారి దగ్గర కూర్చుంటే ఊరికే ఆ రజోగుణం వాడిలాగా ఇంజన్ వేడెక్కడం, ఈ తమోగుణం వాళ్ళ లాగా ఎప్పుడూ నిద్రపోతేనే బాగుంటుంది, తిని పడుకోవటమే కార్యక్రమంగా ఉండటం ఆ రెండింటి కన్నా, ఇక్కడ ఆ రెంటికీ కాసాగు కట్టినట్టుగా ఉంటుంది, ఒక రకమైన ప్రశాంతత అప్రయత్నంగా లభిస్తుంది. కారణం లేకుండానే ఆనందంగా ఉంటాము. అదీ పెద్దల యొక్క సాంగత్యంలో ఉన్న ముఖ్యమైన రహస్యం. ఎందుకంటే వాళ్లు సత్వములో ఉండటం వలన, గుణాతీతమైన తత్వము సత్వంలోంచి ప్రకాశిస్తూ ఉంటుంది, అదీ విభీషణుడు. రావణాసురుడు రజోగుణుడు, కుంభకర్ణుడు తమోగుణుడు, అది రామాయణంలో ఇచ్చారు. అట్లాగే మనకి ప్రతి వాడిలో కూడా కనిపిస్తూ ఉంటాయి నిద్ర లేవ లేనివాళ్లు, శుభ్రముగా ఉండలేని వాళ్ళు, చేస్తే ఏమి? చేయకపోతే ఏమి? అని అడిగే వాళ్ళు, విపరీతంగా చేసే వాళ్ళు, ఇలా కనిపిస్తూ ఉంటారు. దాన్నిబట్టి మనకి రజోగుణమో, తమోగుణమో శుభ్రంగా తెలుస్తుంది. మనకి భగవద్గీతలో గుణత్రయ విభాగయోగంలో కృష్ణుడు పట్టీలు వేసి ఇచ్చేసాడు. తమోగుణం వాడు ఎట్లా ఉంటాడు, రజోగుణము వాడు ఎట్లా ఉంటాడు, తిండి దగ్గర నుంచి ఇచ్చేశాడు, పులిసి పోయింది, చద్దిది, చల్లటిది తిందాము అనిపిస్తుందిట తమోగుణము వాడికి. ఎంత చద్దిది తింటే వారికి అంత ఇష్టం. అంత నిద్ర వస్తుంది. చల్లటివి తినాలి అనిపిస్తుంది. రజోగుణము వాడికి నోరు చుర్రుమనేవి, వేడివేడివి తినాలనిపిస్తుంది, పళ్ళకారం తినాలి అనిపిస్తుంది. తలుపు రజోగుణం వాడు ధడేల మని తీసి, ధడేలు మని వేస్తాడు. తమోగుణము వాడు తలుపు పూర్తిగా తీయడు, తలుపు పూర్తిగా వెయ్యడు, తలుపు వేసాను అనుకుంటాడు, మర్చిపోతాడు, తాళం వేసావా అంటే వేసాను అంటాడు. వేయడు. రజోగుణం వాడు తాళం వేసింది మూడుసార్లు చూసుకుంటాడు వేశానో లేదో అని. ఇట్లా ఉంటారు మనుషులు, చూసుకోండి. వీళ్ళ అందరిలోనూ మనకి హాయిని ఇచ్చే వాడు సత్వగుణ సంపన్నుడు. వాడి దగ్గర కూర్చుంటే మనకు ఈ రెండు అటు ఇటుగా ఉన్నవి కాస్త సర్దుకుంటాయి. అబ్బా హాయిగా ఉంది కదా ఈయన దగ్గర అనిపిస్తుంది. ఈ ప్రదేశంలో ఉంటే హాయిగా ఉంది అనిపిస్తుంది అంటే ఆ ప్రదేశంలో సత్వగుణము ఉంది అన్నమాట, అదీ

పుణ్యక్షేత్రం. పుణ్యక్షేత్రంలో కూడా మనము ఊరికే హడావిడి పడిపోతూ ఉంటాం కదా! దర్శనము queue లో ticket కొనుక్కోవడం, పరుగెట్టుకుంటూ వెళ్ళడం, అన్నం దొరుకుతుందా లేదా ఇవన్నీ చూసుకోవటంతో సరి. ఏమిటో తిరుపతి వెళ్లి సుఖపడ్డవాడు ఎవరు ఉన్నారు? వెళ్లినప్పటి నుండి ముందు cottage దొరకకపోతే మనము ఎక్కడ పడుకోవడమో అని భయం కదా. ఆ తర్వాత దర్శనం భయము. ఆ తర్వాత భోజనం భయము. Return ticket, reservations ఇవన్నీ ఉన్నాయి. ఇన్ని పెట్టుకుని ఎందుకు ఆ పుణ్యక్షేత్రము వెళ్లి సుఖంగా ఉన్నావా? మళ్లీ లడ్డూలు తేకపోతే ఇక్కడ ఉన్న వాళ్ళు ఏమంటారో అని అదొక భయం. ఇలా మనకి సుఖపడే యోగము ఉండదు రజోగుణంలోనూ, తమోగుణములోనూ. గుణత్రయ విభాగ యోగము తప్పకుండా ఒకసారి చదువుకోండి. మనం ఏ బడిలో ఉన్నామో మనకు తెలుస్తుంది. మాసిపోయిన బట్టలు, చిరిగిపోయిన బట్టలు వేసుకుని, గుండీ లేకపోయినా లేకపోతే ఏమి అనిపిస్తుంది తమోగుణము వాడికి. రజోగుణం వాడికి ఎట్లా ఉంటుందంటే వాడు బట్ట ఇస్త్రీ చేసేటప్పుడు చిన్నగా నలిగి ఉన్నా వాడు వేసుకోను అంటాడు. అట్లా ఉంటాయి కాబట్టి సత్వగుణ సంపన్నుడు దగ్గరకు చేరినప్పుడు ఈ ప్రకోపాలు తగ్గుతూ ఉంటాయి. ఎందుకని అంటే సత్వగుణ సంపన్నునిలో రజస్సు తమస్సు సమతూకముగా ఏర్పడటం వలన సత్వము బాగా ప్రకాశిస్తూ ఉంటుంది. సత్వము ద్వారానే గుణాతీతమైన చైతన్యము ప్రకాశిస్తూ ఉంటుంది. గుణాతీతమైన భగవంతుడు సత్వగుణము ద్వారా ఎక్కువ ప్రకాశిస్తూ ఉంటాడు. అవసరమైనప్పుడు రజోగుణము, తమోగుణము కూడా చూపిస్తూ ఉంటాడు, కాకపోతే సమతూకంగా ఉంటాడు. మనము చూడండి వంకాయలు కొనుక్కుంటున్నామనుకో, ఒకపక్క రాయి పడికట్టు, ఇంకొక వైపు వంకాయలు తూకములో తూగుతూ ఉంటే ఎక్కువ తక్కువలు ఉన్నప్పుడు మనము తక్కెడ వైపు చూస్తూ ఉంటాము. వంకాయ పూర్తిగా పడే వరకు వంకాయలు వైపు చూస్తూ ఉంటాం, ఎందుకంటే రాయి బరువుగా ఉండి వంకాయలు బాగా కిందకు వచ్చేంతవరకు వంకాయలు చూస్తూ ఉంటాం. మనం వంకాయలు కొద్దిగా రాయిపెట్టిన పళ్ళెం కన్నా కిందకి ఉండాలి అనుకుని చూస్తాము. వంకాయలు అమ్మేవాడు కొద్దిగా రాయి ఉన్న పళ్ళమే కిందకు ఉంటే బాగుంటుంది అనుకుంటాడు. వాడి view point అది. మన view point ఇది. వాడ్ని ఇంకోటి వెయ్యమంటావు, వాడు ముళ్ళు చూడమంటాడు. ముళ్ళు దగ్గరికి ఇద్దరు చేరుకుంటారు. ఎప్పుడు చేరుకుంటారు అంటే ఈ రెండు సరి సమానంగా అవుతుంటే ముల్లు దగ్గరకు చేరుకుంటారు కదా! అట్లాగే ఈ తమస్సు, రజస్సు అన్నది రెండు సమతూకమైనప్పుడు ఈ రెండు మీద మనసు ఉండక ఈ రెండిటికీ కేంద్రమైన సత్వము మీదికి మనసు ఉంటుంది. ఆ సత్వము దగ్గర వాళ్ళిద్దరికీ agreement ఉంది

కదా! ఆ ముల్లు దగ్గర వీళ్ళు ఇద్దరు agree అవుతారు. ఆ ముల్లు అటువుంటే ఒకడు వొప్పుకోడు. ఇటువుంటే ఇంకొకడు ఒప్పుకోడు. రెండు ఏకమైన చోట ఏమైంది? తూకం దగ్గరికి వెళ్ళేటప్పటికి ఏమైంది? వంకాయలు, రాళ్లుకాక అక్కడ చూసి నిర్ణయం చేసేస్తాడు సరిపోయింది అని. అట్లా సత్వగుణము ఉన్నవాడి దగ్గరికి వెళ్తే తమోగుణం వాడు, రజోగుణం వాడు ఏకీభావం చెందుతారు. వాళ్లు ఉండక వాళ్లలో ఉన్న సత్వగుణము ఒకసారి పైకి వస్తుంది. ఇది మహాత్ముల యొక్క సాన్నిధ్యము మనకు ఇచ్చేది. దాన్నే 'అయస్కాంతీకరణము' అంటారు. అయస్కాంతము దగ్గరికి వెళ్ళిన తర్వాత ఇనుప ముక్క అయస్కాంతము అయిపోతుంది కదా దాని పరిధిలో ఉన్నంతసేపూ. మహాత్ముల యొక్క సాన్నిధ్యము సాధకులను ఆ విధంగా చిత్తవృత్తి నుంచి అప్రయత్నంగా ఉద్ధరిస్తుంది. మనల్ని మనము ఉద్ధరించుకోవడానికి చాలా time పడుతుంది. ఇనుప ముక్క తనంతట తాను అయస్కాంతము ఎప్పుడవ్వగలదు? ఒక అయస్కాంతము సాన్నిధ్యంలో ఎంత త్వరగా అవ్వగలదు? అది మహాత్ముల యొక్క సాన్నిధ్యం! అది గురువుల యొక్క సాన్నిధ్యము! ఆ రూపంలో ఎవరు ఉన్నారు? గుణాతీతుడే సగుణునిగా అక్కడ ఉన్నాడన్న మాట. అందుకని మనకి భాగవత మార్గంలో భాగవతోత్తములు అందరూ భగవద్భక్తియందు ఉన్నవారు, భగవంతుని సమస్తమునందు దర్శిస్తున్న వారూనూ! ఊరికే బేషజంగా నామాలు పెట్టుకుని, గుడ్డలు చుట్టుకుని, గడ్డాలు పెంచుకున్నంత మాత్రాన తెలియదు. వారి దగ్గర మనం కూర్చున్నప్పుడు చాలా ప్రశాంతంగా ఉండాలి. ఎప్పుడు వెళ్ళినా అట్లానే ఉండాలి. ఎందుకంటే వాళ్లు కూడా ఒక్కోసారి ప్రశాంతంగా ఉండకపోతే వచ్చే వాళ్ళు వెళ్ళిపోతూ ఉంటారు అని అప్పుడప్పుడు ప్రశాంతంగా ఉన్నట్టుగా ఉంటారు. కానీ ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే వాడే మనకి ప్రశాంతతను ఇవ్వగలుగుతాడు. ఎప్పుడూ అనుష్ఠానం లో ఉండే వాడు అంటే సర్వమునందు ఉన్న అంతర్యామిని దర్శనము చేస్తున్న వాడు మాత్రమే అనుస్యూతముగా ప్రశాంతముగా ఉండగలడు. అటువంటి ప్రశాంతత ఉన్న వాడు గుణాత్మకమైన స్వభావములను అధిగమించి జీవిస్తూ ఉంటాడు. వారి దగ్గరికి వెళ్లి మనము కూర్చుంటే మనవి కూడా కొంచెం అణుగుతాయి. పులి కూడా అణిగి పోతుంది. పులి అంటే చాలా రజోగుణము. పులికి ఆకలి ఎక్కువ. సింహము ఆకలికి, పులి ఆకలికి చాలా తేడా ఉంది. సింహం చాలా noble గా ఉండే గంభీరమైన జంతువు. తనకి ఆకలి వేసినప్పుడు చుట్టుపక్కల ఉన్న ఒక జంతువును తింటుంది. ఆకలి లేనప్పుడు దాని ముందు కుందేలున్నా , ఇంకా ఏమైనా జంతువు వెళ్లినా దానిని ముట్టుకోదు. పులి అట్లా కాదు, ఏమో మళ్ళీ దొరుకుతుందో లేదో అనుకునే మన type. ఇప్పుడు వచ్చిన దల్లా ముందు బుట్టలో వేసుకోవడం, దాచుకోవడము, కనబడినదల్లా చంపడం

రజోగుణము. రజోగుణము ఉన్నచోట కనిపిస్తూ ఉంటుంది. మహాత్ముల యొక్క సాన్నిధ్యంలో పులి కూడా పిల్లి వలె కూర్చుంటుందిటండీ! అది మనకి బుద్ధుడు జీవితంలో కనిపిస్తుంది. పైథాగరస్ జీవితంలో కనిపిస్తుంది. చాలామంది మహాత్ముల జీవిత చరిత్రలో విష జంతువులు అత్యంత సౌమ్యంగా ప్రవర్తించిన సన్నివేశాలు కనిపిస్తాయి. వాళ్ళ దగ్గర ఉన్న సత్వము అటువంటిది! మనలో కూడా భగవంతుని యొక్క స్మరణ బాగా జరుగుతూ ఉంటే సత్వము బాగా ఏర్పడుతుంది. భగవంతుని యొక్క సత్వగుణ రూపాన్ని మనము ధ్యానం చేస్తూ ఉంటే సత్వగుణము పెరుగుతుంది. భీకరమైన రూపములను మనం బాగా ఉపాసన చేస్తూ ఉంటే మనలో కూడా భీకరత్వము పెరుగుతుంది. అందుకని సగుణోపాసనలో సత్వగుణము ఉపాసన బాగా ముఖ్యమైనది. అది ఉన్న వాళ్ళు మహాత్ములు. కాబట్టి వాళ్ల రూపంలో ఉన్నవాడు కేవలము వాళ్ళ రూపంలో ఉన్నది భగవంతుడే అని గుర్తు పెట్టుకోవాలి. వాళ్ల గురించి మనము వ్యాఖ్యలు చేయకూడదు. ఎందుకంటే మామూలు సగటు మనిషినే అర్థం చేసుకోవడం మన వల్ల అయ్యే పని కాదు. అటువంటిది ఒక మహాత్ముని మనం అవగాహన చేసుకోవడం అనేది అసలు అయ్యే పనికాదు. కాబట్టి ఆయనకన్న ఈయన గొప్ప, ఈయన కన్నా ఆయన గొప్ప, వీళ్ళలో ఎవరు గొప్ప ఎవరు తక్కువ అని మాట్లాడుకుంటూ ఉంటాం కదా! అదంతా కర్తవ్యానికి మించి చేసే చిత్తప్రవృత్తిలోంచి పుట్టే ప్రకోపము. గుణదోషము మనలో ఉండటం వల్ల ఏర్పడుతూ ఉంటుంది. అందుకని మహాత్ముల సాన్నిధ్యము కోరి ఏర్పరచుకోవాలి. సత్వగుణము బాగా ఉన్న వారిని మనము కోరి కూర్చుని సంభాషణము, దర్శనము, స్పర్శనము, సంభాషణము చేసుకుంటూ ఉండాలి. అలాగే సత్వ గుణము ప్రధానంగా ఉండే ప్రదేశాలకు వెళ్లి, అక్కడ కొన్నాళ్లు హాయిగా ఉండడం చేయాలి. పువ్వులు, పళ్ళు ఉండే ప్రదేశంలో ఉంటే మనకు తెలియకుండానే మనలో చక్కటి సమతూకము వస్తుంది. అట్లాగే మంచి సముద్రము, సెలయేరు, ప్రశాంతమైన వాతావరణం లోను గనుక మనం ఉన్నామంటే మనకి సత్వగుణము ఏర్పడడానికి అవకాశం ఉంటుంది. వీటి అన్నింట్లో కూడా సత్వగుణోపేతమైన భగవంతుని యొక్క అస్తిత్వమును దర్శనం చేసుకోవాలి. మనం వేసుకున్న రంగులలో కూడా సత్వగుణం ఉంటుంది. తెలుపు సత్వగుణమునకు ప్రతీక. అందుకని తెల్ల దుస్తులు మనము బాగా ధరిస్తున్నట్లయితే తెలియకుండా కొంచెం ప్రశాంతత ఉంటూ ఉంటుంది. తెలుపులాగే ప్రశాంతతను ఇచ్చేది నీలం. అందుకే నీలం దుస్తులు! ఆకాశ నీలం ఉన్నవి, నలుపు నీలము/ ఇంద్ర నీలము ఉన్నవి, ఊదా రంగు/వంకాయ రంగు ఉన్నవి. అవన్నీ కూడా మనకి సత్వగుణ ప్రధానమైనవి. ఎరుపు రంగు రజోగుణానికి సంబంధించినది. మనుషులు కాస్త బద్ధకంగా ఉన్నారనుకోండి వాళ్లకి ఎరుపు రంగు అందించాలి. ఎందుకంటే

వాళ్ళకి కొంచెం రజస్సు తగిలిస్తే, తమస్సు నుండి బయటకు వస్తారు. అందుకని ఎర్ర రంగు, సింధూర రంగు, గులాబీ రంగు ఇవన్నీ కూడా బద్ధకస్తుడిని బాగు చేయడానికి పనికి వస్తాయి. తమోగుణము రంగు అసలు ఎవరికీ ఉండకూడదు. మట్టి రంగు, నలుపు రంగు, బూడిద రంగు ఈ మూడు రంగులను కూడా తమోగుణముతో అనుసంధానం చేసి చెప్తారు. మనిషి ఎప్పుడూ తమోగుణంలో నుంచి రజోగుణంలోకి ఉద్ధరించబడి, రజోగుణంలో నుంచి సత్వ గుణం లోకి ఉద్ధరింపబడుతూ ఉంటాడు. అసలు ఏమీ చేయని వాడి కన్నా ఏదో ఒక పని చేసేవాడు మంచివాడు. ఏదో పని చేసేవాడు, చక్కని పని చేసేవాడు కన్నా కొంచెం తక్కువ. ఈ రకంగా మడు మెట్లు అన్న మాట. కాబట్టి మన ఇంటికి వేసుకునే రంగుల్లోనూ, మనం వేసుకునే బట్టలలలో, మన bed sheets, curtains ఇలా అన్నింట్లోనూ కూడా సత్వగుణము ప్రకాశించాలి. నీలము, పసుపు. (పసుపు అంటే ఆకుపచ్చ నుంచి వచ్చిన రంగు) ఈ రంగులన్నీ మనకి ఆరాధనలో ఉన్న రంగులు. అన్నీ మనలో చైతన్యాన్ని కొంచెం పెంచి, అంటే అగ్ని రగులుకొల్పి, ఆ తర్వాత సాధన ద్వారా సత్వంలో నిలిపే పద్ధతి ద్వారా మన పూజాదికాలలో మనకు అవి కనిపిస్తూ ఉంటాయి. మనం వాడే వస్తువులు అన్నింట్లో కూడా. ఇవన్నీ సత్వగుణము ఎక్కడ ఉంటుందో, రజోగుణం ఎక్కడో తెలియటానికి, తమోగుణము ఎక్కడుందో తెలియడానికి చెప్పుకుంటున్నాం. ఈ విధంగా గుర్తించి సత్వ గుణమును మనము కోరి ఏర్పరచుకుంటున్నాము అనుకోండి, మనలో దాని సాంగత్యం ద్వారా అది బాగా ఎక్కువ పెరుగుతుంది. అందుకనే సత్సాంగత్యం చేయటము. సత్సాంగత్యము వలన అడ్డమైన వాటి మీద మనసు పోవడం తగ్గిపోతుంది. ఎందుకంటే కనబడిన ప్రతిదీ కావాలి అనిపిస్తుంది కదా! మనస్సుకి. చిత్త ప్రవృత్తిలో ఉన్న మనసుకి సంగం చాలా ఎక్కువ ఉంటుంది. 'సత్సంగత్వే నిస్సంగత్వమ్'. అంటే మనకు అది ఉండకూడదు ఇది ఉండకూడదు అనుకోవడం కాదు. దాని యందు మనకి మనసు పోకూడదు. అంతే! అది అక్కడ ఉన్నా మనసు దానిమీదకి పోకుండా ఉంటే అది నిన్ను ఏం చేసింది అది అక్కడ ఉండటం వలన? చాలామంది మనకి చెప్తూ ఉంటారు కాంత, కనకము చాలా dangerours అని. ఎవరికి? దానియందు భ్రమ కలిగిన వారికి! దానిమీద భ్రమ లేని వాడికో? అక్కడ ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే! ఆ విధముగా మనము నిస్సంగత్వంలోనికి రావాలి అంటే సత్వగుణాన్ని బాగా ఆరాధనలో పెంచుకోవాలి. ఆ సత్వ గుణము పరిపూర్ణముగా ఉండే వాడిని 'శిష్టేష్టుడు' అన్నారు. ఆ శిష్టేష్టుడు రూపంలో ఉన్న వాడు భగవంతుడే! నిస్సందేహముగా భగవంతుడే! అతడు నీ దగ్గరికి వచ్చాడు, నీతో మెలిగాడు, నీ కుటుంబంలో ఒకడిగా ఉన్నాడు అంటే నీవు ఎప్పుడో చేసుకున్న పూర్వ పుణ్యము వలన భగవంతుడు అతనిని నీ దగ్గరికి

పంపించాడు అని భావన చేయాలి. మన దగ్గరికి మాస్టర్ గారు మనలో ఒకరిగా ఉండి కదులుతూ ఉన్నప్పుడు, నేను ఎరిగిన కారణం ఏంటంటే ఎప్పుడు ఎక్కడో చేసుకున్న ఒక పుణ్య కారణము చేత భగవంతుడు మెచ్చి తానే ఈ రూపంలో మన దగ్గరికి వచ్చాడని. గురువు రూపంలో భగవంతుడు వస్తాడు. అది అవకాశం గా తీసుకుని మనము నిస్సంగత్వంలోకి, నిర్మోహత్వంలోకి, నిశ్చలతత్వంలోకి ఆయన సాన్నిధ్యంలో పెరగటానికి అవకాశం ఏర్పడుతుంది. ఆయన దగ్గర మనకుండే సంఘానికి సంబంధించినవి కోరుకుంటూ కూర్చున్నామనుకోండి, అది ఇచ్చి వెళ్ళిపోతాడు. గురువు తల్లి లాగా ఉంటాడు, తండ్రి లాగా ఉంటాడు. తల్లిలాగా ఉన్న గురువు అడిగినవన్నీ ఇస్తూ ఉంటాడు. తండ్రిలా ఉన్న గురువు తను చేసే పనిలో వాటా ఇస్తూ ఉంటాడు. తండ్రి కొడుకుకి పని అప్పచెప్తాడు, కానీ తల్లిలాగా నువ్వు పాలు తాగావా, చొక్కాలాగు వేసుకున్నావా, తలదువ్వుకున్నావా, ఇవాళ నువ్వు కడుపునిండా తిన్నావా, ఇవన్నీ తండ్రి అడగడు. తండ్రి దగ్గర రాగానే ఆ పని చెయ్, ఈ పని చెయ్ అని చెప్తాడు తండ్రి. తల్లిదండ్రుల యొక్క కర్తవ్యములు పిల్లల యందు ఈ విధంగా ఉంటాయి. అట్లాగే గురువు కూడా రెండు రకములుగా ఉంటాడు. మనం వినియోగించేకునే పద్ధతి పట్టి ఉంటుంది. తల్లి లాగా మనకు కావాల్సినవి చూస్తున్నాడు అనుకోండి, అప్పుడు తండ్రి ప్రణాళికలో భాగంగా చేరడానికి అవకాశం ఉండదు. ఎంతసేపూ తల్లి దగ్గరే ఉండే కొడుకు తల్లి చాటు బిడ్డలాంటి వాడు, ఎందుకు పనికి వస్తాడు? పనికి రాడు కదా! తల్లి తయారుచేసి తండ్రికి అప్పగిస్తుంది. అప్పచెపితే తండ్రి తను చేసే పనిలో వాటా ఇస్తాడు. వాటా ఇవ్వటం అంటే బాధ్యతలు అప్పజెప్తాడు. తండ్రి పోషించేవాడు కాదు, బాధ్యతలు అప్ప చెప్పేవాడు. అట్లాగే గురువులో తండ్రీ ఉన్నాడు, తల్లి ఉన్నారు. కాబట్టి దేనికి మనము ఉన్ముఖత్వము చూపిస్తే దాని ప్రకారంగా ఆయన మనతో ఉంటాడు. తల్లిలాగా పోషించే గురువు, తండ్రి లాగా పోషించే గురువు ఒకడే, ఇన్ని రూపాల్లో ఉన్నా. అందుకని ఈ గురువు దగ్గరకు చేరినప్పుడు ఆయన చేసే పనిలో భాగం కోరేవాడు తెలివైనవాడు. ఒక ఋషి దగ్గరికి వెళ్లి అడిగాడట ఒక సాధకుడు మహాత్ములను ఏ విధముగా సద్వినియోగం చేసుకోవాలి అని, అంటే మహాత్ముని సద్వినియోగం చేసుకోవాలంటే ఒకటే ఒక పద్ధతి వుంది, ఆయనను వినియోగించుకోవటం కాక ఆయనకు వినియోగపడటం నిజంగా సద్వినియోగం చేసుకోవడం, అని చెప్పాడట. గురువు అనే అవకాశం జీవితంలో అందరికీ రాదు. మహాత్ములు మనలోకి వచ్చి మనలో ఒకనిగా మెలగటము అనేది ఎంతమందికి అవకాశం ఏర్పడుతుంది? ఏర్పడదు కదా! అదే శంకరాచార్యుల వారు 'అసలు మనిషిగా పుట్టడమే పెద్ద అదృష్టము, మనిషిగా పుట్టిన తర్వాత ఆస్తిక్యబుద్ధి ఉండటం రెండవ అదృష్టం. ఈ రెండు ఉన్నా కూడా చాలదు.

మనిషిగా పుట్టి, ఆస్తిక్యబుద్ధి ఉండి, సద్గురువు యొక్క సాన్నిధ్యము దొరికితే అంతకన్నా ఆ జీవితానికి ఏం కావాలి' అని చెప్తాడు వివేక చూడామణిలో. కాబట్టి సద్గురువు దొరికినప్పుడు మనము ఆ విధముగా భగవంతుడే ఆ రూపముగా వచ్చాడు మన దగ్గరికి. మనం చేసే ప్రార్థనలు విని. (ఇప్పుడు చేసినవో, ఇంతకుముందు చేసినవో) మన దగ్గరికి వస్తాడు. వచ్చినప్పుడు నువ్వు ప్రార్థన చేసావు, నేను వచ్చాను అని ఏమీ మాట్లాడడు. మాట్లాడకుండా అంతకుముందు భగవంతుని అది చేస్తాను, ఇది చేస్తాను, నువ్వు నాకు కనబడు, నీ దర్శనము ఇవ్వు, నీ స్పర్శనం ఇవ్వు ఇటువంటివన్నీ అడుగుతూ ఉండి ఉంటాం కదా! చూద్దాం ఏం చేస్తాడో, అని వస్తాడు. అది మర్చిపోయి ఇంకోటి ఏమైనా చేసాం అనుకోండి అంటే ఆ అవకాశం పోయినట్లే! మళ్లీ అవకాశం కోసం వేచి ఉండాల్సిందే! అందుకని సత్పురుషులు వచ్చినప్పుడు వాళ్ల దగ్గర నుంచి మనం ఏమి పొందాలి అనేది కాకుండా, వాళ్లకి మనము ఎటువంటి సేవ చేసుకోవాలి అనేది చూడాలి. అది మన సాంప్రదాయం. ఇప్పుడు మనకి కలియుగంలో ఎట్లా ఉందంటే గురువు మంచి ఉద్యోగాలు ఇప్పిస్తాడా? మంచి సంబంధాలు ఇప్పిస్తాడా? మనకు ఆస్తి పెంచే సలహాలు ఏమైనా ఇస్తాడా? ఇట్లా మరి తల్లి గా ఎక్కువ వాడుకోవడం జరుగుతుంది. తప్పని నేను చెప్పట్లేదు తల్లి దగ్గరే ఉన్న పిల్లవాడు అంటే ఏమిటి పసి పిల్లవాడు అని అర్థం. అంతేగా! 30 ఏళ్ల అయినా అమ్మా నాకు స్నానం చేయిస్తావా అంటే? ఎద్దల్లే పెరిగావు నువ్వే చేసుకో అని చెబుతుంది కదా! గురువు కూడా అంతే! చేసినంత కాలం చేసి, ఆ తర్వాత వాళ్ళని వాళ్ళకు వదిలేస్తాడు. ఎప్పుడు? వాడు ఇటు చూడకపోతే! అందుకని రకరకాల ఉద్ధారణకు కారణం ఒక మహాత్ముని సాన్నిధ్యం! అందుకని ప్రత్యేకించి భారతదేశంలో మహాత్ములు చాలామంది, శతాబ్దానికి ఒక డజను మంది వస్తూ ఉంటారు. ఇతర దేశములలో వేలాది సంవత్సరములకు ఒకడు కనిపిస్తూ ఉంటాడు. కాబట్టి వాళ్లను మనము సద్వినియోగం చేసుకోవటం అంటే వాళ్లకి వినియోగపడటమే సద్వినియోగము! ఆ విధముగా భగవంతునికి మనము ఎక్కువ చేరువ అవవచ్చు, ఎందుకంటే గురువు తను వహిస్తున్న కర్తవ్యంలో, ప్రణాళికలో భాగంగా పనిచేసే వాడికి చెవులో ఏదో నూరి పోస్తాడు. ఇక వాడు పని చేసుకుంటూ ఉంటాడు. మనము భగవంతుడికి చేరువ అవటానికి అవకాశం ఇచ్చే మహాత్ముని కూడా 'నేనే సుమా' అని చెప్పడానికి విష్ణు సహస్రనామం లో శిష్టేష్ట రూపంలో భగవంతుడు ఉన్నాడని చెప్పడానికి వివరించారు.

322, 323, 324 శిఖండి, నహుషః, వృషః

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

325, 326 క్రోధః, క్రోధకృత్

క్రోధః క్రోధకృత్ అంటే కోపాన్ని ఉపశమింప చేసే వాడు, కోపాన్ని కలిగి వుండేవాడు. ఇద్దరిలో కూడా భగవంతుని యొక్క తత్వము మనకు ఈ నామాలలో ఇమిడి ఉన్నది. భగవంతునికి కేవలము ప్రసన్నమైన రూపము, వదనము మాత్రమే అనుకోవటానికి వీల్లేదు. ధర్మ సంస్థాపన కోసం భగవంతుడు కోపాన్ని కూడా అభినయిస్తూ ఉంటాడు. మనకు కోపము వస్తూ ఉంటుంది. భగవంతుడు కోపము తెచ్చి పెట్టుకుంటాడు. మామూలుగా అవసరాన్ని బట్టి కోపాన్ని అభినయించడం అనేది భగవత్ తత్వం లో కనిపిస్తుంది. అంటే కోపం కూడా వారి యొక్క అదుపాజ్ఞల్లో ఉంటుంది. మనకి కోపం వస్తే, దాని అదుపాజ్ఞ లోకి మనం వెళ్ళిపోతాం. కోపము మనల్ని నియంత్రిస్తుంది. మహాత్ములు కోపాన్ని నియంత్రిస్తూ ఉంటారు. కోపాన్ని నిర్మూలిస్తూ ఉంటారు. కోపాన్ని ఉపసంహరిస్తూ ఉంటారు. అది భగవంతుని యొక్క కళ్యాణ గుణము అని మనము భావన చేయాలి. ఎప్పుడూ నవ్వుతూనే ఉండడు భగవంతుడు. ఎప్పుడూ నవ్వుతూనే ఉండరు మహాత్ములు. ఎందుకంటే అవసరమును బట్టి కోపాన్ని ప్రదర్శించవలసిన పరిస్థితులు ఏర్పడినప్పుడు ఆ విధంగా చేస్తూ ఉంటారు. అది మనకి మహాత్ముల జీవితములలో గోచరిస్తూ ఉంటాయి. పరశురామ అవతారము పరిపూర్ణమైన కోపమును ప్రదర్శించే ఒక అవతారం. ఎందుకంటే ఆ రోజుల్లో రాజ్యాలను పరిపాలించే రాజులంతా కూడా అధర్మ ప్రవర్తకులై ఉండటం వలన వాళ్ళని అదుపులో ఉంచడానికి తాను బ్రహ్మర్షి కుమారుడు అయినప్పటికీ కూడా, బ్రాహ్మణ ధర్మములో ఉన్నప్పటికీ కూడా, కోపాన్ని తెచ్చుకుని అధర్మప్రవర్తకులైన రాజులనందరిని సంహరించేసి, మళ్లీ వచ్చి తను తపస్సులో కూర్చుంటాడు పరశురాముడు. అంటే కోపము తన యొక్క అదుపులో ఉంచుకుని ప్రవర్తించడం. అలాగే శ్రీరాముని జీవితంలో చూసినట్లయితే కోపము చాలా ప్రయత్నము మీద తెచ్చుకుంటూ ఉంటాడు. సహజముగా కోపం లేదు. ప్రయత్నం మీద కోపాన్ని తెచ్చుకుని ధర్మాన్ని నిర్వర్తించి, మళ్ళీ కోపం నుండి విడుదల అవుతుంటాడు. గురువుగారికి కోపం వచ్చింది అంటే ఆయనేమి గురువుగారు అని అనుకోకూడదు. గురువుగారికి కోపం వచ్చింది కాబట్టి ఈయన అవతారమూర్తి

అనుకోకూడదు. ధర్మము కోసము, ధర్మం స్థాపన చేయడం కోసం కోపిస్తూ ఉంటారు. సుగ్రీవుడి మీద అలా కోపం ప్రదర్శిస్తాడు రాముడు. సుగ్రీవుడు తను పొందవలసిన సహాయాన్ని రాముని మైత్రి ద్వారా పొందిన తర్వాత భోగభాగ్యాలలో మునిగి, రామునికి చేయవలసిన సహాయం గురించి మర్చిపోయినప్పుడు, శ్రీరాముడు కోపాన్ని తెచ్చుకుని, 'వాలిని చంపిన బాణము నా పాదిలోనే ఇంకా ఉంది' అని చెప్పి సుగ్రీవుడికి గుర్తు చేయమని చెప్తాడు. అలాగే రావణాసురుని చూసినప్పుడు కూడా రాముడు కోపం తెచ్చుకోవాల్సి వస్తుంది. ఆ కోపం రాకే సంహరించడం అలస్యం అయ్యింది. రామాయణం చదివితే, రాముడు చాలా ఇబ్బంది పడినట్టుగా ఉంటుంది. ఎందుకు ఇబ్బందిపడ్డాడంటే రాముడికి ఉన్న శాంత స్వభావము అటువంటిది. పరమ శాంతమూర్తి కోపము తెచ్చుకోవడానికి time పడుతుంది. అందుకని అగస్త్యుడు వచ్చి చెప్పాల్సి వస్తుంది. 'ఏమిటి ఇలా ఉదాసీనంగా ఉన్నావు అని?' ఎందుకంటే సహజముగా శాంతమూర్తి! భగవంతుడు సహజంగా శాంతస్వభావుడు అయినప్పటికీ కూడా, అవసరాన్ని బట్టి కోపము తెచ్చుకుంటూ ఉంటాడు. కోపము రావడం వేరు, కోపము తెచ్చుకోవడం వేరు. కోపము తెచ్చుకున్న వాళ్ళు కోపమును పంపించి వేయగలరు. కోపము దానంతటదే వచ్చేవాళ్ళు దానికి లోనై తప్పు చేస్తారు. నరసింహ అవతారంలోనూ, పరశురామ అవతారంలోనూ భగవంతుని కోపం ఎట్లా ఉంటుందో మనకు తెలుస్తుంది. ఎందుకు కోపం అంటే కేవలము ధర్మమును రక్షించడానికి కోసము కోపం. అధర్మ ప్రవర్తకులను దండించడం కోసము కోపం. అందుచేత 'క్రోధకృత్' అనేటువంటి నామము. మనము కూడా పిల్లల మీద అప్పుడప్పుడు కోపించకపోతే వారు సరియైన దారిలో ప్రవర్తించరు కదా! పిల్లల మీద తల్లిదండ్రులకు వచ్చే కోపము అట్టిదే, కానీ శాశ్వతముగా ఉండదు కదా. ఇలాగే సృష్టిలో భగవంతుని యొక్క కోపము కూడా సృష్టిని అదుపాజ్ఞలో ఉంచడం కోసం ఏర్పాటు చేసిన, తాను అభినయించే కోపముగా భావన చేయాలి. పెద్దలు మీ మీద కోపపడ్డారు అనుకోండి వాళ్లలో నుంచి భగవంతుడు 'క్రోధ కృత్' అని తరింప చేయడానికి కోప్పడుతున్నారని గుర్తుపెట్టుకోవడం సాధన పరంగా మనం నేర్చుకోవాలి. మనము పెద్దలు దగ్గరికి వెళ్ళినప్పుడు అప్పుడప్పుడు మంచి విషయాలు చెప్తారు, ఎప్పుడైనా అవసరం వస్తే కోప్పడతారు. కోప్పడినంత మాత్రాన వాళ్లు చెడ్డవాళ్ళు అనుకోవడానికి వీల్లేదు. మన మంచి కోరి వాళ్ళు కోప్పడతారు. అలా కాకుండా మామూలు సన్నివేశాలలో కూడా ఎవరో మనల్ని కోప్పడతారు. వాళ్ళ నుంచి కోపంగా వ్యక్తమైన వాడిని కూడా భగవత్ తత్త్వంగా భావించడాన్ని వాసుదేవతత్వం. అది సాధకులకి! మామూలు మనిషికి ఎన్నో రకాలుగా కోపం వ్యక్తమవుతుంటుంది. మహాత్ములు కోప్పడడం

అనేది ఒకటి ఉంటుంది. అవతార మూర్తి కోపం తెచ్చుకోవడం అనేది ఉంటుంది. ఇన్ని రకాలుగా మనకి కనిపిస్తుంది. ఇన్ని కోపాలలో కూడా భగవంతుడే అని భావన చేయడం సాధకుడి లక్షణం. ఎవరైనా కోప్పడుతూ, ఇంక వారి ఆగ్రహానికి గురైపోయి, వశుడైపోయి, దాసుడైపోయి అట్లా రక్తాన్ని మొహంలో కన్నుల్లో కనిపించినట్లు కోప్పడే వాళ్ళు ఉన్నారనుకోండి, వాళ్ళల్లో ఆ రౌద్రాకారం కూడా భగవంతుడే అని మనము భావన చేసుకుంటే, భగవంతుని మనము ధ్యానం చేసుకుంటే మనం ప్రశాంతంగా ఉంటాం. ఇది సాధకునికి పనికి వచ్చేది. అవతల వాళ్ళ కోపం మనని బాధ పెట్టకూడదు, అది వాణ్ణి బాధపెడితే అది వాడికి సంబంధించినది. మనకి మామూలుగా కోపం ఎక్కడ కనిపించినా ఈ విధంగా అవగాహన చేసుకోవటం విష్ణువు యొక్క అవతరణ సులభంగా దర్శనం చేయడంగా ఉంటుంది. అవగాహన చేసుకోడానికి అవకాశం ఉంటుంది. ఇది విపరీతంగా అనిపిస్తుంది కానీ భగవంతుని చూసేవాడికి, విశ్వము అంతా విష్ణువే అనే తత్వంలో సాధన చేసే వారికి, ఎదుటి మనిషిలో వచ్చిన కోపము భగవంతుని యొక్క రౌద్రాకారముగా ఉంటుంది. ప్రహ్లాదుడు అట్లా చేసాడు. హిరణ్యకశిపుని సంహరించిన తర్వాత, నరసింహుని లో ఉన్న కోపాన్ని భగవంతునిగా ధ్యానం చేస్తే అయన శాంతిస్తాడు. అట్లా మనకి ప్రశాంతమైన వదనం చూసినప్పుడు భగవంతుడు గుర్తుండడం ఒకటి. కోపంలో వున్న వాళ్ళలో కోపాన్ని భగవంతుడుగా చూడటం అనేది సాధన! అది మనలో సత్వగుణానికి సంబంధించినది. లేకపోతే మనలో ఉన్న రజోగుణము పెరగవచ్చు. పెరిగి మనం తిరిగి దానికి ఇంకొంచెం ఎక్కువ మోతాదులో కోపం తెచ్చుకోవడం, మొత్తము సన్నివేశాన్ని అశాంతిగా చేసుకునే అవకాశం ఉంది. సత్వగుణ ప్రధానులకి ఎటువంటి సన్నివేశాల లోనూ కోపం రావడానికి అవకాశం లేదు. కేవలము ధర్మమునకు వ్యతిరేకమైన కార్యములు జరుగుతున్నప్పుడు మాత్రము తప్ప! ఆ ఒక్క సమయం లోనే కోపం తెచ్చుకుని, సన్నివేశాన్ని ధర్మానికి లోబడి ఉండే పద్ధతుల్లో నియమిస్తారు. మిగతా సమయంలో వచ్చే కోపం ఏదైనా ఉంటే, అది భగవంతుని యొక్క అస్తిత్వముగా దర్శనం చేస్తూ ఉంటారు. మహాత్ముల జీవితాలలో అందరిలో కూడా ఇవి కనిపిస్తూ ఉంటాయి. దుర్వాసుని కోపము అంబరీషుడి మీద ఎలా పని చేసింది? దుర్యోధనుడు కోపము, అసూయ. ధర్మరాజు సాధకుడు! హిరణ్యకశ్యపుడు కోపము, ప్రహ్లాదుడు సాధకుడు! ఇట్లా మనకి కోపం వచ్చే వాళ్లలో భగవంతుని యొక్క అస్తిత్వాన్ని సాధన చేసుకోవడం అనేది భాగవత మార్గము. మహాత్ములు కూడా కోపగించడం జరుగుతుంది. క్రమశిక్షణలో పెట్టడానికి, ధర్మ మార్గంలోకి పెట్టడానికి వాళ్ళు కోపించడం జరుగుతుంది. ఆయనకి ఎప్పుడూ కోపం ఉండదు అని అనుకోకుండా,

ఎందుకు కోపంగా ఉన్నారు? మనలో ఏమైనా మార్పు చేసుకోవాలేమో అని అనుకోవాలి. మనలో ఒక ప్రచోదనము జరగడం కోసం కోపంగా ఉంటారు. కొంతమందితో నవ్వుతూ ఉంటారు. కొంతమందిని కోపంగా చూస్తూ ఉంటారు. అంత మాత్రం చేత వాళ్ళందరి మీద ద్వేషమని కాదు. వాళ్లని సరియైన ప్రవర్తనలో పెట్టడానికి వారియందు ఆ రకంగా ప్రవర్తన చూపుతారు తప్ప, వాళ్లకి లోపల కోపం ఉండదు. సుగ్రీవుడి మీద రాముడికి ఉన్న కోపం అట్లా ఉంటుంది. మైత్రిని మరచి, కృతఘ్నుల వలె ప్రవర్తిస్తున్న వారిని దారిలో పెట్టడానికి కోపాన్ని ప్రదర్శించి, మళ్లీ అదే కోపాన్ని ఉపశమనం చేసుకుంటారు. ఏసుక్రీస్తు అదే కోపాన్ని జెరూసలేం అనే ఆలయంలో శాసనం చేసిన వాళ్ళ అందరి మీద చూపిస్తాడు. అంతమాత్రం చేత ఏసుక్రీస్తు కోపానికి లోనైపోయాడు అనుకోడానికి వీలులేదు. ప్రతి మహాత్ముడు కూడా సన్నివేశాన్ని బట్టి కోపాన్ని ఆ విధంగా ప్రదర్శిస్తూ ఉంటారు. శ్రీకృష్ణుడు భీష్ముడి మీద అటువంటి కోపాన్ని ప్రదర్శిస్తాడు. భీష్ముడు తొమ్మిదవ రోజు భారత యుద్ధంలో చాలా తీవ్రంగా యుద్ధం చేస్తూ ఉంటాడు. మొదటి ఎనిమిది రోజులు భీష్ముడు సేనాధిపతిగా యుద్ధము చేస్తున్నా కూడా ధర్మం అటుపక్క ఉన్నది కాబట్టి పరిపూర్ణముగా తనకున్న శక్తి సామర్థ్యాలు వాడడు. అందుకని శ్రీకృష్ణుడు కూడా ఉదాసీనుడై యుండి యుద్ధాన్ని నడిపిస్తూ ఉంటాడు. 8వ రోజు రాత్రి దుర్యోధనుడు భీష్ముడి దగ్గరికి వెళ్లి ఆయన ప్రతాపాలను శంకించి, చేతగాని వాడని, అర్జునుడితో యుద్ధము చేయలేడు అని బోలెడు మాటలు అంటే, పౌరుషం వచ్చి 9వ రోజు యుద్ధం చేస్తూ ఉంటే ఎవరూ నిలవలేక పోతుంటారు. తనకి పౌరుషము వచ్చి యుద్ధం చేస్తున్నాడు కానీ, ధర్మానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నాడు అని భీష్ముడు మర్చిపోయినాడని తెలిసిన కృష్ణుడు, తన రథం నుంచి ఒక్కసారి సింహం లాగా దూకి, తనకు ఉన్న సుదర్శన చక్రాన్ని ఆవాహన చేసి, భీష్ముని చంపడానికి ఒక నటన చూపిస్తాడు, అది కేవలము నటనే. తను చంపడు. తాను ఆ విధముగా చేస్తే తప్ప భీష్ముడికి ధర్మము మళ్ళా అర్థం కాదు కదా, పౌరుషం కాదు ధర్మం ఎలా ఉందో దాన్ని బట్టి ప్రవర్తించాలి. ధర్మాన్ని సంరక్షిస్తున్న వాడిని నేను ఇటుపక్క ఉన్నాను, నీ ప్రవర్తన నా ముందు నిలబడేది కాదు, కేవలము వ్యక్తిగతమైన వాగ్దానమును, ప్రతిజ్ఞను పక్కనపెట్టి ధర్మానికి నువ్వు సమర్పణ చెందు, అనే సందేశాన్ని తెలపడం కోసము కోపాన్ని నటిస్తాడు. అట్లా భగవంతుడు కోపాన్ని నటించిన సందర్భాలు ఉంటాయి. కోపము నటించడం వేరు, కోపానికి లోబడటం వేరు. భగవంతుడు ఆ రకంగా కోపాన్ని ప్రదర్శించిన సందర్భాలు అన్నింటిలోనూ ఏమి జరిగింది అని మనం చూస్తే, ఎవరి మీద ఆ కోపాన్ని వారు ప్రదర్శించారో వారిని ధర్మమైన ప్రవర్తనలోకి మలచారు. కోపానికి కూడా అందనటువంటి వాళ్ళని సంహరించాడు.

దుర్యోధనుడు ఉన్నాడనుకోండి, వాళ్ల మీదే ఎంత కోపం ప్రదర్శించినా వాళ్లు పూర్ణమైన అధర్మంలో జీవించిన వారు కాబట్టి, వాళ్లని ఆ శరీరాల నుంచి తప్పించడం తప్ప ఇంకో మార్గం లేకపోయింది. ఇలా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, పూర్ణంగా వాళ్ళ మృత్యువుని వాళ్ళు కోరిన వాళ్ళని సంహరించారు తప్ప, వాళ్లలో లేస మాత్రము ధర్మము ఉన్నా ఆ ధర్మాన్ని ఆధారం చేసుకుని, వాళ్ళని క్రమశిక్షణలో పెట్టే ప్రయత్నం చేసినట్టుగా మనకి కనిపిస్తుంది. అందుకని క్రోధః కృత్ అంటే anger maker కోపం తెప్పిస్తారు. శిశుపాలుడ్ని అట్లా మాట మాటకి కోపం తెప్పిస్తాడు. శిశుపాలుడికి కృష్ణుని చూడగానే కోపం వచ్చేస్తుంది. కోపం వచ్చి వచ్చి ఆ కోపంలో బాగా ఆయన్ని అపహాసం చేసేవాడు. అవమానపరిచి దాని ద్వారా తనను సంహరింప చేసుకున్నాడు. శిశుపాలుని చూసి నవ్వితే కోపం వస్తుందట. అందర్నీ చూసి నవ్వేవాడు కృష్ణుడు. కొంతమందిని చూసి నవ్వితే, వాళ్ళకి ఎందుకు మమ్మల్ని చూసి ఇలా అవహేళనగా నవ్వుతున్నాడు అనిపిస్తుంది. అంటే ఎదుటి వ్యక్తిలో అధర్మ ప్రవర్తన ఉన్నప్పుడు వీడి నవ్వు చూస్తే, ఎందుకో వాళ్ళకి అవహేళనగా నవ్వుతున్నాడు అనిపిస్తుంది. అంటే ఎదుటి వ్యక్తిలో ధర్మ ప్రవర్తనప్పుడు, ఆ నవ్వు వీళ్ళకి ఒక రకమైన ఆనందాన్ని కలిగిస్తుంది. మంచివాడు ఒక దుర్మార్గుడిని చూసి నవ్వితే, దుర్మార్గుడులో లోపల ఉన్న మొత్తం కోపం బయటకు వస్తుంది. ఎందుకు అట్లా వెకిలిగా నవ్వుతావు ఎప్పుడూ, అంటూ వుండు. అట్లా దుర్యోధనులందరికి కూడా శ్రీకృష్ణుడు నవ్వు అంటే కొంచెం చిరాగ్గా ఉంటుంది. అదే శ్రీకృష్ణుని ఒక చిరునవ్వు కోసం కోట్లాదిమంది జీవులు ఆనాటి నుంచి ఈనాటి వరకు కూడా ఎదురుచూస్తున్న పరిస్థితి ఉన్నది. అది మనలో ఉన్న సంస్కారాన్ని బట్టి ఉంటుంది. భగవంతుడికి కోపం తెప్పించడం కూడా చాలా కష్టం. భగవంతుడికి కోపం తెప్పించడం ద్వారా ధర్మాన్ని నిర్వర్తింపచేస్తారు. అందుకని ఏ కోపము అయితే ధర్మాన్ని నిర్వర్తింప చేయడానికి, స్థాపన చేయడానికి, ధర్మాన్ని ప్రచోదనం చేయడానికి పనికి వస్తుందో ఆ కోపము అంతా కూడా భగవంతుని యొక్క అస్తిత్వము అని గుర్తు ఉండాలి. మామూలుగా రాజుల తలకాయలు అన్ని వరుసగా నరికేస్తే అది మనం ఒక అవతారమూర్తిగా చెప్పుకోలేము కదా! కానీ పరశురాముడి అవతారంలో ఎందుకు చెప్పుకోగలిగాము అంటే, ఆ కోపం కేవలం ధర్మాన్ని నిలబెట్టడానికే! శ్రీరాముడికి శూర్పణఖ మీద, రావణుడి మీద రాని కోపము సుగ్రీవుడి మీద రావడానికి ఏమైనా అర్థం ఉందా? శూర్పణఖ దుర్బుద్ధితో వచ్చింది. రావణుడు చేసింది ఎవరూ సహించరాని పెద్ద తప్పు. మొట్టమొదట రావణుని చూస్తే రాముడికి కోపం రాలేదు. 'ఓరి ! ఇంత తేజవంతుడు, ఇంత మహాత్ముడు, ఈయన ఏమిటి ఇట్లా అయిపోయాడు. ఒక్క విషయంలో దెబ్బ తినేసాడూ', అని బాధపడతాడు తప్ప, కోపము రాలేదు. అటువంటిది సుగ్రీవుడి మీద

ఏమిటి కోపము? అతడు ధర్మాన్ని మరచిపోవడమే! అంటే కోపం తెచ్చుకుని, మళ్లీ ఆ కోపాన్ని తగ్గించుకుంటాడు. ఇట్లా భగవంతుని కోపము ధర్మానికి అనుగుణంగా, ధర్మాన్ని స్థాపించే పద్ధతిలో ఉంటుంది. మనకి మాస్టర్ గారు పురుషమేధంలో శ్రీకృష్ణుడు చెప్పినట్టుగా ఒక వాక్యం చెప్పారు. 'నా వదనము ఎప్పుడూ కూడా ప్రసన్న వదనమే అని భావించరాదు. అవసరమైతే రౌద్రమైన రూపాన్ని కూడా నేను దాల్చగలను' అని. అవసరం అయితే దాల్చడం అంటే ధర్మము ప్రకారం అవసరం అయినప్పుడు. లేకపోతే ప్రసన్న వదనమే! ఎదుటివాళ్ళ కోపాన్ని కూడా అట్లా తగ్గించగలిగే ప్రసన్నమై వదనము కలిగే వాళ్ళు మనకు మహాత్ములలో కనిపిస్తారు, అవతారతత్వంలో కనిపిస్తుంది. ఎక్కడ కనిపించినా అది కళ్యాణ గుణముగా మనము తీసుకోవాలి. మనం చూడగానే ఎదుటి మనిషికి ఆనందం కలిగింది అనుకోండి, వారికి ఒక రకమైన సమత్వం ఏర్పడింది అనుకోండి, ప్రశాంతత ఏర్పడింది అనుకోండి, ఆనందం కలిగింది అనుకోండి అది సత్వగుణము! సత్వగుణము బాగా కలిగిన ముఖము నందు ఆ ప్రశాంతత, ఎదుటివారి దగ్గరకు కూడా వెళ్లి వాళ్ళను, వాళ్ళ కోపాన్ని కూడా శాంత పరుస్తుంది. అట్లా శాంత పరిచిన పద్ధతులు కూడా భగవంతుని దగ్గర ఉన్నాయి. కొన్ని కొన్ని వదనాలు చూస్తూ ఉంటే అట్లా శాంతం తొణికిసలాడుతుంది. అట్లా అవసరమైతే గంభీరంగా కూడా పెడతారు. శ్రీకృష్ణుడు చాలా శాంత వదనం కలవాడు అయినప్పటికీ కూడా సన్నివేశమును బట్టి గంభీరమైనటువంటి వదనము, ఇతరులకు భయం కలిగించే వదనము కూడా ప్రదర్శించిన సన్నివేశాలు ఉంటాయి. ధర్మరాజు అంతటి వాడు కూడా అలా ఉన్నప్పుడు శ్రీకృష్ణుని చూడడానికి భయపడతాడు. అర్జునుడంతటివాడు శ్రీకృష్ణుని చూడడానికి భయపడతాడు. శ్రీకృష్ణుడు విశ్వరూపం ప్రదర్శించినప్పుడు 'నేను చూడలేను, నాకు భయం వేస్తుంది, నువ్వు మామూలుగా వుండు' అంటాడు. ఇవన్నీ అవసరం ఉన్నప్పుడు తెచ్చి పెట్టుకొని, పని అయిపోయిన తర్వాత ఆపేస్తారు. కృష్ణుడు ధర్మరాజంతటివాడు రాజసూయయాగం అయిపోయిన తర్వాత, భీష్ముడు అంపశయ్య మీద మరణానికి సిద్ధంగా ఉన్నాడు అని మర్చిపోతాడు. అదే సుగ్రీవుడూ చేశాడు. వాలి చచ్చిపోయిన తర్వాత సుగ్రీవుడు సొంత అన్నని ఇట్లా చంపించేశాను అని బాధ పడతాడు. నాకు ఈ రాజ్యం వద్దు, నాకు అర్హత లేదు అని ఏడుస్తాడు. పెద్దవాళ్ళు అందరూ చేరి అట్లా కాదు నువ్వే పెద్దవాడివి రాజ్యమేలు, ఆ తర్వాత అంగదుడిని యువరాజుగా పట్టాభిషేకము చేస్తామని బతిమాలితే రాజ్యమేలుతాడు. ఇక అటే. ఇక మళ్ళీ ఇప్పుడు మర్చిపోతాడు. రాముడికి సహాయం చేయాలని మర్చిపోతాడు. అట్లాగే ధర్మరాజు కూడా మొత్తం అంతా యుద్ధము అయిపోయిన తర్వాత నేను ఎవరి కోసం రాజ్యం చేయాలి అంటాడు. చాలా జన నష్టం

అయిపోయింది కదా! ఇంకా జనమున్నారు, కానీ సైన్యాలన్నీ నాశనం అయిపోయాయి, కాబట్టి తనకు తెలిసిన వాళ్ళు ఎవరూ లేరు. తను రాజ్యము చేస్తూ ఉంటే తన వాళ్ళందరూ కూర్చుని ఆహా ఓహో అనటానికి ఎవరూ లేరు. అందరూ చచ్చిపోయారు. బంధువులు లేరు. మిత్రులు లేరు. ఇంకా ఎవరి కోసం రాజ్యం చేయాలి? అని అంటే అందరూ ఎన్నో రకాలుగా చెపుతారు. 'ఎవరో చూసి సంతోషించడానికి కాదు, ధర్మమును సంరక్షించడం కోసము, ప్రజలని రక్షించడం కోసము, ప్రజలను కట్టుబాటులో ఉంచి మంచి మార్గంలో నడిపించడం కోసం, దానికోసం రాజ్యము చేయడం తప్ప నీ కోసము కాదు' అని చెప్తారు. వాళ్ళందరూ కలిసి రాజ్యాభిషిక్తుని చేసిన తర్వాత, కావాల్సిన ప్రశంసలు వస్తూ వుంటాయి భూమి అంతటికీ చక్రవర్తి కదా! రాజ్య వ్యవహారాలలో పడి భీష్ముడు అనే వాడు అంపశయ్య మీద ఉన్నాడన్న సంగతే మర్చిపోతాడు ధర్మరాజు. అంతటివాడు మర్చిపోయాడంటే అంటే మరి మనం ఎంత? సుగ్రీవుడు ఎట్లా మర్చిపోయాడు అంత మూర్ఖుడు కాదు కదా! మనకి ఊహించడానికి అలవికానంత భోగభాగ్యాలలో మనం ఉన్నట్లయితే, మేలు చేసిన వాళ్ళు అప్పుడు మనకి గుర్తుంటారా? ఎంతో సత్వగుణ సంపన్నులకు కానీ గుర్తుండదు. ఏ మానవుడైనా సరే పొందిన మేలును మర్చిపోవడం అనేది దురదృష్టం. మర్చిపోకపోవడం అనేది దివ్యత్వం. మనము మనకు మేలు చేసిన వాళ్ళందరిని గుర్తుచేసుకోవాలి. అక్కడ తల్లిని తండ్రిని గురువుని గుర్తు చేసుకోవాలి. ఎక్కడెక్కడ మనము మెట్లు ఎక్కడానికి సహాయపడ్డారో వాళ్ళందరినీ ఒకసారి గుర్తు చేసుకోవాలి. వాళ్ళందరూ బాగున్నారా లేదా అని చూసుకుంటూ ఉండాలి. వాళ్ళందరినీ బాహ్యంగా వ్యక్తము చేయనక్కర్లేదు, కానీ అంతర్గతంగా వాళ్ళ యోగక్షేమాలు ఎలా ఉన్నాయి అని ఎప్పుడూ ఒక కంట కనిపెట్టుకుంటూ ఉండాలి. ధర్మరాజు మర్చిపోతాడు. మర్చిపోయి ఈ పాగడ్తలకు అలవాటు పడి పోయి సర్వాలంకార భూషితుడై ఒకరోజు కృష్ణుడి మందిరంలోకి నడిచి దగ్గరికి వెళ్తాడు. కృష్ణుడు అక్కడ చాలా గంభీరంగా ఉంటాడు. ఎంత గంభీరంగా అంటే మామూలుగా సరదాగా పలకరిద్దాం అనుకుంటాడు, కానీ వెళ్ళగానే అదోరకమైన ముఖము ప్రదర్శిస్తాడన్నమాట. చూడంగానే భయమేస్తుంది. ఎందుకంటే అటువంటి ముఖము ఎప్పుడూ చూడలేదు ధర్మరాజు. ఏదో తప్పు జరిగింది మనవల్ల అందుకనే అలా ఉన్నాడు అని తెలుసుకుని, మొత్తం తన రాజసం అంతా తగ్గించుకుని, మళ్ళీ భక్తుడిగా తయారైపోయి, నా వలన ఏమైనా పొరపాటు జరిగిందా, చెప్పు అని ప్రార్థన చేస్తే అప్పుడు చెప్తాడు. అప్పుడు శ్రీకృష్ణుడు 'ఈ భూమి మీద నుంచి ఒక పెద్ద వెలుగు వెళ్ళిపోతోంది, అటువంటి వెలుగు ఈ భూమి మీదకి మళ్ళీ వస్తుందని చెప్పలేము. నేను వెళ్ళిపోతాను నాకు అనుజ్ఞ ఇవ్వండి అని చెప్పి నా అనుమతి కోసం కోరుతూ

ఉంది. అందుకని అక్కడ నిమగ్నమై ఉంది నా మనసు' అని చెప్తాడు. అంటే ఎవరు? అని అడుగుతాడు. అప్పటికి కూడా గుర్తు తెచ్చుకోడు. 'భీష్ముడు' అని చెప్తాడు. అంటే స్వతహాగా అతను ధర్మమూర్తి కదా ఒక్కసారి లోపలి నుంచి బాధ వేసి, బయలుదేరి వెళ్తారు. కోపాన్ని అట్లా నటించగలడు. ఎందుకంటే ధర్మరాజు స్వతహాగా ధర్మమూర్తి కాబట్టి చెప్పించాల్సిన అవసరం లేదు, కేవలం గుర్తు చేస్తే చాలు. గుర్తుచేసినవి ఉన్నాయి, కొంచెం కోప్పడినవి ఉన్నాయి, అవసరం అయితే కొట్టినవి వున్నాయి, మరీ బొత్తిగా వినక పోతే చంపినవి ఉన్నాయి. వీటి అన్నింటికీ కోపం లేకపోతే ఎట్లా జరుగుతుంది? భగవంతుడి వదనము ప్రసన్నంగా ఉంటుంది అని మనమందరము నమ్మి, ప్రసన్నమైన వదనం కలిగిన రూపాన్ని మనము ధ్యానం చేస్తూ ఉంటాం. ఎదుటివారిలో ప్రసన్న వదన రూపాన్ని మనం చూసినప్పుడు, మనలో కూడా ప్రసన్నత కలుగుతూ ఉంటుంది కదా! మన కోపం తగ్గిపోతూ వుంటుంది. దుర్యోధనుడికి కోపం వచ్చి, శ్రీకృష్ణుడు రాయబారానికి వస్తున్నప్పుడు ఎవరైనా లేచి నుంచుంటే వాడి తలకాయ తీసి వేస్తాను అని ఒక ఆజ్ఞ వేస్తాడు. సభలోకి వచ్చిన శ్రీకృష్ణుడు దుర్యోధనుడిని చూసి ఒకసారి నవ్వుతాడు. ఆ తర్వాత మిగతావాళ్ళందర్నీ చూసి నవ్వుతాడు. అంతే! వాళ్ళందరూ వాళ్ళకి తెలియకుండానే లేచి నిలబడతారు., ఇదేమిటి మనమందరం వద్దనుకున్నా నిలబడ్డామని దుర్యోధనుడికి ఆశ్చర్యమేస్తుంది. అంటే చిరునవ్వుతో కూడా ఎదుటి మనిషిలో ఉన్న ధర్మాన్ని ఒక్కసారి ప్రచోదనం చేసి, వాళ్లతో సంబంధం లేకుండా, వాళ్ళని లేపి నిలబెట్టగలడు. ఎదుటివారి కోపాన్ని ఎట్లా ఉపశమింప చేయగలరు అంటే, కాస్తో కూస్తో మనిషిలో మానవత్వం ఉంటే, ప్రసన్న వదనంతో మనుషులను సరి అయిన పద్ధతిలో పెట్టవచ్చు. మహాత్ములు గురువులు కూడా ఎక్కువ భాగం ప్రసన్నవదనంతో పనిచేస్తారు. అవతారతత్వంలో కూడా ఎక్కువ భాగం ప్రసన్న వదనంతో పనిచేస్తుంటారు. ఎందుకంటే జీవకోటిలో 80శాతం బలహీనులు తప్ప దుష్టులు కారు. దుర్బలత్వం వేరు, దుష్టత్వం వేరు. దుర్బలులకి ఒక 20 శాతం దుష్టత్వము ఉంటుంది, ఒక 80శాతం దుర్బలత్వం ఉంటుంది. దుష్టుడు అంటే వాడు ధర్మాన్ని వ్యతిరేకించి పనిచేస్తూ, అహంకారియై ధర్మ ప్రవర్తకులని హింసిస్తూ ఉంటాడు. దుర్బలుడు అంటే తాను చేసే పనుల ద్వారా తన్ను తాను నాశనం చేసుకుంటాడు. దుర్బలుడు వేరు, దుష్టుడు వేరు. అది గుర్తుపెట్టుకోండి. Wickedness is different from weakness. మనము weakness ఉన్న వాళ్ళందరూ చెడ్డవాళ్ళుగా అనుకోకూడదు కదా! బలహీనులు వేరు, చెడ్డవారు వేరు. చెడువ్యసనాలన్నీ బలహీనతలలోకి వస్తాయి. మనస్సులో దుష్టత్వం ఉండదు. మంచిగా విభూది రేఖలు పెట్టుకొని, యజ్ఞోపవీతాలు వేసుకొని వెనకాల గోతులు తీస్తున్నారు అనుకోండి, అది దుష్టత్వము. దుర్బలులందరిని కూడా

భగవంతుడు తన యొక్క ప్రసన్నవదనం తోనే ఉద్ధరిస్తాడు. దుష్టత్వంలో కోపాన్ని ప్రదర్శించి, దాని ద్వారా ధర్మాన్ని నిర్వర్తింప చేస్తాడు. అందుకని మనకి ఈ రెండు సన్నివేశాలు కూడా భగవంతునిగా భావన చేయటం సాధనపరంగా ముఖ్యము. మనము విష్ణు సహస్రనామ రూపంలో చెప్పుకునేది కూడా వాటి కోసమే కదా! అందుకని ఎదుటి వ్యక్తిలో ఉన్న కోపాన్ని భగవంతుని అస్తిత్వముగా మనం గుర్తిస్తే ఆ కోపం మనని అంటదు. లేకపోతే మనలో కూడా కోపం వస్తుంది. వాడి కన్నా మనము ఏమి తక్కువ తిన్నాం కోపం రాకపోవడానికి. కోపం వస్తే, అయ్యో నీకు కోపం వచ్చిందా తండ్రీ, అని అనుకుంటాడట భగవత్ భక్తుడు. అయ్యో నీ కోపం తెప్పించే వంటి వాడిని అయ్యానా అని. ఎంత గొప్పండి అది. కోపాన్ని భగవంతుని తత్వంగా భావించడం వల్ల మనలో ఉండే సమతూకం దెబ్బ తినదు. మనలో ఉండేటటువంటి సత్వము దెబ్బ తినదు. మనలో ఉండేటువంటి రజస్సు పెరగదు. కోపానికి కోపం సమాధానం కాదు. కోపానికి శాంతం సమాధానం. తన కోపమే తనకు శత్రువు, తన శాంతమే తనకు రక్ష. ఎవరి కోపానికైనా విరుగుడు ఏంటయ్యా అంటే శాంతం. ఒక వ్యక్తి కోపంగా ఉన్నప్పుడు మనము శాంతముగా ఉండాలి. శాంతంగా ఉంటే నెమ్మదిగా కోపం తగ్గుతుంది. అప్పుడు ప్రశాంతంగా ఉండాలి. నవ్వకూడదు కోపం వచ్చినప్పుడు. అలా నవ్వుతావేంటి సిగ్గులేకుండా అంటాడు కదా! అదీ పద్ధతి. దుర్వాసుడికి కోపం వస్తుంది అంబరీషుడు మీద. ఆ కోపాన్ని అంబరీషుడు విష్ణువు యొక్క అస్తిత్వంగా చూశాడు. ఎక్కడ మాటండీ! మనకి వీళ్లందరూ, మన వల్ల సాధ్యం అవుతుందా అనేది అలా ఉంచి, ఆ గుణాలకు వాళ్లు పరాకాష్ట అన్నమాట. అంతకుమించి మనకి ఎగ్జాంపుల్స్ ఉండవు. అది మనకి మార్గదర్శకంగా పెట్టుకుని, వాళ్ళని మనకు మార్గ దర్శకులుగా భావన చేసుకుంటే, అంబరీషుడికి రాలేదు కదా కోపం. నిష్కారణంగా దుర్వాసుడు కోపం చూపిస్తాడు. దుర్వాసుడేమో క్రోధకృత్ గా అవతరిస్తుంటాడు. అది పట్టుకు తిరుగుతుంటాడు. ఆయన ఏం చేసినా సరే జగత్ కళ్యాణంగా ఉంటుంది. అది గుర్తుపెట్టుకోండి. ఈశ్వరతత్వం పరిపూర్ణంగా ఉన్నవాడు అక్కడికి వెళ్ళి అక్కడక్కడ కొంచెం కోపాన్ని ప్రదర్శిస్తుంటాడు. దానివల్ల జగత్ కళ్యాణం జరుగుతూ ఉంటుంది. అట్లాగే విశ్వామిత్రుడి కోపము! అలా రకరకాలుగా ఉంటుంది. కోపాన్ని చెడ్డదిగా అనుకోవద్దు. కోపాన్ని నటించే వారు వేరు, ప్రదర్శించేవారు వేరు. అంబరీషుడు దుర్వాసుని కోపాన్ని అంతా కూడా భగవంతునిగా దర్శనం చేయడం వలన ఆయన విష్ణోపాసనకు ఏమాత్రం అంతరాయం కలగలేదు. కాబట్టి సుదర్శన చక్రము రక్షించడానికి వచ్చింది. భగవంతుడు కోపం ప్రదర్శించే వారిని, ఎక్కువ కోపాన్ని చూపించే వాళ్ళని మన చుట్టూ పెడుతూ ఉంటాడు. అంటే మన వైపు సాధన చేసుకుందాం అనుకుంటే, ఈ

జన్మకు ఇదొకటి భగవంతుడు నీకు నేర్పుకోవడానికి ఇచ్చాడు అనుకోవాలి. బాగా కోపంగా ఉండే భర్త దొరకొచ్చు భార్యకి. ఎప్పుడూ తిడుతూనే ఉంటాడు కదా! బాగా కోపంగా ఉండే భార్య దొరకవచ్చు ఒక భర్తకు. అంటే ఈ సాధన ఈ జన్మకు అవసరం అని చెప్పడానికి. వాసుదేవతత్వంలో మనము ఉపాసన చేసినట్లయితే, మన చుట్టూ ఉండే సన్నివేశముల రూపములలోనే భగవంతుడు మనకి విద్యను బోధిస్తున్నాడు అని తెలుసుకోవాలి. ఎవరికి ఎప్పుడు ఏది అవసరమో అదే మన చుట్టూ సన్నివేశాలుగా భగవంతుడు పెడతాడు. ఓపిక లేని వాళ్ళకి ఎంతో ఓపిక వచ్చేటట్లుగా చుట్టూ సన్నివేశాన్ని పెడతాడు. బాగా త్వరితగతిని పరిగెత్తి పనిచేసే వాళ్ళకి ఎంతో నిదానంగా పనిచేసేవాళ్ళని పక్కన పెడతాడు. మొగుడు పెళ్ళాలని చూస్తే ఇవన్నీ కనిపిస్తుంటాయి. ఒకళ్ళు speed ఒకళ్ళు slow. ఒకడు బడబడ మాట్లాడుతుంటాడు, ఒకడు ఏం మాట్లాడడు. ఇది మన combination. తన చుట్టూ భార్యభర్తలే అవక్కరలేదు, స్నేహితులు, బంధువులు లేకపోతే మన office లో పనిచేసే వాళ్ళు వీళ్ళందరి రూపంలో వాడే ప్రవర్తిస్తున్నాడు, అని గుర్తువుంది కానీ ఎంత వరకు నువ్వు చూడగలవు అనే ఉద్దేశ్యంలో మనకు వీళ్ళందరూ ఏర్పడతారు సాధకుడికి. మరీ బాగా ఇబ్బంది పెట్టిన ఒక పై అధికారి వచ్చాడు అనుకోండి. మనం బాగా ఓపిక తెచ్చుకోవాలి అని తెలుసుకోవాలి. మన మాట వినేవాళ్ళు వచ్చారు అనుకోండి, ప్రసన్నవదనుడైన భగవంతుడు ఈ రూపంలో వచ్చాడు అనుకోవాలి. అలాగే రకరకాల సన్నివేశాలు వస్తుంటాయి. విష్ణు సహస్రనామములో అన్నిరకాల మంది గురించి చెప్పారు. ఎందుకంటే విశ్వం అంతా విష్ణువుగా దర్శనం చేయాలంటే ఇలాగే చేయాలి. ఇంకోలాగ చేయడానికి కుదరదు. విభీషణుడు ఇట్లా దర్శనం చేస్తాడు రాముడిని. ఆకాశంలో నిలబడి నీకు రాముడు తప్ప ఇంకొక ఉపాయం లేదు అని చెప్పారు, నీ దగ్గరికి వచ్చేసాను శరణాగతి పొందడానికి, అంటే ఒక్కొక్కళ్ళు ఒక్కొక్కరకంగా మాట్లాడుతారు విభీషణుని గురించి. అప్పుడు ఎట్లా ఉంటుంది? కానీ విభీషణుడి ముఖములో ఏమాత్రం మార్పు రాలేదుట. సుగ్రీవుడు ఏమన్నాడంటే 'కష్టంలో ఉన్న అన్నయ్యని వదిలేసి వచ్చాడు, వీడేమీ తమ్ముడు, అదే అన్నయ్యని చంపించేసి రాజ్యము తీసుకుందాం అనుకుంటున్నాడు' అని. 'ఇప్పుడు అనిపిస్తున్నదా రాముడిని శరణం పొందాలి అని, సీతని లంకకి ఎప్పుడో తీసుకువచ్చాడు కదా అప్పుడు అనిపించలేదా' అంటాడు జాంబవంతుడు. ఇట్లా మాట్లాడుతూ ఉంటే మనకందరికి కోపం రాదూ? వెంటనే అది కాదండీ,మీకు అర్థం కాదు, తెలియకుండా మాట్లాడకండీ, తెలిసి మాట్లాడండి, తెలియక పోతే తెలియనట్లుండండి, అడ్డగోలుగా మాట్లాడకండి అని మనం అనమూ? అందుకని రామాయణం గాని, భాగవతం గాని, భారతం గాని ఈ భగవదారాధన చేసేవారు ఎట్లా ప్రవర్తించారని

తెలుసుకోవడం కోసం చదువుకోవాలి. ఊరికే పఠనం చేస్తే ఏమీ రాదు, రామాయణం చదివేసాం అన్నట్టుగా ఉంటుంది. ఒకసారి చదివి వదిలేసేది కాదు రామాయణం. ఎన్నాళ్ళు చదివినా ఇంకా చదవాల్సిందే. చదువుకుంటూ ఉండాలి. మనకి ఏమి తెలుసు విభీషణుడు గురించి? విభీషణుడు ఎటువంటి శరణాగతి చెందాడు? వెళితే అక్కడ accept చేస్తారో లేదో? అవతల వర్గంలో వీడు శత్రువర్గం చెందినవాడని అభిప్రాయంలో వున్న వాళ్ళ మధ్యకు వెళ్లి నేను నిన్ను నమ్ముతున్నాను, నిన్ను శరణు కోరుతున్నాను అని అడగాలంటే ఎంత ధైర్యముండాలి? అది సత్వ గుణ సంపన్నులకు మాత్రమే సాధ్యం! ఉండబట్టే ఆయన అట్లా నిలబడిపోతాడు. పైగా ఎంతటి వాడంటే ఆయన రాముడిని శరణు కోరడానికి వచ్చినవాడు సరాసరి రాముడిని కోరాలి కదా! అట్లా కోరడు. రాముని పరివారానికి చెప్తాడు. అది మహాత్ముల గొప్పదనం. మనకి ఎవరితోనైనా ఏదైనా పని ఉంది అనుకోండి, ఆయన దగ్గర అత్యంత ప్రియతమమైన వారితో స్నేహం చేసుకోవాలి. ఎప్పుడూ గురువుగారి దగ్గర గురుప్రీతి పొందిన ఒక శిష్యుడు ఉంటాడు. గురుప్రీతి పొందిన శిష్యుడి ద్వారా గురువు యొక్క సాన్నిధ్యము పొందటము సులభము కదా! ఎవరో ఒక పెద్దాయనని కలవాలి అనుకుంటే, 'ఆయనను కలవడం చాలా కష్టమండి, చాలామంది వచ్చి పోతూ ఉంటారు, అవకాశం దొరకదు' అని ఒక ముసలాయనకి చెప్పారట. ఈయన బయటకు వచ్చి ఆడుకుంటున్న ఆ పెద్దాయన మనవడికి చాక్లెట్లు అవీ ఇచ్చారట. వీడు చాక్లెట్ తింటూ లోపలికి వెళ్తాడు. మనవళ్ళకి ఎప్పుడూ entrance చాలా free గా ఉంటుంది. కొడుకులు, కోడళ్లకు కూడా వుండదు, వీడు ఆ చాక్లెట్ తింటూ లోపలికి వెళ్లి 'తాతా చూసావా చాక్లెట్' అంటే, 'ఎవరు ఇచ్చారు రా' అంటే 'బయట ఒక ముసలాయన కూర్చున్నాడు, ఆయన ఇచ్చాడు' అంటారు. ఎవరు ఆ ముసలాయన అని ఈయన బయటికి వచ్చి చూసాడంట. అట్లా ఎవరైతే భక్తులు భగవంతుడికి ప్రీతిగా ఉంటారో వాళ్లతో మైత్రి చేసుకుంటే వాళ్లు భగవంతుని దగ్గరికి తీసుకెళ్తారు. ఇది మనకి సాంప్రదాయంగా ఉన్నది. అందుకని భగవంతుని సేవ చేయడము పెద్ద విషయం కాదు. భగవత్ భక్తునికి సేవ చేయడం చాలా పెద్ద విశేషం. భగవంతుడికి అందరు చేస్తారు నువ్వు చేసేది ఏమిటి? పైగా ఆయనకేమీ అక్కర్లేదు. వీళ్ళకే అక్కర్లేదు కానీ భగవద్భక్తులకు సేవ చేయడం వలన భగవంతుడు ఎక్కువ సంప్రీతి చెందుతాడు. ఎక్కువ ఆనందము పొందుతాడు. భగవత్ ప్రీతిని పొందడానికి మహాత్ములను ఆశ్రయించడం అనేది మనకి ఆచారంగా ఇచ్చారు, సాంప్రదాయంగా ఇచ్చారు. అది తెలుసు విభీషణుడికి, అందుకని అతను ఆకాశమునందు తన మంత్రులతో వచ్చి, సుగ్రీవాదులకు చెప్తాడు, 'తాను రాముడిని శరణు కోరడానికి వచ్చాను' అని. వీడేంటి, వీడితో మనకు సంబంధం లేదు అనుకున్నాడు

రావణాసురుడు శివుడి దగ్గర ఉన్న నంది గురించి, దెబ్బతిన్నాడు. నందీశ్వరుడికి శివుడు తప్ప ఇంకేం లేదు, శివుడు లేకపోతే ఆయన లేడు, శివుడితోనే సమస్తమూ. ఆయనకి శివుడు పని తన పని. అతడిని కాదని లోపలికి వెళ్తే శివుడేమి పలకరిస్తాడు. హనుమంతుడిని కాదని రాముడి దగ్గరికి వెళ్తే రాముడు అనుగ్రహించడు. గరుత్మంతుని కాదని విష్ణువు దగ్గరికి వెళ్తే విష్ణుమూర్తి కనబడడు. వాహనం లేని గుడి, గుడి కాదు. వాహనము అంటే ఆ భగవత్ తత్వానికి అది వాహిక. గరుత్మంతుడు తిప్పతాడు అంటే మన దగ్గర కూడా తీసుకొస్తాడన్నమాట కదా! ఎలుక లేని వినాయకుడి గుడి, సింహం లేని అమ్మవారి గుడి, హంస లేని సరస్వతి గుడి ఇట్లా ఉండకూడదు. ఎందుకంటే వాళ్లే మన దగ్గరికి పట్టుకుని వచ్చేవాళ్ళు. 'నను బ్రోవమని చెప్పవే' అని సీతమ్మకి చెప్పకుంటాం. సీతమ్మకు చెప్పకోవడం ఎందుకు? రాముణ్ణే సరాసరి అడిగేస్తే పోలా, అలా వినడు రాముడు. సీత చెప్తే వింటాడు. ఒక మహాత్ముని చుట్టూ ఉండే పరివారంలో మహాత్ముడు ఎక్కువ అస్తిత్వము చెంది ఉంటారు. అందువలన వాళ్ళ ద్వారా తెలుసుకోవాలి ఆ మహాత్ముని గురించి. లక్ష్మణుని మరచి, సీతను మరచి, హనుమంతుడిని మరచి మనము రాముడు దగ్గరికి వెళ్ళామనుకోండి, వొప్పుకోదు పరమాత్మ తత్వం. అది తెలిసిన వాడు విభీషణుడు. అందుకని విభీషణుడు ఏం చేశాడంటే సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడూ వాళ్ల దగ్గరికి వెళ్లి చెప్పాడు 'నాకు రాముడే ఉపాయము ఇంకెవరు లేరు అనే నమ్మకముతో ఇక్కడికి వచ్చాను.రాముని శరణాగతి కోరటానికి వచ్చాను', అంటే వీళ్లు వెళ్లి చెప్పారు. 'విభీషణుడు రావణాసురుడి తమ్ముడు వచ్చాడు శరణు కోరుతున్నాడు నిన్ను', అంటే రాముడు 'మీరందరూ ఏమంటారు? మీరందరూ నాకు కావలసినవారు కదా మీరు చెప్పండి' అంటాడు. అంటే అంత విభీషణుడు తన విజ్ఞతను తెలియబరుస్తాడు. విజ్ఞత ఉన్న వాళ్ళు సరాసరి భగవంతుని దర్శనం కాకుండా భాగవతుల ద్వారా భగవంతుని దర్శనము చేసుకుంటారు. ఒక గురువు ద్వారా భగవంతుని అందుకోవటం అనేది సులభము. ఒక గురువుని దర్శించి హృదయంలో రంజింప చేసేటట్టుగా మనము బాధ్యతలను నిర్వహింపజేసినట్లయితే, ఆయన హృదయము పొంగితే, మనని భగవంతుడు అనుగ్రహిస్తాడు. అదే గురు శుశ్రూష. అట్లా చేస్తున్న వాడికి ఏమవుతుంది అంటే గురువు యొక్క అనుగ్రహం లభిస్తుంది. అదే గురువు అనుగ్రహము లభించడం ద్వారా భగవంతుడు దగ్గరవుతాడు. అంతేగాని మనమేదో ఆయన్ని please చేద్దాము అనుకుంటే అయ్యే పని కాదు. సుగ్రీవుడు ఇదే విషయంలో పారపాటు చేస్తాడు. రామలక్ష్మణుల నిద్దరిని ఋష్యమూక పర్వతం మీదకు హనుమంతుడు తన భుజాల మీద తీసుకొస్తాడు.సుగ్రీవుడు రాముని మాత్రము కూర్చోమని, లక్ష్మణుని కూర్చోమని

చెప్పడు. ఎప్పుడూ రాముడితో ఎడతెగని సంబంధం ఉన్నవాడు కదా లక్ష్మణుడు. రామునికి ఎంత గౌరవం ఇవ్వాలో లక్ష్మణుడుకి కూడా అంతే గౌరవం ఇచ్చిన వాడు తెలిసినవాడు. ఎందుకని? ఎడతెగని, వీడని సంబంధము భగవంతునితో కలిసి ఉన్నది, అంటే వాడు ఎంతటి వాడయి వుండాలి? ఎట్టి పరిస్థితుల లోనూ రాముని వదలని వాడు ఒకడు ఉన్నాడంటే, వాడికన్నా మిన్న ఎవరున్నారు? అవి రెండు శరీరాలు తప్ప ఒకటే తత్వము. అందుకని హనుమంతుడు ఇద్దరినీ భుజాల మీద ఎక్కించుకుని ఋష్యమూక పర్వతము పైన తీసుకెళ్తే రాముడు గురించి అంతా చెప్తాడు హనుమంతుడు. చెప్తే సుగ్రీవుడు ఒక చెట్టు కోసుకొచ్చి రాముడుకి కూర్చోడానికి వేస్తాడు, రాముణ్ణి కూర్చోమంటే లక్ష్మణుడు కూర్చోడు. అది చూసి హనుమంతుడు గబగబా పరిగెత్తుకుంటూ వెళ్లి ఇంకొక చెట్టు తీసుకొచ్చి లక్ష్మణుడికి వేస్తాడు. అదే హనుమంతునికి, సుగ్రీవునికి ఉన్నటువంటి తేడా. రామాయణం చదువుకుంటే మనకు కనిపిస్తుంది. రాముడు ఎప్పుడు వాలిని చంపేస్తాడా అని. వేస్తే లక్ష్మణుడు ఏమనడు ఎందుకంటే చూసి నవ్వుకుంటూ ఉంటాడు. ఎందుకంటే ఎప్పుడూ మనం దేవుని మొహంలోకి చూస్తూ ఉంటాం. మొహం లోకి చూడ్డం కాదు ముందు ఉత్సవ విగ్రహాలు చూడాలి. ఎందుకంటే అదే ఊర్లో తిరిగేది. మూలవిరాట్ ఎప్పుడూ కదలకుండా అక్కడే ఉంటుంది. అందుకని హారతి ఇచ్చేటప్పుడు కూడా మూల విరాట్ తో కూడా ఉత్సవ విగ్రహాలను కూడా చూపిస్తారు. ఉత్సవ విగ్రహాలు కూడా చాలా సమానమైనవి అనే భావంతో చూపిస్తారు. అట్లాగే లక్ష్మణుని పట్టించుకోడు సుగ్రీవుడు. వదిలేస్తాడు. రాముణ్ణి ఎక్కువ పట్టించుకుంటాడు. తనతో వచ్చిన వాడిని సమానంగా గౌరవించారా లేదా అనేది ఎక్కువ చూస్తాడు భగవంతుడు. తనని గౌరవించారా లేదా అని భగవంతుడు చూసుకోడు, తన భక్తుడిని గౌరవించారా లేదా అనేది చాలా ముఖ్యం. అంబరీషుడిని గౌరవించలేదని కదా దూర్వాసుడితో పోరాటం చేశాడు. అంత చెత్త పనిచేసేసి కాళ్ళు పట్టుకుంటే బుద్ధి లేదా అని పొమ్మంటాడు. "నా మేలు కోర భక్తులకు గానీ" అని అంటాడు. ఇక్కడ రామభక్తుడు ఎవరయ్యా అంటే లక్ష్మణుడు. అంతకన్నా భక్తులు ఉండరు. అప్పటికప్పుడు పెళ్లి చేసుకుని honeymoonకి వెళ్లవలసిన వాడు వనానికి వస్తాడు. ఎవరైనా వస్తారా? వీడు ఎక్కడ దొరికాడు నాకు అని అనుకోకుండా ఉంటాడు. రాముడే సమస్తము! అటువంటి వాడిలో ఎంత ఉంటుంది రామ తత్వము! దానిని ignore చేస్తే ఎలా? వాలితో యుద్ధం చెయ్యి నేను కొట్టేస్తాను, అని చెప్తాడు రాముడు. అంటే వెళ్తాడు. వెళ్తే వాలి తంతూంటాడు, బాగా తన్నులు తిన్న తర్వాత పరుగెత్తి వచ్చేసి, రాముని ఏమిటి ఇట్లా చేసావని అడిగితే 'నీకు, వాలికి నాకు తేడా తెలియలేదు, అందుకని నేను బాణం వేస్తే పారపాటున నీకు తగులుతుందని

వేయలేదు' అంటాడు. అది మనకు తెలుసు. వీడికి వాడికి తేడా తెలియాలి అంటే వాలి ఎంత గాడిదో వీడు అంతే గాడిద అని చెప్పడం. నిజానికి రాముడికి వాలికి సుగ్రీవుడికి తేడా తెలియనటువంటి స్థితి ఉండదు. వాలికి ఇంద్రుడు ఒక మాల ఇచ్చాడు. వాలి ఆ మాలని ఎప్పుడు వేసుకుంటూ ఉంటాడు. ఆ మాలని వేసుకోవడం వల్ల ఏమవుతుంది అంటే ఎదుటి వ్యక్తి లో బలం సగం ఈయనలోకి వచ్చేస్తూ ఉంటుంది. అందుకని ఎదుటి వ్యక్తి సగం అయిపోతాడు. ఈయన ఉన్నదాని కన్నా ఇంకో సగం పెరుగుతాడు. ఇంక గెలవలేడు కదా! ఆ మాల పగలయినా, రాత్రయినా మెరుస్తూ ఉంటుంది అటువంటి మాల వేసుకుని వాలి యుద్ధం చేస్తున్నాడు. సుగ్రీవుడి మెడ బోడి మెడ. తేడా తెలియకపోవడానికి ఏమీ లేదు, లక్ష్మణుని ద్వారా అనుగ్రహం పొందితే గానీ సుగ్రీవుడికి గెలవడానికి అవకాశం లేదు. సుగ్రీవుడు బాగా తన్నులు తిన్న తర్వాత లక్ష్మణునితో, ఈ వనంలో ఉన్న పువ్వులని ఒక మాలగా కట్టి సుగ్రీవుని మెడలో వేయమంటాడు. అప్పుడు సుగ్రీవుడు దండం పెడతాడు లక్ష్మణుడికి. ఇంక ఇప్పుడు బయలుదేరి వెళ్ళు అని లక్ష్మణుడు ఆశీర్వదిస్తాడు. మహాత్ములను కాదని మనం ముందుకు పోరాదు. భగవదాశ్రయము కల మహాత్ములను కాదనరాదు. మహాత్ములు ఎప్పుడూ మహాత్ములే! భగవత్ ఆశీర్వాదం కలిగినవాడు చూడటానికి చాలా నీరసంగా కనిపిస్తూ ఉండవచ్చు, వంకరగా, కుంటిగా కనిపించవచ్చు, ఓడిపోయినట్టుగా ఉండవచ్చు. ఈయనేమిటి ఇలా ఉన్నాడు అనుకోకూడదు. మాస్టర్ గారు భాగవతంలో, 'అయస్కాంతం అయస్కాంతమే! ఇనప ముక్క వంకరగా ఉంటే అయస్కాంతానికి సంబంధం లేదు. ఇనుప ముక్కలు వంకరగా ఉన్నా దాన్లోంచి మనకు వచ్చేది అయస్కాంతమే కదా' అన్నారు. అట్లా భగవత్ తత్వాన్ని పరిపూర్ణంగా పొందిన వాళ్ళని ఆశ్రయించటం వలన భగవంతుని చేరవవుతామనేది సాంప్రదాయం. అంబరీషుడు విష్ణువు కన్నా వేరు కాదు. ప్రహ్లాదుడు విష్ణువు కన్నా వేరు కాదు. ఇవన్నీ ప్రసన్న వదనాలు. కానీ ధర్మం కోసం అవసరమైతే భగవంతుడు కోపాన్ని ప్రదర్శిస్తాడు. రౌద్ర రూపాన్ని కూడా దాల్చగలడు.

327 కర్తా

మొత్తం అన్నింటికీ కర్త ఆయన! ఎదుటి వ్యక్తి నుండి మనకు అన్ని విషయాలు అందిస్తున్నాడు. కర్త ఒక్కడే భగవంతుడు. ఏం చేసినా పరిస్థితులు అన్నీ నిమిత్త కారణాలు. అన్నీ ఆయన చేస్తున్నాడనుకుంటే సాధన సాగుతుంది. ఉదాహరణకు సత్రాజిత్తు కృష్ణుడి మీద ఎంత అపవాదు వేసినా చంద్రుణ్ణి పాలల్లో చూసాను దాని మూలంగా ఈ నిందలు వచ్చాయన్నాడు. ఆయన కుమార్తెను పెండ్లి చేసుకున్నాడు కృష్ణుడు. సత్రాజిత్తుని దూషించలేదు. మనకన్నీ కష్టాలే అనుకోరాదు. మనకు కావాల్సిన సాధన వ్యక్తులు నిమిత్తంగా కలుగజేస్తారు. వ్యక్తుల ద్వారా ఆయనే కలుగ చేస్తాడు. అన్ని పరిస్థితులలో ఆయన్ని చూడాలి. కర్త ఆయన! మన కర్మ బట్టి మనం నడుస్తూంటాము. రాముడు అదృశ్యుడై వాలిని కొట్టినట్లే, మనలని అదృశ్యంగా భగవంతుడు కొడుతూంటాడు. ఎందుకంటే మన కర్మల ఫలితం అలా ఉంటుంది. ఆయన అనుగ్రహం ఉన్న చోట మనోబలం తో కర్మలను చేయడం జరుగుతుంది. ఎంత బలం, ధనం వున్నా, అధర్మం వున్నచోట లోపలనుండి భగవంతుడు మనలని సరిచేస్తాడు. కర్మఫలం అలా అందిస్తాడు. మనము చేసిన కర్మే మనకు వస్తున్నదని గ్రహించిన వాడు అదృష్టవంతుడు. ఎవరిమీదా వెష్టపడి లాభం లేదు అని తెలిసినవాడు అదృష్టవంతుడు. శివుని ధనుస్సు కి నారి సంధించవద్దని మనం ప్రార్థిస్తున్నాము నమకంలో. లేకపోతే మనం చేసే అధర్మంతో కూడిన పనులకి కోపించి వెంటనే బాణం వేసేస్తాడని. అందుకూ అధర్మమైన పనులు చేయడం మానుకోవాలి. మనకి జరుగుతున్న వాటిలో పరమార్థం చూడాలి. రాముని బాణాలు తగిలిన భక్తులు చాలా సంతోషిస్తారు. దానికి ముందు, వారు వేరు. బాణం తగిలిన వెనక వారిలో మార్పు వేరుగా వుంటుంది. ఎవరి ద్వారా కష్ట నష్టాలు వస్తాయో, వారిద్వారా కర్మప్రక్షాళన జరుగుతుందని ఎరిగి, వారికి కృతజ్ఞులై యుండండి. అందరిలో నుండి కర్తగా వాడే వ్యక్తం అవుతున్నాడని గ్రహించండి. రాగద్వేషాలలో కొట్టుకొని పోకండి. నీవు ఎంత సామాన్యంగా వుంటే అంత భగవంతునికి దగ్గరవుతావు. అసామాన్యంగా వుంటే అంత దూరమవుతావు. ప్రతి ఒక్క దేవతకి ఒక్కొక్క పని వుంటుంది. అలాగే మృత్యువుకి ఒక దేవత వుంటుంది. అది కృష్ణుడు దేహం వదిలేముందు వచ్చి ఏమిటి నాకిలాంటి పనిచ్చావు? నిన్ను మింగాల్సిన పని వచ్చిందంటుంది. ఇలా ఊర్ధ్వ లోకాల కంటే అధోలోకాలకి వెళ్ళేకొద్దీ వాళ్ళ పని మరీ భారంగా వుంటుంది. ఉదాహరణకి వడ్డించే వాడికంటే ఎంగిళ్ళు ఎత్తేవారి పని కష్టం కదా! సృష్టిలో అందరూ ఇలా ఎక్కడున్నా భగవంతునిలో ఉన్నాము అనుకుంటే బావుంటుంది. ఏ పని చేసినా ఆయన కర్తగా గుర్తు చేసుకొని కర్మలు చేసుకోవాలి.

అన్నిటికీ ఆయనే కర్త! మనకి ఎవరైనా ఏదైనా చేసి పెట్టినప్పుడు ఎదుటి వాళ్ల నుంచి చేస్తున్న వాడిగా భగవంతుడే మనకు చేస్తూ ఉంటాడు. మంచైనా, మనము మంచి కావు అనుకున్నా మన కర్మ క్షాళనమునకు పనికొచ్చేవే అవన్నీ. జరుగుతున్నవన్నీ కూడా మన కర్మానుసారము జరుగుతూ ఉంటాయి తప్ప, ఎదుటి వ్యక్తి పైన వెష్ట పడాల్సిన అవసరం లేదు. ఎందుకంటే మనది కానిది మన దగ్గరికి రాదు మంచైనా, చెడైనా. ఊళ్లో పోయే మంచి అయినా మన దగ్గరికి రావచ్చు. ఊళ్లో పోయే చెడు అయినా మన దగ్గరికి రావచ్చు. మనబట్టి ఉంటుంది తప్ప ఊరుని బట్టి ఉండదు. మిగతా మనుషులను బట్టి ఉండదు. వారంతా నిమిత్త కారణంగా ఉంటారు. నిమిత్త కారణము చూసి మనము బాధపడకుండా మనకు జరుగుతున్న దానికి భగవంతుడు ఈ విధముగా మనకి ఇచ్చాడు, ఎందుకంటే మనలని కర్మల నుండి క్షాళనము చేసి ఉద్ధరించుకోవటం కోసం అనేది గుర్తుండాలి.

328 విశ్వబాహుః

విశ్వబాహు అంటే విశ్వములో ఉన్న సమస్త బాహువులు తనవిగా కలవాడని. విశ్వం అంతా వ్యాపించిన చేతులు కలవాడని ఒక భగవంతుడి నామము. భగవంతుని యొక్క బాహువులు రకరకాలుగా మనకి సహాయపడుతూ ఉంటాయి. అందులో మనకి అభయము ఇచ్చే హస్తము ఒకటి కనిపిస్తూ ఉంటుంది. భయం నుంచి మనల్ని రక్షించే వరద హస్తము ఒకటి ఉంటుంది. అంటే మనకి క్షేమము కలిగించే విషయములను మనకు అందించే హస్తము ఒకటి ఉంటుంది. తరువాత శంఖము ధరించిన హస్తము, చక్రము ధరించిన హస్తము, గద ధరించిన హస్తము, పద్మము ధరించిన హస్తము, వివిధములైన ఆయుధములు ధరించిన హస్తములు మనకి గోచరిస్తూ ఉంటాయి. అంటే రక రకములుగా భగవంతుడు మనల్ని రక్షించడానికి సన్నద్ధుడై ఉన్నట్టుగా కుడా గోచరిస్తుంది. ఈ విశ్వమంతా కూడా తన చేతులతో ఆ విధంగా బాగా రక్షించుకునే బాహువులు కలవాడని! రక్షణ కలిగించడం, పోషణ కలిగించడం, జీవుల యొక్క యోగక్షేమములు చూడడము ఇవన్నీ కూడా భగవంతుని యొక్క విశ్వబాహువులు యొక్క కార్యంగా మనకి కనిపిస్తుంది. భగవంతుడు బాహువులు నుంచి మనకు అందవలసినది అందుతూ ఉంటాయి. ఒక్కొక్కసారి మంచి చాక్లెట్లు పెట్టవచ్చు ఇంకొకసారి చేదు మందు వేస్తూ ఉండవచ్చు రెండూ భగవంతుడే చేస్తూ ఉంటాడు. అందుకని మన దగ్గరికి ఎవరి ద్వారా ఎటువంటివైనా వచ్చినా సరే, ఎవరి చేతల వలన మన వరకు వచ్చిన విషయాన్ని కూడా భగవంతుడు చేస్తున్న భావన చేసుకోవాలి. అలాగే మన చేతుల్లోంచి జరిగే పనులు కూడా భగవత్ పరంగా జరగాలి. 'కమలాక్షుని అర్చించు కరములు కరములు', కాబట్టి మనము చేసే పనులు భగవంతుని సేవగా జరగాలి. భగవంతుని సేవగా అంటే ఎవరికి ఏ పని చేసి పెడుతున్నా సరే భగవంతునకు చేస్తున్నాము అని చేసేటట్లయితే, మనము కొంతమందికి ఎక్కువ చేయబుద్ధి అవడము, కొంతమందికి తక్కువ చెయ్య బుద్ధి అవడము, కొంతమందికి అసలే చేయబుద్ధి కాకపోవడం ఇటువంటివి అన్నీ పోతాయి. మనము చేసే పని ఇష్టాయిష్టాలు బట్టి చేస్తూ ఉంటాము కదా! అటువంటి చేతులు భగవంతుని పనికి వాడే చేతులు కాదు. ఇష్టము, అయిష్టముతో సంబంధం లేకుండా మన కర్తవ్యం మేరకు మనం నిర్లిప్తంగా, నిర్వర్తించడానికి ఉపయోగపడే చేతులు, మనకు ఇవ్వబడిన చేతులు, భగవంతునిగా భావన చేసుకోవాలి. ఈ చేతులు భగవంతుడు ఇచ్చినందుకు చేయవలసినది అటువంటి పనులు. లేకపోతే ఈ చేతులు నిష్ప్రయోజనం అని భాగవతం చెప్తుంది. 'కమలాక్షుని అర్చించు కరములు కరములు', అంటే అర్థం ఎప్పుడూ పూజలు చేసే చేతులని కాదు. ఏ పని చేసినా పూజగా చేసే చేతులు. ఎవరికి అన్నము పెట్టినా, ఎవరికి ఏదైనా డబ్బులు ఇచ్చినా, ఎవరికి ఏమి చేసిపెట్టినా ఎదుటి వ్యక్తి రూపంలో ఉన్నది భగవంతుడే అనే భావన చేసుకుంటూ మనము చేయవలసినది ఈ చేతులతో చేయటం. ఆ విధంగా చేస్తే

విశ్వబాహువులు మన బాహువులవుతాయి. మనకి శక్తి పెరుగుతుంది. ఇది మన చేతులు అనుకోవడం వలన చచ్చుగా ఉంటాయి, కానీ ఇది భగవంతుని యొక్క చేతులు అంటే భగవత్ తత్త్వంలో ఉండే సమస్తమైన శక్తి ఈ చేతులకి రావడానికి అవకాశం ఉంది. అందుకనే ఎదుటి వ్యక్తికి మనము చేస్తున్నది కూడా భగవంతుడు చేస్తున్నదే! మనలోంచి జరిగేవి కూడా భగవంతుని పరంగా జరిగేదే! ఇలాగా మనము సాధన చేసుకుంటే ఎవరి చేతులైన చూసినప్పుడు వాళ్ళ చేతులు, వాళ్ళ చేతులకు ఉన్న ఉంగరాలు, కాకపోతే వాళ్ళ చేతులకు ఉండే వంకీలు చూడడం కాకుండా, అవి భగవంతుని చేతులు అని గుర్తు వస్తుంది. మనలో ఎంతమందికి ఇతరుల చేతులు చూస్తే భగవంతుడు చేతులు వాడికి అట్లా ఉన్నాయి అని గుర్తు ఉంటుంది? ఉండదు కదా! వుండాలి. విష్ణు ఉపాసన చేసినట్లయితే ఎదుటి వ్యక్తి చేతులు విష్ణువు యొక్క చేతులే! ఎదుటి వ్యక్తి యొక్క కన్నులు విష్ణువు కన్నులే! ఎదుటి వ్యక్తి యొక్క రూపం విష్ణువే కదా! అంతా విష్ణువే అయినప్పుడు చేతులు కావా? కాబట్టి చేతులను చూసినప్పుడు కూడా ఈ భావం కలగడానికి ఈ నామము మనకి పని చేస్తుంది. ఈ విష్ణు సహస్రనామం నామాలన్నీ మనము సాధన పరంగా పెట్టుకుంటే, విష్ణువు తప్ప ఇంకేమీ లేని ఒక స్థితిలో జీవించే సంస్కారం మనలో ఏర్పడుతుంది. అప్పుడు ఇంకొకటి కనబడవు. ఈ విశ్వమంతా ఆయన బాహువులతోనే నిండియున్నది. ఆయనే మోస్తూ ఉన్నాడు. ఈ సమస్తాన్ని కూడా ఆయనే చేస్తూ ఉన్నాడు. మనకు జరిగేవి అన్నీ ఆయనే చేస్తున్నాడు మనము చేసేవి కూడా ఆయనకి సమర్పణగా చేసుకుందాం. అటువంటి భావన సాధన పరంగా మనం చేస్తున్నట్లయితే విశ్వబాహు అనే నామానికి మనలో ఒక రకమైన కనువిప్పు కలుగుతుంది. ఒక తెర తొలగింపు జరుగుతుంది. ఎవరి చేతులు చూసినా కూడా భగవంతుని చేతులుగా భావన జరుగుతుంది. ఎవరైనా నోట్లో మందేస్తే, ఆయన చేతులు ఆ భగవంతుడు చేతులే మనకి మందు వేస్తున్నాయని భావన వస్తుంది. వేసేవాడు నారాయణుడు అనుకోమన్నారు కదా! అట్లా ఎక్కడ చేతులు చూసినా భుజముల దగ్గర నుండి బాహువులన్నారు. మొత్తం అంతా కూడా భగవంతుని యొక్క బాహువులే అని గుర్తు ఉండేటట్టుగా సాధన చేసికోవాలి. ఈ సాధనలో మామూలుగా ప్రపంచంలో చూసే అన్నింటిని మనము అర్థం చేసుకునే భావనగా కాకుండా, అక్కడ భగవంతుని యొక్క భావాన్ని ప్రతిపాదన చేసుకోమంటున్నారు. ముందు ప్రతిపాదన చేసుకోవాలి ఎందుకంటే మనకి వేరే భావన ఇచ్చాడు కాబట్టి. ఇది మూత అని మనకి తెలుసు. ఇది మూత అని చిన్నప్పుడు ఎవరో మనకు చెప్తే మూత అని నమ్ముతున్నాము. ఎందుకంటే ఇది మూసుకోవడం వల్ల కూడా మూత అని తెలుస్తుంది. కానీ తెలిసిన వాడికి ఏమిటంటే మూత రూపంలో ఉండేది భగవంతుడు. తెలిసినవాడికి గ్లాసు రూపంలో ఉండేది భగవంతుడు. ఈ లోపల ఉండేది నీళ్లు అనరు. తెలిసిన వాళ్ళు నీళ్లు అనబడేది అంటారు. నీళ్ళని మనం పిలుస్తాం తప్ప అది నీళ్లు కాదు కదా! దానికి అది నీళ్లు కాదు కదా. మిమ్మల్ని కూడా పిలిచేటప్పుడు ఫలానా అని పిలవబడేవాడుగా గుర్తున్న వాడు తెలిసిన వాడు. అలా

కాకుండా మనం ఏం చేస్తాం అంటే వాడి పేర్లు అతడుగా భావిస్తాము. అతనికి ఒక పేరు పెట్టేసరికి అతను పోయి అతని పేరు మిగులుతుంది. అందుకని ఇంగ్లీషులో చెప్పినప్పుడు that it is called, మూత అని పిలవబడేది, గ్లాసు అని పిలవబడేది అని. అది తత్ అన్నమాట. నీరు అని పిలవబడేది, ఇట్లా మాట్లాడుకుంటారు. ఎందుకంటే అట్లా మాట్లాడుకుంటే వెర్రిగా అనిపిస్తుంది. ఆ తత్వమే నీరు అనబడుతుంది ఇక్కడ. ఆ తత్వమే గ్లాసు అనబడుతుంది ఇక్కడ. ఆ తత్వమే జీవుడు అనబడుతుంది. ఆ తత్వమే చెయ్యి అనబడుతుంది. ఆ తత్వమే కన్నుగా కనపడుతుంది. ఆ తత్వమే ఇట్లా--. అదేరా ఉంది, ఇట్లా కనిపిస్తూ ఉంటుంది అని చెప్పడానికి అన్నమాట. అందుకని కాళ్ళ వాడు, ముక్కు వాడు, కన్నులు వాడు, చేతులు వాడు, తలకాయల వాడు అని చెప్పడమే సహస్రశీర్ష, సహస్రాక్ష, సహస్రపాత్. ఎవరి తలకాయలు చూసినా సరే విష్ణువు గుర్తు రావాలి అన్నమాట. అదీ సాధన. మూడు రకాలుగా చూసుకుంటే ఒక మాదిరిగా అనిపిస్తుంది. తలకాయను బట్టి కదా మనం వానిని గుర్తిస్తాము, తలకాయ లేకపోతే వారిని గుర్తించమే గుర్తించము. కాబట్టి మనము మామూలుగా చూసే వాటిని అన్నిటినీ కూడా అది కాదు, నిజానికి వాడు అట్లా ఉన్నాడు, వాడు లేక తత్ అంటే అది, లేక ఆ తత్వమే ఈ విధంగా ఉన్నది. చెట్టు అనబడేది, నీళ్లు అనబడేది, మైకు అనబడేది, చొక్కా అనబడేది. వాడు అట్లా ఉన్నాడన్నమాట. ఇది చొక్కా ఎప్పుడైంది? పోగులు పోగులోకి వెళితే, పత్తి పత్తిలోకి వెళితే, అణువులు కదా! అన్ని అణువులే ఇన్ని రకాలుగా తయారైంది. కొన్ని అణువులు అట్లయితే, కొన్ని అణువులు ఇట్లా మొత్తం అన్ని అణువుల్లో సముదాయము రకరకాలుగా తయారైంది కదా! మరి రకరకాలుగా తయారు అయినప్పుడు, తయారైన పదార్థంలో అసలు మర్చిపోతున్నాం కదా! ఎన్నిసార్లు చెప్పుకున్నా మళ్ళీ మనం మర్చిపోతాం కదా! అదీ గొప్పతనం. ఎందుకు మర్చిపోతామంటే 'అది మాయ' అన్నారు. మర్చిపోకపోతే నీవు కొన్ని పనులు చేయగలవు. గుర్తు పెట్టుకుంటే ఏమవుతుంది అంటే చేయగూడని పనులు చేయకుండా ఉంటాం. గుర్తు లేకపోతే ఏం చేస్తామంటే చేయకూడని పనులు చేయటం వలన చిక్కులు వేసుకుంటాం కదా. ఆయనెవరో అంటే ఇష్టం లేదు, కాబట్టి మన మాటల్లోనూ, చేతుల్లోనూ ఏదో కొంత కొంటె పని చేస్తాము. కొంటె మాటలు అంటాము. ఇష్టం లేకపోవడం వల్ల చేయటం వలన, ఆ కొంటెదనం దానిలోకి రావడం వల్ల అందులోంచి కొన్ని చిక్కులలో పడతాము, మళ్లీ అవి విప్పుకుంటూ కూర్చోవాలి. అవి విప్పుకోవడంలో ఇంకా కొన్ని చిక్కులు వస్తాయి. ఈ గోలంతా లేకుండా ఉండడానికి ఆ మాయ అనే పార దాటాలంటే, 'వాడు' కూర్చుంటే మాయ ఉండదు. మాయ ఉంటే వాడు కూర్చోడు. అది ఆట అన్నమాట. ఇక్కడ ఉన్న క్రీడ ఏమిటంటే 'నువ్వు ఆయనతో ఉంటే నేను నిన్ను అంటను' అంటుంది మాయ. 'ఆయన్ని మర్చిపోయావ్ అంటే మొత్తం అంతా నాదే, నిన్ను నా జేబులో వేసుకుని తిరుగుతాను' అంటుంది. అందుకనే మనము ఎల్లప్పుడూ సమస్తములోను ఆయనతోనే సంబంధం ఏర్పర్చుకోవడం కోసం రకరకాల విషయాలు మనకు చూపించి, ఇట్లా అనుకుంటామే ఇది అదే అని చెప్పడానికి ఇచ్చారు. ఎట్లా చెప్పారు

ఇక్కడ శ్లోకంలో ఇష్టము వాడే, అయిష్టము వాడే నీకు ఏది ఇష్టం లేదో అది కూడా వాడే అని గుర్తు పెట్టుకో. ఇష్టము లేకపోవడం అనేది నీలో ఉన్న బలహీనతే తప్ప, నీకు ఎవరి మీద ఇష్టం లేదో వాళ్ళ రూపంలో కూడా వాడే ఉన్నాడు కదా! అందుకని ఇష్టో విశిష్టః, మహాత్ముల రూపంలో ఆయనే ఉన్నాడు, ధర్మాత్ముల రూపములో, క్రోధః కోప్పడే వాళ్ళ రూపంలో ఆయనే ఉన్నాడు. క్రోధకృత్ - కోపాన్ని ప్రేరేపించే వాళ్ళ రూపంలో వాడె వున్నాడు. కోపాన్ని తగ్గించే రూపంలో కూడా ఆయనె ఉన్నాడు. ఇన్నిట్లోనూ ఉన్నటువంటి వాడిగా చేస్తున్నటువంటి వాడు ఆయనే. ఇన్ని చేతులుగా కనిపిస్తున్నాయి. ఇన్ని చేతులతో పనులు జరుగుతున్నాయి. ఈ చేతులన్నీ ఎవరి చేతులు? ఆయనవే. ఇట్లా గుర్తుపెట్టుకోవాలి.

328. మహీధరః

తనే అన్ని గా ఏర్పడి, అన్నీ చేస్తూ ఉన్నాడు కాబట్టి ఈ మొత్తం అంతటిని ఆయనే ధరించి ఉన్నాడు అని చెప్పడానికి మహీధరః! మహీధర అంటే అంతా ఆయనే ధరించి ఉన్నాడు! ఇప్పుడు మన శరీరము మనం ధరించలేదు. మనము ధరించి ఉంటే మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు ఈ శరీరము వదిలేయాలి, ఎప్పుడు కావాలంటే అప్పుడు పుచ్చుకోవాలి కదా. ఆయన ధరించి ఉన్నాడు కాబట్టి మన ఇష్టా అయిష్టాలతో సంబంధం లేకుండా దీన్ని మన దగ్గర నుంచి తీసేస్తూ ఉంటాడు. కోరి చచ్చిపోయిన వాడు ఎవరైనా ఉన్నారా? లేరు కదా! అందుకని చాల్లేరా, అసభ్యంగాను, అసందర్భంగాను, అసహ్యంగాను, అస్తవ్యస్తంగాను శరీరాన్ని వాడావు. నీకు ఎట్లా మాట్లాడాలో తెలియలేదు, ఎట్లా ఆలోచించాలో తెలియదు, ఏం చూడాలో తెలియదు, ఏం చూడకూడదో తెలియదు, ఏం తినాలో తెలియదు, ఏం తినకూడదో తెలియదు, ఏమి ముట్టుకోవాలో తెలియదు, ఏమి ముట్టుకోకూడదో తెలియదు, అన్ని విధానాలలోను ఒకే రకంగా ఉన్నాయి అందువల్ల దీని వల్ల నీకు ఉపయోగం లేదు కాబట్టి తీసేస్తున్నాను, అంటాడు. ఇదంతా ధరించిన వాడిగా భావన. ఇప్పుడు ఈ భూమి ఎక్కడ నిలబడి ఉంది? ఏదైనా ఒకటి నిలబడి ఉండాలంటే ఒక ఆధారం ఉండాలి కదా! భూమి దేని మీద నిలబడి ఉంది? ఈ శరీరము దేని మీద నిలబడి ఉంది? మనం నించుంటే నించొని, కూర్చుంటే కూర్చుని చేస్తాం. కానీ మనకి కాళ్లు నొప్పులు పెట్టినప్పుడు, ముణుకులు వాచినప్పుడు, లేకపోతే కాళ్లు పడిపోయినప్పుడు నించోలేం. ప్రాణ శక్తి వల్లకదా దేహం నిలిచి ఉంది. ప్రాణశక్తి దేని మీద నిలిచి ఉంది? మనం పీల్చేగాలి, వదిలే గాలి మీద నిలబడే ఉందా? మనము పీల్చేగాలి, వదిలే గాలి ప్రాణము ఉండబట్టే చేస్తున్నాం తప్ప, పీల్చడం వదలడం వల్ల ప్రాణం లేదు. ప్రాణము మనలో ఉన్న ప్రణవము మీద నిలబడి ఉంది. ప్రణవము అంటే ఓంకారము. నాదం! నాదము ఆధారంగా ప్రణవము జరుగుతూ ఉంటే ప్రణవంలోంచి ప్రాణం పుడితే, ప్రాణం నుంచి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు పుడితే దాని ఆధారంగా శరీరము ఎట్లా నిలబడి ఉందో అదే విధముగా ఈ భూమి కూడా ప్రణవం ఆధారంగా నిలబడి ఉంది. ప్రాణము ఆధారంగా నిలబడి వుంది. భూమికి ఒక ప్రాణం ఉంది. అది భూమి ప్రణవం నుంచి పుడుతూ ఉంటుంది. అది ప్రణవంగా సమస్తమైన గ్రహాలన్నింటిని కూడా అట్లా నిలబెడుతుంది. ఇంత పెద్ద భూమి చోట్లో నిలబడి ఉంది. అట్లా ఉండటమే కాదు, అది circus కూడా చేస్తూ ఉంది తన చుట్టూ తాను తిరుగుతుంది, ఇంకొకడు చుట్టూ తిరుగుతోంది, ఒకే speed లో తిరుగుతుంది. ఇవన్నీ చేస్తూ ఉన్న ఆ తత్వం ఏదైతే ఉందో అది మనలో ఉంది. అది భూమిలో ఉంది.

అందుకని భూమిని ధరించిన వాడు కూడా భగవంతుడే, మహీధరుడు! ప్రకృతిని భరించే వాడు, ధరించేవాడు. ప్రకృతి ౭ పొరలుగా మనలో ఈ సృష్టిలో ఉన్నది. అది ఏడు లోకాలుగా చెప్తాము. సూక్ష్మము నుంచి స్థూలం వరకు. ఇవన్నీ ఎక్కడి నుంచి పుట్టుకుంటూ వస్తున్నాయి? ఉల్లిపాయలు నుంచి ఉల్లిపాయ పొరలు ఎట్లా పుట్టుకొస్తున్నాయి? పొరలన్నీ కలిపితే ఉల్లిపాయ ఉంటుంది. అది తీసేస్తే ఏమీ ఉండదు లోపల కదా! ఏమీ లేనట్టుగా ఉండి, అంతా కలిగి ఉండి అన్నింటినీ ధరించడం. ఆ విధముగా సమస్తమును ధరించటమున్నటి వాడుగా భగవంతుని భావన చేయాలి. ఏదైనా కొంతమంది బాధ్యతలు మోస్తున్నారు అనుకోండి, బాధ్యతలు మోసేవాళ్ళల్లో భగవంతుడు మహీధరుడుగా ఉన్నాడని చూడాలి. ఆదిశేషువు ఈ గోళాలన్నీ తలమీద మోస్తున్నాడు అని చెప్తారు పురాణాల్లో. అట్లానే పాశ్చాత్య దేశములో Atlas అనే ఒక మహాత్ముడు ఈ భూమిని అట్లా భుజాల మీద మోస్తున్నాడు అని చెప్తారు. మనలో కూడా Atlas అనే ఒక మణిపూస ఉంది. అది ఆధారంగానే ఈ పైనే ఉండే బుర్ర కాయ అంతా కూడా నిలబడి ఉంటుంది. ఇది మన గోళము. ఆ గోళమును అది మోస్తూ ఉంటుంది అన్నమాట. మనం కుర్చీలో కూర్చుంటే, కుర్చీ మనల్ని ధరించింది కదా! ప్రతిదాన్ని ఎక్కడ ఏది భరించినా ఆ భరించే తత్త్వం భగవంతుడిగా భావన చేసుకోవాలి. భరించి, ధరించి ఉండటం భగవంతుడిగా భావం చేసుకోవాలి అనేది ఈ శ్లోకంలో ఉండే నామానికి అవగాహన.

330 అచ్యుతః

అచ్యుతుడు అంటే పడని వాడు, పొరపాటు పడని వాడు, చ్యుతి అంటే ఓటమి లేనివాడు, నాశనము లేనివాడు, తరగని వాడు, జారిపడిపోవటం, తప్పులు చేయడం ఇటువంటివన్నీ లేనివాడు అని. అంటే ఇవి ఎవరిలో ఐతే ఉండవో, వారియందు దివ్యత్వం బాగా ఉంటుంది. ఇవి ఎవరి యందు ఎక్కువ ఉంటూ ఉంటాయో వారి యందు దివ్యత్వం బాగా తక్కువ ఉన్నట్టు మనము భావన చెయ్యాలి. ఒక్క భగవంతుడు మాత్రమే ఎట్టి పరిస్థితుల్లోనూ మరపు లేనివాడు, పొరపాటు పడనివాడు, జారి పడనివాడిగా మనము భావన చేసుకోవాలి. మనలో పొరపాటు పడటం, జారి పడటం, మర్చిపోవడం, తెలివి తక్కువ పడటం, ఒకదానికి ఒకటి చేయడము, ఒకదానికి ఒకటి మాట్లాడటం, ఇటువంటివన్నీ జరుగుతున్నప్పుడు మనం దివ్యత్వానికి బాగా దూరంగా ఉన్నట్లు అవగాహన చేసుకోవాలి. పదార్థము బాగా పెరిగి పరమార్థం మనలో బాగా తగ్గడం వలన అలా జరుగుతుంది. అందుకని భగవంతుని యొక్క అవతారములకి పొరపాటు ఉండదు. భగవంతుని యొక్క పరిపూర్ణమైన అవతారాలు మనకి దశావతారాలుగా చెప్తారు. ఈ అవతారాలలో అన్ని పనులు జగత్ కళ్యాణమునకే ఉంటాయి. అవతారములు కాక హరి కళలు అని కొన్ని ఉంటాయి హరి కళలు అంటే కొంత భగవంతుని యొక్క తత్వము ఒక వ్యక్తి యందు బాగా పనిచేసి అప్పటికి అప్పుడు తాత్కాలికంగా కొంత మంచి జరగడం! అవతారముల యొక్క కథలు మనకి యుగయుగముల వరకు ప్రచోదనం కలిగించి, మనల్ని సద్బుద్ధి యందు ఉంచి స్ఫూర్తి కలిగించేవిగా, ప్రేరణ కలిగించేవిగా ఉంటాయి. అవి మనకి రామావతారము, కృష్ణావతారము, బుద్ధ అవతారము ఇట్లా మనకి గోచరిస్తూ ఉంటాయి. ఈ అవతార తత్వాలలో పొరపాట్లు కనిపించవు. ప్రేరణ యుగముల తరబడి ఉంటుంది. స్ఫూర్తి కలిగి జాతిలో శాశ్వతముగా భూమి మీద, వారి వలన ఒక దివ్యమైన ప్రేరణ నిలిచి ఉంటుంది. అలా కాకుండా కొంతమంది అప్పటికప్పుడు తాత్కాలికంగా కొంత మంచి జరగడానికి, అంటే, అంత పరిమాణం లో కాకుండా తక్కువ పరిమాణంలో హరి కళ ఉంటుంది. హరి కళ ఉన్నచోట, ఇంత పరిపూర్ణమైన అచ్యుతత్వం కనిపించదు. ఒకటి అరా, పొరపాట్లు కనిపిస్తాయి. మనము భారతం లాంటి గ్రంథం తీసుకున్నట్లయితే, అందులో కొంతమంది ధర్మాత్ములు పొరపాటు పడ్డ సన్నివేశాలు కనిపిస్తూ ఉంటాయి. కాబట్టి అసలు పొరపాటు లేకపోవడం అనేది ఒకటి, కొద్దికొద్దిగా పొరపాటు ఉండటం ఒకటి. అంటే మూడు వంతులు బాగుంటుంది ఒక వంతు బాగుండదు కొంతమందిలో.

ఇంకొంతమందిలో రెండు వంతులు బాగుంటుంది, రెండు వంతులు బాగుండదు. ఇంకొంతమందిలో మూడు వంతులు బాగుండదు, ఒక వంతు బాగుంటుంది. దీన్నిబట్టి మనము ఏం లెక్క వేసుకోవాలంటే నాలుగు పాదాల దివ్యత్వం ఉన్నదా అంటే అది అవతారము. మూడు పాదాలు దివ్యత్వము ఉంటే అది హరి కళ. రెండు పాదాలు దివ్యత్వము ఉండేవాళ్ళు మామూలు మనుషులు. ఒక పాదం ఉండే వాళ్ళ కారణంగా చాలా గొడవలు జరుగుతూ ఉంటాయి సంఘంలో. అవేమీ లేవనుకోండి వాళ్ళు కంటకులుగా ఉంటారు. మనకి భగవత్ తత్వము ఇతరులలో నశింపనిదిగా, ఇతరులకి స్ఫూర్తిని ఇచ్చేదిగా, ఇతరులకు ప్రేరణ ఇచ్చేదిగా అందరిలో గమనించము. కొంతమందిని చూస్తే ఆనందం వేస్తుంది. కొంతమంది వెంటపడి వాళ్ళ కోసం పడి కాపులు కాయము? మహాత్ముల దర్శనం కోసం, వారి యొక్క చూపుల కోసము మనము చాలా ఆరాటపడుతూ ఉంటాము. కారణం ఏమిటయ్యా అంటే, వారిలో ఉన్న పారపాటు లేమి. ఎప్పుడూ పారపాట్లు చేస్తున్నారనుకోండి వాళ్ళ దగ్గరికి ఎవరు వెళ్తారు? పది సలహాలిస్తే అందులో 9 సలహాలు పనికి రాలేదనుకోండి రారు కదా. పది మంచి మాటలు చెప్తే అందులో ఒకటి కూడా పనికి రాలేదు అనుకోండి, రారు కదా! ఏదో అక్కడ ఉండబట్టి కదా వెళ్తూ ఉంటారు మనుషులు. ఏమిటయ్యా అంటే పారపాటు పడని తత్వము! ఏ మాట అయితే ఒక పెద్దాయన దగ్గర విన్నప్పుడు మనకి క్షేమము కలుగుతుందో, రక్షణ కలుగుతుందో, వృద్ధి కలుగుతుందో, అది అంతా కూడా ఆ ఎదుటి వ్యక్తిలో ఉన్న అచ్యుతత్వంగా మనము ఆరాధన చేసుకోవాలి. జ్వాలాకూల్ మహర్షి 'ఎదుటి వ్యక్తి నీకు ఇచ్చిన సలహాని, నీ బుద్ధితో కూడా ఆలోచన చేసి, నీకు సరిపడింది అని అనిపించినట్లయితే నువ్వు అప్పుడు పరిపూర్ణమైన విశ్వాసముతో దానిని ఆచరించచ్చు. అలా కానప్పుడు నీలో ఈ తత్వం పెరగదు' అని చెప్తారు. మనము పారపాటు పడతామేమో అని కదా ఇంకొకళ్లను మనం సలహా అడుగుతాము. అడిగిన సలహా పుచ్చుకొని పనిచేసుకుంటూ ఉన్నాం అనుకోండి. నీ అంతట నువ్వు ఎప్పుడు ఆలోచించగలుగుతావు? అందుకని జ్వాలాకూల్ ఏం చెప్తారంటే 'అడిగిన సలహాకి పరిపూర్ణమైన గౌరవము ఇవ్వు. ప్రాధాన్యత ఇవ్వు. భక్తి ప్రపత్తులతో దానిని ఆచరణ చెయ్, కానీ దాని గురించి నువ్వు కూడా ఆలోచించు. నువ్వు ఆలోచించకుండా అతడి నెత్తి మీద పెట్టుకు కూర్చుంటే, ఏనాడు నువ్వు స్వయంసమృద్ధి సాధించుకోగలుగుతావు? నువ్వు ఎవరిని కలవాలనుకున్నావో, ఆ మనిషి అక్కడ లేడనుకో! అంటే ఊళ్లో లేకపోవచ్చు, లేకపోతే శరీరంలో కూడా లేకపోవచ్చు. అప్పుడు ఏం చేస్తావ్? అందుకని ఒకరి దగ్గర సలహాలు, మనము అందుకుంటున్నప్పుడు, దాన్ని గురించి మనం కూడా కొంత విచక్షణ చేసుకుంటూ ఉంటే, ఏదో ఒక రోజున, అతని వలె నీవు కూడా ఆలోచించగలిగిన శక్తి

సంపాదించుకోగలిగినట్లయితే, అప్పుడు అతనిమీద ఆధారపడ్డట్లే చాలామంది నీమీద ఆధారపడ్డానికి అవకాశం ఉంటుంది. ఈ విధంగా అనుస్యూతంగా ప్రజలకి చక్కటి మార్గంలో నడిపించే వాళ్ళు భూమ్మీద ఉండడానికి అవకాశం ఉంటుంది. అది మన ఋషిప్రోక్తమైన మార్గము', అని చెప్తారు జ్వాలాకూల్ గారు. అంటే సలహాలను అందుకోవడం, వాటిని ఆచరించటం తోపాటు ఆ సలహాలు వారు ఎలా ఇచ్చారు, లోతులు ఏమిటి అని విశ్లేషణ చేయడం వలన, నెమ్మదిగా మనలో కూడా అవగాహన పెరుగుతుంటుంది. పెరగటంచేత, రేప్పొద్దున ఒక నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు, కొన్నాళ్ళు వాళ్ల దగ్గర మీరు ఉన్నారు కదా, అందుకని మిమ్మల్ని అడుగుతున్నాను, ఏదన్నా చెప్పండి అంటే, అబ్బే నాకు తెలియదండి అనే పరిస్థితి ఉండదు. ఎందుకంటే, ఆ అయస్కాంతంతో నువ్వు చాలా సన్నిహితంగా మెలగడం వల్ల నీకు కూడా అయస్కాంతీకరణం జరగాలి. దాన్ని Discipleship అన్నారు జ్వాలాకూల్ గారు. ఆయన ఇచ్చిన సలహా పట్టుకుని వెళ్ళిపోవటం ఒక పద్ధతి, అలా సలహా ఇవ్వడానికి ఆయనలో ఉన్న బలం ఏమిటి? అటువంటి బలం మనలో కూడా ఉంది కదా! కాకపోతే మనం దాన్ని ఇనప పెట్టెలో పెట్టి తాళం వేసేశాము. దాన్ని బయటకు తీయాలి. అది బయటికి తీసేవాడు గురువు! కాబట్టి ఆయన దగ్గర మనకి ఉండవలసినది సంసిద్ధత! సంసిద్ధత ఉంటే మన దగ్గర నుంచి ఆయన అది తొందరగా బయటికి తీస్తాడు. 'నా వలెనే నీవు కూడా అనేది' కావాలి. ఎప్పటికీ ప్రపంచంలో శాశ్వతంగా మనము dependent గా ఉండడము సద్గురువులు కోరుకోరు. వాళ్ళు మనలో కూడా బుద్ధి ప్రచోదనము జరిగి, మనలో కూడా చైతన్యమునకు ఒక పరిపూర్ణమైన మేలుకొలుపు కలిగి, తద్వారా ఆయన వలె మనమూ పది మందికి ఉపయోగపడేటట్టుగా తయారైనందుకు సంతోషిస్తారు. ఏ తండ్రైనా కొడుకు తనంతటివాడు ఐతే, తనను మించినవాడు అయితే ఎక్కువగా సంతోషిస్తాడు. ఎంతసేపూ తన మాట వింటూ, తండ్రికి 80 ఏళ్లు, కొడుకుకి షష్టిపూర్తి వచ్చే సమయానికి కూడా, ఇంకా తన కొడుకు తండ్రిని నాన్నా షష్టిపూర్తి చేసుకోనా వద్దా, అని అడుగుతున్నాడనుకోండి లాభం ఏమిటి? సృష్టిలో మనము జీవుల యొక్క పెరుగుదల చూసినట్లయితే ఒకదాని లోంచి ఒకటి పుట్టి, అంతకు ముందున్న దాన్ని అది Replace చేస్తుంది. ఒక మామిడి చెట్టులోంచి ఒక మామిడి పండు పుట్టి, అందులోంచి మామిడి టెంక వస్తే అందులోంచి ఒక మామిడి చెట్టు తయారవ్వాలి కదా! ఎప్పుడూ మామిడి పండుగానే ఆ మామిడి చెట్టుకే ఉండటం అనేది సృష్టి ధర్మము కాదు. కాబట్టి మనలో కూడా పారపాట్లు ఉంటే, పారపాట్లు చేయని వాళ్ళ దగ్గర శుశ్రూష చేయాలి. గురువుల దగ్గర వశించి ఉండే వాళ్ళని అంతేవాసులంటారు. వాళ్లకు నచ్చే పద్ధతుల్లో వీళ్లు జీవించడం వలన, వాళ్లని అంతరంగంలోనికి

అంగీకరించడం చేస్తారు గురువులు. అలా అంగీకారం తర్వాత, అంతరంగము నుండి అంతరంగంలోకి ప్రచోదనానికి కావాల్సిన ప్రసారం అంతా జరుగుతుంది. బహిరంగంగా ఎంత జరుగుతున్నా అంతరంగంలో, ఎవరి సలహా సంపత్తి మేరకు మనము జీవిస్తున్నామో, వారి యొక్క హృదయము రంజించే పద్ధతిలో మనం జీవించినట్లైతే వారి హృదయము నుండి మన హృదయమునకు అందే విషయం అది. అది మాటల ద్వారా అందదు, బయట చేష్టల ద్వారా అందదు. అది, from heart to heart. హృదయము నుండి హృదయమునకు అందే విషయము. ఎట్లా అందుతుంది అంటే, హృదయము రంజించినప్పుడు అందుతుంది. హృదయం రంజించాలి అంటే వారికి అత్యంత హితమైన విషయములు, అంటే ఇష్టమైన విషయములు, వారికి ఏవి అతి ప్రాధాన్యమైన విషయములుంటాయో అవి మనం ఆచరించి చూపించటం వలన వారు సంతోషిస్తారు. నీకేమైనా ఒక ముఖ్యమైన పని ఉన్నదనుకోండి ఆ పని చేసే వారు దొరికినప్పుడు వారి యందు నీకు సంతోషం కలుగుతుంది. కదా. అలా కానప్పుడు ఎన్ని చేసినా సంతోషం కలగదు. అందుకని పెద్దవారిని సంతోషపెట్టే పద్ధతుల్లో, పెద్దవాళ్ళయందు మనము జీవిస్తాం. అదీ గురుదక్షిణ అంటే! అంటేకానీ గురుదక్షిణ అంటే వాళ్లకి, ఒక జరీ పంచా ,కండువా తీసుకొచ్చి, ఒక తమలపాకు పెట్టి, అరటిపండు పెట్టి, పెట్టటం కాదు. ఏదో కొంత డబ్బులివ్వటం కాదు, లేకపోతే మనకి ఉంది కదా అని, ఒక ఇల్లు ఇచ్చేయడం కాదు. ఏ ప్రణాళిక కోసము ఆయన దిగివచ్చారో, ఏ కార్యాల కోసం ఆయన దిగి వచ్చారో, ఆ కార్యములు పరిపూర్తి చేయడం యందు నీ యొక్క శ్రద్ధ, ఎక్కడ ఉంటుందో అక్కడ హృదయము రంజిస్తుంది. రంజిస్తే ఏమవుతుంది అక్కడి నుంచి ఇక్కడికి పారుతుంది. అదీ భారతీయ సాంప్రదాయము. అందుకని జ్వాలాకూల్ గారు గురువు యొక్క బోధలను ప్రతినిత్యం చదువుకోమన్నారు. నువ్వు నమ్మిన గురువు యొక్క బోధనలు నువ్వు ప్రతినిత్యం చదువుకోవాలి. నువ్వు నమ్మిన గురువు నీకు ఇచ్చిన సాధనను ప్రతినిత్యం చేసుకుంటూ ఉండాలి. అంటే గురువు యొక్క బోధన, గురువు ఇచ్చిన సాధన, గురువు ఇచ్చిన కార్యక్రమముల యందు మన యొక్క సమర్పణ. ఈ మూడు ఉంటే గురువు ఆశ్రమంలోకి రావడానికి మూడు తలుపులూ తెరుచుకుంటాయి అని చెప్తారు. ఒక తెలిసినవాడి దగ్గర ఒక తెలియనివాడు చేరినప్పుడు, ఈ తెలియని వాడు ఏదో రోజు ఆ తెలిసినవాడుగా తయారవ్వాలి. ఆ తెలిసినవాడుగా తయారవ్వాలి అంటే ఈ విధమైన సాధన ఉండాలి. గురువు చెప్పింది, చెప్పినట్టు చేసుకోవాలి. ఒకటి ఏదో సాధనగా నీకు వాక్యం ఇస్తాడు. దాన్ని గురు వాక్యము అంటారు. రెండవది, గురువు చేసిన బోధలు ఉంటాయి. అవి మాటిమాటికీ గుర్తు తెచ్చుకుంటూ ఉండాలి. మూడవది గురువు చేపట్టిన కార్యక్రమాలు, సంఘపరమైన కార్యక్రమాలలో నీ

వంతు, నీవు సమర్పణ చెందాలి. ఈ మూడూ జరిగితే గురువు హృదయంలో ఆనందం కలుగుతుంది ఆ శిష్యుని గురించి. తద్వారా గురువుకి, శిష్యుడికి, అంతరంగంలో ఒక సత్సంబంధము ఏర్పడుతుంది. అది బహిర్గతంగా తెలిసే విషయం కాదు. ఆ విధంగా జరిగినప్పుడు, అక్కడి నుంచి(గురువు నుండి) ఇక్కడికి సరఫరా ఉంటుంది, ఇక్కడ నుంచి బయటికి సరఫరా ఉంటుంది. పనులు జరిగిపోతూ ఉంటాయి, పెద్ద గొడవ, హంగామా, హడావిడి ఏవీ ఉండవు. ఈ లోపల మనిషి, తెలియని తనమునుంచి తెలిసినతనములోకి పెరుగుతాడు. పొరపాట్లు అనేవి తక్కువ జరుగుతూ ఉంటాయి. చాలా బాగా సాధన చేస్తున్నాం కానీ పొరపాట్లు ఎక్కువ జరుగుతున్నాయిట అంటే, సాధన జరగట్లేదు అని అర్థం! రెండూ ఉండవు. పొరపాట్లు ఉన్నచోట సాధన లేదు అని అర్థం. సాధన ఉన్నచోట్ల పొరపాట్లు ఉండవని అర్థం. సాధన పెరుగుతూ ఉంటే పొరపాట్లు తగ్గుతూ ఉంటాయి. మర్చిపోయానండీ అనేది ఉండదు. పొరపాటు పడ్డానండీ అనేది ఉండదు. చేసిన పనులలో విఫలమవ్వడం అనేది ఉండదు. ఉండదంటే తగ్గుతూ వస్తుంది. అసలు ఉండకపోవటం అనేది అవధూత తత్వానికి ఉంటుంది తప్ప, మిగతావాళ్లందరికీ ఏదో కాస్త అటు ఇటుగా ఉంటుంది, నూటికి నూరు పాళ్ళు, నూటికి డెబ్భై ఐదు పాళ్ళు, నూటికి అరవై పాళ్ళు, నూటికి పాతిక పాళ్ళు, ఇట్లా ఈ పొరపాట్లు పడకపోవడమనేది ఉంటుంది. కాబట్టి మనం ఈ అచ్యుతత్వాన్ని మనలో పెంచుకుంటూ ఉంటే మన ఆహార వ్యవహారాదులలో, నిద్ర విషయంలో, మాట విషయంలో, అన్ని విషయాలలోనూ మన యందు పొరపాట్లు జరగడం అనేది తగ్గుతూ రావాలి. పెరుగుతూ రాకూడదు. పెరుగుతూ వస్తే చ్యుతులమైనట్లు లెక్క. భగవంతుడి నామాలలో ఈ అచ్యుత నామాన్ని ఒక సాధనగా తీసుకుని చేసుకుంటూ ఉంటే నెమ్మదిగా మనకి పరిపక్వ స్థితి వచ్చి, అక్కడి నుంచి మనకి పరిపూర్ణ స్థితికి రావటానికి అవకాశం ఏర్పడుతుంది. అట్లా పెరిగి పెరిగి పెరిగి, ఒక సామాన్య మానవుడు మహాత్ముడు కాగలడు. ఆ తర్వాత అతనిలో హరికళ బాగా పెరుగుతూ ఉంటే, వాహికగా తయారవ్వచ్చు భగవంతుడికి. అట్లా భగవంతుడికి పరిపూర్ణమైన వాహికలుగా భూమి మీద నడిచిన వాళ్ళు, మైత్రేయాది మహర్షులు. అందుకని వాళ్ళని మనము ధ్యానం చేసుకుంటూ ఉంటాం. ఎందుకని చేసుకుంటూ ఉంటాం అంటే వారి వలెనే మనం కూడా, దివ్యత్వమైన స్థితిలోకి ఉద్ధరింపబడటానికి. అందుకని ' అచ్యుత 'అనే నామానికి అర్థం ఏమిటంటే, there is no fall, there is no slip. మాటలో, జారుడు ఉండదు. చేతలో జారుడు ఉండదు. మాటల వలన పడిపోవటం ఉండదు. మాటల వలన వైఫల్యం చెందటం ఉండదు. చేస్తూ ఉండడం ఉంటుంది, చేయడంలో ఎక్కువ బాగుండడం ఉంటుంది. రోజురోజుకి రోజురోజుకి,

అన్ని రంగముల యందు మన నుండి వృద్ధి కనపడాలి. ప్రతి రంగంలోనూ! ఎందుకంటే అదంటూ లోపల ఉంటే, నీ యొక్క స్ఫూర్తి పెరగటం వలన, నువ్వు ఎక్కువ బాగా చేస్తావ్. అట్లా చేసుకుంటూ వెళ్తుంటే ప్రధితః అనే నామంలోకి వస్తాం.

331 ప్రధితః

ప్రధితుడు అంటే తెలిసినవాడు అని అర్థం. భగవంతుడి కన్నా తెలిసినవాడు ఎవరూ లేరు కదా! సమస్త విషయములయందు ఎరుక గలగినవాడని కదా అర్థం. మన శరీరంలో ఎక్కడ ఏ నొప్పి కలిగినా మనకు ఎలా తెలుస్తుందో, అలాగే సృష్టిలో ఉన్నది ఒకే ఒక చైతన్యము గనక ఆ చైతన్యంలో భాగంగా ఈ మొత్తం అంతా ఉన్నాం కాబట్టి, ఈ మొత్తంలో ఆయనకు తెలియనిది అంటూ ఏమీ ఉండదు. మన విషయంలో మనకి చాలా తెలియని ఉన్నాయి. ఆయన విషయంలో ఆయనకు తెలియనివి అంటూ ఏమీ ఉండవు. అచ్యుతత్వం అనేది సాధన చేసుకుంటూ వెళ్తూంటే, మనలో పారపడడం అనేవి తగ్గుతూ వస్తూ ఉంటే, వైఫల్యాలు చెందటం అన్నది తగ్గుతూ వస్తూ ఉంటే మనలో తెలివి పెరుగుతూ ఉంటుంది. అది మన తెలివి కాదు, భగవంతుని తెలివి. భగవంతుని తెలివి మనలో పెరగటం వల్ల అంతకుముందు ఉన్న చిక్కు సమస్యలకి పరిష్కారం కనిపిస్తుంది. చిక్కులు వేసుకోవడము కాకుండా పడ్డ చిక్కుల నుంచి నెమ్మదిగా బయటపడ్డంగా ఉంటుంది జీవితం. ఇక చిక్కులు పడకుండా ఉన్న చిక్కులు ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, ఒక్కొక్కటి తీసుకోవడం గా ఉంటుంది. మమూలుగా మన జీవితం ఒక చిక్కు తీయబోయి10 చిక్కులు వేసుకోవడం గా ఉంటుంది. చిక్కుల్ని పెంచుకోవడం అంటే కర్మ పెంచుకోవటమే! పని పెంచుకోవడం. చిక్కులు తగ్గించుకోవడం అంటే ఉన్న కర్మని పెంచక ఇదివరకు ఉన్న కర్మ అంటే సంచిత కర్మని నెమ్మదిగా ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, పూర్తి చేసుకుంటూ వెళ్ళడం. శిథిలం అయిపోతూ ఉంటుంది నెమ్మదిగా, చాలా భాగం. తనని బంధించిన కర్మలయందు తను చ్యుతిలో ఉంటాడు, నిలబడి ఉంటాడు. దివ్యకర్మలో భాగంగా తను జీవిస్తూ ఉంటాడు తప్ప, వ్యక్తిగతమైన కర్మ లేకుండా ఉండే స్థితి వస్తుంది. అది పరమగురువులకి ఉన్నస్థితి. వాళ్ళకి వ్యక్తిగతంగా ఏ కర్మా లేదు. దివ్య కర్మలో భాగంగా వాళ్ళు జీవిస్తూ ఉంటారు. అట్లాగే ఈ మొత్తం సృష్టంతా కూడా, ఈ సృష్టిలో భగవంతుడికి కర్మ ఉండదు. సహజంగా ఆడుకునే పిల్లవాడు ఎప్పుడు వాడికి విసుగు పుడితే అప్పుడు అవన్నీ మూసేస్తాడు. మనకి విసుగు పుడితే మనం ఏది మూసేయగలం చెప్పండి. ఒక ఇల్లు కడుతున్నాం, సగంలో విసుగు పుట్టింది, మూసేయగలమా? పెళ్ళాం పిల్లలు ఉన్నారు, సగంలో విసుగు పుట్టింది,, మూసేయగలమా? వ్యాపారం మొదలుపెట్టాము, సగం వరకు వచ్చిన తరువాత, విసుగు పుడుతోంది, మూసేయగలవా? ఉద్యోగం చేస్తున్నావు, సగం వచ్చిన తర్వాత విసుగ్గా ఉంది కాబట్టి ఇక మానేస్తావా, మానేయగలవా? నువ్వు చేస్తున్నదేదైనా

నువ్వు అట్లా వెంటనే వదిలేయగలవా? అంటే బాధ్యత లేదని కాదు, బంధముల నుంచి బద్ధుడవై ఉన్నావా లేక ముక్తుడువై ఉన్నావా? శ్రీకృష్ణుడు ఎప్పుడూ ముక్తుడిగా జీవించాడు. శ్రీరాముడు ఎప్పుడూ ముక్తుడిగా జీవించాడు. ఒకటే బంధం ఆయనకి, ధర్మంతో బంధం. ఇంతకు మించి బంధాలు లేవు. అటువంటి స్థితికి ఎదగడానికి కారణమేంటయ్యా అంటే పారపాట్లు చేయకపోవడమే! చేయకపోవటంలో అసలు ఏం చేయాలి, ఏం చేయకూడదు అనే తెలివి పెరుగుతుంది. మనం ఎంతసేపూ ఏం చేయాలి, ఏం చేయాలి అనే తెలివి పెంచుకోకుండా బాగా పూజాదికార్యక్రమాలు, అభిషేకాలు, హోమాలు, పుణ్యక్షేత్ర దర్శనాలు, దేవాలయాల చుట్టూ తిరుగుతున్నాం అనుకోండి. ఏదో ఒక రోజున మనిషికి లోపల పుట్టాలి, 'ఇన్ని తిరుగుతున్నాం కదా మనలో ఏమైనా మార్పు వచ్చిందా' అని. ఇట్లాగే ఉన్నామా? ఇట్లాగే ఉన్నామంటే ఇవన్నీ ఎందుకు తిరిగాము? ఇంత రొష్టు ఎందుకు పడ్డాం? ఇన్ని క్రతువులు ఎందుకు చేశాం? చేయటం వల్ల మార్పు వచ్చిందా? ఇవన్నీ కూడా సాధన చేసుకునే వారికి ఫలించే విషయాలు తప్ప, పూజ , క్రతువు, హోమము, తన్నుతాను ఉద్ధరించకుందాం అనే భావన లేనివాళ్లకి ఏవీ పనికిరావు. మనల్ని మనము ఉద్ధరించుకోవటం వేరు, మన గురించి మనం గొప్పగా భావించుకోవడం వేరు. మనని మనం ఉద్ధరించుకోవటం తగ్గించి, మన గురించి గొప్పగా భావన చేసే ఒక జారుడు బల్లలోకి మనము ఆధ్యాత్మిక మార్గం అనే పేరున జారిపోయే అవకాశం ఉంది. అందుకని చేసే పనుల్లో మనకి తక్కువ పారపాట్లు ఉండాలి. పనులు గాని, మాటలు గాని, తిరుగుడు గాని, ఏమి చేసినా పారపాట్లు తక్కువగా ఉండాలి. అది నెమ్మదిగా దాటుకుంటూ వస్తే, తెలివి పెరుగుతుంది. తెలివి పెరగటం అంటే మనలో జ్ఞానం వస్తున్నట్టు. అది ఇంకొకడిని మోసం చేసే తెలివి కాదు. 'అందరిలో ఉన్న ఒకే తెలివిగా ఉన్నది భగవంతుడు' అని తెలియటం తెలివి! భగవంతుడి యొక్క అస్తిత్వాన్ని తెలుసుకున్న తెలివి. అది పెరగటం వల్ల ఏమవుతుందంటే, మనలో చైతన్యము పూర్తిగా నిండి ఉంటుంది, పరిపూర్ణంగా చైతన్యవంతులమై ఉండటం వలన ఎప్పుడూ అప్రమత్తతతో ఉంటాము. మేలుకుని ఉండే స్థితిలో ఉంటాము. అందరి తెలివి ఈ తెలివిలో భాగంగా ఉంటుంది. అందుకని ఒక మహాత్ముడి దగ్గరికి ఎవరైనా వెళ్తే, ఆయన భగవంతుడి తెలివిలో ఉంటాడు కాబట్టి, తన దగ్గరకు వచ్చి తెలివితేటలు ప్రదర్శిస్తున్న వాళ్ళ తెలివి అంతా కూడా అందులో భాగమే కాబట్టి, వచ్చినవాడు ఎటువంటి చిన్న తెలివితో వచ్చాడో చూస్తాడు. అందుకనే వచ్చిన వాళ్ళు ఎందుకు వచ్చారు, దేనికి వచ్చారు, ఏ ఉద్దేశంతో వచ్చారు అవన్నీ కూడా బాగా స్పష్టంగా, విశదంగా తెలుస్తుంది. కారణం భగవంతుడి తెలివిలో వారు జీవిస్తుంటారు కాబట్టి. ప్రధితః అంటే అందరిలో ఉన్న తెలివి. మామిడి చెట్టుకు ఒక తెలివి ఉంది. అది

వసంతఋతువు ముందు పువ్వు కట్టడం, మామిడిపళ్ళు ఇవ్వడం. దానికి ఆ తెలివి లేకపోతే ఎప్పుడో December లో మామిడికాయలు రావాలి. మనకి తెలివి ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియదు కదా! కానీ మామిడి చెట్టు తెలివి మామిడి చెట్టుది! సూర్యోదయానికి స్పందించడం ఉంటుంది. మనకేది అది? సూర్యోదయానికి పువ్వు, చెట్లు, కాయలు ఇలా మొత్తం సృష్టి అంతటికీ కూడా చాలా స్పందన ఉంటుంది. సూర్యుడు వస్తున్నాడు అంటే ఉత్సాహం వస్తుంది జీవకోటికి. మనకి రాదు కదా. నిద్రపోతే బాగుండు అనిపిస్తుంది. అంటే అక్కడ చైతన్యానికి బాగా బిరడాలు పెట్టేశాం అని అర్థం. మూతలు పడిపోయాయి, మాయ అనే పొరలు పడిపోయాయి. అందుకనే తెల్లవారుజామున లేవాలి అంటే కొంత మనకు ఇబ్బందిగా ఉంటుంది. అట్లాగే జంతువులకు వాటి తెలివి వాటికి ఉంది. ఆపదని తొందరగా గుర్తించగలవు జంతువులు. ఎందుకట్లా ఉన్నది? వాటినవి రక్షించుకుంటూ ఉంటాయి. పిల్లి తెలివి పిల్లిది, ఎలుక తెలివి ఎలుకది, పాము తెలివి పాముది. అన్ని జంతువులు వాటి తెలివితేటలు వాటికి ఉన్నాయి. అంటే వాటివి అని అనుకోవు కాబట్టి వాటి నుంచి ఈ తెలివి భగవంతుని తెలివిగా పనిచేస్తూ ఉంటుంది. అలాగే మనలో తెలివి కూడా భగవంతుడి తెలివిగా మళ్ళా పని చేయాలి. అంతే తప్ప తెలివి మనది అనుకోకూడదు. తెలివి మనది అనుకున్న వాడికి గోదావరి నదిలో ఒక గుండు చెంబు నీళ్లు తీసుకున్నట్టుగా అయిపోతుంది. మొత్తం నదంతా నీళ్లు ఉంటే గుండు చెంబులోకి తీసుకోవడం వలన అంత తెలివే అయిపోతుంది. ఏదన్నా, మన తెలివితేటలు కాకుండా, భగవంతుని ప్రార్థన చేసుకోవడం వలన, మనలో పెరిగే తెలివి ఇంకోరకంగా ఉంటుంది. ఆ తెలివిలో మిగతా తెలువులన్నీ కూడా తగ్గి ఉంటాయి. అలా కృష్ణుడి తెలివి, రాముడి తెలివి ప్రధానంగా మనకి గోచరిస్తుంటాయి. అవతార పురుషులు, ఆదర్శ పురుషులు, మనకి తెలిసినవరకు వాళ్ళిద్దరే! వారి జీవితాన్ని బాగా తరచి, చదువుకోవాలి. వాళ్ళు ఎట్లా ప్రవర్తించారు, ఏ విధంగా చేశారు అని. వాళ్ళకంటూ వ్యక్తిగతమైన ప్రత్యేకమైన తెలివిని ఎక్కడ చూపించలా! వ్యక్తిగతమైన తెలివి మిగతావాళ్ళందరూ ప్రదర్శిస్తారు. నిజంగా తెలిసినవాడు తన తెలివిని నమ్ముకోడు. తనకంటూ తెలివి ఎక్కడుంది లేదు కదా. ఆయన తెలివే మనలో వెలుగుతుంటే, మన తెలివని మనం మోసపోతాం. ఆయన ప్రాణమే మనలో, ఈ శరీరంలో తిరుగుతుంటే మన ప్రాణమని అనుకుంటూ ఉంటాం. ఆయన సంకల్పంలోంచి పుట్టిన సంకల్పంలోంచి పుట్టిన చిల్లర సంకల్పాలు, మన సంకల్పాలుగా మనం అనుకుంటూ ఉంటాం. ఇది నా ఆలోచన అంటాం కదా! నీ ఆలోచన కాదు. నీ ఆలోచన అయితే, నువ్వు అనుకున్నప్పుడు రావాలి. ఆలోచన నువ్వు అనుకున్నప్పుడు రాదు, అది వచ్చినప్పుడు నీకు తెలుస్తుంది. ఆలోచనలన్నీ కూడా

మనం అనుకున్నప్పుడు వస్తాయా, అవి వచ్చినప్పుడు మనం తెలుసుకుంటాం. అవి వచ్చినప్పుడు మనం తెలుసుకుంటే మనది ఎట్లా అవుతుందండీ? Current వచ్చినప్పుడు mic పని చేస్తూ ఉంటే, mic నా current అనగలదా? మనకందరికీ ఆలోచనలు time కి రావు. కొంతమందికి పని అయిపోయాక వస్తాయి ఆలోచనలు. అదేంటది? నీ ఆలోచన అయితే, నువ్వు ఎప్పుడు చెప్తే అప్పుడు రావాలి కదా! నీ పని వాడు, నీ car నువ్వు తుడిచిన తర్వాత వచ్చాడనుకొండి. తుడిచారా అని వాడు అడిగాడు అనుకోండి. నీకు అవసరానికి ముందు వచ్చి, అవసరానికి తర్వాత వచ్చే , అవసరానికి రానిది నీది ఎట్లా అవుతుంది? అందుకని చాలా తెలివైన వాళ్ళు అందరూ కూడా పెద్ద తెలివి ఉన్న వాళ్ళు కాదు. వాళ్ళ తెలివి, పరా పశ్య తెలివి అది. మహాత్ముల తెలివి అట్లా ఉండదు. భగవంతుడి తెలివి వాళ్ళ తెలివిగా ఉంటారు వాళ్ళు. అట్లా ఉంటారు కాబట్టే వాళ్ళ నుంచి అట్లాంటి కార్యాలు నెరవేరుతూ ఉంటాయి. అగస్యుడంతటివాడిని శ్రీరామచంద్రుడు ఇంకొక సంవత్సరం అరణ్యవాసము ఉంది, ప్రశాంతమైన ప్రదేశం ఏదైనా చెప్తే అక్కడ ఒక పర్ణ కుటీరం వేసుకుని ముగ్గురం ఈ సంవత్సర కాలము హాయిగా గడిపేస్తాము అని చెప్తాడు శ్రీరామచంద్రుడు. శ్రీరాముడు అడిగితే, అగస్యుడు కళ్ళు మూసుకుని భగవంతుడి తెలివి ఏమిటాని చూస్తాడు. రాముడు వచ్చింది దేనికోసం రావణవధ కోసం. అసలు రామాయణం రావణాసురుని వధకోసం. అతడిని సంహరించాలి. అందుకు దేవతల ప్రార్థనకు ఫలితంగా శ్రీరాముడు దిగి వచ్చాడు. 13 సంవత్సరాలు అరణ్యవాసం అయిపోయింది. 14వ సంవత్సరం ఎక్కడో అక్కడ వేసుకుని ఆ పని పూర్తి చేసుకుని వెళ్ళిపోతాను, అంటున్నాడు భగవంతుడు. అందుకు కాదు కదా వచ్చింది. అందుకని ఎక్కడ ఉంటే అవతారం యొక్క ప్రయోజనం నెరవేరుతుందో అక్కడ వేయిస్తాడు పర్ణశాల. చాలా ప్రశాంతంగా ఉంటుంది జనస్థానం అని. 14 వేల మంది రాక్షసులు ఉన్నచోట, ఒక పర్ణశాల వేస్తారండి ఆయనకి. చాలా బాగుంటుంది అని చెప్తాడు అగస్యుడు. వశిష్టుడిని ముహూర్తం పెట్టండి, శ్రీరామునికి పట్టాభిషేకం చేద్దాం అంటే వశిష్ట మహర్షి అంతటి వాడు ముహూర్తం పెడితే మన ముహూర్తాల లాగా అయిపోతే ఎట్లా? దేనికి ముహూర్తం పెట్టాడు వశిష్ఠుడు? రామావతార ప్రయోజనమునకు ముహూర్తం పెడతాడు తప్ప, రాముడు అక్కడ కుర్చీలో కూర్చోడానికి ముహూర్తం పెట్టడు. ఊర్లో వాళ్ళందరూ అనుకోవచ్చు వశిష్టుడి గురించి, ఈయనకు పాపం జ్యోతిష్యం తెలియదు, మనబోటివాళ్ళమన్నా బాగా పెట్టేవాళ్ళం కదా అని. చూడండి వాళ్ళ చూపు అంత దూరం వెళ్ళిపోయింది. రాక్షస వధకి ముహూర్తం పెడతాడు వశిష్ఠుడు. అట్లాగే అగస్యుడు! చూడడం అంటే అట్లా చూడాలి. ఎందుకు అట్లా చూస్తారంటే వాళ్లు భగవంతుడి తెలివిలో ఉంటారు.

భగవంతుడి తెలివి మనలో ఉండాలి అనుకోకండి! భగవంతుడు మనలో ఉన్నాడు అనుకోవడం కన్నా మనము భగవంతుడిలో ఉన్నాము అనుకోవటం శ్రేష్ఠం! భగవంతుని యందు మనం ఉన్నాము. మన హృదయంలో భగవంతుడు ఉన్నాడని భావన చేయటం ఒకటి, భగవంతుని హృదయంలో మనం ఉన్నాము అని భావం చేయటం ఒకటి. వాడిలో మనము ఉంటే safe! మనలో వాడు ఉంటే, వాడినెవడినో పట్టుకుని మనం తిరుగుదామనుకోవచ్చు. తెలివి మొత్తము భగవంతుడే! ఆ తెలివి అందరిలోనూ కొంచెం కొంచెం పని చేస్తుంటుంది. ఆ తెలివి పనిచేయడానికి కావలసింది ఏమిటంటే పవిత్రత! భావమునందు పవిత్రత పెరిగిన కొద్దీ, ఆ తెలివి పనిచేస్తూ ఉంటుంది. భావమునందు పవిత్రత తగ్గుతున్న కొద్దీ ఆ తెలివి పనిచేయడం తగ్గుతూ వస్తుంది. అందుకని పెద్దలు నీవు భావము నందు పవిత్రుడవై ఉండు అని చెప్తారు. ఉంటే, నీ నుంచి జరగవలసిన కార్యము నెరవేరడానికి అవకాశం ఉంటుంది. అలా కాకుండా మనం ప్రత్యేకంగా ఏదో మనం చేసేయాలి, మనం దున్నేయాలి, మనం పాడి చేయాలి, మన వల్ల ఈ సంఘం అంతా బాగు పడిపోవాలి, ఈ సంఘాన్ని మనం ఉద్ధరించాలి, అనే భావనలు అన్నీ కూడా కేవలము తెలియనితనం వల్ల ఏర్పడే భావాలు. తెలిసినవాళ్లు అట్లా భావించరు. వీళ్ళందర్నీ నేను బాగు చేస్తున్నాను అని అనుకోరు. నువ్వు ఎవరు బాగుచేయడానికి, భగవంతుడే బాగు చేస్తాడు. దానికి నువ్వు దోహదపడితే చాలు. దోహద పడకపోతే కూడా పర్వాలేదు. నీ నుంచి ఒక సత్కార్యము జరగకపోతే అది నీకు నష్టం తప్ప, కార్యానికి నష్టము కాదు. ఇంకొకరి నుండి జరుగుతుంది. అదే మాస్టారు ఎప్పుడూ చెబుతూ ఉండేవారు. మంచి పనులు నేను చెయ్యకపోతే ఆగవు , ఇంకొకరు వచ్చి చేస్తారు, నాకన్నా బాగా చేస్తారు అని చెప్తారు. మంచి పనుల్లో మనము చేరటము వలన, మనము పునీతులము అవుతామే తప్ప, మంచి పనికి మనమేదో చాలా ఉద్ధరణ చేసేసాము అనుకోకూడదు. ఎందుకంటే భగవంతుని ప్రణాళిక, భూమి మీద నిర్వర్తించబడుతూనే ఉంటుంది. అందులో నువ్వు చేరావా లేదా అనేది నీ ఇష్టం. గంగ పారుతోంది. ఆ ప్రవాహంలో చేరటం వలన గంగకేమీ పెద్ద మనం ఉపకారం చేసినట్లు కాదు. నిన్ను నువ్వు పునీతుని చేసుకోవాలంటే గంగలో దిగాలి. గంగలోకి దూకకూడదు. దిగితే, నీవు పవిత్రుడవు అవుతావు. దిగకపోతే మరీ మంచిది, గంగ పవిత్రత ఇంకా హాయిగా ఉంటుంది. నువ్వు దిగటం వల్ల గంగకు కొంచెం ఇబ్బంది, కానీ మళ్ళీ మార్చుకోగలదు. అందుకనే మంచిపనులు చేయాలి అనుకుంటే అహంకారం రావటానికి అవకాశం ఎక్కడుంది, ఆయన తెలివే మననించి పని చేస్తోంది కదా. శ్రీకృష్ణుడు అవతారంగా దిగివచ్చినవాడు. ఎన్ని కార్యాలు చేశాడో కృష్ణ అష్టోత్తరం చదువుతూ ఉంటే పెద్ద list వెధవలందరినీ చావగొట్టాడు. ఆ

సమయంలో అట్లా, అప్రయత్నంగా, చాలా, సునాయసంగా జరుగుతున్నట్లు ఉంటుంది ఆయన చేసిన కార్యాలు. ముందు plan ఏం లేదు. ఎందుకు లేదంటే, చోటులో ఉన్న తెలివితో తన తెలివి అనుసంధానం చేశాడు తప్ప, అంతకుమించి ఏమీ చేయలేదు. చోటుకి మనసుంది. చోటు మనసు, మనలో మనసుగా పనిచేస్తోంది. చోటులో ప్రాణము మనలో ప్రాణంగా పనిచేస్తోంది. చోటులో ఓంకారము మనలో ఓంకారంగా పనిచేస్తోంది. చోటులో తెలివి మనలో తెలివిగా పనిచేస్తోంది. చోటులో లేనిది మనలో ఏం లేదు. ఎప్పుడైతే మనము అని ఒకటి చూశామో, దాంతో మీరు ఇబ్బంది పడాలి తప్ప, తను ఇబ్బంది పడడు. ఎప్పుడు దేనిగురించి ఇది తనది, నాది అని అనుకుంటాడో, ఆ తనది , నాది అనుకునే వాడు ఆ భావన వలన తన్ను తాను బంధించుకుంటాడు. అటువంటి సందర్భంలో తెలివి తనది అనుకోవటం వలన తన తెలివితేటల వలన తన్నే మోసం చేసుకునే సందర్భాలు చాలా వస్తాయి. రావణాసురుడు తన తెలివి చూపిస్తూ ఉంటాడు, యుద్ధంలో. చాలా మంచి విషయం అది, మాటిమాటికి చెప్పుకోవచ్చు. ఏ రోజుకు ఆ రోజు యుద్ధంలో కోతుల కన్నా రాక్షసుల సంహారం స్పష్టంగా ఎక్కువ కనిపిస్తూ ఉంటుంది. వానర సైన్యానికి మన కన్నా వాళ్లు చాలా ఎక్కువమంది చనిపోతున్నారు అని తెలిస్తే ఉత్సాహం పెరిగి ఇంకా బాగా యుద్ధం చేస్తారు కదా, ఇంకా తగ్గుతారు కదా. అందుకని ఏ రోజుకు ఆ రోజు, చచ్చిపోయిన రాక్షసులందరినీ తీసుకుని రాత్రికి రాత్రే అందర్నీ సముద్రంలో పడేస్తాడు. ఎందుకంటే వాళ్లకు లెక్క తెలియకూడదు ఎంతమంది చచ్చారు , ఎంతమంది మిగిలారు అని. మన బోటి వాళ్ళ దృష్టితో చూస్తే అది బ్రహ్మాండమైన తెలివి అది. అవతల వాళ్ళకి, (రాక్షసులము) మనము ఎంత మంది మిగిలి ఉన్నామో తెలియదు. మనము కోటలో ఉన్నాము, మన రాజ్యంలో ఉన్నాము, మనము ఇటునించి యుద్ధం చేస్తున్నాము. అటు వానరులు? బయట దేశం నుండి వచ్చారు. వాళ్ళకి తినటానికి సరుకు వాళ్లతో తెచ్చుకున్న సరుకే. అంతకుమించి సరుకు ఉండదు. కదా. వాళ్లకి ఎన్నాళ్ళు పోట్లాడాలో తెలియదు, ఎందుకని? ఎంతమంది చచ్చిపోయారో తెలియదు కాబట్టి. అటువంటి సందిగ్ధంలో పడ్డారు. అదో పెద్ద యుద్ధనీతిగా. పడితే ఏం జరుగుతుంది, వానరులు భగవంతుని తెలివిని నమ్ముకున్న వాళ్ళు కాబట్టి ఆంజనేయుడు సంజీవని తీసుకొచ్చేసరికి, చచ్చి నేల మీద పడి ఉన్న కోతులన్నీ బతుకుతాయి. ఆ నీళ్లలో పారేసిన రాక్షసులు బతకరు. ఏమిటి ఇది? ఇది ఎవరైనా వివరించగలరా. లక్ష్మణుడు అట్లా మూర్ఛ పడటం చేత, ఆంజనేయుడు సంజీవని తీసుకుని రావడం చేత, ఆ సంజీవని వలన కేవలము లక్ష్మణుడొక్కడే మూర్ఛ నుంచి మేలుకోవడం కాదు, ఆ సంజీవని ప్రభావము వలన అంతవరకు చచ్చి పడి ఉన్న వాళ్ళందరూ బతికి వచ్చారు. సమస్త ప్రాణి కోటికి దాని

యొక్క సాన్నిధ్యంలో ప్రాణము మళ్ళీ ఉద్భవిస్తుంది. ఇట్లా ఉంటుంది ఇక్కడ తెలివి. అట్లాగే శకుని తెలివి, కృష్ణుడు తెలివిగా ఉంటుంది. శకుని తెలివి ఇట్లాగే ఉంటుంది. రకరకాలుగా తన తెలివిని నమ్మి, ప్రణాళికలు వేస్తూ ఉంటాడు. ఈ మొత్తం యుద్ధం అంతా కూడా బల పరాక్రమములపై ఆధారపడలేదు, మీకూ బలం ఉంది, వాళ్లకీ బలం ఉంది. మీకూ దివ్యాస్త్రాలు ఉన్నాయి, వాళ్ళకీ దివ్యాస్త్రాలు ఉన్నాయి. వీటి వల్ల అవ్వదు, మీరంతా ఎంత సేపూ physical labour ని నమ్ముతారు, నేను intellect ని నమ్ముతాను, తెలివిని నమ్ముతాను. అవతల పక్క యుద్ధంలో ఒకడు యుద్ధము చేయను గాని కూర్చుంటాను అని చెప్పాడు రథంలో. వాడు ఎందుకు అలా కూర్చుంటాడో మనకి తెలిసిన రోజున యుద్ధం మనం గెలుస్తాం, అది తెలియని రోజున యుద్ధము మనము గెలవము అంటాడు. యుద్ధం చేయకుండా యుద్ధంలో ఉంటాడు అన్నవాడు నిజానికి ఎక్కువ అపాయకరం. మీరు వాడు యుద్ధం చేయను అన్నందువల్ల చాలా సంతోషపడిపోతున్నారు. కదా. యుద్ధము చేయనివాడు యుద్ధములో ఎందుకు ఉన్నాడు? వాడి గురించి మీరు ఆలోచించట్లేదు అని చెప్తాడు. వాడి ఆలోచన తెలిసిన రోజునే మనం యుద్ధం గెలుస్తాము, వాడి ఆలోచన తెలియని రోజున, యుద్ధం మనం గెలవము అని చెప్తాడు. శ్రీకృష్ణుని యొక్క ప్రణాళికలు ఏమిటి? రోజుకు ఒక strategy ఉంటుంది అని వీళ్ళు అనుకుంటారు. అక్కడ strategy లేకపోవడమే strategy! శ్రీకృష్ణుడి దగ్గర ముందుగా ఒక ప్రణాళిక వేయడం అనేది ఏమీ ఉండదు, మొత్తం జీవితం చూసుకున్నట్లయితే. ఇది ఇట్లా ఉంటుంది కాబట్టి అట్లా చేద్దాము, అట్లా ఉంటుంది కాబట్టి ఇట్లా చేద్దాము అని ఉండదు. వచ్చినదానికి అప్పుడు, అక్కడ ఏం చేయాలి అన్నది తప్ప, ఇంకొకటి ఉండదు. అందుకని ఈయన దగ్గర ప్రణాళిక ఏదో ఉంది అనుకుని శకుని అనుకుంటాడు, లేకపోవడం వలన ఇబ్బంది పడతాడు. సన్నివేశాల్లో కృష్ణుడు వర్తిస్తుంటాడు తప్ప, అంతకుముందుగానే ఒక తంత్రాన్ని పన్ని చేసినది ఏమీ ఉండదు. అట్లా ఉంటుంది భగవంతుడి యొక్క తెలివి. మనం కూడా ముందుగా ఆలోచించడం వల్ల ఉపయోగం లేదు, తన కర్తవ్యాన్ని తను నిర్వర్తిస్తున్న వాళ్ళు తన దగ్గరకి కర్తవ్యం వచ్చినప్పుడు, అప్పటికప్పుడు ఏమి చెయ్యాలో భగవంతుడి తెలివి అక్కడ అవతరిస్తుంది. మనము ముందు వేసిన plans అన్నీ తలకిందులు అయిపోయినవి బోలెడు ఉంటాయి కాదా. మనము ఇట్లా ఉంటుంది అని అనుకుంటే అది ఇంకోలాగా ఉంటుంది అక్కడ. తను అనుకున్నట్లుగా ఎందుకు ఉంటుంది? ఈ time లో అయిపోతుంది అనుకున్నది అవదు. అదే శ్రీకృష్ణుడు చెప్తాడు రుక్మిణి దేవికి. యాదవులందరూ సముద్ర తీరానికి దేవుడితో picnic వెళ్ళారుట మనతో వెళితే అనుకోవచ్చు. దేవుడితో picnic వెళ్లారు అందరూ. ఆడవాళ్లు కొంతమంది ఇంట్లో

ఉండిపోయారు. ఊరు ఊరంతా picnic వెళ్ళింది. ఏమైందిట, అందరూ చచ్చిపోయారు, ఈయన ఒక్కడూ తిరిగి వచ్చాడు. చూస్తున్నాడు బలరాముడు. ఏమిటి ఏమైంది అంటే అందరూ వెళ్ళిపోయారు, నేను కూడా మీకు చెప్పి వెళ్ళిపోదామని వచ్చాను, మిమ్మల్ని అర్జునుడు వచ్చి తీసుకెళ్తాడు, కబురు పెట్టాను, అర్జునుడి రథంలో మీరు హస్తినకు వెళ్లండి, నేను వెళ్లి, దేహ త్యాగం చేస్తాను, అని చెప్తాడు. ఇదేంటండి? పొద్దున్న picnic అని బయలుదేరినవాడు సాయంత్రం ఇంటికి వచ్చి ఈ కబురు చెప్తే ఏమవాలి మనకి? అప్పుడు రుక్మిణీదేవి అడుగుతుంది పొద్దున బయలుదేరినప్పుడు 'నీకు ఈ సంగతి తెలుసా' అని. 'తెలుసు అంటే ఏమి వస్తుంది, తెలియదు అంటే నీకేం వస్తుంది' అని అడుగుతాడు. నాకు తెలియటం వలన, తెలియకపోవడం వలన తేడా ఏం పడదు. ముందేం జరుగుతుందో తనకు తెలుసు అన్నట్టుగా చూపిస్తారు అక్కడ. యుద్ధానికి రాయబారానికి వెళ్తున్నప్పుడు 'నువ్వు దైవం కదా, నీకు అన్నీ తెలుసు కదా' అంటే, అప్పుడు కృష్ణుడు అంటాడు 'దైవంగా ఏం జరుగుతుంది అనేది అప్పుడు అక్కడ నిర్ణయం అవుతుంది తప్ప, దాని గురించి నువ్వు నన్ను అడగక, ఒక బంధువుగా, ఒక స్నేహితుడిగా నీకేం కావాలో అడుగు. ఒక బంధువుగా, స్నేహితుడిగా నేను చేయాల్సిన విధంగా ప్రయత్నం నేను చేస్తాను. నాకు అన్నీ తెలుసు కాబట్టి నేను అన్ని చేసి పెట్టాలి, ఇటువంటి, మాటలు మాట్లాడొద్దు. నీకేం కావాలో చెప్పు. అక్కడ ఏం జరుగుతుంది అంటావా, అది అప్పుడు, అక్కడ, ఆ సమయంలో ఏమయితే అదే' అంటాడు. దైవం ఎప్పుడూ భూతము, భవిష్యత్తు, వర్తమానము మూడు కలిసి ఉంటుంది. కానీ అప్పటికప్పుడు అయ్యే నిర్ణయానికి ముందుగా project చేయడం అనేది ఉండదు. అక్కడ రాయబారంలో ఏమి చేయాలి అనే plan ఉండదు. ఇవాళ program ఇది అని ఒక list చేసుకొని వెళ్లడు. కాకపోతే రాయబారం అనేది యుద్ధము జరగకుండా ప్రయత్నం చేద్దామని. ఎందుకంటే అందరూ కూడా తన లోంచి వచ్చిన వాళ్ళే! అందరూ తనకి కావలసినవాళ్లే! కాదంటారా, అది వాళ్ళ ఇష్టం. 'నువ్వు రాయబారానికి వెళ్తున్నావు. నువ్వు దేవుడివి కదా మరి వాళ్ళందరూ రాయబారానికి ఒప్పేసుకుంటే నా జుట్టు సంగతి ఏమవుతుంది' అని అడుగుతుంది ద్రౌపది. అంటే, నేను నీకు దేవుడిని కానీ వాళ్ళకి కాదు. నేనే దేవుడిని అని నమ్మితే వాళ్ళు ఇంత దూరం వచ్చేవాళ్ళు కాదు కదా. వాళ్ళ స్వభావాలేమీ మారతాయని నేను అనుకోను. అందువల్ల నీ జుట్టుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు సుమా' అనిచెప్తాడు. తానుగా ఒక ప్రయత్నం చేయాలి కాబట్టి చేస్తున్నాను. వీళ్ళు చేయరు అని ఉన్నది కాబట్టి వీళ్లకు రక్షణ కలిగింది. నశించకుండా ఉన్నారు. వాళ్ళు కూడా చేయరు అని ఉండదు కదా. అయినా పోనీలే పాపమని వదిలేశాను' అంటాడు కృష్ణుడు. అందుకని ముందుగా ఊహించడం ఏమీ ఉండదు.

అదీ భగవంతుడు! మనం ఎప్పుడో 6 నెలల తర్వాత శ్రీశైలము వెళదామని ఇప్పటి నుండే ప్రయత్నాలు చేస్తున్నాము. అక్కడ అలా ఉండదు. ఎప్పుడు ఎక్కడకి వెళ్ళాలీ అనేది సరిగ్గా గుర్తు వస్తుంది. Late గా గుర్తు రాదు. అలా అని మరీ ముందుగా గుర్తుకు రావడం ఉండదు. సరిగ్గా ఎప్పుడు ticket దొరుకుతుందో అప్పుడే గుర్తు వస్తుంది. ఎప్పుడు వెడితే ticket దొరుకుతుందో అప్పుడు వెళ్ళే ప్రయత్నము చేయడమే తెలివి. సంకల్పాలు సరి అయిన కాలం లో, సరి అయిన పద్ధతులలో విఘ్నము కలగ కుండా జరిగేవే వస్తాయి. దానికి పవిత్రమైన భావన ఉండాలి. కర్తవ్య లోపము ఉండకూడదు. సత్వ గుణం లో ఉండే వారికి ఇది సంభవము. అందుకే గాయత్రి చేయడం. అప్పుడు దివ్య సంకల్పం లో భాగం గా ఉండే సంకల్పమే ఎప్పుడు రావాలో అప్పుడే వస్తుంది. దానికి అడ్డు ఉండదు.

'కాగల పనులెల్ల కాక మానవు. కాని పనులు భువిని కానె కావు.
మహిమ వేరెకలదు మనలో ఉన్నదా విశ్వదాభిరామ వినుర వేమ!

ఆలోచిస్తే మనలో ఉండే తెలివి మనది కాదు. వెలుగు మనది కాదు. చక్కటి సంకల్పం రావడానికి సంసిద్ధత కావాలి. నిర్మల చిత్తముండాలి. A clean mind కావాలి. సరైన time లో సరైన idea లు రావాలి. అదే రాముడు దివ్యసంకల్పం లో భాగం గా నడిచినట్లు కనిపిస్తుంది. ఆయన చేసిన ఏ సంకల్పమైనా అంతే! కృష్ణుడైనా అంతే! తెలిసిన వారెవరైనా అంతే! Already ఒక ప్రణాళిక నడుస్తుంటే, అందులో భాగంగా, దానికి అనుగుణం గా వారి ప్రణాళిక నడుస్తుంటుంది. దివ్య సంకల్పము ఎరిగి పని చేయాలి. విశ్వామిత్రుడు యజ్ఞము చేయుచుండగా మారీచ, సుబాహులు అంతరాయము కలిగించినప్పుడు, ఆ సమయములో తాను చంపరాదు కనుక, కిం కర్తవ్యమని ఒక్క నిమిషము కనులు మూసుకుంటే 16 ఏళ్ళ రాముడు కనిపిస్తాడు. కనులు ఎందుకు మూసుకున్నాడూ? దివ్య సంకల్పము తెలుసుకోవడానికి! కళ్ళు మూసుకుంటే అలా భాసించాలి. ఎదైనా ఒక సమస్య వచ్చినప్పుడు, ఒకసారి కనులు మూసుకొని భగవత్ సంకల్పముతో అనుసంధానము చెందితే పరిష్కారము దొరుకుతుంది. అంత ఓపిక మనకుండదు. అయ్యిందా మనవల్లే అని చంకలు గుద్దుకుంటాము. అవ్వలేదా, ఎందుకు కాలేదో logic చెప్తాము. అయితే అవ్వడం, అవ్వకపోవడం లో ఉండే రహస్యం తెలిసినవాడు తెలివైనవాడు. ఆ తెలివి ప్రధితః! కాలమూ, చోటూ తెలిసినవాడు వాడు. ఏ కాలం లో, ఏ పని, ఎక్కడ, ఎలా జరుగుతుంది అని తెలిసిన వాడు.

332 ప్రాణః

ప్రణవం లో నుండి ప్రాణము వస్తుంది. ప్రణవమే ప్రాణముగానూ, తెలివిగానూ పనిచేస్తుంది. ప్రాణం ఎలా ఉన్నదీ? ప్రణవము కన్నా బహిర్గతం గా స్పందనగా ఉన్నది. స్పందనం కన్నా బహిర్గతం గా గుండెకొట్టుకోవడం గా ఉన్నది. గుండె కొట్టుకోవడంకన్నా బహిర్గతం గా ఉచ్ఛ్వాస నిశ్వాసలుగా ఉన్నది. ఇలా నాలుగు స్థితులలో ప్రాణము ఉన్నది. అందుకని మన ఎరుకని/ బుద్ధిని/ మనస్సుని రోజూ ప్రాణము మీద కొంత సేపు పెట్టడం అభ్యాసము చేయాలి. ప్రాణము ఉంటేనే కదా మిగతావన్నీ ఉన్నాయి. ప్రాణము లేకపోతే ఏమీ చేయలేము కదా! మనము రోజూ ప్రాణము గురించి ఏ మాత్రం ఆలోచిస్తున్నాము? అది మనలో ఉన్నదా, మనదా? కాదు. ప్రాణము మనది కాదని గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే అది మన చేతిలో లేదు. అది ఎప్పుడు పోతుందో తెలియదు. అందుకని ప్రాణముతో స్నేహం చేసుకో! భగవంతుడే ప్రాణముగా ఉన్నప్పుడు దానితో అనుసంధానం చేయడమే మన పని. అదే మనకు C.V.V. గారు ప్రాణముతో అనుసంధానము చేయడమే prayer గా ఇచ్చారు. Plenty of Prana అన్నారు. నేను చూసుకుంటాను, నేను చెప్పినట్లు చేయమన్నారు. ప్రాణముతో రోజూ కనీసము 24 seconds తో మొదలు పెట్టి తర్వాత మెల్లగా 24 నిమిషములు వరకు అనుసంధానం చేయాలి. అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలు దీర్ఘమైనవి, మృదువైనవి, లోతైనవి, ఒకే పద్ధతిగా ఇలా నాలుగు గుణాలున్నాయి. Slow, soft, deep and calm అన్నారు. నెమ్మదిగా ఉచ్ఛ్వాస, నిశ్వాసలు చేయాలి. నెమ్మదిగా వాటి రాకపోకలు గమనించాలి. మృదువుగా చేయాలి. చప్పుడు చేయకూడదు. చప్పుడు చేస్తే వేడిపుట్టి, గొంతు వద్ద rupture అవుతుంది. అందుకు మృదువుగా పీల్చాలి. నెమ్మదిగా, దీర్ఘంగా పీల్చాలి. మృదువుగా అన్నాక ఇంక చప్పుడు చేయకూడదు. కాసేపున్నాక లోతట్టున చప్పుడు వినిపిస్తుంది. అదేమి చేస్తుందంటే ఒక తలుపు తెరిచి 'లోపల ఇంకోడున్నాడురా' అని లోపలకు పంపిస్తుంది. అదే స్పందన! అది పీల్చే సమయములో వినిపిస్తుంది. మామూలుగా మనము బాగా పీల్చము. బాగా పీల్చేవాళ్ళు 3 సార్లు పీల్చి ఒకసారి విరామము ఇవ్వవచ్చు. ఆ విరామములో ఇది వినిపిస్తుంది. అది Kingdom of Prana లో కలుస్తాము. మొదట 24 నిమిషములు ఉచ్ఛ్వాస నిశ్వాస, తర్వాత 24 నిలు స్పందనము. అలా జరుగుతుంటే స్పందన సూక్ష్మ స్పందనలోకి దారి ఇస్తుంది. అంటే ఇంకో తలుపు తెరుస్తుంది. అక్కడ స్పందనం చప్పుడు వినిపిస్తుంది, అంతే! లబ్ డబ్ లు ఉండవు. 'హంస' శబ్దంగా వినిపిస్తుంది. ఇలా కొన్నాళ్ళు అభ్యాసం చేయాలి.

ఉచ్ఛ్వాస నిశ్వాసలు 24 నిలు చేసి విరామముతో చేస్తే, అప్పుడు స్పందన వద్దకు వెళ్ళడము జరుగుతుంది. ఇలా ఉచ్ఛ్వాస నిశ్వాసలు, స్పందన కలిపి మరో 24 నిలు అభ్యాసం చేస్తుంటె ఉచ్ఛ్వాస నిశ్వాసలు బాగా తగ్గుతాయి. స్పందనము నుండి సూక్ష్మ స్పందనలోకి వెడతాము. ఆ స్పందనం దగ్గర 'సోహం సోహం సోహం' అని వినిపిస్తుంది. అంటే 'అతడే నేను, అతడే నేను, అతడే నేను' అని వినిపిస్తుంది. ఎవరి గురించి మనం చెప్పుకుంటున్నామొ అతడే అక్కడ ఉన్నాడన్నమాట. వాడుండబట్టి మనం ఉన్నాము. వాడు లేకపోతే మనం లేము. వాడుండ బట్టే మనమున్నామనేదే అసలు మొత్తం రహస్యం. ఆమాటే శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'మీరు లేరు. ఉన్నది నేనే. ఉన్నామని మీరు అనుకుంటున్నారు. పోన్లే అని అనుకోనిస్తున్నాను' అని చెప్తాడు. అల ఎక్కడుంది సముద్రము లేకుండా? అలాగ వాడు లేకుండా మనము ఎలా ఉంటాము? 'సహ అహం' సహ అంటే అతడు. అహం నేను. అతడే నేనుగా ఉన్నాను అని తెలుస్తుంది. చాలా బావుంటుంది, 'అమ్మా, ఇదా' అనిపిస్తుంది. అక్కడి నుంచి సూక్ష్మ స్పందన లోకి వెళ్ళే సరికి అతడే నేను అని కూడా పోతుంది. ఒకటే శబ్దం ఉంటుంది. అది 'ఝమ్' అని వినిపిస్తుంది, ఓంకారం. అక్కడికి వెళ్లేసరికి శ్వాస కూడా ఉండదు. అంటే ఏమైంది? శ్వాసలో కెలా వెళ్ళాలో తెలుసుకుని, అక్కడ నుండి స్పందన లోకి వెళ్ళి, అక్కడ నుండి సూక్ష్మ స్పందనంలోకి వెళ్లి, ఓంకారాన్ని వింటూ ఉంటే, అదే ప్రాణం, అదే ప్రణవము. అట్లా కూర్చోపెడదామని సి.వి.వి గారి తాపత్రయం అన్నమాట. అట్లా కూర్చుంటే ఆ ప్రాణం వచ్చే మార్గం ఉందే, అదే కుండలినీ మార్గం! ఆ కుండలినీ చైతన్యము యొక్క మార్గాన్ని సి.వి.వి గారు అంతరిక్షం నుంచి పట్టారు. దాని అంతు తేల్చుకున్నారన్నమాట. ఎక్కడి నుంచి పట్టుకొచ్చారు? సూర్యుడి అవతల ఉన్న తత్వంలోకి కూడా వెళ్లారు ఆయన. దానికి సంబంధించింది మనకి ఇచ్చారు మాస్టర్ గారు, book లో ఉంది. ఎక్కడో ఉన్న ప్రాణం అంతరిక్షం లోంచి సూర్య మండలానికి, సూర్య మండలం నుంచి భూమికి, భూమి నుంచి మనకి, అందుతూ ఉంటుంది. ఆ మొత్తం, మార్గమంతా ఆయన సుగమం చేశారు. అందుకని 'నీకు ఎప్పుడు ప్రాణం సరిగా లేకపోతే, అప్పుడు అక్కడి నుంచి సరఫరా ఔతుంది, నేను చేస్తుంటాను' అన్నారాయన. ఎందుకు ఇది? ప్రాణం ఉంటే శరీరం ఉంటుంది. శరీరం ఉంటే ఏం చేస్తావ్? ఈ శరీరంలో ఉండగానే, ఇక్కడ మనము ముక్తులం కావాలి. మళ్లీ ఇటువంటి శరీరం వస్తుందో రాదో చెప్పలేము. వచ్చినప్పుడు ముక్తులము అయ్యామనుకో, మనము కూడా దివ్య ప్రణాళికలో భాగంగా, చిరంజీవులుగా, సృష్టి ఉన్నంతకాలము అనుభూతిపరంగా ఉండవచ్చు. అందుకనిమానవ శరీరం లో ఉండడం ఒక అవకాశమన్నారు. ఇది మనము పూర్తి చేసుకోకుండా పోయాం అనుకోండి, అన్నీ మర్చిపోతాం. అన్నీ మర్చిపోవడం వల్ల

మళ్ళీ ఒకటి, రెండు, మూడు, అంకెల దగ్గర నుండి, ఏ బి సి డి లు దగ్గర నుండి, అ ఆ ఇ ఈ అవన్నీ నేర్చుకోవాలి కదా. ఇట్లా ఎన్నిసార్లు నువ్వు నేర్చుకున్నావు? కొన్ని వేలసార్లు, కొన్ని లక్షల సార్లు, అట్లా జరిగిపోయింది. ఏం చేస్తున్నావ్ అంటే, ఎప్పుడూ పదో క్లాసు దాకా చదువుతున్నావ్, మళ్ళీ అయిపోయింది, మళ్ళీ పదో క్లాస్ వరకు చదువుకున్నాం, మళ్ళీ అయిపోయింది, ఎప్పుడూ పూర్తి కావట్లేదు. పూర్తి కావడానికి సివివి గారి ప్రార్థన మనకి ప్రాణాన్ని నిలబెడుతుంది. నిలబెట్టిన ప్రాణం ఆధారంగా నీవు ముక్తుడవి కావాలి. ముక్తుడివి కావాలంటే దానికి మాస్టర్ E.K ఇచ్చిన ప్రణాళిక పనికొస్తుంది. అదేమిటి? 'నీకోసం కాకుండా ఇతరుల కోసము పనిచేయటం మొదలుపెట్టు. ఎప్పుడైతే ఇతరుల కోసం అని నువ్వు మొదలు పెట్టావో నీకోసము అనేది లేదో నీకు ఇంక కర్మ పేరుకోదు'. అంటే వచ్చే కర్మ లేదు, పాతదుంది. పాతదంటావా నువ్వు చేసే సత్కార్యాల్లో, ఇతరుల కోసం నువ్వు చేసే పనుల్లో పడే శరీర శ్రమ, భావమయమైన శ్రమ, ఇందులో అదంతా ఊడ్చేస్తాం. అందుకని శరీరం నిలబెట్టుకోవడము ఒక్కటే కాదు కార్యక్రమం. కాకిలా కలకాలం బ్రతికే కన్నా, అని చెప్తారు కదా మనకి. 100 ఏళ్లు బతికాడట, ఎందుకు బతికాడో తెలియదు. కొంతమంది 30 ఏళ్ళే బతుకుతారు, 'అయ్యో, ఇంకొంచెం బతికుంటే బాగుండేదండీ, చాలా పనులు ఆగిపోయినాయి' అనుకుంటాం కదా! అదీ ఉంది, ఇదీ ఉంది కదా. రెండిటికీ సరి ఉండాలి. పరిపూర్ణమైనటువంటి ప్రాణం ఉండాలి, తను సంకల్పించిన కార్యాలన్నిటినీ కూడా పరిపూర్తి చేసుకొని, వెళ్ళటం అనేది ఉండాలి. అటువంటివాడు రెండు రకాలుగా కూడా పరీక్షలో ఉత్తీర్ణుడు అయినట్టు. కొంతమంది పనులు సగంలో ఉండగా వెళ్ళిపోతారు. కొంతమంది చాలాకాలం ఉంటారు కానీ ఏమీ పనులు ఉండవు. శంకరాచార్యులంతటి వారు 30 సంవత్సరాలలో మొత్తం పనులు పూర్తి చేసేసుకుని అట్లా కేదార్ నాథ్ వెళ్ళిపోయి అదృశ్యుడైపోయారు. ఆయనకి వచ్చిన పని అయిపోయింది. 30 ఏళ్లకు మనకు మొదలే కాదు, ఆయనకి 30 ఏళ్లకు పూర్తయిపోయింది. ఏదో సగం వదిలేసారని లేదు ఎక్కడా కదా! మనకేంటో అరవై ఏళ్ళైనా పూర్తి కావు పనులు. అది తమాషా. షష్టిపూర్తికి buiness లు start చేసేవాళ్లు ఉండరూ? ప్రాణాన్ని ఆధారం చేసుకుని, నువ్వు ఎవరో నువ్వు తెలుసుకునే స్థితి వరకు పెరగడానికి కావలసిన సాధన మనకి మాస్టర్ సి.వి.వి గారు యోగమార్గంలో ఇచ్చారు. ఆయన ఇచ్చిన సాధన వలన ప్రాణము బాగా నిలబడుతుంది. ప్రాణం యొక్క తీరు తెలుసుకొని ఓంకారమును పట్టుకోవడం వల్ల నువ్వు అక్షర స్వరూపుడవని, నీకు తెలుస్తుంది. తెలియటం వలన నీకు ఈ ముడులు విడిపోతాయి. అంత మాత్రం చేత ఆకాశాన తిరిగేయవు, ఎందుకంటే అంతకుముందు మనం చేసిన పనులన్నీ ఉంటాయి కదా. అవన్నీ పూర్తి చేసుకోవాలి. ఆ తర్వాత చిరంజీవివై పరమ

గురువుల ప్రణాళికలో భాగంగా జీవిస్తూ ఉండు, అదీ జ్వాలాకూలుడు అంటే, అదీ మరువు అంటే, అదీ దేవాపి అంటే! అంటే half the way disruption ఉండదు, పని పూర్తి చేయకుండా వెళ్లిపోవడము ఉండదు. పని పూర్తయిన తర్వాత ఉండటం ఉండదు. అతడూ పరిపూర్ణ యోగి! అటువంటి యోగం మనకి కావాలి అంటే ముందు ప్రాణము ఉండాలి కదా! పనుల కోసం కాదు, సాధన కోసము ప్రాణం ఉండాలి. ప్రాణాన్ని చక్కగా నిలబెట్టుకుని సాధన పూర్తి చేసుకుంటూ, తన జీవన ప్రయోజనాన్ని పరిపూర్తి చేసుకొని, ప్రాణం యొక్క గతి తెలిసినవాడు కాబట్టి, ఈ ముళ్ళని విప్పేసుకుని శరీరం లోంచి బయటకు వచ్చేస్తాడు. తెలివి ఉండగా ప్రాణాన్ని వదిలేయగలగాలి. ప్రాణము ఉండగా తెలివి తప్పిన వాళ్ళందరూ సరిగ్గా చచ్చిపోయిన వాళ్ళు కాదు. ఆత్మతత్వం నుంచి, ప్రాణము ఒక పాయగానూ, తెలివి ఒక పాయగానూ ప్రయాణం చేస్తూ ఉంటుంది. ప్రాణము అనే పాయను పట్టుకోవటం వలన మనకు శరీరం నుంచి బయటకు వెళ్లడం, లోపలికి వెళ్ళడం, బయటికి వెళ్ళడం, లోపలికి వెళ్ళడం తెలుస్తుంది. తెలివి ఉంచుకుని సత్కర్మలు ఆచరించుకుంటూ, కర్మలు నశింప చేసుకుంటూ పని చేస్తే, ఎక్కువ తేజోవంతులము అవుతూ ఈ శరీరాన్ని అట్లా వదిలేటట్టుగా ఉండాలి. తెలిసినవాడు, అంటే విజ్ఞుడు, ఎవరైతే ఇందాక ప్రథితుడు అన్నామో, వాళ్ళే తెలివితో ప్రాణాన్ని వదిలేస్తారు. మూర్ఖులు, అజ్ఞానులు, తెలియనివాళ్ళు, ప్రాణము పోవడానికి ముందు తెలివి పోతుంది. కలికాలంలో తెలివి ఉండి ప్రాణం వదిలేసే వాళ్ళు ఎక్కడో ఉంటారు. ప్రాణం ఉండి తెలివిపోయిన వాళ్ళు చాలామంది ఉంటారు. తెలివిపోయింది అంటే ఇంక నాలుగు ఐదు రోజుల్లో పోతారేమో అనుకున్నవాళ్లు, నాలుగైదు రోజులు కాదు, నాలుగు నెలలు కూడా అలా ఉంటూనే ఉంటారు వాళ్ళు. వీడు పోడేంటి అనిపిస్తుంది. వాడు పోతే మనము పనులు చేసుకోవచ్చు. వాడు ఉన్నట్లు కాదు, పోయినట్టు కాదు. ఎందుకంటే వాడు వెళ్ళిపోయాడు, వాడి ప్రాణం ఊరికే అక్కడ. ఆ biological system అలా పడుందన్నమాట. అది వాడు అనుకుంటాం వాడు లేడుగా, వాడిని పిలిస్తే పలకడు. అది ఊరికే కొట్టుకుంటూ ఉంటుంది అక్కడ. వాడు కూడా పూర్తిగా వెళ్లిపోలేదు ఎందుకంటే అక్కడ ఒక ముడి ఉండిపోయింది. ప్రాణానికి సంబంధించిన ముడి. ప్రాణం ముడి విప్పుకోలేకపోవడం వల్ల వాడేమో బయటికి పోలేడు. లోపలికి వద్దామంటే రావటానికి వీలుపడదు. వాడికి అది నరకం. వాడి చుట్టూ ఉండే వాళ్ళకి కూడా అది నరకం. ఎందుకంటే వాడు పోయాడు అనుకుంటే ఏదో అక్కడికి మోసుకుపోయి కాల్చేసి, పది రోజులు ఏదో కష్టపడతాం, మళ్ళీ పనుల్లోకి దిగిపోతాం. పోయాడు అనే ఏడుపు ఎంత సేపు ఉంటుంది? అప్పుడప్పుడు వస్తూ ఉంటుంది. కాఫీ తాగుతూనే ఉంటాము, అన్నం తింటూనే ఉంటాము. ఏదీ

వదలము. పోయినవాడు పోనే పోయాడు నీరసం కూడా ఎందుకు అనిపిస్తుంది. పోయాడని కాఫీ ఓ పది రోజులు మానేసినవాళ్ళు ఎవరైనా ఉన్నారా? ఏమీ మానము, అన్ని నడిచిపోతూ ఉంటాయి. మాస్టారు ఒక జోక్ చెప్పారు. ఎవరైనా పోతే, వాళ్ళ ఇంటికి మనం వెళ్తే ఆ ఇంటి ఆవిడ, మళ్ళీ అప్పటికప్పుడు ఒకసారి ఏడవాలి. First time after the death, అంటే after she has become widow వెళ్తేట, ఒకసారి భళ్ళున ఏడుస్తారట మనవాళ్ళు అదొక సాంప్రదాయంగా. ఎందుకంటే మనము పలకరించడానికి వచ్చాం కదా. వాళ్లు ఏడుస్తే కదా మనము పలకరించాలి. ఇవన్నీ మనం వేసుకున్న ముళ్ళు. మూడు నెలల తర్వాత ఒక ఆవిడ ఇంటికి వెళ్లారుట మాస్టారు గారు గుంటూరులో. వెళ్తే ఆవిడ భళ్ళున ఏడవబోతే, నేను వచ్చాను ఇదివరకు వచ్చానమ్మా వారు పోయిన తర్వాత అని చెప్పారట. అంతే ఆవిడ ఏడుపు ఆపేసారుట. అంతకన్నా ఘోరము ఉందండి? అంటే ఇదివరకు ఒకసారి ఏడ్చేసింది కాబట్టి ఏడవలేదుటండీ. అలా ఉంటాయి ఏడుపులు. కాఫీలు అయిపోతుంటాయి, వేణ్ణీళ్ళ స్నానాలు అయిపోతుంటాయి. వాడు ఉంటాడు, కానీ కనపడడు మనకి. అక్కడే ఉంటాడు. దీని దుంప తెగ, ఇన్నేళ్ళూ వెట్టి చాకిరి ఇందు కోసమా చేశాం అనిపిస్తుంది. వాడూ మరచిపోతాడు తర్వాత. అట్లా ఉంటుంది. అది పక్కన పెట్టేస్తే ప్రాణాన్ని చక్కగా నిలబెట్టుకుని, ప్రాణం ఉండగా, పరిపూర్ణమైన చైతన్య స్థితిని పొంది, శరీరం నిలబడి, ప్రాణం వదిలిన వాడి జీవితము సార్థక్యం చెందినట్లు. వాడు తెలిసి శరీరాన్ని వదిలినవాడి కింద లెక్క. అలా పోయినవాళ్ళు చాలా తక్కువమంది ఉంటారు. తను పోయినా కూడా తను ఉన్నాను అని తెలిసినవాడు. పోయినవాడు అంటే శరీరంలో నుంచి బయటకు పోయినవాడు అని అర్థం. తెలియటం అనేది, ఈ శరీరంలో ఉండగానే వాడికి తెలియాలి. అది జరిగిన వాడిని ముక్తుడు అంటారు. వాడు అప్పుడు శరీరంలో ఉన్నా కూడా జీవన్ముక్తుడి కింద లెక్క! అది రమణ మహర్షికి జరిగింది. అది మహాత్ములందరికీ జరిగేదే! వాళ్ళు ఉండగానే, వాళ్ళ శరీరాన్ని వాళ్లు బయటకు వచ్చి దర్శనం చేసుకుంటారు. అదీ కఠోపనిషత్తు యొక్క రహస్యం. నచికేతునికి యముడు చెప్పిన రహస్యం అదే! అదే మార్కండేయ పురాణం! అదే సావిత్రి ఉపాఖ్యానం! ఈ మూడూ చాలా ముఖ్యమైనవి, బాగా చదువుకుంటూ ఉండాలి అందరూ కూడా. మార్కండేయ ఉపాఖ్యానంలో మార్కండేయుడు, చావుని అతిక్రమించాడు కదా. సావిత్రిలో, సావిత్రి ఆ విధంగా సత్యవంతుడికి మళ్ళీ ప్రాణాలు తీసుకొచ్చింది కదా. నచికేతుడ్ని వాళ్ళ నాన్న పంపించేస్తాడు యముడి దగ్గరికి. అతడు యముడితో మాట్లాడుతూ ఉంటాడు. యముడితో ఆ విధమైన సంభాషణలో నచికేతాగ్ని అనేది ఏ విధంగా రగుల్కొల్పుకోవాలో ఉన్నది. ఆ అగ్ని రగులు కొలుపుకోవడం చేత (మూలాధారంలో

మనకు ఉన్న ముడి రుద్ర గ్రంథి), కుండలిని యందు రాగలదు ప్రాణము. అదీ మన యోగము. కుండలినీ యోగము మాస్టర్ సివివి గారు ఇచ్చారు. అది చేసుకుంటే ఏమవుతుందంటే, ఇక్కడ శరీరంలో ఉండగానే, రోజూ బయటికి రావడము అనేది సాధనగా జరుగుతుంది. అందుకనే రాత్రి ఆ ప్రేయర్.

"Master please let us receive the influx of thy plenty of prana into our systems, so that we may transcend disease, decay and death, realise the highest truth, the pure love and bliss of existence and serve humanity, according to thy plan."

నీ ప్రణాళిక ప్రకారము ఈ మానవజాతికి నేను చేయాల్సిన సేవ చేయడానికి నాకు ఇదంతా ఇవ్వమని అని అడుగుతున్నాడు, సాధకుడు. తద్వారా రోజూ ఈ రకంగా బయటికి వెళ్ళిపోయి,వస్తూ ఉంటాడు. ఇది అలవాటైపోతుంది. అది మంద్రజాలంలో మాస్టర్ గారు ఇచ్చిన scheme. అందులో జ్వాలాకూలుడు నిద్రపోయినప్పుడు ఎక్కడో పనులు చేస్తున్నట్లు, పొద్దున్నే వచ్చిన తర్వాత ఇంకో దగ్గర పని చేస్తున్నట్టు ఉంటుంది. అక్కడ పనులు చేస్తున్నట్టు ఇక్కడ తెలియదు, ఇక్కడ పనులు చేస్తున్నట్టు అక్కడ తెలియదు. పగలు ఒక పేరుతో, రాత్రి ఇంకో పేరుతో రెండు చోట్లల్లో పని చేస్తూ ఉంటాడు. ఏదో ఒక రోజున ఆ రెండూ తనే అని తెలియాలి కదా! అందుకనే మంద్రజాలం మహత్తరమైన సాధనా రహస్యము తో కూడిన గ్రంథం. అదేదో మనము కథ చదువుకోవడం వేరు. అందులో మరువు జ్వాలాకూలుడికి చెప్తాడు ఎట్లా అతడే జ్వాలాకూలుడో, అతనే గిరిశర్మో. అదీ జరగాలి మనందరికీ! అందుకనే మాస్టర్ గారు మాస్టర్ సి.వి.వి పుస్తకం ముందు ఇచ్చారు, తర్వాత మంద్రజాలం పుస్తకం ఇచ్చారు. మంద్రజాలంలో జీవుడిగా మనకు ఉండే ఒక ప్రణాళిక, ఆ జీవుడు ఈ లోకంలోకి వచ్చింతర్వాత ఇక్కడ వ్యక్తిగతంగా వృద్ధి చేసుకున్నది ఇంకొక ప్రణాళిక. ఈ జన్మకే ఈ పేరు, ఈ వృత్తి, ఈ సంఘంలో పలుకుబడి. కానీ మనకి ప్రతి జన్మకీ ఉండేది మనలో ఒకటి ఉంది, జన్మజన్మలకి మారేది మనలో ఒకటి ఉంది. జన్మజన్మలకి మారేదాన్ని 'క్షర పురుషుడు' అన్నాడు భగవద్గీతలో. మనలో ఎన్ని జన్మలకీ మారకుండా ఉండేది ఒకటి ఉంది. దానిని 'అక్షర పురుషుడు' అన్నారు. అంటే జీవుడుగా మనము అక్షరులం. జన్మజన్మలకీ మనం ఏర్పరుచుకునే స్థితిగతులు, పేరు ప్రతిష్ట అవన్నీ కూడా పోతూ ఉంటాయి, వస్తూ ఉంటాయి. ఈ వచ్చి పోయే వాటిలో ఉండకుండా, మనం ఎవరో తెలుసుకోవడం కోసం, ఈ రెండు పాయలు కలవాలి మనలో. అది మంద్రజాలం యొక్క రహస్యం. మంద్రజాలంలో మనకి ప్రతిపాదించింది ఏమిటంటే 'తాను జీవుడుగా అక్షరుడని, శరీరం వదిలినప్పటికీ తాను ఉంటాడని, తాను చిరంజీవియై ఈ భూమి మీద సృష్టి

ఉన్నంతకాలం ఉంటాడని, దివ్య ప్రణాళికలో భాగంగా జీవిస్తూ ఉంటాడని, తెలుసుకోవడం'.

333 ప్రాణదః

ప్రాణదా అంటే ప్రాణాన్నిచ్చేవాడు. మాస్టర్ C.V.V రూపంలో మనబోటి వాళ్ళందరికీ అలా చేసారు. అందుకని మాస్టర్ గారు 18 సార్లు ఆయన జీవితంలో శరీరం వదిలేసి, శరీరంలోకి వచ్చి demonstrate చేసి చూపించారు. prove చేశారు. 18 సార్లు 'నేను పోను. నేను ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు శరీరంలోకి రాగలను' అని చేసి చూపించారు. ఇక్కడ మనం ప్రచారము చేసుకోం గాని, మాస్టర్ సి వి వి చాలా ఎక్కువ ఎవరూ చేయని యోగ సిద్ధులు చూపించారు. 6 గంటల సేపు కేవలము గాలి పీల్చడమే, 6 గంటలసేపు కేవలము గాలి వదలడమే, 6 గంటలసేపు ఏ గాలి పీల్చడమూ లేదూ, వదలడమూ లేదు. అదొకటి చేసేవారు ఆయన. పోతరాజు నరసింహం గారని, ఆయన చాలా పెద్ద తత్వవేత్త! సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు, ఆయన ఎవరికి ఎవరూ తీసిపోని వాళ్ళు, అత్యంత సన్నిహితులు అయిన స్నేహితులు కూడా వాళ్ళిద్దరూ. ఆ పోతరాజు నరసింహం గారు సి వి వి గారి శిష్యులే! మనందరికీ మాస్టర్ సి వి వి గారి ఫోటోలు ఆ పోతరాజు నరసింహం గారి దగ్గర నుండి మాష్టారు గారికి, మాస్టర్ గారి దగ్గర నుండి మనకి వచ్చాయి. ఆయనతో C.V.V గారు 'నేను ఎక్కడకీ పోనోయ్ నరసింహం' అంటూ ఉండేవారుట. ఆయనది demonstrate చేస్తూ ఉండేవారు. అంటే అట్లా పడుకుని పోయినట్టుగా ఉండేవారు. నాడి చూస్తే ఉండదు. గుండె చూస్తే కొట్టుకుంటూ ఉండదు, ముక్కు దగ్గర చూస్తే శ్వాస ఉండదు. అమ్మో,ఈయన పోతున్నట్లు ఉన్నారని, డాక్టర్ కోసం ఆ నరసింహం గారు గుమ్మం దగ్గరకి వెళ్ళేసరికి ఈయన లేచి కూర్చుండేవారు, రా రా రా అని. 'ఊరికే నీకు చూపించడానికి చేస్తున్నాను. నేను ఉంటాను. నేను శరీరము లేకుండా కూడా ఉంటాను' అని అనేవారుట. అట్లాగే ఇంకోసారి డాక్టర్ గారి దగ్గరికి వెళ్లేంత వరకు లేవకుండా, ఆ తర్వాత లేవడం. ఇంకొకసారి డాక్టర్ గారు వచ్చిన తర్వాత ఆయన ముందు లేవడం. ఇట్లాగ 18 times He has demonstrated. అంతేకాదు, పోయిన తన తల్లిగారి ప్రాణాన్ని invoke చేసి మళ్లీ నిలబెట్టారు. మూడు సార్లు తన కొడుకుని పోతున్నవాణ్ణి, మళ్ళీ పట్టుకొచ్చారు. మూడోసారి ఆ పిల్లవాడు చెప్పాడు 'నీ ప్రయోగాలకి నేను దోహదం చేయడానికి వచ్చాను, అంతేగానీ నేను ఇక్కడ ఉండటానికి రాలేదు. ఆ సంగతి నీకు తెలుసు కదా, అమ్మ ఏదో అట్లా అంటుంది, ఇంక మరి నన్ను వెనక్కి రప్పించకు' అని. ఇది demonstrate చేసి ఒక మనిషి చూపించారు. ఈ ప్రాణానికి, అగస్త్యఆశ్రమానికి అటువంటి ఒక ప్రత్యేకత ఉన్నది. ప్రాణాన్ని నిలబెట్టటం, శరీరాన్ని నిలబెట్టడం, తద్వారా, సాధన. అందుకని ప్రాణాన్ని

ఇచ్చేవాడు భగవంతుడు అంటే ఇప్పుడు ఆ సి.వి.వి గారు అంటే మనం ఏమనుకోవాలి? అది వేరే ఇంకొకటి అనుకోవడానికి లేదు. భగవంతుడే ఆ రూపంలో దిగి వచ్చాడు అని కదా మనం విష్ణు సహస్రనామంలో మనము తెలుసుకోవలసింది, ఎక్కడ వెలుగు దిగివచ్చినా అదే! మరి సి.వి.వి గారు కాదా? ప్రాణాన్ని ఇవ్వగలడు భగవంతుడు. అందుకనే ప్రాణం పోతున్న సమయంలో, కష్ట సమయంలో ప్రాణం ఇస్తాడని భగవంతుని ప్రార్ధన చేసుకోవడం. కుండలినీ చైతన్యము మనలో వికాసం చెందడం, మనలో గ్రంధులను విడదీయడం, ఆ గ్రంధులను విడదీసి మనల్ని ముక్తులుగా చేయడము, అక్కడి నుండి దివ్య ప్రణాళికలో భాగంగా చేయడము సి.వి.వి గారి ప్రణాళిక. వాహికను తయారుచేసి ఇస్తానని, సూక్ష్మదేహము అమరత్వము సాధించి, జీవులలో గ్రహగతులను చక్కచేసి, తర్వాత తనని స్మరించిన వాళ్ళందరినీ తన వాహికలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. అక్కడ ఉంది ఈ ప్రార్థన యొక్క ప్రాముఖ్యత. **ఆరింటి నుంచి, ఆరింటి వరకు, ఆరు, ఆరు అని, అది చేయలేము కాబట్టి వదిలేయబోకండి, నాకు అందిన ఒక ముఖ్యమైన సూచన మీకు చెప్తాను. మాస్టర్ సీ.వి.వి గారు చెప్పింది ఆరు, ఆరు కాదు ప్రధానంగా, ఎందుకంటే అక్కడ 6.13 , 6.13 కూడా** చేస్తారు. చెప్పింది ఏమిటంటే సాధనకి అంతరాయం రాకుండా, 12 గంటల లోపల ఒకసారి చేయాలి. అంటే, ఆరుకి చేస్తే మళ్ళీ ఆరుకి ప్రార్ధన. ఏడింటికి చేస్తే మళ్లీ ఏడింటి లోపల చేయాలి ఒకసారి. సాయంత్రం 6:00 కి పనులు, పొద్దున 6:00 కి నిద్ర. అప్పుడు 7, 7 పెట్టుకోండి. 7 ,7 కూడా కుదరట్లేదు అనుకోండి, సి.వి.వి గారు ఇంకొక సూత్రం చెప్తారు. 'ప్రొద్దున ఏడుకి చేశావు, సాయంత్రము ఏడుకి నీకు కుదరడంలేదని నీకు తెలిసిందనుకో, ఒకసారి తలచుకో. తలుచుకుని, పడుకునే ముందు పక్క మీద పడుకుని చేసుకో' అని చెప్పారు. నాకు అందిన సూచన అన్నానే, అదేమిటంటే, ఆరు ఆరు అని కాదు, 12 గంటల లోపు ఒకసారి. 12 గంటలకే చేయాలని కూడా కాదది. ఏడింటికి చేశావు పొద్దున, సాయంత్రం ఏడు లోపల ఇంకోసారి చేసావనుకో. చేస్తే అక్కడనించి నీకు పన్నెండు గంటల వరకు renew అయింది అన్నమాట. మధ్యాహ్నం 3 గంటలకు చేశావు, అంటే మళ్లీ నీకు ఎప్పుడు next? తెల్లవారుజామున మూడు గంటల లోపల ఇంకొకసారి చేయాలి. ఆ 12గంటలు దాటిపోతే ఏమవుతుందంటే, ఒకసారి ఈ శబ్దాన్ని ఉచ్చరిస్తే, అది నీ లోపల 15 నిమిషాల పాటు జరిగిన కదలిక, దాని యొక్క తరంగాలు 12 గంటల సేపు పనిచేస్తాయి. 12 గంటల లోపలే నువ్వు, ఏ 7 గంటల తర్వాతో, 8 గంటల తర్వాతో మళ్లీ ఇంకొకసారి pump set on చేశామనుకోండి. రోజూ పొద్దున్న 6:00 గంటలకి సాయంత్రం 6:00 గంటలకి pump set వేయాలి. మధ్యలో pump set వేస్తే ఏమవుతుంది? ఇంకొంచెం దూరం వరకు మనకి వస్తుంది

కదా. కుండలిని చైతన్యములోకి రావడము , మన pump set నుంచి నీళ్లు రావటం ఒకటే.motor on చేస్తే, మధ్యాహ్నం మూడింటికి ఒకసారి చేసుకున్నాం అనుకొండీ, లేకపోతే ఐదింటికి చేసుకున్నాం అనుకోండి. మళ్లీ ఐదింటి వరకు మర్నాడు ఉంది కాబట్టి, ఐదింటికి లేస్తామని మన మీద మనకు నమ్మకం లేదు కాబట్టి, రాత్రి పదింటికి ఒకసారి చేసుకున్నారనుకోండి, ప్రొద్దున్న మళ్లీ పది లోపల ఎప్పుడైనా చేసుకోవచ్చు. మరీ పది వరకు నిద్రపోలేము కదా. అంత నిద్రపోయేవాళ్ళు ఇక్కడ ఉంటారని నేను అనుకోను. అంటే make sure that there is no discontinuity for 10 years life. '10 సంవత్సరాల పాటు దీనికి అంతరాయం రాకుండా ఈ motor ఇట్లా వేసుకుంటూ ఉండు,' అన్నారు. 'వేసుకుంటూ ఉంటే మార్పులు వస్తాయి' అన్నారు. అది నాకు 94 november లో అది భాసించింది. Make sure with in 12 hours you do it again నువ్వు మళ్ళీ చేయటం వలన మళ్ళీ 12 గంటల వరకు నీకు gap ఐపోకుండా, ఈ లోపల మళ్లీ renew చేశావు అన్నమాట. మళ్లీ 12 గంటల లోపల ఎప్పుడో ఒకప్పుడు prayer చేసుకోవాలి. Make sure that there is no discontinuity. That is all what is required. అట్లా 10 ఏళ్ళు. ఇది ఇప్పుడు మనం చేస్తున్న దాని కన్నా కొంత ఎక్కువ సౌకర్యం. అంటే మూడుసార్లు చేసుకున్నారనుకోండి రోజుకి, అప్పుడు ఈ12 గంటలు దాటిపోతుంది అనే బాధ ఉండదు, 12 గంటలు నిద్రపోతే తప్ప continuous గా. నిద్రకు వెళ్ళే ముందు కూడా చేసుకోండి. అక్కడి నుంచి నువ్వు 7, 8 గంటలు నిద్రపోగలవు మహా అయితే. లేచిన తర్వాత చేసుకోండి. ఈ సాధనకి స్నానంతో సంబంధం లేదు గుర్తుపెట్టుకోండి. గాయత్రి అదీ చదవాల్సి వస్తుంది కాబట్టి, అది వేదపరమైన విషయం కాబట్టి స్నానం. లేకపోతే స్నానంతో సంబంధం లేదు, సి.వి.వి గారు చెప్పింది ఒక్కటే, యోగానికి మామూలుగా ఉండే సాంప్రదాయ నిబంధనలు ఉండవు. పవిత్రత మనస్సుకు సంబంధించినది తప్ప శరీరానికి సంబంధించింది కాదు. శరీరాన్ని నువ్వు ఎంత పవిత్రంగా ఉంచాలి అనుకున్నా, స్నానం చేసి బయటకు రాగానే చమట పోయేనే పోస్తుంది. తర్వాత మనిషిలో మలమూత్రములు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. అది ప్రాణం వదిలేసే సమయంలో బయటకు వస్తాయి. ఆ సందర్భంలో నువ్వు శరీరం ఎప్పుడూ పవిత్రంగా ఉందని ఎట్లా చెప్పగలవు? నీలో minimum stock of మలం, మూత్రం ఎప్పుడూ ఉంటుంది. ఆ level పైన ఉన్నదే బయటకు వస్తుంది. అది ఎప్పుడూ అలాగే ఉంటుంది, ఎప్పుడు పోతుంది అది అంటే, కొత్తది వచ్చి చేరుతుంటే పాతది బయటికి వెళ్తూ ఉంటుంది. మొదట్లోది అట్లా ఉండిపోతుంది అనుకోబోకండి. అలా ఎప్పుడూ కొంత మూత్రమూ ఉంటుంది, మలమూ ఉంటుంది. ఆ సందర్భంలో నువ్వు ఎంత బయట కడిగితే నీ శరీరం శుభ్రమైంది అని లెక్క? అందుకని యోగానికి

మాస్టర్ సి వి వి గారు చెప్పింది చాలా సత్యమైన విషయం. 'నువ్వు స్నానం చేసావా లేదా అనే దానితో నాకు సంబంధం లేదు. లేవంగానే కూర్చో. నీకు ఇష్టం ఉంటే చేసుకో. కానీ చేయడం వల్ల extra ఔతుందని నేనేమీ చెప్పను' అన్నారు ఆయన. మనము గాయత్రి చేయడం వల్ల , మనకి మాస్టర్ గారు ఇచ్చిన నిబంధన స్నానం చేయాలని. సి.వి.వి గారు ఇచ్చిన దానిలో గాయత్రి ఏమీ లేదు. ఎందుకంటే 'మీకు గాయత్రి, నారాయణ మంత్రం, నమశ్శివాయ మంత్రం, ద్వాదశాక్షారి అన్నీ ఇదే. నువ్వు దీన్ని పట్టుకో, పదేళ్లు చెయ్యి, కాకపోతే నన్ను అడుగు. నేను ఇస్తున్నాను వాగ్దానం' అని చెప్పారు ఆయన. దానికి సాంప్రదాయంలో చిక్కుకున్నాం కాబట్టి మనం చాల ముళ్ళు వేసుకున్నాము. అది, ఇది కలిపాము. ఆయన ఇచ్చిన యోగము సులభం. దానికి మనము సాంప్రదాయం చేర్చుకున్నాం కాబట్టి, తప్పక స్నానం చేయాలి. గాయత్రి మంత్రం చేయాలంటే స్నానం చేయాలి. యోగం వేరు, వేదం, వేదాంతాలు వేరు, వేదాంగాలు వేరు. వేదము తెలిసిన వారి పద్ధతి వేరు. ఇది లేవంగానే చేసుకోవచ్చు. మనకి ఎంత సాంప్రదాయం అంటే పళ్ళు తోముకోకుండా ఎట్లా చేస్తామని ఒక పరిమితత్వం ఉంది మనలో. ఎందుకంటే అంతా భావమయమే! భావాన్ని పవిత్రీకరించుకోవాలి. శరీరాన్ని ఎంత పవిత్రీకరించినా మరుక్షణం అది మలినం అయిపోతుంది. అందుకని యోగము మీరు చేద్దామనుకుంటే మిగతా rules అన్నీ పెట్టుకుని మిమ్మల్ని మీరు హింసించుకోవద్దు. చాలా కాలము మాస్టర్ గారు ఆరింటికి prayer చేసి, ఎనిమిదింటికి పూజ అవీ చేస్తుండేవారు. తరువాత మార్పులు వచ్చినాయి. మీరు originals లో కి వెళ్తే, మాస్టర్ సి.వి.వి గారి యోగం చేసుకుంటే ఇంక నువ్వు ఏమీ చేయలేకపోయినా పర్వాలేదు. నీకు పరిపూర్ణంగా తెలిసేట్టుగా నేను చేస్తాను. పది సంవత్సరాల పాటు ఇట్లా చెయ్. అయితే continuity దెబ్బ తింటే, ఎక్కడ నీకు అంతరాయం వచ్చిందో అక్కడ నుండి మళ్ళీ పదేళ్ళు, అని చెప్పారు. Service లో continuity పోతే మళ్ళీ అక్కడి నుంచే లెక్క కదా! మనం మానేసి సంతకం పెట్టకపోతే వాళ్ళు service లో discontinuity పట్టుకొస్తూ ఉంటారు. మళ్లీ అక్కడి నుంచి service count చేస్తారు కదా. అట్లాగే ఇక్కడ కూడా ఈ continuity దెబ్బతింటే అక్కడి నుంచి 10 ఏళ్లు లెక్క. ఇప్పటినుంచి 10 ఏళ్లు అనుకున్నా మనకు ఏమీ నష్టం లేదు. 10 ఏళ్లు అనేది మనం ప్రయాణం చేసే జీవితకాలంలో చాలా చిన్నది. అందుకని make sure that within 10 years, you gain what is promised. 'ఇట్లా చేస్తే నా అంతటి వాళ్ళని చేస్తాను రా మిమ్మల్ని అని, దానికి కావలసిన ప్రాణ శక్తిని నేను ఇస్తాను' అన్నారు. కాబట్టి అది చేసుకుందాము. ఇది విష్ణు సహస్రనామంలో భాగంగా చెప్పుకున్నాం. మాస్టర్ గారి యోగం గురించి ఇవాళ ప్రాణం, ప్రాణం ఇచ్చేవారిని ఈ సందర్భంగా ఒకసారి మీకు

గుర్తుచేయడం జరిగింది. మాస్టర్ గారిది పరమగురువుల యొక్క ప్రణాళిక. మాస్టర్ E.K గారిది, మాస్టర్ C.V.V గారిది కాదా అంటే, అవును. కానీ ఆయన ఇచ్చినదానికి ఒక purpose ఉంది. వాహికలని తొందరగా తయారుచేయటానికి ఇచ్చారు మాస్టర్ C.V.V గారు. అందుకని దాన్ని దానిగా చేసుకోండి, అది మనకి corner stone, foundation stone.

334 వాసవానుజః

వాసవానుజ అంటే ఇంద్రునికి తోబుట్టువు అని అర్థం. ఇంద్రుడికి తోడబుట్టినవాడు అంటే ద్వాదశ ఆదిత్యులు లో ఇంద్రుడు ఒకడు.విష్ణువు ఒకడు.ఆ విధంగా ఇంద్రుడికి అనుజుడు, అంటే కశ్యపుడుకి పుట్టిన 12 మంది ఆదిత్యులలో ఇంద్రుడు పెద్దవాడు, విష్ణువు చిన్నవాడు. అందుకని వాసవానుజుడు అనే నామము. అలాగే కశ్యపునికి భగవంతుడు మళ్లీ వామన మూర్తి అయి జన్మించడం వలన కూడా వాసవానుజుడు అనే నామము ఒకటి ఉన్నది. వామనుడిగా జన్మించి ఇంద్ర పదవిని మళ్లీ ఇంద్రునికి స్థిర పరచడము జరుగుతుంది. విష్ణుగా సమస్త సృష్టిని తను ఆక్రమించి వ్యాపనము చెంది, తాను వెనుక ఉండి నడిపిస్తూ ఉంటే, ముందు ఉండి ఇంద్రుడు నడిపిస్తూ ఉంటాడు. ఇంద్రుడు నడిపిస్తున్నట్లుగా కనిపిస్తుంది కానీ నడిపిస్తున్నది ఇంద్రుని ద్వారా పనిచేస్తున్న వైష్ణవ చైతన్యము. మనము కూడా మన మనసునుండి సద్భావములను వ్యక్తం చేసుకుని సత్కార్యములను నిర్వహిస్తున్నప్పుడు మనలో ఆ భావాలు అట్లా కలగడానికి కారణము మనలో ఉన్న భగవత్ చైతన్యము. మనసు ఇంద్రుడిగా మనము భావన చేసినట్లయితే మనస్సు నడిపించే దివ్యశక్తికి అనుజుడు అంటే తోడబుట్టిన వాడు, తోడు వచ్చేవాడు, ఎప్పుడూ పక్కనఉండేవాడు. ఆ విధంగా మనకి బుద్ధి లోకము నుండి మనసును నడిపించే చైతన్యంగా భగవంతుని భావన చేసుకోవచ్చు. వామనుడిగా భావన చేసుకోవచ్చు. విష్ణుసహస్రనామములో నామముగా భావన చేసుకొనవచ్చు వాసవానుజుడు నామానికి మనం ప్రత్యేకమైన అవగాహన చేసుకోవాల్సిందేమిటంటే వాసవునికి ఎప్పుడు తోడు ఉండేవాడు. ఎవరయ్యా అంటే ప్రాణశక్తి! ఆ ప్రాణ శక్తి తోడుగా ఈ మనసు సమస్త కార్యాలు నిర్వర్తిస్తూ ఉంటుంది. ప్రాణశక్తి తోడు లేదు అనుకోండి మన మనసు ఏమీ ఆలోచించి ఏ పని చేయ లేదు. అందుకని ఈ మనసుకు వెనకాల చైతన్యముగాను, ప్రాణముగాను పని చేస్తున్న దివ్యతత్వాన్ని మనము ఈ నామం ద్వారా గమనించవలసి ఉంటుంది. మనకి మనసు వరకు అంత తెలిసినట్లుగా అనిపిస్తూ ఉంటుంది.సృష్టి మొత్తమునకు నిర్వాహణాధికారి/executive officer ఎవరయ్యా అంటే ఇంద్రుడు. ఇంద్రుడు దివ్య ప్రణాళికను నిర్వహింప చేస్తూ ఉంటాడు. Mind is the plan of work అని మనము చెప్పకుంటాము.ఈ plan of work వెనకాల నిలబడిన చైతన్యమును మనము భగవత్ చైతన్యముగా భావన చేసుకోవాలి. అది రెండు రకాలుగా పనిచేస్తూ ఉంటుంది. ఒకటి ప్రాణముగా పనిచేస్తూ ఉంటుంది అంటే స్పందనముగాను అంటే ప్రణవముగాను. ప్రణవం నుండి ప్రాణముగా వచ్చి ఈ

మనసుకి బలాన్ని చేకూరుస్తూ ఉంటుంది. ప్రాణము ఉసురుమంటూ ఉంటే ఆలోచనలు రావు. ప్రాణము లేకపోతే ఆలోచించే పని లేదు. ఒక పక్క ప్రాణంగా వస్తుంది మరొక పక్క బుద్ధిగా వెలుగై మనసుకి బలాన్ని కలిగించి ఉంటుంది. ఆ బుద్ధి అనే వెలుగు అదృశ్యమైనా, ప్రాణము నీరసించినా మనసు చేయగలిగింది చాలా తక్కువ కదా! అంటే నిర్వహణ అధికారికి ఎప్పుడు పక్కనే నిలబడి, నేను ఉన్నాను నీకు ఏమీ పరవాలేదు అని నిర్వర్తించుకో అని చెప్తూ ఉంటాడు. కానీ తాను ఉన్నట్టుగా కనిపించడు. మనము కూడా మనము చేసే పనులు అన్నింటికీ మనమే చేస్తున్నాము అని అనుకుంటూ ఉంటాం. ఇది నా idea అని అంటూ ఉంటాం కదా! ఇది నా thought వాడు copy కొట్టేశాడు అంటూ ఉంటాం కదా! నీ thought ఏంటి? నీ thought అయితే నీతో పుట్టినప్పటి నుంచి ఉండాలి. మనకి ఆ thought ఆ time లో ఒక ప్రచోదనం లాగా వస్తుంది. ఆ వచ్చిన ప్రచోదనాన్ని అందుకుని, మనసు ఇంద్రియాలని, శరీరాన్ని నిర్వహిస్తుంది. మనకి మనసు ఒక ప్రభుత్వములాంటిది. అంటే తన కింద పనిచేసే కొన్ని దేవతా ప్రజ్ఞలుఉన్నాయి. వారందరూ పంచ భూతాత్మమైన శరీరము, ఇంద్రియాలను అధిష్టించు దేవతలు చాలామంది ఉన్నారు. ఈ సృష్టిలో పనిచేసే అన్ని ప్రజ్ఞలు కూడా ఇంద్రుని వశములో పనిచేస్తున్నట్టుగా ఉంటాయి, కానీ ఇంద్రుడి వెనకాల ఉన్న శక్తి చేత ఇంద్రునికి లోబడి ఆ ప్రజ్ఞలు పనిచేస్తూ వుంటాయి. ఇంద్రుడు అవకతవకలుగా పని చేస్తూ ఉంటే ఆ ప్రజ్ఞలు నెమ్మదిగా సహకారాన్ని అందించడం మానేస్తాయి.మనకు కూడా పనులు కావట్లేదు అంటే ఆలోచించే తీరు బాగోలేదు అని అర్థం.ఎక్కడో తేడా ఉందిట అని అర్థం.అందుకని నీ లోపల వాడున్నాడు మిత్రుడు వలె. కాబట్టి ఒక్కసారి లోపల బుద్ధి లోకాల్లోకి మనము పెరిగి, అక్కడ సంప్రదించి, కర్తవ్యం ఏమిటో గుర్తించి, దాన్ని మనము అనుసరించి ప్రవర్తిస్తున్నంత సేపు ప్రణాళిక నడుస్తూ ఉంటుంది. అలాగే ఇంద్రుడు కూడా కొంత ధర్మాన్ని అతిక్రమించినప్పుడు లేక మరచినప్పుడు, ఆయనకి దేవతల యొక్క సహకారము తగ్గిపోతూ ఉంటుంది. రాక్షసుల బలము పెరిగిపోతూ ఉంటుంది. ఆయనకు సింహాసనము జారిపోతూ ఉంటుంది. అప్పుడు మళ్ళీ తను చేసిన తప్ప తెలుసుకోవడం జరుగుతుంది. అప్పుడు మళ్లీ భగవంతుని ప్రార్థించడం జరుగుతుంది. అప్పుడు భగవంతుడు అవతరించి మళ్లీ దాన్ని సక్రమమైన పద్ధతిలో పెట్టడం జరుగుతుంది. మళ్లీ ఈయనని సింహాసనం మీద కూర్చోబెట్టడం జరుగుతుంది, మన విషయంలో కూడా అది సత్యం. మనలో మనము నరులుగా మానవ మేధస్సుతో పని చేస్తున్నప్పుడు, పనులు కానప్పుడు మనము ఆర్తులమై భగవంతుని శరణు వేడుతుంటాం. పనులన్నీ బాగా జరిగిపోతుంటే మన ప్రజ్ఞ అనుకుంటాం. ఎక్కడో ఒక చోట ధభేలున మోకాలు చిప్పలు పగిలి,ముఖము పగిలి

క్రిందపడి, ఎటులేని పరిస్థితిలో, దిక్కుతోచని పరిస్థితిలో అప్పుడు ఏంటయ్యా అంటే ఇటు అటు చూసుకొని, అప్పుడు దేవుని నమ్ముతాడు ప్రతివాడు. ప్రతివాడికి ఎక్కడ తెలుస్తుందంటే వాడి శక్తికి మించిన సన్నివేశము జీవితంలో రాగానే మనకన్నా మించిన శక్తి ఏదో ఉంది, మనమే అంతాకాదని తెలుస్తుంది. తెలిసినప్పుడు దైవము వైపు మొగ్గుతాడు. మొగ్గినప్పుడు పెద్దలని కలుసుకోవడం జరుగుతుంది. వాళ్ళు చెప్పినట్లు నడుచుకోవడానికి ప్రయత్నం చేస్తూ వుంటాడు. కష్టంలో ఉన్నంత సేపు చెప్పింది వింటూ ఉంటాడు. కష్టము దాటగానే జారిపోతాడు. కష్టమన్నప్పుడు వస్తూ ఉంటాడు. ఇదే ఆర్తుడైనటువంటి భక్తుడు. చతుర్విధ భక్తులుగా మనకి భగవద్గీతలో శ్రీకృష్ణుడు చెప్పిన వాటిలో ఒకటి. అధర్మ ప్రవర్తన కలిగిన వాళ్ళమవడం వలన, కష్టంలో ఉన్నప్పుడు పెద్దల యొక్క సలహా ద్వారా మళ్లే ధర్మము లోకి ప్రవేశించి పనిచేసి, మళ్ళీ బుద్ధిమంతుడితనం పొంది, కష్టాలు దాటిన తర్వాత మళ్ళీ మర్చిపోతూ--, ఇట్లా జరుగుతూ ఉంటుంది. ఇంద్రుడు పురాణాల్లో ఇలాగే ఎన్నో రకాలుగా జారిపోతున్నట్టుగా చూపిస్తూ ఉంటారు. అంటే మనం కూడా అంతే అని చెప్పడానికి. అలాగే మనసు నిర్వాహణ అధికారి అయినప్పుడు, నిర్వహిస్తున్న వాడు తానే అంతా చేస్తున్నట్లుగా అనిపిస్తూ ఉంటుంది. మనం చేయకపోతే జరగదు అనిపిస్తుంది. ఇది జరుగుతున్నప్పుడు మనము వాహికగా భగవంతుడు జరిపిస్తున్నాడు అని తెలిసిన వాడు భక్తుడు. అలా తెలియని వాడు సామాన్యమైన మానవుడు. ఇక్కడ తాను జరిపిస్తున్నాడు అని మనకు తెలిసినా, మనం తెలియక ప్రవర్తించినా, మనలో ప్రాణముగా ఎప్పుడూ మనతో ఉంటాడు. మనలో స్పందనముగా ఎప్పుడూ మనతో ఉంటాడు. మనలో చైతన్యంగా ఎప్పుడూ మనతో ఉంటాడు. సంప్రదిస్తే పలుకుతాడు. సంప్రదించకపోతే నిద్రపోతూ ఉంటాడు. వాడిని చేసుకోని, వాడికేమైనా తిప్పలు వచ్చినప్పుడు మనల్ని నిద్ర లేపుతాడని లోపల శుభ్రంగా పడుకుంటాడు.నిద్రాణమైన స్థితిలో ఉంటాడు, దివ్య చైతన్యం నందు ఆసక్తుడైన వాడికి.ధర్మానికి బద్ధుడై జీవించే అందరికీ దివ్య చైతన్యం యొక్క సహకారం ఉంటుంది. ధర్మబద్ధమైనటువంటి జీవితమే చెప్పింది వేదము. ఒక దేవునికి ఒక రూపం పెట్టి, ఒక నామం పెట్టి, ఒక దీపం పెట్టి, గుడి కట్టి, ఒక మఠం పెట్టమని చెప్పలేదు. అందుకని భారతంలో ధర్మాలు తెలుసుకోవాలి. భారతంలో ధర్మమే దైవము అని చెప్తారు. అందుకనే బుద్ధుడు కూడా వచ్చి "ధర్మం శరణం గచ్ఛామి" అని చెప్తాడు. ధర్మాన్ని అనుసరిస్తున్నంత సేపు దివ్య చైతన్యం యొక్క సహకారము మనసుకి అందుతూ ఉంటుంది. ధర్మము అధిష్టించి ఉండటం చేత మనసు మాట ఇంద్రియములు వింటూ ఉంటాయి, ఇంద్రియాల మాట శరీరం వింటూ ఉంటుంది. చైతన్యం నుండి మనసు బాగా దూరం అయి విడి పడిపోయింది

అనుకోండి, అంటే బాగా ప్రత్యేకంగా తనను తాను చూసుకొనే పరిస్థితి జీవునికి వచ్చిందనుకో! ఈ శరీరంలో పని చేస్తున్న సమస్త అవయవములలో, ఇంద్రియాలలో గల దేవతలు, దైవము లేక ధర్మము యొక్క సాన్నిధ్యాన్ని మనము గుర్తించక, అస్తిత్వాన్ని గుర్తించక, మనం ఎట్లా పడితే అట్లా ప్రవర్తిస్తున్నప్పుడు దేహంలో క్రమశః ఇవన్నీ ఒకటి, ఒకటి అదృశ్యమవటం మొదలుపెడతాయి.ఈ దేవతలు దేహంలో అదృశ్యం అవటమే మనకి ఆరోగ్యం పోవటం ఉంటుంది క్షీణించడము అనేది మొదలవుతూ ఉంటుంది. మనము ఎంత పట్టుదలగా ఉన్నా సరే మన శరీరము మన మాట వినని పరిస్థితి మనకి వస్తుంది ప్రాణము సన్నగిల్లుతూ ఉంటుంది. దాంతో ఆలోచనలు సన్నగిల్లుతూ ఉంటుంది. చైతన్యం కూడా సన్నగిల్లుతూ ఉంటుంది. ఈ విధముగా మనకి సహకారం పోతూ ఉంటుంది అందుకని ఈ అనుజుడు మనకన్నా చిన్నవాడిగా కనిపిస్తాడు. ద్వాదశ ఆదిత్యులలో కూడా విష్ణువు ఇంద్రుడి కన్నా చిన్నవాడిగా కనిపిస్తాడు, వరుస క్రమంలో చెప్పినప్పుడు చిన్నవాడు అని ఎందుకు చెప్పాడు అంటే మనల్ని పెద్దవాడుగా project చేసి, తాను చిన్నవాడిగా లోపల ఉంటాడు భగవంతుడు.మనందరిలో ఉండే భగవంతుడు అన్నింటి కన్నా పెద్దవాడు. ఈ మొత్తం సృష్టి కన్నా పెద్దవాడు. సృష్టి కూడా అతనిలో నుండి వచ్చింది. అటువంటి వాడు ఎంతో చిన్నవాడిగా మనలో ఉంటాడు. ఉండి పనులు చేస్తూ ఉంటే, అందరూ ఫలానా వాడు ఇవన్నీ చేస్తున్నాడు అని బయట ప్రపంచము గుర్తిస్తూ ఉంటుంది. గుర్తించినప్పుడు మనమేమి గుర్తించాలి అంటే మనలో చిన్నవాడిగా ఉన్నట్టుగా ఉండి సమస్తమైన కార్యములు నిర్వహిస్తున్న వాడిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉండాలి అలా కాకుండా మనమే చేస్తున్నాము అనుకున్నట్లయితే, ఏం జరుగుతుంది అంటే ఆయన్ని మర్చి పోవడం జరుగుతుంది.ఆయన్ని మర్చిపోతే ఏం జరుగుతుంది చెప్పడానికి మనకి ఈ ఇంద్రుని యొక్క కథలు చెబుతూ ఉంటారు. కాబట్టి వాసవానుజు డుని ఎప్పుడూ ఆ విధంగా గుర్తు పెట్టుకుంటూ ఉండాలి. అలా మనకు గుర్తు ఉన్నట్లయితే, వామనుడు వలే రక్షిస్తాడు. వాసవానుజుడు వామనుడు అనటానికి అక్కడ మనకి ఒక రకమైన అనుసంధానం ఇచ్చారు. సంకల్పించడం అనేది భగవంతుడు నుండి వ్యక్తం అయినది. ఆ సంకల్పానికి రూపకల్పన చేయటం, భావముగా బ్రహ్మ వ్యక్తమవటం జరుగుతుంది. బ్రహ్మము నుండి సంకల్పింపబడిన ఈ సృష్టి అంతా కూడా దానికి ఒక ప్రణాళికను వేసుకుని తీర్చిదిద్దుకొని ఆ ప్రణాళిక ప్రకారం సర్వాన్ని నిర్మాణం చేయటం సృష్టిలో ఇంకో ప్రజ్ఞ వ్యక్తం అయింది. ఆ ప్రజ్ఞని ఇంద్రుడు అని మనము అంటాము. అందుకని సృష్టికి executive officer ఎవరయ్యా అంటే ఇంద్రుడు. వేదములలో శుక్రుడు అని కీర్తింపబడుతూ ఉంటాడు. వేదములో ప్రధాన నాయకుడు

ఎవరంటే శుక్రుడు లేక ఇంద్రుడు. ఆయన నిర్వర్తిస్తే పనులు అవుతాయి. ఆయన నిర్వర్తించుక పోతే పనులు కావు. కానీ ఆయన అంతట మాత్రము ఆయన నిర్వహించలేడు. కారణమేమిటంటే ఆయన నిర్వర్తించడానికి వెనకాల బ్రహ్మ సంకల్పము ఉండాలి. అమ్మవారి యొక్క శక్తి ఉండాలి. అయ్యవారి యొక్క అస్తిత్వము ఉండాలి. భగవంతుడికి ప్రధానమైన తత్త్వము, అస్తిత్వం లేదా ఉండుట. మనము ఉన్నాము అనుకోవడం భగవంతుని యొక్క మూలతత్వం. అది ఉండటం చేత మనమంతా ఉన్నాము అనుకుంటూ ఉంటాం. అలాగే మనలో మనం ఉన్న వాళ్ళము చైతన్యవంతులము అవుతూ ఉంటాము, ప్రతి ఉదయము. చైతన్యవంతులు అయినప్పుడు కూడా ఉండి ఉంటాము.చాలా విషయాలు మనలో భావన చేసుకుంటే మనలో ఉన్న భగవత్ తత్వాన్ని మనము అనుభూతి చెందవచ్చు అది అనుభూతి చెందడం ద్వారా దానినే సమస్తము నందు దర్శనము చేయవచ్చు.ఇది యోగ మార్గము, సాధన మార్గము, ఇది సులభమైన మార్గము ఇందులో రకరకములైన పూజలు, క్రతువులు, వ్రతములు అయిన బాధలు లేవు, మంత్ర తంత్రాలు, ఉపాసనలు లేవు. ఉండటం అనేది భగవంతుని యొక్క అస్తిత్వమే! మన యొక్క అస్తిత్వము, మనము వేరుగా లేము, భగవంతుడు ఉండటము చేత మనము ఉన్నాము అనుకుంటూ ఉంటాము. ఉన్న వాళ్ళమే చైతన్యవంతులు అవడానికి ప్రతి ఉదయము మనకి తెలివి వచ్చిందనే పద్ధతిలో జరుగుతూ ఉంటుంది కదా! అదీ మనలో అమ్మవారు మేల్కాంచటము అంటే! దాన్ని మనకి వేదములలో అదితి అని కీర్తించారు అదితి ని వర్ణించడానికి ఋగ్వేదం మొత్తము చాలలేదు సూర్యోదయం వర్ణించుటము లేక మొదటి వెలుగు వ్యక్తమవటము అనేది వర్ణించడం కోసం ఋషులకు వాజ్ఞయము చాల లేదుట.అటువంటిది ప్రతి ఉదయం మనకి తూర్పున జరుగుతూ ఉంటుంది ప్రతి ఉదయము మనకూ జరుగుతూ ఉంటుంది.మనము ఎక్కడి నుండి నిద్రలేస్తున్నాము? అక్కడి నుంచే మనము వెలుగులోకి వ్యక్తం అవుతూ వుంటాము చైతన్యవంతులమవుతున్నాము దాన్నే మనము తెలుగులో తెలివి వచ్చింది అనుకుంటున్నాం ఈ వచ్చిన తెలివి అంతకు ముందు ఎక్కడ వుంది ? వచ్చిందంటాము కాబట్టి ఎక్కడి నుంచో రావాలి కదా! అది ఎక్కడి నుంచి వచ్చింది అంటే అస్తిత్వంలో నుంచి వచ్చింది, ఉన్నదానిలో నుంచి వచ్చింది.ఆ ఉన్నదాన్ని సత్యము అని అంటారు.అది ఎప్పుడూ ఉంటుంది అందులోంచి వ్యక్తం అయిన చైతన్యము వచ్చి పోతూ ఉంటుంది. అందుకని వచ్చి పోతూ ఉండటం చైతన్యము. అంటే కాలము యొక్క చక్రంలో అట్లా మనకి వచ్చినట్టుగాను, మళ్ళీ వెళ్లినట్లుగాను ప్రతి ఉదయము వెలుగు వస్తూ ఉంటుంది, మళ్ళీ చీకటి వస్తున్నట్లుగానే, ఒక్కొక్క యుగం, ఒక మహా యుగం, ఒక్కొక్క మన్వంతరం, కల్పములు, బ్రహ్మ పగలు,

బ్రహ్మ రాత్రి. అటువంటి బ్రహ్మలు ఒక్కొక్కళ్ళు రావడం వెళుతుండటం, ఇవన్నీ మనకి జరుగుతూ ఉండేది. మనకి రోజు నుంచి మొదలైతే అమ్మవారు అయ్యవారు నుంచి వ్యక్తం అయ్యి, మళ్ళా అయ్యవారిలోకి వెళ్ళిపోతూ ఉంటుంది. కాబట్టి ఈ మొదటి ఉండటం, తర్వాత తెలివి రావటము, తెలివి వచ్చిన తర్వాత సృష్టి. అందుకని అయ్యవారి నుంచి అమ్మవారు వ్యక్తం అయితే, అయ్యవారు అమ్మవారు కలిసిన స్థితిలో బొడ్డులో నుంచి బ్రహ్మ వ్యక్తం అయ్యాడు అంటారు వైష్ణవపరంగా. శివపరంగా అమ్మవారు అయ్యగారు ఒకరి కళ్ళల్లోకి ఒకరు చూసుకుంటూ ఉంటే వాళ్లలో నుంచి పుట్టుకొచ్చారంట ఒక ఆయన. ఆయనే గణపతి. అట్లా ఒకొక్కళ్ళు ఒక్కొక్క పద్ధతి చెప్పినా మనకు కావాల్సింది పేర్లు కాదు. ఈ సృష్టి జరిగే విధానం. అది ప్రతినిత్యము మనలో జరుగుతూ ఉంటుంది. ఈ విష్ణు సహస్రనామములు మనలో జరుగుతున్న ప్రక్రియలకు లేక శక్తుల యొక్క కార్యములకు ప్రత్యేకమైన నామాలన్నీ మనకు గోచరిస్తూ ఉంటాయి. అందుకని విశ్వం మొత్తంలో ఏదైతే దర్శించగలమో అది మనలో దర్శించవచ్చు. భగవంతుని యొక్క 1008 తత్వములు ప్రతివారు తన సాధన పరంగా తనలోనూ, తన చుట్టూ దర్శించడానికి అవకాశం ఉంటుంది కాబట్టి ఈ పరంగా మనం చెప్పుకుంటున్నాము. ఉండటము అన్నది, చైతన్యమంతుల అవడం అన్నది, అక్కడి నుంచి బ్రహ్మ పుట్టడం, బ్రహ్మ నుంచి సృష్టి సంకల్పం రావటము, అంటే ఏంటంటే మనం కూడా మొత్తంలో నుంచి ప్రతి ఉదయం మెలుకువలోనికి వచ్చినపుడు కదా మనకు భావాలు వస్తాయి. భావాలు వచ్చినప్పుడు కదా మనం ప్రవర్తనలోకి వస్తాము. భావము లేనప్పుడు ప్రవర్తన లేదు కదా! భావం రావాలి అంటే అంతకుముందు చైతన్యం ఉండాలి కదా! చైతన్యం ఉండాలి అంటే అంతకుముందు అసలు మనము ఉండాలి కదా! ఉండటం వలన చైతన్యవంతులము అవడం వలన, భావం రావటం వలన కార్యములు జరుగుతూ ఉంటాయి కదా! ఒక భావం మనకు వచ్చినప్పుడు ఆ భావాన్ని ఏ విధముగా నిర్వర్తించాలి? అది అతి ముఖ్యమైన అంశం. మనకు భావము వచ్చినప్పటికి మూడు స్థితులు అయినాయి. ఒకటి ఉండటం, చైతన్యవంతులు అవ్వటం, మన యందు ఒక భావము కలగటం. ఒక భావము వచ్చిన తర్వాత ఆ భావం చక్కగా నిర్వర్తించిన వాడు పరిపూర్ణుడు. భావములను చక్కగా అవతరింప చేసుకోలేని వాడు వ్యర్థుడు. అంతే మొత్తం అంతా! సృష్టిలో ఆ కార్యము నిర్వహించటం అనే తత్వము కూడ భగవత్ తత్వమే! అంతకుముందు మనకు విష్ణు సహస్రనామంలో ఒక నామం విష్ణువుని ఇంద్రుడుగా కూడా చెప్తారు. 'మహేంద్రో ధనదః కాలో' 'ఇంద్ర కర్మ, మహాకర్మ' అంటూ ఉంటాం కదా! కాబట్టి ఇంద్రుడు కూడా భగవంతుడు యొక్క తత్వమే! నిర్వర్తించే వాడు ఇంద్రుడు. ఏం నిర్వహిస్తున్నాడు అంటే బ్రహ్మ సంకల్పాన్ని

నిర్వర్తిస్తున్నాడు. బ్రహ్మ సంకల్పం అంటే బ్రహ్మాణము అయిన సంకల్పం. అంటే వ్యక్తమైన సంకల్పము. మనము కూడా చాలా సంకల్పాలు బ్రహ్మాణము చేస్తూ ఉంటాం. బ్రహ్మ నుంచి ఎట్లా అయితే సంకల్పము వస్తూ ఉందో, ఆ తత్వము దైవీ తత్వంలో ఉంది కాబట్టి మనలో కూడా అది ఉండి, మనకు కూడా వస్తూ ఉంటాయి ఆలోచనలు. మనము ఆలోచించము ఆలోచనలు వస్తూ ఉంటాయి అంతే మనం మానేద్దామనుకుంటే ఆగవు కదా! ఎందుకు ఆగవు అంటే ఉన్నది అటువంటి సృష్టిలో రహస్యం. ప్రొద్దున్నే లేవకూడదు అనుకుంటే లేవకుండా ఉండగలమా? నిద్ర పోకూడదు అనుకుంటే పోకుండా ఉండగలమా? ఆలోచన రాకూడదు అనుకుంటే రాకుండా ఉండగలమా? ఇవన్నీ విష్ణుతత్వంలో ఉన్నాయి మనలో కూడా ఉన్నాయి.కాబట్టి మనలో కూడా వ్యక్తమవుతూ ఉంటాయి వ్యక్తమౌతున్న దాన్ని ఉన్నది ఉన్నట్టుగా చక్కగా ఆచరణ చేయగల ప్రజ్ఞ ఏదైతే ఉందో వాడిని శుక్రుడు అన్నారు వాడిని ఇంద్రుడు అన్నారు. అంటే అధిదేవత, భావానికి చక్కని రూపకల్పన చేసి దాన్ని అవతరింప చేయగలదు. మనలో ఎంతమంది మనకు వచ్చిన భావాన్ని చక్కగా సకాలంలో అవతరింప చేయగలము? చేయగలవాడు ఎవరయ్యా అంటే స్వచ్ఛమైన, శుద్ధమైన, స్ఫటికమంత స్పష్టత వున్న మనసు కలిగినవాడు చేయగలడు. మనలో ఇంద్రశక్తి మనస్సుగా పనిచేస్తుంది. మనస్సుగా మనలో పనిచేస్తున్న ఇంద్ర శక్తి కారణం చేత అందులో స్పష్టత ఉన్న వాళ్ళకి, వచ్చిన సంకల్పాన్ని అట్లా ప్రతిబింబంగా భూమ్మీదికి అవతరింప చేయగలరు ఒక కార్యాన్ని అనుకున్న పద్ధతుల్లో అనుకున్నట్టుగా చేయగలిగిన వాడు పరిపూర్ణ మానవుడు. అనుకున్నాం కానండి, ఏదో అవొచ్చినాయండీ, ఇవి వచ్చినాయండి, పక్క వాళ్ళు ఎవరో మాకు అడ్డుపెట్టారు, అని ఎవరి మీదో నెపం వేసేసి మనం చేయలేకపోవడానికి చూసే వాళ్ళందరూ కూడా అపరిపూర్ణులే.జీవితంలో తనకి సమర్ధత అనేది ఎక్కడ నిర్ణయము అవుతుందంటే అంతర్ లోకంలో లేక ఉర్ధ్వలోకంలో ఏర్పడ్డ సంకల్పాలకు చక్కటి రూపకల్పన చేసి, దాన్ని అవతరింపచేయగల వారు. భావాలు పుట్టలు పుట్టలుగా ఉండి ఏమీ చేయలేని వాళ్ళు మనకి కోటానుకోట్లు కనిపిస్తూ వుంటారు. వచ్చిన భావాన్ని వచ్చినట్లుగా అవతరింప చేయగలిన వాళ్ళు చాలా తక్కువ మంది కనిపిస్తూ వుంటారు. దానికి ముఖ్యం ఏమిటంటే ఇంద్ర శక్తి లేక ఈ మనోశక్తి దాని యొక్క స్పష్టత. దాన్ని పెద్దలు యజుర్వేదముగా ఇచ్చారు. ఎట్లా చేసుకుంటే జయం కలుగుతుందో చెప్పేది యజుర్వేదము! మనకు యజము వలన జయం కలుగుతుంది అని పెద్దలు చెప్తారు.యజమంటే యజ్ఞం. యజ్ఞం అంటే sacrifice, త్యాగము.సృష్టిలో జరిగే ప్రక్రియ మనం చూసినట్లయితే ఒకదాని కోసం ఇంకోకటి పనిచేయటం ఉంటుంది కానీ, తన కోసం తన పని చేసుకోవడం ఉండదు. అది

కేవలం మానవులకు ఉన్న దరిద్రం. తనకోసం అనే భావనలు పడటం చేత తనకు అయ్యే పనులు తనకి కావు. అందుకని మనకి పురాణంలో ఇంద్రుడు సృష్టి నిర్వహణ కార్యక్రమం చేస్తున్నంతసేపు చక్కగా పరిపాలన జరుగుతూ ఉంటుంది. తన గురించి తాను ఆలోచించుకోగానే కుర్చీ వెళ్ళిపోతూ ఉంటుంది. ఎవరో పట్టుకెళ్ళిపోతు ఉంటారు. మళ్లీ తనకి తెలివి వచ్చినప్పుడు ఆయన కుర్చీ ఆయనకు దక్కుతూ ఉంటుంది. మనకు కూడా అంతే! మనకోసం అని మనం వెంపర్లాడుతుంటే మనసులో స్పష్టత తగ్గుతుంది. ఎందుకంటే అన్ని మన వైపుకు మళ్ళించుకుందాం అనే తాపత్రయంలో కర్తవ్యాన్ని చక్కగా నిర్వర్తించడం లో ఒడిదుడుకులు ఉంటాయి. ఆ ఒడిదుడుకులు ఉండకుండా ఉండాలంటే యజము వలే కార్యము చేయాలి. అదే శ్రీకృష్ణుడు కర్మయోగంలో 'నీ కోసం అనుకోబోకు ఈ మొత్తం లో నీకోసము ఏమీ లేదు, నీ భ్రమ తప్ప. ఒకళ్ళ కోసం చేయించడమే ఉంటుంది అది తెలుసుకో' అని చెప్తాడు. ప్రకృతి ఇంకొకరి కోసం చేయిస్తూ ఉంటుంది. నీ పిల్లలు అనుకోకపోతే నువ్వు చేయవు కాబట్టి నీ పిల్లలు అనే భ్రమ కల్పిస్తున్నాము కానీ వాళ్ళు నీ పిల్లలు కాదు, నా పిల్లలు. నా పిల్లలకు నువ్వు చేయంటే చేయవు కదా! అందుకని నీ పిల్లలు అని భ్రమ కల్పించడం చేత నీవు పగలనక రాత్రనక శ్రమించి పనిచేస్తుంటావు. కానీ నిజానికి నువ్వు చేస్తున్నది ఇంకోళ్ళ కోసం కదా ! నువ్వు వేస్తున్న బట్ట ఇంకొకళ్ళకి అన్నం పెట్టడం కోసం. నువ్వు తినే తిండి ఇంకొకళ్ళకి అన్నం పెట్టడం కోసం. నువ్వు తిరిగే కారు ఇంకొకళ్ళకి అన్నం పెట్టడం కోసం. నువ్వు ఏ పని చేసినా అది ఇంకొకరి కోసము సుమా. సృష్టిలో ఈ రహస్యం ఉంది. నీది అని నువ్వు అనుకుంటున్నావు. నిజానికి నీది ఏమీ లేదు ఉన్నదంతా ఇతరుల కోసమే. నీ భావన కూడా ఇతరుల కోసమే అనేది ఎరిగి చేసినట్లయితే తృప్తి నీది. అది లేనప్పుడు తృప్తి నీకు ఉండదు. కార్యములు ఎన్నయినా చేస్తూ ఉండొచ్చు కానీ తృప్తి వుండదు. నీకంటే ఏమీ మిగలదు కాబట్టి, అట్లా మిగల్చరు సృష్టిలో. మనము ఎంతో మంది చేస్తే మనకి కొంచెం దక్కినట్టుగా ఉంటుంది. అడ్డచాకిరిగా ఉద్యోగం రూపం లో ఎంతో మందికి చేస్తూ ఉంటే కదా, మనకి నాలుగు రూకలు ఇంటికొస్తున్నాయి. అట్లాగే వ్యాపారస్తులు, అట్లాగే ఇంకోళ్ళు, ఇంకా ఎవరైనా అట్లా ఇతరులకు చేయకుండా తనకు రావడం లేదు కాబట్టి, ఇతరుల శ్రేయస్సు కోసం తను కర్తవ్యం నిర్వహిస్తున్నాను అని తెలిసి ఉండడం చేత మనసులో స్పష్టత బాగా ఉంటుంది ఈ స్పష్టత ఉన్న వాళ్ళు ఏ కార్యం అయినా తన దగ్గర సంకల్పం వస్తే, ఆ సంకల్పాన్ని రాగానే పరిగెత్తి పనులు చేసేటట్టుగా చేయరు. ఆ సంకల్పమును తనలో తాను వివరించుకోవాలి. ఈ సంకల్పము నెరవేరాలి అంటే ఎటువంటి వనరులు ఉండాలి, అంటే మానవ వనరులు ఎటువంటివి ఉండాలి, అంటే man power,

material power ఎంత ఉండాలి, కాలము, దేశము సరైనవేనా, తనలో దానికి సంబంధించిన శక్తి సామర్థ్యాలు ఉన్నాయా లేవా, లేకపోతే అవి పెంచుకోవాలా ఇవన్నీ ఆలోచించాలి. అంతేగాని మనకు సంకల్పం రాగానే దాన్ని చక్కగా మీమాంస చేయకుండా చేయకూడదు. దీన్నే పూర్వ మీమాంస అని ఇచ్చారు పెద్దలు.అట్లా చక్కగా తెలియటం అనేది మనసుకుండే స్పష్టత. స్పష్టత లేని వాడు భూమి మీద మహత్తరము అయిన కార్యములు చేయలేడు. గుర్తుపెట్టుకోండి. ఇది పరిపూర్ణ యోగము పరమ గురువులు మార్గము.సనాతనము అయిన మార్గము. ఇది ఒక యోగ మార్గము ఇందులో మనస్సును నిందించడం కానీ, మనస్సుని చంపడం గాని, మనస్సుని అణిచిపెట్టడం కానీ చెప్పరు. ఎందుకంటే మనస్సు ఎక్కడి నుంచి వచ్చింది? భగవంతుడు నుంచి వచ్చినదే! దీనికి సంబంధించిన ప్రత్యేకత దీనికి ఉన్నది. దీన్ని ఎలా వినియోగించుకోవాలో తెలుసుకోవాలి. అద్దము మన మొహం ఎలా ఉంటే అలా చూపిస్తుంది.మొహం బాగుండకపోతే అద్దం పగలగొడితే ఏమవుతుంది? అద్దం నా మొహాన్ని చెత్తగా చూపిస్తున్నది కాబట్టి అని అద్దాన్ని పగల గొట్టుకున్న వాడు ఎంత తెలివైన వాడో, ఈ మనస్సును అణిచేద్దాం, మనసు దీనికి శత్రువు, ఇటువంటి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతుంటారు. తెలియకమెట్ట వేదాంతము చెప్పేవారు లక్ష మంది ఉంటారు. మనసు నీది కాదు, అది కూడా దివ్యమైనదే! దైవం నుంచి వచ్చినదే! అది ప్రతిబింబింప చేస్తూ ఉంటుంది. నీకు వచ్చిన సంకల్పాన్ని ఎలా నివర్తించుకోవాలో అక్కడ అద్దం పెట్టాడు దేవుడు. అదే మనకు ఈ రోజున ఒక tax కట్టాలి అనుకుంటే ఎట్లా కట్టాలి అంటాం? దాన్ని know how అంటారు. అట్లాగే మనం ఒక పని చేయాలనుకున్నప్పుడు ఎట్లా చేయాలి? చేద్దాం అనుకుంటే మన దగ్గర అంతా ఉన్నట్టు, సామర్థ్యం కలిగిన వాళ్ళలా బయలుదేరిపోతుంటాము. ఒక ఆవిడ గారెలు వండుదాం అనుకొని గబగబా అన్ని గిన్నెలు రెడీ పెట్టుకుని, గారెలు ఏ పప్పుతో చేస్తారు తెలియదు. పక్కింటి పిన్నిని గోడ చాటుగా అడిగింది, ఏం పప్పు అని అడిగితే మినపప్పు అని చెప్పింది, మినప్పప్పు తర్వాత ఏం చేయాలో తెలియదు, ఈవిడికి గారెలు చేయడం రాదని పిన్ని గారికి అర్థం అయి 'అమ్మా చెప్తాను విను, దాని నానపోయి' అంటే ఇంక నాకు తెలుసు అని వెళ్ళిపోతుంది. మళ్లీ ఏం చేయాలో తెలియదు, మాటిమాటికి ఇట్లా చేయడం వల్ల అక్కడ పాయ్యి కాలిపోతుంది, నూనె కాలిపోతుంది. అట్లాగే ఏమీ తెలియకుండా అంతా తెలిసినట్టుగా బయలుదేరి ఏమీ చేయలేని వాళ్ళు చాలా మంది ఉంటారు. ఇందాక పాయ్యి కాలిపోయినట్లుగా జీవితము కాలిపోతుంది. ఇంద్రుడు యొక్క ప్రాముఖ్యత సృష్టిలోను, మనలోనూ వుంటుందని చెప్తున్నారు. ప్రత్యేకంగా భారతీయులకు ఇది చాలా అవసరం. మనకేం తెలుసో మనకి అందని

స్థితిలో, దానిక సరియైనటువంటి విషయాలు అందేసుకుని మింగేద్దామనుకోవడం చాలా అలవాటు మనసుకి స్పష్టత ఉండాలి. అది ఇంద్రుడు. ఉత్త స్పష్టత పనికిరాదు. స్పష్టత ఉంది కానీ వచ్చిన ఆలోచన చాలా భయంకరంగా ఉందనుకోండి, అప్పుడు ఏమవుతుంది? నువ్వు ఒక రావణాసురుడివి, ఒక దుర్యోధనుడివి, ఒక హిట్లర్గా అయిపోతావు. ఎందుకంటే ఏం కావాలో నువ్వు అవతరింప చేయగలవు. ఒక దరిద్రపు పని అలా అవతరణ చేయగల శక్తి నీ దగ్గర మనసులో ఉంది. ఇంద్రుడికి అనుజుడుగా వెనకాల ఆయన ఉన్నప్పుడే ప్రతిభ. ఆయన లేనప్పుడు ఈయనకి ప్రతిభ ఏమీ లేదు. ఇంద్రుడు లేకపోతే పనులు కావు గుర్తుపెట్టుకోండి. మనకు పనులు కావట్లేదు, చేతకావటం లేదు అంటే మనస్సు యొక్క స్పష్టత లేదని అర్థం చేసుకోండి. ఎవరిని నిందించవద్దు.మనకు పనులు కాకపోతే మన చేతకానితనానికి ఇంకొకరిని నిందించడం ఎందుకు? అసమర్థుడికి కోపము ఎక్కువ అని చెప్తారు పెద్దలు అందువల్ల పనులు కావడం, కాకపోవడం, అనేది మన మనస్సులో ఉన్న స్పష్టత బట్టి ఉంటుంది. మనస్సులో స్పష్టత ఉంటే ఏ పని, ఎక్కడ, ఎప్పుడు, ఎలా చేయాలో తెలిసి ఉంటుంది. దానిని know how అంటారు. Know how రాగానే, దానిలో నుంచి design వేసుకుంటారు. దాన్ని Basic enginnering design అంటారు మనం కూడా ఎట్లా చేయాలో తెలుసుకున్న తర్వాత ఒక plan వేసుకోవాలి, ఇట్లా చేసుకోవాలి అని . అట్లా దాన్ని అమలు పరచడము అనేది మనస్సు చేసి పడుతుంది. సంకల్పం బాగుంటే ఆనందాన్ని కలిగిస్తుంది. సంకల్పం బాగుండకపోతే అది ఏడిపిస్తుంది రావణాసురుడు, హిరణ్యక్షుడు, హిరణ్యకశిపుడు వీళ్ళందరూ కూడా మనసులో స్పష్టత పరిపూర్ణముగా ఉన్నవాళ్లే కానీ సంకల్పంలో తేడా ఉంది. ఋషులు, మహాత్ములు, యోగులు సంకల్పము నందు దివ్యత్వం కలిగి, మనస్సునందు సామర్థ్యం కలిగిన వాళ్ళు. ఊర్ధ్వలోకము నుండి అధో లోకములకు చక్కని యోగము జరిగి, సూక్ష్మం నుంచి స్థూలానికి ఏదైనా సరే అవతరింప చేయగలిగిన సిద్ధి కలిగిన వాళ్ళని సిద్ధులు అంటారు, వాళ్ళని యోగులు అంటారు. చాలా మంచి వాడండి, కానీ పాపం ఏమీ చేయలేడండీ అంటే ఏమీ ఉపయోగం లేదు. చాలా బాగా చదివాడండీ, సమర్థత ఉంది. కానీ మంచి వాడు కాదండి, అంటే ఉపయోగం లేదు.'తెలివికిని సద్గుణంబుల బలిమి' అని చెప్పారు కదా! "Let virtue be the strength of my Intelligence" అంటారు. కర్ణుడు mental clarity ఉన్నవాడు, బలం వున్నవాడు, బుద్ధి మంచిది కాదు. అర్జునుడు mental clarity తో పాటు, స్పష్టత తో పాటు, నిర్మలమైన మనస్సు కలిగిన వాడు, ధర్మ సమ్మతమైన భావము కలిగినవాడు. అందుకని ఒక మెట్టు ఎక్కువగా ఉంటాడు. అందుకనే శ్రీకృష్ణుడు అన్ని తరచి చూసి చివరికి ఏమంటాడు అర్జునుడితో

భగవద్గీతలో. నువ్వు జ్ఞానివై పో అనలేదు, తపస్సు చేసుకో అనలేదు, మంత్రం చెయ్యి అనలేదు 'యోగీ భవ అర్జున' అంటాడు. నీవు యోగి అవ్వు నేను సంతోషిస్తా, అంటాడు. యోగం అంటే వాడితో కూడి ఉండి, స్పష్టత కలిగి పనులు చేసుకోవటం. ఇంద్రుడు లేకపోతే పనులు కావు.స్పష్టత, సామర్థ్యం కలిగిన మనస్సు ఎంత ముఖ్యమో దానికి ఈ అనుజత్వం అంత ముఖ్యం.అనుజత్వం అంటే ఎప్పుడూ దగ్గర ఉండేవాడు అని అర్థం. తోడబుట్టిన వాడు ఎంత దగ్గరగా వుండాలండి. రాముడికి, లక్ష్మణుడి వలె, కృష్ణుడికి బలరాముడు వలె ఉంటారు తోడబట్టినవాళ్లు.కానీ ఈ రోజుల్లో ఏంటంటే తోడబుట్టిన వాళ్ళు కలిసి ఉండే అవకాశం చాలా తక్కువ. అది కలియుగ ధర్మం. ఇక్కడ ఇంద్రుడికి ఈయన ఉండడం చేత ఆ బలం. మనకు కూడా మనం చేసే పనులకి మూడు రకాలుగా సానిధ్యము ఇస్తూ ఉంటాడు భగవంతుడు. ఒకటి చైతన్య స్వరూపముగా! చైతన్యం లేకపోతే భావము లేదు. రెండవది ప్రాణస్వరూపముగా! ప్రాణశక్తి లేదనుకోండి, నువ్వు ఎంత పని చేయగలవు? స్పందన రూపంలో నీకు సహకరిస్తూ ఉంటాడు. మనకి ప్రాణ శక్తి, ఆరోగ్యము ఇవన్నీ ఉండటం వలన ఆయన చేత పనులు మనకి చక్కగా జరుగుతూ ఉంటాయి. అది ఇంద్రుడికి, గరుత్మంతుడికి మైత్రిగా భారతంలో చెప్పబడింది. గరుడోపాఖ్యానములో మనకి ముగ్గురు యొక్క మైత్రి కన్పిస్తుంది. గరుత్మంతుడు బయలుదేరుతాడు తన తల్లి దాస్యాన్ని విముక్తి చేయడానికి. అందులో సాధన పరంగా మూలాధారం నుంచి బయలుదేరినట్లుగా ఉంటుంది. బయలుదేరి ఉత్తమమైన లోకాలు చేరుకుంటాడు. దారిలో ఇంద్రుడు అడ్డుపడతాడు అంటే మనం చేసే సాధనకు మన మనస్సు అడ్డుపడుతూ ఉంటుంది. ఈవేళ చేయకపోతే ఏం అనిపిస్తుంది, చేస్తేనేనా అనిపిస్తుంది, మిగతా వాళ్ళందరూ చేయట్లేదు కదా అనిపిస్తుంది. రక రకాలుగా అడ్డుపడుతూ ఉంటుంది గరుత్మంతుడికి అమృతాన్ని తెచ్చుకునేటప్పుడు సాధనలో. అమృతత్వం అంటే ఏమిటి? అదే సి వి వి గారి యోగము! అది పొందే లోగా మనకి మనస్సు ఎన్నో రకాలుగా అడ్డుపడుతుంది. అట్లాగే ఇంద్రుడు అడ్డుపడితే గరుత్మంతుడు తన యొక్క సంకల్ప బలము చేత ఇంద్రుని జయించి, పైకి వెళ్లి అమృతము తీసుకుని వస్తూ ఉంటే విష్ణువు దర్శనం జరుగుతుంది. అంటే అమృతత్వస్థితి పొందినప్పుడు ఆత్మ దర్శనం కూడా జరుగుతుంది. ఆత్మదర్శనం అంటే ఉన్న స్థితి! అదే మనలో ప్రణవంగా వుంటుంది. ప్రణవంలో నుండి ప్రాణం పుడుతుంది. అదే స్పందన! గరుత్మంతుడు మనలో స్పందన స్వరూపుడే! విష్ణువు గరుత్మంతుడి తో మైత్రి చేసుకుంటాడు. ఇది ఎక్కడా కనిపించదు. విష్ణువు కోరి గరుత్మంతుడుని వరాలు అడిగినట్లు ఎక్కడైనా కనిపిస్తుందా? ఇక్కడ కనిపిస్తుంది. విష్ణుమూర్తి గరుత్మంతుని వరాలు అడుగుతాడు. గరుత్మంతుడు విష్ణుమూర్తికి

వరాలు ఇస్తానంటాడు, అలాగే నేను కూడా ఇస్తానంటాడు గరుత్మంతుడు. సామాన్యుడు కాదు.గరుత్మంతుడు విష్ణువు దగ్గరికి తీసుకెళ్లే శక్తిమనలో. మనలో విష్ణువు అంటే ఆత్మ తత్వం అని మనం గ్రహించినట్లయితే ఆ ఆత్మతత్వం దగ్గరికి మనల్ని తీసుకుని వెళ్ళగలిగే వాడు మనలో స్పందన స్వరూపమైన గరుత్మంతుడు. అందుకని స్పందన యందు శ్రద్ధ కలిగి ధ్యానం చేసుకుంటూ, ఆ స్పందన ద్వారా మనలో ఉన్న అస్తిత్వమును మనము తెలుసుకొనవచ్చు. అది విష్ణు దర్శనము. గరుత్మంతుడు యొక్క సహకారం చేత విష్ణు దర్శనము జరుగుతుంది. ఎందుకంటే గరుత్మంతునికి, విష్ణువుకు అటువంటి సన్నిహితమైన సంబంధం ఉన్నది. విష్ణువుతో సంబంధము ఏర్పరుచుకున్న గరుత్మంతుడు, ఆయనకు ఈయన వాహనంగా ఉంటాడు. ఆయన ఈ క్షేత్రం మీద ఉంటాడు. వాళ్ళిద్దరూ అంటే ఆత్మతత్వము వ్యాపనము చెందాలంటే స్పందన ఆధారంగానే జరుగుతుంది. ఆత్మ తత్వము ప్రణవం అని మనం అనుకున్నట్లయితే , అది ప్రాణ స్పందనగా వ్యక్తమవుతూ ఉంటుంది. వీళ్ళిద్దరూ స్నేహం చేసుకున్నాక. గరుత్మంతుడు అమృతాన్ని పట్టుకుని తిరిగి వస్తూ ఉంటే, ఇంద్రుడు చూసి అమ్మో వీడు గట్టివాడు, వీడితో మనము మంచిగా ఉంటే మనకు మంచిది అని ఇంద్రుడు, నాతో కూడా స్నేహం చేసుకుంటావా అని అడుగుతాడు విష్ణువుతో మనకు స్నేహం ఉంది కదా, వీడితో మనకి ఏం సంబంధం అని అనుకోడు గరుత్మంతుడు ఎందుకు అనుకోడు అంటే పనులు కావాలి అంటే వీళ్ళు ఉండాలి. ఆత్మవంతుడే గాని అవతరింప చేయలేడుట అంటే ఏమిటి ఉద్దేశ్యం? ఎక్కడో అరణ్యంలో కూర్చోవడం కదా. యోగి అందరినీ కూడగట్టుకుంటాడు, కొంతమంది అక్కరలేదు అనుకోడు. ఇంద్రుడి యొక్క సమర్థత ఉంటేనే ఏదైనా కార్యాన్ని నిర్వర్తించగలము. మనకి స్పందన ద్వారా ప్రణవాన్ని అనుభూతి చెందడము, ఆత్మానుభూతి పొందడం, మనమే ఈ జీవుడు దేవుడిని చేరే మార్గం తెలుసుకోవడం అన్ని బాగానే ఉన్నాయి, పంచ భూతాల చేత నిర్వర్తించే ఈ సృష్టిలో మనము కార్యాన్ని నిర్వహించాలి అంటే మనసు యందు స్పష్టత కావలెను. దీన్నే పరమ గురువులు ఈ రోజున ఎక్కువ ఆకాంక్షిస్తున్నారు.'మంచివాళ్లు, తపస్సు చేసుకునే వాళ్ళు, దేవలోకం చేరేవాళ్ళు, దేవుని పొందే వాళ్ళు చాలామంది ఉన్నారు. దేవుడు కావాలనుకునేవాడు తప్ప, దేవుడు పని చేసే వాళ్ళు ఎవరు లేరు' అంటారు. మనం గురువుగారు కావాలనుకుంటాము కానీ గురువుగారు పని చేయడానికి మనమేమి సిద్ధముగా ఉండము కదా! మన పనులకు అయితే గురువుగారు కావాలి మనకి. గురువుగారి పనులకు ఎవరు కావాలి? అది దైవం కార్యము చేయడానికో? అదీ పరమ గురువులు కోరేది. దివ్య ప్రణాళికలో భాగంగా చేరటం కోసం ఈ మార్గం. అందుకని

అది జరగాలంటే స్పష్టత కావాలి మనస్సునందు. కార్యములు నిర్వర్తించడములోను ఒక రకమైన సమన్వయము ఉండాలి. దేన్నైనా చక్కగా నిర్వర్తించగలిగి ఉండాలి, అది తనకీ, ఇతరులకి, అందరికీ ఆనందము కలిగేటట్టుగా నిర్వర్తింప చేయాలి. వీన్ని మనకి white magic అని ఇవాళ చెప్తారు. అంటే తన యందు కలిగిన సంకల్పాన్ని తను నిర్వర్తించి, అక్కడ అవతరింపజేసి, నలుగురికి పనికి వచ్చేటట్టుగా చేసి దాన్ని తయారు చేయగలిగినటువంటిదని చెప్తారు ఉదాహరణకు సత్యసాయి బాబా గారిని తీసుకోండి. ఒక సంవత్సరంలో ఈ పని చేద్దామని మనమంటే అయిపోతున్నాయా? ఆయనంటే అయిపోతుంది. ఎట్లా అవుతుంది? మూడూ కలిసి ఉన్నాయి కాబట్టి అయిపోతాయి. ఆత్మ తత్త్వము, ప్రాణ తత్త్వము, ఇంద్రతత్వము ఈ మూడు కలుపుకుని. ఆత్మ, చైతన్యము, మనస్సు! మనో నై ర్మల్యమే కాకుండా దానికి శక్తి, సామర్థ్యము, స్పష్టత ఇవన్నీ కలిగి ఉంటేనే అది దర్పణంగా ఊర్ధ్వలోకాలలో వుండేదంతా అధోలోకాల్లోకి అవతరింపబడుతాయి. అది లేకపోతే అవతరణ చేతకాదు అందరికీ. ఆ శక్తి ఇంద్రుడుదైతే, ఆ శక్తికి అనుజుడు ఈ రెండు శక్తులు ప్రాణశక్తి ,రెండవది చైతన్యము, మూడవది మనసు. ఈ మొత్తం మూడింటికి కూడా మూలమైన ఆత్మ తత్వం. ఇన్ని రకములుగాను విష్ణు తత్వము మనకు ఉన్నది దాన్ని దైవతత్వము అంటారు. విష్ణు సహస్ర నామాలు చెప్పుకుంటున్నాము కాబట్టి విష్ణువు అంటాము, ఇంకో లెక్కలో అయితే ఈశ్వరుడు అంటాము. ఇంకో పేరు ఏమైనా పేర్ల గురించి కాక మనలో ఉన్న వాటి గురించి భావించండి. మనం వున్నాము అని మనకు తెలుసు, అందుకని భగవంతుడు యొక్క తత్వము ఏమిటంటే అహమస్మి , నేను ఉన్నాను అంటాము. తరువాత చైతన్యము అంటాము, తర్వాత భావము. భావాన్ని అవతరింప చేయడం. ఇవన్నీ కావాలంటే ఇంద్రుడికి ఎప్పుడు విష్ణువు తోడుగా ఉంటాడు అనుజుడై. ఆయన మనకు తోడుగా ఉన్నాడనుకోండి, మన కార్యాలు చక్కగా నిర్వర్తింపబడతాయి. ఎందుకని? మన స్పష్టతకు ఆయన యొక్క దివ్య బలము ఉండడం చేత! ఎందుకంటే కాలము ఆయన చేతిలో ఉంటుంది, దేశము ఆయన చేతిలో ఉంటుంది. కాలము ఎవరి చేతిలో ఉంటుంది? దేవుడు ఒక్కడే కాలాన్ని అతిక్రమించి ఉన్నవాడు. మనకు 24 తత్వాలతో సృష్టి ఏర్పడితే, ఈ 24 తత్వాలు కాలము ఆధీనంలో పనిచేస్తూ ఉంటాయి. అది గాయత్రి అనే 24 తత్వాలుగా (దర్శనాలుగా) చెప్పుకున్నాం. కాలం అనేది 25వ తత్వంలో దాని యొక్క పరిధిలో పనిచేస్తూ ఉంటాయి. ఈ పని చేస్తున్న వాటిని, ఈ కాలాన్నీ కూడా అధిగమించి భగవంతుని తత్వం ఉంటుంది. అందుకనే మనకి భగవంతుడు యొక్క తత్వముతో అనుసంధానము చెందిన జీవుడు, లేక మానవుడు, లేక మనస్సు ప్రధానంగా జీవించేవాడు. మానవుడు అంటే మనసు ప్రధానంగా జీవించే వాడు,

కాబట్టి మనము ఆయనతో అనుసంధానం ఏర్పరచుకున్నట్లయితే కాలం కలిసి వస్తుంది. అమ్మవారి యొక్క శక్తి కలిసి వస్తుంది. ప్రాణము యొక్క స్పందనము కలిసి వస్తుంది. అన్నీ కలిసి వస్తే పని అవుతుంది. అది వాసవానుజుడు! అమృతత్వస్థితి పొందిన వారు కూడా అటు విష్ణువుతోను, ఇటు ఇంద్రుడితోనూ మైత్రి చేసుకుని దిగివచ్చి పాములను తినేస్తూ ఉంటారు. పాములని తినటం అంటే విషపూరితమైన భావములు తినడం. మనలోనే బయటి వాళ్ళల్లో కాదు.మనలో చాలా రకరకాల భావాలు వస్తూ ఉంటాయి. చాలా ద్వేషము, అసూయ, అశ్రద్ధ, నిర్లక్ష్యం ఇలా.ఇతరులు అంటే మనకు మనవాళ్లు ఇంకొకళ్ళు.వాటిని తుంచుకోవాలంటే ప్రాణం ఉండాలి. ప్రాణం వుండాలంటే ప్రాణాయామం చేయాలి.ప్రాణాయామం బాగా చేసుకుంటే ముందు ప్రాణము, గరుత్మంతుడు గట్టిపడితే పాములు చస్తాయి పాములు చస్తే ముందు మనం బయటకు వస్తాం. ఇంత ఉంది ఈ వాసవానుజ నామంలో. మన మనసు గట్టిగా దివ్య సంకల్పం కోసము పనిచేయాలి, అంటే దాని చుట్టూ ఏర్పరచుకున్నటు వంటి తత్వము తెలియాలి.

335 అపాంనిధిః

అపాంనిధి అంటే జలముల / నీళ్ళ యొక్క నిధి. ఆపస్సు అంటే నీళ్లు. 'ఆపోవా ఇదగం సర్వం' అంటూ ఉంటాం కదా! ప్రాణ ఆపః అంటూ ఉంటాం కదా, స్నమ్రాడాపో, విరాడా పో అంటూ ఉంటాం కదా! అన్ని నీళ్లే అని చెప్తూ ఉంటాం. ఒక గ్లాసు నీళ్లతో సంకల్పమని చెప్పుకుంటూ కళ్ళకు అద్దుకుంటూ పని జరిపిస్తాము. అన్నీ ఇదే అన్నీ ఇదే, అని విపరీతంగా సంస్కృతం లో చెప్పేస్తూ ఉంటారు. మనం ఏమి చేస్తున్నామో మనకే తెలియదు. ఆ time లో ఎవరైనా తిట్టుకుంటూ ఉంటే తిట్టుకుంటూ ఉంటాడు లోపల. ఏమిటి మొత్తం ఆపస్సే ఇంకేమీ లేదు అంటే నీరు. నీరు అంటే మనము చూసే నీళ్ళు భౌతిక స్వరూపమైన నీళ్లు. ఈ నీళ్లకు కూడా సూక్ష్మ లోకాలు ఉన్నాయి. అన్ని వేరువేరు లోకాల్లో ఉంటాయి. అది చెప్పడానికే గంగావతరణ కథ చెప్పారు. ఆకాశంలో గంగ ఎట్లా ఉంటుందండి? అక్కడ ఎవరైనా నీళ్లు ట్యాంక్ కట్టించారా? అక్కడి నుంచి భగీరథుడు పిలిస్తే శివుడి నెత్తి మీదకు రావడం, అక్కడ నుంచి జహ్ను మహర్షి చెవిలోకి వెళ్ళటం, ఆ చెవిలోంచి భూమి మీదకి రావటం ఇవన్నీ ప్రాణము యొక్క అవతరణము కథ. The root relating to prana. plenty of prana మన మంత్రం చెప్పుకుంటామే దానికి ఒక root ఉంది. ఆ root ప్రకారం అది దిగి వస్తూ ఉంటుంది. ఈ మంత్రం అంతా ప్రాణమంత్రం కాబట్టి వాసవానుజుడు అన్నా ప్రాణంగా చెప్పుకోవాలి. స్పందన స్వరూపుడుగా ఉండేవాడు. అపాం నిధి మొత్తము ప్రాణం యొక్క సముద్రము అన్నమాట. అది ఎట్లా ఉంటుందంటే మంచినీళ్ల రూపంలో ఉంటుంది. అంటే మంచినీళ్లు అంటే మనము చూసే మంచినీళ్లు కాదు, మనము చూసే మంచినీళ్లు దాని యొక్క స్థూల స్వరూపం. దానికన్నా సూక్ష్మమైనది ఆవిరి, ఆవిరి కన్నా సూక్ష్మమైనది మేఘాలలో ఉంటుంది. అంతకన్నా సూక్ష్మంగా ఆకాశంలో, ఆకాశం వలే ఉంటుంది. 'వియత్ గంగ' అన్నారు. వియత్ గంగ అంటే ఆకాశగంగ. ఆకాశగంగ అంటే తరంగముల వలె ఉండే ప్రాణశక్తి.ఈ నీళ్ళు అతి సూక్ష్మమైన నీళ్ళు. అక్కడ నుండి ఇంకా చాలా స్థూలంగా వస్తే మంచుగడ్డ అయిపోతుంది. కాబట్టి ఈ మొత్తం ప్రాణమంతటికీ కూడా తరంగములవలే ఆకాశంలో ఉన్న ప్రాణశక్తి ఇది అని చెప్తున్నారు. దాన్ని మనము invoke చేసుకుంటున్నాము. ఓంకారము ఒకసారి మనము ఉచ్చారణ చేసినప్పుడు దాని యొక్క పుట్టుక స్థానంలోకి మనము వెళ్లడానికి ప్రయత్నం చేయాలి. 'నువ్వు చేసుకోలేవు నేను చేసి పెడతాను C.V.V. అని అనమన్నారు' ఆయన. ఎందుకంటే ఆయన ఆ route అంతా పట్టుకున్నారన్నమాట. పట్టుకుని నిన్ను ఆ మార్గం నుంచి

'ప్రాణశక్తి సరఫరా అవ్వడానికి నేను ఒక వంతెన ఏర్పరిచాను. అది ఆధారంగా అంతరిక్షంలోకి, అంతరిక్షంలో నుంచి సూర్య మండలంలోకి, సూర్య మండలం నుంచి భూమండలంలోనికి, భూమండలం నుంచి భూమికి. భూమి యొక్క కుండలిని నుంచి నీ కుండలిని ద్వారా నీకది అంది, నీ శరీరమంతా పుష్టిగా ఉండేటట్టుగా నేను చూస్తాను' అని చెప్పారు. అదీ మాస్టర్ సి వి వి గారి యోగం! అదే విషయం మనం ఓంకారము శ్రద్ధగా ఉచ్చరించడం ద్వారా కూడా పొందవచ్చు. అది ఎట్లా చేయాలంటే అంటున్న శబ్దాన్ని పూర్ణంగా వింటూ సుదీర్ఘంగా ఉచ్చారణ చేయాలి. అదే సాధన! ఏది చేసినా 24 నిమిషాలు చేయాలి. కూర్చున్నప్పటి నుంచి ఎప్పుడు లేచిపోదామా అనుకుంటే అవదు. అందుకే ప్రాణాయామము 24 నిమిషాలు చేయాలి.ఏది చేసినా 24 నిమిషాలు 3 sets గా పరిపూర్ణంగా చేయాలి. అప్పుడు పరిపూర్ణంగా సమస్తము తెలుస్తుంది. మొదటి 24 నిమిషాల్లో మనకి ప్రాణశక్తిపరిపూర్ణంగా ఏర్పడుతుంది. రెండో 24 నిమిషాలలో చైతన్యవంతులముగా మనము ఎలా ఉన్నామో తెలుస్తుంది. మూడవ 24 నిమిషాలలో మన అస్తిత్వము మనకు గోచరిస్తుంది. మొత్తము 72 నిమిషాలు పడుతుంది. ఈ యోగములో ఈ సాధన చేసుకునే వాళ్ళకి. 24 నిమిషాలు రోజు ప్రాణాయామం చేయడం అనేది ప్రాతిపదిక, చేస్తే ఎంత ప్రాణశక్తి మనలోకి ఆవాహనం అవుతుందంటే రుగ్మతులన్నీ అదే పార ద్రోలుతుంది. మనకి జ్వరం కూడా రాదుట. ఎందుకంటే లోపల ఉన్నవన్నీ బయటపడుతాయి. కానీ దాన్ని మనము మానకుండా చేస్తున్నామనుకోండి, దానికి కూడా వాళ్లు ఏ సమయం చెప్పారు, 12 నిమిషాలు సూర్యోదయం ముందు నుండి 12 నిమిషాలు సూర్యోదయం అయ్యేంతవరకు 24 నిమిషాలు అట్లా చేసుకోవాలి. అట్లానే సాయంత్రం కూడా చేసుకోవాలి. ఇలా మనము ప్రాణాన్ని పెంపొందించుకుంటే ప్రాణానికి ఉండే బలము, గరుత్మంతుని బలం లాగా పనిచేస్తూ ఉంటే, ఇంద్రుడు కోరుతాడుట 'మైత్రి.' ప్రాణాన్ని పెంచుకుంటే మనస్సు మైత్రిని కోరుతుంది. ఎందుకంటే వీడు గట్టివాడు, వీడితో మనం కలిసి ఉంటే better అని మనస్సు అనుకుంటుంది. గరుడుడి కథలో ఈ రహస్యం ఉంది. కాబట్టి ఇక్కడ ఈ వాసవానుజుడు దగ్గర నుండి అపాంనిధి దగ్గరకు వెళ్తున్నారు. ఎందుకంటే అపాంనిధి అంటే ఈ జలములు యొక్క నిధి. జలములు అంటే సూక్ష్మ జలములు, లేక ఆకాశ జలములు, లేక ఆకాశగంగ. అక్కడి నుండి భగీరథుడు పట్టుకొస్తాడు దాన్ని. పట్టుకొచ్చి మనందరినీ పునీతుల్ని చేస్తున్నాడు. మనకు కూడా అంతే. ఇదంతా బయల్దేరి, బయల్దేరి ఇలా వచ్చి మూలాధారం నుండి బయటకు వెళ్ళి పోతుంది. మనం చేసే పనుల ద్వారా భౌతికంగా బయటకు వ్యక్తం అయిపోతుంది. 'ఆకాశమున నుండి శంభుని శిరంబు, అందుండి శీతాద్రి, సుశ్లోకంబైన హిమాద్రి నుండి భువి' ఇది

ఆకాశం నుంచి వస్తూ ఉంటుంది కదా! అక్కడి నుంచి 'శంభుడి శిరం' మన తల మీద సుడి ఉంటుంది కదా! అక్కడ నుంచి దిగుతుంది. అందుకని అక్కడ పిలక పెట్టుకుంటారు. అలంకారమన్న మాట పిలక. అక్కడి నుంచి శీతాద్రి. అదే హిమాద్రి. హిమాద్రి ఉంటుంది పైన. ఇక్కడ నుండి భూమ్మీద పారటం అన్నమాట.

ఆకాశంబున నుండి శంభుని శిరం, బందుండి శీతాద్రి, సు
శ్లోకంబైన హిమాద్రినుండి భువి, భూలోకము నందుండి య
స్తోకాంబోధి, పయోధినుండి పవనాంధోలోకముం చేరె గం
గా కూలంకష, పెక్కు భంగులు వివేక భ్రష్ట సంపాతముల్.

అక్కడినుంచి కిందకి వెళ్ళిపోయిందల్లా, సముద్రంలో కలిసిందల్లా వ్యర్థం ఏమీ కాదు. దాన్ని మళ్లా ఊర్ధ్వగతి పంపించడం జరుగుతుంది. అందుకని ఇట్నుంచి అటు వెళ్ళి మళ్ళీ మొత్తంలో కలుస్తుంది. మళ్ళీ మొత్తం నుంచి మళ్ళీ దిగొస్తుంటుంది. మొత్తంలో కలుస్తూ ఉంటుంది. మొత్తంలో నుంచి మళ్లీ వస్తుంది. అలా ఒక space ocean ఉంటే అందులోంచి ఇవన్నీ దిగి వస్తున్నాయి. ఈ దిగి వచ్చినవన్నీ మళ్ళీ అందులోకి వెళ్ళిపోతుంటాయి. అందులో మళ్లీ దిగి వస్తూ ఉంటాయి. ఈ విధంగా జరుగుతూ ఉంటుంది అది ప్రాణశక్తి స్వరూపముగా దిగివస్తూ ఉంటుంది. అందుకని నీళ్ళు తాగితే ప్రాణం లేచివస్తుంది అంటారు కదా దాహము వేసినప్పుడు. ఉసురు అంటున్నప్పుడు నీళ్లతో స్నానం చేస్తుంటే ప్రాణం లేచి వస్తుంటుంది కదా! జలములో ఆ ప్రాణము ఉన్నది. అందుకని జలంతో ఉపవాసం పెట్టుకున్నారు కొంతమంది. అంటే జలంతో ఉండటం అన్నమాట, జలములో ప్రాణము ఉన్నది. దానిని నమ్మినవారు దానితోనే ఉపవాసం పెట్టుకోవచ్చు. గాలిలో ప్రాణమున్నది, దానిని అనుసరిస్తున్న వాళ్ళు గాలిని భోంచేస్తారు. సూర్యరశ్మిలో ప్రాణమున్నది దానిని నమ్మిన వాళ్లు సూర్యరశ్మిని భోంచేస్తుంటారు. మనకి ఇంతింత తినడం లో ప్రాణం ఉంది అని నమ్మకం కాబట్టి మనం ఇంతింత ముద్దలు తినేసి ఆ బరువు పెట్టుకొని తిరుగుతుంటాం. అది వేరే సంగతి అపాంనిధి అంటే ఏమిటంటే ఈ సమస్తము మన చుట్టూ ఉన్నటువంటి చోటు. ఇవాళ శాస్త్రం అంటే science. వాడు పాశ్చాత్త దేశాలలో వాళ్ళు ఏం కనుక్కుంటున్నారంటే eletricity is also a subtle form of water. మనకి తెలియదు వాళ్లు కనుక్కున్న తర్వాత మన పుస్తకాల్లో ఉంది కదా అని మనము తెలుసుకుంటాం. అదీ మన తెలివి! ముందే తెలిసి ఉండి వాళ్లకి చెప్పే తెలివి లేదు మనకి. ఎందుకంటే మన ఋషులు కనుక్కున్నది వాళ్ళు రాసేసి వెళ్ళిపోయారు గాని, అది అట్లా ఉందని మనకి తెలియదు. వాళ్లు కనుక్కొని చెప్పిన తర్వాత అది మాకు ఉంది అని చెప్తాం. అదీ తమాషా! మరి మీకు ఉంటే ముందు ఎందుకు ఏడవలేదు అంటారు వాళ్లు. మన ఋషులు తపస్సు చేసి ఏ విధంగా కనుక్కున్నారో,

ఈ scientists కూడా ఋషులే. వాళ్ళు తపస్సు చేయబట్టి కదా మనకి ఇవన్నీ వచ్చినాయి. ఇవాళ ఈ విధంగా విద్యుత్తు ఈ విధంగా ఉన్నదని తెలిసినా దింపగలిగిన శక్తి లేదు. తెలుసు అని చెప్పగలము, కానీ చేయలేము. కానీ వాడు తెలిసినవాడు. ఎక్కడో ఏవో జరుగుతూ ఉంటే భూమ్మీద మనకి ఈ వేళ అట్లా బొమ్మ వేసి చూపించగలడు. వాడు ఋషి కాదా? నీ తమ్ముడు, మీ అన్నయ్య, మీ ఆవిడ, అమెరికాలో ఉన్నారు మాట్లాడుకుంటూ ఉంటే మీకు వినబడుతుంది కదా! అలా గోచరింప చేసిన వాడు ఋషి కాదా? గడ్డం పెంచుకుని మాటమాటికీ రామ నామం చెప్పేవాడే ఋషి అనుకుంటాము, అది మన దురదృష్టం. వీళ్ళందరూ ఋషులే. వీళ్ళందరూ మానవజాతి పురోగతికి సహాయపడినవారు. ఒక Telephone కనిపెట్టిన వాడు, ఒక telegram కనిపెట్టిన వాడు, ఒక television కనిపెట్టిన వాడు, electricity కనిపెట్టిన వాడు, electronic system కనిపెట్టినవాడు, quantum theory కనిపెట్టిన వాడు ఋషులే! Einstein కన్నా మహాయోగి ఈ శతాబ్దంలో ఉన్నాడు అంటే నమ్మకూడదు. ఒక అణువును ఛేదించి, అందులోని బ్రహ్మాండమైన శక్తిని బయటకు తీసుకొచ్చే మార్గాన్ని చూపించిన వాడు Einstein. పరమ గురువులు ఆయన్ని మాలో ఒకడు అని చెప్తుంటారు. మరి Einstein వస్తే దండం పెడతామా? పెట్టము కదా! కాస్త కాషాయం కట్టి, గడ్డం పెంచితే పెడతాం. ఏం చేశాడో తెలియకపోయినా అందుకని యోగులు అట్లా ఉంటారు. అపాంనిధి అంటే space water. అందులో నుంచి ప్రాణశక్తి దిగి వచ్చింది అందులో నుంచి అన్ని జీవుల రూపముల యొక్క నిర్మాణం జరిగింది. ఈ చెట్టు ఉందనుకోండి అట్లా ఉండటానికి ప్రాణం ఉండాలి. అట్లాగే జంతువుల్లోకి, అట్లాగే మనుషుల్లోకి అందరిలోంచి నీరుగా వచ్చి, ప్రాణంగా నిలబడతాడు. రాయిలో ఎందుకు ప్రాణశక్తి లేదంటే నీరు లేదు కాబట్టి. మనలో నీళ్లు లేవు అనుకోండి, ఏమిటి ఇలా అయిపోయారు అంటే dehydration అయిపోయింది అని చెప్తారు. మొత్తము నీళ్లన్నీ తీసేస్తే మనం ఉండము, అంటే ప్రాణం నీళ్ళ రూపంలో ఉంది మనలో. అదే జీవం కదా! అదే చెట్టులో ఉంది, అదే జంతువులలో ఉంది, అదే మనలో ఉంది. ప్రాణం అట్లా మనలో ఉంది కదా అని ఎందుకోసం చేస్తున్నాము ? అట్లాగే భూమ్మీద నదులుగా కూడా ఉన్నది. అది భూమి మీద ఉండే ప్రాణశక్తి. దానికి ఆనకట్టలు కట్టకూడదు అది వెళుతున్న మార్గంలో. నీలో ప్రవహిస్తూ ఉండే రక్తనాళాలకి/ధమనులకి అడ్డుపెడితే గుండె పగిలిపోతుంది. అదే చేస్తున్నాం భూమ్మీద. నదులకి ఆనకట్టలు కట్టి. అవన్నీ life of force. ఆ ప్రవాహాలు అన్నీ కూడా ఒక force ప్రకారంగా వెళుతూ ఉంటే, దాన్ని అడ్డుకట్టి వేసేసి నువ్వు వాడుకుంటే అది తిరిగి నీకే ముప్పాస్తుంది దాని వలన. తెలిసిన వాళ్ళు పూర్వకాలంలో వాళ్ళ వాళ్ళ యొక్క సంస్కృతినంతా నదీ ప్రవాహాలు

పక్కన నిర్మాణము చేసుకొని జీవించేవారు. నీకు నీళ్లు కావాలంటే నీవు నది దగ్గర ఉండాలి తప్ప, నువ్వు ఉన్న చోటుకు దానిని పట్టుకువచ్చి దాని మీద ఒక అడ్డుకట్ట కట్టి ఇవన్నీ చేయడం ఎందుకంట ? అవన్నీ మన తెలివితేటలు తప్పుదారి పట్టిన పద్ధతి. గోదావరి నది మనకి కావాలి అనుకుంటే గోదావరి దగ్గరికి వెళ్ళాలి కదా! ఎందుకని గోదావరి నీళ్లు లేకపోతే మనము బ్రతకలేము కాబట్టి. గోదావరిని మన దగ్గరికి రప్పించుకుందాము అన్న బుద్ధి తప్ప! మామూలుగా మన వ్యవహారంలో మనకి ఎవరి దగ్గర పని ఉందో వాళ్ళ దగ్గరికి మనం పోతాం, కానీ వాళ్ళని రప్పించలేం కదా! మనకి పనుంది నువ్వు రా అని అడుగుతామా ? మనం పోతామా, ఇంటికి వెళ్ళి పోతాం. ఈ మొత్తం అంతా కూడా ఈ ప్రాణాన్ని దానిని ఒక నిధిగా, భగవంతునిగా భావించాలి. ప్రతి దానిలోదాని యొక్క అస్థిత్వాన్ని అట్లా చూడాలి. ప్రతి జీవిలో ఉండే ప్రాణాన్ని అట్లా చూడాలి. అందుకని ఎవరి ప్రాణానికి నష్టం కలగకుండా చూసుకోమని చెప్తారు . భగవంతుడు ఇందులోనే వుంటాడు.

336, 337 అధిష్టానం, అప్రమత్తః

అధిష్టానః అంటే అధ్యక్షా అంటూ వుంటాం కదా! The one who presides over. ప్రతి విషయానికి పైన ఒకటి వుంటుంది. మనం చేసే పనులన్నీ కూడా, మనకు చేసిన దానికన్నా పైన ఒకటి ఉంటూ ఉంటుంది. అది నిర్ణయం చేస్తుంది అవటం, అవక పోవటము. పనులు అవడం, అవకపోవడం మన ప్రతిభ కాదు. ఈ మొత్తం సన్నివేశాలు అన్నీ అధిష్టించి ఒకటి ఉంటుంది. అది నిర్ణయం చేస్తూ ఉంటుంది. దానిని 'దైవము' అన్నారు. మన చేతనైనంత మనం చేసినా కూడా, అవటం లేదు అనేదానికి చేసిన దానికి మధ్యలో ఉండే gapని That is presided over అన్నారు. That Uncertainty thought ఏదైతే వుందే దాన్ని దైవము అన్నారు. అది కాలం రూపంలో చేస్తూ వుంటుంది. మొన్న ఎన్నికలైనప్పుడు ప్రతి వాడి భవిష్యత్తు ఆ డబ్బాలో ఉంది అన్నారు కదా! రాబోయే Prime Minister ఆ డబ్బాలో ఉన్నాడు అని చెప్తారు కదా! డబ్బా తెరిస్తే కానీ తెలియలేదు. డబ్బాలో ఉంటే కనబడదు, తెరిచాక కనబడి కనపడకుండా ఉంటుందంటే, అట్లా ఉంటుంది. దాన్నే There is many a slip between the cup and the lip అన్నారు. ఇంట్లో కాఫీ తాగుదామని ready చేసుకుని నోటి దగ్గర పెట్టుకునే లోపల telephone రావచ్చు కదా! phone మాట్లాడడానికి వెళ్తే ఈ లోపల కాఫీ చల్లారిపోతుంది కదా! కాఫీ తాగినట్టుగా ఉండొచ్చు కానీ వుండదు. అన్నీ ఉండగా అల్లుడి నోట్లో శని ఉంటుంది చూడండి. అట్లా ప్రతి విషయంలో మన జీవితంలో మనము చేసేదానికి, మనకి అందే ఫలితాలకు మధ్య ఉండే gap ఏదైతే వుందో దాన్ని అధిష్టించి భగవంతుడుఉంటాడు. అందుకనే చేయవలసినంత చేసి వదిలేయాలి. ఒక సామెత ఉంది:-

"నూనె ఒంటినిండా పూసుకుని పుట్టెడు నువ్వులలో ఇటు నుంచి అటు, అటు నుంచి ఇటు పొర్లినా కూడా అంటిన నువ్వే అంటుతుంది తప్ప వున్న అన్ని నువ్వులు అంటావు కదా!" ఎంత పొర్లితే మాత్రం అంటవు కదా! అట్లాగే ఉంటుంది. ఆ చోటు లో there is unfilled portion which we cannot fill. మొత్తం తెలిసిన వాడే దాన్ని దాన్ని నింపేయాలి. అట్లా అన్నిటిని అధిష్టించి తాను వుండి అంతిమ నిర్ణయం చేస్తూ ఉంటాడు ప్రతి విషయం లో కూడా. చాలా బాగా చదువుకున్న వాడికి మార్కులు రావడం లాగా వుంటుంది. ఆరోజు, ఆ దిద్దే time లో ఆ పరీక్ష అధికారికి వుండే భావం బట్టి వీడి పరిస్థితి ఏర్పడుతుంది . ఆ భావం వాడికి వుండాలి, నిజానికి వాడు అనుకోడు కదా! ఆ రోజు ఇంట్లో పోట్లాడి వచ్చాడు అనుకోండి, లేకపోతే ఆరోజు ఇంట్లో ఏదైనాజంఝూటం జరిగింది అనుకోండి, వాడూ మనిషే కదా! వాడికి ఏదో

చిరాకు వచ్చింది అనుకోండి, ఏదైనా చాలు మనకి దురదృష్టం ఉంటే. వాడికి మన paper చూస్తున్నప్పుడే ఈ పరిస్థితి రావాలా? అట్లా ఉంటుంది అధిష్టించి. అందుకని మన ప్రయత్నం ఇట్లా చేస్తే అట్లా తిరిగి రావడం అనేది కాదు, ఇటు నుంచి పంపిస్తే అటునుంచి ఏమి వస్తుందో! ఎంత ప్రయత్నం చేసిన వాడికైనా అంతే. ఈ మొత్తంలో ఏ సన్నివేశమైనా సరే దైవము అధిష్టించి ఉంటాడు. అందుకని ఎవరికీ అనుకున్నది అనుకున్నట్టుగా అవదు. అందుకని అనుకోవద్దు అంటారు. ఏది కానీ చేద్దాం అనుకుంటే ఇట్లా అవ్వాలి అని అనుకోవద్దు. నువ్వు చేయవలసినది చేసెయ్, అవడం అవకపోవడం మన విషయం కాదు. అవకాశం కోసం ఎదురుచూసే వాళ్ళు యోగులు కాదు. ఫలితం మీద ధ్యాస లేకుండా తమ కర్తవ్యాన్ని నిర్వర్తించేవారు యోగులు. వీరు అధిష్టించిన వాని గూర్చి అప్రమత్తంగా ఉంటారు. Beyond our control సన్నివేశాలు ఉంటాయి. వాటిని ఆయన అధిష్టించి ఉంటాడు. అప్రమత్తుడై ఉంటాడు. ఇది నాకు రావలసినది కాదు అని ఎవరన్నా అనుకుంటే అంత కంటే మూర్ఖుడుండడు. ఎవరికి ఏది వచ్చినా అది వాడికి రావలసినదే వచ్చింది, అని తెలుసుకోవాలి. ఫలితం ఆశించక నీ కర్తవ్యం నువ్వు నిర్వర్తించు. ఎంత అప్రమత్తంగా ఉంటాడంటే ఈ స్థంభం లో ఉంటాడా అని హిరణ్య కశిపుడు అన్నప్పుడు ఎంత అప్రమత్తత లేకపోతే అక్కడకు వచ్చాడండీ? భగవతుడు అప్రమత్తుడు,నిద్రపోడు, ఆలస్యం చేయడు, ముందు రాడు. ఎప్పుడు, ఎవరికి, ఏది కావాలో అది ఇస్తాడు. అందుకని నువ్వు చేయవలసినవి చెయ్యి. ఏదైనా అందరికీ శ్రేయస్సు కలిగించేదై ఉండాలి. అంత మాత్రం చేత ఊర్లోవాళ్ళందరికీ మనమే చేసేసేయాలని ఒళ్ళు విరుచుకో అక్కర్లేదు. వాడిమీద నమ్మకం ఉంచి మన దగ్గరకు వచ్చినవి, మన కర్తవ్యం అయినవి, చేస్తూ ఉంటే దాని ప్రకారము నెమ్మదిగా చేస్తున్న దాన్నిబట్టి వస్తువులు అందిస్తూ ఉంటాడు. బాగా చేసే వాడికేగా పని ఇస్తాం. అరవం లో ఒక సామెతుంది 'పనిచేసే వాడికి పని ఇవ్వు పనిచేయని వాడికి తిండి పెట్టు' అని. అదేమిటి? పనిచేయని వాడికి తిండి పెడితే అట, వాడు పని చేయడు ఎట్లాగూ, వాడు లేచి ఉంటే మిగతా వాళ్ళకి problem. వాడికి తిండి పెడితే నిద్రపోతాడు. 'కూసే గాడిద వచ్చి మేసే గాడిదని చెడిపిందట' అంటాం కదా! అట్లా పనిచేయని వాడికి తిండి పెట్టేస్తే వాడు పడుకుంటాడు. మనం కూడా అంతే! ఎవరు బాగా పనిచేస్తే వాళ్ళకి పని అప్పచెప్తాము కదా! చెయ్య లేని వాడికి అప్పచెప్పము కదా! అందుకని చేయవలసిన పనులు చక్కగా చేసుకుంటే మన దగ్గరికి ఇంకా మంచి పనులు వస్తుంటాయి చేయడానికి. చాలామంది అంటూ ఉంటారు. నా దగ్గర బోలెడు డబ్బులు ఉన్నాయండి, ఎవరైనా వచ్చి ఇస్తావా అని అడగరు, ఇద్దాం అనుకుంటే, రారు. ఎందుకంటే దాన్ని మన ప్రవర్తనలో reveal చేయలేదు, రారు. ఎంతసేపటికీ ఇస్తాను

ఇస్తాను అంటుంటావు ఏదో, ఇవ్వవు. ఇచ్చే వాడి దగ్గరికి వెళుతూ ఉంటారు కదా. వాడెవడో పౌండ్రక వాసుదేవుడు అని, బాగా మెరిసే బంగారంతో గద, శంఖం, చక్రం అన్నీ చేసి పెట్టుకుంటూ ఉంటాడు. 'నేనే విష్ణుమూర్తి అవతారాన్ని ఆ కృష్ణుడు దగ్గరకు పోతారేంటి, నేను వుంటాను కదా పోతారు వాడి దగ్గర ఏముంది' అని అంటూ ఉంటాడు. ఆ కృష్ణుడు దగ్గర ఇంత గద ఉందా అని అంటాడు. దగ్గరికి ఎవడూ రారు, చూస్తూ ఉంటాను. ఏమీ లేని వాడి దగ్గరకు పోతుంటారు, ఇంత పెద్దది చేయించాను కదా ! ఎవరూ నా దగ్గరికి రారు' అంటూంటాడు. మనము చేసే పనులలో నుంచి పుట్టిన పవిత్రతను బట్టి, మన దగ్గరికి ఇంకా శ్రేయస్కరమైన కార్యాలను నిర్వహింప చేసుకుంటాడు భగవంతుడు. మనము తెగబడి ఏదో ఊళ్లో సేవ చేద్దామని వ్యామోహంలో పడితే ఇంకో రకమైన బాధలు వస్తాయి. సేవ అనే web ఒకటి ఉంది కదా! చేసేది తక్కువ, చెప్పకునేది ఎక్కువ. అందులో మళ్ళీ politics. కాబట్టి అలా ఉండక్కర్లేదు ఇలా ఉన్నట్లయితే అధిష్టించి వాడు ఉన్నాడు కాబట్టి, అప్రమత్తుడై వాడు ఉన్నాడు కాబట్టి, చేయవలసిన దానిమీద స్పష్టత ఉన్నది కాబట్టి చేయగలిగిన ప్రాణశక్తి నీ దగ్గర ఉన్నది కాబట్టి నువ్వు చేసుకుంటూ వెళ్లిపో.

338 ప్రతిష్ఠితః

ప్రతిష్ఠంగా అన్నిట్లో కూడా అక్కడ ఉన్నది ఎవరు ? Well established ఎవరు? వాడే. వాడి తత్వం ఉండటం. ఇప్పుడు ఇక్కడ ఉన్న వాటిలో ఏది లేదని చెప్పగలరు? సృష్టిలో లేనిది లేదు అని ఒక మహా వాక్యం. ఏదైనా ఉన్నదే కదా మీకు తెలుసు. లేని దాన్ని ఒక దాన్ని గురించి మీరు చెప్పండి. ఫలానాది లేదు అని . అది ఉండకపోతే లేదనే భావనే మీకు రాదు. అది ఉండి దానికి ఒక పేరు ఉండడం బట్టి నీ దగ్గర ఉండటం, నీ దగ్గర లేకపోవటం తప్ప అసలు ఉండకపోవటం ఉండదు. అందుకని లేనిది సృష్టిలో లేదు. అందుకని దైవము లేడనే వాడికి కూడా ఉన్నాడు అని చెప్తారు. ఎందుకని అక్కడ దైవమనే భావము ఎక్కడి నుంచి వచ్చింది లేకపోతే? ఉదాహరణకి పది నిమిషాలు ఇస్తాను. ఫలానాది లేదు ఈ సృష్టిలో అని చెప్పండి. ఆయన ఉండటము అన్నది సత్యము. ఈ ఉన్నవాటి అన్నింటిలోనూ ఆయనే ఉన్నాడు అట్లా. అందుకే రాయిలో ఉన్నాడు, రప్పలో ఉన్నాడు, చీమలో ఉన్నాడు, దోమలో ఉన్నాడు అని అంటూ ఉంటాం కదా! అది ప్రతిష్ఠతత్వం భగవంతునిది. అన్నిటిలోనూ తాను ఉండటం వలన అది ఉందట, తాను లేకపోతే అది లేదు. అందుకని ఇట్లా అన్నిట్లోనూ వున్నవాడు. అందుకని 'ఉన్నవాళ్ళల్లో ఉన్నవాడివైన ఓ దేవా' అంటూ ఉంటారు మన క్రైస్తవ సోదరులు. అంటే గ్లాస్ గా వున్నాడు అనుకుంటా. ఇట్లా మనిషిగా ఉన్నాడు, నీలో వున్నాడు, నాలో ఉన్నాడు, ఇల్లు లాగా వున్నాడు. ఏదైనా వాడే అట్లా ఉన్నాడన్నమాట. అచ్యుతము అంటారు మన వాళ్ళు దాన్ని ఉన్నదే సత్యం అంటారు. మిగతావన్నీ దానిమీద తయారైనది. ఉన్నది అన్నది మూలతత్వం. అందుకని మనవాళ్లు దానితో వున్న సత్యము అంటారు. ఇప్పుడు అన్నీ అందులో నుంచి వచ్చేశాయి. కనబడాలంటే ఎట్లా? ఉన్న సత్యము అంటే ఏమిటి ?ఎక్కడ ఏమేమి వున్నాయో అందులో వుండటం అనేది సత్యం. దానిమీద మిగతావి అన్ని ఉత్పత్తి అవుతాయి. మనము ఉండడం చేత చైతన్యవంతులు అవుతు న్నాము. చైతన్యవంతులు అవటం చేత భావం వస్తుంది. భావం వస్తుంది కాబట్టి భాష, ప్రవర్తన వస్తున్నాయి. ఇట్లా ఉంది. కాబట్టి అన్నింటికీ మూలం ఏమిటి? ఉన్నవాడు అచ్యుతుడుగా ఉన్నాడు, ప్రథితుడుగా ఉన్నాడు. ప్రాణంగా ఉన్నాడు, ప్రాణం ఇచ్చే వాడుగా వున్నాడు, వాడికి అనుజుడుగా వాసవుడుగా ఉన్నాడు. వాడే మొత్తము ప్రాణశక్తిగా నిండి ఉన్నాడు. అన్నింట్లోనూ వాడే అధిష్ఠించి ఉన్నాడు. కేవలం అధిష్ఠించి వుండడం చేత president అనుకుని నిద్ర పోతే కుదరదు మన కథలో. President అని ఎందుకు పెడతారంటే ఆ కార్యక్రమములో చెప్పింది చెప్పినట్టుగా,

చెప్పిన time కి నిర్వర్తింప చేయడానికి అప్రమత్తుడై ఉండాలి. అధ్యక్షత వహించి వుండాలి. సమస్తాన్ని తన యొక్క అధీనంలో ఉంచుకొనగలిగి వుండాలి. వానిని నిద్ర లేపే పరిస్థితి ఉండదు. ఎందుకంటే అప్రమత్తుడై ఉంటాడు. స్వచ్ఛందంగా ఉన్నాడు. అన్నిటి యందు నిండివుండడం అని తెలియడం కోసం ఈ నామం.

339, 340 స్కందః, స్కందధరః

స్కందుడు అనే నామము మనందరికీ బాగా పరిచయం ఉన్న నామం. కుమారస్వామిని స్కందుడు అని పిలుస్తాము. స్కంధములు కూడా మనకు తెలుసు భాగవతంలో 12 స్కంధములు ఉన్నాయి అంటే భాగములు ఉన్నాయి అని అర్థం. స్కంధము అంటే వ్యక్తమైన తత్వము అని అర్థం. మొత్తంలోంచి ఒకటిగా వ్యక్తమైన వెలుగు రవ్వ! మనం చూసే ఆకాశము నిండా నిండి ఉన్న వెలుగుల పరమాణువులను 'స్కందులు' అంటారు. వాటిలో నుంచి అన్ని రూపాలు ఏర్పడుతూ ఉంటాయి, మళ్ళీ వాటిలోనికి అన్నీ లయమైపోతూ ఉంటాయి. స్కంద తత్వం వెలుగు పరమాణువుల యొక్క ఒక సమూహార ప్రజ్ఞ. మొత్తం వెలుగులో చిన్నచిన్న అణువుల లాగా వెలుగు ఉంటుంది. ఇలా చేయి పెడితే మీకు నాకు మధ్య ఉన్న చోటులో ఉన్న వెలుగు కూడా స్కందముల యొక్క వ్యూహమే! ఇలా చేయి పెడితే మనకు ఏమీ తగలటం లేదు కదా మధ్యలో ఏదో ఉన్నట్లుగా! అట్లా అత్యంత సూక్ష్మమైన అణురూపంలో వెలుగు వ్యక్తమై ఉంటుంది. ఆ వెలుగు ఉన్నప్పుడు చీకటి ఉండదు. ఈ స్కందుని యొక్క వృత్తాంతం అంతా కూడా అతి విస్తారమైన విజ్ఞానము. భగవత్ తత్వంలో స్కందత్వం అనేది అతి ముఖ్యమైన తత్వం. మనకు ఒక వెలుగు బీజంగా పరమశివుడు నుంచి వ్యక్తమైన వాడిని 'స్కందుడు' అంటాము. పరమశివుడి గురించి మనం చెప్పకున్నప్పుడు అవ్యక్తమైన తత్వము గా మనము అవగాహన చేసుకోవాలి. నారాయణుడు అన్నప్పుడు కూడా అవ్యక్తమైన తత్వము అని మనం అవగాహన చేసుకోవాలి. అవ్యక్తమైన తత్వం అంటే ఇంకా వ్యక్తం కాలేదు కాబట్టి దాని గురించి మనకు ఏమీ తెలియదు. మనం వ్యక్తమైన తరువాత అది మరుగున ఉంటుంది. మనం వ్యక్తం కానప్పుడు అదే ఉండి మనం ఉండము, మనం ఉన్నప్పుడు అది మనకు మరుగున ఉంటుంది background గా. పునాదిరాయి లేనిదే భవనం ఉండదు కదా. అలాగే మనకు అవ్యక్తమైన తత్వం నుంచి మొట్టమొదట వ్యక్తమైన వెలుగు రవ్వ కారణం చేత చీకట్లన్నీ వెలుగుగా మారుతాయి. అది తారకాసురసంహారం అంటే. దేవ అనే శబ్దానికి అర్థం వెలుగు. వెలుగుతో కూడిన, వెలుగే రూపముగా కలిగిన జీవములను దేవతలు అంటారు. దివ్యలోకము అంటే వెలుగుతో నిండిన లోకము. దివి, దేవ ఈ శబ్దాలన్నిటికీ వెలుగు అనే అర్థం ఉన్నది. కుమారస్వామి ఎప్పుడైతే జన్మించాడో అంటే వెలుగు జనించేసరికి అప్పటివరకు అక్కడ ఉన్న చీకటంతా మాయం అయిపోతుంది లేదా సంహరింపబడుతుంది లేదా వెలుగుగా మారుతుంది. కుమారసంభవములో కుమారస్వామి పుట్టి పుట్టగనే 5 ఏళ్ళ బాలుడిగా ఎదిగి, దేవతల సేనకు ఆధిపత్యం వహించి తారక అనే అసురుని సంహరిస్తాడు. అంటే మనలో వెలుగు పుడితే చీకటి

నశిస్తుంది. అందుకని కుమారస్వామి కథ చాలా ముఖ్యమైనది. మనలో చీకట్లను తొలగించడానికి పుట్టిన వెలుగు. ఆ మొత్తం లో నుండి spring up అయిన లేక వ్యక్తమైన తత్వం. అవ్యక్తము నుండి వ్యక్తము లోనికి వచ్చిన మొదటి వెలుగు కేంద్రము! ఒక్కసారి కేంద్రము వచ్చేసరికి ఆ కేంద్రానికి ఉండే తేజస్సు అనే బలము చేత వెలుగు అంత మేర వ్యాపిస్తుంది. ఎంతటి చీకటి ఉన్నా ఒక చిన్న దీపము చుట్టూ ఉండే వెలుగు ప్రభావం కొంతమేర వలయాకారంగా ఉంటుంది. అంతమేరా చీకటిని వెలుగు చేస్తుంది. అలాగే మొత్తం సృష్టి ఏర్పడక మునుపు అవ్యక్తమైన స్థితిలో, అలక్షణమైన స్థితిలో అంటే ఈ లక్షణమని అనుకోడానికి లేదు, అప్రజ్ఞాతమైనస్థితిలో అంటే ప్రజ్ఞాతము కాలేదింకా, అప్రతర్క్యముగా అంటే దానిని గూర్చి మాట్లాడడానికి లేదు. తర్కానికి అసలు వీలు లేదు. ఎందుకంటే అప్పుడు తర్కించడానికి ఎవరూ లేరు. మనమంతా అందులో ఉన్నాము కానీ బయటకు రాలేదు. బయటకి వచ్చేసరికి నేనుగా వ్యక్తమౌతుంది. అది అంతర్యామిత్వం. అది ఉండడం చేత మనము ఉన్నాము. అది లేకపోతే మనం లేము. కానీ ఉన్నామనేది ఉంటుంది. ఎందుకంటే మనం ఆయనలోనే ఉన్నాం కాబట్టి. అందులో ఉన్నదంతా వ్యక్తమయ్యిందన్నమాట. అదీ కుమారస్వామి! ఆ వ్యక్తమైన వెలుగు రవ్వని 'స్కందుడు' అన్నారు. అలా దిగి వస్తుంటాడు. ఈ స్కంద శబ్దానికి కుమార శబ్దం కూడా అన్వయించుకోవాలి. కుమార, స్కంద, సుబ్రహ్మణ్య, వైశాఖ, కార్తికేయ, శరవణభవ అని శబ్దములు స్పందనమునకు సంబంధించినవి. చాలా పెద్ద తంత్రానికి సంబంధించినవి. పెద్ద యోగానికి సంబంధించినవి. అతి పవిత్రమైన, అతి తేజోవంతమైన విషయము. స్కందుని జననం ఎలా జరిగిందంటే భగవంతుడు తపస్సులో ఉన్నాడు. అంటే అంతా తనలో ఉన్నది. ఇంకా కళ్ళుతెరిచి వ్యక్తము చేయలేదు. తన నుండి సంకల్పం గా ప్రకృతి దిగి వస్తే ప్రకృతి, పురుషుని యొక్క సమ్మేళనగ ఒక అవతరణము జరిగింది. ఒక పిల్లవాడు పుట్టాడంటే తల్లి తండ్రుల స్వభావములు కలిపి దిగి వచ్చినట్లు. అటు పురుషతత్వము, ఇటు తల్లి లేక ప్రకృతి తత్వము కలిపి దిగి వచ్చాడు. అంటే రెండు తత్వాలు పుణికి పుచ్చుకుని వచ్చిన తత్వము. అదీ కుమారుడు! ప్రకృతి, పురుషుల సమాహార ప్రజ్ఞి గా ఒక వెలుగు ఏర్పడడమే కుమారుడు! అంతకు ముందు అది నిద్రాణమై ఉన్నది. చోటు నిండా ఉన్న విద్యుత్తుని మనము ఒక పద్ధతిలో వెలుగుగా తెచ్చుకుంటున్నాము. ఆ వెలుగు తెచ్చుకునే ముందు వెలుగు చోటులో ఉన్నదని మనకు తెలియదు. ఆ చోటు వెలుగుకి మాతృస్థానం. అటు అవ్యక్తంగా ఉన్న పురుషతత్వము (అది పరమేశ్వరుడు అనండి, నారాయణుడనండీ) ప్రకృతిగా (మనకు కనబడేట్లు గా వచ్చిందంటే అది ప్రకృతి అని అర్థము) మూలప్రకృతి గా, సూక్ష్మప్రకృతిగా

అమ్మవారి తత్వం వ్యక్తం అయినది. వెలుగు మనకి కనిపించడమే, వెలుగు ఉన్నట్లుగా తెలియడమే ప్రకృతి తత్వం! అంటే అవ్యక్తమైన తత్వాన్ని వ్యక్తం చేస్తున్నది. పరమ పురుషుడు, మూలప్రకృతుల సమాహార ప్రజ్ఞగా ఏర్పడిన వెలుగునే మనం పురుషుడు లేదా దేవుడు లేదా భగవంతుడు లేదా సృష్టిలో దేవుడు అంటాము. ఆ పైది పరతత్వం! అటు నుండి వచ్చినది అపరతత్వం. ఎప్పుడు వెలుగు వచ్చినా ఒక పరిధి లేక గోళము ఏర్పడుతుంది. అ మొత్తం గోళానికి 6 ముఖాలు ఉన్నాయని చెప్తారు. ఆరు ముఖములు గల షణ్ముఖుడని కుమారుడని అంటారు. కుమార పదం లో నుండి కూర్మ పదం వచ్చింది అనగా కూర్మావతారం. అదే కుమార నుండి మకర శబ్దం వచ్చింది అదే .క,మ,ర అనేటటువంటి 'కుమార'లో మూడు శబ్దాలు ఉన్నాయి. కు' లో 'ఉకారం' వ్యాపక అంటే వ్యాపన చెందే శబ్దం. గురు శబ్దం లో కూడా ఉ కారం ఉంది. 'క' అనే శబ్దం సూక్ష్మం నుంచి స్థూలానికి అవతరణం చేయగల ప్రజ్ఞ. 'మ' అనే శబ్దము పైన ఉన్నది క్రిందన ప్రతిబింబింప చేసే తత్వం. ప్రతిబింబం చేసేటందుకు అవరోహణం చేసే ప్రజ్ఞ ఉండాలి. 'ర' అనే శబ్దం ఆ సూక్ష్మం నుంచి స్థూలంలోకి సృష్టి ఏర్పడడానికి అవరోహణక్రమంలో ప్రజ్ఞను ప్రవహింపజేసే బలం. మనలో కూడా అవరోహణ చేసే ప్రజ్ఞ ఉన్నది. మన నుండి ఒక భావన కలిగిందిటా అంటే అది అవరోహణమే! ఆ భావనకి మనం భాష ఇచ్చి మాట్లాడామంటే అది కూడా అవరోహణమే! ఇంద్రియములతోను, శరీరముతోను పని చేయిస్తున్నాంట అనగా అది అవరోహణమే! ఆరోహణం ఒకటి అవరోహణం ఒకటి. ఈ రెండింటి నిర్వర్తించే ప్రజ్ఞని కుమార ప్రజ్ఞ గా చెప్తారు. ఆరు రకాలుగా వ్యాపనం చెందుతాడట. ఉత్తర, దక్షిణ, తూర్పు, పడమర ఇవి నాలుగు, క్రింద పాతాళము, పైన ఉపరితలము కలుపుకుని ఆరు భుజములుగా ఉంటాడుట. మొత్తం గోళాన్ని ఆరు భుజములుగా దర్శనము చేయవచ్చు. ఆరు భాగాలుగా, ఆరు ఋతువులుగా తెలియాలి. ఆ ఆరు ఋతువులకి ఆరు అక్షరముల మంత్రముగా 'శరవణభవ' వచ్చింది. ఇవన్నీ జ్యోతిర్ విద్యతో ముడిపడిన నిరుక్తశాస్త్రం. ఈ కుమార శబ్దం దిగి వచ్చినప్పుడు మకర శబ్దంగా తయారవుతుంది. ఈ శబ్దాలలో ఉన్న తేడా ఏమనగా మకర శబ్దం లో ఉకారం లోపించింది. అనగా సహజముగా వ్యాపన చెందే తత్వము సూక్ష్మము నుండి స్థూలమునకు దిగిరాగానే మొసలి పట్టు లాగా బంధింపబడుతుంది. అదే గజేంద్రుణ్ణి మకరం పట్టడం. ఏడ్చి గీపెట్టినా మకరము వదల్లేదు కదా! మనలో కొన్ని మకరపట్లు ఉన్నవి. అందువల్ల చైతన్యము యధేచ్ఛగా విహారం చేసే అవకాశము కోల్పోతుంది. అందుకని మొసలిపట్లుతో బంధింపబడిన జీవులుగా మనల్ని వర్ణిస్తారు. ఇందుండి విముక్తులు కావడమే గజేంద్రమోక్షం ప్రార్ధన! మొత్తం అంతా ఇటు నుండి విడిపడి అటు వెళ్లడం. వాడు నాకు చాలా ముఖ్యమనేది గజేంద్రుడు విష్ణువుని స్తుతించుట,

మకరం నుండి విముక్తి కోరుటగా చెప్పబడినది. మనకు చాలా విషయములందు చాలా రకాల పట్లుంటాయి. ఆ పట్లు మన మనసులో ఉన్నంత వరకు, మన శరీరం లో చైతన్యము యొక్క ప్రసారము మీద పట్టు పెరుగుతుంది. ఇట్లాగే జరగాలి అనుకునేవన్నీ పట్లే! భాగవతోత్తముడు ఎట్లా జరిగినా అందులో తన కర్తవ్యము నిర్వర్తించడము ఒక్కటే పెట్టుకుంటాడు. జరిగే దానిమీద తనకు ఆధిపత్యం లేకపోయినా, జరుగుతున్నదానిలో తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించడములో అధికారముంటుంది. 'కర్మణ్యేవ అధికారస్య' నువ్వు చేసే దాని మీద మాత్రమే నీకు అధికారముంటుంది. మిగతావి మనం చేసినంత మాత్రాన జరిగిందని అనుకోడానికి లేదు, చేయనంత మాత్రాన జరగదనడానికీ ఏమీ లేదు. వీటన్నిటికన్నా ఇంకో మహిమ ఉన్నదని తెలియాలి. వీటన్నిటిని యధేచ్ఛగా విహారం చేసే కుమార ప్రజ్ఞలు మనం. ప్రతి ఒక్కరమూ కుమారులమే! సహజముగా మనము కూడా వెలుగురవ్వలుగా వ్యక్తమైనవాళ్ళము కదా! అందుచే చైతన్య స్వరూపులం మనము! వ్యక్తమైన వారము అవరోహణములో దిగి వచ్చినప్పుడు ఈ ఉకార శబ్దం పోయి మకరములలో ఇమిడి ఉంటాము. కనుకనే మరలా ఉకార శబ్దాన్ని తెచ్చుకొనుటకు గురువు సాన్నిధ్యము కోరడము! ఈ గురు శబ్దమునందు రెండుసార్లు ఉకారము ఉన్నది.గకార ఉకారము, రకార ఉకారము. జ్యోతిర్ విద్యలో ఈ 'క' అనే శబ్దానికి శనిగ్రహాన్ని అధిదేవతగా చెప్తారు. 'మ' అనే శబ్దానికి చంద్రుడు, 'ర' అనే శబ్దానికి కుజుడు అధిదేవతలుగా చెప్తారు. 'ర' శబ్దము అగ్నిబీజం, అవరోహణములో సృష్టిని సూక్ష్మము నుండి స్థూలమునకు తీసుకురాగలదు. ఆరోహణంలో సృష్టిని స్థూలము నుండి సూక్ష్మానికి తీసుకుని వెళ్లగలదు. అదీ కుమారుడు చేసే పని! అట్నుండి ఇటు రాగలడు, ఇట్నుండి అటు రాగలడు. అందుకనే ఆకాశం నుండి భూమికి, భూమి నుండి ఆకాశానికి తిరగడానికి ఈయనకు ఒక వాహనము ఉన్నది. ఆరు ముఖములుగా ఆరు ఋతువులు కలిగి ఉంటాడు. మనలో ఉన్న ఆరుచక్రములకు అధిపతిగా కుమారస్వామి ఉంటాడు. అందుకని సాధనకి మనకిచ్చే ముఖ్యమైన శిక్షణ ఏమంటే ముందు కుమారుని ప్రార్థన చేయడం! దానివల్ల మనలో ఆరోహణ అవరోహణ క్రమములకు సంబంధించిన మార్గము సుగమంగా ఉంటుంది. అవరోధాలుండవు. లేకపోతే రకరకములైన అవరోధాలు ఏర్పడి దిగి వచ్చినప్పుడల్లా పట్టుబడిపోతుంటాము. తిరిగి స్వస్థానము చేరే పరిస్థితిలో ఉండము. అందుకని కుజుని అనుగ్రహం కోసం 'శరవణభవ' మంత్రం ఇచ్చారు. మనలోని ఆరు శత్రువులని సంహరించి ఆరు చక్రాలలో ఉన్న దివ్యత్వాన్ని వ్యక్త పరచడానికి కుమారస్వామి ఆరాధన పెద్దలు మనకి ఇచ్చి ఉన్నారు. ఆయన ఆయుధం శూలము తో మనలోని ఆరు శత్రువులైన కామ, క్రోధ, లోభ, మోహ,మద మాత్సర్యములను అంతం చేసి,

మనలోని దివ్యత్వానికి అవరోధం లేకుండా చేయగలిగిన తత్వము. అందుకే శూలము / అంకుశము ధరించిన కుమారస్వామి ధ్యానం ప్రాథమికదశలో సాధకులందరికీ ఇస్తారు. 'ఓమ్ శరవణభవాయ నమః' మంత్రం చేసినట్లయితే ఈ ఆరుగురు శత్రువులు బలహీనపడి, మనలో దివ్యసంకల్పానికి బలం ఏర్పడుతుంది. సహజంగా కుమారతత్వం అగ్నిలో ఉండే తేజస్సు. అవ్యక్తతత్వం సూక్ష్మమైన ప్రకృతితో కలసి మొట్టమొదట అగ్నిగా గోచరిస్తుంది. అగ్నిలో ఉండే వేడి, బలము అనిరుద్ధత్వము అనగా ఎక్కడా దానికి అడ్డుఉండదు.అగ్ని కనక చెలరేగితే సమస్తమూ తనలో నింపేసుకుంటుంది. ఏమీ మిగలదు, తనే మిగులుతాడు. అటువంటి తేజోమయమైన తత్వము కుమారతత్వము. అందుకని 'శరవణభవాయ నమః' అని ప్రార్ధన చేయడము, కుజతత్వంతో దానికి సంబంధం ఉన్నది కాబట్టి మంగళవారం ఎక్కువగా ప్రార్థన చేయడం, ఆరు సంఖ్యతో సంబంధము ఉన్నతత్వం కాబట్టి షష్ఠినాడు, సుబ్రహ్మణ్య షష్ఠినాడు ప్రార్ధించడం పూజించటం. ఆరు తలకాయలు అందుకు ఇచ్చారు. ఆరు వర్ణములు అంటే అగ్నితత్వము, సూర్యతత్వము, చంద్ర తత్వము, నీలము, ఎరుపు, పసుపు లేక బంగారు వర్ణముగా కుమార తత్వం వ్యక్తమవుతుంది. దానికి సంకేతంగా ఒకదానిపై ఒకటి అమరిన త్రిభుజములు ఇచ్చారు. ఒక త్రిభుజము కొన పైన ఉంటే, రెండవది క్రిందన ఉంటుంది. మనవారు ముగ్గులుగా కూడా వేసేస్తుంటారు. అది కుమార తత్వానికి సంకేతం. అది అగ్నికంటే తేజోవంతమైనవి. అగ్నిలో బలం కుమారుడు, స్కందుడు. పరమశివుని తత్వం నుండి వ్యక్తమైన తత్వాన్ని మనవారు సాంకేతపరంగా శివుని వీర్యము అని చెప్తారు. అందిస్తే అది అగ్ని దేవుడు అందుకున్నాడని, అలా తారకాసుర వధకు నిర్ణయం చేసారని, కాలం రూపం లో సృష్టి ఏర్పడడానికి ముందు చీకటిగా ఉంటుంది. ఆ చీకటిని తారకాసురుడు అంటారు. సృష్టిలో అవ్యక్తము అయిన తత్వము వ్యక్తమయినప్పుడు దానిని అగ్ని దేవుడు అందుకున్నాడని చెప్తారు. ఎందుకంటే ఈ తారకాసురుని సంహరించాలంటే దేవతలందరూ శివుని నుండి ఒక అంశను అందుకోవాలి, ఆయనే సంహారము చేయగలడు అని చెప్తారు. ఇలా ఒక poetic గా చెప్తారు. కానీ అందులో ఉండే రహస్యమేమంటే అవ్యక్తమయిన తత్వం నుండి వ్యక్తమయిన తేజస్సు అగ్ని వాహనంగా తీసుకున్నది. అగ్ని ధరిస్తుంది. అదే ఏసుక్రీస్తు 'నేను దైవకుమారుడనని మీరంతా అంటున్నారు. నిజానికి ప్రతి జీవుడు దైవకుమారుడు' అని చెప్తారు. ఎందుకంటే ప్రకృతి పురుషుల యొక్క సమాహార ప్రజ్ఞగా ప్రతి జీవుడు దిగి వస్తాడు. అలా తీసుకొచ్చేవాడు అగ్ని. మనలో జరిగే కుమారసంభవము సృష్టిలో కూడా జరుగుతుంది. అందుకనే 'స్కందధరుడు' అని అగ్నికి పేరు. ఆ పరమేశ్వరుని వీర్యం అగ్ని ధరించి. తెస్తూ భరించ లేకపోయాడు. పరమేశ్వరుని వీర్యం స్థలనం జరిగింది.

అందుకు స్కంధుడు అయ్యాడు. స్థలనము అంటే ఆయన నుండి వ్యక్తమయినదని రహస్యార్థముగా చెప్తారు. అగ్ని భరించ లేక గంగలో వదిలి వేస్తాడు. 'గం' అంటే వ్యాపక శక్తి. గమనము కలిగినది. గమనము బాగా కలిగినది కాబట్టి నదికి 'గంగ' అని పేరు పెట్టారు. రెండుసార్లు 'గ' ఉన్నది గంగ లో, అంటే చైతన్యము యొక్క ప్రవాహములో ప్రవేశపెట్టాడన్నమాట! గ, గ మధ్యలో బిందువు అంటారు. ప్రవాహాన్ని మనం చూస్తున్నామనుకో అది జల బిందువుల సమాహారప్రజ్ఞ గా మనకి అనిపిస్తుందా? సృష్టిలో అదే ప్రవాహము ఎప్పుడూ ఉండదు. అందుకే మన పెద్దలు 'ఈ భూ ప్రపంచం లో అదే ప్రవాహములో రెండో సారి ఎవరూ కాలు పెట్టలేరు' అని చెప్తారు. ఏ నది అయినా అది కోటానుకోట్ల జల బిందువుల ప్రత్యక్ష రూపము. అలా నదీజలాలు ప్రవహిస్తుంటే ఒకటే నదిగా అనిపిస్తుంది కానీకాదు. మనము ఒకసారి చూసిన నీరు మరొకసారి చూడలేము. మన శరీరము కూడా అంతే అని చెప్తారు మహర్షులు. అలాగే మనలో కూడా కోట్ల అణువులు అహర్నిశము మారుతూ ఉంటాయి. అందుకే అదే శరీరం అనుకోమాకురా, రూపం లో అణువులు కూడా అలా మారుతూ ఉంటాయి, అని పెద్దలు చెప్తారు. గంగా నదిలో అగ్నిదేవుడు వదిలివేశాడని చెప్పారు. అంటే అవరోహణక్రమం లో ఈ చైతన్యము దిగివచ్చిందని అర్థము. మనలో పింగళ నాడి యమున. సరస్వతి సుషుమ్న నాడి. ఇడనాడి ని గంగగా చెప్తాము. గంగ సూక్ష్మము నుండి స్థూలానికి వ్యక్తాన్ని తీసుకు వస్తుంది. స్థూలం నుండి సూక్ష్మానికి తీసుకు వెళ్ళే ప్రవాహము యమున. అవరోహణము దిగివస్తుంటే అంతకంతకూ వెలుగు తగ్గిపోయి, పదార్థము ఎక్కువయిపోయి చీకటి అయిపోతుంది. ఈ మొత్తం కార్యక్రమమంతా కూడా అట్నుండి ఇటు చేసేవాడు కుమారుడు. మళ్ళీ ఇటునుంచి అటు కూడా చేస్తాడు. అందుకనే కుజుడు వున్న చోట సంకల్పబలం బావుంటుంది అంటారు. అగ్నిలోని తేజస్సు మనలో సంకల్పబలంగా పనిచేస్తుంది. ఆ సంకల్పబలాన్ని ఎటుపక్క నియమిస్తే అటు దాని సిద్ధిని ఇస్తూ వుంటుంది. డబ్బుసంపాదన వైపు వెళ్తే డబ్బు సంపాదన. భగవద్ తత్వంగా చూస్తే భగవద్ తత్వానికి. కామ దృష్టితో పెడితే కామం. ఇలా ఎటు దృష్టి పెడితే అది. కానీ దానికి వుండేది శక్తి! కుమారుడి యొక్క శక్తి! అది అపరిమితమైనది. రాక్షసులు తట్టుకోలేరు. ఐదేళ్ళ కుర్రాడు దేవసైన్యాన్ని నడిపించుకుని వెళ్తుంటే, తారకాసురుడు భయపడి పారిపోయాడుట. మనలోని వెలుగు యొక్క ప్రవాహానికి అవరోధం లేకపోతే, ఎక్కడా లోపల రాక్షస శక్తులు ఉండడానికి అవకాశం లేదు. ఎందుకంటే, చీకటే వెలుగైపోతుంది కాబట్టి! అందుకని కుమారస్వామి ప్రార్థన చేసుకోవాలి. ప్రత్యేకించి బాలారిష్టాలకి కుమారుడి యొక్క ప్రార్థన ఇస్తారు. దేన్నైనా నిర్మూలించాలి, అంటే surgical work చేయాలంటే కుమారుడు. గణపతి చేసే

పద్ధతి వేరు, కుమారుడు చేసే పద్ధతి వేరు. అక్కడ దుష్టాంగాన్ని తీసేసి మిగతా దాన్ని రక్షించాలి అనుకోండి, అక్కడ కుమారుడు. అది క్షాత్ర ధర్మం! ఆ విధంగా భగవంతుని తత్వం వుంది అని మనకి చెప్పడానికి 'స్కంద' నామం ఇచ్చారు. ఆరు భుజములు కలిగిన cross ని ధ్యానం చేసుకోమన్నారు పెద్దలు. ఆరు భుజాలు కలిపితే, డబుల్ పిరమిడ్ అవుతుంది. పైనుంచి ఒక pyramid క్రిందనుంచి ఒక pyramid కలిపితే దాని 'సమవృత్తచక్రం' అంటారు. ఆరు ఆకులచక్రం అంటారు, ఆరు ఋతువులు అంటారు, జ్యోతిష్య పరంగా చెప్పుకోవచ్చు, నివృత్తి పరంగా చెప్పుకోవచ్చు. మనలో వున్న తేజస్సు! అది ఆజ్ఞలో వుంటుంది. ఆజ్ఞలోకి ఎప్పుడు వస్తుంది? నిద్రలేచినప్పుడు వస్తుంది. మనం అవ్యక్తంనుంచి వ్యక్తంలోకి వచ్చినప్పుడు వస్తుంది. అది రావడమే మనం నిద్రలేవడం. మనం ఎప్పుడైతే మేల్కాంచామో ప్రజ్ఞ ఆజ్ఞకి వస్తుంది. అక్కణ్ణుంచీ నీ ఆజ్ఞని పాలించడానికి మేమంతా సిద్ధంగా ఉన్నామని ఈ శరీరమూ, శరీరం యొక్క నిర్మాణమూ, శరీరము యొక్క బాధ్యత వహిస్తున్న దేవతలందరూ కూడా పొద్దున్నే మన ఆజ్ఞలకు లోబడి వుంటారు. ఆజ్ఞ దివ్యంగా వుంటే శరీరం బాగా పనిచేస్తుంది. ఆజ్ఞలు బావుండకపోతే నెమ్మదిగా శరీరంలోని దేవతల స్థానాన్ని రాక్షసులు ఆక్రమించుకుంటూ వుంటారు. ఆ తరువాత దేహం చీకటి కమ్మేస్తూ పోతుంది. మనకి అవరోహణ క్రమానికి కుమార తత్వం. సృష్టి ఏర్పడడానికి ఆ తత్వం పని చేస్తుంది. అలాగే ఆరోహణ క్రమానికి కూడా అదే తత్వం. ప్రతినిత్యం బహిర్గతమైన లోకంలో వున్న పదార్థాన్ని పొందడానికి మనం చేసే ప్రయత్నంలో ఇదే తేజస్సు అవరోహణ చెందుతూ వుంటుంది. బహిర్ముఖమైన లోకం పదార్థమైన లోకంగా మనకి గోచరిస్తుంది. ఇవన్నీ కావాలి అని ఉన్నంతకాలం ప్రజ్ఞ అవరోహణం చెందడం తప్ప, ఆరోహణ చెందడానికి అవకాశం లేదు. బహిర్లోకం లో కావాలి అనే పరిస్థితిలో వున్నందరూ కూడా ఎంత ప్రార్థన చేస్తున్నా, ఎంత దైవతత్వంలో వున్నా, వారు తూర్పుకి వెళ్తున్నాం అనుకుంటూ పడమరకి వెళ్ళిపోతారు. చేసేది దైవ ప్రార్థన, కోరేది బహిర్గతమైన ప్రపంచం! కాబట్టి ప్రవాహం ఎటు వెళ్తున్నది? పశ్చిమ ముఖంగా వెళ్తోంది. అదీ వివేకభ్రష్ట సంపర్కం అంటే! పాతాళంలోకి వెళ్తోంది. మనలో west అంటే మూలాధారం, ఇక అక్కణ్ణుంచి క్రిందకి మోకాల్లోకి వెళ్ళిపోయింది అంటే, నీ బుర్ర మోకాల్లో వుందిరా అంటూ వుంటాం చూసారా! అలా కాకుండా తూర్పుకి ప్రజ్ఞ వెళ్తే అంటే స్థూలమైన విషయములయందు ఆసక్తి కాకుండా, సూక్ష్మము మరియు దివ్యమైన సృష్టి విషయములయందు ఆసక్తి కలిగి వుండడం. అదీ తూర్పు ముఖం పట్టడం! అందుకని తూర్పుకి ప్రవహించే నదులు పుణ్యనదులు అన్నారు. గోదావరి, కృష్ణ, గంగ ఇవన్నీ తూర్పుకి ప్రవహిస్తున్నాయి కాబట్టి పుణ్య నదులు. అలాగే ఉత్తరానికి, 'ఉత్' అంటే ఊర్ధ్వముఖంగా వెళ్ళే నదులు కూడా

పుణ్యనదులు అన్నారు. మన భావనామయ లోకంలో ప్రవాహం ఊర్ధ్వముఖంగా ఉందా? అధోముఖంగా ఉందా? అధోముఖంగా వుంటే కుమారుడు పట్టుకుపోయి, మొసళ్ళకి అప్పజెప్పేస్తాడు. ఊర్ధ్వముఖంగా వుంటే మొసళ్ళు పట్టు వదిలేస్తాయి. ఒకొక్క మొసలి పట్టు వదిలేస్తుంది. మనం హాయిగా మొసలి మీద కూర్చుని ప్రయాణం చెయ్యవచ్చు వరుణకుమారుడి లాగ. మొసలినోట్లో ఉండేవాడు ఒకడు. మొసలి మీద కూర్చుని ప్రయాణం చేసేవాడు ఒకడు. అతడిని 'వరుణుడు' అంటారు. తెల్లని మొసలిమీద కూర్చుని చక్కగా నీళ్ళమీద తిరుగుతూ ఉంటాడు. నీళ్ళంటే ఆకాశగంగ లేక విద్యుత్ తరంగములు. ఆకాశంలో హాయిగా స్వేచ్ఛావిహారం చేసేవాడు ఒకడు. మొసలి నోట్లో పడి ఉండేవాడు ఒకడు. రెండూ జీవులే! ఇద్దరూ కుమారులే! ఒకడు అధోగతి చెందాడు. ఒకడు తన సహజమైన స్థితిలో వున్నాడని చెప్పడానికి ఆ విధంగా చెప్తారు. మనం సాధకులము అనుకుంటే, మనకి రుచి ఎటు వుంది అనేది ముఖ్యం. రుచి బయట విషయాల యందు ఉందా? లోపల విషయాల యందు ఉందా? లోపల విషయాల యందు రుచి ఉందనుకోండి, అటు కూడా speed గా తీసుకుని వెళ్తాడట, అదీ అయన గొప్పదనం. కుమారస్వామి ఎటు వెళ్తావురా? అని అడుగుతాడట. ఎటైనా speed గానే తీసుకెళ్ళిపోతాడుట. అయన నెమలివాహనం ఛక్ అని పట్టుకు పోతుంది. 'ఎటో నువ్వు తేల్చుకో' అంటాడు. తేల్చుకోవలసినది నువ్వు. నీళ్ళలోపడి కొట్టుకుంటావా? ఒడ్డున వుంటావా? ఒడ్డున వుండేది కూర్మం, నీళ్ళల్లో వుండేది మొసలి. రెండిటితో ఆడుతూ ఉంటాడుట. He plays with the crocodile and the turtle అంటాం. అటు ఊర్ధ్వ ముఖంగానూ పని చెయ్యగలడు. ఇటు అధోముఖంగానూ పని చెయ్యగలడు. అంటే సృష్టిలో అగ్నిలో వుండే బలం సూక్ష్మం నుంచి స్థూలం కి,స్థూలం నుంచి సూక్ష్మానికి రెంటినీ నిర్వర్తిస్తుంది. ఎటు కావాలనేది నీ నిర్ణయం. మనం తూర్పుకి వెళ్లాలని పడమరకి వెళ్ళే పడవలో కూర్చుంటాం. అడుగుతున్నది సూక్ష్మం తత్వంలోకి ప్రవేశం, చేస్తున్నది స్థూలం లోకి ప్రవేశం. కుమారుడు చూసి నవ్వుతూ ఉంటాడు. ఎందుకంటే కలకత్తా వెళ్ళే mail ఎక్కుదాం అనుకుని chennai వెళ్ళే mail ఎక్కినట్టు. రెండు mails ఒకేసారి వస్తాయి Visakhapatnam లో. అలా తూర్పు ముఖంగా వెళ్తున్నాము అనుకుంటూ పడమర ముఖంగా వెళ్లి మోసపోయే వాళ్ళు వుంటారు. ఎందుకంటే కోరేది ఇటు , కానీ అటు కావాలి అనుకుంటాం. అటూ కుదరదు, ఇటూ కుదరదు. ఇదేవిటి అంతకు ముందు బావుండేది. ఈ ప్రార్ధనలు అన్నీ చేస్తున్న దగ్గరనుంచీ అక్కడ ఏ పనులూ కావడం లేదు అంటాం. పనులు ఎగ్గొట్టడం కోసం కాదు ప్రార్థన. చైతన్యం యొక్క ప్రవాహం మనలో చక్కగా నిర్వర్తింప బడడానికి కాబట్టి, దానిని ధరించినవాడు స్కందుడు.

341, 342, 343 ధుర్యః, వరదః, వాయువాహనః

(ఈ నామాలకు వివరణ సేకరించే ప్రయత్నం జరుగుతున్నది.)

344 వాసుదేవః

వాసుదేవ అంటే బ్రహ్మాండము నుండి పిండాండం వరకు సమస్తమైన రూపముల అంతర్యామిగా దర్శనమిస్తాడు. దేనిలో ఉన్నా అది అలా ఉండడానికి కారణం వాసుదేవతత్వం. అంటే భగవంతుడు తను సృష్టించిన దానిలో తాను ప్రవేశించి, దాని యందు నివసించి ఉంటాడు. కాబట్టి వాసుదేవుడనే నామం వచ్చింది. కనుక సృష్టిలో దేనిని చూసినప్పటికీ దానిలో భగవంతుడు నివసించి ఉండటం వల్ల అది అలా ఉన్నదని మనం తెలుసుకోవాలి. అందువల్ల అందరి యందు ఉన్న వాసుదేవుని దర్శనం చేయడం అనేది ఒక సాధనగా మనకి పెద్దలు చెప్పారు. వసించి ఉన్నవాడు వాసుదేవుడు. మనం మనుషులను చూసినప్పుడు వారి యొక్క స్థితిగతులను నామరూపాలను ఎక్కువ చూస్తూ ఉంటాము. రూపం ప్రకారం గుర్తించడం, నామం ప్రకారం గుర్తించడం, ఆస్తుల ప్రకారం, ఐశ్వర్యం ప్రకారం గుర్తించడం, పదవుల ప్రకారం గుర్తించడం ఇది మామూలు లౌకికమైన జీవితంలో జరిగే విషయం. ఇవన్నీ కాక వీటికి ముందు వాడిలో వాడుగా ఉన్న తత్వాన్ని 'వాసుదేవతత్వం' అంటారు. వాడుగా వాడిలో ఉంటాడు కాబట్టి ఈ రూపం ఇట్లా నిలబడి ఉండడానికి ఏది కారణమో అది చూడాలి. స్థితిగతులు, పదవులు ఇటువంటివి చూడకుండా ఉంటే అన్ని రూపాల్లోనూ వాడే దర్శనం ఇస్తాడు. అందుకని వాసుదేవ తత్వాన్ని సాధన చేసే వారికి సమదృష్టి ఏర్పడుతుంది. నేను అధికారిని కాబట్టి ఎక్కువ అనేది ఉండదు. అవసరం ఉన్న వాళ్ళతో ఒక విధంగా ప్రవర్తించడం, అవసరం లేని వాళ్ళతో ఒక విధంగా ప్రవర్తించడం ఇలాంటివి ఉండవు. మామూలుగా మనం గుణములలో జీవిస్తూ ఉంటాము కాబట్టి ఆ విధంగా రంగులు మారిపోతూ ఉంటాము. అధికారి దగ్గరకు వెళ్తే ఎంతో వినయంగా ప్రవర్తిస్తాము. సేవకుడు మన దగ్గరకు వస్తే ఆ వినయం పోయి అధికారం గా ప్రవర్తిస్తాము. అది అహంకారము వల్ల. ఇష్టం లేనివాడు కనిపిస్తే లోపల ఒక రకమైన అయిష్టత వ్యక్తం అవుతుంది. ఈ తరతమ భేదాలు లేని వాడు సమదృష్టి కలిగినవాడు. రావణుని చూసిన రాముడు దీనికి తార్కాణం. తన పెళ్ళాన్ని ఎత్తుకుపోయిన వాడు కనిపిస్తే ఎట్లా ఉండాలి? విపరీతమైన కోపం రావాలి రాముడికి. ఎందుకు రాలేదంటే

వాసుదేవతత్వం కాబట్టి. పక్షిలో వాసుదేవుడిని చూసాడు. గుహుడిలోను, శబరిలోను, కోతుల్లోనూ వాసుదేవుని చూసాడు. అలా దర్శనం చేయటమే సాధన! అలా సాధన చేసుకున్న వాళ్ళకి ఆ సాధన పట్టుబడితే ఇంక జీవితంలో సమస్యలు అనేవి ఉండవు. సమస్యలు ఉండవంటే సమస్యలు రావని కాదు, సమస్యను అధిగమించి ఉంటారు. కాబట్టి దాని యందు తమ కర్తవ్యం గా ఉండటమే తప్ప సమస్యగా పరిగణించరు. ఈ స్థితిలో చాలామంది మహాత్ముల యొక్క దర్శనాలు కలుగుతూ ఉంటాయి. అంబరీషోపాఖ్యానంలో అంబరీషుడు దుర్వాసుని యందు, విష్ణువు నందు, విష్ణు చక్రం నందు అన్నిటియందు అంతర్యామినే దర్శించుట వలన వాసుదేవోపాసనలో ఉత్తీర్ణుడయ్యాడు. అలాగే శుకుడు. కొంతమంది స్త్రీలు స్నానం చేస్తూ ఉంటే పురుషులు అటుగా వెళితే స్త్రీలకు తేడాగా ఉండాలి, పురుషునికీ తేడాగా ఉండాలి. కానీ శుకుడు అటు వెళితే ఇద్దరికీ తేడా లేదు. ఎందుకంటే శుకుడు అక్కడ ఆడవాళ్లు స్నానం చేస్తున్నారు, నగ్నంగా ఉన్నారు అనే భావనలో లేడు కదా. అతనికి అంతా వాసుదేవ స్వరూపమే! కాబట్టి స్నానం చేస్తున్న స్త్రీలకు కూడా అటుగా పురుషుడు వెళుతున్నాడని అనిపించలేదట. అదే వేద వ్యాసుడు కొడుకు కోసం వెతుక్కుంటూ అటుగా వెళుతూ ఉంటే శుకుని చూసి ఏ సంచలనమూ లేని స్త్రీలే వేదవ్యాసుని చూడగానే గభాలున చెట్ల చాటున దాక్కుంటారు. శుకుని యొక్క వాసుదేవతత్వం గురించి మనకు సందేశం ఇవ్వడానికి ఈ సంఘటన ఇచ్చారు. తనయందు, సమస్తమునందు వాసుదేవునే దర్శిస్తూ ఉంటాడు కాబట్టి శుకుడు, 'శుకా' అని వ్యాసుడు పిలిస్తే చెట్టు పుట్ట జంతువులు అన్నీ కూడా 'ఓ' యని సమాధానం చెప్పాయట. శుకునియందు అంత పరమార్థము, అంత లోతైన తీవ్రమైన సాధన ఉన్నది. అలాగే ప్రహ్లాదుడు! సాధన చేస్తున్నామని అనుకునేవాళ్లు తెలుసుకోవలసినది ఏమిటంటే సృష్టిని సృష్టిగా దర్శనం చేస్తే ఎప్పుడూ ఏదో ఒక గమనిక ఉంటుంది. ఆలోచనల రూపంలో బాధలు లేని వాళ్ళు ఎవరైనా ఉన్నారా ప్రపంచంలో? ప్రతి వాళ్ళకి ఏదో బాధ కనిపిస్తూ ఉంటుంది. ఆ బాధ రూపంలో అక్కడున్న అస్తిత్వాన్ని వాసుదేవునిగా దర్శనం చేయాలి. అది చెప్పటం సులభం, చేయడం కష్టం. ఎందుకంటే అలవాటు లేదు కాబట్టి. ఏదైనా అలవా టు చేసుకుంటే సులభం అవుతుంది. అలవాటు చేసుకోకపోతే కష్టం. దీన్నే నేను అలవాటు చేసుకుంటాను అనుకుంటే సమస్త సమస్యల రూపంలో భగవంతుడు సాక్షాత్కరిస్తాడు అలవాటు చేసుకుంటున్నావు కదా చూద్దామని. 'ఊరికే చూద్దామని వచ్చాను రా... ఏడ్పేసి, గగ్గోలు పెట్టేసి, గందరగోళం చేసేసి నానా బాధ పడిపోతున్నావు పోనీ వద్దులే వెళ్లిపోతాను' అంటాడు. మనం ఏమీ మారకుండా బాధలు పడకుండా వాసుదేవుడు కనిపించాలని అనుకుంటాం. మనకు పురుగులన్నీ

అలాగే ఉంచుకొని, ఏది ఉంటే బాధపడతావో అవి కూడా అలాగే ఉంచేసుకుని, నువ్వు కూడా ఉండు అంటాము అందుకనే వాసుదేవ ఉపాసన అనుకోగానే సమస్యలు వస్తాయి. కొంతమందికి గట్టిగా పూజ చేస్తే అనారోగ్యం వస్తుంది. వాసుదేవోపాసన అంటే వచ్చిన సమస్య రూపంలో వాసుదేవుడు వచ్చాడు అని చూడాలి. ఇది జరిగితే మొత్తం క్షాళనమైపోతుంది ఇంకేమీ మిగలదు. అందుకే సన్నివేశాల రూపంలో అప్పుడప్పుడు వస్తూ ఉంటాడు. వచ్చినప్పుడు ఆ మొత్తం సన్నివేశాన్ని వాసుదేవునిగా దర్శించే సాధన ఒకటి ఉన్నది. ఆ మెట్టు ఎక్కాలి. అప్పుడు వాసుదేవ అనడానికి అర్హత ఉన్నది. మనకి ఏదైనా కొంచెం అనారోగ్యం వస్తే అంతా కంగారే. కొంచెం కష్టం వచ్చినా, సమస్య వచ్చినా కంగారే! అనుకున్నది అనుకున్నట్టుగా జరగకపోతే కంగారే! మనం అనుకున్నది అనుకున్నట్లుగా సాగనప్పుడు ఆ సమస్య రూపంలో భగవంతుడు ఉన్నాడు అనుకుంటే సమస్య మబ్బు విడిపోయినట్లు విడిపోతుంది. సమస్యని సమస్య రూపంలో చూస్తే గోళ్ళలోకి వెళుతుంది. భగవంతుడు చూస్తాడు... వీడు సమస్యను చూస్తాడా నన్ను చూస్తాడా అని. భగవంతుడిని సమస్య రూపములో చూడటం మొదలుపెట్టిన వాడికి సమదర్శనం వస్తుంది. సమస్యలు ఉండవు. మాట వినని భార్య కానీ, భర్త కానీ దొరికితే వారి రూపంలో భగవంతుడే పరీక్షిస్తున్నాడని మహాత్ములు అనుకుంటారు. మాట వినని కుర్రవాడు దొరకవచ్చు. ఎంతో యోగ్యులైన తల్లిదండ్రులకు పుట్టి అసభ్యమైన పనులు చేస్తూ ఉంటారు. వారు భగవంతుడు ఈ రూపంలో తమకు శిక్షణనిస్తున్నాడని తెలిస్తే ఇంట్లోంచి వెళ్లిపోయిన వాడు కూడా వీళ్ళని వెతుక్కుంటూ వస్తాడు. సమస్యలు పూర్తిగా పరిష్కరింపబడాలంటే వాసుదేవ ఉపాసన ఒకటే మార్గం. ఆ సమస్యను భగవంతునిగా దర్శనం చేసి, మన కర్తవ్యం మాత్రమే నిర్వర్తిస్తూ, వాసుదేవుని యందే నిలబడితే కాలం రూపంలో ఉన్న వాసుదేవుడు మన సమస్యలను తీర్చక తప్పదు. దుర్వాసుని రూపంలో అలా వస్తే అంబరీషుడు చేశాడు. అదే దుర్వాసుని రూపంలో వస్తే ద్రౌపది అదే చేసింది. ఏదో రూపంలో సమస్య వచ్చినప్పుడు సమస్యలు వచ్చాయని కుంగిపోవడానికి, సమస్యలు అనేవి జీవితంలో వస్తాయి, మీ సహాయం ఉంటే చాలు అని అనుకునే దానికే ఎంత తేడా ఉంది. అసలు సమస్య రాకుండానే ఉండడం ఈ సాధనలో ఉండదు. ఇది ఇట్లా జరగాలి అని అనుకోవడానికి ఏమీ లేదు. మాస్టర్ గారు ఎప్పుడూ 'ఎప్పుడయినా, ఎక్కడయినా, ఎవరికైనా, ఏదైనా జరగవచ్చు' అని చెబుతూ ఉండేవారు. నా బోటి వాడికేంటండి? అని అనుకోకూడదు. నువ్వేం ధర్మరాజువా? హరిశ్చంద్రుడివా? నలుడివా? రాముడివా? వాళ్లకే కాలం రూపంలో రకరకాలైన కష్టాలు వచ్చాయి. నీకెందుకు రాకూడదు? కాకపోతే వాళ్ళకి వచ్చినట్లు నీకు సహాయం వచ్చిందా, లేదా? అదీ

లెక్క! సమస్యలేని జీవితం లేదు. సమస్యలను భగవంతుడిగా దర్శించి, కర్తవ్యం నిర్వర్తించి ఇట్లా కావాలని అనుకోకుండా, 'నాకేది మంచిదో అది నువ్వు చేస్తావని తెలుసు. నా కర్తవ్యాన్ని నేను నిర్వర్తిస్తాను. మిగతాది నువ్వు చేసి పెట్టు. నేను చేసుకోలేను. ఇదంతా నేనే చేస్తున్నానని నాకు లేదు' అని అనుకోవాలి. మనమే ఏదో చేసేస్తున్నామని ఉన్నది పీట ముళ్ళు వేసుకుంటూ ఉంటాము మనుషులు ఎవరూ లేని చోట scooter tyre puncture అయిన దానికి, ఇంటికి వచ్చిన తర్వాత scooter tyre puncture అయిన దానికి తేడా ఉందా లేదా? Puncture ఎందుకు అవ్వాలి? అని అనుకోకూడదు. ఎవరూ లేని చోట, మనకు తెలియనిచోట, కొత్త ప్రదేశంలో పడ్డామనుకోండి లేదా మన ఇంట్లో పడ్డాం అనుకోండి లేదా hospital దగ్గర పడ్డామనుకోండి లేదా doctor clinic దగ్గర పడిపోయాం అనుకోండి తేడా ఉంది కదా. పడే వేళకి ఎవరో ఒకరు వచ్చి చూసుకుంటున్నారు. వాడే వాసుదేవుడు! మనం రోడ్డు మీద పడిపోతే 10 మంది తెలిసిన వాళ్ళో, తెలియని వాళ్ళో వచ్చి hospital కి తీసుకుని వెళ్లి సకాలంలో వైద్యం జరిగేటట్టుగా చూస్తారు. వాళ్లే వాసుదేవుడు! ఊరు తప్పక వెళ్లాలి, ticket లేదు. అప్పుడు ఎవరో వచ్చి మనకు ticket arrange చేస్తారు. వాడే వాసుదేవుడు! వాడు చూస్తే కనిపిస్తాడు. చూడకపోతే కనిపించడు. మనం అడగకుండానే ఇలా కాదండి, అలా చేసుకోండి అని చెప్పేసి వెళ్ళిపోతాడు. వాడు వాసుదేవుడు! మనం వాడిని చూస్తూ, వాడిని వింటూ ఉంటే మీతో ఎక్కువ ఉంటాడు. ధర్మరాజుకు అలా జరిగింది. రాజసూయం అయిపోయి మహా వైభవం అనుభవించి ఉన్న సందర్భంలో రాజులు బంధువులు, మిత్రులు, ఋషులు, యోగులు, అందరూ వెళ్లిపోయిన తర్వాత శ్రీకృష్ణుడు ఉండిపోతాడు. మామూలుగా ఎప్పుడూ అలా ఉండడు కృష్ణుడు. ఏదో కారణం చేత ఉన్నాడు కాబట్టి మనం కూడా ఉందామని ఉండిపోయాడు వ్యాసుడు. వ్యాసుడు ఉన్నంతకాలం కృష్ణుడు ఏ విషయము అనలేదు. ఎన్నాళ్లు పోయినా కృష్ణుడు ఎందుకు ఉన్నాడో తెలియడం లేదు. వ్యాసుడు తెలుస్తుందేమో అని చూస్తున్నాడు. ఈయన హాయిగా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ ఉంటే, పనులున్న వాళ్లకు తోచద్దూ? ఇక లాభం లేదు మనం ఇక్కడ ఉండడం అని వ్యాసుడు వెళ్ళిపోతాడు. ఆయన వెళ్లిపోయిన తక్షణమే కృష్ణుడు ధర్మరాజును పిలిచి చెప్తాడు. 'ఈ భూమి మీద ఏ రాజుకీ జరగనంతటి వైభవం ఇప్పుడు నీకు జరిగింది. తర్వాత 14 సంవత్సరాల పాటు మీకు భయంకరమైన సన్నివేశములు ఉన్నాయి. నీకు వచ్చే ప్రతి కష్టమైన సన్నివేశాన్ని నేనుగా భావన చేసుకో. నీకు ఏ కష్టం వచ్చినా అది నేనే అనుకో. నేనే అట్లా వచ్చాను అనుకో. మనుష్యుల మీద కక్ష పెంచుకోకు రొష్టు పడిపోతావు' అని చెప్తాడు. అప్పటినుండి ధర్మరాజుకు ప్రతిరూపము వాసుదేవుడే! ఆయన పడ్డ కష్టాలు మనం చెప్పలేము. ఇన్ని

కష్టాలలోనూ ఆయన నశించిపోలేదు. అది వాసుదేవుడు! అక్కడే ఉంటాడు. మన చుట్టూ ఉంటాడు. మనల్ని చూస్తూ ఉంటాడు. మనం చూడకపోతే కనపడడు. మన ప్రక్కనే, మనతోనే, మన లోపలే ఉంటాడు. అంతకంటే సన్నిహితంగా ఎవరూ ఉండడానికి వీల్లేదు. మన లోపల మనలాగా ఉన్నవాడు ఆయనే! మన చుట్టూ ఉన్న వాళ్ళ రూపంలో ఉన్నవాడు ఆయనే! మన చుట్టూ కొంతమంది మాట వినేవాళ్లుగా, కొంతమంది మాట వినని వాళ్ళుగా ఉంటారు. కొంతమంది మన వెనకాలే మన మీద లేనిపోని మాటలు అనేవాళ్లుగా ఉంటారు. వాళ్ళందరూ వాసుదేవులే! అందుకనే దేవుని యొక్క తీరుతెన్నులు తెలుసుకోవడం కష్టం అంటారు మాస్టర్ గారు. ఆ తత్వం ఎలా ఉంటుందంటే ఒకసారి కారం ఇస్తే ఇంకొకసారి తీపి నోట్లో పెడతారు. అలా రుచులు చూపిస్తారు. దేనికి కూడా ఇది ఇలాగే ఉంటుంది అనుకోకూడదు. ఎప్పటికీ నాతో ఉందామనుకో, అన్ని సమస్యలు తీరుతాయి. మనం చేసిన కర్మలు కడతేరాలంటే ఆ boat లో కూర్చోవాలి. అక్కడ ఏదో సమస్య ఉంటే సమస్యను భగవంతుడిగా దర్శనం చేయడం కాకుండా వేరే విధంగా భగవంతుని ధ్యానం చేస్తే దొరకడు. వచ్చిన సమస్య రూపం లో వాసుదేవుడే వచ్చాడు. తనని చంపడానికి వచ్చిన మహా కృత్యను వాసుదేవుడుగా చూస్తాడు అంబరీషుడు. అలా చూడగలమా ? చూస్తే ఏం జరుగుతుందంటే 1. ముందు మనకు కర్తవ్యం చాలా speed గా గోచరిస్తుంది. 2. చుట్టు ప్రక్కల నుండి, మనుష్యుల నుండి సకాలంలో సహకారం అందుతుంది. కనుక వాసుదేవుడు సర్వకాల సర్వావస్థల యందు అందరి యందు ఉన్నవాడుగా ఉంటాడు. అట్లా పరమాణువు దగ్గర నుండి బ్రహ్మాండం వరకు ఉంటాడు. పరమాణువులో ఉన్న size బ్రహ్మాండంలో ఉన్న size రెండూ సమానమే. అన్నమాచార్యులు 'చేరి యశోదకు శిశువితడు, ధారుణి బ్రహ్మకు తండ్రియునితడు' అని వ్రాస్తారు. మొత్తం సృష్టికి తండ్రిగా, యశోదకు కొడుకుగా రెండుగా వాడే ఉన్నాడు. He can be in any dimension. శత్రువు రూపంలో కనిపించినప్పుడు శత్రువు రూపంలో ఉన్న వాసుదేవుడు అనుకుంటే శత్రువు ఏమీ చేయలేడు. అది వృత్రాసురుడు చూపించిన విద్య. ఇంద్రుడు చంపటానికి వస్తూ ఉంటాడు. ఓడిపోతూ ఉంటాడు. మళ్లీ విష్ణువుని ధ్యానం చేసుకొని, విష్ణువు వద్ద వరం పొంది మళ్లీ వస్తాడు అయినా ఏమీ చేయలేడు విష్ణువు ధ్యానం చేసి వచ్చినా వృత్రాసురుని ఏమీ చేయలేక పోతాడు. ఏమిటిరా నీ బలం అని అడిగితే నా బలం 'నువ్వే' అంటాడు. 'నువ్వు నాలో శత్రువుని చూస్తున్నావు కానీ నేను నిన్ను శత్రువుగా చూడటం లేదు నీలో నారాయణునే చూస్తున్నాను నేను నీలో నారాయణుని చూసినంత సేపు నువ్వు నన్ను చంపలేవు' అంటాడు. అది శ్రీకృష్ణుడు చెప్పినది. నన్ను నమ్ముకున్న వాడికి నాశనము లేదనటంలో ఉద్దేశం అది. వాడు మునగడు. కర్మవశాత్తు పడుతూ ఉంటాడు గాని

మునగడు. కాస్త ఏడిపించినప్పుడు కూడా ఏడిపించినవాడు 'వాడే' అని భావన చేసుకుంటే అందులో ఒక సులువుఉంది. మనలని ఇంకొకడు ఎవడో ఏడిపిస్తున్నాడు అనుకున్నప్పుడు రకరకాల బాధలు, కసి వాడి మీద పెరిగి, ఇంకా ఏవేవో మాటలు పెరిగి మనం అంతా పాడు చేసుకుంటాము. అందుకనే ఎప్పుడైనా, ఎవరైనా మనల్ని ఏమైనా అన్నా కూడా ఒక్కసారి 'వాసుదేవ' అని అనుకోమంటారు. మంచికే వాసుదేవ! మనం అనుకున్న చెడుకు వాసుదేవ! ఇట్లా చేసుకుంటూ ఉంటే అన్ని రూపాలలో ఉన్న వాసుదేవుడు మనకి ఉపకారం చేస్తాడు ఈ సాధన పరాకాష్ట చెంది పరిపూర్ణమైన వాసుదేవతత్వం అవతరణ చెందినప్పుడు, అలాంటి సాధకుని కాలు క్రింద పెట్టనివ్వడు. పూల మీద నడిపిస్తాడు. ఎందుకంటే వాడి యొక్క ఉపాసనతో పరిపూర్ణమైన వాసుదేవ తత్వాన్ని మన యందు అవతరింప చేసుకుంటాం. కాబట్టి ఆ రూపానికి అంత వైభవం ఉంటుంది. అదీ జనకుడు! అందుకని జనకుడు ఎప్పుడు ఎక్కడ కూర్చున్నా సరే దేవతలందరూ వచ్చి సేవలు చేస్తారు. ఎందుకంటే జనకుడు పరిపూర్ణమైన వ్యక్తరూపమైన వాసుదేవుడు. అన్నీ భోగభాగ్యాలే! ఆయన కావాలనుకోలేదు. ప్రీతితో దేవతలచే ఇవ్వబడ్డాయి. కనుక వాసుదేవుడంటే అలా ఉంటాడు. చిన్న చీమ నీళ్లలో పడిపోయినా దాన్ని తీయాలి. ఎలుక, చీమ, బొద్దింక అని ఏ జీవినీ తక్కువ అనుకోకూడదు. అలా చేస్తాడు నలుడు. ఒక పాము మంటల్లో ఇరుక్కుపోయి నన్ను రక్షించు రక్షించు అంటూ ఉంటే... అప్పటికే భార్య పోయింది. అన్నీ పోయాయి. సమస్తము పోయి, ఒంటి పైన బట్ట అంతంత మాత్రమే ఉంది. ఇటువంటి స్థితిలో ఒక పాము రక్షించు అంటే, రక్షిస్తే అది కాటేస్తుంది. ఇదేమిటి ఇలా చేశావు అని అడిగితే మంచికే చేశానంటుంది. నల్లబడిపోతాడు అంత అందగాడూనూ. వాసుదేవో పాసన చేసుకునే వాళ్ళకి ప్రతి చెడూ ఒక మంచికి దారితీస్తుంది. అప్పటికప్పుడు గుర్తించలేకపోవచ్చును గాని తర్వాత గుర్తింపుకొస్తుంది. ప్రతి మనిషికి ఒక చెడు నీడగా ఉంటుంది. ప్రతి చెడుకి ఒక మంచి వెలుగుగా ఉంటుంది. అది తెలుసుకోవాలి. ఈ భూమి మొత్తం సూర్యుడు వెలుగు తన మీద పడాలని సూర్యుడు చుట్టూ తిరుగుతోంది. అటు ప్రక్క పడితే ఇటు ప్రక్క చీకటి వస్తుంది. ఇటు ప్రక్క పడితే అటు ప్రక్క చీకటి వస్తుంది. సంవత్సరం అంతా భూమి సూర్యుడు చుట్టూ తిరుగుతూ ఉన్నా ఒక ప్రక్క వెలుగు ఒక ప్రక్క చీకటే కదా. ఎప్పుడైనా ఈ భూమి మొత్తం వెలుగుగా ఉందా? మనం సూర్యుడు వైపు ముఖం పెడితే వీపు వైపు వెలుగు పడదు. వీపు సూర్యుడు వైపు పెడితే మొహం మీద పడదు అంతే కదా! కాబట్టి ఈ రెండూ ఉంటాయని తెలిసి ఈ ద్వంద్వానికి అతీతంగా ఉండే స్థితిలోకి ఉద్ధరింపబడాలంటే ఈ 'వాసుదేవ' నామాన్ని ధ్యానం చేయాలి. సంసిద్ధత ఉన్న వాళ్ళు అంగీకరిస్తారు. సమస్యలకి అతీతంగా జీవించే స్థిరత్వం వస్తుంది. లేకపోతే

మనం ఎన్నాళ్ళు ఎన్ని పూజలు చేసుకున్నా, ఎన్ని హోమాలు చేసుకున్నా, ఎన్ని వ్రతాలు చేసినా, ఎన్ని పారాయణలు చేసినా ఇందులో ఒక కుత్సితమైన ఆలోచన ఉన్నది, ఏమిటది మనకి కష్టం రాకూడదని! ఎవరికి రాకుండా పోయాయి చూపించండి. ఫలానా ఆయన పుట్టిన దగ్గర నుండి చచ్చిన దాకా ఏ కష్టం లేకుండా ఉన్నాడనేదేమీ ఉండదు. సత్యం ఏమిటంటే పగలు రాత్రిలా అవి ఇవి వస్తూ ఉంటాయి. వాటికి అతీతంగా జీవించే స్థితిలో మనం ఉంటే సమస్యలు సమస్యలుగా ఉండవు. మనకు ప్రతిదీ సమస్యే. ఇంటికి రావాల్సిన పిల్లవాడు 10 నిమిషాలు ఆలస్యం అయితే అది సమస్య కొంత మందికి. 10 సంవత్సరాలు ఇంటికి రానివారు ఉంటారు. వాడి సంగతేమిటి? చేస్తే, సాధన ఇది. దానిని మాస్టర్ గారి జీవితంలో దర్శించాము. ఆయనకు ఏదీ సమస్య కాదు. అలా అని దేనిని అశ్రద్ధ చేయలేదు. అది ఎంత విషయమైనా అప్పుడు మనం ఏం చేయాలో చూసేవారు. వాసుదేవతత్వంలో ఉండేవారు. వాసుదేవుని దర్శిస్తూ ఉండేవారు. మనల్ని ఉల్లాసపరుస్తూ ఉండేవారు. ఆయన ఉల్లాసంగా ఉండేవారు. అలాగే అవసరమైనప్పుడు చాలా శిక్షణ ఇచ్చేవారు. కర్తవ్యము నందు అప్రమత్తంగా ఉండేవారు. మొత్తాన్ని వాసుదేవ తత్వంగా దర్శనం చేసేవారు. తన, పర అనే భేదం మాస్టర్ గారి దగ్గర లేదు. వీడు నా కొడుకు, వీడు కాదు అనే సన్నివేశం మాస్టర్ గారి దగ్గర కనబడలేదు. వీడు మనవాడు, వీడు కాదు అన్నది కనబడలేదు. అదీ వాసుదేవోపాసన! కష్టమైనది. దాని యందు సిద్ధి పొందిన వారి సాన్నిధ్యంలో మాత్రమే అది సాధ్యమవుతుందని భాగవతంలో చెప్తారు. ఆయన సమస్తములోనూ ఉంటాడు భాగవతం అంతా ఇదే! భాగవతంలో వారు కోరేది వాసుదేవుని యొక్క లీలలే! అవి అతి భయంకరంగా ఉంటాయి చూడడానికి ఏవి? పై పొర. అరటిపండు పైకి భయంకరంగా ఉంటుంది. లోపల తియ్యగా ఉంటుంది. మేడిపండు పైకి బాగుంటుంది. లోపల అంతా? ఊరికే పైపై మెరుగుల కి లొంగిపోయే వాళ్ళకి ఈ సాధన కుదరదు. పైపై మెరుగులకి ఉబ్బి పోవటం, పైపై కష్టాలకి కృంగిపోవటం రెండూ ఉండవు. ఇది చెప్పినంత సులభం కాదు. చేయటం మొదలుపెడితే మనకి కనిపిస్తూ ఉంటాడు అక్కడక్కడ. ముందు కొద్ది కొద్దిగా ఉన్నాడేమో అని సందేహం వచ్చేటట్లుగా ఉంటుంది. నెమ్మదిగా ఉన్నాడు అని ఖచ్చితంగా తెలుస్తుంది. ఎందుకంటే మనకు వచ్చే సహాయం అలా ఉంటుంది. సహాయం నువ్వు వస్తుందనుకుంటే రాకపోవచ్చును. ఆ సన్నివేశాన్ని అట్లా ధ్యానం చేయాలి. మన కర్తవ్యం మేరకు మనం ఉండాలి. ఎప్పుడు, ఎవరికి, ఎక్కడ, ఏదైనా కావచ్చును అన్నదాన్ని గుర్తుపెట్టుకుని, జరుగుతున్న సన్నివేశాన్ని భగవంతుని అస్తిత్వంగా గుర్తు చేసుకుంటూ ఉంటే అక్కడ వాసుదేవుడు నిలుస్తాడు.

345 బృహద్భానుః

'బృహద్భానుః' అంటే పెద్ద సూర్యుడని. ఈ సూర్యుడు మన సూర్యమండలానికి వ్యక్తమైనట్టి కేంద్రం. అంతరిక్షంలో ఇలా ఎన్ని కేంద్రాలు ఉన్నాయో? మనం చూసే ప్రతి నక్షత్రం ఒక సూర్య మండలం. మొత్తం ఆ గుంపు అంతా కలిపి ఒక వెలుగు ముద్దలా, తళుకు తళుకుమంటూ కనిపిస్తుంటుంది. ఈ కనబడుతున్న వెలుగులన్నిటికీ ఆ వెలుగు ప్రసాదించింది ఎవరు? అదే మనం చేసుకునే గాయత్రి మంత్రం. 'బృహద్భానుః' అనే దానికి మంత్రం గాయత్రీ మంత్రం. అది, చిన్న బొద్దింక కన్నుల్లో వెలుగు దగ్గర నుండి సూర్యుడు, సవిత్రుడు వరకు వెలుగుగా ఉంటుంది. మనం ఎవరిని ఎవరం చూసుకున్నా కూడా, కళ్ళల్లో వెలుగులు చూసుకునే కదా పలకరించుకుంటాం. సహజంగా వెలుగు లేకపోతే దృష్టి పోతుంది. 'బృహత్' అంటే చాలా పెద్దది అని అర్థం. బృహత్ ప్రణాళిక అంటూ ఉంటాం. ఈ మొత్తం సృష్టి ప్రణాళికకి వెలుగు గా నిలబడిన సత్యాన్ని మన వాళ్ళు గాయత్రి మంత్రం ద్వారా ధ్యానం చేసుకుంటారు. గాయత్రి ఆడ మగ అనేది అలా ఉంచి, వ్యక్తం అయిన వెలుగు! ఈ శ్లోకమంతా కూడా వ్యక్తమైన వెలుగు. అవ్యక్తమైన స్థితి నుండి వ్యక్తమైన స్థితికి 'స్కందః' దగ్గర మొదలుపెట్టి ఇప్పుడు 'బృహద్భానుః' దగ్గరికి వచ్చాము. మొత్తం భళ్ళున వెలుగు వచ్చింది. ఆ వెలుగు నుండి మండలాలు గోళాలు ఏర్పడుతున్నాయి. అందులోంచి సూర్యులు పుట్టారు. వాటినే 'భృగులు' అంటారు. భృగు మహర్షి అంటూ ఉంటామే మన పురాణాల్లో భృగువు అంటే భర్గులు అన్నమాట. భర్గులంటే వెలుగు ముద్దలని. వెలుగు ముద్ద, మొత్తం వెలుగులోంచి ఒక్కొక్కటిగా వస్తూ ఉంటుంది. ఆ వచ్చిన దాంట్లో నుంచి మిగతా గ్రహగోళాదులన్నీ వస్తూ ఉంటాయి. అంతే! వెలుగు నుంచి సమస్తము ఏర్పడుతూ ఉంటుంది. స్థూలమైతే పదార్థంగా కనిపిస్తుంది. సూక్ష్మమైతే ఆకాశంలో వెలుగుగా కనిపిస్తుంది. మన అందరి మధ్య చోటుగా వెలిగింపబడినది ఆ వెలుగే. ఆ వెలుగు నుంచి ఈ గోళాలన్నీ ఏర్పడతాయి. ఇన్ని గోళాలు గాను, ఇన్ని గోళాల నుండి ఇన్ని గ్రహాలుగాను, ఈ గ్రహాల నుండి ఇన్ని జీవులుగాను దిగివస్తున్నది ఒకటే వెలుగు. ఇవన్నీ వెలుగు యొక్క వ్యక్త రూపాలే. అసలు వెలుగు అవ్యక్తం నుంచి వ్యక్తం అవుతూ ఉంటుంది. మనం నిద్రలేచినప్పుడు ఎక్కడ నుండి లేస్తామూ? అవ్యక్తం నుండి వ్యక్తం అవుతాం. లేస్తాం. అట్లా మొత్తం వ్యక్తమైన చోటునే ఆకాశమన్నాము. 'కాశ్' అన్న పదానికి అర్థం వెలుగని. 'ఆకాశ్' అంటే వెలిగింపబడినదని. దానిని 'చైతన్యం' అంటారు. దాన్నే పురాణాలలో అమ్మవారు అంటారు. అది బహిర్గతమైన వ్యక్త స్వరూపం. అందుకే మనకి గాయత్రీ మంత్రంలో అవ్యక్తమైన దానికి ఆధారంగా

వ్యక్తమైనది కాబట్టి స్త్రీగా వర్ణిస్తారు. అవ్యక్తం కనిపించని భగవంతుడు. ఆ కనిపించని భగవంతుడే అమ్మవారుగా కనిపిస్తారు. అందుకే ఆ కనిపించని దానిని అయ్యవారని, కనిపించే దానిని లేదా వ్యక్తమైనదాన్ని అమ్మవారని అన్నారు. ఆయన కనిపించడు, ఈవిడ కనిపిస్తుంది. ఈవిడ ఉండడం అంటే ఆయనే ఈవిడగా ఉన్నది. అలా వ్యక్తం అవుతుంది. అట్లా వ్యక్తమైన దానినే మళ్లీ 'ఈశ్వరుడు' అంటారు. ఒక్కొక్కళ్ళు ఒక్కొక్క పేరు పెట్టేసరికి మనం వేరువేరుగా అనుకుంటాం. ఒకళ్ళు 'విద్యుత్' అని ఒకళ్ళు 'electricity' అని ఇంకొకళ్ళు మరొకటి అని దాన్నే చెబుతూ ఉంటాము. వ్యక్తం అవుతున్నది ఒక పరిధి మేరకు వ్యక్తం అవుతుంది. ఆ మొత్తం పరిధి మన ఆకాశం. దాన్నే 'కురుక్షేత్రం' అన్నారు. ఆ పరిధిలోనే అన్ని actions జరుగుతూ ఉంటాయి. కురు అంటే action . క్షేత్రం అంటే field. Field of action. ఈ మొత్తం field లో ఆవరించిన వెలుగు ఒకటి ఉంటే, ఆ వెలుగులోంచి ఒక్కొక్కటే ఒక్కొక్కటే పుట్టుకుంటూ వస్తాయి. పుట్టుకొచ్చిన దాంట్లో మళ్ళీ ఆ వెలుగు ఉంటుంది. మనకు 'స్కందః' చెప్పి 'వాసుదేవ' చెప్పి 'బృహద్భానుః' అని చెప్తున్నారు. అంటే ఏమిటంటే ఈ చిన్న చిన్న వెలుగులన్నీ కూడా పెద్ద వెలుగులో భాగమేనని. ఊరిలో electricity ఉంటే మన ఇంట్లో tube light లోను ఉంటుంది. ఊళ్లో లేకుండా మన ఇంట్లో ఉండదు కదా. మొత్తంలో నుంచి విడివిడిగా వస్తుండటంతో, అంతా మొత్తంలో భాగమని తెలుస్తుంది. తెలిసినప్పుడు మనకు అవగాహన ఉంటుంది. మన సూర్యుడికి మించి ఉన్నది సవితృ మండలంలో, అంతకన్నా మించి భర్గోదేవ మండలంలో ఉన్నది. ఆ భర్గులైన వెలుగు ముద్దలను 'భృగు మహర్షు'లంటారు. భార్గవులంటారు. ఈ భర్గులందరికీ కేంద్రమైన వాడిని, ఆధారమైన వాడిని 'భర్గోదేవః' అంటారు. 'భర్గోదేవ అస్య ధీమహి'. భర్గః అంటే వెలుగు ముద్దలు. అస్య అంటే యొక్క. దేవః అంటే దేవుడు. అంటే వాడికి పుట్టుక స్థానం. వెలుగు ముద్దలన్నిటికీ పుట్టుక స్థానం. మన సూర్యుడు లాంటి సూర్యులు కోటానుకోట్లు ఉన్నారు. వీళ్ళందరికీ ఎవరు మూలస్థానమో, వాడిని మనం గాయత్రీ మంత్రంలో తలుసుకుంటున్నాము. 'ధీమహి' అంటే we meditate. మనం ధ్యానం చేస్తున్నాం. ఎవరిని? భర్గుల యొక్క దేవుడిని. 'భర్గోదేవస్య ధీమహి'. ఎందుకోసం? వాడు నీలో కూడా ఉన్నాడు. ప్రచోదనం అవటం కోసం. 'ధియః యోనః ప్రచోదయాత్'. మా బుద్ధులను ప్రచోదనం చేయడం కోసం. గాయత్రీ మంత్రం అంటే ఏదో చిన్న పటం పెట్టుకుని ఆ ఫోటోకే పరిమితం చేయకండి. మొత్తం మన లోపల, మన బయట ఉన్న సమస్తమైన వెలుగు మనల్ని మరింత ప్రచోదనం చేసుకోవడం కోసం రోజూ ఒక shower. Light shower. రోజు shower తీసుకుంటాం కదా. ఇది వెలుగు స్నానం చేస్తే ఎలా ఉండాలి? ధగధగలాడిపోతూ ఉండాలి. గాయత్రీ మంత్రం చేసి dull గా ఉండడానికి వీలు లేదు.

ఎందుకు అలా ఉంటామంటే మనకి గాయత్రి మంత్రం అంటే ఏమిటో తెలియదు కదా ఊరికే ఏదో అలా చదివేస్తాం. అది రుబ్బడం. ఊరికే రుబ్బడం కాదు కదా! అందులో ఏదో వేసి రుబ్బాలి. మన లోపల, మన బయట ఉన్న వెలుగుని మనలోకి ఆవాహన చేసుకుంటున్నామన్న భావనతో ఈ మంత్రాన్ని చేసుకోవాలి. ఒకసారి చేశాం, కపాలం నిండింది. ఇంకోసారి చేశాం కళ్ళల్లో నిండింది. ఇంకోసారి చేశాం చెవుల్లో నిండింది. ఇంకోసారి చేసాం ముక్కులో నిండింది. ఇంకోసారి చేశాం నోరు నిండింది. ఇంకోసారి చేసాం చేతులు అలా శరీరం అంతా వెలుగు తరంగాలతో నిండిపోయినట్లు భావన చేసుకోవాలి. సత్రాజిత్తు శమంతకమణిని పెట్టుకున్నప్పుడు వచ్చినంత వెలుగు రావాలన్నమాట గాయత్రి మంత్రం చేసుకుంటే. ఆ వెలుగు ఎంత లోపలికి వస్తుంటే లోపల ఉన్న రుగ్మతలను చీకటిని అంతగా పారద్రోలుతుంది. కుమారస్వామి వస్తూ ఉంటే తారకాసురుడు పారిపోయాడు అంటే చీకటి పారిపోతుంది. వెలుగు నిండుతుంది. అది 'బృహద్భానుః'.

346 ఆదిదేవః

ఆది దేవుడంటే మొదటి దేవుడని అర్థం. వెనకాల, పైన ఉంటాడు. ఈ వెలుగుకి ఆధారంగా ఉండేవాడు. వాడితో మనకేమీ సంబంధం లేదు. వెలుగుతోనే మనకు సంబంధం. వెలుగులోకి మనం వెళితే, ఈ వెలుగులోంచి ఆ చీకటికి దారి దొరుకుతుంది తప్ప సరాసరి అవ్యక్తమైన దానికి దారి దొరకదు. ఎందుకంటే మనమంతా వెలుగులోంచి పుట్టిన వాళ్ళం కాబట్టి ముందు ఆ వెలుగులో ఇమిడితే, ఆ వెలుగు ఏ ఆధారంగా నిలబడిందో ఆ రహస్యం తెలుస్తుంది అందుకని ఈ వెలుగు ధ్యానాన్ని మించినది లేదని చెప్తారు. గాయత్రి కి మించిన మంత్రం లేదని చెప్పటంలో ఉద్దేశం అది. అది వెలుగును అవగాహన చేసుకుని, వెలుగును చూసి, వెలుగును దర్శనం చేస్తే, తానే ఆ వెలుగైపోయి, తన యొక్క ప్రత్యేకమైన అస్తిత్వాన్ని చిన్నది చేసుకుని, ఆ మొత్తం యొక్క తత్వాన్ని ఎక్కువగా గమనించేటట్టుగా తయారు చేస్తుంది. మనం కొలిచే దేవతలు అందరూ ఉన్నారే, వాళ్లంతా దానిలోంచి వచ్చిన వాళ్లే. వినాయకుడు అందులోంచే వచ్చాడు. కుమారస్వామి అందులోంచే వచ్చాడు. ముందు అది వచ్చాకే వీళ్లంతా వచ్చారు. దాన్నే మన వాళ్ళు 'అదితి' అని అంటారు. ఆవిడ రాగానే దితి పక్కకు వెళ్ళిపోతుంది. ఆవిడ లేకపోతే దితి ఉంటుంది. దితి అంటే చీకటి. అదితి అంటే చీకటి లేకపోవడం. ఆవిడ లోంచి పుట్టారు కాబట్టి 'ఆదిత్య'లని పేరు. అది మొదటి జోడు. ఎందుకంటే అంతకు పైన ఉంటాడు కానీ ఏది పట్టించుకోడు. ప్రతిదానిలో ఆయన ఉంటాడు. ఆయన లేకపోతే ఏమీ ఉండదు. ఆయన ఆధారంగా చేసుకుని ఈవిడ చేస్తూ ఉంటుంది అంతే! ఆవిడకి ఆయన ఆధారం. కనపడని విద్యుత్తు కనపడే విద్యుత్ కి ఆధారమైతే, కనపడే విద్యుత్ తో మనం రకరకాల పరికరాలు వాడుకుంటాం. సరాసరి మనం కనబడని విద్యుత్ తోనే తయారు చేసుకుందామంటే అవదు కదా. అలాగే సృష్టిలో దేవుడున్నాడు. సృష్టిలో దేవుడిని 'ఆదిదేవుడు' అంటారు ఎందుకంటే వ్యక్తమైనాడు. వ్యక్తం కానప్పుడు అది పరబ్రహ్మం, పరమశివుడు అంటారు, నారాయణుడు అంటారు, పరాశక్తి అంటారు. అంటే ఏదైతే మొట్టమొదట మనకు ఆధారంగా ఏర్పడిందో దానికి ఆధారంగా ఉన్నది, మనకు తెలియనిది. First God. అక్కడనుండి అందరూ దేవతలు వస్తారు. అదే మూడుగా తయారవుతుంది. ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులుగా. ఈ వెలుగులోంచే త్రిమూర్తులు పుడతారు. వాళ్ల యొక్క శక్తులు పుడతాయి. మిగతా దేవతలు పుడతారు. రకరకాల దేవతలు ఉన్నారు. ఈ దేవతలందరూ ఎక్కడినుండి పుట్టారు? ఈ తత్వంలో నుంచి పుట్టారు. అందుకని.ఊళ్లోని constable ని పరిచయం చేసుకుని, SI ని పరిచయం చేసుకుని, CIని పరిచయం చేసుకుని ఇలా బాధపడే

బదులు మనం police commissioner నే పరిచయం చేసుకున్నామనుకోండి, police commissioner స్నేహితుడని మొత్తం police department అంతా తెలిసిపోయింది అనుకోండి, మనం police office కి వెళ్తే అక్కడ అందరూ salute కొడతారు కదా! అదీ ఒక భాగవతోత్తముని స్థితి. భాగవతోత్తముడంటే భగవంతుని తనయందు పరిపూర్ణముగా దర్శనం చేసి, అందరి యందు దర్శనం చేసుకుంటాడు. కాబట్టి ఈ మొత్తానికి ప్రభువు అయిన వాడితో అతి సన్నిహితమైన పరిచయం ఉన్నది కాబట్టి దేవతలు కూడా సహకరిస్తారు. ఒక్కొక్క దేవతను ప్రసన్నం చేసుకుంటూ వెళితే ఎంతమందిని ప్రసన్నం చేసుకోగలం? ఒక area SI కి friend అంటే, ఇంకొక area SI కి కోపం రావచ్చును. అందుకని ఏం చేశారంటే మనకి ప్రత్యేకమైన ఆరాధనలు కొన్ని సన్నివేశాలను బట్టి ఇవ్వడం జరిగినప్పటికీ కూడా దర్శనం చేయవలసినది మూలమైన వెలుగును. అందుకని భారతీయులకు గాయత్రి! మనం భారతీయులం అని అనిపించుకోవడానికి కూడా కారణం అదే! ఆ వెలుగు యందు రతి కలిగిన వాళ్లు వీళ్లు. దానితో అనుసంధానం ఏర్పరచుకొనటం వల్ల దేవతలు కూడా సహకరించే జాతి అని. చూడటానికి అంత పెద్ద నదురుగా లేకపోయినా దేవతల యొక్క సహకారం ఎక్కువ ఉన్న జాతి. ఇప్పుడు ఉన్నదో లేదో చెప్పలేము, ఎందుకంటే రతి ఇంకో దాని మీదకు వెళ్ళిపోయింది కాబట్టి. కనుక ఎప్పుడూ ఆ వెలుగును ఆరాధించుకోవడం కోసం మనకి గాయత్రినిచ్చారు. అందులో మళ్ళీ విష్ణు గాయత్రి, శివ గాయత్రి మొదలైనవి చాలా గాయత్రిలు వచ్చినాయి. అదలా ఉండగా విశ్వామిత్రుడు దర్శించి ఇచ్చిన గాయత్రి సరాసరి ఆ వెలుగు ధ్యానమే! గాయత్రి ధ్యానం చేసేటప్పుడు అంతా నింపేసుకోండి. అంతా నిండిపోయింది అనుకోండి రుచి ఎట్లా ఉంటుందంటే ఇంకా నింపేసుకుందామనిపిస్తుంది. మనం ఉన్న గది, ఆ తర్వాత మనం ఉన్న ఇల్లు, మన పేట, మన ఊరు, మన రాష్ట్రం, మన దేశం, మన ఖండం మొత్తం భూ ప్రపంచం. ఇలా నింపడంలో నిన్ను నువ్వు మర్చిపోతావు. అలా మొత్తం అంతా వెలుగుతో నింపి దాని యందు కూర్చోవాలి. అంతేగాని వెంటనే 'శం నో మిత్ర శం వరుణః' ఈ syllabus తయారు చేయడం వదిలేయండి. నిశ్చలత్వం వేరు, ఈ syllabus వేరు. ఒకరోజు గాయత్రి చేసి మిగతావన్నీ మానేస్తే ఏమవుతుంది? ఒకటే పీక్కుంటారు. నాకు చాలా కష్టంగా ఉంటుంది. అది చేయలేదు, ఇది చేయలేదు. ఎందుకు చేయాలి? ఒకటి చేస్తే నిండి పోతే ఇంకొకటి ఎందుకు? నాకు అర్థం కాదు. ఒక్కోసారి సి.వి.వి అంటే మొత్తం నిండిపోతుంది. ఇంకేమీ చేయబుద్ధి కాదు. సామూహిక ప్రార్థనలలో ఈ పరిమితత్వం ఒకటుంది. గాయత్రి చేస్తూ ఉంటే ఒకడికి ఎక్కువైపోతుంది. తట్టుకోలేడు. ఒక్కొక్కసారి వ్యక్తిగతమైన సాధన బాగుంటుంది. ఎప్పుడూ ఒకేలా చేయాలని rule లేదు. సామూహికంగానే చేయాలని rule లేదు.

మనకి కూడా ఒక్కొక్కసారి ఒంటరిగా చేస్తే బాగుంటుంది. ఒక్కోసారి కలిసి చేసినప్పుడు బాగుంటుంది. ఎప్పుడు ఎట్లా బాగుంటుందో తెలియదు అట్లా నింపండి. మనందరికీ మాస్టర్ గారు ఇచ్చిన అతి ముఖ్యమైన బహుమతి ఏంటంటే గాయత్రి. అది ఆయన యందు సిద్ధి పొందిన మంత్రం. అందుకే ఆయన ఏ భయము లేకుండా అందరికీ ఇచ్చేశారు. చాలా బాధపడి పోతారు పండితులు ఆడవాళ్లు గాయత్రీ మంత్రం చేసుకుంటూ ఉంటే చూసి. వాళ్ళు చేస్తూ ఉంటే వీళ్ళు ఏడుస్తారు. చేస్తున్న వాళ్ళు బాగానే ఉంటారు. అదేమిటండి బ్రాహ్మణులు కాని వారికి ఇస్తారు, ఆడవాళ్లు చేస్తారు అని. నిజానికి ఆయన చాలా సత్యమైన పని చేశారు. ఎందుకంటే అదే అందరిలోనూ ఉన్నది ఎక్కువ చేసుకోవడం వల్ల సంస్కారవంతులమవుతాము. గాయత్రి గురించి ఎంతైనా చెప్పుకోవచ్చును.

347 పురందరః.

పురందరుడంటే 'ఇంద్రా విష్ణువు' అనే దేవత గా ఆయనే ఉన్నాడు. రకరకాల దర్శనాలు జరిగినప్పుడు ఈ పేర్లన్నీ పెట్టేస్తాడు భీష్ముడు. వెయ్యే అని అనుకోకూడదు ఇంకా ఎన్నో పెట్టుకోవచ్చును. పురందరుడంటే తూర్పు నుండి వచ్చే వెలుగు, ఇంద్రుడు. మొత్తం వెలుగైపోతుంది. ఇంకేమీ మిగలదు ఇదంతా వెలుగు ధ్యానం. మొదట వెలుగుతో పెట్టాడు.

స్కందః స్కందధరో ధుర్యో వరదో వాయువాహనః
వాసుదేవో బృహద్భానుః ఆదిదేవో పురందరః

ఇది మొత్తం వెలుగు గురించి చెప్పే శ్లోకం. Plan of action రూపంలో వెలుగు ఉండడం 'ఇంద్రా విష్ణు'వంటాం. ఈ సృష్టి అంతా ఒక పద్ధతి ప్రకారం భగవంతుని సహకారంతో నిర్వర్తిస్తున్న వాడిని ఇంద్రుడు అంటారు. ఈ సమస్తము నిర్వర్తిస్తూంటే వెలుగు, బలిమి, సమర్ధత ఉంటాయి. వీడింత సమర్ధుడు ఎలా అయ్యాడు? అని అనిపిస్తుంది. వాడిది కాదు ఆ సమర్థత అని వాడికి తెలుసు, కానీ ప్రపంచానికి మాత్రం చెప్పడు. మీరు ఇంత గొప్పగా ఎట్లా చేస్తున్నారంటే నవ్వుతాడు. నవ్వుతూ ఉంటే వాడి లోంచి నవ్వే వాడు 'వాడు'. వీడు ఊరికే అట్లా వాహికగా ఉంటాడు. అందుకనే అతి సామాన్యంగా కనిపించే వాడి నుండి కూడా అతి దుర్లభమైన కార్యాలు జరిగిపోతూ ఉంటాయి. 'దుర్గమ్ కార్య జగత్ కే జేతే' చేసేవాడు వాడు. మనం వాడికి వాహనంగా ఉన్నాం, అని గుర్తుపెట్టుకుని చేస్తూ ఉంటాడు. అట్లా చేస్తూ ఉంటే మనసులోకి చీకట్లు రావు. ఎందుకంటే వెలుగు ఉంటుంది కాబట్టి. వెలుగు ఉన్నంతసేపు చీకటి రాలేదు కదా. చీకటి రాకపోవడం వల్ల మనసు అదే వెలుగును ఇంద్రియాలకు అందిస్తుంది. అప్పుడు కన్ను, ముక్కు, చెవులు, నాలుక అన్నీ కూడా అప్రమత్తంగా ఉంటాయి. అవి కూడా దాన్నే (వెలుగునే) వ్యక్తం చేస్తూ ఉంటాయి వాడు ఉన్నంతసేపూ system అంతా కూడా alert గా ఉంటుంది. లేకపోతే మనసు బహిరంగము నుండి వచ్చే ఆకర్షణలకు లోబడి పోయి ఉన్న బలం పోగొట్టుకుంటుంది. తన దగ్గర ఉన్నది తన బలం కాదు. వాడి బలమే మన బలంగా కనిపిస్తే, మన బలం అనుకుంటాం. అన్యాయం కదా! మనమంతా కూడా వాడి account ని మన account లో వేసుకుంటూ ఉంటాం. భక్తుడ్ని నీ account లోనే ఉంచు, అంటాడు. ఈ దేవుడితో వ్యవహారం ఎట్లా ఉంటుందంటే మనకు account open చేసి మన account లో వేస్తూ ఉంటే మనది అనుకుంటూ ఉంటాం. మనది అనుకోగానే అది బరువైపోతుంది. వాడిది అనుకుంటే తేలిగ్గా ఉంటుంది. భక్తులకి మిగతా వాళ్ళకి వచ్చే

తేడా అది. మనకి మంచి marks వచ్చాయి అన్నట్టుగా ఉంటుంది. మనకి మంచి marks రావడం కాదు. వాడు ఇచ్చాడు మనకి మంచి marks! ఏమిటి ఇలా మాట్లాడుతున్నారు అనిపిస్తుంది. కానీ ఇది చాలా సత్యం! మనం గాలి పీల్చి వదలడం దగ్గర నుండి అన్నీ వాడే చేస్తుంటే జరుగుతున్నాయి. ప్రతీదీ అంతే! అన్నీ అంతే! మన account లో వేసేసరికి మనది అనుకుంటాం. మనకి పురాణ కథల్లో చెప్తారు. భగవంతుడు మొత్తం అంతా ఇంద్రుని account లో పెట్టాడట. ఇదంతా నీకే, ఈ అష్టదిక్పాలకులు, ఈ దేవతలు, ఈ నవగ్రహాలు ఇవన్నీ మొత్తం నీ చేతిలోనే ఉన్నాయి, నువ్వు manage చేస్తున్నావని చెప్పాడుట. వాళ్ళందరి రూపంలో ఉన్నది మళ్ళీ ఈయనే! ఇంద్రుని రూపంలో ఉన్నది ఈయనే! కానీ నీ చేతుల్లో పెట్టాను అనేసరికి, మనం పొంగిపోయాం అనుకోండి. ఆయన తప్పుకుంటాడు. ఇంక ఏమీ మిగలదు. అందుకనే ఇంద్రుడు విష్ణువుతో కలిసి ఉన్నంత సేపు పరిపాలన బాగుంటుంది. మనలో ఇంద్రుడు మనసు కాబట్టి బహిర్గతంగా ఏమైనా ప్రణాళికలు నిర్వర్తించాలంటే మనసు లేకుండా చేయలేము. మనసుదేముంది ? అంటారు. మనసు లేకపోతే నువ్వు చేసేదేమీ లేదు. అసలు మనసుది దివ్యమైన తత్వం! ఆ మనసుకి భగవత్తత్వం తోడున్నప్పుడు పురందరుడవుతాడు. తూర్పు నుండి వ్యక్తం అయ్యే వెలుగుగా అంతా వ్యాపిస్తున్నాడు చూసారా? అట్లాగే మనకి తూర్పు ఆజ్ఞా చక్రంలో ఉంది. 'ముఖాదింద్రశ్చాగ్నిశ్చ' అంటుంటాం కదా ముఖం (నోరు) లోంచి ఆ పురుషుడే ఇంద్రుడు గాను, అగ్నిగాను వ్యక్తం అవుతూ ఉంటాడు. ప్రణాళిక ఆజ్ఞ నుండి వ్యక్తమవుతున్నప్పుడు జరగవలసిన సమయంలో తప్పకుండా జరిగే సంకల్పం వస్తుంది. జరిగే సంకల్పం జరగని సమయంలో వచ్చినా లాభం లేదు. కొన్ని అయ్యే పనులు ఉంటాయి. అయ్యే time ఉంటుంది. అవని పని మంచి ముహూర్తం పెట్టుకున్నా అవ్వదు. ఎన్నిసార్లు మనం మంచి ముహూర్తాలు చూసి చేసిన పనులు గాలికి పోలేదూ? అందరూ ముహూర్తం పెట్టుకునే కదా చేస్తారు. ఈ రెండింటికి ఎప్పుడు అనుసంధానం ఏర్పడుతుందంటే వాడితో ఉన్నప్పుడు అయ్యే సంకల్పం ఏర్పడుతుంది. అదీ గాయత్రి! గాయత్రి చేస్తున్న వాళ్ళకి దిగి వచ్చే సంకల్పం జరిగేదే వస్తుంది. జరగనిది రాదు. అయ్యే పనులే మనకే తడితే సుఖం కదా! మనం కొన్ని అనుకుని అవి అయ్యేట్టు చూడమని వాడి చుట్టూ తిరుగుతూ ఉంటాం. అవి అవవురా అని వాడు చెప్పలేడు. వాడు చెప్పినా మనం వినలేము అందుకని ఈ సత్యాన్ని మనసుకు బాగా పట్టి ఉంచాలి. పట్టి ఉంచితే అన్నీ అవతరింప చేయవచ్చును ఈ సమయానికి ఈ పని చేసేస్తాను అని చెప్పి చేసేస్తారు, అంతే! ఫలానా చోటులో, ఫలానా టైములో ఉంటావా అంటే ఏమోనండి ఏం చెప్పగలం అంటాం, మన బోటి వాళ్ళం.వాళ్ళు ఎన్ని కష్టనష్టాలకైనా ఓర్చుకొని అక్కడికి వెళ్లి పోతారు. ఎందుకంటే

ఈ సహాయం ఉంటుంది కాబట్టి. రాముడికి పుష్పక విమానం వచ్చింది. తిరిగి అయోధ్యకు తీసుకుని వెళ్లడానికి ఇంకా కొన్ని గంటలే ఉంది. చెప్పిన time కి రాకపోతే అగ్ని ప్రవేశం చేస్తానని చెప్పాడు భరతుడు. వారిద్దరి మధ్య ఒప్పందం అది. ఆరోజు ఆ time కు నువ్వు కనపడకపోతే ఇక భరతుడు లేడనుకోమని చెప్తాడు. అప్పుడే అన్నీ finish చేసి time చూసుకుంటే ఇంక time లేదు. అందుకనే పుష్పక విమానం ఉంటుంది అక్కడ. ఎందుకంటే చేసిన ఉపాసన అటువంటిది. భక్తుల విషయంలో అది కనిపిస్తుంది. ఉదంకుడు గురువు వద్ద విద్యాభ్యాసం పూర్తి అయ్యాక గురుదక్షిణ ఏమివ్వమంటారని గురువుగారిని కోరగా, గురువుగారి భార్య నాగలోకములోని కుండలాలు గురుదక్షిణగా తెమ్మంటుంది. ఉదంకుడు గురువుగారి భార్యకు నాగలోకానికి వెళ్లి కుండలాలు తెచ్చిస్తానంటాడు. అంతా అయిపోయి తిరిగి చూసుకుంటే time లేదు ఏం చేయాలనుకుంటే అక్కడ ఒక తెల్ల గుర్రం ఉంటే దాని తోకలో ఒకసారి ఊదేసేయ, అంటాడు. అంతకుముందు ఈ ఊదమని చెప్పిన వాడే, ఒక ఆవు మీద కూర్చుని ఆవు పేడ వేస్తే తినమంటాడు. ఆవు పేడ తినడమేమిటి బుద్ధి లేదా అని అడగడు, తినేస్తాడు. ఇది వాసుదేవ ఉపాసన! ఎక్కడో నాగలోకంలో ఉండేవాడు వెళ్లి వాళ్ళ గురువుగారి ముందర ఉండాలి ఎట్లా ఉంటాడు? ముందు ఆవు పేడ తినమన్నవాడే last minute లో వచ్చి ఆ గుర్రం తోకలో ఊదేసెయ్, నువ్వు వెళ్ళిపోతావు సరాసరి నీ గురువుగారి పాదాల దగ్గర నిలబడతావు అని చెప్తాడు. దేవతల సహకారం అట్లా వస్తుంది ఈ ఉపాఖ్యానాలన్నీ చదువుకున్నప్పుడు. అబ్బా వీళ్లంతా అదృష్టవంతులు, అనిపిస్తుంది. ఏ కథ తీసుకున్నా భక్తునికి కష్టంలో సహకారం ఉంటుంది. మనందరికీ problem ఏమిటంటే మనం మనసుతో పని చేసేటప్పుడు వాడు అక్కడే ఉంటాడండీ అంటాం. ఎక్కడ? గూట్లో! మనం పెట్టిన గూటిలో వాడుంటాడు ఆ గూటిలో నుండి నువ్వు వచ్చి నాతో ఉండు అని చెప్పుకోవాలి. నేను నీలో ఉండేట్టుగా చూడూ, నిన్ను మర్చిపోకుండా పనిచేసేటట్టు వరాన్ని ఇమ్మని అడుగుతాడు బ్రహ్మ, సృష్టి చేసినప్పుడల్లా. మనకే కాదు ఈ problem బ్రహ్మకు కూడా ఉంది. మర్చిపోతే సృష్టి వంకరదారుల్లో వెళ్ళిపోతూ ఉంటుంది. వంకర దారిలో వెళ్ళింది మళ్లీ సర్దాలంటే చచ్చిన చావు. మరవకుండా ఉండాలంటే వాడిని గుర్తుపెట్టుకోవాలి. మరో మార్గం లేదంటాడు అదొక్కటే సాధన! నాకు గుర్తుండాలంటే నువ్వేం చేసి పెడతావు అంటే నేను చేసి పెట్టేదేమీ లేదు, నీకు గుర్తుండాలి అంతే అంటాడు. గుర్తుండాలంటే ఏమి చేయాలంటే మర్చిపోకూడదు. మర్చిపోకూడదంటే గుర్తుపెట్టుకోవాలి. మర్చిపోతున్నామంటే గుర్తుపెట్టుకోమని గుర్తు రావడం లేదంటే మర్చిపోకు రా అని ఇటు నుండి అటు, అటు నుండి ఇటు తిప్పుతారు. అదే భాగవతం రెండో అధ్యాయంలో ఉంటుంది. మనం ఎంత సేపు

గుర్తుపెట్టుకుంటే అంత సేపు ఉంటాడు. అది ఆయనకు, మనకి agreement. మర్చిపోతే అక్కడే ఉంటాడు, కానీ మనకు ఉపయోగపడడు. అదే అంటాడు ఏసుక్రీస్తు కూడా 'నిధి నుండి నడిచి వెళుతూ ఉంటావు కానీ ఎప్పుడూ దరిద్రుడు గానే ఉంటావు' అని. మనం ఇంట్లోంచి బయటకు నడిచి వెళుతూ ఉంటాం, వస్తాం, సాయంత్రం వెళతాం వస్తాం అలా వస్తూ వెళుతూనే ఉంటాం. నీకు కావాల్సినంత సంపద ఉంది, కానీ ఐదు రూపాయల కోసం పది రూపాయల కోసం బయటకు వెళ్లి అడ్డమైన చాకిరీ చేసి వస్తాం. అట్లా ఉంటుంది భగవంతుని మరచి పనిచేసుకునే వాడి సంగతి. సాధన ఎక్కడ ఉంది అంటే చేస్తున్న పనిలో ఉన్నది. ఇప్పుడు ఇంద్రా విష్ణువు సాధన చేయకపోవడం వలన కష్టం. సాధన చేస్తే కష్టం లేదు. ఐదు సంవత్సరాల పిల్ల త్రాటి మీద పెద్ద కర్ర పట్టుకుని అటు నుండి ఇటు, ఇటు నుండి అటు నడుస్తుంది. డాన్స్ కూడా చేస్తుంది. మన బోటి వాళ్లను చేయమంటే తాడక్కరలేదు గోడమీద కూడా నడవలేము. కదా! ఆ అమ్మాయికి ఎలా వీలు పడింది? సాధన! ఇవాళ శీర్షాసనం అనుకోండి, క్రింద పడిపోతాం. శీర్షాసనం వేస్తున్న వాళ్ళు ఉన్నారు కదా వాళ్లకు ఎలా వీలు పడింది? అభ్యాసం! అది అభ్యాసం కోసం ప్రతిరోజు ఒక అవకాశం గా తీసుకోవాలి. ఎక్కడున్నా ఇది తప్పదు. మాస్టరు గారు అన్నారు బాత్రూంలో ఉన్నా కూడా వాడున్నాడు కాబట్టి ఎక్కడున్నా వాడున్నాడని గుర్తు పెట్టుకుంటే బాగుంటుంది. అప్పుడు మనం ఎవరూ చూడకుండా చేసే పనులు చేయడానికి వీలు ఉండదు. వాటిని చేయడం దాటాలి అని చెబుతుంది Madam Blavatsky. దాటాలని అనిపిస్తుంది. ఎక్కడ దాటతాం? ఎవరైనా ఉంటే చేస్తావా? చేస్తాను అయితే చేసుకో, ఎవరైనా ప్రక్కన లేకపోతేనే చేస్తావా అయితే అటువంటి పనులు చేయకు. ఇది ఒక instruction (సూత్రము). వాడొకడు ఉన్నాడు కదా వాడు చూస్తున్నా చేయగలిగినదా ఇది? అయితే చెయ్. వాడు చూస్తున్నప్పుడు చేయగలిగినది కాకపోయినా చేయాలని బలవంతంగా ఉంటే వాడికే చెప్పకో! 'ఇది చేయకూడదని తెలుసు కానీ చేద్దామనిపిస్తున్నది. చేద్దామనే స్వభావం చేయకూడదనే బుద్ధిని దాటింది. మరి నువ్వే నాకు సాయం చేయి. ఇప్పటికింతే'. అని చెప్పేసుకోవడమే! ఈరోజు అనుకొని ఈరోజే పవిత్రులమై పోలేము. మనం అనుకున్నంత మాత్రాన మార్చేసేటట్లు ఉండదు సాధన ఎందుకంటే నెమ్మదిగా ఎక్కుతుంది. రోజూ చెప్పకోవాలి 'ఈ విషయంలో నా పరిస్థితి ఇంతే నేను దాటలేను, నువ్వు దాటించు. నువ్వు ఎప్పుడు దాటిస్తావో' అని ప్రార్థన చేసుకుంటూ ఉంటే, ఇంకో ప్రక్కనుండి బలం పెరిగి చేయడం మానేయాలి. ఇవాళ అనుకుని రేపు మానేయడం జరగదు. అట్లా సాధన చేసుకుంటూ ఉంటే ఈ పురందరుడు అనే తత్వం మనలో బాగా ఏర్పడితే ఇక తిరుగు ఉండదు. ఎక్కడికి వెళ్లినా వెనకాల ఉంటాడు వాడు టక్కున

రక్షిస్తాడు. Accident అయ్యే స్థలంలో accident అవ్వదు ఆ time కి ఎవడో ఆపేస్తాడు మనల్ని. ఎవడన్నా వస్తే మనం విసుక్కుంటాం కదా. ఇప్పుడు దిగాడు ఏమిటి అనిపిస్తుంది ఈ ఉపాసన చేసేవాడు ఏం చేస్తాడో తెలుసా? వచ్చినవాడు వాసుదేవుడని కూర్చుంటాడు వాడితో సౌమ్యంగా సమాధానం చెప్పి అప్పుడు బయలుదేరుతాడు ఆ time కి అక్కడ accident అయిపోతుంది. ఒకసారి నేను మాస్టర్ గారు బందరు బయలుదేరాము. Konark కి అప్పుడొక్క భోగియే విశాఖపట్నం నుంచి attach చేసేవారు. అందులో ఎక్కి పడుకుంటే రాత్రి rail engine వచ్చి పట్టుకొని పోయేది. పొద్దున్న 6:00 కల్లా విజయవాడలో ఉండేవాళ్ళం. అది మాకు ఎప్పుడూ అలవాటు. ఇది ఎక్కేసి రాత్రి 10:30 గంటలకు అందులో పడుకుంటే కొంచెం దోమలు కుట్టేవి కప్పేసుకుని పడుకుంటే సరిపోయేది. పెట్టె side line లో ఉంటుంది. ఆ రైలు ఎప్పుడు వచ్చి దీన్ని తగిలించుకుని వెళుతుందో మనకు తెలియదు. మంచి నిద్రలో ఉండే వాళ్ళం. మెలుకువ వచ్చేసరికి ఏలూరు దగ్గర ఉన్నామేమో అనిపించేది. అక్కడ నుండి బెజవాడ, బందరు వెళ్లడముండేది. అట్లా ఉండేది. ఇలా వెళుతున్నప్పుడు ఒకసారి నేను ఆయన పడుకున్నాము. ప్రొద్దున లేచి చూస్తే మన లెక్క ప్రకారం ఏలూరులో ఉండాలి ఐదు గంటలకు, కానీ బండి అక్కడే ఉంది. నేను ముందు లేచాను, తర్వాత మాస్టర్ గారు లేచి ఎక్కడున్నామని అడిగితే ఎక్కిన చోటే ఉన్నాం మాస్టారు, అన్నాను. అయితే దిగి వెళ్ళిపోదాం, అన్నారు అంతేగాని నేను astrologer ని, నాకన్నీ తెలుసు. నేను బండి ఎక్కితే ఎందుకు కదలలేదు, ఇటువంటివేవీ ఉండవు వాసుదేవోపాసనలో. గురువుగారు ఇప్పుడొద్దు ఇంకొకసారి వెళ్ళమంటున్నారు, అని వచ్చేసాము. ఒకసారి ఆయన ఇంటి నుంచి బయటకు వెళ్దాం అనుకుంటూ ఉంటే బయట ఆయనకు ఒకటి కనిపించింది ఎక్కి కూర్చున్నారు కారులో. ఇప్పుడు వద్దులేవోయ్, అని కారులో ఇట్లా తిరిగి అట్లా వచ్చేసాం. ఏం మాస్టారు అంటే అంతేలే ఇప్పుడు వెళ్ళినా అది అవదు, అన్నారు. వాసుదేవుడు అట్లా సందేశాలు ఇస్తాడు వినే వాళ్ళకి. చెవిటి వాడికి ఏమిస్తాడు? గ్రుడ్డివాడికి ఏమిస్తాడు? ఆయన దగ్గర అలా చూసాము. మాస్టారు మనం ఏమైనా చెబుతూ ఉంటే, ఒక చెవి మనకి పడేసి రెండో చెవితో చుట్టుప్రక్కల వినటం, కళ్ళతో పైకి చూడటం, ప్రక్కకి చూడటం అట్లా చేస్తూ ఉండేవారు. ఎందుకంటే వాసుదేవుడు ఏం సమాధానం చెప్తాడోనని. అంతేకానీ తన పాండిత్యంలోంచి ఏదో వొలకబోసేద్దామని ఉండదు. ఆయనకు ఒక్కోసారి బయలుదేరే టైములో అరగంట గంట ముందు ఎవరైనా భోజనం పిలిచి పెట్టారనుకోండి, ఇప్పుడు తినవోయ్ తర్వాత దొరకదు అని చెప్పేవారు. నేను రెండు గంటలకే తింటానని భీష్మించుకుని కూర్చున్నాం అనుకోండి, ఆ టైముకు ఏమీ దొరకదు. అలా ఉంటుంది

వాసుదేవోపాసన! మనసులోనికెక్కినది సాధన! మనోమయ లోకంలోకి ఎక్కాలి! ఆలోచనలన్నీ ఈ క్లాసులో ఉన్నంతసేపు వాసుదేవునిలో ఉన్నాము కాబట్టి బయట ఉంటాయి. గేటు దాటుతున్నప్పుడు కూడా వాడిలో ఉన్నామనుకోండి అవి బయట ఉంటాయి మనల్ని ఏమీ చేయలేవు. అదీ తమాషా! పెద్ద సారు ఇక్కడ ఉన్నాడు కాబట్టి మనం వాడి జోలికి వెళ్ళకూడదు అనుకుంటాడు. అట్లా మరిపించారు మనకున్న భాగవతులందరూ. Co-operation దేవతలు ఇచ్చారంటే, ఇప్పుడు వర్షం పడేది ఆగిపోతుంది. ఎందుకంటే మేఘానికి కూడా వారి యందు respect. ఆయన నడుస్తూ ఉంటే మరీ ఎండగా ఉంటే మేఘం అడ్డు వస్తుంది. అలా ఎన్నో కనిపిస్తాయి. ఇవన్నీ వీళ్ళు చేసేదేమీ ఉండదు. వీళ్ళు వాడిలో ఉండటం వలన, వాడి ఆధీనంలో సమస్తము ఉండటం వలన అవన్నీ అలా జరిగిపోతూ ఉంటాయి. తన ప్రతిభ అని ఎప్పుడూ అనుకోడు. కృష్ణుడు అంతటివాడు నా ప్రతిభ అని ఎక్కడా చెప్పలేదు. అన్నీ జరిగిపోతూ ఉండేవి. ఆయన వెనకాల పెద్ద వాసుదేవరూపం ఉండేది. మాస్టారి క్రీడామయుడు చదువుకుంటే మీకు అర్థమవుతుంది. ఆ మూర్తి ఒకటి ఈ ఐదేళ్ల కుర్రవాడి వెనకాల బ్రహ్మాండంగా నిలబడి ఉంటుంది. అదృశ్య రూపంలో వెలుగుగా ఏదో ఒకటి దూడరూపంలోనూ, గాడిద రూపంలోనూ వస్తూ ఉంటాయి కదా! వస్తే ఆ వెనకాల ఉండేవాడు కొట్టేసేవాడు. వీడు కొడుతున్నట్లుగా కనిపించేది. లేకపోతే ఐదేళ్ల కుర్రవాడు కాళీయ మర్దనం చేయడం మనం ఊహించలేము కదా! అట్లా ఆ రూపం వెనకాల ఉంటుంది. ఎప్పుడూ దానితోనే ఉంటాడు. దాన్ని విడిచి ఎప్పుడు బయటకు రాడు. సరదాగా పెళ్ళాంతో కబుర్లు చెప్పేటప్పుడు కూడా ఆయన వదల లేదండి. అందుకనే ఆయన యోగేశ్వరుడు. ఆయన వదిలిన క్షణం లేదు. ఎప్పుడు వదిలేస్తాడు అంటే శరీరం వదిలేసేముందు దాన్ని నేను వచ్చేస్తాను, నువ్వు పదా అని పంపించేసి అప్పుడు బాణం చేత కొట్టించుకుంటాడు. లేకపోతే బాణాలు తగిలే ప్రశ్న లేదు అది ఉంటే! అంతకుముందు యుద్ధం అవగానే శంఖం, చక్రం పంపించేస్తాడు ఇంక మీ పని అయిపోయిందని అట్లా తన చుట్టూ ఎప్పుడూ అది ఉండేది. అది చేసేది పనులన్నీ. లేకపోతే ఎక్కడా లేని శంఖం చక్రం అప్పటికప్పుడు ఎట్లా వచ్చేస్తాయి ?

348, 349, 350 అశోకః, తారణః, తారః

ఈ మూడూ ఒకే తత్వానికి సంబంధించిన మూడు నామాలు. ఈ తత్వంలో కొంత ఏకత్వ మున్నది. కొంత భిన్నత్వ మున్నది. 'అశోకుడు' అని భగవంతునికి పేరు. అంటే శోకము లేనివాడు. శోకము లేకుండా చేసేవాడు.'తారణః' అంటే తరింప చేసేవాడు. 'తారః' అంటే దారి చూపించేవాడు. శోకము లేకుండా తరింపచేసి, దారి చూపించే వాడు.

భగవంతునికి శోకము లేదు. అది మనకి శ్రీకృష్ణపరమాత్మ దేహధారియై మనయందు సంచరించినప్పుడు పరిపూర్ణంగా నిర్వర్తించి, తాను నడిచి చూపించాడు. శ్రీకృష్ణునికి వచ్చిన కష్టనష్టములు మానవ దృక్పధంతో చూసుకుంటే చాలా ఎక్కువ. ఆయనది పుట్టినప్పటి నుండి శరీరాన్ని వదిలేసేంత వరకూ కూడా ప్రతినిత్యమూ మృత్యువు పొంచి యున్న జీవితం. దానితో సమానమైన జీవితం ఎక్కడా గోచరించదు. అయినప్పటికీ కూడా ప్రతినిత్యము తన వదనము నందు దరహాసము ఏ మాత్రమూ కోల్పోనట్టి స్థితి యందున్న వాడు. మొదటినుండి చివరివరకు కూడా చిరుదరహాసమూర్తి, ప్రసన్నవదనం కలిగియున్నవాడు. రామాయణం లో రాముని తత్వం, ఉత్తమ మానవుని తత్వంగా గోచరిస్తుంది. శ్రీకృష్ణ అవతారంలో భగవత్తత్వం గోచరిస్తుంది. అందుకని శోకానికి అతీతంగా తానుంటాడు. తనవారు మరణించినప్పుడు కూడా శోకం లేదు. కష్టసుఖములు రెండింటియందు కూడా ఒకేవిధమైన నిర్వికారస్థితి యందుండటం అశోకస్థితి. అశోకస్థితి యనునది సామన్య మానవులకు లభ్యమయ్యే స్థితి కాదు. అప్పుడప్పుడు దేవతలు, సిద్ధులు, సాధ్యులు కూడా శోకం చెందే పరిస్థితి మనకు కనిపిస్తుంది. మహాత్ములు కూడా కాలం యొక్క ప్రభావం బట్టి అప్పుడప్పుడు శోకం చెందడం కనిపిస్తుంది. కానీ భగవంతు డెన్నడూ శోకం లేనటువంటి వాడు, శోకం నుండి మనల్ని తరింప చేసే వాడు కాబట్టి 'అశోకః తారణః'. కేవలం పరిపూర్ణమైన సిద్ధుడై, భగవంతుని అస్తిత్వము తానుగా నిలబడిన వాడికి మాత్రమే తప్ప, మిగతా వాళ్ళందరికీ శోకం వుంటుంది. భగవంతుడే తానుగా నిలబడిన వాళ్ళు సిద్ధులు. అటువంటి సిద్ధులకు శోకం వుండక పోవచ్చును. కానీ ధర్మరాజంతటి వాడికి శోకం కలిగింది. వశిష్ఠుడంతటి వాడికి శోకం కలిగింది. వ్యాసుడంతటి వాడికి శోకం కలిగింది. వాల్మీకంతటివాడికి శోకం కలిగింది. కాబట్టి మనకి శోకం వుండకూడదనే భావన, డాంబికమైన భావన అవుతుంది. సాధకునికి శోకం రావడానికి అవకాశం వున్నదని చెప్పటానికి రాముని యొక్క కథయే మనకి ప్రమాణం. ఉత్తమ మానవునిగా

ఎటువంటి పరిమితత్వం లేని మానవునిగా రాముని యొక్క జీవితము మనకి గోచరిస్తుంది. అటువంటి రాముడు కూడా సన్నివేశమును బట్టి శోకం అనుభవించినట్లుగా రామాయణం చాలా ప్రస్ఫుటంగా చెబుతుంది. అంటే మానవునికి శోకం అనేది తప్పదు. కష్టం వచ్చినప్పుడు శోకించకుండా వుండడ మనేది మానవత్వం కాదు. అది కేవలం ముమ్మాటికీ ఒక్క శ్రీకృష్ణునికే సాధ్యం! శ్రీకృష్ణునికి తన పరివారమంతా పోయినా శోకం లేదు. తనవద్ద చిన్నప్పటి నుండీ పెరిగి, తన వద్ద విద్యలు నేర్చుకున్న అభిమన్యుడు పోయినా శోకం లేదు. అట్లా ఎవరూ వుండలేరు. కృష్ణుడిలాగ వుండడానికి ప్రయత్నం చేయడం మానవులకు సాధ్యమయ్యేది కాదు. రాముడు, సీతాదేవిని రావణాసురుడు ఎత్తుకొని వెళ్ళిపోయినప్పుడు చాలా శోకిస్తాడు. నెత్తి నోరు బాదుకొని, నేలమీద పొర్లి, నానా హంగామా చేసి, ఏడ్చి, శోకించి, అట్లా నాలుగైదు సార్లు శోకిస్తాడు. లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు చాలా శోకిస్తాడు. అలా ఎన్నోసార్లు శోకిస్తాడు రాముడు. ఎందుకంటే శోకించడం మానవసహజం. రామాయణం ఉత్తమ మానవుడి యొక్క ప్రవర్తనకు సంబంధించిన కథ! భాగవతంలో కథానాయకుడైన శ్రీకృష్ణుడు భగవత్తత్వం మానవాకారంలో వున్న కథ. ఈ రెండింటికి చాల తేడా వుంది. మనం ధర్మప్రవర్తనకు పూనుకున్నట్లైతే, రాముడు మనకు ఆదర్శం. శరణాగతి కావాలనుకొంటే కృష్ణుడు ఆదర్శం.రాముడూ ఆదర్శమే! రాముడెప్పుడూ చేతిలో బాణం సంధించి, రెడీగా వుంటాడు రక్షణకు. అందుకని అశోకస్థితి అనేది అందరికీ వుండదు. సిద్ధులకు వుండవచ్చు. భూదేవికి కూడా శోకంవుంటుంది. భూమిమీద అధర్మం ఎక్కువవుతున్న కొద్దీ భూదేవికి బాధగా వుంటుంది. శోకం నుండి, అశోకస్థితికి తరింపచేసేవాడు భగవంతుడు. అందుకే 'అశోకః' అనే నామం దగ్గరే 'తారణః' అనే నామం వేసారు. అశోకస్థితి కావాలంటే తరింపబడాలి. అట్లా తరించినవాళ్ళు సాధుపుంగవులు, యోగులు, భక్తులు, మహాత్ములు. అట్లా చాలామంది జీవితాలు పురాణాలలో గోచరిస్తూ వుంటాయి. ధర్మము నందు నిలబడినప్పుడు కూడా శోకించే సన్నివేశాలు వస్తాయి జీవితంలో. నలుడు ఏ పాపపాటు చేసాడని అంత కష్టపడాల్సి వచ్చింది? హరిశ్చంద్రుడేం పాపపాటు చేసాడని అన్ని కష్టాలు పడవలసివచ్చింది? ధర్మము నందు ప్రవర్తిస్తున్న వారికి భగవంతుడు కారణం చూపించి, శోకస్థితి నుండి అశోకస్థితికి తీసుకొని వెడతాడని చెప్పడానికి, ఈ కథలన్నీ మనకు పనికివస్తాయి. విభీషణుడు లంకలో శోకిస్తూ వుంటాడు అన్న చేసిన పనికి. తన ధర్మాన్ని నిర్వర్తించడానికి రాముని శరణాగతి పొందుతాడు. అది కూడా ధర్మము నందు ప్రవర్తించి తనను తాను ఉద్ధరించుకోవడం వలన, రాముని శరణు దొరకడం వలన అశోకస్థితి చేరడానికి వీలుపడింది. అంటే

అశోకస్థితికి మనల్ని భగవంతుడు చేర్చగలడు. శోకములు రావడమనేది సహజం. మనకి శరీరస్థితి బాగుండకపోతేనే శోకం వస్తుంది. ఇంట్లోవాళ్ళ పరిస్థితి బాగుండకపోతే శోకం వస్తుంది. మన ఉద్యోగ పరిస్థితి బాగుండకపోతే శోకం వస్తుంది. మనకి చాలా సులభంగా శోకం వస్తుంది. మరి మనలాంటి వాళ్ళకి ఏమిటి గతి? అంటే, 'తారణః' తరింపచేసే వాడొకడున్నాడు కాబట్టి, వాడిని పట్టుకోవడం వలన శోకస్థితి నుండి అశోకస్థితికి వెళ్ళడానికి వీలుబడుతుంది. ఎప్పుడు ఏ శోకమున్నా వాడిని పట్టుకొంటే, మనల్ని ఉద్ధరిస్తాడు. అదే తారణమంటే! తారణం, తారకం. తారకమంత్ర మంటారు కదా రామనామాన్ని. తారకమంత్రమంటే తరింపచేసే మంత్రం. దేంట్లోంచి? మన కష్టముల సముదాయము నుంచి. మన కష్టాలు ఎక్కువగా మన భావపరంపరగా వుంటాయి. భావమయమైన లోకంలో జీవిస్తూ వుంటాడు మానవుడు. మనసే ప్రధానంగా వున్నవాడు మానవుడు. మనసు నిండా కష్టాలే! మనసు దాటినవాడికి కష్టాలు లేవు. శుద్ధ చైతన్యానికి అశోకస్థితి అనేది వుంటుంది. ఆ శుద్ధ చైతన్యం మీద రకరకములైన భావముల యొక్క ప్రతిబింబాలు పడినప్పుడు, మన శుద్ధ చైతన్యస్థితిని మర్చిపోవడం వలన, మన భావములలో మాత్రమే మనం జీవిస్తూ వుండడం వలన, మన భావాలు మనల్ని ఇరుకులో పెడుతూ వుంటాయి. 'అభావస్థితి' అనేది ఒక్క శ్రీకృష్ణుని లోనే దర్శించగలం. ఇంకెక్కడా దర్శించలేము. మనకి తార్కాణం లేదు. ఒక్క శ్రీకృష్ణుడు తప్ప, ఎవరూ శోకము చెందలేదు అని అనటానికి ఇంకెక్కడా లేదు. అవతారమూర్తులలో రాముణ్ణి, శ్రీకృష్ణుణ్ణి ఇద్దరినీ సమానంగా కొలుచుకుంటాం మనం. అటువంటి రాముడు కూడా శోకస్థితి చెందినట్లు కనిపిస్తున్నది. మహాత్ములు ఎవరి పేరు చెప్పండి, వారి జీవితాల్లో ఏదో ఒక శోకస్థితి కలిగిన సందర్భాలు కనిపిస్తాయి. సాధకుల యందు కూడా అటువంటి శోకస్థితి వున్నది. కాబట్టి భగవంతునికి తప్ప మిగతావారికి తప్పనిది శోకస్థితి. దేవతల రాజు ఇంద్రుడికీ శోకస్థితి వున్నది. దేవతలకీ శోకస్థితి వున్నది. కాబట్టి 'అశోక' అనే నామం కేవలం భగవంతునికి మాత్రమే! శ్రీకృష్ణుడు అశోకవృక్షం క్రింద కూర్చుని వేణుగానం చేసినట్లు భాగవతంలో వున్నది. సీతాదేవి లంకలో అశోకవనంలో వున్నది. రామునికి శోకం ఎక్కువ వుంటుంది తప్ప, సీతాదేవి అంత శోకించదు. మనం రామాయణం చదువుకొంటే, సీతాదేవి ఎక్కువ స్థితప్రజ్ఞలాగ కనిపిస్తుంది. ఆమెకు రాముని యందున్న నమ్మకం అటువంటిది. రావణుడు తననేదో చేస్తాడనే భయం సీతాదేవికి ఎప్పుడూ లేదు. రావణుడు తనను అతిక్రమించి వ్యవహరించినట్లైతే, భస్మం చేయగలిగిన శక్తి వున్న మహాసాధ్వి ఆవిడ. కేవలం ధర్మసంస్థాపన కోసం, రాముని అవతారం పరిపూర్తి అవడం కోసం, ఆ సన్నివేశం అట్లా జరుగుతుంది. అందుకని

రాముడు, సీత ఇద్దరినీ చూసినట్లైతే, రాముని కంటే సీత ఎక్కువ అశోకస్థితిలో వున్నట్లు కనిపిస్తుంది. ఆమె అశోకవనంలో కూర్చుంది. అశోకమనే వృక్షమంటే, శోకాన్ని దగ్గరకు రానియ్యనిది. అందుకని తపస్సులు కూడా అశోకవృక్షం క్రింద చేసుకునేవాళ్ళు. భావములకు అతీతమైన స్థితిలో వుండగలిగితే, అశోకస్థితి కలుగుతుంది. ఎందుకంటే శోకమొక భావము. తాను శుద్ధచైతన్య స్వరూపుడుగా మాత్రమేనుండి, విదేహస్థితి యందుంటే, అశోకస్థితి. అది దేవతలకే సాధ్యపడని విషయం కాబట్టి, దాన్ని పొందేలోపుగా మనకి చాలా శోకం కలుగుతుంది అశోకస్థితిని చేరుకోవటానికి. ఆయనే మనను తరింపచేసే స్థితిలో వున్నాడు కనుక స్తోత్రాదికములతో ఆయనను వేడుకొని, మన ప్రవర్తనల యందు సర్దుబాటు చేసుకోవాలి. ఈ రెండూ కలసి సత్యం. ప్రవర్తనలో సర్దుబాటు చేసుకోకుండా, స్తోత్రాదికములు మాత్రమే చేసుకొంటే, రక్షింపబడడానికి అవకాశం రాదు. రక్షింపబడ్డ వాళ్ళందరి చరిత్రలు రామాయణ, భారత, భాగవతాది గ్రంధములు లేక ఇతర పురాణములు చూసుకున్నట్లైతే, ధర్మము నందుండి, శోకమునకు గురియైన వాళ్ళు రక్షింపబడ్డారు. లేక అధర్మము నందుండి, దుఃఖము కలగటం వలన అధర్మము నుండి విముక్తులై, ధర్మప్రవర్తకులుగా తమను తాము మార్చుకొంటూ, భగవంతుని ఆరాధన చేసినవాళ్ళూ, తప్పుదారిన నడచి, దారి మార్చుకొన్న వాళ్ళూ కూడా శోకము నుండి తరింప చేసిన సన్నివేశములు మనకి కనిపిస్తాయి. కదా! మార్పు చేసుకోకపోతే మాత్రం రక్షణ రాదు. అంటే ధర్మము నందు నిలబడినవారికి రక్షణ భగవంతుడిస్తాడు. ధర్మము నందు నిలబడినంత మాత్రాన శోకము రాదనిలేదు. మంచివాళ్ళకే కష్టాలు అన్నట్టుగా బోల్డు కధలుంటాయి. కానీ కష్టాలు వచ్చాయి కాబట్టి, చేసినదాంట్లో తప్పలున్నాయేమో చూసుకొని, అటువంటి తప్పులు మళ్ళీ చేయకుండా వుండడానికి ముందు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. వచ్చిన కష్టమల్లా మనకే ఎందుకొచ్చింది? ఏదో వుంది మనలో. లేకపోతే మన వరకూ రాదు. మన వరకూ వచ్చిందంటే, మనలో ఏదో వుంది కాబట్టి. ఇంకొంచెం బాగా వుందాం. ఇంకొంచెం ధర్మము నందు, దైవము నందు నిలబడి వుందాం అనే భావన వుండటం మంచిది. నేను బాగానే వున్నాను అనవసరంగా ఇంకొకళ్ళ మూలంగా కష్టమొచ్చింది అనుకోకూడదు. గజేంద్రుడి లాగ సాధన చేయాలి. గజేంద్రుని యొక్క సాధన ఎట్లా వుంటుంది? తన తప్పు తాను తెలుసుకుంటాడు. నీటిమీద వ్యామోహం కొద్దీ వచ్చి, ఇంత పని చేసానని తెలుసుకుంటాడు. నీళ్ళల్లోకి రావటమెందుకు? వచ్చానే అనుకో, ఇంత గందరగోళం చేయటమెందుకు? చేసానే అనుకో, మరి నీటిలో వుండేవాళ్ళ ప్రశాంతత భంగం చేయటం వల్ల కదా ఇది వచ్చింది. అని ముందు తను తెలుసుకొని, తర్వాత దైవప్రార్ధన చేస్తాడు. అందుకని మనం దైవాన్ని ప్రార్ధన

చేసేటప్పుడు questioning ఏమీ వుండకూడదు. మాకెందుకీ కష్టమిచ్చావ్ అని అడగకూడదు. చూపిస్తే మనకే బాధగా వుంటుంది. అంత చెత్తపని చేసియుంటాము. మన గురించి మనకు మన గతాన్ని చూపిస్తే, ఎందులోనైనా దూకేద్దామనిపిస్తుంది. ఏదో చేసి యుండటం వల్ల కష్టం వచ్చింది. దాన్ని అంగీకరిస్తున్నాను, దాన్నించి నువ్వు నన్ను తరింపచేయి, అని కోరుకోవటం నిజమైన ప్రార్థన అవుతుంది. అంతేకానీ వాటికోసం, వీటికోసం కష్టం లేనప్పుడు కూడా అవి కావాలి, ఇవి కావాలి అని కోరుకోవడం ఆ syllabus వేరే, ఇది వేరే. తనకుండే కర్తవ్యం నిర్వహించే దానిలో కూడా కష్టం లేకుండా కోరుకోవడం. సతీసక్కుబాయి అట్లా కోరుకుంది. బస్తాలు, బస్తాలు పప్పులు అక్కడ పడేసి, తెల్లారేసరికి రుబ్బేయమని అడిగితే కష్టమే కదా మరి! కష్టం వచ్చినప్పుడు పిలిస్తే, ఆదుకుంటాడు. ద్రౌపదీదేవికి కష్టం వచ్చింది దూర్వాసుడు వచ్చినప్పుడు. అప్పుడు కృష్ణుడున్నాడు కాబట్టి రక్షించాడు అనుకోవద్దు. అప్పుడు కూడా ద్రౌపదీదేవికి దగ్గరగా లేడు. వస్త్రాపహరణ మప్పుడూ ఎక్కడో వున్నాడు కదా! నిజంగా మనకి కష్టం వచ్చినప్పుడల్లా వాళ్ళకీ, వీళ్ళకీ చెప్పుకోవడం కన్నా, ఆయనకు చెప్పుకోవటం వల్ల తీరతాయి. ఇదో పద్ధతి. తప్పకుండా తరింపచేస్తాడు. ఎందుకంటే చోటంతా నిండియున్నాడు కాబట్టి. ఇప్పుడెట్లా అనుకోవద్దు. మీరు దగ్గర లేరు మాస్టారూ, మాకు కష్టం వచ్చినప్పుడు అనుకోకూడదు. నిజానికి మాస్టారనే తత్వం మొత్తం వ్యాపించి యుంటుంది. ఏదో రకంగా పరిష్కారం లభిస్తుంది. చేసే ప్రార్థన లోని శ్రద్ధ వల్ల, భక్తి వల్ల, శుచి వల్ల, త్రికరణశుద్ధి వల్ల లభిస్తుంది. ఈ 'తారణం' అనేది భగవంతుని తత్వాల్లో గొప్ప తత్వం. 'అశోకం'[1] అనేది అందరూ పొందవలసిన తత్వం. అది వుంటే గొడవే లేదు. శ్రీకృష్ణునికి తన వాళ్ళందరూ చచ్చిపోయినా, ఏమీ అనిపించలేదు. ఎందుకనిపించలేదంటే, పుట్టటం, పోవటం అనేది ఈ భూమిమీద సహజంగా జరుగుతూ వుంటుంది. వాళ్ళందరూ ఎక్కడికీ పోలేదు. నాలోనే వుంటారు. నాలోంచే బైటకి వస్తారు అనే తత్వంలో వుండే వాడికి పోయారనే point ఏమిటి? మనకి కదా పోయారనే బాధ! పరిపూర్ణ శుద్ధబ్రహ్మతత్వము కృష్ణ తత్వం! అటువంటి వాడిని మనం శరణు వేడుకోవాలి. బాబూ! ఈ కష్టం వచ్చింది. నీకేదీ కష్టం కాదనుకో. మాకన్నీ కష్టాలే. కాబట్టి మమ్మల్ని ఈ కష్టం నుండి ఒడ్డున పడేస్తే, నీ కాళ్ళ దగ్గర అలా పడుంటాము అని. కష్టం వున్నంతసేపు పడుంటాము. కష్టం తీరిన తర్వాత దులుపుకొని వెళ్ళిపోతాము. కుక్క చూసారా! ఎట్లా దులుపుకొని వెళ్ళిపోతుందో! ఒకసారి దులిపేసి, మళ్ళీ తిరిగేస్తాం. మళ్ళీ కష్టం వస్తుంది. మళ్ళీ వస్తాం. కష్టం అయిపోయిన తర్వాత నన్ను మర్చిపోయాడని భగవంతు డనుకోడు. ఎందుకంటే అట్లా అనుకోవటానికి భావస్థితిలో వుండడు కదా! భావాతీత స్థితి కదా! అది కారణంగా భూమిమీద అన్నిచోట్లా దైవారాధనలు వచ్చాయి. నమ్మకం వుండాలి.

ఎంత కష్టం నుండైనా కడతేర్చగల్గిన ఆ తత్వానికి సంబంధించిన వాడు. మీరు పేరేదైనా పెట్టుకోండి. అది మీ నమ్మకానికి సంబంధించినది. రూపం ఏదైనా పెట్టుకోండి. తప్పక రక్షిస్తాడని నమ్మకం పెట్టుకోండి. అదొక్కటే! ఏదో విధంగా రక్షణ ఆ టైముకి వస్తుంది. శత్రువు తమ్ముడినే తరింపచేసాడు కదా శ్రీరామచంద్రుడు. ఈ కథలన్నీ, భగవంతుడెట్లా తరింపచేస్తాడన్న దానికి చదువుకోవాలి. కొంత కొంతమందికి వున్న స్థితి నుండి ఇంకా దైన్యమైన స్థితిలో పడేసి తరింపచేసాడు. ఎందుకంటే వాడక్కడ వుండడం వలన. ముందు బాగుండదని తెలిసిందనుకోండి. ఇవాళ ఉద్యోగం తీసేసారని వస్తుంది వార్త. కష్టం కదా! అదేమిటి రోజూ ప్రార్థన చేస్తున్నాను, ఉద్యోగం తీసేసారేమిటి అనిపిస్తుంది. ఇంతకన్నా మంచిదేదో ఇవ్వటానికి ఇది తీసేస్తారు. విదురుడికి అలాగే ఉన్న ఉద్యోగం తీసేశాడు. ధర్మరాజుకి ఉన్న రాజ్యం, సంపద అన్నీ శుభ్రంగా తీసేసాడు. చెట్టుకు పురుగు పట్టిందనుకోండి ఏం చేస్తారు? ఆకంతా తీసేసి, దులిపేసి, మొత్తం బోడిచేసి మళ్ళీ చిగురించేటట్లు చేస్తారు. క్రొత్త చిగురెప్పుడూ మంచిది. ఎండిపోయిన ఆకులు, క్రుళ్ళిపోయిన ఆకులు, పురుగు పట్టిన ఆకులు ఏర్పడుతున్నాయనుకోండి, తీసేస్తారు. అలాగే తనవాడనుకొన్నవాడు సంపద వల్ల పాడైపోతే, సంపద తీసేస్తాడు. కీర్తి వల్ల పాడైపోతే, కీర్తి తీసేస్తాడు. అలా వుంటుంది. విష్ణుమూర్తి, శివుడు ఇద్దరూ కలిసి ఒకసారి భూలోకానికి వెళ్ళి, మానవులెలా వున్నారో చూసి వద్దామనుకున్నారు. అంటే, ముందు శివుడన్నాడుట ముందు నా భక్తుల దగ్గరకి వెళదాము. ఎట్లా వున్నారో చూద్దామని. సరే! ఆయన భక్తుని దగ్గరకు వెళ్ళారుట. ఆయన చాలా ఐశ్వర్యము, సంపద కలిగి వున్నాడుట. శివ భక్తులకు సిరిసంపదలు బాగా వుంటాయి. శివుడేమీ వుంచుకోడు. అందరికీ ఇచ్చేస్తూ వుంటాడు. బాగా మదించి వున్నాడు. అప్పుడు శివుడు, విష్ణువుని చూసి, ఎందుకు వాడికంత సంపద నిచ్చావని అడుగుతాడు. శివుణ్ణి ప్రార్థిస్తే, విష్ణువు అనుగ్రహిస్తాడు. విష్ణువుని ప్రార్థిస్తే, శివుడనుగ్రహిస్తాడు. వాళ్ళిద్దరి మధ్య అటువంటి understanding వున్నది. విష్ణువుని ధ్యానిస్తే, ఉన్నవి పట్టుకొనిపోతాడు. ఆ తర్వత విష్ణు భక్తుని దగ్గరకు వెళ్ళారుట. వాడేమో పెట్టుకోకపోతే బాగుండదని, ఒక గోచీ పెట్టుకొని, అహర్నిశలూ భగవంతుడ్నే ధ్యానం చేస్తూ, ఇంకొకటి లేని స్థితిలో వుంటాడు. అప్పుడు విష్ణువు, శివుణ్ణి అడుగుతాడన్న మాట ఎందుకిలా చేసావని? మన కథలన్నీ అలాగే వుంటాయి. విష్ణువుని ధ్యానం చేస్తే, ఏం చేస్తాడంటే శివత్వాన్నిస్తాడు. అంటే ఏమీ లేకపోయినా ఆనందంగా వుండే స్థితి. ఉంటే ఆనందంగా వుండడం లేకపోతే ఆనందంగా లేకపోవడం ఇవన్నీ మనకి అలల్లాగా హెచ్చుతగ్గులుగా వుంటాయి. అందుకని భాగవతంలో కూడా ఒక పద్యముంది. నన్నెవరైతే బాగా ప్రార్థన చేస్తారో,

వాడికి 'నేను' తప్ప ఇంకేమీ మిగలదని చెప్తాడు. నన్ను గాని అన్యమెరుగని స్థితి నిస్తానంటాడు. ఉన్నవాడికి వున్న వాటియొక్క బాదరబందీ తప్ప, లేనివాడికి లేవన్న భావం వుండదు. అదీ! ఉన్నవాడికి కూడా వున్నాయనే భావన లేకపోతే, ఉన్నా లేనట్లే. సుఖంగా వుంటాడు. లేనివాడికి కూడా లేదనే భావన లేకపోతే, వాడికి లేకపోవడం కూడా లేనట్టే. మరి వాడి సంగతేమిటి? మొదటి'వాడు అలా కొట్టుకొని పోతున్నాడు కదా! వాడూ వస్తాడు ఏదో రోజున. అప్పుడు వాడికీ ఈ స్థితి కల్పిద్దామని' ఇద్దరూ వస్తారు. ఈ కథ ఏ పురాణం లోనూ లేదు. నానుడిగా వచ్చే కథ. ఎందుకిది చెప్తున్నానంటే, ఒక్కొక్కసారి భగవంతుడు శోకస్థితి నుండి ఉద్ధరించడం కాకుండా, శోకస్థితిలో పడబోయేవాడిని కూడా ఉద్ధరిస్తాడు శోకం కల్పించి. ధర్మరాజుకట్లా చేసాడు. విదురునికట్లా చేసాడు. కొంతమంది మంచివాళ్ళు, చెడుదారిలో వెళ్ళడానికి నెమ్మదిగా ఆకర్షింప బడ్డారనుకోండి, వాళ్ళ కన్నిచోట్లా అడ్లు పడేస్తాడు. వున్నది తీసేస్తాడు. ఆ భావం పోవడానికి కొంత base తీసేస్తాడు. ధర్మంలో వుండి, కష్టంలో వున్నారనుకోండి, వారికి తరింపు మార్గం చూపిస్తాడు. అన్నీ తరింపు మార్గాలే. ఏ విధంగానైనా భగవంతుడిచ్చేది తరింపే! దానికి మనం విశ్వాసంలో ఏ మాత్రమూ లోపం లేకుండా, నిత్యమూ ఆరాధన చేసుకుంటూ వుండాలి. అందుకే మన సాంప్రదాయంలో ప్రతి ఇంటికీ ఒక ఇలవేల్పు వుంటాడు. ఆ ఇలవేల్పును అలా ప్రతిరోజూ ధ్యానం చేసుకొంటూ, ప్రార్ధన చేసుకొంటూ, షోడశోపచారాలు చేసుకొంటూ వుంటే, శోకస్థితి కలగకుండా వుంటుంది. కలిగినా దానినుంచి తరింపు కలగజేసే పద్ధతి ఒకటుంటుంది.

350 తారః

తారః అంటే దారి కూడా చూపిస్తాడు. మళ్ళీ శోకాల్లో పడిపోకుండా, ఒక మార్గాన్ని దర్శింపచేస్తాడు. మార్గదర్శకుడు కూడా భగవంతుడే! గురువుల రూపంలో తానే దిగివచ్చి జీవులకు దారి చూపిస్తాడు. కష్టమొచ్చినప్పుడు ఏ గురువు గారి దగ్గరకో పరిగెడుతూ వుంటారు కదా జీవులు. ఒంట్లో బాగులేకపోయినా, సరిగ్గా సంపాదన లేకపోయినా, ఆర్తులు, అర్థార్తులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు ఇలా వున్నారు కదా! కష్టాల్లో ఉండో, సంపాదన కోసమో, ఇదేమిటో తెలుసుకొందామనే జ్ఞానం కోసమో, ఏదో మొత్తానికి ఒక స్థితిలో ప్రతివాడూ ఎవరో తెలిసినవాడి దగ్గరకు చేరుతూ వుంటారు. అందుకనే ఒక్కొక్కసారి బాగా కష్టాలు పెట్టి కూడా తోలుతూ వుంటాడు తనవారి దగ్గరకు. ప్రతివారి జీవితంలో కూడా ఒక కష్టంతో మహాత్ముని చేరుకోవడం కనిపిస్తుంది. ఆ విధంగా తన దగ్గరకు తెచ్చుకున్న తరువాత, వాళ్ళకి ఎట్లా జీవించాలనే మార్గాన్నిస్తాడు. ఎందుకంటే మనం సహజం గా చైతన్య స్వరూపులమైనప్పటికీ కూడా బహిర్గత ప్రపంచంలో వున్న ఆకర్షణలకు లోనవడం వలన మనకివ్వబడిన మనసు, ఇంద్రియాలు, శరీరానికి లోబడిపోతాం. మన భావాలకు లోబడిపోతాం. మన ఇంద్రియాల కున్న ఆకర్షణలకు లోబడిపోతాం. శరీర సుఖాలకు లోబడిపోతాం. ఈ లోబడి పోయినవాడు వాటిమీద స్వామిత్వం లేక బానిసవలె జీవిస్తూ వుంటాడు. బానిస జీవితం ఎలా వుంటుందో మనకు తెలుసు కదా! ఈ బానిస జీవితంలో పడుతున్న కష్టాలు, తన భావనల వల్ల తనకి ఏర్పడినవే ఎక్కువ. తనకి ఇంద్రియముల ద్వారా బయట ప్రపంచంలోని ఆకర్షణల వల్ల వచ్చేవే కష్టాలు. బయట ప్రపంచంలో ఎటువంటి సన్నివేశంలో కూడా దుఃఖం చెందనివాడు మార్గంలో వున్నట్లే! మనం అలా దుఃఖం చెందుతూ వుంటాం కాబట్టి, భావమయ లోకంలో వుంటాం కాబట్టి, భావమయ లోకంలో వున్నప్పుడు శోకం తప్పదు కాబట్టి, మాటిమాటికి శోకంలో వున్న వాళ్ళని, మాటిమాటికి తరింపజేస్తూ యుండడమన్నది అంత తెలివైన పని కాదు కాబట్టి, శోకం లేకుండా వుండే మార్గాన్ని వాడికివ్వటం కూడా తానే ఒక కర్తవ్యంగా పెట్టుకున్నాడన్నమాట! అందులో భాగంగా మనకి సద్గురువుల యొక్క అస్తిత్వం! సద్గురువుల రూపంలో మళ్ళీ మనుష్యులకు సరైన దారిని అందించి, ఇకముందు ఇలా జీవించు, నీవీ స్థితిని దాటుతావు అని చెప్తాడు. ఏ స్థితిని? శోకస్థితిని! శోకస్థితిని దాటడమంటే కష్టాలు రావని కాదు. అంత కష్టంగా అనిపించదు. చాలు కదా రెండూ O.K. . అన్నం దొరకదుట అంటే భయపడిపోతాం. ఆకలి లేదుట అనే స్థితికి వచ్చామనుకోండి. అన్నం దొరక్కపోతే మనకేమిటి?

డబ్బులుండవుట, దొరకవుట అంటే భయంగా వుందనుకోండి. డబ్బుతో సంబంధం లేకుండా హాయిగా వుండే జీవితంలోకి వచ్చామనుకోండి. డబ్బుల్లేవుట అనేది మనల్ని భయపెట్టదు కదా! ఏది మనల్ని భయపెడుతుందో అది మన భావమే! సాధనలో లేక మార్గంలో గురువు దగ్గర నెమ్మదిగా శిష్యుడు, ఈ లోకమంతా భావనతో నిండియున్నది, తన భావములే తనని బాధ పెడుతున్నాయి. తన భావములే తనని భయపెడుతున్నాయి అని తెలుసుకొంటాడు. మనందరికి పామంటే భయం. మహాత్ములకు పామంటే భయం వుండదు. ఎందుకని? మహాత్ములకు పామంటే వుండే భావన వేరు. మనకి పామంటే వుండే భావన వేరు. మనకి పామక్కరలేదు. బొద్దింక చాలు. గభాలున వచ్చి మీదపడితే, నానాగొడవా చేస్తాం. ఏమిటి తేడా? ఇంకొకడికి బొద్దింక పడితే కదలడు. మామూలుగా తీసేస్తాడు. చేత్తో పట్టుకొని ఆడతాడు కూడ. మనకి బొద్దింక పడినా భయమే కదా! పాము వరకు ఎందుకు? పామంటే మరీ భయం కదా! పులంటే భయం కదా! ఇవన్నీ భయాలు కదా! ఎందుకేర్పడినాయి? కొంతమంది కెందుకు లేవు? మన కెందుకున్నాయి? ఆలోచించి చూస్తే, కేవలం మన భావములే మనల్ని భయపెడతాయి. మన భయానికి అసలు కారణం వుండదు. భయానికి కారణమేమిటంటే, భయపడాలని మనం పెట్టుకోవటం వలననే. భయపడాలని పెట్టుకోవటం వలన భయపడుతూ వుంటాం. ఆ భయం తీరాలంటే, దాన్ని ఒకసారి కదిపి చూడాలన్నమాట! దేనియందు వీడు ఎక్కువ మక్కువ పెట్టుకొంటాడో, దాన్ని కదిపి చూస్తాడు. మాటిమాటికీ కదులుతుందనుకోండి అలవాటైపోతుంది నెమ్మదిగా. ఇది ఇట్లాగే వుంటుంది. ఫరవాలేదు. ఇట్లా వున్న వాళ్ళు కూడా చాలామంది వున్నారు అని. ఒక జాతక కథ వున్నది. ఒకావిడ మొగుడు పోయాడని చాలా గొడవ చేస్తుంది. రాజుగారి దగ్గరకు వెడుతుంది. నా మొగుడిని బ్రతికించలేవా? నీవింత రాజువి కదా! పైగా యోగివిట, రాజయోగివిట. బ్రతికించకూడదా? అని అడుగుతుంది. అప్పుడు ఆ రాజు చెపుతాడు. రాజ్యంలో ప్రతి ఇంటికీ వెళ్ళి, చావులేని ఇల్లు ఏదైనా వుంటే, ఆ ఇంట్లోని యజమానినో, పెద్దనో నా దగ్గరకు తీసుకునివస్తే, వాని ద్వారా నీ భర్తను బ్రతికిస్తాను. అంటే, అతనికేవో powers వున్నాయి. అటువంటి మనిషిని తెస్తే బ్రతికించగల డనుకొని వెడుతుంది. ఇంటింటికీ వెడుతుంది. ఒక్కొక్క ఇంట్లో ఒక్కొక్క కథ వింటుంది. ఈవిడకు 60 ఏళ్ళకి మొగుడు పోయాడు. 30 ఏళ్ళకే మొగుడు పోయినవాళ్ళు, కొడుకులు పోయినవాళ్ళు కనిపిస్తారు. తండ్రులు పోయినవాళ్ళు, ప్రమాదంలో పోయినవాళ్ళు కనిపిస్తారు. భయంకరంగా చచ్చిపోయినవాళ్ళూ, ఇవన్నీ చూస్తే చివరికి ఓ! మనకొచ్చింది చాలా చిన్న కష్టంలే అనిపిస్తుంది. ధర్మరాజు కదే చేస్తాడు శ్రీకృష్ణుడు. యుద్ధం అంతా అయిపోయాక రాజ్యాభిషేకానికి చేయడానికి

తయారవు బాబూ అంటే, ఎవరికోసం ఈ రాజ్యం ఏలాలి? వీళ్ళందరూ చచ్చిపోయారు. నేను రానంటాడు. నాకక్కరలేదంటాడు. ఎంతమంది చెప్పినా వినడు. అప్పుడు కృష్ణుడొచ్చి, ఏమిటి నీకొచ్చిన కష్టం? ఇంతకంటే భయంకరమైన కష్టం వచ్చిన రాజొకడున్నాడు తెలుసా? వాడి కథ వింటే గుండాగి చచ్చిపోతావు అంటే, నాకన్నా కష్టపడ్డాడా? అని అడుగుతాడు. నీ బొంద కష్టం. నీ కష్టమేమిటి? వాడి కష్టం వింటేనే చచ్చిపోతావు, అంటాడు. చెప్పు చెప్పు, అంటాడు. అప్పుడు నారదుని పిల్చి, నువ్వు చెప్పు అని వెళ్ళిపోతాడు. ఆ కథ విన్నాక ధర్మరాజుకి మనం బాగానే వున్నాం కదా అనిపిస్తుంది. అంటే ఏం జరిగిందక్కడ? మనోమయ లోకాల్లో మార్పు జరిగింది. అట్లాగే చేస్తూ వుంటారు. ఫరవాలేదు బాగుంటుందని చెప్తారు. ఏలినాటి శని వచ్చింది. ఏడున్నరేళ్ళు వుంటుంది. వాడు మూడు నెలల్లోనే మన దగ్గరకు వచ్చి ఏమీ బాగాలేదని, ఏం చేయమంటారని అడిగితే, చూసి, మరీ మనం నిరుత్సాహపరిస్తే చచ్చిపోతాడు. వాడికి ఏలినాటి శని. ఎప్పుడూ కష్టాలే ఉండేవాడికి problem లేదు. అప్పుడే క్రొత్తగా కష్టాలు వచ్చినవాడికి చాలా కష్టంగా వుంటుంది. కదా! ఎప్పుడూ జ్వరం రానివాడికి జ్వరం వస్తేనే కష్టం. మాటిమాటికీ జ్వరాలు వచ్చేవాడికి ఆ(ఉంటే వుందని, హాయిగా office కి పోతాడు. అన్నీ చేసుకుంటాడు. ఇంటికి వస్తాడు. జ్వరానికి మందేసుకుంటాడు. పని చేసుకుంటాడు. ఏలినాటి శని వున్నవాడు వస్తే ఏం చేస్తావు? ఒక 6 నెలలు ఇబ్బందిగా వుందండి. అంటే మళ్ళీ వస్తాడు. కొంచెం నెమ్మదిగా తగ్గుతుంది. కొన్ని రోజులు పడుతుంది. వాడిని prepare చేయడమన్నమాట! ఆ తరువాత పోతుందా అంటే, అప్పటికి అలవాటు పడిపోతావని చెప్పాలి. ఏదైనా సరే అలవాటు పడిపోవాలి. మనకి కూడా ఎంత పెద్ద కష్టం వచ్చినా, మర్నాడు ప్రొద్దున లేచి కాఫీ త్రాగడం మానం కదా! కష్టపడుతూనే కాఫీ మాత్రం తాగేస్తాం. అదే మనం చూస్తూ వుంటాం మామూలుగా ఎవరింట్లోనైనా సరే. ఆత్మీయులు వెళ్ళిపోతారు. ఉండరు కదా! ఎవరుంటారు? మనకి చెప్పి వెళ్ళలేదని. చావు ముందు చెప్పచ్చు కదా ఫలానా మనిషిని తీసుకొని పోతున్నానని. అట్లా చెప్తే మనం ఒప్పుకుంటామా? వచ్చి తీసుకెళ్ళిపోతుంది. వెక్కి వెక్కి ఏడుస్తూనే, కళ్ళు తుడుచుకుంటూనే వుంటారు. కాఫీ తాగుతూనే వుంటారు. అంతే! మూడు రోజులయ్యేసరికి మర్చిపోతారు. శుభ్రంగా భోజనం చేస్తూ వుంటారు. 10 రోజులయ్యేసరికి మామూలే! ఏమైంది ఈ 10 రోజుల్లో నీకు నిజంగా మన భయం తప్ప. ఈ 10 రోజుల్లో ఏం జరిగింది? మొదటి రోజున ఎందుకట్లా వున్నావు? 10 వరోజుకి ఇట్లా వున్నావేమిటి? సంవత్సరం తరువాత? ఏమైంది నీకు? ఇక్కడ మార్పేగా! భావనలో మార్పు తీసుకొనిరావడమే కదా! అదే గురువు చేసేది కూడ! ఊరికే మనం పెట్టుకొనేవి తట్టెడుంటాయి మన దగ్గర. అవే మనల్ని భయపెడుతూ

వుంటాయి. చిన్న పిల్లవాడుగా వున్నప్పుడు బూచాడు వస్తాడంటే, నిజంగానే బూచాడు వస్తాడనిపించదూ? పెద్దవాడైన తరువాత బూచాడు లేడని తెలియదూ? పెద్దవుతూ ఉండడము, చైతన్యవంతులమవుతూ ఉండడం. ఎక్కువ పెరిగిన కొద్దీ తక్కువ భయాలుంటాయి. ఎక్కువ భయాలున్నాయి అంటే, తక్కువ పెరిగావని అర్థం. నీ భయాల నుండే ఆయనే మార్చుకుంటూ వస్తాడు. నీకేది ఎక్కువ భయమో, దానిని దగ్గరకు తెచ్చి, మాటిమాటికీ అదివచ్చి, చూసినట్లుగా చేస్తాడు. అదీ సి.వి.వి. గారి training! ఆయన మొదట చెప్పినదదే! నీలోని భావ పరిమితత్వాన్ని ముందు ఎదుర్కొంటాను. ఎదుర్కోవడమంటే ఏమీలేదు నీకు ఏవైతే భయం కలిగిస్తున్నాయో, అవి అట్లా మీదపడుతున్నట్లుగా వుంటాయి. పడుతున్నట్లుగా వుంటాయి కానీ పడవు. కొన్నాళ్ళు పోయిన తరువాత ఏమనుకొంటాము? ఆ. పడితే పడనీ అనుకుంటాము. పడనవసరం లేదు. అది శనిగ్రహమిచ్చే training. అదే మార్గాన్ని చూపిస్తుంది. మనకి చీమ కుడితే శోకంతో ప్రారంభించి పెద్ద పెద్ద శోకాలున్నాయి. ఎన్నెన్నో వుంటాయి మనకి. వీటికోసం మాటిమాటికీ వాడిని బాధపెట్టని పద్ధతి ఇస్తాడు. ప్రతిరోజూ అప్పు కొచ్చాడనుకోండి. అప్పు చేయని స్థితిలో వీడిని పెట్టే మార్గం వాడికిస్తే, వాడు అప్పుకు రానక్కరలేదు కదా! కాబట్టి ఏది పెద్ద సత్కార్యము? అడుక్కొని తినేవాడికి రోజూ ఒక 10 రూపాయలు ఇవ్వడం ఒక పద్ధతి, అడుక్కోకుండా వాడి కాళ్ళమీద వాడు నిలబడేటట్టు చేయడం ఇంకా పెద్ద పద్ధతి. అందుకనే ద్రవ్యయజ్ఞం కన్నా, జ్ఞానయజ్ఞం ఇంకా విలువైనదని చెప్పారు. ఏమిటి జ్ఞానం? ఇలా పదిమంది మీద పడి బ్రతకడం కన్నా, వాడి కాళ్ళమీద వాడు నిలబడి, వాడు పదిమందికీ ఉపయోగపడేటట్లు చేయడం. అదీ జ్ఞానం! అలా భగవంతుడు 'తారః' అంటే దారి చూపించేవాడు. తార రామాయణంలో వస్తుంది. చాలా చక్కటి దారి చూపించగలదు ఆవిడ. ఆవిడ చెప్పిన దారిలో నడిస్తే అంతా సౌకర్యమే. అంతా సుఖమే. అంతా శుభమే. వినకపోతే కష్టమే. అది వాలి తెలిసీ, వినడు. తార చాలా చక్కగా చెప్తుంది. 'ఇప్పుడే యుద్ధంలో నీ చేతిలో తన్నులు తిన్నాడు. మళ్ళీ పిలుస్తున్నాడంటే, వేరే ఏదో కారణం వుండే వుంటుంది. ఆలోచించుకోవాలి. వెనకాల ఎవరో వుండే వుంటారు. కాబట్టి వెళ్ళక' అని చెప్తుంది. 'అయినా వాడు తమ్ముడే! సహజంగా మంచివాడే. పోరపాటు చేసానని చెప్పాడు. పోరపాటు మన్నించి, మనలో పెట్టుకొంటే, నీకే గొడవుండదు కదా! వాడు మాటిమాటికీ రావటం, వాడిని నువ్వు తన్నడం ఎందుకు?' ఇలా చాలా చెప్పి, చివరికీమాట చెబుతుంది. ఎంత బాగా చెప్పిందంటే, మనం చెప్పగలమా అలా? 'తన్నులు తిన్నవాడు వెంటనే వచ్చాడంటే, ఏదో వెనక బెట్టుకొనే వచ్చాడు కదా! తప్పకుండా నీకిది నష్టాన్ని కలిగిస్తుంది. కష్టాన్ని కలిగిస్తుంది. అపజయం కలిగిస్తుంది. కాబట్టి వెళ్ళబోక' అని చెప్తుంది. తార, రామాయణంలో చాలా

మహోత్కృష్టమైన పాత్ర. వాలి చచ్చిపోయేటప్పు డొకటి చెప్తాడు సుగ్రీవునికి. 'నువ్వు తెలివైనవాడివి కాదు, మంచివాడివి. ఆయన వల్ల నన్ను జయించావు. తార చెప్పినమాట ఎప్పుడూ వేదవాక్కుగా పెట్టుకొని ఆచరించుకొంటూ వుండు బాగుంటావు. ఇది బాగా గుర్తు పెట్టుకో' అని చెప్తాడు. ఎందుకు ఆవిడకు 'తార' అని పేరు పెట్టారో మనం అర్థం చేసుకోవాలి. మార్గాన్ని చూపించగలది, ఏ మార్గం తరింపు మార్గం? తార అనే పేరు ఎందుకు వచ్చింది? ఇది వరకు తారను పట్టుకొని ప్రయాణం చేసేవాళ్ళు. తూర్పు తార rising star, ఉత్తర తార pole star తారలు దారి చూపిస్తాయి. భగవంతుడే తారకుడై యుంటాడు. భగవంతుడే మార్గంగా వుంటాడు. 'నేనే మార్గమును'[1] అని క్రీస్తు అనటంలో ఉద్దేశ్యమది. నేనే మార్గమంటే అర్థం భగవంతుని యొక్క తత్వం రూపు కట్టుకొనివచ్చి, ఎట్లా జీవించాలో మళ్ళీ గుర్తుచేస్తుంది. అది మనకు మార్గమవుతుంది. అట్లా మాటిమాటికీ వస్తూ వుంటాడు. మన మాస్టరుగారు కూడా అలావచ్చి, 'ఇట్లా ఉండండి, హాయిగా వుండొచ్చు' అని చెప్పారు. మాస్టరుగారు, ఎవరన్నాపోతే ఊళ్ళో వున్న తన అనుయాయుల నందరినీ పిల్చి, ఆ పోయినవాడి శరీరాన్ని స్మశానానికి తీసుకొనివెళ్ళి, స్మశానంలో వాడు కాలేంతవరకు వీళ్ళు చూసేటట్లు చేసేవారు. ఏమిటి ఉద్దేశ్యం? చావంటే భయం పోవడంకోసం. ఆ శరీరం పూర్తిగా ఆహుతి అయిపోయిన తరువాత, అక్కడకక్కడ అందరినీ కూర్చోపెట్టి, వాడిట్లా వెడతాడు, అట్లా వెడతాడు. ఆ తరువాత వాడిని పితృదేవతలు మళ్ళీ వాడు ఇంకో మార్గంలో తిరిగి వచ్చేటట్లు చూస్తారు. ఇవన్నీ చెప్పేసి వచ్చేవారు. ఇవన్నీ ఎందుకు చెప్పాలి? మనలో ప్రతివాళ్ళకీ అన్నిటినీ మించిన భయం చావు కదా! మనం చచ్చిపోము, ఊరికే శరీరం పోతుంది తప్ప అని తెలియటం కోసం ఆయన ప్రత్యేకించి స్మశానానికి మనుష్యులందరినీ పిల్చేవారు. సంఘంలో ఒక్కడు పోతే, మిగతా అందరూ రావలసిందే! అట్లా రాకపోతే ఆయనకు కోపం వచ్చేది. ధర్మంలో మనల్ని ప్రవర్తింప చేయడానికి వచ్చే కోపమది! 'ఏమిటి నీకంత మించిపోయిన పన్లున్నాయా? నాకంటే important పన్లు నీకున్నాయా?' అని అడిగేవారు. ఇంకా వాడిది మందమైన చర్మమైతే, 'నేను రేపు పోయినప్పుడు నన్ను ఎవరైనా తీసుకొనివెళ్ళాలి కదా! అందుకని ఈ రోజు నేను వాడిని తీసుకొని వెడుతున్నాను. ఏమో! మిమ్మల్ని నమ్ముకొంటే లాభం లేదు' అనేవారు. ఆయన ఎంత ధీశాలి అంటే, తల్లితండ్రులున్న వాళ్ళెవరూ శవాన్ని ముట్టుకోరు, మోయరు. స్మశానానికి వెళ్ళరు. ఆయన శుభ్రంగా తండ్రి ఉండగానే, చిన్నతనంలోనే, ఏదైనా దిక్కుమాలిన శవం వుంటే, తనూ తన స్నేహితులూ కలిసి పాడికట్టేసి, నాలుగు ప్రక్కలా మోసేవారు. ఆయన మోసిన శవాలు ఇన్నీ అన్నీ కావు. తీసుకువెళ్ళి దహనం చేసేవారు. 'ఎందుకయ్యా అలా చేస్తావు? పెళ్ళాం పిల్లలున్నారు, తండ్రి వున్నాడు. అలా

వెళ్ళబోక, చేయబోక' అంటే మాస్టరుగారు వాళ్ళకి ఒకటే సమాధానం చెప్పేవారు. 'ఏమోనండి రేపు ప్రొద్దున నేను కూడా అలా పోవచ్చును కదా! మీకంటే నమ్మకం వున్నది. మీరు పోయిన తరువాత కూడా మీరు మనుష్యుల చేత పని చేయించుకోగలరని. నాకు నమ్మకం లేదు నేను పోయిన తరువాత వాళ్ళచేత పనులు చేయించుకోగలనని. అందుకని ఏదో ఇలా పదిమందికి చేస్తే, రేపు నేనుకూడా పడిపోతే, నన్ను కూడా, అలా పట్టుకుపోతారని చేస్తున్నానండి' అని ఓ చురక పెట్టేవారు. రేపు నువ్వు కూడా అట్లా దిక్కులేకుండా చచ్చిపోవచ్చు. అప్పుడు నీ గతేంటి? నీ శరీరానికి కూడా దహనసంస్కారాలు జరగాలి కదా అని చెప్పటం అన్నమాట! ఇదొక శిక్షణ. రెండవది చావంటే భయం లేకపోవటం. సి.వి.వి. మార్గంలో గానీ, శ్రీకృష్ణుని మార్గంలో గానీ, ఏ సద్గురువు మార్గంలో గానీ మొట్టమొదట నేర్పేదేమిటంటే, మనం చావం, మనం ఈ శరీరం కాదు. మనం ఈ శరీరాన్ని ఆక్రమించుకొనియున్న వాళ్ళం. ఆవేశించి యున్న వాళ్ళం తప్ప ఈ శరీరం మనం కాదు. ఈ శరీరం పోతుంది. ఈ శరీరం ఎల్లప్పుడూ ఇట్లాగే వుండదు. ముందు మారిపోతుంది. తర్వాత పోతుంది. 'అలా అయిపోయారేమిటండీ' అంటాడు ఎవడో ఒకడు వచ్చి. భయమేస్తుంది. 'ఏమిటి బాగానే వున్నాం కదా' అనుకుంటాం. రోజూ అద్దంలో చూసుకొని. ఒక 6 నెలల తర్వాత చూసినవాడికి తేడా కనిపిస్తుంది. రోజూ చూసేవాడికి కనిపించదు. లేదండీ బాగానే వున్నానంటే, లేదండీ చాలా మారిపోయారు. ముసలికళ పడిపోయింది. మీరు పౌడర్లు, క్రీములు పూసి ఏం చేసినా, శరీరం ఎట్లాగూ ముసలిదై పోతుంది. అది దాని తత్వం. ఆ తత్వం తెలుసనుకో ఆ ఖర్చు, ఆ కాలవ్యయమూ వుండవు. పుట్టిందేదీ పోయేదేమీలేదు. కేవలం రూపాలు మారుతూ వుంటాయి. సి.వి.వి. గారి మొదటిపాఠం కూడా 'చావనేది లేదు, మనం చావం' అని చెప్తారు. మనకి చావుని గురించిన భయం పోవాలంటే ఏం చేయాలి? ఎవరింట్లోనైనా మరణం జరిగిందనుకోండి అక్కడకు వెళ్ళాలి. చాలా మందికి ఎవరైనా మరణించారంటే, వాళ్ళింటికి వెళ్ళడమే భయం కదా! ఎందుకు భయం? ఉన్నది పోతుందేమోనని కొంతమందికి భయం. కొంచెం పోతేనేగానీ ఆ భయం పోదు. అందుకొస్తుంది ఏలినాటిశని. మనకే భయాలున్నాయో, ఆ భయాలమీద మాత్రమే పనిచేస్తాడు భగవంతుడు. ఆ భయం పోతే, ఆ event అవటం, అవకపోవటంలో తేడా ఏమీ వుండదు. తేడా వుండదు కాబట్టి అవకపోవచ్చును కూడా. అవటంవలన నీలో కలుగవలసిన మార్పులు, అవకుండానే జరిగితే, ఇంక ఆ event అవవలసిన అవసర మేముంది? అదే మాస్టరుగారు వ్రాస్తారు 'మాస్టర్ సి.వి.వి. గారి సాధనమార్గంలో వుండేవారికి చిత్రమైన పద్ధతులలో వారిలో వుండే పరిమితత్వం తీసేస్తారని'. వ్యాపారం

మునిగిపోతుందేమో ముందు ముందు. ఇప్పుడు బాగానే వుంది అనుకోవచ్చు. ఉంటాయి కదా భయాలు. ఉద్యోగం పోతుందేమో అని భయపడేవాళ్ళు లేరూ? మనం పోతామేమో అని భయపడేవాళ్ళు లేరూ? లేకపోతే మనవాళ్ళెవరైనా పోతారేమో అని భయపడేవాళ్ళు లేరూ? ఏవో పిచ్చి భయాలుంటాయి. మొత్తం వ్యాపారమంతా పోయినట్లు, రోడ్డుమీద అడుక్కు తింటున్నట్లు కల వచ్చిందనుకో. కలలో అనుభవించేస్తే, ఆ పని ఆయిపోతుందన్నమాట! ఎందుకంటే అది అనుభవానికి వచ్చేసింది కదా! లేకపోతే మనవాళ్ళెవరో పోయినట్లు అనుభవించేస్తాం. మనకున్నది పోయినట్లో, మనమే పోయినట్లో, ఏం రాకూడదా? అంతకన్నా శుభ్రమైన కల ఇంకొకటి లేదు. వస్తే అలాటి కల రావాలి. ఎవరికైనా వస్తే తెలుస్తుంది. దాంట్లోంచి చాలా పరిమితత్వం. Limitation దాటాము. మనని ఉరి తీస్తున్నట్లు కల వస్తుంది. మన ముందొకడు, వాడి ముందొకడు, వాడి వెనకాల మనం వెడుతూ వుంటాము. వాడిని ఉరి తీసేస్తారు. చూస్తూ వుంటాము. మనకి కూడా అంతేకదా అని. రెండవసారి ఇంకొకడు వెడతాడు. వాడిదై పోతుంది. మనవరకూ వస్తుంది. అందులో పెట్టేస్తారు బుర్ర. ఆ తరువాత ఏమవుతుందో తెలియదు. మెలకువ వచ్చేస్తుంది. అలా కల వచ్చిందనుకోండి భయపడుతున్నారా? కలకదా! అలా జరిగిందనుకోండి అప్పుడు ఇదంతా కల అని తెలుస్తుంది. ఇది కల. ఇదేం కలా? మన భావాలతో అల్లుకొన్న సత్యమిది. భావం లేకపోతే? ఎదురుగుండా మనిషి వున్నాడండీ, మనం ఆలోచించుకుంటూ ఎక్కడకో వెళ్ళిపోయామనుకోండి. మద్రాస్ వెళ్ళిపోతాం ఆలోచనలో. ఎదుటి మనిషి మనకి లేడు కదా! అదేమిటి ఉన్నాడు కదా! ఉన్నా నాకు లేడు. నేను లేను ఆ భావం ఏ భావనా లేదనుకోండి మనమే వున్నాం. అప్పుడు ఏమిటట? ఇవి చాలా ముఖ్యమైన విషయాలు. భగవంతుడు మనల్ని తరింప చేయటమంటే రెండు రకాలుగా చేస్తాడు. తట్టుకోలేని వాడికి కాస్త బెల్లం ముక్క పడేస్తాడు. తట్టుకొనే వాడికి బెల్లం ముక్క కోరని స్థితి కల్పిస్తాడు. రెండూ గురువు ద్వారానే చేయవచ్చు. అసలు బెల్లంముక్క తినకపోతే చచ్చిపోతున్నామనుకోండి కొంచెం బెల్లంముక్క ఇస్తాడు కొన్నాళ్ళదాక. అప్పుడు ఏదో ఒకరోజు ఎవడోవచ్చి, ఏదో రూపంలో, నీవు బెల్లం తింటే చస్తావంటాడు. బెల్లం కంటే చావటం ఎక్కువ భయం కదా! అందుకని బెల్లం మానేస్తాడు. బెల్లం కావాలా? చావు కావాలా? అని అడిగాడనుకోండి. బెల్లం వద్దు. మరీ అంత బుద్ధి లేనివాడిని కాను. బెల్లం తినను. ఇట్లా వుంటానంటాడు. అయింది కదా! రోగం కుదిరింది కదా! రోగం ఎట్లా కుదిరింది మనకి? అదే Homoeo Theory. ఇంతకన్నా పెద్ద కష్టం వస్తే, చిన్న కష్టం మర్చిపోతాము. ఎవరో పోయారంటే ఏడుస్తూ కూర్చున్నాము. ఎవడో friend వచ్చి ఒరేయ్ రాకపోతే

ఉద్యోగం తీసేస్తారుట అంటే ఇవన్నీ మర్చిపోయి office కి పోమూ? అట్లా కూడా చేస్తాడు. జీవితంలో సన్మార్గంలో వెళుతున్న వాళ్ళకి ఇటువంటివన్నీ జరుగుతూ వుంటే, చూస్తూ వుంటాం. ఇవన్నీ ఏమిటంటే భావమయమైనవి. ఈ శ్లోకంలోని మొదటినామం అత్యుత్తమమైనది. అశోకస్థితి. అది ఆయన స్థితి. తనంతటివాడిగా చేయాలి కదా మనల్ని. నన్ను తలచినవానిని, నా అంతవానిగా చేస్తానని కదా వాగ్దానం. మరి అట్లా చేయాలంటే, ఇవన్నీ పెట్టుకొని కూర్చుంటే మనకెట్లా తెములుతుంది? అందుకని కాస్త అక్కడక్కడ గిల్లి చూపిస్తూ వుంటాడు. మేకులు కొట్టినా నువ్వు ఏడవవా అంటే ఏడవనన్నాడు. అయితే కొట్టనా అంటే కొట్టమన్నాడు. కొట్టించుకొన్నాడు ఒకాయన. నువ్వా, శరీరమా అంటే, నేను శరీరం కాదన్నాడు. మనం అనగలమా? ఒక లెంపకాయ కొట్టి ఎలా వుందంటే, నొప్పిగా వుందంటాము. ఆయన ఏం చేసినా, నా శరీరంతో నాకు సంబంధం లేదని చెప్పాడు. అయితే మేకులు కొడతామన్నారు. కొట్టండన్నాడు. ఏమిటిది? అంటే భావస్థితిలో అంతవరకు వెళ్ళచ్చు. మనకి మామూలుగా చిన్న చీమ కుడితే, ఆ రోజు office మానేసేంత పరిస్థితి వస్తుంది. అక్కడ కూడా వున్నాం మనం. అక్కడ నుండి మొదలై, ఆకాశం ఉరిమిందనుకోండి. మనకు భయం. ఆకాశం ఉరిమితే మనకెందుకు భయం? దేనికైనా మనం భయపడడానికి సిద్ధంగా వుంటాం. ఆ స్థితి నుండి దేనికీ భయంలేని స్థితికి రావాలి కదా! మార్గం వుంది కదా! ఆ మార్గంలో నడిచి చూపిస్తారు వాళ్ళు. అందుకు భగవంతుడు ఈ రూపాల్లోకి దిగిరావటం. సిద్ధుడి రూపంలో భగవంతుడే వుంటాడు. ఆత్మ రూపంలో భగవంతుడే వుంటాడు. నడచి చూపిస్తూ వుంటాడు. అప్పుడు మనకి కొంచెం ఓహ్! ఆయన చేస్తూ వుంటే, మనకేం రోగం? మనమూ చేయవచ్చు అనిపిస్తుంది. అనిపించి చేస్తూ వుంటాము. ఇట్లా తరింపు మార్గాన్ని ఇచ్చే ఒక తారగా భగవంతుడు మనయందు కరుణ గలిగియుండి, వాత్సల్యం కలిగియుండి నేర్పుకుంటాడు. పాపం ఆయనే నేర్పుతాడు. తనే ఇంతమందిగా విడివడ్డాడు. సముద్రంలో అలలు అలా బయటకు వెళ్ళిపోవుగా! మళ్ళీ సముద్రంలోనే కలుస్తాయి. అలాగే ఇంతమందిగా విడివడి, మళ్ళీ తనలోనే అందరినీ కలుపుకొంటాడు. నిజంగా మనం మన గురించి చేసుకొనే భావనలన్నీ కూడా ఒక్క ముక్కలో చెప్పాలంటే హుళక్కి. 'ఈ మాట అందరికీ చెప్పకూడదు. చాలా రహస్యం. చెప్పినా నీ గుండె పగలదు గాబట్టి నీకు చెబుతున్నా' నంటాడు రాజవిద్యా రాజగుహ్యంలో అర్జునునితో శ్రీకృష్ణుడు. 'నీవు లేవు. ఉన్నది నేనే' అని చెప్తాడు. ఏమిటది? అంతకన్నా పెద్ద రహస్యం ఏదీలేదు. ఆయనే మంటాడంటే, ఇది చాలా రహస్యమైన విషయం. రాజవిద్య ఇది. విద్యల్లోకెల్ల రాజు. రాజుల దగ్గర వుండే రహస్యం వుంటుంది. రాజుల దగ్గర వుండే రహస్యాన్ని ఛేదించలేము. బ్రాహ్మణుల దగ్గర రహస్యం వుండదు. రాజుల

దగ్గర వుంటుంది. అది ఎంత రహస్యమంటే రాజగుహ్యా మన్నాడు. అయినప్పటికీ నీకు చెప్తాను. ఎందుకంటే నీకు శ్రద్ధ వున్నది. అసూయ లేదు. అందుకని చెప్తున్నాను. జాగ్రత్తగా విను అంటాడు. మొత్తం ఎన్నిసార్లు చెప్పినా ఏం చెప్పాడనిపిస్తుంది. ఏమిటా రహస్యమంటే, ఏమీలేదు నువ్వు లేవని చెప్తాడు. అదీ! ఏమీలేదు అని, 'నువ్వు లేవు. నేనే ఉన్నాను' అని అంటాడు. వాడే నేను గా వుంటే, నేను వేరుగా వున్నానని నేను అనుకుంటున్నా నన్నమాట! వేరే branch పెట్టామనుకోండి office కి, branch లో కూర్చున్నవాడు branch వాడిదే అనుకుంటే, మనం ఊరుకొంటామా? వాడి దగ్గరకెళ్ళి, branch నీది కాదు, నాది అని చెప్తాం కదా! అదేమిటి సార్? ఇన్నాళ్ళ నుంచీ నేనే చూస్తున్నాను కదా అంటే అది నిజమే! కానీనాదని చెప్పమూ? అట్లాగే వాడే 'నేను' గా వస్తే, మనం వేరుగా వున్నామని భావన చేసుకుంటూ, ఆ భావన ఆధారంగా ఇంత అల్లుతాము. పెద్ద పెద్ద చేటలంత అల్లేస్తాం. ఒరేయ్ ఈ అల్లేసినదంతా ఏమీలేదు. ఇదంతా నువ్వు అల్లుకున్నావు తప్ప, అసలు నువ్వే లేవు నీదేమిటంటాడు. నువ్వే లేనప్పుడు, నీదేమిటి? మరెవరున్నారు? నేనే ఉన్నాను. నువ్వు కాదంటాడు. అదే అంటాడు అర్జునుడితో, నీకు గుర్తు లేదు. నేనే నువ్వుగా వున్నావని. నాకు గుర్తుంది. నేనుగా వున్నానని. అందుకే ఈ problems నీకు. నాకేమీ problem లేదంటాడు. ఆయనకు ఒకడు చచ్చాడని కానీ, ఒకడు పుట్టాడని కానీ ఏమీలేదు. అవతల వాళ్ళు నవ్వుతూ వుంటే, పోనీగదా అని తనూ నవ్వుతాడు. అవతలవాడు ఏడుస్తూ వుంటే, చూస్తూ వుంటాడు. ఎందు కేడుస్తున్నావని అడుగుతాడు. అదీ భగవంతుడి తత్వం. అసలు మనమెట్లా వున్నామో ఒకసారి చూసుకోండి. మనమంతా వున్నట్లు We are taking it granted. ఎట్లా వున్నాం? ఉండటం ఎట్లా జరిగింది? ఎప్పుడన్నా ఆ ప్రశ్న పుట్టిందా? పుట్టదు. అంత రహస్యంగా పెట్టాడు దాన్ని. మనమెలా గాలి పీలుస్తున్నాం? ఎలా గాలి వదులుతున్నాం? ఏనాడూ ఏదీ అనుకొని చేయలేదు కదా! మనం తిన్నదంతా ఎలా అరుగుతున్నది? అరక్కపోతే తెలుస్తుంది తప్ప, అరిగితే తెలియదు. అరిగితే అలా కొట్టుకొనిపోతూ వుంటాము. అరక్కపోతే అప్పుడు కాస్త ఆగుతాము. కదా! కన్నులు చూస్తూనే వున్నాయి. ఎలా చూస్తున్నాయి? చూస్తున్నంతసేపూ ఎలా చూస్తున్నాయన్న ప్రశ్న రాదు మనకి. చెవులు వింటున్నాయి. చెవిటివాడికి వినబడటం లేదు. మనకి వినబడుతున్నాయి. వాడికి వినబడటం లేదు. ఇది మన గొప్పతనం కాదు. మనకివ్వబడినది అని అనుకోవటం లేదు. ఒక గ్రుడ్డివాడిని చూస్తే, భగవంతుని పాదాలు పట్టుకొని వెక్కి వెక్కి ఏడవాలి. వాడిలాగ నాకు కూడా కళ్ళు లేకుండా చేయలేదని. కళ్ళిచ్చాడు కదా! కళ్ళిచ్చాడని మనకి గుర్తుందా? కళ్ళున్నాయని గుర్తుందా? ఇవన్నీ ఎంత ప్రస్ఫుటంగా వున్నాయో, అంత రహస్యంగానూ వున్నాయి.

అదీ తమాషా! అందుకనే చెప్తూ వుంటాడు కన్నుల లోంచి చూసేవాడు ఎవడు? నువ్వు కాదు. 'నేను' చూడటం మానేస్తే, డాక్టరు చెబుతాడు కనబడదండి అని. అంతే అలాగే సర్దుకొనిపొండి అని చెప్తాడు కదా! ఏం చేస్తాం? వినబడదు కొంతమందికి. ఏం చేస్తాం? మాట రాదు. ఏం చేస్తాం? వాడే మనలో మనలాగ వుంటూ, మనలోంచి చూస్తూ, మనలోంచి వింటూ, మనలోంచి రుచి చూస్తూ, ఇవన్నీ మనం చేస్తున్నట్టుగా అనుకుంటూ వుంటే అనుకోనిస్తూ ఊరుకుంటాడు. ఈ అనుకోవటం వలన మనం రకరకాల బాధల్లో పడతాం. ఈ అనుకోవడం లేని స్థితి అశోక స్థితి! ఒక్కొక్క కష్టం లోంచి ఒక్కొక్క మనిషి పెరుగుతాడు. ప్రతి సుఖంలోనూ మనిషి చతికిలపడతాడు. అందుకని కుంతీదేవి కష్టాలే ఇయ్యి నాయనా! అప్పుడే నీవు మాకు ఎక్కువ అర్థమవుతున్నావంటుంది. మనం కష్టాలే ఇమ్మని అడగనక్కర లేదు. ఎందుకంటే అంత స్థితి లేదు కాబట్టి. మేకులు కొట్టించుకున్నంత చేయలేం కదా! కాకపోతే కష్టం వచ్చినప్పుడల్లా మార్పుకి వచ్చిందని, మనలో లోతులు పెరగడానికి వచ్చిందని, మనలో చైతన్యం వృద్ధి చెందడానికి వచ్చిందన్న భావన వుంటే చాలు. ఆధ్యాత్మిక సాధనలో ఇది చాలా ముఖ్యమైన భావన. భావన వుండటం వల్ల కష్టం చిన్నదవుతుంది. Example చెబుతున్నాను మా అబ్బాయి చిన్నపిల్లవాడుగా చావుబ్రతుకులలో వున్నపుడు మాస్టారు వచ్చి మందేస్తే, మళ్ళీ ఆయన్ని న్యూకాలనీలో కారులో దింపుతూ వుంటే, ఆయన నాకు చెబుతారూ పాండవులకు అభిమన్యుడు పోయాడు. ఉప పాండవులు పోయారు. కృష్ణుడంత మాత్రాన పాండవులకు లేడనా? ఉన్నాడు కదా! మరి అయినా పోయారు కదా! ఇలా చెప్పారు. ఏమిటర్థం? ఊరికే గిల్లి చూడడమన్న మాట! అటువంటిది ఏమైనా వుంటే రెడీగా వున్నావా అని. ఎప్పుడూ ఆధ్యాత్మిక సాధనలో ముందు కెడుతున్నకొద్దీ చురక లెక్కువ వుంటాయి. నీకు దేనిమీద పట్టు వుంటుందో, దాన్ని ముట్టుకొని చూస్తారు. ఎద్దు పుండు కాకికి నొప్పా? అన్న సామెతగా వుంటుంది సాధన. ఎందుకంటే ఆ భయాలు పోవాలి. ఆ భయాలు పోతేగానీ నువ్వు ఉద్ధరింపబడవు. ధర్మరాజుకి మయుడు సంపాదించిన సభ అబ్బో! చాలా గొప్పగా వుంటుంది. అది వుంటే వీడు బాగుపడడని తెలిసిపోయింది. ఒక్కోసారి మనం పెట్టుకున్న వ్యాపారాలు, మనం పెట్టుకున్న ఆస్తులు మనల్ని పాడుచేస్తాయి. మనచుట్టూ వుండే మనుష్యులు మనల్ని పాడుచేస్తున్నారనుకోండి, అక్కడ నుండి మనల్ని మనం ఉద్ధరించుకోవాలనుకొన్నాం అనుకోండి. అక్కడనుండి వాళ్ళని పిలక బట్టుకొని లేపి, ప్రక్కన పెట్టేయాలి. అటువంటివి భగవంతుని యొక్క సాధన చేసుకునేవారి జీవితంలో జరుగుతాయి. ఏం జరుగుతాయంటే, టక్కున ఇక్కడనుండి వేరే చోటుకి, ఎవ్వరూ లేనటువంటి చోటుకి transfer అయిపోతుంది. అప్పుడు ఈ బాదరబందీ అంతా వుండదు. సాధన చేసుకోవచ్చు. లేకపోతే పెద్ద

అనారోగ్యం వచ్చి, అందులోంచి వాడి పరిస్థితులన్నీ మారతాయి. ఓ పెద్ద ఇబ్బంది వ్యాపారంలోనో, ఉద్యోగంలోనో వచ్చి అందులోంచి మార్పు. ఈ మార్పుల్లో పెరుగుతారు తప్ప, లేకపోతే పెరగరు. అందుకని ఏదైతే కష్టమని అనుకొంటామో, అది సాధనపరంగా తీసుకొంటే, దాంట్లోంచి భగవంతుడు మనకిచ్చే శిక్షణ వుంటుంది. మనకి ఆ భయం పోవటం కోసం ఇస్తున్నాడు. మనం భయగ్రస్తులుగా ఉన్నంతకాలం, పసిపిల్లలలాగ ఎక్కువ ఆధారపడి వుంటాం. మనల్ని పెంచుకోవాలి కదా ఆయన! మనల్ని పెంచుకోవడంలో భాగంగా ఏం చేస్తాడంటే, మనకి కాస్త ఎదురువేస్తాడు. అందులోంచి మనం పెరగటం వుంటుంది. ఆ పెరిగినప్పుడు అంతకుముందు భయపడినదంతా హుళక్కి అనిపిస్తుంది. ఎంతవరకు వెళ్ళచ్చయ్యా అంటే, ఇందాక చెప్పినట్లు చావు కూడా అలా దాటేయవచ్చు. చావనేది ఏమీలేదు అని తెలుసుకోవచ్చును. అది మనకు కఠోపనిషత్తులో ఇచ్చారు. అది దాటి వెళ్ళావంటే, చచ్చిపోతావని చెప్తాడు యముడు, నచికేతునికి. అక్కడ ఒక తోరణం వుంటుంది. దానిపై మృత్యువు అని వ్రాసి యుంటుంది. అటు వెళ్ళావంటే పడిపోతావు. పడిపోతే ఎక్కడి కెళ్ళిపోతావో? నాదేం లేదు అని చెప్తాడు. వెడతానంటాడు. వెడితే అంతే సంగతులు నీ ఇష్టం అంటాడు. ఈ కుర్రాడు ఇటునుండి అటు వెళ్ళిపోతాడు. ఉంటాడు. అదేమిటి? ఉన్నానే! మృత్యువు దాటినా ఉన్నానే అని అటునుండి ఇటు వెనక్కి తిరిగిచూస్తాడు. యముడు కనిపిస్తాడు. ఉన్నాను కదా అంటాడు. అవును వున్నావంటాడు. మరి ఇట్లా చెప్పావంటే, అది అంతే అంటాడు. ఆ పైన చూడు ఏం వ్రాసియుందో అంటాడు. అదే తోరణానికి అటు ప్రక్క జననం అని వ్రాసి యుంటుంది. అటునుండి ఇటువస్తే పుట్టాడంటారు. ఇటునుండి అటు వెళితే చచ్చాడంటారు. రెండూ లేవు, రెండూ వున్నాయి. ఉండీ లేకుండా, వున్నట్లుంటుంది సృష్టిలో. అదీ గొప్ప విషయం. అందుకనే 'నాసత్యం' అన్నారు. నువ్వు ఉన్నావా? అంటే ఉన్నావు. ఉన్నావా? అంటే లేవు. అదీ నాసత్యమంటే! న అసత్యమన్న మాట! Not untrue. అన్నీ అంతే! ఉంది అంటే వుంది. లేదంటే లేదు. 'యద్భావం తద్భవతి'[1] అన్నారు. మహర్షులకి గోడ వుండదు. మనకి వుంది. ఉండబట్టి మనం గోడలోంచి వెళదామంటే మొహం పగులుతుంది. ఆయనకు లేదు కాబట్టి గోడలోంచి వచ్చేస్తాడు. చెట్టు మనకి వుంది. కానీ సిద్ధుడికి వుండదు కాబట్టి చెట్టులోంచి వచ్చేస్తాడు. పులి గురించిన భావన మనకుంది. కాబట్టి అది మనల్ని మ్రింగేస్తుంది కదా! కానీ అదే పులిని సిద్ధుడిట్లా ముట్టుకొంటే, పిల్లిలా ప్రక్కన కూర్చుంటుంది. ఇవన్నీ వాడికి వీలుబడి, మనకు వీలుపడలేదంటే, ఏమిటి తేడా? అంటే భావాలు! ఈ భావాలన్నిటినీ దాటించే మార్గం మూడవ నామం 'తారః'[1]. ఇది దాటేలోపుగా మనకి రకరకాల త్రోవలుంటాయి కదా! ఆ త్రోవల్లోంచే ఏడుస్తున్నావు కదా అని పైకి

తీసుకొనివస్తాడు. అట్లా వదిలేయడు. ఏడుస్తూ వుంటే, చంక నెక్కించుకొంటాడు. కొంచెం నడవడం మొదలుపెట్టాక నడు, అని చెప్తాడు. ఇప్పుడు చంక నెక్కించుకోవేం అంటే, నడుస్తున్నావు కదా! నడు అని చెప్తాడు. అందుకని సాధనలో ముందుకెళ్ళిన వాళ్ళకి, వెనక వున్న వాళ్ళకంటే తక్కువ సహాయం లభిస్తున్నట్లుగా వుంటుంది. ఎందుకంటే వాడింక నడవాలి. చంక నెక్కినవాడు, నడుస్తున్న వాడికంటే గొప్పవాడు కాదు. 'మాకు భగవంతుడు పిలిస్తే పలుకుతాడు. మీకేమిటి అన్నీ కష్టాలు' అన్నాడనుకోండి. అట్లాగే వుంటుంది. కొన్నాళ్ళు పోయిన తరువాత నిన్నూ నడిపిస్తాడు. అప్పుడు నీకన్నా నేను చాలా ముందు వుంటాను అనుకుంటాడు వాడు. ఈ మధ్యలో ఈ ఉండీ లేని స్థితి మనకు వుంది. భగవంతుడు దానికి అతీతంగా వుంటాడు. మార్గంలో నడిచేవాడు దానికి అతీతంగా వుండడానికి ప్రయత్నం చేస్తూ వుంటాడు. ఈ మధ్యలో మనం వుంటాం కదా! వీళ్ళకి కూడా పరిష్కారాలున్నాయి. అవి స్తోత్ర పఠనాలు. చక్కగా స్తోత్ర పఠనాలు చేసుకుంటే, రక్షింపబడుతూ వుంటాం. ఎన్నాళ్ళు చేసుకోవాలీ, అని అడుగుతాం. ప్రతిదానికీ అడుగుతాం. మనకే అనిపిస్తుంది. ఇలా ప్రతిదానికీ అడుగుతూ వుండడమేనా? అని. దాన్ని చేరుకోడానికి ఏదైనా పద్ధతుందా? అని. మాస్టారిని మనకి కావలసినవన్నీ ప్రేయర్ లో అడగడం ఒక పద్ధతి. ఇవన్నీ ఇలా వుండగా, మాస్టారిని చేరుకొనే పద్ధతి ఏమైనా వుందేమో? అనిపించదూ? అనిపిస్తుంది ఏదో ఒకరోజు. ఇవి ఇట్లా వుంటూనే వుంటాయి. సముద్రంలో అలలెప్పుడూ వుంటూనే వుంటాయి. ఇది ఇలా వుండగా, ఈ ఒడిదుడుకులు దాటి, అవతలకెళ్ళే మార్గం, అలలు దాటి సముద్రంలోకి వెళ్ళే మార్గం ఏదైనా వుందా? అని. మనం ఉన్నాం, మనం లేము. అల వుందా అంటే వుంది. ఉందా అంటే లేదు. సముద్రమే అది. అల, సముద్ర తీరంలో వున్నవాళ్ళు అసలు మర్చిపోకూడదు. అల వుందా? లేదా? అని మామూలుగా అడిగితే, వుంది సార్ అంటాం. ఉందా అంటే అబ్బే లేదండి, సముద్రమే, సముద్రమే అలగా వున్నది అంటాం. సముద్రమే అలగా వున్నది అనటమే "సోహమస్మి'. సోహం, సోహం అనే మంత్రం అందుకిచ్చారు. అంటే సహ plus అహం. 'అతడే నేను'. అతడే నేను అనే స్థితి వున్నప్పుడేమవుతుందంటే, ఈ చుట్టుప్రక్కల వాళ్ళని కూడా అంత ఇబ్బంది పెట్టం మానసికంగా మనం పరిణతి చెందడం వలన. అదట్లాగే వున్నప్పటికీ కూడా మనకి ఇబ్బంది కాదు. రోజూ traffic లోంచి వెళ్ళాలనుకోండి ఇబ్బంది. traffic కి అలవాటు పడిపోయామనుకోండి. ఎట్లా వెడుతున్నావయ్యా ఇంత traffic లో అంటే, ఏముందండి మొదట్లో అట్లాగే అనుకొన్నాను గానీ, అలవాటైంది. సైకిల్ త్రొక్కాలనుకోండి. మొదట పడిపోతాం. త్రొక్కుతూ, త్రొక్కుతూ వుంటే అలవాటవుతుంది. ఇదీ అంతే! ఆ స్థితికి మనం చేరుకోడానికి ఈ మూడు నామాలూ.

‘అశోకస్థితి’ అంటే శుద్ధ చైతన్యస్థితి. అంటే భావములు లేక మనం మేలుకున్న స్థితి. మనం మేలుకుని వున్నాం. మనకు భావాలు లేవు. ఎవరు నువ్వు? అంటే వాడే నేను. ఇంక ఏం అడిగినా అదే! నాకింకేం తెలియదు. అదొక్కటే తెలుసు. అక్కడనుంచి భావస్థితి! భావస్థితిలో ఆనందాన్ని కలిగించేవి, ఇంకొకటి కలిగించేవి వస్తూ పోతూ వుంటాయి అలల్లాగ. అక్కడ పడవలో వున్నట్లుగా మనం తేలి వుండడానికి వాడి నామం, వాడి స్తోత్రం, వాడి ఆరాధన. ఆ తరువాత ‘తారః’ అనే నామం ద్వారా వాడిని చేరుకునే మార్గం. ఇట్లా మూడు స్థితులలో ఈ నామం ఇచ్చారు.

351, 352 శూరః, శౌరిః

శూరుడు అంటే ప్రతాపవంతుడని, ధైర్యవంతుడని, బలవంతుడని, పరాక్రమవంతుడనే భావాలు మనకి తడతాయి. అవరోధములు లేని వెలుగు కిరణములు కలిగిన వాళ్ళని 'శూరుడు' అంటాం. పదార్ధము వెలుగుకి అవరోధము కలిగిస్తుంది. పదార్ధము మందమైన కొలది సూర్యకిరణములకు కూడా అటు నుండి ఇటు వెళ్ళడానికి అనుమతి ఉండదు. ఒక గోడవలె వెలుగు కిరణములకు అవరోధము కల్పిస్తాయి. అదే పదార్ధము పలుచనయిన కొలది వెలుగు నిండుతూ ఉంటుంది. పదార్ధము ఎక్కువ అయితే చీకటి పెరుగుతుంది. అదే పలుచనయితే వెలుగు నిండుతుంది. అందుకే చీకటిలో భయం వేస్తుంది. వెలుగులో భయం ఉండదు. చీకటిలో దివ్యత్వము యొక్క ప్రభావము తక్కువ ఉంటుంది. ఎక్కడ వెలుగు ఎక్కువ ఉంటుందో అక్కడ దివ్యత్వము ఎక్కువ నిండి ఉంటుంది. అందుకని చీకట్లో ఉండకూడదు. చీకటి ఇళ్ళల్లో ఉండకూడదు. ఎప్పుడూ వెలుగు పారని గదుల్లో ఉండకూడదు. నిదురించేటప్పుడు కూడా గదిలో ఏ వెలుగూ లేకుండా నిదురించకూడదు. చిన్న bed light, ఒక అగరబత్తి పెట్టుకోవాలి. ఎప్పుడూ ఎదో ఒక వెలుగుతో ముడిపడి జీవించాలి. అదే 'అర్చిర్ మార్గము' అంటారు. భావములోనూ ఎక్కువ వెలుగుండాలి. చీకటి అజ్ఞానము. వెలుగు జ్ఞానస్థితి. ఏది, ఎప్పుడు, ఎలా చేయాలి? అన్న స్ఫూర్తి కలిగినవాడు వెలుగులో వున్నట్లు. అరే మర్చిపోయానే అంటే వెలుగు లేదన్నమాట. ఈ పని నిన్న చేసి వుంటె బాగుండేది అంటె లోపల వెలగటం లేదన్నమాట. వెలుగు ఎక్కడ వుంటే, అక్కడ సమయానికి స్ఫూర్తి వుంటుంది. ఎప్పుడు, ఎక్కడ, ఏ పని ఎట్లా చేయలో, ఎట్లా ప్రవర్తించాలో, ఎట్లా మాట్లాడాలో, అన్నీ బాగా తెలిసి యుండడానికి ఆధారమేమిటంటే మనలో ఉన్న వెలుగు. ఆ వెలుగు మన మనసు యందు ఎప్పుడూ భాసిస్తే, మనసు యొక్క తత్వం లేక నైజం ఏమిటంటే, ప్రతిబింబింప చేయటం. అది ఇంద్రియాల మీద ప్రతిబింబించేలా చేస్తుంది. సమస్తమూ భగవంతుడే అనే భావన మనకు వుందనుకోండి, అప్పుడు చెట్టును చూసినా, పుట్టను చూసినా, మనిషిని చూసినా భగవంతుడు గోచరిస్తాడు. ఎందుకని? భావన యందుండటం వలన, మనసు నందు ఆ భావన నింపడం వలన. మనసు నందు ఆ భావన నింపలేదనుకోండి అంతకు ముందు మనకున్న అవగాహన మాత్రమే మిగిలి ఉంటుంది. 'శూరః'[1] అంటే అవరోధము లేని వెలుగు కిరణములు కలిగినవాడు. అంటే ఏమిటి? పరమాత్మ నుంచి జీవాత్మకు వెలుగుగా దిగివచ్చిన తత్వం! జీవాత్మ నుండి అతని బుద్ధి, మనసు ఇంద్రియములు శరీరము ద్వారా అవరోధం లేకుండా ప్రసారం జరగాలి. జరిగిన వాళ్ళకి మనసులో కూడా

నిండుతాడు భగవంతుడు. మన మనుకొనే మార్గమనండి, భగవంతుడనండి, స్వామి అనండి పేర్లు చాలా పెడతాము. మనం అనుకొనే భగవంతుడే మనంగా వున్నామని కదా! అవస్థితి చెందడం వలన మనంగా వున్నాము. మనమూ, భగవంతుడు సమానమా? అంటే కాదు. ఎందుకంటే మనం అవస్థితి చెందడం వలన. సముద్రం అలగా వున్నది. ఆ స్థితి నుండి తరువాత స్థితికి దిగివచ్చేటప్పుడు అదే తత్వం దిగివస్తున్నదా? లేక మన స్వభావం అడ్డుపడుతున్నదా? సూర్యుడి వెలుగు మన ఇంట్లోకి రావాలంటే, కిటికీకి గాజు తలుపుందనుకోండి, ఇంట్లోకి వెలుగు లోపలకి వస్తుంది. చెక్క తలుపుందనుకోండి, మూసియుంటే లోపలకి రాదు. ఏమిటి తేడా అక్కడ? పదార్ధము యొక్క సాంద్రత తేడా! అంటే పదార్ధం మందంగా వున్నదా? లేక పలుచగా వున్నదా? పలుచగా వున్న పదార్ధం నుండి వెలుగు ప్రవహిస్తూ వెడుతుంది. ప్రసారమౌతుంది. మందంగా వున్న పదార్ధం నుండి వెలుగుకి అవరోధం కలుగుతుంది. అందుకనే ఆధ్యాత్మిక సాధన పేర అన్ని మతాలూ కూడా ఈ శరీరం మందంగా, మొద్దుగా, తమోగుణ ప్రధానంగా ఉండకుండా వుండేలా రకరకాల నియమాలు ఇస్తారు. సహజంగా శరీర గుణమేమిటంటే, తమస్సు! శరీరమెప్పుడూ విశ్రాంతి కోరుతూ వుంటుంది. అంటే కదలకుండా వుంటే బాగుంటుంది. పడుకొంటే బాగుంటుంది. నిద్ర లేవకుండా వుంటే బాగుంటుంది. అసలు నిద్ర పోలేదనుకోండి, మనం బ్రతకం. అసలు కూర్చోలేదనుకోండి, బ్రతకం. కాబట్టి రక్షణ కోసం తమస్సు అనే గుణం అవసరం. అది వుండవలసిన మోతాదు కంటే ఎక్కువగా వుంటే వెలుగుకి అవరోధంగా తయారవుతుంది. తమస్సూ ఉండాలి, రజస్సూ ఉండాలి, సత్వమూ ఉండాలి. మూడిటి మధ్యా సమపాలు ఉండాలి. కాఫీ, పాలు, పంచదార ఇందులో ఏది ఎక్కువైనా కాఫీ బాగుండదు కదా! అలాగే సత్వగుణం, రజోగుణం, తమోగుణం మూడూ సమపాళ్ళలో వుంటే, అందులోంచి సత్వాతీత స్థితి ప్రతిబింబించడానికి అవకాశం వుంటుంది. మామూలుగా మనుష్యుల్లో రజస్సు ఎక్కువగా వుండడమో, తమస్సు ఎక్కువగా వుండడమో జరుగుతుంది. తమస్సు ఎక్కువగా వుండడమంటే, మర్చిపోవడం, పన్లు వాయిదా వేస్తూ వుండడం, అది నెత్తిమీద కొచ్చేంతవరకు చేయం. ఆ రోజు ఎట్లాగూ చేయలేం. ఎందుకంటే మొత్తమంతా ఒకసారి కాదు కాబట్టి. ఎప్పటికప్పుడు చేయవలసిన పని వాయిదా వేయకుండా చేస్తే, ఎప్పుడూ హాయిగానే వుంటుంది. ఎప్పడైతే తమస్సు చేత వాయిదా వేస్తామో, అది బాగా పెద్దదై, ఏదో రోజు మీదపడుతుంది. అప్పడెట్లాగూ చేయలేం కాబట్టి దానికి లొంగిపోతాం. అది పరీక్షల విషయం లో సత్యం. మన శరీరం విషయంలో సత్యం. ప్రతి వారం తలంటుస్నానం చేయాలని తెలుసు. Time లేదు. చేయం. అది ఎప్పుడో ఒక రోజున ఒక రకంగా

పరిణమిస్తుంది. ఏదైనా వాయిదా వేస్తే, అది తమస్సుకి సంబంధించినది. ఎప్పుడూ పడుకుందామనిపిస్తుంది. లేకపోతే rest తీసుకుందా మనిపిస్తుంది. ఊరికే కూర్చుందా మనిపిస్తుంది. చద్దివి తిందామనిపిస్తుంది. మర్చిపోవడంటం విపరీతంగా వుంటుంది. ఎందుకు మర్చిపోతున్నాడుట అంటే తమస్సు ఎక్కువ వుంటే మర్చిపోతారు. రజస్సు వుండేవాడు మర్చిపోడు. మర్చిపోకపోగా అక్కరలేనివి కూడా గుర్తుపెట్టుకుంటాడు. ఇది నీకెందుకురా? అవసరం లేదు కదా! మర్చిపోరా అంటే లేదు అదికూడా గుర్తుంటుంది అంటాడు. అక్కరలేనివి గుర్తుండేవాళ్ళు కొంతమంది, కావలసినవి మర్చిపోయేవాళ్ళు కొంతమంది. ఇట్లా రజోగుణం వల్ల రకరకాల బాధలున్నాయి. అవసరం కన్నా ఎక్కువ ప్రతిస్పందించడం వలన బాధలున్నాయి. అవసరం కన్నా తక్కువ ప్రతిస్పందించడం వలన ఇబ్బందులున్నాయి. అవసరం మేరకు ప్రతిస్పందించడం వలన, ఎంతవరకు అనుభూతి నివ్వాలో అంత ఇస్తుంది. ఎక్కువ నీళ్ళు పోసామనుకోండి చెట్టుకి, కుళ్ళి చస్తుంది. తక్కువ నీళ్ళు పోసామనుకోండి, ఎండిపోయి చచ్చిపోతుంది. పోయాల్సినంతే పోయాలి. ఎక్కువ మాట్లాడామనుకోండి, ఇబ్బందులొస్తాయి. తక్కువ మాట్లాడామనుకోండి, ఇబ్బందులొస్తాయి. కానీ మాట్లాడాలంటే రజస్సు కావాలి. అది ఎక్కువగా వుంటే ఎక్కువ మాట్లాడుతాం. పనిచేయాలంటే రజోగుణం ఉండాలి. ఎక్కువ పనిచేస్తే ఇబ్బందులొస్తాయి. అసలు మాట్లాడకపోతే, ఏమిటండీ ముంగిలా మాట్లాడరు అంటారు. మరీ మాట్లాడేసే మనుకోండి అబ్బ, మరీ కష్టం బాబూ. చిన్నప్పుడు బాగా వస పోసారు కాబోలు అంటారు. ఎట్లా అయినా కష్టమే. అది అలా సమపాళ్ళలో వున్నప్పుడే ఈ వెలుగు కిరణములు ప్రవహించి, ప్రసారమై వెళ్ళటానికి అవకాశం వున్నది. The light waves can travel. అవతల వాళ్ళకి మన మాట, మన చూపు, మన నవ్వు, మన స్పర్శ వెలుగు యొక్క స్పర్శ నందిస్తుంది. మహాత్ములను చూస్తే ఆనందంగా వుంటుంది కదా! ఎందుకు ఆనందంగా వుంటుందంటే, వాళ్ళ చూపుల్లోంచి ప్రసారమయ్యేది ఆత్మతత్వం. వాళ్ళు నవ్వితే, నవ్వులోంచి వెళ్ళేది అది! ఎంత అందమైన ముఖం మాస్టరు గారిది. నావరకు అంత అందమైన ముఖం ఎవ్వరికీ లేదు. ఎంత బాగా నవ్వుతూ వున్నది. ఆ నవ్వు నుండి వెలుగు ప్రసారం మామూలు ఫొటో నుండి కూడ వస్తుంది. అంత చక్కటి బొమ్మ అది. నవ్వుతూ వుంటే, అంత వెలుగు రావడమేమిటి? మామూలుగా మనం నవ్వామనుకోండి, మన ఫొటో ప్రక్కన పెట్టిచూస్తే, చాలా సులభంగా తెలుస్తుంది. ఏమిటది అంటే, వెలుగు ప్రసారమవడానికి ఏమీ అడ్డుపడదన్నమాట! ఏమిటి అడ్డుపడదు? ముందు మనసు అడ్డుపడదు. మనసు అడ్డుపడకపోతే, ఇంద్రియాలు అడ్డుపడవు. ఇంద్రియాలు అడ్డుపడకపోతే, అంతర్ముఖంగా వున్నది బహిర్ముఖంగా చక్కగా ప్రవహిస్తుంది.

ఇటునుండి అటు, అటునుండి ఇటు. May we transact light అన్నారు కదా మాస్టరుగారు in terms of joy. అటువంటి వాళ్ళకు ఇటునుండి అటు వెళ్ళేది వెలుగే! అటునుండి ఇటు గ్రహించేది కూడా వెలుగే! మనబోటి వాళ్ళందరితో వాళ్ళున్నారుట అంటే అర్థమేమిటంటే, మనలో వున్న వెలుగుని దర్శిస్తూ ఉండగలిగారు గానీ, మిగతావి చూస్తే వాళ్ళు మనతో ఉండడానికి బొత్తిగా అవకాశం లేదు. ఎందుకంటే మన లోపల పెద్ద పెద్ద బండరాళ్ళు, కొండరాళ్ళు, ఇటుకరాళ్ళు అన్నీ వున్నాయి. ఇవన్నీ పట్టుకొని కూర్చుంటే అయ్యేపని కాదు. శూరత్వం అన్నది ఎక్కడ వున్నదీ అంటే భగవంతుడే తానుగా వున్నాడనే భావన వుండటం చేత. సోహమస్మి! ఆ భావన మనిషిలో వుండటంచేత, భగవంతుడే నామరూపాది సృష్టిగా వున్నాడని గుర్తుంటుంది. అది వున్నప్పుడే భగవంతుడు గుర్తున్నట్లు. మనమేదో కాసేపు పూజ చేసినప్పుడు రాముడు, కృష్ణుడు, మాస్టర్ సి.వి.వి. అని, తరువాత మామూలుగా వుంటే అది సాధన కాదు. ఎప్పుడు ఈ శూరత్వం అన్నది మనలో పనిచేస్తుందో, అప్పుడు ఎవరిని చూసినా భగవత్తత్వం గుర్తొచ్చి, తరువాత వారు గుర్తు రావాలి. ముందు వారు గుర్తొస్తే, భగవత్తత్వం చచ్చినా గుర్తురాదు. అదీ మాయ! మనకి బాకీ వున్నవాడు కనబడ్డాడనుకోండి, వాడి రూపంలో వున్న 'వాడిని' చూద్దాం అన్నది సాధన. బాకీ వున్నవాడు వచ్చాడు. వాడిని పట్టుకోవాలనుకున్నా మనుకోండి. సాధన జరగదు. భావనలో అత్మతత్వం నిండి వున్నట్లైతే, తానదే అని తెలిసినప్పుడు, మొత్తమంతా అదే అని గుర్తుంటుంది. మొత్తమంతా అదే అయినప్పుడు దాన్ని దర్శిస్తే, శూరత్వం వుంటుందక్కడ. మామూలుగా అయితే బలంగా వున్నాడు, ధైర్యంగా వున్నాడు, ఎవరినయినా కొట్టగలడు ఇవన్నీ మామూలుగా వున్న అర్థాలు. అది కాదు శూరత్వం. ఎట్లా వుంటుంది శూరత్వం అంటే, వాడు చూసే చూపులోంచి, ఆత్మయే దర్శిస్తూ వుంటుంది. ఎవరిని? ఆత్మని! దర్శిస్తూ వుంటే ఎదుటి వ్యక్తిలో కూడా అది వుంది కాబట్టి, ఇటునుండి వచ్చే చూపుకి అది ఆకర్షింపబడి, వాళ్ళూ వాళ్ళూ కలుసుకొంటారు. ఆ స్థితిలో శిష్యుడి స్వభావం శిష్యుడిదిగా వుండగా, గురువు శిష్యుడిలో శిష్యుడిగా వుండే ఆత్మతత్వంతో అనుసంధానం చేస్తాడు. ఇక ఆ శిష్యుడెక్కడికీ పోడు. ఎందుకంటే వాడికి తనయందు కారణము తెలియని ఒక అనుబంధం ఏర్పడుతుంది గురువు గారి మీద. ఏమిటి ఆ అనుబంధం అంటే, అత్మ సంబంధమైనది. ఎప్పుడైతే ఆత్మబంధం ఏర్పడిందో, మిగతా బంధుత్వాల కంటే అది మిన్నగా వుంటుంది. జన్మ జన్మలకీ అది వుండిపోతుంది. అలా కాకపోతే ఏమవుతుందంటే వాడికీ, మనకీ వున్న వ్యవహారాల పద్ధతి బట్టి కలిసివుండడం, కలిసి వుండకపోవటం, పోట్లాడుకోవడం, తన్నుకోవడం ఇవన్నీ వస్తాయి. ఇక్కడ చెప్పబడిన 'శూరః' అనే నామంలో భగవత్తత్వం 'అదే తాను' అనే భావనగా

వుంటుంది. అహమస్మి! 'అతడే నేనుగా వున్నాను'. అతడే ఈ చెట్టుగా వుంది. అతడే ఈ మనిషిగా వున్నాడు. అతడే ఈ జంతువుగా వున్నాడు అని గుర్తుపెట్టుకొని సాధన చేయాలి. అట్లాచేస్తే ముందది కనిపిస్తుంది. లేచిన దగ్గర్నుండి ఏం చూస్తున్నాము? మిమ్మల్ని మీరు అడగండి. ముందు అది కనిపించినవాడు సాధకుడు. ఇంకొకటి కనిపించినవాడు కాదు. ముందు అలా చూసిన వారు మనమెరిగిన మహాత్ములు. వారి పాదాలను మనం ధ్యానం చేసుకుంటున్నాం. ఎందుకు ధ్యానం చేసుకుంటున్నాం? ఈ స్ఫూర్తి కలగడం కోసమే! ఇది కలగకుండా ఎన్ని ధ్యానాలు చేసినా, ఎన్ని పూజలు చేసినా, ఎన్ని వ్రతాలు చేసినా, ఎన్ని గుళ్ళు దర్శించినా, ఎన్ని పుణ్య క్షేత్రాలకు వెళ్ళినా ఏమీ ఉపయోగం లేదు. అది దర్శించేవాడికి ఇక్కడున్న ఈ కృష్ణ విగ్రహం పాదాలు ముట్టుకుంటే, అందులోంచి జివ్వున ఆ తత్వం యొక్క స్పర్శ కలుగుతుంది. అలాకాదు బొమ్మ అని ముట్టుకున్నామనుకోండి, బొమ్మలాగానే వుంటుంది. చాలామంది మహాత్ములకు గుళ్ళో దేముడు నిజం! మనం మాట్లాడేసి వెళ్ళిపోవడం కాదు. అటునుండి ఆయన ఏం మాట్లాడతాడో వింటాడు. ఎందుకంటే దేముడు నిజం కాబట్టి. మనమైతే ఇటునుండి చెప్పేసి, ఇంటికి వచ్చేస్తాము. అంతేకదా! విన్నాడో లేదో తెలీదు. అందుకని ఇంకొకడికి చెప్తాము. ప్రక్కన ఇంకొకడుంటే వాడికి చెప్తాము. వాడూ వీడే కదా! ఇన్నీ అయినాక, ఆ ప్రక్కన ఇంకొకటి వుంది. అది కూడా చూద్దాం. ఒక గుడికి వెడితే ఒకటే దేముడు. వాడికి దండం పెట్టుకొస్తే చాలు. చుట్టూ, అక్కడపెట్టి, ఇక్కడపెట్టి, గుమ్మానికి పెట్టి, స్తంభానికి పెట్టి అన్నిటిలో వున్నాడు అనే భావనతో పెడితే ఫరవాలేదు. ఇంతమంది దేవత లున్నారనుకోవడం, వాడు వినలేదేమో అనుకోవడం మనకి 'రాయి' అయినప్పుడు వినలేదనిపిస్తుంది. అందుకని అది తానుగా వున్నాడు కాబట్టి, తను దర్శించే ముందు, ఆ భావనతో జరగాలి. 'భావములోన, బాహ్యము నందున' పాటున్నది కదా! నాదేం లేదు అంతా నువ్వేనని చెప్పడం 'గోవిందా' అని చెప్పడం. ఈ సమస్తానికీ యజమాని ఆయన. నేను కూడా లేను. వాడే నేనుగా వున్నాను కాబట్టి, నేను కూడా వాడి సొత్తే. నా శరీరం వాడి సొత్తే. కాబట్టి ఏం చేసినా 'గోవిందా' అని గుర్తుండే వాడు భక్తుడు. అలా గుర్తులేనప్పుడు ఈ వెలుగు ప్రసారం కాదు. అది గుర్తుందనుకోండి, వెలుగు ప్రసార మవుతుంది. అదీ ధర్మరాజు సాధన! ఎన్ని కష్టాలు పడుతున్నా, ఎదురుగా ఒక కర్ణుడో, శకునో, ధృతరాష్ట్రుడో, దుర్యోధనుడో వస్తే ధర్మరాజుకి లోపల తేడా పడదు. భీముడికి, అర్జునుడికి, ద్రౌపదికి తేడా పడుతుంది. ముందు తేడాపడిపోయి తరువాత సర్దుకొంటారు. ధర్మరాజుకి తేడా పడదు. ఇంత జననష్టం జరిగిన తరువాత దుర్యోధనుడు ఆ నీళ్ళలో దాక్కొని పైకి వచ్చినప్పుడు కూడా ఆయన చూసిన చూపు అలాగే వుంటుంది. అంతకుముందు మనకేం జరగలేదు వీడితో అన్నట్లుంటుంది. అదీ

పరాకాష్ట సాధనలో! మనబోటి వాళ్ళకి అది గుర్తురావాలి ధర్మరాజంటే! ఏమిటి ఇలా దాక్కున్నావు? నువ్వు మాలో ఒకడితో పోట్లాడు చాలు, అని అడుగుతాడు. ముందు, పాతవి వదిలేసేయ్ కలుసుందామంటాడు. వాడు ఒప్పుకోకపోతే నీ ఇష్టం నీకేది కావాలంటే అది చేద్దాం, అంటాడు. అప్పుడు కూడా సగం రాజ్యం ఇవ్వడానికి దుర్యోధనుడు ఒప్పుకోడు. మీలో ఒకరితో యుద్ధం చేస్తాను. మీరేనా ఉండాలి, నేనేనా ఉండాలి. ఇద్దరూ ఉండడానికి వీలులేదంటాడు. సరే ఎవరితో చేస్తావు? ఏ ఆయుధం పట్టుకుని చేస్తావంటాడు? ఎందుకట్లా ఇచ్చేసాడు అవతల వాడికవకాశం? అర్జునుడితో చేస్తాను గదతో చేస్తానన్నా డనుకోండి. కష్టం. గదాయుద్ధంలో దుర్యోధనుడు చాలా ప్రావీణ్యం గలవాడు. సహదేవునితోనో, నకులునితోనో చేస్తానన్నా డనుకోండి. ఏమిటి ధైర్యం అంటే, అదే ధైర్యం. అందుకే ధర్మరాజు కథానాయకుడవుతాడు మహాభారతంలో. అందుకనే శ్రీకృష్ణుడు సభలో కూడా, ఇవన్నీ ఎందుకురా? ఆయనకు కోపం రాదు. వస్తే ఇదంతా మండిపోతుంది, అని చెప్పాడు. సత్యవాక్కు పలికే వాడు కదా శ్రీకృష్ణుడు. 'సత్యవాక్ సత్యసంకల్ప సత్యభామారతోజయీ' కదా శ్రీకృష్ణుడు. ఆయన వాక్కు సత్యం. సత్యం ఆయన స్వభావము. 'భామ' అంటే స్వభావము. అటువంటి సత్యవంతుడైన శ్రీకృష్ణుడంటాడు ఆయనకు కోపం వస్తే, ఈ మొత్తం ఏమీ వుండవు. కానీ ఇన్ని చేసినా ఆయనకు కోపం రాదు. చూస్కో దాని సంగతి, అని అంటాడు. అదీ ధర్మరాజు సహనం! రాముడి జీవితంలో కూడా అట్లాగే కనిపిస్తుంది. అష్టకష్టాలు పెట్టేసి, పెళ్ళాన్ని ఎత్తుకొనిపోతే, రాళ్ళేసుకొని, రప్పలేసుకొని ఆ సముద్రం దాటివెళ్ళి, నానాగడ్డీ తిని యుద్ధం చేస్తే, ఒకరోజు రావణాసురుడు వస్తాడు. వాడిని చూడగానే ఎట్లా ఉండాలీ మామూలుగా? చూడగానే మొహం కండలు చించుకోవద్దూ? నవ్వుతూ చూస్తాడు రావణుణ్ణి. ఓహో, ఎంత బాగున్నావురా నువ్వు అన్నట్టుగా అనుకొంటాడు లోపల. రావణుని యొక్క దర్పం, దర్జా, అందం, వైభవాన్ని చూసి ఆనందిస్తాడు. మనం ఆనందించగలమా? మనని ముష్టితిప్పలు పెట్టి, మూడు చెరువులు త్రాగించిన వాడెవడూ లేడు. ప్రతీవాళ్ళ జీవితంలో ఏవో చిన్నచిన్నవి వుంటాయి ఇబ్బందులు. వాడది అన్నాడు, ఇదన్నాడని తప్ప, అదేపనిగా జన్మంతా మనల్ని కక్షకట్టి, పగబట్టి సాధించిన వాళ్ళుండరు. అటువంటి రావణుణ్ణి చూసి, రాముడు ఆవేశం తెచ్చుకోలేదు. రావణుని కళ్ళల్లో చూసేసరికి ఇద్దరిలో నున్న ఆత్మతత్వం ఏకీభావం చెందుతుంది. అది కారణంగా రావణాసురుడు మరుసటి రోజు చిత్తుక్రింద ఓడిపోతాడు. అట్లాగే శ్రీకృష్ణుడు చేత చూడబడిన వాళ్ళకి కూడా అటువంటివి జరుగుతాయి. ధర్మరాజు, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు వీళ్ళందరూ ఎదుటి వ్యక్తిలో ఏ ఒకటైతే ఈ మొత్తంలో వున్నదో దానిని దర్శనం చేస్తారు. అట్లా దర్శనం చేసేవాళ్ళకి

అపజయం వుండటానికి వీలులేదు. ఇంకొకటి దర్శనం చేసేవాళ్ళకి అపజయం కలిగే అవకాశం వున్నది. భాగవత మార్గంలో చెప్పబడేది ఏమిటంటే, ముందు దానిని దర్శనం చేసుకోమని. అదే మనకి నారాయణ కవచంలో ఉపదేశింపబడినది. సమస్తమూ నారాయణుడుగా దర్శించమని. ఆ దర్శనం చేస్తున్నంతసేపూ ఆ చైతన్యం యొక్క ప్రసారం అట్లా వుంటుంది. ఆ వెలుగు యొక్క ప్రసారం అట్లా వుంటుంది. అది కారణంగా నువ్వు బలవంతుడివిగా వుంటావు. విశ్వామిత్రుడు, వశిష్ఠునితో రకరకాలుగా భేటీవేస్తే, ప్రతిసారీ వశిష్ఠునిదే పైచేయి అవుతుంది. కారణమేమంటే, వశిష్ఠునిలో విశ్వామిత్రుడు చూసేది ఆత్మతత్వం కాదు. విశ్వామిత్రుడిలో వశిష్ఠుడు చూసేది ఆత్మతత్వం. మొత్తం సృష్టిలో వుండే రూపాలకి ఆధారం ఏమిటంటే ఆత్మతత్వం! దానితో అనుసంధానం చెందితే, సరాసరి ఆ ఎదుటిరూపంతో మనకి మిత్రత్వం ఏర్పడుతుంది. ధర్మరాజుని అజాతశత్రువు అనడానికి కారణమేమిటంటే, ఆయన మనసులో ఎవరూ శత్రువులు లేరు. ఆయన్ని ఎవరైనా శత్రువుగా భావన చేసుకొంటే వేరు. ఆయన మనసులో ఫలానా వాళ్ళ గురించి చెడ్డభావన గానీ, ఏహ్యభావం గానీ, నిరాదరణ భావం గానీ, విముఖభావం గానీ ఏమీలేవు. అదీ అజాతశత్రువు! అది సాధించిన వాడిని 'మైత్రేయు' డంటారు. సకలసృష్టి యందు వుండే జీవరాశులతో మిత్రత్వం కలిగినవాడు మైత్రేయుడు. మనలాగ పురుగు, పుట్రని చూసి ఇబ్బంది పడనక్కరలేదు బాధపడ నక్కరలేదు. ఆయన చుట్టూ వుండేవన్నీ కూడా ఆయనతో అట్లా మిత్రత్వం సాధించుకున్నవే! భగవంతుని యొక్క ఒక అస్తిత్వం ఏమిటంటే, తన మనసునందు ఏ విధమైన శత్రువులూ లేనిస్థితి. అట్టివాడు శూరుడు. అటువంటి వాడు కాబట్టే ధర్మరాజు నహుష ప్రశ్నలప్పుడు, యక్ష ప్రశ్నలప్పుడు తన తమ్ములని రక్షించుకున్నాడు. అలా దర్శనం చేయగలిగినవాడు కాబట్టే మహాప్రస్థానమప్పుడు కుక్కని స్వర్గలోకానికి తీసుకొని వెళ్ళకూడదంటే, అయితే నేనూ వెళ్ళను. కుక్కతో పాటే వుంటానని, చెప్తాడు. మనకి ఈ సాధకుల యొక్క జీవితచరిత్రలు అందుకు ముఖ్యం. వాళ్ళెప్పుడూ ఆ సమభావం నుండి దిగకుండా నిలబడి యుండటం చేత వాళ్ళ దగ్గర ఒకవిధమైన శౌర్యం వుంటుంది. భగవంతుని యొక్క శౌర్యం అటువంటిది. 'సమస్తమూ నేనే తప్ప వేరుగా లేదు కాబట్టి సమస్తమునూ నేనుగానే దర్శనం చేసుకుంటాను. కనుక నాకు మనవాళ్ళు, ఇంకోళ్ళు అని వేరుగా లేరు. వీళ్ళందరూ ఎక్కడికీ పోరు. నాలోకే వచ్చేస్తారు' అని శ్రీకృష్ణుడు చెప్తాడు. ప్రత్యేకంగా, తను వ్యక్తిగతంగా ఎవరినైనా చంపివుంటే, అది వారి direct absorption into him. శిశుపాలుని చంపితే ఆ తత్వం తనలోకే ప్రవేశిస్తుంది. పూతనను చంపితే ఆ తత్వం తనలోకే! ఎవరిని చంపినా సరే ఆ జీవుడిని తనలోకి అంగీకరించినట్లే నన్నమాట! అట్లా భాగవతంలో ఎక్కడ కృష్ణుని చేత

సంహరింపబడినా, అక్కడల్లా జరిగేది అదే. అందుకనే చక్రం పట్టుకొని, నిన్నివాళ కొట్టేస్తా నంటాడు, భీష్ముడితో. 'ఈ జన్మకిది చక్కటి పరిష్కారం. నీ చేతిలో మరణించడం కన్నా కావలసిన దేముంది? అలా కానిచ్చేయ మంటాడు' భీష్ముడు. కానీ అంతకుముందు ప్రణాళిక ఇంకొక రకంగా ఉండడం వలన సంహరించడు. ఈ సమస్తమైన కార్యములన్నీ కూడా వాక్కు యొక్క పరిపాలనలో వుంటాయి. ఎవరెవరి నుండి ఎటువంటి వాక్కులొచ్చినాయో దాన్నిబట్టి ఖాతా ఒకటిపెట్టి, జమాఖర్చులు లెక్కవ్రాసి యుంచుతారు. దాన్నిబట్టి వెళ్ళిపోతూ వుంటుంది. అందుకని 'శౌరి' అనే పేరు శ్రీకృష్ణునికి ప్రత్యేకంగా ఇవ్వబడిన నామం. అది భగవంతుని తత్వంలో ఒకటి. కారణ మేమిటయ్యా అంటే, సర్వకాల సర్వావస్థల యందు తానెవరో యెరిగి, తనచుట్టూ వున్నది తానే అని తెలిసిన వాడు. అలాంటి వారు ఎవ్వరూ లేరు. మొత్తం అలా వున్న వాడు కాబట్టి ఆయనకు 'శౌరి'[1] అనే నామం. ఇలా మనం వున్నప్పుడు మనకి జయమనేది తథ్యం! అంటే ఇక్కడుండే బలమేమిటయ్యా అంటే

బలమెవ్వడు కరిబ్రోవను, బలమెవ్వడు పాండుసుతుల భార్యను గావన్,
బలమెవ్వడు దితి పుత్రునకు, బలమెవ్వడు నాకు నీకు బలమౌ కృష్ణా!

ప్రహ్లాదునికి ఇంకొకటి లేదు. అందుకనే భాగవతోత్తముల గురించి చెప్పేటప్పుడు ఎవరితో మొదలు పెడ్తారంటే, ప్రహ్లాదునితో. ప్రహ్లాద, నారద, శుక, శౌనక, వ్యాస ఇట్లా. ప్రహ్లాదునికి నారదుడు గురువైనా, నారదుని మించిపోయాడుట. సమస్తమూ భగవంతుడే అనే భావన నుండి పీకినా రాడు. ఎన్ని రకాలుగా పీకినా రాడంతే! అతుక్కుపోయాడు. నీళ్ళల్లో వేసినా రాదు. నూనెలో వేసినా రాదు. నిప్పులో వేసినా రాదు. ఏం చేసినా రాదు. అన్నీ అదేకదా అంటాడు. ఏదైనా అదేకదా అంటాడు. నీళ్ళల్లో పడేయండి అంటే నీళ్ళు వాడేకదా అంటాడు. నిప్పులో పడేయండి అంటే నిప్పు వాడేకదా అంటాడు. అది మనం అసలు ఊహించలేము. The most aquarian soul అన్నమాట! The future of humanity అంటే The ideal of human being or the ultimate happening is Prahlada. ఎందుకట్లా వున్నాడంటే, ఇది వాడి శూరత్వం. హిరణ్యకశిపుడు శూరుడా? ప్రహ్లాదుడు శూరుడా? అంటే మామూలుగా అయితే వాడు వేసుకొనే దుస్తులు, పెట్టుకొనే ఆయుధాలు, వాడి జబ్బబలం చూస్తే హిరణ్యకశిపుడే శూరుడనిపిస్తుంది. కానీ ప్రహ్లాదుడు కదా మరి శూరుడు! ఎక్కడా చేతికి మట్టి అంటకుండా పని పూర్తిచేస్తాడు. వశిష్ఠుడు పోట్లాడకుండా జయించాడు విశ్వామిత్రుని. ప్రహ్లాదుడు పోట్లాడకుండా జయించాడు హిరణ్యకశిపుని. గాంధీమహాత్ముడు పోట్లాడకుండా జయించాడు British సామ్రాజ్యాన్ని. ఏది బలం? సత్యమే! అన్నిట్లో వున్న సత్యాన్ని దర్శనం చేస్తూ కూర్చోడమే ఒక మూల. అదే పనిచేస్తూ వుంటుంది. మనం చేయగలమా? British

వాళ్ళు సత్యాగ్రహం చేసినప్పుడు చాలామందిని చంపారు, కదా! గాంధీమహాత్ముని ఎందుకు చంపలేకపోయారు? ఈయన్ని చంపేస్తే పోయేది కదా అని మీరనవచ్చు. చంపలేరు. ఎందుకంటే ఎవరినైతే చంపాలో, వాడిలోనూ వున్నది అదే కాబట్టి అది చంపనివ్వదు. ఎందుకంటే వీడందులో వున్నాడు కాబట్టి. రెండుసార్లు ధర్మరాజు దొరుకుతాడు యుద్ధంలో. అయినా చంపలేదు. భీముణ్ణి, అర్జునుణ్ణి, దృష్టద్యుమ్నుని అందరినీ చుట్టూ కాపలా పెడతారు. వీళ్ళు ఊరికే అటూ ఇటూ పారిపోతూ వుంటారు. అదేమిటి నన్ను వదిలేసి పోతున్నారని పిలవడు. వీళ్ళని పట్టుకొని వుండడు. వాడూ 'శౌరి'! నిజమైన ప్రతాపం ఎవరిది? చాలామటుకు యుద్ధం చేయకుండా జయించిన వాళ్ళు. ఎందుకంటే ఆయన అందులో నిలబడటం చేత. దానికి పరాకాష్ట శ్రీకృష్ణుడు. నేను యుద్ధం చేయను గానీ, వుంటానంటాడు. ఈ శూరత్వం మనకుందా? దీనికి దైవము నందు నమ్మకం కావాలి. దైవమంటే ధర్మము. తాను ధర్మపరుడై, ధర్మము నందు నిలబడి, తనలో ఏర్పడిన ఆత్మవిశ్వాసం చేత ధర్మరాజు నిలబడగలిగాడు. అది వున్నవాళ్ళు మాత్రమే అటువంటి పనులు చేయగలరు. అందరూ చేయలేరు. హరిశ్చంద్రుని ఆత్మవిశ్వాసం అలా వుంటుంది. మనం దేవుణ్ణి కొలుస్తూనే వుంటాం. మళ్ళీ రకరకాలు జాగ్రత్తలు పడుతూనే వుంటాం. మనం ఉండడం విషయంలో గానీ, పోవడం విషయంలో గానీ, మనకున్నది ఉండడం, పోవటం విషయంలో గానీ మనకున్న ఆదుర్దా ఎంత? మనమంతా విష్ణు సహస్రనామం చదువుతూనే వున్నాం కదా! అంటే మనం చాలా తెలియని వాళ్ళుగా వున్నాం. మాయ చేత ఆవరింపబడిన వాళ్ళంగా కనిపిస్తాం. నేను మా తండ్రిగారి దగ్గర ఇటువంటివి చూసాను. ఆయన ఇల్లు తాళం పెట్టకుండా ఊరెళ్ళిపోతూ వుంటే, సగం దూరం వెళ్ళిన తరువాత గుర్తువచ్చింది, ఇంటికి తాళం పెట్టలేదని. కడప నుండి వెళుతున్నాం. ఆయన వెనక్కి వెళ్ళి తాళం వేసే ప్రశ్నే వుండేది కాదు. ఉంటే వుంటాయి, పోతే పోతాయి. ముందుకే వెళదాము. మొత్తం tour 10 రోజులు. బెంగుళూరు, మైసూరు, బృందావన్ గార్డెన్స్ మొత్తం అన్నీ చూసుకొని ఇంటికి రావాలి. ఆ రోజే లాల్ బహదూర్ శాస్త్రిగారు పోయింది. సగం దూరంలో గుర్తు రాగానే, ఆ.. ఉంటే వుంటాయి, పోతే పోతాయి. మనం పోదాం అని వెళ్ళిపోయాం. మామూలుగా అయితే రోజూ గుర్తు రావాలిగా! ఏమై పోతున్నదో? ఇంట్లో అవున్నాయి, ఇవున్నాయి అని. ఏమీలేదు. ఎవరికీ గుర్తు లేకుండా చేసారాయన. ఇంటి కొచ్చేసరికి ఏమీపోలేదు. పోయినా ఆయనకేమీ బాధ వుండేది కాదు. మనకేదైనా వుండకూడనిది అందులో వుంటే, రాముడు తీసేస్తాడు. Open గా వుంచాం కాబట్టి, వుండకూడనిది ఏమీ లేకపోతే వుంటుంది. అలా ధైర్యంగా వుండగలమా? త్రాచుపాముని ధైర్యంగా చేత్తో పట్టుకొని, ఇదికూడా రాముడే కదా! అని చెప్పారు. అంటే భగవంతుని యందు విశ్వాసం! భావంలో అది

పూర్తిగా నిండిపోయి, అదే ఇదిగా వుంది కదా ఇది రాముడే కదా! ప్రతీదీ రాముడిగా చూసేవారు సాధకులు, భక్తులు. వారినెవరూ ఏమీ చేయలేరు. అది కావాలి ఇందులో. ఈ సాధన మనకి నిలబడాలంటే, కాస్త ఏదైనా తేడాబడితే, ఏమైపోతాం? అని అనుకోకూడదు. ఏమై పోవటమేమిటి? ఏమీ అయిపోము. మళ్ళీ మనమే భగవద్గీత చదువుకుంటూ, శ్రీకృష్ణుని నమ్ముకున్న వాళ్ళెవ్వరూ నాశనం కారు అనుకొంటూ, మళ్ళీ జ్వరం రాగానే చచ్చిపోతాం అనుకుంటూ, ప్రాణభీతి వుండకూడదు. వాడున్నాడు వాడు చూస్తాడు అని, వాడిని మించి వుండడు. వాడిని చూడనప్పుడు ఇంకో భావం వుంటుంది కాబట్టి వుంటుంది. అన్ని విషయాల్లో కూడా ఆ స్థితిలో వుండేవాళ్ళకి జయమే! అపజయం వుండదు. అది మనకి ఈ 'శూరః'[1] అనే నామం. Let the light flow through you. Let the light flow through me. అదే గాయత్రీ మంత్రం, జపం, గానం అంతా అదే. 'తత్సవితుర్వరేణ్యం' ఆ వెలుగు నన్నావరించాలని, దానికోసం ఆ వెలుగుకి ఆధారభూతు డైనవాడు 'భర్గోదేవుడు'. భర్గులంటే వెలుగు ముద్దలు. అ వెలుగు ముద్దలందరికీ దేవుడైన వాడిని, 'ధీమహి' ధ్యానం చేస్తున్నాను. ఎందుకంటే అది మనల్ని ఆవరించాలి. ఆవరించి, మన బుద్ధిలోంచి అది పనిచేస్తుండాలని. గాయత్రీమంత్రంలో మనం కోరుకుంటున్న దేమిటంటే, మొత్తం వెలుగు, మనలో చిన్న వెలుగుగా దిగివచ్చింది కాబట్టి, సముద్రంలో అలగా దిగివచ్చింది కాబట్టి అదే తత్వం మనసు, ఇంద్రియాలు, శరీరంగా రోజంతా పనిచేయాలని. మళ్ళీ అందులో ఎక్కడా commissions, concessions, discounts పెట్టకుండా, దాన్ని జేబులో పెట్టుకొని, మన పనులు చేసుకోవటం. గాయత్రి బాగా చదివి, ఇంక ఫరవాలేదు మన ఇష్టం వచ్చినట్లు పనిచేసుకో వచ్చనుకోవడం కాదు. గాయత్రిని పనిచేయనివ్వాలి. దేముణ్ణి తల్చుకొని మనం పనిచేయటం కాదండి, దేముణ్ణి పనిచేయనివ్వాలన్న మాట! అదీ వాహికగా వుండటం. భాగవత మార్గం! మనం తిరుగుతుంటే, వాడే ఊరేగుతున్నట్టని ఆ పద్ధతిలో. వాడిదీ శౌర్యం అంతా. వాడికి ఏమైపోతుందో అనే భయం వుండదు. తను నశించి పోతాడేమో అని భయం వుండదు. తనకొచ్చే కష్ట నష్టాలన్నీ వాడే చూసుకొంటాడు మనకెందుకు? అన్న తత్వంలో వుంటాడు. వాళ్ళ చరిత్రలన్నీ మనకి భాగవతం. వాళ్ళూ శూరులు. ఎందుకని? వాళ్ళ స్పర్శ pranic healing. అంతేకానీ pranic healing అని ఏవో రెండు పుస్తకాలు చదివేసి, ఏవో రెండు exercises చేసేసి, mental గా చేస్తూవుంటే అవదు. ఆ ఆత్మతత్వంలో ప్రాణతత్వం వుంది. వెలుగు ఉన్నది. అది మన నుండి మనసు, ఇంద్రియాలు, శరీరం నుండి ప్రసరించడానికి అనుమతి ఇవ్వాలి. మన వాహిక అయిన మనసు, ఇంద్రియాలు, శరీరంగా వున్నటువంటి ఈ రూపం ఏదైతే వున్నదో, దానికి అవకాశం ఇవ్వాలి. అట్లా

ఇస్తే, అది ప్రతిసారీ ఒకమాట, ఒక తరంగంగా వెళ్ళి ప్రచోదనం చేస్తూ వుంటుంది. మహాత్ముల యొక్క వాక్కు, చూపు, నవ్వు, స్పర్శ అన్నీ కూడా ఆ విధంగా ప్రచోదనం చేస్తూ వుంటాయి. అందుకని వాళ్ళని స్పర్శించడం. మనం వెళ్ళి ముట్టుకున్నామనే గర్వమెక్కువ తప్ప, ఏమన్నా అందిందా? అందులోంచి ఆయన అందిస్తారు. నువ్వు ఎంత పుచ్చుకున్నావు? అలా వుంటుంది. ఇది key note. అది వున్నవాడు ఎక్కడున్నా సరే ధీరుడుగా వుంటాడు. వాడికేమీ అక్కరలేదు. తనయందు తను ఆనందం పొందివుంటాడు. అంటే మొత్తం అంతా కూడా భగవంతుని అస్తిత్వం క్రింద దర్శనం చేస్తూ ఆనందంగా వుంటాడు. అతనికి దేనియందూ భయం వుండదు. అది అవదేమో ఇది అవదేమో, వాడి కాళ్ళు పట్టుకుందాం వీడి కాళ్ళు పట్టుకుందాం అని, ఎవడి కాళ్ళో పట్టుకొనే బదులు, ఇంత భక్తుడివి దేముడి కాళ్ళే ఎందుకు పట్టుకోవూ? అదే సి.వి.వి. గారు చెప్పేది 'వాడినీ, వీడినీ అడగబోకు. ఆ పని గురించి నన్ను అడుగు. నీకు మరీ భయం, ఆందోళన కలుగుతూంటే నాకు చెప్పేసెయ్' అని. అది photo గా అనిపిస్తుంది. ఉన్నాడో, లేడో తెలియదు. అది photo అనుకుంటే, photo. రాముడికి చెప్పినా, కృష్ణుడికి చెప్పినా అదే. 'శ్రీరామరక్ష సర్వజగద్రక్ష'[1] అంటాము. సర్వ జగత్తును రక్షించేవాడు, మనల్ని రక్షించలేడా? అలా అని మళ్ళీ ఎవడి దగ్గరకో recommendation కోసం పోవడం ఏమిటి? వాడే recommendation! అందరిలోనూ వాడే వున్నాడు కాబట్టి వాడే పిలుస్తాడు. ఉద్యోగం కావాలంటే, ఎంతమందికి recommend చేసి, లంచాలిచ్చి తెచ్చుకుంటారండి? మళ్ళీ వెంకటేశ్వర స్వామికి మ్రొక్కుతారు. వెంకటేశ్వర స్వామి అనుకుంటాడు ఇదేమిటిరా నువ్వు అని. మీ దగ్గర appointment అడిగి, మీరిస్తానన్నాక, మళ్ళీ గేటు దగ్గర వుండే watch man కి గురువుగారు నన్ను లోపలకి పిలిచేట్టు చూడమని అయిదు రూపాయలు ఇస్తే ఎట్లా వుంటుంది? మనం చాలా తెలివితక్కువగా చేస్తూవుంటాం పన్లు. అప్పుడేమవుతుంది? అది పోతుంది. watch man కి చెప్పకున్నావు కదా వాడు చూసుకుంటాడులే అని. వెంకటేశ్వరస్వామికి ముడుపూ కట్టి, లంచమూ ఇచ్చి, ఇంకో officer చేతా చెప్పించుకొని, మంత్రిగారి వెంటబడీ, M.L.A. వెంటబడీ, ఇన్ని రకాల బాధలు పడి, వీడికి దేనిమీద విశ్వాసం వుందంటే, వాడికే తెలియదు. వాడిమీద వాడికే లేదు విశ్వాసం! మొట్టమొదట సారి ఆంధ్రరాష్ట్రం అంతటికీ నలుగురు break inspectors ని, auto mobile engineering చదివినవాళ్ళని తీసుకుంటామని వచ్చింది. వస్తే మా నాన్నగారు రామకృష్ణా మిషన్ లో చదువుకుంటూ application పెట్టారు. అక్కడ స్వామీజీతో ఉద్యోగానికి application పెట్టానని చెపితే, ఆయన 'నీకు తప్పకుండా వస్తుంది ఉద్యోగం. నువ్వు రామభక్తుడవు కదా! రాముడే చూసుకుంటాడు' అన్నారు. ఆ తరువాత నాలుగు పేర్లు

వచ్చినాయి. అందులో ఈయన పేరు లేదు. ఈయన పరిస్థితి ఏమిటంటే, అంతకుముందు automobile exams అయినాయి. ఇంటికి వస్తున్నానంటే, వాళ్ళ నాన్నగారు అంటే మా తాతగారు 'ఇంటికొచ్చి నువ్వు చేసేదేమీ లేదు. అక్కడే ఏదో నీ జీవనానికి సరిపడా నువ్వు అవకాశం ఏర్పరచుకున్న తరువాత ఇంటికి రా' అని వ్రాసారు. 'నీ అంతట నువ్వు జీవించడానికి, ఉత్తరోత్తరా నీ కుటుంబాన్ని నువ్వు పోషించుకోవాలి కదా! దానికి సంబంధించిన కార్యక్రమానికి పునాదులు వేసుకొని, అది గట్టిపడిన తరువాత రమ్మని' వ్రాసారు. అదీ తండ్రి! మా నాయనే, మా నాయనే అని ఒత్తులు ఒత్తుకుంటూ కూర్చోవడం కాదు. సరే ఈయన application పెట్టారు. పెడితే రాలేదు. సరే! ఆయన కొక గది ఇచ్చారు రామకృష్ణా మిషన్ వాళ్ళు. 'అక్కడ రాముడి photo దగ్గర కూర్చున్నారు. నాకెందు కివ్వలేదు? నువ్వు సమాధానం చెప్పాలి. నేను అర్హుడిని కాకపోతే ఫరవాలేదు. అర్హుడినైతే ఎందుకు రాలేదు? నాకు సమాధానం చెప్పు. అంతవరకు నేను మంచినీళ్ళు తాగను, అన్నం తినను అని' కూర్చున్నారు. తలుపులు లోపల వేసుకొని కూర్చున్నారు. ఆ స్వామీజీ 'ఇది కాకపోతే ఇంకొకటి వస్తుంది. అలా నిరుత్సాహ పడకూడదు' అన్నారు. మా నాన్నగారు 'ఇది నాకు, నా దేముడికి మధ్య వుండే సమస్య. మీరు పెద్దవారు. మీరు ఇందులో జోక్యం చేసుకోవద్దని' చెప్పారు. మూడు రాత్రుళ్ళు, మూడు పగళ్ళు అలా కూర్చున్నారు. కూర్చుంటే, మళ్ళీ ఇంకో ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరంలో ఈయన పేరు బదులు ఇంకొకరి పేరు పొరబాటున announce అయింది. He is one among the four అని letter వచ్చింది. మాకు school లో, college ల్లో seats కి, ఆయన officer అయ్యుండి ఎవరికైనా చెప్తారా అంటే, చెప్పను. కావాలంటే రాముడికి చెప్తాను. నేను వాడి కాళ్ళు, వీడి కాళ్ళు పట్టుకోను. రాముడి కాళ్ళు పట్టుకోమంటే పట్టుకుంటాను అనేవారు. recommendation అంటే ఆయన చాలా కోప్పడేవారు. నీకు చేతకాకపోతే చక్కటి బొచ్చె ఒకటిస్తాను అడుక్కు తినమనేవారు. అదో పద్ధతి. అలాగ కూడా బ్రతకొచ్చు, తప్పలేదనే వారాయన. చదువుకొని, బాగుపడి ఏదన్నా చేసుకుందామనుకొంటున్నావా? చదువుకో కష్టపడి. నీ అంతట నువ్వు తెచ్చుకో దైవబలంతో. నేనట్లా తెచ్చుకున్నాను. దైవబలంతోనే జీవిస్తున్నాను. నువ్వు అలాగే జీవించు. ఎవరినీ అడగమని చెప్పకు అనేవారు. ఏమిటా ధైర్యం? అంటే అదీ ధైర్యం! ఏడుగురు పిల్లలు. ఎవరూ ఇంకా settele కాలేదు. 51 ఏళ్ళు. నిజమైన భక్తుడు ఈ భూమి మీద దేనికీ యజమాని కారాదు. అసలు యజమాని వాడు కదా! వాళ్ళూ వీళ్ళూ మీకు స్థలం వుంటే బాగుంటుందని స్థలం కొనిపెడితే, ఆ స్థలం అలా వుండేది. మళ్ళీ అమ్మేస్తే బాగుంటుందంటే అమ్మేయమనేవారు. అమ్మినప్పుడూ ఒకటే, కొన్నపుడూ ఒకటే. ఇల్లు వున్నప్పుడూ ఒకటే, లేనప్పుడూ ఒకటే. వాటితో సంబంధం

లేదాయనకు. ఎవరితో సంబంధమంటే, అంతర్యామి యైన భగవంతునితో. అలా జీవిస్తే మన సామ్రాజ్యానికి మనం చక్రవర్తులుగా జీవించవచ్చును. బానిసలుగా జీవించనక్కరలేదు. మన వాళ్ళకెంత ఆదుర్దా వాళ్ళేమైపోతారో, వీళ్ళేమైపోతారో అని. మాస్టరుగారి మూడవ అబ్బాయి కోసం ఒక ప్రణాళిక చెబితే, అది చాలా బాగుంది కానీ వాడికుండే అదృష్టం బట్టి దానిని అందుకొంటాడు అంటే, మరి మీ కొడుకే కదా మాస్టారూ అంటే, నా కొడుకైనంత మాత్రాన అలా వుండదు కదా! వాడి జీవలక్షణం ప్రకారం వాడికుంటుంది. ప్రయత్నం చేయి. అయితే అవుతుంది లేకపోతే కాదు అని అంత నిర్లిప్తంగా వుండేవారు మాస్టారు. మా విషయంలో మా నాన్నగారిని అడిగితే, ఆయన ఒకటే అన్నారు. నేను చేసిన సాధనే మా పిల్లలందరికీ లెఖ్ఖ. వాళ్ళకేమీ కాదు. వాళ్ళు బాగుంటారు అని మా అమ్మగారికి ధైర్యం చెప్పారు. సాధారణంగా స్త్రీలకు అధైర్యం వుంటుంది కదా! మనకి ఏడుగురు పిల్లలు. వెనకాల పోగేసిందేమీ లేదు. నాకేమి రక్షో, వాళ్ళకీ అదే! మాస్టరు గారిని మొదట కలిసినప్పుడు, మొట్టమొదట చెప్పిన వాక్యమిది. 'మీ కుటుంబానికి మీ నాన్నగారు రామనామంతో కోట కట్టేసారు. కాబట్టి మీ కుటుంబానికి ఎటువంటి భయం లేదు.' ఎందుకిది చెప్తున్నానంటే, మనం రకరకాల సాధనలు చేస్తున్నాం. పూజలు చేస్తున్నాం. హోమాలు చేస్తున్నాం. కార్యక్రమాలు చాలా విస్తృతంగా చేస్తూవుంటాం. ఏది ఉండాలో అది వుందా? లేదా? అదికాక మిగతావన్నీ వున్నాయా? ఇది ఊరికే డంబాచారమా? ఇదివరకు Rotary club, Lions club లో చేరడం ఒక గొప్ప. ఇప్పుడు ఒక గురువుగారి దగ్గర చేరడం కూడా ఒక club. అందులో membership కాదు. ఈ నామం యొక్క వివరణ మనల్ని మనం పరిశీలించుకోవడం కోసమే!

353 జనేశ్వరః

జనేశ్వరః అంటే జనులకు ఈశ్వరుడని. జనులంటే పుట్టిన వాళ్ళని. వాళ్ళందరి లోపల ఈయనే కదా వున్నది. సర్వభూత హృదయముల యందు 'నేనే' కూర్చుని వున్నానని చెప్తాడు, శ్రీకృష్ణుడు భగవద్గీతలో. కాబట్టి ఏ పుట్టినదాన్నీ ద్వేషించబోక. 'అద్వేష్టా సర్వభూతానాం' నన్ను ద్వేషించిన వాడివవుతావు అంటాడు. అంటే మనందరిపై తను స్వామిత్వం వహించి యున్నాడన్న మాట. మనం ఆయన్నించి తెంపుకొని వెళ్ళిపోతే, అది మన దురదృష్టం. ఆయనతో ముడి వేసుకొంటే బాధలేమీ వుండవు. దాన్నే మనకు "The return of the prodigal son' అంటే తండ్రిని మరచిన కొడుకు, తండ్రిని కాదనుకొని వెళ్ళిపోతాడు. రకరకాల కష్టాలు పడతాడు. చేసిన తప్పుడు పనులను తెలుసుకొంటాడు. వాళ్ళ నాన్న ఇదివరకు చెబుతాడు ఇదిచేస్తే ఇది వస్తుంది. ఇట్లాచేస్తే ఇట్లా అవుతుంది. అట్లాచేస్తే అట్లా అవుతుంది. అట్లా చేసి చూస్తాడు ఏమవుతుందని. అట్లాగే అవుతుంది. అందుకని ఇలాకాదు తండ్రి దగ్గరకు వెళ్ళిపోదా మనుకుంటాడు. మనం కూడా అంతే! సహజంగా జీవలక్షణం ధర్మం వెంట తిరుగుతుంది. మనకి ధర్మం తెలియక కాదు. ధర్మం ప్రతీవాళ్ళకీ తెలుసు. ఎందుకంటే లోపల సత్యం జీవించే వుంటుంది. చావదు. అందుకనే సత్యాన్ని ఎవరూ అంతుపట్టలేరంటారు. ఎందుకంటే అధర్మంగా ప్రవర్తిస్తున్న వాడిని, వాడిలో వుండే ధర్మస్వరూపం గా ఉన్న దివ్యత్వం హెచ్చరిస్తుంది. కానీ ప్రక్కన పెట్టేస్తాడు. అలా మాట్లాడకుండా వుండాల్సింది నువ్వు. వాడితో మరీ అలా కటువుగా మాట్లాడేవేమిటి? అని చెప్తుంది. ఫరవాలేదులే, వాడి కలాగే చేయాలి. లేకపోతే మాట వినడు అని, మనం దానికి చెప్పేస్తాము. ఏది ఎట్లా చేయాలో లోపల నుంచి సాక్షిగా వుండటమే కాదు, ఒక మిత్రుడి వలె ఇలా వుండాలని చెబుతుంది. దానినే ఇంగ్లీషులో Conscious అని, తెలుగులో ఆత్మసాక్షి అని అంటారు. ప్రొద్దున్నే లేవలేదు. ఎందుకంటే రాత్రి 12 గంటల దాకా కబుర్లు చెప్పుకుంటూ పడుకున్నాము. లేవలేకపోయాం. దేముడికి దండం పెట్టుకోలేదని పీకుతుంది. ఊళ్ళో వాళ్ళకి ఏవైనా చెప్పచ్చనుకోండి. కానీ మనకు తెలుసు కదా! మనకి లోపల నుండి చెప్పేస్తుంది. 'గాడిదల్లే రాత్రి 12 గంటల దాకా వున్నావు కదా! అందుకే ప్రొద్దున్నే లేవలేకపోయావు. అప్పుడు తొందరగా పడుకుంటే బాగుండేది కదా! త్వరగా లేచేవాడివి' అని లోపల నుండి చెబుతుంది. లోపల నుండి మనకే చెబుతుంది కాబట్టి ఫరవాలేదు. ఊళ్ళో వాళ్ళు వినరు కదా! ఇట్లా వుంటాడు మనలో. ఉండటమే కాదు ఆయన్ని అధ్యక్షుడిగా పెట్టుకుంటే పరిపాలిస్తాడు. అధ్యక్షుడిగా పెట్టుకోకుండా,

మనమే కూర్చున్నామనుకోండి. కూర్చుని చూస్తూనే వుంటాడు. అప్పుడు నువ్వు నిర్వర్తించుకోవాలి. అప్పటికే ఆయనే ఈశ్వరుడు. ఎట్లా ఈశ్వరుడంటే, నువ్వు నానా కంపు చేసిన తరువాత మళ్ళీ అప్పజెప్పటమో లేక నశించటమో, ఆ విధంగా మళ్ళీ ఆయన దగ్గరకే వెళ్ళడం జరుగుతుంది. He decides. మనం ఉండడమో, ఉండకపోవడమో మన చేతిలో లేదు కదా! ఎంత president అయినా Can we preside our life? ఏమిటి మన President ship? ఏమీలేదు. మనం ప్రతీ రోజూ బెగ్గరే! Continuous begger. వాడిని పట్టుకొని, వీడిని పట్టుకొని, ఇంకోడిని పట్టుకొని, మరొకడిని పట్టుకొని పనుల కోసం ఇంతమంది కాళ్ళు పట్టుకుంటూ, మనం రాజులెలా అవుతాము? ఎప్పుడు రాజు నువ్వు? ఈశ్వరుడి కాళ్ళు పట్టుకో! జరిగే పనే నీకు ఆలోచనగా వస్తుంది. అదే చేసుకో. తృప్తిగా జీవించు. అక్కరలేనివన్నీ పైన వేసుకొని, అవలేదని ఏడవడం ఎందుకు? ఆ తెలివి వస్తుంది ముందు. ఏది అవసరం, ఏది కాదు అనే తెలివి వస్తుంది. తద్వారా అవసరమైనవి, వాడితో ముడి వేసుకోవడం వలన జరిగే పద్ధతిలో వుంటాయి. అలాంటివాడు ఊరికే బాధపడడు. పైవాడు చూసుకుంటాడని. వాడు సింహాసనం మీద కూర్చున్నాడు మనం వాడి కాళ్ళ దగ్గర కూర్చున్నామనే భావనలో వుంటాడు. అదీ హనుమంతుని posture. రాముడి యొక్క ఆశీర్వచనం. అట్లా కూర్చుంటావా? ఆయన్ని సింహాసనం మీద, హృదయంలో రోజూ కూర్చోబెట్టి, నువ్వు క్రింద కూర్చో. రోజూ ప్రొద్దున్న చెప్పుకో. 'ఇవాళ శుక్ల పాడ్యమి, భాద్రపద మాసం, ఈశ్వర నామసంవత్సరం. ఇప్పుడు బైటకు వెళ్తున్నాను. నువ్వు నాతోనే వుండు. మళ్ళీ సవ్యంగా సాయంత్రానికి వచ్చి, నీ కాళ్ళ దగ్గర ఇట్లా కూర్చునేట్టు చేయి. నేను పన్లు చేసుకున్నప్పుడు నువ్వు నాతో వుండు, పని అయ్యాక నేను నీతో వుంటాను.' అదీ ఒప్పందం. సాయంత్రం అయ్యేసరికి మనం ఆయన కాళ్ళ దగ్గర చేరతాం. పగలంతా పన్లు చేసుకునేవాళ్ళు, పన్లు చేసుకుంటూ కూడా కూర్చునే స్థితి లేదు కాబట్టి, నేను బయటకి వెళ్ళినప్పుడు నువ్వు నాతో వుండు. ఎందుకంటే నేను ఏ పిచ్చివేషాలూ వేయకుండా చూడాలి కాబట్టి. నా పనులు అయిపోయిన తరువాత నేను నీ దగ్గర వుంటా. ఈశ్వరునికి అలా అప్పజెప్పాలి. అట్లా అప్పజెపితే, చాలా సమస్యలకి పరిహారం జరిగిన కథలు మనకున్నాయి. అప్పజెప్పి చూడండి. అదీ దేవతారాధన అంటే! అదీ మనకు జ్వాలాకూల్ మహర్షి 'Occult Meditation' అనే పుస్తకంలో ఇచ్చారు. ప్రతిరోజూ నువ్వు చేయవలసిందేమిటంటే, నువ్వు నమ్ముకున్న దైవమునో, గురువునో నీ హృదయంలో దర్శించి, ఆయనకో కుర్చీవేయి అక్కడ. ఖర్చు లేదు కాబట్టి, నీ ఊహకి ఎంత బాగా అందితే, అంత మంచి కుర్చీ వేయి. అందుకనే మనవాళ్ళు పూజలో నవరత్న ఖచిత సింహాసనం సమర్పయామి అన్నారు. ఏం పోయింది అందులో? కొనక్కర లేదు, వేయనక్కర

లేదు. మన భావనే కదా! అలా కుర్చీ వేసి ఆయన పాదాల దగ్గర కూర్చో! భావనలోనే జరిపించు అంతా. ప్రాథమిక దశలో సాధకుడికి మెలకువలో కన్నా, నిద్రలోనే ఎక్కువ ధ్యానం జరుగుతుంది అని చెప్పారు. మనం మెలకువ స్థితిలో ధ్యానం చేసేటప్పుడు, మన మనసు పరిపరి విధాల పోతూ వుంటుంది కదా! ఊరంతా తిరుగుతుంది. నిద్రలో తిరగదు కదా! అందుకని నిద్రలోకి వెళ్ళేముందు హృదయమనే గుహలో మంచి ధగధగ లాడుతున్న, నీ ఊహకు అందినంత వైభవం కలిగిన మంచి సింహాసనం వేయి. సింహాసనం అంటే కుర్చీ చేతులు పెట్టుకొనే చోట రెండు సింహాలుంటాయి. షిరిడి సాయిబాబా సింహాసనం, రాజుల కుండే సింహాసనం వలె. సింహాలంటే సింహరాశి. మన హృదయం సింహరాశికి సంకేతం. సింహాసనం అంటే నీలో సింహరాశి తత్వం ఎక్కడ వుందో, అక్కడ వేయమని. ఎంత comfortable గా వుండేది వేయగలిగితే, అదివేసి కూర్చోబెట్టు. కావాలంటే ఆయన కాళ్ళు కడుగు. చేతులు కడుగు. మంచినీళ్ళు ఇవ్వు. గంధం పూయి. నీకేది కావాలంటే అది చేసుకో. అదే మానసిక పూజ అంటే! శుభ్రంగా నీ చేత్తో ఆయనకు భోజనం పెట్టు. ఆయనకి నచ్చేవి, బావుండేవి, మనం కోరుకునేవి, మనం తినలేకపోయేవి, నేను తినలేకపోతున్నాను, నువ్వు అయినా తిను అని పెట్టు. అలా పెట్టేసి కూర్చున్నాక దేముడితో పిచ్చాపాటి మాట్లాడు. ఇలా చేస్తూ వుంటే కొన్నాళ్ళ కవి నిజమైపోతాయి అని చెప్పారు జ్వాలాకూల్ గారు. నీ గురువుతో నువ్వు మాట్లాడాలనుకుంటే ఇలా చేసుకో. కొన్నాళ్ళకి నీ గురువుతో నిజంగానే మాట్లాడతావు. దైవంతో నువ్వు మాట్లాడదామనుకొంటే, రోజూ పడుకునే ముందు ఇలా సాధన చేసుకో. ప్రాద్దున్న లేవగానే అదే పూజ! ఊరికే చిమ్ముకోవటాలు, తుడుచుకోవటాలు చేసి, శరీరం అలసి, పూజ చేయబోయేసరికి ప్రాణం ఉసూరు మంటుంది. పైగా బైట చేసే పూజ అందరికీ తెలుస్తుంది. మనకేమి అందిందో మనకి తెలియదు. లోపల జరిగే పూజ బైటవాడికి తెలియదు కదా! అంతా అయిన తరువాత శుభ్రంగా తాంబూలం ఇచ్చేసి, హారతి కూడా ఇచ్చేసి, అన్ని ఉపచారాలూ చేసేసి, అప్పుడు మన కబుర్లన్నీ ఆయనతో చెప్పుకోవచ్చును. ఆయన్ని ప్రసన్నుడుగా చేసుకుని, ఊళ్ళో వాళ్ళకీ, వీళ్ళకీ చెబుదామనుకొన్నవి, అడుగుదామనుకున్నవి సూటిగా ఆయనకే చెప్పుకోవచ్చు. ఎందుకంటే ప్రతివాడి హృదయము నందూ వున్నాడు కాబట్టి, ఏ రూపంలో తల్చుకుంటే ఆ రూపంలోకి వస్తాడు. అదీ వాడిలో వుండే గొప్పతనం! రాముడున్నాడాండీ? అని అడుగుతారు చాలమంది. రామభక్తుడికి రాముడున్నాడు. మనకి లేడు. కృష్ణుడున్నాడా? అంటే ఉన్నాడు. ఎవరికి? కృష్ణ భక్తుడికి! ఎందుకంటే వెలుగు తత్వం, అపటికప్పుడు నువ్వు కోరిన రూపంలోకి అక్కడకు వస్తుంది. నువ్వు ఏది అభ్యాసం చేస్తావో, ఆ రూపంలోకి తను దిగివస్తాడు. అదీ భగవంతుని యొక్క

అంతర్యామిత్వం! అంతర్యామి అయిన భగవంతుడు నువ్వనుకున్న రూపం గట్టుకొని సాంగం, శక్తిం, సాయుధం, అధిదేవత, ప్రత్యధిదేవతా సహితంగా వస్తాడని మనకు భాగవతంలో వుంది. వెంకటేశ్వర స్వామిని పిలిచామనుకోండి, విష్ణుమూర్తి రూపంలో గరుడుని సహితంగా వస్తాడు. శివుణ్ణి పిలిచామనుకోండి నంది కూడా వస్తుంది. అంతేకాదు మొత్తం పరివారం వస్తుంది. నువ్వు దర్శనం అలా చేసుకో! కొంచం హృదయం విశాలమవుతుంది. వాళ్ళందరూ వింటూండగా ఈయనకు చెప్పుకున్నట్లుంటుంది. దర్బారు అది! అటువంటి దర్బారులో ఆయన ఆసీనుడై యున్నాడు కాబట్టి, ఆయన పాదాల దగ్గర కూర్చొని, సమస్తమూ నివేదన చేసుకుంటున్నామనుకోండి. ఇంక వాడినీ, వీడినీ అడగక్కరలేదు. ఇది సత్యం! మాస్టరుగారు ఎప్పుడూ ఎవ్వరినీ ఏమీ అడగలేదు. మా నాన్నగారు కూడా అంతే! అందుకనే నాకు ఆ అనుసంధానం బాగా వచ్చింది. ఎన్నడూ ఎవరినీ 'ఇది నాకు కావాలి' అని అడిగినవాళ్ళు కాదు వారిద్దరూ. మాస్టర్ సి.వి.వి. గారి మొదటి సూత్రం కూడా అదే. అందుకే ఆయన సరైన పద్ధతి సులభంగా ఇచ్చేసారు. నాకు దండం పెట్టుకున్న వాడివి, ఇంకొకడి కాళ్ళు పట్టుకున్నావంటే, నామీద విశ్వాసం లేదనేగా అర్థం! ఎందుకు time waste చేసుకుంటావూ? పట్టుకోక! నీకేమైనా problem వుందీ, నాకు చెప్ప. మాస్టరుగారు అంటూండేవారు ఎందుకలా బాధపడతావు? ఉన్నాను కదా! నాకు చెప్పుకోవచ్చును కదా! అనేవారు. ఆయన ఇంకొకరికి చెప్పుకోవచ్చును. మొత్తం అంతా అలా వెడుతుంది account. ఎందుకు చెబుతున్నానంటే, ప్రతివాళ్ళకీ హృదయము నందు భగవంతుడు ఈశ్వరుడై, సమస్తమునూ అధిష్టించి నడిపించేవాడు వున్నాడు కాబట్టి. వాడికి కుల్చీవేసి, నువ్వు కాళ్ళ దగ్గర కూర్చో. వాడిచేత నీ జీవితం నడిపించుకో. నీ జీవితం వాడు నడుపుతాడు. నువ్వు ఆనందంగా వుండు. అదీ అర్జునుడు రథంలో కూర్చోవడం, కృష్ణుడు పగ్గాలు పట్టడమంటే! రథంలో కూర్చోబెట్టేసి, నేను తోలుతానంటే ఇప్పుడు మనం చేస్తున్న పనిలా వుంటుంది. మన ఇష్టం వచ్చినట్లు మనం తోలుతూ వుంటే, ఆయన కూర్చునే అవసరం లేదు. ఆయనకి అప్పజెప్పేస్తే, మొత్తం మన జీవితరథాన్ని నడిపిస్తాడు. అప్పుడు చూడు ఎంత బావుంటుందో! వాడికి అప్పజెప్పడ మన్నది గొప్ప విషయం! అది మనకి నిజంగా విశ్వాసం వుంటే అప్పజెప్పుతాం. భగవత్తత్వము నందు మనకి నిజమైన పూర్తి విశ్వాసం వున్నదా? లేదా? ఉంటే అన్నీ అవే వస్తాయి. అదీ మాస్టరుగారు చెప్పింది. ప్రతీదీ మన కాళ్ళ దగ్గరకు వస్తుంది. మనం చేయాల్సింది చేస్తూ వుందాం. మనకేదైనా బాధ వుంటే, మాస్టారికి చెప్పుకుందాం. అదీ భక్తి మార్గం! తరువాత తీరిక వేళల్లో ఆయనతో అనుసంధానం చెందడం. అదీ యోగం! అందుకనే అందరి హృదయములలో వున్నాడు కాబట్టి, నీకు ఎవరితో పనుందో, వాడి

హృదయంలో కూడా వున్నాడు కదా! సంఘమన్నాక పనులుంటాయి కదా! ఎవరో ఆఫీసరుతో పనుండవచ్చు. ఎవరో ఒకరు మన పనులు చేసి పెట్టాలి కదా! ఎవరూ పనిచేయకుండా మన పనులు అవవు కదా! పనులవడానికి మార్గాలు రెండు రకాలు. ఒకటి మనం వెళ్ళి వాడిచుట్టూ తిరగడం, ఇంకో పద్ధతి సరాసరి నీ హృదయంలో వాడికి చెబితే, ఆ హృదయం లోనూ వాడే వున్నాడు కాబట్టి అక్కడ నుండే చేస్తాడు. తానీషా ఎలా విడిపించాడు రామదాసుని? Recommendation లో ఏముంది? నా బొంద. ఎవరైనా recommend చేస్తే, వాడిని కూడా జైల్లో పెట్టేస్తారు. పరిస్థితి ఎలా వుంది? ప్రభుత్వం డబ్బు ఈయన తినేసాడు. ఈయన తినేయలేదు. గుడి కట్టాడు. గుడి కట్టినా, వాళ్ళకి రావలసినది రాలేదు. జైల్లో పెట్టేసారు. దాన్ని గురించి ఎవరు recommend చేయగలరు? అప్పడేం చేసాడు? రాముణ్ణి ప్రార్ధించాడు. రామదాసు కీర్తనలన్నీ ఆ బాధలో నుండి పుట్టినవే! అప్పడు కలలో తానీషాకు రాముడు కనిపించి, jail నుండి వదిలేయమన్నాడు. ఇది పుక్కిటి పురాణం కాదు. మొన్నీ మధ్య జరిగినదే కదా! రామదాసు తానీషాకు చెబుదామనుకోలేదు. తానీషాకు చెబితే ఏమొస్తుంది? రాముడికి చెప్పకున్నాడు. రాముణ్ణి కొంత తిట్టాడు కూడా. నువ్వు కిరీటం పెట్టుకొన్నావు. మీ ఆవిడ వడ్డాణం పెట్టుకుంది. అన్నీ బాగానే చేయించుకున్నావు నా కెందుకీ అపనింద? అని కోప్పడుతాడు రాముణ్ణి. రెండుసార్లు కోప్పడి, మళ్ళీ ఏమీ అనుకోబోక అంటాడు. ఏమైనా అక్కడ చేసుకోవచ్చండి. You can do anything with your Master. Do not do it outside. మీకు కోపం వచ్చి మాస్టరు గారిని తిట్టాలనుకున్నారనుకోండి, మనసులో తిట్టుకోండి. ఊళ్ళో వాళ్ళని తిడితే రకరకాల బాధలొస్తాయి. వాళ్ళు కక్ష కట్టి మళ్ళీ తిరిగి తిడతారు. మంచైనా, చెడైనా ఆయనతోనేనండి! అదీ పద్ధతి. నేనొకసారి మాస్టార్ని అడిగాను. కృష్ణుడు తనను తిట్టిన వాళ్ళనందర్నీ తొందరగా తన దగ్గరకే తీసుకున్నాడు కదా! అంతే కదా మాస్టరయినా అంటే అవును, అన్నారు. తిట్టడం కూడా ఒక స్మరణే! ఊళ్ళో వాళ్ళని తిడితే ఊరుకోరు. గురువు గారిని తిడితే, గురువు గారేమీ చేయరు. వీడికేదో ప్రకోపించింది, అనుకుంటారు. ఈ రోజు వీడి mood చెడింది, మళ్ళీ చూద్దాంలే, అనుకుంటారు. అంతే తప్ప, తిరిగి ప్రతీకారం వంటివేవీ వుండవు కదా! అందుచేత Do everything in relation to your life with the Master or with the Lord. ఆయన హృదయంలో వున్నాడు. ఆ విధంగా చేసుకుని వెళ్ళామనుకోండి. ఎంత confidence వుంటుందీ! అన్నీ అడక్కుండా వస్తాయి. ఊళ్ళో వాళ్ళందరూ ముష్టివెధవల్లా వెంటబడుతున్నవన్నీ, వాళ్ళని తప్పించుకుని మన దగ్గరకు వస్తాయి. అది నిస్సందేహము! ఏమిటది? అది అంతే! భక్తుడి కన్నా ప్రియమైనవాడు లేడు భగవంతుడికి. అదొక పెద్ద problem ఆయనకి! అమిత మమకారం.

అంబరీషోపాఖ్యానంలో విష్ణువంటాడు నాకేమీ అక్కరలేదు. నా భక్తుల మేలు కోరతాను అంటాడు దుర్వాసుడితో. వాడు భక్తితో నన్ను కట్టేస్తాడు. నేను కాదనలేను. వాడికి, నాకు అనుసంధానముంది అంటాడు. ఇంక అంతకన్నా ఏం కావాలి? భక్తితో తప్ప భగవంతుని ఇంకొక రకంగా కట్టలేరెవరూ. ఆయన కరిగిపోతాడు. హృదయం పెద్దది. రోజూ ఆయన్ని పిలిచి ఇలా మాట్లాడుకుంటూ, ఏడుస్తూ వుంటే, పాపం పిచ్చి వెధవ పోన్లేరా అని చేస్తాడు. అట్లా వుంటుంది. అందుకని ఇంతమంది హృదయాల్లో వున్న భగవంతుని గురించి ఈ 'జనేశ్వరః' అనే నామం చెప్పుకున్నాం.

354 అనుకూలః

అధర్మ ప్రవర్తన బాగా పెచ్చు పెరిగిపోతే ఏమవుతుందంటే, He is favourable to those who follow the Law. ఎవరు ధర్మాన్ని నిర్వర్తిస్తూ వుంటారో, వాళ్ళకి అనుకూలుడుగా వుంటాడు భగవంతుడు. దేవతలనుకూలించక పోయినా, భగవంతుడనుకూలిస్తాడు. భగవంతుడనుకూలించడం వలన, దేవతలనుకూలిస్తారు. S.I. గారు మాట వినకపోయినా, D.I.G. గారు మన దగ్గర వున్నాడంటే, S.I. మాట వింటాడు. ఇటువంటి సన్నివేశాలు చూపించారు మనకి పురాణాలలో. దేవతలు కాస్త అటూ ఇటూగా వున్నా, దైవాన్ని నమ్ముకోవడం వలన దేవతలొచ్చి సాయం చేయవలసి వస్తుంది. అందుకని అనుకూల స్థితి! అనుకూలుడాయన! అంటే He has a favourable disposition. ఆఫీసరు దగ్గరకి వెళ్ళినట్టు పరుగెట్టి వెళ్ళనక్కరలేదు. 10 ఏళ్ళ తరువాత వెళ్ళామనుకోండి ఆయన దగ్గరకి, లక్ష తప్పులు చేసి వెళ్ళామనుకోండి, వెళ్ళగానే మంచి అనుకూలమైన పద్ధతులలో మనల్ని అంగీకరిస్తాడు. అదీ వాడికీ, మనకీ తేడా. మనం ఏదీ లేకుండానే ప్రతికూలంగా వుంటాం. అటువంటి అనుకూలత్వం మనకి చాలా చక్కగా ఏర్పడుతుంది. అది ఎలా వుంటుందో తెలుసా? ప్రతికూలంగా వున్న సన్నివేశాలు కూడా అనుకూలంగా మారతాయి జీవితంలో. మనం ఏది ప్రతికూలం అనుకుంటామో, చివరికి దానిలోంచి అనుకూలమైన స్థితి ఏర్పడుతుంది. మనకి ఎంతో కష్టంగా వుంటుందనుకున్న సన్నివేశం అలా మారి, అరే ఇది ఎంతో కష్టం, నష్టం అనుకున్నాం. చివరికిది చాలా లాభం, వైభవం తెచ్చిపెట్టిందే అనిపిస్తుంది. He can reverse the trend. అదీ అనుకూలుడంటే! మనం మామూలుగా వ్యాపారసరళిలో తీసుకుంటే, ఆయన చాలా అనుకూలుడు. అందుకే మనం ప్రసన్న వదనం ధ్యానం చేసుకోవడం. 'ప్రసన్న వదనం ధ్యాయేత్' కదా! ఎప్పుడూ ప్రసన్నుడాయన! ఆ ప్రసన్నత్వం లోంచి మనం ఏ రోజైతే ఆయన ప్రక్క, అటు ప్రక్క ఉన్ముఖులౌతామో, ఆ రోజు నుంచి మనకు అనుకూలత్వమనేది మొదలవుతుంది. 'అనుకూలుడు' అనగా అన్ని కాలముల యందు, అన్ని అవస్థల యందు అన్ని విధముల అనుకూలుడు. ఆయనను అనుసరించే వారందరి యెడల, ఆయన భక్తుల యెడల అనుకూలుడు. భక్తవిజయంలో ఇచ్చారు. కష్టాల మలుపు ఏర్పరచి, ప్రతికూల సన్నివేశం వచ్చినపుడు అక్కడ వున్నది భగవంతుడే అని నమ్మగలిగితే, అదే అత్యంత లాభదాయకంగా, శాపమే వరముగా మారే సన్నివేశములను కూర్చుతాడు. ఆ సమస్య రూపం లో, ప్రతికూల పరిస్థితి రూపం లో ఉన్నది భగవంతుడే అని దర్శనం చేయడం వల్ల, ఆయన్ని స్మరణ చేయడం వల్ల, ఆ పరిస్థితులలో అవకతవకలు

చేయకుండా ఉండడం వల్ల చక్కటి పరిష్కారము కాలం రూపం లో రావడమే కాకుండా, ఆ పరిష్కారము లాభదాయకముగా, సుఖదాయకముగా ఏర్పడుతుంది. ధర్మము తప్పని అర్జునునికి శాపము వరముగా అయిన సంఘటనలు చూసాము భారతంలో. దేవలోకంలో తన కోరిక తీర్చని కారణాన అప్సరస అయిన ఊర్వశి, అర్జునునికి బృహన్నల కమ్మని ఇచ్చిన శాపము, ధర్మప్రవర్తకుడవడం వలన అర్జునునికి అజ్ఞాతవాసములో అది వరం గా పరిణమించింది. మనం అనుకూలం అనుకున్నవి ఉదాహరణకి బాగా డబ్బు సంపాదించుకుంటూ పోయామనుకో తర్వాత అవి మనకు బంధాలు అవుతాయి. అనుకూలం ప్రతికూలమయ్యేది అధర్మ ప్రవర్తకులకు. ధర్మప్రవర్తకులకి ప్రతికూలంలా కనపడేది కూడా అనుకూలం అవుతుంది. ఉదాహరణకి రామునికి లక్ష్మణుని మూర్ఛ చాలా దుఃఖము కలిగిస్తుంది. సీతా వియోగం కన్నా ఎక్కువ బాధపడతాడు. కానీ ఈ ఆపద సంజీవని ప్రాప్తికి దోహదపడుతుంది. సంజీవని ప్రభావం వల్ల మృతి చెందిన వానరులంతా బ్రతుకుతారు. యుద్ధం లో ఎంతమంది చనిపోయారో తెలియకూడదని రావణుడు తన సైనికుల మృత దేహాలను సముద్రం లో పారవెయ్యడం వల్ల వారికి సంజీవని ప్రభావం ఉపయోగపడలేకపోయింది. ఇలా ప్రతికూల పరిస్థితులు ధర్మ ప్రవర్తకులకి అనుకూలములుగా ప్రాప్తిస్తాయి. కష్టము వచ్చినప్పుడు వాటిని చూడక భగవంతుని చూడగలిగితే అది మనకు తెలియకుండా తీరుతుంది. మనకు బాధ కలిగినపుడు, బాధపడకుండా భగవంతుని యందుండటం నేర్చుకుంటే, అది మనకి అనుకూలముగా అయ్యేటట్లు ఆయన చూస్తాడు. ఏలిననాటి శని కాలం లో పరిస్థితులు ప్రతికూలం గా ఉంటాయి. అవి ఆరోగ్యము మీద దెబ్బ కొట్టవచ్చు, వృత్తిమీద దెబ్బకొట్టవచ్చు, సంబంధ బాంధవ్యాలమీద దెబ్బకొట్టవచ్చు. ఏమైనా జరగవచ్చు. ఎన్నో ప్రతికూల పరిస్థితులు ఏర్పడవచ్చు. అలా బయట పరిస్థితులు అనుకూలముగా లేనప్పుడు ఎక్కువ లోపల ఉండాలి. ఎక్కువ భగవంతుని స్మరణ జరగాలి. భగవంతునితో మనస్సు నందు ఎక్కువ సాన్నిధ్యాన్ని చేకూర్చుకోండి. దానివలన సాధన బాగా సాగుతుంది. అది భగవద్భక్తుల లక్షణం. బాధలు ఎలాగూ తప్పవు. అవి మనం కలుగచేసుకున్నవి కనక. మన ధనం, మన కీర్తి, మన గొప్పతనం మీద అందరూ దెబ్బకొడతారు. కనుక ఆయన యందు మనం వుండగలిగితే, ఇవన్నీ మనలని తాకవు. మన పైనుండి వెళ్ళిపోతాయి. ఆయన యందు మనం వుంటాము. కనుక వాడు ఎపుడూ అనుకూలుడే! ఏ భక్తుల జీవితం చూసినా, శాపాలు వరముగా మారాయి. కర్ణునికి వరాలన్నీ శాపాలుగా మారాయి. అర్జునునికి శాపాలు వరములుగా మారాయి. ఇద్దరూ సామర్థ్యములో సమానులే! అయినా ఎందువలన అని కర్ణుడు భీష్ముణ్ణి అడుగగా, ధర్మపరంగా వున్నవాడు అర్జునుడు. కనుక

ఏమిచేసినా అది వరంగా మారి, జయం పొందుతాడు. ధర్మమూ, దైవము అతడి పక్కన ఉన్నాయి. నీవు, నేను అధర్మం వైపు వున్నాము. కనుక మనకి సహజం గా తక్కువ బలము. అపజయం తప్పదు, అన్నాడు. మనము మన గురువు దగ్గర్నుంచి వచ్చిన ధర్మ మార్గాన్ని చక్కగా నిర్వర్తించుకుంటే, అనుకూలురమై ధర్మపరంగా బ్రతకటానికి అవకాశం వుంటుంది. అప్పుడు ఎంతటి ప్రతికూల పరిస్థితి అయినా అనుకూలమవుతుంది.

355 శతావర్తః

శతావర్తః అనగా రకరకములైన ప్రవర్తనలు కలిగిన వాడు అని అర్థం. ఎన్నో రకాలుగా ప్రవర్తిస్తాము. ఇన్ని ప్రవర్తనలలో వున్న వానిని, గుర్తించాలి. మనకి ఇష్టమున్న ప్రవర్తనలలో వున్న వానిని, ఇష్టం లేని ప్రవర్తన కలిగిన వానిని ఒక్కటిగా చూడాలి. వాడుగా గుర్తించాలి. అపుడు మనకి రాగద్వేషా లుండవు. అంతమందిలో వున్న ప్రవర్తనలలో చిక్కుకోకుండా వుండడమే 'వాసుదేవోపాసన'! అందరిలో వాసుదేవుని దర్శించడం వలన మనకి తక్కిన విషయము లంటవు. ఇలా నర్తకుని వలె పెక్కు భంగిమలు నర్తిస్తూ వుంటాడు వాడు. మనలోని భావాలే మనలని బంధిస్తాయి. ఉదాహరణకు కుక్క కరుస్తుందేమో అనుకుంటే, కరుస్తుంది. నీ మనస్సులో చెడు భావము గానీ, మంచి భావముగానీ ప్రక్కకునెట్టి, 'ఇన్ని భావముల రూపం వాడిదే, వాడే నాలో వున్నాడు' అన్న భావం రావాలి. అపుడు వాడు చేసేది, చూసేది అంతా మహత్యమే! భాగవతంలో, భారతంలో పెద్ద పెద్ద వాళ్ళంతా అలా వుంటారు. ఏడు లోకాలుండి, మళ్ళీ వాటిలో ౭ × ౭ గా పొరలు పొరలుగా అనేకమైన ప్రవర్తనలు కలిగిన జీవులుంటారు. అన్నింటిలో వాడుగా వుంటాడు పరమాత్మ. కనుక 'నేను ఏ రూపంలోనైనా రావచ్చు, అన్నింటిలో నన్ను చూడు,' అన్నారు సాయిబాబా. వాడి దగ్గరనుంచి వచ్చిన ఆదేశాలను గుర్తించి ఎన్నో విధాలుగా సత్యాన్ని దర్శించవచ్చు. ఇవి రెండు విధాలుగా వుంటాయి. 1. తెర వెనుక ౨. తెర ముందు. మనకి కనిపిస్తున్నవి కాక, కనిపించని ఆదేశములను ఆచరిస్తూ వుండాలి. వాడి వర్తనములను తెలుసుకోవడం కష్టం. వర్తనము అనగా 'వృత్తములు' అని అర్థం. భావాలు అనేకం. ఎన్ని రకల పనులు చేసుకుంటూపోతే అన్ని భావాలు. 'యద్భావం తద్భవతి'. 'దేనినీ ఆశించక చేసుకుంటూ పో' అన్నారు సి.వి.వి. గారు. ఆయనని హృదయంలో చూస్తున్నట్లుగా భావన చేసుకోవాలి. కోరిక వున్నచోట దుఃఖం వుంటుంది. కోరిక లేక, ఆశ లేక చేస్తే సుఖం వుంటుంది. ఆనందం వుంటుంది. మన భావములలో ఎన్ని వర్తనములు వుంటే, అన్ని ప్రవర్తనలలో చిక్కుకుంటాము. ఈ సృష్టంతా గోళములుగా ఆవర్తనలు కలిగి, ఒక్కొక్క గోళం ఒక్కొక్క స్వభావం కలిగి, దాని తత్వంతో నిండి, 33 కోట్ల దేవతలు వుండి, ఎవరి ప్రవర్తనలో వాళ్ళుంటారు. ప్రతీ జీవి దాని భావనలో అల్లిక చేయబడి వుంది. ఉదాహరణకు గొంగళి పురుగు సీతాకోకచిలుక అయినట్లు, లక్ష వర్తుల స్వభావాన్ని అగ్నికి ఆహుతి చేయాలి. అంతేకానీ లక్షవత్తులు వెలిగించి, వ్రతం చేయటం కాదు. ఎవరిపై కక్ష, కోపాలు వుండరాదు. అది వున్నంతకాలం నీ గతి అధోగతే! ఎదుటివాడిలో ద్వేషాన్ని విషంగా

కాక, వాడిలో వున్న అమృతత్వాన్ని చూడాలి. లేకపోతే పరమ గురువులకి చాలా దూరంగా వుంటారు. ఇది ధర్మజుని తత్వం. అందరిలో భగవంతుడినే దర్శిస్తూండటం వలన, అజాతశత్రువు అయినాడు. అందుకే కృష్ణునికి ధర్మజుడంటే అంత ఇష్టం. కోపం రానివాడు. కోపం వస్తే ఇంకేమీ మిగలదు. ఎవరిపై రాగద్వేషాలు లేనివాడు. 'అద్వేష్టా సర్వభూతానాం'[1] అన్నాడు శ్రీకృష్ణుడు భక్తియోగంలో. భక్తులలో వుండవలసిన 42 గుణాలు వరుసగా చెపుతాడు. సి.వి.వి. గారు ఒక మంత్రం ఇచ్చారు. 'నీ మనస్సులో వున్న శత్రువుల దగ్గర జాగ్రత్తపడు'[1]. అంటే మనలో వున్న శత్రువులు మన మనస్సులో వున్నవాళ్ళే. ధ్యానం కుదరక వాళ్ళే కన్పిస్తారు కనక జాగ్రత్తపడాలి. 'శత్రువులందరిలో నా రూపం ధ్యానం చేయి. వారు వైదొలగి 'నేను' నీలో మిగులుతాను. శత్రుత్వం తొలగి, నాతో మైత్రి మిగులుతుంది. వాళ్ళని చూస్తే 'నేనే' గుర్తురావాలి' అన్నారు. అప్పుడు గురువుగారు మిగిలి, ఆయనకు దండం పెడతాడు. మనకి ఇష్టం లేని మనుష్యులని, సన్నివేశాలని ఎక్కువగా ధ్యానం చేస్తుంటే, అవే కనపడతాయి. గురువుల దగ్గరకి వెళ్ళినపుడు ఇష్టం లేని వ్యక్తులని, సన్నివేశాలని కలుగజేసి, శిష్యునిలో కలిగే భావతరంగాలని చూస్తూంటారు. వీడిలో పూర్తిగా మార్పు రావాలి. మాటలలో ముళ్ళు కాకుండా, అమృతం కురవాలి. అందరినీ ఒక్కటిగా గురువుగారియందు దర్శించగలగాలి. ఏ భావనలూ అడ్డు రాకూడదు. ఇదే భక్తులకి వుండవలసిన మొదటి గుణం. దీనివలన మనలో సత్వగుణం పెరిగి, రజోగుణం తరుగుతుంది.

356 పద్మ

పద్మాన్ని రెండుచోట్ల ధరిస్తాడు విష్ణుమూర్తి. 1. చేతిలో ఉంటుంది 2. బొడ్డు నుండి పద్మం వస్తుంది. పద్మములను చేతిలో ధరించేవాడు. మనకు పూర్తిగా స్ఫూర్తి నిచ్చేది పద్మం. విశాలత్వం చెందిన చైతన్యం పద్మము. అందుకనే పద్మాలతో దేవిని, విష్ణువుని వర్ణిస్తారు. ఆత్మ తత్వాన్ని వికసింపచేసేది పద్మం కనుక వికాసాన్ని కలిగించేది ఆయన చేతిలో పద్మము. ఇవే పద్మాలు మనలో ఆరు చక్రాలకి సంకేతము. పద్మాలు మనలో గిర్రున తిరిగి, తిరిగి మొత్తం పంచభూతముల తత్వాలను మనలోకి ప్రవేశింపచేస్తాయి.

1. ఆజ్ఞ ---------- జీవుడుంటాడు (ఆకాశ తత్వం)
2. విశుద్ధి ---------- మనలో వాక్కుగా
3. అనాహతము ---------- వాయు తత్వముగా
4. స్వాధిష్టానము ---------- వేడిగా
5. మణిపూరకము---------- నీరుగా
6. మూలాధారము---------- పదార్ధంగా

ఈ చక్రాలు తిరుగుతూండటం వలన మనలో పంచభూతములు, వాటి తత్వాల నిర్మాణం జరుగుతుంది. కనుక ఒక చేతిలో ఆయన చక్రం ధరించాడు. భావములలో చస్తూ, బ్రతుకుతూ తిరుగుతూ వుంటాము. ఇలా చక్రాలలో సుడిగుండాలలో తిరుగుతూ, పద్మంగా వికసించే ఒక తత్వం వుంది. అదే తులారాశి. ఈ రాశి నుండి ధ్యానం చేసి, సాధన చేస్తే చక్రాలు పద్మాలుగా వికసిస్తాయి. అప్పుడాయన పద్మాలు ధరించిన వాడవుతాడు. మనకి వికాసాన్ని కలిగించడానికి, పంచభూతముల చైతన్యము నందు చిక్కుకోకుండా వుండడానికి ధరిస్తాడుట. ఇదే అమ్మవారి తత్వములో చెపుతారు. వికాసం జరిగేకొద్దీ మనలో మార్పు వస్తుంది. దీనివలన భగవంతుడు మనని బంధించని స్థితికి ఎదిగేలా చేస్తాడు. మనలో ఆవేశం వుంటే, నీరు మురికిగా వుంటుంది. ఈ ఆవేశం లేనిచోట ఆ నీరే, మంచినీరుగా మార్పు చెందుతుంది. కనక జబ్బుచేస్తే నీరు త్రాగించమంటారు. పదార్ధం సూక్ష్మంగా మారుతుంది. 'Water purifies mind' అని Madam Blavatsky చెప్పింది. మనలో నీటి వలన ప్రాణశక్తి పెంపొంది, circulation బాగా జరిగి, అరిషడ్వర్గము లైన కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యములను జయించే శక్తి ఉత్పన్నమవుతుంది. అవి చేరటం వలన రక్తంలో తేడా కనిపిస్తుంది. మన రక్తంలో మన ప్రవర్తనకు సంబంధించిన సమస్తమూ వుంటుంది. పరిశుద్ధ ఆత్మ కలవాడైన ఏసు ప్రభువు పాపులను ప్రక్షాళన చేస్తాడు అంటే, ఈ purification జరిపించటమే.

కనుక మందులతో జబ్బులు తగ్గవు. మంచి ప్రవర్తన రక్తాన్ని శుద్ధిచేసి, జబ్బులను రానివ్వదు. మూలాధారం పదార్థమయం. పదార్థం పరిశుద్ధం కావాలి. దానిలో మనం బంధింపబడివున్నాం. ఈ చక్రంలో ప్రపంచంలోని బాంధవ్యాలు జాగ్రత్తగా చూసుకోకపోతే అక్కడ పట్టుబడతాము. కనుక అందరియందు మంచి భావం వుంటే, ఈ చక్రం పద్మంగా వికసిస్తుంది. ఆవేశ కావేశములు, అరిషడ్వర్గములను జయించి, మంచి భావములుగా వుంచుకుంటే, నీటియందు స్వామిత్వం వచ్చి మణిపూరక చక్రము, పద్మముగా మారుతుంది. భావముల యందు పరిశుద్ధత ఏర్పరచుకుంటే, అగ్నియందు స్వామిత్వం వచ్చి స్వాధిష్టాన చక్రము, పద్మముగా మారుతుంది. సమస్త జీవరాశులలో పవిత్రీకరణ మనలో వున్న యెడల, హృదయమందు వికాసం వచ్చి, అనాహత చక్రము పద్మంగా వికసిస్తుంది. వీటికి సంకేతములుగా విష్ణువు పద్మములు పట్టుకొని వుంటాడు. పద్మము సృష్టి ఆరంభము నుండీ వుంది. దేనియందూ మనకి బద్ధత లేక, చక్కని అనుసంధానము కలిగియుండునది పద్మము. తోటివారి యందు అనుబంధం కాక, అనురాగం కలిగి, ఇది నాది అనే స్థితిని అధిగమిస్తే, అపుడు వాయువుగా పట్టుబడి ఆకాశ తత్వాన్ని అధిగమిస్తాడు. ఇలా సాధకుడు ఆకాశతత్వంలో, వాయుతత్వంలో, భావములో, అగ్ని, నీరు, పదార్థ తత్వాల యందు పట్టు చిక్కించుకొని అధిపత్యాన్ని సాధిస్తాడు. ఆశ లేనివారికి ఇవి పట్టుబడతాయి. జీవుడు, దేవుడితో అనుసంధానము చెంది, ఆకాశంలో స్వేచ్ఛగా విహరిస్తాడు. అవసరాన్ని బట్టి ఎక్కడికైనా తిరుగుతాడు. అదే మాస్టరుగారు రాసిన మంద్రజాలం లోను, పురుషమేధం లోను జ్వాలాకూలుడు తిరిగే పద్ధతి. అన్ని తత్వములను అధిగమించి, వాటిమీద స్వామిత్వం పొంది తిరుగుతాడు. నాయందే ఉండి, నన్నే ధ్యానిస్తూ వుంటే వికాసం కలుగుతుంది. అదే భాగవత మార్గం. నాతోనే వుంటూ, నాతోనే సహవాసం చేస్తూ వుంటే,నాయొక్కచూపు ఆ పద్మాలపై పడుతుంది. అపుడవి నీలో క్రమంగా వికసిస్తాయి. భగవంతునిపై దృష్టి కలవానిపై, భగవంతుని దృష్టి పడుతుంది. దానివలన వికాసం కలుగుతుంది. గురువు చిరునవ్వుతో వీక్షించినపుడు ఆయన మనలో ఆత్మతత్వాన్ని దర్శిస్తారు. మిగిలినవి దర్శించరు.

357 పద్మనిభ ఈక్షణః

పద్మనిభేక్షణః అనగా ఆయన యొక్క వీక్షణములు మనపై బడి, మన పద్మములను వికసింపచేస్తాయి. అత్మతత్వాన్ని చూస్తాయి. మనలో పంచభూత తత్వాలు పవిత్రీకరణం చెందినపుడు, వారి దృష్టి మనపై పడుతుంది. ఇట్లాంటి వారినే గురువులు శిష్యులుగా అంగీకరిస్తారు. మిగిలిన భావనలు వదిలి గురువుని హృదయ పద్మములో ధ్యానిస్తే, ఆయన అనుగ్రహం మనకుంటుంది. ఆయనను హృదయమనే గుహలో కూర్చోబెట్టి, ఆయన పాదాల చెంత మనం వున్నట్లు ధ్యానం చేసి, గోడు అంతా చెప్పుకోవటం వలన 1. ఆయన పాదాలు చూస్తూ 2. ఆయన కళ్ళల్లోకి చూస్తూ మాట్లాడటం జరుగుతుంది. లేదా మన చేష్టలన్నీ ఆయనపైనే మాట్లాడడం, పాడడం, ఆడడం, విషయం వర్తింపచేయడం అదో భక్తిమార్గం. ఇలా అన్నీ ఆయన పరంగా జీవితం అర్పణ చేయడం జరుగుతుంది. ఉదాహరణకు త్యాగరాజు మొదలగు భక్తుల వలె మనలని ఎపుడూ చూస్తూంటాడుట భగవంతుడు, మనం ఎపుడు వానిని చూస్తామో అని. మన సర్వస్వం ఆయన అస్తిత్వమే అని మనం ఆయన్ని చూస్తున్నపుడు ఆయన చూపులు, అనుగ్రహం మనపైనే వుంటాయి. 'All seen eye' అని భగవంతుని చూపుని అంటారు. అన్నింటినీ చూసే చూపు ఆయనది. పద్మాల వంటి కళ్ళు ఆయనవి. అలా చూస్తుంటే, మన చూపులలో ఆయన చూపులు కలిస్తే, ఆయన చూపులు మనపై పడవలసి వస్తుందట. మనం ఆయన్ని చూడలేము కాబట్టి, ఆయన చూపులు మనలోకి ప్రసరింప చేస్తాడుట. పతంజలి 'నీవు పెట్టుకొన్న విగ్రహంలో నుండి నీలోకి ఆయన చూస్తున్నట్లు భావన చెయ్యి' అన్నారు. భూమిపై నున్న దేవతల నందరినీ పూజిస్తావు కదా! పైవిధంగా వారిని ఆవాహన చెయ్యి, అన్నారు. షోడశోపచార పూజ ఆ విధంగా చేసి, వారిని సేవించు. దానివలన వారితో మనకి పరిచయం పెరుగుతుంది. పెద్దలుపూజావిధానం ఇవన్నీ ఆలోచించి ఇచ్చారు. ఎవరన్నా బాధలో, కష్టాలలో వున్నపుడు వారిపేర పూజలో ఆ దేవుని స్మరించడం జరుగుతుంది. అప్పుడన్ని విషయాలు ఆయనకి అర్పణ చెయ్యటం వస్తుంది. అప్పుడాయన సత్యం నీకు దర్శనం జరుగుతుంది. అపుడు అధిదేవతలు నీవు ఏ రూపులో పిలిస్తే అలా వస్తారు. ధర్మ ప్రవర్తనలో మనకి మనం అడ్డురాకుండా వెళుతూంటే, క్రమంగా వారి దర్శనం దొరుకుతుంది. మనకి మనమే అడ్డు. మాస్టర్ E.K. అంటూండేవారు 'నువ్వన్నా చేసుకో లేక నన్నయినా చెయ్యనివ్వు' అని. కనక ఆయన చూపులో మన చూపులు కలసిన దానిని భగవంతుని 'మీనాక్షి తత్వం' అన్నారు. మీనరాశి యందు ఆ తత్వం పరిపూర్ణంగా పొందుతారు. కొంతమంది చూపుల వలన, కొంతమంది స్పర్శనము, కొంతమంది మంత్రం వలన ఇలా ఎన్నో

విధాలుగా తరిస్తారు. ఇలా విష్ణువుని నాలుగు చేతులు కలిగి, అందు శంఖ, చక్ర, గదా, పద్మములు ధరించి, మన చూపులలో ఆయన చూపులు కలిపినట్లుగా రాత్రిపూట నిద్రపోయే ముందు హృదయంలో ఆయనని ధ్యానించుకొని, ఆయన సాన్నిధ్యాన్ని పొందండి.

358 పద్మనాభః

పద్మము అంటే ? వికాసానికి సంకేతముగ మనకి వేదాలలోను, పురాణాలలోని ఇవ్వబడి ఉన్నది. అందుకని ఎక్కడైతే వికాసము ఉంటుందో అక్కడ పద్మము యొక్క చిహ్నము మనకి ప్రదర్శింపజేస్తూ ఉంటారు ఋషులు. పద్మములో అమ్మవారు కూర్చున్నట్టు, చేతిలో పద్మాలు ధరించినట్లు, పద్మ దళముల వంటి కన్నులు కలిగినట్లు, పద్మాలయములో ఉన్నట్టు. ఇలా ఎందుకు చెప్తారంటే పద్మము అంటే చైతన్యము యొక్క వికాసమునకు సంకేతము కాబట్టి.ఈ వికాసం ఎక్కడ నుంచి వస్తుందంటే, అవ్యక్తము అయినటువంటి తత్త్వము లోంచి అది అనుస్యూతంగా వ్యక్తము అవుతుంటుంది. వ్యక్తము అయి, మళ్ళి ఎక్కడ నుంచి వ్యక్తము అయినదో అందులో లీనము అవుతుంది. భగవత తత్వం ఎప్పటికప్పుడు ఒక పక్క నుంచి వ్యక్తము అయ్యి, మళ్ళి ఆయనలోకి లీనము అవుతుంది. సముద్రము కెరటాలు లాగ, కొన్ని అలలు కెరటాలుగా బయటకి వస్తుంటాయి, కొన్ని కెరటాలు సముద్రము లోకి వెళ్తుంటాయి. వ్యక్తము అవటం, మళ్ళి అవ్యక్తము కావటం అనుస్యూతంగా జరుగుతు ఉంటుంది. కొంత మంది జీవులు దిగి వస్తుంటారు, కొంతమంది జీవులు తిరిగి వెళ్తుంటారు. దిగి వచ్చే జీవులకి యొక్క orientation లేక ఉన్ముఖత్వం, తిరిగి వెళ్లే జీవులు యొక్క ఉన్ముఖత్వం వేరేగా ఉంటుంది. ఎక్కడ నుంచి దిగి వస్తున్నారో, ఎక్కడకి తిరిగి వెళ్తున్నారో ఆ కేంద్రము భగవంతుని యొక్క నాభి అని చెప్తారు. ఆ నాభికి అవతల ఏమిటి ఉందయ్యా! అంటే నీలం అనే వర్ణం ఉంది. అనిర్వచనమైనటువంటి శరీరము అది. మన బోటి వారికి అర్ధము కావటానికి దానిని ఒక రూపములోకి తీసుకు వస్తే కానీ మనకి అర్ధము అవదని, రూపాత్మకమైన భావము తీసుకు రావటము కోసము, ఆయన పడుకున్నట్టు, ఆయన బొడ్డులో నుంచి ఒక కమలము ఉద్భవించినట్లు. ఆ కమలంలో ఒకాయన కూర్చున్నట్టు, ఆ కుర్చున్నాయన నుంచి ఈ సృష్టి అంత జరుగుతున్నట్లు. ఎక్కడ పడుకున్నాడయ్యా అంటె, ఒక పాము చుట్టలు చుట్టలుగా ఉంటె దాని మీద పడుకున్నట్టు. ఆ పాము ఎక్కడ ఉందంటే అనంతమైన తరంగములు లేని తెల్లని సముద్రము మీద ఉన్నట్టు. ఆయన పాదముల దగ్గర లక్ష్మీదేవి ఉన్నట్టు ఇలా ఎందుకు చిత్రీకరించారంటే, అలా ఎక్కడో ఉన్నాడని కాదు. తత్త్వము యొక్క అవతరణము ఒక పక్క జరుగుతూ ఉంటుంది, మరో పక్క తిరోధానము జరుగుతూ ఉంటుంది. అవరోహణ క్రమములో అవ్యక్తమైన తత్త్వము చైతన్యవంతమై, అక్కడ నుంచి శక్తిని ఆధారము చేసుకొని పదార్థమైన సృష్టి జరుగుతూ వస్తుంటే, మరో పక్క పదార్థమైన సృష్టిని మళ్ళీ అదే శక్తి

ద్వారా సూక్ష్మమైన పదార్థములకి ఉపయోగించుకోవటం, అక్కడ నుంచి ఈ మొత్తానికి పుట్టుక స్థానానికి వెళ్ళటం, ఇంక అక్కడ నుంచి మనందరికి అందని తత్వములోకి తీసుకు వెళ్ళటం ఇలా కాలచక్రము తిరుగుతూ ఉంటుంది. అదే ప్రతీ మాసము జరుగుతుంది. అమావాస్య నుంచి పౌర్ణమి వరకు అవతరణం, పున్నమి నుంచి అమావాస్య వరకు తిరోధానం. యోగమునందున్న వారు, కాలము యొక్క గుణములు తెలిసిన వారు పౌర్ణమి వరకు బహిర్గతమైన పనులు చేసుకుంటూ, వారి వరకు అంతర్గతమైన కార్యక్రమాలు చేసుకుంటూ ఉంటారు. అమావాస్య వచ్చే వరకు పుట్టుక స్థానములోకి వెళ్ళిపోతారు. ఇవాళ మనకి అమావాస్య లేక ప్రతిపత్ ఈ పుట్టుక స్థానాన్ని 'నాభి ' అన్నారు. నాభి అంటే బొడ్డు కాదు. నాభి అంటే 'కేంద్రము' అని. ఈ మొత్తానికి కేంద్రము భగవంతుని యొక్క బొడ్డుగా దర్శనం చేసి, ఆ బొడ్డు లోంచి అది వికసిస్తోంది కాబట్టి దాన్ని 'పద్మము' గ దర్శనము చేసి, భగవంతునికి పద్మనాభ అని ఒక పేరు పెట్టారు. వ్యక్తము వికాసముగా వ్యక్తము అవటం. మనము వ్యక్తము అవుతూ ఉంటాము కదా. అది వికాసమో లేక వికారమో మనకి తెలియదు. మనం చేసే పనులు మనకి జీవితంలో వికాసముగా కొంత మందికి, వికారంగా కొంతమందికి ఉంటాయి. అవి వికారంగా తయారై మళ్ళీ మనకే డోకు వచ్చి, మననే ఇబ్బంది పెట్టి, అట్లా కొన్ని జీవితాలు ఉంటాయి. కొన్ని జీవితాలు వికసిస్తూ ఉంటాయి. వికాసము అంటే చైతన్యానికి సంబంధించిన వికాసము. ఈ వికాసము వారికి చైతన్యము వైపు వికాసము కొంతమందికి ఉంటె, మరి కొంత మంది పదార్థము వైపు వికాసము చెందిన వారు కొందరు ఉంటారు. సృష్టిలో ఎప్పుడు రెండు ఉంటాయి. వీరి మధ్య ఘర్షణ ఎప్పుడు ఉంటుంది. మానవ జాతి ఉన్నంత కాలం భూమి మీద ఘర్షణము ఉంటుంది ఎందుకంటే, కొంతమంది అటు వెళ్లే వాళ్ళు, కొంతమంది ఇటు వెళ్లే వాళ్ళు. కిందికి దిగి వచ్చే వాడికి అవగాహన వేరు. పైకి వెళ్లే వారికి అవగాహన వేరు. వాళ్ళిద్దరు కలిశారు అనుకోండి, భాష ఒక్కటైనా భావము వేరు కాబట్టి వీడొకటి చెప్తుంటే, వాడొకటి చెప్తాడు. తిరిగి వెళ్లే వాడికి కిందికి వెళ్లే వాడి గురించి అర్థము అవుతుంది. ఎందుకంటే వాడు అదంతా ఎరిగి మళ్ళా వెనక్కి వస్తాడు కనుక. ఉత్తర నుంచి దక్షిణం, తూర్పు నుంచి పడమర వెళ్లే వాళ్ళు ఉన్నారనుకో, తిరిగి వెళ్లే వాళ్ళకి ఏమి తెలుస్తుందంటే, మనము కూడా ఇది వరకు ఇలా వెళ్ళిన వాళ్లమే అని అనిపించడము సహజమే. మన అవగాహన వాడికి చెప్పినా ఉపయోగము లేదు, వాడి అవగాహన లో వాడికి అర్థమయ్యే విధంగా ఏదైనా పద్ధతి ఇస్తే సరిపోతుంది అనుకుంటాడు. అంతే తప్ప తాను తిరుగు ప్రయాణములో ఉన్నాడని, తన ప్రయాణము గురించి విషయాలు చెప్పాడనుకోండీ, సినిమాలో చెప్పినట్లుగా మనకి ఆయన పాటే కాదు, మాట కూడా అర్థము కాదు. ఏమి చెప్పినా అర్థము కాని స్థితిలో

కొందరు ఉంటారు. వాళ్ళకి చెప్పి ప్రయోజనము లేదు. ఎందుకంటే వాళ్ళకి చెప్పి మనం ఇంకా తికమక చేస్తుంటాము. అందుకని మనకి ఉండే ఈ యోగ విద్య, బ్రహ్మ విద్య తిరిగి వెళ్లే వారు ఎట్లాగో దాని కోసము తాపత్రయ పడి పట్టుకుంటారు కాబట్టి, పదార్థము వైపు వెళ్లే వాళ్ళని ఇబ్బంది పెట్ట కూడదని కొన్ని కట్లు విధించారు. ఎందుకని అంటే మీ కోసము కొన్ని ఇలా విధించారు. మనకి ఏది కావాలో అలా వెతుకుతూ వెళ్తుంటాము కాబట్టి. So వీళ్లిద్దరు ఇట్లా కలుస్తూ ఉంటారు. From spirit to matter కొంత మంది వెళ్తుంటే. కొంత మంది From matter to spirit వెళ్తుంటారు. కొందరు involutionary process లో ఉంటారు. కొందరు evolutionary process లో ఉంటారు. అందుకని తిరిగి వెళ్లే వాడు పదార్థానికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడు. ఎంత దూరం వెడతాడంటే భావము కూడా పదార్థమే కదా! వెలుగు కూడా పదార్థమే కదా! అనుకుంటాడు. అంటే అమ్మవారిని కూడా దాటి అయ్యవారితో ముడి పడదామని ప్రయత్నిస్తూ ఉంటాడు. ఇందాక చెప్పిన సంకేతములో అవ్యక్తమైన తత్వం నీలం అని ఎందుకు చెప్పారంటే అది మన అందరి మధ్య ఉండేది. Light ఆర్పేస్తే నలుపు అయిపోతుంది. Light వేస్తే తెలుపు అవుతుంది. కానీ ఉన్నది నీలమే! సూర్యుడు లేకపోతే ఆకాశం సూర్యుడు ఉంటే ఆకాశము, మధ్యలో ఉండే రంగులు అన్నీ కూడా నలుపు తెలుపు మధ్యలో ఉండే రంగులు. అట్లా ఉంటాడు ఆయన. ఆయన లో నుండి వచ్చే ఇచ్ఛే, బొడ్డులో నుంచి వచ్చే వికాసమన్నమాట! మనకి కూడా ఇచ్ఛ వస్తుంటుంది కదా లేవంగానే! ఆయన బొడ్డులో ఉండటం వల్ల, మన బొడ్డు లో కూడా ఉంటాయి అవి - ఇవి చేయాలని. ప్రపంచము అంత బాగు చేయాలని. మన లోంచి ఇచ్ఛ పుట్టింది, ఆయన లోంచీ ఇచ్ఛ పుట్టింది. ఆయన ఇచ్ఛ వికాసముగా ఏర్పడి, అది పద్మము లాగ వికసిస్తుంది. మన లోనించి పుట్టిన ఇచ్ఛ కూడా అట్లా ఉంటే, అంటే ధర్మానికి యుక్తమై ఉంటుంది. ధర్మముతో కలసి ఉన్నప్పుడు మనకి వచ్చినటువంటి సంకల్పం వికాసవంతమై ఉంటుంది. ధర్మానికి అనుగుణముగా లేని సంకల్పము ఏదైతే ఉంటుందో అది మనకి వికారము కలిగించుతుంది. కాబట్టి ఆయన లోంచి ఇచ్ఛ వచ్చింది. ఏమిటంటే వ్యక్తము అవుదామని. వ్యక్తము అయితే అయన లోంచి వచ్చిన మొదటి తరంగమే 'అమ్మ వారు'. మనము ఏమి ఆలోచించని స్థితిలో ఉంటాము కదా! ఆలోచించకుండ మనము ఉండలేము కాని, ఆలోచించక మనం ఉండగలం. ఆలోచన లేకుండా మనం ఉన్నాము కాబట్టి. మనకి ఆలోచన వచ్చిందనుకోండి, అదే మనకి ప్రధాన లేక మొదటి తరంగము! ఆ తరంగము ఎక్కడ నుంచి వచ్చింది? ఆయన లోంచే వచ్చింది కాబట్టి, ఆయనదే ఆ తరంగము కదా! పిండి లేనిదే రొట్టె రాదు కదా! రొట్టె లో పిండి ఉంది కదా! తరంగముగా వచ్చినప్పుడు, తరంగముగా ఎవరున్నారు? ఎవరి నుంచి ఆ తరంగము వచ్చిందో

వాళ్ళే అది గా ఉంటారు. భూమి నుంచి ఆవిరి వచ్చినట్లు, ఆవిరి నుంచి వర్షము వచ్చినట్లు. అసలు ముడి సరుకు లేకుండా ఇవన్నీ తయారవ్వవు కదా. కాబట్టి ముడి సరుకే ఒక తరంగంగా వచ్చింది. ఒక తరంగం మొత్తం ముడి సరుకుతో సమానము కాదు. పోల్చి చూస్తే చాల చిన్నది. మీకు ఎన్ని ఆలోచనలు వస్తున్నాయి పుట్టిన దగ్గర నుంచీ? అవన్నీ మన ఆధారంగానే వస్తున్నాయి. మన బట్టి వస్తుంటాయి మన ఆలోచనలన్నీ. అంటే మన ఆలోచన మనము అవటం చేత, అది వెళుతూ ఉంటె దాని వెంట మనమూ వెళ్తూ ఉంటాము. పుణ్య క్షేత్రానికి వెళదామన్నఆలోచన మనలో నుండే వచ్చినా, మొత్తం మనని పట్టుకు వెళ్తూ ఉంటుంది కదా! పుణ్యక్షేత్రానికి అవ్వొచ్చు లేక సినిమా Talkies కి అవ్వొచ్చు, మొత్తానికి పట్టుకు వెళ్తుంది. అందుకే తన నుంచి వచ్చిన ఇచ్ఛ మనకి 'అమ్మవారుగా' దర్శనము చేయిస్తారు బొమ్మలో. పడుకున్న అయ్యవారు పాదముల దగ్గర అమ్మవారు. ఎందుకని అమ్మవారిని పెట్టారంటే, 'ఇచ్ఛ' అని. మనలో కూడా ఇచ్ఛ ఉంది. ఒక్కొక్కరి ఇచ్ఛ ఒక్కొక్క విధంగా ఉంటుంది. పొద్దున్నే లేస్తే, ఎక్కడ నుంచి లేచాము అన్న భావనలో కొంత మంది ఉంటారు. లేస్తే ఏమి తిందాము అనుకునే వాళ్ళు కూడా ఉంటారు. పశువుకి లేవగానే ఏమి తిందాము అనిపిస్తుంది. తప్పు లేదు. ఎందుకంటే వాళ్ళు ప్రయాణము మొదలు పెట్టినవాళ్ళు. ఈ ప్రయాణములో తిరుగు దారి పట్టిన వాళ్ళు ఉంటారే , వాళ్ళు ఏమి అనుకుంటారంటే, ' అమ్మో! మనము అక్కడ నుంచి లేచాము. దానితో కొంత మనము ముడి వేసుకుందాము' అని. అదిట 'బ్రహ్మ ఇచ్ఛ'. లేచి లేవగానే మనం ఎక్కడ నుంచి లేచాము అనే భావన ఉండాలి. బ్రహ్మే అటువంటి భావన చేసాడంటే , ఆయన భావాల లోంచి పుట్టుకు వచ్చిన వాళ్ళం మనం కాబట్టి, మనము కూడా పొద్దునే లేవగానే ఎక్కడ నుంచి లేచాం అనే భావన చేయాలి. ఎక్కడ? మంచము మీద నుండి లేవగానే. అంటే శారీరికంగా లేవడం కాదు. మెలుకువ రావడమే లేవడం. ఎక్కడ నుంచి మనకి మెలుకువ వస్తుందో 'అక్కడ' ధ్యానం చేయమంటాడు, భగవంతుడు భగవద్గీతలో, ధ్యాన యోగంలో! అక్కడ ధ్యానం చేయండి. అక్కడ అంటే ఎక్కడ అంటే, ఈ 'అక్కడ' అనే భావన ఎక్కడ నీలో పుట్టిందో అక్కడ. నీ భావన పుట్టుక స్థానానికి నువ్వు వెడితే తెలిస్తే ఎక్కడ నుంచి పుట్టుకు వచ్చావో తెలుస్తుంది. పొద్దున్నే లేస్తే నేను ఉన్నాననే భావన ఒకటి ఉంటుంది. మిగతా భావాలు అన్నీ రాక ముందు 'నేను ఉన్నాను' అనే భావన మాత్రమే వస్తుంది. ఆ భావన వచ్చే లోగ మిగతావన్నీ దాన్ని మింగేసేటట్టుగా వచ్చేస్తాయి కాబట్టి కొంత 'Taken for granted' అన్నట్టుగా తీసుకుంటాము. ఉన్నాం కదా అని. నువ్వు ఉన్నావు అంటే, అసలు ఎట్లా ఉన్నావు అన్నది తెలియద్దూ? నువ్వు ఎట్లా స్పందిస్తున్నావు, ఎట్లా గాలి పీలుస్తున్నావు? నీలోంచి భావాలు అన్నీ ఎట్లా వస్తున్నాయి, ఇవన్నీ నీలో నుండి

వస్తున్నాయి కదా అవి ఎలా వస్తున్నాయీ అనే భావన రావద్దూ? బ్రహ్మకి వచ్చింది. ఎలా వచ్చాము మనము అనిపించింది. చూస్తే ఎక్కడో కూర్చున్నట్టుగా అనిపించింది. ఎక్కడ కూర్చున్నాడు అంటే పద్మములో కూర్చున్నాడు. అంటే వికసింపబడిన దానిలో ఉన్నాడన్నమాట. మనము కూడా అంతే! మనము పడుకున్నప్పుడు 'ఆదినారాయణులం'. లేవంగానే 'బ్రహ్మలం'. మన సృష్టి మనకి ఉన్నది కదా! లేచిన దగ్గర నుంచి తెగ సృష్టించాలి. భావాల లోంచే కదా మొత్తం అంత తయారు చేసాము. మంచో చెడో, ఎవరి సృష్టి వారు చేశారు కదా. ఈ సృష్టి అంతా చేయటానికి కారణము ఏమిటి? వాడి బొడ్డు లోంచి వచ్చినఆలోచనలే కదా! బొడ్డు లో నుండి ఆలోచనలు రావటానికి కారణము వీడు ఉన్నాడు కదా. వీడు ఎట్లా వచ్చాడు అసలు బయటకి? మనం ఎట్లా వచ్చాము అసలు బయటకి? మనం కూడా ఎవరి నుండో వికాసము అవడం వల్ల వచ్చాము కదా. బ్రహ్మ అలా వచ్చాడు. అందుకని బ్రహ్మ పుట్టినప్పుడు, బ్రహ్మ చేసిన సాధన చాల అత్యుత్తమైనది. మనము ఎక్కడ నుంచి పుట్టుకు వచ్చాము అంటే, వికాసము వచ్చింది మనని నిద్ర లేపింది. తెలివి వచ్చిందంటాం. ఇవాళ తెలివి రాలేదు అంటాం. తెలివి వచ్చాక కూడా పోతూ ఉంటుంది. ఒక్కొక్కప్పుడు ముందు తెలివి వస్తుంది. ఆ తరువాత అందులోంచి ఆలోచన వచ్చి ఉన్న తెలివి పోతుంది. అందుకని పిచ్చి పనులు చేయ కూడదు. ఈ తెలివి అనేది ఎక్కడ నుంచి వచ్చిందని ఆలోచించాలి. తెలివి రావడమే 'పద్మంలో కూర్చోడం'! పద్మంలో కూర్చున్నప్పుడు, ఈ పద్మం ఎక్కడ నుంచి పుట్టుకు వచ్చింది అనే భావన చేసి, చూద్దామని ఎంత దూరము వెళ్ళినా అంతులేదుట. ఆ విధముగా 'అనంతుని' దర్శనము చేసాడు. వెతుతున్న కొలది అలా సారంగములోకి వెళ్ళిపోతూ ఉంటె, భయం వేసిందిట. అంతు తెలియలేదు. ఎందుకైనా మంచిది, లేచిన చోటే కూర్చుందాము, అని వచ్చి కూర్చున్నాడు. అందుకని మనము కూడా లేచిన వెంటనే చేయాల్సిన సాధన యోగ పరంగా అదే! 'పద్మనాభుడ్ని' తలచుకోడమూ అంటే అది! ఆయన బొడ్డులో మనము ఒక కాడ పెట్టి, అందులో బ్రహ్మ ముఖం పెట్టమూ! అదొక అవగాహన. అతనిలో నుంచి మనం ఏవిధముగా వ్యక్తం అయ్యాము? అతడి లోనుంచి అతడే బ్రహ్మగా వ్యక్తము అయ్యాడు. అతడే ఇచ్ఛగ వ్యక్తము అయ్యాడు. అది అమ్మవారు! ఆ అమ్మవారి లోనుంచి మళ్ళా ఈయనే బయటకు వచ్చాడు బ్రహ్మగా. అదే తండ్రి కొడుకుగా పుట్టడం. కొడుకు తత్త్వము తండ్రి- తల్లి కలిపినది. అందుకని ఈయనకి మళ్ళీ భావన వస్తుంది. తరంగము కదా అమ్మవారు, అందుకని బ్రహ్మకి మళ్ళీ ఇచ్ఛ కలుగుతుంది. చేయాలని. అందుకు 'నేను ఏమి చేయాలని అడిగాడు?' ముందు ఆమె లోంచి తరంగము పుట్టింది. ముందు తాను ఎవరనే ప్రశ్న పుట్టింది, తరువాత ఆయన లోంచి తాను ఏమి చేయాలనే ప్రశ్న పుట్టింది. Who am I ? What

am I to do? ఏమి చేయాలంటే, 'సృష్టి' చేయమన్నాడు. ఈ భావన ఎక్కడ నుంచి వచ్చింది? తనలో తండ్రి తత్త్వము ఉంది, తల్లి తత్త్వమూ ఉంది. ప్రతి మనిషిలో కూడా తల్లి యొక్క తత్త్వం, తండ్రి యొక్క తత్త్వం ఉంటుంది. తల్లి రూపాన్ని ఇస్తుంది. తండ్రి బ్రహ్మ తత్వాన్ని ఇస్తాడు. ఇప్పుడు మనకి శాస్త్రజ్ఞులు 'ఒక జీవుడు పుట్టినప్పుడు ఎనిమిది అతి సూక్ష్మము అయిన బిందువులు ఏర్పడతాయి. అందులో ఒక బిందువు తండ్రి తత్త్వం లోనిది, మిగతా ఏడు బిందువులూ తల్లి తత్వాన్ని కలిగి ఉంటాయి' అని చెప్తున్నారు. మన సృష్టి కథలో మన పెద్ద వాళ్ళు చెప్పింది కూడా భగవంతుడనే తత్వం ఆధారంగా ప్రకృతి 7 లోకాలలో ఉంటుందని. శాస్త్రజ్ఞులు కూడా ఋషులే. వాళ్ళూ సత్య దర్శనము కోసమే తపస్సు చేస్తున్నారు. ఆ విధంగా వాళ్ళు తెలుసుకోవడం జరిగింది. అట్లాగే ఇప్పుడు ఈ బ్రహ్మగారికి అమ్మవారి తత్త్వం ఉన్నది. అది మళ్ళి ప్రవహిస్తుంది. ఆయన లోంచి ప్రవహించిన దాని వెంట ఆయన పడతాడు. మన లో నుండి ప్రవహించిన దాని వెంట మనం పడడం లేదూ? ఎక్కడో బెజవాడలో పెళ్లి అనుకోండీ, వెళ్లాలని అనిపించగానే పరుగెత్తడం లేదూ? అంటే మన భావన వెంట మనం పరుగెత్తడమే కదా! అందుకని వేదములో ఏమి చెప్పారంటే, బ్రహ్మ లోంచి సరస్వతి పుడితే, సరస్వతి వెంట బ్రహ్మ పరుగెత్తాడని. మన భావన వెంట మనం పరిగెడుతుంటాం. మన భావనే మన సంకల్పంగా వస్తే ముందుకు వెళ్తూ ఉంటాము. అట్లాగే భగవంతుని నుండి వచ్చిన భావన లోంచి బ్రహ్మ వస్తే, బ్రహ్మ లోంచి మళ్ళా భావన వచ్చి ఒకరిని సృష్టిస్తే, దాని లోంచి మళ్ళా భావన వస్తే, అలా ప్రజాపతులు, మనువులు పుట్టారు. సప్త ఋషులు పుట్టారు. మానస పుత్రులు పుట్టారు. వాళ్ళందరి లోంచి మళ్ళా భావనలు పుట్టాయి. అంటే ఒకరి లోంచి ఒకరు పుట్టుకొస్తుంటాము కదా! దేని లోంచి ఏది ఎట్లా పుట్టుకొస్తోందో మనం ప్రకృతిని చూస్తే తెలుస్తుంది. ఇదంతా ఒకరి భావన లోంచి వచ్చింది. ప్రతీదీ అట్లాగే వస్తుంది. దీనంతటికి కేంద్రము ఏమిటి అనే భావన చేస్తే, దాన్ని 'పద్మనాభ స్థానం' అంటారు. అందుకనే మనం అర్ధరాత్రికే, పద్మనాభుడికి సంబంధము పెడతాము. నారాయణ కవచం చదివితే, పద్మనాభ యొక్క ఘడియలు ఎప్పుడు వస్తున్నాయో అందులో రాసుంది. 'నిశీధ ఏకో వతు పద్మనాభః' అంటే చీకటిలో ఒక్కడే ఉంటాడట. ఆ time లో రక్షించవలసిన వాడు ఎవరంటే 'పద్మనాభ'అనే నారాయణుడు. కేశవ నామాల్లో కూడా 'పద్మనాభుడు' వస్తాడు. బ్రహ్మ ఒక్కడే ఉన్నాడట. మనం కూడా ఒక్కరమే ఉన్నప్పుడు మనకి ఎవరున్నారిక ? వాడుంటాడు! ఉన్నాడు, తానూ ఉన్నాను అన్న భావన ఉంటె అమ్మవారు కూడా ఉంటుంది. భావన ఉంటే 'అమ్మవారు' ఉన్నట్టే! నేను ఉన్నాను అన్న భావన ఉంటె, అమ్మవారు ఉన్నట్టే. అతడే నేనుగా ఉన్నాను అన్న భావన ఉంటె కూడా అమ్మవారు ఉన్నట్టే. అసలు నేను ఉన్నానని కూడా మర్చిపోయడనుకో,

అప్పుడు 'అయ్యవారు' గా ఉంటాడు. ఈ తరంగము/సంకల్పము ఎదైతేఉందో, అప్పుడు నేనున్నాను అని ఉంటుంది. నిద్ర లో లేదు కదా! ఉన్నాము కానీ, ఉన్నామన్న భావన లేదుకదా. వాడు నారాయణుడు! లేవగానే, నేను ఉన్నానన్న భావనే 'సత్యము చైతన్యవంతము అయినట్టు'. ఉన్న స్థితిని 'సత్యము' అంటారు. Existence! ఉన్న వాడు చైతన్యవంతమై ఉన్నాడట. అంటే అమ్మవారితో కలసి ఉండటమట. అందుకని 'నేను ఉన్నాను' అనే సత్యమైన స్థితి నుంచి 'నేను ఉన్నాను' అనే భావాత్మకమైన స్థితిలోకి వస్తారు. నిజానికి మనము లేము. వాడే మనముగా ఉన్నాడు. మనం ఉన్నాము అని అనుకుంటే అనుకోనిస్తాడు. అది సత్యం! అది భగవద్గీతలో మూలమైన రహస్యం! తొమ్మిదో అధ్యాయములో చెప్తాడు శ్రీకృష్ణుడు! 'నిజానికి నువ్వు లేవు, నేనే ఉన్నాను.నువ్వు ఉన్నావని అనుకోనిస్తున్నాను' అంటాడు . సముద్రము అల గా ఉంది. సముద్రము లేకపోతే అల లేదు. సముద్రము అలగా ఉన్నప్పుడు, అలగా ఒకటి ఉంది అని మనం అనుకుంటే అనుకోనిస్తాడు, అంతే! సముద్రము అస్థిత్వము అలగా ఎలా ఉందో, భగవంతుని అస్థిత్వము జీవకోటిగా ఉందే తప్ప ఇంకోలా లేదు. అందుకే మనం లేవగానే అతడే నేనుగా ఉన్నానని ధ్యానం చేయాలి. అది చెప్పడమే లోకానికి హృదయ స్పందన! అందుకనే స్పందన తలచుకోవడం వల్ల 'మనం లేము. ఉన్నాము అనుకోడమూ వల్ల ఇదంతా పెట్టుకున్నాము . ఆయనే ఉన్నాడు. ఆయనే పని చేసుకుంటాడు. మనం చూస్తూ ఉందాం'. అనే పరిస్థితి ఒకటి వస్తుంది. మనం పని చేస్తుంటే ఆయన చూస్తుంటాడు. ఆయన పని చేస్తుంటే మనం చూస్తుంటాము. ఎంత సుఖం! నేను ఇట్లా కూర్చుంటాను మీరు నడిపించండి, అని కదా అర్జునుడు అట్లా రథములో కూర్చొని, కృష్ణుడు నడిపించే బొమ్మ నిచ్చారు. అలా ఒక రథం లో కూర్చోపెట్టి అర్జునుడి దగ్గర మొత్తం భగవద్గీత అంతా చదువుకోటానికి యుద్ధంలో time లేదు కదా ! అది కూడా మనకి ఒక సంకేతమే. అదేమిటంటే, సంకల్పము ఆయన నుంచి దివ్య సంకల్పంగా వచ్చింది. అదే దివ్య సంకల్పం అట్లాగే వెళ్లాలంటే నువ్వు కేవలం ఒక వాహికగా ఉంటె ఆ సంకల్పం అట్లా వెళ్తుంది. నువ్వు వాహికగా ఉండకుండా అడ్డు పడ్డావనుకో, నీ రంగు, నీ కంపు దానికి అంటిస్తే, తరువాత వచ్చేది నీ కంపుతోనే ఉంటుంది. ఇచ్చే నీళ్లు మంచివే అయినా, గొట్టాలు కంపుగా ఉన్నాయనుకోండి నీళ్ళని కంపు చేస్తాయి కదా! ఇవి కుళ్ళు నీళ్లు, ఇవి మంచి నీళ్లు అంటాము కదా! నీళ్ళకి మంచి లేదు, కుళ్ళు లేదు. ఉండే స్థానం బట్టి, వాహికని బట్టి. తోమని గ్లాసులో పోసామనుకోండి, కంపు కొడుతుంది. తోమిన గ్లాసులో పోసామనుకోండి, కంపు ఉండదు. నీటికి కంపు ఉందా? అట్లాగే భగవత్ తత్వాన్ని బ్రహ్మ గారు 'నేను ఏమి చేయాలి'? అంటే, తపస్సు చేస్తే తెలుస్తుంది ఏమి చేయాలో అన్నారు. అప్పుడు 'తప' అనే పదం వినిపించిందిట

అతనికి. అంతకు ముందే 'అతడే నేను'గా తెలుసుకున్నాడు కదా! దాన్నే 'జపము' అంటారు. మన జపం, లోపల జరుగుతూ ఉన్న దానితో మనసుని అతికించడమే మనం చేయవలసిన పని. జపము ఎప్పుడూ జరుగుతుంటుంది లోపల! అదే 'స్పందనం'! ఆ స్పందనం'సోహం అస్మి', అని చెప్తుంది. సోహం, సోహం అనే అది, వ్యక్తము అవటం మళ్ళీ తిరోధానం అవటం. వ్యక్తం అయినప్పుడు ఒక శబ్దం, మళ్ళి వెనక్కి వచ్చినపుడు ఒక శబ్దం. స్పందన లోంచి ఈ రెండు వినిపిస్తాయి. 'సోహం' వినమన్నారు తప్పా, సోహం అంటూ వుంటే మళ్ళీ మనస్సే పనిచేస్తుంది. సోహం ని వినాలి. అది ఉచ్వాస - నిశ్వాస లుగా వ్యక్తము అవుతుంది. అంటే ఇంకొంచెం బహిర్గతంగా. అంతర్గతం గా స్పందనగా వ్యక్తమౌతుంది. ఆ స్పందనకి అవతల ఎవరున్నారంటే, కమలానికి పైన ఒకడు ఉన్నాడు, కమలానికి ఆధారంగా ఒకడున్నాడు కదా! ఇక్కడ మనం స్పందనమే కమలమనుకుంటే, దానికి ఇవతలగా మొత్తం తత్త్వం ఉంది. ఆ మొత్తం తత్త్వం స్పందన లో నుండి మనంగా బయటకి వస్తాము. కాబట్టి ముందు జపం 'వాడే నేను' గా ఉన్నానని. రెండోది, 'ఏమి చేయాలి?' వాడు చేసుకుంటాడు, నువ్వు అట్లా ఉంటె! ఎందుకంటే నువ్వు కావాలని కోరి సంకల్పించి పుట్టలేదు కదా! మనమంతా ప్రణాళిక ప్రకారం తెలుగు దేశం లో పుట్టామా? లేదుగా! ఎదో ఒక ప్రణాళికలో భాగముగా వచ్చాము కాబట్టి, ఆ ప్రణాళికకి వదిలేస్తే అదే పట్టుకుపోతుంది. అదే 'నాప్రణాళిక దివ్య ప్రణాళికగా' అని ఆశంశనం చేసుకుంటున్నాం. దాన్నే యేసు క్రీస్తు, 'Father ! Thy will be done, not mine,' అన్నాడు. నీ సంకల్పం ప్రకారమే కానియ్యి. నా సంకల్పాలు వద్దు, అని చెప్పాడు. పోద్దున్నే లేవగానే భగవత్ సంకల్పం ప్రకారము తమ జీవితము సాగాలని కొంతమంది బండిని గాడిలో పెట్టుకుంటారు . లేదంటే మన దారి మనది. అది ఎటో పట్టుకు పోతుంటుంది. అక్కడ నుండి మళ్ళి లాక్కు రావాలి. అందుకనే ఆయన సంకల్పము అని తెలుసుకోవడం కోసం తపస్సు చేసి, ఆ విధంగా మనం చేయాలి. మరి మనం లోపలకి ఎలా లోపలకి వెళ్ళాలి? నిద్ర లేవగానే ఎక్కడ నుంచి లేచాము? అక్కడ ధ్యానము చేయాలి. ధ్యాన యోగములో రహస్యము అదే! ఎక్కడ నుంచి సంకల్పాలు వస్తున్నాయో అక్కడ గమనించు. ఎక్కడ నేను ఉన్నాను అని నువ్వు అనుకుంటున్నావో అక్కడకి చేరు. తరువాత అక్కడ నుంచి వెతుక్కోవాలి, 'ఏమి చేయమంటారు Sir' అని. అందుకనే ఈ 33 కోట్ల దేవతలూ ఇబ్బంది వస్తే సృష్టిలో crisis వస్తుంది. Crisis వచ్చినప్పుడల్లా వీళ్ళందరు బ్రహ్మ దగ్గరకి వెళ్తారు. ఇట్లా వచ్చింది ఏమి చేయాలని అడుగుతారు. అప్పుడు బ్రహ్మ తన లోపలకి వెళ్తాడు. అదీ నారాయణుడు దగ్గరకి వెళ్ళడమంటే! లోపలకి వెళ్తే ఆయనకి వినిపిస్తుంది ఇట్లా చేసుకోండి అని.అది విని అట్లా చెప్తాడు మళ్ళా వీరికి. వినడమే ! అందుకనే చూడ్డము

కన్నా వినడం ఎక్కువగ చెప్తారు పెద్దలు. భగవంతుడు శబ్దముగా వచ్చి వెలుగు అయ్యాడు. అందుకని చూద్దామన్న, విందామన్న ఒక స్థితిలో ఒకటే. చూట్టానికి వినటానికి ఒకే అవయవము ఉన్నది పాములకి. అందుకనే అది వింటే చూడగలుగుతుంది, చూస్తే వినగలుగుతుంది. చూసి వింటుంది, విని చూస్తుంది. మనం కూడా కళ్ళు మూసుకొని వింటే ఎదైనా, ఆ దృశ్యము అంతా కనబడదూ? కానీ చూస్తే అంత బాగా వినబడదు. అందుకని వినడం! బ్రహ్మ వింటాడు. ఎక్కడ నుంచి వింటాడు? అవ్యక్తం నుంచి వింటాడు. అందుకనే పెద్దలు తత్త్వమునకు రూపము, నామము ఏవి లేవనే చెప్తారు. అది వినగలిగే శక్తి ఎవరికి ఉంటుందంటే తాను మొత్తము తత్త్వములో భాగం అని తెలిసిన వాడికి! అందరికి వినబడదు. మొత్తం తత్వం లో భాగంగా ఉన్న వాడు, మొత్తము తత్త్వములో భాగంగా మాట్లాడతాడే తప్ప, స్వంత మాటలు మాట్లాడడం ఉండదు. మనకి పద్మనాభో అరవిందాక్ష అని next నామము ఉంది. ఆయన లోంచి సృష్టి వస్తుంటే ఆయన చూస్తున్నాడండి, ఆయన చేయడము లేదు. అందుకనే 'నేను ఏమి చేయను, చూస్తుంటాను' , అని అంటాడు. ఒక సంకల్పాన్ని వ్యక్తము చేసాడు. వ్యక్తము అయ్యింది, నేను వ్యక్తము చేయలేదు అంటాడు. మన బతుకు కూడా అంతే! సంకల్పము మనకి పుడుతుంది తప్ప, మనం పుట్టించామా? మనమే సంకల్పం పుట్టించి ఉంటే, వద్దు, అని అనుకుంటే ఆపేయగలగాలిగా! సంకల్పాలు వస్తుంటాయి, అది 'అమ్మవారి తత్త్వము'. ఉండడం అనే అయ్యవారుగా మనము ఉంటె, మనలో సంకల్పాలుగా అమ్మవారు వస్తుంది. మనకి వచ్చే సంకల్పాలలో మనకి ఉండే పవిత్రతని బట్టి సవ్యమైనవి, అపసవ్యమైనవి వస్తాయి. పవిత్రత అనేది చక్రములో ముందుకి వెళ్ళటం, వెనక్కి రావటములో భాగముగా జరుగుతూ ఉంటుంది.ఈ ముందుకు వెళ్ళటం, వెనక్కి రావటము ఉంటుంది కదా. అదే 'కాలచక్రము'. ఆ కాలచక్రమే ఆయన పడుకున్న 'ఆదిశేషు'! అంటే కాలం రూపములో ముగ్గురితో ఆడతాడు ఆయన. ఒకడేమో వెళ్లిపోయేవారిని చక్ర రూపములో తిరిగి, మళ్ళి తిరిగి పట్టుకు వస్తుంటాడు. ఈ కాల చక్రము సంకల్పము వచ్చినప్పటి నుంచి వస్తుంది. తన లోంచి సంకల్పము రావటము చేత , అది మొదలుగా కాలము పుడుతుంది. మనలోంచి సంకల్పం వచ్చినప్పటి నుంచి లెక్క వేయమూ ఎప్పటి నుంచి అంటే? ఒక ఇల్లు ఎప్పుడు కట్టారంటే చెప్తాము , పిల్లలు ఎప్పుడు పుట్టారంటే చెప్తాము. పెళ్లి అయి ఎన్ని ఏళ్ళు అయ్యింది అంటే చెప్తాము. అంటే ఏమిటి ఇదీ? మనకి తెలిసిన ఒక స్థానము నుంచి కొలత. ఇక్కడా మొదటి తరంగము తన లోంచి వ్యక్తము అయ్యి ఉందే, అప్పటి నుంచి ప్రారంభము అవుతుంది. అందుకనే ఆయన లోంచి తరంగము రావటమే కాకుండా, కాలమూ వస్తుంది. అంటే ప్రకృతి రావడమే కాకుండా, కాలము కూడా వస్తుంది. ప్రకృతి వచ్చినప్పుడు, అంటే

సంకల్పము వచ్చినప్పుడు ఆ సంకల్పానికి బలం మళ్ళి తనలో నుండే ప్రకృతి లాక్కుంటుంది. ఊరికే కూర్చుని మనకి సంకల్పము వచ్చిందనుకోండీ హిమాలయాలు వెళ్తే బాగుంటుందనీ! హిమాలయాలకు లాక్కు వెళ్ళదూ? సంకల్పాలు చేసినా కొంత మందికి నెరవేరవు. అప్పుడు ఏమంటాము మనం ? 'సంకల్ప బలము ఉండాలి', అని అంటాము. ఈ సంకల్పానికి బలం ఎక్కడ నుంచి వస్తుందీ? మళ్ళ వాడి లో నుండే వస్తుంది. దానినే 'శక్తి' అన్నారు. ఇలా మూడు వచ్చాయి. కాలం వచ్చింది, సంకల్పం వచ్చింది, సకాలం లో సంకల్పం నిర్వర్తించగలిగే శక్తి. ఇన్ని వస్తే ఆయన నాలుగో వాడుగా వచ్చాడండీ! ఆయనే బ్రహ్మ! అందుకనే ఆయనకి నాలుగు ముఖాలు. నాలుగు ముఖాలు ఎట్లా వచ్చినాయి? ఆయన అంటూ ఒకడు లేడు కదా! కానీ ఆయన నలుగురికి సంకేతముగా అక్కడ ఉన్నాడు. ఆయనకి కాల జ్ఞానం ఉంది. ప్రకృతి యొక్క సహకారం ఉంది. శక్తి యొక్క సహకారము ఉన్నది. అంతే కాకుండా 'అతడే' తానుగా వచ్చాడు కాబట్టి ఆయనే అక్కడ ఉన్నాడు. అందుకని నాలుగు ముఖాలు. అందుకే నాలుగు, నాలుగుగా కొట్టుకొని పోతాడు. నాలుగు వేదాలు చేసాడట. నాలుగు కాలాలు చేసాడట. ఎందుకంటే నాలుగుఆయనకిచ్చారు కాబట్టి. ఆ నాలుగు ఇవ్వలేదనుకో పనే కాదు. ఈ నాలుగులో సంకల్పము లేదనుకోండి, ఇహ ముందుకి వేళ్లేదే లేదు. సంకల్పం లేకపోతె కాలం లేదు. కాలం, సంకల్పం ఉండి బలం లేదనుకోండి తను లేవడు, నీరసముగా పడుకుంటాడు. అట్లాగే పనిలోనూ నీరసమే! సంకల్పం నిర్వర్తించడము లో కూడా నీరసం, ఇవన్నీ ఎందుకు వస్తాయంటే, ఈ నాలుగు లేకపోతె! ఇట్లా బయటకి వస్తే, ఆ వచ్చింది ఎలా చేస్తుందో కళ్ళు పెట్టుకు చూస్తుంటాడుట ఈ పడుకున్నాయన.

359 అరవిందాక్ష:

పద్మ దళములు వంటి కనులు పెట్టి ఆ జరుగుతున్నది చూస్తుంటాడు. మనకి ఏ సంబంధము లేదని చెప్తాడు. ఎవరికి సంబంధము అంటే, 'నాలోంచి పుట్టిన సంకల్పం ఇవన్నీ పోగేసుకు చేసుకొనే మొత్తం తాపత్రయం అంత ఆవిడదే తప్ప నాకు ఏమి లేదు, ఎక్కడ పడితే అక్కడ ఉంటా', అని చెప్తాడు. 'అది ఎట్లా విచ్చుకుంటే అట్లా అందులోకి నేను వెళ్లి ఉంటాను. నేను ఉండని ప్రదేశము లేదు. నేను ఉండనిది లేదు', అంటాడు. అందుకని రాయి, పాము, తేలు, బొద్దింక, మనకి ఇష్టము అయినవారు, ఇష్టము లేనివారు అన్నిటిలో ఉంటాడు. ఎందుకంటే అది లేకపోతె అక్కడ పని ఏమి కాదు. అట్లా ఉండే వాడిని స్థాణుః అంటారు. నన్ను పెట్టుకొని మీరు అల్లుకోమన్నాడు. అల్లేది ఎవరు? 'అమ్మవారు'. మనము అట్లా మనలోంచి వచ్చే వాటిని చూస్తూ ఉండగలమా? చేస్తూ చూస్తూ ఉండాలి! భగవంతుడే లేకపోతె అంటే తత్వమే లేకపోతె అందులో నుంచి లేవటము అనేదే లేదు కదా! చైతన్యవంతులము అవుతున్నామంటే, అది అవడానికి కావలసిన potential లేకపోతె చైతన్యవంతులం అవలేము కదా! అందుకనే ఏమీలేదూ, దానంతట అదే అంతా ఏర్పడుతోందనే science సిద్ధాంతము మన ఋషులు ఒప్పుకోరు. ఎందుకంటే 'అసలు తెలివి' లేకుండా ఇవన్నీ ఎట్లా ఇట్లా వచ్చాయి కొత్తగా. మొత్తం అంతా Physics and Chemistry and Biochemistry ఇదే ఉంది అంటారు. ఈ Physics , Chemistry , Biochemistry అవి అట్లాగే ఉండటానికి, అవి ఆ పాళ్లల్లో కలవటానికి ఎదో ఒక ప్రజ్ఞ ఉండాలి కదా! అది అట్లా ఎందుకు కావాలి? మన బోటి వాళ్ళకి అర్థము అవటానికి ఉదాహరణ మాస్టరుగారు చెప్పేవారు. శాస్త్రము ఏమి చెప్తుందంటే నీళ్ళల్లో శనగలు వేస్తె, శనగలు నాన్తాయి. అది ప్రకృతి యొక్క కార్యక్రమము. దాని గురించి పెద్దగా theory చెప్పనక్కర లేదు అస్తికమైన రీతిలో. శనగలు నీళ్ళల్లో నాంతాయనేది correct కానీ, వాటిని నీళ్ళల్లో వేసేవాడు ఒకడు ఉండాలి కదా! నీళ్ళల్లో వాటి మట్టుకు అవి పడి నానవు కదా! అలాగే ఇంకో ఉదాహరణ చెప్పారు. తమలపాకు, వక్క, సున్నము కలిపితే ఎరుపు రంగు వస్తుందని. మూడు కలిపే వాడు ఒకడు ఉండాలి కదా! రెండు units hydrogen, ఒక unit oxygen కలిపితే నీళ్లు వస్తాయని చెప్పారు. ఎవరు కలిపారు? నువ్వు కలిపావా? నువ్వు ఉన్నావా కలపటానికి? అంటే మామూలుగా ఈ science ఇలా అనడానికి కారణం అంతకు ముందు ఈ తత్వం గురించి చెప్పిన వారు అందరూ కూడ సరైన పద్ధతిలో చెప్పకపోవటం వల్ల. వాళ్ళు ఏమి చేసారంటే మనకి అర్థము

కావటానికి అన్నీ 'మనిషి' రూపములో పెట్టేసరికి, వాళ్ళందరూ భగవంతుడి మనుషులుగా మనం నమ్మడం మొదలు పెట్టటము వల్ల, మళ్ళా కొత్త సిద్ధాంతము తయారు చేసాము. అందుకని అటువంటి వాళ్ళు ఎవరు లేరో వాళ్ళందరూ కలసిపోతుంటారు వీరిలో. కానీ నిజముగా మన పెద్దలు చెప్పిందేమిటంటే, మొదట రూపాలు ఏమి లేవు, తత్వానికి కొన్ని రూపాలు తయారు చేసాము అవగాహన కోసం, అని. సినిమాలలో చూపిస్తారు మనకి గంగాదేవి నాట్యం చేస్తూ శివుని నెత్తి మీద నుండి వస్తున్నట్లు. నిజానికి అలా శివుడు కుర్చున్నాడా? ఆమె అలా వచ్చిందా? మనకి అర్థం కావడానికి తత్వానికి రూపకల్పన చేసారు. మీకు చాలా మంది స్నేహితులు ఉన్నారు, వారిలో ఏ భాగము స్నేహితుడు? భార్య, భార్య అంటావు. భార్యలో ఏ భాగము నువ్వు భార్యగా చూస్తున్నావు? ఏది భార్య అందులో? భావనే కదా? అట్లాగే భర్త! నిజానికి భార్య, భర్తలుగా ఏదైనా ఒకటి ఉందా? కేవలము భావనే కదా! తత్త్వముగా మీరు అవగాహన చేసుకోండి. ఆ తత్త్వము ఏమిటో తెలియటానికి దాని నామములో ఒక రహస్యం చేసి పెట్టారు. అది పెద్దలు చేసిన పని. ఏ తత్వానికి సంబంధించిన నామము దానికి పెట్టారు. మనలాగ సూర్యనారాయణ అని పేరు పెట్టుకొని ఎప్పుడూ మొద్దల్లే ఉండదు. సూర్యనారాయణ అంటే ఎప్పుడు సూర్యనారాయణునిలా వెలుగ్గా ఉండాలి. అక్కడ పెట్టిన నామాలు అన్ని కూడా వ్యుత్పత్తి అర్థాలు కలిగినవి. కేవలము సంస్కృత భాషలో వాటి అర్థములు ఉన్నవి తప్ప ఇంకెక్కడా లేవు. అవి చాలా లోతైనవి. సంస్కృతములో చెప్పిన అన్ని పదములకు కూడా ఆ పదములో ఆ వస్తువు ఏ విధంగా వుత్పత్తి అయినదో, దానికి సంబంధించిన శబ్ద తరంగాల రహస్యము అంతా అందులోనే ఉంటుంది. రామ అనే శబ్దము ఉందనుకోండి, దానికి ఒక వ్యుత్పత్తి అర్థము ఉంది. విష్ణు అనే పదము అన్నామనుకోండి, దానిలో ఒక వ్యుత్పత్తి అర్థము ఉంది. గణపతి అన్నామనుకోండి, వ్యుత్పత్తి అర్థము ఉంది. అలాగే దుర్గ న్నామనుకోండి వ్యుత్పత్తి అర్థం ఉంది. అందుకని ఆ వ్యుత్పత్తి అర్థము లోకి వెళ్తే దాని రహస్యము తెలుస్తుంది. తత్త్వము తెలుస్తుంది. తత్త్వము అంటే భగవంతుడు సృష్టిలో రకరకాల పద్ధతులలో అస్థిత్వము కలిగి ఉంటాడని తెలుస్తుంది. జలము అంటే ఒక అర్థము ఉంది. నీళ్లు అంటే లేదు. ద్వారము అంటే అర్థము ఉంది, తలుపు అంటే లేదు. 'ద్వా' అనే శబ్దము లోంచి వచ్చింది. అందుకనే దీన్ని తెలియాలంటే వేదములో ఒక రహస్యము ఉంది. ఒక అంగము ఉంది. దానికి ఒక తాళం చెవి ఉంది. దానిని 'నిరుక్తము' అంటారు. ఆంగ్లములో దాన్ని Etymological key అంటారు. అది పెట్టి తిప్పితే అందులో రహస్యముంది. అందుకని బ్రహ్మగారు ఈ నాలుగు బట్టి ముందుకు వెళ్తూ ఉంటారు. వెళ్తూ ఉంటె 'అది' ఏర్పడుతూ ఉంటుంది. ఏర్పడినది తమ క్రమబద్ధత చూస్తూ ఉంటారు. అందులో

ఉన్నదా? సృష్టించిన దానిలో? ఉన్నాడు! లేకపోతె ఏర్పడదు కదా! పూరి చేద్దామని అనుకుంటే, పిండి లేకపోతె రాదు కదా పూరి. ఆయనే మూల ప్రభావము, మూల సంకల్పం. కాబట్టి ఉన్నాడు. కాని స్థితి మార్పు చెంది ఉన్నాడా అంటే లేదు. అట్లాగే ఉంటాడు. అందుకనే 'నాకు అవస్థితులు లేవు', అంటాడు. మనకి చాలా అవస్థితులు ఉన్నాయి, అవస్థలు ఉన్నాయి. అవస్థితి అంటే ఏమిటి? మారిపోతూ ఉంటాము కదా! ఆయన మారకుండా ఉంటాడు. ఆవిడ చేస్తూ ఉంటె ఆయన చూస్తూ ఉంటాడు తప్పా, అందులో ఇరుక్కొని పప్పులో పడడు. మనము చేసే దాంట్లో మనం ఇరుక్కొని క్రింద పడుతూ ఉంటాము. బ్రహ్మగారు మాత్రం చేసే దాంట్లో ఇరుక్కుపోయి, ఆమ్మో! ఇరుక్కున్నామని అనుకొని మళ్ళి వెనక్కి వెళ్ళి ఆ ఇరుకు లోంచి బయటకి వస్తాడు. బ్రహ్మగారు ఇట్లా సృష్టి చేస్తూ ఉంటె, ఆయన relax అయి పడుకుని చూస్తుంటాడు కదా బొమ్మలో. తన లోంచి వచ్చేవే అన్నీ చేస్తుంటే చూస్తుంటాడు. మనలోంచి వచ్చేవి మన ఆధారంగా జరుగుతున్నవి, మనము కూడా చూస్తున్నట్లయితే సుఖ పడతాము. అది మన భాగవతులు చేసే పని! మనకి అది చేత కాదు. మనలోంచి వచ్చేవి మనం చూస్తూ, చేస్తూ ఉండటమే. చేస్తున్నామా అంటే చేయటము లేదు. చేయటము లేదా అంటే చేస్తున్నాము. అదే చెప్తాడు శ్రీకృష్ణుడు నాలుగో అధ్యాయములో. కృష్ణుడు చెప్పంది లేదు. ఈయనే లేకపోతె తరంగమే లేదు, తరంగమే లేకపోతె ఇంకేమీ లేదు. సంకల్పం లేకపోతె ఏమి లేదు కదా! అందువల్ల ఈయన లేకుండా ఏమి లేదు. మరి ఏమిటయ్యా అంటే, 'నేనేమీ చేయడం లేదు సంకల్పం చేస్తోంది ఇదంతా' అంటాడు. 'ప్రకృతి తనకి ఉండే ఈ మూడు గుణముల చేత ఈ మొత్తమంతా నన్ను ఆధారంగా చేసుకొని అల్లుకుంటోంది, ఆమెకి నేను సహకరిస్తున్నాను'. అంటాడు. మనం కూడా పాద్దునే లేచిన దగ్గర నుంచి తెగ అల్లుతాము. అల్లడమే కాదు పేనుతాము కూడా! మన పేనుడులో మనకి చికాకు వేస్తుంది. మన పేనుడులో మనం ఇరుక్కుంటాము, ఆయన ఇరుక్కోడు. అందుకని మనము కూడా నడుస్తూ ఉంటె చూస్తూ ఉండాలి. అదీ కృష్ణుడు చెప్పిన 'యుద్ధములో నేను ఉంటాను, యుద్ధము చేయను' అనడం. అని చేసి చూపించాడు. వేదములో చెప్పిన సమస్తము ఒక మనిషి రూపు కట్టుకొని నిర్వర్తిస్తుంటే ఎట్లా ఉంటుందనేది శ్రీకృష్ణుడు మాత్రమే చెప్పాడు. ఇది ఇలా ఉంటుందని ఎవరు సాహసించి చెప్పలేదు. అందుకని ఆయన 'చేసే వాడిలో చేయని వాడిని చూడు, చేయని వాడిలో చేసే వాడిని చూడు,' అంటాడు.

"కర్మణ్యకర్మ యః పశ్యే అకర్మణి చ కర్మ యః
స బుద్ధిమాన్ మనుష్యేషు సయుక్త: కృత్స్న కర్మకృత్"

అంటాడు. భారత యుద్ధము ఆయన చేస్తేనే అయ్యిందా, ఆయన చేసాడా? 'నేను ఏమి చేయను. కూర్చుంటాను', అన్నాడు. అదీ President అంటే! President

కూర్చొని సభకి అధ్యక్షత వహిస్తాడు. అది సమావేశంగా ఉండేలా చూస్తాడు. వాడూ అధ్యక్షుడు! సమావేశము అంటే అందరి భావముల equilibrium ఉండేటట్టుగా చూసే వాడు అధ్యక్షుడు. ఈయన అట్లా అధ్యక్షుడుగా ఉంటాడు. నేను President ని , కానీ నేను ఏమి చేయను. కానీ నేను లేకపోతే ఏమి జరగదు. మొత్తము అంతటిలో, జరిగేదంట్లో ఏమి చేయనట్టుగా ఒకడు ఉంటాడు, వాడే అన్ని చేస్తూ ఉంటాడు. శరీరములో ఉన్న సమస్త దేవతలూ/అవయవాలు ఒక సభ పెట్టుకున్నాయట. వాడు ఉంటెనే ఇవి ఉన్నాయని తెలియక, వాడిని పిలవకుండా సభ పెట్టుకున్నారట. ఇందులో ఏ అవయవము important అని. ప్రతి వాళ్లు వారివారి గొప్పదనము అంతా చెప్పారు. అక్కడకు పిలవని వాడు ఒకడు ఉన్నాడు కదా. వాడు 'నన్ను పిలవ లేదు కదా' అని వెళ్ళిపోయాడు. వాడే స్పందనము! వాడు ఉన్నట్టు మనకి తెలియదు కదా! గుండె ఆగిపోతేనే గుండె ఉన్నట్టు తెలుస్తుంది. కొట్టుకుంటున్నప్పుడు తెలియదు కదా మనకి. అలాగే 'హృదయ స్పందనము' నిర్వర్తించే ప్రజ్ఞ ఏదైతే ఉందొ అది, సరే మనం బయటకి వెడదామని అలా బయటకి అడుగు పెట్టే ప్రయత్నానికే శరీరం అంతటికీ మూర్ఛ వచ్చేస్తుంది. 'ఆమ్మో'! అనిపిస్తుంది! కాబట్టి అట్లా చేస్తూ ఉంటాడు. అదీ 'అరవిందాక్షుడు' చేసే పని. 'నేను అన్ని చూస్తున్నాను, అన్ని గమనిస్తూ ఉన్నాను, అన్నిటికి లెక్కలు కూడా వేస్తున్నాను', అని చెప్తాడు. ' కాలః కలయతా మహం' 'నేను కాలము రూపములో అందరికి లెక్క వేసేస్తున్నాను. ప్రతి వారికి account ఉన్నది'. నీ దగ్గర account original ఆయన దగ్గర ఉంటుంది. మనం కూడా మనము పనులు చేస్తున్నప్పుడు అట్లాగ కాస్త విడిపడి చూస్తే, మనం చేసే వాటిలో అవకతవకలు కనిపిస్తాయి. తరువాత అవకతవకలని change చేయవచ్చు. లేకపోతే మనం చేస్తున్న తప్పులు మనకి తెలియవు. ఏదో ఒకటి కడుతున్నామనుకోండి, కడుతున్నప్పుడు వంకరలు తెలియవు. దూరము నుంచి చూస్తే తెలుస్తుంది. అందుకని మనం చేసే పనులకి మనం కొంచం దూరముగా ఉండి చూస్తే, మన వంకరలు మనకి తెలుస్తాయి. నిష్పక్షపాతముగా చూడాలి. అట్లా లోపల చూసే వాడు ఒకడు ఉన్నాడు, వాడిని నిద్ర లేపాలి. దాని వల్ల చేసే వంకరలు తెలిసీ, అట్లా చేయకపోవటం వల్ల, ముళ్ళు వేసుకోకుండా ఉండే అవకాశం ఉంటుంది. భగవత్ తత్త్వము గురించి చెప్పినవన్ని కూడా మనలో ఉన్నాయి. కాని మనలో ఆ ప్రజ్ఞలు, ఆ శక్తులు, వాటి యొక్క కార్యక్రమాన్ని అలాగే నడిచేటట్టుగా చూడగలగాలి. అలా కాకుండా మనం ఒకళ్ళము ఏర్పడ్డామనుకో వాళ్ళకి అడ్డము. అసలువాడు చెప్పినట్లుగా వీడు చేస్తుంటే వాళ్ళు వింటారు. లేకపోతె మెల్లగా తప్పుకుంటూ ఉంటారు. వాళ్ళు తప్పుకుంటూ ఉంటె మనకి ఒక్కో అవయవం పని చేయటము మానేస్తుంది. ఎందుకంటే ఏ దేవతా ప్రజ్ఞలు అయితే ఏ స్ఫూర్తితో వీటన్నిటిని నడిపిస్తున్నాయో, ఆ స్ఫూర్తి వాటికి పోతుంది.

అప్పుడు ప్రజ్ఞా కేంద్రాలు అన్నీ మూసుకు పోతాయి. ఆ మూసుకు పోవటమే అసురత్వము అంటారు. సురత్వము లేకపోవడము. 'సుర'అంటే వెలుగు కేంద్రాలు. ఇవన్నీ మూసుకు పోతాయి. అందుకని 'పద్మనాభుడు' అనే నామము, 'అరవిందాక్ష' అనే నామము మనకి సాధన పరముగ ఇచ్చారు. మనకి ప్రతి నామము సాధన పరమే! తెలుసుకోవలసిందేమిటంటే, నువ్వు మాట్లాడేది బావుందా లేదా నువ్వే చూసుకో. నువ్వు చేసే పని బావుందా లేదా అని నువ్వే చూసుకో. చేయవలసిన పనులు చేయకుండా ఉంటే బావుంటుందా అని నువ్వే చూసుకో! కొన్ని పనులు చేయకుండ ఉంటే బావుంటుందేమో చూసుకో! మాట్లాడవలసింది మాట్లాడకుండా ఉన్నామా, లేదా ఎక్కువగా మాట్లాడామా నువ్వే చూసుకో! నువ్వే చూసుకో ! ఎందుకంటే నీలో ఉన్నాడు 'అరవిందాక్షుడు'. ఇలాంటి భావాలని ఏరేస్తూ ఉంటె పుచ్చులన్ని పక్కన పడేయవచ్చు. అలాక్కాక పుచ్చుతో ఉన్నవన్నీ వండేసుకున్నావనుకో, ఆ తరువాత జబ్బు చేస్తుంది. అందుకనే కొందరికి వాళ్ళ జీవితాలు వాళ్లకే రుచిగా ఉండవు. Be a dispassionate witness of your own thoughts and your own speeches and your own actions. Also be a witness of your own silence. మనము మాట్లాడవలసి వచ్చినప్పుడేమో మౌనముగా ఉంటాము. మౌనంగా ఉండాల్సిన సందర్భములో మాట్లాడతాము. ఎవరినైనా నిందిస్తూ ఉంటే మనం కూడా నిందిస్తాం. భీష్ముడు, విదురుడు, ద్రోణుడు, అశ్వద్ధామ, ఎప్పుడు మాట్లాడాలో అప్పుడు మాట్లాడ లేదు. కొంత మాట్లాడారు తీయలేదు! అప్పుడే తీసెయ్యాలి వారిని. తీయకుండా మనం ధర్మాత్ములము అంటే కుదరదు. అధర్మము జరుగుతుంటే మన వంతు అక్కడ కర్తవ్యము నిర్వర్తించని వారు అందరూ కూడా ధర్మమునకు హాని కలగడానికి సహకరించిన వారే! కాబట్టి వారందరూ శిక్షార్హులు. ఏనాడు అధర్మమునకు సహకరించిన వారయ్యారో అప్పుడే వారంతా 'చచ్చినవారు'. అప్పుడే వారి శరీరాలని ప్రజ్ఞలన్నీ వదిలేసాయి. ధర్మపరముగా చచ్చారు. శ్రీకృష్ణుడు యుద్ధమునకు ముందే వారంతా ఎప్పుడో చచ్చిపోయారు అనడం లో ఉద్దేశ్యం అది. ఏనాడైతే ధర్మాన్ని వదిలేసారో ఆనాడే వారంతా చచ్చారని. అట్లాగే మనమందరమూ కూడా చేసే పనులలో, భావాలలో, మాటలలో, చేతలలో ధర్మము ఉండాలి. మాట్లాడ వలసిన చోట మాట్లాడాలి. మనకి ఎవరో మంచి మాటలు చెప్పున్నారు అనుకోండి, మౌనముగా ఉండవచ్చు. మాస్టారు చెప్పేవారు. పక్క వాళ్ళింట్లో దొంగలు పడితే, మనింట్లో ఇంకా గట్టిగ తాళాలు వేసుకునేవాడు అధర్మపరుడని. రేపు నీ ఇంట్లో దొంగ పడినప్పుడు పక్క వాడు కూడా అదే చేస్తాడు కదా! నీ అంతటగా నువ్వు వెళ్లి వాడిని పట్టుకోలేకపోతె, కనీసము నీ ఇంట్లోంచి Police లకు phone చేయవచ్చు కదా. ధర్మములో నిలబడి నిష్పాక్షికంగా

మన గురించి మనము అట్లా దూరముగా నిలబడి చూస్తే, మన వికృతాలన్నీ మనకి కనిపిస్తాయి. మామూలుగ కప్పేసి ఉండటం వలన మనకి కనబడవు. ఈ thoughts ని మనలో చంపుకోవాలి. అవి చావవు. వాడు చూస్తుంటాడు కానీ చూస్తున్నాడని మనకి తెలియదు. ఈ కష్టము నాకే రావాలా? ఇది నాకే ఎందుకు వచ్చింది? అంటారు. నువ్వు చేసేవి నీకు తెలియదు కదా! అందుకనే పెద్దలు 'అధర్మము నిర్వర్తిస్తున్నప్పుడు చాల హాయిగా ఉంటుంది. దానిని rectify చేసుకున్నప్పుడు బాధగా ఉంటుంది' అని చెప్తారు. Rectification నిజానికి కోరుకోవాలి. మనకి ఏ కష్టము వచ్చినా ఇది వరకు చేసిన దానికి ఇప్పుడు rectification. ఎందుకంటే accounts అక్కడ చాల శుభ్రంగా వేసి ఉంటాయి. ఇక్కడ లెక్కలు తప్పించుకున్నా, అక్కడ లెక్కలు తప్పించుకోలేము. ప్రజ్ఞలలో 'లిఖితాస్' అనే ప్రజ్ఞలు ఉన్నాయి. అంటే వాళ్ళు ఎప్పుడూ రాస్తూనే ఉంటారు. అదే నాడులలో పట్టుకొచ్చేది. ఈ లిఖితలతో స్నేహము చేసి ఋషులు ఈ నాడులు పట్టుకొచ్చారు. ప్రతివాడి దగ్గర వాడి కథ ఉంటుంది. ఆ కథ ప్రకారము వాడికి జరగాల్సినది జరుగుతుంది. ఈ జరిగే వాటిలో మార్పులు రావాలంటే మనం రాజమార్గము ఎక్కాలి. అంటే ప్రతి పొద్దున్న, ప్రతి రాత్రి చూసుకుంటూ ఉండాలి. ఇవాళ మనం ఏమి చేసాము? చేయాల్సింది చేశామా? కొన్ని చేయవలసిన పనులు మిగిలిపోతుంటాయి, కొత్తకొత్తగా అక్కర్లేనివి చేసేస్తుంటాము. అందుకని ప్రతి సాయంత్రము dairy రాసుకోవాలి నువ్వు చేయవలసినవి చేశావా? లేదు. అక్కర్లేనివి చేశావా? చేశాను. ఇలాగే వస్తాయి సమధానాలు. అవి మాటలు అవ్వవచ్చు, పనులు లేక ఆలోచనలు అవ్వొచ్చు. ఈ dairy వలన నీలో వీక్షించే వాడిని మేలుకొలిపే వాడివి అవుతావు. నువ్వు dairy రాయనక్కరలేదు , ఆ పని రోజు సాయంత్రము చేసుకోవచ్చు. నువ్వు చేయవలసినవి, చేద్దామనుకున్నవి చేశావా or just spending time. There is a judge in you who judges. Whether you have used the time fruitfully or not. నీలో ఉండే ఆ న్యాయవేత్తని నువ్వు మేలుకొలిపావనుకో, వాడు ధనూ రాశిలో ఉంటాడుట. అందుకనే మార్గశీర్ష మాసానికి అంత ప్రాముఖ్యత. నీకు నువ్వే న్యాయనిర్ణేతగా నిలబడ్డావనుకో, నువ్వే judge వి కాబట్టి, నువ్వే న్యాయము చెప్పాలి కాబట్టి నువ్వు మళ్ళి court కి వచ్చే అవస్థ ఉండదు. Judgeగారు court కి రావటానికి, నిందితుడు court కి రావటానికి తేడా లేదండీ? Judge is presiding over the proceedings. మిగతా వాళ్ళు they are subordinate to him. మన జీవితానికి subordinate గ ఉందామా, లేక అధిష్టించి ఉందామా అని మనమే నిర్ణయించుకోవచ్చు. చూస్తూ ఉంటే ఆయన ఇందు లోంచి లంబకోణముగా బయటకి వచ్చాడు కదా! అలా సమాంతర రేఖగా ఉంటె దాని నుంచి ఒక లంబ రేఖ

గీసుకుంటే ఒక లంబకోణము వస్తుంది. లంబకోణము మీద ఏర్పడిన చతురస్రము, మిగతా రెండు భుజాల మీద ఏర్పడిన చతురస్రములూ సమానము అని చెప్పారు కదా! The square on the hypotenuse is equal to the aggregate of the squares on the other two sides of a right angled triangle. If it is a wrong angled triangle అయితే, అవదు. ఇది మనకి Pythagoras విజ్ఞానము ఆయన దర్శించి ఇచ్చినది. 'మన లోంచి వ్యక్తమైనది, మనం రెండు సమపాళ్లలో ఉంటమే న్యాయనిర్ణేత ఈ కర్ణము. కర్ణము మీద చతురస్రము అంటారు కదా. ఆయన దీన్ని చూడలేదు అనుకోండి, కర్ణము లేదు అసలు! కర్ణము ఉండటం అంటే లంబకోణము మీద ఉన్నది. దాని మీద నిర్మాణము చేసిందంతా కూడా ప్రకృతి - పురుషులు యొక్క సమాగమముగ ఉంటుంది. A good blend of the splendour of human. splendour is human . అదీ కృష్ణుడు అంటే! పరిపూర్ణమైన వైభవము! అందుకనే కృష్ణుడు ఉన్న చోట అమ్మవారు బొమ్మ పెట్టరు. కృష్ణుడు దేవాలయములో మళ్ళి రుక్మిణి, సత్యభామ, ఎవరు ఉండరు. ఎందుకంటే, ఇది, అది ఆయనే! He is the mother, He is the father He is the perfect manifestation of male - female energies . అదీ అర్ధనారీ-ఈశ్వర తత్వము. ఆయన లోంచే 'విష్ణువు' పుట్టాడట. తెలుపు వర్ణము. ఆయనలోంచే 'అమ్మవారు' పుట్టిందట. వారిద్దరూ పెళ్లి చేసుకున్నారట. అని చెప్తారు పురాణాలలో. లేకపోతె ఆయన లోంచి విష్ణు, అమ్మవారు పుట్టటం ఏమిటి , వీళ్ళు పెళ్లి చేసుకోవటం ఏంటి? ఇద్దరు వచ్చారు, వారి లోంచి మళ్ళా ఇంకోడు మూడో వాడు వస్తాడు. వాడి లోంచి వీళ్ళిద్దరూ దిగివస్తారు. అట్లా ఈ చతురస్రం ఎక్కడ తప్పుగా ఏర్పడిందండీ? ఈ శరీరం ధరించినందుకు సృష్టి ప్రభావము అనుభవించటానికి ప్రకృతి, ప్రజ్ఞ, శక్తి మూడు ఉన్నవి. 'కాలం' యొక్క సహస్రారం ఉన్నది. ఎప్పుడో ఈ విధంగా నువ్వు భీష్మించి నీ జీవితాన్ని నడుచుకుంటున్న టైపు. అది నడుస్తూ ఉంటె నువ్వు you are merely witnessing and on a daily basis you make adjustments to you. ఏరోజుకి ఆరోజు అందులోకి వెళ్లి చూసేసుకున్నామనుకోండి, లేకపోతె అట్లా కట్టుకుంటూ పోతే వంకరలు వస్తుంటాయి. అందుకని మళ్ళి ఒకసారి చూసుకుంటూ ఉండాలి గుర్తుపెట్టుకొని. ఆ వీక్షణము కావాలి. అందుకనె ఈ మార్గములో ఆత్మ పరిశీలన చాలా ముఖ్యం. అది ఉదయం జరగాలి, సాయంత్రము జరగాలి. విశ్రాంతి తీసుకున్నప్పుడల్లా ఒక్కసారి మూల స్థానానికి వెళ్ళాలి. స్వగృహానికి వెళ్ళాలి. స్వస్థానం అంటారు. అక్కడ నుంచి భావాలు, మాటలు, చేతలు. అలా వెళ్తే అరవిందాక్షుడు, పద్మనాభుడు లో లేస్తాము.

360 పద్మగర్భః

పద్మగర్భుడు ఎవరయ్యా అంటే పద్మము యొక్క గర్భము లోనుంచి పుట్టిన వాడు. ఆయనే బ్రహ్మ! ఆయన కూడా ఈయనే, అని చెప్పటానికి మాత్రమే ఈ నామము ఇచ్చారు. అందుకని 'బ్రహ్మగా వాడిని విడిగా చూడమాకురా' అన్నారు. మన బోటి వారు, వాడు మన లాగే ఉన్నప్పుడు ఇక బ్రహ్మ చేసింది ఏమిటి ఘనకార్యం అని ప్రశ్న వేస్తాం. అందుకని 'బ్రహ్మగా చూడమాకురా, నన్నుగానే చూడు' అని చెప్పారు. బ్రహ్మ అంటే, బృంహణము నుంచి చేయబడిన వాడని. బృంహణము చేయడము అంటే మన లోంచి వ్యక్తము అవటం. 'నేను' అనే అనంతమైన తత్త్వము లోంచి ఒక సంకల్పం ఆధారంగా ఆయన పుట్టాడు కాబట్టి ఆయన కూడా నేనే! మనకు ఏమౌతుందంటే, details లోకి వెళ్లే సరికి original మర్చిపోతాము. ఆయన కూడా 'నేనే'! ఈ బట్టలు వేసుకున్న వాళ్లందరికీ గురువు ఏమి గుర్తు ఉంటుంది? జ్ఞానమే గుర్తు ఉండదు, ఇహ గురువు ఏమిటి! గురువే ఆధారమని బట్టలు వేసుకు కూర్చొనే వాళ్ళు మూలాన్ని యెఱిగి పని చేసుకుంటున్న వాళ్ళు. గుంజకి కట్టబడ్డ వాళ్ళు. వాళ్లకి ఇబ్బంది ఏమి లేదు. అలా కాని వాళ్ళకి ఇబ్బంది అవుతుంది. అందుకని 'పద్మగర్భః' అనే నామము లో ఉద్దేశము ఏమిటంటే , 'మళ్ళీ వాడిని ఇంకోడుగా చూడబోకురా వాడిలో కూడా నేనే!' అని చెప్పినప్పుడు అద్వైతము ఏమిటి? ఇది విశిష్ట మైనటువంటి అద్వైతము. అద్వైతములో ఏమిచెప్పారంటే 'ఉన్నది ఒక్కటే ఇన్ని లేవు' అని చెప్తారు. విశిష్టాద్వైతములో ఏమి చెప్తారంటే 'ఆ ఒక్కటి నీలో కూడా ఉన్నాడు కాబట్టి ఇన్నింట్లోనూ ఆ ఒక్కడిని చూసుకుంటూ ఉండు' అన్నారు. ఇంకేమి లేదు అంటే, ఇవన్నీ తీసేసి పక్కన పడేస్తే సరిపోతుంది. అలా చేసుకోవచ్చు. అలా కానప్పుడు 'అదే ఇదిగా ఉంది' అని చెప్పుకోవాలి మనం. 'అదే ఇది' అనే పెద్ద మంత్రము ఉంది. అదే చెట్టుగా ఉంది, అదే సూర్యుడుగా ఉంది, అదే బొద్దింకగా ఉంది అని ఇలా మనం అనుకుంటూ వున్నామనుకోండి, నెమ్మదిగా ఏమి జరుగుతుందంటే, దీని బదులు 'అది' ఎక్కువగా కనిపిస్తుంది. అది అదే అని చెప్పడానికే వేదములో దాన్ని 'తత్' అన్నారు. ఆయన గురించి చెప్పేదంతా 'తత్-త్వం' అన్నారు. మనకి అర్థము కాకపోతే, తత్త్వం చెప్తున్నారంటారు. 'తత్త్వం'' చెప్పటం అంటే 'తత్' గురించి చెప్పటమని. కాబట్టి, ఏది చూసినా 'దాన్నే' దర్శనము చేసే నిజమైన సాధకుడు చేసే సాధన! మనకెందుకని అసలుది మనం పట్టుకోము. అక్కర్లేనివవన్నీ పట్టుకుంటాము. ఇప్పుడు చూడండీ మనము బయలుదేరి వస్తుంటుంటే మన పుట్టుక స్థానం నుండి ఒక్కటొక్కటే చూపిస్తూ మళ్లీ నేను అదే అని చూపిస్తున్నాడు. అందుకని

మనమే అది అని చెప్పాడు.'అదే' అని చెప్తోంది. మన లో సంకల్పం తానే అని చెప్తుంది. 'పద్మగర్భము' 'నేనే' అని చెప్పటానికి విష్ణుసహస్రనామం లో చేరింది. ఆయన ఏమి చేస్తుంటాడంటే పెంచుతూ ఉంటాడు శరీరాన్ని.

361 శరీరభృత్

ఎవరి శరీరము అంటే ఈ అవ్యక్తము అయిన తత్త్వము ఉందే దానికి శరీరముగా మొత్తము అంతా ఏర్పాటు చేస్తూ ఉంటాడు. మనం కూడా అదే చేస్తూ ఉంటాము. మన జీవితములో పరచుకుంటూ వెళ్ళడం లేదా? ఎంత పరచుకుంటూ ఉంటాడంటే మళ్ళి ముడుచుకోలేనంత పరుచుకుంటాడు. ఇక్కడ భగవత్ తత్త్వమునకు మళ్ళి ముడుచుకు గలిగే స్వామిత్వము ఆయనలో ఉంది. అందుకనే ఆయన 'స్వామి' అయ్యాడు, మనము దాసులము అయ్యాము. మనము కూడా 'స్వామి' అని పిలవబడ్డాము అనుకోండి, ఏదైనా ముడిచేయగలిగేలా ఉండాలి. అంటే పరిచిన దాంట్లో మనం ఉంటూ, పరిచింది మళ్ళా ముడవగలిగేలా చూడాలి. మనం పెంచుకున్నది మిగతా వాళ్లకి బంధంగా తయారవుతుంది. పెరిగిన కొలది వైభవముగా ఉన్న వారు కొందరు అయితే, పెంచుకున్న దాంట్లో ఇరుక్కుపోయేవారు కొందరు ఉంటారు. ఎంత వ్యక్తిగత సామ్రాజ్యం పెరుగుతూ ఉంటె అంత దానికి దాసులు అయిపోయేవారు చాల మంది ఉన్నారు. అది పెరుగుతుంటే బంధం పెంచుకోకుండా ఉండేవారు కొంతమంది ఉన్నారు. యోగ సాధన చేసే వారు ఇవన్నీ మనకి అక్కరలేదు, ఉన్నది పంచుకోవడమే అని పరమార్థము పట్ల ఆసక్తి కలిగి ఉంటారు. వాళ్లందరికీ తలమానికం శ్రీకృష్ణుడు. రాజయోగి ! యోగులందరికి గమ్య స్థానం ఏమిటంటే 'రాజయోగమే'! భగవద్గీతలో శ్రీకృష్ణుడు రాజయోగికి ఉదాహరణగా జనకుడిని ఇస్తాడు. జనకుడు వాళ్ళందరూ పారిపోలేదురా, ఎంత కలిమి గలిగినా అది బంధించ లేదు. అది భగవంతుడి వైభవముగా చూస్తాడు. ఐశ్వర్యము అంటే అదీ అర్థం. ఐశ్వర్యం ఐశ్వర్యము అంటాము కదా! ఏమిటి ఐశ్వర్యము? 'ఈశ్వరుడు నుంచి అంత వ్యక్తము అయినది' అని గుర్తు ఉన్నవాడికి అది ఐశ్వర్యము. ఈశ్వర తత్త్వము ఉంటె ఐశ్వర్యము ఉంటుంది. వాడిది అనుకున్నామనునుకుంటే అదొక తీరు. వాడిది అని అనుభవిస్తూ ఉంటారు.. మనది అనుకుంటే కాముకులమవుతుంటాము. 'వాడిది' అని గుర్తు ఉంటె వాడికి శోభని ఇస్తుంటుంది. కొంత మందికి ఐశ్వర్యం శోభనిస్తుంది. కొంతమందికి దుఃఖాన్నిస్తుంటుంది. ఆనందము కాదు వాడికి ఐశ్వర్యము. ఎందుకనీ అందులో ఈశ్వర భావం లేదు. తన లోంచి ఆయన అన్నీ ఇచ్చాడుగా! సంతానముగా, సంపదలుగా, మిత్రులుగా, అనుయాయులుగా ఇలా ఇవన్నీ వాడు ఇచ్చినవే! తన లోంచి ఆ తత్త్వమే అట్లా పెరుగుతోందని జనకుడికి గుర్తు ఉంది. మరి మనకి పెరుగుతూ ఉంటె పాగరు పెరుగుతుంది. ఎందుకంటే, మనం ఎదో చేసాము అన్నది

వుంటుంది. నిజమైన భక్తులకు అట్లా ఉండదు. తాను పెరిగాడు అనుకోడు. 'వాడు' పెరిగాడు అనుకుంటాడు. పెరిగిందల్లా వాడే అని గుర్తుంటుంది. వామనుడు వాడే, త్రివిక్రముడూ వాడే! నేను పెరగలేదు. పెరిగించేది, తగ్గించేది ఆయనే! మనల్ని ఇలా వైభవముగా ఉండమన్నాడు అని గుర్తు ఉంటె ధర్మకర్తగా ఉంటాడు. తనది అని ఏమి ఉంచుకోడు. ప్రపంచానికి అంతా అతనే అని పించవచ్చుకానీ అది వాడిది కాదు అని తెలిసి ఉంటుంది. అది తెలియనప్పుడల్లా క్రిందకి పడిపోతాడు. పడ్డప్పుడల్లా గుర్తుకు రావాలి ! కానీ రాదు. ఎప్పుడైతే తనది అనుకుంటాడో, తనలో అసురుడు విజృంభించాడు అంటారు. అంటే ఏమిటి? వాడిది కాదని తనది అనుకున్నాడో లేదో పెరుగుటకి అవరోధము వస్తుంది. ఒక పాప అడ్డు అపడుతుంది. అదే 'అసురత్వం'. అప్పుడు ఉన్నదీ పోతుంది. ధర్మరాజుకి మయసభ పెద్ద mishap ! తనది అనుకున్నాడట. మనకి ఎందుకు చెప్పారంటే, వాళ్ళే అట్లా అనుకుంటే ఇక మన సంగతి ఏమిటని ! ఎవరు ఇప్పించారు ఈ సభ ? శ్రీకృష్ణుడు ఇప్పించాడు. ఎందుకని? అర్జునుడికి వరాలు ఇస్తాను అంటాడు మయుడు నన్ను కాపాడావని. అర్జునుడు, 'పిచ్చి వాడా! ఆయన అనుగ్రహము వలన నువ్వు బతికావు తప్పా నన్ను శరణుజొచ్చినా నేను నిన్ను కాపాడ లేను. ఆయన అనుగ్రహము లేనిదే నేను ఏమి చేయలేను ' అంటాడు. ఆయన అనుగ్రహిస్తాడు అర్జునుడిని ఎందుకంటే, అర్జునుడు ధర్మాన్ని అనుసరించేవాడు. లేకపోతే అర్జునుడు కూడా నా వాడు కాడు, అంటాడు. అంత నిష్కర్ష గా ఉంటుంది భగవంతునితో. అదేంటండి, పది సార్లు విన్నాము కదా పదకొండోసారి వినలేదు, పది సార్లు బాగానే ఉన్నాను కదా ఇప్పుడు ఏమిటంటే? ఇప్పుడు బాగుండదు అంటాడు. నేను చెప్పినట్టు చేసినప్పుడు సుఖపడ్డావు, నేను చెప్పినదానికి వ్యతిరేకముగా చేస్తే పడతావు! మధ్యమధ్యలో మనకి కాస్త పిచ్చి వస్తుంటుంది! ఇదంతా మనమే జయించాము. మన వల్లే జరిగిందని.అది ధర్మరాజుకు వచ్చిందంటే ఇక అర్జునుడు ఎంత, మనము ఎంత? వచ్చి ఆ మయ సభని చూస్తూ మురిసిపోతున్నాడట. ఎంత వరకు పోయాడంటే, నారదుడు వస్తే, ఇదంతా చూపించాడట. మనం కూడా చూడండీ, వాళ్ళు అడిగిన అడగకపోయినా ఇల్లంతా చూపించి కానీ వదలం, ఎందుకంటే మనం కట్టాము కదా! వాళ్ళు చూపించమంటేనే చూపించడం సబబు తప్ప, అడగకుండా చూపించడం అన్యాయం. మనలాగే ధర్మరాజు కూడా నారదుడుకి చూపించి, అంతటితో ఊరుకోకుండా 'ఇంత బాగా కట్టాడా ఎవరైనా' అని అడిగాడు. దానితో నారదుడికి అర్ధమయింది. వీడికి ఎదో వికారము వచ్చింది అని సరి చేయాలని, మొత్తం వ్యూహంతో బయటకి వచ్చాడు. ఈ ఉన్నదంతా పోయేట్లు చూసాడు. ఎందుకంటే, ఎప్పుడైతే మన positions మార్చామో అప్పుడు అది ఐశ్వర్యము కాదు ఇంక. అందుకనే కొంత మందికి వచ్చింది

పోతూ ఉంటుంది, కొంత మందికి పోదు పార్లుతూ ఉంటుంది. ఎంత కాలము? దానిలో ఈశ్వర తత్త్వము దర్శనము చేస్తూ ఉన్నంత కాలము పోదు. అందుకనే చూడండి మన తాతల time లో ఉన్నవి మనకి ఏవి ఉండవు. మా తాతలు నేతులు తాగారు , మా మూతులు వాసన చూడండి , అన్నారుట. తాతలు time లో అన్నిటిలో చూసుకుంటే అక్కడ దివ్యత్వం ఎక్కడికో పాతాళానికివెళ్ళిపోయి ఉంటుంది. ఎక్కడ దివ్యత్వం పోతుందో అక్కడ ఐశ్వర్యం పోతుంది.

సిరి దా వచ్చిన వచ్చును
సలలితముగ నారికేళ సలిలము భంగిన్
సిరి దా బోయిన బోవును
కరిమింగిన వెలగపండు కరణిని సుమతీ!

అన్నారు కదా! అట్లాగే లోపల ఏమి ఉండదు. అయ్యో అంతా పోయిందే, అని చూసేసరికి ఇంకో generation వస్తుంది. అందుకనే పెరిగిందల్లా అది భగవంతుడి యొక్క సంపదగా భావన చేస్తుంటే నిలబడడమే కాక పెరుగుతూ ఉంటుంది. బ్రహ్మ అట్లా పెంచాడుఈ 14 భువనాలు. మనము ఏదో కాస్త పెరగటానికి నానా బాధ పడుతున్నాము. ఎట్లా పెరిగాడూ అంటే ఆయనే పెరిగాడు ఇదంతా! ఆయన పెరుగుతూ ఉంటె ఏమి జరిగిందంటే, ఎక్కడ ముట్టుకున్నా ఆయనకి తెలుస్తుందండి. ఇప్పుడు మీకు పెందుర్తి అవతల పొలము ఉంది అనుకోండి, అక్కడ ఎవడో పాలంలోకి వచ్చాడనుకోండి, మీకు తెలుస్తుందా? కాయలు ఏవో కోసుకున్నాడనుకోండి, మీకు తెలుస్తుందా? ఆయనకి తెలుస్తుంది. సృష్టిలో సమస్తము తాను అట్లా వ్యాపించి ఉన్నాడట. అదీ శరీరభృత్! అందుకనే శరీరము వేరు, ఇది తుచ్ఛమైన శరీరం, అనే పిచ్చి మాటలు ఉంటాయి కదా! అట్లా ఏమి ఉండదు. సృష్టిలో అతడు లేనిది ఏది లేదు. మరి తుచ్ఛమైనది ఎలా అయ్యిందీ ? అది నీలో ఉండే కరడు కట్టిన అజ్ఞానం! అందుకని శరీరం దివ్యమైనది అని చెప్తారు జ్ఞానులు. అది దైవము చేత ఇవ్వబడినది. అర్జునుడి శంఖం దేవదత్తం, కృష్ణుడి శంఖం పాంచజన్యం .అంటే తనంతట తానే పుట్టుకు వచ్చిన వాడు కృష్ణుడు. ఇవ్వబడిన వాడు అర్జునుడు. మనమంతా కూడా అర్జునుడి type - Categorised. మనకి ఇవ్వబడిన శరీరము మనది కాదు, దేముడు ఇచ్చాడని గుర్తు పెట్టుకోవాలి. దాన్ని హింస పెడ్తే అధర్మం! అందుకని శ్రీకృష్ణుడు ఉపవాసి, ఎక్కువ తినే వాడు, ఇద్దరిని ఒప్పుకోలేదు. నీదా శరీరము! దానిని నువ్వు బాధ పెట్టడానికి? కాదు కదా! మరి ఇక ఉపవాసము ఏమిటి! ఉపవాసము అంటె వాడికి దగ్గరగా ఉండమని అంతే కానీ దానికి తిండి పెట్టడం మానేస్తే ఎలా? ఈ రోజు మనం బజారుకి వెళ్ళం కదా అని గుర్రానికి మేత పెట్టక పోతే ఎట్లా ఉంటుందీ? దాని నాలుగు కాళ్ళు చచ్చు పడిపోతాయి. అది మనకి

తెలియాలని, ఈ పెంచిన అంత శరీరంలో "నేనే" అని చెప్తాడు. ఎక్కడ ముట్టుకున్నా నన్ను ముట్టుకున్నట్టే అవుతుంది. అందుకని దేన్ని ముట్టుకున్నా వాడిని ముట్టుకున్న భావన చేసుకుంటే అది సత్యమై కూర్చుంటుంది. దేవుడి పాదాలు ముట్టుకోవాలని చచ్చిపోతుంటాము కదా తిరుపతి వెళ్తే! ఆ జయ - విజయుల గురించి ఎవ్వరు పట్టించుకోరు. వారి రూపములో ఉన్నది కూడా ఆయనే అయినా. పాపం వాళ్ళు అక్కడ బయట readyగ ఉంటారు. ఎంతసేపయినా చూడవచ్చు, కానీ చూడం. లోపలకి వెళ్లిపోవాలని. వాళ్లనే చూడనప్పుడు నేను ఎందుకని ఈయన లోపలకి వెళ్ళిపోతారు. జయ- విజయల రూపములో ఉన్నది ఎవరూ? మనకి ఇన్ని తెలిసి చక్కగా కాలు ఎక్కడ వేస్తే కూరుకుపోతామో అక్కడ వేస్తాము. వీడిని కాదని వాడి దగ్గరకి వెళ్తే వాడు ఒక్క ఈడుపు ఈడుస్తాడు అంతే! ఏమి చూసావులే! అని. మన జుత్తులో పేను తిరుగుతూ ఉంటె మనకి తెలియటం లేదా? కాలు చిటికిన వేలు మీద చీమ కుడితే తెలుస్తోంది. ఇంతే ఉన్నాము మనం, అందుకే అంతే తెలుస్తుంది. పక్క వాడిని కుడితే మనకి తెలుస్తుందా? అస్సలు తెలియదు. పైగా వాడు 'ఓ ఓ' అంటే పర్వా లేదులే, అని కూడా చెప్తాము. చీమే కదా అని. మనని కుడితే అది పాము కుట్టినంత, వాడిని కుడితే అది చీమ కుట్టినట్టు. పాము కుట్టినా చీమ కుట్టినట్టుగా కూడా ఉండదు మనకి. పక్కవాడికి పాము కుట్టిందిటా అంటే, ఓహో అని TV చూస్తుంటాము. Disturb చేసినట్టుగా feel అవుతాము. కానీ ఈ మొత్తము 14 భువనాలు ఉన్నాయే వాటిలో తానె నిండి ఉండడం చేత ఎక్కడ, ఎవరికి ఏమి జరిగినా, మన కాలు చిటికిన వేలుకి దోమ చీమ కుడితే ఎట్లా తెలుస్తుందో అట్లా తెలుస్తుందటండి. అందుకని వాడు "ఈశ్వరుడు" అయ్యాడు. అంటే మన పాలములో ఏమి జరిగినా మనకి తెలిసేటట్టుగా మనం ఉంటె మన పాలానికి మనం "ఈశ్వరుడు". Master! అంత వరకు అక్కరలేదు. కాస్త ఈ శరీరానికి అవతల ఏమి జరిగినా , మనది అనుకున్నదానికి దేనికి జరిగినా బాధగా ఉంటుంది. మీ car Rear-view mirror ఎవరో పీకేసారండీ అన్నారనుకోండి, ఉపన్యాసం ఆపేసి అక్కడకి వెళ్ళిపోతాం. ఎందుకంటే భావన చేత మనం అక్కడున్నాం. అదే పక్క వాడి car అయితే tyre తీసుకొని పోయినా బాధపడం. ఎంత భయంకరమైన తేడా? అదే చెప్తాడు ప్రహ్లాదుడు, 'నువ్వు గొప్ప వాడివే, నేను నీ అంత గొప్పవాడిని అని అనుకోవడము లేదు. 'వాడు' గొప్పవాడు అనుకుంటున్నాను నేను. నీకు, నాకు ఒక బేధము ఉంది. అది నీకు మన వాళ్ళు, ఇంకోళ్ళు అని. అంత కన్నా దరిద్రము ఇంకోటి లేదు. అది నాకు లేదు' అంటాడు. ఎంత సాధన, ఎన్ని పూజలు, ఎన్ని వ్రతాలు చేయండి ఆ పార మాత్రము చచ్చినా తెగదు. అంటే సాధన లేదు అని అంటే బాధ పడతారు అని వారు మాట్లాడరు. 'మీరు మేమను మతి భ్రమణమ్ముగ ప్రవర్తిల్లక' అని

చెప్తాడు తండ్రికి. అంతాటా వాడే! అంతా వాడుగా నిండి ఉన్నాడు కాబట్టి ప్రహ్లాదుడికి ఎక్కడైనా వాడే కనిపిస్తాడు. భాగవత మార్గములో భక్తుడికీ భగవంతుని కోసం పరుగెత్తడము లేదండీ. చుట్టూ వాడే ఉంటె ఎక్కడికి పరుగెత్తుతాడు? కర్తవ్యము లేనప్పుడు వేడుకగా వెళ్లి చూసి రావచ్చు తప్పా ఎక్కడ లేడని వెళ్లి చూస్తావు? ఓ భాగవత భక్తుని దగ్గరకి వెళ్లి చెప్పాడట వెళ్లి దర్శనము చేసుకు వస్తానని. అంటే ఆయన ఓ ప్రశ్న అడిగాడట, వెళ్ళటం ఏమిటని? ఇక్కడే ఉంది కదా! మళ్ళి రావటము ఏమిటి? అంతటా అతడు నిండి ఉన్నాడు అని చెప్పటానికి మనకి ప్రహ్లాద చరిత్ర ఇచ్చారు. పద్యము చదివేస్తాము మనము, 'ఇందుగలడందులేడని సందేహము వలదు, చక్రి సర్వోపగతుండు. ఎందెందు వెదకి చూసిన' వెతక్కపోతే ఏమి లేదు. ఎందుకంటే కప్పేసి ఉంటుంది కాబట్టి దానికి మనం వేరే పేరు ఏమి పెట్టము అంతే! చిన్నప్పటి నుంచి చెట్టు అని చెప్పారు కాబట్టి చెట్టు అని నమ్ముతున్నాము. అట్లా చెప్పలేదనుకోండీ, ఏమి చేసే వాళ్ళు? ఓ కప్ప వేసేస్తారు మనందరికీ. పెరిగేప్పటికే కప్పలు ఊడిపోతాయి. ఆ తత్త్వమే ఈ చెట్టుగా ఉంది అని చెప్తుంది వేదం. అదే మనిషిగా ఉంది. అదే జంతువుగా ఉంది. అంటే వాళ్ళు ఏమంటారంటే తెలుగులో చెప్పాలంటే, 'చెట్టుగా పిలవబడుతున్నది, చెట్టుగా ఉన్నది' అని అంటారు. That which is called a tree. చెట్టుగా పిలవబడుతుంది. 8వ అధ్యాయములో శ్రీకృష్ణుడు 'నువ్వు చెట్టుగా అనుకొని చూడటము వలన చెట్టుగా కనిపిస్తోంది, లేకపోతే ఉన్నది నేను! నేనే కనిపిస్తాను ఋషికి' అంటాడు. దాన్నే ఇదిగా చూస్తాడు. అందుకనే దీంట్లో అదే కనిపిస్తుంది. మనము కేవలము మనము గీసుకున్న బొమ్మలలో తప్ప దేముణ్ణి చూడము. ఎవడో మోసము చేసాడని బాధ పడతాము. పోనీలేరా దాంట్లో దేముణ్ణి చూడు అంటారు. నిజానికి ఇదంతా అది అని చెప్పటం 'శరీరభృత్'! అట్లా చూస్తే అట్లాగే కనిపిస్తుంది. అప్పుడు ఇన్ని గొడవలుండవు. ఎక్కడ పడితే అక్కడ అదే కనిపిస్తూ ఉంటుంది. దానితోనే ఉంటాడు. అదీ ప్రహ్లాదుడు చేసినది! అందుకని భాగవతోత్తములలో మొదటి పేరు ప్రహ్లాదుడిది, తరువాత అంబరీషుడిది. అంబరీషుడు మొత్తము భూగోళానికి చక్రవర్తి. రాజ్యము పరిపాలిస్తూ ఎప్పుడూ విష్ణువుని మరువలేదంతే! అన్నిటిలో అదే చూసాడు. ప్రహ్లాదుడు ఇంకా రాజ్యము పుచ్చుకోక ముందు చూసాడు, రాజ్యము పుచ్చుకున్నాక కూడా చూసాడు. నువ్వు ఎంత వరకు చూడవో అంతవరకు దర్శనం లేదనే! అలాగే ఎంత నువ్వు పరిమితము చేసుకుంటావో, అంత నువ్వు పరిమితము అయిపోతావు. అందుకని శరీరభృత్ అనే నామము ఎక్కడ మొదలు అయ్యిందండీ? చిన్న బిందువుగా 'నాభి' నుంచి మొదలై అక్కడ నుంచి ఒక పాదములో ఇంత భావము పెట్టేసాడండీ. ఇంత భావం నాలుగు నామాలలో చెప్పగలిగినవాడే ఋషి! ఎవరు చెప్పారు ఇది? భీష్ముడు! రాజయోగి!

సమస్తము తెలిసినవాడు. ఏ పాదం లో నాలుగు నామాలు అయినా వాటి గురించి చెప్పుకుంటూ ఈ మూల నుంచి ఆ మూలకి వెళ్ళిపోతాము. ఆ విధంగా పద్మనాభః, అరవిందాక్షః, పద్మగర్భః, శరీరభృత్ నాలుగు నామాలకి కొంత అవగాహన. మనం, మన జీవితం, మన పరిసరాలు వీటికి అనుగుణముగా జీవిస్తూ, మన సాధన కి సంబంధించి చెప్పుకుంటే, అది ఇక్కడ నుంచి వెళ్ళేక గుర్తు ఉంటె ధన్యం ! లేదంటే ఎప్పుడూ అది కొత్తగానే ఉంటుంది. సాధన చేసుకుంటూ ఉందాము మరి! మర్చిపోవడము అనేది మన ధర్మమూ. గుర్తు చేయడము అనేది వాడి ధర్మమట! అది కూడా చెప్పేసారు అయన. ఎన్ని సార్లు చెప్పాలండి, అని శ్రీకృష్ణుడిని అడిగాడు ఒక శిష్యుడు. అంటే, 'ఎన్ని సార్లుమర్చిపోతే అన్ని సార్లు చెప్పటమే!' అని చెప్పాడట. మర్చిపోకపోతే నీ ఉద్యోగం లేదుకదా!అన్నాడట. నేను కూడా అదే చేస్తుంటాను. మర్చిపోతాం కాబట్టి మళ్ళీ కలుస్తుంటాం. అలా చూసుకుంటూ సాధన చేద్దాము. చూద్దాము ఎప్పటికి వస్తుందో. విష్ణు సహస్రనామము అయిపోటము కాదు, అది అయ్యే లోపున సాధన లో బాగా పట్టు రావాలి.

362 మహర్ధి

మహర్ధి, బుద్ధః, వృద్ధాత్మా, మహాక్షో, గరుడధ్వజః, ఈ పాదంలో అయిదు నామాలున్నవి. "మహా బుద్ధిః" అనే నామానికి అర్థమేంటంటే అంతు లేకుండా పెరిగే వాడు. ఎంతైనా పెరుగుతాడు. బుద్ధుడంటే పెరిగినవాడు. అనిబుద్ధః అంటే అడ్డులేకుండా పెరిగేవాడు. మహాబుద్ధుడు అంటే పెరుగుతూ ఉంటాడుట, ఈ సృష్టిలో తాను పెరుగుతూ ఉంటాడు. అంతకు ముందు నామంలో మనం శరీరభృత్ అన్ననామానికి అవగాహన చేసుకున్నప్పుడు మొత్తం అంతా వ్యాపించి ఉంటాడు అని చెప్పకున్నాం. ఆ వ్యాపించి ఉండే వాడు ఎంత వ్యాపిస్తాడంటే అంతు లేకుండా వ్యాపిస్తాడు. దానికి అంతమేం లేదు, ఎందుకంటే చోటు ఇంత అని మనం ఏం చెప్పలేము. అందులో మనకి కనిపించి పెరుగుతున్నదంతా పెరుగుతున్నట్టుగా మన భావన కదా! పెరిగేదేమిటి? ఆయనలో ఉన్న ప్రకృతి తప్ప ఆయన పెరగటం ఉండదు, తరగటం ఉండదు. మనం కూడా పెరుగుతున్నట్టుగా ఉంటాం కదా! ఈ పెరగటం అంటే ఏంటి, శరీరం పెరగటమే! జీవుడు ఎప్పుడూ అంగుష్ఠ మాత్ర పురుషుడే! పెరిగేదీ, తరిగేదీ, అలా మనకి ఏది పెరుగుతున్నట్టు కనిపించినా ఆ కనిపిస్తున్నదంతా చోటులో ఏర్పడుతున్న పదార్థము. పంచభూతాలని ఎంత సమీకరించుకుంటే అంత పెరిగినట్టుగా కనిపిస్తుంది. ఎంత సిమెంట్, ఇటుక, ఇసుక మన దగ్గర ఉంటె అంత కట్టచ్చు. అంతే కానీ ఈ సిమెంట్, ఇసుక, ఇటుక లేకముందు ఉన్నచోటు, ఇవి కట్టిన తర్వాత ఉన్న చోటు ఎప్పుడూ ఒకటిగానే ఉంటుంది. అందుకనే పెరుగుతున్నట్టుగా గోచరిస్తాడు, కానీ పెరగటానికేం లేదు మొత్తం అంతా అదే ఉంది. ఎందుకీ నామం భగవంతునికి ఉంది అంటే వామనుడు త్రివిక్రముడుగా పెరిగాడు కదా. పెరిగి సమస్తాన్ని వ్యాపించాడు. వ్యాపించడమంటే ఏముంది ఇక్కడ, ఆయనే మొత్తం. కొంత రూపంలో కనిపించిన వాడిని చూసాం. దాన్ని ఆ పంచభూతాల్లోనే ఆయన పెంచుకుంటూ వెళ్తూ ఉంటే మొత్తం అంతా తానుగానే గోచరిస్తాడు. అలాగే వెలుగు స్వరూపం కూడా మనలో ఉండేటువంటిది,

'సూక్ష్మ రూప ధరి సియహి దిఖావా, వికట రూపధరి లంక జలావా
భీమ రూప ధరి అసుర సమ్హారే, రామచంద్ర కె కాజ్ సంవారే'

చిన్నరూపంతో సీతా దేవికి కనిపించాడు. వికటరూపంతో లంకని కాల్చాడు భీమ రూపం తో రాక్షస సంహారం కావించావు అంటాం. అంటే పెరగడం తరగడం అనేది ఇక్కడ, ఆత్మకి తను ఏర్పరుచుకున్న శరీరానికి సంబంధించింది. మొత్తం వ్యాపించిన ఆత్మలో, మన చుట్టూ కొంత పదార్థము ఏర్పడిన తరువాత వేరు వేరుగా ఆత్మలు గోచరిస్తూ ఉంటాయి. ఈ తెల్ల గోడ మీద కాస్త సున్నాలు చుడితే ప్రతి సున్నాలోనూ

గోడ కనిపిస్తుంది. సున్నాల్లో గోడ ఉందా, గోడ మీద సున్నాలు ఉన్నాయా? ఇక్కడ పెట్టినటువంటి సున్నాలు గోడ మీద కదా, అప్పుడేమనుకుంటామంటే సున్నాలోన ఉండే గోడ, సున్నా బైట ఉండే గోడ అని చెప్పుకుంటాం కదా! కానీ నిజానికి గోడ సున్నాలో ఉందా?అట్లాగే మన లోపల భగవంతుడున్నాడనంటాం గానీ, లోపల బయట అని ఏం లేవు. లోపల ఎప్పుడు ఉంటుందంటే ఆవరణ ఏర్పడప్పుడు లోపల ఉంది. ఆవరణ ఏర్పడనప్పుడు? బయట వర్షం పడుతుంటే లోపల కూర్చున్నాం అనుకుంటున్నాం, కదా! కానీ ఈ నాలుగు గోడలు కట్టక ముందు ఇక్కడ ఏముందో, నాలుగు గోడలు కట్టిన తర్వాత కూడా అదే ఉంది ఇక్కడ. దానికి లోపల, బయట లేదు. నాలుగు గోడలు కొంచెం తక్కువ అవుతున్నదని, సరిపోవడం లేదని పెంచాం అనుకోండి, ఇపుడు బాగా పెంచారండి అంటాం, ఏమిటి పెంచాం? గోడలు పెంచాం. పెంచిన దానికి చోటు పెరిగిందంటాం మన భాషలో. కానీ చోటు పెరగటం ఏం లేదు, చోటు అట్లాగే ఉంది. గోడలు కొంచెం దూరం దూరంగా కట్టినందున అదే చోటు పెరిగినట్టుగా కనిపిస్తుంది. అంతే పెరగడం అంటే! ఎందుకంటే ఉన్నదదే! దానికి పెరుగుదల లేదు, తరుగుదల లేదు, అందులో ఏర్పడే రూపాలకి పెరుగుదల, తరుగుదల. అందుకని ఇక్కడ నువు పెరుగుతున్నట్టుగా కనిపిస్తావు, అమితంగా పెరుగుతావ్ అన్నాడు, ఎంత వరకు పెరుగుతావంటే మనకు తెలీనంత పెరుగుతాడు, కారణం ఏమిటంటే మనం అందులో యిమిడిపోతాం ఆయన పెరిగితే, అందుకని ఆయన ఎంత అని మనకి తెలియదు, బయటకి వచ్చినా ఆయన్ని కొలవలేము. అందుకని నిట్టనిలువుగా దేవతలందరినీ నుంచో పెట్టినా కూడా ఇంకా ఆయన సరిపోడుట అని అన్నమాచార్యుల వారు ఒక కీర్తనలో రాశారు. ఆ విధంగా కొలవటానికి అందుబాటులో లేరు, ఎందుకంటే అందులోంచి ఇవి వచ్చినాయి కాబట్టి. దానికి ఎప్పుడు మనం గుర్తు పెట్టుకోవలసిన ఉపమానం ఏంటంటే, గోదావరి వాళ్ళైతే గోదావరిలో చెంబులనుకోవాలి, కృష్ణ వాళ్ళైతే కృష్ణ లో చెంబులనుకోవాలి, గంగ వాళ్ళైతే గంగలో చెంబులనుకోవాలి. అంటే ఏంటి, మొత్తం గంగలో మనం చెంబు ముంచితే, మన చెంబులో గంగ ఉంటె, చెంబులో గంగ అని మనం అనుకుంటాం, కానీ గంగలో చెంబు ఉంది, అని మాస్టరుగారు ఎప్పుడు చెప్పే ఉపమానం. గంగలో చెంబు ఉండటం వల్ల, చెంబులో గంగ ఉంది కదా! అనే వారు. అదే విధంగా మీకు గోడ ఉపమానంగా చెప్తున్నాను. అలాగే సముద్రం, అల చెప్తూ ఉంటాను. అల సముద్రంలో ఉండబట్టి, సముద్రం అలలో ఉంది. అసలు సముద్రమే లేకపోతే అలే లేదు, కదా! కాబట్టి పెరిగే ఆయన ఏవిటి పెరుగుతున్నాడంటే తన ప్రకృతి చేత తాను పెరుగుతున్నట్టుగా కనిపిస్తూ ఉంటాడు. మనం కూడా బాగా పెరిగారండీ మీరు అనంటాం కదా, ఏమిటి పెరిగింది? శరీరమే! మనం భౌతికమైన శరీరాన్ని

కొంత పెంచగలం, కొంత కాలం తర్వాత ఆగిపోతుంది. అదే మనలో ఉండే వెలుగు శరీరం ఇంతకన్నా ఎక్కువగా పెరగటానికి అవకాశం ఉంది. అది పెరుగుతుంది, తరుగుతుంది, ఎందుకంటే అది చుట్టూ ఉండే చోటుతో అనుసంధానం చెంది ఉంటుంది. ఆ పదార్థానికి ఈ రకమైన rigidity ఉండదు. సిమెంట్ వేసిన తర్వాత గోడ గట్టి పడిపోతుంది కదా, గట్టి పడితే ఇంక దానికి వృద్ధి ఉండదు హానే ఉంటుంది కదా. అట్లాగే మనం శరీరం గట్టిపరుచుకుని, వృద్ధి లేకుండా హానితో మళ్ళీ దాన్ని పదిలించుకుని మళ్ళీ ఇంకోటి తెచ్చుకుంటూ ఉంటాం. కానీ మనలో ఉండే తత్త్వం ఏదైతే ఉందో, దానికి హాని వృద్ధులు లేవు. అది చోటులో ఎంతైనా పెరగవచ్చు. అది మనకి భగవంతుడు త్రివిక్రముడిగా చూపిస్తాడు, అదే హనుమంతుడు చూపిస్తాడు. అట్లాగే శ్రీకృష్ణుడు పెరుగుతాడు. విశ్వరూప సందర్శనం జరిగినపుడు జరిగేదేంటయా అంటే ఆయన యొక్క పెంపు. ఈ పెంపు అంతకు ముందు ఉన్నదే! ఉన్నదాన్ని ఏంచేస్తారంటే వాళ్ళు కొంత దాంట్లో నుంచి కనిపిస్తూ ఉంటారు. శ్రీ కృష్ణుడు అంటే ఆ రూపమే కాదు, ఆ రూపంలో నుంచి వ్యక్తమయ్యే తత్త్వం. మనం కూడా అంతే! మన చెంబుకు అటూ ఇటూ మూత తెరిచి ఉందనుకోండి. దాన్నే కుంభ రాసి సంకేతంగా ఇచ్చారు. ఇటు తెరిచి ఉండడం కాదు, అటు కూడా తెరిచి ఉందనుకోండి అప్పుడేమౌతుంది, మొత్తం ఇటునుంచి అటు వెళ్తు ఉంటుంది కదా! మొత్తం ఇటునుంచి అటు వెళ్తు ఉంటె మనం ఎంత? చూసినపుడు మూతలోంచి కిందకు కనిపించినప్పటికీ అటు పక్కన దానికి చాలా పెద్ద అపరిమితమైన తత్త్వం కదా! అదీ వాహిక అంటే! మాస్టర్ CVV గారు medium, medium అంటే ఎదో మధ్యవర్తిగా పనిచేయటం అనుకుంటుంటాం, దేనికి మధ్యవర్తిత్వం ? అపరిమితమయిన తత్వానికి పరిమితంగా కనిపిస్తున్నట్టుగా మధ్యవర్తిత్వం, అటు open ఉంది, ఇటు open ఉంది, ఇటు open లోంచి వచ్చేటట్టు చూసుకుంటాం, ఏ మాత్రం వస్తుందంటే అది ఎంత opening ఉంటె అంతే వస్తున్నట్టు కనిపిస్తుంది, కానీ అంతేనా అది, అటునుంచి అటు ఎంత ఉందో, అటు పక్క మూత వేసుకున్నవాళ్లకి చెంబుల్లాంటి వాళ్ళకి అంతే! చెంబు ఆకారం ఎంత ఉంటె అంతే! కానీ అటు పక్క opening చేసుకున్నవాళ్ళకి ఇస్తూ ఉంటె, వస్తూ ఉంటుంది కదా, ఇటు ప్రవహిస్తూ ఉంటె అటునుంచి వస్తూ ఉంటుంది. నది అంతే కదా! ఇటువెళ్లి సముద్రంలో కలుస్తుంటే మళ్ళీ సముద్రము లోంచి నీరు ఆకాశంలోకి వెళ్లి, అక్కడినుంచి మళ్ళీ నదిగా వస్తూ ఉంటుంది. అపరిమితంగా ఉంటుంది, మనం చూసినపుడు మనకి పరిమితంగా ఉన్నట్టుగా కనిపిస్తూ ఉంటుంది. మనకి శాస్త్రజ్ఞులు ఏమి చెప్తున్నారంటే ఇపుడు ఈ భూమి మీద కొన్నాళ్ళు పోయిన తర్వాత ఇది అయిపోతుంది, అది అయిపోతుంది, మొత్తం అన్నీ అయిపోతాయి అని తినేస్తాం కదా మనం, ఇది తినేయటం వల్ల అయిపోతుంది

అనుకుంటుంటారు, అయిపోతే తినము, ఎట్లా అయిపోతుంది? అయిపోటానికి 'ఇంత' అని ఏర్పాటు ఎక్కడ లేదు కదా! ఎప్పటికప్పుడు ఏర్పడుతూ ఉంటె అప్పటికప్పుడు అయిపోతూ ఉంటుంది, అదీ సృష్టిలో ధర్మం! అందుకని ఇన్నాళ్లయ్యే సరికి ఈ బంగారం అంతా అయిపోతుంది, ఇన్నాళ్లయ్యే సరికి బొగ్గు అంతా అయిపోతుంది, ఇన్నాళ్లయ్యే సరికి petrol అంతా అయిపోతుంది, ఇన్నాళ్లయ్యే సరికి నీళ్లు అన్నీ అయిపోతయి, అన్నీ పిచ్చి పిచ్చి లెక్కలు. మనింట్లో ఒక tank లో నీళ్లు చూసి ఈ నీళ్లు సాయంత్రానికి అయిపోతాయి అని మనం చెప్పచ్చు. కానీ అంతేనా, మనం రోజూ నీళ్లు వాడుకుంటూనే ఉన్నాం, tank లోకి నీళ్లు వస్తాయి కదా! ప్రకృతిలో రజో గుణం కారణంగా ఎప్పుడూ ఏర్పడుతూ ఉంటుంది. అది నెమ్మదిగా మళ్ళీ తమో గుణం కారణంగా కలిసిపోతూ ఉంటుంది. ఈ ఏర్పడి, కలిసిపోవడం మధ్య ఉన్నట్టుగా కనిపిస్తుంది తప్ప ఆ ఉన్నది మనం చూస్తుంటాం, చూసినపుడు అది పరిమితంగా కనిపిస్తుంది. కానీ ఉన్నది కాదు మనం, ఆ మనం కూడా ఒక ప్రవాహమే, సమస్తం ఒక ప్రవాహమే! అదే జీవన ప్రవాహం అంటారు దాన్నే ప్రాణ శక్తి అంటారు. అదీ కూడకట్టుకుంటూ ఉంటుంది, మళ్ళీ వదిలేస్తూ ఉంటుంది, కూడకట్టుకుంటూ ఉంటుంది, మళ్ళీ వదిలేస్తూ ఉంటుంది. ఈ కూడకట్టుకున్నపుడు కూడకట్టుకున్నంతే మనం అనుకుంటే పొరపాటు. అదీ వామనుడు. ఆ రూపం తీసుకున్నంత మాత్రాన వాడంతేనా? మూడడుగులు ఇస్తానంటే వాడెంతటి వాడో తెలీకుండా, మొత్తం అంతా వాడైపోయాడు కదా! ఈ తత్వంలో చాలా మంచి లోతుగా అలోచించి, మనం ఎంత అపరిమితులమో తెలుసుకునె సాధన ఉంది. ప్రతి ఒక్కరం కుడా అపరిమితత్వానికి ఒక ప్రతీకలం. వ్యక్తులం కదా మనం, వ్యక్తులంటే అంటే ఏంటి? వ్యక్తం చేయబడ్డ వాళ్ళం. ఏవిటి వ్యక్తమయిందీ? అవ్యక్తమైన తత్వం వ్యక్తంగా కనిపిస్తుంది, ఇంతేనా మనం? ఇంతే అనుకుంటే ఇంతే! అంతా ఇంతగా ఉన్నది అని తెలుసుకున్న వాడి, ఇంతే కాదు వాడు అంతానూ! అట్లా ఉన్నవాడు ఈ శరీరం వరకే పరిమితం కాకుండా వ్యాపనం చెంది ఉంటారు, ఎక్కడో పిలిస్తే ఇక్కడ తెలుస్తుంది, వాళ్ళు కదా మరి మహాత్ములు. ఎట్లా తెలుస్తుంది? ఇంతే అనుకోవడం లెదు, దీన్నించి పని చేస్తున్నాం అనుకుంటారు. ఇందులోంచి పనిచేస్తుంది విద్యుత్తు, ఇంతేనా విద్యుత్తు? అందులోంచి పనిచేస్తుంది విద్యుత్తు, అంతేనా విద్యుత్తు? ఈ నామం లో మనకి భగవంతుని యొక్క అపరిమితత్వం ఎప్పటికప్పుడు గోచరిస్తుంది. ఒక పక్కన తీస్తూ ఉంటె మళ్ళి ఇంకో పక్కనుంచి పూడుకొస్తూ ఉంటుంది. ఒక గొయ్యి తవ్వి వదిలేస్తే కొన్నాళ్ళకి గొయ్యి మూసుకుపొయ్యేట్టుగా భూమి మళ్ళీ పూడ్చేసుకుంటుంది, భూమికి ఆ తత్వం ఉంది. ఒక పక్కనుంచి అయిపోతున్నట్టుగా ఉన్నా, ఇంకో పక్కనుంచి ఏర్పడుతున్నట్టుగా ఉంటుంది కాబట్టి ఇది ఎప్పటికీ ఉండేది,

మొత్తం అంతా ఉన్నది, ఏర్పడుతున్నంత మేర మాత్రమే కాదు. ఈ భూగోళం ఏర్పడ్డది, గ్రహ గోళాలన్నీ ఏర్పడినాయి, సూర్యమండలం ఏర్పడ్డది, అటువంటి గుంపుల సూర్య మండలాలు ఏర్పడినాయి, అవన్నీ ఎందులో ఏర్పడినయ్యో అది ఎంత? అందులో ఎంత ఏర్పడచ్చు? ఎంత ఏర్పడింది? ఇప్పుడు మనం కూర్చున్న వాళ్లమంతా ఏర్పడిన వాళ్ళం అనుకుంటే ఈ గదిలో ఉండే చోటుకి మనల్ని పోల్చి చూస్తే మనం ఎక్కువగా ఉన్నామా, చోటు ఎక్కువగా ఉన్నదా? అంత అపరిమితంగా పెరిగే అవకాశం, మొత్తం చోటంతా తానే కాబట్టి ఈ కనపడుతున్న భాగంలో మనం చూస్తున్నాం కాబట్టి ఈ కనపడుతున్నది పరిమితం అయినటువంటిది, కానీ అది అపరిమితంగా పెరగగలదు. అందులో పెరుగుతున్నది ఏమిటయ్యా అంటే ఆ తత్త్వం తన చుట్టూ కట్టుకుంటూ ఉంటుందంతే! ఎంత కట్టుకుంటుంది అంటే ఇంత అని చెప్పటానికి కుదరదు, ఎంతైనా కట్టుకుంటుంది. అందుకని శ్రీకృష్ణుడు అట్లా అట్లా అట్లా పెరిగిపోతూ కనిపిస్తాడు అవసరమైనపుడు. అందుకని హనుమంతుడు పరిపూర్ణమైన యోగేశ్వరుడు కాబట్టి ఆయన కూడా అట్లా అట్లా అట్లా పెరిగిపోతాడు, అవసరమైనపుడు ఇంత ఉంటాడు, అవసరమైతే అంతుంటాడు, ఎంతయినా ఉండచ్చు, ఎందుకంటే ఇంతే ఉండాలనేం లేదు, చూడ్డం తెలిసిన వాళ్లకి. అది మనకి కుంభ రాశిలో జరగటానికి అవకాశం ఉంది. ఇపుడు కుంభ యుగం అంతా అదే, కుంభ యుగంలో expansion of consciousness ఎంత వరకు అంటే up to the space, అందుకనే space consciousness is the characteristic of aquarian age అన్నారు. మొత్తం ఇదంతా ఒక పెద్ద చోటు, ఈ చోటులోనే ఇన్ని గ్రహ గోళాలు, నక్షత్ర మండలాలు, ఇన్ని మండలాలు ఏర్పడినాయి, అవి చోటులో ఏర్పడినవే, ఎంత చోటు ఉంది అంటే, చోటు లెక్కపెట్టలేము, ఈ చోటుకు చుట్టూ నాలుగు గోడలు కట్టుకుని గోడలకి చోటు లెక్కపెట్టుకోవచ్చు. పిల్లవాడిని చూసి వీడు మూడు అడుగులడుగుతున్నాడు, వాడే మూడు అడుగులు ఎత్తు లేడు, అనుకుంటాడు బలి. అప్పటికే శుక్రాచార్యుడు చెప్తూనే ఉంటాడు. వాడు మూడు అడుగుల వాడు కాదు అని, ఎందుక్కాదూ అంటే అటునుంచి ఇటు వచ్చిన వాడు. మనం అంతా కూడా అటునుంచి ఇటు వచ్చిన వాళ్ళమే! అది గూడా గుర్తు పెట్టుకోండి, మనమేం తక్కువ వాళ్ళం కాదు, కాకపోతే మనం మర్చిపోయాం కాబట్టి అటు ముతేశారూ, అందుకని అటునుంచి ఇటు ప్రవాహం లేదు. అటు మూత వేసేసుకోడం వల్ల మనం తండ్రియే కుమారుడుగా ఉన్నాడు, దైవమె జీవముగా ఉన్నది, పరమాత్మయే జీవాత్మగా ఉన్నది, 'సహ అహమస్మి' 'అతడే నేనుగా ఉన్నాను', ఇవన్నీ మర్చిపోయిన వాళ్లకి ఏం జరుగుతుందంటే వీడు పరిమితుడు. వాడే తనుగా ఉన్నాడనేది తెలిసి, తానంటూ ఎవరూ లేడు అనుకున్నవాళ్ళకి అపరిమితుడు. అందుకని అపరిమితత్వంలో ఉండే

వాడిని వాడింత అని చెప్పలేము. భాగవత మార్గంలో ఈ భాగవతులని అంచనా వేసుకోలేము. ఎందుకంటే చూస్తే చాలా మాములుగా మిగతా వాళ్ళ లాగానే ఉంటాడు, ప్రత్యేకంగా ఏం కనపడడు. ప్రత్యేకంగా కనపడ్డ వాడెవడంటే మోసం చేసేవాడైతే కనపడాల్సొచ్చేది, ఎందుకు ప్రత్యేకంగా కనపడ్డం, అంతా అదే అయినపుడు, వాడేంచేస్తాడు? అట్లా ఉంటాడు, కానీ వాడి దగ్గరనుంచి ఇట్లా చేయి పెట్టి తీసుకుంటూ ఉంటె ఎంతయినా వస్తుంది, ఎందుకనీ, అపరిమితత్వానికి వీడు వాహిక కాబట్టి అటునుంచి వస్తూ ఉంటుంది, వీడు ఇస్తూ ఉంటాడు. వీడి దగ్గర ఇంత ఎటునుంచి వస్తుందీ, అనిపిస్తుంది, ఎవరి దగ్గర మొత్తం ఉందో వాడి దగ్గర వీడు ఉన్నాడు కాబట్టి వీడి దగ్గర నుంచి అది వచ్చేస్తూ ఉంటుంది, అదీ భాగవత మార్గం! సమస్త అవస్థల యందు భగవంతుని యందు మాత్రమే జీవిస్తూ ఉండడం చేత భావనలో, ఆ అపరిమితమైనటువంటి తత్వానికి అనుసంధానం చెంది ఉండటం చేత, ఆ తత్త్వం వీడిలోంచి ప్రవహించటం చేత, అతడు అపరిమితుడవటం అవటం వల్ల వీడు అపరిమితుడు అవుతాడు. మనింట్లో water tank బైటవాటితో link up అయ్యి ఉంటె అపరిమితంగా నీళ్లు మనింట్లోకి వస్తాయి, Link up కాలేదంటే రావు. అట్లా మొత్తం తత్త్వంతో అనుసంధానం చెందిన వాడు కూడా అపరిమితుడవచ్చు, సాధనా పరంగా. అప్పుడూ పెరగడం తరగడం! పెరగడం అంటే ఏంటి? శరీరాన్ని దాటి తమ ప్రజ్ఞ ఉండడం. యక్షులు అట్లాగే ఉంటారు, ఒక యక్షుడు ఒక చోట ఉంటె, వాడి చుట్టూ పక్కల వాడికొక పరిధి ఉంటుంది, ఆ పరిధిలో ఏం జరుగుతున్నా వాడికి తెలుస్తుంది. ఆ పరిధిలో ఉండే జంతువుల్లో, చెట్లల్లోనూ, మొక్కల్లోనూ, అన్నిట్లోనూ వాడే ఉంటాడు. ఒక మహాత్ముడు కూడా అంతే. ఒక మహాత్ముని ఆశ్రమంలోకి అడుగు పెడుతూ ఉంటె ఆశ్రమం ఎంతంటే ఆయన యొక్క ప్రజ్ఞ ప్రసారం ఎంత ఉందొ అంత ఆయన ఆశ్రమం. అందులోకి అడుగు పెట్టగానే ఈయనకి తెలిసిపోతుంది, వాడొస్తున్నాడని. తెలిసిపోయి దానికి తగ్గట్టుగా ప్రతిస్పందిస్తాడు. అగస్త్యుడు ఆశ్రమానికి వెళుతూ ఉంటె ఆ భావంలో వచ్చే మార్పు బట్టి రాముడికి తెలుస్తుంది ఆశ్రమంలో అడుగు పెట్టామని, అంటే ఇంటి వరకు వచ్చి, ఇంట్లో సింహద్వారం లోపలికి వెళ్తే ఆశ్రమంలోకి వెళ్లామని కాదు. మన భావంలో దగ్గరికొస్తున్న కొద్ది ఒక స్థితిలో ఠక్కున మార్పు వస్తుంది. అప్పటినుంచి ఆశ్రమ పరిధిలోకి మనం వచ్చినట్టు లెక్క. ఎందుకట్లా అంటే అంత పెరిగుంటాడు, కేవలం శరీరంగా ఉండడు, అవసరాన్ని బట్టి అంటే సహజంగా అగస్త్యుడు అవసరాన్ని బట్టి ఆకాశం వరకు కూడా శరీరాన్ని పెంచగలడు. అవసరాన్ని బట్టి ఉత్తర ధృవం వరకు పెంచగలడు, ఆ పైకి పెంచగలడు, ఇంకా పెంచగలడు, ఇంకా పెంచగలడు, అంటే అది tuning with that వల్ల. ఇట్లా పెరుగుతూ ఉండే వాడిలో భగవత్తత్త్వమే ఇట్లా పెరుగుతుంది సుమా, కేవలం నువ్వు

నీ శరీరాన్ని మాత్రమే పరిమితం చేసుకోకు. అందుకనే మన భావంలో దేహాత్మ భావం కన్నా జీవాత్మ భావం ఎక్కువ ఉండాలి. అపుడందరికీ మన గురించి ఒక idea ఉంటుంది కదా. అంతే మనం! మన idea ఎంతుంటే అంతే మనం, మన గురించి మనం చేసుకున్న భావానికి మనం పరిమితులం. నిజానికి మనం ఎవరం అన్న ప్రశ్న వేసుకుంటే, మనం పేరు కాదు, మనం రూపం కాదు, అదే ఇదిగా ఈ రూపంతో ఉంది, అనేది మనకేం గుర్తుంటుంది? ఉండదు. ఎందుకంటే చిన్నప్పటినుంచి ఇంకో రకంగా పెరిగాం కాబట్టి అది బాగా అలవాటైపోయింది కాబట్టి, అట్లాగే భావన చేసుకుంటూ ఉంటాం కాబట్టి, అంతే ఉంటాం, 'యద్భావం తత్భవతి'. 'నీవక్షరుడవు' అని శ్రీకృష్ణుడు చెప్తే అర్జునుడికి అర్థమైందా? కాలేదు కదా! ఎప్పుడర్థమవుతుంది? ధ్యానం చేయాలి. ఎపుడు పడుకొని లేచినా మనం అక్కడ్నుంచి లేస్తాం. లేచిన తర్వాత మన గురించి మనం ఒక నిర్వచనం చేసుకుంటాం. నిర్వచనం చేసుకోవడం వలన దానికి మనం అక్కడకి localise అవుతాం, స్థానికులం అవుతాం, స్థానికులం అవటం అంటే ఆ స్థలానికి ఉండే relation తో మన్ని మనం ఒకటి నిర్వచించుకొని అక్కడ ఏర్పడతాం. అది చాలా అప్రయత్నంగా జరిగిపోతూ ఉంటుంది. రైల్లో నిద్ర లేస్తే ప్రయాణీకుడుగా లేస్తాం, లేవంగానే ఎదుటి వ్యక్తి కనిపిస్తే మనం ప్రయాణీకులమవుతాం, అక్కడ localise అయ్యాం, పిల్లవాడు కనిపిస్తే తండ్రిగా, తండ్రి కనిపిస్తే పిల్లవాడుగా, భార్య కనిపిస్తే భర్తగా అవుతాం. ఇవన్నీ we are defining ourselves. మన్ని మనం నిర్వచించుకుంటుంటాం ఎప్పటికప్పుడు. నిర్వచించుకున్నపుడు అది అవుతున్నాం కదా, అంటే మనకి ఏది నిర్వచించుకుంటే అది అవుతున్నాంగా? అంటే ఎంత శక్తి ఉంది మనలో? The sheer defining about ourselves we are becoming that, అప్పటికప్పుడు తల్లైపోతాం, మరుక్షణంలో చెల్లైపోతాం, ఇంకో క్షణంలో అత్తయిపోతాం, ఇట్లా అయిపోతున్నాం కదా! దేనివల్ల అయిపోతున్నాము, మనం ఏవిటి, ఇవన్నీ మనం కాదు కదా! తల్లైన వాళ్ళు పిల్లలెట్లా అయిపోతాం, పిల్లల్లైన వాళ్ళు చెల్లెట్లా అయిపోతాం, చెల్లెయిపోయింది అత్తెట్ల అవుతుంది? అత్తై అయిపాయింది పిన్నెట్లా అవుతుంది? ఇవన్నీ ఎట్లా అయిపోతున్నారు? అంటే అప్పుడుండే సన్నివేశాన్ని బట్టి స్థానికంగా. సన్నివేశం లేకపోతే మనం ఎవరం అనేది ఎప్పుడూ జ్ఞాపకముండదు. అన్ని పనులు అయిపోయాయి. ఎవ్వరూ మన చుట్టూ లేరు. అప్పుడు మనం ఏంటి? Who are we? అందుకనే ఏకాంతం! ఏకాంత స్థితిలో నువ్వెవరు? ప్రస్తుతానికి నువ్వెవరు? అప్పుడు ఆఫీస్ విషయాలు, సమస్యలు, దుఃఖం అన్నీ గుర్తొస్తాయి, చాలా మందికి. సాధకుడికి ఇప్పుడు నేను ఏమి అంటే అదే గా నేను! ఒక పేరు పెట్టుకుని బయట తిరుగుతుంటాం స్థానికం గా, ఆ రకంగా ఏర్పడ్డాన్నే అహంకారం అనే తొడుగు

వేసుకోడం అంటారు. అహంకారం అంటే పొగరని కాదు, He is circumscribed , he is defined. Infinite has become the finite. సమస్య వచ్చినపుడు సమస్యలాగే రూపొందుతాము, సమస్య లేకపోతే అట్లా ఉంటాం. అంటే ఎవరికో ప్రాణాపాయంగా ఉందనుకోండి పగలు రాత్రి పనిచేస్తారు, మామూలుగా అయితే రాత్రి చచ్చినా మేల్కొనుండలేడు. అదే అర్థరాత్రి మనకి చాలా ముఖ్యమైన వాళ్ళు station కి వస్తున్నారంటే వెళ్లరూ? అదే ముఖ్యం కానీ వాళ్లయితే వెళ్లకపోవచ్చు. అదేంటి ఎట్లా వీలుపడ్డది? మామూలుగా నిద్రపోవాలి కదా నువ్వు, మరి అపుడు ఎట్లా వెళ్లగలిగావ? సరిగ్గా పన్నెండు గంటలకి phone వచ్చిందనుకోండి మీ వాళ్ళని hospital లో చేర్చారని, మీరు వెంటనే రావాలి అంటే, ముందు ఏ hotel కో వెళ్లి భోంచేసి వెళదామని ఆలోచిస్తామా? ఎందుకాలోచించం? మామూలుగా భోజనం కావాలి కదా! ఇవన్నీ ఎం జరుగుతున్నాయంటే we can expand we can rise upto the situation. ప్రతి విషయంలో కూడా, రోజూ మనని నాలుగింటికి, 3:30 కి లెమ్మంటే లేస్తామా? 5:30 కి పూజ పెట్టుకునే సరికి లేవాల్సొస్తోంది. నిన్న 5:30 కి పెట్టారు గదా, 6 కి పెడితే బావుండు, ఎదో 7 రోజులు మొత్తానికి వచ్చేస్తారు, పదో రోజు మళ్ళీ మామూలే, ఇవన్నీ ఉంటాయి, ఎందుకనీ we are able to rise అంటే అర్థం ఏంటి, there is ability in us to raise, అంతే కదా! Inability ఎక్కడ్నుంచి వస్తోంది, మన భావం చేత వస్తోంది. Ability ఎక్కడ్నుంచి వస్తోంది? అందుకనే పరీక్షలప్పుడు చదువుకునే వాళ్ళందరూ పరీక్షలు అయిపోయాక మనం ఇట్లా పొద్దున్నేలేవాలి, ఎప్పుడు ఇట్లా చదువుకుంటే బావుంటుంది అనుకుంటారు, పరీక్షలైపోగానే మర్చిపోతారు, అట్లాగే పూజలు మొదలిపెట్టినపుడు అనుకుంటారు, అయిపోగానే మర్చిపోతారు. అంటే we are also capable of growing unlimited because we are verily He only in this form. ఆ తత్వమే మనంగా ఉంది కాబట్టి, అతడు పెరగగలడు కాబట్టి, మనం కూడా పెరగగల్గుతున్నాం. వీలు పడదండి, చేయలేమండీ, వాళ్లకి వీలుపడదండి, మనకు వీలు పడదండి అంటే తనని తాను మోసం చేసుకుంటునట్టు ఒకటి, తాను బద్ధకానికి బాగా లొంగిపోయాడని అర్థం. బద్ధకస్తుడుకి ఏదీ వీలు పడదు, గుండ్రాయల్లే కూర్చుంటాడు. వాళ్లకి వీలు పడ్డది కదా. వాళ్ళు ఎప్పుడదే చెప్తారు, మేము మీలాంటి వాళ్ళమే మాకు వీలు పడ్డది కదా, మీకెందుకు వీలు పడదు? అందుకనే రామాయణం చదుకునేప్పుడు అట్లా చదుకోవాలి, రాముడికి వీలుపడ్డప్పుడు మనకీ వీలు పడాలి, ధర్మరాజుకి వీలు పడ్డప్పుడుది మనకీ వీలు పడాలి, అర్జునుడికి వీలు పడ్డది మనకీ వీలు పడాలి, హనుమంతుడికి వీలు పడ్డది మనకీ వీలు పడాలి. చతికిలపడిపోతే ఏ వీలూ పడదు. అందుకని ఈ నామం ద్వారా మనం తెలుసుకోవాల్సింది మనలో ఉన్నది

భగవత్తత్వమే, భగవంతుడికి ఉండే శక్తి అంతా కూడా మనలోనే ఉంది, ఎందుకనీ? భగవంతుడు మనలో ఉన్నాడు కాబట్టి, మనం ఉన్నామనుకుంటే అవన్నీ పక్కనుంటాయి. కానీ వాడు కూర్చున్నాడు కదా మనం చేసేదేముంది, చూద్దాం ఏంచేస్తాడో, అని ఆ తత్వంలో కూర్చుంటే ఈ దివ్య శక్తులన్నీ కూడా విజృంభించి పని చేస్తాయి. ఎందుకంటే ఆయన సహకారంలో ఉన్నవి కూడా ఆయనయే కదా! ఇంకోటి కాదు కదా!కాబట్టి ఎక్కువ మన భావన 'అతడే మనంగా ఉన్నాం' అని మనం మర్చిపోతున్నాం, మర్చిపోకుండా 'అతడే మనం గా ఉన్నాం' అని గుర్తుతెచ్చుకుందాం, అనేది బాగా సాధన చేసుకుంటూ ఉండాలి. అలా చేస్తూ ఉంటె మనం 'బుద్ధః' అంటే పరిపూర్ణంగా పెరిగిన వాళ్ళమౌతాం. ఆయన కూడా పరిపూర్ణంగా పెరిగి ఉన్న వాడు. అదీ విష్ణు తత్త్వం! స్థితి కారకుడు కదా, పరిపూర్ణంగా పెరిగి ఉంటాడు, మొత్తం అంతటా వ్యాపించి ఉంటాడు, ఎక్కడినుంచైనా పలకటానికి సిద్ధంగా ఉంటాడు. అట్లా దర్శనం చేసాడు కాబట్టే ప్రహ్లాదుడు ఇక్కడ ఉన్నాడు అని చెప్పగలిగాడు. సందేహమే లేదు, ఎక్కడ కావాలంటే అక్కడికి పిలిపిస్తాడు. సర్వోపగతుడు, ఎందెందు వెదకి చూసిన అందందేగలడు. 'బుద్ధః' అనే నామానికి అర్థం మొత్తం వ్యాపించి ఉన్నాడు, స్థిరంగా ఉన్నాడు, 'fully developed' ఇంకింతకన్నా పెరగటానికేం లేదు అని. మనకో? మనం పెరుగుదామనుకుని సంకల్పించిన్నవన్నీ బుట్టలో పెట్టేసి, pending లో పెట్టినవి చాలా ఉంటాయి, కదా ! ఎన్నో విషయాల్లో, ఇట్లా ఉంటె బావుంటుంది అని మనకి ఆలోచన రాలేదా? వచ్చినాయి, బోల్డు సార్లు వచ్చినాయి. కానీ వాటినేం చేస్తామంటే మనలో బుట్టలో పడేసే వాళ్ళు కొంతమంది, కొంత మంది పక్కన టేబుల్ మీద పెడతారు చేద్దామని arrear files పెట్టినట్లుగా అవి అట్లా ఉంటాయి, వాయిదా వేస్తూ ఉంటారు, అవి అలా పెరుగుతుంటాయి, ఇవి పెరగటం కాదు. అలా కాకుండా మనం కూడా ఈ మానవ శరీరంలో ఉన్నపుడు మాత్రమే ఇది అవకాశం కాబట్టి, మరి ఇంక సమయాన్ని వృధా చేయకూడదు. అది మన చేతిలో ఉన్న సాధనపరమైన 'have we grown fully' మనం పూర్తిగా పెరిగామా? శరీర పరంగా అయితే అయ్యి ఉండవచ్చు, ప్యాంటు పట్టక పోవచ్చు, కదా! కానీ దివ్యాత్మ స్వరూపుడిగా నేను పెరగవల్సినంతా పెరిగానా? అట్లా పెరగడానికి అవకాశం ఇచ్చేది ఇదొక్కటే శరీరం, మిగతా శరీరాలు ఇవ్వవు. అందుకనే పురంజనోపాఖ్యానంలో భగవంతుడు మొత్తం అన్ని నగరాలు తిరిగి చూసి చివరికి పరిపూర్ణంగా తొమ్మిది ద్వారములు ఉన్న నవద్వార పురమైన మానవ శరీరం అంటే ఆనందం కలిగి దిగాడుట. దానర్థం ఏంటంటే సృష్టిలో పరిపూర్ణమైన రూపం మానవ రూపం, ఈ రూపంలో ఉన్నపుడు మాత్రమే సత్త్వపరంగా పరిపూర్ణంగా పెరగటానికి వీలుపడుతుంది. మిగతా

రూపాలలో మనకి వీలు పడదు, అందుకనే ఋషులు మాటిమాటికదే గుర్తు చేస్తూ ఉంటారు. ఇదొక్కటే నీకు అవకాశం, మళ్ళీ కుక్కలాగానో, గాడిద లాగానో, చెట్టు లాగానో, పురుగు లాగానో పుట్టినపుడు అవకాశం ఉండదు, మళ్ళీ ఎప్పుడొస్తుందనేది by choice వచ్చేది కాదు, by chance వచ్చేది కాబట్టి, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకో, ఇది సాధించావంటే, సాధించిన ఈ శరీరం కాక నువ్వు ఎలా ఉన్నావో నీకు కనుక అనుభూతమైనట్లయితే అక్కడినుంచి నువ్వు ఏ రూపం తీసుకున్న నీకు నువ్వు తెలిసుంటావు. అట్లా హంసల రూపంలోనూ, తెల్లటి పక్షుల రూపంలోనూ, తెల్లటి పులి రూపంలోనూ ఉండి, సింహం రూపంలోనూ, నాగు పాము రూపంలోనూ, గరుడ పక్షి రూపంలోనూ ఇట్లా ఉండచ్చు. ఎందుకంటే ఒక్కసారి తెలుసుకున్న తర్వాత, ఆ తర్వాత ఇక ఏ రూపంలో ఉన్నా మనకి మనం తెలిసి ఉన్నాం కాబట్టి! అందుకని అంతా తెలిసిన మహాత్ముడు కోతి రూపంలో ఉన్నాడు, ఆయనే హనుమంతుడు! ఆయన కోతి కాదు. ఎందుకు కోతి రూపంలో ఉన్నారంటే కోతిగా ఉంటె ఎవరూ వచ్చి అంతరాయాలు కలిగించరు, ప్రశాంతతకు భంగం కలిగించరు అని. దాగి ఉండటం అని చెప్పటానికి కోతి రూపం అన్నారు. తిరుగుతూ ఉంటె విపరీతంగా జనం చేరిపోతారు, ప్రశాంతత ఉండదు. అందుకే కప్పుకుని ఉండటం, ముసుగు వేసుకుని ఉండడం.

363, 364 బుద్ధః, వృద్ధాత్మా

బుద్ధః పూర్ణముగా నిండిన తత్వము, ఆ తర్వాత వృద్ధాత్మా, మామూలుగా అయితే, ఆత్మకి ముసలి ఏముందండి అంటాం. వృద్ధ అంటే పెరిగిన, అన్నింటికన్నా మొదటిది, అన్నింటికన్నా పెద్దది అని చెప్పటానికి వృద్ధుడు అని చెప్తాం. వృద్ధుడంటే ఏమిటి? వృద్ధి పొందిన వాడని కదా! తెలిసిన వాడు అని. శరీరపరం గా వృద్ధుడని కాదు. ఆత్మ నుంచి మిగతావన్నీ వచ్చాయి కాబట్టి అది మొదటిది, ఒకటి పక్కన చేరిపోతే సున్నాలెన్నయినా పరవాలేదు, వాటన్నిటికీ value ఉంటుంది. ఒకటి లేకుండా ఎన్ని సున్నాలున్న ఉపయోగం లేదు. అలాగే ఆత్మ తత్త్వం వలన ఈ సృష్టిలో సమస్తం ఏర్పడిందని వేదం చెప్తుంది. అది పంచభూతాలకు అతీతంగా ఉంటుంది కాబట్టి, పంచభూత తత్వమైన సృష్టిని మాత్రమే దర్శించ గలిగిన వాళ్ళు అదేం లేదంటారు. అదే లేకపోతే ఇదంతా ఎట్లా ఏర్పడుతోంది? అది తెలియాలంటే బాగా మనసు యందు పవిత్రత ఏర్పడితే కానీ అవగాహన రాదు. అది లేదని ఎంత మంది చెప్పినా ఉన్నది కాబట్టే దాని యొక్క విభూతిగా ఇవన్నీ సృష్టిలో ఒక పద్ధతి ప్రకారం అన్నీ ఏర్పడుతూ ఉంటాయి. Set patterns గా మొత్తం అంతా జరుగుతూ ఉంటుంది, ప్రతి దానికో పద్ధతి ఉంటుంది, మామిడి చెట్టుకి మామిడి చెట్టు పద్ధతి ఉంది, కొబ్బరి చెట్టుకి కొబ్బరి చెట్టు పద్ధతి ఉంది, కొబ్బరి చెట్టు కొమ్మల్లాగా మామిడి చెట్టు కొమ్మలు పడిపోవు కదా! ఏ జంతువు కా జంతువుకి చోటులో కొన్ని పద్ధతులున్నాయి, patterns ఉన్నాయి, వాటినే విభూతి అన్నాము. విభూతి యోగంలో శ్రీ కృష్ణుడు చెప్పేదంతా అదే! సృష్టిలో ఉండే patterns. నమూనాలు! అదెప్పుడు ఆ నమూనా ప్రకారమే ఉంటుంది. అట్లా నమూనాలు చోటులో దింపే వాడిని త్వష్ట అంటారు, "తస్య త్వష్టా విదధ ద్రూపమేతి" అని చెప్పి మనకి పురుష సూక్తంలో ఉంది. చోటులో ఆ రూపమేస్తే దాని చుట్టూ పదార్ధం అల్లుకుంటే ఆ రూపంలోకి వస్తుంది, అట్లా గమనించారు. అయస్కాంతం కాయితం కింద పెట్టి కాయితం పైన యినుప రజను తిప్పుతుంటే యినుప రజను కొన్ని patterns లో తయారవుతూ ఉంటుంది. కొత్త కొత్త నమూనాలు వస్తూ ఉంటాయి కదా! ఎక్కడేర్పడుతున్నాయి, ఆ magnetic current యొక్క movement బట్టి ఏర్పడుతున్నాయి కదా! ఆ pattern ఇనుప రజనుకుందా? లేదు. Pattern లో అది యిముడుతోంది. అట్లాగే ఈ పదార్ధం ఈ త్వష్ట అనే తత్వము తయారుచేసిన patterns లోకి కలిగి ఉంటుంది. ఆయన్ని దేవతల యొక్క వడ్రంగి, అని చెప్తారు, ఆయన వడ్రంగం చేస్తూ ఉంటాడు చోటులో! చోటులో ఇట్లా గీసారనుకోండి, ఆ దగ్గర్లో పదార్థం ఏదన్న ఉంటె అలా అయిపోతుంది, అంతే

కదా! జంతికల గొట్టంలో పిండేసి వత్తితే పెట్టిన బిళ్ళ మీద ఏదుంటే అదేగా వస్తోంది, అట్లా చోటులో ఆయన తయారు చేస్తూ ఉంటాడుట. అట్లా చోటులో తయారు చేస్తూ ఉంటే దానికి రూపాలు ఏర్పడతూ ఉంటాయి. వృద్ధాత్మ అనే ఒకే ఒక తత్త్వం అందరి కన్నా మొదట ఉన్న వాడు, వాడిని ఇట్లా వత్తుతారు పడేసి. వాడిని వత్తుతుంటే జంతికల గొట్టం లోంచి రకరకాల design లో జంతికలు వచ్చినట్టు వచ్చేస్తూ ఉంటుంది సృష్టి. అది

'అబధ్నన్ పురుషం పశుమ్. తం యజ్ఞం బర్హిషి ప్రౌక్షన్'

వాడిని కట్టేసి, వాడిని పెట్టి యజ్ఞం చేశారట దేవతలు, దేవతలుగా ముందు వాళ్లొస్తే, వాళ్ళేం చేశారంటే 'సృష్టి చేయాలన్నావు కదా, రా!' అని వాడినే పట్టుకుని పిండటం మొదలు పెట్టారు. వాడిని పిండుతుంటే ఇవన్నీ వచ్చాయన్నమాట. ఇవన్నీ పిండుతుంటే ఎక్కడి నుంచి వస్తున్నయ్యో వాడూ ముడి పదార్ధం! పిండి లేకుండా జంతికల గొట్టం ముట్టుకుంటే జంతికలు వస్తాయా, పిండి ఉండాలి కదా! అందుకే ఏ ఆధారం లేకుండా ఇదంతా దానంతట అది ఏర్పడిపోయింది అని శాస్త్రజ్ఞులు చెప్పే మాటలకు ఋషులు ఒప్పుకోరు. వాళ్ళేం వాదించరు, తెలియని వాళ్లతో ఏమి వాదిస్తాం, వాళ్లే తెలుసుకుంటారులే, తెలుసుకోపోతే ఇపుడు నష్టమేంటి అనుకుంటారు. అది! దానంతట అదే వచ్చేసేట్టయితే ఆ పిండెక్కడ్నుంచి వచ్చింది? ఆ ముడి సరుకు ఎక్కడ్నుంచి వచ్చింది? ఆ మూల పదార్ధం ఎక్కడ్నుంచి వచ్చింది? ఆ మూల తత్త్వం ఎక్కడుంది? గోళాలు గుండ్రంగానే ఎందుకు రావాలి? నలుపలకలుగా రావచ్చు గా మైసూరుపాకం బిళ్లలల్లే? ఒక గోళానికీ, ఒక గోళానికీ అనుసంధానం ఎందుకుండాలి? సృష్టి విధానం ఒకటి ఉంది, అదొక technology! అదట్లాగే జరుగుతుంది. అవి అట్లా జరగడానికి మూలం ఎవరు? వాడు! మనం ఇట్లా మెట్లెక్కి వెళ్తుంటె కొంత వరకు సృష్టి నిచ్చెన కనిపిస్తుంది. ఇక ఆ తర్వాత ఏమీ ఉండదు. నిచ్చెనకి ఇటు పక్క కనిపించే వాడు బ్రహ్మ. మరి మీరు ఎక్కడినుంచి వచ్చారు అంటే, నేను ఎక్కడినుంచి వచ్చానో అది నాకే కనపడలేదు, కానీ అదొకటి ఉందని తెలుసు, అని చెప్తాడు. అది లేకపోతే నేను రాలేను కదా! నాలోంచి వచ్చి మీరు గా ఏర్పడింది కూడా అదే! అదీ మొదటి వాడు అని చెప్పడం, తత్త్వం. మొదలు అని చెప్పడానికి ఒకటి అన్నపుడు అది మొదలని చెప్తాం, కదా! ఇక్కడ ఒకటి అనటానికి ఏమీ లేదు, ఒకటి అంటే వచ్చిందని, రావడం ఏమిటి అది ఉన్నది కదా! ఈ ఇల్లు ఎప్పుడు కట్టారంటే ఒక తేదీ చెప్పచ్చండి, ఈ ఇల్లు ఉన్న చోటు ఎప్పుడు ఏర్పడిందంటే తేదీ ఎమన్నా ఉందా దానికి? ఒక భారతీయ ఋషిని ఒకాయన ఒక పాశ్చాత్య దేశాల్లో ఎగతాళి చేయటానికి అడిగారు, 'మా క్రైస్తు ఎప్పుడు పుట్టాడో మాకు తెలుసు, మీ కృష్ణుడు ఎప్పుడు పుట్టాడో మీకు తెలుసా?' అంటే ఆయన చెప్పాడు

'మీ క్రైస్తు పుట్టే స్థితిలో ఉన్నాడు, మా కృష్ణుడు పుట్టే స్థితిలో లేడు. అందుకని తేదీ తెలియళ్ళిర్లేదు. పుట్టన వాడు పుట్టినట్టుగా కనిపించి మళ్ళీ ఎప్పుడూ ఉంటాడు. వెళ్లిపోయిన వాడు కాదు, పుట్టిన వాడు కాదు, ఎప్పుడూ ఉన్నవాడే! అందుకని మా దైవం రూపం కాదు, రూపానికి అతీతమైన తత్వం. అది ఎప్పుడూ ఉంటుంది'. 'అది ఎప్పుడు చొక్కా వేసుకుంది ఎప్పుడు చొక్కా తీసేసింది ఎందుకయ్యా లెక్కలు నీకు, ఇపుడా చొక్కా ఎప్పుడు వేసుకున్నావ్ మొదటి సారి అనేది ముఖ్యమా? ఈ చొక్కా, లాగులు వేసుకున్న వాళ్ళు ఎవరన్నా చెప్పండి, మొట్టమొదటి సారి అవి ఎప్పుడు వేసుకున్నారు? ఇవాళ కట్టుకుంటే తప్ప మొదటి సారి, ఇవాళ కట్టుకుంటే ఇప్పుడే పుట్టాడుట అని అర్థం, అంటే junior most fellow. మొత్తం చోటు, నీలమైన చోటు కి ఒక చొక్కా వేశామండి, ఆ చొక్కా ఎప్పుడేశామన్నది ముఖ్యం కాదు, చొక్కా ముఖ్యం కాదు, కదా! చొక్కాలో ఎవడున్నాడో వాడు కదా ముఖ్యం. అందుకని కృష్ణుడు పుట్టటం ఏంటిరా పిచ్చి వెధవా, అసలు పుట్టటం అనేదే లేదు, ఈ సంగతి నీకు తెలియాలంటే ఈ మొత్తాన్ని దాటి నువ్వు కొంత సాధన చేయాలి' అన్నాడు. వాడికి పిచ్చెక్కింది. అంటే వాళ్లంతా కేవలం intellect తప్ప అంతకు మించి ఏంలేదు కదా! 'కృష్ణుడు పుట్టటం అనేదే లేదు కాబట్టి వెళ్ళటం అనేది లేదు. నువ్వు కూడా అంతే మీ క్రైస్తు కూడా అంతే, ఇటువంటి ప్రశ్నలు ఎపుడు వేయవద్దని చెప్పాడు. ఎవరో తెలుసా చెప్పినాయన, చెప్తే మీరు ఆశ్చర్యపోతారు, ఎందుకంటే మనకి ఎంతసేపూ మన వాళ్ళని మనం తిట్టుకోడంలో మనం సిద్ధ హస్తులం. ఆయన పేరే రజనీష్! ఎంత బాగా చెప్పారు. ఎంత వారికైనా కొన్ని కొన్ని పొరపాట్లు ఉండవచ్చు. మనం ఆటుపోకుండా జ్ఞానం వైపు చూస్తే ఆయన తక్కువ వాడు కాదు. వృద్ధాత్మా అంటే దాంట్లోంచి అన్నీ వస్తూ ఉంటాయి, అన్నిటిలోకి వాడు వస్తూ ఉంటాడు. అన్నిటిలోకి వాడు రావడం అంటే ఏంటి, వాడిలో అవన్నీ ఏర్పడటమే! అందుకనే ఈ పదాలు అదే అంతకంతకీ భాష, చాలా కష్టమౌతుంది మాట్లాడ్డానికి. భగవంతుడు దిగి రావడం అంటే ఏంటి? దిగి రావాలంటే అక్కడ లేడనేగా దిగి వచ్చింది చోటుకి, మనమంటే ఇపుడు దిగి వెళ్ళిపోతాం కిందకి, దిగి రావడం ఏంటి మొత్తం అంతా ఉన్నవాడు? లేదు కదా! దిగొచ్చినట్టుగా ఉంటుంది. అసలా భావం ఋష్యశృంగుల భావం అంత ఉత్కృష్టమైన భావం. ఓ సిద్ధుడు దగ్గరికి అప్పుడే కాస్త దేవుడు, భక్తి అని అల్లరి చేసే వాడు ఒకడు వెళ్ళాడుట. అల్లరే ఎక్కువ భక్తి పేర్న. అసలు తక్కువ అల్లరెక్కువ. వెళ్లి 'నేను వెళ్తున్నాను వస్తావా తిరుపతి' అనంటాడు. తిరుపతిలో ఎవరున్నారని అడిగాడాయన 'దేవుడున్నాడు'. 'దేవుడెక్కడుంటాడు?' 'అంతటా ఉంటాడు.' 'అంతటా ఉండేవాడు, తిరుపతిలో ఉన్నవాడు ఇక్కడ గూడా ఉన్నాడా' అంటే 'ఉన్నాడు.' 'మరి నువెళ్తున్నావ్ అంటావేంటి, ఇక్కడ లేడా?' 'ఏమో నాకర్థం

కావట్లేదు, నేను వెళతాను' 'నువ్వు వెళ్ళు, వెళ్తే నాకేం అభ్యంతరం లేదు'. వెళ్ళడం ఏంటి అంటాడు? మంచి పుస్తకం ఒకటుంది, అది ధ్యానం చేయాలి, There is no such thing as far away, అందులో మొత్తం15 వాక్యాలు కూడా ఉండవు. రాసిన వాడు Richard Bach అని నా దృష్టిలో ఒక ఋషి. ఆయన మూడు పుస్తకాలు రాసారు, ముఖ్యమైనవి. ఇంకా చాలా ఉన్నాయి కానీ, Jonathan Livingston Seagull (doubt) అనే పుస్తకం ఒకటి, 'Illusions' అనే పుస్తక మొకటి, There is no such thing as far away. అందులో ఒక పిట్ట ఇంకో పిట్ట దగ్గరికొచ్చి అడుగుతుంది, ఎందుకంటే మనుషులు పేర్లు పెడితే వాళ్ళు గోల పెడతారని ఈయన పిట్టలని ఎన్నుకున్నారు. ఒక పిట్ట ఇంకో పిట్ట దగ్గరికొచ్చి అంటుంది 'ఫలానా పిట్ట పుట్టినరోజు ఇవాళ, నేను వెళ్తున్నాను నువ్వొస్తావా', అని. ఈ మూడు sentences మొదటి chapter. Next దాంట్లో, ఇవతల పిట్ట 'అసలు పుట్టిన రోజంటే ఏంటి?' అని అడుగుతుంది. ఏమి చెప్తుంది పుట్టినరోజంటే? ఇదేంటిరా ఇంత పిచ్చిగా ఉన్నాడు, మరీ అమాయకుడు, తెలివితక్కువ వాడు అనుకుంటుంది ముందు పిట్ట. చెప్తుంది, 'పుట్టడం అంటే ఏమిటి?' అని అడుగుతుంది ఇంకో పిట్ట. పుట్టినరోజు అని మనం అనుకుంటాం కానీ మనం ఆరోజు పుట్టామా? అంతకు ముందు ఉన్నాం కదా తల్లి కడుపులో, తల్లి కడుపులోకి ఎప్పుడొచ్చాము? తెలీదు. పోనీ తెలుసుకున్నాం అనుకోండి, ఎక్కడ్నుంచి వచ్చాము తల్లి కడుపులోకి, ఎక్కడ్నుంచి లేకుండా అక్కడికి రాలేదు కదా! తండ్రి నుంచి వచ్చాము. తండ్రి దగ్గరికి ఎప్పుడొచ్చాము?, ఎప్పుడో వచ్చాము, ఎక్కడ్నుంచి వచ్చాము? బుర్ర గోక్కుంటాడు. పుట్టటం ఏవిట్రా? అని అడుగుతుంది. ఇక్కడికి ఒక chapter అయిపోయింది. మూడో chapter. ఆ తర్వాత సరే పుట్టాడన్నావ్ ఎదో, వెళ్ళడం ఏంటి? అని అడుగుతుంది. ఇవన్నీ మనకి ఉపనిషత్తులు నా దృష్టిలో. వాడి స్థితి ఇది, వీడి స్థితి అది. వీడేమో కూడగట్టుకున్న వాటిని చూస్తున్నాడు. వాడేమో వీటన్నిటికీ మూలమైనది చూస్తున్నాడు.ఈ పురుష సూక్తం చదువుకున్న వాళ్ళందరూ దాన్ని చూడాలి. ఇప్పుడు ఈ గదిలోకి రాంగానే ఈ గదిలో ఉండే fans, lights, దేవుడి బొమ్మలు, నేల, గోడకుండే రంగు, తలుపులు, ఇవన్నీ ఎవరైనా చూస్తారు. ఇక్కడ ఉండేదీ, చూడనిది ఏమిటయ్యా అంటే ఇందులో ఉండే చోటే! అదొక్కటి చూడం మనం, మిగతావన్నీ చూస్తుంటాం, కదా! ఋషి ఇక్కడుండే చోటు చూస్తాడు, ఈ చోటులో మనం ఏమి నింపాము యిన్నాళ్ళ నుండి, అని కూడా చూస్తాడు. మనం గోడ చూపించి ఏదో రంగని , నేల mosaic అని అంటే వాడికి పట్టదు అది. నేల mosaic అయినా granite అయినా పట్టదు. వాడేం చూస్తాడంటే ఈ గదిలో ఇంతకాలం వీడు ఏం తత్వం పెట్టి నింపాడు. చీట్ల పేక తత్వం ఉందా, తాగుడు తత్వం ఉందా, వాళ్ళని వీళ్ళని తిట్టుకున్న విషయాలు ఉన్నాయా,

ఎటువంటి శబ్దాలతో నింపాము, ఎటువంటి భావంతో నింపాము, అన్నీ గమనిస్తాడు, ఎందుకనీ? వాడు దాంతో ముడివేసుకుని ఉన్నాడు, సూక్ష్మమైన వాటితో. మనం స్థూలమైన వాటితో ముడి వేసుకుంటాం, కాబట్టి వీడికివి కనిపిస్తే, వాడికవి కనిపిస్తాయి. సరాసరి తీసుకు వస్తే వాడు చూసేది వాడు చూస్తాడు. అట్లా చూసిన వాడు కాబట్టి భీష్ముడు 'వృద్ధాత్మా' అని ఒక నామం ఇవ్వడం జరిగింది. ఎందుకంటే ఎప్పటి వాడు? చెప్పలేడు, వాటి లోంచి వచ్చిన వాడు కూడా చెప్పలేడు. 'The part never comprehend the whole' అని మనం చెప్పుకుంటూ ఉంటాం. అంశము మొత్తాన్ని ఎపుడూ గ్రహించలేదు అని. అందులోకి యిమిడిపోతుంది. అంతే! అందుకని వృద్ధాత్మా, సహస్రాక్ష, పురుష సూక్తం బాగా తెలుసుకోండి, తెలిస్తే ఎప్పటి పురుషుడు వీడు, ఎట్లా అయ్యాడు, ఏం జరిగింది, ఇదంతా ఉంటుంది.

365 మహాక్షః

మహాక్షుడు అంటే చాలా పెద్ద కన్ను 'All Seeing Eye', సమస్తాన్ని చూస్తూ ఉండగలడు. అందుకనే కృష్ణుడు' 'నేను సాక్షిని' అంటాడు. అంటే స అక్షిని, అన్నీ చూస్తాను, మీరు చూడలేరు అనుకున్నవి కూడా చూస్తాను. మీరు చూడటల్లేదు, పరవాలేదు అనుకున్నవి కూడా చూస్తాను. అంటే మనం ఎవరి గురించైనా చేసిన భావనలన్నీ వాళ్లకి తెలుస్తుంటాయి. వాళ్యకంటే యోగులంతా అని! దాన్ని బట్టి నేను మీ account maintain చేస్తాను అంటాడు కృష్ణుడు. ఎదురుగా ఉన్నపుడు మర్యాదగా ఉండటం ఒక పద్ధతి కదా, లేనపుడు ఇంకో రకంగా ఉంటాం కదా, లేకపోతే తోచదు మనకి అసలు. వెళ్ళంగానే వాడి గురించి ఎదో ఒక బాణం ఒదలకపోతే! లేని వాళ్ళ గురించి మనం మాట్లాడుకునే మాటలన్నీ వాడు లేడని మాట్లాడుకుంటాం కదా, కానీ అసలు 'వాడు' ఉంటాడు. అందుకని అన్నింటికీ నేను సాక్షిగా ఉంటాను. దాని ప్రకారం నీకు accounts పడిపోతూ వుంటాయ్. దాని ప్రకారం నీకు రావలసినవి వస్తూ ఉంటాయి. మనం ఎవరినన్నా అన్నవన్నీ, మనం చేసినవన్నీ కూడా వాఙ్మయ లోకం నుంచే మనకొస్తాయి. వాఙ్మయ లోకంలో మనం కొంత అధర్మంగా ప్రవర్తించామనుకోండి మనం కూడా వినాల్సొస్తుంది. భావమయలోకంలో మాట ఏదన్నా కొంత పారేసుకోకుండా ఉండగలరు. భావమయ లోకంలో బాగా తిట్టుకుంటూ వాళ్యని almost హత్య చేసేస్తూ ఉంటారు. అలా చేసిన వాళ్లు ఇక్కడ భావమయ లోకంలో బాధపడుతుంటారు. కొంత మంది భావమయ లోకంలో రాంగానే, వాఙ్మయ లోకంలోకి పట్టుకొచ్చేస్తారు. పట్టుకొస్తే వాళ్ళు వాఙ్మయ లోకంలోనే అనుభవిస్తారు కానీ భావమయ లోకంలో ఇంక అనుభవించేది ఏమి లేదు. అక్కడ clearance వచ్చేసింది. భావమయ లోకంలో మనం బాగా గింజుకుంటున్నాం అనుకోండి అంటే మనం భావమయ లోకంలో ఇతరుల యందు చేస్తున్న భావముల వలన, ఎవరికి, ఏది, ఎప్పుడు జరిగినా అది అప్పుడు వాడికి రావాల్సిందే వస్తుంది తప్ప, ఇంకోటి రాదు. మనమేదో చాలా మంచివాళ్యం కాబట్టి మనకే ఎందుకొచ్చింది అనుకుంటాం, ముందు మంచి వాళ్ళు అని అనుకోడమే ఒక presumption! వాళ్ళు కనబడి ఇదిగోరా నీ account అని ముందు పడేస్తే, మనకే అసహ్యం వేస్తుంది. ఒద్దు సార్ అంటాం, అట్ట చాలు, పేజీ కూడా అక్కర్లేదు, అంతా open చేయక్కర్లేదు, అట్ట దగ్గరనించి కాగితం కాగితం లోను, మనమే ఏదన్నా ఎక్కడికన్నా వెళ్లి చూసి తెలుసుకున్నట్టుగా ఉంటాయి మన విషయాలు. మరి వాడ్ని ఇది ఎందుకు ఇలా చేసావ్? అని అడగకూడదు. ఎందుకిట్లా చేసావ్ అని అడిగితే, వాడు చూపిస్తే మనం బతకలేం. పూర్వ కాలంలో మన దేశం

నాయకులందరూ ఒక్కొక్కడ్ని పిలిచి వాడి files వాడి ముందు పడేస్తుండేవారు. వాడు నోరు మూసుకు వెళ్ళిపోయి రాజీనామా ఇచ్చేసేవారు, కదా! అట్లా మనందరివి లిపికలు అనే దేవతలు చాలా detailed accounts వేస్తారు. మీరు number one account, number two account అని అంటూంటారు కదా, అలా Thought plane account ఒకటి ఉంటుంది, Vocal plane account ఒకటి ఉంటుంది, Action plane account ఒకటి ఉంటుంది. మూడు accounts ఉంటాయి. ఈ మూడు accounts ఈయన చూస్తూ ఉండడం వలన అక్కడ record అయిపోతాయండీ. పాశ్చాత్య దేశస్తులు కూడా 'Our Lord is the all seeing eye' అని చెప్పకుంటారు. అన్నీ చూస్తారు అని తెలుసుకుంటే మనం చాలా విధాలుగా బాగుపడతాం. ఎందుకంటే, ఎవరన్నా చూస్తుంటే మనము చేయకూడదు అనుకున్న పనులు చెయ్యం. ఎవరూ చూడకపోతే చేద్దాం అనుకునే పనులు ఇంక చేయడానికి వీల్లేదు, వీడొకడు ఉన్నాడు కదా. వాడు లేడనుకుని నువ్వు చేస్తున్నావ్ కానీ, వాడు ఉండడం వల్ల మళ్ళీ నీకది వచ్చేస్తుంది అని చెప్తున్నారు. భీష్ముడికి కూడా అట్లాగే ఇచ్చేసాడు కృష్ణుడు. ఆయన ఖాతా ఆయనకి అప్పచెప్పేసాడు, ఎవరి ఖాతా వాళ్ళకి అప్పజెప్పేస్తాడు. ఎవరిది వాళ్ళకి చూసి దాని ప్రకారం, కేవలం చూడటమే. అలాగే మనము ఏమి చేస్తామో చూస్తాడు, మనము ప్రార్థన చేస్తే వింటాడు. అది సత్యము. అది మనకి పుక్కిటి పురాణం లాగా అనిపించచ్చు కానీ అది చాలా పెద్ద సత్యం. అక్షం అంటే ఇంకొక అవగాహన ఉంది. కేంద్రం నుంచి పరిధికి కొని రాయబడినది అని. అంటే radius! కేంద్రం నుంచి పరిధికి కొని రావడం కూడా అక్షం. మహాక్షం అంటే విపరీతంగా వచ్చేసాడు కేంద్రం నించి పరిధి వరకు. ఎక్కడివరకు అంటే, అంతవరకు (నేను) (మీరు) చెప్పినంత వరకు ఉంది. కేంద్రం నించి పరిధికి వ్యాపించిన దాన్ని ఏమంటాం మనం? Radius అంటాం ఇంగ్లీషులో, తెలుగులో వ్యాసం అంటాం. వ్యాసార్ధముకి, పరిధికి ఉండే సంబంధం ఏంటి? చదువుకున్నారు కదా చిన్నపుడు. Radius కి circle కి ఉండే relation ఏంటి? pi అన్నారు. pi అనే మాట ఎక్కడ్నించి పుట్టింది? అది pi కాదు అది 'p' . మనం తెలుగులో మనవాళ్ళు pi చేసారు. పైన కింద లాగ, ఈ p అనేది Greek పదం. దాని mathematical equation ఏంటి? ౨౨ /౭ అని చెప్తారు, అది ౨౨ / ౭ కాదు, by ౭ correct, it is not ౨౧, it is not ౨౨. It is in between. ౨౧ point something, ఆ point something మీరు ఎంత చేసినా అది పూర్తి అవ్వదు. అంటే 'త్రిస్సప్త సమిధః కృతాః' మూడు ఏళ్ళు ఎంత? తిస్సప్తహ, కదా! అంతే కాదు అంతకి మించి ఉన్నాడు. ఇరవై ఒకటి అయ్యాడు, మూడు భాగాలు చేసుకుంటే, ఏడు సార్లు ఏడు లోకాలు. త్రిగుణాత్మకంగా ఏడులోకాలు సృష్టి చేసాడు, ఇది పురుషసూక్తం లో వున్న పెద్ద రహస్యం. పురుష సూక్తం ఊరికే చదివేస్తాం గాని

అందులో మొత్తం సృష్టి రహస్యాలు అన్నీ ఉంటాయి, అందులో ఆవులున్నాయ్, గుర్రాలున్నాయ్ తర్వాత గొర్రెలున్నాయ్ ఇవన్నీ ఆవులు, గొర్రెలు, గుర్రాలు కావవి. అన్ని ఇట్లా రహస్యంగా ఇవ్వబడినటువంటివి. వేదంలో పదకొండువేల ఆరువందలచిల్లర సూక్తాలు ఉంటె, వాటన్నింటికి రాజమకుటం లాంటిది పురుష సూక్తం. అందులో ఈ p ఉంది. ఏమిటి ఈ p అంటే, ఏడు లోకాలుగా, మూడు త్రిగుణములు చేత, ఏర్పబడిన తర్వాత కూడ ఇంకా మిగిలి ఉంటాడు. అంటే there is a remainder after 21. శేషం ఉంటుంది. ఆయన్ని పెట్టి భాగించినా శేషంగా మిగిలి ఉన్నాడు, అదీ శేషుడంటే! అట్లా ఉండిపోతాడు. ఎందుకంటే మొత్తం యజ్ఞం చేయలేదు. ఎంత సృష్టి జరగాలో అంతే యజ్ఞం జరుగుతుంది, మిగితాది ఉండిపోతుంది. మన బస్తాలో బియ్యం లాగ, ఆ రోజుకి కావల్సినది వండుకు తింటాం, మిగతాది ఉండిపోయినట్టు. ఎప్పుడూ ఉండిపోతాడుట, నువ్వు ఎంత యజ్ఞం చెయ్, కొంత ఉండిపోతాడుట. యజ్ఞం చేయాలంటే through triangle, అదీ త్రిగుణాత్మకము అన్నారు. 'The whole creation is a triangle of forces' అని చెప్తుంది మహాభారతం. మూడు తో పట్టుకొస్తాడు, అవి ఏడు లోకాలు గా అగుపడతాయి. అందుకని మూడు, ఏడూ ఇచ్చేసారు. ఇరవై ఒకటి. దానికి మించి ఉంటాడు. అంటే ఏంటి, కేంద్రం నించి తీసుకొస్తుంటే అట్లా పరిధి వరకు వస్తాడండీ. ఇక్కడ పరిధి ఇంత అని ఏమీ లేదు. 'అనేమీ చక్రం' అంటారు, అంటే అంతు లేదుట దానికి. అనేమీ అంటే అంతు లేకపోవడం. అంతు లేకుండా అట్లా అక్షంఅవుతూనే ఉంటుంది, అక్షాంశము. దాని యొక్క equation ఏంటయ్యా అంటే, 'త్రిస్సప్తః' అది దాని Equation. దానికి సంకేతం ఏమిచ్చారు అంటే, P అనే అక్షరం ఉంటుంది చూసారా, రెండు verticles పైన ఒక horizontal ఉంటె అది P అనే అక్షరం గ్రీకులో. మనం Gemini symbol వేస్తాం, రెండు verticles వేసి, వాటి పైనొకటి కిందొకటి పెడతాం, పైనొక horizontal, కిందొక horzontal. కింద horizontal ఏంటంటే 'rooting of the physical', పైన horizontal ఏంటంటే భగవద్ తత్వం గంధర్వతత్వంగా అట్లా తరంగంగా వెలుగుతూ ఉండడం. ఇట్లా వెళుతూ ఉంటే చాలా దూరం వెళుతూ ఉంటుంది, ఎందుకంటే ఈ విజ్ఞానం అపరిమితమైన విజ్ఞానం. అందుకని మహాక్షుడంటే కేవలం చూసే వాడనే కాకుండా అట్లా కేంద్రం నుంచి పరిధి వరకు అపరిమితంగా వ్యాపనం చెందుతూ, ఆ చెందుతున్న దాంట్లో తాను ఉన్నప్పటికీ ఇంకా మిగిలి ఉండి ఉంటాడు. అంటే సృష్టిగా ఉంటాడు, సృష్టికి మించి ఉంటాడు. మనం కూడా మన శరీరం మాత్రమే కాకుండా శరీరానికి మించి ఉంటాం. అది మనకి సంబంధించిన సృష్టి కాబట్టి, అట్లా మహాక్షుడుగా ఉంటాడు. మహాక్షా అన్న పదానికి Pi equation కూడా వస్తుంది. ఊరికే వీటి dimensions గురించి

చెప్పకుంటున్నాం తప్పితే ఇపుడు మొత్తం Pi equation గురించి చెప్పాలంటే మిథున రాశి అంతా చెప్పాలి. అదొక 15 రోజులు పడుతుంది. Verticals దిగొచ్చేది male, female వస్తుంది. Male, Female గా వచ్చేదానికి పైన horizontal గా ఉండే line it is the unity of male female in its sections, అదొకటి.

366 గరుడధ్వజః

గరుడధ్వజ అంటే శ్రీ కృష్ణుని యొక్క రథానికి గరుత్మంతుడి యొక్క ధ్వజం అంటే flag ఉంటుంది. గరుత్మంతుడు గూర్చి ఒక పెద్ద seminar పెట్టుకున్నాము, 10 రోజుల పాటు, అది ఎప్పుడన్నా మీకు ఓపిక ఉండి వింటే బావుంటుంది. ఎందుకంటే గరుత్మంతుడు గనుక మనలో మనకి తెలిస్తే దేవుడి దగ్గర ఉన్నట్టే మనం. He is the most proximate intelligent to that which we call God. మనం దివ్యత్వం అనేది ఆయన యొక్క మూపురం మీద వుండే వాడు కదా. గరుత్మంతుడంటే మనలో ఉండే స్పందన. అందుకని ఆయన గరుత్మంతుడుండే ధ్వజం పెట్టుకున్నాడుట. ఎందుకిది చెప్పారంటే మనలో బ్రహ్మ దండం అనే ఒక ధ్వజం ఉంది. ఈ బ్రహ్మ దండం అనే ధ్వజానికి కూడా గరుత్మంతుడికి ఉండే రెండు రెక్కలులాగా, ఈ గుండెకాయ దగ్గరికి వచ్చే సరికి రెండు ఊపిరి తిత్తులు ఉంటాయి. పక్షి రెక్కలు లాగానే అవీ contract అవుతూ ఉంటాయి expand అవుతూ ఉంటాయి, కదా! సంకోచం చెందుతూ ఉంటాయి, వ్యాకోచం చెందుతూ ఉంటాయి. అట్లా సంకోచ వ్యాకోచాలు చేస్తున్న ప్రజ్ఞగా మనలో గరుత్మంతుడు వున్నాడు. ఆయన మూపురం మీద అంటే రెండు ఊపిరి తిత్తులు కలిసే చోటు ఉందే,వెనకాల అక్కడ నారాయణ పద్మం ఒకటి ఉంది, దాన్నే 'అష్టదళ పద్మం' అంటారు. అక్కడ కూర్చుని ఉంటాడు. అక్కడ్నుంచి ఇంకొంచెం పైకి వెళితే ఈ ముక్కు భాగం నుండి ఇది ప్రాణ వాయువు తనలోకి తీసుకువెళ్లి అపానాన్ని బైటికి పంపిస్తూ, ఈ సంకోచ వ్యాకోచాలు చేస్తున్న మొత్తం ప్రక్రియ మనలో జరుగుతూ వున్నదే, అది గరుత్మంతుడు. ముక్కు గరుత్మంతుడి ముక్కు అన్న మాట. అందులోంచి గాలి వెళుతూ ఉంటె సంకోచ వ్యాకోచాలు జరుగుతూ ఉంటాయి, అది కారణం గా ఆ సంకోచ వ్యాకోచాలూ లోపల చేస్తూ ఉన్న స్పందన ఒకటి ఉంది. ఆ స్పందనాన్ని అధిష్ఠించి ఉన్న వాడు భగవంతుడు/ భగవత్తత్వం. కాబట్టి ఆజ్ఞ నుండి మూలాధారం వరకు, గరుత్మంతుడి తోక మూలాధారం, గరుత్మంతుడి ముక్కు పై భాగం ఆజ్ఞ. ముక్కు ఇట్లా ఉండి రెక్కలు విచ్చుకున్నాయి. అసలు గరుత్మంతుడికి, మనకి ఏంటి తేడా అంటే మన గరుత్మంతుడు, ఎముకల పెట్టలో ఉండిపోయాడు. అస్థి పంజరంలో ఉండిపోయాడు. ఆ గరుత్మంతుడు రెక్కల్ని పంజరం దాటి, మరీ విచ్చుకుని తిరుగుతున్నాడు. మనం కూడా ఆ విధంగా ఈ రెక్కల్ని పెంచుకోవచ్చుట. ప్రాణాయామం కార్యక్రమం ద్వారా. పెంచుకుంటే ఈ రెక్కలు , ఊపిరి తిత్తులు రెక్కలు, ప్రాణాయామం ద్వారా దివ్య మైన రెక్కలు ఏర్పడతాయి. అవి పట్టుకుని ఎగరవచ్చు పక్షల్లే. అవి, ఈ 'సోహం' అనే శబ్దం ద్వారా ఏర్పరుచుకుని, శరీరాన్ని

వదిలి అట్లా చోటులో ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్తూ ఉంటాడు మహాత్ముడు, ఆ రెక్కల ద్వారా. అందుకనే మనకి దేవతలు బొమ్మలు వేసినప్పుడు రెక్కలెక్కడ చూపిస్తారు? మన రెక్కలేమో ఎముకల పెట్టలో ఉంటాయి, వాళ్ళ రెక్కలు భుజాలు నుండి బయటికి వచ్చేసి ఉంటాయి కదా. అంటే ఏంటి? పంజరం లోంచి బయట పడ్డ పక్షి లాగా అన్నమాట. పంజరం లోంచి బయటికి వచ్చిన జీవుడు లాగా.

(ఇక్కడ్నించి 10 నిమిషాలు రికార్డింగ్ సెకరించే ప్రయత్నము జరుగుతొంది)

367 అతులః

అతులః అంటే తూకం వేసి ఎవరితోనూ సమానం అని చెప్పటానికి వీల్లేదు. తుల అంటే తూకం. అతుల అంటే తూకం లేని వాడని. తూకం లేనివాడు అంటే ఆయనని తూచలేమని. ఎందుకని? తూచేవన్నీ ఆయనలోంచి దిగి వచ్చినాయి కదా. త్రాసు, తూచేవాడు, తూచుదామనే బుద్ధి, ఇవన్నీ ఎవరి నుండి దిగి వస్తాయో ఆ మూలతత్త్వాన్ని ఏదీతూచలేదు. అందుకని ఫలానా వాడితో సమానం భగవంతుడు అని చెప్పడానికి వీలు లేదు. ఆయన నుండి దిగివచ్చినవి కాబట్టి ఆయనతో ఏదీ సమానం కాదు. అందుకని ఆయనని గురువు అని కూడా అంటారు. అందరికన్నా పెద్దవాడు. ఎంత పెద్దవాడు అంటే ఇంకెవరూ ఆయనతో సమానం కాదు. గురువు గురువే, లఘువు లఘువే. అందుకని ఆత్మ తత్త్వం ఏదైతే ఉందో అందులోంచి సమస్తం వ్యక్తం అవుతున్నాయి కాబట్టి దేంట్లో నుండి మిగతా ప్రజ్ఞలు వ్యక్తమవుతున్నాయో, ఆ ప్రజ్ఞలు కూడా ఆయన ద్వారా వ్యక్తమవుతూ ఉన్నప్పుడు, వ్యక్తమైన అవ్యక్తతత్త్వాన్ని గురుతత్త్వం అంటారు. అందుకని సత్యభామా దేవి తులాభారం వేసి కృష్ణుడిని బంగారంతోనో, వెండితోనో తన స్వంతం చేసుకుందాం అని అనుకున్నప్పుడు భంగపడుతుంది. ఎందుకంటే ఎవరూ కూడా భగవంతుడిని స్వంతం చేసుకోలేరు. భగవంతుడికి వీళ్ళు స్వంతం అవ్వచ్చు. నా దేవుడనటానికి వీల్లేదు. దేవుడి వాళ్ళం అనాలి. నా దేవుడు... మనం ఒక బొమ్మ పెట్టినప్పుడు కూడా మా కృష్ణుడండీ... అంటే ఎట్లా? మనం కృష్ణుడి వాళ్ళమని తెలియడం నిజమైన తత్త్వం. మా కృష్ణుడు అనడం అవివేకం. మా దేవుడు అనడం అవివేకం. మనం ఆయనలో నుండి వచ్చాం, ఆయనకు చెంది ఉన్నాం. ఆయనకు చెంది ఉన్నాం కాబట్టి, ఆయన మనకు చెంది ఉన్నాడు. అంతే తప్ప, నాలో మీరు ఉన్నారు కాబట్టి మీలో నేను ఉన్నాను తప్ప, మీలో నేనున్నాననే భావన నాలో మీరు ఉండటం వలన ఏర్పడుతుందని చెప్తాడు తొమ్మిదవ అధ్యాయం భగవద్గీతలో. ముఖ్యం గా తానే ఇంతమందిగా వచ్చాడు కాబట్టి, వచ్చే వాళ్లలో మనవాడు అనుకోవటానికి వీల్లేదు ఎవరు కూడా. రుక్మిణీదేవి తన వాడు అనుకోలేదు, తాను ఆయనకు చెందినది అని గుర్తు ఉన్న వ్యక్తి. సత్యభామ మామూలుగా మానవ సహజమైన ప్రవృత్తి కలిగి, స్వంతం చేసుకునే ఒక బుద్ధి కలిగి ఉంది. ఆయననే కాదు ఆయన సృష్టిలో దేనిని కూడా స్వంతం చేసుకోవడానికి వీల్లేదు. ఇది గోవింద నామం! సమస్తం ఆయనే! సమస్తానికి యజమాని ఆయనే! యజమాని ఆయన అయినప్పుడు మనమంతా ఆయన యొక్క భాగములు లేదా అంశములు అయినప్పుడు, ఆయన మనలను పొంది ఉన్నాడు తప్ప, మనం ఆయనను పొంది ఉన్నామనే భావన సరికాదు. నా

యందు భగవంతుడు ఉన్నాడు అనుకుంటే అది పూర్తి వివేకం కాదు. నేను భగవంతుని యందు ఉన్నాను, అనుకోవడం పూర్తి వివేకం. నా గురువు అనుకోవటానికి వీల్లేదు. గురువులను, దేవతలను, దేవుళ్లను అందర్నీ మనం, మన వశం చేసుకుందాం అనుకుంటాం కదా! అది అసుర భావం! రావణాసురుడు శివుడ్ని వశం చేసుకుందామనుకున్నాడు. గజాసురుడు వశం చేసుకుందామనుకున్నాడు. భక్తుడు భగవంతుడిని వశం చేసుకోవడమనేది అవివేకం. భగవంతునికి వశమై జీవించడం అనేది వివేకం. రుక్మిణీదేవి భగవంతునికి వశమై తాను జీవించింది. సత్యభామా దేవి మొత్తం అంతా కూడా ఎప్పటికప్పుడు కృష్ణుడిని పట్టి ఉంచాలనే ప్రయత్నంలో విఫలం అయ్యి, తెలుసుకుని, జ్ఞానోదయం అయ్యి అప్పటినుంచి తాను ఆయన దానిగా ఉండాలి తప్ప, ఆయన తన వాడు కాడు. మనమందరము కూడా భగవంతుడు మనవాడు అనుకోకుండా మనము భగవంతునికి సంబంధించిన వారము అనుకోవాలి. అయితే భగవంతుడు నిజంగా మనకు బాగా సాన్నిహిత్యం కలిగి ఉన్నప్పుడు ఏముంటుందంటే భావం... తాను అతనికి చెందిన వాడు, తనకున్న సమస్తము కూడా అతనిదే, తనకున్నదనే భావనే తప్ప నిజానికి అతనిదే. అతనిదే తనదిగా అనుభవింపనిస్తున్నాడు. ఈ సృష్టి మొత్తం అతనిదే! అందుకని అతనికి చెందినది మనలను అనుభవించడానికి అనుమతినిచ్చాడు, అని తెలుసుకున్న వాడు నిజమైన భక్తుడు. మనదనే భావంతో అనుభవించడం కన్నా, అతనిది మనం అనుభవిస్తున్నాం కాబట్టి అది అనుగ్రహం. ఇంట్లో ఉండనిచ్చాడు అనుకోవాలి. లేకపోతే camps పెట్టి, వారానికి ఒక రోజే ఇంట్లో ఉండడం, మిగతా అప్పుడు అంతా తిరుగుతూ ఉండడం ఉంటుంది కదా. అలా జరుగుతోంది కూడానూ. కాబట్టి ఎక్కడ, ఎప్పుడు మనని ఏది అనుభవించాం అని మనం అనుకున్నా, అనుభవింపనిచ్చాడు అనుకోవాలి. అది సత్యం! అందుకని ఏది మన దగ్గరకు వచ్చినా, ముందు వాడికి సమర్పణ చేసి నువ్వు ఇది నాకు ఈ రోజు అనుగ్రహించావు కాబట్టి నీకు ఇస్తున్నాను, నీ పరంగా తీసుకో అని జీవించాలి. మనకెందుకనో ఇది వాడిదని గుర్తుండదు. మనదేనని గుర్తుంటుంది. కష్టాల్లో గుర్తొస్తాడు. మనకు ఎప్పుడు ఇబ్బంది వచ్చినా గుర్తొస్తాడు. 'నీ వారము శంభో' అని ఒక పాట ఉంటుంది, నా వాడివి నువ్వు అని అనడం కాకుండా నీ వాళ్ళము మేము అని. చిన్నప్పుడు 'మాయల మారి' అని ఒక సినిమా వచ్చింది. అందులో ఒక పాట ఉంటుంది. 'నా వాడివి శంభో' అన్న వారందరూ కూడా అసురులయ్యారు. నీ వారము మేము అని గుర్తున్న వాళ్ళందరూ కూడా ఉద్ధరింపబడ్డారు. నేను నీ వాడను కాబట్టి నన్ను రక్షించు. నువ్విచ్చే సమస్తము నీదే, నామీద కలిగిన అపారమైన కరుణ చేత, అనుగ్రహం చేత, నన్ను అనుభవింపజేయనిస్తున్నావు అన్న భావనలో ఉండాలి. అలాగే ఈ సమస్తమైన

సృష్టిలో ఏదీ మనది కాదు అని తెలుసుకోవాలి. నా మొగుడు అనుకోవడానికి వీల్లేదు, నా పెళ్ళాం అనుకోవడానికి వీల్లేదు, నా పిల్లలు అనుకోవడానికి వీల్లేదు, నా ఆస్తి అనుకోవడానికి వీల్లేదు, నా స్థలం అనుకోవడానికి వీల్లేదు. నాదంటూ ఏమీ లేదు, వాడిదే అంతా! వాడిది, మన దగ్గర మన మీద విశ్వాసం కొద్దీ ఉంచాడు. మనం నెమ్మదిగా స్వంతం చేసుకున్నా బాధపడడు, పోనీలే మన వాడే కదా అనుకుంటాడు గాని, దుర్వినియోగం అయితే మాత్రం ఊరుకోడు. అందుకని మొదటగా ఏదీ స్వంతం అనుకోకూడదు. రెండవది దాన్ని ఉంచుకున్నందుకు అది మనకు ఇబ్బందికరంగా తయారవుతుంది. ఏది మనకు అనుభూతినివ్వాలో అది మనకు దుఃఖాన్నిస్తోందనుకోండి... అంటే ఏమిటి దానియందు మనం సద్బుద్ధి, సరైన బుద్ధి కలిగి ఉండకపోవడం వల్ల ఒకటి, దానిని దుర్వినియోగం చేయడం వల్ల. ఈ రెండు జరిగినప్పుడు అక్కడి నుండి మనకు అనుభూతి రాదు. ఆ ఉన్నది కూడా సడలిపోతుంది. అందుకని మనం సాధన పరంగా చూసినప్పుడు 'అతులః' అనే నామములో ఒకటి నిన్ను మేము తూకం వేయలేము, నీ కన్నా పెద్దవాడు/గొప్పవాడు ఎవరూ లేడు నీలోంచి మేము వచ్చిన వాళ్ళము కాబట్టి నువ్వు ఇంత అని చెప్పలేము. 33 కోట్ల దేవతల్ని ఒక్కళ్ళ మీద ఒకళ్ళు, ఒక్కళ్ళ మీద ఒకళ్ళు అలా నిలబెట్టినా కూడా, అంతకన్నా మించి ఉంటావు నువ్వు అని అన్నమయ్య పాట పాడాడు. ఎందుకని? ఆయనలోంచి వచ్చారు కాబట్టి వీళ్లంతా. ఈ మొత్తం సృష్టి, సృష్టిలో జీవులు అందరూ కూడా ఆయనకు ఒక పాదం అంటే 1/4 వంతు. మూడు వంతులు ఇంకా దిగనే లేదట. ఒక పావలా దిగిందట. ఒక పావలా దిగితే ఇంకా ముప్పావలా అక్కడ ఉన్నాడట. కాబట్టి ఆ ముప్పావలాను ఈ పావలా దేన్ని పెట్టి కొలుస్తారు? కొలిస్తే ఏమాత్రం సరిపోతుంది? సరిపోదు కాబట్టే ఆయనను తూచలేము, తూకం వేయకూడదు. భగవంతుడితో నువ్వు ఎంతటివాడవు అని అనుకోకూడదు. ఎంతటి వాడవో మాకు తెలియదు, వాడి లోంచి వచ్చిన వాళ్ళము కాబట్టి వాడితో ఉండి వాడి ఒడిలో కూర్చుని మన పనులన్నీ చేసుకుంటూ వెళ్లటమే. అప్పుడు మనలో నిండిపోయినట్లుగా ఉంటుంది. వాడి చంక నెక్కి మనము కూర్చుంటాం. మనల్ని చంకలో పెట్టుకుని వాడు మన పనులు కూడా చేస్తాడు. మనవని మనం అనుకోకూడదు. అన్ని ఇంక వాడివే! అది భక్తుడు అయిపోవడమంటే! అలా కానప్పుడు సమస్తం బరువెక్కుతుంది. నిజానికి మనం ఒక్కొక్కళ్ళం కనీసం 60-70 కేజీలు అయినా ఉంటాం కదా. ఉంటామా. ఎవరికి వాళ్లు తూకం వేసుకోండి. అంత తూకం బస్తా ఒకటి ఎత్తండి. ఎత్త లేకపోవడం ఒకటి, ఎత్తినా బరువుగా ఉంటుంది కదా! మరి మనం నిలబడితే మనకట్లా ఉండదేం? కానీ 74 కేజీలు ఉన్న వాడిని, నాకు నేను బరువుంటానా? మీకు మీరు బరువుంటారా?

ఏమిటిది? ఏమైపోయినాయి ఈ కేజీలన్నీను? వాడి అస్తిత్వం వలన ఇదంతా తెలియదు. మనకు బరువు తూచే యంత్రం ఇచ్చినప్పుడు కదా తెలుస్తుంది, మనం ఇన్ని కేజీలు ఉన్నామని. లేకపోతే తెలుస్తుందా? మన బరువు మనకెందుకు తెలియదు? ఒక కేజీ రాయి జేబులో పెట్టుకుంటే బరువు తెలుస్తుంది. ఎందుకని? కేజీ రాయిలో లేము. శరీరంలో మనం ఉన్నాం కాబట్టి బరువు తెలియదు. అలాగే ఈ భూగోళం, దాని బరువు మనం తూచలేము కదా. అటువంటి గోళాల సమూహంగా ఒక సూర్య మండలం, దాని బరువు. అటువంటి సూర్య మండలాల గుంపులు, దాని బరువు. ఇవన్నీ ఎవరండీ మోస్తోంది? మోస్తున్నానని భావన లేకుండా మోస్తున్నాడు. మనకు మన శరీరం మోస్తున్నామనే భావన లేదు కదా! మోస్తున్నామనే భావన ఉంటే ఇంకొక ముద్ద కూడా లోపలికి వెళ్లదు. ఎందుకంటే అదీ బరువైపోతుంది. నిజానికి మనకు ఈ బరువు పదార్థం వలన అనుకుంటాం తప్ప పదార్థం... పరమార్థం ముందు చాలా తేలిక. పరమార్థం ముందు పదార్థం తేలిక. అందుకనే పరమార్థం యొక్క తత్త్వం తెలిసిన వాళ్లకి పదార్థాన్ని ఇక్కడ నుంచి అక్కడికి, అక్కడి నుంచి ఇక్కడికి తిప్పగలుగుతారు. పరమార్థంలో పదార్థం తేలుతూ ఉందంటే పరమార్థం నిజంగా బరువు కాబట్టే పదార్థం తేలుతోంది. అంటే ఇది మనకు ఒక inversion కదా. చాలా ధ్యానం చేయవలసిన భావం. మామూలుగా మనం చెప్పేది ఏమిటంటే పదార్థం బాగా బరువుగా ఉంటుంది, పరమార్థం తేలికగా ఉంటుంది. సూక్ష్మమైన కొద్దీ తేలికవుతుందని. సూక్ష్మమైన కొద్దీ బలమవుతుంది. అది బరువు లేని బలం. అదీ అందులో తమాషా. ఇంత బరువుని తేలికగా మోసేటటువంటి బలం. ఇప్పుడే శాస్త్రజ్ఞులు కనిపెడుతున్నారు... ఎంతో తేలిగ్గా ఉంటుంది ,అది ఎంత బండరాయినైనా ఇట్లా ఎత్తేయగలదు. అది ఒక scale లాగా తయారుచేసిన దానికి అతికిస్తే, దాన్ని ఎత్తితే అంత బండ రాయి దానితో కలిసి వచ్చేస్తుంది. చూడటానికి అది మామూలు మన scale కన్నా చాలా తక్కువ బరువు ఉంటుంది. దాని నుంచి ఏమి తెలుస్తుందంటే ముందు ముందు సూక్ష్మ లోకంలో బలం ఎక్కువ ఉంటుంది, స్థూల లోకంలో బలం తక్కువ ఉంటుంది. సూక్ష్మ లోకంలో ఉండే బలం దేని బలమయ్యా అంటే

బలమెవ్వడు కరి బ్రోవను, బలమెవ్వడు పాండుసుతులభార్యనుబ్రోవన్,
బలమెవ్వడుసుగ్రీవునకును,బలమెవ్వడునాకునీవేబలమౌకృష్ణా!

కాబట్టి అందరికీ బలమేదో ఆ బలం ఈ బరువునంతా మోస్తూ ఉంటుంది. కాబట్టి నేను బరువు బట్టి భగవంతుడిని తూచుతాననే సత్యభామాదేవి యొక్క కథ చాలా సందేశం. మామూలుగా కృష్ణుడు బరువెక్కిపోయాడు. ఇంకా బరువెక్కి పోయాడుట. కానీ ఏమిటంటే సూక్ష్మ లోకముల యొక్క బలము ముందు స్థూల

లోకముల యొక్క బరువు ఎందుకూ చాలదు. ఎందుకని? ఆకాశం నుంచి వాయువు వచ్చింది. వాయువు నుంచి అగ్ని వచ్చింది. అగ్ని నుంచి నీరు వచ్చింది. నీరు నుంచి భూమి వచ్చింది. ఇందులో ఒకదాని కన్నా ఒకటి ఎక్కువ బలమైనది. ఆకాశం అన్నిటికన్నా బలమైనది. భూమి కన్నా నీరు బలమైనది. నీరు కన్నా అగ్ని బలమైనది. అగ్ని కన్నా వాయువు బలమైనది. వాయువు కన్నా ఆకాశం బలమైనది. ఆకాశం కన్నా మనసు బలమైనది. మనసు కన్నా బుద్ధి బలమైనది. బుద్ధి కన్నా ఆత్మతత్త్వం బలమైనది. ఇట్లా మనకు పైకి వెళ్ళిన కొద్ది బలం పదింతలు, పదింతలు, పదింతలు అట్లా పెరుగుతూ ఉంటుంది. అందుకే మనకు బరువు ఉన్నవి, ఆ తత్త్వంలో తేలిక. అందుకని ఆ తత్త్వంలో జీవించే వాళ్ళకు ఈ పదార్థమైన విశ్వం కూడా చాలా తేలికగా ఉంటుంది. తులసిదళంలో ఆ తత్వాన్ని ఎంచి రుక్మిణి దేవి తూకంలో వేయడం వలన ఇంత సామాను పైకెళ్ళింది, తులసిదళం కిందకు వచ్చింది. ఏమిటి కారణం? భక్తుని కన్నా మించిన బలం లేదు. బరువుగా ఉన్న వాళ్ళంతా బలంగా ఉంటారని చెప్పలేము కదా! బాగా ఒళ్ళు ఉందనుకోండి, బాగా బరువుగా ఉంటారు కానీ నీరసంగా ఉంటారు. బలంగా ఉండేవారు బరువుగా ఉండనక్కర్లేదు. అసలు బలం ఏదైతే ఉందో దానికి బరువే లేదు. అది బరువు లేక ఈ సమస్తమైన బరువులని మోస్తుంది. ఒక గోళం బరువు అంటే ఎంత బరువండీ! ఈ ఇల్లు బరువు అలాంటివి కొన్ని కోటానుకోట్లు. కోటానుకోట్ల చెట్లు, పర్వతాలు. అన్నీ కలిపి ఒక పెద్ద బరువు. దాన్ని మోయాలంటే మరి ఎంత బలం కావాలి? అటువంటి గోళాలెన్నున్నాయి? ఇంకా ఇది చిన్న గోళం. బృహస్పతి గోళం ఈ భూమండలంలో అన్నిటికన్నా పెద్ద గోళం. ఈ గోళాలన్నీ ఎట్లా మోస్తాడంటే, మనం మన శరీరాన్ని మోస్తే ఇది మోస్తున్నట్లు ఎట్లా భావన లేదో, అట్లా మోస్తాడు. కాబట్టి వాడిని 'అతులః' అన్నారు. కారణమేమిటంటే వాడిలోంచి వచ్చినవే ఇవన్నీ. కాబట్టి వాడికన్నా తక్కువ బలమైనవి, ఎక్కువ బరువైనవి. మనకు కూడా జీవితం బరువు ఎక్కిపోతుంది కదా. ఎప్పుడు బరువెక్కుతుంది? మనదనుకుంటే బరువెక్కుతుంది. వాడిదనుకున్నప్పుడు తేలికౌతుంది. ఈ జీవితం వాడు! అంటే మనలో ప్రాణంగా వాడే ఉన్నాడు. మనలో చైతన్యంగా వాడే ఉన్నాడు. మనలో సమస్తమైన శక్తులుగా వాడే ఉన్నాడు. అన్నిటా ఉండి, వాడే నడిపిస్తూ ఉంటే మనం ఒక్కళ్ళం ఉన్నాం అనుకుంటాం. అందుకే వాడికి కుర్చీ ఇచ్చి, వాడి కుర్చీ కింద కూర్చోవడం అనేది మనం చేయాలి. సమస్తము నీదే, పైనుంచి కింద వరకు. ఇన్నాళ్లు తెలియక నీ కుర్చీలో నేను కూర్చున్నాను. ఇప్పుడు నువ్వు కుర్చీలో కూర్చో, నీ పాదాల దగ్గర నేను కూర్చుంటాను. అదీ హనుమంతుడు! అందుకని హనుమంతుడ్ని కొలవాలి. కుర్చీ ఖాళీ చేయాలి ముందు మనం. ఈ శరీరం నీది, ఈ జీవితం నీది. నా పరివారమంతా నీ పరివారం. పరివారం అంటే

మనవారు అనుకున్న వాళ్ళందరూ వస్తారు. అంటే వాళ్లంతా మొత్తం అంతా వాడికి అప్పచెప్పి, వాడి పాదాల దగ్గర మనం కూర్చుంటే... హనుమంతుడు రాముడు పక్కన కూర్చోలేదు. కదా! కూర్చోలేక కాదు, కూర్చుంటే రాముడు ఏమైనా అంటాడనీ కాదు. అయినా రాముడికి హనుమంతుడిని నెత్తిన పెట్టుకుందాం అనిపిస్తుంది. హనుమంతుడు ఒప్పుకోడు గాని. 'ఉండండి సార్' అని అంటాడు. అంటే రాము బంటు! దాన్నే 'దాసత్వం' అంటారు. దాన్నే వైష్ణవ సాంప్రదాయంలో 'దాసోహం దాసోహం' అంటారు. దాసు దాసు, అని పిలుస్తారు ఇది గుర్తుపెట్టుకోవడం కోసం. 'నేను లేను నువ్వు ఉన్నావు'! అదే కదా మన మంత్రం 'సోహం సోహం' అంటే, 'అతడే నేను, అతడే నేను' అని. హృదయంలో వాడి రూపాన్ని ఆవాహన చేసి, ఆసనం వేసి, శుభ్రంగా అక్కడ కూర్చోబెట్టి, సేవలు అన్నీ చేసేసి, ఆయనకు నివేదన చేసుకోవాలి. 'ఇవాళ ఇన్ని పనులు ఉన్నాయి అని అనుకుంటున్నాను, నేను నా పనులుగా అనుకుని చేసుకుంటాను, కానీ నీ పనులుగా అనుకుని, నువ్వు తోడుగా ఉండి చేసిపెట్టు. నేను నిన్ను మర్చిపోతూ ఉంటాను. మరిచిపోకుండా కూడా నువ్వే చూసుకుంటూ ఉండాలి' అని అడగాలి. పూజగది లో నుండి రాగానే మర్చిపోతాము. అట్లాగే మగవాళ్ళు బట్టలు వేసుకొని బయటకు రాగానే మర్చిపోతారు. ఇవాళ గురుపౌర్ణమి కదా. 'నిన్ను నేను మర్చిపోకుండా నువ్వు నాతో ఎప్పుడూ ఉండేట్లుగా చూడు. నాకు మరపు చాలా సహజం. ఆ మరపు కూడా నువ్వే పోగొట్టాలి. అన్నీ నువ్వే' అనుకోవాలి. ఇట్లా ఒక సాధన చేసుకుంటూ ఉంటే అంతా ఆయనే! ఎటు తిరిగి ఏమవుతుందంటే వీడు కూడా అక్కడ కూర్చుంటాడు హృదయంలో, ప్రార్థన చేస్తున్నప్పుడు వాడి రూపాన్ని ఒకదాన్ని చిత్రీకరించుకుని, వాడి పాదాల దగ్గర పాదపూజ చేయవచ్చు. 16 ఉపచారాలు పాదాలకు చేయవచ్చు. శుభ్రంగా పాదాలకు పారాణి పెట్టచ్చు. పువ్వులు వేయవచ్చు. అగరత్తులు వెలిగించవచ్చు. దీపాలు పెట్టవచ్చు. అక్షింతలతో పూజ చేయవచ్చు. ఎలాగైనా చేయవచ్చు. ఎంతసేపైనా చేయవచ్చు. సామాను అక్కరలేదు. అట్లా చేసుకుంటే ఆ తర్వాత ఏమవుతుందంటే చేసేవాడిగా లోపల మనము కూడా కనిపించడం మొదలు పెడతాం. మనం మన గాయత్రీ మంత్రమో, ఇంకో మంత్రమో చేస్తుంటే లోపల వాడు చేస్తున్నాడు అనే భావన. ఎవడు? లోపల ఉన్నవాడు. లోపల ఏం కనిపిస్తుందంటే అంగుష్టమాత్ర పురుషుడు. వాడు లోపల నుండి పూజ చేస్తుంటే, మనం బయట పూజ చేస్తున్నట్లు ఉండాలి. లోపల వాడు చేస్తున్నప్పుడు బయట వీడు స్థూలమైన ప్రక్రియ చేయాలి. ఆవాహయామి అనగానే కళ్ళు మూసుకుని లోపల కూర్చోవాలి. నువ్వు, నీకు ఇష్టమైన దైవరూపం. అక్కడ నీ ఎదురుగా రాంగానే ఆసనం సమర్పయామి. కాళ్లు కడగండి. చేతులు కడగండి. మంచినీళ్లు ఇవ్వండి. కూర్చోబెట్టిన తర్వాత తీర్థం. మళ్లీ

కాళ్లు కడుక్కోవాలి. ఇవన్నీ చేస్తున్నవాడిగా లోపల నిన్ను కూడా నువ్వు దర్శనం చేసుకుంటూ ఉంటే ఏం జరుగుతుందంటే... నువ్వొకడివి తయారవుతావు అక్కడ. ఆయనతోపాటు. నిజానికి నువ్వట్లానే, లోపల చూపుడు వేలంత ఉన్నావంటుంది భాగవతం. బొటన వేలంత అంటుంది ఉపనిషత్తు. కాబట్టి అంతటివాడు లోపల ఉన్నట్లుగా మనం భావన చేసుకొని పూజలు చేసుకుంటూ ఉండాలి. అక్కడ నుంచి మనం బయటకు రాగానే ఈ శరీరం రథం. ఎవరికి రథం? నీకు కాదు వాడికి. చూడండి. ఎప్పుడైనా దేవుని రథం మీద బయటకు తీసుకొచ్చినప్పుడు, దేవుడు కూర్చొని ఉండగా పూజారి పక్కన కూర్చుంటాడు. ఇద్దరూ కలిసి బయటకు వస్తారు. మొత్తం మూడు. రథము, పూజారి, దేవుడు కదా! అట్లా మనము బయటకు వెళ్ళినప్పుడు ఒక్కళ్ళమే వెళ్ళామనుకోకూడదు. వాడితో కలిసి మనం వెళ్ళామని. వాడు మనతో కలిసి వస్తున్నాడు అనుకోకూడదు. ఎవరి వెంట ఎవరు నడుస్తున్నారని? మాస్టరు నాతో వచ్చారనుకూడదు. నేను మాస్టర్ తో వెళ్లాను. ఇద్దరూ కలిసి వెళ్ళినప్పుడు నీతో మాస్టర్ వచ్చారా, మాస్టరుతో నీవు వెళ్లావా అంటే... నేను తీసుకొచ్చాను మాస్టర్ని అని అనరు. తెలిసినవాడైతే ఓహో-- అని అనుకుంటాడు. మాస్టర్ గారితో మనం వెళ్లామని. దైవంతో కలిసి ఈ రథంలో పనిచేయటానికి ప్రపంచంలోకి వెళ్ళాము అని అనుకోవాలి. అలా వెళ్ళామనుకోండి అది యోగం అవుతుంది. లేకపోతే ఇంకొకటేదో అవుతుంది. 'జీవన్మృతుడు' అని అంటాం. 'Living dead' అంటారు. బ్రతికి ఉంటాడు కానీ జీవం ఉన్నట్లుగా ఉండడు. శాల్తీ, శాల్తీ అని అంటాం మనం. శాల్తీ అంటే ఏమిటి? ఇది లేకపోతే అది శాల్తీ అవుతుంది. అన్ని శాల్తీలు వేసాము, అందులో మనం లేము కదా. అందుకని దైవాన్ని గౌరవించుకుని, దైవంతో పాటు నడుస్తూ, మనం పనులు చేస్తున్నప్పుడు వాడిని పక్కన పెట్టుకోవాలి. అందుకని భక్తి మార్గంలో వాడికి ఒక గుర్తు వేస్తారు. ఇంట్లో గుర్తు వేయడం అంటే హృదయంలో కూడా ఉండాలి. దాంతో కలిసి వెలుతూ ఉంటే, దైవము లోపల కూర్చుంటే ఈ శరీరం శరీరం లాగా కాక కవచం అవుతుంది. అప్పుడు శరీరానికి దెబ్బలు తగలడం ఉండదు. ఏదీ కొయ్యలేదు దాన్ని. ఏదీ కుట్టలేదు. మహాత్ములను దోమ కూడా కుట్టదు. ఎందుకంటే కవచం! పాములు, తేళ్లు కుట్టే ప్రశ్న లేదు. ఎందుకంటే కవచం. నారాయణ కవచం, శివకవచం అలా చాలా కవచాలు ఉంటాయి. ఎన్ని కవచాలు చదివినా అందులో ఒక రహస్యం ఉంది కవచానికి. ఏంటంటే లోపల తన యందు తనుగా, భగవంతుడు ఉన్నాడు, అట్లా మనం అందరం ఉన్నాము అక్కడ, అది అద్వైతం అవుతుంది. వాడే ఉన్నాడు, నేను లేనని అద్వైతం.. విశిష్టాద్వైతం... వాడే నిండి ఉన్నాడు కాబట్టి ఏదో ఒక మూల చిన్న రాయిగా మనం కూడా ఉన్నట్లు. అలా వాడిని కూర్చోబెడితే ఇది కవచమవుతుంది. అలా వాడిని

కూర్చో పెట్టకపోతే ఇది మామూలు శరీరం అవుతుంది. వాడిని కూర్చోబెట్టామనుకోండి, అప్పుడు కత్తి తగిలినా దెబ్బ తగలదు. పడ్డా దెబ్బ తగలదు. ఏ కొద్దిగా జారి నేల మీద పడ్డా అన్ని విరిగిపోయే వాళ్ళు కొంతమంది ఉంటే... మేడ మీద నుండి పడ్డా ఏమీ అనారోగ్యం లేకుండా ఉంటారు కొంతమంది. ఏమిటా తేడా అంటే ఒకటి కవచం, ఒకటి శరీరం. అందుకని శరీరాన్ని భగవంతుని యొక్క శరీరంగా భావన చేస్తే... ఎందుకంటే ఇది దివ్యమైన, దైవం ఇచ్చినది కాబట్టి, అలా భావన చేస్తే దీనికి భగవంతుడే రక్షణగా ఉంటాడు. మనది అనుకుంటే అంతంత మాత్రంగా ఉంటుంది. కాబట్టి సాధన చేసుకున్న వాళ్ళు అలా చేసుకున్నారనుకోండి... బరువు ఉండదు ఈ శరీరం, ఏం చెయ్యొ. ఎందుకంటే లోపల వాడు తేలికగా ఉంటాడు. వాడు ఎంత తేలికగా ఉంటే ఈ శరీరం అంత తేలికగా ఉంటుంది. వాడి అస్థిత్వం ఎంత పెంచితే ఇది అంత తేలిక అవుతుంది. ప్రాణం పెరిగిన కొద్దీ శరీరం తేలిక అవుతుంది. చైతన్యం పెరిగిన కొద్దీ తేలికగా అవుతుంది. చైతన్యం తగ్గితే బరువైపోతుంది. అసలు పూర్తిగా పోతే పడిపోతుంది. శవం బరువుగా ఉంటుంది బ్రతికున్న మనిషి కన్నా. ఎందుకంటే అందులోంచి అది వెళ్లిపోవడం వల్ల జీవం! అలాగే నిద్రపోతున్నప్పుడు మనం ఎక్కువ బరువుగా ఉంటాం, మేలుకొని ఉన్నప్పుడు కన్నా. నిద్రపోయిన పిల్లల్ని ఎత్తుకున్నప్పుడు బరువుగా ఉంటారు. అదే మెలకువగా ఉన్నప్పుడు పిల్లల్ని మోస్తే తేలికగా ఉంటారు. ఏంటి తేడా? చైతన్యం మొత్తం అంతా వ్యాపించినప్పుడు పదార్థానికి బరువు తక్కువగా ఉంటుంది. చైతన్యం ఏదో ఒక కేంద్రంలో మాత్రమే ఉండేప్పుడు పదార్థం బరువు ఎక్కువగా ఉంటుంది. 74 కేజీల మనిషికి, 74 కేజీల బండరాయికి తేడా అది. మనిషిలో ఎక్కువ ఉన్నది ఆ చైతన్యం, రాయిలో లేదు. ఈ బరువు, తేలిక! బరువు వేరు, బలం వేరు. బలం ఆత్మపరమైన బలం. దానిని మించినది లేదు. దాని ముందు ఏదీ సరితూగదు. కాబట్టి దాంతో అనుసంధానం చెందటం ఎక్కువ బలం అని చెప్తారు.

368 శరభుఁ

శరభుడు అంటే తలకాయ తీసేసేవాడు అని. ఒకాయనకు (దక్షుడు) తలకాయ చెక్కేసాడట్లా. తాటి ముంజెను చెక్కినట్లు చెక్కేశాడు. ఆయన పేరు వీరభద్రుడు. భగవంతుడి అవతారాల్లో వీరభద్రుడు అవతారం ఒకటి. ఎందుకు చెక్కేసాడు అంటే బొత్తిగా అసలు తానున్నాను అనే తత్త్వాన్ని మరచి, అహంకరించి జీవిస్తున్న వాళ్ళ తలకాయల్ని తీసేయడానికి వస్తూ ఉంటాడు. పెరుగుట తరుగుట కొరకే అన్నట్లు బాగా విపరీతంగా అహంకారంతో పెరిగితే దాన్ని తగ్గించడానికి తను దిగివస్తాడు. అన్ని కథలు అవే కదా. కృష్ణ కథలు కూడా అంతే కదా! అహంకార భావంతో విపరీతంగా పెరిగిన వాళ్ళకి తల తీసేసి... తల తీయడమంటే తల మార్పు, అంటే తలపుల మార్పు అని చెబుతారు. వినాయకుడికి... శివుడు వచ్చేముందు మంచి పాగరుగా ఉండేవాడు. ఏంటి పాగరంటే శక్తి వలన ఏర్పడిన పాగరు. అమ్మవారు సూక్ష్మ శరీరం, స్థూల శరీరం, మూడు శక్తులు... ఇచ్చా జ్ఞాన క్రియా శక్తులు అన్ని వాడిలో పెట్టేసి కాపలా ఉండు, తను వస్తున్నారూ, స్నానం చేస్తా అంటే ఎవరు వస్తే తలుపు తీయాలో ఆయనకే తీయను పొమ్మంటాడు. అంటే ఏమిటి... బుర్ర సరిగా లేదని అర్థం. అంతే కదా గౌరవించవలసిన వాడిని మనం గౌరవించలేదంటే బుర్ర సరిగ్గా లేదని అర్థం. మాస్టర్ గారు వచ్చారనుకోండి... లేచి నిలబడలేదు అనుకోండి, అంటే ఆ బుర్ర మార్చాలి. అంతేగా! పెద్దవాడు వచ్చాడు, మనం నిర్లక్ష్యం చేసాం ఆ బుర్ర మార్పు. వినాయకుడికి కూడా అలాగే మార్పు చేశారు. చూడ్డానికి అందంగా ఉంది తప్ప, అందులో బుద్ధి లేదు కాబట్టి ఆ తల తీసేసి ఏనుగు తల పెట్టారు చూడటానికి బాలేదు కానీ బాగుంది అసలుగా. అదేమిటి అట్లా చేశావంటే... ఇలా ఉంటేనే బాగుందంటాడు. అట్లాగే ఒక ఆయనకి ఉన్న తలకాయ తీసేసి గొర్రె తలకాయ పెట్టారు. దక్షుడికి! అందుకూ వీరభద్రుడి అవతారం. దక్ష ప్రజాపతి చేసే యజ్ఞంలో శివుడికి భాగం ఇవ్వలేదు సరి కదా, శివుని యొక్క ప్రతినిధి వస్తే అవమానం జరిగింది. ఎంత అహంకారం కరుడు కట్టేసింది? ఆ కరుడు కట్టిన అహంకారాన్ని తొలగించాలంటే తను దిగిరావాలి కాబట్టి వీరభద్రుడుగా దిగివచ్చి ఒక్కొక్కరిని పళ్ళూడగొట్టి కొంతమందికి, దక్షుడికి తలకాయ తీసేసి హోమగుండంలో పడేసాడు. యజ్ఞం జరుగుతోంది. యజ్ఞం జరుగుతుంటే వచ్చేసాడు. వచ్చేసి ముందు ఆ తలకాయ తీసేసి అవతల పారేశాడు. అంతా అయిపోయిన తర్వాత 'అయ్యో అయ్యో' అని గోల పెడితే సరే కదా మళ్ళీ పెడదాం, అనుకుంటే తలకాయ లేదక్కడ. బూడిదయిపోయింది. ఏం చేద్దాం అంటే ... అక్కడ గొర్రె తలకాయ ఉంది. గొర్రె తల

వినయంగా ఉంటుంది పొట్టేలు కాదు. ఎందుకు ఇది చెప్పానంటే to cut the throat. To cut the throat and pull the tongue out అని ఉన్నది. ఉన్న నాలుక పీకేయాలి. మనమందరం నాలుక నుంచి ఎంత విషం కక్కుతాం? సాధకుడికి ముందుకెళుతున్న కొద్ది ఏం జరుగుతుందంటే ఉన్న నాలుక పీకేస్తారట తలకాయ కాదు. అది ఎట్లా సాధ్యమంటే... పాత నాలుక పోయి కొత్త నాలుక రావాలి. పదేళ్లు పోయినా అట్లే మాట్లాడుతున్నాడట అంటే మన నాలుకలు ఏమీ మారలేదు. అట్లాగే పాత తలపులు పోయి, కొత్త తలపులు వస్తే తల మారినట్లే. అదే పుర్రె... కానీ లోపల ఆలోచనలు మారినాయి. ఆలోచనలు మారలేదనుకోండి ఏమిటి ఆలోచనలు మారేది మనది అనుకున్నదంతా వాడిదని తెలియటం. మన వాళ్ళు అనుకున్నదంతా వాడి వాళ్ళని తెలియడం. మనవాళ్లు కాదు అనుకున్న వారంతా కూడా వాడి వాళ్లే అని తెలియడం... సర్వమున్ అతడి దివ్యకళమయమటంచు విష్ణు నందు రమించి... అంతా వాడిదే మనం వాడి హృదయంలో ఉన్నాం, అని అనుకోకపోతే ఏమవుతుందంటే మన తలకాయలు తెగిపోతాయి. అహంకరించిన వారికి తలకాయలన్నీ తెగేవే. మనకేమవుతుందంటే ఊళ్లో పెద్దవాళ్ళు అనుకుని చాలా అహంకారులని మనం చూస్తూనే ఉంటాం. మనం ఇదివరకు చరిత్రలో చూసిన వాళ్ళ కన్నా రావణాసురుడు, హిరణ్యకశిపుడు... వీళ్ళ కన్నా చాలా చిన్నవాళ్లు. గజాసురుడు, దక్షుడు. ఇంద్రుడు ఎన్నిసార్లు మరిచిపోతాడో... గురువుగారు వస్తే కుర్చీలో కూర్చుని లేవటం మర్చిపోతాడు. వెంటనే గురువుగారికి అర్థమవుతుంది. ఓహో తల మార్పిడి చేయాలి. అంతకు ముందు రోజు కాళ్లు పట్టుకుని కుర్చీ సంపాదించుకొని ఉంటాడు. మనం కూడా అంతే. మామూలుగా కష్టంలో ఉన్నప్పుడు మాటిమాటికి వచ్చి రకరకాలుగా కనబడుతూ ఉంటారు, దండాలు పెట్టుకోవడానికి. కాస్త కష్టం తగ్గగానే మర్చిపోతాం. మన కన్నా ఇంద్రుడు కొంచెం భూతద్దం సైజులో వస్తాడు. అంతవరకు నానా అగచాట్లు పడుతున్న వాడిని మళ్లీ సింహాసనం ఎక్కించాడు బృహస్పతి, తన యొక్క బుద్ధిబలం చేత. కూర్చోబెట్టి ఎవరెవరు ఆసనాల్లో వాళ్ళు కూర్చున్నారు. చాలా రోజుల తర్వాత కూర్చున్నారేమో మర్చిపోయారు. సభ కొస్తే లేవలేదు. చూశాడట ఒకసారట్లా. ఓహో పాట్ట బిర్ర బిగిసింది అనుకున్నాడట అలా రాస్తారు. వెళ్ళిపోయాడట. ఈయన వెళ్లిపోయిన మరుక్షణం ఇదేంటి... ఇట్లా చేశా...అనుకున్నాడంట అనుకుని వాడి వెంట పరిగెత్తాడు. వెతికాడట మొత్తం అంతా. అతడిదే కదా ఈ సృష్టి అంతా. చాలా గొప్పవాడు. వేదంలో... ఇంద్రుడు మొత్తం సృష్టికి కథానాయకుడు, శక్రుడంటాం. మర్చిపోతే---మరచిపోకపోతే అతడే అంతాను. విష్ణువుకి అన్నగారు. ఉపేంద్రుడు అంటారు. ఎవరిని? విష్ణువుని. అంటే Vice-Chairman అనీ Vice-President

అని. అంతటివాడికీ కనబడలేదు. కనబడకపోతే అప్పుడు బాధపడతాడు. బాధపడి లాభం లేదని బ్రహ్మ దగ్గరకి వెళ్తాడు. ఒకసారి గుర్తుపెట్టుకోండి గురుతత్త్వాన్ని మనం గనక అవమానిస్తే ఇక మనం అంతే! ఎవరి నుంచి సహాయం పొందామో వాళ్ళని మరిచిపోతే అంతే జరుగుతుంది. సరే ఈయనకు అలా జరిగింది. ఏడ్చాడట, గోల పెట్టాడు. వెళ్ళాడుట బ్రహ్మదేవుడి దగ్గరకు. అతను అన్నాడట తప్పు కదా అంటే... తప్పే, కనబడలేదు అంటాడు. మరేం చేయమంటారు అంటే, విశ్వరూపుడనే ఒక గురువు ఉన్నాడు, అతడి దగ్గరకు వెళ్ళమంటాడు. విశ్వరూపుడంటే విశ్వం యొక్క రూపాన్ని గురువుగా భావన చేసుకుని జీవించే వ్యక్తి. గురువుగా కనబడడు రోజు వచ్చి దండం పెట్టుకునేట్లుగా. అన్ని రూపాల్లో ఉండే తత్వాన్ని చూడాల్సి వస్తుంది గురువుగా. ఆయన దగ్గరికి వెళ్లి గోల పెడితే, సరే ఆయన మళ్ళీ మనవాడిని ఉద్ధరించి, నారాయణ కవచం ఇచ్చాడు. నారాయణ కవచం ఇవ్వడం అంటే ఇందాక చెప్పానే, నువ్వు కూర్చోఅక్కడ. ఆయనని కూర్చోబెట్టు. అప్పుడు సమస్తము నీదిగా కనిపిస్తుంది. వాడిదిగా నువ్వు భావన చేయి, అని చెప్తాడు. అనిపించడం మనదిగానే కనిపిస్తుంది. ఇల్లు ఎవరిదండీ అంటే... కుమార్ గారిది అంటారు బయట నుంచి. కుమార్ గారు మాత్రమే అనుకోకూడదు. మిగతావాళ్లు అనుకోవాలి. బయట వాళ్లందరూ ఇది మీది కాదు కదండీ, దేవుడిది కదండి అనకూడదు. ఇది దేవుడిది కాదు నాదని నేనకోకూడదు. అది సృష్టి రహస్యం! బ్రహ్మకు ఇదే చెప్తాడు నారాయణుడు. బయట నువ్వు సృష్టి చేస్తున్నప్పుడు...అంతా ఈ సృష్టి అంతా నువ్వే చేస్తున్నావని అనుకుంటారు, వాళ్ళనట్లాగే అనుకోనీ. నువ్వు మాత్రం అనుకోకు. నువ్వు అనుకుంటే బోల్తా పడతావు. వాళ్ళకలా కాదు. ఇదంతా ఆయనదే అని నువ్వు చెప్పావంటే... నిన్ను వాళ్ళు బోల్తా కొట్టిస్తారు. చూడండి ఎలా ఉంటుందో ఈ psychological loopholes ఉంటాయి. అందులో పడ్డామనుకోండి అంతే! ఇంద్రుడు విశ్వరూపుడు అనే గురువు దగ్గరికి వస్తే, ఆయన 'నువ్వు కాదు నీలాగా, నీ లోపల ఆయనే ఉన్నాడు, అలా నువ్వు భావన చేసినంత సేపు నీ శరీరం పవిత్రంగా ఉంటుంది. అలా భావన చేయకపోతే నీకు దుర్బుద్ధులు పుడతాయి' అని చెప్పి చేయిస్తాడు. కథ మళ్ళీ బాగుంటుంది, అంతా సవ్యంగా జరుగుతుంది. రోజు ఈ గురువుగారిని ధ్యానం చేసుకుంటూ ఉంటాడు. ఒకరోజు ఈ గురువుగారిని చూస్తేట ఈయనకు మూడు తలలు కనిపిస్తాయి. మన గురువుగారికేంటి మూడు తలలున్నాయి? అనుకుంటాడు. ఒక తల నుంచి దేవతలందరూ వస్తున్నారు బయటకు. దేవతలందరూ ఆయన ఆధారంగా పనిచేస్తున్నారు. ఇంకొక తలలోంచి పితృదేవతలందరూ వస్తున్నారట. వాళ్ళందరూ ఈ సృష్టిలో శరీరాల నిర్మాణం చేస్తున్నారట అన్నిటికి. ఇంకొక తల నుంచి మానవులు పుట్టుకొస్తున్నారు. కార్యక్రమాలన్నీ ఆ తల ఆధారంగా

జరుగుతున్నాయి. వెలుగు కేంద్రాలుగా ఏర్పడే వాళ్ళు దేవతలు. ఆ వెలుగు కేంద్రాలకు దేహం ఆధారంగా తయారు చేసే వాళ్ళు పితృదేవతలు. మనలో కూడా మన శరీరాన్ని తయారు చేసే వాళ్ళు పితృదేవతలు. శరీరంలో ప్రజ్ఞలుగా పని చేసే వాళ్ళు దేవతలు. దేవతలకు నమస్కారం పెడితే చాలుట. వాళ్ళకేం అవసరం లేదట. పితృదేవతలకు ఆహారం పెట్టాలిట. 'నమో దేవేభ్యః స్వధా పితృభ్యో స్వస్తిర్మానుషేభ్యః' అని మనం చదువుకుంటాం హోమం మంత్రాలు మామూలుగా. మనుషులకు హాయిగా ఉండాలి అని ఉంటుందిట. ఇలా రోజు ఉండొచ్చు కదా, కొత్తవి కావాలి. పితృదేవతలకు ఆహారం. అందుకని పితృదేవతలు సంతోషించాలి అంటే పదిమందికి భోజనం పెట్టాలి. మన శరీరం బాగుంటుంది, పక్క వాళ్ళ శరీరం బాగుంటుంది. పితృదేవతల అనుగ్రహం ఉంటే శరీరం బాగుంటుంది. దేవుళ్ళకి ఏం చేయాలి అంటే వారికి నమస్కారం పెడితే చాలుట. ఇంకేం అక్కర్లేదు. ఒక నమస్కారం పెడితే సంతోషించేసి, వాళ్ళు మనల్ని ఆశీర్వదిస్తారు. పితృదేవతలకు భోజనం పెడితే ఆనందిస్తారు. ఎంతమందికి భోజనాలు పెడితే అంతా మంచిదని మనవాళ్లు అందుకు పెడతారు. అవకాశం ఉన్నప్పుడల్లా ఏదో ఒక రకంగా భోజనాలు పెడతాం. భోజనాలకు పిలిస్తేనే ఒళ్ళు అలసిపోతుందని అనుకునే సమయం కదా ఇప్పుడు మనం. అలా అనుకుంటే ఏమవుతుంది అంటే ఒళ్ళు అలిసిపోవడం కాదు కుళ్ళిపోతుంది. అట్లా కుళ్ళిపోతున్నాం. అది వేరే సంగతి. మూడో తల నుంచి ఏం జరుగుతోంది? మనుషులు వస్తున్నారు. మనుషులు వస్తుంటే... మనుషుల భావాల్లోంచి మిగతా జంతువులన్నీ వస్తున్నాయి. మనలో ద్వేష భావం వలన పాములు పుడుతున్నాయని మన సృష్టి నిర్మాణ కథ. మనలో కుట్టే స్వభావం వలన పురుగులు పుడుతున్నాయని. దోమలు, తేళ్లు. బాగా కుడుతూంటే తేళ్ళు. మంచి విషపూరితమైన భావం మనలోంచి వచ్చినప్పుడు తేళ్లు పుడతాయి. కొద్దికొద్దిగా కుడుతూనే ఉంటాం కదా. అందుకనే దోమలు ఎక్కువ. అవి వచ్చి మనల్ని కుడతాయి. మనలో నుండి పుట్టిన భావాల్లోంచి పుట్టినవి మిగతా జంతుజాలం అంతానూ. గోళం, ఈ వృక్ష జాతి ఇవన్నీ ఒక platform గా/వేదికగా వస్తే, అందులో నిర్మాణమైన జీవుడు ఈ విశ్వరూపుడి నుంచి ఇట్లా మూడు రకాలుగా వస్తూ ఉంటే, ఆయనకు ఏం కనబడిందంటే ఈ మనుషులతో పాటు ఈ మూడో తల లోంచి చెడ్డ మనుషులు, చెడ్డ భావాలు కలిగిన వారు, అసురభావాలు కలిగిన వారు కూడా పుట్టుకొస్తున్నారుట. వాళ్లకు కూడా ఈయన support ఇస్తున్నారట. అందరికీ ఆయన support ఇస్తారు. అందరికీ ఆయనే ఆధారం కదా! చెడ్డవాళ్లలో మాత్రం వాడు లేడా? అట్లా ఉండేసరికి ఇంద్రుడికి... అమ్మ... ఈయన ఇలా చేసేస్తున్నాడు. మనకు కేవలం అంతా మంచే జరగట్లేదు ఈ గురువుగారి ద్వారాను. మూడు తలల్లో

ఆ తలకాయ నుంచి వాళ్ళెవరో పుట్టుకొస్తే వాళ్ళకు కూడా ఈయన ఆధారంగా ఉన్నాడు. వాళ్ళకీ ఈయన తన సహకారాన్ని ఇస్తున్నాడని చెప్పి, రహస్యంగా మూడు తలకాయలు ఎగరగొట్టేస్తాడు. ఎగరగొట్టేస్తే అప్పుడు బ్రహ్మహత్య, బ్రహ్మ హత్య అని చుట్టూ ఒకడు తిరుగుతూ ఉంటాడు. మళ్లీ గోల. ఈ లోపల విశ్వరూపుడిని అలా సంహరించేసరికి అందులో నుండి ఒక పెద్ద భూతం పుడుతుంది. వాడే వృత్రాసురుడు. వాడు నారాయణ కవచం పరిపూర్ణంగా తెలిసినవాడు. అందుకని ఇంద్రుడు వాడితో యుద్ధం చేస్తుంటే ఎంతసేపటికి వృత్రాసురుడు చావడు. వజ్రాయుధం వేస్తే ఈక ముక్కలాగా ఉంటుంది. అప్పుడు వృత్రాసురుడే చెప్తాడు,'నీకు నారాయణ కవచం అంతకుముందు చెప్పారు కదా. నువ్వు అది మరిచిపోయావు కదా. నువ్వున్నావనుకోబోక. వాడున్నాడనుకో నీతో' అని చెప్పి వాడికప్పుడు మళ్ళీ ఉపదేశం చేసి, వాడి చేత చంపించుకుని, 'నేను చచ్చినా ఒకటే, బ్రతికినా ఒకటే, ఎప్పుడూ చావను కాబట్టి' అని అంటాడు. వాడు అసురుడు ఏమిటి? వీడు సురుడేమిటి? వృత్రాసురుడు అంటాం. అంటే ఇందులో భావం ఏమిటయ్యా అంటే మన తల మార్చుకోవాలి. తల మార్చుకుని, 'ఉన్నది అతడే, అది మనలాగా ఉన్నాడు కాబట్టి మనం ఉన్నాం అనుకుంటున్నాం. అతనే ఉన్నాడు, ఈ సమస్తము అతడిదే' అనే వినయంతో ఉండే వాడికి సృష్టి వైభవమంతా కూడా తనంతట తానే అనుభవంలోకి వస్తుంది. మనది అనుకోగానే అది మూసుకుపోతుంది. వైభవం ఉండదు. బరువెక్కిపోతూ ఉంటుంది. ఏదది? ఏది కొనుక్కున్నా బరువైపోతుంది. ఇంట్లో సామానులన్ని బరువెక్కిపోయి మనము అటూ ఇటూ కదలడానికి కూడా వీల్లేకుండా ఇరికించేసుకుంటాం. అట్లాగే మిగతా భావాలు అంటే అట్లా తయారైపోతాయి అవన్నీ సంహరించడానికి వచ్చేవాడు శరభుడు. అవన్నీ మనలో సంహరిస్తే పాత తలకాయ పోయి, కొత్త తలకాయ వస్తుంది. భావమయమే కదా అంతా! ఆ భావాన్ని తీసి ఈ భావాన్ని మనకు ఏర్పాటు చేస్తాడంటే మనకు మంచి చేస్తున్నట్లా, చెడు చేస్తున్నట్లా? దక్షుడికి ఆ తలకాయ తీసేసి గొర్రె తలకాయ పెట్టడం వలన అప్పటినుండి ఇప్పటివరకు వినయంగా పనిచేసుకుంటున్నాడు. వాడే ఇదంతా చేసుకుంటున్నాడనే భావనతో. అలా మరిచిపోయినప్పుడల్లా భక్తుడు కూడా దెబ్బ తిన్నారు, అహంకారులే కాదు. అంతా నువ్వు చెప్పినట్లు చేస్తానని ఒప్పందం చేసుకుని యుద్ధం మొదలుపెట్టిన తర్వాత మళ్ళా స్వంత కొట్టుడు కొడుతుంటాడు అర్జునుడు. స్వంత కొట్టుడు కొట్టినప్పుడల్లా ఇబ్బందులే మనకి. అందుకనే పాద్దున్నే ప్రార్థన లేవంగానే వాడ్ని గుర్తుచేసుకోవాలి. కానీముందు అసలు మనం ఒక్కళ్ళమే లేస్తాం. మనం ఒక్కళ్ళమే లేస్తే గాడిద లేచినట్లే! గాడిద అంటే గాడిద ఒప్పుకోకపోవచ్చు, ఈ మాటన్నందుకు. 'నన్నెందుకంటావు మాటిమాటికీ మీ మనుషులందరూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తూ. మీకు

దేవుడి ప్రార్థనలవన్నీ అవసరం. మాకు ఆ బాధలు లేవు. మాటిమాటికి మమ్మల్ని అంటావేమిటి' అంటుంది గాడిద, కదా! అందుకని లేచినప్పుడు మనం వాడితో సహా లేవాలి. లేకపోతే లేచిన తర్వాత ప్రార్థనల ద్వారా వాడిని నింపుకోవాలి. ఇదొక అభ్యాసం. గొడవ ఏమిటంటే మనకు గుర్తుండదు. గుర్తు ఉండకపోవడం వలన మళ్లీ మనమే ఉంటాము. గుర్తుంటే వాడుంటాడు. అట్లా గుర్తుతెచ్చుకుంటూ ఉంటే మన భావాల్లో మార్పు చాలా వస్తుంది. ఇంకా మారాలి. ఇంకా పూర్తిగా ఒక పదేళ్ళ క్రితం భావాలకి, ఇప్పుడు భావాలకి చూసుకుంటే మనకే ఆశ్చర్యం. 'అట్లా ఉన్నది మనమేనా?' అనిపిస్తుంది. చెప్తారు. వాడూ రెండవసారి పుట్టినట్లు. ద్విజత్వం అంటే అది! Twice born. పుట్టంగానే ఎవరూ బ్రాహ్మణులు కారు. ఈ విధంగా తనను తాను మార్చుకున్నవాడు బ్రాహ్మణుడు. బ్రహ్మయందు చరించెడివాడు. బ్రహ్మ వీడి ఆధారంగా చరిస్తూ ఉంటాడు ఆ రూపంలో. అలా లేని వాళ్ళు బ్రాహ్మణాకృతులు కాని బ్రాహ్మణులు కారు, అంటారు. ఎందుకంటే ఆకృతి అంటే ఏమిటి? మంచి పంచ కడతారు, విభూతి పట్టీలు పెడతారు, యాంత్రికంగా వల్లిస్తూ ఉంటారు, లోపల మాత్రం విద్వేషం కోరుతుంది. అందుకని అట్లా ఉన్నప్పుడల్లా ఈ శరభుడొస్తాడు. ఈ ఇబ్బందులు కష్టాలు వచ్చినాయి అంటే మనం స్వంతంగా ఏదో చేయడము వల్ల వస్తాయి. వాడి పరంగా చేశామనుకోండి మొత్తం ప్రచోదనమైపోతుంది. షిరిడి సాయిబాబా చెప్పిన కొన్ని ముఖ్యమైన సూచనలు, ఆదేశాలు ఏంటయ్యా అంటే 'మీ ఇంట్లోకేం తెచ్చుకున్నా ముందు నా దగ్గర ఉంచి నువ్వు వాడుకో' అని. 'అప్పుడు ఒకటి గుర్తుపెట్టుకో. ఇది నాది. నువ్వు వాడుకుంటున్నావు. ఇంట్లోకి కోడలు వచ్చినా, అల్లుడు వచ్చినా కూడా అట్లానే ఉంటుంది. పిల్లాడు వచ్చినా, పిల్ల వచ్చినా, పెళ్ళాం వచ్చినా, ఏం వచ్చినా సరే. నువ్వు వచ్చినా సరే. నువ్వు ఇంట్లోకి వచ్చినా ముందు నా దగ్గరకు రా. ఆ తర్వాత వెళ్ళు. అట్లా పెట్టుకోమంటారు'. అలా అయినప్పుడు ఏమవుతుందంటే అంతా ఆయనది, మనం వాడుకుంటున్నాం అని ఎరిగి ఉంటాం. అప్పుడు తలలు త్వరితగతిని మారుతాయి. శరభుడిని పిలుచుకోవాలి. చాలా పారపాట్లు చేసాం కొన్ని కొట్టి పారెయ్యాలని. శరవణభవ లో కూడా ఈ మూడు శబ్దాలు ఉన్నాయి. శ,ర,భ శబ్దం. ఆయన కూడా ఆ పని చేస్తాడు. అంకుశం పెట్టి కుమార స్వామిగా పాడుస్తూ ఉంటాడు. ఎప్పటికప్పుడు పాడిపించుకుంటే సుఖం. మొత్తం అంతా పేరుకున్న తర్వాత అప్పుడు తీయాలంటే బాగా ఇబ్బంది.

369. భీమః

భీమః అంటే భయంకరుడు. భీముడు అంటే పాండవులలో భీముడే మనకు తెలుసు. పాండవులలో భీముడికి ఆ పేరు పెట్టారు ఎందుకంటే చాలా భయంకరంగా, భయం కురిపించేట్లుగా ఉంటాడుట. మనకు భయం కురిపించే సన్నివేశాలు వచ్చాయి అనుకో... వస్తాయి కదా, అప్పుడు భగవంతుడు భీముడిగా వచ్చాడని గుర్తుపెట్టుకోండి. భయం కలిగినప్పుడల్లా భీమ శబ్దాన్ని గుర్తు పెట్టుకుంటే... ఆ భీమ తత్వమే ఈ సన్నివేశంలో వచ్చిందనే గుర్తుపెట్టుకుని, దండం పెట్టుకుంటేట భయం పోతుంది. అంటే అప్పుడు విష్ణుమూర్తిని భీముడిగా ఆరాధన చేస్తాం. ఆపదలు రకరకాలుగా వస్తాయి మనకు. వచ్చినప్పుడల్లా భయం వస్తుంది. బొత్తిగా ధైర్యం లేని వాళ్ళం కదా భారతీయులం అంటే. అందుకని మొదటి నుంచి భగవంతుడు ఆధారంగా బ్రతుకుతున్న వాళ్ళం. మధ్యలో కొంచెం స్వతంత్ర బుద్ధి వచ్చింది. కానీ భయం పోదు. భయం ఎందుకంటే అలవాటు లేని విషయాలు, అలవాటు లేని పనులు చేసినప్పుడల్లా భయం వస్తుంది. అందుకని భారతీయులకు భయం ఎక్కువ. భయం ఎందుకు వచ్చింది అంటే మనల్ని సరైన పద్ధతులలో ఉంచాలని. అందుకనే సన్నివేశం ఏది భయం కలిగిస్తుందో, దానిని భగవంతుడిగా ధ్యానం చేసుకుంటే భీముడుగా ఏ విధంగా అందరినీ చితక్కొట్టేసి తాను నిలుస్తాడో అట్లా భగవంతుడు భయం అనే సన్నివేశం నుంచి మనల్ని రక్షిస్తాడు. భయంకరుడు అంటే సన్నివేశం అంత భయంకరంగా తీసుకొస్తాడు. అందరికీ తీసుకురాడు. అవసరం ఉన్న వాళ్ళకి. తీసుకొచ్చినప్పుడు భగవంతుడిగా ప్రార్థన చేస్తే, ఆ సన్నివేశంలోంచి మనం ఉద్ధరింపబడతాం. మళ్లీ భయం కొలిపే సన్నివేశంలోకి ప్రవేశించే ప్రవర్తన లేకుండా కూడా చేస్తాడుట.

370 సమయజ్ఞుఁ

సమతూకంగా ఆయన యజ్ఞం చేయబడ్డాడట. తస్మాద్యజ్ఞాత్సర్వహుతఃఁ. సర్వహుతఃఁ అంటే మొత్తం అంతా కూడా తగలబెడుతున్నారట హోమంలో. మొత్తం అంటే ఆయన. ఆ మొత్తాన్ని హోమంలో వేసి హోమం చేస్తూ ఉంటే అందులోంచి పుట్టుకొచ్చినాయట. ఏంటి? ఈ గోళాలు, గిరులు, అరణ్యాలు, మనుషులు, ఆవులు, గుర్రాలు, ఊళ్ళు ఇట్లా అన్ని పుట్టుకొస్తున్నాయట. ఆయన్ని హోమం చేస్తే ఇవన్నీ పుట్టుకొచ్చినాయట. అందుకనే మొత్తం ఈ సృష్టిని 'పురుషమేధం' అంటారు. మనం ఏదైనా ఒక ముడి సరుకు ఉంటే కదా పదార్థం తయారవుతుంది. గిన్నెలో ఏమైనా వేస్తే కదా వంట అవుతుంది. అట్లా మొత్తం సృష్టికి ముడి సరుకు ఆయన. ఆయన్ను పెట్టి ఇవన్నీ తయారు చేశారట. ఆయన మూలంగా ఇదంతా జరుగుతోందట. ఆయన లేకపోతే సృష్టి ఆగిపోతుంది. జంతికల గొట్టంలో పిండి వేయకుండా ఊరికే నొక్కాము అనుకోండి... ఏమొస్తుంది ఇవతలకి? గాలొస్తుంది. పిండి ఉంటే మనం పెట్టిన ఏ బిళ్ళలు పెడితే ఆ విధంగా వస్తుంది జంతిక, మనకు ఎట్లా కావాలంటే అట్లా వస్తుంది. ఎంతసేపు వస్తుంది? పిండి ఉన్నంతసేపు వస్తుంది. పిండి లేకపోతే? అట్లా ఈ సృష్టికి మొత్తం పిండి అంటే, మూలం ఆయన! ఆయన్ని దేవతలందరూ పట్టుకువచ్చి, పశువు వలె బంధించి హోమం చేశారట. మనం కూడా అంతే! మన చుట్టూ ఉండే సృష్టి మనం చేసుకున్నది, దాంట్లో ఉండే శక్తి అంతా కూడా మనం ఇస్తేనే అది వచ్చింది. మన నుంచి ఉద్యోగం వచ్చిందంటే ఎంత శ్రమపడి చదువుకుని నానా బాధపడి, శక్తి ధారపోస్తే చదువయ్యింది. అందువల్ల కదా ఉద్యోగం వచ్చింది. ఎక్కడ నుండి వచ్చింది ఉద్యోగం? మనలోంచే. మన శక్తినే తీసుకుని వస్తోంది. అట్లాగే తోడుండడానికి ఒక ఆవిడ వస్తుంది. ఆవిడకి తన శక్తిని ఇవ్వడం వలన పిల్లలు వస్తారు. పిల్లలెవరు? తన శక్తిని ధారపోస్తేనే పుట్టుకొచ్చారు. తల్లి, తండ్రి ఇద్దరి శక్తి యొక్క కారణంగా వీళ్ళు బయటకు వస్తారు. కదా. అంతటితో అయ్యిందా? వాళ్ళను పెంచడానికి ఎంత శక్తి కావాలి? భావంలో. ఉత్త భావం కాదు కదా. పిల్లల్ని పెంచటం అనే భావనలో ఎన్ని పనులు చేస్తే పిల్లలు పెరిగారు? ఎక్కడ నుంచి వచ్చింది? నీ నుంచి వచ్చినదంతా. ఈ పిల్లలందరినీ పెంచేసరికి ఇట్లా నిస్సత్తువ అయిపోతుంటారు కదా మనుషులు. ఏమయ్యింది? వీడిదే ప్రాణం పోతూ ఉంటుంది ఎక్కడో స్థలాలిస్తున్నారు, చవకగా నేల వస్తోంది, కొనుక్కున్నామనుకోండి, రోజూ పోయి రావాలంటే ఎవరి శక్తి పోయిందక్కడికి? మన శక్తినది పుచ్చుకుంటోంది. అక్కడ ఇంకేమైనా మొక్కలేస్తే బాగుంటుందనుకుంటాం. మొక్కలేస్తే మన శక్తే పుచ్చుకుంటుంది. మనమే వేయక్కర్లేదు. ఎవరికైనా డబ్బులు ఇచ్చి వేయించామంటే,

ఆ డబ్బు సంపాదించిన శక్తి మరి నీలోంచే కదా వెళ్ళేది. అక్కడ ఇల్లు కట్టావు. నీలోంచే శక్తి. ఈ ఇల్లంతా కూడా నీ శక్తే ఇల్లుగా ఉంది. పొలం కొన్నావు, ఇల్లు కొన్నావు, డబ్బులు దాచావు ఎక్కడినుంచి వచ్చినాయివన్నీ? నిన్ను హోమం చేస్తే వచ్చినాయి. ఒకపక్క నువ్వు హోమం లో ఆహుతి అయిపోతూ ఉంటావు. చాకిరి ఎప్పుడో ఒకప్పుడు అయిపోతుంది, సుఖంగా ఉండొచ్చనుకుంటావు. అలా అవ్వదు. ఎందుకంటే continuous process. అంతం లేదు దానికి. ఉన్నంతకాలం ఎవరో ఒకళ్ళు పుచ్చుకుంటూనే ఉంటారు నీలోంచి శక్తి. 50-60 వచ్చేసరికి ఇంకా నా ప్రాణాలు తీయకండి రా బాబూ, చేయగలిగినంత చేశాను ఇంక వదిలేయండి, అంటాము కదా. వాడు అట్లా అనడు. ఎందుకంటే వాడి దగ్గర అనంతం. వాడి పేరు 'అనంత్' కదా. ఇదిగో పట్టుకుపో నీకు ఎంత కావాలంటే అంత. వీళ్ల ఓపిగ్గా చేసి చేసి చేసి అంతా చేసేసరికి పావలా తీశారుట ఆయనలోంచి అంతే. ఏమిరా అయ్యిందా అంటే ఇంక చాలు, మాకు ఓపిక లేదు అని వీళ్ళు అన్నారుట. అంతున్నాడు. మరి ఆయన ఆధారంగా ఈ సృష్టి అంతా పట్టుకొచ్చారు. మనం ఆధారంగా మన సృష్టి అంతా ఉన్నది. అందుకని సుఖపడాలనుకునేవాడు పెంచుకోడు. పెరిగిన కొద్దీ సుఖం లేదు. ఏదో పాపం తెలియక పెంచుకుంటాడు. నిజమైన భక్తుడు బొత్తిగా ఏమీ పెంచుకోడు. కుచేలుడిలా ఉంటాడు. ఆయనకు తెలుసు ఏం పెరిగినా అది మనకు గుచ్చుకుంటూ ఉంటుందని. పూల మొక్క వంటిది ఇంటికి పట్టుకొస్తే రోజూ దానికి నీళ్లు పోయాలి కదా. కాబట్టి 'మనకై ఏం తెచ్చుకోవద్దు, వాడు పంపించిన దానికి సేవ చేద్దాం' అనుకుంటాడు భక్తుడు. అంటే మనమేం తెచ్చుకోవద్దనుకున్నా మన దగ్గరకు వస్తూ ఉంటాయి. అవి దేవుడు పంపించిన జీవాలుగానో, వేటిగానో తీసుకుని వాటికి సేవ చేసుకోమన్నాడు. అక్కడ ఎగ్గొడితే మళ్ళీ కష్టం. ఇబ్బందులు వస్తాయి. యజ్ఞం ఎలా చేశాడంటే... సమయజ్ఞం అంటే అర్థం ఏమిటంటే సమతూకంగా ఆయన యజ్ఞం చేయబడ్డాడట. ఆయన ఆధారంగా యజ్ఞం జరిగిందట. ఈ దేవతలు ఎక్కడ నుండి వచ్చారు? ఆయనలోంచే వచ్చారు. ఆయన లోంచి దేవతలు వచ్చి, ఆయనను యజ్ఞం చేశారు. మనలోంచి పిల్లలు వచ్చి మనల్ని యజ్ఞం చేయరూ? తినేయరా కొంతమంది? అట్లా తింటూనే ఉంటారు కదా ప్రాణాలని. మనకు సమ్మగానే ఉంటుంది ఎందుకంటే మన పిల్లలని. ఇంకొకళ్ళు తింటే ఒప్పుకోం. అట్లా వాడికి సృష్టి అంతా మన పిల్లలే కాబట్టి ఆ తినండి మీ ఇష్టం అన్నాడు. మనం కూడా ఉసూరు మనకుండా ఉండాలంటే వాడితో అనుసంధానం చెంది ఉంటే మనది కూడా సమయజ్ఞం అవుతుంది. వాడితో అనుసంధానం చేసి నువ్వే ఇంత ఆహుతి అయిపోతున్నావు కదా సృష్టిలో, నాదెంతా? అసలు బొత్తిగా పోలిక లేదు. నువ్వు ఆహుతి అవుతున్నప్పుడు నీ మార్గంలో నడిచేవాడు, నేను ఆహుతి అవ్వటంలో పెద్ద

విషయమేమిటి అని అంగీకరిస్తాడట ఆహుతి అంతా కూడా. ఎంత ఆహుతి చేస్తున్నా తనని అంగీకరిస్తాడట. వాళ్ళూ భక్తులు! వాళ్ళూ పరమ గురువులు! పగలుండడు, రాత్రి ఉండడు, పట్టు ఉండడు. ఎవరు ఏది అడిగితే కాదనకుండా చేస్తూనే ఉంటారు. ఎందుకంటే సమయజ్ఞంలో భాగం అవ్వటానికి. అది సత్వం ఉన్నచోట వస్తుంది. రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు రావటానికి అవకాశం లేదు. అందుకని భగవంతుడు సమయజ్ఞుడు! మనం ఎంత తీస్తే అంత రావడం లేదూ? భూమి నుంచి లాగుతూ ఉంటాం, గింజలోంచి లాగుతూ ఉంటాం, వృక్షాల్లో నుంచి లాగుతూ ఉంటాం, మొక్కలోంచి లాగుతూ ఉంటాం. ఇందులోంచి వస్తున్నది ఏమిటి? వాడిని యజ్ఞం చేయటం వలన రూపాలు వస్తే, ఆ రూపాల్లోంచి మళ్లీ వాడే వస్తుంటాడు. మనకు ఆనందాన్ని ఇవ్వడానికి. వాహికలు చేసుకొని అట్లా వస్తూనే ఉంటాడు. గడ్డి గేదకు పెడితే ఏమైంది? గడ్డిలోంచి గేదెలోకి వస్తాడు, గేదెలోంచి పాలల్లోకి వస్తాడు, పాలలోంచి మనలోకి వస్తాడు, మనలోంచి పదిమందికి పనిచేసేటట్లుగా, ఇష్టం ఉన్నా లేకపోయినా చేయించుకుంటాడు. ఇట్లా ఒకళ్ళ ద్వారా ఒకళ్ళకి, ఒకళ్ళ ద్వారా ఒకళ్ళకి చేస్తూనే ఉంటాడు. ఈ మొత్తం దానిలో నుంచి శక్తిగా అన్నింటిలోంచి ప్రవాహం జరుగుతున్నది ఆయనే! యజ్ఞం చాలా సాధన చేయవలసిన ఒక భావం. ఇతరుల శ్రేయస్సు కొరకు పనిచేసేది యజ్ఞం. తన శ్రేయస్సు కోసమైతే అది ఇంకోటేదో అవుతుంది. అందుకని యజ్ఞం చేసి, యజ్ఞ ఫలం పుచ్చుకున్న వాడు ఎప్పుడూ నశించడు అంటారు. అందరికీ పెట్టి తను తింటే అది యజ్ఞఫలంట. ముందు తను తినేస్తే దొంగతనంట అది. కృష్ణుడే చెప్పాడు, తనకు తాను తినేసేవాడు దొంగ అని. నా రూపంలో ఉండే వారికి (నాకు) సమర్పించి మిగిలినది (మిగిలితే) తినాలి. ద్రౌపదీదేవి రోజూ అందరికీ పెట్టి, చివరికి మొగుడికి కూడా పెట్టిన తర్వాత తను తినేదిట. మన సంప్రదాయంలో కూడా ఇంటికి వచ్చిన వాళ్లందరికీ పెట్టిన తర్వాత చివరికి ఆ గృహస్థు తింటాడట. అప్పుడు అది యజ్ఞం అవుతుంది. ఏదైనా ముందు మన సంగతి ఆలోచించుకునే వాడు స్వార్థపరుడు. వాడు యజ్ఞానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వాడు. కాబట్టి నశిస్తాడు. ఇతరుల సంగతి ముందు ఆలోచించే వాడు యజ్ఞ భావనలో జీవిస్తూ ఉంటాడు. యజము చేస్తే జయము కలుగుతుంది అని మనకు భారతం చెబుతుంది. నిన్ను నువ్వు సమర్పణ చేసుకో సృష్టి కార్యక్రమానికి, సృష్టి ప్రణాళికకు. అప్పుడు నీకు కలిగేదంతా జయమే! నువ్వుందులోంచి మింగుతూ కూర్చున్నావనుకో, నశిస్తావు. అందుకని సృష్టి అంతా కూడా ఒక యజ్ఞంగా జరుగుతుంది కాబట్టి సృష్టి యజ్ఞము అన్నారు. ఈ సృష్టి యజ్ఞము జరుగుతూ ఉంటే ఈ సర్వస్వము ఏర్పడుతుందే దానికంతా మూలంగా తాను బిందువుగా ఇదంతా జరుగుతోంది. ఆయన లోంచి పీకుతున్నారు ఇదంతా. అంటే పీకుతున్న కొద్ది వస్తూ

ఉంటుంది. ఎంత పీకినా వస్తుంది. వచ్చిందేమవుతుందంటే మళ్లీ ఇటు నుంచి అటు కలిసిపోతూ ఉంటుంది. సముద్రంలో నీళ్లు ఆకాశంలోకి వెళ్లి వర్షం పడి మళ్లీ నదుల ద్వారాను, మురికి కాలువల ద్వారాను, సూర్యుడి యొక్క కిరణాల ద్వారాను మళ్ళీ పైకి పోతూ ఉంటుంది. మళ్లీ కిందకు వస్తూ ఉంటుంది, మళ్ళీ పైకి పోతూ ఉంటుంది, మళ్ళీ కిందకు వస్తూ ఉంటుంది. తరగదు. అక్షయంగా ఉండే మార్గం యజ్ఞమార్గం. మన ఇంట్లో బియ్యం బస్తా అయిపోతుంటే ఇంకో బస్తా రావట్లేదా? ఇంకో బస్తా వస్తుందన్న ధీమా మనకు ఉంది కదా! అట్లాగే గాలి పీలుస్తున్నాం అనుకోండి, ప్రాణవాయువు పీల్చిన కొద్ది ఇంకా దొరుకుతూనే ఉంది, కదా! అదేంటంటే ఒకపక్క నుంచి వినియోగం జరుగుతూ ఉంటే ఇంకొక పక్క నుంచి దాని యొక్క అందుబాటు/ supply ఉంటుంది. వాడుతూ ఉంటే వస్తూ ఉంటాడు. స్వంతానికి వాడుకోకపోతే బాగా వస్తాడు. తన స్వంతానికి వాడితే ఆగిపోతాడు. స్వంతం అంటే మన ఇంట్లో tank నీళ్లు మనం వాడుకుంటే చాలు అనుకుంటే బయట నుంచి ఇంక నీళ్లు ఏమీ రావు. ఆ tank తో సరి. అదేదో ఇంకొక దానికి connection ఉందనుకోండి, మనం వాడుకున్న కొద్ది అందులోంచి వస్తూ ఉంటాయి. బయటి వాళ్లు మాకు ఒక బిందె ఇవ్వండి, అంటే, తీసుకోండి అంటాము. మనవి కావు నీళ్ళు మన ఇంట్లో ఉన్నంత మాత్రాన. మనం ప్రహారీ కట్టినంత మాత్రాన, bore నీళ్లు మనవైనాయా? నిజంగా చెప్పండి. మన bore అంటాం కదా. మన bore ఏంటి? అక్కడ ఎక్కడో లోపల 100 అడుగులలో 150 అడుగుల లోపల నీళ్లు కదా. అవి నీ నీళ్లా? ఇక్కడ నాలుగు గోడలు కట్టేస్తే నాలుగు పక్కలా, ఇటు పక్క భూమి ఈ చివర నుంచి ఆ చివర వరకు అటు వెనక్కి వెళితే U.S. వెళ్ళిపోతాము. సారంగం తవ్వుకుంటూ వెళ్ళిపోతే ఇక్కడ, అక్కడ కాలిఫోర్నియాలో తేలుతాం. ఇదంతా మనదేనా? ఎంత నీరు ఇందులో? ఆ లోపల 150 అడుగుల లోపల నీళ్లు దొరికితే ఆ నీళ్లు ఎవరికీ చెందినట్లు? నీ నీళ్లా? ఎవరైనా ఒక బింద పట్టుకుంటామంటే ఎంత నువ్వు వెకిలి వేషాలు వేస్తావు? ఆశ్చర్యంగా ఉండదూ? అంత వెకిలి మనం. ఎందుకంటే భయం బొత్తిగా. ఎందుకంటే మనకు ఉండవేమోనని. సత్యం ఏమిటంటే ఇతరులకు ఇవ్వడం వలన మనకు పెరుగుతుంది. 'ఒరేయ్ వీడు పదిమందికి ఇస్తున్నాడు కాబట్టి వీడి దగ్గర ఎక్కువ పెడదాం' అనుకుంటాడుట. 'తన సొత్తును వీడి దగ్గర ఎక్కువ పెడితే మంచిది ఎందుకంటే పదిమందికి ఇస్తున్నాడు కాబట్టి ఇక్కడ ఉంచుదాం' అనుకుంటాడుట. ఇవ్వని వాడి దగ్గర పెడతాడా? మీకే నలుగురు పిల్లలు ఉన్నారంటే మిగతా ముగ్గురు పిల్లల సంగతి చూసే వాడి దగ్గర తల్లిదండ్రులు ఎక్కువ పెడతారు. ఎందుకని? మిగతా వాళ్ళ సంగతి చూస్తాడని. ఇచ్చిన తరువాత లోపల వేసేసుకునే వాడి దగ్గర పెట్టరు కదా. భగవంతుడూ అంతే! యజ్ఞం యొక్క పరమార్థం భగవంతుడు. యజ్ఞం తను ఎట్లా

చేస్తున్నాడో చూపిస్తాడు. ఆయనకేంటి ఈ మొత్తంలో? పదిమంది పిల్లల్ని కని, వాళ్ళందరినీ పోషించి, వాళ్లకు చాకిరీ చేసి ఇవన్నీ చేస్తే ఏమిటి? పిల్లలు ఆనందంగా ఉంటే చూసి ఆనందించడమే, కదా! 'మీ ఆనందం కోసమేరా నేను తయారు చేశాను. మీరు ఆనందంగా ఉంటే నాకు ఆనందం. మీరు ఆనందంగా ఉండాలంటే ఒకళ్ళకొకళ్ళు చేసుకోవాలి. ఎవరికి వాళ్లు చేసుకోవడం కాదు' అని చెప్పి భగవంతుడు పంపించాడు. ఎవరికి వాళ్లు ఎంత ఎక్కువ చేసుకుంటే అంత ఎక్కువ బాగుంటుందనేది మనం అనుకుంటుంటాం. అది మన దురదృష్టం. అసలు మనం చేస్తున్నది యజ్ఞమే కాదు. ఎందుకంటే అజ్ఞానంలో తన కోసం బతుకుతాం అనుకునేకన్నా, ఇంకొకళ్ళ కోసం అని అనుకున్నామనుకోండి అది యజ్ఞమే! Institute కి వచ్చినప్పుడు notes రాసుకుని, చాలా బాగా రాశానని చూడమంటే ఎవడూ చూసేవాడు కాదు. పైగా ఇవన్నీ ఎందుకు నువ్వు ఒక్కడివే రాసుకుంటున్నావు అనేవారు. సాధారణం గా ఒకరు notes రాసుకుంటే ఇంకొకడికి ఇవ్వడు. ఎవరి notes వాడే రాసుకుంటాడు. పక్కవాడికి తెలిస్తే వాడి మార్కులు బాగా వస్తే మరి వీడు ముందుకు వెళ్లడు కదా! కుళ్ళు బుద్ధులు ఉన్నాక, పైకి రావడం అనేది చాలా కష్టం. ఎవ్వరు పుచ్చుకునే వాళ్ళు కాదు. అవే పరీక్షలో వచ్చేవి. అప్పుడు వచ్చి 'అయ్యో అప్పుడు రాసుకోలేదు, నువ్వు చెప్పావు' అనేవారు. అందుకని ఏదైనా మన దగ్గరకు వచ్చినది పదిమందికి ఇవ్వటానికే! ఇంకో సత్యం చెప్పనా... మన దగ్గర ఏదున్నా అది ఇంకొకళ్ల కోసమట. మన కోసం కాదట. మీకు జ్యోతిష్యం తెలుసు అనుకోండి, మీ కోసమా జ్యోతిష్యం? వందలాది మంది మా అమ్మాయి పెళ్లి ఎప్పుడు అవుతుంది? మా అబ్బాయి ఉద్యోగం ఎప్పుడు వస్తుంది? Transfer ఎప్పుడు అవుతుంది? ఆరోగ్యం బాగాలేదు, ఎప్పుడు బాగుపడుతుంది? అని వస్తూనే ఉంటారు. పొద్దున లేచిన దగ్గర నుండి నీకేం పనికి వచ్చింది నీ విద్య? ఇంకొకళ్ల కోసమే కదా! నీకు Homoeo వచ్చు, ఏం జరుగుతుంది? పగలు, రాత్రి వస్తారు మందు కోసం, Homoeo వచ్చు కాబట్టి. రాకపోతే? విద్య మన దగ్గరికి చేరిందంటే ఎవరి కోసం చేరింది? మీ కోసమా? Homoeo నాకు బాగా వచ్చిందంటే నా కోసమా? రోజూ మందులు వేసుకుంటామా Homoeo వచ్చు కాబట్టి? వేసుకోము కదా! రోజు ఎంతకాలం మన chart మనం చూసుకుంటాం astrology వచ్చిందని? రోజు మన చేయి మనం ఎంత చూసుకుంటాం సాముద్రికం వచ్చని? ఈ విద్యలన్నీ ఎందుకు పనికి వస్తాయి? ఇంకొకడు వస్తాడు నీకు ఈ విద్య రాంగానే. వాడొచ్చి చెప్పించుకుంటాడు. వాడు ఊరుకుంటాడేంటి? ఇంకొకడికి చెప్తాడు వెళ్ళమని. Phones దాని గురించే. Appointmentలు దాని గురించే. పొద్దున లేచిన దగ్గర నుండి రాత్రి పడుకునేంతవరకు దాని గురించే. పగలు, రాత్రి తినేయరా? Homoeo

బాగా తెలుసంటే మరి 18 గంటలు వాడుకున్నారు ఒక ఆయనని. కదా! ఎవరికోసం ఈ విద్యంతా నీ దగ్గరున్నది, ఇంకొకరి కోసం. డబ్బులు ఉన్నాయనుకో నీ దగ్గర, ఊరుకుంటారేంటి మనుషులు? దానానికి వస్తారు. దానం మనం ఇవ్వము కదా, అందుకని అప్పుకొస్తారు. అప్పు అంటే అంత తొందరగా ఇవ్వం కదా! ఎక్కువ వడ్డీ ఇస్తామంటారు. పట్టుకు పోతాడు. దానం కిందే లెక్కవుతుంది, ఎందుకంటే తిరిగి రాదు కాబట్టి. నీ దగ్గర ఉన్న డబ్బు ఇంకొకడి కోసమే అక్కడికి చేరుతుంది. అది సత్యం. నా జీవితంలో నేను చాలా చూశాను. వచ్చింది అంటే ఎవరి కోసమో వస్తుంది తప్ప నీకోసం కాదు. ఎంత తింటావు నీ మొహం. రెండు పూటలు తింటావ్. అది కూడా సరిగ్గా తిననివ్వరు. అంటే ఎవరికోసం వచ్చింది? ఇలా వస్తే అలా ఎవడో వస్తాడు దానికి సంబంధించిన వాడు. అందుకని ఉన్నదల్లా ఇంకొకరి కోసమే. అది విద్య అవ్వచ్చు, సంపద అవ్వచ్చు, శరీరం అవ్వచ్చు. మన కోసం తయారు చేసుకున్నాము అనుకుంటే ఎట్లా? ఈ సత్యం తెలుసుకుంటే... ఓరి ఓరి ఎంత మోసపోతున్నాం మనం. మన దగ్గర పెట్టినదంతా ఇంకొకళ్ల కోసమే అని తెలుస్తుంది. గురువుగారు ఉన్నారు అనుకోండి. ఆయన దగ్గరకు వస్తారు... శిష్యులని. అంటే ఏంటి మన నుంచి పట్టుకు పోయేవాళ్ళు. మనం ఏం చేయాలి? మన నుంచి పట్టుకు పోవడానికి ధారాళంగా వదిలేసి మనం ఎవరిని పట్టుకున్నామో వాళ్ళ దగ్గర నుండి ధారాళంగా తెచ్చుకుంటూ ఉండటమే. ఏం పోయింది? Municipal tap ఏడవదు కదా! నీళ్లు వస్తూ ఉంటే ఇస్తోంది, tap కి ఏముంది బాధ. ఈ కాసేపట్లో నా గొట్టంలో ఉన్నాయి కాబట్టి నా నీళ్ళు అనుకుంటాం. అదే స్వార్థం! సత్యం అడిగితే ఇలా ఉంటుంది. ఏది? దాని దగ్గర ఉన్నదంతా ఇంకొకళ్ల కోసమే. మన ఇంట్లో బట్టలు పాతబడినవి బీరువాలో ఉన్నవి మన కోసం కాదు వేసుకోము కదా! అయినా అక్కడ పెట్టి ఉంచుతాం కదా. ఏమిటది ? వాడని వస్తువులు ఇంట్లో అటకెక్కించినవి ఉన్నాయే, నిన్ను బాధపెడతాయి. ఎందుకంటే అక్కడ ఎలుకలు చేరుతాయి. మూడు నెలలకు ఒకసారి సర్దడానికి వెళ్తే, మూడేళ్లకో... ఏదో తేలు కుడుతుంది. కదా! మాటిమాటికి సర్దుకోవద్దూ? పనికిరాని వస్తువులన్నీ ఇచ్చేస్తే ఇంకొకళ్ళకి పనికి వస్తాయి కదా. అందుకని మొత్తం సృష్టి అంతా కూడా ఒక ప్రవాహం. అది వృత్తాకారమైనటువంటి ప్రవాహం. ఒక చక్రం! అట్లా తిరుగుతూ ఉంటుంది. నీ దగ్గరకు వచ్చినది ఆపక. ఆపేవో చచ్చావే. అది నిన్ను బంధిస్తుంది. అట్లా ప్రవహించనీ. అట్లా చూడండి వర్షాలు పడి నదుల్లోకి వస్తే, నదుల్లోని నీళ్లన్నీ ప్రవహించి సముద్రంలోకి వెళితే, మళ్ళీ సముద్రంలో నుంచి ఆకాశంలోకి వెళితే, మళ్ళీ వస్తున్నాయి కదా. దానికి కావలసినది ఏంటంటే సృష్టి యజ్ఞం ఎట్లా జరుగుతుందో తెలిసి, దానియందు మనకు విశ్వాసం ఉంటే, మన జీవితం అట్లా చక్కగా సెలయేటి ప్రవాహంలా ఉంటుంది. లేకపోతే ఏం

జరుగుతుందంటే dams కట్టుకున్నప్పుడు వర్షాలు ఎక్కువ పడితే మన పంటలే మునిగిపోయి... రకరకాలుగా ఉంటుంది. అందుకని సమయజ్ఞం అనేది ఎక్కువ తక్కువ వాళ్ళు లేకుండా, ఒకే రకమైన ప్రవాహం అట్లా సెలయేటి లాగా జరిగి, మూలం నుండి స్థూలం వరకు, మళ్లీ స్థూలం నుండి మూలం వరకు తిరుగుతూ వస్తూ ఉంటుంది. మొత్తం విషయము మన దగ్గరకు వచ్చినది, దాచుకున్నదల్లా పోతుంది. అందుకే మన పెద్దలు ఏం చెప్పారంటే ఇతరులకు చేసిందల్లా నువ్వు దాచుకున్నది, నువ్వు దాచుకున్నదల్లా పోయింది. దాచి దాచి, కాపలా కాసి, తినక బాధపడితే వాడి ఇంట్లో ఒకడు పుడతాడు. ఎవరు? ఈ మొత్తం అంతా కాజేసేవాడు. వాడే! మా నాన్నకు చేతకాదు, నేను ఖర్చు పెట్టి చూపిస్తా, అని పదేళ్లలో ఖర్చు పెడతాడు, వాడు 50 ఏళ్లలో సంపాదించినదంతాను. అయిపోయింది. రెండు చెప్పారు యోగ జీవితం అయినా ఉండాలి, భోగ జీవితం అయినా ఉండాలి ఈ రెండూ లేకపోతే రోగ జీవనం అవుతుంది. యోగి అంటే ఏమి చేస్తాడయ్యా అంటే తన దగ్గరకు వచ్చినవి ఇతరుల శ్రేయస్సు కోసం వినియోగం చేయడానికి తన జీవితాన్ని చాలా సామాన్యంగా simple గా ఉంచుకొని ఇతరులకు పంచుతాడు. వాడు అనుభూతి చెందుతాడు. అందరూ ఆనంద పడుతూ ఉంటే చూసి ఆనందిస్తాడు. భోగి ఏం చేస్తాడు? కనీసం తను అనుభవించి ఆనందపడతాడు. రోగి ఈ రెండు చేయలేక దానివల్ల కష్టపడతాడు. చచ్చిపోయేవాడెవడో ఒక్కొక్కళ్ళని చూస్తున్నాడట. చూస్తుంటే అందరూ అక్కడ... నాన్న చచ్చిపోతున్నాడు కదా అని కొడుకులు చేరారు. మొగుడు చచ్చిపోతున్నాడని పెళ్ళాం చేరింది. అందరూ ఒక్కొక్కళ్ళని చూసాడుట. చూసిన తర్వాత ఒకడు వెనకాతల నిలబడితే వీడికి కనపడలేదట. పోయే తెలివి కదా! వాడు ఏడిరా అన్నాడుట. అంటే వాడు నేను ఇక్కడ ఉన్నాను నాన్నా అని కనబడ్డాడు. 'అందరూ ఇక్కడే ఛస్తే shop లో ఎవడున్నాడు రా' అని చచ్చిపోయాడుట. అంటే వాడి జీవం shop లో ఉంది ఇక్కడ లేదు పాపం. అట్లా దాచుకుని దాచుకుని ఎవడికీ కాకుండా, కుక్కలు చింపిన విస్తరి అంటారు చూశారా, కొంతమంది సంపద అట్లా అయిపోతుంది. అక్కడ యజ్ఞం లేకపోవడం వల్ల అట్లా అయ్యింది. అందుకని యజ్ఞార్థం జీవనం, అందులోనూ సమతూకమైనది ఉండాలి. ఆవేశంగా చేయటం సమతూకం కాదు. ఎందుకైనా మంచిది మనం దాచుకుందాం అనుకోవటం కూడా సమతూకం కాదు. అంటే ఆపడం సమతూకం కాదు, పోయటం సమతూకం కాదు. ప్రవాహానికి ప్రతిస్పందించడం సమతూకం. ఊళ్లో రేపు పొద్దున్న నా దగ్గర ఉంది మీరంతా పట్టుకు పొండయ్యా అని advertisement ఇస్తే ఎల్లుండికి ఏమీ ఉండదు. అయిపోతుంది కదా! అలా కాదట. నీ దగ్గరకు సన్నివేశంవస్తుంది. దానికి నువ్వు ఉంచుకుని లేదనక. అదే సత్యనారాయణ స్వామి వ్రతం. వాడు లేదన్నాడు. కదా! అన్నీ

ఆకులు, అలములుగా అయిపోయినాయి. ఉండి లేదనక. నీ దగ్గర ఉన్నది ఇంకొకరి కోసం. ఉన్నది కదా అని విర్రవీగక. ఊరంతా పంచుతాను అంటే అపాత్రమైపోయి, అక్కరలేని వాళ్ళకి ఇచ్చి, ఆకలి లేని వాళ్లకు పెట్టి, మనం చూడండి... ఇంటికి వచ్చిన వాడికి ఎవడికైనా అన్నం పెడితే చాలు. ఇంటిముందు అమ్మా ఆకలి అన్న వాడికి పెడితే చాలు. లేదా ఏదో జంతువులు వస్తే పెడితే చాలు. నారాయణ సేవ చేస్తామని ఊరినిండా ఇష్టుడు తెగ తయారైపోయారు. ప్రతి గురువారం ఊళ్లో షిరిడీ సాయిబాబా గుడి లో చాలా పెరిగింది. ప్రతి గురువారం ప్రతిభక్తుడు బాబా గారి పేరు మీద భోజనం పెడితే ఏదో కలిసొస్తుందని. గురువారమే పెట్టాలా శుక్రవారం పెట్టొచ్చు, సోమవారం పెట్టొచ్చు. కదా. గురువారం పెడితే ఎక్కువ కలసి వస్తుందని మనకు. అది వ్యాపారమేగా? అలా గుళ్ళు ఎక్కువైపోయినాయి. అన్నిచోట్ల తినేవారు కొంతమంది తయారు అయిపోయారు. వాళ్ళను వెళ్లి పిలిస్తే ఇప్పుడు ఏమంటున్నాడో తెలుసా... ఏకాదశి, బాబా గారి గుడిలో భోజనం పెడుతున్నాం, గురువారం కూడా వచ్చింది అంటే వాడిలో బాబా పలికాడు. వాడు అన్నాడు... 'ప్రతివాడు గురువారం పెడితే ఎవరు తింటాడండీ? మీరందరూ రోజులు మార్చుకోండి, అని చెప్పాడు. ఏడు రోజులూ పెట్టండి. వారానికి ఒకచోటకి వస్తాము. తింటాము. ప్రతివాడు గురువారమే పెడితే ఒకరోజు ఎన్ని చోట్లకని వస్తాము? మిగతా రోజులు మాకేదీ?' అన్నాడు. బాగుంది కదా. అంతేకాదు, ఇంకొన్నాళ్ళు పోతే... sweets వేయకపోతే రామంటారు. ఎందుకని? నీకై నువ్వు వెళ్లి పెడదాం అనుకుంటున్నావు కాబట్టి. ప్రేమ సమాజానికి వెళ్లి అడగండి ఇప్పుడు... అయ్యా మా నాన్నగారి పేరున ఏమైనా చేస్తామండీ అంటే ఖాళీ లేదంటాడు. అన్ని రోజులూ booked. ఖాళీ లేదు. సంతర్పణండీ, మీ మనుషుల్ని పంపించండి... అనాథ బాలబాలికలను అంటే, అవసరం లేదండీ వాళ్లకు చాలా ఉంది అంటాడు. షిరిడీలో ఇదివరకు కుక్కలు అట్లా ఉండేవి. కుక్కలకు పాలు పోయాలండీ ఎందుకంటే కుక్కల్లో బాబా ఉంటాడు అని వాళ్ళ ఒక నమ్మకం. మనం అక్కడికక్కడ అట్లా పరిమితం చేసుకున్నాం. ఏం పందుల్లో లేడా బాబా. కుక్కల లోనే ఉన్నాడా. ఆ పాలు కుక్కలకు పోస్తూ ఉంటే వాటికి ఎంత ఎక్కువైపోయిందంటే... ఆ పాలు అక్కడ పెడితే అట్లా చూస్తాయి. తాగవు. బలసిపోయి. పాలంటే వాటికి వెగటు. వాటికి నోరు లేదు. లేదంటే తిట్టేవి. ఎప్పుడూ పాలేనా... ఇంకేమైనా పట్టుకురా అని. అది సమయజ్ఞం అవ్వదు. మనం అనుకుని చేయడం కాదు, మన దగ్గరకు వచ్చిన వాడికి చేస్తే సమయజ్ఞం అవుతుంది. భగవంతుడు 'అడగందే అమ్మయినా పెట్టదు' అన్నట్లుగా అలా జరిపిస్తూ ఉంటాడు. సన్నివేశాలకు ప్రతిస్పందిస్తూ, ఇతరుల కోసమే మన దగ్గర ఉందని గుర్తుపెట్టుకుని, యజ్ఞార్థం జీవిస్తూ ఉంటే ప్రవాహం నిర్మలంగా సాగుతుంది. అట్లా కాకపోతే చాలా

ఎక్కువ తక్కువగా ఉంటుంది. దాచుకునే వాళ్ళు ఒక విధంగా ఉంటే, రజోగుణంతో దానం చేసే వాళ్ళు ఇంకొక విధంగా ఉంటారు. రెండూ అక్కర్లేదు. ఆ పద్ధతిలో ముందుకు పోవాలి.

371, 372 హవిః, హరిః

హవిస్సు అంటే యజ్ఞంలో హోమం చేయబడే నెయ్యి. అంటే సృష్టికి మూలమైన పదార్థం. సృష్టికి మూలమైన పదార్థం భగవంతుడే! అతడే తనను తాను దేవతల చేత హోమం చేయబడటం చేత ఈ సమస్తమైన జీవసృష్టి జరిగింది. దైవాన్ని హోమం చేసి జీవులను తయారు చేశారన్నమాట. అందుకని జీవుల రూపంలో దైవమే ఉన్నాడనే అవగాహన మనకు సత్పురుషులు, సద్గంథాలు ఎక్కువగా చెప్తూ ఉంటాయి. అందుకని అందరిలోనూ అందరిలాగా తాను ఉండి, ఈ సమస్తాన్ని నడిపిస్తూ ఉంటాడు కాబట్టి ప్రతి దాంట్లోనూ దాని యొక్క మూలతత్త్వాన్ని భగవంతుని యొక్క అస్తిత్వంగా గమనించాలి. అది ఇక్కడ హవిస్సు భగవంతుడు ఇవ్వడం. ఆ విధంగా తనను తాను సమర్పణ చేసుకుంటూ, నెయ్యి వేస్తే హోమం లో అగ్ని బాగా వెలుగుతుంది. అగ్నిని చూసినప్పుడు ఆ అగ్నికి మూలకారణమైన ఇంధనం ఏదో మనం చూసినట్లయితే అది నెయ్యి. నెయ్యి అంటే మనకు ఆవు గడ్డి మేస్తే, దాంట్లో నుంచి పాలు వస్తే, పాలను కాచితే, పెరుగు ఏర్పడితే, పెరుగుని మజ్జిగ చేస్తే, మజ్జిగను చిలికితే, అందులోంచి వెన్న వస్తే, ఆ వెన్నను మళ్ళీ కాస్తే, అందులోంచి వచ్చేది నెయ్యి. ఆ నేతిని కూడా కాచామనుకోండి మళ్లీ అంతర్ధానమవుతుంది. అందుకని ఈ మొత్తం నుంచి ఏమీ లేని దానిగా కనిపిస్తున్న దాని నుంచి ఇన్ని రకాలుగా దిగివచ్చి మళ్ళీ తన మూల తత్త్వం లోకి తను పుడుతూ ఉంటాడు. ఇవన్నీ సృష్టిలో చైతన్యవంత స్థితులు అని చెప్తూ ఉంటాం. కాబట్టి అన్నిటికీ మూలంగా ఉండే వాడొకడు. వాడు తారసపడడు. వాడి కారణంగా అగ్నికార్యం జరుగుతూ ఉంటుంది. వాడే లేకపోతే అగ్ని లేదు. అగ్ని వెలగటానికి ఏది కారణంగా ఉందో దాన్ని మనం హవిస్సుగా తీసుకోవాలి. అందరిలో కూడా ఆ అగ్నికార్యం ఆ విధంగా జరుగుతున్నది. చెట్టులో జరుగుతోంది, జంతువులో జరుగుతోంది, మనిషిలో జరుగుతోంది, ఒక గోళంలో జరుగుతోంది. ఇవన్నీ ఈ విధంగా నిలబడి ఉండటానికి గాని, తిరుగుతూ ఉండటానికి గాని, అస్తిత్వం కలిగి ఉండడానికి గానీ మూలంగా ఉన్న తత్త్వాన్ని హవిస్సుగా మనం భావన చేస్తాం. అందుకని దేని మూలంలోకైనా వెళ్తే అక్కడ మనకు భగవంతుని యొక్క అస్తిత్వమే గోచరిస్తుంది. అలా మూలతత్త్వంలోకి వెళ్లడమనేది సాధనలో భాగం. మామూలుగా మనం పై పొరల్లో ఇమిడిపోయి, అవే చూసుకుని అదే సత్యమని జీవిస్తూ ఉంటాం. మగ అని, ఆడ అని. మగైనా ఆడైనా అదే సప్త ధాతువులతో చేయబడినటువంటి శరీరం. వీటిలో ఉన్నటువంటి ప్రవర్తిస్తున్నటువంటి ఇంద్రియాల ద్వారా ప్రవర్తిస్తున్నది, మనసు ద్వారా ప్రవర్తిస్తున్నది

అయిన జీవ చైతన్యం ఏదైతే ఉందో, ఆ చైతన్యమే దైవంగా భావన చేసినట్లయితే మూలతత్త్వంలోకి వెళ్ళొచ్చు. ఇది మనం ఎప్పుడూ మర్చిపోతూ ఉంటాం. చెప్పుకున్నప్పుడు గుర్తుంటుంది. ఆచరించేప్పుడు గుర్తుండదు. గుర్తుండకపోవడం అనేది అందులో భాగం. గుర్తుండకపోవడం వల్ల ఆట ఆడుతూ ఉంటాం. మరీ బొత్తిగా గుర్తు ఉండకపోతే పోట్లాటవుతుంది. అందుకనే ఆటగా క్రీడించాలంటే, అది గుర్తు ఉండి నిర్వర్తించుకునే వాడు క్రీడగా దానిని నిర్వర్తించుకుంటాడు. కానీ క్రీడలో ఎప్పుడైనా ఎవరైనా జారిపోతూ ఉంటాం. అందుకని మొత్తం తత్వాన్ని ఈ విధంగా ఎప్పుడో దర్శనం చేయటం మనకు పెద్ద ఇచ్చిన మార్గంలో ముఖ్యమైనది. అదే తత్వం అప్పుడప్పుడు ఏం చేస్తుందంటే తనే కావాలంటే రూపం ధరిస్తుంది మొత్తంగా. అంటే దైవం జీవుడిగా వ్యక్తం అవుతూ ఉంటే, దైవము తన మాయ చేత తననే తాను సృష్టించుకునే తత్త్వం కూడా ఒకటి ఇమిడి అందులో ఉంది. సృష్టిలో ఉన్న జీవులకు మాయ కమ్ముతుంది. అంటే మనము ఇలా చెప్పుకున్నప్పుడు అంతా సత్యమే అని తెలిసినా, మళ్లీ ప్రవర్తనకు వచ్చేసరికి ఎలా మర్చిపోతామో, ఆ మర్చిపోవటాన్ని 'మాయ' అంటారు. ఆ మాయను దాటి, నామానికి రూపానికి అతీతమైన తత్వము ఒక రూపము తీసుకుని, ఒక నామం ధరించి మన మధ్య అలా తిరిగినప్పుడు ఆయనను 'హరి' అంటారు. 'భగవంతుడు హరియై దిగి వచ్చుట' అని మనకు భాగవతంలో చెప్తారు. అంటే అప్పటికప్పుడు తాత్కాలికంగా దిగివచ్చి కొన్ని పరిష్కారాలు ఇవ్వటం ఉంటాయి. ఒక పురుషుడిగా దిగివచ్చి కొన్ని దశాబ్దాల పాటు మనలో ఉండి జాతికి పరిష్కారాలు ఇచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఇలా చిన్నచిన్న అవతారాల దగ్గర నుంచి పెద్దపెద్ద అవతారాల వరకు చాలా ఉంటాయి హరి యొక్క అవతారాలు. హరి అంటే దిగి వచ్చిన తత్త్వము!. దివ్య తత్త్వము మాయ చేత కప్పబడక, పరిమితి పొందక ప్రవర్తిస్తే దాన్ని హరితత్త్వము అని చెప్తారు. మనకు మామూలుగా దశావతారాలు చెబుతారు కానీ భాగవతంలో చూస్తే ఏకవింశతి అవతారాలు చెప్తారు. ఏక వింశతి అంటే 21. వింశతి అంటే 20. చతుర్వింశతి అంటాం మనం. దేనిని? గాయత్రీ మంత్రాన్ని! అందులో 24 అక్షరాలు ఉంటాయి. అవి కాకుండా 'హరి కళ' భాగవతోత్తముల యందు పనిచేస్తూ ఉంటుంది. అంటే అర్థం ఏమిటంటే... మాయ పొరలు విడి, జీవుని యందు ఆవరించిన భగవంతుడు పనిచేస్తూ ఉంటే, భక్తులు దానికి అనుసంధానం చెంది పనిచేసుకుంటారు. అది హరికళ! ఈ హరికళ కలిగిన వాళ్ళందరూ కూడా మహాత్ములుగా మనకు పరిగణింపబడతారు. అవతార పురుషుడు ఒకడు అయితే హరికళ కలిగిన వారు చాలామంది ఉన్నారు. హరి కళలలో కూడా అదే తత్త్వం ఉంటుంది. అంత మోతాదులో ఉండదు. అవతారంలో పూర్తిగా అదే అయి ఉంటుంది. అంటే దానికున్న అవతరించిన వెలుగు యొక్క

పరిమాణాన్ని బట్టి, పన్నానుబట్టి, దీన్ని అవతారం అంటారు. అంటే ఎక్కడ బొత్తిగా మానవ సహజమైన గుణాలు కనిపించవు. అప్పుడప్పుడు కాస్త మానవుడు కనిపిస్తూ, అప్పుడప్పుడు దైవం పనిచేస్తూ అట్లా ఉంటారు. వారంతా జీవులుగా దైవంతో అనుసంధానం చెందిన వాళ్ళు. వాళ్లను భక్తులు అని మనం పేర్కొంటాము. జ్ఞానులు అంటూ ఉంటాం. వీరందరి నుంచి కూడా అదే తత్వము వ్యక్తం అవుతూ ఉంటుంది. అలా వ్యక్తం అయినప్పుడు దానిని దర్శనం చేస్తూ ఉండాలి. అలా ఎలా దర్శనం చేస్తూ ఉంటాం అంటే చిన్న పాము దగ్గర నుంచి చాలా పెద్ద వరకు ఉంటాయి కదా అన్నీ. మొత్తం సృష్టి అంతా అందులో ఉన్న జీవులుగాను, గ్రహగోళాదులుగాను భగవంతుడే సాక్షాత్కరించినప్పటికీ కొన్నిటిలో ఎక్కువగా మనకు ప్రస్ఫుటంగా కనిపిస్తాడు. కొన్నింటిలో కనిపిస్తూ, కనిపించకుండా ఉంటాడు. కొన్నింటిలో పూర్తిగా కనిపించకుండా ఉంటాడు. అంటే చూసేవాడి దృష్టిబట్టి ఇది. కొంతమంది, బాగా విపులంగా కనిపిస్తే తప్ప చూడలేరు. కొంతమంది వ్యక్తావ్యక్తంగా ఉన్నా చూస్తారు. కొంతమంది అవ్యక్తంగా ఉన్నా చూస్తారు. 'భక్తుడు' అనే బిరుదు మనం ఎవరికైతే ఇస్తుంటామో వాళ్ళందరూ సమస్తమునందు దర్శనము చేసుకుంటారు. కాబట్టి వాళ్లకు ఇక అక్కడికి, ఇక్కడికి వెళ్ళవలసిన పని ఏమీ లేదు. ఎక్కడ ఉంటే అక్కడ తనయందు, తన చుట్టూ వాడే ఉన్నాడు కాబట్టి, వాడిని స్మరణ చేసుకుంటూ అట్లా జీవితం గడిపేస్తారు. అలాకాకుండా కొంతమందికి మామూలుగా బాగా ఫెళ ఫెళ ఫెళ లాడుతూ నేనున్నాను రా, అని అన్ని రకాలుగా చూపిస్తేనే గాని గోచరం కాదు. వాళ్లను చూసి వాళ్ళ వెంట మనం తిరుగుతూ ఉంటాం, భగవంతుని తత్వం అక్కడ ఉన్నదని. ఉన్నది సత్యం కాబట్టి అక్కడకు వెళుతూ ఉంటారు. వాళ్ళు ఏం చెప్తారంటే నాయందు చూశావు బాగుంది, అన్నింటిలోనూ చూడమని, చెప్తూ ఉంటారు. అవతార పురుషుడి చుట్టూ జీవులు చేరడం అంటే అయస్కాంతం చుట్టూ ఇనుప ముక్కలు చేరటం. ఎందుకంటే ప్రతి జీవుడిలో ఉన్నదదే. అది ఎక్కడ ఎక్కువగా ఉంటుందో అక్కడ ఆకర్షింపబడుట అనేది చాలా సహజం. ఆకర్షింపబడడం అనేది దైవతత్వానికే తప్ప, అక్కడ ఉన్న రూపానికీ, నామానికీ కాదు. నామము, రూపాన్ని ఆధారం చేసుకుని జీవించే జీవులు దానిని చూసి ఆ విధంగా ఆకర్షింపబడి, అందులో ఒక నిష్కారణమైన ఆనందాన్ని, అనుభూతిని పొందుతూ ఉంటారు. ఆ విధంగా అవతార తత్వం దగ్గర నుంచి భాగవతుల వరకు, భాగవతుల దగ్గర నుంచి ఇంకొంచెం కిందకు దిగి వస్తే కొంతమంది మానవుల యందు, కొన్ని కొన్ని చాలా దివ్యమైన గుణాలు ఉన్నాయి. ఒక్కొక్కళ్ళలో ఒక్కొక్కటి అట్లా కనిపిస్తుంది. కనిపించినప్పుడు ఆ గుణంగా ఆ మనిషిలో వ్యక్తమైనది భగవంతుని యొక్క తత్వము అని చూడటమనేది దేవుడ్ని ఇంకా బాగా చూడడం. గుడిలో దేవుని చూడటం, ఒక

మహాత్ముడిలో దేవుడ్ని చూడడం, అక్కడ నుండి అందరి మనుషులలో, అన్ని జంతువులలో ఉన్న కళ్యాణ గుణాలను దేవుడుగా చూడడం... ఇలా నెమ్మదిగా మనం భగవంతుడిని చూసే syllabus పెంచుకుంటూ వెళ్లాలి. అందుకనే 'హరి' అన్నప్పుడు దిగి వచ్చినవాడిగా, అవతార మూర్తిగా మనం దర్శనం చేస్తాం. రాముడు లోనూ, కృష్ణుడు లోనూ లేకపోతే షిరిడి సాయిబాబా లోనూ, సత్యసాయిబాబా లోను మాస్టర్ E.K. లోనూ, మాస్టర్ M.N. మాస్టర్ C.V.V.లోనూ అలాంటి వాళ్ళలో చూడడం అనేది కొంత సులభం. వీళ్లలో కూడా చూడని వాళ్ళు ఉన్నారు. వాళ్ళను అలా ఉంచి ఇక్కడ నుంచి ఇంకా దిగివస్తే జీవులలో ఉండే కళ్యాణ గుణాలుగా ఉండే వాడు భగవంతుడే అనే భావనచేయాలి.

373 సర్వలక్షణ లక్షణ్యఃఁ

అందరి లక్షణాలలోనూ లక్షణంగా ఉన్న వాడు. కాబట్టి ఎవరి యందు ఏ గుణం బాగా గోచరిస్తూ ఉంటుందో, వారి యందు ఆ గుణాన్ని బాగా ఆరాధన చేస్తే, భగవంతుని ఆరాధన చేసినట్లే! కొంతమందికి రక్షణ ఇచ్చే గుణం ఉంటుంది. ఆ రక్షణగా, అక్కడ భగవంతుడు మనకు, ఆ రూపంలో అస్తిత్వం చెంది ఉన్నాడు. కొంతమందికి దానం చేసే గుణం ఉంటుంది. కర్ణుడు ఏ విధంగా మహాత్ముడయ్యాడంటే అతనిలో ఉన్న దానగుణం కారణం చేత. అంటే భగవంతుడు ఆ విధంగా అతని యందు అస్తిత్వం కలిగి ఉన్నాడు. అంటే దానం ద్వారా ఎక్కువ వ్యక్తం అవుతాడు. భీముని యందు బలంగా వ్యక్తమవుతాడు, అర్జునుని యందు సమబుద్ధిగా వ్యక్తమవుతాడు, ధర్మరాజు యందు ధర్మముగా వ్యక్తవుతాడు, ద్రౌపది యందు శక్తిగా వ్యక్తమవుతాడు. వ్యాసుని యందు వేదముగా వ్యక్తమవుతాడు, శుకుని యందు పరమ భాగవతోత్తమునిగా వ్యక్తమవుతాడు, పరీక్షిత్తు యందు ఒక భాగవతోత్తమునిగా వ్యక్తమవుతాడు. గోవులందు సాధుత్వంగా వ్యక్తమవుతాడు. కుక్కయందు విశ్వాసంగా వ్యక్తమవుతాడు. గుర్రమునందు ప్రాణశక్తిగా వ్యక్తమవుతాడు. గుర్రంలో ఉన్న ప్రాణశక్తి దేనిలోనూ లేదు కాబట్టి. పిల్లి యందు శుభ్రతగా వ్యక్తమవుతాడు. పిల్లికున్న శుభ్రత ఎవరికీ లేదు. ఏమాత్రం కాస్త దుమ్మంటినా నాకేసి తీసుకుంటుంది. అట్లాగే ఎలుక యందు యుక్తిగా వ్యక్తమవుతాడు. కౌశలం ఎక్కువ ఎలుకకు. మనం ఎంత దాచినా అది ఏదో ఒక విధంగా దూరిపోయి కన్నం పెట్టేసి, తీసేసుకుంటుంది. ఏనుగు నందు గంభీరత్వంగా వ్యక్తమవుతాడు. సింహము నందు nobilityగా వ్యక్తం అవుతాడు. చాలా లీవి. పువ్వు యందు అందంగా వ్యక్తం అవుతాడు. పండు యందు దాని యొక్క రుచిగా వ్యక్తం అవుతాడు. అట్లా ఎక్కడబడితే అక్కడ వ్యక్తం అవుతున్న వాడిని చూడటం అనేది సాధన జరుగుతున్న వారికి, మొత్తం అంతా వాడే కనిపిస్తాడు. అందమైన వాళ్ళ రూపం నందు అందంగా వ్యక్తం అవుతూ ఉంటాడు. చక్కగా మాట్లాడే వాళ్ళ యందు వాక్కుగా వ్యక్తం అవుతాడు. చక్కగా పనిచేసే వాళ్ళ యందు పనిగా వ్యక్తం అవుతాడు. చక్కగా పాడేవాళ్లు యందు పాటగా వ్యక్తమవుతూ ఉంటాడు. ఇట్లా ఒక్కొక్కరి యందు ఒక్కొక్క లక్షణముగా వ్యక్తం అవుతున్నది ఉన్నదే అది కేవలం మనుషులే కాదు జంతువులు, చెట్లు, బంగారము, ఇనుము వీనిలో ఉండే ఆ లక్షణంగా ఆ భగవంతుని యొక్క తత్త్వమే వ్యక్తమవుతోందని దర్శనం చేసుకోవాలి. ఇలా చేసుకుంటూ ఉంటే క్రమశః అన్నిటిలోనూ వస్తువును చూడడం మానేసి, అందులో వసించి ఉన్న వాడిని చూడడం ప్రారంభం అవుతుంది. ప్రారంభమైనప్పుడు అది

ముఖ్యమౌతుంది, వస్తువు ముఖ్యం అవ్వదు. అదే హనుమంతుడికి మంచి హారం అమ్మవారు ఇస్తే అందులో రాముడు ఉన్నాడో లేడో చూడడం అంటే. మనమైతే హారం ఏమాత్రం విలువ చేస్తుందో చూసుకుంటాం. ఎన్ని పూసలు ఉన్నాయి? ఏమాత్రం బరువు ఉంది? అమ్మితే ఏమాత్రం వస్తుంది? ఇట్లా చూసుకోవడం అదొక పద్ధతి. ఇంకొక పద్ధతి ఏమిటంటే అందులో ఉన్న అసలు తత్త్వం ఏ మాత్రం వ్యక్తం అయింది అనేది. ఎందుకు వజ్రాలు, వైఢూర్యాలు, మాణిక్యాలు ఇటువంటి రాళ్లు గురించి ఎక్కువ తాపత్రయపడతాం బెడ్డలకన్నా? ఎందుకు ఒక గుండ్రాయి కన్నా ఒక ముత్యమో, వజ్రమో, నీలమో, కెంపో... వీటి యందు మనం ఎక్కువ ఆకర్షింపబడతాము? ఎందుకంటే వీటిలో మామూలు గుండ్రాయిలో కన్నా ఎక్కువ వ్యక్తమై ఉన్నాడు కాబట్టి. గుండ్రాయిలో కూడా వ్యక్తమై ఉన్నాడు. అందులో ఏమీ సందేహం లేదు. చూసేవాడికి అన్నింటిలోనూ కనిపిస్తాడు. కొన్నింటిలో ఎక్కువగా కనిపిస్తాడు. ఎంత ఎక్కువగా కనిపిస్తూ ఉంటే అంత మనకు ఆకర్షణ. అంటే కాంతివంతమైన కొద్దీ ఆకర్షణ ఉంటుంది అందుకే భగవంతుడు లక్ష్మీవంతుడు అంటారు. కాంతి లక్ష్మి.

374 లక్ష్మీవాన్

కొన్నింటిలో లక్ష్మి ఎక్కువగా కనిపిస్తుంది. అంటే కాంతివంతంగా కనిపిస్తాడు. పదార్థం పెరిగిన కొద్దీ (స్థూలమైన కొద్దీ) కాంతి తగ్గుతుంది. పదార్థం సూక్ష్మమైన కొద్దీ కాంతి పెరుగుతూ ఉంటుంది. అదే తేడా ఒక వజ్రానికీనూ, ఒక బొగ్గుకీనూ. ఒక నల్లరాయికీ పాలరాయికీ తేడా అదే. పాలరాయి చాలా సున్నితంగా కనిపిస్తుంది. నల్లరాయిలో బలంగా ఉంటాడు. తెల్లరాయిలో సున్నితంగా ఉంటాడు. కాంతి పెరిగిన కొద్ది ఎక్కువ లక్ష్మీవంతుడిగా కనిపిస్తాడు. కొంతమందిలో కాంతి ఉంటుంది. చాలా కళగా ఉంటారు. మన logic తో సంబంధం లేకుండా దాని యందు మనకు ఆకర్షణ ఉంటుంది. అదేంటది? అది అంతే! ఎందుకంటే జీవులుగా మనమంతా కూడా అదే! జీవ చైతన్యం అటువంటి వెలుగు. కాబట్టి వెలుగు, వెలుగుకి ఆకర్షింపబడటం అనేది సహజం. మనిషిలో వెలుగు తక్కువ ఉంటే తక్కువ వెలుగు ఉండే రంగులకు ఆకర్షింపబడతారు. మట్టి రంగుకు ఆకర్షింపబడే వాళ్ళు ఉంటారు. వెలుగుకు ఆకర్షింపబడే వారు నీలానికి, పసుపు రంగుకి, సింధూరం రంగుకి, చిలకాకుపచ్చ రంగుకి, తెలుపు రంగుకి ఇటువంటి వాటికి ఎక్కువ ఆకర్షింపబడతారు. అట్లాగే ఆకారాలు చూసినప్పుడు సుందరమైన ఆకారాలు కొన్ని ఉంటాయి. వికారమైన ఆకారాలు కొన్ని ఉంటాయి. ఏదో జంతువుని పులి చంపుకు తింటున్న బొమ్మలు ఇంట్లో ఉంటాయి. అంటే పులి దాని మీద పడి దాని యొక్క మెడ కొరికేస్తున్నట్లుగా ఆ బొమ్మ. అది ఇంట్లో పెట్టుకుంటారు లోపల కాస్త కూస్తో ఇటువంటి తత్త్వం ఉంటే అటువంటి బొమ్మ పెట్టుకుంటారు. ఎండిపోయిన చెట్టు scenary పెట్టుకుంటారు కొంతమంది ఇంట్లో. అట్లా ఒక బండి చాలా ఎడారి లాంటి ప్రదేశంలో వెళుతూ ఉంటుంది. ఆ పక్కన ఎండిపోయిన చెట్టు ఉంటుంది. అంటే ఏమిటంటే వీడి జీవితం అలా ఉంటుంది అని చెప్పడానికి. మనకు. లోపల లక్ష్మీ కళ అనేది ఇక్కడ ఉండదు. అది మా తత్త్వం అని మనంగా మనం చెప్పుకోవడం అన్నమాట. ఎడారిని చూసినదానికి, ఉద్యానవనం చూసిన దానికి తేడా కనిపిస్తుంది. అంటే పరిపూర్ణంగా లోతుల్లోకి వెళ్లిపోయిన తర్వాత అంతా ఒకటే. కానీ ఈ లక్ష్మీ కళగా కనిపిస్తున్నప్పుడు దానియందు ఆకర్షణ లేకపోతే అందుకు పైవి జరగడానికి అవకాశం ఉంది.ఆ విధంగా భగవంతుడు అన్నిటియందు ఉన్నా, కొన్నిటియందు ఎక్కువగా కనిపిస్తాడు. కొన్నిటికి కొన్ని రూపాలు ఎక్కువ గా పలుచగా ఉండటం వలన వాటి నుంచి వ్యక్తం అవుతాడు. మొద్దుగా ఉన్నచోట ఉంటాడు గానీ అంత ఎక్కువ వ్యక్తం కాడు. అందుకనే అందరు జీవులలోనూ దైవత్వం

ఉన్నప్పటికీ కూడా కొంతమంది జీవులలో ఎక్కువగా ఉన్నట్లు గోచరిస్తాడు. ఎందుకు గోచరిస్తాడంటే వాళ్లలో పదార్థం యొక్క మందం తక్కువగా ఉండటం వలన. మందం తక్కువగా ఉన్న కొద్ది చైతన్యానికి ప్రసారం ఎక్కువగా ఉంటుంది. ప్రవాహం ఎక్కువగా ఉంటుంది. మందం ఎక్కువైన కొద్దీ ప్రవాహం తక్కువైపోతూ ఉంటుంది. దాన్నే 'తమస్సు' అంటూ ఉంటాం. ఈ విధంగా మనకు భగవంతుడు హరి అయి దిగి వచ్చినవాడై, ఆ తర్వాత లక్షణాల రూపంలో గోచరించే వాడు, ఆ తర్వాత కాంతివంతంగా గోచరించే వాడు, ఇట్లా గోచరిస్తూ ఉంటాడు. ఎదుటివాడిలో ఉండే మంచి లక్షణాలు చూడంగానే మనకు ఆనందం వేస్తే, మనలో సత్వగుణం బాగా ఉన్నట్లు. అంటే భగవంతుని దగ్గరకు చేరుకోవటానికి కావలసిన స్వభావం మన దగ్గర ఉన్నట్లు. ఎదుటి వ్యక్తిలో కళ్యాణ గుణాలను గురించి ఎవరైనా చెబుతూ ఉంటే, అసూయపడి వాడిలో ఉండే మిగతా గుణాలను కూడా బయటకు తెచ్చి చూపించే స్వభావం కొంతమందిలో ఉంటుంది. ఆయన చాలా మంచివారు, మంచి పనులు చేస్తున్నారంటే మీకు ఏమి తెలుసండీ ఆయన చేసే మిగతా పనులన్నీ? ఇట్లా చేస్తారు, అట్లా చేస్తారు అని. కొంతమంది ఇది చూస్తుంటారు, కొంతమంది అది చూస్తుంటారు. చూసేవాళ్ళబట్టి అక్కడ ఎంత విలువ ఉన్నా కూడా కొంతమందిలో కనిపించదు. శ్రీకృష్ణుని యందు కూడా అటువంటి దివ్యదర్శనాలను చేయలేని సమకాలీకులు ఉన్నారు. చేసిన వారున్నారు. చేసిన వారిలో దైవీగుణం ఎక్కువగా ఉన్నట్లు. చేయని వారిలో అసుర భావం ఎక్కువగా ఉన్నట్లు. అలాగే మహాత్ములు మన మధ్య తిరుగుతూ ఉంటే మనం ఏం చేస్తామంటే, కొంతమందిని మెచ్చుకుంటూ ఉంటాం, కొంతమందిని తిట్టుకుంటూ ఉంటాం. మెచ్చుకున్న వాళ్ళనే మరొకసారి తిట్టుకుంటూ ఉంటాం. అంటే ఇవన్నీ ఏం జరుగుతోందంటే, మనలో ఉన్నదే మనం వ్యక్తం చేస్తున్నాం తప్ప ఎదుటి వ్యక్తి గురించి కాదు. ఒక వ్యక్తి ఎవరి గురించి మాట్లాడుతున్నా, ఎక్కువ భాగం తన గురించి చెప్పుకుంటూ ఉంటాడు, తెలియకుండా. అలా మాట్లాడడం వలన మనం ఎంత అజ్ఞానులమో తెలుస్తూ ఉంటుంది ఎదుటి వాళ్ళకి, తెలుసుకునే వాళ్లకు. అందుకనే మహాత్ముల దగ్గర మనం మాట్లాడినప్పుడు మన మాటలను బట్టి మన యొక్క స్థితి వాళ్లకు తెలుస్తూ ఉంటుంది. నిష్కారణంగా ఎవరైనా బాగుంటే అసూయపడే వాళ్ళు ఉంటారు. ఈయనకి ఏమీ ప్రత్యేకంగా ఆయన వలన అపకారం జరగక పోయినప్పటికీ కూడా, నిష్కారణంగా అసూయపడతారు. నిష్కారణంగా ద్వేషం పెంచుకుంటారు. నిష్కారణంగా ఈర్ష్య పెంచుకుంటారు. నిష్కారణంగా క్రోధం పెంచుకుంటారు. శ్రీకృష్ణుడి గురించి అట్లా రకరకాలుగా చాలామంది ప్రతిస్పందించారు. గోపికలందరూ ఒకరకంగా ప్రతిస్పందిస్తే, కంసుడు ఇత్యాదులు మరొక రకంగా ప్రతిస్పందించారు. ఈ తేడా

ఎక్కడుందంటే కృష్ణుడులో తేడా కాదు, వాళ్ళల్లో ఉండే తేడా. కంసుడు ఒకరకంగా ప్రతిస్పందిస్తే, అక్రూరుడు మరొకరకంగా ప్రతిస్పందించాడు. అక్రూరుడికి భగవంతుడు అంతర్యామి అనే భావం రాలేదు. అందరి యందు ఉంటాడు, అన్నిటియందు ఉంటాడు అని. చుట్టూ ఉండే వాళ్ళందరూ ఎక్కువగా శ్రీకృష్ణుడు భగవంతుడు అని చెప్పుకుంటూ ఉంటే ఆయనకు అంత నమ్మబుద్ధి కాదు. ఒక్కొక్కసారి భగవంతుడు ఏమో అని అనుమానం వస్తుంది. ఒక్కొక్కసారేమో... కాదు, మనలాంటి వాడే యాదవుడు అని అనుకుంటూ ఉంటాడు. మన కులంలోనే పుట్టాడు, మనలాంటి వాడే దేవుడేమిటని! గుర్తుకురాదు. కాసేపేమో దేవుడేమో అనిపిస్తుంది. అట్లా చివరి వరకు అతనికి తెమలదు. అట్లానే అంతా తెలిసిన విదురుడికి కూడా చివరి వరకు తెమలదు. కృష్ణుడు వెళ్లిపోయిన తర్వాత తెలుస్తుంది. కృష్ణుడు భగవంతునిగా... భగవంతుడే దిగి వచ్చాడు అని తెలిసేసరికి కృష్ణుడు ఉండడు విదురుడికి. ఎందుకంటే విదురుడు కూడా తనకు ఉన్న తెలివియందు చిక్కుపడ్డ వాడు. భీష్ముడికి తెలుసు. తెలిసిన వాళ్ళు ఒకరకంగా ప్రవర్తించారు, తెలియని వాళ్ళు ఒకరకంగా ప్రవర్తించారు. ఈ తెలియడం, తెలియక పోవడం వాళ్లలో ఉండే సంస్కారమే తప్ప, అసలు తత్త్వం అదే! కాబట్టి శ్రీకృష్ణుణ్ణి గుర్తించలేదంటే ఇంకెవరిని గుర్తించగలరు ఈ మానవజాతి? ఏసుక్రీస్తు వస్తే శిలువ వేసి పంపించేశారు. నువ్వు వెళ్ళిపో, మా మధ్యలోకి నువ్వు రాకూడదు అని శుభ్రంగా మేకులు కొట్టేశారు. సరే ఆయన తప్పించుకుని హిమాలయాలకు వచ్చేశారు. ఏసుక్రీస్తు చచ్చిపోలేదు. శిలువ వేసిన తర్వాత మూడు రోజుల్లో మళ్ళీ బ్రతికి, శిష్యులందరికీ కనిపించేసి, హిమాలయాలకు వచ్చేశారు. కాబట్టి అట్లా మనకు అంటే భగవత్తత్త్వం ఎప్పుడూ అన్నిచోట్లా వ్యాపించి ఉన్నా, బాగా పూర్తిగా వెలుగుగా దిగివచ్చినప్పుడే చూడలేదు మానవజాతి అంటే... కొద్ది కొద్దిగా వెలుగుగా వస్తున్నప్పుడు ఏం చూడగలరు? వాటిని కూడా ఏదైనా సందు దొరుకుతుందేమో పెద్దవాళ్ల మీద రాద్దాం అని రెడీగా ఉంటాయి మన పత్రికలు కదా! అవకాశం దొరికితే చాలు రాసేద్దాం అన్నట్లుగా ఉంటాయి ఏమి ఒకటి, అరా తప్పులు జరగకూడదా? కేవలం ఆ దృక్పథం వారి యందు. వారిని నాశనం చేసేదిగా ఉంటుంది తప్ప, ఎదుటి వ్యక్తికి దాని వలన ఎటువంటి తేడా పడదు. ఆ విధంగా మనకు అది గుర్తున్నప్పుడు ఈ శ్లోకంలో మనకు అవతార మూర్తుల దగ్గర నుంచి హరికథల వరకు, జీవులలో ఉండే లక్షణాల వరకు, వీటిలో ఉండే కాంతి వరకు భగవత్ తత్త్వాన్ని చెప్పారు. ఎవరి కన్నుల్లోకి చూసినా కాంతి కనిపిస్తుంది. గేదె కన్నుల్లోకి చూసినా కాంతి కనిపిస్తుంది. ఇది గేదె అనుకోవడం కన్నా... ఆ కన్నుల్లోకి చూసినప్పుడు భగవత్ తత్త్వం ఈ రూపంలో ఉంది అనుకుంటే ఇంక గేదె కనిపించదు కదా. నిజానికి ఏ కన్నుల్లో చూస్తే కాంతి లేదు?

మనం మామూలుగా చూసినప్పుడే ఎదుటి మనిషి కన్నుల్లోకే చూస్తాము. ఎందుకంటే సహజంగా మనమది ఎదుటి వ్యక్తిలో దానికోసం వెతుకుతూ దాన్ని చూస్తాం. అందుకనే మాట్లాడేటప్పుడు కన్నుల్లోకి చూసి మాట్లాడటమనేవి ఉన్నాయి. అందుకని ఎక్కడ వెలుగు, ఎక్కడ కళ ఉందో, అక్కడ భగవంతుని యొక్క అస్తిత్వాన్ని చూడాలి. అస్తిత్వాన్ని చూసిన తరువాత ఆనందించాలి తప్ప పొందుదామని అనుకోకూడదు. పొందుదామనుకుంటే మనకు రామాయణం కథ వచ్చేస్తుంది. బంగారు లేడి అంత కాంతివంతంగా కనిపించేసరికి ఆకర్షింపబడతాము. మనది అయినది మన దగ్గరకు వస్తుంది. మనది కాని దాని కోసం మనం పోకూడదు అనే సందేశం మనకు రామాయణంలో కనిపిస్తుంది. ఎంత దివ్యమైన స్వభావం కలిగిన వాళ్లకు కూడా ఇటువంటి కోరిక కలిగితే ఏ విధంగా కష్టాలపాలవుతారో మనకు తెలుస్తుంది.

375 సమితింజయఃసమితింజయుడంటే... సమిత అంటే సమానంగా ఉన్న వాళ్ళందరి మధ్య ఉన్నప్పటికీ కూడా, వాళ్ళకన్నా పెద్దవాడు అని అర్థం. మామూలుగా మనతో పాటే తిరుగుతూ ఉంటే మనలాంటి వాడే అనుకుంటాం. అలాగే అనుకున్నారు రాముడి గురించి. అట్లాగే అనుకున్నారు కృష్ణుడి గురించి. అట్లాగే అనుకున్నారు ఏసు క్రీస్తు గురించి. అట్లాగే అనుకున్నారు షిరిడీ సాయిబాబా గురించి. కదా. మనలో, మన వలె, కేవలం ఆకారం మాత్రం ధరించి ఉంటారు తప్ప మనకన్నా ఎక్కువే,. అది గమనించాలంటే మనలో సంస్కారం కావాలి. మనలో సంస్కారం లేకపోతే అది మనం గమనించే అవకాశం చాలా తక్కువ. ఎందుకంటే భగవంతుడు వచ్చి నేను భగవంతుడు అని చెప్పకోడు.. ఎందుకంటే భగవత్ తత్త్వము కోసం బాగా ఎదురుతెన్నులు చూస్తున్న వారికి సేద తీర్చడానికి వస్తాడు భగవంతుడు. వాళ్లకు ఆనందం ఇవ్వటానికి వాళ్లతో కలిసి మెలిసి తిరిగి, వాళ్ళ మధ్య ఉండి, వాళ్ళకు ఆ స్ఫూర్తినిచ్చి, వాళ్ళు తనలో స్థాపింపబడుట, తాను వారియందు స్థాపింపబడుట అని ఒక కార్యక్రమం జరిగిపోతుంటుంది. ఇది ఇలా ఉండగా ఊళ్లో జనానికి ఈయన కూడా మనలాంటివాడే, ఏం పెద్ద గొప్ప, అన్నట్లుగా ఉంటుంది. 2000 సంవత్సరాల తరువాత కూడా ఈరోజు మనము Israel దేశానికి వెళ్లి అక్కడ మాస్టర్ ని ప్రార్థించి, యూదుల్ని అంటే Jews ని యేసుక్రీస్తు గురించి అడిగితే మాలో ఒకడేనని చెప్తారు. ఇప్పటికి కూడా అంగీకరించరు. కరుడు కట్టిన అహంకారం అట్లా ఉంటుంది.అదే విషయం చెప్తాడు ఉద్ధవుడు విదురుడికి. శ్రీకృష్ణుడు వెళ్లిపోయిన తర్వాత ఉద్ధవుడు ద్వారా వింటాడు... శ్రీకృష్ణుడు దేహత్యాగం చేశాడు అని విదురుడు. విని బాధపడతాడు. బాధపడి, చిన్నప్పటినుండి ఎన్నో కష్టాలు పడ్డాడు ఆయన మా ఇంటికి కూడా వచ్చాడు, మమ్మల్ని అనుగ్రహించాడు, అంటూ ఏదో చెప్పకుంటాడు. తన గురించి చెప్పకుంటూ ఉంటాడు. తను ఎంత గొప్పవాడో కాబట్టి తన ఇంటికి ఆయన వచ్చాడని. చెబుతుంటే అప్పుడు ఉద్ధవుడు చెప్తాడు... మనలో మన వలె, మనలో ఒకడిగా మెలిగినప్పటికీ కూడా మనలో ఒకడు కాదు సుమా... అక్కడే ఉంది తిరకాసు, అని ఒక ఉదాహరణ ఇస్తాడు ఉద్ధవుడు విదరుడికి. ఒక సముద్రంలో చిన్న చిన్న చేపలు, పెద్ద పెద్ద చేపలు చాలా తిరుగుతూ ఉంటాయి. తిరుగుతూ ఉంటే ఒక పెద్ద ఓడ సముద్రంలో వెళుతూ ఉందనుకోండి, ఓడ కింద భాగం ఒక పెద్ద తిమింగలంలాగా, అంతకన్నా పెద్దదిగా మనకు గోచరిస్తుంది కదా. అది కూడా నీళ్లలో తిరుగుతున్నట్లుగా ఉంటుంది. తిరుగుతూ ఉంటే ఈ తిరిగే చేపలన్నీ దాన్ని

చూసి... ఇది కూడా మనలాగా ఒక చేప అనుకుంటూ ఉంటాయి. ఉద్ధవుడు ఏమంటాడంటే అది కూడా నీళ్లలో తిరుగుతూ ఉన్నప్పటికీ కూడా, నీళ్ల పైన కూడా ఉంది కదా అది. ఓడ నీళ్ల లోపల మాత్రమే లేదు, నీళ్ల పైన కూడా ఉంది. చేపలు నీళ్లకు లోపల మాత్రమే ఉన్నాయి. అంటే ఇక్కడ మాయలోపల ఉన్నవాళ్ళు ...మాయలోకి తనను తాను దింపుకున్నప్పటికీ భగవంతుడు మాయకు అతీతంగా ఉన్నవాడు. వాడిని చూసి ఈ మాయలో ఉన్న వాళ్ళు మనలాంటి వాడే వాడు, అనుకుంటారు. కానీ మనలాంటి వాడు కాదాయన. మనకు, ఆయనకు పోలికే లేదు. అట్లా అనుకోవడం వలన చాలామంది తెలిసినవాళ్లు అనుకున్న వాళ్లు కూడా ఆయన యొక్క సాన్నిధ్యాన్ని పొందలేకపోయారు, అని చెప్తాడు. చెప్పి, నీ యందు ప్రత్యేకమైన అభిమానం ఉందాయనకు. ఉండటం చేత నువ్వు తెలుసుకుని ఏదో ఒక రోజు వస్తావని ఎదురు చూశాడు. నువ్వు రాలేదు. నీకు అహంకారం అడ్డొచ్చింది. అందుకని నీకు తెలుపమని చెప్పి నాకు, మైత్రేయుడికి చెప్పాడు. వెళ్ళిపోయే ముందు ఏ రహస్యం తెలిస్తే పరిపూర్ణమైన జ్ఞానం ఏర్పడుతుందో ఆ రహస్యాన్ని నీకు అందించమని చెప్పాడు. అంటే మరి అది ముందు చెప్పమని, అడుగుతాడు ఉద్ధవుడ్ని విదురుడు. అడిగితే 'నేను చెప్పలేను. ఆయన చెప్పినది విని అనుభూతిలో నేను ఉండగలను గాని, దానిని మళ్లీ తిరిగి చెప్పే మేధస్సు నాకు లేదు. దాని యందు జీవించట్లేదు కాబట్టి. అది నీకు తెలియాలంటే మైత్రేయుడు దగ్గరకి నిన్ను తీసుకెళ్తాను' అని చెప్పి మైత్రియుని చూపించి, ప్రయాగ తీర్థంలో, త్రివేణి సంగమంలో... 'అదిగో అక్కడ ఉన్నాడు ఆయన దగ్గరికి వెళ్లి శ్రీకృష్ణుడు ఇచ్చిన బ్రహ్మోపదేశాన్ని నువ్వు పొందు' అని ఉద్ధవుడు చెప్తే, అప్పుడు మైత్రేయుడి దగ్గరికి విదురుడు వెళితే, విదురుడికి మైత్రేయుడు చెప్పినది భాగవతం! అంటే భగవంతుడి తత్త్వం ఏ విధంగా భూమి మీద ఉంటుంది, ఏ విధంగా దానిని దర్శనం చేయాలి, మన యొక్క అహంకారపు పనులు మనకు దానిని ఏ విధంగా దర్శనం చేయకుండా అడ్డుపడతూ ఉంటాయి అనేది చూపిస్తే, వెక్కివెక్కి ఏడుస్తాడు విదురుడు. ధర్మము అనే ఒక జిజ్ఞాసలో, ధర్మస్వరూపంగా భగవంతుడు దిగివస్తే చూడలేదు. పైగా జీవితంలో ఎన్నో సన్నివేశాలను చూస్తాడు. కౌరవ సభలో విశ్వరూపాన్ని దర్శింపజేసిన మహానుభావుడు. తనను కట్టివేసిన సందర్భంలో. అప్పటికీ కూడా ఇంకా దైవం... దైవమైతే యుద్ధం లేకుండా ఈ మొత్తాన్ని శాంతియుతంగా పరిష్కారం చేయవచ్చు కదా అంటాడు. శాంతియుతంగా పరిష్కారం చేయలేదు కాబట్టి ఆయన మీద కినుక. మనం ఏమనుకుంటామంటే మనం పెట్టిన conditions కి లోబడి భగవంతుడు పని చేయాలి అనుకుంటాం. ఆయన పెట్టిన conditions కి మనం లోబడదామనేది లేదు. అందుకని అందరిలో, అందరిలాగా ఉన్నప్పటికీ కూడా, వాళ్ళందరితో సమానంగా

కనిపిస్తున్నప్పటికీ కూడా సమానం కాదు. వాళ్ళ కన్నా పెద్ద! అందుకని among equals, He is one. ఆ time లో అలా దొరుకుతారు. లేకపోతే మామూలుగా ఉంటారు. కోతులతో కలిసి ఉన్న రాముడికి మామూలుగా చూస్తే ఎట్లా ఉంటుంది... కోతులు ఏమనుకోవాలి? మన సహాయం కోరాడు ఈయన... అంతే కదా. మన సహాయం కోరాడంటే మనకన్నా చిన్నవాడైపోయినట్లే కదా! ఒక్క హనుమంతుడికి తప్ప మిగతా వాళ్ళు ఎవరికీ తెలియలేదు రాముడంటే ఏమిటో. సుగ్రీవుడికి రాము బాణమునందు భయమే తప్ప రాముని యొక్క అవగాహన లేదు. తారకు రాముని యొక్క అవగాహన లేదు. రాముని యొక్క పరాక్రమమునందు అవగాహన ఉన్నది తారకు. హనుమంతునికి రాముని యొక్క దివ్యత్వమునందు పరిపూర్ణమైన అవగాహన ఉన్నది. అందుకని తాను రామకార్యం నిర్వర్తిస్తున్నా అది రాముని అనుగ్రహంగా భావించి నిర్వర్తించాడు గానీ, నేనే లంకను దాటి సీతను చూసి చెప్పకపోతే ఈ రాముడి గతి ఏమిటి? అని అనుకోలేదు. ఎందుకు అనుకోలేదు? తమలో తమతో ఒకడిగా, మిత్రుడిగా ఉన్నప్పటికీ కూడా, తాను మిత్రుడిగా భావన చేయలేదు రాముడిని. దైవంగా భావన చేసి దాసుడిగా తానున్నాడు. సుగ్రీవుడు అలా ఉండలేదు. సుగ్రీవుడితో రాముడు 'నువ్వు నా స్నేహితుడి'వని చెప్తాడు. అంటే రాముడు నా స్నేహితుడని చెప్పుకుని తిరుగుతుంటాడు సుగ్రీవుడు. దైవం దిగి వచ్చినప్పుడు అందరితో సమానంగా తాను ప్రవర్తిస్తాడు. అంత మాత్రం చేత మనము, ఆయన సమానము అనుకోకూడదు. ఆయన అట్లాగే ఉంటాడు. ఏసుక్రీస్తుని ఆయన మహత్తరమైన కార్యాలను చూసి, చచ్చిన వాడిని బ్రతికించి, గుడ్డివాళ్ళకు కళ్ళు ఇచ్చి, ఇవన్నీ చేస్తే 'మేము నమ్ముకున్నటువంటి దైవ కుమారుడివి నువ్వే' అంటే... 'నువ్వు కూడా దైవ కుమారుడివే' అని చెప్తాడు. 'నేను ఎక్కడ నుండి పుట్టుకొచ్చానో నువ్వు అక్కడ నుండే పుట్టుకొచ్చావు కదా, కాబట్టి నువ్వు కూడా ఆ దైవం యొక్క పుత్రుడివే' అంటాడు. అంటే ఆయన దైవ కుమారుడే, నేనూ దైవ కుమారుడినే కాబట్టి equal అనుకున్నాం అనుకోండి Equal అవ్వదు. Looks like, but it is not so. చాలా తేడాగా ఉంటుంది. ఎందుకంటే అందరితో సమానంగా ప్రవర్తించడం అనేది దైవం యొక్క స్వభావం. అంత మాత్రం చేత జీవుడిగా ఉన్నవాడు దైవం తో నేను సమానం అనుకుంటే అయిపోతుంది. అది కృష్ణుడి జీవితంలో కనిపిస్తుంది. రాముడి జీవితంలో కనిపిస్తుంది. రాముడు అరణ్యవాసానికి వచ్చినప్పుడు ముందు గుహుడితో స్నేహం చేసుకుంటాడు. 'నువ్వు నా సోదరుడితో సమానం' అంటాడు. అప్పుడు భరతుడు, లక్ష్మణుడు మేము ఒప్పుకోం అంటారా? అలాగే శబరి! రాముడి జీవితంలో చూస్తే ఆయన యొక్క సమభావం, సమదర్శనం చాలా అద్భుతం. బోయవాడితో, అడవి వాళ్ళతో, ఆశ్రమంలో పేడ నీళ్లు జల్లి ఎప్పుడూ శుభ్రం చేసే ఒక మనిషితో, పక్షితో,

కోతితో, రాక్షసుడితో... అలా ఎలా వీలు పడ్డది? అంత మాత్రం చేత వాళ్లతో ఆయన సమానమా, అంటే ఎప్పటికప్పుడు వాళ్లకు చూపించాడు. సన్నివేశం లేనప్పుడు మామూలుగా ఉన్నాడు. అందరిలో ఉండేది కూడా తనే కదా! ఇంకా ఏం చేస్తాడు అంటే ముని ఆశ్రమాలకు వెళ్తాడు. వెళ్తే మన ఆశ్రమానికి వచ్చి మన పాదాలకు నమస్కారం చేశాడు కాబట్టి, మనం ఆయన కన్నా గొప్ప వాళ్ళమేమో అని అనుకోలేదు మునులు. మామూలుగా అదే కదా జరగాలి. ఎవరైనా మనం ఒక ఆశ్రమం పెట్టుకుంటే, మన ఆశ్రమానికి వచ్చి మన కాళ్లకు దండం పెడితే, మనకన్నా కొంచెం ఎక్కువ కర్మలో ఉన్న జీవి పాపం, మనం అనుగ్రహించాలి అట్లా అనుకోలేదు మునులు ఎవరూ కూడా. ఎందుకంటే వాళ్లకు ఋషి దృష్టి ఉంది. అంటే లోదృష్టి ఉంటుంది. వచ్చినవాడు భగవంతుడు, మనల్ని అనుగ్రహించడానికి వచ్చాడు అని. మరి 14 ఏళ్ల అరణ్యవాసంలో 13 ఏళ్లు ఎన్నో ఋషి ఆశ్రమాలు అట్లా దర్శనం చేసుకుంటూ తిరిగాడు. పైగా లక్ష్మణుడికి వాళ్ల గురించి చాలా చక్కగా చెప్తాడు. వారు మహాత్ములూ, మనం దర్శనం చేయాలి, వాళ్ళ పాదాల స్పర్శనం చేయాలి అని. వాళ్లేమో, ఈయనను చూడంగానే భగవంతుడు తమను అనుగ్రహించడానికి వచ్చాడని, తమ తపస్సు ఫలించిందని, భావన చేసేవాళ్ళు. నేను అందరికన్నా పెద్దవాడిని కాబట్టి నేను ఎవరికీ దండం పెట్టను, నాకు అందరూ దండం పెట్టాలి... అనే తత్వం రాముని కథలో గాని, కృష్ణుని కథలో గాని కనిపించదు. సమత్వం ఉంటే అట్లా ఉంటుంది. అంత మాత్రం చేత మనతో సమానం అని అనుకుంటే దెబ్బతింటాం. ఆ సన్నివేశాలు ఎన్నో కనిపిస్తాయి మనకు ఈ భగవంతుని అవతారకథలు మనం చూసినప్పుడు. పంది లాగా వస్తే 'పందే కదా' అనుకున్నాడు హిరణ్యక్షుడు. కాదు కదా! అట్లాగే నరసింహావతారం. వామనుడిగా వస్తే మరీ చిన్న పిల్లాడు, అనుకున్నాడు. మనకీ అట్లా అనిపిస్తూ ఉంటుంది. అప్పుడప్పుడు గురువుగారికి ఏమీ తెలియదు, మనం చెప్పాలనిపిస్తుంది. ఇవన్నీ చాలా సహజంగా మనలో ఉండే భావనలు. మనం చెప్పకపోతే ఆయనకు ఎట్లా అని. వామనుడికి ఏదో చెబుదామని అనుకుంటాడు బలి చక్రవర్తి. వామనుడు పెరిగిన కొద్దీ బలి పెరగడం వలన వామనుని యొక్క తత్వం త్వరగా అవగతం అయింది. మిగతా వాళ్ళు ఎవరికీ జరగలేదు ఆ దర్శనం. మనకు సినిమాలో చూపించినట్లుగా ఉండదు. సినిమాలో అర్జునునికి చూపించిన విశ్వరూప దర్శనం యుద్ధం మధ్య లో చూపిస్తే, అందరూ చూస్తే అప్పుడే వాళ్ళు ఆయుధాలు పారేసి శరణు జొచ్చేవాళ్లు. మరీ కరుడుగట్టిన అహంకారం మూర్తులు తప్ప మిగతా వారందరూ అక్కడ పడేసి వెంటనే కాళ్లు పట్టుకోవాలి కదా! ఎవరికి దర్శనం? అర్జునుడికి దర్శనం! అంటే అర్జునుడి చైతన్యంలో ఈ వ్యాపనం జరుగుతుంది. భగవంతుని యొక్క విశ్వరూప దర్శనం అక్కడ అర్జునుడికే జరిగింది. అలాగే వామన

కథలో బలికి జరుగుతుంది, శుక్రుడికితెలుసు. అందుకనే 14 లోకాలు వ్యాపించింది ఎవరు? వామనుడితో పాటు బలి కూడా. కాబట్టి మొత్తం అంతా భగవత్ తత్వమే అని అవగాహన చేసుకున్న వాడు అయినప్పుడు, 'మొత్తం అంతా కూడా భగవత్ తత్వంతోనే నిండి ఉంది. ఎక్కడుంటే ఏమిటి లే' అనే భావం కలుగుతుంది. అంతకు ముందు వరకు ఇంద్ర సింహాసనం మీద కూర్చుందామనుకున్నవాడు/కూర్చున్న వాడు ఆ తరువాత ఎక్కడ కూర్చున్నా ఒక, ఇదేమీ పెద్ద విశేషం కాదు అని తెలిసి దానిని పక్కన పడేసి, ఆయన కూర్చోబెట్టిన చోట కూర్చుంటాడు. ఎందుకు జరిగిందంటే ఆయనలో ఏర్పడిన వికాసం. వామనుడి యొక్క త్రివిక్రమత్వం. బలికి జరిగిన దర్శనం. అంతేగాని ఆ చుట్టుపక్కల వాళ్ళందరికీ జరుగిన దర్శనం కాదు. ఎప్పుడు ఇటువంటి దర్శనం జరిగినా అది ఆ వ్యక్తికే పరిమితం! అతను వర్ణిస్తే మనమందరం ఓహో, అనుకుంటాం. కానీ ఈ విధంగా మరి ఏ రూపంలో వస్తాడో మనకు తెలియదు కదా! వచ్చిన వాడి రూపంలో పరీక్షగా మనం కనుక చూసినట్లయితే, కొంత కొంతమంది లోంచి తానే వచ్చి మనకు రక్షణ కల్పిస్తాడు. మనకు వికాసాన్ని కలిగిస్తాడు. మనకు దారి చూపిస్తాడు. అందుకని ఎప్పుడూ అప్రమత్తతో కన్నులు తెరుచుకుని వెతికే వాళ్ళుగా ఉండాలట. బాగా పరీక్షించాలిట. పరీక్షగా చూడాలిట. ఎవరి నుంచి భగవంతుడు వచ్చి ఏమి చేస్తాడోనని. మన చుట్టూ ఉండే వాళ్ళలో ఎవరిలో నుంచి వ్యక్తమవుతాడో మనకు తెలియదు. కాబట్టి అట్లా వ్యక్తం అయ్యే తత్వాన్ని పరీక్షగా చూసుకుంటూ ఉంటే ఒక్కొక్కరిలో నుంచి ఒక్కొక్క రకంగా వ్యక్తమవుతూ ఉంటాడు. మనకు నీతిచంద్రికలో సింహం, ఎలుక కథ ఉన్నది. ఎలుక ఒకసారి బంధింపబడిన సందర్భంలో సింహం సహాయం చేస్తుంది. చేసినప్పుడు ఎలుక ఏం చెప్తుందంటే... ఏదో ఒక రోజున భగవంతుడు అనుగ్రహిస్తే నేను నీకు కూడా సహాయం చేస్తాను, నీ ఋణం తీర్చుకుంటాను, అంటుంది. సింహం నవ్వుతుంది. నువ్వేం సహాయం చేస్తావు నాకు? ఏమనుకుంటున్నావు నీ గురించి? అంటుంది. ఎందుకు చేయకూడదు... దేవుడు అనుకూలిస్తే ఏదో ఒక రోజు చేసే ఋణం తీర్చుకోవాలి కదా, అని అంటుంది ఎలుక. ఏడిశావులే, పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడవద్దు, హాయిగా రక్షింపబడ్డావు కదా, పొమ్మని చెప్తుంది సింహం. ఆ తర్వాత ఏదో కొనాళ్ళకి సింహం వలలో పడుతుంది. వలలో పడితే అప్పుడు ఎలుక అటుగా వెళుతూ చూస్తుంది. చూసి ఇలా ఇరుక్కున్నావా, అని చెప్పి గబగబా ఆ వలంతా కొరికేసి సింహాన్ని రక్షిస్తుంది. ఆ రుణం తీర్చుకున్నాను, అని చెప్తుంది. అప్పుడు సింహం అట్లా గుడ్లు తేలేస్తుంది. అందుకని ఎవరి నుంచైనా, మనం చాలా చిన్నవాళ్ళు అనుకున్న వాళ్ళ నుండి అయినా కూడా మనకు దర్శనం జరుగుతుంది. చాలా చిన్న సన్నివేశంలో కూడా దర్శనం జరుగుతుంది. అంటే భగవంతుడు మరి అన్నింటిలోనూ

ఉన్నప్పుడు ఎక్కడి నుంచైనా మనల్ని ముట్టుకోవచ్చు కదా! ఐదు ఇంద్రియములలో ఏ ఇంద్రియం ద్వారానైనా మనలోకి ప్రచోదనం కలిగించవచ్చు. హిరణ్యకశిపుడికి స్తంభం నుంచి వచ్చినట్లు, ఈ మామిడి చెట్టు లోంచి దర్శనం జరగవచ్చు. ఎవరికి? ఆ విధంగా ఎదురుచూస్తున్న వారికి. చూస్తే ఏమవుతుందంటే మనకు మామూలుగా గోచరించిన వాడు, మనకన్నా చాలా పెద్దవాడు. భగవంతుడు 'అతులుడు' అంటే తూకం వేయలేనటువంటి వాడు. కాబట్టి అందరిలో తాను సమానంగా ఉన్నప్పటికీ కూడా, అతనిని దర్శించే వాళ్ళు తనతో సమానంగా దర్శనం చేయకూడదు. అందుకే అందరితో సమానంగా ఉంటున్న వాళ్ళని చూసినప్పుడు, వాళ్ళు చేసే పనులను బట్టి వాళ్ళు అసామాన్యులని గుర్తించి, వారి యందు ఎక్కువ భక్తిశ్రద్ధలు కలిగి ఉండాలి. కారణమేమిటంటే వారియందు ఆ తత్త్వం ఎక్కువ పని చేస్తుంది. అసలు ఆ తత్త్వమే వచ్చిందనుకోండి వస్తే ఇంకా బాగా అందుకోవాలి. అందుకని దాన్ని దర్శించడానికి కావలసిన సామాగ్రి ఏమిటయ్యా అంటే, పరీక్షగా అప్రమత్తతతో దానిని దర్శిస్తూ ఉండాలి. మామూలుగా మనం అలా రోడ్డు మీద వెళుతూ ఉంటే ఎవరో పిచ్చివాడిలా అనిపించవచ్చు. మనం షిరిడి సాయిబాబా కథలో చదువుకుంటే అట్లాగే తిరుగుతాడని తెలిసింది. దత్తాత్రేయుడు ఎప్పుడూ ఉన్మత్త వేషంలో అలా తిరుగుతూ ఉంటాడు. అందుకని మనం ఎవరి గురించి ప్రార్థనలు చేస్తున్నామో వాళ్లు మన పక్క నుంచి వెళ్లి మనతో మాట్లాడదాం అనుకుంటే మనం చూడలేదనుకోండి, మనం వినలేదనుకోండి. సాయి లీలామృతం కథలన్నీ అవే కదా! దత్తాత్రేయుడి గురించి తెలిపేవి అన్ని కథలు అలాటివే. అందుకని భగవత్ తత్త్వం మనం దర్శనం చేయాలనుకుంటే అప్రమత్తత కలిగి ఉండాలి. ప్రత్యేకించి మహాత్ముల విషయంలో మనలాంటి వాడే, అని అనుకోకూడదు. అవతార పురుషుడినే మనలాంటి వాడు అనుకున్న జాతి మనది. కాబట్టి మనకన్నా కొద్దిగా ఎక్కువ అతనెప్పుడూ. మనకు, ఆయనకు పోలిక లేదని తెలిసి ఉండాలి. అదే ఉద్ధవుడు చెప్పిన పడవ, చేప ఉపమానం. పడవ తేలుతుందనేది సముద్రానికి సంబంధించినది కాదు. పడవ సముద్రంలో నుంచి బయటకు వస్తే చచ్చిపోదు. చేప సముద్రం నుంచి బయటకు వస్తే చచ్చిపోతుంది. మనతో పాటే తిరుగుతున్నట్టే ఉంటాడు తప్ప, మనవాడు కాదు. మానవుల్లో మానవుడిగా పుట్టినంత మాత్రాన మానవుడు కాదు. దైవము మానవరూపం ధరించిందని తెలుసుకోవాలి. ఆ అవగాహన మనం తగ్గి ఉండడానికి పనికొస్తుంది. హనుమంతుడికి అలా కనిపించింది రాముడు గురించి. మిగతావారికి అలా కనబడలేదు. అలాగే కృష్ణుడిని చూస్తే కొంతమందికి కనిపించింది. కొంతమందికి కనబడలేదు. కనబడిన వాడు ఉద్ధరింపబడ్డాడు, కనబడని వారు తమ యందు ఆ చైతన్యం యొక్క వికాసం జరగే ఒక అవకాశం కోల్పోయారు.

376 విక్షరః

విక్షరుడు అంటే క్షరము కాక అక్షరం గా ఉన్నవాడు అని అర్థం. అక్షరం అంటేనే క్షరము కాని అని అర్థం, అక్షరములో, మరీ అక్షరమైన అక్షరముగా ఓంకారాన్ని చెప్తారు పెద్దలు. ఈ ఓంకార స్వరూపముగా భగవంతుడు ఉన్నాడు అని మనకి తెలియపరచడానికి, ఈ ఓంకారాన్ని ఒక భగవంతుని నామం గా మనం చెప్పుకోవడం జరుగుతుంది. విక్షరుడు అంటే శాశ్వతమైన, నశింపబడని అక్షరముగా ఉన్న భగవతత్త్వం అని అర్థం. ఓంకార స్వరూపుడిగా అన్నిటియందు తాను ఉండుట చేత, ఈ సమస్తమైన సృష్టి నిలిచి ఉన్నది అనేది ఈ నామం ద్వారా మనకు ఎక్కువ అవగాహన అవుతుంది. మనము ఉన్నామంటే మనలో ఈ ఓంకార నాదం ఉండబట్టి ఉన్నాం తప్ప, మన అస్తిత్వము అంతకంటే వేరుగా లేదు. ఓంకారం ఉండడం చేత, దానిలోంచి ఉద్భవించే చైతన్యం కారణం చేత, ఆ చైతన్యం ఆధారంగా భావములు రావడం చేత, ఆ భావములు ఆధారంగా మనము బహిర్గతమైన సృష్టిలో ప్రవర్తిస్తూ ఉన్నట్టుగా ఉన్నాము. నిజానికి ఉన్నది ఓంకారం, మనం ఉన్నది అంటే ఓంకారమే! అందుకనే భగవద్గీతలోని ఎనిమిదవ అధ్యాయం అయిన అక్షర పరబ్రహ్మ యోగం లో, భగవానుడు అయిన శ్రీకృష్ణుడు, నేను 'ఓంకార స్వరూపుడను' అని చెబుతాడు. 'ఓంకారుడుగా శాశ్వతడును' అని చెబుతాడు. నీవు కూడా అలాగే ఓంకార స్వరూపుడవే! తనను తాను ఎవరైతే ఓంకార స్వరూపుడిగా ఎరుగుతారో, వారు మృత్యువు నుంచి బయట పడినవారు, 'ముముక్షువులు' అని చెప్తారు. అంటే మనలో, మనం ఎలా ఉన్నాము అనే భావన చేసుకున్నట్లయితే, మన భావనలు మనకి కలగని స్థితి లో మనమున్నప్పుడు, మనకి శబ్దము, వెలుగు రెండూ ఒకేసారి గోచరించినప్పుడు, మనం వెలుగు స్వరూపము అని ఎంత అనుకుంటే, అంత శబ్ద స్వరూపము కూడా! శబ్దము, వెలుగు మధ్యలో అవినాభావమైన సంబంధం ఉన్నది. శబ్దం వల్ల వెలుగు వస్తుంది. వెలుగు ఆధారంగా భావము ఉద్భవం అవుతాయి. మనము రాత్రి నిద్రలో ఉన్నప్పుడు శబ్దస్వరూపుడిగా ఉంటాం. పొద్దున్న మేల్కాంచినప్పుడు వెలుగు స్వరూపుడుగా గా మేల్కాంచుతాము. వెలుగు కారణంగా భావములు వస్తూ ఉంటాయి. భావములు కారణంగా మనం ఈ సమస్తమైన కార్యాన్ని నిర్వర్తిస్తూ ఉంటాము. కాబట్టి మనలో, మనముగా ఉన్నది ఓంకారం! అది సుషుమ్న నాడిలో మనకు వినిపిస్తూ ఉంటుంది అని పెద్దలు చెప్తారు. దానిని అనుభూతి చెందడం కోసమే తపస్సు చేస్తూ ఉంటాము. 'ఓం ఇత్యే కాక్షరం బ్రహ్మ', అంటుంటాం కదా! ఈ ఏకాక్షరమే బ్రహ్మతత్త్వం! కాబట్టి ఈ తత్త్వంగా మనలో ఉన్న దాన్ని ఆధారంగా చేసుకొని అది మనం అయితే, అక్కడ్నుంచి మనం అవస్థితులు

చెందుతూ ఉంటాం. ఎటువంటి అవస్థితులు చెందుతూ ఉంటాం అంటే, మనకి తెలివి వచ్చింది అని అనుకుంటాం ప్రారంభ్దన్నే. ఆ తర్వాత మనకి భావాలు వస్తుంటాయి, ఆ భావాలు పట్టుకొని మన ఇంద్రియాలు, శరీరం ద్వారా పనిచేసుకుంటూ వెళుతూ ఉంటాం. కానీ ఈ జరుగుతున్న మొత్తం వ్యాపారం అంతటికీ కూడా వెనకాల ఆధారంగా ఉన్నది ఓంకారం. అందుకని మనకి మనం, మనలో భగవత్ తత్త్వం ఓంకార స్వరూపంగా ఉన్నది, అక్కడ నుంచి అవస్థితి చెందిన పరిస్థితిలో మనల్ని మనం మరిచిపోయినప్పుడు, జీవుడుగా మనకి మనమే ఒక బంధం ఏర్పరచుకుంటాం. జీవుడు సహజంగా దైవము యొక్క అంశ అయినప్పటికీ కూడా దాని నుండి అవస్థితి చెందడం చేత, తాను వేరుగా తనని గుర్తించడం చేత పరిమితుడు. అందుకని మనం ఓంకారనాదాన్ని ఉచ్చారణ చేస్తున్నప్పుడు, మళ్ళీ ఒక్కసారి జీవుడు దైవంతో ఐక్యం చెందడానికి నిత్యమైన సాధనా మార్గంగా ఓంకారం వినిపిస్తుంది. అందుకని ఓంకారం చేసుకోమని చెప్తారు. ఓంకారం నిత్యం చేసుకున్నప్పుడు దానిలో ఉన్న ముఖ్యమైన 'ఓం' అనే శబ్దం మనం పలికిన తర్వాత, లోపలి నుంచి మళ్లీ 'ఓం' అని ప్రతిధ్వనిగా మనకు వినిపిస్తూ ఉంటుంది. నిజానికి లోపల ఓంకారం జరుగుతూ ఉంటే దానికి ప్రతీకగా మనం బయట ఓంకారం చేస్తూ ఉంటాం. కాబట్టి లోపల జరిగే ఓంకారం, దైవతత్త్వం అయితే, పరమాత్మ తత్త్వం అయితే, దానికి ప్రతీకగా మనం చేసే ఓంకారం, జీవుడు చేసే ఓంకారంగా ఉంటుంది. ఈ ఓంకారం నుంచి సమస్తమైన శబ్దములు, సమస్తమైన వెలుగులు, సమస్తమైన శక్తులు, దేవతలు, సృష్టి ధర్మాలు ఇవి అన్ని ఉద్భవించినాయి అని పెద్దలు చెప్తారు. కాబట్టి సమస్తానికి ఏది ఆధారమైనదో దానిని ఓంకారం గా లేదా విక్షరుడు గా మనకి విష్ణు సహస్రనామములో భగవంతుడు నామముగా ఇవ్వబడి ఉంది. మనము ఈ ఓంకారం చేసేటప్పుడు, మన లోపల ఎక్కడి నుంచి ఉద్భవిస్తూ ఉన్నదో మొదట గమనించాలి. యాంత్రికంగా ఉండడం, చేయడం కాకుండా, ఓంకారం చేసేటప్పుడు మొదట దానిని మనం వింటూ ఉండాలి. వింటూ, అంటూ ఉండాలి. ఆ తరువాత మనం అనకుండా వినడం జరుగుతుంది. అనకుండా వినడం కోసమే ఉచ్ఛ్వాస, నిశ్వాస ద్వారా 'సోహం' అనే శబ్దం విని, ఆ సోహం నుంచి 'ఓం' అనే శబ్దాన్ని మనము అనుభూతి చెందడానికి ఒక మార్గం ఉన్నది అని, యోగమార్గంలో పెద్దలు నిర్దేశిస్తారు. రోజు మనం ఆ విధమైన ఆసనము, ప్రాణాయామము, ప్రత్యాహారము అనే యోగాంగములు యందు శ్రద్ధాభక్తితో, సాధన చేసే వారికి అవి స్పష్టంగా గోచరిస్తాయి. ఈ ఓంకారం లో మూడు అక్షరాలు ఉన్నాయి. 'అ', 'ఉ', 'మ' అని. అందులో ఈ మూడు కూడా త్రిమూర్తి తత్త్వంగా చెబుతారు. ఒకే పరమాత్మ త్రిమూర్తులుగా దిగిరావడం గా, 'అ' అంటే శివుడని, 'ఉ' అంటే విష్ణువు అని, 'మ'

అంటే బ్రహ్మ అని చెప్తారు. లేకపోతే, 'అ' అంటే తండ్రి అని, 'మ' అంటే తల్లి అని, 'ఉ' అంటే ఆ ఇద్దరి నుంచి దిగి వచ్చిన చైతన్యం అని. ఈ విధంగా మనకి రకరకాలుగా ఇదే విషయాన్ని చెబుతారు. 'అ' అంటే శివుడని, 'మ' అంటే ప్రకృతి అని, 'ఉ' అంటే శక్తి అని, శక్తి, శివుడు, ప్రకృతి ఈ మూడు అక్షరాలకి. వీటినే మనకి ఒక్కొక్క భాషలో ఒక్కొక్క విధంగా, ఒక్కొక్కమతం లో చెప్పుకుంటారు కొంతమంది, 'అ' అంటే తండ్రి అని, 'మ' అంటే తల్లి అని, 'ఉ' అంటే దైవకుమారుడు అని చెప్పుకుంటారు. ఇదే మనకు ఒకే తత్త్వం మూడు శక్తులుగా దిగి వస్తే, ఇచ్ఛా శక్తి, జ్ఞాన శక్తి, క్రియాశక్తిగా దీని గురించి చెప్పుకుంటారు ఈ మూడు. 'ఓం' నుంచి పుట్టిన సమస్తమైన అక్షరములు కూడా మళ్లీ తిరిగి ఓంకారంలోకి లయమవుతూ ఉంటాయి. మళ్లీ ఓంకారం నుంచి బయటకు వస్తుంటాయి. కాబట్టి మనకు అన్ని మంత్రములకు కన్నా అతి ముఖ్యమైన మంత్రం ఓంకారం. ఓంకారం లేకుండా ఏ మంత్రమూ ఉచ్ఛారణ చేయరు. ఎందుకని అంటే అదే ప్రథమమైన శబ్దము, ఆ శబ్దం నుంచే మిగతా శబ్దాలు అన్నీ పుట్టాయి కాబట్టి, మిగతా మంత్రాలు చేసిన చేసుకోకపోయినా, ఓంకారం చేసుకుంటే అన్ని మంత్రాలు చేసినట్టు అవుతుంది. ఏ మంత్రం చేసినా దానికి ముందు 'ఓం' అనేది, భావన చేసి, ఉచ్ఛరించి, మంత్రాన్ని ఉచ్ఛరిస్తే, ఎక్కువ సిద్ధిస్తుందని అని కూడా పెద్దలు చెబుతూ ఉంటారు. ఈ సమస్తము 'ఓం' కారం గానే బయటికి వ్యక్తం అయింది అని, ఓంకారం గనక ఆగిపోతే, సృష్టి లీనం అయిపోతుందని అని కూడా చెప్తారు. మనలో ఓంకారం ఆగిపోతే, ఈ మొత్తం అంతా పడిపోతుంది. అలాగే ఈ భూమి ఇరుసులో ఓంకారం జరగడం వల్ల, భూమి తన చుట్టూ తాను తిరుగుతూ, సూర్యుని చుట్టూ తిరగడం, ఏ ఆధారం లేకున్నా తిరుగుతుంది అనుకుంటాం! అది ఓంకారం కారణంగా తిరుగుతుంది. అలాగే సూర్య మండలం, అలాగే మొత్తం సృష్టి మండలం అంతా కూడా ఓంకారం ఆధారంగా జరుగుతుంది. 'అ' అనే శబ్దం ఉచ్ఛరించడం చేత ఏర్పడి సృష్టి, 'ఉ' అనే శబ్దం కారణంగా నిలబడి ఉండట, అది 'ఉమ్' అని పూర్తి చేసేస్తే మొత్తం అందులోకి వెళ్ళిపోతుంది. అందుకని ఓంకారం ఎడతెరిపి లేకుండా జరుగుతూ ఉంది సృష్టిలో అని చెబుతారు. సృష్టిలో జరుగుతున్న ఓంకారమే మనలో కూడా జరుగుతుంది. కాబట్టి మనలో జరుగుతున్న ఓంకారం తెలుసుకుంటే, సృష్టిలో ఓంకారం ఏ విధంగా శాశ్వతంగా ఉందో, మనలో మనం శాశ్వతుడిగా ఏ విధంగా ఉన్నామో తెలియడానికి అవకాశం ఏర్పడుతుంది. ఈ విద్యనే 'అమృతత్వ విద్య' అని కూడా చెప్తారు. అందుకని ఓంకార స్వరూపుడిగా మనల్ని మనం ఎరగడము అనేది ముఖ్యమైన సాధనగా మనకి, అష్టమ అధ్యాయం, భగవద్గీతలో ఇవ్వబడి ఉన్నది. దానిని మనం ఏ శబ్దం చేసినా, చేయకపోయినా, ఓం అనే శబ్దాన్ని ఉచ్ఛరిస్తూ మన చుట్టూ, మన లోపల వ్యాప్తించి ఉన్న తత్వంతో మనము

అనుసంధానం చెందడానికి ప్రయత్నం చేయాలి. యాంత్రికంగా ఓంకారం ఉచ్చారణ చెయ్యకూడదు. భగవంతుడిని పిలుస్తున్నట్లుగా ఉచ్చారణ చెయ్యాలి. అందులో మనం ఇమిడిపోవాలి. ఇమిడి పోయాక. చూస్తూ ఉంటే కదలికలు ఉంటాయి. అదే మాస్టరుగారు నీ లోతట్టున ఏమి జరుగుతున్నదో గమనించండి, అన్నది. ఆ కదలికలు శబ్దం వల్ల కలుగుతున్నట్లు తెలుస్తాయి. ఆ శబ్దము తెలుసుకుంటే ఓంకార నాదము తెలుస్తుంది. అది ముందు రెండు అక్షరాల సోహంగా వినిపిస్తుంది తర్వాత ఏకాక్షర శబ్దం గా వినిపిస్తుంది. ఆ ఏకాక్షర శబ్దంలో మనము ఇమిడిపోయినప్పుడు మనకి దేహ భావము పోతుంది. ఆత్మగా మనము ఎలా ఉన్నామో మనకి తెలుస్తుంది. చూట్టూ ఉండే రూపములు మనకి గోచరము కావు. సమస్తము ఒక నీలాకాశముగా, అవధులు లేని ఆకాశము గా గోచరిస్తుంది. దానిలో తను ఉన్నాడని తెలుస్తుంది గానీ, ఎలా ఉన్నాడో తనకు గోచరించదు. మొత్తములో తను ఉండడం గా , తన ఎరుక కలిగి ఉంటాడు. కాని తనకి ఒక రూపం ఉన్నదని, ఒక నామము ఉన్నదని కాక ఉన్న స్థితి. అందుకని ఓంకారము ప్రత్యేకించి ఇప్పుడు ఉన్న సమయానికి పరమ గురువులు 21 సార్లు ఓంకారం చేసుకోమని చెప్పారు. దాని వలన మనిషి తనని తాను చక్కగా నిర్మాణం చేసుకోగలరని చెప్తారు. అదే ప్రతిరోజు మధ్యాహ్న సమయం లో 21 సార్లు ఓంకారం ఉచ్చారణ చేసుకోవడం ఒక సూత్రం గా పెట్టుకుని, ప్రారంభం చేసుకున్నాం. ఏది చేసినా చేయకపోయినా బయట, లోపల ఓంకారం వింటూ ఉండాలి. అంటూ వినడం వల్ల దానితో అనుసంధానం చెందడం జరుగుతుంది. రాత్రి పడుకునేటప్పుడు అది వినడం చేత ఎక్కువ దాంట్లో వెళ్లడానికి అవకాశం ఉంటుంది. పగటిపూట సమయం దొరికినప్పుడు దాన్నే ఉచ్చారణ చేయాలి. రాత్రిపూట దాన్నే ఉచ్చారణ చేయాలి. యోగులందరూ దాన్నే వింటూ ఉంటారు. దానియందే లగ్నమై ఉంటారు. 'నిత్యం ధ్యాయంతి యోగినః'! దానితో ముడిపడి ఉంటారు. పనులు ఏమైనా ఉంటే బయటికి వచ్చి పనులు చేసుకుని మళ్లీ దాంట్లోకి వెళ్లిపోతూ ఉంటారు. ఓంకారం యోగులందరికీ, ఋషులందరికీ కూడా వాళ్ల పుట్టుకస్థానం గా, స్వస్థానంగా భావించి దాంట్లో జీవిస్తూ ఉంటారు. అవసరమైతే వ్యక్తమవుతూ ఉంటారు. లేకపోతే ఎప్పుడూ దాంట్లో ఇమిడి ఉంటారు. ఓంకారంలో ఇమిడి ఉండి, ఓంకారం నుంచి బయటికి వచ్చి పనులు చేసుకుని, మళ్లీ ఓంకారం లోకి వెళ్లిపోవాలి. ఏ పనీ లేనప్పుడు ఎందులో ఉండాలి అంటే, ఓంకారంలో ఉండాలి. పనులు ఏమైనా ఉంటే పనులు చేసుకోవాలి. అప్పుడు ఓంకారం ఎలాగా గుర్తు ఉండదు. పనులు పనులు చేసుకునేటప్పుడు ఓంకారం గుర్తు ఉండడం సిద్ధులు కి జరిగే విషయం. సాధకులు పనులు తొందరగా ముగించుకుని ఓంకారం లోకి వెళ్లే ప్రయత్నం చేయాలి. ఓంకారంలో ఉన్నంత సేపు ఎంత రుచిగా ఉంటుందంటే అక్కర లేని పనులు

చెయ్యబుద్ధి కాదు. అవసరమైనప్పుడు కర్తవ్యోన్ముఖుడై ఉంటాడు కాబట్టి, ఓంకారం లోంచి బయటకు వచ్చి చేస్తాడు, కర్తవ్యం లేనప్పుడు మళ్ళీ ఓంకారం లోకి వెళ్ళిపోతాడు. అందుకే శమీక మహర్షి రాజయిన పరీక్షిత్తు తన మెడలో చచ్చిపోయిన పాము వేస్తే, తనే తప్పు చేశానని చెప్తాడు. ఒక రాజు తన ఆశ్రమానికి వచ్చినప్పుడు ఆయనకి ఆతిథ్యం ఇచ్చే కర్తవ్యం తనకి ఉన్నప్పుడు, తను నిజంగా ఓంకారంలో ఇమిడి ఉంటే కర్తవ్యోన్ముఖుడై ఉంటాడు కాబట్టి, కర్తవ్యం మరచి సాధన జరగదు కనుక అది సరిగ్గా జరగలేదని బాధపడతాడు. అలాగే అగస్త్య మహర్షి కూడా గజేంద్రుడికి శాపం ఇస్తాడు. ఇంద్రద్యుమ్నుడు అనే ద్రవిడ దేశపు రాజు కూడా విష్ణువు గురించి తపస్సు చేస్తూ అందులో మునిగిపోతే నిజంగా భగవత్ జ్ఞానంలో మునిగి ఉన్నవానికి ఎరుకపోదు, ఎరుక పెరుగుతుంది. ఆత్మజ్ఞానం పెరుగుతున్నప్పుడు మనిషి బాగా చురుకుగా ఉంటాడు. శక్తివంతుడుగా ఉంటాడు. పదునుగా ఉంటాడు. చాలా చలాకీగా ఉంటాడు. యుక్తిమంతుడుగా ఉంటాడు. చాలా యోగ్యుడుగా ఉంటాడు. చాలా స్థైర్యం, ధైర్యం కలిగి ఉంటారు. ఎందుకంటే అంతా ఓంకారం లోంచి వచ్చినవి కదా! అప్పుడు పెద్ద వెలుగు అయిన అగస్త్యమహర్షి అతని దగ్గరకు నడిచి వస్తుంటే, అది గమనించక విష్ణుధ్యానం చేస్తున్నానే భావం లో ఉన్నాడు. అంటే చాలా చివాట్లు పెడతాడు, ఇలాగ కాదు తపస్సు అని, ఇంద్రద్యుమ్నుడు ఓంకారం లా తయారు అవ్వాలని ఏనుగుగా పుట్టమని శాపం పెడతాడు. కాబట్టి అగస్యుడు అతనిని మూఢ, అని సంబోధిస్తాడు అంటే తెలివితో కూడిన తపస్సు కాదని, లుబ్ధా అంటే పిసిని కొట్టు వాడా అని కూడా సంబోధిస్తాడు. ఎందుకంటే కనులు తెరిస్తే తనకి విష్ణువు ధ్యానం పోతుందని అనుకుంటాడు ఆ రాజు. వచ్చిన వాడు కూడా విష్ణువే కదా! వచ్చినవాడే నారాయణుడు అని అనుకోమంటారు. అగస్త్యుడు వచ్చినప్పుడు విష్ణువు గా చూడక కళ్ళు ఇంకా గట్టిగా మూసుకుంటాడు. ఇలాగ చాలామంది తపస్సు పేరున ఎరుక కోల్పోతారు. తపస్సు ఎరుకపోవటానికి కాదు ఎరుక రావటానికి. ఎరుక సమస్తమైన సృష్టిలో, లోపల బయట ఉన్న సృష్టిలో ఎక్కువ మనం మేల్కాంచి ఉండడం జరుగుతుంది. అలా మేల్కొంచి ఉంటారు ఋషులు. అలా మేల్కొంచి ఉంటాడు బ్రహ్మ. బ్రహ్మ కూడా సృష్టి జరుగుతున్నప్పుడు తను దాంట్లో మేల్కాంచి ఉంటాడు. మేల్కొని తన నుంచి సృష్టి వ్యక్తం అవుతూ ఉంటే చూస్తూ ఉంటారు. అలాగే ఓంకారంలో మనం ఇమిడి ఉంటే ఏ విధంగా సమస్తం మనలోంచి వ్యక్తం అవుతుందో, కార్యరూపం దాలుస్తుందో చూసి మనం ఆనందిస్తూ ఉండాలి, సాక్షి భూతంగా. ఈ జీవితం మనది అనుకుంటాం కదా! అది మనది కాదని తెలుస్తోంది. మన నుండి మన జీవితం జరుగుతోంది అనుకుంటాం కదా! అది మన జీవితం కాదని తెలుస్తుంది. భగవత్తత్త్వంమైన మన జీవితం అనుభూతిపరంగా

ఆనందింప చేయటానికి, సాక్షి భూతంగా నిలపటానికి మనకి అవకాశం ఇస్తుంది. ఓంకార సాధన అన్నింటికీ మించినటువంటి సాధన. అందుకని ఋషులు, యోగులు, మునులు అడవి ప్రాంతంలో గాని, కొండల మీద గాని ఓంకారం చేస్తూ, వింటూ, ఓంకారంలో ఇమిడిపోయి ఉంటారు. వారికిక శరీర భావం ఉండదు. అంత చేయలేకపోయినా మనం సంసారంలో ఉన్నా ఓంకారంలో కనీసం ముడిపడి ఉండటం ముఖ్యం. ఎందుకంటే ఓంకారం శాశ్వతమైనది. అది మనలో సత్యం అయితే అది కూడా మనము కూడా శాశ్వతం అని తెలుస్తుంది. ప్రతి వాళ్లు ఓంకారం యొక్కవ్యక్తరూపాలే కాబట్టి ఆ తత్త్వం అవగాహన చేసుకోవడానికి మానవ ప్రయత్నం చేయాలి. అది మనలో స్థిరపడడానికి ప్రయత్నించాలి. అందుకని మూడుసార్లు ఓంకారం చేస్తున్నాం మనం. దాంట్లో మొదటి ఓంకారం తో మనలో మనవలె ఉన్న దైవంతో ముడి వేసుకుని, రెండవ ఓంకారం తో బయట ఉన్న భగవంతుడితో ముడి వేసుకుని, మూడవ ఓంకారం తో లోపల, బయట అంతటా వ్యాపించి ఉన్న భగవంతునితో ముడి వేసుకుని కూర్చోవాలి. ఎప్పుడూ మనకి మనసులో ఒక programme ఉంటుంది. ఈ ఓంకారం తర్వాత ఏమి చేయాలి, అదైపోయింతర్వాత ఏమి చేయాలి ఇలా... అందుకే మనకి ఏదీ అవ్వదు. మొదలుపెట్టినప్పుడు ఎలా ఉన్నావో, తర్వాత కూడా అలాగే ఉన్నావు. ఏమి లాభం? అస్సలు ఓంకారం చేస్తున్న వాడు దాంట్లో లయం అయిపోతాడు. ఇంక గురుబ్రహ్మ - - - మొదలైనవి ఏమీ లేవు. వాడికి పరిసరాలు తెలియవు. మనకి మనసులో భావాలు ఎన్ని ఉంటాయంటే prayer ఎప్పుడు అయిపోతుందా అని చూస్తూ ఉంటాం. అన్నీ అనేస్తాం. అనుసంధానం చెందుతున్నామన్న భావన కూడా ఉండదు కదా! అయిపోయిందీ పూటకి అనుకుంటాము. ఓంకారం ఉచ్చరించిన తర్వాత, గట్టిగా నువ్వు ఎవరి కోసము ఉచ్చరించావో ఆయనతో కూర్చొని ఆయనతో మాట్లాడుకోవాలి. ఓంకారం చేస్తున్నప్పుడు దాని మూలాన్ని గమనించే ప్రయత్నం చెయ్యాలి. ఒక్కసారి గట్టిగా, మనఃస్ఫూర్తిగా హృదయములో నుండి వచ్చే ఓంకారాన్ని ఉచ్చారణ చేస్తే శబ్దంగా మారుతున్నది కదా!అది నిశ్శబ్దంగా ఎక్కడ నుండి బయలుదేరి వచ్చింది? మనకు శబ్దంగా వినబడే ముందు అది ఉండడం వల్ల కదా బయటకి వచ్చింది. ఎట్లా వుంది? నిశ్వాసగా వున్నది. నిశ్వాస ఎక్కడ నుండి వస్తోంది? నిశ్వాస వచ్చే స్థానం 'హృదయ స్థానం' అంటారు. ఎంతవరకు పీలుస్తాం? బాగా గుండెలు నిండేవరకు పీలుస్తాం. పీల్చాక అక్కడ నుండి వదులుతాము కదా! వదిలే ముందు అది 'అనాహతం' గా వుంటుంది. ఆ తర్వాత 'ఆహతం' గా గొంతు వద్దకు వచ్చి చేరుతుంది. గొంతు నుండి బయటకు వినబడే ఉచ్చారణ అయేలోగా అది వున్న స్థానం, ప్రయాణం చేసే స్థానం మనం గమనించాలి.

గమనించి, హృదయంలోకి వెళ్తే, అక్కడ శబ్దం expansion and contraction గా, లేదా వికసించి, మళ్ళీ ముకుళించే రెండు శబ్దములుగా వినిపిస్తుంది కదా! అలా రెండు అక్షరములుగా, రెండు శబ్దములుగా వినిపించేదే 'సోహం'. ఆ శబ్దం ఓంకారం బాగా చేస్తే వినిపిస్తుంది. ఓంకారం చేసి ఆపిన తర్వాత దానిని వినడం సులభం. 'ఓం' ఆధారంగానే 'సోహం' వచ్చింది. ఆ శబ్దాన్ని వింటూ కూర్చోవడమే 'తపస్సు' అంటారు. యోగులందరూ ఆ విధంగా తపస్సు చేసుకుంటూంటారు. అంతమాత్రం చేత ఏ పనీ చేయకుండా వుండరు. కర్తవ్యాలు ఖచ్చితంగా నిర్వర్తింపబడుతూ వుంటాయి. మిగతా సమయాలు అందులో వుంటారు. మన వరకు భగవంతుడు ఓంకార స్వరూపుడుగా అవగాహన కావాలంటే, 'ఓంకారం' తో ఎక్కువ పనిచేయాలి. ఓంకారం తోనే అన్నీ పుట్టుకు వచ్చాయి.

377 రోహితః

అంటె ఎర్రగా ఉండేవాడు. ఈ ఎర్రదనం అనేది సంకల్పశక్తిగా చెప్తారు. మనకు సూర్యుడుదయించే ముందు తూర్పున వచ్చే మొదటి రంగు ఎరుపు. మళ్ళీ సూర్యుడస్తమించాక కనిపించే రంగూ ఎరుపు. దానితో మొదలై దానితో ఆఖరవుతుంది. ఓంకారం లోంచి ఎర్రటిరంగు లేక సంకల్పబలం వ్యక్తం అవుతుంది. దానినే 'శివుని యొక్క శక్తి' అంటారు. అదే 'సృజనాత్మక శక్తీ, సంహారక శక్తీ' కూడా. అదే మొదలు, అదే ఆఖరు కూడా. ఎరుపుని రంగుల్లో మొదటి రంగుగా చెప్తారు. తెలుపనేది రంగు కాదు. తెలుపనేది ఓంకారం యొక్క శుద్ధ స్వరూపం! అది శివతత్వం! తెలుపు నుండి ఏడు రంగులు పుట్టుకొస్తాయి. తెలుపు నుండి ముందు మూడు రంగులు పుడతాయి. ఆ మూడు రంగుల నుండి మరో మూడు రంగులు పిల్లలుగా పుడ్తాయి. అలా మొత్తం ఏడు రంగులు. తెలుపు లో నుండి ఎరుపు, నీలం, పసుపు ఏర్పడతాయి. పసుపు ఆకుపచ్చ అవుతుంది. అందుకనే మనకు పసుపు, కుంకుమ ఆరాధనలో భాగంగా ఇచ్చారు. దైవము నీలం రంగు. నీలం అనగా తెలుపే!. తెలుపును మూడు రంగులుగా విభజించినపుడు నీలంగా తానుంటాడు. పసుపు క్రియాశక్తి, నీలం జ్ఞానశక్తి, ఎరుపు ఇచ్ఛాశక్తిగా వుంటాయి. ఈ మూడింటినే శివుడు, విష్ణువు, బ్రహ్మ అంటారు. ఈ మూడింటినే పార్వతి, లక్ష్మి, సరస్వతి అంటారు. అందుకే మనకి దైవాన్ని నీలంగా పెట్టి, పచ్చటి పీతాంబరాలు కట్టి, కుంకుమతో పూజ చేసుకోవడం ఇచ్చారు. ఎంత ఎరుపు మనలో వుంటే, అంత సంకల్పబలం మనలో వుంటుంది. సంహారానికీ, సంకల్పానికీ కూడా ఎరుపే! అందుకని బాగా సంకల్పబలం తక్కువున్న వారికి ఎరుపు రంగు ధ్యానానికి ఇస్తారు. మరీ ఎరుపైతే భరించలేడని సింధూరంగా ఇస్తారు. అదే ఆంజనేయుడు! ఎరుపు పలుచబడ్డ వర్ణం సింధూరవర్ణం. దాన్నే మనం ఇంగ్లీషులో orange అంటాం. Orange అంటే ఎరుపు, పసుపు కలిసినది. ఎరుపు, నీలము, పసుపులో నుండి మరో మూడు రంగులు పుడతాయి. ఎరుపు, పసుపుల సమ్మేళనం చేత సింధూర వర్ణం. పసుపు నీలంతో కలవడంతో ఆకుపచ్చ అవుతుంది. నీలంలో నుండి violet అంటే ఊదారంగు వస్తుంది. ఈ ఆరు వర్ణాలలోనూ వున్నది తెలుపే! ఈ రంగులన్నీ సంకల్పం నుండి పుట్టుకొచ్చాయి. ఆ సంకల్పమే ఎరుపు రంగుగా చెప్తారు. ఆ ఎరుపు రంగును దాల్చిన భగవంతుడు సృష్టి జరిగినపుడూ ఎరుపు రంగులో వుంటాడు, సృష్టిని సంహరించినపుడూ ఎరుపు రంగులో వుంటాడు. మనలో సంకల్పబలం బాగా పెరగడం కోసం ఆజ్ఞాచక్రంలో కుంకుమ దిద్దుకోవడ మనేది మన సాంప్రదాయంలో ఒక భాగంగా వచ్చింది. ఆకుపచ్చ బొట్లు, పసుప్పచ్చ బొట్లు ఏవో పిచ్చిపిచ్చి బొట్లు

పెట్టుకోకూడదు. అక్కడ వుండే తత్వం ఆజ్ఞ నిచ్చేది. మొత్తం శరీరం లోని జీవతత్వాన్ని నడిపించే భగవత్తత్వం మనకి ఆజ్ఞలో వుంటుంది. అక్కడనుండి ఏం చేయాలో commands అన్నీ వస్తూ వుంటాయి. దానిని దేనితో ప్రచోదనం చేసుకోవాలీ అంటే ఎర్రటి బొట్టుతో. అంతేకానీ ఏవేవో రంగులు పెట్టుకోకూడదు. నలుపు అసలు పెట్టుకోకూడదు. ఏం పెట్టుకున్నా, పెట్టుకోకపోయినా రోజూ ఉంగరం వేలుతో భ్రూమధ్యాన్ని స్పృశించి, మనలో సంకల్పాన్ని దివ్యసంకల్పంగా చక్కగా మేలుకొల్పాలి. మన వ్యక్తిగత సంకల్పాలు, సృష్టి సంకల్పాలకు అనుగుణంగా లేకపోతే ఊరంతా ఒక దారైతే, ఉలిపిరి కట్టెదొక దారన్నట్లుగా మనం బంధింపబడుతూ వుంటాం. అలాంటప్పుడు మనకి ఎక్కువ ఇబ్బందులు ఎదురౌతాయి. సృష్టంతా దివ్య సంకల్పంగా జరుగుతున్నప్పుడు, నీ సంకల్పం కూడ అందుకు అనుగుణంగా వున్నట్లయితే, దైవత్వం యొక్క ఆసరా వుంటుంది. అలాకాక నువ్వు ఎదురీదుతున్నావంటే, నీకు కష్టాలు ఎక్కువగా వుంటాయి. అందుకని ప్రతి ఉదయం స్నానం చేసాక, కుడిచేతి ఉంగరం వేలుతో భ్రూమధ్యాన్ని స్పృశించి, 'ఇక్కడ నుండి దివ్య సంకల్పం వ్యక్తమై, నన్ను నడిపించుగాక' అని కోరుకోవాలి. దాన్నే ఏసుక్రీస్తు 'Father, Thy will be done. Not mine' అని చెప్పాడు. దాన్నే మనం 'కర్తవ్యం దైవమాహ్నికం' అంటాం. దివ్యమైన పద్ధతిలో మన కర్తవ్యం జరుగుతూ, అనుసంధానం చెందుతూంటే, వైభవం అనుభవించవచ్చు. అనుసంధానం లేనప్పుడు ఇదే సృష్టి మనకు సంకటంగా తయారవుతుంది. పూర్తి ఘర్షణతో నిండిపోయి వుంటుంది. అందుకని సూర్యోదయం జరిగే ముందు వచ్చేఆ ఎరుపు కాంతిని మనలో కూడా దర్శనం చేసుకోవచ్చు. ఆ ఎరుపు కాంతిని ధ్యానం చేసుకోవడం వలన మన సంకల్పాన్ని, దివ్య సంకల్పంతో అనుసంధానం చేసుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. ఆ ఎరుపునే మనవాళ్ళు శక్తిగాను, పార్వతిగాను ఆరాధిస్తారు. మనలో బాగా సంకల్పశక్తి పెరగాలంటే 'రామ' శబ్దం చేయాలి. ఎందుకంటే బీజాక్షరాలలో 'రామ' శబ్దం అగ్నితత్వంతో కూడినది. అగ్ని చక్కటి ఎరుపు వర్ణం కనక, ఆ అక్షరాన్ని ఆ రంగుతో కలిపి పలికినట్లైతే, మనలో సంకల్పబలం బాగా పెరుగుతుంది. ప్రత్యేకించి భారతీయులకు ఈ సంకల్పబలం బాగా ఎక్కువగా వుండేది. ప్రస్తుతం బాగా బలహీనంగా వున్నది. ఇష్టపడనుకున్నది రేప్పొద్దున్న మనం చేయలేం. ఆ పట్టు మనకి లేకపోవడం వల్ల, ఏదీ పూర్తిగా సాధించలేని స్థితి ఏర్పడింది. ఆ స్థితిలో నుండి మళ్ళీ మనం ఉద్ధరింపబడాలంటే, ఆకాశంలో వుండే ఈ రంగును ఎక్కువ ఆరాధించాలి. అంతకు ముందు చెప్పబడిన 'ఓంకారం' మన ఆత్మ జ్ఞానానికి సంబంధించినది. ఈ ఎరుపు రంగు సృష్టిలో ఏ రకమైన అవరోధములూ లేకుండా సాగిపోవడానికి సంబంధించిన భగవత్తత్వం. అందుకనే ప్రళయకాల రుద్రునివలె కార్యాలు నిర్వర్తించే

వారంతా ఎరుపును ఆరాధిస్తారు. ఎర్రదనం ఆ విధమైన తత్వం కలిగినది. అందులో సమస్తమైన శక్తి ఇమిడియున్నది. దాన్ని 'First Ray' అంటారు జ్వాలాకూలుని భాషలో. అదే సంకల్ప బలం! అది లేకపోతే మనం సాధన ఏమీ చేయలేము. తపస్సు చేత ఆ బలాన్ని పెంపొందించుకొనవచ్చు. తపస్సుకు కూడా మళ్ళీ ఆ బలమే కావాల్సి వుంటుంది. రోజూ ఇక్కడ ఈ వివరణలు విన్నప్పుడు, మహాత్ముల వద్ద మంచిమాటలు విన్నప్పుడు మనం ఏదో చేసేద్దాం అనిపిస్తుంది. ఇంటికి వెళ్ళగానే మళ్ళీ మన విషయాలు బంధించేసి, ఏమీ చేయలేం. చేసినా, ఒక రోజు లేదా రెండు రోజులు, మూడు రోజులు. అలా అవరోహణ క్రమంలో జారిపోతుందే తప్ప, మొదటి రోజు వుండే శ్రద్ధ వుండదు. ఎందుకుండదంటే, సంకల్ప బలం లేకపోవడం వల్ల! ఆ బలం కలగాలంటే, ఈ తత్వాన్ని ఎక్కువ ఆరాధన చేయాలి.

378 మార్గః

ఈ సమస్తంలో తనే మార్గముగా వున్నాడు. పరతత్త్వం ఇన్ని రకాలుగా అవస్థితి చెందినప్పటికీ, అసలు మార్గం ఎప్పుడూ తెరిచేవుంది. మార్గం మూసెయ్యలేదు. మనం ఎన్ని ఊళ్ళు తిరిగినా, మళ్ళీ మన ఇంటికి చేరే మార్గం మనకి గుర్తుంటుంది కదా! ఆ పద్ధతిలో ఇన్ని రకాలుగా తానే వ్యక్తమయ్యాడు కాబట్టి, తానే ఇన్ని రకాలలోను మార్గంగా వుంటాడు. మార్గాన్వేషణ మనం చేద్దామనుకుంటాం కదా! ఏ మార్గంలో మనం ప్రయాణం చేయాలి? తనను తాను తెలుసుకోడానికి అన్వేషణ చేయాలనుకున్నా లేదా జీవితంలో తను పొందుదామనుకున్న దాని గురించి కూడా మార్గాన్వేషణ చేస్తాం. అంటే ఒక ధ్యేయం అనుకొని, ఆ ధ్యేయం కోసం పనిచేసేటప్పుడు దానికి సంబంధించిన మార్గం ఎన్నుకోవాలి కదా! ఆ మార్గంగా మళ్ళీ భగవంతుడే వుంటాడు. 'నేనే మార్గము' అని చెప్తాడాయన. దాంట్లో ఉద్దేశ్యం ఇది. 'నేనే' అంటే అందరి పేరూ, దేవుడి పేరూ కూడా! నేనే మార్గమును, నేనే గమ్యమును అన్నట్లుగా సమస్తమునకు తానే మార్గముగా వున్నాడు. ఎక్కడైతే ఆయన్ని చూడడం మొదలుపెడతామో, అక్కడ నుండి మళ్ళీ మార్గం దొరుకుతుంది. మనకి ఒక పరిస్థితిలోనో సమస్యలోనో అవరోధాలు వచ్చి ముందుకు కదలలేనప్పుడు, భగవంతుని తల్చుకుంటే మళ్ళీ మార్గం దొరుకుతుంది. అందుకే అన్నిటికీ భగవంతుడే ఉపాయము అని చెప్తారు పెద్దవాళ్ళు. ఏ పరిస్థితులలోనైనా సరే ఆయన్ని పట్టుకుంటే, అన్నిటికన్నా సులువైన పద్ధతిలో లేదా సరైన మార్గము లోనికి తీసుకెళ్ళడానికి అవుతుంది. ఏ సమస్యకైనా పరిష్కారానికి మార్గము. మనకి పనులు జరగాలంటే వాళ్ళనీ, వీళ్ళనీ పట్టుకోవడం అవివేకం. వాణ్ణి పట్టుకోవడం వివేకం. మనకు తెలిసిన పెద్దలూ వాడినే పట్టుకున్నారు తప్ప, వాళ్ళ కాళ్ళు, వీళ్ళ కాళ్ళు పట్టుకోలేదు. మనకే రోజుల్లో వాడొకడున్నాడు, వాడివల్ల పనులు జరుగుతాయి. వాడే ఉపాయము అని తెలియకపోవడం వలన ఎంతోమంది కాళ్ళు పట్టుకుంటూంటాం. నిజంగా తెలిసినవాడు ఆయన కాళ్ళు పట్టుకుంటాడు. సీతమ్మను, 'నేను తీసుకెళ్ళిపోతాను నా భుజాల మీద ఎక్కి వచ్చేసెయ్,' అంటాడు హనుమంతుడు. మనమైతే వెంఠనే ఎక్కేస్తాం. అప్పుడామె ఏం చెప్పిందంటే 'రాముడే నాకు ఉపాయం. కాబట్టి రాముడే నన్ను రక్షిస్తాడు. నేను నీ వీపుమీద ఎక్కి రావడం కాదు. ఆయన వచ్చి నన్ను తీసుకెళ్ళేట్టుగా చూడు' అంటుందామె. వాళ్ళూ వీళ్ళూ చేసిపెడతా మన్నారనుకోండి, వాళ్ళ రూపంలో భగవంతుడే మనకి చేస్తున్నాడనుకోవాలి. చేసిపెట్టడం లేదనుకోండి, దైవానికే చెప్పుకోవాలి. అలకాక

వాళ్ళని పట్టుకోవడమా, వీళ్ళని పట్టుకోవడమా అని అలోచిస్తూ కూర్చునేవారు దైవసాధకులు కాదు. ఇది లోకం చెప్తుంది. నిజంగా నమ్మకం వుండి, వాడే ఉపాయం అనుకున్న వారి జీవితంలో ఆ విధంగా పరిష్కారాలు వాడే చూపిస్తాడు. మనకి మహాత్ముల జీవితంలో చాలా కనబడుతూంటుంది. దూర్వాసుడు వచ్చాడు. అన్నం పెట్టమన్నాడు. అప్పుడేం చేసిందండీ ద్రౌపది? కంగారుపడితే లాభం లేదు కదా! లేకపోతే ఆయన్ని 'వేళాపాళా లేదా? ఇప్పుడొస్తే ఎలా?' అనలేదు కదా! అలాగే వస్త్రాపహరణం జరుగుతోంది. ఎవరు ఉపాయం? ఏమనుకుంటీ? సమస్య వచ్చినపుడు మనిషికి, సమస్య ఎక్కువ గుర్తుంటుందా? భగవంతుడెక్కువ గుర్తుంటాడా? మామూలుగా సమస్య గురించి ఆలోచిస్తాడే తప్ప, భగవంతుడి గురించి ఆలోచించడు. కానీ నిజమైన సాధకుడు భగవంతుణ్ణే ఉపాయంగా పెట్టుకుంటాడు.

దిక్కెవరు ప్రహ్లాదుకు దిక్కెవరు పాండుసుతుల దీనుల కెపుడున్
దిక్కెవరు యహల్యకు దిక్కెవరు నీవె నాకు దిక్కువు కృష్ణా!

ఇలా వున్నది కదా! ఇవన్నీ చదువుతాం కానీ వాడే ఉపాయం అన్నది గుర్తుండదు. ఏమో చేస్తాడో లేదో నన్న సందేహం! మన భావంలో మార్గం వాడే అని వున్నప్పుడు, తప్పక వాడే మార్గం అయివుంటాడు. కాదనుకున్నప్పుడు కాదు. Doubt పడ్డప్పుడు కాదు. భాగవతంలో కథలన్నీ అలాగే వుంటాయి. భాగవతంలో వారి కష్టాలతో పోలిస్తే మనవేం కష్టాలండీ? అప్పుడు మనమీద మనకే అదోలా అనిపించదూ? ఏమిటి ఇంత కథలు వింటాం, దేవుడి గూర్చి పూజలు చేస్తాం. పూజలని, హోమాలని, అభిషేకాలని బోలెడు ఖర్చుపెడతాం. భగవంతుణ్ణి ఈ costly subject గా work out చేస్తాం కానీ నమ్మకమో? వాడే మార్గమని నమ్మకమున్నదా? మరి లేకపోతే ఖచ్చితంగా మనల్ని మనం మోసం చేసుకుంటున్నట్లే. వాణ్ణి నమ్ముకుంటే ఏది, ఎప్పుడు, ఎట్లా జరిగితే బాగుంటుందో అట్లా జరుపుతాడు. మార్గాన్ని వాడే చూపిస్తాడు. భగవద్భక్తు లెప్పుడూ భయంకరమైన సన్నివేశాలు వచ్చినప్పుడు సన్నివేశాల్లో ఉండకుండా, గబుక్కున వాడిలోకి వెళ్ళిపోతారు. వెళ్ళిపోవడం చేత వీళ్ళకి పరిష్కారం వస్తుంది. వెళ్ళనంతసేపూ పరిష్కారం రాదు. ఇంతకుముందు చెప్పాను మా నాన్నగారి జీవితంలో అలా జరిగిందని. ఆయన ఉద్యోగానికి దరఖాస్తు పెట్టుకుంటే రాలేదు. వాళ్ళ నాన్నగారు, ఉద్యోగం రాకపోతే ఇంటికి రానక్కరలేదు. నువ్వు ఉద్యోగం తెచ్చుకుని నీ కాళ్ళమీద నిలబడాలి. ఇంటికొచ్చి ఏం చేస్తావ్? రెండు పూట్లా తినడమే కదా! అని చెప్పారు. రామభక్తుడైన మా నాన్నగారు ఈ ఉద్యోగం నాకు రావాలి అని, రాముడికి చెప్పి దరఖాస్తు పెడితే రాలేదు. రాకపోతే రెండు మూడు రోజులు అన్నము, నీళ్ళు మానేసి, రాముణ్ణే ప్రార్థిస్తూ కూర్చున్నారు. నాకు

అవమానం కలిగితే, నీకు అవమానం కలిగినట్లు కాదా? అని. మూడు రోజుల తర్వాత ఇంకో notification వచ్చింది. ఈయన పేరు బదులు పొరపాటున ఇంకొకరి పేరు పడ్డదీ, ఈయనకి ఉద్యోగం వచ్చిందీ అని. మనం అయితే ఈలోగా ఏ joint secretary నో, ఏ minister నో ఎవడినో పట్టుకొని, డబ్బులు ఖర్చు పెట్టుకొని, ఇలా చేస్తాం. నమ్మితే భగవంతుణ్ణి పూర్తిగా నమ్మాలి, లేకపోతే time waste. మనవాళ్ళ నమ్మకాలు చాలభాగం వృధా కాలయాపనగా అనివుంటాయి. అందరికన్నా పెద్దవాడు' అనుకుంటాం తప్ప, నమ్మం! నమ్మితే వాడు చేసి పెడ్తాడు కదా! నమ్మితే ఎట్లాంటి పనైనా చేస్తాడు. ఎంతెంత మందికి ఎలాంటెలాంటి పనులు చేసిపెట్టాడు? భక్తుడి కొక్కడికే భగవంతుడు కట్టుబడతాడు. ఇంకెవ్వరికీ కాదు. 'నా భక్తులకు కట్టుబడ్డట్లుగా ఇంకెవ్వరికీ కట్టుబడనంటాడు. నా భక్తుడు, నేను తప్ప దిక్కు లేదనుకుంటాడు. నేను తప్ప ఉపాయం లేదనుకుంటాడు. నేను తప్ప మార్గం లేదనుకుంటాడు. అందుకని నేనే మార్గంగా ఉండాల్సి వుంటుంది. వాడికోసం ఏం పనులైనా చేస్తానంటాడు'. సమస్తానికీ మార్గంగా వుండి, ఏదైనా చేయడానికి సిద్ధంగా వున్నప్పుడు వాణ్ణి నమ్ముకోవాలా లేదా? కేవలం ఆత్మ జ్ఞానానికే కాదు, జీవితంలో జరిగే ప్రతి చిన్నవిషయం నుండి పెద్దవిషయం వరకు భగవంతుడే మార్గం అనుకోవాలి. మన ప్రయత్నం కూడా ఆయన ప్రేరణ వల్లే జరుగుతున్నదని అనుకోవాలి. హనుమంతుడు లంకకు మహేంద్ర పర్వతం మీద నుండి దూకుతాడు. ఎగిరేముందు అక్కడి వారందరికీ (వానరులకి) చెప్తాడు 'నేను రామబాణమల్లే దూసుకుపోతాను' అని. చాలా మంచి విషయం. రాముడి చేత వదలబడ్డ బాణంలా వెళ్తున్నాను అంటే, రాముని చేత పంపబడుతున్నాను అని అర్థం. నేను వెళ్తున్నాను, నేను సముద్రాన్ని లంఘిస్తాను అన్న భావన హనుమంతుడికి లేదు. రాముడు బాణం వేస్తే ఎలా వెళ్తుందో, అలాగే రాముడి సంకల్పబలం చేత, అనుగ్రహం చేత వెళ్తానని అర్థం. వెళ్ళి, లంకలో వెదుకుతాడు భవనాల్లోను, వాటిల్లోను, వీటిల్లోను. వెదుకుతున్నప్పుడు 'తాను వెదుకుతున్నాను' అన్న భావం చేత కనబడలేదని బాధపడతాడు. ఇది కాదని రాముణ్ణి, లక్ష్మణుణ్ణి, అమ్మవార్ని తల్చుకుంటాడు. 'మీ అనుగ్రహం చేత నాకే కార్యం పూర్తి కావాలి. ఎందుకంటే నేను వట్టి చేతుల్తో వెళ్తే రాముడు బ్రతకడు. అని అనుకున్న తర్వాత ఆయన మనస్సు లోనికి భావం వస్తుంది. ఏమనీ? ఎదురుగుండా అశోకవనం వున్నది అందులో వెతుకుదామని. అంతసేపూ ఆ భావన రాదు. ఎంతసేపూ భవనాలు, ఆడవాళ్ళు పడుకొనే చోట వెదుకుతూంటాడు. కనబడదేమో, కార్యసిద్ధి కాదేమో అనుకున్నప్పుడు ముగ్గుర్నీ తల్చుకుంటాడు. రాముడ్ని, సీతమ్మని,లక్ష్మణుడ్ని! మన సాంప్రదాయంలో ఈ ముగ్గుర్నీ మనం ఎప్పుడు తల్చుకుంటే అప్పుడు జయం కలుగుతుందని వున్నది.

రాముడు భగవంతుడు, లక్ష్మణుడు భగవద్భక్తుడు, సీత అమ్మవారు, శక్తి. అందుకనే మనం ప్రార్థన చేసినపుడు ఈ ముగ్గుర్నీ ప్రార్థన చేయాలి. పని సులభం అవుతుంది. కనుక అమ్మవార్ని, అయ్యవార్ని ప్రార్థన చేయాలి. అన్నిటికీ మించి వీరిద్దర్నీ స్తుతించే గురువుని ప్రార్థన చేయాలి. ఎందుకంటే గురువులో ఆయనే వుంటాడు. అందుకనే లక్ష్మణుడికి మర్యాదలు జరగని చోటల్లా, రాముడితో పనులు కావు. సుగ్రీవుడికీ అలాగే జరుగుతుంది. హనుమంతుడు మొదటినుండీ రాముడితో సమానంగా లక్ష్మణుణ్ణి చూస్తాడు. ఎందుకంటే భగవంతుడు తనని గౌరవించకపోయినా పట్టించుకోడు గానీ, తన భక్తుణ్ణి గౌరవించకపోతే భరించడు. మొండికేస్తాడు. అందుకని గురువుగారికి సున్నం పెట్టి, దేవుడి దగ్గరకు వెళ్తానంటే కుదరదు. గురువు గురువే! గురువు రూపంలో నేనున్నప్పుడు నన్ను చూడక, నువ్వేంట్రా ఇక్కడకి వచ్చావ్ అంటాడు. కనుక అన్నీ గురు స్తోత్రంతో మొదలుపెడ్తాం. పార్వతీ పరమేశ్వరులు ప్రత్యక్షమవాలంటే ముందు వినాయకుడికి పూజ చేసుకోవాలి. మనకిచ్చిన విధులు అలాంటివి. ఆధ్యాత్మికంలో లొక్యం అన్నట్లుంటుంది కానీ ఇది లొక్యం కాదు. ఇది సరైన మార్గం! పిల్లవాడు వాకిట్లో ఆడుతూంటే, వాణ్ణి ఓ జెల్లకాయ కొట్టి మనం లోపలకి వచ్చి మాట్లాడతాం అంటే కుదుర్తుందా? బయట ఆడుకొనే పిల్లవాడిని ముద్దు ముచ్చట్లతోనో, ఓ చాక్లెట్ ఇచ్చో మంచి చేసుకొని లోపలకి వచ్చి మాట్లాడం? అప్పుడు వాడు లోపలకి వెళ్ళి వాళ్ళ నాన్నతో చెప్తాడు తొందరగా వెళ్ళండి, అలా కూర్చున్నారేంటి? ఆయనెవరో వచ్చారని. ఇంట్లో పిల్లవాణ్ణి మచ్చిక చేసుకుంటే, వాడు వెళ్ళి ఇంట్లో పెద్దవాళ్ళని సతాయించేస్తాడు ముందు వెళ్ళి వాళ్ళని కలవమని. అట్లాగ వినాయకుడి పూజ చేయకుండా పార్వతి అమ్మవారు, శివుడికి పూజ చేస్తే కుదరదు. గురువుకి పూజ చేయకపోతే, భగవంతునితో సంబంధం కుదరదు. అమ్మవారు లేకపోతే అసలు దారే ఇవ్వడు. అందుకే గణపతి, దుర్గ ఆ తర్వాత అయ్యవారు. వాళ్ళిద్దరూ అనుకూలురైతే ఇంక అంతా నిరాటంకంగా అవుతుంది. ఇంక అక్కడేం వుండదు. ఎంత కావాలంటే అంత ప్రసన్నం. వీళ్ళిద్దరూ ముందు రెండు గుమ్మాలుగా వుంటారు. అందుకని హనుమంతుడు ఏం చేస్తాడంటే లక్ష్మణుణ్ణి, అమ్మవార్ని, రాముణ్ణి తలుచుకొని వెదకడం మొదలుపెడ్తాడు. హనుమంతుడంతటివాడు సమస్య వస్తే వాళ్ళని తల్చుకున్నాడూ అంటే మనమేమిటి? ఏ భక్తుడి జీవితమైనా సరే, సమస్యలో జీవించినంతసేపూ సమస్య పరిష్కారం కాలేదు. సమస్య ప్రక్కన పెట్టి దైవాన్ని తల్చుకున్నప్పుడల్లా పరిష్కారం వచ్చింది. ఇంత సాధన చేసినవాళ్ళు సమస్యని సమస్యగా, దేవుణ్ణి దేవుడిగా చూస్తూంటారు. సమస్య దేవుడు తీర్చిపెట్టడా? అలా తీర్చిపెడతాడు అని విశ్వాసం కలిగినవాడికి భగవంతుని నామం మార్గం. ఏదైనా వాడే తీర్చిపెడతాడు, అని నమ్మకం వుండాలి. పరీక్షలో పాసవ్వడం

దగ్గర్నుండే చేసిపెట్టాడు కదా పరమహంస యోగానంద గారికి. పరీక్షల కోసం భగవంతుణ్ణి ప్రార్థించడం ఏమిటని అనుకోకూడదు. దేనికోసమైనా సరే వాడే మార్గం అనుకుంటే, నువ్వు చేసేదేమీ లేదు. వాడి సాయం చేతే అని తెలుస్తుంది. మూగవాడు మాట్లాడగలడు. కుంటివాడు నడవగలడు. మనం ఒంటరిగా అయితే శూన్యంలాగ వుంటుంది మన పరిస్థితి. వాడితో వుంటే వాడి బలం, మన బలం అయిపోయి అంతటివాడిగా వుంటాము. అదీ విశ్వామిత్రునికి అవగాహన కాని వశిష్ఠుని బలం. అవతలవాడు ఎంతవాడైతే వీడంతవాడై, ఆ మీద ఓ అంగుళం ఎక్కువుంటాడు. అంగుళమే కదా అని వాడు మళ్ళీ ఇంకో అంగుళం పెరిగితే, మళ్ళీ వీడు ఇంకో అంగుళం పెరుగుతాడు. ఎప్పుడూ భక్తుని జీవితం పైచేయిగానే వుంటుంది. కింద చెయ్యిగా వుండదు. ఎందుకుండదూ అంటే, అందరికీ ఇచ్చేవాడితో వీడు వున్నాడు కాబట్టి. అందుకే 'సమస్తములో తానే మార్గముగా వున్నాడు' అని తెలిసిన వాడికి భయం వుండదు. మనం ఎన్నోరకాల భయంకర మార్గాలలో నడుస్తూంటాం కదా! అపాయకర మార్గాలలో నడుస్తూంటాం కదా! అలాటప్పుడు ఆ మార్గం వాడే అనుకుంటే, ఆ మార్గంలో వీళ్ళకి భయం వుండదు. చాలా అపాయకరమైన సన్నివేశాలలో చెక్కుచెదరకుండా బయటకు వచ్చినభక్తులు చాలామంది వుంటారు. వాడు నడిపించాలి మనం నడవాలి. నడిపించేది వాడు. నడిచేది మనం. పొద్దున సంకల్పం అలా చేసుకోవాలి. మార్గం నువ్వే! నువ్వు నడిపించే మార్గంలో నేను నడుస్తాను. ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా, లాభనష్టాలతో సంబంధం లేకుండా, సౌకర్యాసౌకర్యాలతో సంబంధం లేకుండా నడుస్తాను. నువ్వే నాకు ఉపాయము! భక్త విజయంలో రాస్తారు. ఆ భక్తులంతా ఎలా స్థిరపడి వున్నారో! ఎంత చిన్న బాధ వచ్చినా, బాధ గురించి ఆలోచించకుండా వాడి గురించి ఆలోచిస్తారు. అది గనక జరిగితే అన్నిటికీ మార్గంగా నిలవడమే కాకుండా, అక్కడికి చేరే మార్గంగా కూడా నిలబడి, దానికి తగిన స్ఫూర్తినిచ్చి నడిపిస్తాడు. ఒక మనిషి మహాత్ముడవడనికి ఎన్నో రకాలుగా భగవంతుడు మార్గదర్శిగా నిలబడతాడు. ఓ మహాత్ముణ్ణి పంపడమో, ఓ మంత్రం ఇవ్వడం ద్వారానో, ఓ సాధన చెప్పించడమో చేయించి వాడిని అక్కడ నిలబెట్టడం జరుగుతుంది. మార్గంలో రక్షించడం జరుగుతుంది. నడిపించడం జరుగుతుంది. ఎక్కడకక్కడ ప్రతిచోటా తాను మార్గదర్శిగా వుండి, మార్గము తానై మనము నడిచేటట్లుగా ఉన్నాడు అని తెలియడం కోసం ఈ నామం ఇచ్చారు. ఎందుకంటే ఇది మార్గం కాదు అనుకున్నవాళ్ళు ఎంత శక్తిమంతులైనా, తెలివైనవారైనా, యుక్తిగలవారైనా వాళ్ళకి దొరకలేదు మార్గం. రావణుడు ఈయన మార్గం కాదు అనుకోవడం వలన అంతటివాడూ నశించవలసి వచ్చింది. ఆయన మార్గం అనుకోవడం వలన బలహీనుడు బలవంతునిపై గెలిచిన సంఘటన

లున్నాయి. అందుకని మన తెలివైనా, మన భక్తి అయినా, మన కృషి అయినా, మన ప్రయత్నమైనా సమస్తము వాడు మార్గంగా నడవడమనేది భక్తిమార్గంలో ఒక ముఖ్యమైన భావం. పాద్దున్నే లేవాలి ఏమైనా సరే అనుకోవడం ఒక పద్ధతి. అప్పుడు రాత్రంతా నిద్రపట్టక రెండు గంటలనుండి నిద్రపట్టడం మొదలౌతుంది. రాత్రి సరిగా నిద్రపట్టలేదు ఇవాళేం లేస్తాంలే, అనుకుంటాం. పాద్దున్నే లేవాలి నేను ఏమైనా అనేకన్నా, 'పాద్దున్నే లేచేట్లు నువ్వు నన్ను కరుణించు' అనుకోవడం మార్గం. 'నేను ఈ విధంగా సాధిద్దాం అనుకుంటున్నాను అనుకొనేకన్నా, ఈ విధంగా నువ్వు నాకు సాధించిపెడ్తే బావుణ్ణు అని నేననుకుంటున్నాను. ఆ పైన నీ ఇష్టం' అనుకోవడం భక్తి. మనకుండే కోరికలు కూడా వాడికే చెప్పేసి 'ఇష్టం నీది సుమా' అని చెప్పాలి. C.V.V. గారందుకే 'నీకేమన్నా కావాలంటే నాకు చేప్పకో. ఊళ్ళో వాళ్ళకి చెప్పబోక' అని చెప్పారు. ఎందుకంటే నేను రెండు రకాలుగా నీ కోరిక తీరుస్తాను. ఒకటి ఆ కోరిక నీలో లేకుండా చేయడం వలన అది తీరినట్లే. రెండవది దాన్ని నీకు సిద్ధింపచేసి తీరుస్తాను. ఏ విధంగానైనా నీకు పరితృప్తే! ఏదో కావాలనుకున్నది, అక్కరలేదనుకుంటే పీడా పోతుంది. కావాలనుకున్నది దొరికేలా చేయచ్చు. ఏదైనా ఫలితం ఒకటే! అందుకే ఆయన 'నా యోగంలో వున్నప్పుడు ఊళ్ళో వాళ్ళకు చెప్పకోకు నాతో చెప్పకో' అంటారు. అంటే అర్థం 'నేనే మార్గం అనుకో' అని. ఇన్నిచోట్లకూ వెళ్ళి ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా ఉండబోక అని చెప్తారు. మాస్టారి మార్గం అంటూనే transfer కోసం వాణ్ణి వీణ్ణి పట్టుకుంటారు. మనల్ని ఎక్కడ పెడ్తే సంతోషమో అక్కడ పెడ్తారు అని నమ్ముకున్న వాళ్ళం కదా! ఉన్నచోట వాడే ఉంచాడు. ఇదే మనకు ఒక పెద్ద ఉపాయం. మా నాన్నగారికలా రెండునెలల కొకసారి transfer అయిపోతూండేది వెళ్ళిపోతూండేవారు. 'ఎలాగండీ' అంటే 'ఎలాగేమిటి? రాముడు నన్నక్కడకు పొమ్మన్నాడు, పోతున్నాను అనేవారు. వాడెవడు నన్ను transfer చేయడానికి? వాడూ వీడూ transfer చేసాడని నేను అనుకోడం లేదు. రాముడే నన్ను అక్కడకి వెళ్ళమని అంటున్నాడు' అనేవారు. ఇంక గొడవుండదు. అదే మార్గం! సమస్తానికీ అదే మార్గం అయినపుడు, సమస్తానికీ అతడే మార్గం అయినప్పుడు ఆయన మాటమీద నిలబడాలి కదా! అది చూడాలి మనం నిజంగా ఈ మహాత్ముల జీవితాల్లో. ప్రతిదానికీ ఎవడి మీదో ఒకడి మీద రొష్టు పడడం, ఇది కారణం, కర్మ కారణం ఇలా అన్నీ పెట్టుకొని, మనస్సంతా వికారం చెందిపోతుంది. ఉన్న స్థితిలో ఇలా ఉండడం వాడి సంకల్పంగా వున్నావు. వాడెటు నడిపిస్తే అటు నడుస్తావు. వాడిచ్చింది పుచ్చుకుంటావు. ఆ తర్వాత నీ ఇష్టం. అందుకని 'మార్గం' అనే నామం చాలు మనకి. అన్నిటికీ ఒకటే మందంటారు చూసారా! అలా భగవంతుడే మనకి

సమస్త విషయాలకీ ఉపాయం. కనక 'నాకేమన్నా తీవ్రమైన కోరిక కలిగినా, సమస్య కలిగినా వాడే ఉపాయం. వాడేం చేస్తే అది' అనుకున్నవాడు ఎక్కువ సుఖపడతాడు.

378 హేతుః

హేతువు అంటే ఆలోచనావిధానం. కొంతమంది ఆలోచనలు తమను తామే బంధించుకొనేట్లు వుంటే, కొంతమంది ఆలోచనలు సమస్యలని పరిష్కరించ కలిగేట్లుంటాయి. అందుకని సమస్యలు పరిష్కరించ గలిగిన వారి వద్దకు ఎక్కువ పోతూంటారు. ఎందుకంటే వాడి ఆలోచన వాళ్ళది అనుకోక, భగవంతుడేం చెప్తున్నాడో విని, వీళ్ళకు చెప్తాడు. అంతేగానీ మహాత్ములు తమకు తోచింది చెప్పడం అనేది వుండదు. మనలో కూడా ఏది ఎట్లా చేసుకుంటే బావుంటుందో అనే హేతుబద్ధమైన భావం ఉంటుందే, అదికూడా భగవంతుడే! అది ఎక్కువగా ముందు చెప్పిన 'మార్గం వాడే' అనుకున్న వాళ్ళకి వుంటుంది. మనలో పనిచేసే తెలివి, విచక్షణ, ఆలోచనాశక్తి ఇవన్నీ వాడే అనుకుంటూ ఉండడం చేత, ఏదైనా సమస్యతో వెళ్తే, మహాత్ములు వాణ్ణి స్మరించి సమస్యకు పరిష్కారం చెప్తారు. వాళ్ళు మనల్ని అడిగారు కాబట్టి మనం చెప్పాలని తొందరపడరు. మనకు తెలిసేట్లుగా కాకపోయినా, తన లోపల ఒకసారి సంప్రదించి అప్పుడు బయటకి మాట్లాడ్తారు. బ్రహ్మాంతటివాడు దేవతలు వస్తే, అక్కడ ఒకసారి consultation తీసుకొని చెప్పడం వున్నది. అలాగే మనం గురువుని అడిగితే తను నమ్మిన దైవాన్నో, గురువునో స్మరించి అక్కడ నుండి ఏ సమాధానం వస్తుందో అది చెప్తూంటాడు. అందుకనే శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'నీకు ఎవర్నీ అడగడం ఇష్టం లేదనుకో, నీకే తెలియాలని అనిపించిందనుకో అప్పుడల్లా నన్ను స్మరణ చేసుకో' అంటాడు. నన్ను అంటే 'నేను' అనే తత్వాన్ని! నన్ను బాగా స్మరణ చేసుకొని కూర్చుంటే, నీలో భాసించే భావం వున్నదే, అదే నేను నీకిచ్చినట్లు అవుతుంది. అదే బుద్ధిలోకం నుండి మనకి పరిష్కారం రావడంగా వుంటుంది. మనోలోకం నుండి వచ్చేవి పరిపూర్ణమైన పరిష్కారాలు ఇవ్వవు. బుద్ధిలోకం నుండి పరిష్కారాలు సులభంగా వస్తాయి. మన చైతన్యము బుద్ధిలోకానికి ఎదగాలంటే భగవంతుని యొక్క స్మరణ పరిపూర్ణంగా చేసినప్పుడు ఉద్ధరింపబడుతుంది. ఉద్ధరింపబడిన స్థితిలో మనకు కలిగిన సంకల్పాల ప్రకారం మనం అడుగుతూంటే భగవంతుడు చెప్తాడు. కాబట్టి హేతుబద్ధంగా ఉండడం, మనలో ఆలోచనాశక్తి గానూ, వివేచనాశక్తి గానూ, వివేకంగాను అతడే ఉన్నాడు అని తెలుసుకోవడం జరుగుతుంది. ఈ విష్ణు సహస్రనామంలో ప్రతీదీ 'అతడే, అతడే' అని చెప్తాడు. అందుకే నమకంలో 'నమో నమో' అని చెప్తూంటారు. చమకం లో 'చ చ' అని చెప్తారు. ఏది చెప్పినా అంతా వాడితో నిండి వుంది అని దర్శనం చేయడం కోసం చెప్పే నామాలివి. మనం ఏదో ప్రార్థన చేసికొని మన ఆలోచనలు, మన plans, మన schemes మనం వేసుకుంటూంటే శకునిలాగ అయిపోతాము. శకుని

ఎక్కువగా స్వంత తెలివిని నమ్మిన వాడు. ఆయన తెలివిని నమ్మినవాళ్ళు దుర్యోధనాదులు. కృష్ణుడి తెలివిని నమ్ముకున్నవాళ్ళు పాండవులు. కృష్ణుడి తెలివి ఏదో నాకు తెలిస్తే మిమ్మల్ని గెలిపిస్తానంటాడు శకుని. ఎందుకంటే వీడికి కృష్ణుడి తెలివి తెలియదు కాబట్టి. ఎందుకంటే కృష్ణుడు తెలివిలో ఉండడు. తెలివికన్నా పై స్థితిలో వుండి, అవసరాన్ని బట్టి ఆ సన్నివేశంలో, ఆ తెలివిలోకి దిగివస్తాడు. రావణాసురుడు తెలివిలో వున్నాడు. రాముడు అంతర్యామి తత్వంలో తానుండి, నడిపిస్తాడు. రాముడెప్పుడూ ధనుర్ధారియై వుంటాడు. ధనుస్సు అంటే ప్రణవం. రాముడు ధనుస్సును పట్టుకున్నా, కృష్ణుడు వేణువు పట్టుకున్నా రెండూ ఓంకారానికి ప్రతీక. ప్రణవాన్ని ధరించి యున్నవాడు అని, సమస్తమైన భగవత్తత్వంతో తాము ముడిపడి యున్నామని చెప్పడానికి రాముడు, లక్ష్మణుడు ధనుర్ధారులై యుంటారు. అందుకని రామబాణం అంటే ఓంకారంలో నుండి వ్యక్తమైనది. దివ్యప్రణాళికలో నుండి వ్యక్తమైనట్లుగా వ్యక్తమౌతుంది. అందుకని ఆ బాణానికి తిరుగులేదు. ఓంకారం ఎప్పుడూ తనయందు నిలబడియున్నది కాబట్టి శివధనుస్సును అలా విరిచేస్తాడు. ధనుస్సు అంటే వేదపరమైన సంకేతం 'ఓంకారం'. 'నమస్తే రుద్ర మన్యవ ఉతోత ఇషవే నమః'[1] అని మొదలెడతాం. రుద్రాభిషేకంలో 'ఓ రుద్రుడా! నీ విల్లుకున్న అల్లెత్రాడు కొంచెం తొలగించేస్యెయ్' అని. తొలగిస్తే మనమీద బాణాలు రావు. రుద్రబాణాలు ఎలా వస్తాయంటే, మనం చేసిన పనులకి ప్రతిఫలంగా ఒక్కొక్కటి వచ్చి గుచ్చుకుంటూంటాయి. మాటల రూపంలో, ఇతరుల చేతల రూపంలో, జీవిత సన్నివేశాల రూపంలో ఎన్నో వచ్చి గుచ్చుకుంటూంటాయి కదా! ఇవన్నీ రుద్రుడు వేసే బాణాలు! ఎందుకు వేసాడంటే అంతకు ముందు మనం వేసినవే తిరిగి మనకి వేస్తూంటాడు. అక్కడో ధనుస్సు! అలాగే రాముడి, లక్ష్మణుడి ధనుస్సు ఓంకారమునకు ప్రతీకలు. అలాగే కృష్ణుడి వేణువు ఓంకారానికి ప్రతీక. ఆ ఓంకారంలో తాను ఎప్పుడూ నిలబడి వున్నాడు కాబట్టి, తననుండి వ్యక్తమైనదంతా దివ్యమైన ప్రణాళిక. మిగతావాళ్ళు చచ్చేట్టు చాకిరీ చేస్తారు. ఇంద్రుడు, గరుత్మంతుడు సహకారం అందిస్తారు. ఇవన్నీ అడిగారా? వాళ్ళే వచ్చి సహకారం అందిస్తారు. ఎందుకంటే తాను ఓంకారము నందు నిలచివున్నాడు కాబట్టి. రామాయణం కూడా అలాగే చదువుకోవాలి. రామాయణంలో, భాగవతంలో సమస్తమైన రహస్యాలున్నాయి. జాగ్రత్తగా, నెమ్మదిగా భక్తుల యొక్క ప్రవర్తన చూసుకుంటూ చదువుకోవాలి. రామాయణంలో రాముణ్ణి, హనుమంతుణ్ణి, సీతాదేవిని, లక్ష్మణుణ్ణి వీళ్ళు వచ్చినప్పుడు, వారు మాట్లాడిన తీరు, ప్రవర్తించిన తీరు వీటన్నిటినీ జాగ్రత్తగా గమనించాలి. వారి ప్రతీమాట, ప్రతీ కదలిక వారలా ఎందుకు చేసారు? అలా ఎందుకు మాట్లాడారు? అని గమనించినట్లైతే మనకి చాలా దొరుకుతుంది. మనకి

శ్రద్ధ వుంటే తప్ప, ఏదో శాస్త్రం, వేదం తెలియడం కోసం చదువుకున్నట్లు చదవనక్కరలేదు. కనుక అటువంటి శ్రద్ధతో నామాలకు వివరణ చెప్పుకోడానికి ప్రయత్నం చేస్తున్నాం. ఈ వివరణ ఆ స్ఫూర్తిలోకి తీసుకువెళ్ళడానికి చేస్తున్న వివరణే తప్ప, ఇదే పరిపూర్ణమైన వివరణ అని చెప్పుకోడానికి వీలులేదు. అనుకుంటే అంత అవివేకం ఇంకొకటి లేదు.

380 దామోదరః

దామోదరః అంటే కలువపూల దండ వేసుకుంటాడుట. దాన్నే 'వైజయంతి' అంటారు. ఎప్పుడూ జయాన్నే కలిగిస్తుంది. అదెప్పుడూ వాడిపోదుట. ఎప్పుడూ పరిమళము వెద జల్లుతుంటుంది. అది ధరించియున్న వాడిని 'దామోదరుడు' అంటారు. ప్రతి సృష్టి ఒక కమలం. అది ఒకదాని తర్వాత ఒకటి విచ్చుకుంటూ ఉంటుంది. ఒక పువ్వుల మొక్క వద్ద పువ్వులు కోసుకున్నాక మరల మరుసటి రోజు ఎలాగైతే మళ్ళీ పూవులు వికసిస్తాయో అలాగ ఈ సృష్టి ఎల్లప్పుడూ వికసిస్తూనే ఉంటుంది. సృష్టి అయిపోవడం ఉండదు. ఒక పక్క అయిపోతుంటే మరొక పక్క కొత్త సృష్టి వచ్చేస్తుంది. ఒక భూమి అయిపోయే లోగా మరొకటి తయారైపోతూ ఉంటుంది. ఒక సూర్య మండలం కాల పరిమితి అయిపోయే లోగా మరొక సూర్యమండలము తయారైపోతుంటుంది. అంటే అయినంత మేరా పుట్టుకొస్తుంది. అనుస్యూతంగా సృష్టి అలా ఉంటూనే ఉంటుంది. మనకుండే పరిమితత్వం వల్ల అయిపోతుందనిపిస్తుంది తప్పా అయిపోవడం ఉండదు. మళ్ళీ కొత్తది మొదలై పోతుంది. ఇది నిత్యం జరుగుతుంటుంది. అది విద్య! center నుండి అనుస్యూతంగా, అయిపోవడం లేకుండా నిండుతూ ఉంటుంది. అదే మనకు వంశానుక్రమంగ కూడా చెప్పకుంటాం. తండ్రి అయ్యేలోగా కుమారుడు, కుమారుడు అయ్యేలోగా మనమడు వచ్చేస్తారు. అలా ఆ స్థానం లో వచ్చేస్తుంటారు. అలాగే ఒక రాజ్యం లో ఒక రాజు వెళ్ళిపోయే లోగా ఇంకో రాజు వచ్చేస్తాడు. అంటే తను తర్వాత వారికి తనస్థానం అప్పచెప్పి, పై స్థానానికి వెళ్ళడం జరుగుతుంది. అదే గురు శిష్యుల సంప్రదాయము కూడా! శిష్యుడు గురువు కాగానే గురువు పైలోకాలకికి వెడతాడు. మళ్ళీ ఈ గురువు వాక్కు మరొక శిష్యుడు అందుకోగానే ఇతడు పైలోకాలకి వెడతాడు. ఇలా శిష్యుడు గురువైతే, గురువు పరమ గురువు అయితే, అతడు పరమేష్టి గురువు అయ్యి , అక్కడ నుండి సప్తఋషులు వద్దకు, అలా ధ్రువుడు, ఆ పైన సనకసనందనాదులు, బ్రహ్మలోకము, విష్ణులోకము ఇలా చక్రభ్రమణము జరుగుతూనే ఉంటుంది. అయిపోదు. ఇంట్లో బియ్యం బస్తాలో బియ్యం అయిపొతుంటే మళ్ళి రావడం లేదూ! అలాగే సబ్బుబిళ్ళ అరిగిపోతే ఇంకో సబ్బు వాడుకోమూ! ఇది మనము ఎప్పుడైనా గమనించామా? మనశరీరం లో కూడా అణువులు ఎప్పటికప్పుడు పుడుతుంటాయి, పోతుంటాయి వీటి మధ్యలో శరీరం ఉన్నట్లుగా ఉంటుంది. అదే శరీరమా అంటే కాదు.అలా అనిపిస్తున్నదా? అది లోదృష్టి ఉన్నవాళ్ళు చూడగలరు. అలాగే ప్రవాహము. ఏ మనిషీ ఒక సారి కాలు పెట్టిన అదే నీటిలో మళ్ళీ కాలు పెట్టలేడు కదా! అదే గోదావరి అయ్యుండచ్చు కానీ నీళ్ళు అవికావు. ఎందుకంటే ఒక ప్రవాహం గా

వెడుతూ ఉంటే నీళ్ళు కదులుతూ ఉంటాయి. అలాగే సమస్త సృష్టి! త్రిమూర్తి తత్త్వం లో ఒక ప్రక్కన బ్రహ్మ తత్త్వం పుట్టించుకు వస్తుంటే, శివతత్త్వం తీసుకు వెళ్ళిపోతుంటుంది. అలా పుట్టినవి, తీసుకుపోయినవి రెండూ అనుసంధానం చెంది ఉండడం వలన, సమన్వయం చెంది ఉండడం వలన మధ్యలో ఉన్నట్లుగా గోచరిస్తుంటుంది. అదీ బ్రహ్మకి, శివునికి మధ్య ఉండే మైత్రి, అనుసంధానం, సమన్వయం, అవగాహన. ఉన్నదా అంటే లేదు, లేదా అంటే ఉన్నది. అందుకని అయిపోతుందని చెప్పేవారు అవివేకులు అంటారు. ధారాళం గా నువ్వు పంచుకుంటూ ఉంటే నీ దగ్గరకి వస్తూనే ఉంటుంది. ప్రయోగం చేసి చూసుకోమంటారు. ఇస్తే వస్తుంది అనే మంత్రం ఉంది. ఇవ్వకపోతే కుళ్ళిపోతుంది. దాచిపెట్టుకోవడం సృష్టి ధర్మానికి వ్యతిరేకం. ప్రవాహం గా వచ్చే వన్నీ నలుగురికి అందుబాటులో ఉంచడం సృష్టి ధర్మం. అలా ఉండేవాళ్ళు ఈ వైజయంతి అనే తత్త్వం లో ఇమిడిపోయి ఉంటారు. వారికి అయిపోవడం ఉండదు. అయిపోనటువంటి, ఎప్పుడూ ఉండేటటువంటి ఒక తత్త్వం ఉన్నదే అది వైజయంతి! అదీ భగవంతుని మాల! సూర్య మండలాల నుండి మన మామిడి చెట్ల వరకు కూడా, మన శరీరము వరకు కూడా అయిపోవడం ఉండదు. ఎప్పుడూ ఉంటుంది. భావాలూ అయిపోవు. ఒక భావం అయిపోతే మరొక భావం వస్తుంది కదా! ఎప్పటికీ అయిపోకుండా నిలచి ఉండే తత్త్వం ఒక మాలగా భగవంతుడు ధరించాడుట. ఎప్పటికీ అయిపోని అయ్యప్పమాల వేసుకోవడమంటే నేను అయిపోయే వాడిని కాదు, శాశ్వతుడ్ని. నేను ఎప్పుడూ ఉంటాను. నా శరీరం నుండి నేను వ్యక్తమవుతుంటాను. అని తెలియజేయడం. అత్యంత పవిత్రము, ఆనందకరము, ఆహ్లాదకరము అయినది వైజయంతి. అదీ భగవంతుని శరీరము మీద ఉండే మాల. కాబట్టి భగవంతుని దర్శనము చేసినప్పుడు ఈ మాలని దర్శనం చేయాలి.

381 సహః

సహః అంటే భరిస్తాడని. కేవలం పుట్టించడమే కాదు భరిస్తాడు. అందరినీ భరిస్తాడు. మనం మంచివాడు అనుకున్నవాడ్ని భరిస్తాడు, మంచివాళ్ళు కాదనుకున్న వాళ్ళనీ భరిస్తాడు, సాధుజంతువులనీ భరిస్తాడు, క్రూర జంతువులనీ భరిస్తాడు. ఎంత సహనం! భగవంతుని సహనం చూస్తే, మనల్ని భరిస్తాడంటేనే చెప్పొచ్చు.కదా! మన మేమన్నా తక్కువ వాళ్ళమా? మనం ఒక్కళ్ళనే భరించలేము. ఒకపక్క దైవభక్తి అంటాం, దైవం అంటాం ఇంటికిఎవరన్నా ఒక్కరోజుండడానికి వచ్చినా భరించలేము. ఎందుకలా అంటే మన శరీరం అలసిపోతుందని, వనరులు అయిపోతాయని. కానీ ఏదీ అయిపోదు. చేస్తున్నకొద్దీ నిజానికి శక్తి పెరుగుతుంది. దాచుకున్నకొద్దీ శక్తి నశిస్తుంది. ప్రవాహం లో నీరు ఎంత నిర్మలం గా ఉంటుందీ, అదే ప్రవాహం నీరు మన బిందెల్లో పట్టి ఉంచుకుంటే అలా ఉంటుందా? రెండో రోజే కుళ్ళు వాసన వస్తుంది. అలాగే ప్రవాహం లో స్నానం చేస్తే దేహానికి వచ్చే చైతన్యం, ఇలా కుళ్ళబెట్టుకునే నీళ్ళల్లో స్నానం చేస్తే ఏమీ రాదు. బావిలో నీళ్ళు పోసుకోవచ్చు. ఎందుకంటే అవి మళ్ళీ వస్తుంటాయి, నిర్మలం గా ఉంటాయి. ఎక్కడో నదికి ఆనకట్టలు కట్టి, అలా అలాఎన్నో విధాలుగా నిలవచేసిన నీరు మన tank వద్దకు వచ్చేసరికి కుళ్ళి ఉంటాయి. అందుకనే మనం ధగధగలాడ్తూ, కళగా, చైతన్యవంతం గా ఉండము. దేహాలు బొత్తిగా రాచ్చిప్పలల్లే ఉంటాయి. అలాగే ఇళ్ళల్లో తిండిపదార్థాలు మిగిలితే ఇచ్చెయ్యాలి. కుళ్ళబెట్టుకుని మర్నాడు తినడం.. సృష్టి ధర్మాలన్నీ పోయినాయి. ఎందుకు అలా చేస్తాం అంటే అయిపోతుందనే భయం.కనీసం దైవభక్తులమనుకుంటున్న వాళ్ళు అలా చేయకుండా ఉండాలి. అదీ సాధనే. ఎందుకంటే ఒక పక్క ధర్మ మార్గాన్ని అనుసరిస్తున్నాం అనుకుంటూ, ధర్మాన్ని అనుసరించకపోతే కుదరదు. దైవాన్ని నమ్మక, ధర్మమార్గాన్ని అనుసరించక ఇలా చేస్తే నష్పచ్చు. దొంగ దొంగతనం చేయడానికి, police దొంగతనం చేయడానికి ఎంత వ్యత్యాసం ఉంటుందీ? ఎవరిది ఎక్కువ తప్పు? అలా దైవం పేరు చెప్పి, ధర్మం పేరు చెప్పి, ధర్మానికి వ్యతిరేకం గా పని చేస్తుంటే ఎక్కువ తప్పు. నువ్వు నమ్మింది నువ్వు ఆచరించకపోతే నీకు శిక్ష విధించ వచ్చు. దాని నుండి వచ్చే దుష్ఫలితాలు ఎక్కువ ఉంటాయి. ఒక బ్రాహ్మడు, ఒక తురకవాడు పనిమీద ఇంకో ఊరు బయలుదేరారుట. మధ్యలో పెద్ద తుఫాను వచ్చి ఇద్దరూ ఒక అమ్మవారి కోవెలలో తలదాచుకున్నారు. రాత్రి బ్రాహ్మడు అమ్మవారి పాదాలమీద తలపెట్టి నిద్రపోయాడుట. తురకవాడు గుమ్మము మీద తలపెట్టి అమ్మవారి మీద కాలు పెట్టి పడుకున్నాడుట. రెండవరోజు రాత్రి అమ్మవారు బ్రాహ్మడి కలలోకి వచ్చి 'వాడికాళ్ళు

నామీద నుండి తీయించకపోతే నీ తలకాయ తీసేస్తాను' అని చెప్పిందిట. కాళ్ళు వాడు పెడితే, బ్రాహ్మడి తలకాయ తీయడమేమిటి? ఇతడికి ఆమె అమ్మవారు. తురకవాడికి అది రాయి. బ్రాహ్మడు అమ్మవారని నమ్మినవాడు. నమ్మినవాడివి నువ్వేమి చేస్తున్నావు? అలా దైవం పేరు చెప్పి కర్మలను ఆచరించని వాడు, ధర్మాన్ని ఆచరించనివాడు శిక్షార్హుడు. ధర్మాన్ని ఆచరించే వారికి ఎప్పటికప్పుడు ప్రక్షాళన జరిగిపోతుంటుంది. దుష్టులకి చాలా రోజులు బాగా జరిగినట్లు కనిపించవచ్చు తర్వాత ఇబ్బందులు వస్తాయి. మొదట సాధనలో మనకు చెప్పేది అవతలవారిని క్షమించడం, భరించడం. క్షమికాని వాడు నా భక్తుడు కాడు అంటాడు కృష్ణుడు. Tolerance is the first quality of the disciple అంటారు. మనందరినీ క్షమించి భరిస్తున్నాడుగా! సహనానికి భగవంతుడే! భూమిని కూడా చెప్తారు. కాని ఆయన ఎవరెవరి ధర్మం ప్రకారం ఏ విధంగా ప్రవర్తిస్తున్నారో అన్నీ చూస్తూ కూర్చుంటాడు. స్వంతం గా ఎవరి account వాడే finalise చేసుకుంటాడు. మనమేమీ చెయనక్కరలేదు. ధర్మ మార్గం లో ఉన్నవాడు తనకి అన్యాయం జరిగినా, ఎవరైనా పోట్లాడినా మాట్లాడకుండా సహిస్తాడు. దానికి రెండూ కారణాలు. ఒకటి క్రితం జన్మలో తాను చేసిన అధర్మం అలా వచ్చినదని, బాకీ కాబోలు అని, ఊరుకుంటాడు. దాని గురించి యాగీ చేయడు. రెండవది అవతల వాడి దుష్ప్రవర్తన వాడికి సంబంధించినది. మనం ప్రత్యేకించి వేలు పెట్టకూడదు. ఇది మన పెద్దలు చేసినది. ఏదన్నా పోయినా మనకి సంబంధించినది కాదు. ఎందుకంటే ఎంత పట్టుకు కూర్చున్నా పోయేవి పోతూనే ఉన్నాయిగా! పోయిందల్లా మనది కాదు. మన కర్మ ప్రక్షాళనకే అలా జరిగింది అనుకునేవారు పెద్దలు! మనది కానిది మనము గీ పెట్టినా మనకురాదు. రావడాలూ, పోవడాలు మనచేతిలో లేని విషయం. కేవలం ధర్మ ప్రవర్తన ముఖ్యము. భాగవతం లో ద్వితీయ స్కంధం లో చెప్తారు 'పూజలూ, వ్రతాలూ, ధ్యానం పేర్న గట్టిగాముక్కుమూసుకు కూర్చోవడము, జ్ఞానసముపార్జన ఇవి ముఖ్యం కాదూ, కర్తవ్యపాలన, ధర్మ పాలన ముఖ్యం. కర్తవ్యం నిర్వర్తించక వీటివల్ల ప్రయోజనముండదు. ధర్మపాలన లేనివాడు భగవంతుని అస్థిత్వాన్ని దర్శించ లేడు. ఎందుకంటే ధర్మమే భగవంతుడు. వేరుకాదు. ఈ ధర్మపాలన లో చాలా సహనం కావాలి. రాముడు అలాగ సహించాడు. ధర్మరాజు అలా సహించాడు. లంకకి వెళ్ళినప్పుడు హనుమ అలా సహనం చూపించాడు. అవసరం లేకున్నా బ్రహ్మాస్త్రానికి పట్టుబడ్డాడు. అలాగే తోకకి నిప్పు పెట్టినా ముందు కార్యాలను దృష్టిలో పెట్టుకుని సహనం చూపించాడు. రజోగుణం కలిగినవాళ్ళు రోషాలతో,కోపాలతో ప్రవర్తించి మరింత కర్మని కూడగట్టుకుంటారు. మాస్టర్ C.V.V. మార్గములో యోగమూ ఉంది, Healing prayers కూడా ఉన్నాయి.

నువ్వు యోగాన్ని పట్టుకో. ఎందుకంటే మనది భృక్తరహితతారకరాజయోగము కదా. Healing అంటూ file pending లో పెడితే ఎలా? తర్వాతైనా మనమే attend అవ్వాలి కదా! అందుకని మాస్టారు 'అనుభవించేసి యోగం లో నిలబడు, నేను త్వరితగతిని అది జరిగేట్లు చూస్తాను' అని చెప్పారు. లేదంటే postpone అవుతుంది తప్పా క్షాళన కాదు. అంతేకాదు దానికి ఈ రోజు కర్మ కూడా కలుస్తుంది కదా! అలా కలుస్తూనే ఉంటుందిగా ముందు ముందు. అందుకని అనుభవించడానికి సిద్ధపడాలి. Transfer వస్తేనే భయపడిపోతారు. ఎందుకంటే 'కష్టమండీ' అంటారు. కష్టపడిపో, క్షాళన అయిపోతుంది. ఇచ్చింది పుచ్చుకోవడం నేర్చుకోవాలి. భక్తవిజయం కథలు చదివితే భక్తుల జీవితాల్లో వారి సహనం, వచ్చిన సన్నివేశాలని పుచ్చుకోవడం, అనుభవించెయ్యడం కనిపిస్తుంది. చదవండి. సహనం కావాలి. సహనమనే కళ్యాణగుణం మనం అలవరచుకోవాలి. వచ్చినదాన్ని అంగీకరించి, కర్తవ్యము ఏమిటని తరచి చూసుకోవాలి.

382 మహీధరః

మహీధరుడంటే మహిని ధరించినవాడు. మొత్తం ఈ సృష్టినంతా కూడా తానే ధరించినవాడు. ఈ పదార్థాన్నంతా కూడా తానే ధరించియున్నాడు. చిన్న చితకా దగ్గర్నుంచి పెద్ద విషయాల వరకు అన్ని కొండలు, పర్వతాలు, గోళాలు ఇవన్నిటినీ కూడా ధరించినవాడు. భూమిని ధరించినవాడు. భూమి అంటే ఈ భూగోళమని కాదు, పదార్థమని! పదార్థాన్ని ధరించినవాడు. మనలో కూడా పదార్థాన్ని అతడే ధరించియుంటాడు. సమస్తాన్నీ ఆ విధంగా ధరించినవాడు భగవంతుడు. అందుకనే ఎవరు, ఎక్కడ, దేనిని ధరించియున్నా సరే, ఆ ధరత్వాన్ని, మోసే తత్వమేదైతే వున్నదో అది భగవంతుడిలో భాగము. మొత్తం పదార్థాన్ని ధరించిన తత్వాన్ని 'శేషుడు' అంటారు, మన సంప్రదాయములో. Greek సంప్రదాయం లో 'Atlas' అంటారు. ఈ బుర్రకాయనంతా ధరించే వెన్నెముక పై భాగము ఒక పూసను కూడా medical science లో 'Atlas'[1] అంటారు. ఎందుకంటే ఈ బుర్రను భరిస్తుంది కదా! ఆయన ధరిస్తే పదార్థం నిలబడి వున్నది. ధరించకపోతే? 'Matter unaided by spirit falls'[1] Madam Blavatsky అన్నారు. మనలో కూడా చైతన్య స్వరూపుడుగా మనలాగ భగవంతుడు ఉండడం వలన ఈ శరీరం నిలబడివున్నది. అది తప్పుకున్న దనుకోండి, ఇది పడిపోతుంది కదా! ఇలా కూర్చున్నా పడిపోతుంది. అందుకని ఈ మొత్తాన్ని ధరించే ఒక శక్తి వున్నదే, ఎక్కడ ఏది ఎపుడు దేన్ని ధరిస్తున్నా, దాన్ని 'మహీధరుడు' గా భగవంతుడు యొక్క ధ్యానం చేసుకోవాలి. ఈ ధరించటం అనేది విష్ణుతత్వం గా చెప్తారు. స్థితి కలిగిస్తాడు. అన్నిటికీ స్థితి కారకుడు. ధరించాడు కదా మందర పర్వతాన్ని కూర్మావతారుడై. మందర పర్వతాన్ని ధరించాడు అనగా సృష్టి అనేదాన్ని అటు ఇటు, కుడి ఎడమల శక్తులు రాక్షసులు, దేవతలు. వాళ్ళు అటు లాగుతూ వుంటే, వీళ్ళు ఇటు లాగుతూ వుంటారు. ఇద్దరూ తలోప్రక్కా లాగితే మనం వుంటాం. వాళ్ళిద్దరిలో ఏ ఒక్కళ్ళు పనిచేయకపోయినా రెండోవాళ్ళు పనిచేయలేరు. అందుకనే వాళ్ళిద్దరూ ఎపుడూ అట్లా వుంటారు. ఒకళ్ళ కొకళ్ళు శత్రువులుగా కనిపిస్తారు తప్ప, అది భగవంతుని యొక్క అమరిక! రాత్రి, పగలు అమావాస్య పౌర్ణమి, ఉత్తరాయణం దక్షిణాయనం, ఎడమ కుడి, ఇట్లా వుంటారు. షామియానా లాంటిది రెండుప్రక్కల లాగి కట్టకుండా వుంటే నిలబడి వుంటుందా? కుడిప్రక్క దేవతలు, ఎడమప్రక్క రాక్షసులు. ఎడమప్రక్క రాక్షసులు మనకు వద్దు అని, ఎడమప్రక్క షామియానా త్రాడు వదిలేయండి షామియానా, నిలబడుతుందా? రాక్షసులంటే అర్థం రక్షకులని,

రక్షించేవారు అని. అందుకనే ఈ రెండూ ఎపుడూ సృష్టిలో వుంటాయి. ఉంటేనే నిలబడి వుంటుంది. కాబట్టి ఈ నిలబడినదాన్ని అంతా కూడా దానికి అటువాళ్ళకి, ఇటువాళ్ళకి వాళ్ళు పెరిగితే తగ్గుతారు, వీళ్ళు పెరిగితే తగ్గుతారు. దేవతలు పెచ్చుమీరితే రాక్షసుల తోటి కొట్టిస్తారు. రాక్షసులు పెచ్చుమీరితే ఇతను కొడతాడు. అదీ ఆయన umpiring. అదేకదా మొత్తం పురాణాల కథలన్నీ కూడ. దేవతలు చేయవలసిన పనులు దేవతలు చేయాలి. రాక్షసులు చేయవలసిన పనులు రాక్షసులు చేయాలి. అపుడపుడు దేవతలకి కొంచెం బాగుండే పని ఇస్తారు. చక్కగా పట్టుచీర కట్టుకొని, వడ్డాణం పెట్టుకొని, వడ్డించే కార్యక్రమాలన్నీ దేవతలు చేస్తారు. ఆ వంట చేసిన తర్వాత ఈ ఎంగిలాకులు లేకపోతే ఈ ఎంగిలి పళ్ళాలు, ఈ మొత్తం చెంబులు, తపేళాలు కూర్చుని బొగ్గేసి, శుభ్రం చేసి తోమే పనులన్నీ రాక్షసులు చేస్తారు. ఒకళ్ళేమో సృష్టి చేస్తుంటే, అందులోంచి రకరకాల మలినాలు పుడుతూ వుంటాయి. అవన్నీ పాపం వాళ్ళు భరిస్తూ వుంటారు. చేతిలో అరటిపండు తినేసి, చక్కగా రోడ్డు ప్రక్కన విసిరిపారేస్తే దాన్ని తీసేవాడు ఒకడున్నాడు కదా! మరి వాడి సంగతేమిటి? మరి అవన్నీ రాక్షసుల పనులు. రాక్షసులకి పనులేమిటయ్యా అంటే labour. దేవతలకు పనులేమిటయ్యా అంటే white collar jobs. బట్ట నలగకుండా చేసే పనులు దేవతల కిచ్చారు. ఒళ్ళు చించుకొనే పనులన్నీ రాక్షసుల కిచ్చారు. అంటే రాక్షసులు వెధవలు, మంచివాళ్ళు కాదనికాదు. వాళ్ళు దేవతల కన్నా సమర్ధులు అని. మీక్కూడా జ్యోతిష శాస్త్రములో దేవనక్షత్రాలు, రాక్షస నక్షత్రాలు, మానవ నక్షత్రాలు అని మూడు చెపుతూ వుంటారు. రాక్షస నక్షత్రాలలో పుట్టినవాడు చేసినంతపని, దేవ నక్షత్రములో పుట్టినవాడు చేయలేడు. వాడికి శక్తి ఎక్కువ! వాడి పనే అటువంటిది. వాళ్ళ పనులు వీళ్ళు చేయలేరు. వీళ్ళు కావాలంటే వాళ్ళ పనులు చేయగలుగుతారు. అందుకనే దేవతలు కొంచెం ఏదన్నా తేడాగా వుంటే, కొంచెం వాళ్ళకేదన్నా పైత్యమొస్తే రాక్షసుల చేత కొట్టిస్తూ వుంటారు. ఇంద్రుడికి ఎపుడు బలిసినా, వెంటనే ఎవడో వచ్చేసి, వాడిని లాగేసి జబ్బపట్టుకొని, ఆ కుర్చీలో వీడు కూర్చుంటాడు. ఆ ఇంద్రుడు బాగుపడి, మళ్ళీ వాడి కర్తవ్యం అంతా వాడు బాగా తెలుసుకున్న తర్వాత ఏడుస్తాడు అపుడు వచ్చి, 'అయ్యో! తప్ప అయిపోయింది' అని. అప్పుడు ఈయన వచ్చి ఆ రాక్షసులని, 'ఇంక చాల్లేరా వాడికి తెలిసివచ్చింది', అని తీసుకువెళతాడు. రావణాసురుడిని, కుంభకర్ణుడిని, హిరణ్యకశిపుణ్ణి, వీళ్ళందరినీ ఏమి చేయగలిగారండీ ఈ దేవతలందరూ? ఏమన్నా చేయగలిగారా? వీళ్ళ దగ్గరకు రావాలన్నా భయంగా వుంటుంది. అంత బలంగా వుంటారు వాళ్ళు. నిజంగా రాత్రి, పగలు, ఎవరి యొక్క గుర్తింపు లేక చేసేవాళ్ళు, ఎవరు ఎక్కువ దగ్గరగా వుంటారు? దేవుడికి! భగవంతుడికి! తండ్రికి! తండ్రికి ఇద్దరు పిల్లలనుకోండి ఒకడు నానా చాకిలీ

చేస్తాడు. ఏ గుర్తింపూ చూడడు. ఒకడు ఊరికే అలా పైపైన పెరుగుతూ, అందరికీ ఆశీర్వచనాలు ఇస్తూపాదనమస్కారాలు చేసుకుంటూ వుంటాడు. వీడు పేలవంగా వుంటాడు. వాడు లోతుల్లో వుంటాడు. పెటపెటలాడే వాడిమీద ఎక్కువ దయ వున్నట్టు కాదు. ఏదో కానీయ్, వాడు అంతకన్నా చేయలేడు. ఈ పనికి వాడు పనికిరాడని తెలిసే, ఆ పనిలో పెడతారు. వాడు కొంచెం తాను అందరికన్నా పెద్దవాడు అనుకున్నప్పుడల్లా వాడికి కొంచెం మొట్టికాయ వేయిస్తాడు. అయితే ఈ రెండూ ఉండటం వలన మనకి స్థితి వున్నది. ఇద్దరిలో ఎవరు ఎక్కువ అంటే ఒక రకంగా చూస్తే మనం రాక్షసులనుకుంటామే, వాళ్ళే ఎక్కువ. దేవతలు, రాక్షసులు కాకుండా ఇంకొకళ్ళు వున్నారట. వాళ్ళు యోగులు! వాళ్ళు కూడా ఏమిటంటే ఇటువంటి అతీతమైన స్థితిలో వున్నారు. బలిచక్రవర్తి ఉన్నాడనుకోండి ముందు రాక్షసుడు. ఇంద్రుడి సింహాసనం ఆక్రమించాడు. దానాలు చేయడం మొదలుపెట్టాడు. ధర్మములో ఇంద్రుణ్ణి మించిపోయాడు. దాన ధర్మములలో దైవీస్వభావము వచ్చింది. ఎంత దూరం వెళ్ళిపోయాడంటే ఇంద్రుడికి ఇంకా కుర్చీ కావాలీ అని ఉంది కానీ బలిచక్రవర్తికి ఇంక కుర్చీ కూడా అక్కరలేదు. అన్నిచోట్ల నీవే కదా ఉన్నావనే స్థితిలోకి వెళ్ళిపోయాడు. మాస్టరుగారు పురుషమేధంలో మృత్యువు గురించి రాస్తారు. మృత్యువు వచ్చి, 'ఎందుకు నాకు ఇటువంటి కష్టమైన పనిచ్చావు? నన్ను ఇటువంటి ఉద్యోగంలో పెట్టావు?' అని అడుగుతాడు. ప్రతివాళ్ళూ అనుకుంటారు కదా! చావంటూ వస్తుందంటే తిట్టుకోరండీ? తిట్టుకునే పనులన్నీ వీళ్ళకా? పొగిడే పనులన్నీ వాళ్ళకా? 'మృత్యుదేవత మమ్ములను ఇటువంటి కష్టమైన పనిలో పెట్టావు. అందరూ తిట్టుకుంటారు. తిట్టుకుంటే తిట్టుకున్నారు. నీవు చెప్పిన పని కాబట్టి, నీ కోసం చేస్తున్నాం. ఇవాళ నీకు కూడ అదే పని చేయటానికి వచ్చాను' అని చెబుతాడు. 'ఆఖరికి నీకు కూడా ఈ పని చేసే ఒక దుఃఖపూరితమైన కర్తవ్యం నాకు నిర్దేశించావు కదా!' అంటాడు అప్పుడు కృష్ణుడంటాడు 'దుఃఖం, శుభం, మంచి, చెడు ఇవన్నీ దాటిన స్థితిలో వున్నారు కాబట్టి, మిమ్మల్ని ఈ పనిలో పెట్టాను. మిగతావాళ్ళ దాటలేదు కాబట్టి వాళ్ళని ఆ పనిలో పెట్టాను' అని చెపుతాడు. యముడి పని ఎవరికి నచ్చుతుందండీ? ప్రతివాడినీ పీకటమే కదా! ఒక పాశం వేసి ఆ జీవుణ్ణి టక్కున లాగుతాడు కదా! Fork పెట్టి లాగినట్లుగా లాగేస్తాడు జీవుణ్ణి శరీరం నుండి.. ఎవరైనా అంగీకరిస్తారా? పైగా ఒక నల్లటి దున్నపోతు వాహనం. మనబోటి వాళ్ళకి నచ్చేవేవీ పాపం వాళ్ళకివ్వరు. ఇటు వీళ్ళకేమో హంసవాహనం లేకపోతే నెమళ్ళు, తెల్లటి ఎద్దు ఇట్లా వుంటాయి. అటుప్రక్కేమో దున్నపోతులు, మొసళ్ళు ఈ వాహనాలు. ఏమిటంటే ఇవి తక్కువవి, అవి ఎక్కువవి అనే తేడా కూడా వాళ్ళు దాటిపోయారు. అలా వాళ్ళు ఒకప్రక్క, వీళ్ళు ఒకప్రక్క కలిసివుంటే, తను ఇది మోసాడు. వాళ్ళిద్దరూ

తలోప్రక్క పట్టుకొని లాగకపోతే ఈయన ఊరికే క్రింద తాబేలై కూర్చుంటే? మందర పర్వతం పెట్టి మథనం చేస్తున్నప్పుడు వాళ్ళిద్దరూ మథనం చేస్తుంటే కదా ఈయన ఉన్నాడు. అలాగే మనలో కుడి శక్తులన్నీ పింగళ నాడి నుంచి పనిచేస్తూ వుంటాయి. ఎడమ శక్తులన్నీ ఇడ నాడి నుంచి పనిచేస్తూ వుంటాయి. కనుక ఇడ నాడి నుంచి పదార్థమయమైన లోకాలన్నీ తయారవుతూ వుంటాయి. పింగళ నాడి నుంచి పదార్థాన్ని మళ్ళీ సూక్ష్మ పదార్థం గాను, చైతన్యవంతం గాను తయారవుతున్న కార్యక్రమం నడుస్తూ వుంటుంది. ఈ రెండిటినీ ఆయన ధరించి వుంటాడు. అది మనకి 'క్షీరసాగర మథనం' అంటారు. ఇవి రెండూ జరుగుతూ వుంటే ఒకప్రక్క పదార్థం పుట్టుకొస్తూ వుంటుంది. ఇంకొకప్రక్క పదార్థం ఎక్కడనుంచి పుట్టుకొచ్చిందో, ఆ పుట్టుకస్థానం లోకి వెళుతూ వుంటుంది. పింగళ నాడి కుడికన్ను, ఇడ నాడి ఎడమకన్ను. ఎడమ అంతా కూడా పదార్థమయమైన చైతన్యానికి సంబంధించినది. పదార్థమయమైన విషయాలలో మన శక్తి ఎడమ అన్నమాట. సూక్ష్మ పదార్థం దివ్యమైన పదార్థం, దైవలోకములకు సంబంధించినదంతా కుడి. అంటే కుడి ఒకటి, ఎడమ ఒకటి. కుడి ఎడమగా మొత్తం సృష్టినంతా నడిపిస్తాడు. అందుకే కావడి. కావడికుండలలాగ, త్రాసు లాగ, త్రాసు అంటే ఆ పెన వుండాలి, ఈ పెన వుండాలి. రెండు ప్రక్కల రెండూ వుంటేనే కదా త్రాసు. ఈ రెండు వుండి, తాను ఆ రెండింటికి మధ్యస్థుడై, న్యాయనిర్ణేత అధికారిగా తానుండి నడిపిస్తూ వుంటాడు. వాడు 'మహీధరుడు'. కాబట్టి ఆ విధమైన మహీధరత్వాన్ని వహించేటివాడు భగవంతుడైనపుడు, మనకు సాధన పరంగా ఈ మహీధరత్వం ఎలా చూసుకోవాలి? మనకు కూడా కుడిఎడంగా జరుగుతూ వుంటాయి పనులు. రెండింటిని ధరించి యుండగలిగే పరిస్థితి మనకు వున్నట్లైతే యోగస్థితి యందు యున్నట్లు. ఇది వద్దు అది కావాలి, అది వద్దు ఇది కావాలి అనుకున్నా, ఈ రెండిట్లో సరే పదార్థం వద్దు, పరమార్థమే కావాలి అనుకుంటే జరగదు. పరమార్థం వద్దు, పదార్థమే కావాలి అనుకుంటే జరగదు. పదార్థం, పరమార్థం రెండిటికి మూలమైనవాడు ఒకడున్నాడు కదా! వాడియందు మనం నిలబడి పదార్థమైన సన్నివేశాలని, పరమార్థమైన సన్నివేశాలని రెండింటిని అనుభూతి చెందటం జీవుడికి ఇవ్వబడిన అవకాశం. ఆ అవకాశాన్ని ఆ విధంగా వినియోగించుకున్నా మనుకోండి, అది యోగం! చాలామంది ఇది గొప్ప, అది గొప్ప ఇట్లా కొట్టుకు చస్తూ వుంటారు. బాగా దైవానికి పూజలు చేసేవాళ్ళు, మిగతా వాళ్ళందరినీ పాపులుగా చూస్తూ వుంటారు. అంతేకదా! అదెక్కువ దురాచారం. రోజూ పూజ చేసేవాడు, పూజ చేయనివాడి వైపు చూసే చూపులోనే వీడియొక్క మదం, గర్వం, తేలికభావం ఇవన్నీ వుంటాయి కదా! నన్ను పూజ చేయలేదు కదా అన్నట్లుగా చూస్తూ వుంటాడు. దుష్టులు

ఎక్కువగా కనిపిస్తూ వుంటారుట కొత్తకొత్తగా సాధన చేసుకునె వాళ్ళకి. ప్రపంచమంతా పాడై పోయిందంటాడు ఒకరోజు పూజ చేసి కదా! మాస్టరుగారు ఒక వాక్యం రాసారు 'దుష్టులున్నారని అనుకోవటం లోనే ఎక్కువ దుష్టత్వ ముందిట'. ప్రపంచంలో ఎంతమంది దుష్టులు కనబడుతుంటే, వీడిలో అంత దుష్టత్వ మున్నట్లు. నీవు దుష్టులనెందుకు చూడటం? నీ దృష్టి భగవంతుడి మీద ఉండవచ్చుగా! ఇంతమంది దుష్టులలోనున్న భగవంతుని చూడవచ్చు కదా! అలా కాకుండా దుష్టులనెందుకు చూస్తున్నావు? నీలో దుష్టత్వముంది కాబట్టి నీవు దుష్టత్వమే చూస్తూ వుంటావు ఇతరులలో. అందుకని యోగంలో మనం నిలబడటం అంటే పరమార్థానికి, పదార్థానికి సమతూకంగా నిలబడినవాడు యోగి! అందుకే తెనాలి రామకృష్ణుడు, అమ్మవారు ఆ చెంబు, ఈ చెంబు ముందుపెట్టి 'ఏది కావాలిరా' అంటే 'రెండూ ఇచ్చేయమ్మా' అన్నాడు కదా!. ఇదేమో పదార్థమైనట్టి సంపద. ఇదేమో ఆత్మ సంపద. రెండింటిలో ఏది కావాలని అడిగింది. రెండింటిలో ఏది కావాలంటే రెండు ఇచ్చేయచ్చు కదా అన్నట్లు కూర్చుని వున్నాడు యోగి కాబట్టి. యోగులే అలా కోరుకోగలరు యోగులే అట్లా కోరుకుంటారు. అమ్మ కావాలా, నాన్న కావాలా ఏవరో ఒకళ్ళని తేల్చుకో అంటే, ఎవరో ఒకళ్ళని తేల్చుకోవట మేమిటి? ఇద్దరున్నారు కదా! ఇద్దరూ కావాలి అన్నవాడు యోగి. నాన్న కావాలి, అమ్మ అక్కరలేదంటే చచ్చాడే! అమ్మ కావాలి, నాన్న అక్కరలేదంటే చచ్చాడే! కొంతమంది గొప్పకి అమ్మ అక్కరలేదు, నాన్న కావాలి అంటారు. వాళ్ళు ఈ తెలిసీ తెలియని దైవభక్తులు. అమ్మ లేనిది నాన్న లేడు. నాన్న లేనిది అమ్మ లేదు. వాళ్ళిద్దరూ ఒకళ్ళ నుంచి ఒకళ్ళు విడదీయలేని అర్ధనారీశ్వర తత్వం. అందుకని రెండూ కావాలనుకోవాలి. రెండూ సరియైన మోతాదులో వుండాలి. ఏదీ దేనినీ మించకుండా వుండాలి. అదీ యోగం. ఇదెక్కువై దానిని పడగొట్టకూడదు. అదెక్కువై దీనిని పడగొట్టకూడదు. జీవుడిగా మనం దిగివచ్చినది సృష్టి వైభవమును అనుభూతి చెందటం కోసమే. కాబట్టి వైభవం అక్కర్లేదనుకుంటే వడియం ముక్కలుగా వుంటారు. వడియాల ముక్కలుగా వుండమని పంపించలేదు దేముడు. హాయిగా సృష్టిని అనుభవించు, వైభవాన్నంతా చూడు. దానిలో ఇరుక్కుపోక అని చెబుతాడు. అందుకనే దైవంతో సంబంధం పెట్టుకొని సృష్టిని అనుభూతి చెందాలి ధర్మపరంగా. అంటే దానియందు, దీనియందు సమభావంగా అలా వున్న వాడు చక్కగా ధరించగలిగి యుంటాడు. అలా తను ధరించియున్నాడు. నేను రాక్షసులకు పనిచేయను, దేవతలకే పనిచేస్తాను అని అనడు. ఇద్దరూ సమంగా పనిచేస్తూ వుండండి. నేను ఇద్దరికీ ఆధారంగా వుంటాను, అన్నాడు. అవే మనకి దేవదానవ కథలన్నీ కూడ. అట్లా ఆ విధంగా ధరించాలి. మనం కూడా ధరించేవన్నీ అట్లా కుడిఎడమగా, వచ్చేవన్నీ కష్టాలు సుఖాలుగా వస్తూ

వుంటాయి. Material emphasis వుంటుంది ఒక రోజున. ఒకరోజు spiritual emphasis వుంటుంది. ఇదొస్తే అటు ఊగిపోయి, అటువస్తే ఇటు ఊగిపోనక్కర లేదు. ఈ రెండింటికి మధ్యన నిలబడి వుండవచ్చు. అలా ఉంటే రెండింటికి సమమైన దూరంలో వుంటాం. Equi-distant, equi-poise. ఆ equi-distance మనం maintain చేస్తున్నామా. ఏది? విష్ణుమూర్తి తాబేలుగా ఉండినట్లుగా, అటు రాక్షసులు, ఇటు దేవతలు వున్నట్లు. పైగా చూడండి దేవతలకే మిన్న. తోక ఇచ్చాడట. రాక్షసులకు విషం కక్కే పడగలు కలిగిన తలభాగం ఇచ్చాడట. ఎందుకిచ్చాడు, అదేమిటని అడిగితే నీకు బలం లేదురా, బలం కొరకు ఇచ్చానంటాడు. వీళ్ళ ప్రక్క వున్నట్లుగా కనిపిస్తాడు గానీ గట్టిగా మనం చూస్తే, రెండో ప్రక్క కూడా అంతగానూ వున్నట్లుగా కనిపిస్తాడు. అదేకదా! వాళ్ళెవరు? వాళ్ళు తనకు ఇష్టులే కదా! వాళ్ళు తనకి అత్యంత ప్రీతిపాత్రులు. చూడటానికేమో అటుప్రక్క partial పెట్టినట్లుగా వుంటాడు. ఇది మనలో కూడా మనం అవగాహన చేసుకోవాలి. పదార్థమైన ప్రపంచాన్ని, పరమార్థాన్ని రెండింటిని చక్కగా సమన్వయం చేసుకొని జీవించటం మొదలుపెట్టినట్లైతే, భగవంతుడు ఏ విధంగా సునాయాసంగా సృష్టిని ధరించి నడిపిస్తున్నాడో, మనం కూడా ఈ జీవితాన్ని అలా ధరించి నడపటానికి అవకాశం వుంటుంది.

అలాగే మహీధరుడు అంటే ఈ భూమిని ధరించినవాడు లేక పదార్థమును ధరించినవాడు. భగవంతుడి యొక్క ధారణశక్తి కారణంగా ఈ సృష్టంతా నిలబడియున్నది. భూమి మీద జీవులు, భూమి, సూర్యమండలము, సృష్టిలో వుండే గ్రహ తారకలన్నీ కూడ అలా చోటులో నిలబడి యున్నవంటే ఏ ఆధారము లేకుండా, అది భగవంతుని యొక్క ధారణశక్తి. ధరించే వాడగుటచేత ఆయన ఈ గోళాలన్నిటినీ ధరించాడు. ఈ రూపాలన్నిటినీ ధరించాడు. వీటన్నిటి యందు ఆయన కనక అదృశ్యమైతే ఇవన్నీ పడిపోతాయి. మనం కూడ మనలో, మనవలె వర్తిస్తున్న భగవంతుడు ఎవరైతే ఉన్నాడో ఆ చైతన్యం మూలంగా ఇందులోంచి తప్పుకున్నట్లైతే ఈ శరీరం పడిపోతుంది. అలాగే ఈ జీవితంలో మనం, కనపడే సమస్త జీవులన్నిటి యందు కూడ ఆ జీవుల రూపాలను ధరించి యున్న వాడిని మనం ఈ నామం ద్వారా బాగా ధ్యానం చేసుకోవాలి. కుక్కరూపాలను ధరించి యుంటాడు. మనం కుక్క అనుకుంటాం. పంది రూపం ధరించి యుంటాడు. మనం పంది అనుకుంటాం. పదార్థాన్ని ధరించడమే! రకరకాల రూపములలో నున్న పదార్థాలను పరమార్థం ధరించి యున్నాడని దర్శించ గలిగాలి. అదే ఈ పదార్థాన్ని ధరించి యున్నదని తెలుస్తుంది. ఆ ధారణ కావాలంటే చాలా ఓర్పు కావాలి. చాలా శక్తి కావాలి. ఓర్పు, శక్తి యున్నవాళ్ళు మాత్రమే ఏదైనా ధరించగలరు. మిగతావాళ్ళు ఏమీ ధరించనూ

లేరు, భరించనూ లేరు. ఆయన అన్నీ ధరించి, అన్నీ భరించి ఇట్లా మోస్తూ వుంటాడని ఆదిశేషువుగా భగవంతుని యొక్క అవతారములలో ఒకటిగా చెబుతారు ధరించి వున్నాడు అని. మనలో కూడ ఈ మొత్తం కుండలినీ శక్తిని ధరించి వుంటుంది. ఈ విధంగా ధారణశక్తి కలిగిన భగవత్తత్వాన్ని మనం బాగా భరించేవి, బాగా ధరించేవి మానవులు వరకు మనం చూచినట్లైతే 'మహీధరుడు' అంటే రాజు అనే అర్థం కూడ ఒకటి వున్నది. రాజులలో కొందరే మహీధరులు, కొంతమంది కాదు. ఎందుకంటే కొంతమంది రాజులు భూమిని ఆ విధంగా ధరించి, భరించి తమ ఓర్పుచేత, శక్తిచేత ధర్మాన్ని నిర్వర్తించి, భూమిమీద భూమికి తేలికగాను, ఆహ్లాదంగాను వుండేట్లుగా జీవులను వర్తింపచేసి వుండేట్లుగా మహాత్ములైన రాజులున్నారు. వాళ్ళను రాజయోగులంటారు. వారు నిజమైన మహీధరులు! అంటే భూమి తనదిగా కాక, భూమి తనకు అప్పచెప్పబడినది ధరించటానికి అనే భావన కలిగినవారు. సమస్తమూ మనకు అప్పచెప్పబడ్డది. మనం దాన్ని ధరించి, భరించి కర్తవ్యం నిర్వర్తించాలి అనే భావన కలిగినవారు. అటువంటి రాజులను కనక మనం ఒక్కసారి గుర్తు తెచ్చుకొన గలిగినట్లైతే అందరిలో కన్నా ముఖ్యముగా, అతిప్రాముఖ్యంగా, మకుటాయ మానముగా కనిపించే రాజు శ్రీరాముడు! రాజులలో శ్రీరాముడి తరువాతే ఇంకెవరినైనా చెపుతాం. ఎందుకంటే ఆయన యందున్న ఓర్పు ఇంకెవరి యందు మనకి గోచరించటానికి అవకాశం లేదు. చిన్నతనంలోనే విశ్వామిత్రునితో వెళ్ళి, అడవుల్లో సకలవిజయాలను సాధిస్తూ, మౌనం వహించి కార్యం నిర్వహించినాడు. ఆ తరువాత తనకు జరిగిన అన్యాయాన్ని మౌనంగా భరిస్తాడు కదా! 'Valiant' కదా ఒక సూక్తి సువర్ణ సోపానంలో. Personal injustice జరిగినచోట, వ్యక్తిగతంగా తనకు జరిగిన అన్యాయమును ధీరతతో సహించుట అనేది మనకు రాముడి జీవితంలో చాలా కనిపిస్తుంది. అంతా అన్యాయమే కదా! కానీ మౌనంగా ధీరతతో సహించాడు అంతాను. రాజ్యం తనదియైన దానిని, తనకు కాకుండా 14 సంవత్సరాలు చేసారు. మౌనంగా భరించాడు. తనతో విడిపరచలేని భాగాన్ని, అవినాభావ సంబంధం కలిగిన స్త్రీ తత్వాన్ని తననుంచి అన్యాయంగా ఒక రాక్షసభావం కలిగినవాడు ఎత్తుకుపోతే దాన్ని సహించి, దాన్ని భరించి, తన ధీశక్తితో తనవద్దకు మళ్ళీ న్యాయంగా తెచ్చుకున్నాడు. న్యాయం గదా! తనవంతు తత్వాన్ని తనయందు మళ్ళీ ఇముడ్చుకున్నాడు. మళ్ళీ ఎవరో ఏదో అన్నారని ఆమెను త్యజించడం అనేది జరుగుతుంది. రాజులకు వ్యక్తిగతమైన జీవితం ఉండటానికి వీలులేదు. వ్యక్తిగతమైన జీవితం రాజ్యభారాన్ని భరించిన తర్వాతే వస్తుంది. అంటే ముందు రాజ్యాన్ని నిర్వర్తించే ధర్మం. ఆ తరువాత వ్యక్తిగతంగా తనకు సంబంధించిన సౌకర్యాలు. అలా వుంటుంది. ఎప్పుడూ కూడ ఒక రాజు స్థానంలో, పూజ్య స్థానంలో

వుండే వ్యక్తి అంటే పదవి అనేది బాధ్యత. కానీ అది హక్కు కాదు. కాబట్టి ఆ బాధ్యత నిర్వహణలో తనకు వ్యక్తిగతంగా వుండే నష్టములు, అసౌకర్యములు, కష్టములు వీటన్నిటినీ భరించవలసి వస్తుంది. ఊరికే రాజు అవుదామనుకొంటే సరిపోదు. భరించగలిగిన వాడు మాత్రమే రాజు కాగలడు. దానిని ధరించగలగాలి. క్షమగా వుండాలి. శక్తి వుండాలి. శక్తి వుంటేనే ఓర్పు వుంటుంది. ఆ విధమైన ఓర్పే మనకు హరిశ్చంద్రుడిలో కనిపిస్తుంది. ఈ దివ్యతత్వం మహీధరుల రూపంలో ఏ విధంగా వున్నదీ మనకు తెలియాలంటే ఈ రాజుల కథలన్నీ చదువుకోవాలి. పృథు చక్రవర్తి, నలుడు, ధర్మరాజు వీరి గురించి చదువుకోవాలి. వీళ్ళందరూ జీవించిన పద్ధతి మనం కనుక క్షుణ్ణంగా చదువుకున్నట్లైతే మనకి మహీధరత్వమంటే ఏ విధంగా వున్నదో తెలుస్తుంది. భూమిమీద కొంతభాగాన్ని పరిపాలించిన రాజులు నిర్వర్తించిన తీరులో మనకి ఆ తత్త్వం గోచరించినపుడు. అటువంటి భూమి మొత్తాన్ని, అటువంటి గోళముల యొక్క సముదాయమైన మండలములుగా ఏర్పడిన ఈ మొత్తం సృష్టిలో సమస్తాన్నీ తాను ధరించి, దాన్ని భరించియుండడం అనేదాన్ని ఆలోచన చేసికొన్నట్లైతే, మనలో కూడ దానికి సంబంధించిన శక్తి పెంపొందించుకొనటానికి అవకాశం వుంటుంది. దీని ఉపాసన వలన మనలో ఓర్పు వస్తుంది. మనలో సహనం వస్తుంది. సహనం వున్నవాడు మహీధరు డవుతాడు. సహనం లేనివాడు దేనినీ పెద్దపన్నాలో నిర్వర్తించడానికి అవకాశం వుండదు. అందుకే మనకి శ్రీరాముడు, హరిశ్చంద్రుడు, నలుడు, ధర్మరాజు, అంబరీషుడు, పృథు చక్రవర్తి, పరీక్షిత్తు ఇటువంటి రాజులందరినీ మనం తలుచుకున్నప్పుడు వాళ్ళలో తమకు అన్యాయం జరిగినా తాము దానికి ప్రతిస్పందించక, ప్రతీకారవాంఛ లేక దాన్ని తమయందు ఇముడ్చుకొని, తమవంతు కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వర్తించట మనేది కనిపిస్తుంది. తనకి కాస్త కష్టం వచ్చినా, కాస్త నష్టం వచ్చినా, కాస్త అసౌకర్యం కలిగినా వెంటనే దాన్ని ఏ విధంగా తప్పించుకోవాలో అని చాలా ప్రయత్నం చేస్తాం. నష్టం కలిగితే నష్టం కలిగించిన వాళ్ళమీద దెబ్బ కొట్టాలనుకొంటాం. కష్టం కలిగినా అంతే. ఇవన్నీ భగవత్తత్త్వం లోకి రావు. ఇవన్నీ రజోగుణం లోకి వస్తాయి. భగవంతుడు సత్వగుణ సంపన్నుడిగా వుండి, భరించి, అధర్మాన్ని శిక్షిస్తాడు. భరించటం అంటే అధర్మాన్ని భరించటం కాదు. ధర్మ సమ్మతంగా నిర్వర్తించడం. రాముడు ధర్మాన్ని నిర్వర్తించడం కోసం భరించాడు అంతా. తండ్రి మాట కోసం, తండ్రికి ఉత్తమమైన గతులు కలగాలనే ధర్మం కోసం తాను రాజ్యము నందు లేకపోయినా రాజ్యానికి ఎటువంటి సంక్షోభం కలగదు, అనే ఉద్దేశ్యంతో అరణ్యానికి వెళతాడు. భీష్ముడి యొక్క ప్రతిజ్ఞకి, రాముడి యొక్క ప్రవర్తనకి మనకు ఈ తేడా కనిపిస్తుంది. భీష్ముడు కూడా రాముడి వలెనే తన తండ్రి యొక్క సుఖము, సౌకర్యము కోసం రాజ్యత్యాగం చేస్తాడు. కానీ

భీష్ముడు తాను రాజ్యము నందు రాజుగా వుండని పరిస్థితులలో ఆ రాజ్యానికి సుస్థిరత వున్నదా లేదా అని ఆలోచించలేదు అనిపిస్తుంది. భీష్ముడు చాలా త్యాగం చేసాడు. రాముడు చాలా త్యాగం చేసాడు. .భీష్ముడు మహాత్ముడే! కానీ రాముడి యొక్క త్యాగానికి, భీష్ముడి యొక్క త్యాగానికి మనం పోల్చి చూచినట్లైతే, రాముడి త్యాగంలో పరిపూర్ణమైన ధర్మం వుంది. భీష్ముడి త్యాగంలో పరిపూర్ణమైన ధర్మం లేక, ఆయన తను చేసిన భీషణ ప్రతిజ్ఞ ద్వారా తనను తాను బంధించుకొనిన వాడైనాడు. రాముని యొక్క ప్రవర్తన యందు తనను తాను బంధించుకొనిన దేమీలేదు. మనకి ధర్మస్వరూపం దానిలో చాలా సూక్ష్మంగా వుంటుంది. అది మనకు అవగాహన కావాలంటే మనలో పవిత్రత పెరిగాలి.. కాబట్టి ధర్మ పరిపాలనము నందు మాత్రము అశ్రద్ధ వహింపక కష్టనష్టాన్ని భరించి యుండడం, మనవంతు ధర్మాన్ని మాత్రం నిష్కర్షగా నిర్వర్తించడం. అలా ఈ భూమిని, ఈ సూర్యుని, ఈ సృష్టిని ఇందులో వున్న సమస్త జీవరాశులను భరించియున్న భగవంతుణ్ణి మనం ధ్యానం చేసుకోవడం కోసమే ఆదిశేషువుని ధ్యానం చేసుకోవడంగా ఇచ్చారు. ఆదిశేషువుని ధ్యానం చేసుకోవడం అంటే సమస్తాన్నీ ధరించిన భగవంతుణ్ణి, తన వేయిపడగల మీద ఈ సమస్తాన్నీ మోస్తున్నాడని మనకి మామూలుగా చెబుతారు. కాబట్టి ఆ రకమైన తత్త్వం మనం గుర్తుపెట్టుకున్నట్లైతే, మనకి కూడా జీవితంలో రకరకములైన సమస్యలు వచ్చినపుడు వాటిని భరించే శక్తి వస్తుంది. లేకపోతే మనకి అసహనం పెరిగి, ఇంకొంచెం తప్పులు చేస్తూ వుంటాం. ఇతడు సమస్తాన్నీ ధరించి ఉండగలగాలి. ధరించి వున్నట్లయితే దానికి తాను రాజు అవుతాడు. దేన్ని తాను ధరించి వున్నట్లయితే, దానియందు తనకి స్వామిత్వ ముంటుంది. దేన్ని తాను ధరించలేక పోతున్నాడో అపుడు ఆ ధరించలేని విషయమేదైతే వున్నదో అది మనమీద స్వామిత్వాన్ని సంపాదించుకుంటుంది. చిన్న చిన్న విషయాలే మనం ధరించలేం, భరించలేం. అంటే ఏమిటి ఆ చిన్న విషయాలు మనమీద స్వామిత్వాన్ని పొంది వున్నాయి. మనం ఆ విషయముల యందు బానిసలై యుంటాం. దేన్నయినా భరించగలిగే శక్తి కలిగి ఉండే ఈ నామంలో ప్రత్యేకంగా ఇవ్వబడియున్నది. ఆ విధంగా రకరకముల సన్నివేశములలో మనకు అవతారమూర్తిగా భగవంతుడు దిగివచ్చినపుడు ధరించినవి, భరించినవి బోలెడున్నాయి. అందుకని ఏ మతమైనా సరే మొట్టమొదట చెప్పే భగవంతుని కళ్యాణగుణం, మనం సాధనా పరంగా నేర్చుకోవలసినదీ ఏమిటయ్యా అంటే 'క్షమ'. ఇంగ్లీషులో 'tolerance' అంటాం. అది లేనపుడు చలికాలం చలి భరించలేము. భరించకేమి చేస్తావు? ఏడవటం తప్ప భరించాలి కదా! పోనీ ఎండైనా ఇస్తాను తీసుకోరా అంటే అబ్బెబ్బే. మార్చి రాగానే మొదలుపెట్టేస్తాం ఈసారి ఎండాకాలం ఎండ చాలా ఎక్కువగా వున్నది అని.

ప్రతిసారీ అదే మాట. మనం ఏ ఎండాకాలం ఈ మాట అనకుండా వదిలేసాం? ఎండాకాలం ఎండ పనికిరాదు శీతాకాలం చలి పనికిరాదు. అపుడేమో చల్లగా వుంటే బాగుండు ననుకుంటాం. ఇపుడేమో వెచ్చగా వుంటే బాగుండు ననుకుంటాం. ఏదన్నా ఉన్నది తప్ప ఇంకొకటి బాగుంటుంది. భగవంతుని సృష్టిలో మానవుడికి వున్న వికృతమైన ఒక భావన! ఉన్నది బాగుండదు, లేనిది కావాలి. అది వస్తే అది బాగుంటుందని ఉందా? చాలామందికి చాలా కావాలనుకొని అది పొందిన తరువాత ఇంతేనా అనిపించింది. మన జీవితంలో మనకే సత్యం! కోరి పెళ్ళి చేసుకొని బాధపడుతున్నవారున్నారు కదా! పిల్లలు లేక బాధపడుతున్న వారున్నారు. ఆస్తులు సంపదించుకొని బాధపడుతున్న వారున్నారు. పదవి కావాలనుకొని, పొంది, బాధపడుతున్న వారున్నారు. కీర్తి కావాలనుకొని పొంది, బాధపడుతున్న వారున్నారు. కీర్తి కావాలనుకున్న చోట అపకీర్తి వుంటుంది. పదవి కావాలనుకున్న చోట పదవీచ్యుతి వుంటుంది. ఏదన్నా కావాలనుకుంటే దానితోపాటు ఇంకొకటి కూడ వస్తుంది. అందుకని ఏదన్నా మనం ఉన్నదానితో తృప్తి పొందక, లేనిది కావాలనుకుంటూ వుంటాం. అది మనకి అసహనానికి దారి తీస్తుంది. ఇది చలికాలం ఇక్కడ వున్నాం తప్పదు భరించు. ఇక్కడ వున్నావు ఫరవాలేదు. ఉత్తర దక్షిణ ధృవాలలో వున్నవాళ్ళు భరిస్తున్నారు కదా మనకన్న ఎక్కువగా. మనకేమిటంటే ఒక పూట తలక్రింద దిండు సరిగా కుదరకపోతే కోపం వచ్చేస్తూ వుంటుంది. లేకపోతే వేసవికాలం మనకు కరెంటు పోతూ వచ్చిందనుకోండి. ఆ రోజు మనం మాట్లాడే మాట, మనం చేసే చేష్టలు మనం చూసుకుంటే మన సాధనలలో మనం ఎంత ముందుకున్నాం మనకు తెలుస్తూ వుంటుంది. అన్ని విషయాలలోను మన సహనం చూస్తే బొత్తిగా ఆవగింజంత వుండదు. ప్రతిదానికీ చిరాకే. ప్రతిదానికీ కోపమే. ప్రతిదానికీ అసహనము. ఏదీ ధరించలేం, ఏదీ భరించలేం. ఏ మనం స్థితిలో వున్నాం? ముందు మనకి సాధనలో శనిగ్రహం యొక్క సాధన ఇస్తారట. నిజంగా ఆధ్యాత్మిక సాధన చేసుకుందాం, ఆత్మతత్వాన్ని దర్శనం చేద్దాం అని, ఊరికే గొప్పగా అనుకోవడం వేరు. దానియందు నిలబడడం వేరు. మనకే మవుతుందంటే ఈ సాధన చేస్తున్నపుడు, మొట్టమొదట శనిగ్రహం యొక్క ప్రభావం మనమీద లేకుండా గురువు మనకి దానికి సంబంధించిన శిక్షణలో నియమిస్తాడు. అందులో ఉత్తీర్ణుడైన వాడిని శుక్రగ్రహ సంబంధమైన అనుభూతి పరమైన శిక్షణలో నియమిస్తాడు. ఇంకా చక్కగా సాధన చేసుకున్న శిష్యుడికి బుధగ్రహానికి సంబంధించిన వెలుగు లోకాల్లోకి ప్రవేశం ఇస్తాడు. అక్కడనుంచి ఇంకా ముందుకు వెళ్ళి, సూర్యగ్రహానికి సంబంధించిన ఆత్మతత్వాన్ని మనకి అందిస్తాడు. అట్లా నిచ్చెనలో నాలుగున్నాయి. శని, శుక్రుడు, బుధుడు, సూర్యుడు. ఆత్మతత్వం తెలియాలంటే, ముందు సాధన శనితో

మొదలవుతుంది. శనిగ్రహం ఇచ్చిన శిక్షణ కారణంగా మిగతా వాటికి అర్హత వస్తుంది సాధకునికి. శనిగ్రహం ఇచ్చే శిక్షణ ఏమిటయ్యా అంటే, మనం దేనియందు పరిమితత్వం కలిగియుంటామో, ఆ పరిమితత్వాన్ని తొలగించటానికి శని ప్రయత్నం చేస్తుంది. మనలో వుండే పరిమితత్వం అనే పరిధిని ముందు పగలగొట్టాలి. అది పగలగొడితే తప్ప వికాసం రావటానికి వీలులేదు. గుడ్డులో వున్న పిల్ల బయటికి రావాలంటే, అది పెరిగి ఆ గుడ్డుని పగలకొట్టుకుంటేనే కదా బయటికి రాగలదు. అట్లాగే ప్రతి జీవుడు తనని తాను తన శరీరంలో మూడు రకాలుగా బంధనం వేసుకున్నవాడు, తనని స్వతంత్రుడిగా తయారు చేసుకోవాలంటే మూడు రకాల పరిమితత్వాలను దాటాలట. ఒకటి భౌతికలోకానికి సంబంధించిన పరిమితత్వం, రెండవది కోరికల లోకానికి సంబంధించిన పరిమితత్వం, మూడవది భావాలకు సంబంధించిన పరిమితత్వం. ఈ మూడు పరిమితత్వాలు దాటితే మనలో ఉండే మూడు గ్రంధులు భేదించబడతాయిట. అది మనం చదువుకుంటాం గ్రంధి విభేదనంగా. ఈ మూడు గ్రంధులు మనలో చలనం జరగాలంటే భౌతికంగా మూడు రకాల పరిమితత్వాలు, మళ్ళీ మూడు లోకాలలో కూడా మూడు రకాల పరిమితత్వాలు వుంటాయి. భౌతికమైన లోకంలో మనకి పరిమితత్వం ఎట్లా వుంటుందంటే, భౌతికమైన సౌకర్యము లేనపుడు దుఃఖం చెందకుండా వుండటం. భౌతికమైన సౌకర్యములు ఉండకూడదని కాదు. ఉండవచ్చు. అది లేకపోతే బాధపడకూడదు. రాజప్రాసాదాల నిర్మాణం చేసుకొని, మణిమయమైన భవనాలలో నివసించే ఒకావిడను తీసుకొనిపోయి ఆరడుగుల గదిలో పడవేసారు. మొదటి రోజు ఎంతో భయంకరంగా వుంటుంది ఆమెకి. ఆత్మహత్య చేసుకుందామనేటంత బాధగా వుంటుంది. రెండవ రోజుకి నెమ్మదిగా, మూడవ రోజుకి ఇంకొంచెం, నాల్గవ రోజుకి ఇంకొంచెం ఒక పది, పదిహేను రోజులు పోయేసరికి అలవాటై పోతుంది. అందుకే ఈ పరిమితత్వం మనకుండే పట్టు వల్ల వుంటుంది తప్ప, అక్కడేం లేదు నిజానికి. నిద్ర పోకపోతే అసౌకర్యంగా వుంటుంది కొంతమందికి. రాత్రి నిద్ర పోకపోతే వాడికి కోపం వస్తూ వుంటుంది నిద్ర పోయిందని. అటువంటి వాడికి ఏదో రాత్రిపూట ఇంట్లో పెళ్ళో లేక ఇంట్లో వాళ్ళకు బాగుండక రాత్రిపూట హాస్పిటల్లో కూర్చోటానికి కూడా చోటు లేకుండా ఉండాల్సి వస్తుంది. అప్పుడేమి జరుగుతుంది? పెద్ద బాధ్యతలు వున్నప్పుడు ఈ చిన్న అసౌకర్యాలు వర్తించవు. ఇలా గురువు, సాధన చేసే సాధకులకు ముందు ఏం చేస్తాడంటే శనిగ్రహాన్ని అనుగ్రహిస్తాడట. ఏ గురువైనా అంతే. ప్రత్యేకించి మాస్టర్ సి.వి.వి. గారికి కొంచెం ఎక్కువ అపవాదు వచ్చింది కానీ, గురువు లెవరైనా సరే నిజంగా ఒక శిష్యుడిని అనుగ్రహించాలంటే, రకరకాలుగా వాణ్ణి ఉద్ధరించుకోవాలంటే వాడికుండే పరిమితత్వాలను తీసేయాలి. అందుకనే

భౌతికమైన అసౌకర్యము. రెండవది తనచుట్టూ వుండే సంపద! ఆ సంపదకి సంబంధించిన సౌకర్యం వుంటే ఎట్లా వున్నాడు? లేకపోతే ఎట్లా వున్నాడు? అది మనకు జనకుడి కథగా వస్తుంది. జనకుడు మహారాజు. సమస్త సంపదలు వున్నప్పటికీ కూడ దానియందు తను జీవించడు, అవి వుంటే వాటిని నిరాకరించడు. అలాగే స్త్రీ, పురుష వాంఛ. అది లేకపోతే బ్రతకలేం అని చెప్పేవాళ్ళు కొంతమంది వుంటారు. ఇట్లా మనకి భౌతికమైన లోకంలో కొన్ని పరిమితమైన భావాలున్నాయి. అలాగే కామమయ లోకంలో గట్టి కోరికలు కలిగి వుండడం. నీవు ఎంత కోరితే అది నీకు వ్యామోహమై అంత అడ్డమొస్తుందని 'గోదావైభవం'[1] అనే కావ్యంలో చెప్పారు. నీవు ఎంత గట్టిగా కోరితే అంత ఆ కోరిక నెరవేరడానికి అడ్డంగా వస్తుంది. 'ఏమైనా సరే నిన్నే పెళ్ళి చేసుకుంటానంటుంది' గోద, శ్రీకృష్ణుడి దగ్గర. ఆయన ఆమెను శ్రీరంగడికిచ్చి పెళ్ళి చేసేస్తాడు. 'ఎందుకిట్లా చేసావు' అంటే, 'రూపానికి అతీతం అనే స్థితిలోకి నీవు ఉద్ధరించబడాలని. ఆ రూపాన్ని నీవు ధ్యానం చేసుకున్నావు. ఆ రూపం ఒకటే కాదు కదా! నాకు చాలా రూపాలున్నాయి కదా! అన్ని రూపాల్లో నన్ను దర్శించే అపరిమితత్వం లోకి నీవు ప్రవేశించాలి' అని చెప్తాడు. రాముణ్ణి ప్రార్థిస్తే, కృష్ణుణ్ణి ప్రార్థిద్దామా, వద్దా అనిపిస్తుంది. కృష్ణుణ్ణి ప్రార్థిస్తే, హనుమంతుడికి దండం పెట్టాలా వద్దా అనిపిస్తుంది. హనుమంతుణికి దండం పెడితే మళ్లీ వినాయకుడికి పెట్టాలి. ఎవరికి ఇందులో మానేయాలి, పెట్టాలి? ఇట్లా ఎన్నో రకాలుగా వుంటుంది మనస్సు నిండా. ఇవన్నీ పరిమితత్వాలే! ఇన్ని రూపాలలో నుంచీ వ్యక్తమవుతున్నది నేను ఒకడినే కదరా! అనే భావన నిజంగా ఎవరికన్నా కలిగిందా? కలిగితే వాడు అదృష్టవంతుడు. కలిగితే ఒకదానికన్న ఒకటి ఎక్కువ ప్రాముఖ్యమైన భావనలో జీవిస్తూ వుంటాం గదా! అంటే ఏమైంది? రూపంలో ఇరుక్కున్నావు కదా! అది పరిమితత్వమే కదా! నీవు ఎంత కోరుకుంటే, నీవు కోరుకున్నది నీ పరిమితత్వమే అవుతుంది. వచ్చింది అంగీకరించట మనేది అక్కడ సాధనగా ఇస్తారు. మొదట భౌతిక లోకాల్లో సౌకర్యం, అసౌకర్యం వున్నచోట సాధన వుంటుంది. కామమయ లోకాలలో జీవితం నీకు అందించింది తీసుకొని తృప్తిపడటం అనేది, తృప్తిపడక చేసేదేమీ లేదు. ఎందుకంటే లేకపోతే బాధే కదా! మీకు ఇష్టం లేనిచోటుకి బదిలీ చేసారండి. రకరకాలుగా ప్రయత్నం చేస్తాం కదా! అవదు. ఎవరికి అవదో తెలుసా? గురువుకి ఎక్కువ సన్నిహితంగా వున్న వాడికి అసలు అవదు. మరి గురుదేవులలో వున్న విషయమే అది! ఆయన ఏమి చెప్పారంటే, వచ్చింది పుచ్చుకో, తృప్తి పడు అని చెప్పారు. అలాగే సర్, తప్పకుండా అని చెప్పి వచ్చాం. వెళ్ళగానే ఇచ్చారు ఒకటి పుచ్చుకుంటావా లేదా అని. ఏది వస్తే అది పుచ్చుకోవటం అనేది భాగవత ధర్మం! దానినే భగవంతుడు మనకు ప్రస్తుతం ప్రసాదంగా ఇచ్చాడు అందుకుందాం. అదికాక

ఇంకొకటి కావాలనుకోవటంలో ఇంకొకటి రాదూ, ఉన్నది అనుభవించలేవు. మొత్తం బాధలో వుంటాం. అంటే పరిమితత్వం పెట్టే బాధే కదా అది. అందుకనే మహాత్ముల జీవితాలు మనం చూసుకున్నట్లైతే, కష్టం దగ్గర్నుంచి వచ్చింది ముందు అందుకున్నారు. అందుకొని, అందులో వాళ్ళ కర్తవ్యాన్ని నిర్వర్తించారు. అంతకుమించి ఎక్కువ, తక్కువ చేయలేదు కదా! ఉన్న పళంగా రాజ్యాన్నంతా విశ్వామిత్రుడు పట్టుకుపోతే, పెళ్ళాన్ని పట్టుకుపోయి, కొడుకుని పట్టుకుపోయి ఏమిటండి అది? ఈ కథలన్నీ ఎందుకిచ్చారండి? నలుడి కథ, ఆ ధర్మరాజు మాటేమిటి? రాముడి మాటేమిటి? వీళ్ళందర్నీ మనం చూసినట్లైతే, మౌనంగా, వ్యక్తిగతంగా తమకు జరిగిన అన్యాయమును ధీరతతో సహించుట కదా! అలా మనకి రెండవ చోట అంటే కామలోకంలో కోరికలు నెరవేరటం అనేది పెట్టుకోబోకు. నీకేది కావాలో నేను ఇస్తాను. ఇవ్వని దాని గురించి ఏడవక. నేనే ఇవ్వలేదనుకో అని చెబుతాడు ప్రతి గురువు. గురువుకి సమర్పణ చేసుకోవటం అంత సులభమైన విషయం కాదు. మనం ఏదో గురువు ముందు ఒక fashion, రెండవదేమో ఒక అల్లాఉద్దీన్ అద్భుతదీపం లాగ మనకు ఎప్పుడు కావాలన్నా, దానిని మూడుసార్లు తోమితే వాడొకడు పుడతాడు, పుట్టి మనకి చేస్తాడు అని. అంతేకదా! మూడుసార్లు తోమడమే కదా సి.వి.వి అనడం. మూడుసార్లు తోమితే మనకు కావలసినది అయన చేయడు. తోమినకొద్దీ ఆయన ఏం చేస్తాడంటే, మనకి ఏది అవసరమో అదే చేస్తాడు. మిగతాది చేయడు. నిజమైన గురువు అంతే! గురువు తల్లియై వుంటాడు, తండ్రియై వుంటాడు. తల్లి ముందు ఏదో అడిగిందల్లా ఇచ్చినట్లుగా, గారాబంగా చూస్తూ వుంటుంది. తండ్రి అట్లా చేయడు. వాడికి ఏది తోస్తుందో అది చేస్తాడు. అందుకని రెండవస్థితిలో మనకి సహనం అవసరం. 'మహీధరః' అనే భావనను సాధన చేసుకోవాలి అంటే సహనం అవసరం. ఊరికే భగవంతుని యొక్క వైభవం చెప్పుకెళ్ళిపోతే, ఓహోహో చాలా బాగుందనుకుంటాం. ఇంటికెళ్ళిపోతాం. అది మనయందు కూడా యున్నది. అది మనకి కూడా వీలుపడుతుంది. ఎప్పుడు వీలు పడుతుంది? అందుకున్నప్పుడు అంగీకరించినప్పుడు వీలుపడుతుంది. మాస్టర్ సి.వి.వి. గారు ఏం చెప్పారంటే 'నాకు దండం పెట్టుకున్నవాడు ప్రతీవాడు కూడా ఆ రోజునుంచి జీవితంలో వచ్చేవి అంగీకరించాలి. అంగీకరించి, వాటిలో తమ కర్తవ్యాలు నిర్వర్తించాలి. తద్వారా వాడిని ఉద్ధరించుకుంటాను' అన్నారు. నేను ఇంకొక ఊరు వెళ్ళనండి అంటే, పరిమితత్వమే కదా! నేను ఇంకొకళ్ళ ఇంటికి వెళ్ళనండి అంటే ఇంకొక పదిళ్ళకి పంపిస్తాడాయన. తిరిగి తిరిగి ఇంటికొచ్చి ఒక నెలరోజుల పాటు ఎక్కడికన్నా వెళ్ళకూడదనుకుంటుంటే, వెంటనే phone వస్తుంది. Case పడ్డది రండి అని. పోతే పోయిందని వదులుకొంటే, ఎవరో తెలిసినవాడికి

జబ్బు చేసింది serious గా వున్నారు రండని వస్తుంది. ఏం చేస్తావు? అందుకని ఏమిటో తెలుసా? ఇట్లా జరగాలనేది నీ పరిమితత్వమే! ఒకసారి మనం గురుపూజలు చేస్తుంటే వర్షం పడ్డదండి. మనం గురుపూజలు చేస్తుంటే వర్షం పడ్డం ఏమిటి అంటే? ఎందుకు పడకూడదు? అన్నారు మాస్టారు. 'వర్షం పని వర్షం చేస్తుంది. మన పని మనం చేద్దాం' అన్నారు మాస్టారు. అంటే నా అంతటివాడు గురుపూజలు చేస్తుంటే వర్షం పడుతోంది అనుకుంటే అది రజోగుణం. ఒకసారి దాదాపు రెండు నెలల వరకు కాలి మీద కురుపుతో మాస్టారు బాధ పడ్డారు. 'మీ అంతటి వారికి కురుపెందుకు రావాలి?' అంటే, 'ఎందుకు రాకూడదు?' అన్నారాయన. ఎందుకంటే, ఈయన ఎందుకు రాకూడదు అని అనుకుంటాడో లేదో చూద్దాం అనే కదా, ఆ పైన వున్నాయన చూస్తూ వుంటాడు. నాకు కురుపెందుకు వచ్చింది? అని సి.వి.వి. గారిని అడగరు, మాస్టారు. ప్రతిదానికీ ముందు complaint ఇస్తాం మనం. మన prayer అంతా complaint box! ఊరికే అందులో complaints పడేస్తూ వుంటాం. అది ఇట్లాజరిగింది, ఇది ఇట్లా జరిగింది అని. ఎన్ని చేసినా సందేహాలే వుంటాయి. ఎందుకని వుంటాయంటే, 'నీవు అది కాదురా! మన original agreement ఒకసారి చూసుకో' అంటారు సి.వి.వి. గారు. మన agreement దాచేసి కబుర్లు చెపుతావేంటి? నీకు, నాకు agreement ఏమిటయ్యా అంటే, మూడు conditions దానిలో 1. నాకు దండం పెట్టిన తరువాత వచ్చినది పుచ్చుకో. 2. నీ గురించి ఎవరి దగ్గరా ఇట్లా పెట్టకు చెయ్యి. నీ చెయ్యి క్రిందగా పెట్టక. ఎవ్వరినీ ఏమీ అడగకు. నన్ను అడుగు దరిద్రం వుంటే. వెంటనే చేస్తా. అది ఇవ్వనన్నా ఇస్తా, లేకపోతే ఆ భావనన్నా తీసేస్తా. రెండూ ఒకటే. ఒక లక్ష రూపాయలు కావాలనిపించిందనుకోండి, ఊరిలో ఎవరినన్నా అడిగితే ఇస్తారండీ లక్ష రూపాయలు? లక్ష రూపాయలు నాక్కావాలని మాస్టారిని అడిగామనుకోండి. లక్ష రూపాయలు వచ్చేటట్లుగన్నా చూస్తారు లేకపోతే లక్ష రూపాయలు కావాలనేది తీసేస్తారు. పీడా వదిలిపోతుంది. కావాలనుకోవటం వల్ల కదా బాధ. ఇల్లు లేకపోతే ఎట్లా? అనిపించిందనుకోండి మనకి. కొన్ని అనిపిస్తాయి మామూలుగా. మానవ సహజం కదా! ఇల్లు లేకపోతే ఎట్లా అనుకుంటే? ఉండాలని రూలేముంది? ప్రతివాడికీ ఇల్లు వుండాలనే సిద్ధాంతమేమన్నా ఉన్నదా? ప్రతివాడికీ పిల్లలుండాలని సిద్ధాంతం వున్నదా? ఇట్లా ఉండాలనుకొనేది మనం అనుకోవడమే కదా! అలా కాకుండా జీవితం ఎట్లా వుండాలో, ఎవరికి సంబంధించింది వాడికి సన్నివేశాల ద్వారా ఇస్తూ వుంటుంది. అంగీకరించి ముందు పుచ్చుకోవాలి. మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. లేనిది కావాలనుకుంటారు, ఉన్నది అనుభూతి చెందరు. శుక్రగ్రహం యొక్క అనుభూతి అంటే ఏమిటో తెలుసా? శని తరువాత శుక్రుడిలోకి కదా వస్తాం. ఉన్నది

పరిపూర్ణంగా అనుభూతి చెందగలిగే యోగ్యత వుండాలి. అదీ శుక్రగ్రహం! ఉన్నది అనుభూతి చెందకుండా, లేనిదాని కోసం వెంపర్లాడేవాడికి ఏ సాధన ఇవ్వాలి? లేనిది అట్లా ఉంచరా. లేనిదెట్లాగూ లేదు. ఉన్నదాని సంగతేమిటి? చాలామంది ఇంట్లో వుండే వాళ్ళని అశ్రద్ధ చేస్తాం. వాళ్ళు వెళ్ళిపోయింతర్వాత వాళ్ళ పటాన్ని ఊరికే పూజలు చేస్తూ వుంటాం కదా! అప్పుడేమి చేసినా ఉపయోగం లేదు, పటమేగా! మాస్టారు గారున్నపుడు మాస్టారు గారికి సేవలు చేసుకున్నవారు, మాస్టారు గారు వెళ్ళిపోయిం తర్వాత మాస్టారు గారి పటానికి సేవ చేసుకున్న వారికి చాలా తేడా వున్నది. ఉన్నప్పుడు ఏమి చేసావు? ఏమీ చేయలేదు. లేనప్పుడు ఏడుస్తావు. నీకు అప్పుడూ దొరకలేదు ఇప్పుడూ దొరకలేదు. అట్లాగే ప్రదేశాలు, అట్లాగే వస్తువులు. నీ దగ్గర చేరింది నీకు భగవంతుడు అప్పచెప్పింది, దానియందు నీవు శ్రద్ధ వహించి, తద్వారా అనుభూతి పొందు తప్ప, దానిని మర్చిపోతే ఏమవుతుంది? మనింటి నిండా బోలెడు music cassettes వుంటాయి. అక్కడా అక్కడా వెళ్ళిన చోటల్లా భక్తిగా కొనేస్తాం. అవన్నీ ఇంట్లో వుంటాయి. ఎప్పుడన్నా విన్నావా? ఇంకొకటి ఎందుకు కొంటున్నావు? ఇట్లా వుంటాయి మనవన్నీ కూడ. ఇది పోవాలి. ఇది పరిమితత్వం. ఇలా కావాలి నాకు అంటే అలా ఎందుక్కావాలి అని అడుగుతారు గురువు. ఇట్లా జరగాలి అని అనుకోకూడదండి సాధకుడు. ఎవరికి, ఎప్పుడు, ఎక్కడ, ఏదన్నా జరగచ్చు అనిచెప్పి, ఒక వాక్యాన్నిచ్చారు మాస్టరు గారు. ఎందుకు జరగకూడదు? నీవేమిటి పెద్ద? ఇచ్చింది పుచ్చుకున్న వాడు సత్త్వగుణం లోకి ఎక్కినవాడు అవుతాడు. అలా కానపుడు పరిమితత్వం! ఆ పరిమితత్వంలో ఎవరికి బాధ? పరిమితత్వం వున్న వాళ్ళకే బాధ కదా! ఏదన్నా లేనిదాని గురించి ఆలోచించటం అనేది మానేయాలి. దానికి సంబంధించి, సాధించుకొనే ప్రయత్నం చేయాలి తప్ప, లేదని ఏడవవద్దు. ఉన్న దానితో తృప్తిపడి, లేనిదానికి కావాలంటే ప్రయత్నం చేసుకుంటూ ఉండండి. లేదు అనే భావన వద్దు. మన కవసరమైనది మనకు మాస్టరు గారు ఇస్తారు. మన కర్తవ్యాలు మనం నిర్వర్తించుకుంకొంటూ వుందాం అనేవాడు సాధకుడౌతాడు. అలా కానివాడు సాధకుడవడు. వారందరికీ photo వెక్కిరింపుగా వుంటుంది. గురువు చెప్పినట్లు పద్ధతిలో జీవించటానికి నడుం కట్టుకున్నట్లైతేనే photo పెట్టుకోవాలి. లేకపోతే పెట్టుకోవద్దు. పెట్టుకుంటే మనం ఆయన మాట వింటామనుకొని ఆయన మనకు ఏదో programme ఇస్తాడు. మనకది కష్టంగా అనిపిస్తుంది. ఇదంతా శనితో సంబంధించిన సాధన! కోరికలు దాటిం తర్వాత భావాలుంటాయి. భావాలు కోరికలకు సంబంధించినది కాదు. మనకుండే అభిప్రాయాలు, వీళ్ళు మంచివాళ్ళు, వీళ్ళు మంచివాళ్ళు కాదు. ఇది మంచి ప్రదేశం, ఇది మంచి ప్రదేశం కాదు, ఇది మంచిది, ఇది మంచిది కాదు ఇట్లా మనం

అంతా నిర్ణయాలు చేసుకుంటాం కదా! అవి అన్నీ కూడా భావముల యందుండే పరిమితత్వం. మనకు భావముల వలన పరిమితత్వ మున్నది. కోరికల వలన పరిమితత్వ మున్నది. భౌతికమైన పరిసరముల వలన పరిమితత్వమున్నది. ఈ మూడు పరిమితత్వాలు వున్నంతకాలం సహనం వుండదు. అందుకని సాధనలో మనకి మొట్టమొదటిగా ఈ మూడింటి యందు మనకుండే దృక్పథాన్ని మార్చడానికి ఒక ప్రయత్నం జరుగుతుంది. నీకు ఏది అత్యంత ప్రియమైనదో, దాన్ని కొంచెం పెకిలించి చూస్తాడు. రాముడికి సీత లాగేసాడు. ధర్మరాజుకి చక్రవర్తిత్వం లాగేసేలా చేసాడు. శ్రీకృష్ణుడు భాగవతంలో 'నీకు చాలా ప్రియమైనదేదో అదొక్కసారి నోట్లో పెట్టేసి మాయం చేసేస్తాను. అపుడు ఊరికే నేను ప్రియం, నేను ప్రియం అంటున్నావు కదా! మరి నాకన్నా నీకు ఇంకొకటి ప్రియం వుండకూడదు కదా నిజంగా నీవు ఆ మాట అంటే! కాబట్టి నీకు ప్రియమైనవన్నీ ఇంకేవీ వుండవు. నేనే మిగులుతాను. నీవు దానికి సిద్ధమేనా?' అని అడుగుతాడు. మనకేమిటంటే అన్నీ కావాలి. వాటితోపాటు భగవంతుడు కూడా కావాలి. అదీ వచ్చింది! ఎందుకయ్యా నీకు భగవంతుడు అంటే, నీకు పనులు చేసిపెట్టటానికి కావాలి. ఏమో ఎప్పుడే కష్టం వస్తుందో? ప్రక్కన వుంటే మంచిదని. ఈ భావాలన్నీ కూడ మనలో సహజంగా వుంటాయి. ఎందుకంటే మనం బలహీనులం కాబట్టి. కానీ మనం నమ్మిన గురువో, దైవమో 'సమస్తాన్నీ శాసించేవాడు' అనే నమ్మకం మనకు వున్నట్లైతే, ఆయన శాసనంలో మనం వున్నట్లైతే, మనం ఎక్కడా నశించం అనేది తెలిసి వుంటుంది. కాబట్టి ఆ విధమైన నశించని స్థితియందు నిలబడాలంటే, పరిపూర్ణమైన ప్రగాఢమైన విశ్వాసం, మనం ఎవరికి దండం పెడుతున్నామో వారియందు వుండాలి. లేకపోతే దండం పెట్టడం ఎందుకు? అలా విశ్వాసం ఉంచి చేసుకొనినట్లైతే ప్రతివాడి లోను సహనం పెరుగుతుంది. గురుపూజలలో మూడు పూట్ల, మూడు రాత్రులలోను నిద్రపోకుండా వుంటారు కామేశ్వరరావు గారు. ఎంత సహనం కావాలి దానికి? వంటింట్లో మంటల దగ్గర వుండి! అవలేదని కొంతమంది, అయిందని కొంతమంది, ఉడకలేదని కొంతమంది, ఉడికిందని కొంతమంది, బాగాలేదని కొంతమంది, బాగుందని కొంతమంది, ఇంకా అవలేదా అని ఇట్లా రకరకాలుగా వుంటాయి కదా! మరి అక్కడ పరిపూర్ణమైన సహనం కలిగినవారు కొంతమంది పనిచేయబట్టి గురుపూజలు మిగతా వారందరికీ అనుభూతి నిస్తాయి. మరి ఆ విధంగా మనం సహనాన్ని పెంచుకోవాలి. సహనాన్ని పెంచుకోవటం ఎట్లా పెంచుకోవడం? భరించడం, ధరించడం. అందుకని కష్టాలు వస్తాయి జీవితంలో. కష్టం అంటే ఏమిటి? మనకున్న దృక్పథమే! ఇట్లా కాకూడదు అని అంటే, 'అట్లా ఎందుకు కాకూడదు' అని అంటారు గురువు గారు. ఎందుకంటే ఆ angle నీలో neutralise చేయాలని. ఒకాయన

సి.వి.వి. గారికి దండం పెట్టుకున్నారు. ఊళ్ళో ఉద్యోగంతో పాటు వ్యాపారం, వ్యాపారంతో పాటు ఆవులను, గేదెలను పెంచటం, ఆ పాలు అమ్ముకోవడం ఇవన్నీ కూడా చేసుకుంటూ, మాస్టారు గారి దగ్గరకువచ్చి 'నాకు కూడ ఉపదేశం చేయండి' అని అడిగాడు. 'చేస్తే మొత్తం foundation కదులుతుంది ఫర్వాలేదా' అని అడిగితే, 'ఫర్వాలేదండి దానికేమి' అన్నాడట. సి.వి.వి. అని ఉపదేశం తీసుకున్న నెలరోజుల లోపల ఆయనకి transfer అయిపోయింది. చాలా గొడవ చేసాడు. 'ఈ వ్యాపారం ఏం చేయను, ఈ గేదెలనేం చేయను, ఈ ఆవులనేం చేయను?' అంటే 'అది నీవు చూసుకో నాకు సంబంధం లేదు. నీవడిగావు. నేను ముందే చెప్పాను నీకు. ఇవన్నీ కదులుతాయని. ఇవన్నీ అవసరం లేదు నిజానికి. ఉద్యోగం చేసుకున్నదాంతో నీకు సరిపోదా? నీకు ఆవులెందుకు, గేదెలెందుకు, పాలాలెందుకు, వ్యాపారా లెందుకు? ఎందుకురా ఇవన్నీ చేస్తున్నావు? అందుకనే ముందు నీ programme clear చేయటానికి ఒక చిన్న cut-off ఇచ్చాను. మరి సి.వి.వి. కావాలన్నట్లైతే మళ్ళీ ప్రయత్నం చేయకుండా బళ్ళారి transfer చేసేసారు కదా వెళ్ళిపో' అన్నారు. మళ్ళీ దగ్గర కూడా కాదు. అనకాపల్లి, రాజమండ్రి అయినట్లైతే, ఉండి చూసుకోవచ్చు. అందుకని ఏకంగా బళ్ళారి పంపించేసారు. ఊరుకున్నాడు. మనకి minimum programme వుంచి, మిగతావన్నీ లేకుండా చేస్తారు మాస్టారు. అదీ రక్షణ! అక్కర్లేని చోటకు వెళ్ళనివ్వరు. మనమెంతో తాపత్రయపడతాం అక్కడ కెళితే బాగుంటుంది, ఇక్కడ కెళితే బాగుంటుంది అని. వెళితే బాగుండదురా నీకు. నీకు తెలియదని ఆయన ఆపుతూ వుంటారు. మనమేమో గురువు గారికి దండం పెట్టుకుంటే ఆపేస్తారు అనుకుంటాం. ఆపకపోతే చస్తాం అని. అట్లాగే అన్ని విషయాలలో కూడ నీవు గట్టిగా కోరింది మాత్రం కాకుండా జాగ్రత్తగా చూసుకుంటా డాయన. ఎందుకంటే, ఎందుకు కోరాలి? కోరి ఎందుకు బాధపడాలి అనేది అవగాహన రావాలి. అట్లాగే నీకు ఇష్టం లేనివాడు నీ ఇంటికి వచ్చేట్లు, నీకు ఇష్టం లేనివాడి ఇంటికి నీవు వెళ్ళేట్లు ఇట్లా చేస్తూ వుంటాడు. అదేకదా 'Enemies beware of yourselves' అని మంత్రం. అది నీలో వుండే పరిమితత్వమే కదా! వీళ్ళతో మాట్లాడకుడదు. వీళ్ళతో మాట్లాడాలి. వీళ్ళని మనం ప్రేమగా చూడకూడదు, వీళ్ళని ప్రేమగా చూడాలి. మనవాళ్ళు, మనవాళ్ళు కానివాళ్ళు ఇవన్నీ ఏమిటి? పరిమితత్వాలే కదా! అవన్నీ ఆయనకు నచ్చవు. ఎందుకు నచ్చవంటే మనం పరిమితంగా ఉండటం ఆయనకు నచ్చదు. సహజంగా అపరిమితులమై యున్న వాళ్ళం, ఎందుకిట్లా పరిమితం చేసుకోవాలి మనని మనం? ఇట్లాగే ఉండాలని ఎందుకనుకోవాలి? ఇచ్చింది ఎందుకు పుచ్చుకోవు? ఇది నేర్చుకోవడానికి ఎక్కువ సాధన వుంటుంది శిష్యుడికి. అందుకని శిష్యుడికి మొట్టమొదటి సాధనంతా కూడా patience, tolerance. చుట్టు వుండే వాళ్ళందరూ

తిట్టిపోస్తారు. ఎవ్వరూ సహాయం చేయరు. ఎద్దేవా చేస్తారు. ఎన్ని చేసినా సరే దానిమీద నిలబడాలని చూస్తాడు. ఏదీ? తన కర్తవ్యం మీద. అట్లా వున్నవాడిని ఎన్నుకొని, తన సామ్రాజ్యానికి చక్రవర్తిగా నిలబెడతాడు. సాధన పరంగా ఇది వుంది. ముందు మనం దైవాన్ని నమ్మిన నమ్మకం బూటకపు నమ్మకం. అది ఓటి నమ్మకం. కొంచెం గట్టిగా పాతుకుందో లేదో అని ఊపి చూపిస్తారన్నమాట. ఊరికే ఇంత గాలి వస్తేనే పడిపోయే చెట్టు, ఎంత పెద్ద చెట్టు అయితేనేమిటి లాభం? తుఫాను వచ్చినా పడనిచెట్టు చెట్టు. అందుకే మనకేం చేస్తారంటే, జీవితంలో కూడ గురువైతే వెంటనే పట్టుకొచ్చి ఇస్తారు గట్టిపరచడానికి. దైవం ఏం చేస్తాడంటే, కాలం రూపంలో ఏలినాటి శని, అర్ధాష్టమ శని ఇలాంటివి పట్టుకొచ్చి అపుడపుడు ఊపుతూ వుంటాడు. ఊపుతున్నపుడు నిలబడాలి. నిలబడి, 'నీవున్నావు కాబట్టి నాకేమీ ఫర్వాలేదు. నేను తప్పులు చేయకుండా చూడు. తప్పులు చేసే స్వభావము ముందుకు దూకకుండా, నేను సరిగా ప్రవర్తించే స్వభావమును నాలో పెంపొందించు. నీవు ఆధారంగా నేను నిలబడతాను ప్రతిదానికి' అనేది గట్టిగా తయారవ్వాలి. ఇంత వుందండి ఈ ధరించటం లోను, భరించటం లోను.

383 మహాభాగః

మహాభాగః అంటే పెద్దభాగం ఆయనదేనట. ఈ మొత్తం అంతా ఆయన కాదాండి. పెద్దభాగం అంటున్నారు. ఏంటి? నేనుకాక కొంత వున్నది. అది నీవు తుడుచుకుంటూ వుండు అని చెబుతూ వుంటాడు భగవంతుడు. సృష్టి అగ్నికార్యంగా జరుగుతూ వుంటే, అందులోంచి మలినాలు పుడుతూ వుంటాయి. అది తుడుచుకుంటూ వున్నవాడికి మెరుగు వుంటుందిట. అది తుడుచుకోని వాడికి ప్రణాళికలో భాగం కానివాటిలో వీడు ఇరుక్కుపోవడం జరుగుతూ వుంటుంది. సముద్రం వున్నది అల వస్తున్నది. సముద్రంలో ఏ నీరున్నదో, అలలో కూడ ఆ నీరే వున్నది. కానీ అల వేగంతో ఒడ్డుకి వచ్చినపుడు నురుగు వస్తుంది కదా! నురుగు నీటిలో భాగం కాదు. అవునా? ఒక బకెట్టు నురుగు పట్టుకువస్తున్నామనుకోండి. నురుగు మనం కోరింది కాదు. మనం కోరంది అక్కడకు వచ్చింది. అల వేగం వల్ల వచ్చింది సముద్రంలో నురుగు. అలాగే మొత్తం సృష్టంతా కూడ అగ్నికార్యం. అది జరుగుతూ వుంటే, అందులోంచి కొన్ని మలినాలు వస్తూ వుంటాయి. రోజూ భోజనం చేస్తున్నామండి, ప్రొద్దున్నే లేచేటప్పటికి నాలుక గీసుకొనే పరిస్థితి వస్తుంది కదా! దానిమీద అట్లా మనకి పాచి వచ్చేటట్లు ఎవరూ plan చేయటం లేదు. కళ్ళల్లో పుసులు మనం ఎవరూ plan చేయడం లేదు కదా! అట్లాగే చెవిలో గులిమి, ఒంటిమీద మురికి ఇవన్నీ ఎక్కడ నుంచి వస్తున్నాయి? మనం కావాలని తెచ్చుకుంటున్నామా? మనం చేసే పనుల్లో భాగమా అది? మనలో జరిగే అగ్నికార్యం కారణంగా అవి బయటకు వస్తాయి. అందులో ఆయన లేడు. ఆ భాగం ఆయన కాదు. మిగతాదంతా ఆయన. అందుకని 'మహాభాగం' అన్నమాట. అంటే substantial గా ఆయనే వున్నారు. గోళ్ళు కత్తిరిస్తే మనం బాధపడం. ఎవరన్నా జుట్టు కత్తిరిస్తే మనం చచ్చిపోయినంత బాధపడం కదా! ఎందుకని? అది కొంచెం అదనపు పెరుగుదల. అది ఉండడం, లేకపోవడంతో మనకేమీ తేడా పడదు కదా! అయితే జుట్టు ఎవరన్నా పట్టుకుంటుంటే మనకు ఎందుకు తెలుస్తుందంటే, మనతో సంబంధం ఉండటం వలన. వాడు చక్కగా కత్తిరిస్తూ వుంటే, హాయిగా కత్తిరింపించుకుంటాం. మరీ గుండు గీసేటపుడు ఎంతో ఆనందంగా వుంటుంది వాడు గీస్తూ వుంటే. చర్మాన్ని అట్లా ఎవరన్నా వలిచారనుకోండి. ఆనందంగా వుంటుందా? అట్లాగ మనలోంచి వచ్చే మలినాలన్నీ కూడ తీసుకుంటూ వున్నకొద్దీ ఆనందంగా వుంటుంది తప్ప ఆ భాగం అతడు కాదు. ఆ భాగం తత్వం కాదు. అది అగ్నికార్యంగా జరుగుతున్నది. సూర్యుడిని మనం చూస్తూవుంటే, మన నీడ వెనకాల పడుతూ వుంటుంది. నీడలో దేవుడున్నాడా, మనలో దేవుడున్నాడా? నీడ ఎందుకు పడుతుంది? వెలుగు ఉండటం వలన నీడ

పడుతుంది. కనుక shade ఎట్లాగో ఇదికూడ అట్లాగన్నమాట. ఛాయలో దేవుడు లేడు. దానికి జీవం కూడా లేదు కదా! భూమి కన్నా పైకి వెళ్ళిపోతే, ఛాయ ఎక్కడా పడదు. భూమి మీద నుంచి పైకి వెళ్ళిపోతే పగలు లేదు, రాత్రి లేదు. ఎండాకాలం లేదు, చలికాలం లేదు. అందుకనే ఎవరికి ఉష్ణం, శీతలం ఉండదంటే, భూమి స్థితిని దాటిన వాడికి. అంటే పృథ్వీతత్వం దాటినవాళ్ళకి. కుండలినీ చైతన్యం ఊర్ధ్వగతి చెందినవాళ్ళకి ఈ పృథ్వీతత్వం యొక్క పరిమితత్వం వుండదు. మిగతా వాళ్ళందరికీ వుంటుంది. 'మహాభాగుడు' అంటే ఎక్కువ అంతా ఆయనదేనండి. ఆయనే ఉన్నాడు అని అనడంలో అర్థం ఏమిటంటే, కొంత నేనుకాదు అబ్బాయి అదికూడా నేనే అనుకోబోకు, అని. ఆ విధంగా మనకి 'మహాభాగ' వస్తుంది.

384 వేగవాన్

వేగవాన్ అంటే వేగాన్ని కలిగినవాడు. వేగాన్ని కలిగించేవాడు. ఎంత వేగం అంటే ఎలుకపిల్ల వేగం దగ్గర్నుంచి మొదలుపెడితే రకరకాల జంతువులు, రకరకాల వేగాలలో తిరుగుతూ వుంటే, ఆ వేగంలో మనం ఆ భగవంతుని యొక్క తత్వాన్ని చూడాలి. వేగంగా పక్షులు పరుగెడుతూ వుంటాయి. వేగంగా మనుషులు పరుగెడుతూ వుంటారు. పరుగెట్టే వారిలో నేను మిల్కాసింగ్ అన్నట్లుగా వుంటుంది. వాడిలో అంత వేగంగా పరుగెట్టే శక్తి ఏదైతే వుందో, అది తనట. 'అశ్వం' అంటారు దానిని. అది ప్రతివారిలోను కాస్తోకూస్తో వున్నది. కొంతమంది కొన్ని కొన్ని వేగాలు కలిగివుంటారు. లేడిపిల్ల వేగం వుంది, ఏనుగు వేగం వుంది. అలాగే మనుషుల వేగం మనుషుల కున్నది. జంతువుల వేగం జంతువుల కున్నది. భూగోళానికి వేగం వున్నది. తనచుట్టూ తాను ఒక jumbo plane కన్నా ఎక్కువ speed గా తిరుగుతుంది భూమి తెలుసా? అంటే మనకుండే jumbo jet ఒకటి వేసుకొని మనం భూమి చుట్టు తిరిగితే, 24 గంటల లోపల మళ్ళీ ఇదే ప్రదేశానికి రాలేము. ఎందుకంటే ఆ విమానం వేగంకన్నా ఈ భూమి ఎక్కువ వేగంగా తిరుగుతున్నది కాబట్టి. భూమి చాలా వేగంగా తిరుగుతున్నది. కానీ మనకేమీ తెలియటం లేదు. ఆ వేగం ఎక్కడిది దానికి? అసలు వేగాన్ని ఎప్పుడన్న గమనించామా? విమానం వేగం గమనిస్తాం. విమానంలో వుండే ఆ వేగం అనే తత్వం ఏదైతే వున్నదో అది ఆ తత్వం! ఎక్కడన్నా ఏదన్నా speed గా వెళుతుంటే, ఆ speed ని భగవంతుని యొక్క తత్వంగా చూడమంటున్నారు. పక్షిలో వేగముంది. జంతువులలో వేగం వుంది. జీవుల్లో వేగం వుంది. గోళంలో వేగం వుంది. వెలుగు యొక్క వేగం ఎంత వేగం? ఒక సూర్యకిరణం సూర్యుణ్ణుంచి భూమికి ఎంత split second లో వస్తుంది?. ఈ వేగం ఎక్కడిది? అంతేగాదు అన్నిటికన్న వేగమైంది ఏమిటి? మనసు. సూర్యుని వెలుగు కన్న వేగంగా వుంటుంది. ఎంత వేగం అంటే మనం ఇపుడు ఇక్కడ నుంచొని ఆలోచిస్తే, క్షణంలో వైకుంఠం గురించి ఆలోచిస్తే, వైకుంఠం భావన వచ్చేస్తుంది కదా! అంటే time ని, place ని అధిగమించగలిగిన వేగం వున్నది భగవంతుని యందు. ఎందుకంటే time, place ఆయనలో నుంచి వచ్చినవి కాబట్టి, దాన్ని దాటి తను ఉండటం బట్టి, ఆ వేగంతో ఈ మొత్తాన్నంతా నడిపిస్తూ వుంటాడు. అదీ భగవంతుని శక్తి! ప్రతి పనికి late అయ్యే వారు 'వేగవాన్'[1] అనే నామాన్ని ఎక్కువ ధ్యానం చేసుకోవాలి. అపుడు వేగిరం అవుతూ వుంటారు. ఇది ఒక అద్భుతమైన అనుభూతి. వేగాన్ని దైవంగా దర్శనం చేయటం అనే సాధన చేస్తే. కొంతమంది చురుగ్గా పనిచేస్తూ వుంటారు కదా! క్షణంలో చేసేస్తారు కొంతమంది. కాలము, పని అని మనకి చిన్నప్పుడు లెక్క లుండేవి కదా!

పదిమంది మనుషులు ఒక పనిని ఐదు గంటలలో చేస్తే, ఇరవై మంది మనుషులు అదే పనిని ఎంతసేపటిలో చేస్తారంటే, Proportionate గా చూచి మనం చెపుతాం ఐదు గంటల్లో చేసేస్తారని. అట్లా మనకి మనుషులు పెరిగినకొద్దీ వేగం పెరగడం కాదు. వేగం తనలో పెరగటం వలన పని చిన్నదైపోతూ వుంటుంది. మాస్టారు గారు ఎంత వేగంగా పనిచేసారో! మమూలుగా మనం 100 సంవత్సరాలలో చేసే పని, ఒక ముప్పై సంవత్సరాలలో చేసేసారు. వందమంది మనుషులు చేయవలసిన పని ఒక్కళ్ళు చేసి, అవతల పారేసారు ఆటగా! ఏమిటి ఆ వేగం ఆయనలో? అదీ భగవంతుని యొక్క తత్త్వం! కొంతమంది ఎక్కడ వున్నావంటే, వేసినచోటే వున్నాను గొంగళి అట్లా వుంటుంది. మనకి సామెత వున్నది, కాకిలాగ కలకాలం బ్రతికే బదులు హంసలాగ ఒక రోజు బ్రతికితే చాలు అని. శంకరాచార్యులు వారు ముప్పై సంవత్సరాల లోపల సమస్త విజ్ఞానాన్ని ప్రపంచానికి అందించేసి, మూడుసార్లు దేశం అంతా పైనించి క్రిందకి, క్రిందనించి పైకి తిరిగి, అట్లా హిమాలయాల్లోకి వెళ్ళి, కేదార్ అవతల శరీరాన్ని వదిలేసారట రహీమని. ఆయన చేసిన పని ఈ రోజున ఎవరన్నా చేయాలంటే, మూడు వందల సంవత్సరాలు పడుతుంది. అదీ వేగం! అంటే భగవత్తత్త్వం వున్నచోట వేగం అనేది వుంటుంది. వాడి నడకలో కూడా వేగం కనిపిస్తూ వుంటుంది. అట్లా ఎద్దులల్లే నడవటం వుండదు. ఎంత చకచకా నడుస్తారో! మాస్టరు గారి నడక చూస్తే చాలా వేగం వుండేది. అది ఊరికే కంగారుగా వుండే వేగం కాదు. ఇది చురుకుదనానికి సంబంధించిన వేగం. ఒక కిరణం లాగ తిరగడం అన్నమాట. అంటే శరీరం యొక్క బరువుండదు. గమనిస్తే మహాత్ములో వేగం వుందో, లేదో కనిపిస్తుంది. ఉంటే మనం కొంత లెక్కవేసుకోవచ్చు. తాను కదలకుండా సమస్తాన్నీ కదిలిస్తాడు మహాత్ముడు. మరి ఆయన అక్కడ కుంభకోణంలో కూర్చొని మొత్తం భూమంతా కదిలించాడు. అట్లా వుంటారు వాళ్ళు. తెలియని వేగం. అందే వేగం కాదది. కాబట్టి వేగాన్ని భగవంతునిగా ధ్యానం చేసుకోవడం! ఈ సృష్టిలో వేగం కారణం చేత అన్నీకూడ కదులుతూ వున్నాయి చిన్న పాన్న దగ్గర్నుంచి, గ్రహ గోళాదుల వరకు, సూర్యకిరణములు, మనసు భావముల యొక్క కదలిక ఎన్ని వున్నాయో వేగమునకు సంబంధించి. ఆలోచనలు నెమ్మదిగా వచ్చినవనుకోండి, Time కి రాలేదనుకోండి. వాటివలన ఏమీ ఉపయోగం వుండదు. రెండు నిముషాలు late అయితే ఏ భావనకైనా, సమయానికి స్ఫురించకపోతే, తరువాత స్ఫురించి ఉపయోగం లేదు కదా! దేనివల్ల వస్తుంది? తమస్సు వల్ల వస్తుంది. తమస్సు ఎందుకు వస్తుందంటే, పదార్థం బరువైతే వస్తుంది. పదార్థం ఎక్కువ బరువుట అంటే, చైతన్యం తక్కువున్నదట అని అర్థం. పదార్థం తక్కువున్న కొద్దీ వేగం ఎక్కువుంటుంది. పదార్థం ఎక్కువైన కొద్దీ వేగం తగ్గుతూ వుంటుంది. సూర్యుడి యొక్క వేగం గోళాలలోకి వచ్చి,

గోళా లేర్పడిన తరువాత, గోళాల తిరుగుడు సూర్యుడి కిరణాల వేగం కన్నా తక్కువుంటుంది. అందుకని ఈ వేగం యొక్క అవగాహన మనకు బాగా కలగాలంటే, అన్నిట్లో వేగంగా ప్రవర్తిస్తున్నదేదో, దానిని గమనిస్తూ వుండాలి.

385 అమితాశనః

అమితాశనం అంటే అసలు బొత్తిగా ఎంతతిన్నా ఆకలి తీరదట. అమితమైన భోజనం ఇట్లా చేస్తూనే వున్నాడట సృష్టి మొదలైన దగ్గర్నుంచి. ఒకప్రక్క సృష్టి జరుగుతూ వుంటే, రెండోప్రక్క తింటూ వుంటాడట. అంటే కొన్ని జీవులు బయటకు వస్తున్న దగ్గర్నుంచి, కొన్ని జీవులు ఆయనలోకి వెళ్ళిపోతూ వుంటాయి. కొన్ని గోళాలు ఆయనలోంచి బయటకు వస్తూ వుంటే, కొన్ని గోళాలు మళ్ళీ ఆయనలోకి వెళ్ళిపోతూ వుంటాయి. కదా! మనవడు పుట్టగానే తాత వెళ్ళిపోతున్నాడు కదా! అంతమాత్రం ఆగిందా? మనవడు తండ్రి అయేసరికి, తండ్రి తాత అవుతుంటాడు. మునిమనుమడు వచ్చేసరికి తాత వెళ్ళిపోతూ వుంటాడు. ఎప్పుడూ ముగ్గురు కనిపిస్తూ వుంటారు standard గా. అట్లాగే గోళాలు కూడ. ఈ గోళం వెళ్ళిపోయే లోపల ఇంకొక గోళం రెడీగా వుంటుంది. చాలా అద్భుతం కదూ! మూడు పిండాలు పెడతారు కదా శ్రాద్ధానికి. అంటే ముగ్గురు వెళ్ళిపోయిన వాళ్ళకి నాలుగోవాడు పెడుతూ వుంటాడు కదా! ఆ పెట్టేవాడు వీడు కూడా ఒక రోజు దానిలో మొదటిపిండం అవుతాడు. వీడు అందులో మొదటి పిండం అయేటప్పటికి అందులో చివరిపిండం వెళ్ళిపోతుంది. ఎప్పుడూ మూడు పిండాలే వుంటాయి. అంటే ఇంతటితో అయిపోతుందని ఏమీలేదు. ఓ పిండం బయటికి, ఒక పిండం లోపలకి వెళ్ళిపోతూ వుంటుంది. అంతేగా? అట్లా గోళాలు కూడ సత్య లోకంలో ఒకటి వుంటే, సంకల్ప లోకంలో వుంటే, తరువాత మనకి immediate గా కామలోకంలో ఒకటి వుంటుంది. కనిపించే లోకంలో ఒక గోళం వుంటుంది. కనిపించే లోకంలో గోళం అదృశ్యమయే లోపల అంతకుముందు కామలోకంలో ఒకటి వస్తుంది. అట్లా ఎప్పుడూ ఒక గోళం అదృశ్యమయే లోపల ఇంకొక గోళం అక్కడకు వస్తుంది. ఎప్పుడూ వుంటుంది ఒక భూగోళం. ఎప్పుడూ వుంటుంది ఒక సూర్య మండలం. ఒకటైపోతూ వుంటే, ఇంకొకటి వస్తూ వుంటుంది. ఈ అయిపోవడం, వస్తూ వుండడం ఎంత చక్కగా, సమన్వయంగా జరుగుతూ వుంటుందంటే, అదే ఎప్పుడూ ఉన్నట్లుగా వుంటుంది. గోదావరి ఎప్పుడూ ఉన్నట్లుగా వుంటుంది. కానీ గోదావరి ఎప్పుడూ లేదక్కడ. వచ్చే నీళ్ళు వస్తున్నవి. పోయే నీళ్ళు పోతున్నవి. ఆ నీళ్ళే ఎపుడూ లేవుకదా! కానీ గోదావరి ఎపుడూ ఉన్నట్లుగా కనిపిస్తుంది. అలాగే మనం కూడ! రవిశంకర్ అట్టాగే ఉన్నాడనుకుంటాం. రవిశంకర్ అట్టాగే వుండడు. ఎందుకంటే గంట క్రింద చూసిన రవిశంకర్ వేరు, ఇప్పుడు చూస్తున్న రవిశంకర్ వేరు వైజ్ఞానికంగా. ఆధ్యాత్మికపరమైన శాస్త్రం తెలిస్తే, ఎన్నో అణువులు పుట్టి, ఎన్నో అణువులు లయమైపోతూ వుంటే, మధ్యలో రవిశంకర్ వున్నట్లుగా వుంటుంది. గోదావరిలో

నీళ్ళు వెళ్ళిపోతూ వుంటే, నీళ్ళు వస్తూ వుంటే గోదావరి ఉన్నట్లుగా ఎట్లా వున్నదో, అట్లాగే మనమంతా కూడ ఉండటం అంటే ఒకప్రక్క నుంచి అణువులు పుట్టుక జరుగుతూ వుంటే, ఇంకొక ప్రక్క అణువులు లయమైపోతూ వుంటే, మధ్యలో స్థితి వున్నట్లుగా వుంటుంది. సుడిగాలి వచ్చి ఒక ఆకారం వచ్చిందనుకోండి. సుడిగాలి ఆకారం ఎంత సత్యమో అంతే సత్యం నీ శరీరం అంటుంది భాగవతం. అది ఆకారం ఏర్పడినట్లుగా మనకిచ్చి, మళ్ళీ టక్కున గాలి వెళ్ళిపోగానే దుమ్ము ఎక్కడకక్కడ సర్దుకుంటుంది కదా! ఎలా ఏర్పడింది అంటే గాలి యొక్క వర్తులాకారం ప్రయాణంలో ధూళిరేగి, అందులోంచి ఒక ఆకారం ఏర్పడితే, ఉన్నట్లుగా గోచరించడంలా? ఉందా లేదా సుడిగాలిలో ఒక కాగితం తిరుగుతోందనుకోండి, కొట్టుకుంటూ వుంటుంది. ఎంతసేపుంది? అట్లాగే ఈ శరీరంలో కూడ వస్తూ పోతూ వుంటే, మధ్యలో ఉన్నట్లుగా వుంటుంది. ఇది మాస్టరు గారు చాలా చక్కగా ఇస్తారు. 'ఏమీ లేనట్టి గగనాన ఇమిడియుండి, అన్ని ఉన్నట్టి భువికి అవతరింతు'. ఇది అన్నీ ఉన్నట్టే ఇది కూడ. అన్నీ ఉన్నట్టుగా వుంది తప్ప, అన్నీ ఉన్నాయను కోవడానికి లేదిక్కడ. అన్నీ ఉన్నట్టుగా వుంది. సినిమా తెరమీద బొమ్మ నిజమా? వచ్చిపోతూ వుంటాయి కదా ఎన్ని బొమ్మలైనా! ఇదీ అంతే! ఎందుకయ్యా అంటే ఒకప్రక్క తింటూ వుంటాడట ఆయన. అందుకనే అగ్నిదేవుడికి ఒక పేరుంది 'అనల్' అని. అనలుడు, అనిలుడు. 'అనల్' అంటే ఏమిటంటే, తిన్నకొద్దీ ఆకలట. ఎంత తిన్నా ఆకలి తీరదట. ఇంకొక పేరు అగ్నికి 'అమితాశనుడు' ఎంత భోజనమైనా చేస్తూనే వుంటాడట. సృష్టంతా భోజనం చేస్తూనే వుంటాడట. ఒకప్రక్క పుట్టిస్తూ వుంటే, ఒకప్రక్క ఆయనలో కలిసిపోతూ వుంటుంది. అట్లా అవుతూంటుంది. ఈ మధ్యలో దాన్ని, ఆ ప్రవాహాన్ని తన వేగం చేత ధరించి వుంచుతుంది. అలా మోస్తూ ఉన్నట్లుగా మనం భావన చేయక్కర్లా. మొయ్యటం ఏమీ వుండదు. ఒక ప్రవాహం వున్నది. వేగం కదా! ఒకప్రక్క మింగేయడం వున్నది. కనుక వెళుతుంటే, వేగం గా వెళుతుందనుకోండి, వెళుతుంటే ఆ వేగమే దాన్ని మోస్తుంది. Speed ఆగిపోతే పడిపోతావు. విమానం వంటిది speed లేకపోతే పడిపోతుంది. పక్షికి speed లేదనుకోండి దిగిపోతుంది. అందుకని భగవంతుడు ప్రతిదీ ఒకప్రక్క వస్తూ వుంటే, ఒకప్రక్క వెళ్ళిపోతూ వుంటుంది. దాన్నే ఆంగ్లభాషలో కూడ వాళ్ళు ఏం చెబుతారంటే, "It came to pass" అంటారు. వెళ్ళిపోవటానికి వచ్చిందని. ఈ సృష్టిలో ఏదైనా అంతే! మనం వచ్చామనుకోండి వెళ్ళిపోవటానికే వచ్చాం. ఒక సన్నివేశం మన జీవితంలో వచ్చిందనుకోండి వెళ్ళిపోవటానికే వస్తుంది. వచ్చిందల్లా వెళ్ళిపోతుంది. కలకాలం వుండదేదీను అది సుఖమైనా, కష్టమైనా. కష్టాలు కలకాలం కాపరం వుంటాయా అమ్మా, అంటూంటాం కదా! ఏదైనా వచ్చిందంటే వెళ్ళిపోవలసిందేనండి. శరీరం

వచ్చింది కాబట్టి వెళ్ళిపోతుంది. కష్టం వచ్చింది కాబట్టి వెళ్ళిపోతుంది. సుఖం వచ్చింది కాబట్టి వెళ్ళిపోతుంది. వచ్చి, వెళ్ళిపోయేవే అన్నీ. ఈ వెళ్ళిపోవటం ఉండకపోతే, అక్కడే ఉండిపోతే కష్టం కూడ అది. ఆయన ఆ విధంగా ప్రతిదీ తనలోకి మళ్ళీ ఇముడ్చుకుంటాడట. చిన్న పొన్న నీళ్ళు అట్లా సముద్రంలోకి వస్తూ వుంటే, నదుల్లోంచి సముద్రం పెరిగి,పెరిగి పెద్దదైపోవద్దూ? కాని మళ్ళీ అందులోంచి పైకి పట్టుకొస్తాడు. అవే మళ్ళీ తీసుకొచ్చి ఇస్తూ వుంటాడు. మళ్ళీ అవే పారుతూ వుంటాయి. అలా చక్రభ్రమణంలో నువ్వు చూసినచోట కి వచ్చినట్లుగా వుంటుంది. ఎప్పుడూ అది అక్కడే వుంటుంది. కానీ అక్కడ మారుతూ వుంటుంది చూడండి. అక్కడ బల్బులు పెడుతూ వుంటారు illumination అప్పుడు. అట్లా ప్రయాణం చేస్తూ వుంటే, అక్కడ ఒకటి ఎప్పుడు ఉన్నట్లుగా వుంటుంది. అలాగే ఎంత చక్కటి సమన్వయ సృష్టిని ఏర్పరిచాడంటే, ఒకప్రక్క నుంచి ఆయన తినేస్తున్నా, మనకు తెలియడం లేదు. అంతా అట్లాగే ఉన్నదనుకుంటాం. అట్లాగే చెట్టు. చెట్టులో కూడ ఒకప్రక్క రాలిపోతూ వుంటే, ఒకప్రక్క చిగురిస్తూ వుంటే, ఎపుడూ అవే ఆకులు వున్నవా? కానీ చెట్టు బాగానే ఉన్నదనుకుంటూ వుంటాం. ఎంత చక్కగా చేస్తాడంటే జరుగుతున్నది తెలియకుండా చేస్తూ వుంటాడు. వేగం తెలియదు. హరించటం తెలియదు. పెరుగుదల తెలియదు. అంతా అలాగే శాశ్వతంగా ఉన్నట్లుగా కనిపిస్తుంది. కానీ కాదు. అందుకే అమితాశనుడిని గుర్తు పెట్టుకుంటే వచ్చిందల్లా వెళ్ళిపోతుంది అని తెలుస్తుంది. కాబట్టి కష్టం వచ్చిందంటే వెళ్ళిపోతుందిలే అనే ధైర్యం. ఎందుకంటే పట్టుకుపోతాడు కాబట్టి, ఏదీ మిగల్చడు కాబట్టి. జీవితప్రవాహం అనేది ఒకటున్నది కదా! ఆ ప్రవాహం కూడ తీసుకొచ్చినవాడు పట్టుకెళతాడు. వచ్చినపు డేముంది మన దగ్గర? కాబట్టి వచ్చినవన్నీ వెళ్ళిపోతాయి అని గుర్తున్నవాడు అదృష్టవంతుడు. రానంతవరకు మనకు తెలియదు కానీ, వచ్చిన తరువాత పట్టుకుంటాం దాన్ని. పట్టుకుంటే మనకది బాధ కలిగిస్తుంది. ఎందుకంటే నువ్వో, అదో వెళ్ళిపోవాలి. అదీ ప్రయాణంలో వుంది, నీవు ప్రయాణంలో వున్నావు. అది గుర్తుంచుకోవాలి. జిగురు ఉండకూడదు. అది వెళ్ళిపోతే ఒక పని తగ్గించాడు అనుకోవాలి. వస్తే ఒక పని పెంచారు అనుకోవాలి. వచ్చిందల్లా సంతోషం అనుకుంటాం. అది చాకిరి. వెళ్లిందల్లా కర్మ క్షాళణం. మనందరం అంతాతలకిందులుగా చూస్తాం, అందుకే అవగాహనలో తలకిందులు ఉంటాయి. ఏడు రకాలుగా తలకిందులు అవుతాం. మళ్ళీ ఏడుసార్లు తిరిగి నిజస్వరూపం లోకి వెళ్ళాలి. అమితాశునుడు మహాకాలుడు! అలా అన్నీ లాగేస్తాడు లాగకపోతే మనకే ఇబ్బంది. పుట్టినవాళ్ళంతా అలాగే ఉంటే మనం ఏమైపోతాం? వెళ్లిపోవడం లో ఒక సుఖం ఉన్నది అది తెలిసి, జీవితంలో కర్తవ్యాలు అయిపోయాక వెళ్లిపోయేవారు. పూర్వకాలం కర్తవ్యాలు నిర్వర్తించి

హిమాలయాలకు వెళ్లిపోయేవారు. ఇక క్షేమ సమాచారాలు తెలియజేయడం ఉండదు. అలా తిరుగుతూ ఎక్కడో పడిపోతాం. పనైపోయాక ఇక ఉండడం ఉండదు. మహాప్రస్థానం! వెళ్ళిపోదాం అనుకున్న వాళ్లంతా అలా వెళ్లిపోయిన వారు. పాండవులు అంతా అలా వెళ్లిపోయిన వారే! ఆదిశంకరాచార్యులు అలా 30 ఏళ్లకే వెళ్ళిపోయారు. ఆయనంతట ఆయన, వచ్చిన పని అయిపోయిందని స్వచ్ఛందంగా వెళ్ళిపోయారు. యోగులు అలా వచ్చిన పనైపోయాక శరీరాలను వదిలేస్తారు. అలా వెళ్లవద్దు అనుకున్నా, సృష్టిలో శక్తులు అప్రమత్తతతో ఉండి రానన్నా మత్తుమందు ఇచ్చి అయినా తీసుకువెళ్లి పోతాయి. చనిపోయేముందు భయం కలిగి తెలివి తప్పుతుండంగా తీసేస్తారు. అలా వాళ్లు తీసుకు వెళ్లే లోగా మనం వెళ్ళిపోతే మంచిది కదా! యుద్ధం అయ్యాక కృష్ణుడు , అర్జునుడిని ముందు రథం దిగమంటాడు. రోజూ కృష్ణుడు రథం తీసుకువచ్చి, అర్జునుడిని ఎక్కించుకొని మరలా సాయంత్రం అతనిని దింపి, తన రథాన్ని తీసుకొని వెళ్ళేవాడు. అదే దైవం మనల్ని పొద్దుట లేపి, రాత్రి నిద్రలోకి తీసుకు వెళ్ళడం! దైవమే లేపకపోతే మనమంతే! అర్జునుడు '18 రోజులు నువ్వు నాకోసం రథాన్ని తీసుకువస్తూ, నన్ను దింపుతూ చాలా చేశావు. ఈరోజు రథం నువ్వు ముందు దిగు, నేను తర్వాత దిగుతా' అంటాడు. కృష్ణుడు నవ్వి, 'ఈ పూట కూడా ముందు నువ్వు దిగు. ఎందుకనేది నెను తర్వాత చెప్తాను' అంటాడు. అర్జునుడు దిగాక, కృష్ణుడు దిగుతాడు. దిగగానే మొత్తం రథం పెద్ద మంటలో మండిపోయి క్షణకాలం లో అదృశ్యం అయిపోతుంది. 'నేను ముందు దిగి నువ్వు అందులో ఉంటే నువ్వు కూడా మండిపోయే వాడివి' అని చెప్తాడు. అందుకని దైవం ఉండగానే మనం దిగాలి. అందుకని దిగడం తెలియాలి. దిగకపోతే తినేస్తాడని తెలిస్తే ముందే దిగిపోతాం. ఏదైనా ఎప్పుడు వదలాలో తెలియాలి అనేది ఇందులో తెలుసుకోవలసిన గంభీరమైన విషయం. శరీరం కావచ్చు, సన్నివేశం కావచ్చు, ఏదైనా కావచ్చు. పని అయ్యాక వేళ్లాడకూడదు. వస్తా అని చెప్పాక వెనక్కి చూడకుండా వెళ్ళిపోయే వాడే లెక్క! మెరుపు వలె వచ్చినట్లే, మెరుపు వలె వెళ్లిపోవాలి. ఏడుస్తూ వెళ్ళరాదు. ప్రస్తుతం లో జీవించాలి. సృష్టిలో ప్రతిదీ తనలో లాగేస్తుంటాడు. అది అనుస్యూతం గా, శాశ్వతం గా సృష్టి లో జరుగుతుంటుంది. ఒక సృష్టి లయమౌతుంటే ఇంకొక సృష్టి సిద్ధం గా ఉంటుంది, అయిపోవడం ఉండదు. మన ముందు మూడు లోకాలు, మనము, మన వెనకాల మూడు లోకాలు మొత్తం ఏడు లోకాలు ఉంటాయి. ఒక వంశం లో ముగ్గురు ముందుంటే నలుగవ వాడు కూర్చుని ఉంటాడు పిండ ప్రదానంలో. ముందు ముగ్గురికి నాలుగవ వాడు చేయడం జరుగుతుంది. వాడి తర్వాత వెనుక ముగ్గురు ఉంటారు. వీడు ఖాళీ చేయగానే వెనకవాడు కుర్చీలో కూర్చుంటాడు. ఈ నాల్గవ వాడు మూడవ స్థానానికి అక్కడ

నుండి రెండు, అక్కడ నుండి మొదటి స్థానానికి వెళ్తే ఆపైన నువ్వు పిండాలు అవసరం లేని స్థితికి వెడితే నువ్వు సరిగ్గా పనిచేసినట్లు లెక్క! అంటే నీ ప్రవాహం లో ఎప్పుడూ breaks పడ లేదు. పై లోకాలకి సక్రమంగా వెళ్లినట్లు లెక్క! అలాగే గోళాలు కూడా ఉంటాయి. ఒక గోళం అయిపోతూ ఉంటే మరొక గోళం తయారవుతూ ఉంటుంది. మూడు గోళాలు ముందు వెళ్లిపోతుంటే వెనకాల రావడానికిమూడు గో ళాలు తయారుగా ఉంటాయి మధ్య గోళం ఉండగా. మనకు స్ఫూర్తి ముందు వెళ్లిపోయిన ముగ్గురు. మనం మన వెనక ముగ్గురికి స్ఫూర్తి. Madam Blavatsky 'Globe Chains' అని ఈసృష్టి రహస్యాన్ని మొట్టమొదటిసారి మానవజాతికి తీసి ఇచ్చింది Secret Doctrine లో. అది మన పిండాల విషయం లో సత్యం. సూర్య మండలాల విషయం లో సత్యం. మనుష్యుల విషయం లో సత్యం, గోళాలు విషయంలో సత్యం. ఇవీ ౭ లెక్క! ౭ స్థితుల్లో అన్నీ ఉంటాయి. అందులో నాలుగవ స్థితి మనది. అదే పరా పశ్యంతి మధ్యమా వైఖరి అన్నారు. నాలుగవ స్థితిలో మనకి మాట వినిపిస్తుంది. అదృశ్యం గా అంతకు ముందున్నది భాష. భాష రాక ముందు భావనగా ఉన్నది. భావనకి ముందు నీవున్నావు. నీలో నీ భావన ఇమిడి ఉన్నది. అంటే నీవే భావనగా వ్యక్తమౌతున్నావు. భాష మనకి భౌతికం గా వినిపించే ముందు 3 స్థితులలో కార్యక్రమము జరుగుతుంది. నాలుగవ స్థితిలో కనిపించే/ బయటకు వచ్చే ముందు మూడున్నాయి కదా! బయటకు వచ్చింది మళ్ళీ నీలోనే కలసిపోయింది. నేను చెప్తున్నప్పుడు మీరు నా భాష పుచ్చుకుంటున్నారు. నా గొంతు పుచ్చుకోవడం లేదు. ఆ భాషని వొలిచి భావాన్ని పుచ్చుకుంటారు. వొలిచి మీలో ఇమిడ్చుకుంటారు అప్పుడు భావము కూడా జారిపోతుంది. అంటే నాలో శుద్ధ చైతన్యం తో మీ శుద్ధచైతన్యం ఏకీభావం చెంది, మీరు ఆనందమో, దుఃఖమో పొందారు. ఇన్ని స్థితులున్నాయి. మనం ఎప్పుడన్నా గమనించామా? అది దర్శించారు ఋషులు. కనబడనివి మూడున్నాయి. అవి అమృతమైనవి దివ్యమైనవి అని చెప్తుంది పురుషసూక్తం.

386 ఉద్ధవః

ఉద్ధవః అంటే సమస్తమైన సృష్టికి, పుట్టుకకు ఆధారమైనవాడు అని అర్థము. పరా ప్రకృతి, సూక్ష్మ ప్రకృతి, స్థూల ప్రకృతి, పదార్థమైన ప్రకృతి ఇవన్నీ ఏ తత్త్వం నుంచి పుట్టుకు వచ్చాయో వాటన్నిటికి శక్తికి, కాలానికి, సంకల్పానికి, సమస్తానికీ ఆధారమైనది. అనిర్వచనీయమైనది. ఆ తత్వం భగవంతుని యొక్క తత్త్వం! అది ఆధారంగా మిగతావన్నీ పుట్టాయి తప్ప దానికి పుట్టుక లేదు. అది అనంతమైనది, శాశ్వతమైనది. ఆ తత్త్వం భగవంతుడు! మనం సృష్టిలో ఏదైనా ఒకటి చెప్పినట్లైతే, అది పుట్టినట్లు లెక్క. దేన్నైనా చెప్పండి దానికి పుట్టుక వుంటుంది. ఏమీ చెప్పలేక, నిర్వచనానికి అందక, భావానికి అతీతమైన తత్త్వం ఏదైతే వుందో దాన్ని 'సత్యం' అన్నారు. అది ఆధారంగా మిగతావన్నీ పుట్టాయి. మనమూ పుట్టాము. మనం ఎందులోంచి పుట్టాము? భగవంతుడు లోంచి ప్రకృతి పుడితే, ప్రకృతి లోంచి మనం పుట్టాం. అదీ మనకీ, భగవంతునికీ వున్న వ్యత్యాసము. మనమూ పుట్టాం, సమస్త జీవరాశులూ పుట్టాయి. గోళాలు పుట్టాయి. తత్త్వాలు పుట్టాయి. పంచ భూతాలు, పంచ తన్మాత్రలు, పంచేంద్రియాలు పుట్టాయి. మనస్సు పుట్టింది. మహత్తు పుట్టింది. వెలుగు కూడా పుట్టినదే. వెలుగు చీకటిని ఆధారంగా వెలిగిందన్నమాట. వెలగక ముందు కూడా వున్నాడు. వెలుగునే అదితి అంటాము. దానికన్నా ముందు నుంచీ ఉన్నవాడు. తను ఆధారంగా సమస్తమైన తత్వములు పుట్టి, ఆకాశం పుట్టి, గోళాలు పుట్టి, గోళాల మీద జీవులు పుట్టి, ప్రకృతి పుట్టి ఇన్ని పుట్టుకలకి ఎవరు కారణమో, ఎవరి నుంచి ఈ సమస్తమూ ఉద్భవించిందో, ప్రకృతి పుట్టి, ప్రకృతి లోంచి అన్నీ పుడ్తే, ప్రకృతికి మూలస్థానమైన వాడన్నమాట. అందుకని మన ఊహకి అందడు. మునులు కూడా కీర్తించలేకపోయారు, నిర్వచించలేకపోయారు. కారణం ఏమిటంటే ఆ నిర్వచనానికి ఒక పరిమితమైన భావనే వుంటుంది. ఇది భావానికి అతీతమైన తత్త్వం! భారతీయ సాంప్రదాయంలో భగవంతునికి నిశ్చయంగా ఈ రూపమని ఏమీ చెప్పలేదు. ఈ నామం అని ఏమీ చెప్పలేదు. కానీ మనం ఏ రూపంతో, ఏ నామంతో కొలుచుకుంటే ఆ రూపము, ఆ నామము లోనికి కూడా ఆ తత్వం దిగివస్తుంది. అందుకని మన పెద్దలు చక్కని పద్ధతుల్లో మనకి ఈ ఆరాధనల్ని ఇచ్చారు. ఇక్కడ శ్రీకృష్ణుని విగ్రహం మనం పెట్టుకున్నాం. కృష్ణుని రూపంలో తత్త్వం పరిపూర్ణంగా వున్నదని భావనచేసి, తత్త్వంతో కూడా అనుసంధానం చెందాలి. లేకపోతే రూపానికి మనం పరిమితమైపోతాం. రూపానికి పరిమితం కాకుండా వుండాలనే ఆసక్తితో, ఆర్ద్రతతో, జీవులపై అపారమైన కరుణతో, ఋషులు 'ఎప్పుడూ గుర్తుపెట్టుకో. అది అనిర్వచనీయమైనది. అది శాశ్వతమైనది. సమస్తమూ దాంట్లోంచే

పుట్టుకొచ్చినాయి. దాన్ని మరచిపోకు సుమా' అని చెప్పారు. అది రాముని పరంగా చెప్పినా, కృష్ణుని పరంగా చెప్పినా, విష్ణువు పరంగా చెప్పినా, శివుడి పరంగా చెప్పినా, అమ్మవారి పరంగా చెప్పినా 'పరా' అంటారు. పరాశక్తి అంటారు. పరమేశ్వరి, పరమేశ్వరుడు, పరబ్రహ్మము అంటే బ్రహ్మానికి అవతల ఉండేవాడు. పుట్టించే ఈ సృష్టి కంతటికీ కారణభూతుడైన వాడికన్నా కూడా వెనకాల వున్నవాడు. 'పరతత్త్వము' అంటారు. అంటే ఏమిటంటే మన ఊహకి అందనిది, దేనినుంచైతే మనమంతా పుట్టుకొచ్చామో,ఆ సమస్తానికీ తాను మూలస్థానం. తనలోంచి పుట్టినవాడి లోంచి పుట్టినవాళ్ళం మనమంతా. ఆ విధంగా భావన చేసికున్నట్లైతే, మనం ఎక్కడ నుంచి పుట్టాం? అని ప్రశ్నించుకుంటూ వెళ్తే, ఆ తత్త్వం దగ్గరికి వెళ్తాం. ఈ సమస్తము ఎక్కడ నుంచి పుట్టిందీ అనే భావన చేసామనుకోండి, మనం ఆధారంగా పుట్టేవి వున్నాయి కదా! అవి ఎట్లా పుడుతున్నాయో తెలిస్తే, అతని నుండి ఈ సృష్టి అంతా ఎట్లా పుట్టిందో తెలుస్తుంది. మన నుంచి సృష్టి ఒకటి పుడ్తూ వుంటుంది కదా! ఇప్పుడు ఈ విష్ణు సహస్రనామం వివరణ తరగతి ఎలా పుట్టింది? మన సంకల్పం వల్ల పుట్టింది. మనలో ఎక్కడి నుంచి వచ్చింది? బుద్ధి ఎక్కడ నుంచి వచ్చింది? మన నుంచే కనుక మనం మిగిలిపోతాం. మనం అంటే నిర్వచనం లేదు నిజానికి. మనం ఎలా నిర్వచించుకుంటే అలా నిర్వచించబడ్తాం తప్పా, మనకంటూ ఇది అనే నిర్వచనం లేదు. అదే తెలుసుకోవాలి ప్రతివాళ్ళూ కూడా. 'నేనెవరు' అనే ప్రశ్న వేసుకొనేటప్పుడు సమాధానం ఏం లేదు. ఎందుకంటే నీవు ఏ సమాధానం ఇస్తే ఆ సమాధానం వరకు దాన్ని పరిమితం చేసిన వాళ్ళమవుతావు. మనం దీనిమీద బాగా ఎక్కువ ధ్యానం చెయ్యాలి. మనం అంటూ ఎలా వున్నాం? ఎవరు మనం? అని ప్రశ్న వేసుకుంటే, ఆ అనిర్వచనీయమైన తత్త్వమే మనయందు, మనవలె వుండుట వలన, భగవంతుని నుంచి సంకల్పము వచ్చి సృష్టి ఎలా ఏర్పడిందో, అదే తత్త్వం మన యందు ఉంది కనుక మనక్కూడా సంకల్పాలు వస్తూ వుంటాయి. భగవంతుని నుంచి వచ్చిన సంకల్పాన్ని 'గాయత్రి' అంటారు. మనం కూడా మనలో వుండే మన తత్త్వాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసుకున్నట్లైతే, మననుంచి కూడా భాసించేది దివ్యసంకల్పమే అవుతుంది. ఆ దివ్యసంకల్పమే మనయందు భాసించాలని కోరుకోవడం కోసమే మనం గాయత్రీ మంత్రాన్ని పఠనం చేస్తూ వుంటాము ప్రతి ఉదయం, ప్రతి సాయంత్రం. ఏ వెలుగైతే సమస్తమైన బుద్ధిని ప్రచోదనం చేస్తుందో, అదే వెలుగు నాయందు కూడా ప్రచోదనం కావాలి. అంటే ఏమిటి? వెలుగే సంకల్పం! భగవంతుని నుంచి ఒక సంకల్పం రాగానే అది భళ్లుమని ఒక వెలుగుగా వచ్చింది. అక్కడ నుంచి మిగతావన్నీ వచ్చాయి. అలాగే మనం కూడా! సంకల్పానికి అతీతంగా వున్నాం. మననుంచి సంకల్పాలు వస్తున్నాయి. మన సంకల్పాల్లోంచి మనం

పుట్టించేవన్నీ పుట్టిస్తున్నాం. మంచి, చెడు అన్నీ మనలోంచే పుడ్తున్నాయి కదా! మనలోంచి సంకల్పం ఎలా పుట్టుకొస్తోందో తెలిసి, మనలో సంకల్పం పుట్టే స్థానాన్ని 'గాయత్రి' అంటారు. అక్కడ నుంచి సమస్తము ఎలా పుట్టుకొస్తున్నాయో అట్లాగే భగవంతుని సంకల్పం నుండి వెలుగు పుడ్తే, శక్తి పుడ్తే, కాలం పుడ్తే అందులోనుంచి ప్రకృతి, శక్తి, కాలం పుట్టుకొస్తే, ఈ తత్వాలన్నీ పుట్టుకొచ్చి, ఈ సృష్టి ఏర్పడుతోంది. కాబట్టి భగవత్తత్త్వాన్ని ఒక రూపం లోకి ఆవాహనం చేసుకుని ధ్యానం చేస్తాం. ఒక నామం లోకి ఆవాహనం చేసుకుని ధ్యానం చేస్తాం. కానీ అదేనా ఆయన? అంటే అది కూడా, అని తప్పా అదే అని చెప్పడానికి వీలులేదు. అదే అని అంటే నువ్వు భగవంతుణ్ణి రూపానికి, నామానికి పరిమితం చేస్తున్నావు. కాబట్టి నీ వరకు భగవంతుడు పరిమితుడే! ఇది మనకు తెలియచెప్పడానికే మనవాళ్ళు రకరకాలుగా, రకరకాలుగా చెప్పారు. ఒక రూపం లోకి, ఒక నామం లోకి ఇలా తెచ్చుకోకపోతే అవగాహన అవడం కష్టం. తెచ్చుకుంటే ఆ రూపంలోను, ఆ నామంలోను ఇరుక్కుపోవడం జరుగుతూ వుంటుంది. దానివల్ల మూఢత్వం ఏర్పడుతుంది. మాస్టరు గారంటే ఎవరు మనకి? మాస్టర్ అన్నామనుకోండి, కొంతమందికి మాస్టర్ గారంటే మాస్టర్ E.K., కొంతమందికి మాస్టర్ గారంటే మాస్టర్ C.V.V. కొంతమందికి మాస్టర్ గారంటే ఇంకొక పేరు, ఇంకో రూపం. అసలు మాస్టర్ ఎవరు? ఏ తత్వం ఆ రూపం నుంచి పనిచేస్తోందో అది 'మాస్టర్'! దాన్ని చూడకుండా మనం రూపాన్ని, నామాన్ని పట్టుకుంటే, మనకి మాస్టర్ దొరకడానికి అవకాశం వుండదు. అలాగే భగవంతుడు కూడా ఈ రూపంలోకి వచ్చాడు. అందుకనే మన పెద్దవాళ్ళు ఈ రూపంలోకి నిన్ను ఆవాహన చేస్తున్నానని చెప్పడానికని, 'ఆవాహయామి' అని అన్నారు. లేకపోతే ఎప్పుడూ అంతటా నిండి వున్న భగవంతుణ్ణి మనం ఆవాహన చేయడం ఏమిటి? ఎక్కడ లేడు? లేనిచోటు ఒకటి వుండి, అందులోకి భగవంతుడు వస్తున్నాడా? లేదు కదా! మొత్తం అంతా వ్యాపించి వున్న వాణ్ణి ఆవాహన చేయడంలో ఉద్దేశ్యం ఏమిటంటే నువ్వు కోరుకున్న రూపంలోకి ఆయన్ని నువ్వు సంకల్పించి తెచ్చుకుంటున్నావు. అందుకనే పూజంతా అయిన తర్వాత ఉద్వాసన కూడా చెప్పారు. ఎందుకు ఉద్వాసన చెప్పారు? ఈ రూపమే కాదు సుమా అని చెప్పడానికి. ఈ రూపంలోకి వచ్చాడు. విద్యుత్తు ఆ tube లోకి వచ్చినట్లు, ఆ mic లోకి వచ్చినట్లు, ఆ tape recorder లోకి వచ్చినట్లు. ఎప్పుడూ అక్కడే ఉండిపోతుందా అది? ఉండిపోదు కదా! పనైపోయింతర్వాత ఏం చేస్తాం? ఆపేస్తాం కదా! ఆపేస్తే ఎక్కడికి పోయింది? వెళ్ళిపోయిందా? లేదు. నువ్వు అనుకున్న రూపంలోంచి వెళ్ళిపోయింది. నీకు కావలసిన రూపంలోకి వస్తూ వుంటుంది. నువ్వు మాట్లాడుకోవాలంటే ఆ రూపంలోకి తెచ్చుకోవచ్చు. ఈ పంపించెయ్యడం అనేది

ఎక్కడ నుంచి వచ్చిందంటే, ఈ రూపమే కాదు అనే జ్ఞానం కలగడం కోసం ఆవాహన ఎలా చేసావో, ఉద్వాసన కూడా అలా చేయమన్నారు. దేవుణ్ణి పంపించెయ్యడం ఏమిటి? అంటారు కొంతమంది. అందుకని ఉద్వాసన చెప్పరు. అలా అంటే ఆవాహన చేయడం ఏమిటి? దానికెవరు సమాధానం చెప్తారు? ఆవాహనా లేదు, ఉద్వాసనా లేదు. రెండూ లేనివాడిని మనం దర్శన, స్పర్శన, సంభాషణాదుల కోసం తెచ్చుకుంటూ వుంటాం. వాడు ఇవన్నీ పుట్టకముందు వున్నాడు. పుట్టిన తర్వాత వున్నాడు. మళ్ళీ అంతా అయిపోయిన తర్వాత కూడా వుంటాడు. కనుక అటువంటి వాడుగా భగవంతుణ్ణి ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలనే ఉద్దేశ్యంతో 'అన్నిటికీ పుట్టుకైనవాణ్ణి నేను ధ్యానం చేస్తున్నాను. నేనెరిగిన దైవం అన్నిటికీ పుట్టుక స్థానం. దాన్ని ఇది అని నిర్వచించలేము. ఈ పేరే అని పెట్టలేము. అన్ని కాలాల్లోనూ, అన్ని దేశాల్లోనూ నిండివున్నాడు.' ఇది అవగాహన కావడం కోసం ఋషులు మనకి ఈ రకంగా ఎన్నో నామలు ఇచ్చారు. ఇది 'ఉద్భవః' అనే నామానికి అవగాహన.

387 క్షోభణః

క్షోభం కలిగిస్తాడు. అంటే కదలిక కలిగిస్తాడని అర్థం. సమస్తమూ ఎప్పుడూ కదులుతూనే వుంటుందండీ సృష్టిలో. మన లోపలా కదులుతూంది. మన బయటా కదులుతూంది. అన్నీ కదులుతూనే వుంటాయి. సూర్యమండలాలు కదులుతున్నాయి! గోళాలు కదులుతున్నాయి ! గోళం ఎంత వేగంగా కదులుతూ వున్నదీ? ఆ కదలిక ఎక్కడ నుంచి వచ్చింది? ఆయన కలిగించిన 'క్షోభణము' అని ఋషులు దర్శించారు. ఈ తత్త్వము కేవలం ఉండడమే కాకుండా, తాను కదలక అన్నిటినీ కదిలిస్తుంది. ఒకటి నిశ్చలంగా, స్థిరంగా వుంటే అది ఆధారంగా మిగతావన్నీ తిరుగుతూ వుంటాయి. అన్నీ తిరుగుతూ వుంటే వీలుపడదు. అందుకని తాను నిశ్చలుడై, శాశ్వతుడై, స్థిరుడై, స్థానము కొనియున్నపుడు అతడు ఆధారంగా సమస్తాన్నీ తిప్పుతూ వుంటాడుట. మనం అదే పని చేస్తూ వుంటాం. మనం కారణంగా ఆలోచనలు వస్తాయి. లేకపోతే ఆలోచన లేదుకదా! ఆలోచనల కారణంగా ఇంద్రియాలకి పని, శరీరానికి పని. అన్నీ కదులుతూ వుంటాయి. శరీరంలో రక్తప్రసారం కూడా మనం ఉండబట్టి జరుగుతోంది తప్ప, మనం లేకపోతే జరగదు. గుండె కొట్టుకోవడం మనం ఉండబట్టి జరుగుతోంది తప్ప, మనం లేకపోతే జరగదు. స్పందనం మనం ఉండబట్టి జరుగుతోంది తప్ప, మనం లేకపోతే జరగదు. ఏ ఒక్కటీ మనం లేకపోతే జరగదు. మనం ఎట్లా ఉన్నాం? అంటే తెలియదు. ఎంత బాగా ఉన్నామంటే మనకే అవగాహన కానట్లుగా ఉన్నామన్నమాట. అంత అదృశ్యుడై, అంత నిహితుడై, అంతర్వర్తియై వుంటాడు. మనం లేకపోతే మన దేహంలో జరిగే వ్యాపారాలేవీ జరగవు. కదలికలేమీ జరగవు. మనం లేకపోతే సంకల్పాలు రావు. పనులూ లేవు. ఈ శరీరానికి కదలికా లేదు. మరి వీటన్నిటినీ కదలించబట్టి కదా ఉన్నట్టుగా మన స్థితి ఒకటి మనకు ఏర్పడింది. అలా కదలిక కలిగించేవాడుగా తాను ఉన్నానని మనకి తెలియజెప్తున్నాడు ఈ నామంలో. మనయందు అట్లాగే వున్నాడు. సృష్టి యందూ అట్లగే వున్నాడు. నిరంతరం అన్నీ కదులుతూనే వుంటాయి, తను తప్ప! ఆ కదలటం కూడా తను ఉండటం చేత కదులుతూ వుంటాయి. సృష్టించి, దానియందు తాను ప్రవేశించి, నివసించి ఉండటం చేత, తాను కేంద్రంగా సమస్తమూ కదులుతూ వుంటాయి. కేంద్రం అలా స్థిరంగా వుంటుంది. అందుకని ఏమీలేనట్టుగా తనుంటాడు. అన్నీ ఉన్నట్లుగా చుట్టూ వుంటాయి. ఏమీ లేనట్టుగా ఉన్నవాడు అసలు ఉన్నవాడు. అన్నీ ఉన్నట్టుగా ఉన్నవి వచ్చి పోయేవి. అక్కడే తిరుగుతూ ఉన్నవాడిగా, వచ్చిపోయేవాడిగా, అన్నిటిగా ఉన్నట్లుగా ఈ కదలిక మూడు రకాలుగా చేస్తూ వుంటాడట. ఒక కదలిక వర్తులాకారంగా జరుగుతూ వుంటుంది. అంటేఅలా భ్రమణం

చక్రభ్రమణంగా జరుగుతూ వుంటుంది. ఆ కదలికలో జీవులందరూ బంధింపబడి జీవిస్తూ వుంటారుట. అంటే అదే ప్రాద్దున్న, అదే సాయంత్రము అలా జరిగిపోతూ ఎప్పుడూ నూతనత్వం లేకుండా, చైతన్యవంతం అవకుండా అట్లాగే జీవిస్తూ ఉండేవారు లేరూ? గానుగెద్దు మాదిరిగా జీవించే జీవితాలు చాల వున్నాయి. ఇది భగవంతుడి ఒక కదలిక. వర్తులాకారమైన కదలిక. చక్రభ్రమణంలో అన్నీ అట్లా తిరుగుతూ వుంటాయి. ఆకాశంలోకి నీళ్లు వెళ్తూ వుంటాయి. మళ్ళీ అందులోంచి వర్షంగా నదుల్లోకి, వాటినుండి సముద్రంలోకి వెళ్ళి కలుస్తూ వుంటాయి. మళ్ళీ తిరిగి వస్తూంటాయి. ఇట్లా జరుగుతూ వుంటుంది. దీనికి ఎడతెరిపి లేదా అంటే వుందిట. ఇంకో కదలిక వుందిట. వర్తులాకారంగా తిరుగుతూ చక్రభ్రమణం చేస్తున్నవాడు ఒక చక్రభ్రమణం జరిగి, రెండో సారి వచ్చేసరికి అలాగే తిరుగుతున్నప్పటికీ, అంతకన్నా ఎక్కువ ఆరోహణ చేసిన స్థితిలోకి, ఉత్తమోత్తమైన స్థితిలోకి ప్రవేశించడం అనేది ఒకటి వుంది. దాన్ని మనకి 'మాధవీలత' అంటారు. 'రాధామాధవం' అంటారు. మాధవుని చుట్టూ రాధామాధవం అనే లత. ఏ లతైనా సరే ఒక యష్టి లేక ఒక గుంజ నాధారం చేసుకొని దానిచుట్టూ అల్లుకుంటూ, తిరుగుతూ, పైకి వెళ్తూ వుంటుంది. కదా! ఇక్కడ కూడా తిరుగుడు వుంది కానీ ఒక తిరుగుడై రెండో తిరుగుడు కొచ్చేసరికి అంతకన్నా పైన వుండడం జరుగుతుంది. దీన్నే మన పెద్దలు 'అనూరాధ' అనే ఒక క్రతువుగా ఇచ్చారు. అల్లుకుంటూ పైకి వెళ్ళిపోతూ వుంటుంది. అల్లుకుంటూ పైకి వెళ్ళిపోయిన మార్గమేదైతే వుందో అదే మార్గం గా మళ్ళీ దిగివచ్చేయడం కూడా జరుగుతుంది. అందుకని భగవంతుని యొక్క కదలికలో ఒకటి వర్తులాకారమైన కదలిక అయితే ఇంకొకటి అవరోహణ క్రమంలో కదలిక. రెండవది ఆరోహణ క్రమంలో కదలిక. ఇట్లా కదలిక లున్నాయి. ఇది రెండవ కదలిక. అవరోహణ క్రమంలో సూక్ష్మ లోకాల్లోంచి స్థూల లోకాల్లోకి సమస్తాన్నీ పట్టుకొస్తూ వుంటాడు. ఆరోహణ క్రమంలో స్థూలంలోంచి సూక్ష్మంలోకి పట్టుకెళ్తూ వుంటాడు. ఇది ఇంకొక రకమైన చక్రభ్రమణం. ఇందులో ఆరోహణ, అవరోహణ క్రమాలుంటాయి. ఇలా వర్తులకారంగా ఊర్ధ్వగతి చెందుతున్నవాళ్ళు తాను, నేను అనే తత్త్వం తెలుసుకున్న తర్వాత మూడవ రకమైన కదలిక వుంటుంది. ఏమిటా కదలిక అంటే 'వ్యాపనము'. ఇంక అక్కణ్ణుంచి గుండ్రం గుండ్రంగా తిరగటం వుండదు. మొత్తం అంతా వ్యాపించి యుంటాడు. ఈ వ్యాపించి యుండే తత్వం ఒకటి. ఆరోహణ, అవరోహణ క్రమంలో వుండే తత్త్వం ఒకటి, క్షోభణం. అక్కడే తిరుగుతూ వుండే తత్త్వం ఒకటి. ఇలా మూడు రకాలుగా తనయొక్క కదలికలు వున్నాయి. మనలో కూడా చక్రభ్రమణంగా రక్తప్రసారం జరుగుతూ వుంటుంది. గుండె దగ్గర మొదలుపెట్టి మంచిరక్తం అలా శరీరమంతా ప్రవహించి, తిరిగి వచ్చేటప్పుడు చెడురక్తంగా వస్తే, దానిని మళ్ళీ

మంచిరక్తంగా చేస్తుంటే, మళ్ళీ చెడురక్తంగా మారుతుంటే, మంచిరక్తం, చెడురక్తం ఇలా ఉత్తరాయణం, దక్షిణాయనం గా జరిగిపోతూ వుంటుంది కదా! ఆ కదలిక ఎవరు కలిగిస్తున్నారు? మనలో మనవలె నున్న భగవత్తత్త్వం వలన అది జరుగుతుంది. లేకపోతే జరగదు. మనిషి లేకపోతే రక్తప్రసారం ఏముంది? తర్వాత రెండవది ఊర్ధ్వగతి చెందేది, అధోగతి చెందేది అయిన కదలికలు మన శరీరంలో వుండే సుషుమ్న నాడిలో జరుగుతాయి. పదార్థం మీద విరక్తి కలిగి, పరమార్థం మీద ఆసక్తి పెరిగినవాళ్ళు క్రమశః ఊర్ధ్వగతి చెందుతూ వుంటారు. వాళ్ళు పదార్థ లోకాల్లో జీవించడం మానేసి భావమయమైన లోకాల్లో ఎక్కువగా జీవిస్తూ వుంటారు. వాళ్ళకి చుట్టూ అవి వున్నాయా, ఇవి వున్నాయా అనే వాటితో లెక్కలేదు. ఎక్కువగా భావంలో వుంటూ వుంటారు. భావం నుంచి పరభావంలోకి వెళ్తారు. పరతత్వం గురించిన భావంలోకి. అట్లా ఊర్ధ్వగతి చెంది వెళ్తూ వుంటారు. అది సుషుమ్న నాడిలో మనకి ఊర్ధ్వగతి గాను, అధోగతి గాను దిగిరావడానికి మార్గం. ఈ బ్రహ్మరంధ్రంలో కదలికలున్నాయి. యోగంలో మనం చేసే సాధన ఏమిటయ్యా అంటే మామూలుగా ఇలా గుండ్రం గుండ్రంగా గానుగెద్దుల్లాగా తిరుగుతున్న జీవితం నుంచి బయటపడి, అనూరాధ తీగెలాగ అలా సుషుమ్న నాడి ఆధారంగా ఊర్ధ్వగతి చెందటం. అంటే పదేళ్ళ క్రిందట ఎటువంటి భావాలు, ఎటువంటి కోరికలు, ఎటువంటి స్థితి వుందో, ఎరుక వుందో, ఇప్పుడూ అదే వుంది అంటే ఇప్పుడూ అక్కడే వున్నావని అర్థం. పదేళ్ళు పోయినా అదే వ్యామోహం, భ్రమ, మమకారం మనచుట్టూ వుండే విషయాల మీద మనకు ఉందనుకోండి, వుంటే గుండ్రంగా తిరుగుతున్నట్లు అర్థం. ఒక ఎద్దు గానుగను తిప్పేటప్పుడు ఒక సంవత్సరంలో ఒక వెయ్యి కిలోమీటర్లు తిరగవచ్చు. కానీ ఏం జరిగింది దానికి? అది అక్కడే వుంది. అదే వెయ్యి కిలోమీటర్లు గానుగ చుట్టు తిరగకుండా వెళ్ళిందనుకోండి, చాలా దూరం వెళ్ళచ్చు. కాశీ వరకు వెళ్ళిపోవచ్చు కదా! విశాఖపట్నం నుంచి కాశీ వెళ్ళాలనుకొని గానుగెద్దు పద్ధతిలో ఒకటి, ఇంకో పద్ధతిలో ఒకటి. ఈ రెండో తత్వం మనకి యోగంలో అందుకిచ్చారు. ఊర్ధ్వగతి చెందాలయ్యా బాబూ! రోజూ చేస్తున్నాను ప్రార్థన. అయినా ఏమీ మర్పులేదే అంటే నీ భావంలో మార్పేది? కప్ప బావిలో రెండడుగులు పైకెగిరి, మూడడుగులు క్రిందపడ్తూంటుంది బావిలో. ఎప్పటికది బయటికి వస్తుంది? నీళ్ళల్లోకి వెళ్ళిపోవడమే తప్ప. కనుక రెండు పైకి వెళ్ళి, మూడు క్రిందకి వెళ్తూంటే, ప్రతిరోజూ అడుగు క్రిందకి దిగుతోందన్నమాట. మనకలాగే వుంటుంది. ఎందుకంటే సాధన చేస్తూంటే అంతరాయాలు వస్తూ వుంటాయి కదా! అంతరాయం వచ్చిందంటే కప్ప క్రిందకి వచ్చినట్లే. కప్ప పైకిలేస్తే అదివరకు మనకుండే తాపత్రయాలు ఇప్పుడు తగ్గుతూ వుంటాయి. మూడు రకాల తాపాలు వుంటాయి మనకు. తాపత్రయం, తాపత్రయం

అంటాం కదా! మూడు రకాల తాపాలు. తాపముల యొక్క త్రయము. ఏమిటా మూడు రకాలైన తాపాలు? మొగుడికి పెళ్ళాం మీద, పెళ్ళానికి మొగుడు మీద వుండే తాపం ఒకటి. ఇద్దరికీ పిల్లల విషయంలో వుండే తాపం ఒకటి. అందరికీ ధనం మీద వుండే తాపం ఒకటి. అందుకనే 'దారేషణ, పుత్రేషణ, ధనేషణ' అని చెప్తారు. ఈ మూడూ ఈషణత్రయాలు. అవి తాపం కలిగిస్తూ వుంటాయి. అక్కడే తిరుగుతూ వుంటాడు. ఎన్నాళ్ళు పోయినా వీటికోసం పనిచేయడమే! ఇంక ఇంతకన్నా ఏమీలేదు. ఇది దాటి ఎప్పుడైనా ఆలోచించమా? పిల్లలు, చదువులు, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళు అదో గోల అదో పెద్ద కార్యక్రమం. ఇంకో కార్యక్రమం ఎట్లా సంపాదించాలి? అనేది. ఎన్నాళ్ళు పోయినా ఆ సమస్య సమస్యగానే వుంటుంది. మూడవది ఈయనకి ఆవిడమీద, ఆవిడకి ఈయన మీద ఇంతే. ఈ మూడూ దాటి బ్రతకడట గానుగెద్దు జీవితమల్లే! ఇంతకన్నా వైభవోపేతమైన జీవితం వున్నదా లేదా? అని ప్రశ్న వేసుకొని, ఆ ప్రశ్నలోంచి ఋషులు సాధించారు. మనకి చాలా మహత్తరమైన జీవనం వున్నదని, మనకి ఏడంతస్థుల మేడ ఇస్తే, క్రింద వున్న cellar లో వుంటున్నాం అని చెప్తారు వాళ్ళు. ఏదీ? గాలి, వెలుతురు లేక ఏడుస్తూ, దోమలు కుట్టించుకుంటూ, మురుగు కంపుకొడ్తూ. ఉన్నది ఏడంతస్థుల మేడరా! నువ్వు ఏడంతస్థుల్లో కనీసం మొదటి అంతస్థులో కూడా లేవు. అంతకన్నా క్రింద వున్నావు, పైకి లే! అంటారు. ఈ పైకి లేవడం అనేది మనలో రెండవ కదలిక. అదే యోగం! యోగం జరుగుతోందా లేదా అనేది ఎలా తెలుస్తుందంటే మన భావాల్లో మార్పులొస్తుంటే, యోగం జరుగుతున్నట్లు. ఏం జరగట్లేదండీ అంటే నీకు భావాల్లో మార్పు తెచ్చుకొనే సంకల్పం లేదు. యోగాన్ని ఇందుకు వాడాలని కదా! ధన సంపాదనకి, కుటుంబం యొక్క సంక్షేమానికి, పిల్లల యొక్క వృద్ధికి వీటికోసం యోగం వాడటం కాదు. దానికి ఆరాధనలు చేసుకో. భగవంతుని యొక్క అనుకూల్యం సంపాదించుకో. భగవంతుని యొక్క అనుకూల్యం ఒకే ఒక రకంగా వస్తుంది. నీవు ఇతరులకి ఎంత అనుకూలంగా వుంటే, అంత అనుకూలం భగవంతుని దగ్గరనుండి నీకు వస్తుంది. భగవంతుని యొక్క అనుకూలత మనకు రావాలనుకుంటే, మనం జీవులపట్ల చూపించే అనుకూలత బట్టి వుంటుంది. అందుకని మనం ఇట్లా ఊర్ధ్వగతిని చెందటం అనేది రెండవ కదలిక. ఆ కదలికే యోగం! ఏమన్నా కదిలిందా అంటే ఏమీ కదలదు. అది కదిలితే, కదిలి కదిలి ఆజ్ఞలోకి వచ్చామనుకోండి. ఆజ్ఞలోకి వచ్చిన జీవుడు అక్కడి నుంచి వ్యాపనం చెందుతూ వుంటాడు. అది మూడవ కదలిక. ఇక్కడ వుంటాడని తప్ప ఇక్కడ వుండడు. ఇక్కడే వుండడు. మనమైతే ఇక్కడే వుంటాం. ఇందులోనే. డిప్ప మూత వేసేసినట్లుగా, డబ్బా మూత పెట్టేసినట్లుగా వుంటుంది. అది డబ్బా మూత తెరచినట్లు వుంటుంది. డబ్బా మూత తెరిస్తే ఏం జరిగింది? డబ్బా లోపలి చోటు,

బయటి చోటు ఒకటై పోయింది కదా! మొత్తం చోటు అంతా ఆక్రమించి వున్నదా? డబ్బాలో వున్నచోటుకు ఆక్రమణ లేదు కదా! అది డబ్బాకే పరిమితమై వున్నది. ఇది మూడవ కదలిక. ఇట్లా మూడు కదలిక లున్నాయి. కనుక ఇలా మూడు రకాలుగా మొత్తాన్ని కదలిస్తూ వుంటాడు. ఏం చేస్తూ వుంటాడు? ఒకటేమో అక్కడక్కడే, అక్కడక్కడే తిరుగుతూ వుండేది. ఇంకోటేమో పైకి వెళ్ళడం, క్రిందకి రావడం. ఇంకోటేమో పైకి వెళ్ళి వ్యాపనం చెందడం. ఈ మూడు రకాల కదలికలు ప్రతి జీవుడికి, ప్రతి గోళానికి, సృష్టికి ఏర్పరిచారట. ఇది ఆయన చేసే క్షోభణం. ఇంత కదలిక చేస్తున్నాడే! మనలో కదలిక లున్నాయి. బయట కదలిక లున్నాయి. మనలో మనం ఆధారంగా కదలికలు అవుతున్నాయి. సృష్టిలో ఆ తత్త్వం ఆధారంగా కదలికలు అవుతున్నాయి. నిజానికి మనలో మనంగా వుండేది కూడా ఆ తత్త్వమే!

388 దేవుఁ

వెలుగే శరీరంగా ఉండే వాడిని 'దేవ' అంటారు. భగవంతుడి శరీరం ఏమిటయ్యా అంటే వెలుగే! వెలుగు వచ్చినపుడు భగవంతుడే సశరీరుడుగా వచ్చినట్లు భావన అన్నమాట. ఎప్పుడు వెలుగు వచ్చినా, ఆ వెలుగుకి ఆధారంగా వున్నవాడు ఉండటం బట్టి అది వెలుగుతోంది. లేకపోతే అది వెలగదు. అగ్ని ఆధారంగా జ్వాల వున్నది. జ్వాల వుంటే అగ్ని వున్నట్లే. అగ్నిలేకపోతే జ్వాల లేదు. విద్యుత్తు వుంటే ఆ దీపం అక్కడ వెలుగుతుంది. విద్యుత్తు కనబడదు. కానీ విద్యుత్తు వున్నట్లు ఎలా తెలుస్తోంది? వెలుగు వుండబట్టి తెలుస్తోంది. దీపం వుండబట్టి తెలుస్తోంది. కాబట్టి భగవంతుడు ఉండడం అంటే వెలుగుగా గోచరించటమే! అందుకని ఏమన్నా వెలుగు కనపడ్డదా అంటూంటాం కదా! వెలుగు కనబడడం అంటే ఆయన వచ్చాడు అని అర్థం. కొంతమంది యందు వెలుగు ఎక్కువగా వుంటుంది. అంటే వాళ్ళు మిగతావాళ్ళ కన్నా ఎక్కువ వెలుగు కలిగివున్నారు కాబట్టి 'దివ్యులు' అని అర్థం. దాన్నే ఆంగ్లం లో Divine అంటారు. ఈ దివ్యత్వం పరిపూర్ణంగా ఉండేవాడు ఆయన! ఎందుకంటే ఆయన నుండి అది వెలుగుతోంది. మనం కూడా అప్పుడప్పుడు ఏదన్నా మంచి భావం వస్తే 'వెలిగిందిరా' అంటాం కదా! ఒక్కొసారి మన క్కూడా వికాసం వచ్చి, మనం కూడా అంతకుముందు కంటే బాగుంటాం వెలిగినప్పుడు. అట్లాగే భగవంతుని యొక్క సంకల్పంగా ఇదంతా వెలుగొస్తుంది. అంటే ఏమిటి? తాను తన వెలుగుగా వ్యక్తమయ్యాడన్న మాట. అందుకని ఎక్కడ వెలుగు దర్శనమైనా వాణ్ణి చూడడం నేర్చుకోవాలి. వజ్రం ఖరీదైనదని అమర్చుకుంటూ వుంటాం. అది వజ్రం అనుకునే కన్నా అది వెలుగు అనుకుంటే ఎక్కువ బాగుంటుంది. వజ్రంలో వుండే విలువ ఏది? వెలుగే కదా! లేకపోతే అదీ బొగ్గే. కనుక వెలుగు ఎక్కడ కనిపిస్తే దానిని భగవంతుని అస్తిత్వం అని గుర్తించాలి. కొంతమంది కన్నుల్లో మంచి వెలుగు కనిపిస్తుంది. కొంతమంది నవ్వుతుంటే చాలా వెలుగు వస్తుంది. మాస్టరుగారు నవ్వుతూంటే వెలుగు అట్లా బయటికి వస్తూండేది. 'మాస్టరుగారూ! మీరు నవ్వుతో ఎక్కువ చికిత్స చేస్తారు హోమియోతో కన్నా' అని అంటూండేవాణ్ణి. 'అటువంటివేమీ పెట్టబోక నాకు' అని చెప్పారు. కానీ మాస్టరుగారి నవ్వు ఎలాంటిదంటే నవ్వుతున్న కొద్దీ వెలుగు అలా వ్యాపనం చెందుతుండేది. కొంతమంది భాషణం చేయటం వల్ల వెలుగు వస్తుంది. ఏదైనా వెలుగునే దర్శనం చేసుకుంటే, ఉన్నదాంట్లో వుండే వెలుగును చూస్తే, దేవుణ్ణి చూసినట్లు. వెలుగును తప్ప మిగతావన్నీ చూస్తే దేవుడు మరుగవుతాడు. మనకి అక్కడ ఇతరమైన విషయాలు ఎక్కువ అవతరించి వుంటాయి.

389 శ్రీగర్భః

శ్రీగర్భుడు అంటే అమ్మవారి లోంచి అన్నీ పుట్టినాయి. శ్రీకి, తాను పుట్టుక స్థానం. తననుంచి అమ్మవారు పుడ్తే, అమ్మవారి నుంచి మిగతావన్నీ పుట్టాయి. మనకి పుట్టినవి ఏరుకుంటూ వుంటాం. మనలోంచి పుట్టినవన్నీ పోగేసుకొని, మనచుట్టూ ఏర్పరచుకుంటూ వుంటాం. అది తెలిసినవాళ్ళకి అవివేకంగా కనిపిస్తూ వుంటుంది. నీలోంచి పుట్టేది నువ్వు దాచుకోవడం ఏమిటి? దాచుకోవలసిన అవసరం ఏముంది? పుడ్తుందిగా. తనలోంచి పుట్టేది తను దాచుకునే అవసరం లేదుకదా! ఎందుకంటే తన కవసరమైనపుడు మళ్ళీ వస్తుంది. ఎక్కడనుంచి? తనలోంచే! ఇది చాలా పెద్ద సాధనా రహస్యంగా మనం భావన చేయాలి. మనమంతా ఏం చేస్తామంటే మనలోంచి పుట్టిన విషయాల వెంట మనం పడ్తూ వుంటాం కదా! మనలోంచి కుటుంబం పుడుతుంది. కుటుంబం వెంట మనం పడతాం. మనలోంచి కీర్తి పుడుతుంది. కీర్తి వెంట మనం పడతాం. మనలోంచి సంపద పుడుతుంది. సంపద వెనకాల మనం పడుతూ వుంటాం. దాన్ని కాపాడుకోవడం కోసం. ఆస్తులు పుడ్తాయి. సమస్యలు పుడ్తాయి. అవి మనలోంచి పుట్టినవే. వాటి వెంట మనం పడ్తూ వుంటాం. ఏంటండీ అలా వున్నారంటే, కొంచెం సమస్యలు ఎక్కువగా వున్నాయండి. వాటిలో బాగా ఇరుక్కొని వున్నానంటాడు. ఎక్కడ నుంచి పుట్టాయి? నీలోంచే పుట్టాయి. శ్రీ దగ్గర్నుంచి సమస్తమూ నీలోంచే పుడుతుంది. భగవంతుడి లోంచి ఎట్లా పుట్టిందో అలా! ఇది ప్రత్యేకంగా భగవంతుడికి, మానవుడికి వుండే సామ్యం. తనంతటి వాడుగా చేసి అక్కడ పెట్టాడు. పెడ్తే, వాడిలాగ ఉండలేక ఇంకొక రకంగా తయారయ్యాం మనం. తననుండి ఆమె పుట్టింది కాబట్టి ఆమె వెంట ఆయన ఉండడుట. తన వెంట ఆమె వుంటుంది. భగవంతుని అంటి శ్రీ వుంటుంది. ఎందుకని? భగవంతుని నుంచి వ్యక్తమైంది కాబట్టి. మననుంచి వ్యక్తమైంది కూడా మనవెంటే వుంటుందని తెలియక దానివెంట మనం పడతాం. మనవెంట పడే దానివెంట మనం పడ్తున్నాం అంటే ఎంత అవివేకం అది? మన నుండి వచ్చిందే కదా! మననుంచి వచ్చింది మనకన్నా ఎక్కువ ప్రాముఖ్యత సంతరించుకున్నదట అంటే మన కేంద్రం నుంచి మనకు వికేంద్రీకరణం జరిగిందన్నమాట. అంటే అక్కడ నుంచి disturb అయింది. చెదిరిపోయింది. కేంద్రం చెదరడం వల్ల మనకి గందరగోళం అవుతుంది. ఎందుకు చెదరాలి? మననుంచి వచ్చిందే కదా! మనం దానివెంట పడడమేమిటి? అది మనవెంట వుంటుందిలే అని అనుకున్న వాళ్ళందరికీ వెంటే వుందండి. సృష్టిలో సమస్త వైభవములు వాటి వంక చూడనివాడి వెంట అవి వున్నాయి. వాటివెంట పడినవాళ్ళని మోహంలో పడేసి అధోగతి పాలు చేసాయి.

మననుండి మన ఆధారంగా పుట్టింది నీడ. నీ నీడ వెంట నీవు తిరగటం ఎంత అవివేకం? ఇవాళ నీ నీడ వెంట నీవు తిరుగుతున్నావనుకో. అందుతుందా నీకది? నీవు నీ నీడ వైపు వెళ్తుంటే, నీడ ఇంకా ముందుకు వెళ్తూనే వుంటుంది. ఏం జరుగుతుంది? సూర్యునివైపు వీపుని, నీడవైపు ముఖాన్ని పెట్టుకొని, వెలుగు లేక, దొరకని నీడ వెంటపడి పోతూ వుంటాడు. పోతున్న కొద్దీ సూర్యుడికి అంటే ఆత్మజ్ఞానానికి దూరమౌతూంటాడు. ఇలా పోతూ పోతూ ఉన్నామనుకోండి. ఏంటిరా అట్లా నీడవెంట పోతున్నావు అంటే అది దొరకట్లేదండి. దాన్ని పట్టుకుందాం అని. అది నావెంట రావాలి. నేను చెప్పినట్లు అది వినాలి. అంటూ అది చెప్పినట్లు నువ్వు వింటున్నావిప్పుడు. అనుకోవడం నీవు చెప్పినట్లు అది వినాలని. జరుగుతున్నది అది చెప్పినట్లు నీవు వినడం. అది చూసి ఒక పెద్దాయన చెప్పాడట నీవెంట అది రావాలి అంతేకదా! వెనక్కి తిరగమన్నాడు. అలా వెనక్కి తిరిగి నడిస్తే, వీడి వెంట అది వస్తోంది. 'ప్రయత్నం లేకుండా మన వెంట నడిచే వాటి వెనక మనం ప్రయత్నించి నడవడం' కంటే అవివేకం ఏముంది? అందుకనే ఆత్మజ్ఞానికి దేనివెంటా పడకుండుడం అనేది ఒకటి వుంటుంది. తను పడకుండా వుండుట వలన అతనివెంట అవి పడివుంటాయి. జనకుడికి అలా అన్నీ పడివున్నాయి. సమస్త భోగములు, వేటికోసమైతే మనం జన్మల తరబడి చొంగలు కార్చుకుంటూ తిరుగుతామో ఆయనకి అవన్నీ ఊరికేనే అక్కడపడి వున్నాయట నేనంటే నేనని. ఎందుకని? ఆయనకేమీ అవి కావాలని లేదుట. అందుకని వున్నాయట. ఎప్పుడూ అంతే. వద్దంటే డబ్బు. నీవు ఏది కావాలనుకుంటావో ఆ కావాలనుకొనే కోరికకి, ఆ దొరికే విషయానికి నీవే అడ్డంగా నిలబడిపోతావు. ఎంత కోరితే అంత అవరోధం కల్పించుకొన్న వాడివవుతావు. దాని గురించి చేయవలసినది చేస్తూంటే, అది నీవెంటే వుంటుంది. జనకుని వెంట వున్నాయి అలా అన్నీనూ. సమస్త భోగములు ఆయన వెంట వున్నాయి. యోగులు వేరు, రాజయోగులు వేరు అని చెప్తారు. రాజయోగులేమిట్రా అంటే ఎప్పుడూ వైభవంలో వుంటారు. వైభవం వారి వెంటే వుంటుంది. వారు వైభవంలో ఉండాలనే కోరిక కలిగి వుండరు. శ్రీకృష్ణుడు అటువంటి యోగి! జనకుడు అటువంటి యోగి! వీళ్ళందరూ రాజర్షులు. ఏమిటయ్యా అంటే వేటికోసమైతే చక్రవర్తులు సైతం వెంటపడ్తూ వుంటరో, అవన్నీ వదిలేసి అసలు తత్త్వంతో ముడిపడి వుంటారు. అట్లా ముడిపడి వున్నప్పుడు ఏమవుతుందయ్యా అంటే తానే పుట్టిల్లవుతాడు సమస్తానికీ. సమస్త వైభవానికీ తానే ఆధారం! తనవలన ఈ వైభవం తప్ప, ఈ వైభవం వలన తనుకాదు అని తెలిసినవాడు. వాడు 'శ్రీగర్భుడు'. భగవంతుడు శ్రీగర్భుడు! ఏమిటయ్యా అంటే ఆయనలోంచే వచ్చి ఇంత వైభవం వున్నప్పటికీ ఆయన ఆధారంగానే అది వుంది తప్ప, అది ఆధారంగా ఆయన లేడు. మనం నాలుగురాళ్ళు

సంపాదించి, ఆ రాళ్ళు ఆధారంగా జీవిస్తూ వుంటాం కదా! అవి బ్యాంకులో వుంటే తృప్తి మనకి కదా. మనకి ఒక సామెత వుంది. గొడ్డుకి తిన్నది తృప్తిట మనిషికి వున్నది తృప్తిట. వీడు వాడడు, పెట్టడు. అక్కడ వుందని సంతోషం అంతే. తినడు. తింటే అయిపోతుందని భయం. బ్యాంకులో వుంది ఒక కోటి రూపాయలు. అమ్మయ్య అని ఆనందంగా వుంటాడు. వీడేం తినడు. పాతికేళ్ళయినా దాన్నేమీ ముట్టుకోడు. ఉందని ఆనందమే! అది పోయిందనుకో. నిజానికి వీడికేం తేడా పడుతుంది? ఎందుకంటే వాడెన్నడూ వాడలేదు దాన్ని. కేవలం మానసికమేనా? భౌతికమా? మా ఊళ్ళో నాకు ఒక వంద ఎకరాల పొలం వుందండి. అసలు ఎప్పుడూ పోలేదు. ఉందనే తప్ప వెళ్ళి చూసింది లేదు. ఇవ్వాళ లేదని ఎవడన్నా చెప్పాడనుకోండి. నీకేంటి తేడా పడ్డది? నీవెన్నడూ పోలేదు, చూడలేదు. అక్కడ అనుభవించలేదు. అది లేకపోతే ఏమొచ్చింది? లేదన్న భావన వల్ల బాధ తప్ప, నిజంగా భౌతికంగా లేకపోవడం కాదది. ఇలా చాలా తమాషాగా ఇబ్బంది పడుతూ వుంటాం. దీనికి కారణం, మనలోంచి, మనం ఆధారంగా వున్న వాటియందు మనం ఆధారపడి వుండడం. మనం ఏదో scooter, car కొనుక్కుంటాం కదా! కొనకముందు కాళ్ళేనా ఆధారం? ఏమిరా రాలేదు అంటే, scooter repair కి ఇచ్చాడుట అందుకని పక్క సందులో ఉన్న వాడి ఇంటికి వెళ్ళడు, scooter లేదు కదండీ అంటాడు. అదేంటి? ఈ scooter లేనప్పుడు నీకేంటి ఆధారం? అందుకనే ఆత్మసాధనా కార్యక్రమంలో self dependency గురించి ఎక్కువ చెప్తారు. స్వయం మీద ఆధారపడటం తప్ప ఇంక దేనిమీద ఆధారపడక పోవడం. అది ఎంతదూరం వెళ్ళిపోతుందంటే, ఆహారం మీద కూడా ఆధారపడకుండా వుండడం వరకు వెళ్తుంది. తన చుట్టుప్రక్కల వాళ్ళమీద కూడా ఆధారపడకుండా వుండడం. అక్కణ్ణుంచి తన పనులు తానే చేసుకుంటాడు. తన గుడ్డలు తానే ఉతుక్కుంటాడు. ఎవడన్నా ఉతికిపెడతాడా, అని చూడడు. ఎవరన్నా అందిస్తారా, అని చూడడు. మనకన్నీ అందించాలి కదా! కాఫీ కూడా రోజూ ఇంటావిడ ఇస్తుంటే త్రాగుతాం. ఒక రోజున ఆవిడ లేదనుకోండి కాఫీ త్రాగటం మానేసి ఉస్సూరుమంటుంటాడే తప్ప వీడు కలుపుకోడు. అంత dependency కదా! అలా వుండడుట యోగి. ఎలా వుంటాడుట అంటే, ఎప్పటికప్పుడు చూసుకుంటూ వుంటాడుట. తను దేనిమీద ఎక్కువ వాలిపోతున్నాడో చూసుకొని, ఈ వాలిగా బ్రతకడం ఇష్టంలేక, వాలడం తగ్గిస్తూ వుంటాడు. car లేదనుకోండి, scooter, scooter లేదనుకోండి, cycle. cycle లేదనుకోండి, కాళ్ళు. అట్లా ready గా వుండాలట. సంసిద్ధత! తనమీద తనకి ఆధారం తప్ప ఇంకేదీ ఆధారం లేని స్థితిలో ఉంటాడు. అంటే అది లేకపోతే వీడు బ్రతకలేకపోవడం ఉండకూడదు. అది వుంటే అనుభవించవచ్చు. కొంతమంది వాళ్ళ కీర్తిమీద బ్రతుకుతూ వుంటారు. కదా! వాడికి

సంబంధించిన పదవి ఏదో ప్రక్కన వేసుకోకపోతే కుదరదు. చూడటానికి ఏబ్రాసి లాగ వుంటాడు. పదవి వుండటం వల్ల గౌరవిస్తూ వుంటారు. అది తెలియకపోతే వాణ్ణి గౌరవించరు కదా! అందుకని దానిమీద బ్రతుకుతూ వుంటాడు. కొంతమంది ధనం మీద బ్రతుకుతూ వుంటారు. కొంతమంది మనుషుల మీద బ్రతుకుతూ వుంటారు. కొంతమంది ఆస్తుల మీద బ్రతుకుతూ వుంటారు. యోగి ఏం చేస్తాడయ్యా అంటే, దేనిమీద ఆధారపడుతున్నామా అని చూస్తాడు. దాన్ని వెంటనే కత్తిరించేస్తాడు. ఎప్పుడో April, May లో మామిడిపళ్ళు వస్తాయని ఇప్పట్నుంచే మామిడిపళ్ళ మీద ఆశగా బ్రతికేవాళ్ళం ఉండమా? ఇంత ఆధారం మామిడిపండు మీదా? అని మామిడిపండుని కత్తిరించేసాడట ఒకడు. అందుకని కాశీలో వదిలేయమంటారు. అది లేకపోతే నీవు చావవు అని నీకు తెలియాలని. ఏదీ వదల్లేం, అన్నీ కావాలి. వీటన్నిటితో బాటు అదికూడా కావాలన్నమాట! వాళ్ళేమంటారంటే 'నాయనా! ఈ ఆత్మసామ్రాజ్యం లోకి రావాలంటే నువ్వు ఏనుగులు, లొట్టిపిట్టలు, వాటిమీద నీ సామాను, ఆస్తులు ఇవన్నీ తీసుకొస్తే వీలుపడదు. భావాలు కూడా వదిలేసి రావాలి' అని. 'సూదిమొన వుంది కదా! (సూదికి కన్ను వుంటుంది దారం గుచ్చేది). దాంట్లోంచే నీవు రావాలి. అందులోంచి ఏం పడితే దాన్ని తీసుకురా' అంటారు. నువ్వు తప్ప పట్టవు అందులో. నీ భావం కూడా అడ్డే! అలా వదిలేసినవాడికి అంతా వాడివెంట వుంటుంది. పతంజలి మహర్షి యోగసూత్రంలో చెప్తాడు. దేనినీ ఆశించని వాడి దగ్గర విలువైన వస్తువులు చేరతాయి. ఆశించిన కొద్దీ అది దూరమవుతూ వుంటుంది, నీడ వెంట పరిగెత్తడంలా. ఆశ్చర్యంగా ఉంటుంది. అనుకోకుండా కావలసినవన్నీ వాడి దగ్గరకు చేరుతూ వుంటాయి. కొంతమంది దానికోసం తెగ తాపత్రయపడుతూ వుంటారు. అది దొరకదు. ఇక్కడ రహస్యం ఏమిటయ్యా అంటే 'నీమీద నీవు ఆసక్తిగా వుండు. మిగతా వాటిమీద ఆసక్తి లేక వుండు. నీమీద నీవు ఆధారపడి వుండు. అప్పుడూ, నీమీద వాడికి కలిగిన అనుగ్రహం చేత నీకు వైభవాన్ని ఏర్పాటు చేస్తాడు. అప్పుడు కూడ వైభవంలో బ్రతుకుదాం అనుకోక. వాడితోనే వుండు. వైభవం వుంటుంది. ఎందుకని అంటే 'శ్రీ' వాణ్ణి వదిలి వుండదు కదా! 'శ్రీ' తోనే నీవు ఉండటం వల్ల నీక్కూడా అవన్నీ వుంటాయి'. అదీ రహస్యం. అందుకని 'శ్రీ' కి పుట్టిల్లుగా ఉండడమనేది యోగి చేయగలడు. శ్రీకి పుట్టిల్లు భగవత్తత్త్వం! యోగి ఎందుకిది చేయగలుగుతున్నాడంటే, భగవంతునితో యోగము చెందియుండటం వలన. 'యోగి' అంటే అర్థం అదే! యోగి అంటే భగవత్తత్త్వంతో విడివడకుండా కలిసి, ఎల్లకాలం ఉన్నవాడు. యోగము చెందినవాడని అర్థం. యోజించాడన్న మాట! యోజించడం అంటే కలపడం. ఏమిటి కలపడం? తాను అనే తత్త్వాన్ని, పరతత్త్వంతో ముడివేసి ఉంచడం. కాబట్టి ఆయనకి available

అయినవన్నీ, యోగికీ అందుబాటులో వుంటాయి. అదీ శ్రీ గర్భః! ధనవంతుడు కావాలంటే అట్లా కావాలి. ఇంకోరకంగా ధనవంతుడైతే ఆ ధనం మనల్ని పీడిస్తుంది. దీనినే మనకు 'నీడవెంట పరిగెత్తక. వెలుగు వెంట నడుస్తూ వుండు. నీడ నీ వెనక వస్తుంది. నీ శరీరం కూడా నీ నీడే' అని చెప్తారు. మనకి ఈ శరీరం వుంటుందో లేదో అనే భయం ఒకటి వుంటుంది కదా! భయం పడిపోతుందేమో నని! శరీరం పడిపోదు. నువ్వెళ్ళిపోతే అది పడిపోతుంది. అందుకని నీమీద ఆధారపడి వున్నది నీ శరీరం. అందుకని యోగసాధనలో మొట్టమొదటి మెట్టుగా ఏం చెప్తారంటే 'శరీరం మీద నీవు ఆధారపడక. శరీరం నీమీద ఆధారపడేట్టుగా చూసుకో. నీ మీద ఆధార పడ్డ శరీరం మీద నీవు ఆధార పడ్డావనుకోకు'. 'నీవు చేద్దాం అనుకొనే పనికి శరీరం సహకరించాలే తప్ప, శరీరం కావాలనుకొనే వాటికి నీవు సహకరించక' అని చెప్తారు. మనకు అట్నుంచి ఇటు అయిపోతుంది. ఎవరూ చెప్పలేదుగా చిన్నప్పుడే? చెప్పకపోవడం వల్ల ఏమవుతుందయ్యా అంటే వీడు దానికోసం అన్నీ తయారుచేస్తాడు. అదేమో ఆ తర్వాత నేను చెప్పినట్లు నువ్వు వింటావా సరే, లేకపోతే నీ సంగతి ఇంతే అని చెప్తుంది. కదా! మనం చెప్పింది వినకుండా ఎన్నిసార్లు పనిచేసింది ఈ శరీరం? కారణం ఏమిటి? దాన్ని అట్లా తయారుచేసాం మొద్దబ్బాయల్లే. మొద్దబ్బాయి మాటేం వింటాడు? పెద్దలేం చెప్పారంటే ఈ శరీరం 42 ఏళ్ళకి లొంగిందా, లొంగింది. ఆ తర్వాత ఇంక లొంగేదేమీ లేదు. నీవు దానికి లొంగి యుండటమే. ఇంకా ఏదో లొంగుతుందని ఆశతో జీవించక. అయిపోయింది. 21 సంవత్సరాలకి లొంగదీసుకున్నావా, చాకులా వుంటావు. పోనీ 28 అంటావా, ఫరవాలేదు. 35 అంటావా, ఇంకా ఫరవాలేదు. 42 అంటే ఇంక లాభం లేదు. అందుకని 7 ఏళ్ళ నుండి దానికి పదును పెట్టుకునే సాధన ఇచ్చారు. 7 సంవత్సరాలు వచ్చిన తర్వాత శరీరాన్ని పదును పెట్టే జీవనవిధానం మనకి ప్రాచీన సాంప్రదాయంలో ఆర్య సంస్కృతిలో వుంది. అదే ఉపనయనం! ఉపనయనంలో మంత్రాలు చదువుతారే తప్ప మనకెవరూ అర్థం చెప్పరు. అర్థం చేసుకోవడానికి ప్రయత్నం కూడా చెయ్యరు. అందులో ఏం వుంటుంది? పిల్లవాడు 7వ సంవత్సరం నుండి 21 వ సంవత్సరం వరకు, 14 సంవత్సరాలపాటు దీక్ష వహిస్తున్నాడు. ఏమిటా దీక్ష తెలుసా? ఒక గుండ్రాయి పెట్టి దానిమీద ఎక్కిస్తారు వాణ్ణి కదా! 'కాసేపు ఎక్కు నాన్నా' అంటారు. వాడు ఒక కాలు పెట్టి తీసేస్తాడు. 'గుండ్రాయి వున్నంత స్థిరంగా నేను వుంటాను' అని ప్రతిజ్ఞ చేస్తున్నాడు. సంస్కృతంలో చేస్తున్నాడు కాబట్టి తెలీదు. గుండ్రాయి అట్లా పెడితే ప్రపంచమంతా పదేళ్ళు తిరిగివచ్చినా అక్కడే వుంటుంది. అంటే ఎందుకక్కడ వుంటుందీ అంటే దానియొక్క స్థిరత్వం! అంత స్థిరమైన చిత్తాన్ని నేను సాధించుకొంటాను, అని ప్రతిజ్ఞ చేస్తున్నాడు పిల్లవాడు అక్కడ. అలా స్థిరంగా

వుండటం కోసం శరీరానికి నేను శిక్షణ ఇచ్చుకుంటాను అని, చెప్తున్నాడు. అందులో భాగంగా ఆ రోజునుంచి పిల్లవాడు మంచం మీద పడుకోడు. దూదిపరుపులు, U-foam, Dunlop ఇవన్నీ వుండవు. మామూలుగా తలగడ కూడా వుండదు. చన్నీళ్ళ స్నానం ఒకటి. తన శరీరాన్ని అందంగా తయారుచేసుకోవాలనే ప్రయత్నం వుండదుట. శరీరాన్నినేల మీద పడుకోబెడ్తారు వాళ్ళు తలగడ లేకుండా. తన కుడిభుజం యొక్క కండరమే తలగడగా వుంటుంది. జ్వాలాకూలుడు అలా పడుకుంటాడు మంద్రజాలంలో. ఏం పరుపులు లేవా ఆయనకి? ఆకుల మీద, మామిడిపండు రంగులో వున్న ఛాయలో, ఒక మామిడిపండు ఇక్కడ వున్నదా అన్నంత కండరం వుందిట ఆయనకి. ఆ కండరం మీద తలపెట్టుకు పడుకొనివుంటే, దేవాపిమహర్షి వచ్చి 'కౌసల్యా సుప్రజా రామా' అనిపాడి మేలుకొలుపుతాడు. అదేమిటి అట్లా ఆకులమీద పడుకోనిస్తాడటండీ గురువుగారు? ఏం గురువుగారండీ ఆయన? పైగా ఎక్కడివాడు జ్వాలాకూలుడు? కృష్ణుని రాజ్యంలో కోశాధికారి, రక్షణాధికారి/cabinet minister మనవడు. మన cabinet minister మనవడిని తెచ్చి నేలమీద పడుకోరా అంటే, పడుకుంటాడా? ఆకులమీద చెయ్యే తలగడగా పెట్టుకొని పడుకున్నాడు, అని మంద్రజాలంలో మనకి అనడంలో అర్థమది. పిల్లల్ని అట్లా పెంచాలి. చిన్నప్పుడు వంగనిది పెద్దైన తర్వాత వంగదు. మొక్కై వంగనిది మానై వంగుతుందా? అని సామెత వుంది కదా! అలాగే ఇది కూడా. వాడికి చల్లనీళ్ళ స్నానం. కేశాలంకరణ వుండదట. అందుకనే గుండు చేస్తారు. ఆ రోజు నుంచి నీ అందం కాదురా నీకు కావలసినది. లోపలి అందం బయటికి రావాలి. కాబట్టి ఇప్పుడు ప్రాధాన్యత శరీరానికి కాదు, లోపలి విషయాలకి. అంతఃకరణ మేల్కాంచాలి. బహిఃకరణములు దానికి లోబడి వుండాలి. బహిఃకరణములు అంటే మనస్సు, ఇంద్రియములు, శరీరము. అంతఃకరణములు అంటే అహంకారము, బుద్ధి, చిత్తము, మనసు. వాటికివి లోబడి వుండాలంటే శిక్షణ ఇవ్వాలి. ఏమిటి శిక్షణ? భౌతికమైన శరీరానికి శిక్షణ. శరీరం భౌతికంగా బలంగా వుండాలి. పదునుగా వుండాలి. మనకెవరికన్నా మామిడిపండంత కండరం ఏదండీ? పెసరగింజంత వుంటుంది. ఉందో లేదో తెలీడం లేదన్నట్లుగా వుంటాయి. మొండెం పెరుగుతుంది. ఇవేమో ఊరికే పాట్లకాయల్లే వేలాడుతూ వుంటాయి కదా! మరి ఇలావున్న ఈ శరీరాలు పెట్టుకొని సార్ మరి కుండలిని అంటే గురువుకి నవ్వాలో తెలీదు, ఏడవాలో తెలీదు. రుచిమీద స్వామిత్వం రావాలని ఉపనయన వటువుకి రుచికరమైన భోజనం అనే ప్రశ్న లేదు. భోజనంలో ఉప్పు లేదు, కారం లేదు, తీపి లేదు, వగరు లేదు ఏమీలేదు. అది వాడికి భోజనం తెలుసా? ఎందుకండీ అంత హింస పెట్టడం అంటే హింస కాదది. 21 సంవత్సరాల తర్వాత వాడేమి కావాలంటే అది తినమను. శరీరం మాట

వింటుంది. లేకపోతే శరీరం ఎంతసేపూ అనారోగ్యమైన రుచులకి అలవాటు పడిపోయి అవే కావాలనుకొని, తనకు తానుగా నాలుక ద్వారా జబ్బులు తెచ్చుకుంటూ వుంటాడు. జన్మంతా జబ్బులతో ఉంటాడు. దానికి బానిసై బ్రతకకూడదనే ఉద్దేశ్యంతో ఇలా పెట్టారు. వాడు చేయవలసిన దేమిటయ్యా అంటే ప్రాతఃసమయం, సంధ్యా సమయాల్లో ప్రార్థన. మిగతా సమయంలో ఒళ్ళు వంచి విద్యాభ్యాసము, పని. క్లాసులో కూర్చోబెట్టి పాఠాలు చెప్పడంగా వుండేది కాదు విద్య. ఇట్లా చేసుకోమని ఓ గంట చెప్పి, రోజంతా దానికి సంబంధించిన పనిచేయించేవాళ్ళు. మనసు, ఇంద్రియాలు, శరీరానికి పదునెక్కించడానికి. 7 వసంవత్సరం నుంచి 21 వ సంవత్సరం వరకు ఇలా తయారైన యువకుని యొక్క శరీరం, 84 ఏళ్ళ వరకు వాడు చెప్పినట్లు వింటుంది. ఆ తర్వాత ఇంక అక్కరలేదని వదిలేసి వెళ్ళిపోతాడట. అది మన ఆర్యసంస్కృతి! ఇప్పుడు మనం ఏం చేస్తున్నామంటే మోసుకు తిరుగుతున్నాం దాన్ని. బియ్యం బస్తా, పిప్పళ్ళ బస్తాలాగ వేసుకొని అట్లా ఏడుస్తూ అది పట్టుకొని తిరుగుతూ వుంటాం, దాన్ని సమర్థించుకుంటూ. నేనేమీ అంత లావేం కాదండీ, అంటూ వుంటాడు కదా! మనం వెనకనించి ఎట్లా కనబడుతున్నామో మనకి తెలీదు. కదా! అద్దం కూడా, పెద్ద నిలువుటద్దం ఎవరింట్లో వుంటుంది కనక? మొహం వరకు చూసుకుంటారు. దాంతో సరిపెట్టుకుంటారు. ఎప్పుడూ అదే మొహం చూస్తున్నాం కాబట్టి బాగానే ఉందనుకుంటాం మనం. ఎందుకివన్నీ చెప్తున్నానంటే శరీరం మీద కూడా మనం ఆధారపడటం కాకుండా శరీరాన్ని మనయొక్క పనిముట్టుగా తయారుచేసుకోవాలి. ఈ శరీరం కారణంగానే ఈ జీవుడు చేయవలసిన పనులు చేయగలుగుతాడు. లేకపోతే చేయలేడు. చేయగలుగుతాడు కాబట్టి దాని ద్వారా చేయించుకోవలసిన పనులకి దానికి సంసిద్ధత ఏర్పరచుకోవాలి తప్ప దాన్ని గురించి ఏడవకూడదు పోతుందేమోనని. పోతుందేమో ఏంటి? ఇదిపోతే ఇంకొకటి వస్తుంది. కదా! నువ్వుంటే కారొస్తుంది. కారేమిటీ వాహనమేగా! కనుక వాహనం కన్నా మనం ముఖ్యం. మనం బాగుంటే లక్ష వాహనాలు. మనమే దానికి లోబడిపోతే? అందుకని ఈ నీడ వెంటబడటం అన్నచోట మొట్టమొదట తెలుసుకోవలసింది ఏమిటీ అంటే ఈ శరీరం వెంట నీవు పడక. శరీరం నిన్ను అంటి వుంటుంది. నీవు కారణంగా వుంది శరీరం. నిన్ను అంటిపెట్టుకొని వున్నదాన్ని నీవు చక్కగా పదునుపెట్టుకొని, దానితో పనిచేయించుకో. పనులన్నీ అయిపోయిన తర్వాత వాళ్ళెక్కడో వదిలేసి వెళ్ళిపోయేవారుటండీ ఎవరూ చూడకుండా. అదీ కాశీకి ప్రయాణమంటే. కాశీ చేరుకోవాలి! అక్కడ గంగలో స్నానం చేయాలి. కేదార ఘట్టమా, ఇంకో ఘట్టమా ఇదికదు లెక్క. ఇక్కడ పనులైపోయినాయి. ఇంక నడచి వెళ్ళిపోతాను అని, ఎక్కడో

అక్కడ పడేసి పోతాను. 30 ఏళ్ళకే పనులు పూర్తిచేసుకొని కేదార్ నాథ్ అవతల వుండే లోయలోకి వెళ్ళిపోయి శరీరం వదిలేసి వెళ్ళిపోయాడట శంకరాచార్యుల వారు. మనకి 30 ఏళ్ళకి పనులేమవుతాయి? ఆయన మూడుసార్లు భారతదేశాన్ని హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు, కన్యాకుమారి నుంచి హిమాలయాలు అట్లా. తిరిగాడట. మూడవసారి హిమాలయాలకి వెళ్ళేటప్పటికి పనులైపోయాయి ఆయనకి. అక్కడ పారేసి, పోయాట్ట. అదీ ఆర్య సంస్కృతి! అంతేకానీ పనులైపోయినా అందులోనే పడివుండడం కాదు. పాశ్చాత్యదేశాల్లో అదే ఇప్పుడు బాధ. ముసలితొక్కులు. ప్రాణాలుంటాయి, వాడుండడు. మన సంస్కృతి ఏమిటి? పని వరకే శరీరం. పనైపోయాక వదిలిపెట్టేయాలి. పనైపోయాక కారక్కడ వదిలేసినట్లే. పనికోసం ఇది అని తెలిసి, పనేమిటో తెలిసి, ఆ పని పూర్తిచేసుకొని వదిలేయాలంటే, కేంద్రంగా తను వుండాలి. తను వీటన్నిటికీ ఆధారం తప్ప, తనకు ఇది ఆధారం కాదు అని తెలిసివుండాలి. Assistant లేకపోతే ఆరోజు పని చేయలేకపోయాం అనుకోండి. మాస్టరుగారు లాంటివాళ్ళు కారుంటే కారులో వెళ్తారు. స్కూటరుంటే స్కూటరులో వెళ్తారు. సైకిలుంటే సైకిల్ మీద వెళ్తారు. ఏమీలేకుంటే నడిచివెళ్తారు. దేనికోసం ఆగరు. మందులపొట్లం కట్టేవాడుంటే ఒక ఫలానా మందు కట్టరా, అంటారు. లేకపోతే తాను వెళ్ళి కడతారు. అందుకనే patient ఎవరన్నా వస్తే పొట్లం కట్టడానికి ఎవరూలేరండీ, మరి మీకు మందివ్వడం కుదరదన్నట్లుగా వుండదు. అంటే 'నిరాలంబయోగం' అంటారు దీన్ని. దేనిమీదా ఆలంబనం లేదు. తానే తనకి ఆలంబనం. సంస్కృతంలో దాన్నే ఏమంటారంటే 'స్వతంత్రము' అంటారు. స్వాతంత్ర్యము కావాలి అంటాం కదా! ఎక్కడనుంచి వస్తుంది స్వాతంత్ర్యము? 'స్వ' తనమీద తను, దేనివలనా బద్ధుడై యుండక ఉండేవాడు. అంటే తనయందు మాత్రమే తను ఆధారపడివున్నాడు తప్ప మరి దేనిమీదా ఆధారపడిలేడు. అది స్వతంత్రము. అటువంటి స్వతంత్రము పొందినవాడికి సమస్తము వాడియందే భాసిస్తూ వుంటుంది. వాడి దగ్గరే వుంటుంది. వాడిలోంచే పుడ్తూ వుంటుంది. అది 'శ్రీగర్భః' అంటే. భగవంతుడికి ఎవరండీ ఆధారం? మనందరికీ ఏవో రకరకాలైన ఆధారాలున్నాయి. వాడికి ఏమిటి ఆధారం? వాడే అన్నిటికీ ఆధారం. సాధనలో కూడా, ఆ స్థితికి చేరుకున్నవాడు పరిపూర్ణ యోగి అవుతాడు.

390 పరమేశ్వరః

ఈశ్వరుడు, పరమేశ్వరుడు. ఈశ్వరుడు అంటే సమస్తాన్నీ అధిష్ఠించి, నియమించి, నడిపించేవాడు అని అర్థం. సృష్టిలో ప్రతి జీవియందు కూడా భగవంతుడు తాను ఈశ్వరుడై నిలచి అంటే అధిష్ఠించి, నియమించి నడిపిస్తూ వుంటాడు. అలాగే పదార్థంలో నియమించి నడిపిస్తున్నట్టుగా కనిపిస్తాడు. వృక్షంలో కనిపిస్తాడు. జంతువులో కనిపిస్తాడు. మనిషిలో కనిపిస్తాడు. అంటే తానే సమస్తమైన జీవులుగా కనబడినప్పటికీ, మళ్ళీ ఒక్కొక్క జీవునిలో తానుంటాడు. ఉండి, నియమించి నడిపిస్తూ వుంటాడు. ఉప్పులో ఉప్పగా వుండి, నియమించి నడిపిస్తాడు. పంచదారలో తీపిగా వుంటాడు. మామిడిచెట్లో మామిడిచెట్టు ధర్మంగా వుండి, మామిడిపండునే ఇచ్చి, కొబ్బరిపండుని ఇవ్వకుండా, అలాగే జంతువులో పిల్లిలో పిల్లిలాగ, పులిలో పులిలాగ, సింహంలో సింహంలాగ మొత్తం అన్ని జంతువులకి ఈశ్వరుడుగా సింహంవలె నియమించి నడిపించేదంతా ఈశ్వరత్వమే! ఒక ఇంట్లో పెద్దలాగ వుంటాడు. ఒంట్లో మళ్ళీ పెద్దలాగ వుంటాడు. మనలో ఒక భావం కలిగించి ఆ భావం ప్రకారం మనల్ని ప్రవర్తింపచేసి, తద్వారా మనల్ని నియమిస్తూ వుంటాడు. నడిపిస్తూ వుంటాడు. నడిపించడం అంటే పెరుగుదల అంటే హానివృద్ధులు. ఆకురాలడం, చిగురు వేయడం, ఫలవంతమవడం ఇటువంటి ఋతుధర్మాలన్నిటిలో ఈశ్వరుడుగా వుంటాడు. మానవుల్లో హృదయము నందు నిలబడి, మానవుని నియమిస్తూ వుంటాడు. మళ్ళీ వాళ్ళల్లో నాయకుని వలె మానవుల గుంపును నియమిస్తూ వుంటాడు. జంతువుల్లో ఒక్కొక్క జంతువులోను తానుండి, ఆ జంతువు యొక్క ప్రవర్తన రూపంలో నియమిస్తూ, మళ్ళీ జంతువుల సమూహానికి ఒక నాయకుడుగా నియమిస్తూ వుంటాడు. అన్ని జంతువులకీ నాయకుడుగా సింహంవలె నియమిస్తూ వుంటాడు. అలాగే కర్మకు లోబడిన జీవులను కర్మయే దైవంగా నడిపిస్తూ వుంటాడు. కర్మకి అతీతంగా జీవించే జీవులని మోక్షం వైపు ఈశ్వరుడిగా నడిపిస్తూ వుంటాడు. గుంపులు గుంపులుగా వున్న మానవుల్ని ఒక మానవుడు ఈశ్వరుడై నియమించి, నడిపిస్తూ వుంటాడు. గుంపుకి ఒక గురువుంటాడు కదా! గురువు చెప్పినట్టల్లా వాళ్ళు నడుచుకుంటున్నారంటే, వాళ్ళకందరికీ ఆయన ఈశ్వరుడు! మళ్ళీ ఇటువంటి గుంపులు గుంపులుగా వుండే నాయకులకి నాయకుడుగా, గురువులందరికీ జగద్గురువుగా నియమిస్తాడు. అలాగే భూమిని నియమించేవాడుగా భూమి ప్రజ్ఞగా, ఈశ్వరుడిగా వుంటాడు. భూగోళానికి కేంద్రంగా వుంటాడు. అలాంటి గోళాల సమూహం ఒక సూర్యమండలమైతే, లోపలి నుండి ఆ సూర్య మండలానికి సంబంధించిన గోళములను, గోళముల మీది

జీవులను నియమిస్తూ వుంటాడు. అణువు నుండి సూర్యమండలం వరకూ కూడా సమస్తాన్నీ ఇలా ఎక్కడికక్కడ అధిష్ఠించి, నియమిస్తూ వుంటాడు. అలాగే సూర్యమండలాల గుంపులకి సవితృ మండలము నందు నిలబడి, దానికి కేంద్రమై నియమిస్తూ వుంటాడు. 'ధ్యేయస్సదా సవితృ మండల మధ్యవర్తీ'. మళ్ళీ సవితృ మండలాలు కొన్నింటిని ఇంకొక కేంద్రం నుంచి నియమిస్తూ వుంటాడు. ఇలా సృష్టి నంతటినీ కూడా నియమించే వాడింకొక డుంటాడు. సృష్టిలో జీవుల రూపంలో, గ్రహ గోళాదుల రూపంలో, సూర్య మండలాల రూపంలో నియమించేవాడు. వాడూ ఈశ్వరుడే! ఇట్లా సమస్తాన్నీ ఏర్పాటుచేసిన తర్వాత దాన్ని అధిష్ఠించి మొత్తం సృష్టికి అతీతుడుగా కూడా ఈశ్వరుడున్నాడు. అతడి నుంచి ఈ సృష్టి వచ్చింది కాబట్టి సృష్టికి అతీతమైన ఈశ్వరుణ్ణి 'పరమేశ్వరుడు' అన్నారు. సృష్టి యందు జీవులలో కేంద్రముగా వున్న భగవంతుని 'ఈశ్వరుడు' అన్నారు.

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽర్జున తిష్ఠతి
భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా

అని మనకు భగవద్గీతలో శ్రీకృష్ణుడు, 'ఈశ్వరుడు సర్వభూతముల హృదయములందు ఉపస్థితుడై యున్నాడు అర్జునా!' అని చెప్తాడు. ఇలా జీవుల సమూహాలకు ఈశ్వరుడై నిలబడి సృష్టిచేసి, పెంపొందించి, మళ్ళీ తనలో కలుపుకుంటూ వుండేది ఈశ్వరతత్వము. ఒకసారి మనం గమనికకు తెచ్చుకుంటే, తననుండి వ్యక్తమైన దాంట్లో తాను కూడా నిండి వుంటాడు. మన నుండి వ్యక్తమైన దాంట్లో వుండే దానిలో మనం కూడా అలా నిలబడి ఉంటే మనం కూడా ఈశ్వరులమే! భగవంతుడి నుండి ఏర్పడిన సృష్టి సమస్తము నందూ తానే వ్యాప్తి చెంది యున్నాడు. తననుంచి సంకల్పం వచ్చి, తననుంచి ప్రకృతి వచ్చి, తన సంకల్పశక్తి చేత ప్రకృతి యందు తను ప్రవేశించి, దాన్ని ఉద్భవింపచేసి, దాన్ని వృద్ధి పొందించి, అందులో తాను వుండి, తాననుభవిస్తూ వున్నాడు. మనం ఎక్కడో ఇల్లు కట్టుకున్నామనుకోండి. మన భావం నుంచి వచ్చిందే కదా మన ఇల్లు. ఆ ఇంట్లో మనం ఉన్నామా? లేదు. ఆ ఇంట్లో ఎవరైనా మేకు దింపుతున్నారనుకోండి సుత్తి పెట్టి కొట్టి. మనకేం తెలీదు కదా! అందుకని మననుంచి దిగివచ్చిన సృష్టికి మనం ఈశ్వరుని వలె ప్రవర్తించడం లేదు. మన ఈశ్వరత్వం కేవలం ఈ శరీరానికే పరిమితమై యున్నది. భగవంతుని యొక్క ఈశ్వరత్వం వ్యాపనం చెంది వుంటుంది. అంటే ఎక్కడ, ఎవర్ని, ఏం చేసినా తనకి తెలుస్తుంది. మనకి మన ఒంట్లో ఎక్కడ ఏం జరుగుతున్నా తెలుస్తుంది. అంటే కాలిమీద దోమ కుడ్తున్నా, తలమీద పేలు పాకుతున్నా గమనిస్తాం.అంత వరకే మనకి తెలుసు. ఎందుకంటే మన శరీరం వరకే మనం వ్యాపనం చెంది యున్నాం. కానీ భగవంతుడు ఎలా వ్యాపనం చెంది యున్నాడంటే తననుంచి వ్యక్తమైన సమస్తములోనూ తను వ్యాపనం చెంది యున్నాడు. అంటే మొత్తము భగవంతుని యొక్క శరీరమే! మాస్టరుగారు ఒక చక్కటి ఉదాహరణ చెప్తుండేవారు. 'నీవు కూడా ఈశ్వరుడవే. ఈ భావన ఎప్పుడు

ఏర్పడుతుందంటే, నీది అనుకున్నదంతా నువ్వు ఆక్రమించి ఉండాలి'' అని. అంటే ఎక్కడో మనకి ఊరి బయట పొలం వుందనుకోండి. పొలంలో ఎద్దు మేస్తుంటే నీకిక్కడ తెలియాలి. అప్పుడా పొలం నీది. పొలానికి కూడా నీవు వ్యాపనం చెంది ఉన్నావన్నమాట! అలా కాకుండా మనమే మన పొలం దగ్గరికి వెళ్తూంటాం. మనమే వస్తూ వుంటాం. మాస్టరు గారంటూంటారు పొలం నాదంటాడు. కానీ పొలం దగ్గరికి వీడు వెళ్ళాల్సిందే కానీ, పొలం వీడి దగ్గరికి రాదని. అంటే వాడు పొలానికి యజమానయ్యాడా? పొలం వాడికి యజమానైందా? అని అడుగుతూ ఉండేవారు. మన యజమాన్యం ఎట్లా వుంటుందంటే మననుంచి పుట్టినదానికి మనం బానిసైపోతాం. భగవంతుని నుంచి పుట్టినదానిని భగవంతుడు అధిష్ఠించి వుంటాడు. మన నుండి వచ్చినదానికి మనం స్వామిత్వం వహించినట్లయితే మనం ఈశ్వరులం. అది అమలుపరచడం లో దానికి మనం బానిసలు కాకుండా ఉండడం. మన నుండి పుట్టినవే మన జీవనవిధానంలో ఆస్తులు, బంధుమిత్రాదులు. వీటితో మనకుండేది కేవలం బంధమా? సత్సంబంధమా? అని ఎవరికి వారుగా చూసుకుంటే ఎక్కువ బంధంగానే వుంటుంది. అంటే మనలోంచి పుట్టిన సంకల్పం మనని బంధిస్తుంది. భగవంతుడి నుంచి పుట్టిన సంకల్పం భగవంతుణ్ణి బంధించదు. బంధించకపోగా దాన్ని ఆయన నియమించి, దాన్ని అతిక్రమించి నిలచియున్నాడు. మనం మన నుండి పుట్టినదాంట్లో ఇమిడిపోయి, ఇరుక్కుపోయి బందీకృతులమై బాధపడ్తూ వుంటాం. కనుక ఈ పరమేశ్వర తత్వాన్ని భావన చేసుకునేటప్పుడు సమస్తమునూ తను నియమించి, తననుంచి ఉద్భవించిన దానియందు తాను స్వామియై నిలచి వుండటాన్ని గమనించాలి. మనం ఆస్తులు పెంచుకొని వాటికి కాపలా కాసేవారిలాగ తయారైపోతాం. సంపద పెంచుకొని అలా అయిపోతాం. అట్లాగే చుట్టూ వుండే పనులు పెంచుకొని, పనులకి బానిసైపోతూ వుంటాం. అలా కాకుండా తాను స్వామిగా నిలబడి, సమస్తమునూ శాసించే పద్ధతిలో వున్నట్లైతే దాన్ని 'ఈశ్వరతత్త్వం' అంటారు. మనలో ఈశ్వరతత్త్వం ఆ విధంగా నియమిస్తూ వుంతుంది. తన యందున్న ఈశ్వరునికి లోబడి పనిచేసుకొనేవాడు, క్రమశః ఈశ్వరుని యొక్క సాన్నిధ్యాన్ని, పొంది తనని తాను నియమించుకొనే స్థితిలోకి వస్తాడు. అలా కాకపోతే పరిసరాలు వీణ్ణి నియమిస్తాయి. పరిస్థితులు నియమిస్తాయి. మనుషులు నియమిస్తూ వుంటారు. తనని తాను నియమించుకున్నవాడు ఆత్మనియతి కలిగినవాడని చెపుతారు. అందుకని మనం ఏదైనా ఒకటి చేద్దాం అని ఒక సత్సంకల్పం వచ్చిందనుకోండి. దాన్ని మనం ఏమాత్రం నియమించ గల్గుతున్నాము, నిర్వర్తింప గల్గుతున్నాము అని తెలిసినట్లైతే, మనకే మాత్రం Mastery వుందో తెలుస్తుంది. మాస్టర్ అంటే ఈశ్వరుడు అని అర్థం. స్వామి అని అర్థం. మాస్టర్ అంటే తను సంకల్పించినది తననుంచి వ్యక్తమౌతున్నపుడు దానికి commission లు, discount లు, compromise లు కొట్టకుండా వుండాలి. మననుంచి వ్యక్తమైన ఎన్నో సత్సంకల్పాలను మనం నియమించి, పాలించి అమలు పరచలేము. అంటే ఈశ్వరత్వం లేదు అని అర్థం. అలా తను సంకల్పించినది,

నలుగురికీ శ్రేయస్సు కలిగించేది. తననుంచి వ్యక్తమైన దానిని తాను పరిపాలించ గలిగి యుండాలి. అలా పరిపాలించగల్గిన వాడికి మనసు, ఇంద్రియములు, శరీరము మీద కూడా ఈశ్వరత్వము వచ్చినట్లు. అంటే హృదయంలో నిలబడిన వాడికి తన మనసు మీద, తన ఇంద్రియముల మీద, తన శరీరం మీద, తన వాక్కు మీద తనకి ఆధిపత్యం వుంటుంది. ఏం మాట్లాడుతున్నామో తెలీకుండా మాట్లాడేసినట్లుగాను, ఏం చేస్తున్నామో మన వశం లేకుండా చేసేట్లుగాను, చేద్దాం అనుకున్నవి చేయకుండానూ, చేయకూడదనుకున్నవి చేస్తూనూ ఉన్నామనుకోండి. అదేకదా జరుగుతూంటుంది. బీరువా సర్దుకుందాం అనుకుంటే నెలరోజులు పడుతుంది. అది ఏ రోజుకారోజు వాయిదా వేయడమే తప్ప సర్దుకున్నది లేదుకదా! మనకు వచ్చిన సంకల్పాన్ని అమలుపరచ లేకపోవడమనే స్థితి నుండి మనని మనం ఉద్ధరించుకోవాలి. అందుకని తన మనసుని తాను నియమించగలిగి, తన పంచేంద్రియములను తాను నియమించగలిగి, తన శరీరాన్ని తాను నియమించగలిగిన వాడు మాత్రమే ఈ శరీరంలో రాజుగా వుంటాడు. లేకపోతే ఈ శరీరానికి బానిసగా వుంటాడు. శరీరానికి బానిసగా, శరీర అవసరాలకి బానిసగా వుంటాడు. ఆ సుఖం కలిగినట్లుగా వుండి జారిపోతుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఏం చెప్తాడయ్యా అంటే, ఇంద్రియముల ద్వారా పొందే సుఖం, సుఖం కలిగినట్లుగా అనిపించి, సుఖపడ్డామనుకొనే లోపల జారిపోతుంది అని. అందుకనే మళ్ళీ మళ్ళీ కోరుకుంటాయట ఇంద్రియాలు. చూసిన ప్రదేశానికే మళ్ళీ చూద్దామనిపించి వెళ్తూ వుంటాం కదా! ఎందుకండీ అక్కడికి వెళ్ళారు అంటే, హాయిగా వుంటుందని వెళ్ళాం అంటారు. హాయిగా ఎంతసేపు వుంది? మళ్ళీ అక్కడికే వెళ్తారు కదా! హాయి నీలో ఉండేట్లయితే మళ్ళీ వెళ్ళడం ఎందుకు? అంటే ఆ దృశ్యము హాయి గొలిపినట్లుగా భ్రమకొల్పి మళ్ళీ నిన్ను అదే చోటుకి తీసుకువెళ్ళేట్టుగా లాక్కెళ్తూ వుంటుంది. అలాగే నాలుక లాక్కెళ్తూ వుంటుంది. అక్కడ బాగుంటుంది. ఎక్కడ? కొత్తగా పెట్టారు. బాగా వేస్తున్నారు దోసెలు అని చెప్తూంటుంది నాలుక. మాటిమాటికీ అక్కడికి తీసుకెళ్తూ వుంటే హాయిగా వుంటే, బాగుంటే, ఒక్కసారితో పూర్తిగా హాయి రావాలి కదా! రాదు. అట్లాగే 5 ఇంద్రియాలు మనల్ని చేసిన పన్లే చేయిస్తూ వుంటాయి. ఎప్పుడూ అదే పని! ఏంట్రా అంటే హాయిగా వుంటుందండీ. ఎప్పుడూ హాయిగా వుండదు. ఏంట్రా హాయి వుండాలి కదా ఇన్నిసార్లు చేస్తున్నావు అంటే, అదేమరి వుండాలనే చేస్తున్నాను. ఉంటున్నట్లుగా వుంటుందే తప్ప వుండడం లేదంటాడు. అంతా నట్టే. అంటే ఇంద్రియాలు మనకి హాయి కొలిపినట్లుగా అనిపిస్తాయి తప్ప హాయిని ఎప్పటికీ పూర్తిగా ఇవ్వవు. అందుకని ఇంద్రియములు దేనికోసం అంటే, మనకి బాహ్యప్రపంచం నుండి సమాచారాన్ని అందించడానికి, మన నుండి బయట ప్రపంచానికి అందించడానికి. కన్ను చూసి మనసుకు చెప్తే, మనసు నుండి ఏం చెయ్యాలో మనిషి చెప్తాడు. అప్పుడు మనసు నుండి, ఇంద్రియాల నుండి పనిచేస్తుంది. అలాగే చెవి, అలాగే ముక్కు. ముక్కు ఇక్కడ సువాసన వుంది, ఇక్కడ దుర్వాసన వుంది అని, చెప్తుంది. అలా చెప్పకపోతే దుర్వాసన వచ్చే చోటే కూచుంటాం కదా

మనం! కేవలం అట్లా ప్రపంచం నుండి మనకి సమాచారం, మననుండి ప్రపంచంలో వాళ్ళకి సమాచారం అందించడానికి ఇంద్రియాలు దూతల్లా పనిచేస్తూ వుంటాయి. ఇంద్రియాలే లేకపోతే మనకి, ప్రపంచానికి అసలు ఏమీ సంబంధం లేదు. అంటే అక్కడ ఎవరున్నా మనకి తెలీదు. అక్కడ దుర్గంధం వున్నా తెలీదు. సుగంధం వున్నా తెలీదు. అన్నం ఏ వాసన వస్తుందో తెలీదు. అశుద్ధం ఏ వాసన వస్తుందో తెలీదు. మంచిమాట వినబడదు. చెడుమాట వినబడదు. మనం మనలో వుంటాం. మనం బయటికి వెళ్ళటానికి వీలులేదు. 5 ఇంద్రియాలూ లేకపోతే మనిషి బయటికి పోవడానికి ఏమీలేదు. అలాగే చర్మం వల్ల స్పర్శ. ఇది వేడి, ఇది చలవ లేకపోతే ఏ కుంపటి మీదో కూచుంటాం. కుంపటి మీద కూచుంటే కాలుతుందని ఎట్లా తెలుస్తుంది? స్పర్శజ్ఞానం చర్మం దగ్గర వుండటం వల్ల. అలా కాకపోతే మొత్తం కాలిపోయినా ఏమీ తెలీదు మనకు. లేకపోతే ఒక ఐసుముక్క మీద కూచున్నామనుకోండి, ఏం తెలీదు. అంతా కొయ్యబారి పోతుంది. ఇలా కాకుండా వుండటానికి ఇంద్రియాల్నిచ్చారు. ఆ తర్వాత ఎలా పనిచేయాలో తెలుసుకోవడానికి సంకల్పం. మనలో వుండే సంకల్పం ప్రతిబింబించడానికి మనసు నిచ్చారు. మనసు ద్వారా ఇంద్రియాలను నియమించుకోవాలి. మనస్సుని మనం నియమించుకోవాలి. మనం వేరు, మన మనసు వేరు. మన ఆలోచనలను మనం వేరుగా కూర్చొని చూసుకుంటూ వుండాలి. ఎట్లా వస్తున్నాయని? ఆలోచనల్ని ఒక సినిమా వేసుకొని చూసుకొనేవాడు నెమ్మదిగా తననుండి, తన మనసు నుండి తను వేరుపడటం అనేది జరుగుతుంది. రోజూ అందుకే ధ్యానం! మొదట్లో ధ్యానం ఏమిట్రా అంటే, మన మనసు యొక్క కల్మషత్వం బుడగలు బుడగలుగా డుబుక్, డుబుక్ మని ఎట్లా పొంగుతుందో చూసుకుంటూ వుండటమే. ఎవరి మీద కత్తులు దూస్తుంది? ఎవరి మీద ఉమ్మేస్తుంది? ఎవర్ని తిడుతూ వుంటుంది? ఎవర్ని తన్నాలనిపిస్తుంది? ఎవర్ని పాడవాలనిపిస్తుంది కనీసం మాటలతోనైనా? ఇవన్నీ ఒకసారి చూపించమని అంటే భలే చూపిస్తుంది. దీనివలన నీకేమన్నా సుఖం వుందేమో కానీ నాకేమీ సుఖం లేదని చెప్పుకోవలి. మనసుతో మాట్లాడుకోవాలి. మనిషి బానిసగానే జీవిస్తాడు మనసుకి. అందుకని మహాత్ములందరూ కూడా మనసుతోనే మాట్లాడుకునేవారు. ఎందుకిట్లా ఏడిపిస్తావు నన్ను? అనకూడని మాట అనిపిస్తావు. చేయకూడని పని చేయిస్తావు. తలవకూడని తలపు కలిగిస్తావు. అక్కరలేని ఆశలు చూపిస్తావు. ఇట్లా నన్నెందుకు ఏడిపిస్తావని మాట్లాడుకోవచ్చు. మనసుతో మాట్లాడుకున్న వాళ్ళే మనకు రామదాసు, త్యాగరాజు, అన్నమయ్య. వాళ్ళ పాటలన్నీ కూడ మనసుకి సంబంధించినవే. 'మనసా ఎటు లోర్తునే' అని అంటాడు కదా! నీకు డబ్బులిష్టమా, రాముడిష్టమా చెప్పమంటాడు త్యాగయ్యని. ఇట్లా మన మనసుని మనం కనీసం, గమనించడం మొదలుపెడ్తే మనం వేరు, మన మనసు వేరు అని తెలుస్తుంది. మన మనసు యొక్క ఆలోచనా సరళి తెలుస్తుంది. ఇట్లా దాన్నుండి విడిపడే అవకాశం ఏర్పడుతుంది. మనసు, ఇంద్రియములు, శరీరము మూడూ కలిసి మనకి ముక్కాలిపీటండీ. ఈ పీట మీద మనం కూర్చుంటామా? మన మీద పీట

వుంటుందా? Tripod. దాన్నే మనకి పెద్దలేం చెప్పారంటే, సింహాసనం మీద నువ్వు కూర్చుంటావా? నీమీద సింహాసనం కూర్చుంటుందా? గుర్రం మీద నీవు కూర్చుని, సవారి చేస్తావా? నీమీద గుర్రం సవారి చేస్తుందా? మనం కూర్చుని ఇటు వెళ్ళమంటే, అటు పాలాల్లోకి వెళ్ళి, అడ్డమైన గడ్డీ తింటుంటే, ప్రయాణం ఏం సాగుతుంది? మనమంతా గడ్డి తినే గుర్రాలమే కదా! ఇటు పొమ్మంటే అటు పోతుంది. అటు పొమ్మంటే ఇటు పోతుంటుంది. పొమ్మన్న చోటుకి తప్ప మిగిలిన చోట్లకి పోతూ వుంటుంది కదా! ప్రతిరోజూ కాస్సేపు గుర్రాన్ని స్వాధీనంలోకి చేసుకునే ప్రయత్నం రౌతు చేస్తాడు. అది ఎంత మొండి గుర్రమైనా కొన్నాళ్ళకి మాట వింటుంది కదా! మనం కూడా చాలా మొండివాళ్ళమే. మనం అంటే మన మనస్సు గురించి చెప్తున్నాము. మనిషి మొండివాడు కాడు. జీవుడు స్వతహాగా పాపం ఈ గుర్రం ఎక్కుదామని వస్తాడు ఇందులోకి. వచ్చిన దగ్గర్నుండి అది వెనక నుండి తన్నడం, ముందు నుండి తన్నడం, క్రిందపడేయడం, తొక్కడం ఇట్లా జరిగిపోతుంది. ఇది గుర్రం అనుకుని ఎక్కాం. ఎక్కబోయి క్రిందపడ్డాం. అది మనని తొక్కుతుంటుంది. అందుకనే మనకేం చెప్తారంటే, దీంట్లో బంధింపబడ్డవాడు పశువు అని చెప్తారు. దీనిమీద అధిష్ఠించి సవారీ చేయాలి. అదీ గుర్రం ఎక్కడం అంటే! గుర్రం ఎక్కి కూర్చున్నవాడు అంటే శరీరాన్ని అధిష్ఠించి యున్నవాడు. వాడు రాజు. అలా శరీరాన్ని అధిష్ఠించి యున్న వాడికి అష్టాంగయోగంలో మూడో అంగం 'ఆసనం' దక్కినట్లు. కనీసం కూచున్నాడు. ఇహ ప్రయాణం సంగతి తర్వాత సంగతి. ఇలా కూచోకుండా, దాని క్రింద కూచొని అది తొక్కుతూ వుంటే బాధపడేవాళ్ళు చాలామంది వుంటారు. అందుకే మనకు ధనూరాశిలో ఒక సంకేతం చూపిస్తారు. వెనుకభాగం గుర్రం, ముందుభాగం మనిషి. సగం మనిషి, సగం గుర్రం అయివున్నామనుకోండి మనం, అంటే మన పొట్ట దగ్గరనుంచి గుర్రంలాగ వుండి, ఆ పైనుండి మనిషిలాగ వుంటే, మనిషి చేద్దాం అనుకునేవన్నీ చేయలేం. ఎందుకంటే వెనుకభాగంతో మనని లాగేస్తూ వుంటుంది. అదీ మన పరిస్థితి! అందులోంచి బయటికి రావాలంటే, ప్రతి ఉదయము సాధనలో కొంత భాగంగా ఏకాంతంగా కూర్చుని, మనసుతో మాట్లాడుకోవడమనేది నేర్చుకోవాలి. ఏమిటి నీ పరిస్థితి? మనస్సు చెప్పినట్లు నీవు వింటున్నావా? నీవు చెప్పినట్లు మనస్సు వింటోందా? అసలు నువ్వెందుకు వచ్చావు? ఏం చేద్దామని వచ్చావు? ఏం చేస్తున్నావు? ప్రయాణము మొదలు కాలేదు కదా! ఎందుకు మొదలు కాలేదు? గుర్రాన్ని స్వాధీనం చేసుకోలేదు. గుర్రం స్వాధీనం అయాకే కదా ప్రయాణం. అది ఎంత వరకూ వచ్చింది? మనం చెప్పినట్లే మన మనసు వింటోందా? మనం చెప్పినట్లే, మనం అనుకున్నట్లే మన ఇంద్రియాలు వింటున్నాయా? మనం చెప్పినట్లే మన శరీరం వింటోందా? మనం అంటే మనలో జీవుడు. మనం చేద్దామనుకుంటున్నది మనస్సు, శరీరము, ఇంద్రియాలు చేయనిస్తున్నాయా? చేయనివ్వటం లేదా? ఆచరణలో పెడదామనుకొంటున్నవి పెట్టగలుగుతున్నామా? పెట్టలేకపోతున్నామా? అసలేమిటి నీ సమస్య అని, సినిమాల్లో అద్దంలో తనతో తానే మాట్లాడుకునేటట్లు మన వాహికను మన నుండి

విడిగా తీసి, దాన్ని చూసి మాట్లాడుకుంటూండాలి. అంటే మనం మన కారునుంచి బయటికి వచ్చి కారుతో మాట్లాడినట్లు. మన కార్లోంచి మనం బయటికి రాలేకపోతే car tyre puncture అయ్యిందో, engine down అయ్యిందో. Engine down అవ్వడమంటే, కొంచెం heart problem రావడం అన్నమాట! అది Engine, మన బండికి గుండెకాయ. ఎక్కడైనా సొట్టలు పడ్డాయో, కొన్ని నట్లు విరిగాయో అంటే నడుములు విరగడం. ఇలా మనకిచ్చిన వాహనం వేరు, మనం వేరు అని భావన పెట్టుకొని, మన వాహనం అసలు ఎట్లా మనకు ఉపయోగపడుతోంది? Steering ఇటు త్రిప్పతుంటే అటు పోతుంటే తప్ప కదా! break వేసినపుడు పడక అక్కర్లేనప్పుడు పడి, gear వేస్తుంటే పడక ఇలా వుందనుకోండి. కొంచెం రోజూ ఒక 10, 15 నిముషాలు దాన్ని గురించి ఆలోచించుకొని బాగుందనిపించి, బాగానే చేస్తున్నాం అనిపిస్తే, ఇంతకన్నా బాగా చేయగలనా? అని చూడాలి. ఎప్పుడూ జీవుడు తనను తాను తెలుసుకొనేంత వరకు పరితృప్తి చెందకూడదు. పరితృప్తి చెందాడంటే ఇక ముందుకు సాగడం మానేస్తాడు. మనం బాగానే వున్నాం ప్రపంచమే బాగాలేదనుకుంటాడు కదా! ఈ ప్రపంచమంతా ఎప్పుడు మారుతుందో అని చూస్తూ వుంటాడు. అది ఎప్పుడూ మారదు. నువ్వు మార్చలేవు. దానికి సంబంధించిన పని అది చేసుకుంటూ వుంటుంది. నీవు దానితో అనుసంధానం చెందాలంటే నీవు మారాలి. ఏదో ఒక రోజున Calcutta వెళ్ళే train Mumbai పోకపోతుందా అని ఆ train లో కూర్చుంటే అవుతుందా? సూర్యుడి ప్రక్కకి తిరిగి, నా మొహం మీద ఎండ పడకూడదంటే అవుతుందా? మనం మారాలి తప్ప సూర్యుడు నీకోసం అట్నుంచి రాడు. మనకు శాశ్వతమైన ఆనందం వుంటే ఇంకప్పుడు మారక్కరలేదు. మనిషికి 'మానుషీ ఆనందం' అని ఒకటుంటుంది. ఆ తర్వాత 'దేవానందం', ఆ తరువాత 'బ్రహ్మానందం', ఆ తర్వాత 'పరబ్రహ్మానందం' ఇట్లా చాలా వున్నాయి. తైత్తరీయోపనిషత్తు లో ఇన్ని ఇన్ని ఆనందాల క్రింద లెక్కేస్తూ వెళ్ళిపోతారు. మనకు మనిషికి దొరకాల్సిన సగటు ఆనందమే దొరకడం లేదు. జీవి అంటే 'అన్వేషించేవాడు' అని అర్థం. ఏమిటి అన్వేషిస్తాడు అంటే హాయిగా వుందాం, ఆనందంగా వుందాం అని ప్రతిరోజూ ఆశిస్తూ వుంటాడు. తనకు తాను పరిపూర్ణుడై, పరిపూర్ణంగా తెలిసి, తన వాహనాన్ని తను అధిష్ఠించి యున్నపుడు మాత్రమే అతడు ఆశీనుడై యున్నట్లు. వాడూ రాజంటే! ఆసనమంటే అదీ! ఆసీనుడై యున్న వాణ్ణి 'ఈశ్వరుడు' అంటారు. అలా మనయొక్క వాహనం మీద/శరీరం మీద మనకి ఆధిపత్యం వచ్చినపుడు మనని 'ఈశ్వర' అంటారు. అంటే జీవుడు ఈశ్వరత్వాన్ని పొందినట్లు. అలా పొందినవారు వాళ్ళ శరీరం నుండి వాళ్ళు వ్యాప్తిచెంది, బయటికి వస్తూ వుంటారు. మనకి తలలో పేను, కాలిమీద దోమ మాత్రమే తెలుస్తుంది. ఇలా తన గుర్రంమీద తను కూర్చున్నవాడు, గుర్రం దిగి కూడా వెళ్ళిపోగలడు. మనం కార్లో తలుపులు లోపల వేసుకొని, బయట తాళ్ళం పెట్టేసుకొని, తీసుకో లేకపోతే ఏమీ చెయ్యలేం. కానీ తలుపులు తెరుచుకోగలిగిన వాడు బయటికి కూడా వెళ్ళగలడు. వెళ్ళగలిగినవాడు పాలంలో ఏం జరుగుతుందో కూడా చెప్పగలడు. అది వాడి ఈశ్వరత్వం! షిరిడీ

సాయిబాబా ఆయనకిచ్చిన గుర్రాన్ని ఎవరో ఎక్కడో కొడితే, ఇక్కడ 'ఎందుకు నా గుర్రాన్ని కొట్టావ'ని అడుగుతాడు. ఎట్లా అడగగలిగాడు? కేవలం శరీరానికే పరిమితం కాక వ్యాప్తి చెంది యున్నాడు కాబట్టి. ఇలా 'ఈశ్వర' శబ్దాన్ని మనం అవగాహన చేసుకోవాలి. ముందు వాహనం మీద లేక మనస్సు, ఇంద్రియాలు, శరీరం మీద స్వామిత్వం ఏర్పడిన తర్వాత కుర్చీ మీద కూర్చున్నవాడు దానినలా పెట్టేసి, అట్లా అట్లా తిరిగేసి మళ్ళీ వచ్చి కూర్చోవచ్చు కదా! అలాకాక కోళ్ళ మధ్య ఇరుక్కు పోయామనుకోండి, అదే త్రికూటంలో వుండే లంకలో బంధింపబడటం అని చెప్తారు. బంధింపబడిన వాడికి తపన లేకపోతే మార్గం దొరకదు. అందుకని ఉదయం ధ్యానం చేసుకోవాలంటే, చాలా కార్యక్రమాలు పెట్టుకోకు. ఈ రకమైన ఆత్మ పరిశీలనానికి చక్కగా ఆరుబయట కూర్చుని దోమలు కుట్టకుండా తయారుచేసుకోండి. ఎందుకంటే మనకదో బాధ. పోనీ ఆరుబయట కూర్చుందాం అనుకుంటే దోమలు కుడ్తాయి. దోమలు కుట్టగానే ఇక అంతే సంగతులు. వాటివెంట వెళ్ళిపోతుంది మనసు. అలా కాకుండా ప్రశాంతంగా వుండేట్టుగా కూర్చుని, ఒక కప్పు కాఫీ త్రాగినా ఫరవాలేదు. టీ త్రాగిన ఫరవాలేదు. అసలు మీ గురించి మీరు మీరు ఏం జరిగింది? అసలు ఎందుకొచ్చాం మనం? ఏం చేస్తున్నాం? అనే ప్రశ్న రోజూ వేసుకోవాలి. అందుకు ఉదయం పూట 10,15 నిముషాలు నీకై నీవు వుంచుకోమని చెపుతారు. లేచిన దగ్గర్నుంచి ఊరికే రుబ్బు రోలల్లే ఎంత తిరిగినా ఉపయోగం లేదు. పిండి రుబ్బినట్లే కదా! ఒకటే రుబ్బుడు. రుబ్బుడొద్దు. ఆత్మ పరిశీలన కాసేపు చేసుకోండి. అది రుబ్బేసి పారేస్తే అయిపోయిందనుకుంటాం. ఏమీకాదు. రోజూ అట్లాగే రుబ్బుతున్నాం. అట్లాగే వుంటున్నాం కదా! ఏం మార్పులేదు కదా! ఎందుకు మారలేదు? అత్మ పరిశీలనం లేదు! నన్ను నాకు తెలిసే సాధన యందు నన్ను స్థిరంగా వుంచమని కోరుకోవాలి భగవంతుణ్ణి. తనను తాను తెలుసుకున్న కొద్దీ తనచుట్టూ వుండేది కూడా తెలుస్తూ వుంటుంది. తనను గురించి తెలుసుకొనే పరిస్థితి, ఆ ప్రయత్నమూ లేనపుడు తనచుట్టూ వున్నవి తనకి అవగాహన కాకపోగా అపోహలు, అపార్థాలు వస్తూ వుంటాయి అందులోంచి. ఉన్నది లేనట్లు కనిపిస్తూ వుంటుంది. ఉన్నదొకటి, నీవనుకున్న దొకటిగా వుంటుంది. వీటన్నిటికీ కారణం ఏమిటయ్యా అంటే ఆత్మ పరిశీలనమన్నది జరక్కపోవడమే. అందుకని ఈ మార్గంలో ముందుకు వెళ్తే ఈశ్వరత్వానికి దగ్గరవుతాం. ఎందుకంటే మనం ఇందులోకి దిగివచ్చినపుడు దీన్ని వినియోగించుకొని, సృష్టిని పరిపూర్ణంగా అనుభూతి చెందటానికి సంకల్పించుకొని వచ్చాం. ఈ ఒక్క శరీరంలోనే అది వీలుపడుతుంది కాబట్టి ఆ కార్యక్రమానికి ప్రాధ్యన్నే కాస్త 10,15 నిముషాలు మీ కోసం మీరు వుంచుకోండి. మీ శరీరం కోసం లేక మీవారు అనుకున్నవారి కోసం పడే తపన అంతా కూడా తర్వాత మిగలదు కదా! అందుకనే శంకరాచార్యుల వారు వచ్చేస్తోందిరా, వచ్చేస్తోంది అని. ఏమిటంటే appointed hours కి నిర్దేశించిన time కి వాడొచ్చేస్తాడు. Time కి ఈ శరీరాన్ని పట్టుకుపోతాడు. నిన్ను పట్టుకుపోడు. శరీరాన్ని పట్టుకుపోతాడు. మళ్ళీ నీవు మామూలుగా నిలబడిపోతావు. ప్రయాణం అవదు. మళ్ళీ ఇలాంటి బండి

దొరకదు. శుభ్రమైన వాహనం దొరకదు. చెత్తవాహనాలు దొరుకుతాయి. వాటిలో ప్రయాణాలు చేయలేవు. బాధపడ్తావు. దొరికినపుడేమో మరచిపోతావు. దొరకనపుడేమో వాటికోసం బాధపడ్తూ వుంటావు అని చెప్తూ వుంటారు. 'సంప్రాప్తే సన్నిహితే కాలే నహి నహి రక్షతి'[1] ఏదీ నిన్ను రక్షించదు కాబట్టి గోవిందుణ్ణి భజించమంటారు. అంటే ఈ సమస్తమునూ వ్యాపించి వున్నవాణ్ణి గమనించి, వాడిలో మనం భాగమని తెలిసి, వాడే మనలో మనలాగ వున్నాడని గుర్తుతెచ్చుకొని, మనం చేయవలసినవి తప్ప, చేయతగనివి నెమ్మదిగా వదిలేయాలి. ఈ శరీరంలోకి ఎందుకు వచ్చామో ఆ పని మానేసి, మిగతావన్నీ చూసుకుంటే ఉపయోగం ఏం వుంది? ఎందుకంటే ఎప్పుడూ ఏవో చాలా పనులున్నట్లుంటాయి అసలు పని తప్ప. అందుకని ఈశ్వరభావంలో తనను తాను నియమించుకోగలగాలి. అదే ఆరో అధ్యాయంలో చెప్తాడు కృష్ణుడు. 'ధ్యానం అంటే ఏమీలేదు. నిన్ను నీవు ఉద్ధరించుకొని నీమీద, నీ శరీరం మీద స్వామిత్వం తెచ్చుకో ముందు. నీవు కుర్చీలో కూర్చుంటే కదా! తర్వాత నువ్వు, నేను మాట్లాడుకునేది' అంటాడు. నువ్వు బల్లలు, టేబుళ్ళు, మంచాలు, కిటికీలు మీదేసుకుని కూర్చుంటే, నీవు నాతో మాట్లాడేదేమీలేదు, నేను నీతో మాట్లాడేదేమీలేదు. నీవు ముందు స్థిరంగా కూర్చొని ఉంటె నీవు చెప్పింది నేను వినచ్చు, నేను చెప్పింది నీవు వినచ్చు. అందుకని ఆసనం అయిన తర్వాత ప్రాణాయామం. ఆసనమే లేనివాడికి ప్రాణాయామం లేదు. ప్రాణాయామం తర్వాత ప్రత్యాహారం. ప్రత్యాహారం అయిన తర్వాత ధారణ. ధారణ అయిన తర్వాత ధ్యానం. ఏం చేస్తున్నావంటే ధ్యానం చేస్తున్నానంటాడు. ఏంటి చేసేది ధ్యానం? Meditation అంటాడు English లో. అందుకని ఆత్మ పరిశీలనం అనే కార్యక్రమం ఒకటి పెట్టుకొని ఈ నామానికి దగ్గరగా చేరి మన జీవితానికి మనం స్వామిత్వం వహించడం అనే కార్యక్రమాన్ని ప్రాద్దున్నే మన జీవితంలో భాగంగా చేసుకుంటూ వుండాలి. లేకపోతే ఏమీ మారదు. అట్లాగే వుంటుంది ఈ నచ్చటాలు, నచ్చకపోవటాలు. ఎవరికన్నా నచ్చాయా? నచ్చనివాడు నచ్చకుండానే ఉండిపోయాడు ఒక ప్రక్కన. నచ్చినవాడు కూడ ఏదో ఒకరోజు నచ్చకపోవచ్చు. Standard ఏముంది మనకి? ఈవాళ నచ్చినవాడు రేపు నచ్చడు కదా! నచ్చనివాడు మళ్ళీ నచ్చే పరిస్థితి మాత్రం రాదు. నచ్చినవాళ్ళు ఒక్కొక్కళ్ళూ నచ్చనివాళ్ళ జాబితాలోకి వెళ్ళడమే వుంటుంది తప్ప. నచ్చని ప్రదేశాలు, నచ్చని సన్నివేశాలు అసలు ఈ నచ్చకపోవటం ఏమిటి? నాకు నచ్చదంతే అన్నామనుకోండి. అవునయ్యా బాగానే వుంది. ఎందుకు నచ్చదు? కారణం ఏమిటి? నచ్చదనుకోవడమే తప్ప కారణం ఏమీ వుండదు. నచ్చినవి వదిలేయమంటారు అక్కడ కాశీలో. నేనంటానూ అక్కడ నచ్చనివి వదిలేయండి బాగుపడతారు అని. నచ్చినవి వుంచుకోండి ఫర్వాలేదు. నచ్చకపోవడం అనేదాన్ని వదిలేయండి. అదొక్కటే మార్గం పరిమితత్వం నుంచి అపరిమితత్వం లోకి వెళ్ళడానికి! నీ భావనేగా అది! భావన మాత్రం చేత నచ్చనివన్నీ నచ్చినవవుతాయి. అట్లాగే పిడి మేకేసుకొని కూచున్నామనుకోండి. అంతే ఇక పెరుగుదల వుండదు. ఇంకా నచ్చనివి, ఇంకా నచ్చనివి, ఇంకా నచ్చనివి ప్రక్కవాడి పాడే గిట్టకుండ

పోతుంది. నచ్చనిది మనమీద స్వారీ చేస్తున్నపుడు ఈశ్వరత్వం ఏముంది? నచ్చినా, నచ్చకపోయినా వాడు ఒకే రకంగా వుంటాట్ట. అతడూ ధర్మరాజు! అతడికి నచ్చడం, నచ్చకపోవడం లేదు. 'నా అంతటివాణ్ణి దుర్యోధనుడు గౌరవించడేం' అని కృష్ణుడు చూడడు. అవమానించినా పట్టించుకోడు. దుర్యోధనుడికి నచ్చడం, నచ్చకపోవడం వుంటాయి. కృష్ణుడికుండవు. ధర్మరాజు కుండవు. ఎందుకుండవంటే నచ్చకపోవడం వల్ల మనకి కదా బాధ. మనకు నచ్చనివాడు మనకెదురుగా కూచుంటే, మన మొహం కుచించుకుపోతుందా, వాడి మొహం కుచించుకుపోతుందా? బాధ ఎవరు పడ్తున్నారు? ఇటువంటివన్నీ మనం విష్ణు సహస్రనామాల్ని పురాణపరంగా కాక సాధనాపరంగా చెప్పుకుంటున్నాం కాబట్టి ఏదన్నా భగవత్సంబంధమైన కార్యక్రమలు చేసుకున్నప్పుడు మనలో ఒక రసాయనం జరగాలి. మార్పు రావాలి. 'నేనిట్లా గుండ్రాయి లాగానే వుంటాను. చూస్తా నీవు ఏం మారుస్తావో' అంటే ఏం చేస్తారంటే పగలగొడ్తారు గుండ్రాయిని. ఎట్లా? కాలం రూపంలో, కర్మం రూపంలో. అంతవరకూ తెచ్చుకోక ఈ లోపలే తెలుసుకోవచ్చు. 'నచ్చని మనుషులు, నచ్చని ప్రదేశాలు, నచ్చని సన్నివేశాలు లేకుండా చేసుకో. ప్రయత్నం చేసుకో' అన్నారు. అది సి.వి.వి. గారు మనకిచ్చిన మొట్టమొదటి ఉపదేశం. ఎందుకిచ్చారయ్యా అంటే, ఏం లేదు నీకు ఇంకొంచెం స్వామిత్వం వస్తుంది. నీకు నీ మనసు మీద, నీ మీద, నీ శరీరం మీద స్వామిత్వం రావడం కోసమే చెప్తున్నాను తప్ప నాకేమీ దానివల్ల నష్టం రాదు సుమా అని. ఇట్లా సృష్టిలో వాడికన్నీ నచ్చుతాయిటండీ. వాడికి రాక్షసుడూ ఒకటే, దేవతా ఒకటే. భగవంతుడికి రాక్షసులంటే ఇష్టం లేకపోతే ఎక్కడనుంచి వచ్చారు వాళ్ళందరూ? కొంతమందికి కొన్ని పనులు అప్పచెప్పారండీ. మంచిపనులు అప్పచెప్పారు. మరి మాకూ, అన్నారు కొందరు. మరి మీరు దొడ్లూడ్చండి, రోడ్లూడ్చండి ఇటువంటి పనులు కొంతమందికి. 'అదేంటి ఇటువంటి పనులు చెప్పారు' అంటే, 'మంచిపని, చెడ్డపని అనే తారతమ్యం దాటి వున్నారు కాబట్టి, మీకు ఆ పనులు అప్పచెప్పాం. వాళ్ళు ఇంకా చిన్నవాళ్ళు. వాళ్ళు అటువంటి పని అప్పచెప్తేనే చేస్తారు. లేకపోతే బాగా చేయరు' అంటే, 'మరి మేమేం చేయాలి' అని అడిగితే 'ఈ పని చేయండి, వాళ్ళు సరిగా పనిచేయకపోతే మీరే ఆ పని కూడా చేయండి' అని చెప్పారు. అందుకనే కదా ఇంద్రాది దేవతల ప్రవర్తన సరిగా లేనపుడు వాళ్ళ పని కూడా వీళ్ళే చేస్తారు. సరిగా వున్నపుడు వీళ్ళ పని వీళ్ళు చేస్తారు. చీకట్లో జరిగే రసాయనం మనకేం తెలుసు? తెలీదు కదా! అమావాస్య తెలీదుగా! పౌర్ణమి తెలియవచ్చు. పగలు చేసేవి తెలుస్తాయి. రాత్రి చేసేవి తెలియదు. ఇలా మనకి తెరమీద జరిగేవే తెలుస్తాయి. తెర వెనుక ఎంత కథ జరిగితే, తెరమీద కథ జరుగుతోంది. తెర వెనుక ఎంతమంది పనిచేస్తే తెరమీద వుండే కథానాయకుణ్ణి, కథానాయికని చూసి ఓహో, ఆహా అంటున్నాం. నిజానికి వాడి గొప్పతనం ఏముంది? వాడు మాట్లాడే మాట వాడిది కాదు. వాడు వేసుకొనే వేషం వాడిది కాదు. వాడి మాట, నటన, వేషం, ప్రవర్తన అన్నీ ఇంకొకడు చెప్పినవే. వీడిదేం లేదు. కానీ మనకు వీడే మగాడుగా కనిపించడం లేదా? కానీ అలా జరగడానికి ఎంతమంది వెనకాల పనిచేశారు? అలా పనిచేస్తూ

వుంటారట వాళ్ళు. రాక్షసులు అంటే రక్షించేవారు, రక్షసులు అని అర్ధం. తనకి వాళ్ళూ ప్రీతే, వీళ్ళూ ప్రీతే. ఇద్దరికీ ఎవరి పనులు వాళ్ళకి అప్పచెప్పాడు. ఇద్దర్నీ కాపాడుతూ వుంటాడు. ఇద్దరికీ వరాలిస్తూ వుంటాడు. అదేంటండీ వాడికిచ్చారు అంటే ఎందుకివ్వకూడదు? వాడికే ఇస్తాడు. అంటే ఆయన సమత్వం ఎలా వుంటుందంటే సమస్త జీవుల్లోనూ, జీవరాశుల్లోనూ తాను వున్నాడు కాబట్టి రాక్షసుని రూపంలోనూ తానే వున్నాడు. అదీ విష్ణోపాసన! విష్ణుభక్తుల ఉపాసన ఎట్లా వుంటుందంటే చెడులో, చెడుగా ఉన్నాడనుకునే వాళల్లో కూడా వాణ్ణే చూసేవాడు విష్ణుభక్తుడు. కదా! చూడలేకపోతే అంతమేరకు నీకు దేవుడు కనబడడు ఒకటి, ఇంకొకటేమిటంటే, అలా చూడగలిగేటంత వరకు అసలు దేవుడు కనబడడు. 'కోరకుండని రూపంబు కొసకు మిగులు'[1] అని రాసారు మాస్టారు గోదాకళ్యాణంలో. 'నీవు కోరుకున్న రూపంలో నేను కనపడను. నేను కనపడే రూపంలో నీవు తీసుకో' అని చెప్తారు. అందుకని మననుండి పుట్టే భావములకు కూడా మనము స్వామియై నిలబడటానికి ప్రయత్నం చేయాలి. భావం వచ్చిన తర్వాత ఆహా నీవు వచ్చావా? అట్లా వుండు. నేను ఆలోచించి ఏం చేయాలో చెప్తాను అని. ఇదొక సాధన. ఇట్లా చేస్తే నీ మనస్సును నియమించగలవు.

391, 392, 393 కరణం, కారణం, కర్తా

అంటే implementation నియమించడం, అధిష్ఠించడం. అప్పుడు నీవు నీ మనస్సుని ఇట్లా చెయ్యి అట్లా చెయ్యిఅని నియమించు.ఇంద్రియాలని నియమించు. శరీరాన్ని నియమించు. నీ వరకు ఈశ్వరుడవు. ఈ శరీరాన్ని నియమించగల్గుతావు. మనదేముందండీ అంతా అదే చేసుకుంటుంది. అదే పోతూంటుంది. అంటే అప్పడేమొచ్చినా ఒప్పుకోవాలి. కొంతమంది చెప్తూంటారు theory. మనదేం లేదండీ అంతా వాడే చేస్తూంటాడు. అంటే అలాగేనండి ఈ పూటకు breakfast మీకు లేదు sir అంటే, సరిపోతుంది. అప్పుడు తెలుస్తుంది. అంతా వాడే చేస్తూ వుంటాడా, మనం పరుగెడతామా hotel కి అని. తనను తాను నియమించుకోలేనివాడు ఈ సృష్టిలో బానిస. మిగతా జీవులని భగవంతుడే సరాసరి నియమిస్తాడు. మనకేం చేసాడంటే నిన్ను నువ్వే నియమించుకోమని స్వతంత్రం ఇచ్చాడు, కేవలం కరుణ చేత! చిన్న పిల్లవాడికి ఏమీ తెలియకపోతే మనమే అన్నీ చూసిపెడతామండీ. వాడికి నీళ్ళు పొయ్యడం, బట్టలెయ్యడం ఇవన్నీ చేస్తాం కదా! మిగతా జీవరాశులు అంటే పదార్థం, వృక్షం, జంతువు ఈ పరిణామం అంతాకూడా ప్రకృతే చేస్తూ వుంటుంది తల్లివలె. ఎందుకంటే వాటికి చేసుకోవటం తెలియదు. మూడునెలల పసిపిల్ల వాడున్నాడనుకోండి. పోయి నీళ్ళు పోసుకో పో, అంటే వాడికి తెలియను కూడా తెలియదు. కదా! నీవే కాళ్ళమీద పడుకోపెట్టుకొని స్నానం చేయించి, సాంబ్రాణి కూడా వేసి, ఏవేవో చేస్తాం. ఇరవై ఏళ్ళవాడు నన్ను కాళ్ళమీద పడుకోబెట్టుకొని స్నానం చేయించి, సాంబ్రాణి వెయ్యమ్మా అంటే లెంపకాయ కొడ్తుంది కదా! ఏమిటి తేడా? 'నువ్వు పెరిగావురా. నీ అంతట నీవు వుండు' అని. అట్లాగే మానవుడు! తనకి తానుగా, తనంతటి వాడుగా ఈ సృష్టిలో జీవించడానికి కావలసినంతా వాడికి ఇచ్చి పంపించెసాడు. పిల్లవాడికి చదువు చెప్పారు. ఆస్తి ఇచ్చారు. పెళ్ళి చేసారు. అయినా ఇంకా అమ్మా నాన్నా అంటే ఎట్లా వుంటుంది? అప్పుడు ఏం చెప్తారు తల్లితండ్రులు 'నీ బ్రతుకు నీవు బ్రతుకు' అని చెప్తారు. అట్లాగే భగవంతుడు ఏం చేసాడంటే మానవుని వరకు తన దగ్గరవున్న సమస్తమూ ఇచ్చేసాడండి. 'నేనెంతటివాణ్ణి నువ్వూ అంతటివాడివే. నేనెంత చేయగలనో నువ్వూ అంత చేయగలవు. అన్నీ నీలో వున్నాయి' చేసుకోమన్నాడు. 'ఎట్లా చేసుకోను' అంటే 'నేనెట్లా చేసానో చూడు' అన్నాడు. 'సృష్టిని చూస్తుంటే నీకే' తెలుస్తుంది. అట్లగే నీవు చేసుకో. చక్కగా నియమించుకోవచ్చు. ఈశ్వరత్వం సాధించుకున్నవాడు తనను తాను నియమించుకుంటాడు. వాడు ఆత్మనియతి కలిగిన వాడు. 'ఎవరిదయ్యా హరికులం' అంటే 'ఆత్మనియతి కలిగినవాడిదే హరికులం' అని చెప్తాడు అన్నమయ్య.

ఆత్మనియతి అంటే ఏమిటి? తనకు వచ్చిన అడ్డమైన ఆలోచనని అమలులోకి రానివ్వడు. తన ఇంద్రియాలు ప్రబోధిస్తున్న అడ్డమైన రుచులకి తను లొంగడు. తన శరీరం చెప్పే విషయాలకి తను లొంగక, తను చెప్పినట్లు అవి వింటాయన్నమాట. అదీ 'కరణం' అంటే! మనకు కరణం అంటే కారణం వేరే వుండి, అది నడిపిస్తూ వుంటుంది. 'కరణం, కారణం, కర్తా'. మనకేం జరుగుతోందంటే మనం సృష్టి ధర్మాన్ని అనుసరించి పనిచేయక పోవటం వల్ల కారణాలు పెట్టుకు పనిచేస్తాం. సృష్టి ధర్మం ప్రకారం పనిచేస్తూ వుంటే, ఇందుకోసం అనేది వుండదు. చెయ్యడమే వుంటుంది. అలా చేయటం వలన నీవు పొందే ఆనందం వుంటుంది. ఇందుకోసం అని పెట్టుకొని పనిచేయటం వల్ల ఆ ఇందుకోసం అనేది మనకు అందనపుడు బాధపడ్తూ వుంటాం కదా! ఎందుకోసమని ఏమీలేదు. అన్నీ చేస్తున్నాయి. మనం కూడా చేస్తున్నాం. మనం చేయవలసినది మనం చేస్తాం. మన దగ్గరకి రావలసినది మన దగ్గరకి వస్తుంది. ఇది సనాతనమైన భారతీయమైన భావన. నీవు చేయవలసినవి నీవు చేస్తూ వుంటే, నీ దగ్గరకి వచ్చేవి వెంటబడి వస్తాయి. నీవు చేయవలసినవి మానేసి రావలసిన దాని గురించి ఆలోచిస్తూ, చేయటం ఆపేస్తే రావటం ఆగిపోతుంది. చేయవలసినది చేస్తూ వుండటమే. ధర్మరాజును యక్షుడు ప్రశ్నలు వేస్తాడు. అన్ని ప్రశ్నలకి సమాధానం చెప్తాడు. ఎందుకు? అన్నదమ్ము లందరూ పడిపోయారు. 'నువ్వు చెప్పిన ధర్మం అంతా నాకు నచ్చింది. చాలా బాగా చెప్పావు. నీ తమ్ముళ్ళలో ఒకణ్ణిస్తాను కోరుకో' అంటాడు. అంతవరకు తమ్ముళ్ళ గురించి అడగడసలు. అడిగిన దానికి చెప్తూ వుంటాడు. అంతే అడుగుతున్నాడు తనకి తెలిసింది చెప్పటమే తప్ప ఇంకో పనిలేదక్కడ. ఒక్కణ్ణిస్తాను నలుగురిలో ఎవర్ని కోరుకుంటావో కోరుకో అంటాడు. మామూలుగా ఎవర్ని కోరుకోవాలి? తనకు ఎక్కువగా ఉపయోగపడే వాణ్ణి కోరుకోవాలి కదా! ఎక్కువగా ఉపయోగపడే వాడెవడు? అర్జునుడు! ధర్మరాజుకి అర్జునుడంటే అటువంటి విశ్వాసం. అందుకని విరాటపర్వంలో ఆయుధాల్ని చెట్టుమీద వుంచే సమయంలో అది ఒక శవంలాగ కనిపించాలని సంకల్పిస్తే అది అట్లా అయిపోతుంది. అప్పుడు ఆయుధాలన్నింటికీ 'నేను కాని, అర్జునుడు కాని వస్తే మీరు ఆయుధాల్లాగా కనిపించండి. ఇంకెవరొచ్చినా మీరు నల్లత్రాచుల వలె బుసకొడుతూ కనిపించండి' అని చెప్తాడు. శవమల్లే కనిపించి, శవం మీద కట్టిన తాళ్ళు త్రాచుపాములల్లే కనిపించమని చెప్తాడు. అర్జునుడికి మాత్రం అట్లా అక్కరలేదు. నాకు అట్లా అక్కరలేదు. మేమిద్దరం వస్తే మాత్రం మామూలుగా సహజంగా కనిపించమని చెప్తాడు. అంటే ఏమిటి అర్థం? వాళ్ళిద్దరికీ ఆత్మనియతి వున్నదని అర్థం. మిగతావాళ్ళు అప్పుడప్పుడు లొంగిపోతారని అర్థం. మరి అటువంటి అర్జునుణ్ణి కోరుకోవాలి కదా! యక్షుడు అడిగితే, నకులుణ్ణియ్యమని చెప్తాడు. ఆశ్చర్యపోయి 'అదేంటయ్యా రేపు

యుద్ధమంటూ వస్తే వందమంది ధృతరాష్ట్రుని కొడుకుల్ని చంపడానికి భీముడు కావాలి నీకు. అర్జునుడు కావాలి. వాళ్ళిద్దర్నీ వదిలేసావు. నకులుణ్ణి అడిగావు. పోనీ అందరికన్నా చిన్నవాడి మీద మక్కువ వుంటుంది. సహదేవుణ్ణి అడగలేదు. నకులుణ్ణి అడగటంలో ఏమిటి నీ ధర్మం' అని అడుగుతాడు. అంటే ధర్మరాజు చెప్తాడు. 'మా నాన్నకి ఐదుగురు కొడుకులు. మా అమ్మకి మేం ముగ్గురం కొడుకులం. మా పిన్ని కిద్దరు కొడుకులు. మా అమ్మ ముగ్గురి కొడుకుల్లో పెద్దవాణ్ణి నేనున్నాను. మా పిన్ని ఇద్దరి కొడుకుల్లో పెద్దవాడుండద్దా' అంటాడు. మనం అసలు ఊహించలేం! చేయవలసినది చేయటమే! Result చూసుకొని కోరుకోవడం కాదు. చేయవలసినది చేస్తూ వుంటే 10, 12 సంవత్సరాలైన తరువాత చూడాలండీ ఎట్లా వుంటుందో? ఓపిక లేదు మనకి. మొన్న ఎక్కడికో ఉపన్యాసానికి వెళ్తే, అక్కడో అయన చెప్పారు. గోపికలంటే ఎవరండీ? ఓపికలున్న వాళ్ళే గోపికలు, అని. మనకి బొత్తిగా ఓపిక లేదు. ఈ పూట చేసి, రేపు ప్రొద్దున్నే వాడి మొహం చూస్తాం ఎందాకా వచ్చామని. 10,12 సంవత్సరాలు ఎదురు చూడకుండా మనం చేయవలసినది చేసి, ఆ తర్వాత మనకేమొస్తుందో చూడండి. 12 ఏళ్ళు పడ్తుంది ఒకసారి చక్రం తిరగడానికి. చక్రం తిరిగి ఒక్కొక్కటి ఒక్కొక్కటి నీ దగ్గరకి వస్తూ వుంటే, అపుడు చూస్తే నీకు ఓహో, అని ఆశ్చర్యమేస్తుంది. పన్నా బట్టి ఒక్కొక్కళ్ళకి 14 సంవత్సరాలు, 30 సంవత్సరాలు కూడా పెడ్తారు. అందుకని నియమ పరిపాలన కావాలి. 'కారణం' అంటే అది! తనను తాను నియమించుకొని పరిపాలించుకోవాలి. ధర్మరాజు తనను తాను నియమించుకున్నాడు. రాముడు తనను తను నియమించుకున్నాడు. భరతుడు తనను తాను అట్లా నియమించుకున్నాడు. మహాత్ములందరూ తమను తాము అట్లా నియమించుకున్నారు. నియమించుకోవడం అనేది మనకోసమే. మనం నియమం పెట్టుకొని దాన్ని మనమే ఉల్లంఘించకూడదు. ఇప్పుడు నేను చెప్పిన పేర్లలో ఎవ్వరూ కూడా నియమోల్లంఘన చేయనివారు. వారు చేసినా కూడా ఎందుకు చేసావని ఎవరూ అడగలేరు. అటువంటి వాళ్ళు. అందుకని ఈ విధమైన నియమాల్ని పరిపాలించడం అనేదాన్ని 'కరణం' అంటారు. అదీ సృష్టిలో నియమ పరిపాలన. అన్ని జీవరాశులూ అట్లా చేస్తాయి. మామిడిచెట్లు మామిడిపండ్లే ఇస్తాయి. కొబ్బరిచెట్లు కొబ్బరికాయలే ఇస్తాయి. వేపచెట్లు వేపపళ్ళే ఇస్తాయి. వేపచెట్టుకు మామిడిపండ్లు పండడం వుండదు. ఎందుకని? వాటిని ప్రకృతే నియమిస్తుంది. అట్లాగే మానవుడు కూడా మనిషిలాగే వుండాలి. మానవుడు చేపలాగ ఈదడానికి చూస్తాడు. పక్షిలాగ ఎగరడానికి చూస్తాడు. జంతువులాగ అందరినీ ఆక్రమించడానికి చూస్తాడు. ఒక్క మనిషిలాగ మాత్రం వుండడు. వాడెట్లా వుండాలో అట్లా వుండక మిగతా అన్నిటిలాగా వుంటాడండీ. అంటే అన్ని రకాలుగా వుండగలడని తెలుస్తోంది. వాడిలాగ వాడుంటే

పరిపూర్ణుడౌతాడు. అందుకని తనను తాను నియమించుకొని, తనని తాను పరిపాలించుకోవటం కోసం ఈ 'పరమేశ్వర' తత్త్వం దగ్గరనుంచి 'కరణం' శబ్దం దగ్గరకొచ్చాము. కాబట్టి మనలో ఆ విధంగా నియమం చేసేవాడు కూడా భగవంతుడే. ఏం చేస్తాడు? తప్పు దోవలో వెళ్తున్నవాళ్ళని, ఆ దారిలో వెళ్ళడం వల్ల వచ్చిన ఇబ్బందుల వల్ల నేర్చుకొని, సరైన దారిలోకి వచ్చేలా చేస్తాడు. అడ్డగోలగా తింటూ వుంటే ఓ రోగం పెడ్తాడు. అది హద్దు! ఎలుకకి పిల్లి హద్దు. పిల్లికి కుక్క హద్దు. ఇట్లా ప్రతిదానికి హద్దులు పెడ్తూంటాడు. ఎట్లా పడితే అట్లా మాట్లాడే మనిషికి తీరని నష్టం ఎప్పుడో కలుగచేస్తాడు. అప్పట్నుంచి వాడు నేర్చుకుంటాడు మనం ఇట్లా మాట్లాడకూడదని. ప్రవర్తన లోంచి వచ్చిన చిక్కుల్లో నుండి నేర్చుకోవడం ఒక పద్ధతి. పెద్దలు, ఇలా ఇలా ప్రవర్తిస్తే ఇటువంటి చిక్కులొస్తాయి అని చెప్పినపుడు, ఆ దారిలో కాకుండా ఇంకో దారిలో నడవడం, తనను తాను స్వయంగా పరిపాలించుకొని బాగుచేసుకోవడం. అందుకని కారణం వుంది కాబట్టి ఆచరించడం ఒక పద్ధతి. అంతకుముందు వున్న స్థితి ఈశ్వరత్వం వుండటం చేత తనను తాను పరిపాలించుకోవడం వుంటుంది. మిగతావాళ్ళకి ఏం జరుగుతోందంటే కరణం, కారణం, కర్త. ఏం చేస్తాడు? వాడికే కారణాలు పెడ్తాడు. ఎట్లా పెడ్తాడు? రలాయించి తిరిగేవాళ్ళకి ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్కటి పెడ్తాడు. ఒకడికేం పెడ్తాడంటే, విపరీతమైన ఆపద తెస్తాడట జీవితంలో. తెచ్చుకుంటాడు వాడు. వీడు తేనక్కరలేదు. నియమ పరిపాలన లేకపోవడం వల్ల వచ్చే ఆపదలోంచి వాడు పట్టుకుంటాడు ఏదో ఒకటి. కాసేపు వినాయకు డంటాడు. లేకపోతే హనుమంతు డంటాడు. లేకపోతే రాముడంటాడు, కృష్ణుడంటాడు. ఏదో ఒకటి మొత్తానికి ఒక కొమ్మ పట్టుకుంటాడు. ఏమిటిరా అంటే ఏదో కారణం వుంటుంది. అప్పులవాడు అప్పు ఇవ్వలేదనో, లేకపోతే ఎవరో తనని పట్టుకుంటారనో, వ్యాపారం నష్టం వస్తోందనో, తనకి ప్రాణానికి భయం వుందనో, తనకి భయంకరమైన రోగం వచ్చిందనో ఇలా ఏదో కారణంగా ఆర్తితో భగవంతుణ్ణి పట్టుకునేటట్లు చేస్తాడు. భగవంతుణ్ణి పట్టుకోవడం అంటే ఏమీలేదు. భగవంతుడు ముందు రుచిగా వుండి, తరువాత నేనంటే ఏమీలేదు సృష్టి ధర్మమే, అని చెప్తాడు. సృష్టిలో భగవంతుడు ధర్మం రూపంలో వుంటాడు. ధర్మాన్ని నమ్మినవాడి వెనుక దైవం నడుస్తాడు. దైవం వెంట నడుస్తున్నామని ధర్మాన్ని అనుసరించని వాళ్ళకు దైవం ఉండడు. ఉన్నాడనుకొని మోహపడవచ్చు. దూర్వాసుడే దానికి తార్కాణం. అంత ఋషి కూడా అధర్మ ప్రవర్తన చూపేసరికి, దైవం తన సహాయ సహకారాలు ఇవ్వలేదు కదా! కనుక ఈ దైవారాధనలు ధర్మమునందు నిలబడటానికి, నెమ్మదిగా అలా అలా ఆ మార్గంలోకి తీసుకొనివెళ్తాడు. ధర్మరాజు ఏ దైవాన్ని ప్రార్థించాడండీ? ఎక్కడైనా వుందా? ధర్మమే దైవంగా జీవించాడు. సృష్టిలో

ధర్మాన్ని దైవంగా తెలుసుకొని ఆ ధర్మాన్ని అనుసరించడం వల్ల దైవానికి ఆయన్ని కాపాడాల్సిన పరిస్థితి వచ్చింది. ధర్మం లేని దైవం లేదు! లేక మనం అనుకున్నవి అనుకున్నట్లుగా జరగవు. దైవాన్ని నమ్మడం అంటే ధర్మాన్ని నమ్మడమే! ధర్మంతో కూడిన దైవారాధన చేస్తూంటే ఫలితం బాగా వుంటుంది. ఉత్త దైవారాధన ధర్మంతో సంబంధం లేకుండా చేస్తూ వుంటే, దైవం అంత పలకడు. ఇంకొంచెం వీడు ధర్మంలోకి రావడానికి సన్నివేశా లేర్పడుతూ వుంటాయి. తద్వారా నెమ్మది నెమ్మదిగా వస్తూ వుంటాడు. అందుకని భారతంలో ధర్మం ఎక్కువ చెప్తారు. ధర్మరాజు దానికి కథానాయకుడు. ఎట్టి పరిస్థితిలోనూ ధర్మాన్ని అతిక్రమించలేదు. మిగతావారంతా అతిక్రమించారు. అతిక్రమించినందుకు అనుభవించారు. అతనొక్కడే అలా నడచి వెళ్ళిపోయాడు. స్వర్గారోహణ పర్వం తీసుకుంటే, అతనొక్కడే కదా నిలబడతాడు. ఏమిటి అతన్లో బలం? ఏం పూజలు చేసాడు? ఏం అభిషేకాలు చేసాడు? నామం చేసాడా? హోమం చేసాడా? ధర్మాన్ని పరిపాలించాడు. ధర్మమే దేవత కనుక ఆ కుక్కను కూడా స్వర్గానికి తీసుకుపోకపోతే ఆ స్వర్గం నాకక్కర లేదన్నాడు. తనతో నడిచివచ్చింది ఇంతదూరం. తన తమ్ముళ్ళు కూడా రాలేకపోయారు. తన భార్య రాలేకపోయింది. కుక్క వచ్చిందంటే, వాళ్ళు చేయలేనిది ఇది చేసిందంటే, అంతేకాదు తను చేసిందంతా కూడా చేసింది. కాబట్టి తనకిచ్చే గౌరవం కుక్క కివ్వాలి. తన తోటివారిని సంరక్షించుకోవడం, ఆదరించడం రాజు ధర్మం. నాకక్కర లేదంటాడు. అదేంటండీ అంటే, మరి ఇదో అంటాడు. స్వర్గంలో క్రొత్తగా కుక్కల్ని ఎక్కడ తీసుకొస్తాం? అంటాడు. ఒకడు తన భార్యాపిల్లలతో, ధనం మూటతో ఒక పడవలో ప్రయాణం చేస్తూ వుంటాడు. కొంతదూరం వెళ్ళాక పడవ వాడంటాడు. పడవ బరువెక్కుతోంది ఎవరన్నా దూకాలి, అని. అంటే వీడు పిల్లల్ని ఒక్కొక్కణ్ణీ తోసేస్తూ వుంటాడు. అందరినీ తోసేస్తాడు. ఏం ఉంచుకున్నాడంటే ధనం మూటని ఉంచుకున్నాడట. పెళ్ళాన్ని కూడా తోసేస్తాడట. డబ్బుంటే మళ్ళీ వీళ్ళందరూ రారా, అని వీడి నమ్మకం. ఆ తర్వాత పడవ వాడంటాడు, లాభం లేదండీ మూట కూడా పారేస్తే కానీ మీరు రావడానికి వీలులేదు, అని. మూట పారేసే బదులు నేనే దూకేస్తానని, వాడే దూకేస్తాడు. ఇట్లా వుంటాం మనం. ధర్మరాజు చూడబోతే అట్లా వున్నాడు. ఎందుకిట్లా వున్నాడంటే, ఆ ధర్మపాలన అనే ఆత్మనియతి కలిగినవాడికి దైవం దగ్గరుండి సేవకుడల్లే సేవ చెయ్యాలి తప్పదు. ఎందుకంటే ధర్మమే దైవం కాబట్టి, దైవమే సృష్టిలో ధర్మం కాబట్టి, ధర్మాన్ని రక్షించుకోవలసిన బాధ్యత దైవాని దవుతుంది. అందుకని కారణం పెట్టుకొని పనిచేసే వాళ్ళందరినీ ముందు ఆ మార్గంలోకి రప్పించడానికి తానే కారణమవుతాడు. డబ్బు సంపాదిస్తే బావుంటుంది అనే భావన మనలో కలిగిందనుకోండి. అది కారణంగా మనచేత డబ్బు

సంపాదించటం అనే కార్యక్రమం పెట్టించి, మనచేత ఊర్లో అందరికీ పనిచేయించి పెడ్తాడన్నమాట. లేకపోతే చేయం కదా! ఓ లక్ష రూపాయల లాభం వుందంటే ఆహా అని దూకి పగలు, రాత్రి ఒళ్ళు విరుచుకొని పనిచేయమూ? ఆ చేసేపని ఎవరికోసం చేస్తున్నాం? మిగతావాళ్ళ కోసమే! ధర్మాన్ని అనుసరించి కారణం లేకుండా స్వచ్ఛందంగా పనిచేసే వాళ్ళు స్వచ్ఛంద సేవకులు సృష్టిలో! అలాకాని వాళ్ళందరికీ ఒక కారణం పెడ్తాడు. కారణం పెట్టి వాడిచేత గొడ్డుచాకిలీ చేయిస్తాడు. ఎందుకంటే వాడు మిగతావాళ్ల కోసం పనిచేయాలి తప్పదు. అందులో వాడు నలగాలి. అందులో వాడికి అనుభవం రావాలి. అందులోంచి జ్ఞానం రావాలి. మూర్ఖంగా పనిచేసే వాడికి అనుభవం వల్ల కొంత జ్ఞానం వస్తుందట. ఆ అనుభవం నుంచి విజ్ఞానం ఏర్పడుతుందట. ఆ తర్వాత ఎట్లా చెయ్యాలో తెలుస్తుందట. ఏదో ఒక పద్ధతిలో తెలుసుకుంటాడు. మొత్తానికి తప్పదు. అందుకని ఈ కారణం ఇలా జరగడానికి కూడా కర్త భగవంతుడే! ఇదంతా తను పెట్టిన ఆట. బాగా ఆడుకున్నవాళ్ళు ఆడుకుంటారండీ. ఇందులో గెలవాలి కాబట్టి వాణ్ణి తందాం, వీణ్ణి తందాం, వాడి నెత్తిమీద ball వేసి కొడదాం, bat వేసి కొడదాం అనుకొనేవాళ్ళకి కొన్ని extra కార్యక్రమాలు పెడ్తాడు. అందులోంచి వాడు మారేటట్లు చూస్తాడు. అందరూ బాగా అనుభూతి చెందాలని ఆయన తాపత్రయం. ఎందుకండీ ఈ గోలంతా అంటే ఒకటే! నలుగురు పిల్లలుంటే నాలుగు తెచ్చిపడేసి, వాళ్ళు ఆడుకుంటుంటే చూసి ఆనందిద్దాం అని కదా! వాడు ఆనందించకుండా దానితో తంటాలు పడుతూ వుంటే దానితో ఎట్లా ఆనందపడాలో నేర్పాలనిట ఇన్ని రకాలుగా వేషాలు వేస్తాడు. పరమేశ్వరుడు దగ్గరనుంచి తన కారణమై, కరణమై, తనే కర్తయై సమస్తాన్నీ అట్లా నడిపిస్తూ వుంటాడు.

394 వికర్తా

వికర్తా అంటే మొత్తం చేసిన దాన్నంతా కూడా మళ్ళీ తనలోకి ఇముడ్చుకొనేవాడు. ప్రతిదానికీ ఒక ముగింపు గలిగించేవాడు. సృష్టిలో తననుంచి వ్యక్తమైన సమస్తము మళ్ళీ తనలోకి వస్తూ వుంటుంది. గ్రహగోళాదుల దగ్గరనుంచి చీమ, దోమ వరకూ కూడా అలాగే జరుగుతుంది. వ్యక్తమైన ప్రతిదీ కూడా మళ్ళీ తిరోధానం చెందాల్సి వుంటుంది. పురోగమనం అయిన ప్రతిజీవి సృష్టిచక్రంలో సమస్తమైన అనుభూతులను పొంది, మళ్ళీ తన దగ్గరకి చేరడం జరుగుతుంది. అందుకని ప్రతిదీ ఎక్కడ నుండి ఉద్భవించిందో అక్కడికి మళ్ళీ చేరుకోవడం అనే కార్యక్రమం సృష్టిలో ఒక ధర్మంగా అమర్చి వుంచారు. ఇన్ని ఆలోచనలు పెంచుకుంటూ ముందుకు వెళ్తాం. అన్ని ఆలోచనలూ తగ్గించుకుంటూ మళ్ళీ వెనక్కి వెళ్తాం. ఎన్ని కోరికలు పెంచుకుంటూ ముందుకు వెళ్తామో, మళ్ళీ అన్ని కోరికలూ తగ్గించుకుంటూ వెనక్కి వెళ్తాం. భగవత్తత్త్వం నుండి ప్రత్యేకాత్మలుగా విడివడి రకరకములైన అనుభూతులను పొందుతున్న వాళ్ళం మళ్ళీ తిరుగు ప్రయాణంలో వాడి సంకల్పంగానే వాడిని చేరుకోవడానికి మరలడం వుంటుంది. పగలంతా ఎక్కడెక్కడ మేసినా సాయంత్రమయ్యేసరికి తను వుండే చోటుకి వస్తూ వుంటుంది పశువు. అది ప్రతిజీవి విషయంలోనూ సత్యం. పుట్టిన ప్రతిదీ కూడా ఎక్కడనుంచి పుట్టిందో మళ్ళీ అందులోకి వెళ్ళిపోతుంటుంది. విత్తనంలోంచి చెట్టు పుట్టి, చెట్టులోంచి పండు పుట్టి, పండులోంచి మళ్ళీ విత్తనం పుట్టేసరికి ఏమైంది? మళ్ళీ విత్తనం అయిపోయింది. అట్లాగే మనలోంచి పుట్టినవన్నీ కూడా వెళ్ళిపోయి, మనం మిగులుతూ వుంటాం కదా! మసలితనం రాగానే శరీరం కృశిస్తుంది. యుక్తవయసులో వుండే కోరికలకీ, ముసలి వయసులో వుండే కోరికలకీ తేడా వుంటుంది. ప్రతి చక్రంలో ముందుకు వెళ్ళి వెనక్కి వస్తూంటుందన్న మాట. పురోగమనము, తిరోధానము అన్ని విషయాల్లోనూ వుంటుంది. ఏ ఊరన్నా వెళ్తే మళ్ళీ తిరిగి మన ఊరు వచ్చేస్తాం కదా! మనమే పుట్టుకస్థానం కాబట్టి మననుంచి వ్యక్తమైన భావాన్ని పట్టుకొని వెళ్తూ, మళ్ళీ ఆ భావాన్ని పట్టుకుని వెనక్కి వస్తూ వుంటాం. మళ్ళీ ఇంకో భావం రావాలంటే మళ్ళీ మనం, మనంగా వుంటాం కాబట్టి ఇంకో భావం వస్తోంది. సృష్టి భగవంతుని యొక్క భావం. భగవంతుడి నుంచి ఒక భావం వ్యక్తమైతే ఇంత జరిగింది. మన నుండి కూడా భావం వ్యక్తమైతే ఎంత జరగట్లేదు? బాగా చదువుకొని బాగా ఆర్జన చేయాలి, ధనం సంపాదించాలి అనే భావన మనిషిని దాదాపు ఇహ పనిచేయలేనంత వరకూ కూడా త్రిప్పుతూనే వుంటుంది. అలాగే కుటుంబాన్ని ఏర్పరచుకోవాలనే భావం. వివాహం చేసుకొని,

పిల్లల్ని కని, వాళ్ళని పెద్దవాళ్ళని చేయాలి ఇలా అన్నీ భావాలే కదా మనలో! ఇందులోంచి ఎంత పుడ్తోంది? మనదైన సృష్టి ఒకటి పుడ్తోంది. ఇలా విష్ణు సహస్రనామం class చెప్పుకుందాం అనే ఒక సంకల్పం రావటం వల్ల ఇప్పుడు దాదాపు ఐదేళ్ళ నుంచి శనివారం ఈ విధంగా అవకాశ మున్నప్పుడల్లా కలుస్తున్నాం కదా! ఆ భావమే రాలేదనుకోండి ఇవన్నీ లేవు కదా! ఈ భావానికి ఒక అంతు వుంది కదా! 108 శ్లోకాలు పూర్తవగానే దీనికో పరిసమాప్తి వుంటుంది. కనుక పుట్టిన ప్రతిదానికీ ఒక పరిసమాప్తి వుంటుంది. ప్రతిదానికీ పెరుగుదల వుంటుంది, తరుగుదల వుంటుంది. జాతులలా పెరిగి, మళ్ళీ పడిపోతూ వుంటాయి. భారతజాతి ఒకప్పుడు ఉన్నతమైన జాతి. ఇప్పుడు సరిగ్గా రోడ్లు, కాలువలు, నీళ్ళు ఏవీకూడా అమర్చుకోలేని దుస్థితిలో వుంది. ఎంత ముందుకు వెళ్తే అంత వెనక్కు రావాలి. అందుకని చక్రంలో చేయించేవాడుగా తనుంటాడు. మళ్ళీ ఇహచాల్లే, అనిపించే వాడుగా కూడా తానే వుంటాడు. తినటం మొదలు పెట్టామనుకోండి, ఇహచాల్లే అనిపించకపోతే చచ్చేవరకు తింటాం ఆ పూటే. ఒక పూట భోజనంతో సరి. అలా ప్రతిదాన్లోంచి కూడా వికర్తా! 'పనినుంచి తిరోధానం చెందడం. ఇహచాలు' ఇంతకన్నా ముందుకి వెళ్ళద్దు అనేది జరుగుతూ వుంటుంది. ఇలా మనలో ఆ సంకల్పం కలిగించేవాడు కూడా వాడే! భగవంతుని యొక్క తత్త్వం గురించి తెలుసుకొని అందులో ఇమిడి వుందామనే సంకల్పం మనది కాదు. మనలో మనం చాలా పొరల్లో వుంటాం. శరీరమే తాముగా ఉండేవారు, ఇంద్రియములే తాముగా ఉండేవారు, మనసులో వచ్చే ఆలోచనలే తాముగా ఉండేవారు, బుద్ధిలో వచ్చే మంచి భావములే తాముగా ఉండేవాళ్ళు.. ఇలా వుంటారు. అక్కడ నుంచి బుద్ధి పొరల్లో ఇంకా లోతుల్లోకి, ఇంకా వెలుగులోకి వెళ్తూ వుంటే, ఇదంతా ఏమిటి? మనమంతా ఎందుకిట్లా వున్నాం? ఇట్లా ఎందుకుండాలి? ఇట్లాగే ఉండాలా, ఇంకో పద్ధతి ఉన్నదా? అనే ప్రశ్నలు లోపల ప్రతివాడికీ పుడ్తాయి. 'ఆర్తిగానో, అర్థార్థి గానో, జిజ్ఞాసువు గానో, జ్ఞానిగానో నాలుగు రకాలుగా నా దగ్గరకి వస్తూ వుంటారు మనుషులు', అని చెప్తాడు భగవంతుడు భగవద్గీతలో. అంతకు ముందు కష్టంలో వుంటే రావడం. ఆ తర్వాత మనక్కావలసినవేవీ దొరకడం లేదు ప్రపంచంలో కాబట్టి ముందు భగవంతుని బయట పనుల కోసం ఆరాధించడం గా పట్టుకోవడం. ఇదంతా ఏమిటి అనే ప్రశ్న పుట్టడం వల్ల, ఆ తర్వాత జ్ఞానం అబ్బడం వల్ల పట్టుకోవడం. ఇట్లా నాలుగు రకాలుగా నాతో వుంటారు. ఈ నాలుగు రకాలుగా ఈ జీవికి జరుగుతున్న ప్రయాణంలో ఏదో ఒక చోట వాడికి అనిపిస్తుంది ఇహచాల్లే అని. దైవమే జీవునిగా ఉండటంచేత జీవునికి అంతరాంతరాళాల్లో అనిపించడంచేత అప్పట్నుంచి వాడు దైవస్మరణలో దిగుతాడు. దిగినతర్వాత వీటికి సంబంధించినవన్నీ ఎక్కువ ఆసక్తిగా వుంటాయి. కొత్తలో కొంచెం ఒక మాదిరిగా వుండి, మళ్ళీ పాత

అలవాట్లలోకి వెళ్ళిపోతూ వుంటాడు. నెమ్మది నెమ్మదిగా లోపలినుంచి జీవుని యొక్క బోధ ఒకటి వుంటుంది. ఆత్మ బోధ. అది ఏం చేస్తుందంటే ఎంత చేసినా మనకు దైవస్మరణే బావుంటుందని మళ్ళీ అక్కడికి పంపుతూంటుంది. అటూ ఇటూ తిరుగుతూ ఎందుకీ గోల? ఇదే బాగుంటుందేమో అనిపిస్తూ వుంటుంది. ఇట్లా అనిపించడం నెమ్మదిగా పెరుగుతూ వుంటుంది. పెరిగి అంతకుముందు చేసే పనులు కొన్ని కొన్ని ఆపేసుకొని 'ఇందులోనే పడివుందాం. ఈ పై పై మెరుగుల కోసం భ్రమపడటం వలన మనకి కాలం వృధా. ఏవో చాలా మెరుస్తూ వుంటాయి. మెరిసేవన్నీ నిజం కాదు.' ఇట్లా నెమ్మదిగా వాడిలో మొదలై, వాడంతట వాడే తిరుగుదారి పడ్తూ వుంటాడు. వాడనుకుంటాడు తాను తిరుగుదారి పడుతున్నానని. తిరుగుదారి పట్టించేవాణ్ణి కూడా 'నేనే' అని చెప్తుంటీ నామం. జీవునికి పరిపూర్ణమైన అనుభూతి ఏర్పడి, ఈ శరీరానికి ఒక ప్రమాణం లేదు. ఒక standard లేదు. రోజుకో రకంగా ప్రవర్తిస్తూ వుంటుంది. ఇంద్రియాలకు పుట్టే కోరికల కొక ప్రమాణం లేదు. మనసులో వచ్చే చంచలమైన భావాలకు ఒక ప్రమాణం లేదు. ఈ ప్రమాణం లేని, అవకతవకల మార్గంలో, నమ్మకం లేని మార్గం లో ఎంతకాలమని ప్రయాణం చేస్తాం? అని విసుగుపుట్టి, జీవుడు కొంచెం పైకి ఎక్కుతాడు. అదే బుద్ధిలోకి వెళ్ళడం. కొంచెం నిలకడగా జీవిద్దాం. మరీ ఇట్లా అడ్డగోలుగా వద్దనిపిస్తుంది. అలా అనిపించడం జీవుని అంశగా వున్న దేవుని ప్రేరణే! అనిపించిన దగ్గర్నుంచి అంతకుముందు చేసే పనులు ఒక్కొక్కటీ మానేయడం మొదలుపెడ్తాడు. ఎవరో చెపితే మానేసారనుకోడం పారపాటు. వాడికి స్వతహాగా లోపల అనిపించాలి. అందుకనే మన పెద్దవాళ్ళు ఇన్ని వేల సంవత్సరాలుగా ఇంత తెలిసికూడా ఎన్నడూ ప్రచారం చేయలేదు. ప్రచారం ఎందుకు? ఇది మంచిది అని జీవుడికి అనిపిస్తే వాడే వెదుక్కుంటూ వస్తాడు. వాడు అతుక్కుని వుంటాడు. మనం వాణ్ణి పట్టుకు తిరగడం కాదు. వాడు మనని పట్టుకు తిరుగుతాడు అని జ్ఞానులు తెలుసుకున్నారు. వాణ్ణి మనం పట్టుకు తిరిగితే మనం ఏదో కాస్త ఏమరుపాటు పడినపుడు వాడు పారిపోతాడు. ఏరా అంటే, మీరివేళ వెళ్తారని తెలిసిందండీ. అందుకనే వేదం క్లాసుకి రాలేదు అంటాడు. ప్రచారం వలన కాస్తో కూస్తో పైపై పరిధుల్లో రుచి ఏర్పడినవాడు, ఎప్పుడు అవకాశం వుంటే అప్పుడు తప్పించుకొనేట్టుగా వుంటాడు. అంతరాంతరాళలో రుచి ఏర్పడితే వాడే పట్టుకొని వుంటాడు. వాడు పట్టుకున్నది సహజమైనది. మనం రుద్దినది అసహజమైనది. అందుకని రుద్దుతూ వుంటే పారిపోతారు. ఈ రుద్దేవాడు కూడా నీకది వస్తుంది, ఇది వస్తుంది, ఇంకోటి వస్తుంది అని భ్రమలు కలిగించడం వల్ల వాటివలన దీన్ని పట్టుకున్నాడే తప్ప, దీన్ని పట్టుకోలేదు. ఇక్కడ ఈయన దగ్గర దండం పెడితే మనకేదో కలిసొస్తుంది. డబ్బు కలిసొస్తుందనో,

వ్యాపారం కలిసొస్తుందనో, ఇంకోటి కలిసొస్తుందనో, మరోటి కలిసొస్తుందనో కదా! అంటే దేనిమీద నమ్మకం? ఎవరి పాదాలు పట్టుకున్నామో వాడిమీద కాదు. మన పనులు అవడం మీద నమ్మకం. అంటే ఇది తప్పని నేను అనడం లేదు. కానీ అలా ఉన్నవాడు పనుల కోసం వున్నాడు తప్ప దానికోసం లేడు. కాబట్టి దానివలన వాడు వస్తూ పోతూ వుంటాడు. ఏదో వాడికొక రోజు బాగుంటుంది వస్తాడు. ఓ సంవత్సరం బాగుండదు రాడు. మళ్ళీ ఎప్పుడో వస్తూ వుంటాడు, మళ్ళీ పోతూ వుంటాడు. వస్తూంటాడు పోతూంటాడు. ఎందుకంటే పనులవడం బట్టి వుంటుంది. కాబట్టి మనవాళ్ళే మన్నారంటే ఒరే నీవు పట్టుకోబోక. ప్రకృతికి సమస్తమూ తెలుస్తుంది. ప్రకృతి భగవంతుని నించి వ్యక్తమైనది. కాబట్టి భగవంతునికి తెలుసు ఎవడ్ని ఎప్పుడు తన దగ్గరికి తెచ్చుకోవాలో. తన దగ్గరికి వద్దాం అని అనుకునే వాళ్ళకి మాత్రమే నీవు తెలుపు. అదికూడా వాళ్ళకుండే ఆసక్తిని బట్టి తెలుపు. అందరికీ ఒకే రకమైన ఆసక్తి వుండదు. ఒక్కొక్కళ్ళకి ఒక్కొక్క రకమైన ఆసక్తి. కొంతమందికి అక్కడ, కొంతమందికి ఇక్కడ, ఇంకొంత మందికి ఇంకో దగ్గర అట్లా ఆసక్తిలో మళ్ళీ మెట్లుంటాయి. ఎవరి ఆసక్తిని బట్టి వాళ్ళకి తెలుపుతూ వుండు తప్ప, చేయవలసినది నేను. నేనే తెచ్చుకుంటాను. నేనే మొదలుపెట్టాను ఈ మొత్తం అంతా. మళ్ళీ నేనే అందరినీ నా దగ్గరికి తెచ్చుకుంటాను. నీవు ప్రత్యేకించి overactive గా పనిచేసి, వాళ్ళందరినీ నా దగ్గర చేర్చాలనుకొనే మోహంలో పడ్డావంటే దెబ్బ తింటావు. ఎందుకంటే వాడు నా ప్రణాళిక బట్టి నడుస్తున్నాడే తప్ప నీ ప్రణాళిక బట్టి నడవడు. అందుకని అడిగినవారికే చెప్పు. అడగనివారికి చెప్పక. నిన్ను కోరిన వారి దగ్గరే నువ్వు విషయం మాట్లాడు తప్ప, ఊరికే మైకులు పెట్టుకొని ఊరంతా ప్రచారం చేయమని భారతీయమైన సంప్రదాయంలో లేదు. ఎందుకంటే అది చీదితే ఊడిపోయే ముక్కు అంటాం చూసారా? అటువంటి ముక్కు ఎన్నాళ్ళని పట్టుకు తిరుగుతాం? గట్టిగా గాలి వదిలితే, తుమ్మితే పడిపోతుంది. అందుకని పెద్దలేమన్నారంటే ఇది 'మార్జాల కిశోర న్యాయం కాదు. మర్కట కిశోర న్యాయం' అన్నారు. బ్రహ్మవిద్య ఎలా వుంటుందయ్యా అంటే కోతిపిల్ల కోతిని పట్టుకుంటే, కోతి ఈ చెట్టు నుంచి ఆ చెట్టుకు, ఆ చెట్టు నుంచి ఈ చెట్టుకు, కొమ్మ నుండి కొమ్మకి దూకుతూ వుంటుంది. పిల్ల ఏమైపోతుందో అనేది కోతికి వుండదు. పిల్ల పట్టుకున్నంతకాలం పట్టుకుంటుంది. పడిపోతే అదే నేర్చుకుంటుంది ఎలా ఎగరాలో? పట్టుకోవలసిన బాధ్యత కోతిపిల్లది! మార్జాల కిశోర న్యాయంలో ఇది పట్టుకొని అక్కడపెట్టి, ఇక్కడ దాచి, నానాగడ్డీ తింటుంది. దీనికీ, దానికీ అంత తేడా వుంటుంది. మాస్టరుగారు నాకు చెప్పిన విషయం మీకు చెప్తున్నాను. Belgium లో ఒకసారి నేను, ఆయన ఒక గృహస్థు ఇంట్లో వున్నపుడు జరిగింది. ఆ గృహస్థు ఒక homoeo doctor. ఆయనకో భార్య. వాళ్ళిద్దరూ నాకు

బాగా స్నేహితులు. ఈ దేశం వచ్చినపుడు మన ఇంట్లో వుండేవాళ్ళు. సరే వాళ్ళింట్లో మేమున్నాం. ఆవిడ గర్భం ధరించి వుంది. ఐదు నెలలు. ఇంకా నాలుగైదు నెలలైతే కానీ పిల్లో, పిల్లాడో పుట్టడు. ఈ లోపల ఇల్లు మార్చి వచ్చే పిల్లో, పిల్లవాడో వాడికోసం ఒక పెద్దగది వుండేట్టుగా ఇల్లు తీసుకుంది. వచ్చిన తర్వాత తీసుకుందాం అని మొగుడు చెప్తే వినలేదు. సరే ఇల్లు తీసుకున్న తర్వాత పిల్లలకు పేర్లు పెట్టడం కోసం అప్పుడే జాబితా తయారుచేసుకుంది. మన పెద్దలు చెప్పిందేమిటంటే పిల్లలు పుట్టాక పేరు తప్ప, పుట్టకముందు పేరు పెట్టకూడదు. ఆలోచించను కూడా ఆలోచించకూడదు. ఎందుకంటే అక్కడ అది వున్న తర్వాత కదా పేరు. సృష్టిలో ముందు ఒకటి ఏర్పడి, దానికి పేరు ఏర్పడిందే తప్ప, ముందు పేరు ఏర్పడి, తర్వాత ఏర్పడిందేమీ లేదు. అందుకనే సృష్టిలో లేనిదాన్ని ఒకదాన్ని చెప్పమని చెప్తూ వుంటాడు గురువు శిష్యుణ్ణి. చెప్పలేరు. ఎందుకని చెప్పలేరంటే, లేనిదంటూ ఒకటుంటే దానికి పేరు కూడా వుండదు. కాబట్టి ఎట్లా చెప్తాడు? 'నామాని కృత్వా అభివదన్ యదాస్తే' అని వస్తుంది పురుషసూక్తంలో! సృష్టించి పేర్లు పెట్టారు. నీవు కడుపులో వుండగానే పేరు పెట్టకూడదు అని మాస్టరుగారు నాతో ఓ మాటన్నారు. ఇన్ని పేర్లు పెడ్తోంది, ఆలోచిస్తోంది ఇప్పట్నుంచీ అని. ఏం చేసింది? దేశంలో వుండే రకరకాల పిల్లలాడుకొనే బొమ్మలన్నీ తెచ్చిపెట్టింది. వాళ్ళాయన బాగా సంపాదిస్తున్నాడు. ఈవిడకేమీ పనిలేదు. ఇహ ఆ పుట్టబోయే పిల్లవాడికి రకరకాల స్వెట్టర్లు అల్లడం ప్రారంభించింది. మాకా గది చూపించింది. ఆ గదినిండా ఒక పాతికమంది పిల్లలుంటే ఎన్ని సామాన్లుంటాయో అన్ని సామన్లు చేర్చింది. ఇంకా పిల్లాడు పుట్టలేదు. కొంచెం వెర్రిగా అనిపించింది. సరే ఆ గదిని చూసి వచ్చేసాం. మా గదిలో పడుకున్నపుడు మాస్టరుగారిని అడిగాను. 'మరీ ఇంత వెర్రిగా, ఇంత వ్యామోహంగా వుందేమిటి' అని. అంటే 'ఏం లేదోయ్ మనవాళ్ళు కూడా ఇప్పుడిలాగే తయారవుతున్నారు' అని చెప్పారు. 'ఇంత అన్యాయం కాదు కదా మాస్టరుగారూ' అంటే 'అసలు ఋషిప్రోక్తము, ఆర్యము అయిన మార్గము ఏదో తెలుసా?' అన్నారు. 'చెప్పండి' అన్నా. పిల్లవాడు పుట్టిన తర్వాత కూడా వాడి గురించి తండ్రి ఎక్కువ పట్టించుకోకూడదుట. పుట్టగానే శిర్ష్వోదయమైనపుడు తన చెయ్యి అతని శిరస్సు మీద వుంచి బయటికి తీస్తాడు. ఆ తర్వాత తల్లి చూసుకుంటుంది పిల్లవాడి గురించి. తను ఊరికే ఎత్తుకోవడం, మోయడం, చిచ్చీ అని బుగ్గలు గిల్లి, నిమిరి ముద్దులు పెటుకొని, ఈ రోజుల్లో తండ్రుల్ని చూస్తే నాకు ఆశ్చర్యమేస్తుంది. ఆర్యుల విధానం అదికాదు' అన్నారు. 'ఏం చేస్తారు మాస్టారూ ఆర్యులైతే' అంటే, 'పిల్లలు ఏడవ సంవత్సరం వరకు తల్లి దగ్గర పెరగాలి. తండ్రి తన దగ్గరికి వస్తే పలకరించొచ్చు, ప్రేమగా చూడచ్చు. వాడి దగ్గరికి వీడు పోవడం అనేది లేదు' అని చెప్పారు. 'వాడి దగ్గరికి వీడు పోయి, వాణ్ణి

ఎత్తుకొని, వాణ్ణి తిప్పి ఇదంతా తండ్రి యొక్క కర్తవ్యం కాదు. ఏడు సంవత్సరాల వరకు చక్కని పద్ధతుల్లో పిల్లవాడిని పోషించి, పెంచే బాధ్యత తల్లిది. వానికి కావలసిన వాటిని సమకూర్చడం తండ్రి యొక్క బాధ్యత. ఏడు సంవత్సరాల తర్వాత పుట్టిన వాళ్ళతో తండ్రికి కార్యక్రమాలు ప్రారంభం' అన్నారు. 'ఎందుకని' అని అడిగాను. అంటే 'వాడు బ్రతుకుతాడో, చస్తాడో ఎందుకు ఈ లోపల వీణ్ణి take up చేయాలి' అని వుంటారట ఆర్యులు. వచ్చినవాడు తన కొడుకు అనుకోడు తెలిసినవాడు. జీవుడు శరీరం ధరించాడు. మన ద్వారా ధరించాడు. ఏడేళ్ళ వరకు survival of the fittest అని, వుంటాడో, పోతాడో? బాలరిష్టాలని వుంటాయి. ఈ బాలారిష్టాల నుంచి నెగ్గుకు వచ్చాడా? అప్పటినుంచి వాడియందు తండ్రికి కర్తవ్యం వుంటుందట. అంతవరకు కర్తవ్యం వుండదట. అక్కడ నుండి ఏమిటి కర్తవ్యం? 7 వ సంవత్సరం నుండి 21 వ సంవత్సరం వరకు తనకు తెలిసినది వాడికి అందించాలి. 21 వ సంవత్సరం తర్వాత 'నీ దారిన నువ్వు చక్కగా జీవించు. నీకు సమస్తమైన అవగాహన విద్య వలన, నాయొక్క సాన్నిధ్యం వలన నీకు లభించింది. ఇంక ఇక్కడినుంచి నీ అంతట నీవు జీవించు' అని మళ్ళీ వాణ్ణి స్వతంత్రుడుగా వదిలేస్తాడు. ఇది ఆర్యుల యొక్క ధర్మం'. ఈ రోజున మనవాళ్ళు పుట్టిన దగ్గర్నుంచి ఆడవాళ్ళ కన్నా మగవాళ్ళే ఎక్కువ చేయడం ఒకటి. వాడికి కొడుకులు పుట్టి, వాడికి మనవళ్ళు పుట్టినా వీడు వాడిని వదలకపోవడం అనేది ఒకటి. పిల్లల్ని మనం వదులుతామా? వాళ్ళకి పెళ్ళిళ్ళు చేసినా, వాళ్ళ మనవళ్ళ క్కూడా మనమే ప్రణాళిక లిచ్చి వాళ్ళని పెంచి, వాళ్ళెట్లా చదువుకోవాలో చెప్పి, అంతదూరం మనం వెళ్ళిపోతున్నాం' అని చెప్పారు. చెప్తే, అపుడు నాకు కర్దముడి కథ గుర్తుకి వచ్చింది. కర్దమ ప్రజాపతికి కపిలుడు అనే మహానుభావుడు పుడ్తాడు. కర్దముని భార్య దేవహూతి. కర్దమ ప్రజాపతి పరిపూర్ణమైన జ్ఞాన స్వరూపుడు. దేవహూతి అంటే తను పిలిస్తే దేవతలు పలుకుతారు. అటువంటి మహాత్ములకి పుట్టిన పిల్లవాడికి 5వ సంవత్సరం రాగానే కర్దముడు 'నేనొచ్చిన పనైపోయింది. నేను వెళ్తున్నాను'. 'ఇదేంటయ్యా వెళ్ళిపోతున్నావు. నన్నేం చేసి పోతావు' అంటే 'వాడున్నాడు కదా' అంటాడు. వాడేమి చేయగలడంటే, 'వాడు అన్నీ చేయగలడు. నాకన్నా బాగా చేయగలడు. వాడు చూసుకుంటాడు నీసంగతి. నేనొచ్చిన పని అయిపోయింది' అని వెళ్ళిపోతాడు. కపిలుడికి ఏడేళ్ళ వచ్చిన తర్వాత కపిలుడి దగ్గర ఆవిడ జ్ఞానం పొందుతుంది. భాగవతంలో కథలు చదువుకుంటే చాలా తమాషాగా వుంటాయి. మనకి కథల్లో చూస్తే ఋషులు, స్త్రీలకి పిల్లల్నిచ్చి తాము వెళ్ళిపోయిన సన్నివేశాలు చాలా కనిపిస్తాయి. ఏమిటయ్యా అంటే అది బాధ్యతా రహితంగా జీవించడం కాదు. ధీమా! వాళ్ళన్నీ ఎరిగి జీవిస్తారు. మనకు ఈ రోజు ఆ ధీరత్వమే పోయింది. పోయి వీళ్ళను

పట్టుకొని వాళ్ళు వ్రేలాడుతూంటారు. వాళ్ళను పట్టుకొని వీళ్ళు వేలాడుతూ వుంటారు. ఇలా పిల్లికథ జరుగుతోంది. మనకు కోతికథ జరగాలి. కోతిపిల్ల పట్టుకున్నంతసేపే పట్టుకుని. తనుకూడా తన తల్లివలె ఎగరగలిగినంత వరకు ఎగరగలగడం తెలిసేసరికి అదే ఎగురుతూంటుంది ఈ చెట్టుమీంచి ఆ చెట్టు మీదికి, ఆ చెట్టుమీంచి ఈ చెట్టు మీదికి. కోతిపిల్లలు కోతితల్లి నుంచి పడిపోవడంటం వలన చచ్చిపోవడం అనే సందర్భాలేమీ లేవు, వుండవు. మనకనిపిస్తుంది అమ్మో చచ్చిపోతుందేమోనని. అది పడదు. దానికి ధైర్యం వచ్చినపుడు వదిలేస్తుంది. ఇది ప్రకృతిలో వుండే రహస్యం కాబట్టి ప్రకృతే అన్నీ నేర్పుకుంటుంది. కాబట్టి నీకు నిజంగా భగవంతుని యందు విశ్వాసం వున్నట్లైతే భగవంతుడే నేర్పుకుంటాడు కనుక అయ్యో నేర్పకపోతినే, వీళ్ళందరికీ ఏం తెలియకపోయెనే, తెలుసుకోలేకపోతే చాలా పాడై పోతారేమోనని అంటే నీవు చాల అహంకారివి, అని అర్థం. అంటే భగవంతునికి తెలియదా? తననుండి వ్యక్తమైన జీవులకి ఎప్పుడు ఏం నేర్పుకోవాలో? నీవు వాళ్ళ గురించి తాపత్రయపడకు. అక్కరలేదు. మరేం చెయ్యాలి? భగవంతుడు ఏ జీవులనైతే మళ్ళీ తిరోధానం అయ్యే మార్గంలో నడిపిస్తాడో, వాళ్ళందరినీ తెలిసినవాళ్ళ దగ్గరకి పంపిస్తూ వుంటాడు. ఈ పంపించిన వాళ్ళకి నీకు తెలిసినది చెప్ప. అంటే వాళ్ళంతట వాళ్ళు వస్తే నీవు చెప్పాలి తప్ప, నీ అంతట నీవు వాళ్ళ దగ్గరకి పోయి చెప్పకోవడం పెట్టుకోకూడదు. చూడండి ఏ స్థితి లోంచి ఏ స్థితికి జ్ఞానానికి సంబంధించిన కార్యక్రమాలు అవస్థితి చెందినాయో! నిజంగా తెలుసుకుందాం అనుకొనేవాడిని, ఎక్కడ తెలుస్తుందో అక్కడికి చేరుస్తుంది ప్రకృతి. మనకి ఏమిటో అందరికీ తెలియచెప్పాలి అనేది వ్యామోహం. తెలియచెప్పాలనుకోవడం వలన వీలుపడదు. పైగా నిరాశ, నిస్పృహ ఏర్పడుతుంది. కారణమేమిటంటే ఒకరోజు వస్తాడు, ఒకరోజు రాడు. పదిహేనుమందో, పాతికమందో వస్తోంటే, అమ్మో రోజు రోజుకీ పాతికమంది వస్తున్నారని సంతోషపడుతుంటే మర్నాడు ఐదుగురే రావచ్చు. అందుకని నీకు చెప్పాలనే భావన వుండకూడదు. వాడికి తెలుసుకోవాలనే భావన వుండాలి. నీవు భగవంతుని యందు నిలిచియుండాలి. ఇక్కడ తమంతట తాముగా వచ్చే వాళ్ళల్లో ఏం జరుగుతోంది? వాళ్ళ లోపలినుంచి వాళ్ళకి కలిగిన ప్రేరణే కారణం. అలా వచ్చినవాళ్ళు, వాళ్ళ ప్రేరణ బట్టి వాళ్ళు వుంటారు. అంతేకానీ నీవేదో పేద్ద నెత్తిన ఒకటి వేసుకొని, మనం ఏదో వెళ్ళి చేసేస్తున్నాం అనే మోహంలో పడే స్థితి ఆర్యులకి లేదు. నమ్మమని కూడా అడగరు. విషయం చెప్తాను నీకు నచ్చితే తీసుకో. లేకపోతే అవతల పారేయ్, అని చెప్తారు. అది వాళ్ళ ధైర్యం. అది వాళ్ళ 'ధీ:', బుద్ధిబలం! కాబట్టి అట్లా తెలుసుకొని వెనక్కి వస్తూ ఉండేవాళ్ళంతా 'వికర్త' లో భాగమే. అదేమిటండీ అలా వదిలేశారు మీ అబ్బాయిని అని అడిగితే, తండ్రి ఎట్లా వుంటాడంటే వాడు నా కొడుకు.

నా దగ్గరికి వస్తాడు ఏదో ఒక రోజున. అది తండ్రి ధైర్యం! అంతేకానీ, నా కొడుకు ఏమీ లాభం లేదండీ, అని చెప్పే తండ్రి తండ్రి కాదు. మాస్టర్ గారి దగ్గరికి ఒకాయన వచ్చి వాళ్ళిద్దరి పిల్లల గురించి భయంకరంగా చెప్తుంటే, 'అట్లా ఎక్కువగా చెప్పబోక. నీ గురించి చెప్పకున్నట్లుంది. ఎందుకంటే నీ నుంచి వచ్చినవాళ్ళే కదా వాళ్ళు. వాళ్ళ గురించి నీవు చెడుగా చెప్తున్నావంటే నీ గురించి చెప్పకున్నట్లే. నీ బట్టే వాళ్ళుంటారు. నీవు మరి ఇట్లా లేవా నీ తల్లితండ్రులతో' అని అడిగారు మాస్టరుగారు. ఉన్నాడు కాబట్టి, నీవెట్లా వున్నావో నీకు అటువంటిదే వస్తుంది. ఇంకో తల్లితండ్రులున్నారు నాకు తెలిసి. ఆ తండ్రి దగ్గరికి వెళ్ళి తల్లి చెప్పింది పిల్లలంత బాగా చదువు కుంటున్నట్లు లేదు అంటే 'వాళ్ళు నా కొడుకులు. నాకు తెలుసు వాళ్ళెట్లా వుంటారో' అని అన్నారు. నిజంగా నీవు గట్టివాడివైతే నీ కొడుకు గురించి నీవేమీ భయపడనక్కరలేదు. లోపల డొల్లయితే భయమే! భగవంతుడికి తెలుసు జీవులందరూ కూడా తననుంచి వచ్చిన వాళ్ళని. కాబట్టి తప్పకుండా ఏదో రోజు వస్తారు. వాళ్ళ వాళ్ళ అనుభవాలు, వాళ్ళు వాళ్ళు పొంది, అందులోంచి వస్తారు. మధ్యలో మిడిమిడి జ్ఞానం గాళ్ళు మనం ఏదో చేయాలని హడావిడి పడ్తుంటారు. మనం చేయడం ఏమిటి? ఏది ఎప్పుడు ఎలా జరగాలో ఆయనకు తెలుసు. తన ప్రకృతి నుంచి ఆ కార్యక్రమాన్ని నిర్వర్తిస్తూ వుంటాడు. ముందుకు వెళ్ళేవాళ్ళు ముందుకు వెళ్తూ వుంటారు. వెనక్కెళ్ళే వాళ్ళు వెనక్కొస్తూ వుంటారు. ఎవరు ముందుకెళ్ళాలి, ఎవరు వెనక్కెళ్ళాలి అని, వాళ్ళ వాళ్ళ అనుభూతులను బట్టి అది చక్కగా ఒక పద్ధతి ప్రకారం నిర్వర్తింపబడుతూ వుంటుంది. అందుకని ఓ ప్రక్క అయిపోతూ వుంటే, ఇంకోప్రక్క మొదలవుతూ వుంటుంది. ఎప్పుడూ అయిపోదు. అట్లా వుంటుంది. చూడండి ఈ భూమిమీద పగలు, రాత్రి చక్కని ఉదాహరణ మనకి. పగలు అయిపోతున్నట్లు, రాత్రి వస్తున్నట్లు వుంటుంది. కానీ భూగోళం మొత్తం తీసుకుంటే దానిమీద వెలుగు, చీకటి ఎప్పుడూ ఒకే పరిమాణంలో వుంటుంది. కొంతభాగం వెలుగు వస్తే, కొంతభాగం చీకటి వస్తుంది. వెలుగున్న భాగం, చీకటి వున్న భాగం భూమి తిరుగుతున్న లక్షలాది సంవత్సరాల నుండి కూడా అలాగే వుంది కదా! అంటే వెలుగులోకి కొంతమంది జీవులు వస్తూ వుంటే, చీకటిలోకి కొంతమంది జీవులు వెళ్తూ వుంటారుయి. కనుక వెలుగులో వున్న భాగం, చీకటిలో వున్న భాగం ఎప్పుడైనా మారిందా? ఈ భూమి మీద వెలుగు ఎక్కువ భాగం ఉండి, చీకటి తక్కువున్న భాగం వుందా? ఉండదు. అలా సృష్టిలో కూడా ఒక ప్రక్క నుంచి జీవులు తనలోకి ఉద్ధరింప బడుతుంటే, మరొకప్రక్క నుండి జీవులు తనలో నుండి అవతరింపచేస్తూ వుంటాడు. అట్లా జరుగుతూ వుంటుంది. సినిమాలో చూపిస్తూ వుంటారు. శ్రీకృష్ణుడు విశ్వరూపం చూపించినపుడు, కొందరు ఎడమప్రక్క నుంచి దిగివస్తూ వుంటే, కుడిప్రక్క నుండి కొందరు అందులోకి వెళ్ళిపోతూ

వుంటారు. ఈ దిగి వచ్చేవాళ్ళు, వెళ్ళిపోయే వాళ్ళు అట్లా constant గా ఒకే number వుండడం వల్ల మనం ఉన్నట్లుగా వుంటుంది. ఏమీ పోవు. మన శరీరంలో కూడా రోజూ అదే జరుగుతూ వుంటుంది. కొన్ని అణువులు చోట్లో కలిసిపోతూ వుంటే, కొన్ని అణువులు పుడ్తూ వుంటాయి. మధ్యలో మనం ఉన్నట్లుగా ఉంటాము. కొన్ని అణువులు కలిసిపోతూ ఉంటాయి. వికర్త! కొన్ని పుట్టుకు వస్తుంటాయి. ఈ రెంటి మధ్య వున్న నిష్పత్తి ఒకటిగా వుండడం వల్ల, మనం ఉన్నట్లుగా వుంటుంది. అంత చక్కగా దాన్ని organise చేసి work out చేస్తున్నారు. అందుకని ఋషులు 'ఈయన పెంచేవాడే కాదు మళ్ళీ తనలోకి పట్టుకుపోతుంటాడు' అని దర్శించారు. పౌర్ణమి, అమావాస్యలు మనకి తప్ప, అసలు చంద్రునికి వున్నాయా? చంద్రుడు తగ్గాడు, చంద్రుడు పెరిగాడంటాం కదా! మనకి relative. చంద్రుడు తగ్గనూ లేదు, పెరగనూ లేదు. ఎప్పుడూ అట్లాగే వున్నాడు కదా! కనుక ఈ హానివృద్ధులు అనేవి అలా వున్నట్లుగా గోచరిస్తాయి కానీ లేవు. ఇట్లా వెనక్కి తీసుకువెళ్తాడు కాబట్టి ప్రతిదీ వచ్చిందల్లా మళ్ళీ వెళ్ళిపోతుంది అని గుర్తు పెట్టుకోమంటాడు. Old Testament అని వాళ్ళూ పుస్తకంలో రాసుకున్నారు ఇంగ్లీషులో. It comes to pass, It came to pass అని. ఎందుకు వచ్చిందయ్యా అది అంటే వెళ్ళడానికే వచ్చిందట. ఏదైనా అంతే! మనకో సన్నివేశం వచ్చిందనుకోండి. వచ్చిందంటే వెళ్ళిందనే లెక్క! ఏదన్నా ఒకటి వస్తే అది ప్రవాహంలో భాగంగా వచ్చి వెళ్ళిపోతూ వుంటుంది. కష్టం వచ్చిందనుకోండి వెళ్ళిపోతుంది. సుఖం వచ్చిందనుకోండి వెళ్ళిపోతుంది. ఆరోగ్యం వచ్చిందనుకోండి వెళ్ళిపోతుంది. అస్వస్థత వచ్చిందనుకోండి వెళ్ళిపోతుంది. ఏదీ ఉండదు. ఎందుకని? తాను నిత్యమైనవాడు, సత్యమైనవాడు. తెరమీద పడే బొమ్మలన్నీ కూడా వెళ్ళేవే తప్ప అట్లా అతుక్కుపోయేవేమీ లేవు. వెండి తెరకు ఏవీ అంటుకోవు. మనం కూడా వెండితెర లాంటివాళ్ళం. అందుకని వచ్చినప్పుడల్లా ఉబ్బనక్కరలేదు. పోయినపుడల్లా కృంగనక్కరలేదు. వస్తూ వుంటాయి పోతూ వుంటాయి. ఇవన్నీ తరంగాల్లాగ వస్తూంటాయి అని తెలిసి, తాను వాటిని అనుభవించడమే తప్ప వాటిలో ఇరుక్కోకుండా జీవించడం తెలియాలంటే 'వికర్త' నామం తెలిసి వుండాలి. భగవంతుడు మనకేదన్నా ఇచ్చినపుడు ఆనందంగా వుంటుంది. పుచ్చుకు పోయినపుడు ఆనందం పోతుంది. శరీరం దగ్గర్నుండి, సంపద దగ్గర్నుండి, బంధు మిత్రాదులు, కుటుంబం దగ్గర్నుండి వచ్చిందల్లా ఆనందం మనకి. వచ్చినదల్లా వెళ్ళిపోతుందని గుర్తుపెట్టుకోండి. ఎలాగూ వెళ్ళిపోతుంది కదా దీన్ని మనం అనుభూతి చెందనక్కరలేదని అనుకోకూడదు. పిల్లలు వచ్చారనుకోండి మన దగ్గర వున్నంతకాలం వాళ్ళతో మనకి అనుభూతి. ఆ తరువాత వాళ్ళు ఎల్లకాలం మనతోనే వుంటారా? Khalil Gibran మంచి ఉపమానం ఇచ్చారు. 'నువ్వు

విల్లులాంటి వాడివి. నీ పిల్లలు సంధించిన బాణాల్లాంటి వాళ్ళు. నిన్ను ఆధారంగా వాళ్ళు ముందుకు వెళ్తారు' అని చెప్పాడాయన. విల్లునే అతుక్కొని వున్న బాణానికి విలువేముంది? ఎందుకా బాణాలు? ఇపుడు మన పిల్లలందరినీ అట్లాగే కదా తల్లితండ్రులు తయారుచేసుకుంటూ వుంటారు. వాడెక్కడికీ పోకూడదు. వదిలేస్తే అట్లా వాడు ముందుకెళ్ళటానికి మనం platform తప్ప ఇందులో కూరుకుపోవటం కాదు అని చెప్తాడు Khalil Gibran . Your children are not your children. They are the future and you are the present. నీవు ప్రస్తుతానివి. వాళ్ళు భవిష్యత్తు. దానికి తగినట్లుగా వాళ్ళు తయారై వస్తారు. ముందు కాలానికి సరిపోయేట్లుగా వాళ్ళు వస్తారు తప్ప పాతకాలానికి, ప్రస్తుత కాలానికి సరిపోయేట్లుగా రారు. అందుకని మన భావ పరంపరకి, వాళ్ళ భావ పరంపరకి తేడా వుంటుంది. అందుకని ఎవరొచ్చినా వాళ్ళందరూ వెళ్ళాలి. మనమొక్కళ్ళమే వచ్చాం గదండీ మనమొక్కళ్ళమే వెళ్ళాలి. మనతో బాటు కొంతమంది నడిచారండీ. తర్వాత కూడా నడవచ్చు. వారితో కలిసి వెళ్ళడం వుండవచ్చు. ఇందులో మళ్ళీ ఆత్మబంధువుల నుంటారు. వాళ్ళందరూ కలిసి నడుస్తుంటారు. దేహ బంధుత్వం వుండే వాళ్ళంతా వచ్చి వెళ్ళిపోతూ వుంటారు ఎక్కడికక్కడే రైలు ప్రయాణీకుల్లాగ దిగిపోతారు. అదే train లో మనతో పాటు ప్రయాణం చేసి, మనం వెళ్ళిన పనిమీదే వెళ్ళి, మళ్ళీ మనతో బాటే తిరిగి వచ్చేవాళ్ళు, ఇతర ప్రయాణీకులతో దిగివెళ్ళిపోరు కదా! మనతో వుంటారు. ఇట్లా కొంతమంది ఆత్మ బంధువులుగా వుంటారు. వాళ్ళందరూ కలిసి నడుస్తూ వుంటారు. ఆత్మ బంధువు level లో కూడా కొంచెం ముందు వెనుకలుగా వుంటాం. ఈ దారి ఎటువంటిదిరా అంటే ఏ జీవీ, ఇంకో జీవితో సమానంగా నడవటానికి వీలు వుండదట. ఒకడు ముందు వుంటాడు. ఒకడు తర్వాత వుంటాడు. బాగా దగ్గరగా వుండచ్చు. మిమ్మల్ని train ఎక్కించినపుడు కూడా ఒకే compartment లో కూర్చున్నపుడు కూడా అందరిదీ ఒకే seat కాదుగా. మీ seat లోంచి మీకు కనిపించినది వేరు, మీ ప్రక్క seat లో వాడికి కనిపించేది వేరు. అంటే angle తేడా కదా! అట్లా జీవులు కూడా నడుస్తూంటే ఒకడు ముందు, ఒకడు వెనక. అందుకనే రాముడు 'నీవు ముందు నడు. నీ వెనుక నేను నడుస్తాను. మధ్యలో అమ్మవార్ని నడిపిద్దాం' అని లక్ష్మణుడితో చెప్తాడు అడవిలో. భగవంతుడు అందరికన్నా వెనకాల వుండి అందరినీ నడిపిస్తాడన్న మాట! ఎందుకని? ముందు నడిచేవాళ్ళకి తను రక్షణగా వుంటాడు. ముందు నడిచేవాడికి వెనకాల చూసుకోవడానికంత వీలుండదు. ముందు నడుస్తూంటే, వెనకాల ఎలుగుబంటి పట్టుకుపోయిందనుకోండి. తెలీదు కదా! వెనకాల వుంటే ముందుండే వాళ్ళని చూడచ్చు. అందుకనే పశువుల కాపరి, గొర్రెల కాపరి మనకి ఆదర్శపురుషులయ్యారు. ఏం చేసారు వాళ్ళు? ఆవులు తోలేవాళ్ళు, గొర్రెలు తోలేవాళ్ళు ఆవులకి,

గొర్రెలకి వెనకాల వుంటారా? ముందుంటారా? అంటే నిజమైన నాయకుడు ఎవడయ్యా అంటే వెనకాల ఉండేవాడు. వెనకాల వుండి ముందు నడిపించేవాడు నాయకుడౌతాడు. ముందుండి నడుద్దామనుకొనే వాడు వెనక్కి తిరిగిచూస్తే ఎవ్వడూ వుండడు. అందుకని 'యుద్ధంలో నాయకుడికీ, జీవితంలో నాయకుడికీ తేడా వుంది' అని చెప్తాడు ఒక పరమగురువు. యుద్ధంలో నాయకుడు ముందు నడుస్తాడు. ఎందుకని? అది అక్కడ రక్షణ. తను ముందువెళ్ళి నడిపించాలే తప్ప మీరంతా వెళ్ళండి, తర్వాత నేనొస్తాను అనకూడదు యుద్ధంలో. జీవితంలో నాయకుడు వెనకాల వుండాలట. ఇద్దరూ correct! ఇవన్నీ ఎందుకు చెప్తున్నానంటే తిరుగు ప్రయాణమనేది ప్రతిదానికి వుంటుందండీ. దానికి సంసిద్ధత రావాలి. ఎప్పుడు రావాలి? మనిషికి 42 ఏళ్ళకి రావాలి. 84 ఏళ్ళు పూర్ణ ఆయుర్దాయం మనకిప్పుడు. కలియుగంలో ఇప్పుడున్న పరిస్థితిలో 84 ఏళ్ళు బ్రతికితే వాడు పూర్తిగా బ్రతికినట్టే. వాడు తక్కువ బ్రతికాడనటానికేమీ వీలులేదు. సహస్ర పూర్ణిమలు అప్పటికై పోతాయి. ఇంక అక్కడనుంచి వాడు వెళ్తాడని కాదు. 42 ఏళ్ళకే పెట్టె, బేడా సర్దుకొని తిరుగు ప్రయాణానికి రెడీగా వుండు అని చెప్తారు. అప్పుడే మవుతుందంటే బాధ వుండదు. గభాల్న బండి దింపేసారనుకోండి బాధుండదు. ఎందుకంటే 42 ఏళ్ళనుంచీ రెడీగా వున్నాం కదా! నేనెప్పుడో రెడీ మాస్టారూ, అన్నట్టుగా వుంటుంది. 42 ఏళ్ళ వరకు మానవ జీవితంలో మనం ముందుకు వెళ్ళాలి. 42 ఏళ్ళ నుంచి మళ్ళీ వెనక్కిరావడం మొదలుపెట్టు. 49 ఏళ్ళకి వెనక్కిరావడంలో పరిపూర్ణమైన అవగాహన ఏర్పరచుకో. అక్కడనుంచి ఒక్కొక్క అడుగు వేసుకుంటూ వచ్చేసెయ్. 60 ఏళ్ళకి పులిలా వుంటావు. ఇప్పుడు మనకి 70 ఏళ్ళైనా తెమలవు. ఏంట్రా అంటే ఇంకా పనుంది కాస్త ఆగు అంటాం. 42 ఏళ్ళు మనకు ఒక junction అని చెప్తారు పరమగురువులు. తరువాత 49 ఏళ్ళు. పోన్లే చెప్తూ వుంటాం కదా సార్ ఇంకా ఉండిపోయినాయి. ఇప్పుడు మీరు రమ్మంటే బాగుండదు. పోనీ 49 చేసుకోరా అప్పటికి ఏడేళ్ళు కనిపిస్తాయి కదా! ఆ బాగానే వుంది 49. అప్పటికి రెడీ అయిపోతానండీ, అంటాడు. 49 సంవత్సరాలకి వచ్చి ఏరా ఎట్లా వున్నావు, అంటే పెరుగుతుంది. ఏది? అంతకుముందు కన్నా పెరుగుతాయి. తమాషా. తగ్గుతుందేమోనని ఆయన వస్తాడు. 56 క్కూడా నీవు రెడీ కాదనుకో. వదిలేస్తాడట. అంటే వదిలేయడమంటే ఏమీలేదు. బలవంతంగా వదిలించడమనేది కాలమే చేస్తుంది. నీ అంతట నీవు వదిలేవా సుఖం! వాడిచేత వదిలించుకున్నావా? దుఃఖం కదా! యముడు ఒక్కొక్కటే కాలం రూపంలో వచ్చి వదిలిస్తూ వుంటాడు. అవి వదిలిస్తూ వుంటే బాధగా వుంటుంది. అందుకే 42 ఏళ్ళనుంచి శరీరానికి సుఖాలన్నీ కూడా నెమ్మదిగా తగ్గించుకుంటూ రా, అని చెప్తుంది ఆయుర్వేదం. ఎందుకంటే

రోగాలు వచ్చిన తర్వాత వైద్యులు మాన్పిస్తారు., మీరు నేలమీద పడుకుంటే మంచిదండీ, అంటారు. ఏం అంటే వీడికి నడ్డినొప్పి, మెడ దగ్గర నొప్పి cervical. నేలమీద పడుకో. లేకపోతే హాయిగా బల్లమీద పడుకో, అని చెప్తాడు. వాడిదేం పోయింది? 42 ఏళ్ళకే బల్లమీద పడుకోవడం, నేలమీద పడుకోవడం మొదలుపెట్టావనుకో, ఒకళ్ళ చేత చెప్పించుకోనక్కర లేదు. వైద్యుడు చెప్తాడు ఒక పూట తిను చాలు ఇంక, అని. ఎందుకు ఒకళ్ళ చేత చెప్పించుకోవడమనే దరిద్రం? నువ్వే ఒక పూట తింటే బాగుంటుంది 42 ఏళ్ళ నుండి, అని ఆయుర్వేదం చెప్తుంది. మనకి తెమలక తింటూ వుంటాం. అదేమవుతుందంటే ఒక రోగం కింద వచ్చి మానిపిస్తుంది. ఎవరిచేతన్నా చెప్పించుకునే దుస్థితికి రాకుండా మనకి పద్ధతి ఇచ్చారు. అందుకని 49 final అక్కడికింక చాలించుకోవాలి. చాలించుకోకపోతే ఇంక last chance and last warning అంటారు చూడండి అది 56. ఇహ అక్కడికీ తెమలకపోతే ఇహ వాడికి జన్మకి తెమలదని అర్థం. 56 కి ముళ్ళు విప్పుకోలేని వాడు ఇహ ఆ జన్మకి ముళ్ళు విప్పుకోలేడు. Next time better luck. 'వికర్త' లో భాగం ఇవన్నీ! దీనికేమంటే వచ్చినవన్నీ వెళ్తాయి. మనం వచ్చినపుడు ఎలా వచ్చాం? వెళ్ళేటప్పుడు అలా వెళ్ళాలి. వచ్చేటప్పుడు ఒక్కడే వచ్చాడు. దారిలో పోగైనాయి. వెళ్ళేటప్పుడు ఒక్కడే వెళ్ళేందుకు సిద్ధంగా వుండాలి. 49 నుండి 56 దాకా జిగురు సాగుతుంది. పోనీ 49 నుండి మొదలు పెట్టామనుకోండి 56, 63. అసలు ఆ జిగురు ఎప్పటికీ వదల్లేదనుకోండి బాధలు చూడండి. ఎంత మంచి విషయాలు చెప్పారో పెద్దలు! మనమంతా సుఖంగా వుండాలని చెప్పారు గానీ కష్టపడాలని చెప్పలేదు. నీ ఊరు వచ్చింది దిగిపోరా అంటే, బండిలో వాడెవడో నాకు friend అయ్యాడండీ, వాడితో వెళ్ళాలండీ, అంటే ఎట్లా? నువ్వు దిగవలసినది బెజవాడ, వాడు దిగాల్సింది నెల్లూరు. వాడితో నెల్లూరు వరకు వెళ్తావా? వాడు అక్కడ దిగి tata చెప్తాడు. అప్పుడు నువ్వేం చేస్తావ్? మళ్ళీ ఇంకో బండి పట్టుకొని వెనక్కి రావాలి. నువ్వెక్కినప్పుడు వాడు నీకు తెలీదు. వాడికో programme వుంది. నీకో programme వుంది. ఎవడి programme మీద వాడుండీ, train లో కలిసినట్లే కలుస్తాం మనం. ఇలా చెప్పకుంటే ఏమిటీ ఈయన అన్యాయం చేసేస్తున్నాడనిపిస్తుంది. కానీ సత్యం అదే. మంచి పద్యమున్నది. 'కలలం బోలెడు పుత్ర మిత్ర వనితాగారాది సంయోగముల్ జలవాంఛారతి ఎండమావులకు నాసల్ జేయు చందంబులన్ తలచున్ సత్యములంచు మూఢుఢ వృధా తత్వజ్ఞుడన్'[1] అంటాడు అక్రూరుడు. కలలో కలిసామనుకోండి ఎవర్నైనా? కలలోంచి బయటకు రాగానే వాళ్ళేరి? కలలో మనం వున్నప్పుడు, కలలో వాళ్ళు సత్యం. కల అయిపోయిన తర్వాత, మెలకువ వచ్చిన తర్వాత వాళ్ళు సత్యమా? కాదు. అట్లాగే మనకుండే సంబంధాలన్నీ కూడా

మేలుకున్నప్పుడు సత్యము. నిద్ర పోతున్నప్పుడు? వీళ్ళంతా నిద్రలో వుంటారా? లేదే? ఏమైంది నీకు? నిద్రలో వాళ్ళంతా లేకపోయినా నీవున్నావు కదా! అలా ఇదంతా ఒక పెద్ద ప్రవాహం. కలిసినపుడు కలుస్తూంటారు. విడిపోయినపుడు విడిపోతూంటాం. ఎవరిని ఎప్పుడు కలుపుతూంటాడో, ఎవరిని ఎప్పుడు విడదీస్తూంటాడో ఎవరికీ తెలీదంటాడు భీష్ముడంతటి వాడు. 'వాయువశంబులై ఎగసి వారి ధరంబులు మింటను పాయుచున్ పూడుచునుండు భంగి, కాలమొక్కతరి చరింపదు కాలము విచిత్రము, దుస్తరము ఎట్టి వారికిన్' అంటాడు. ఈ ఆకాశంలో మేఘాలు గాలి కారణంగా కలుస్తూంటాయి, విడిపోతూంటాయి. ఎందుకు కలుస్తూంటాయో, విడిపోతూంటాయో ఎవరికీ తెలీడం లేదుట. అలాగ కలుస్తూ, విడిపోతూ వుంటారు జీవులు. ఎప్పుడు కలుపుతాడు, ఎప్పుడు విడగొడతాడు తెలీదు కదా మనకి. మనం ఏదో చాలా పెట్టుకుంటాం. అన్నీ waste అంటాడు భీష్ముడు. మనకి ఎక్కడెక్కడ బిగురుందో, అదంతా ముందు నుండే వదిలించుకోకూడదు. ముందు పట్టుకోవాలి. అలాగని చిన్నప్పటి నుండే నూనె పూసుకొని కూర్చోకూడదు. 40 సంవత్సరాల వరకూ పూసుకోవాలి. 40 సంవత్సరాల నుండి పూసుకున్న నూనెకి పిండి రాసి, తలంటు పోసుకోవాలి. నెమ్మదిగా వదిలించుకోవాలి. అదీ కార్యక్రమం. ఈ పూసుకోవడం ఎందుకు? వదిలించుకోవడం ఎందుకు? అంటే అదే ఆటన్నాడు. అది క్రీడారంగం. దిగరా, ఆడితే బావుంటుందంటాడు. ఆటలోకి దిగితే పోట్లాట వుండవచ్చు. పోట్లాడితే పోట్లాడావు. అసలు ఆటంటే నేర్చుకో, అంటాడు. బాగా ఆట నేర్చుకున్నవాడికి ఆట అనుభూతి నిస్తుంది. ఆట అయిన తర్వాత మళ్ళీ క్రీడారంగం నుండి వెనక్కిరావడం కూడా తెలుస్తుంది. ఏ పరిస్థితి నుండి ఎప్పుడు వెనక్కి రావాలో తెలిసిన వాడుంటాడే, వాడే జ్ఞాని. వెళ్ళడం అంటే అదే మాలోకంగా వెళ్ళడం కాదు. అలా అని వెళ్ళకపోవడం కాదు. అసలు వెళ్ళనివాడికి జీవితం యొక్క అనుభూతి లేదు. వెళ్ళి ఇరుక్కుపోయిన వాడికి అనుభూతి లేదు. వెళ్ళాలీ, రావాలీ! ఇదీ వాడు పెట్టిన కార్యక్రమం. అది చూపించడానికి వస్తూంటాడు. చిన్నప్పటి నుండే అన్నీ నేర్పిస్తూంటాం. అమ్మ, నాన్న, అమ్మమ్మ, తాతయ్య ఇలా అన్నీ నేర్పి, 49 సంవత్సరాలు వచ్చేసరికి ఇవన్నీ ఏమీలేవు మర్చిపో, అని చెప్తారు. ఈ నేర్చుకున్నదంతా మళ్ళీ మర్చిపోవడం జరగాలి. జరిగితే తనకు తానుగా మిగులుతాడు. ఇలా వుంటుందా కార్యక్రమం.

395 గహనః

అంతు చిక్కనివాడు అని అర్ధం. అవగాహన కానివాడు అని అర్ధం. తెలియనివాడు అని అర్ధం. తెలుసుకోలేని వాడు, మనచేత తెలుసుకోబడని వాడు. ఎంత తెలుసుకున్నా పూర్తిగా తెలియడమనేది భగవంతుణ్ణి గురించి వుండదు. ఎందుకంటే 'The part can never comprehend the whole'. మొత్తంలో మనం భాగం. మొత్తంలోకి భాగం ఇమిడిపోవడం వుంటుంది తప్ప, మొత్తం గురించి పూర్తిగా తెలుసుకోవడం వుండదు. దైవం యొక్క తత్త్వం ఎప్పుడూ ఏదో తెలియనిది వుంటూనే వుంటుంది. అది కాలము, దేశము రూపంలో అవతరించినపుడే మనకి తెలుస్తుంది. ఆ కాలం మడతలలో వుండి, మనకి అదృశ్యంగా వుండి, అప్పటికప్పుడు sudden గా అందిస్తుంది. నీకు ఉద్యోగం వచ్చిందంటుంది. నిన్నటి వరకు ఉద్యోగం కోసం గిలగిల లాడుతూంటావు. రేపు ఉద్యోగం వస్తుందని మనకివాళ తెలీదు కదా కాగితం చేతికి వచ్చేవరకు. అలాగే ఎవరో పోయారనే వార్త కూడా ఇవ్వచ్చు. అదేంటండీ, ప్రొద్దున్న చూసానూ అంటాడు. ప్రొద్దున్న చూసాడు. ఇప్పుడు లేడని చెప్తుంది కాలం. కాలం అప్పటికప్పుడు అందిస్తూంటుంది. ఇప్పుడు లేడయ్యా. ప్రొద్దున్న వున్నాడు కదా అంటే ప్రొద్దుట నేను ఆయనతో ఇడ్లీ తిన్నానంటాడు. అసలు ఆ మాటకి అర్ధం వున్నదీ? ప్రొద్దుట లేడని చెప్పడం లేదు కదా! ఇప్పుడు లేడని కదా చెప్తూంటా. అలా ఆశ్చర్యపడి మాట్లాడుకుంటూంటాం. అట్లా అంతుబట్టడు ఎవ్వరికీ. పూర్తిగా నాకు తెలిసిందీ అనుకొనేవాడు ఎవ్వరూ లేరు. అట్లా అనడానికి కూడా వీల్లేదు. 'ఎందుకిట్లా రభస పెడ్తావు? అసలు యుద్ధం అవుతుందా, లేదా' చెప్పమని అడుగుతాడు అర్జునుడు. పాండవుల అజ్ఞాతవాసం అయిపోయింది. సంజయుడొచ్చాడు రాయబారానికి. అదేం బావులేదు. తర్వాత ఇంకొకడు వచ్చాడు. అదీ బావులేదు. తర్వాత కృష్ణుడ్ని, 'నువ్వెళ్తే బావుంటుందేమో' అన్నాడు ధర్మరాజు. అంటుంటే, అర్జునుడు అంటాడు 'నీకన్నీ తెలుసు కదా! నిజంగా సంధి అవుతుందా? అవని సంధికి నువ్వెళ్ళడ మెందుకు?' అంటే 'అది అప్పుడు, అక్కడ నిర్ణయం అవుతుంది తప్ప, ముందు నిర్ణయమయ్యే విషయం కాదు' అంటాడు కృష్ణుడంతటివాడు. 'కాలం అనంతుడు అంటారు కదా! ఆ కాలం మడతల్లో ఏం వుంటుందనేది ముందు ఊహించి తెలుసుకొనేది కాదు. వచ్చినప్పుడు ఎట్లా ప్రవర్తించాలనేది ఒక్కటే యోగం తప్ప, ముందు తెలుసుకోవడం యోగం కాదు. నేను ఇప్పుడు, ఇక్కడ మీతో ప్రస్తుతంలో వున్నాను. మీరేం చెప్తారో నాకు చెప్పండి. అక్కడ, అప్పుడు ఏం చెయ్యాలనేది అక్కడ వాళ్ళని బట్టి వుంటుంది తప్ప, ముందే లిఖించినట్లుగా పెట్టుకోబోక. నేనట్లా భవిష్యత్తులో జీవించను. ప్రస్తుతంలోనే

జీవిస్తూంటాను' అని చెప్తాడు. యాదవులందరిని కృష్ణుడు picnic కి beach కి బయల్దేర తీస్తాడు. అక్కడ తిన్నంత తిన్నాక అందరూ కొట్టుకు చచ్చిపోతారు. ఎంత ఆనందంగా వెళ్ళి వుంటారు యాదవులంతా? ఉహించలేనంత. పైగా ఎవరితో వెళ్తున్నారు? బలరామ కృష్ణులతో! ఎంతో ఆనందంగా వెళ్ళి, మొత్తం total tragedy. ఎవ్వరూ లేరు. అందరూ పోతారు. ఆయన, బలరాముడు మిగిలారు. ఇంటికి తల్లిదండ్రులకి వెళ్ళిపోతున్నానని చెప్పడానికి వస్తాడు. అప్పుడు రుక్మిణీదేవి అడుగుతుంది 'ప్రాద్దుట బయల్దేరినపుడు మీకివన్నీ తెలియదా' అని. అంటే ఆయన 'ఇప్పుడా విషయం అప్రస్తుతం. అప్పుడు నాకు తెలుసు, అప్పుడు నాకు తెలియదు ఈ రెంటి వలన నీకొచ్చేదేం లేదు. ఇప్పుడేం చేయాలో చూడు' అంటాడు. ఎప్పుడూ తనకి తెలుసు అని చెప్పలేదు. 'భవిష్యత్ వాణి' అని పిచ్చివేషాలు వేసినట్లు కృష్ణుడి చరిత్రలో లేదు. అంతకన్నా మనకి పరిపూర్ణ అవతారం లేదు. రాముడు భవిష్యత్ వాణి చెప్పలేదు, కృష్ణుడూ భవిష్యత్ వాణి చెప్పలేదు. మన యోగంలో కూడా ఎప్పుడు, ఎక్కడ మనం ఎలా వుండాలో అని మాత్రమే చెప్పారు. యుద్ధం వస్తుందని తెలిసే సంధి కెందుకెళ్ళారండీ? అని ప్రశ్న వేయవచ్చు. మనం చాలారకాల interpretations ఇవ్వచ్చు. ఆయన దేవుడు కాబట్టి ఆయనకి మనం support ఇవ్వచ్చు. ప్రతివాళ్ళూ వాళ్ళ దేవుణ్ణి, వాళ్ళ గురువుని వాళ్ళు support చెయ్యడానికి ప్రయత్నిస్తారు. అక్కర్లేదు. ఉన్నది వున్నట్లుగా ఒప్పుకుంటే చాలు. కృష్ణుడిదే చెప్తాడు అర్జునుడికి, అప్పుడు అక్కడ ఏం జరుగుతుందో ఇప్పుడేం నిర్ణయం లేదు. అక్కడ బట్టి. అక్కడ భీష్ముడు, ద్రోణుడు వాళ్ళ మాట నెగ్గిందనుకోండి, యుద్ధం లేదు. నెగ్గలేదనుకోండి, ఇంతకాలం నెగ్గలేదు. ఇప్పుడూ నెగ్గకపోవచ్చు. అయినా మన ప్రయత్నం మనం చెయ్యాలి. మహాత్ములకే అంతుపట్టని విషయాలు మాకేవో తెలుసని చెప్పేవాళ్ళని చూసి నవ్వుకోవాలి తప్ప, వాళ్ళని మనం పెద్దగా లెక్కలోకి తీసుకోనక్కర లేదు. రాముడి, కృష్ణుడి జీవితాలలో ముందు ఇలాగ జరగబోతుంది. అని చెప్పింది లేదు. జరుగుతున్న దానిలో మనం ఎట్లా ప్రవర్తించాలన్నదే వున్నది. అదే యోగం!. ధర్మాన్ని బట్టి ఎవరికి ఏ విధంగా వృద్ధి వుంటుందీ, హాని వుంటుందీ మాత్రం చెప్తారు. ఈ మాత్రం విషయం నువ్వైనా, నేనైనా చెప్పవచ్చు కదా! ధర్మాన్ని అనుసరిస్తున్నాడు అంటే వీడికి వృద్ధి వుంటుంది, అనుసరించని వాడికి హాని వుంటుంది అని కదా! ఎంతసేపూ ధర్మాన్ని చూడడం, ధర్మంలో ఉండడం మాత్రమే వుంటుంది. ఆ ధర్మం కూడా పూర్తిగా తెలియదు. ధర్మరాజంతటి వాడు అప్పుడప్పుడు బాధపడ్డ విషయాలున్నాయి. ఎందుకు చెప్తున్నానంటే 'గహనుడు' అంటే పూర్తిగా తెలియనివాడు. నిగూఢుడు. లోతు తెలియనివాడు. అంతు చిక్కనివాడు. నిర్వచించడానికి అందనివాడు. భగవంతుడని నువ్వనుకున్న రూపం నీకు సత్యం

అంతే! వాడికి ఈ రూపం అని లేదు. అన్ని రూపాలలోనూ వున్నాడు. రూపానికి అతీతంగానూ వున్నాడు. నువ్వు ఏ రూపం అనుకుంటే ఆ రూపంలో నీకోసం అందడానికి కరుణించి వున్నాడు తప్ప, అదే రూపం అనుకోకూడదు. రూపాయి బిళ్ళ రూపాయా? రూపాయి కాగితం రూపాయా? బిళ్ళే చూసినవాడు, రూపాయి బిళ్ళే అంటాడు. అదే కాగితం చూసినవాడు, రూపాయి కాగితమే అంటాడు. ఈ ఇద్దరూ ఎంత తెలివైనవాళ్ళు? అలాగే మనుషులు కూడా ఒక్కొక్కళ్ళు ఒక్కో రూపం నమ్ముకొని, ఈ రూపంలో కూడా వున్నాడనుకోండి తప్పలేదు కానీ ఈ రూపమే అనుకుంటే దెబ్బ తింటాడు. రూపానికి, నామానికి, కాలానికి, దేశానికి అందనటువంటి వాడి గురించి ఎంత చెప్పకున్నా అవదు గనక, నైమిశారణ్యంలో ఆ సూతుడు ఇంకా అలా చెప్పకుంటూనే వున్నాడుటండీ శౌనకాది మునులకి. వాళ్ళు కళ్ళప్పగించి వింటునే వున్నారట. రెప్ప కూడ వేయరుట. వీళ్ళు నైమిషులే అయినా చెప్పే విషయం అలాంటిది కాబట్టి రెప్పలార్పితే ఏమన్నా అందదేమోనని అంత అప్రమత్తతతో వింటున్నారట. ఎంత వింటున్నా అవడం లేదు. అవదు. అందుకే సూతుడు ముందే చెప్తాడు 'ఇదేదో అయిపోతుందని చెప్పడం లేదు. నాకు తెలిసినంత చెప్తాను' అంటూ చెప్తూంటే, అప్పటికీ ఇప్పటికీ ఇంకా అవలేదుట. ఆయన ఒకటి చెప్తాడు 'భగవత్తత్త్వం గురించి చెప్పడం అంటే ఆకాశంలోకి ఎగరడం లాంటిది. దానికి అంతేమీ లేదు కదా! అలాగే భగవత్తత్త్వానికీ అంతం లేదు' అని చెప్తాడు. అదే 'గహనం'! అలాగే 32 అక్షరాల ఛందస్సుతో కూడిన శ్లోకం అని కూడా గహనానికి అర్థం వున్నది. విష్ణు సహస్రనామంలో మీరు లెక్కపెడితే ప్రతి శ్లోకం 32 అక్షరాలు. అసలు అర్థం ఏమిటంటే, ఆ పూర్తిగా తెలియనివాడిని ఈ ఛందస్సుతో కూడుతున్నాం. కొంత తెలుస్తాడు, కొంత తెలియడు. అంతా ఎప్పటికీ, ఎవరికీ తెలియలేదు. తెలుసు అనుకుంటే పడిపోతారు. అందుకే భాగవతంలో తెలిసినవాళ్ళు, 'తమకి ఏమీ తెలియలేదని తెల్సింది' అని చెప్తారు. 'తెలియలేదు అని తెలియడమే తెలియడం' అంటారు. ఏమీ తెలియకుండానే అంతా తెలుసు అనుకునే తత్త్వం నుండి, చాలా తెలిసి అంతా తెలియలేదు అనువకోవడం ఎంత మంచి విషయం? నారదుడంతటి వాడు ఎప్పుడూ అణిగే వుంటాడు. గురువుగారు ఏ route లో వస్తాడో తెలియదు. జరిగినప్పుడు ఎప్పుడూ ఆ సన్నివేశం ఊహాతీతం గానే వుంటుంది. అద్భుతంగానూ, అతీతంగానూ వుంటుంది. ఋషులందరూ కలిసి 'పురాణ పురుషుడు దిగివస్తున్నాడు. మనం ఆయన్ని కాపాడుకోవాలి' అనుకుంటారు. ఎందుకని? కంసుడు పుట్టగానే చంపేస్తాడు కనక మనం దేవుణ్ణి కాపాడుకోవాలని మహర్షు లేడుగురూ చాలా పెద్ద ప్రణాళిక వేస్తారు. కంసుడి చెరసాలలో వుండే వారందరికీ లంచాలిచ్చి, మచ్చిక చేసుకుంటారు. ఈయన పుట్టగానే జైలు తాళాలు వాళ్ళు తెరిస్తే, వసుదేవుడు

బయటకు వస్తే, పడవెక్కించేసి అక్కడ నందుడి దగ్గరకి తీసుకెళ్ళడానికి పడవలో బ్రహ్మ మానసపుత్రులలో ఒకరైన సనత్సుజాతుడనే మహాత్ముడు కూర్చుని వుంటాడు. భగవంతుణ్ణి, పసివాడుగా వుంటాడు గదా అని తప్పిద్దామని. వసుదేవుడికి, చేసిన arrangements గురించి చెప్తారు. నందగోపుడు కూడ ఆ పని మీదే వుంటాడు. వసుదేవుడు వీళ్ళు చెప్పింది విని నవ్వుతాడు. ఏమిటి ఆయన్ని మనం రక్షించడం ఏమిటంటాడు. మనల్ని రక్షించేవాడు ఆయన కదా అంటే, అయినా మన ప్రయత్నం మనం చేయాలి కదా, అంటారు. తీరా అష్టమినాడు పుడతాడనగా, సప్తమి నాటికి కంసుడికి జైల్లో అందరినీ కొందరు కొనేసారని వార్త తెలుస్తుంది. అందుకని సాయంత్రానికి సాయంత్రం అందర్నీ మార్చేస్తాడు కాపలాదార్లనీ, రక్షణాధికారినీ కూడా! ఏమైందపుడు? వసుదేవుడంటాడు ఇదే మనకి తెలియనిది. మనకి తెలిసిందేమంటే భగవంతుడు దిగివస్తున్నాడని. ఎక్కడ పుడుతున్నాడో తెలియడం సామన్య విషయమా? ఇప్పుడు కూడ ఎక్కడ పుడతాడో అని ఎవరైనా claim చేస్తే, అవునేమో అని అటు పరుగెడ్తున్నారంతా. నేనంటే నేనని పదిమంది కల్కి భగవాన్ లు తయారయ్యారు. ఇంకా ఇంకో పదిమంది వస్తారు. ఎవరో తెలియదు. అలాంటిది కొంతమందికి నిర్దిష్టంగా భగవంతుడు ఎక్కడ పుడతాడో తెలియడం సామాన్య విషయమా? నందగోపుడంటే ఆనందస్వరూపమే రూపం కట్టుకొని వచ్చింది. ఆనందాన్నెప్పుడూ రహస్యంగా అనుభూతి చెందేవాడు నందగోపుడు. కనుక ఆయన కూడా ఈ ప్రణాళికలో భాగం అవుతాడు. పడవలో వున్న సనత్సుజాతుడికి delivery time చెప్తారు. అక్కడ కూర్చుంటాడు. సరిగ్గా అర్ధరాత్రయ్యేసరికి మాంఛి నిద్ర వచ్చేస్తుంది. వర్షం పడేసరికి కట్టినతాడు ఊడిపోయి పడవలో ఈయన కొట్టుకుపోతాడు. కనుక వీళ్ళు వేసుకున్న plan ఒకటి, జరిగింది ఇంకొకటి. ఆయన దిగివచ్చి, ఆయనంతట ఆయనే వసుదేవుణ్ణి, ఈ పరిసరాల స్ఫూర్తిలేని స్థితిలోనికి ఉద్ధరిస్తాడు. మామూలుగా తలుపుందని తెలిస్తే, మనం ముందుకి వెళ్ళలేం. కానీ అక్కడ తలుపుందని గానీ, తాళం వుందని గానీ, అది నదని గానీ, పొంగుతోందని గానీ, వర్షమని గానీ ఏ భావమూ లేదు. ఎలా వెళ్ళాడో తెలీదు. ఎలా అక్కడ పెట్టాడో తెలీదు. అంతా కలలాగ జరిగిపోతుంది. అన్నీ తెలిసిన హిమాలయాల్లోని ఋషుల దగ్గర్నుండి, శంబళ గ్రామంలోని సనత్కుమారుని దగ్గర్నుండి, కలాప గుహలలోని మరువు, దేవాపి మహర్షుల దగ్గర్నుండి, శ్రావస్తి గుహలలోని మైత్రేయుడి దగ్గర్నుండి అందరూ ఈ విధంగా ఒక పద్ధతిగా మానవ ప్రయత్నంగా చేస్తే ఏం జరిగింది? ఎప్పుడు, ఎక్కడ అవతార పురుషుడు పుడతాడనేది ఎవ్వరికీ తెలియదు. తెలిసినా వాళ్ళకీ పూర్తి details తెలీవు. ఏదీ పూర్తిగా తెలీదండి. తెలిస్తే ఏముందండీ? జాతకాలు చూపించి డబ్బులిచ్చే వాళ్ళు, నాడీ గ్రంధాలు చూపించి డబ్బులిచ్చే వాళ్ళు,

చేతులు చూపించి డబ్బులిచ్చే వాళ్ళూ. భగవంతుడి comedy movie లో భాగం ఇది. ఏదో కొంత చెప్పగలడు గానీ details చెప్పలేడు. కొంత అవగాహన ఇవ్వచ్చు. అదే 'గహనుడు'! పూర్తిగా తెలియదబ్బాయ్ అని. పూర్తిగా తెలిసిపోతే ఇంక జీవించడానికేం interest వుంటుంది. ఈ రాత్రి ఇలా వుంటుంది. ఇలా తింటావ్. రేపు ఇది తింటావ్. ఇలా వుంటావ్. రేపు వాళ్ళు వస్తారు, వెళ్తారు. ఇలా 10 సంవత్సరాల కార్యక్రమం తెలిసిపోయిందనుకోండి. ఏమి interest వుంటుంది? అందుకే తెలియకుండా వుంచిన వాడికి 'గహనుడు' అని పేరు. కృష్ణుడి గురించి, రాముడి గురించి ఎవరికి పూర్తిగా తెలుసు? అసలు మన ఎదుటివాడి గురించి మనకి పూర్తిగా తెలుసా? తనకి తెలిసినంత మేరా తనకి తెలుసు తప్ప, ఎదుటివాడి గురించి పూర్తిగా ఏమీ తెలీదు కదా! ఎంత సన్నిహితంగా వున్నా తెలీదు. అదీ తమాషా! ఎందుకంటే ఎదుటివాడిలో నువ్వేదైతే చూడదల్చుకున్నావో, అదే నువ్వు చూస్తావు. మిగతావి చూడవు కదా! అందుకే ఏమన్నారంటే ఎవరి గురించి కూడా నీకెప్పుడూ పరిపూర్ణంగా తెలియదు కాబట్టి, వాళ్ళ గురించి ఇదీ అని నిర్ణయం చేయక! అదే ఏసుక్రీస్తు చెప్పిన 'Judge not'. నువ్వు నిర్ణయం చేయబోక. ఎందుకంటే అది నీకు వాడిపట్ల వున్న అవగాహన తప్ప, వాడు మొత్తం కాదు కదా! అందుకే రాముడు, విభీషణుడి గురించి అడిగితే ఎవరి అభిప్రాయం వాళ్ళు చెప్పారు తప్ప, అసలు విభీషణుడి గురించి ఎవరికి తెలుసు? స్నేహం చేయాలా? వద్దా? అతడేమో పెళ్ళాన్ని, పిల్లల్ని, పదవిని వదిలి సముద్రం దాటి వచ్చాడు ఇద్దరు సేవకులను వెంటబెట్టుకొని. ఏంటయ్యా అంటే నిన్ను శరణు కోరడానికి వచ్చానంటాడు. అందుకోవాలా? అందుకోకూడదా? రాక్షస మాయా? ఈ రోజు మనకి కథ తెలుసు కనక మనకి సులభంగా వుంటుంది. ఆ రోజున? చూడబోతే రావణాసురుడు పద్నాలుగు లోకాలకీ భయంకరంగా తయారయ్యాడు. అతడి తమ్ముడు ఇతగాడు. వచ్చాడు. రాక్షసులు పన్నే మాయల్లో భాగమా ఇది, అని ఒకడు, అన్నయ్యని సంహరించడానికి మనతో చేరడానికి వచ్చాడు. వీణ్ణి నమ్మడం ఎలా, అని సుగ్రీవుడు అంటారు. అంటే రాముడు నవ్వుతాడు. సుగ్రీవుడు చేసిందేమిటి మరి! జాంబవంతు డంటాడూ, ఇప్పుడు రావడమేమిటి? సీతను తీసుకు వెళ్ళి చాల్రోజులైంది కదా! అప్పుడు అతడికి అధర్మం అనిపించలేదా? మనం తీరా సముద్రతీరానికి వచ్చి, వారధి కట్టుకెళ్ళే సమయానికి ఇతడికి అనిపించిందా? ఇతడుగానీ అవకాశవాది కాదు కదా, అంటాడు. జాంబవంతుడి కున్న తెలివితేటలు మనకి లేవు. సకల విద్యలనూ నూరి పోసినవాడు. సుగ్రీవుడు సరాసరి సూర్యుడి కొడుకు. ఆత్మజ్ఞానం కలిగినవాడు. మన సినిమాల్లో చూపించే కోతులనుకోబోకండి. వాళ్ళు కామరూపం కోతులుగా వేసుకున్నారు. తెలియని వాళ్ళేమీ కాదు. ధర్మం పూర్తిగా తెలిసినవాడు సుగ్రీవుడు.

హనుమంతుడు చెప్తాడు, తీసుకో ఫరవాలేదని. ఇలా అంతా తలా ఒక విధంగా చెప్తూంటే, ఏది నిజమో ఎట్లా తెలుస్తుంది? ఎందుకైనా మంచిది, మా వాళ్ళంతా వద్దంటున్నారు వెళ్ళిపొమ్మని, చెప్పలేదు. అప్పుడు రాముడు తన ధర్మపరంగా తను నిర్ణయం తీసుకుంటాడు. 'అతడు మంచివాడో, చెడ్డవాడో నాకనవసరం. మంచివాడని హనుమంతుడు, చెడ్డవాడని తీసుకోవద్దని మిగతావాళ్ళూ అంటున్నారు. నాకు వీటన్నిటితో సంబంధం లేదు. నన్ను శరణు కోరాడు గనక, మంచిచెడులతో సంబంధం లేకుండా నేను అంగీకరిస్తా' అంటాడు. రాజవిద్య రాజగుహ్యంలో దానికి సంబంధించిన శ్లోకం వున్నది భగవద్గీతలో. భగవంతు డేమంటాడంటే 'సమస్త జీవరాశులలో వీడు నాకు ప్రియుడు, వీడు నాకు అప్రియుడు అని లేదు. అందరూ నావాళ్ళే. వీళ్ళంటే ఇష్టం, వీళ్ళంటే అయిష్టం అని నాకేమీ లేదు' అంటాడు. వేంకటేశ్వరస్వామి గుడికి ఎవరు వెళ్ళినా, తరతమ భేదాలు లేకుండా దణ్ణం పెట్టుకు రావచ్చు. కొంతమందిని రావడానికి వీల్లేదని తలుపేసెయ్యరు కదా! Interview అందరికీ వుంది కదా! అంటే అంత తెలిసినవాళ్ళు కూడా పారపాటు పడవచ్చు. పూర్తిగా ఎవరికీ తెలియదు. అని చెప్పడానికన్న మాట ఇదంతా చెప్పకున్నది. కాలం రూపంలో మన కందించినపుడు తెలుస్తుంది. కాలం ముడత తెరిస్తే కనిపిస్తుంది. అంతవరకు ఏమీ కనిపించదు. ఎంత అకస్మాత్తుగా ఇటునుండి అటు అయిపోయిన జీవితాలు లేవూ? హరిశ్చంద్రుడు, నలుడు వాళ్ళే మనకు తార్కాణాలు. ధర్మరాజు ఫెళఫెళ మంటూ వున్నవాడు మరునాడు మాయం. ఏముందో కాలంలో మనకేం తెలుసు? అట్లా దాచి వుంచుతాడండీ అని చెప్పడానికే నామం.

396 గుహః

గుహః అంటే కనిపించడు. గుహలో వుంటాట్ట. తరచి చూస్తే కానీ తెలియడు. దాక్కుని వుంటాడు. గుహ్యంగా వుంటాడు. అంటే ఊరికే బయటకి కనిపించడు. Advertisement లేదండీ. నేను దేవుణ్ణని వార్త వుండదు. ఆ పైన వుండే రూపానికి వెనకాల వుండే తత్వం! అది రంగులుగా వుంటుంది. శబ్దంగా వుంటుంది. అందుకని apparent is not real. కనిపించినదంతా సత్యం కాదు, చూసేదంతా సత్యం కాదు అంటారు. ఉన్నది సత్యం. అంతేగానీ నువ్వు చూసేది సత్యం కాదంటారు. జీవులుగా ఎంతమందిని చూస్తాం. లౌకికమైన సంబంధాల రూపంలో చూస్తాం. వీడు నా కొడుకు, ఆమె నా భార్య, వారు నా చుట్టం ఇంతేకదా చూస్తాం. ఆ చూపంతా first impression, మొదటి భావం. ఆ భావం వెనకాల దాక్కొని వుంటాడుట. దాక్కొని వుంటాడు కాబట్టి దొంగ, అని చెప్పారండీ. కనబడడు కాబట్టి నల్లగా వుంటాడంటారు. అంటే చీకట్లో కనబడడు. నలుపులో నలుపు కలిసిపోతుంది కదా! దాక్కొని వున్నవాణ్ణి మనం లోతుల్లోకుపోయి వెతుక్కోవాలి తప్ప, ఊరికే బయట తిరుగుతూంటే దొరకడు. కనక బహిర్ముఖంగా దొరకడు. అంతర్ముఖంగా దొరుకుతాడని అర్థం. నీయందు నీ లోపల వుండే గుహలో అతడు వున్నాడు, అని తెలియచేయడానికి ఈ నామం పనిచేస్తుంది. అతడు దిగివచ్చి మన హృదయగుహలో ఎప్పుడూ వుంటాడు. అక్కడకి వెళ్ళి కలుసుకోవాలి తప్ప, ఇంకో రకంగా కలవడానికి వీల్లేదు. కనుపించేదంతా సత్యం అని అనుకోకండి. దానికి వెనక కథ చూసుకోవాలి. మన ఆధ్యాత్మిక సాధనలో కూడా 'మేడిపండు చూడ మేలిమై యుండు పొట్ట విచ్చి చూడ పురుగులుండు' అనేది చాలా సత్యం. పైకి మెరిసేట్లుగా వుండదు అసలు తత్వం. Show వుండదు. Show వుందిట అంటే అసలు ఏమీ లేదన్నమాటే! లోపల వుంటే బయటకి show వుండదు. ఉండకపోవడం వలన వెతికి చూసుకొనేవారికి కనిపిస్తారు. పై భ్రమలకి లొంగిపోయే వారికి అందేవాడు కాదు. అందుకే శ్రీకృష్ణుడు ఆ రోజుల్లో ఎవరికీ అందలేదు. కాస్తో కూస్తో భీష్ముడికి అందాడు. విష్ణు సహస్రనామం కదా! భీష్ముడికి తెలుసు. కొంత అర్జునుడికి, అంతకన్నా ఎక్కువ ధర్మరాజుకి తెలుసు. అయినా అర్జునుడు కొంచెంసేపు స్నేహితుడనుకున్నాడు. కాసేపు బంధువనుకున్నాడు. కాసేపు మనలాటి వాడనుకున్నాడు. కాసేపు దేవుడనుకున్నాడు. ఇట్లా అనుకున్నాడు. భగవద్గీతలో నీ గురించి రకరకాలుగా భావన చేసి ఎన్నో రకాలుగా ప్రవర్తించాను. క్షమించు అంటాడు. ఆ తర్వాత కొంతసేపటికి మామూలే. మనక్కూడా అప్పుడప్పుడు మాస్టరుగారు మహాత్ములు

అనిపిస్తూంటుంది కదా! ఎందుకట్లా వుంటారుట అంటే ఇదీ కారణం. లోపలకి వచ్చే వాళ్ళకి మాత్రమే తెలుస్తుంది. బయటున్న వాళ్ళకి తెలియదు. అందుకని తాను రాముడిగా వచ్చినా, కృష్ణుడిగా వచ్చినా, ఎలా వచ్చినా తనకై తాను నేను ఫలానా, అని వ్యక్తం చేసేదేమీ వుండదు. లోపలకు వెళ్తున్న వారికి తెలుస్తుంది. అందుకనే గోపికలకి తెల్సింది. అందుకే నందుడికి తెల్సింది. అందుకని వసుదేవుడికి తెల్సింది. అందుకని హిమాలయాల్లో వుండే ఋషులకి తెల్సింది. రామున్ణి అందరూ నువ్వు పరమ పురుషుడివి దిగివచ్చావంటే, అదేమీలేదు నా పేరు రాముడు. నా తండ్రి దశరథుడు అని చెప్తాడు ఎప్పుడూ. అవునూ వీళ్ళందరూ గుర్తించడం లేదు అనుకోడు. మీరు దేముడేమో అంటే, అవునయ్యా ఎవ్వరూ గుర్తించడం లేదు అంటాం. కానీ వాళ్ళేం అంటారంటే, నా పేరు రాముడు. నేను దశరథుడి కొడుకని మాత్రం తెలుసు. అంతకంటే నాకేమీ తెలీదు. మీరేం చెప్తున్నారో నాకవేం తెలీదు అంటాడు. ఋషుల ఆశ్రమాలకి ఈయన వెళ్ళి, మీ ఆశీర్వచనం కోసం నేను వస్తున్నానని చెప్తూంటాడు. ఋషు లేమనుకుంటారూ, మనల్ని ఆశీర్వదించడానికి రాముడు వస్తున్నా డనుకుంటారు. ఎక్కడ తెముల్తుందీ? అట్లా వుంటుంది అసలు తత్త్వం వున్న చోట. లేకపోతే నిన్ను ఆశీర్వదించడానికి వచ్చాను, నిన్ను bless చేయడానికి నేను వచ్చాను అని ఎవరైనా అంటే మనకి, పొండ్రక వాసుదేవుడు అనుకోవాలి. లోపలుండే విషయం తప్ప, బయటకి చూపించే విషయం కాదు. సన్నివేశాలకి కనిపిస్తుంది. సన్నివేశాలకి కృష్ణుడు ఆకాశం ఎత్తున లేచి, పనిచేసేసి, తర్వాతి క్షణం లోనే మళ్ళీ మామూలుగా వుంటాడు. మనం అయితే ఊరంతా దాని గురించి మనమే చెప్పుకొని, మళ్ళీ వాళ్ళు మర్చిపోతారేమోనని ఇలా వుంటుంది. లోతులు కావాలి. పై మెరుగులు కాదు. భగవంతుడు కూడా లోతుల్లోనే దొరుకుతాడు. 'గుహుడు' గుహ్యంగా వుంటాడు. అందుకని అంతర్ముఖంగా దీనికి సాధన ఎక్కువ చేసుకోవాలి.

397 వ్యవసాయః

ఈ నామాలు సాధనకు సంబంధించినవి. 'వ్యవసాయం' అంటే నిరంతర కృషి అని అర్థం. వ్యవసాయం చేసే వాళ్ళకి తెలుస్తుంది ఆ కృషి ఎలా వుంటుందనేది. వ్యవసాయం చేయడం వలన మనకి పంట దక్కుతుంది. మార్పులు జరగడం వలన, ఆ మార్పులలో నుండి మనకి పుష్పమో, ఫలమో, ధాన్యమో లభిస్తున్నాయి. సృష్టంతా కూడా ఒక పెద్ద వ్యవసాయం! భగవంతుడు మనకి వ్యవసాయాత్మకుడుగా గోచరిస్తాడు. అందుకని ఆ నామం భగవంతునికి చెప్పుకుంటాం. ఏమిటి వ్యవసాయం అంటే? ఇవన్నీ తయారవడమే వ్యవసాయం. ఎప్పుడూ త్రిగుణాత్మకమైన ప్రకృతి పనిచేస్తూండడం వలన, సమస్తము నందు మనం ఆశించిన లీతిలో మార్పులు వస్తూంటాయి. వసంతఋతువు రాగానే చెట్లు చిగురించడము, మావిచిగురులు, మామిడిపళ్ళు రావడం. అలాగే విత్తనాలు చల్లితే, మొక్కలుగా పెరిగి ధాన్యపు కంకులు రావడం ఇవన్నీ ఎలా వస్తున్నాయి? కొన్ని లక్షల మార్పులు మొక్కలలో జరగడం వలన వస్తున్నాయి. ఒక విత్తనం వేస్తే ఆ విత్తనం అలా పెరిగి, కొన్ని వందల విత్తనాలు మళ్ళీ పుడుతున్నాయి కదా! ఈ మొత్తం అంతా గమనించి చూసేవారికి ఎంత కృషి ఈ సృష్టిలో ఇమిడి వున్నదీ అర్థం అవుతుంది. విత్తనం చూడబోతే అతి సూక్ష్మంగా వుంటుంది. దానిలో ప్రణాళిక మాత్రమే వుంటుంది. చుట్టూ వుండే భూమిలోని సారాన్ని గ్రహించి, తనలోని ప్రణాళికని విస్తారం చేస్తుంది విత్తనం. అలాగే మనం కూడా మన శరీరమనే భూమిని ఎంత సాగుచేస్తే, అందులోంచి అన్ని రకములైన పంటలు ఉత్పన్నమవుతాయి. అది ఎవరికి వారు చేసుకొనే సాధన బట్టి, ప్రయత్నాన్ని బట్టి జరుగుతుంది. పంటభూమి ఇచ్చినా బద్ధకస్థుడికి దాని నుండి ఏమీ అందదు కదా! ఎంతమంది వ్యవసాయం చేయలేక, అమ్మేసుకొని, డబ్బులు పట్టుకొచ్చి పారేసుకొని, ఇప్పుడు బయట దేశాలకి వెళ్ళిపోయారు? ఎందుకయ్యా అంటే తమస్సు వ్యక్తిలో పెరిగితే, కృషి తగ్గుతుంది. కృషి తగ్గితే సృష్టిలో సంపద పెరగదు. ఎవరి కృషి బట్టి వారికి సంపద వుంటుంది. ఆయనకేదో బాగా కలిసి వస్తున్నది, మనకి కలిసి రావడంలేదు, అనుకుంటాం. ఎవరికేది కలిసివచ్చినా అది చేసే కృషిని బట్టి వుంటుంది తప్ప ఇంకోలా వుండదు. ఒక మహాత్ముడికి సిద్ధులున్నాయి అనుకోండి. ఎక్కడనుండి వచ్చినాయి? పూర్వజన్మ సుకృతమనో, జన్మతః అనో అంటారు. జన్మతః ఎట్లా వస్తాయి? అంతకుముందు చేసుకోవడం వలన వస్తాయి. ఇప్పుడు చేసుకుంటే ముందుకు వస్తాయి. సృష్టి కూడా కృషి చేస్తే వచ్చినదే తప్ప చేయకుండా రాలేదు. ఏమీ చేయకపోతే ఇదంతా ఇలా మారుతూ వచ్చిందా? కపిలుడు, దేవహూతికి చెప్పిన జ్ఞానం ఒకసారి చదువుకోండి. మాస్టారు చాలా విపులంగా ఇచ్చారు. చైతన్యం ఆధారంగా, అస్తిత్వం ఆధారంగా పరాప్రకృతి త్రిగుణాత్మకమైన సృష్టి నిర్మాణం చేస్తుంది. మనం కూడా శుద్ధచైతన్యస్వరూపులమైనా రజోగుణాన్ని వినియోగించడం వలన, దానికి పోటీగా తమోగుణం నిలబడి వుండడం వలన, సమస్త సంపదలూ మనలోంచి

ఉత్పన్నమౌతాయి. సృష్టిలో కూడా అలాగే ఉత్పన్నమైనాయి. అదే క్షీరసాగర మథనంగా చెప్పారు. క్షీరసాగర మథనంలో అందరూ ఊరికే పడుకొని నిద్రపోతూంటే అన్నీ పుట్టుకొచ్చాయా? అమృతం పుట్టే ముందు ఎన్నో పుట్టాయి కదా! విషం పుట్టింది, అమ్మవారు పుట్టింది, చంద్రుడు పుట్టాడు, గుర్రం పుట్టింది, ఏనుగు పుట్టింది. ఇవన్నీ ఏం చెయ్యడం వలన పుట్టాయి? రజస్సు, తమస్సు ఒకటి ఇటు, ఒకటి అటు లాగుతూంటాయి. సత్త్వం ఆధారంగా, సత్త్వంలో, వున్న స్థితి ఉండడం చేత, సత్యం ఉండడం చేత అది ఆధారంగా మనం కూడా వున్నాం కాబట్టి మనమే సత్యస్వరూపులం. మన వెన్నెముక యందుండే చైతన్యమే మందరపర్వతం. ఈ మందరపర్వతాన్ని ఇటు దేవతలు, అటు రాక్షసులు మథనం చేసారు కదా! అంటే కొంతమంది కార్యం చేస్తుంటే, మరి కొంతమంది విశ్రాంతి. మనలో దేవతలు విశ్రాంతి కోరే దేవతలు, పనిచేసే దేవతలు. తమస్సుకు సంబంధించినవారు, చీకటికి సంబంధించినవారు కొంతమందైతే, రజస్సుకు, పగలుకు సంబంధించినవారు, పనికి సంబంధించినవారు ఇట్లా వుంటుంది. అటు, ఇటూ మథనం చేయడం బట్టి సృష్టి ఏర్పడిందని సంకేతపరంగా మనకి తెలియచేయడానికి క్షీరసాగర మథనంగా చెప్పారు. సముద్రము వలె విస్తారమైన చైతన్యము భగవంతుని నుండి సంకల్పంగా వ్యక్తమైంది. అప్పుడు పెద్ద వెలుగు వచ్చింది. అందుకని చీకట్లోంచి వెలుగు పుట్టిందంటారు. పుట్టిన వెలుగుని ఏం చెయ్యాలి? ఏదో ఒకటి చెయ్యాలి కదా! ఆ వెలుగే త్రిగుణాత్మకంగా తయారయ్యింది. రజోగుణం గాను, తమోగుణం గాను, సత్త్వగుణం గాను మూడుగా ఏర్పడి, రజస్ తమస్సులు ఒకదానితో ఒకటి భేదించి పనిచేస్తూంటే అందులోంచి మనకి సృష్టి పుట్టుకొచ్చింది. అప్పటి నుండి ఇప్పటివరకు అలా త్రిగుణముల యొక్క కార్యక్రమము సృష్టిలో జరుగుతూనే వున్నది. చైతన్యము ఆధారంగా త్రిగుణముల యొక్క కార్యక్రమాలు జరుగుతున్నాయి. చైతన్యమునకు ఆధారము అస్తిత్వము. ఈ అస్తిత్వమును సత్యమన్నారు. చైతన్యమును 'చిత్' అన్నారు. ఈ రెండింటి కార్యక్రమాన్ని ఆనందం కలిగించే సృష్టి అన్నారు. మనం కూడా ప్రతి ఉదయం చైతన్యవంతుల మవుతూంటాం. ఉన్న స్థితి నుండి మేల్కాంచే స్థితికి వస్తాం. అక్కడ నుండి త్రిగుణాలలోనికి ప్రవేశిస్తాం. త్రిగుణముల కార్యక్రమము పనిచేయించడం, విశ్రాంతి ఇవ్వడం, పని చేయించడం, విశ్రాంతి ఇవ్వడం. పనికి, పనికి మధ్య విశ్రాంతి. కేవలం సత్త్వ గుణమే దైవీగుణం అనుకోకూడదు. రజోగుణం కూడా దైవీసంపత్తి లేకుండా ఎలా వచ్చింది? దేనియొక్క ప్రాముఖ్యత దాని సమయంలో దానికి అందించాలి. విశ్రాంతి కావాలి అంటే తమోగుణం కావాలి. ఏదైనా ఒక అభ్యాసం ఏర్పడాలంటే తమోగుణం కావాలి. మళ్ళీ అభ్యాసం యొక్క పరిమితత్వము నుండి విడిపడాలంటే రజోగుణం కావాలి. కార్యక్రమం మొదలుపెట్టాలంటే రజోగుణం కావాలి. మొదలుపెట్టిన దాన్ని సక్రమంగా నిర్వర్తించాలంటే సత్త్వగుణం కావాలి. సత్త్వగుణం అధిష్ఠించి వుండగా, రజస్తమస్సులు సమపాళ్ళల్లో పనిచేస్తూంటే, పదార్థములో చైతన్యము చేసే మార్పులలో నుండి సంపద పుడుతూంటుంది. సృష్టిలో ఏర్పడే సంపదంతా అలా

ఏర్పడుతున్నదే! ఎన్ని లక్షల మార్పులు జరిగితే ఒక చెట్టు ఒక పండు నిస్తుంది? ఎన్ని లక్షల మార్పులు జరగబట్టి భూమిలో అనేక రకములైన ఖనిజములు దొరుకుతున్నాయి? ఎన్ని రకములైన మార్పులు జరుగుతూండబట్టి మన శరీరం ఇలా పెరుగుతున్నది? మనం కోరినా, కోరకపోయినా పసికందు నుండి ఇంతవరకు పెరిగాం కదా! ఈ మార్పులు ఎలా జరిపిస్తున్నారు? కదలిక ఉండబట్టి కదా! ఆ కదలిక ఎప్పుడూ వున్నది కదా! మనలో రక్తప్రసరణ చర్యలో కానీ, స్పందనాత్మకమైన చర్యలో కానీ ఎప్పుడూ కదలిక వున్నది కదా! అలాగే మెలకువ వచ్చినపుడు ఆలోచనల రూపంలో కదలిక వుంటుంది. సహజంగా సృష్టిలో కనిపించేది వ్యవసాయం. నిరంతర కృషి! నిరంతర కృషి మనకి సముద్రం చూసినా కనిపిస్తుంది. ఒక నదీప్రవాహాన్ని చూసినా కనిపిస్తుంది. దేన్ని చూసినా కనబడని పద్ధతిలో మార్పు జరుగుతూ ఉంటుంది. కనకనే మనలో గాని, వృక్ష సంపదలో గాని ఇలా అన్ని జీవరాసులలోనూ మార్పు కనిపిస్తుంది. ఇదంతా భగవంతుని యొక్క వ్యవసాయము అని చెప్పుంటే నామం. అంటే చోటులో ఒక సంకల్పం వెలుగు ఆవరణగా ఏర్పడితే, ఆ వెలుగులో జరిగే త్రిగుణముల కార్యక్రమము చేత అన్నీ పుట్టుకొస్తూంటాయి. ముందు విషం పుడ్తుంది. విత్తనం వేసేది కొబ్బరి కోసమైనా, ఎన్ని అయినాక కొబ్బరి దొరికిందందులో? మనం వేసినపుడు పీచు కావాలని, మట్టలు కావాలని అనుకోలేదు కదా! కానీ అవన్నీ అయినాక కదా కొబ్బరి దొరికింది. మామిడిపండు కావాలని వేస్తే ఎన్ని మార్పులు జరిగాక మనకి మామిడిపండు వచ్చింది? అలాగే సాధన విషయంలో కూడా సాధకులుగా, సాధన చేస్తూంటే లోపల దాక్కున్నవన్నీ, ఉండకూడనివన్నీ ముందు బయటికి వస్తాయి. అందుకని యోగసాధన చేస్తే ఒక్కోసారి జబ్బులు బయటపడ్తాయి. బావిలో ఏదో పడిందని గాలం వేసి దిగితే అంతకుముందు పడిపోయినవి, అక్కర్లేనివి దొరికి, తర్వాత మనం పారేసుకున్న విలువైన ఉంగరమో ఏదో ఒకటి దొరుకుతుంది. అలాగే సాధనా కార్యక్రమంలో మనం కోరినవి కాక మిగతావి బయటికి వస్తాయి ఈ క్షేత్రాన్ని మనం వ్యవసాయం చేస్తూండగా. అప్పుడు మనకి నిస్పృహ రాకూడదు. ఇదే గుర్తు పెట్టుకోవాలి. శుభమా అని పాలంలో మొక్కలకి నీరు పోస్తే, ప్రక్కనున్న కలుపుమొక్కలు త్వరగా పెరుగుతాయి అసలు మొక్కలు కన్నా. కదా! బలంగా కూడా పెరుగుతాయి. అలాగే మనలో సాధన జరుగుతూంటే వచ్చే శక్తిప్రసారము లోపల వుండే అన్నిటికీ బలం చేకూరుస్తుంది. కొన్ని కొన్ని ప్రకోపిస్తాయి. హాలాహలం ముందు పుట్టిందన్నప్పుడు ముందే అమృతం పుట్టదని చెప్పడమే! ముందే సిద్ధి రాదూ, అది వచ్చేముందు ఈ క్షేత్రంలో వుండే మలినాలు బయటకి వస్తాయని చెప్పడం. సృష్టిలో మనం కోరేది యజ్ఞఫలంగా చివరికి అందుతుంది. ఈ లోపల కోరనివి వస్తూంటాయి. ఇలా కోరనివి వస్తున్నాయి కదా అని సాధన ఆపెయ్యడం, కలుపుమొక్కలు పెరుగుతున్నాయి కనక నేను వ్యవసాయం చేయను అన్నట్లుంటుంది. కలుపుమొక్కలు పెరిగితే ఎప్పటికప్పుడు తీసేస్తూండాలి. పురుగు పట్టకుండా చూసుకోవాలి. కాపాడుకుంటూ ఉండాలి. అట్లా సృష్టిలో రజస్తమస్సుల కారణంగా

రెండు రకాలూ పుడతాయి. అమృతత్వాన్నిచ్చేవి, మృత్యువునిచ్చేవి సాధన చేసినపుడు మనలో కూడా రెండు రకాలుగా పుట్టే అవకాశం వుంది. కొన్నిటిని ఏరి పారెయ్యాలి. కొన్నిటిని ఉంచుకోవాలి. అలా నిరంతరమూ చేసేదాన్ని 'వ్యవసాయం' అంటారు. పతంజలి యోగసూత్రాలలో కూడా 'దీర్ఘకాలం, నిరంతరమూ దృఢమైన చిత్తంతో సాధన చేయవలెను' అని చెప్తాడు. మనకేం జరుగుతుందంటే కొన్నాళ్ళు చేసేసరికి ఒకదానికి మొదలెడితే ఇంకోటేదో వచ్చిందనిపిస్తుంది. శుభమా అని ఏమన్నా మొదలుపెడితేనే కొన్ని బయటకు వస్తాయి. అందుకే ఏమీ మొదలుపెట్టం అంటే ఎలా? చెడు బయటకు వచ్చేస్తోందనుకోవచ్చు కదా! బయటపడితే మంచిది తప్ప, లోపల వుంటే అది మనకు మృత్యువుని కలిగిస్తుంది. తెలిస్తే మనకి మనవంతు కర్తవ్యం నిర్వర్తించవచ్చు. తెలియకుండా పొంచి వుండి దెబ్బకొడితే? పురుగు పడుతోందని తెలిస్తే, పట్టకుండా ఏదో చేసుకోవచ్చు. తెలియకుండా పురుగు పట్టేస్తే? కనక పురుగు పడుతున్నదని తెలియడం మంచిదా? తెలియకండా పురుగు పట్టడం మంచిదా? తెలిసిన తర్వాత అసలిదంతా పంట పండించడం వల్ల, పంట వద్దూ, కలుపు వద్దనుకుంటే? సృష్టిలో దేనిని మొదలు పెట్టినప్పుడు అందులో అంతర్లీతముగా ఉన్నట్టి మనం గమ్యం పెట్టుకొని కార్యక్రమం సాగిస్తున్నప్పుడు బోలెడు by-products కూడా బయటకు వస్తాయి. సృష్టి అనేది అగ్నికార్యం కాబట్టి అందులోంచి మృత్యు సంబంధమైన ఆటంకములు వస్తుంటాయి. అంత మాత్రం చేత మనం వాటియందు మనస్సు పెట్టి చేయవలసిన కర్తవ్యాలు మానకుండా ఉండాలి. ఒక రైతు వ్యవసాయం చేసేటప్పుడు ఎన్ని రకాల అడ్డంకులు వచ్చినా, ఆ పంట కోసం ఎలా కృషి చేస్తాడో, ఒక్కోసారి పంట పోయినా ఎలా కృషి చేస్తాడో అలాగే సాధనలో నిరంతర కృషి జరుగుతూండాలి. సాధన మనకి వ్యవసాయం కింద లెక్క! సృష్టిలో వ్యవసాయమున్నది. మనలో కూడా ఈ వ్యవసాయం జరగాలి. కృషి లేనిచోట, ప్రయత్నం లేనిచోట ఏ విధంగా భూమి బీడు బారిపోతుందో, ఆ విధంగా మనకివ్వబడ్డ ఈ క్షేత్రాన్ని నిష్ప్రయోజనం చేసుకున్నట్లవుతుంది. మనలో కృషిని పెంచే పెట్టుబడి 'స్పందనం'. దాన్ని ఎంత చక్కగా వినియోగించుకొని ప్రాణప్రవృత్తులను పెంచుకుంటామో, అంతకాలం శరీరం పంటభూమిగా మారుతుంది. లేకపోతే ఏమీ పండని బీడుభూమిగా మరుతుంది. పంటభూమిలో విత్తనం మొలకెత్తి పెరుగుతుంది. అందుకే సాధనలో ఎక్కువభాగం శరీరాన్ని పదునెక్కించడం గానే కనిపిస్తుంది. ఊరికే పుస్తకాలు చదివి తెలివి పెంచుకోవడం వలన అవదు. ఎన్ని పుస్తకాలు చదివినా, వ్యవసాయం ఎలా చేసుకోవాలో చెప్పేవే కదా అవి. చెయ్యడం దగ్గరకి వచ్చేసరికి తేడాపడితే అక్కడ పంట పెరగదు కదా! అందుకని శరీరాన్ని వినియోగించుకుంటే, అందులోంచి పుట్టే పంటే తనకు దక్కే అమృతత్వ సిద్ధి. ఈ అమృతత్వం అంతకుముందు శరీరంలోనే పాలల్లో కలిసిన వెన్నలాగ వుంటుంది. ఈ శరీరానికి వెలుగు శరీరం ఏర్పడే శక్తి వున్నది. వెలుగు శరీరం ఏర్పరచుకోవడం అనేది కృషి బట్టి వున్నది. ఎక్కడున్నదండీ వెలుగు శరీరం ఊరికే అలా చెప్తారు అంటే, పాలల్లో వెన్న ఎక్కడ కనబడుతున్నదండీ? కృషి చేసి చిలికితేనే వస్తున్నది వెన్న, కదా!

రజస్సు, తమస్సు అనే గుణాలు కుడి, ఎడమలుగా clockwise, anti-clockwise directions లో చిలికితే, ఆ చిలుకుల్లోంచి అంతకుముందు లేనట్టుగా వున్న వెన్న గోచరిస్తుంది. మామిడిపండు మామిడిచెట్టులో ఎక్కడ వున్నది? అంతర్లీనంగా వున్నది. కొమ్మలో పండు ఇప్పుడు కనిపిస్తుందా? కొమ్మలో పండు నివ్వగల శక్తి వున్నది. పూలమొక్కలో పూల నివ్వగల శక్తి వున్నది. పూలమొక్క కన్నా పువ్వు ఎంత సున్నితంగా వుంటుంది? మామిడికొమ్మ తిన్నామనుకోండి, మామిడిపండు తిన్నామనుకోండి ఎంత తేడా వుంటుంది? ఇందులోంచి వచ్చిందే అది. అయినా పండు తినడానికి పనికివస్తుంది గానీ, కొమ్మ పనికిరాదు కదా! అలా ఈ శరీరం చెట్టులాటిదైతే, అందులోంచి ఏర్పడే సూక్ష్మశరీరం ఈ పండు లాంటిది. ఈ పండులో మళ్ళీ చెట్టును పుట్టించే శక్తి కూడా వుంటుంది విత్తనంగా. రాజవిద్య, రాజగుహ్యంలో 'నాయందు మీరున్నారు కాబట్టి, మీయందు నేనున్నాను' అని చెప్పినది ఎలాగ గోచరిస్తుందంటే, చెంబు గోదావరిలో వున్నది కాబట్టి, గోదావరి చెంబులో వున్నది. చోటులో మనం వున్నాం కాబట్టి మనలో చోటున్నది. మనలో చోటుండడం ఎంత సత్యమో, చోటులో మనముండడం అంతకన్నా పెద్ద సత్యం. మామిడిచెట్టులో పండు అంతర్లీనం గా ఎలా ఉన్నదో, పాలల్లో వెన్న అంతర్లీనం గా ఎలా ఉన్నదో, మనలో కూడా ఈ శరీరానికి సంబంధించిన నమూనా వెలుగు శరీరంగా వున్నది. అది ఏర్పరచుకొనడం బట్టి వస్తుంది. ఏర్పరచుకోనివారు మృతులౌతారు. ఏర్పరచుకున్నవారు అమృతత్వసిద్ధి పొందిన వారౌతారు. అంటే తనలోంచి ఎప్పుడైనా శరీరం పుట్టించుకోవాలంటే పుట్టించుకోగలరు, లేకపోతే అలా ఉండగలరు. అదేకదా ఒక విత్తనం యొక్క స్థితి! పండుగా వున్న విత్తనం చెట్టుగా కావాలంటే రాగలదు. అందులోంచి మళ్ళీ పండు పుట్టించుకోగలదు. అందుకని మనవాళ్ళు 'పుష్పించని పువ్వు, ఫలించని చెట్టు' నిరుపయోగం అన్నారు. ఈ శరీరాలు ఎన్నిసార్లు వచ్చినా ఒక్కసారీ ఒక్క పువ్వూ పూయలేదు, ఒక్క కాయ కాయలేదనుకోండి, పాయ్యిలో పెట్టెయ్యడం ఖాయం. ఇది పాయ్యిలో పెట్టేలోగా ఇందులోంచి ఒక పండును తయారుచేసుకొని, అందులోకి సూక్ష్మంగా మళ్ళీ ఈ శరీరాన్ని మొలకెత్తించగల ప్రణాళికను పట్టుకోగలగాలి. ఇదీ యోగం! ఇది వ్యవసాయం వల్ల మాత్రమే సాధ్యం.

3918, 3919 వ్యవస్థానః, సంస్థానః

భగవంతుడు తనను తాను నిరంతర వ్యవసాయాత్మకుడుగా ఉంచుకున్నాడు. తాను ఈ సమస్తంగా ఏర్పడి, అందులో తను వుండి, అందులోంచి మళ్ళీ తను వచ్చి, ఇలా వ్యాపించి యున్నాడండి. అందుకని ఇది ఆయన 'వ్యవస్థాన' మైనది. మొత్తం ఈ చోటులో ఎంత మేరైతే వెలిగింపబడి, ఈ సృష్టికార్యం నడుస్తున్నదో అదంతా కూడా ఆయన 'వ్యవస్థానం', 'సంస్థానం'. అలాగే మనం కూడాను. ఎవరి కృషి మేరకు వారి వ్యవస్థానం ఏర్పడుతుంది. వారి సంస్థానం ఏర్పడుతుంది. కొందరి సంస్థానం వారి ఇంటి గోడల మధ్య వరకే వుంటుంది. మరి కొంతమందికి అక్కడ కూడా ఉండకపోవచ్చు. మన ఇంటికి మనం యజమానిగా వున్నాం, అనుకొనే పరిస్థితిలో లేనివాళ్ళు కూడా వుంటారుగా. కొంతమందిది ఊరంతా పాకుతుంది. మరి కొంతమందిది దేశమంతా పాకుతుంది. మరి కొంతమందిది భూగోళమంతా పాకుతుంది. మరి కొంతమందిది గ్రహగోళాదులలో పాకుతుంది. అది వారి యొక్క ఒక పరిధి! ఎక్కడ నుండి వచ్చింది ఇదంతా? కేవలం కృషి వలన! అందువలన సత్వంతో ముడి వేసుకున్నట్టి, ధర్మంతో ముడి వేసుకున్నట్టి కార్యాచరణ మేదైతే వున్నదో, అది మనిషికి ఊహించనంత విస్తార మిస్తుంది. అందుకని హరిశ్చంద్రుని గురించి మిగతా లోకాలలో చెప్పకున్నారని, అంబరీషుడి గురించి మిగతా లోకాలలో చెప్పకున్నారని ఇచ్చిన కథలలో భావం ఏమిటంటే, పరిధి పెంచుకుంటూ వెళ్తుంటే, మన ప్రభ గోళం దాటి కూడా వెళ్ళిపోవచ్చు. అలా వెళ్ళినవారున్నారు భూమిమీద. లోకాలు దాటి తమ అస్తిత్వాన్ని గుర్తింప చేయగలిగిన కథలు పురాణాల్లో కనిపిస్తాయి. వాటి ఉద్దేశ్యం వారు చేసిన కృషి అటువంటిదని. అలా కృషి చేస్తుంటే, ప్రతివాడికీ వాడి కృషి నుండి కొంత ప్రణాళిక వ్యక్తమౌతూంటుంది. అది వాడి ప్రణాళికగా ప్రత్యేకంగా గోచరిస్తుంది. 'వ్యవస్థానం' అంటే అది. అంతకుముందు లేదు, ఆ తర్వాత ప్రత్యేకంగా వున్నట్లు గోచరిస్తుంది. సూర్యమండలం అంతా సూర్యుడి యొక్క వ్యవస్థానంగా గోచరిస్తుంది. సూర్యుడు పుట్టక ముందేమున్నది అక్కడ? చోటు! చోటులో మథనం చేత ఒక కేంద్రం పుట్టింది. కేంద్రం ఎక్కడ పుట్టినా దానికొక పరిధి ఏర్పడుతుంది. వారి చైతన్యము లోతుల మేరకు ఈ పరిధి ఏర్పడుతుంది. ఎంత లోతుల్లోకి వెళ్తే అంత విస్తారం వస్తుంది. మహాత్ములు ఉన్న చోటే వుంటారు. వారి ప్రభావం క్రమశః అలా వ్యాపనం చెందుతూంటుంది. ప్రపంచమంతా ప్రతిచోటుకి వెళ్ళకుండానే, వాళ్ళ ఊళ్ళోనే, ఉన్న గదిలోనే వుండి వ్యాపిస్తారు. అరుణాచలంలో ఒకాయన గుహలో వుండి ప్రపంచమంతా పాకాడు. అలాగే షిర్డీ మారుమూల గ్రామంలో వుండి ఇంకొకాయన

ప్రపంచమంతా పాకాడు. ఏమిటి చేసారు వాళ్ళు అంటే 'వ్యవసాయం'. వాళ్ళేం చేసారో మనకి తెలియకుండా చేస్తారు. మనం చేసే కాస్తా అందరికీ తెలిసేట్లు చేసుకొని, ఆ రోజుతో దాని ఫలితం పొందేస్తాం. ఎవరైతే సాధన నలుగురికీ తెలిసేట్లు చేస్తారో, మీరు బాగా చేస్తున్నారండీ అంటే అయిపోయింది. ఈ చెట్టు ఏం చేస్తోందో మనకేం తెలుసు? మామిడిపండు వస్తే కోసుకు తింటున్నాం తప్ప, అందులో ఎన్ని మార్పులు జరిగాయో మనం గమనించామా? ఒక పువ్వు పుష్పించిందంటే, ఆ మొక్కలో ఎన్ని లక్షల మార్పులు జరిగితే అది ఒక పువ్వుగా వస్తున్నదో మనం గమనించామా? మనం గమనించేట్లుగా అవి చేసాయా? గడ్డి పెడితే ఆవో, గేదో పాలిస్తున్నది కదా! ఎట్లా వస్తున్నాయి? మనం పెట్టేది గడ్డి అదిచ్చేది పాలు. అంటే ఎంత రసాయనికచర్య జరిగింది? ఈ జరిగే రసాయనికచర్యకి ఎక్కడన్నా ప్రచారమున్నదా? మనకెందుకు కృషికన్నా ప్రచారం మీద ఆసక్తి ఎక్కువ? ఏమీ చేయకుండా అన్నీ బావుండాలనుకుంటాం కదా! ఏం చెయ్యాలని మొదలుపెట్టినా అడ్డంకులు వస్తూంటాయి కదా! ఒకటి చెప్పారు భాగవతంలో. ఎంత తీరని అనారోగ్యమైనా కేవలం ఆహార నియమాలతో నయం చేసికొవచ్చునని. అంటే మన అనారోగ్యానికి మనం సేవించే ఆహారంతో సంబంధం వుంటుంది. కేవలం ఆహారం మార్పుతో ఎంతటి తీవ్రమైన అనారోగ్యమైనా సరిదిద్దుకోవచ్చు. కాకపోతే దానికి కావలసిన కృషి వుండాలి. మొదట్లో ఇబ్బందిగా వుండి మానేస్తాం. కానీ ఆ మొదట నిరోధనశక్తి అంటే వద్దనే జబ్బు, మంచిని వద్దనే జబ్బు, మనకి ఏది జబ్బును పెంచుతుందో అదే కావాలంటుంది. ఎవరికి ఏది తింటే జబ్బు కలుగుతుందో వారికి అదే తినాలనిపిస్తుంది. ఏది తింటే జబ్బు తగ్గుతుందో అది తినబుద్ధి కాదు. ఎందుకంటే జబ్బు మనిషిని అలా కమ్మేస్తుంది. నేనొక మనిషిని కలిసాను జీవితంలో. ఆయనకి 81 సంవత్సరాలు. ఇప్పుడు 45 సంవత్సరాల నుండి ఆయనకి ఒంట్లో జబ్బు అంటే ఏమిటో తెలియదుట. U.G. కృష్ణమూర్తి ఆయన పేరు. ఎంత చలాకీగా వుంటారంటే మనమెందుకూ పనికిరాం. ఆయన్ని నేనడిగాను ఏమిటి మీ రహస్యాన్ని నాతో పంచుకుంటారా అంటే, నవ్వి 'ఏమీలేదు. నాలుక మీద స్వామిత్వం వస్తే శరీరం పదునొస్తుంది. నాకు 42 ఏళ్ళకి ఆ సంగతి తెలిసింది. అడ్డమైన బాధలూ పడేవాణ్ణి. దాంతో ఓ రోజున ఓ రకమైన విరక్తి వచ్చింది. కేవలం దీని మూలంగానే కదా ఇంత తెచ్చుకుంటున్నాం. దీనిమీద స్వామిత్వం సంపాయించలేమా? అనుకున్నాను. అంతే ఆ రోజు నుండి శరీరం ఎంత గగ్గోలు పెడ్తున్నా వినకుండా ముందుకుసాగి, 30 నెలలు శరీరానికి ఏది పడుతుందో అదిమాత్రమే తగుమాత్రంగా ఇవ్వడం పెట్టుకున్నాను. ఈ రోజున నేను పాద్దున్న ఇంత కట్టుపాంగలి లేకపోతే రెండు ఇడ్లీలు, మధ్యాహ్నం ఇంత, రాత్రికీ ఇంత. అంతే! ఈ శరీరానికి అంతకంటే అక్కరలేదండీ. మనమింత పెట్టేస్తాం,

పాడుచేసుకుంటాం. నిద్ర కూడా అంత అక్కరలేదు.' అని చెప్పారు. ఇది miracle అనుకోకండి. కేవలం కృషి చేత వస్తుంది. ప్రతిదాన్ని మన దేశంలో miracle గా చేసేస్తారు. ఇది మాత్రం కేవలం కృషి వల్లనే వస్తుంది అని చెప్పారు. సాధన వుంటేనే సిద్ధి. నియమం పాటించకుండా ఏమీ చేయలేం. దీక్ష కావాలి. దీక్ష మొదలుపెట్టగానే చూద్దామని అడ్డంకులు వస్తాయి. అదీ తమాషా. అసలు నీ మనసులో ఒక సంకల్పం రాగానే దేవతలే పరీక్షలు పెడ్తారు, ఏ మాత్రం నిలబడతాడో చూద్దామని. అదికదా హనుమంతుడు ఎగరగానే మైనాకుడు వచ్చి, సురస వచ్చి అడ్డంకులు. ఎగిరీ ఎగరగానే హనుమంతుడితో, మైనాకుడు వచ్చి, "మీ నాన్నకి, నాకు చాలా స్నేహం. పైగా ఎవరి కార్యం మీద వెళ్తున్నావో వారి సంబంధీకులు మాకు చాలా ఉపకారం చేసారు. కాబట్టి నువ్వికడ వుండి, కాస్త బ్రేక్ ఫాస్ట్ చేస్తే పుష్టిగా వుంటుంది. మళ్ళీ ఎగరచ్చు అని చెప్తే, ఏం చేసాడు హనుమంతుడు? మనలాగ ఆశ పడిపోలేదు కదా! మనకీ రోజున ఎలా వుందంటే అసలు పని కన్నా side issues చాలా condition చేస్తూంటాయి. అలా వాకింగ్ కని బయల్దేరి అరగంట కూర్చుని కబుర్లు చెప్పేసి వచ్చేసే వాళ్ళుంటారు వాకింగ్ మానేసి. కదా! ఎందుకోసం వెళ్ళావు వాకింగ్ కి? వాకింగ్ చేస్తూ పోనీ కబుర్లు చెప్పకున్నాడా అంటే అది వుండదు. ఏం చేస్తారంటే వాడు కనబడ్డాడు, వాడితో మాట్లాడుతూంటే టైమ్ తెలియలేదు. టైమ్ అయిపోయిందీ అంటాడు. దేనికీ అంటే తింటానికి టైమైపోయింది. పండుకోడానికి టైమైపోయింది. మొదలుపెట్టగానే వచ్చే విఘ్నాలన్నీ మనలో సంకల్పశక్తి ఏమాత్రం వుందో లోపల్నుంచి దేవతలే, అసలు వీడు నిలబడగలడా, లేడా అని చూస్తారుట. వీడికి సహకారం చేద్దామా, వద్దా అని. మనం ఏదైనా సత్సంకల్పం చేస్తే, వెంటనే దేవతలు చాలామంది గుమిగూడతారుట. దేవతలంటే మనలో వున్న శక్తులు. Intelligences అంటాం ఇంగ్లీషులో. వెలుగు కేంద్రములు దేహము నిండా వున్నాయి. "ఓం" అనగానే అవన్నీ ఒక రకమైన సావధానం లోకి వస్తాయిట. పిలుస్తున్నాడు కదా పనున్నది అని. కానీ "ఓం" తర్వాత మన దగ్గర పనేలేదు. పెద్ద యజ్ఞయాగాదులు చేసినపుడు, క్రతువులు చేసినపుడు, యోగసాధనలో అమృతత్వ సిద్ధినో ఏదో గమ్యం పెట్టుకోని చేసామనుకోండి, వరసగా ఏడు లోకాల దేవతలూ గుమిగూడి అప్రమత్తులై వుంటారుట. అదీ ఓంకారంలో వుండే మహత్తరమైన సత్యం. మనమేమో ఓంకారం చేసి నిద్రపోతాం. ఓంకారం అయ్యాక కబుర్లు చెప్పకుంటాం. వీడి ఓంకారం సీరియస్ కాదు నాన్నా పులీ అన్నట్లు ఊరికే పిలుస్తుంటాడు అనుకుంటారు. సాధనలో ప్రాథమికదశలో ఎందుకు ఆగిపోతాం అంటే, మనకై మనంగా చేసిన నిర్ణయాలు మనమే పాటించం. అదీ ఆశ్చర్యం. ఎవరూ మనల్ని నిర్ణయం చేసుకోమని అడగరు. చేసుకొన్న నిర్ణయం ఎందుకు పాటించలేం? ఆ అడ్డుపడడం వలన ముందుకు సాగం.

ఇది ఎంత ముందుకు సాగితే అంత పంట పండుతుంది. ఎందుకంటే సృష్టిలో ప్రత్యేకించి మానవుడికి సాధ్యపడని దేమీలేదు. దేవతలు కూడా భూమిమీద ఏమన్నా చేయాలంటే వాళ్ళకి వాహికగా మానవుణ్ణే కోరుకుంటారు. వృక్షాలకి చేసినా, జంతువులకి చేసినా, ఖనిజాలకి చేసినా మానవుడు చేయగలడు. అటు పైలోకాలకి, ఇటు క్రింద లోకాలకీ వీడు వంతెన లాంటివాడు. వీణ్ణించి ఎంతైనా జరగచ్చు. వీడిలో అన్ని శక్తులూ వున్నాయి. కానీ ఏంటయ్యా లోపం అంటే ధార్మికమైన కృషి. కృషి వుండచ్చు అది ధర్మంతో ముడిపడి వుండకపోతే, రావణాసురుడి లాగ. ధర్మంతో ముడిపడి వుంటే సముద్రం మీద వంతెన కట్టిన రాముడు, ఆయన అనుయాయులు లాగ వుంటుంది. కదా! ఎప్పుడూ కూడ కృషి లేనిచోట ఏ మార్పూ రాదు. ఎప్పుడూ కృషి మానరాదు. కృషి లేకుండా ఏ సంపదా రాదు. కృషి లేకుండా అడ్డదారుల్లో సంపాదించిన సంపద బాధపెడుతుంది. అందుకని మనకి ఈ నామం అన్ని రకాలుగా చాలా ముఖ్యమైన నామం. ఏది మనకి తక్కువగా ఉందనుకుంటామో దానియందు మనకి కృషి లేదని గుర్తుపెట్టుకోండి. ఆరోగ్యం తక్కువగా వుందిట అంటే ఆరోగ్యం గురించి నీ కృషి ఏమిటి? ఏమీలేదు. ధనం తక్కువగా వుందిట అంటే ధనానికి సంబంధించిన కృషి తక్కువగా వుందిట అని అర్థం. దేనికైనా అంతే. అందుకనే పెద్దలేం చెప్పారంటే దైవానుగ్రహం, పురుష ప్రయత్నం రూపాయి నాణానికి బొమ్మ, బొరుసు లాంటివని చెప్పారు. నువ్వు చెయ్యకపోతే ఎక్కడ నుంచి వస్తాయి? మన చేతిలో వుండేది మన ప్రయత్నమే. దైవానుగ్రహం కాదు కదా! అట్నుంచి వచ్చేది కదా అనుగ్రహం. అనుగ్రహం ఎవరికి వస్తుందంటే పురుష ప్రయత్నం చేసేవాడికి మాత్రమే. మన దేశంలో ఈ ప్రయత్నం వదిలేయబట్టే మన జాతి నిర్వీర్యమై పోయింది. మనం కూడా మనలో ఏ విషయంలో లోటు వున్నదో అందులో కృషి చేయడానికి కావలసినంత బలం కావాలి. ఆ బలాన్ని మనం బాగా పొందించుకుందాం. పెంపొందించుకుంటే ఉత్తీర్ణులమయ్యే అవకాశం వున్నది. మొదటవచ్చే విఘ్నాలని లెక్కపెట్టవద్దు. విఘ్నాల వైపు చూడవద్దు. కృషి వైపు చూడండి. కృషి ఎంత చేస్తే అంత మంచిది. ఒక పిచ్చుక యొక్క పిల్ల పిచ్చుకని సముద్రం అల వచ్చి లోపలకి తీసుకుపోయిందిట. లోపల అది గిలగిల లాడుతున్నది. బయట ఇది ఏమీ చేయలేక, తనకున్న రెక్కలతో ఆ సముద్రం నీళ్ళని గాలితో కాస్త వేరుచేస్తే, ఇది బయటకి వస్తుందని ప్రయత్నం చేస్తోందిట. చేస్తూ చేస్తూ తన ప్రాణం కోల్పోయే స్థితికి వస్తుందిట. అప్పుడు గరుత్మంతుడికి సముద్రుడి మీద కోపం వచ్చి, ఒక్కసారి తన రెక్కలతో అలా అనేసరికి సముద్రమంతా చెల్లాచెదురై పోయిందిట. ఏమిటిలా చేస్తున్నావంటే, బుద్ధిలేదా? ఆ ప్రాణి ఎంత చిన్నదో. దాని ప్రయత్నం చూసావా? సాయం చేయవచ్చు కదా రోగమా? అంటాడు. అంటే కృషి వున్నచోట సహకారం

అలా వుంటుంది. రామాయణంలో రాముడికి ఎంత సహకారం వచ్చింది యుద్ధ సమయంలో. గరుత్మంతుడు వీస్తాడు. ఒకసారి నాగపాశాన్నుండి విముక్తి నిస్తాడు. సంజీవని వచ్చి లక్ష్మణుడే కాక కోతులన్నీ బ్రతుకుతాయి. ఇంద్రుడు మాతలిని, రధాన్ని పంపిస్తాడు. అలా కలిసొస్తుంది. నువ్వు చేసే కృషి ధర్మంతో కూడి వున్నప్పుడు దేవతల సహకారం చాలా వుంటుంది. నీ బలం పెద్ద బలం కాదు. కానీ నీవు దాన్ని అట్లా pursue చేస్తుంటే? నిరంతరము చుట్టు వుండే చోటు నుండి దైవీశక్తులు మనకి తోడ్పడుతూంటాయి. ఇదే మనం చూడాలి. అర్జునుడికి ఎంతటి తోడ్పాటు కలిగింది? కర్ణుడికెంత భంగపాటు కలిగింది? కర్ణుడికి తను తెచ్చుకున్నవన్నీ సమయానికి పనికిరాకుండా పోయాయి. అర్జునుడికి తను తెచ్చుకున్నవి లేకపోయినా అన్నీ వచ్చి చేరతాయి. ఎందుకు అలా జరిగింది? కాలం కలిసిరావడం. అంటే ధర్మాన్ని అనుసరించిన వాడికి దేవతాస్వరూపాలు, అదే ప్రకృతిలో వుండే శక్తులు తోడ్పాటు చేస్తాయి. ఎంత తోడ్పాటు చేస్తాయంటే, నువ్వు రోడ్డు మీద ఎండలో వెళ్తూంటే, చిన్న మేఘం వచ్చి నీడ నిస్తుంది. అంతవరకు ఎందుకు? ఎండలో వెళ్తుంటే ఎవరో వచ్చి కారులో ఎక్కించుకొని వెళ్తారు. నిజంగా నువ్వు ధర్మంగా నడుస్తూ, నలుగురికీ సాయంచేస్తూ, ఇతరుల కష్టాలలో పాలు పంచుకొంటూంటే నీ చుట్టూ చోటులో వుండే దైవిక శక్తులు నీకు ఆ విధంగా తోడ్పాటు చేస్తూంటాయి. కష్టాలలో వుండగా నలుడికి, ధర్మరాజుకి బోలెడు సాయం వచ్చింది. ధర్మరాజుకి అరణ్యంలో వుండగా అక్షయపాత్ర వచ్చింది. అంతకన్నా ఏం కావాలి? అంటే మనం ఎక్కడికి వెళ్ళినా Five star hotel ప్రక్కన పెట్టుకున్నట్లే with kitchen and cook. ఇంక అదేం అరణ్యవాసమండీ? హాయిగా వున్నట్లే. ఎందుకొచ్చిందీ? మనం ధర్మం వదలకుండా, మనం చేయవలసిన కృషి చేస్తే దేనిలో నుండైనా సరే పరిష్కారం లభిస్తుంది. అలా కాకపోతే ఏం చేసినా పరిష్కారం కాదు. ఎందుకంటే మనం కృషి తప్ప, మిగతావన్నీ చూద్దాం అని చూస్తాం. సృష్టిలోనే ఇంత కృషి వుంది. దానివలన ఇంత వ్యవస్థానం, సంస్థానం ఏర్పడి 'స్థానదో' మనకిచ్చేస్తారుట.

400 స్థానదః

ఇదంతా నువ్వేలుకో అని స్థానం కల్పిస్తాడుట. సూర్యుడికెంత స్థానం ఇచ్చేసాడు? ఈ సూర్యుడి కేంద్రంగానే కదా ఈ గ్రహగోళాదులూ ఇవన్నీ, ఈ జీవరాశులూను. వ్యక్తం చేయబడి మనం వున్నాం కాబట్టి, విత్తనం లోంచి మొక్క ఎలా విచ్చుకుందో మనలోంచి కూడా మళ్ళీ ఆయనే విచ్చుకుంటాడు అదీ. మనం ఊరికే విప్పారడం కాదు. మామిడి విత్తనంలో మామిడిచెట్టు యొక్క ప్రణాళిక వుంటుంది తప్ప, మిగతాదంతా భూమి నుండి, నీటి నుండి, చుట్టూ వుండే సూర్యరశ్మి లోంచి అందులోకి దూరి విచ్చుకున్నదే. కొబ్బరి విత్తనంలో నీళ్ళు ఎన్ని? కొబ్బరి బొండాలలో నీళ్ళు ఎలా వస్తున్నాయి? చెట్టు భూమిలో నుండి నీటిని, కొబ్బరికాయలో దాన్ని పదిల పరుస్తూంటుంది. ఏం జరిగిందీ? విత్తనం వాహిక అయ్యిందా? మూలం అయిందా? విత్తనం వాహికగా పంచభూతాలూ దానిలోంచి వ్యక్తమౌతూంటాయి. గాలి, నీరు, వేడిమి, భూమిలోని పదార్ధము పుచ్చుకొని కదా ఇది పెరుగుతుంది. కాబట్టి విత్తనం అక్కడ వాహికగా అయింది. ఇదో మామిడిచెట్టు, దీనికొక చోటు. కొంచెం దూరంగా ఇంకో మామిడిచెట్టు వేస్తారు తప్ప, ఆ మామిడిచెట్టు మొదల్లోనే మరో మామిడిచెట్టు వేయరు కదా! ఎందుకంటే దీని నీడ పడితే, అది పెరగదంటాం కదా! దానిక్కొంత area, ఆ area లో అది పెరగడం, అది దానికి సంబంధించిన స్థలం. ఇలా మనకి తెలుస్తుంది కదా! ఈ మొత్తం లోంచి అసలు ఏం పెరిగింది? బ్రహ్మలోంచి అలాగే విచ్చుకుందిట. బ్రహ్మ కూడా ఒక విత్తనం లాంటివాడు. మన నుండి పెరిగినదంతా మనం కారణంగా పెరిగింది కదా! అది పదిమందీ అనుభవిస్తూంటారు కదా! మొత్తం అంతా మనకి అప్పజెప్పినా కూడా ధర్మకర్తలమే తప్ప స్వంతదారులం, యజమానులం కాదు. విత్తనం లోంచి పుట్టుకొచ్చిన దానికి విత్తనం కారణమైంది తప్ప, నీరు విత్తనానిది కాదు. సూర్యరశ్మి విత్తనానిది కాదు. భూమిలో పదార్ధం విత్తనానిది కాదు. కానీ అవన్నీ విత్తనం లోంచి వ్యక్తం అయ్యేసరికి ఇది అంత వృక్షమైంది. అలాగే సృష్టి కూడ. అలాగే మనం కూడ. కాబట్టి ఈ మొత్తమంతా అయినది వాడే. మనకిచ్చినట్లుగా ఇచ్చి, మళ్ళీ వాడే వుంటాడు. కనుక నాలోనుండి వ్యక్తమయ్యేది కూడా నువ్వే అని తెలుసుకున్నాం అనుకోండి, అప్పుడు ఈ వ్యవసాయం, వ్యవస్థానం, సంస్థానము, స్థానదుడు, ఇలా జరుగుతూంటే మనలో ఒక ధృవత్వం ఏర్పడుతుంది.

401 ధ్రువః

ధృవత్వం అంటే ఒక కేంద్రంగా పాతుకుపోవడం అన్నమాట. ఒకే పని కొన్ని సంవత్సరాల పాటు అలా చేస్తూంటే, మనలో అది అభ్యాసంగా స్థిరపడుతుంది. అభ్యాసాలన్నీ అలా అయినవే. ఏది అభ్యాసమైనా, అదలా అనుస్యూతంగా ప్రతిరోజూ చేయడంవలన కదా మనకది అభ్యాసంగా అయినది. అభ్యాసం అయేంతవరకూ చేయాలి కదా! అందుకని మనచేత అభ్యాసం చేయిస్తాడుట అన్నిట్లోను. చేసి, ధృవపరచి మనం ఉండేట్లు చేస్తాడు. ఎందుకంటే సృష్టికి స్థితి కావాలి కదా! స్థితి కావాలంటే ఈ ధృవత్వం కావాలి. మనక్కూడా కేవలం ఆలోచనలే వచ్చి అవి కార్యరూపం దాల్చకపోతే ఏమౌతుంది? ఏమీ అవదు. కార్యరూపం దాలిస్తే అవతరణ జరుగుతుంది. అవతరణం చెందిన తర్వాత, అందులో మనం ఇరుక్కుపోవడం కూడా జరుగుతుంది. అందుకని మనం ఏది అభ్యాసం చేస్తామో, అది నెమ్మదిగా మనమీద స్వామిత్వం పొందడం ప్రారంభిస్తుంది. పిల్లవాడికి బయటకి వెళ్ళి ఆడుకోరా, ఎంతసేపూ నా చుట్టు తిరుగుతావేంటి అని తల్లిదండ్రులు చెప్తే, వాడు నెమ్మదిగా ముందు ఏడుస్తూ బయటకి వెళ్తాడు. ఆ తర్వాత బయటకి వెళ్ళినవాడు రాడు. ఏరా ఎంతసేపయ్యింది, తొమ్మిదయినా ఇంటికి రావేం? అంటే అదేంటీ నువ్వేకదా వెళ్ళమన్నా వంటాడు. అలాగే జీవులు కూడా భగవంతుని నుండి విడివడి వ్యక్తీకరణం చెందడానికి ఎన్నో సంవత్సరాలు జరుగుతాయి. ఈ వ్యక్తీకరణం అంటే individualisation జరిగాక వద్దు మొర్రో పొమ్మంటే బయటకి పంపేసినట్లు. పోయిన తర్వాత వాడు వస్తాడా? రాడు. అందుకు వాణ్ణి తెప్పించుకోడం కోసం మనుషుల్ని పంపించుకోవాలిక. పిల్లవాడు ఏమయ్యాడు చూడు అని ఇంట్లోవాళ్ళని పంపిస్తాం కదా! ఇంట్లో వున్న పెద్దవాడినో, వాళ్ళనో, వీళ్ళనో పంపించి ఇదికాదు నీచోటు, నీ చోటు అది. మళ్ళీ నువ్వు అక్కడకి వచ్చెయ్యాలి అంటే అభ్యాసం ద్వారానే మళ్ళీ అది వీలుపడుతుంది. ఇటుకైనా అభ్యాసమే, అటుకైనా అభ్యాసమే. అందుకని అభ్యాసం అనేది సృష్టిలో ఒక పెద్ద దేవతామూర్తిగా తయారైంది. ఆ అధిదేవతను తమోగుణం ఆధారంగా ఏర్పరుస్తాడుట. ఏ అలవాటైనా దానికి స్థిరపడాలంటే, తమోగుణం ద్వారా స్థిరపరుస్తారు. రజోగుణం మళ్ళీ మార్పును తీసుకువస్తుంది. అందుకని మళ్ళీ మార్పుకు అగ్ని కావాలి అని అడుగుతాం. తపస్సు అనే అగ్ని ద్వారా మళ్ళీ మార్పులు తీసుకువస్తుంది. అందుకని స్థిరపడుతూ, స్థిరపడకుండా ఉండడంగా కనిపిస్తుంది సృష్టిలో. దేనిలోనూ చతికిలబడడానికి వీల్లేదు. అదే హిరణ్యాక్షుడు ఒక ప్రక్క సృష్టి చేస్తూంటే, మరోప్రక్క ముడిచేస్తూంటాడు. చాప చుట్టేసినట్లు చుట్టేస్తూంటాడు. ఏమిట్రా చుట్టేస్తున్నావంటే, మాకీ కథ తెలుసు, మాకు

ఇది వద్దంటాడు. విచ్చుకున్నకొద్దీ మర్చిపోతాం. అదో గోల అసలు విచ్చుకోడం ఎందుకు? విచ్చుకోనే వద్దంటాడు. విచ్చుకొనేప్పుడు విచ్చుకోవాలి. ఆట మొదలు పెట్టేప్పుడు ఆటగాళ్ళందరూ క్రీడారంగం లోకి వెళ్ళాలి. అయిపోయాక రావాలి. అక్కడే ఉండిపోవడానికి వీల్లేదు. కనుక ఆటకి వెళ్ళడానికి, తిరిగిరావడానికీ కూడా అభ్యాసం కావాలి. అందుకని 'ధృవత్వం' అనేది మళ్ళీ కృషి ద్వారానే ఏర్పడుతుంది. ఇటు పాతుకున్నా, అటు పాతుకున్నా రెంటికీ కృషి కావాలి. ఇటు పాతుకోడానికి ఎంత కృషి కావాలో, అటు పాతుకోడానికి అంత కృషి కావాలి. అందుకని ఏమన్నారంటే ఎందులో పాతుకుంటే మనం సుఖంగా, దెబ్బతినకుండా వుంటాం, బిగుసుకు పోకుండా వుంటాం అన్న ప్రశ్నకు మనకు ముగ్గురు సోదరులు జవాబులు చెప్తారు. వారే రావణ, కుంభకర్ణ, విభీషణులు. ఒకడేమో కావాలని పోయాడు. మరొకడు అక్కరలేదని పోయాడు. మూడవవాడు ఏది చేయాలో అది చేయాలనుకున్నాడు. సృష్టించి, సృష్టిలో ధర్మస్వరూపంగా భగవంతుడున్నాడని చెప్తాం కదా! అదే సత్యం అంటే. సః, తి, యం ఉన్నదాంట్లోంచి వ్యక్తమైన దాంట్లోకి తానే ప్రవేశించి ధర్మస్వరూపుడుగా వుంటాడు. అందుకని ఉప్పు ఉప్పుగానూ, పంచదార పంచదార గాను, పులి పులిగాను, పాము పాముగాను, ఒక్క మనిషి తప్ప అన్నీ వాటి ధర్మాలు నిర్వర్తిస్తూనే వుంటాయి. వీడే ఎట్లా వుంటాడో వీడికే తెలియదు. ఎందుకంటే వాడికున్న స్వతంత్రం వీడికే వుంది కాబట్టి వీడు అన్ని రకాలుగానూ ఉండగలడు ఒక్క మనిషిగా తప్ప. అటు చేపలా ఈదగలడు. ఇటు పక్షిలాగ ఎగురగలడు. మనిషిలా మాత్రం ఉండలేడు. ఇలా వున్నప్పుడు ఎట్లా వుంటే ఈ సృష్టిలో ఇరుక్కోకుండా ఉండగలం అంటే ధర్మంతో కూడి వున్నట్లైతే ఇరుక్కోకుండా ఉండగలం. తమస్సుకు కుంభకర్ణుడు ఏమయ్యాడో తెలుస్తుంది. రజస్సుకి రావణుడు ఏమయ్యాడో తెలుస్తుంది. సత్వానికి విభీషణుడు ఏమయ్యాడో తెలుస్తుంది. లంకలో వుంటూ లంకలోంచి బయటకి వస్తాడు కదా! రామాయణంలో లంకంటే శరీరం అని ఒక సంకేతం. లంకను పాలించేవి మూడు త్రిగుణాలు. అందులో సత్వం, రజస్సు, తమస్సు. Domination ఎవరిది? రజస్సుది. అందుకని విభీషణుడు పడివుంటాడు. ఎన్నాళ్ళకీ మాట వినడు రజస్సుగారు. అందుకని సత్వానికి ప్రతీకయైన వీడు బయటకి వచ్చేసి, త్రిగుణాలకు అతీతమైన తత్త్వాన్ని పట్టుకొని మళ్ళీ లోపలకి వచ్చి, లంకను సరిచేసుకుంటాడు. మన ప్రార్ధన అంతా అదే. మనం నేర్చుకోవలసిన దేమంటే, ఈ సాధన చేసేవాళ్ళం మన ప్రార్ధనలో ఏముండాలి? రావణాసురుడి ప్రార్ధన ఉండరాదు. రావణాసురుడి ప్రార్ధన ఏమంటే ఏదో కావాలని అనుకున్నాడు. Result oriented ప్రార్ధన కదా! వాడేమైపోయాడో తెలుసు కదా! కుంభకర్ణుడు కూడా అంతే. ఒకడేమో చావుండకూడదని కోరుకున్నాడు కదా! అసలు చావనివాడు

చావుండ కూడదని కోరుకోవడమేమిటి? తను చావనివాడు. చస్తాను అని అనుకోవడం వలన కదా చావకుండా వుండాలని కోరుకున్నది? ఎందుకొచ్చిందా అజ్ఞానం? తాను వేరుగా వున్నాననే భావన వల్ల వచ్చింది. మొత్తమే తానుగా ఉన్నవాడు చచ్చిపోడానికేమీ లేదక్కడ. ఈ ఇల్లు వుంటే, ఇంటి లోపల చోటు, బయట చోటు వుంది. ఇల్లు కట్టకముందు? ఇదే చోటు. ఇల్లు తీసేస్తే అదే చోటు. చోటెప్పుడూ చోటుగానే వుంది. గోడలు కడితే లోపలొక చోటు, బయటొక చోటు అయింది కదా! అలాగే శరీరం వుంటే, ఇదేదో వేరుగా వున్నానని అనిపిస్తే, నేనెప్పుడూ ఉండాలనిపిస్తే నువ్వెప్పుడూ వుంటావు. అలాకాక అడిగిందేమంటే గోడలు ఎప్పుడూ వుండాలని అడిగాం. నేనెప్పుడూ వుండాలని అడగలేదు. వాడేమైపోయాడు? అధర్మమైన కోరిక. అంటే సృష్టి ధర్మాలున్నాయి. చోటెప్పుడూ వుంటుంది. గోడలుండక పోవచ్చు. గోడలు మళ్ళీ కట్టుకుంటూ వుండచ్చు. వాడు అలాగే కోరుకున్నాడు. ఇంకోళ్ళ ఉద్యోగం నాకిప్పించమని కోరుకున్నారు కుంభకర్ణుడు, రావణుడూనూ. మనకి స్వశక్తి వుంటే చాలు. ఏమన్నా సంపాదించుకోవచ్చు కానీ చావుండరాదని అది కోరుకున్నాడు. కుంభకర్ణుడు ఈ గోలంతా ఎందుకు? అసలు వాడి సింహాసనం అడిగేస్తే పోతుంది కదా అని అడగబోయి, ఇంద్రాసనం అనబోయి, నిద్రాసనం అనేసాడు. అంతే వాడికి నిద్ర వచ్చేసింది. వాడు పడుకుండి పోయాడుట. విభీషణుడు ఏం అడిగాడు? ఈ సృష్టి అంతా నిర్మించి, ఇందులో ధర్మ స్వరూపంగా నువ్వున్నావు కాబట్టి నా మనసెప్పుడూ ధర్మంతో కూడియుండేటట్లు గాను, ధర్మ విరుద్ధమైన భావనలు రాకుండా వుండేటట్లుగాను నాకు వరమివ్వ వలసినదని అడుగుతాడు. మనమేం అడుగుతాం ప్రేయర్స్ లో? ఏమిటేమిటో అడుగుతాం. విభీషణుడు అడిగినట్లు అడగాలి. మనస్సు ఎప్పుడూ ధర్మం నుండి ఎప్పుడూ విడిపడకుండా, ఇంకోవైపుకు చూడకుండా వరమివ్వగలవా నాయనా అని బ్రహ్మను అడుగుతాడు విభీషణుడు. చాలా సంతోషం ఇస్తున్నా నంటాడు. అందుకే అతని మనసెప్పుడూ ధర్మంగా ఆలోచిస్తుంది. సీతను తీసుకురావడం ధర్మం కాదు. ఇదివరకెన్నో వెధవపనులు చేసావు. అది వేరు, ఇది వేరు. ఈమెను తెచ్చుకోవటం ఇంట్లో మంట పెట్టుకున్నట్లు. కుంపటి పెట్టావు. ఇంక కాలిపోవడమే అని చెప్తాడు అన్నకు. వినడు. వినకపోతే ఏం చేసాడూ, అంటే శరీరం సత్త్వాగుణాన్ని వినడం లేదు. లంకంటే శరీరమే కదా! అది త్రిగుణాలచేత పరిపాలింప బడుతున్నది. అందులో ఏం జరిగింది? ఎప్పుడైతే మిగతావి మాట వినడం లేదో, సాయం భగవంతుణ్ణి కదా అర్థించాలి? అదీ శరణాగతి. విభీషణుడి శరణాగతి అంటే శరీర ధర్మాలు కాక, సృష్టి ధర్మానికే అధ్యక్షుడైన తత్త్వాన్ని ఆశ్రయించడం. అందుకు ప్రార్థన చేయాలి. చేస్తే ఏం జరుగుతుంది? వాడు వస్తాడు. వచ్చి మనకు సహాయం చేస్తాడు. మనం కూర్చుంటే పనిచేసి పెట్టడం కాదు. కుంభకర్ణుణ్ణిలా చంపాలీ,

రావణాసురుణ్ణిలా చంపాలీ మొదలైన సలహాలన్నీ ఎవరిస్తారు? విభీషణుడే. లంకలోకి వెళ్ళి రాగలిగినవాడు ఒక్క హనుమంతుడు. అంటే శరీరంలోకి వెళ్ళగలడు, శరీరంలోంచి రాగలడు. లంకలోకి వెళ్ళి రాలేనివాడు అంగదుడు. నేను వెళ్ళగలను గానీ రాలేనని చెప్తాడు అంగదుడు. అంగదుడంటే, ఎప్పుడూ నామస్మరణ చేసుకొనేవాడని సంకేతార్థం. నామస్మరణ చేసుకొనేవాడు అంత పరిపూర్ణమైన సిద్ధి పొందినవాడు కాదు. ఇంకా సాధకుడే. హనుమంతుడు వెళ్ళగలడు, రాగలడు. ఇట్నుంచటు వెళ్ళినవాళ్ళు లంకలోకి, చాలామంది వుంటే ఇట్నుంచి వెళ్ళి రాగలిగినవాడు హనుమంతు డొక్కడూ అయితే లంకనుంచి వచ్చేసిన వాడొక్కడు విభీషణుడు. వాడూ మనకి ఆదర్శపురుషుడు. శరీరం పంచేంద్రియముల చేత, త్రిగుణముల చేత బంధింపబడి వుంటుంది. త్రిగుణములు ఒక ముడి, ఇంద్రియములు ఒక ముడి. భౌతికమైన శరీరం ఒక ముడి. ఈ మూడిటి నుండి బయటపడాలంటే మనస్సు నెప్పుడూ ధర్మమునందే లగ్నం చేసి వుంచాలి. అలా వుంచితే అవసరమైతే శరీరాన్నే వదిలేస్తావు తప్ప అధర్మాన్ని ఆచరించవు. అదీ విభీషణుడు. ఎంత కష్టం? అన్నగార్లిద్దరూ శరీరాన్ని పాడుచేస్తూంటే, ఇంక మనం అందులో కూర్చోడం ఎందుకూ? ఈ మొత్తానికి ఏది ఆధారమో దాన్ని పట్టుకుందాం అనుకున్నాడు. పట్టుకొని తెచ్చుకొని ఈ లంకని బాగుచేసుకున్నాడు. త్రిగుణాలకి అతీతమైన వెలుగే శుద్ధచైతన్యం. అదే గాయత్రి. అది త్రిగుణాత్మకమైన చైతన్యముగా అవస్థితి చెందుతూంటుంది. మనం కూడా శుద్ధమైన వెలుగు స్వరూపులమే. అయినా కూడా కోరికచేత రజస్సులో, అక్కర్లేదని అనుకోవడం వలన తమస్సులో, ధర్మానికి సంబంధించిన విషయముల ఆలోచన, కర్తవ్యాల వలన సత్వంలో వుంటాము. కానీ ఏదైనా ఈ త్రిగుణాల లోనికి రావడం అంటే చట్రంలో ఇరుక్కోవడమే. చట్రానికి అవతల నున్న సత్త్వాన్ని, చట్రంలోకి తెచ్చుకున్నప్పుడు ఎటునుండి బయటకు వెళ్ళాలంటెను చట్రంలోంచే బయటకు వెళ్ళాలి. రజస్సులోంచి దైవాన్ని సందర్శిస్తే, నీ కోరికే నీకు దైవంగా సిద్ధిస్తుంది. ముగ్గురన్నదమ్ములు కలిసి తపస్సు చేసారు. ముగ్గురికీ తపోబలం ఉండడం వలన బ్రహ్మ ముగ్గురికీ కనిపించాడు. ముగ్గురిలో అంత తపోబలం వున్నదంటే, దానికి సంబంధించిన రజోగుణం బాగా వున్నది కదా! అది సత్త్వాన్ని అంటిపెట్టుకొని వున్నదా, లేదా అని తప్ప. బ్రహ్మ కనబడగానే రావణాసురుడికి, కుంభకర్ణుడికి గంగవెర్రులెత్తాయి. విభీషణుడు మాత్రం ఇలా వుండబట్టి బయటకు రాగలిగాడు. దైవాన్ని కలవగలిగాడు. దైవం యొక్క శరణాగతి పొందగలిగాడు. దైవంతో పాటు మళ్ళీ శరీరంలోకి రాగలిగాడు. లంకలోకి వచ్చాడు కదా రాముడితో. వెళ్ళిపోయినవాణ్ణి మళ్ళీ రాను వస్తే వాడితో పాటే వచ్చి, ఇది మార్చుకుంటానని చెప్పి వెళ్ళిపోతాడు. తిరిగివచ్చాక శరీరమనే లంకని

పాలించడానికి కావలసిన స్వామిత్వమును పొందుతాడు దైవం యొక్క సాయం చేత. అప్పటినుండి రాముని ప్రతినిధిగా లంకను ఏలుకుంటాడు అంతే. ఈ క్షేత్రం ఆయనిది. దీనికి మనం ప్రతినిధులం అని నామస్మరణతో లంక ఏలుకున్నవాడు విభీషణుడు కదా! ఇంత జరగాలంటే మనం చేసే ప్రార్థనలో మనం కోరుకోవలసినది 'ఈ మొత్తం సృష్టిలో ధర్మంగా వుండే తత్త్వంతో నాకు అనుసంధానం కలగాలి' అని. అప్పుడు మనకొచ్చే ఆలోచనలన్నీ కూడా ధర్మానికి సంబంధించి వుంటాయి. తద్వారా మన క్షేత్రాన్ని కృషితో చక్కగా పండించుకొని, పంటభూమిగా తయారు చేసుకోవచ్చు. తయారుచేసుకుంటే ఇదే స్వర్గం అవుతుంది. తయారు చేసుకోకపోతే ఇదే నరకం అవుతుంది. ఏది? ఇదే ఈ శరీరం. మన శరీరమే మనల్ని ముప్పతిప్పలు పెట్టడంలేదా? కొంతమందికి పాలం ఇబ్బంది పెడ్తూంటుంది. ఏంటోనండి మా నాన్న ఎందుకిచ్చాడో ఈ పాలం అంటాడు వీడికి చేతకాక. అలాగే శరీరాన్ని చక్కగా నిర్వర్తింప చేయలేనివాడు మాట్లాడేస్థితిలో ఈ సాధన చేసే వారుండరాదు. అందుకని ఈ నామాన్ని బాగా పదేపదే గుర్తుపెట్టుకోవాలి. అందుకనే మనకన్నా తక్కువ దైవప్రార్థనలు చేసి, ఎక్కువ కృషి చేసేవారికి ఎక్కువ ఫలితాలు, సంపదలు కనిపిస్తాయి. ఏం? నేనింత దైవప్రార్థన చేస్తూంటే ఏమీ జరగదేం అంటాడు. జరగడానికి నువ్వేమన్నా చేస్తేగా? దేవుణ్ణి ప్రార్థించి table జరగాలి అనుకోడం ఒక పద్ధతి. Table ని జరుపుకుంటే పోలేదా? నీలో కూడా వున్నాడు కదా! కర్తవ్యం చాలా ముఖ్యం. బుద్ధిమంతుడు సినిమాలో చాలా చక్కగా చెప్తాడు. గోపురం పైన గంట కొట్టిస్తానంటాడు దేవుడి చేత వాడు. మన ద్వారానే కొట్టిస్తాడు, మనం వెళ్ళి కొట్టచ్చంటాడు వాడి తమ్ముడు. గుడి ముఖ్యమా, బడి ముఖ్యమా ఆ సినిమా. వాళ్ళన్నయ్య దేవుడి గుళ్ళో, గర్భగుళ్ళో తలుపేసుకొని కూర్చొని దేవుడు గంటలు కొట్టకపోతే తలకొట్టుకు చచ్చిపోతానంటాడు. దేవుడున్నాడని prove చేయాలి. వెంటనే వాడి తమ్ముడు వాళ్ళన్నయ్య కోసం ప్రాణాలకు తెగించి ఎక్కి గంటలు కొడ్తాడు. దేవుడే కొట్టించాడని వీడు బయటికి వస్తాడు. దైవప్రార్థనల వలన వచ్చే స్ఫూర్తితో మనమే పనిచేయాలని ఈ ఆధ్యాత్మిక మార్గంలో నడిచేవారు గుర్తుపెట్టుకోవాలి. మనకి సంకల్పం వాడే కలిగిస్తాడు. దానికి బలాన్ని కూడా కల్పిస్తాడు. అంతేకానీ మనల్ని కూర్చోపెట్టి పనులు చేసిపెట్టడు. అందుకని పనులు చేసేవాడి వెంట, వాడి పని రూపంలో నేనున్నాను అంటాడు. పనిచేయకుండా కూర్చునేవాడి రూపంలో వుండడు. అంతే. అందుకనే కృష్ణుడు యుద్ధం ఎట్లా చేసుకోవాలో చెప్తాను గానీ యుద్ధం నేను చెయ్యనని చెప్పాడు అర్జునుడు వచ్చి అడిగితే. తమరు చేయండి, తమరు బాణాలు సంధించండి, వదలండి రథంలో కూర్చొని, ఎలా చేయాలో చెప్తానంటాడు. చేసిపెట్టనంటాడు. చేసిపెడ్తానంటే ఇంకో

ఇన్ని చెప్తాం. పిండి రుబ్బడం దగ్గర్నుండి అన్నీ చెప్పమూ చేసేవాడుంటే? అందుకని నీలోనే చేసిపెట్టేవాడిగా ఒకడున్నాడు కాబట్టి వాడితో చేయిస్తూండాలి. మనం చేయకుండా ఇంకొకళ్ళు చేసిపెట్టాలనుకొనే వాళ్ళంతా దెబ్బతింటారు. అలా దెబ్బతిన్నారు. మనం చేయడం వలన మాత్రమే దానికి ఆ మార్పు వస్తుందని తెలియాలి. మార్పు అంటే మనకి కదా! మనకి అంటే మన శరీరంలో మార్పు. దాన్ని పంటభూమిగా చేసుకోవాలంటే మనం చేస్తే వస్తుంది. కాలు కిచ్చేస్తే? వాడు పట్టుకుపోతాడు. అదేకదా జరిగింది. అగ్రహారీకులంతా ఏమయ్యారు? అమెరికా పారిపోయారు. అక్కడకి పూజారి ఉద్యోగం కోసం వెళ్ళిపోయారు. ఆ పనిక్కడే చేస్తే అగ్రహారాలు పోయేవి కాదుకదా! వ్యవసాయమైనా, వ్యాపారమైనా, ఉద్యోగమైనా ఏదైనా మనం చేసుకుంటేనే వస్తుంది. సాధనైనా అంతే. మనం ఏమీ చేయకుండా ఇన్నాళ్ళూ గురువుగార్ని అంటిపెట్టుకొని వున్నా గురువుగారేం చేయలేదంటే? నువ్వు దానికి సంబంధించినదేమీ చేయలేదుట అని అర్థం చేసుకోవాలి. కొంత మనకి ఈ భావం ముఖ్యం. పురుష ప్రయత్నం మన చేతిలో వున్నది. దైవానుగ్రహం మన చేతిలో లేనిది కనుక మన చేతిలో వున్నది మనం చేయాలి. మనమంతా ఒక చోటు విత్తనాలమే కదా! ఒకచోట బాగా పెరుగుతుంది. ఒకచోట అస్సలు పెరగదు. ఒకచోట అంతంత మాత్రంగా వుంటుంది. ఏమిటి కారణం? వ్యవసాయం. శ్రద్ధ, భక్తి, కృషి, దానియందు మనం చూపే సమర్పణ భావం. మనం దేనియందు ఎంత శ్రద్ధ చూపిస్తామో అది అంత వికాసం చెందుతూంటుంది. అందుకని ఆ విధంగా చేసుకుంటూ వెళ్తూంటే ధృవములు ఏర్పడతాయి. ఏర్పడినపుడు 'స్థానదో' అంటే మనకప్ప జెప్పేస్తాడు. ఇది నీకు ఇచ్చాను నువ్వు పరిపాలించుకో అని చేయకుండా ఎదురుచూసే జాతి అవడం వలన మనం ఇలా వున్నాం. చేసి అంతా మేమే చేస్తున్నాం అనుకొనే జాతులున్నాయి. వాళ్ళు మనకన్నా బాగున్నారు. ఎందుకంటే కనీసం చేయడం అనే తత్త్వం ఉన్నందువలన బాగున్నారు. కాకపోతే మేమే చేస్తున్నాం అనే అహంకారం వలన పడిపోవచ్చు. మనుషుల్లో కూడా అంతా నేనే చేస్తున్నానని అనుకొనేవాళ్ళు చాలామంది వున్నారు. వాడెప్పుడు పడిపోతాడా అని చూస్తూంటాడు ఈ చేయనివాడు. వాడు పడిపోవాలని అనుకోడం ఎందుకు? అమెరికా పడిపోతే బావుణ్ణని చూసే దేశాలు ఈ భూమిమీద చాలా వున్నాయి. ఎందుకు పడిపోవాలి? మనకి లేక వాడు పడిపోతే మనతో సమానంగా వుంటాడనే తప్ప, మనం బావుండచ్చు కదా! అందుకని ప్రత్యేకించి మన భారతజాతికి, ప్రత్యేకించి యువతరానికి ఈ నామం చాలా అవసరం. ప్రార్థన కూడా తనలో వుండే స్వయంకృషి పెంచుకోడానికి చేయాలి తప్ప, వాడేదో చేసిపెడ్తాడనే భావనతో కాదు.

వ్యవసాయో వ్యవస్థానః సంస్థానః స్థానదో ధృవః

పరర్ధిః పరమస్పష్ట స్తుష్టః పుష్టః శుభేక్షణః

అనే ఈ శ్లోకంలో 'వ్యవసాయం' అంటే విపులంగానే, లోతుగానే అర్థం చేసుకున్నాం. ఆ వ్యవసాయం ఎలా చేసుకోవాలో మన శరీర విషయంలో గానీ, సృష్టి విషయంలో గానీ భగవంతు డేవిధంగా చేస్తున్నాడనేది మనకి అవగాహన అయింది. దాన్నుండి నిరంతర కృషి ఆధారంగా సృష్టి ఏ విధంగా ఏర్పడుతున్నదో, దానికి 'క్షీరసాగర మథనం' అన్నది ఋషులు ఏవిధంగా సంకేతంగా ఇచ్చారో, అదేవిధంగా కృషిని అనుస్యూతంగా, నిరంతరంగా జరపాలనీ, ఆ కృషి ఆధారంగా ప్రతివారికీ కొంత పరిధి ఏర్పడుతుందని తెలిసింది. సృష్టికి కూడా అలాగే ఒక పరిధి ఏర్పడింది. ఆ పరిధిలో గ్రహగోళాదులన్నీ ఏర్పడుతున్నాయి. ఈ ఏర్పడడంలో వ్యవసాయానికి ఎక్కడా విశ్రాంతి లేదు. విశ్రాంతి కావాలనుకుంటే వ్యవసాయం జరగదు. మనలో కూడా స్పందనం కాసేపు విశ్రాంతి తీసుకోవాలనుకుంటే, మిగిలిన కార్యాలేమీ జరగవు కదా! అలాగే ఉచ్ఛ్వాస, నిశ్వాసలు విశ్రాంతి తీసుకుంటే ఏమీ జరగదు కదా! అలాగే సృష్టిలో స్పందనం మొదలైనప్పటి నుండి, ఒక సృష్టి పూర్తై, మరో సృష్టి పుట్టేవరకూ కూడా అనుస్యూతం కృషి జరుగుతూంటుంది. కృషి మనకు సంబంధించినది. అనుగ్రహం భగవంతునికి సంబంధించినది. కాబట్టి శక్తివంచన లేకుండా కేంద్రాలు ఏర్పాటు చేసాడు. మనం కూడ తాత నుండి కార్యక్రమం తండ్రికి అందితే, తండ్రి నుండి కొడుక్కి అందితే, కొడుకు నుండి మనుమడికి అందుతూంటే, కొంతకాలం ఆయన అధిష్ఠించి యుంటాడు. కుటుంబ పెద్ద ఎన్నాళ్ళు కుటుంబ పెద్ద? కొడుకు చేతికంది వచ్చి, కార్యక్రమాలు నిర్వర్తిస్తూంటే వాడి చేతికి అప్పజెప్పేస్తారు. అప్పుడేమైనట్లు? కొడుకు రూపంలో తండ్రి వున్నట్లే! అందుకని కొడుకుగా పుట్టినవాడు తానే అని తెలియడం కోసం 'ఆత్మావై పుత్రనామాసి'. నీ నుండి దిగివచ్చినదే కదా! అలా దిగివచ్చి మళ్ళీ కేంద్రాలై, మళ్ళీ పరిధులు ఏర్పడుతూంటాయి. మళ్ళీ కేంద్రాలు ఏర్పడతాయి. మళ్ళీ పరిధులు ఏర్పడుతూంటాయి. ఇక ఇది అనంతం! అందుకనే Centre every where. Circumferance no where అన్నారు మాస్టరు సి.వి.వి. గారు. అంటే ప్రతీదీ కేంద్రమే సుమా! అది పరిధిగా కనిపిస్తుంది తప్ప అది కేంద్రమే. ఇవాళ పరిధి, రేపు కేంద్రం. ఇలా కేంద్రాలు ఏర్పరచుకొంటూ వ్యాపిస్తూంటాడు. ఎక్కడికక్కడ full of activity వుంటుంది. అది దాని సంస్థానం! దాని వ్యవస్థానం! అది వ్యవసాయం వల్ల ఏర్పడింది. దానికొక కేంద్రం ఏర్పడింది. ఆ కేంద్రం ఆధారంగా అక్కడ పనులు జరుగుతూంటాయి. ప్రతి మనిషీ కేంద్రంగా వాడిచుట్టూ కొంచెం పని జరుగుతూంటుంది. మంచో, చెడో వాడి పరిధి వాడికుంటుంది. ఎవడి పన్నా వాడిది అంటూంటాం కదా! ఎవడి పన్నాలో వాడు పని చేస్తూంటాడు. కొంతమంది పన్నా

కేవలం వాడింటి వరకే ఉండవచ్చు. మరి కొంతమంది పన్నా వీధి వరకు ఉండవచ్చు. మరి కొంతమంది పన్నా ఊరి వరకు ఉండవచ్చు. అలా కొంతమందిది పెరుగుతూండవచ్చు వాడి కృషిని బట్టి. చాలా అదృష్టవంతుడండీ, అంటారు. అదృష్టం అంటే ఏమీలేదు మనకి కనబడదు అంతే. అ, దృష్టం కదా! మనకి తెలియనిది. సృష్టిలో వ్యవసాయం తప్ప అదృష్టం లేదు. ఎంత కృషి చేస్తే అంత అది తిరిగి వచ్చి, మన నుండి వ్యక్తమవుతుంటే, చూసేవాడికి అదృష్టంగా కనబడుతుంది. చేసేవాడికి అదృష్టంగా కనబడదు. ఎందుకంటే వాడికి తెలుసు ఇదంతా తనతో అనుసంధానం చేసి చేస్తూండడం వల్ల జరుగుతోందని. తననుండి వాడే జరిపిస్తున్నాడనే వాడు భక్తుడు. ఒకరోజు ఒక మనిషి మహాత్ముడుగా మారగానే, ఆ రోజేదో తోకచుక్క దిగివచ్చిందండీ, ఆ మర్నాడాయన మహాత్ముడై పోయాడండీ అని సి.వి.వి. గారి గురించి చెప్పకుంటూంటాం కదా! అట్లా మామూలు మనిషి మీద తోకచుక్క దిగివస్తే ఢామ్మని పేలిపోతాడు. అంతకు ముందు ఏ సాధనా లేకుండా ఏ మనిషీ మహాత్ముడు కాలేడు. ప్రతి వ్యక్తికీ తను చేసిందే తన దగ్గరకు వస్తుంది. సృష్టిలో ఆ విధంగా నిర్మాణం చేసి వదిలేసాడు. ఎక్కువ, తక్కువలు చేయలేదు. నువ్వెంత చేస్తే నీకంత వస్తుంది. 'కృషితో నాస్తి దుర్భిక్షం' నువ్వు చేసుకుంటే వస్తుంది. నువ్వు చేసుకోకపోతే రాదు. ఇదివరకు చేసుకుంటే ఇప్పుడు వచ్చింది. ఇదివరకు చేసుకున్నది ఇప్పుడు మనం చూడలేం కాబట్టి ఇప్పుడు మనకది అదృష్టం అంటారు. విష్ణువు కూడా వ్యాపనం చెందడం ఈ చేయడం నుండే. కృషి ఎక్కడ జరుగుతుంటే అక్కడ వ్యాపనం. భక్తులు అందుకే పనులు చేయడం నుండి జరగడం అనే స్థితిలోకి వస్తారు. అసలు చేయనివాడు కన్నా చేసేవాడు మెరుగు. చేసేవాడిలో మనం చేయడం కాదు, మననుండి వాడు జరుపుతున్నాడనుకునేవాడు మెరుగు. బుద్ధిమంతుడయ్యాడన్నమాట. ఒక విత్తనం ఇంత మామిడిచెట్టుగా అయి, కాయలిస్తున్నదీ అంటే అది కేవలం విత్తనం యొక్క ప్రభావమా? విత్తనం ఆధారంగా పంచభూతాలూ వ్యక్తమై ఇదంతా జరుగుతోందా? ఏది సత్యం? విత్తనంలో కేవలం ప్రణాళిక వున్నది. కానీ అందుండి విచ్చుకుంటున్నదల్లా పంచభూతాలే! మీలో విచ్చుకున్నా, నాలో విచ్చుకున్నా, ఇంకొకళ్ళలో విచ్చుకున్నా 'విచ్చుకునే తత్వం' ఒకటి వున్నది. దానికి సంబంధించిన ప్రణాళిక మనలో వున్నది. మనిషిలోనూ మహాత్ముడయ్యేంత ప్రణాళిక వున్నది. మరి అవలేదేం అంటే సాధన చేయలేదని అర్థం. నలుగురికీ నాలుగు విత్తనాలు ఇచ్చామనుకోండి, ఒకరింటిలో బాగా పెరిగిందండి. ఒకింటిలో బాగా పెరగలేదు. నాలుగూ ఒక చెట్టు విత్తనాలే! మనమంతా ఒక చోటు విత్తనాలమే కదా! ఒకచోట బాగా పెరుగుతుంది. ఒకచోట అస్సలు పెరగదు. ఒకచోట అంతంత మాత్రంగా వుంటుంది. ఏమిటి కారణం? వ్యవసాయం. శ్రద్ధ, భక్తి, కృషి,

దానియందు మనం చూపే సమర్పణ భావం. మనం దేనియందు ఎంత శ్రద్ధ చూపిస్తామో అది అంత వికాసం చెందుతూంటుంది. అందుకని ఆ విధంగా చేసుకుంటూ వెళ్తూంటే ధృవములు ఏర్పడతాయి. ఏర్పడినపుడు 'స్థానదో' అంటే మనకప్ప జెప్పేస్తాడు. ఇది నీకు ఇచ్చాను నువ్వు పరిపాలించుకో అని. తనదనుకుంటే దెబ్బ తింటాడు. అదీ పురాణాల్లో ఇంద్రుడి కథ. 'ఈ దివ్యలోకం అంతా నీకు అప్పజెప్పేసాను. వీళ్ళంతా నీమాట వింటారు. నేను అలా శాసించాను కాబట్టి, నువ్వు పరిపాలించూ' అంటే ఎవరి మూలంగా వాళ్ళంతా ఈయన మాట వింటున్నారో, వాణ్ణి మర్చిపోకుండా పరిపాలించుకుంటే ఇంద్రుడు దివ్యలోకాలకు అధిపతిగా ఉంటూంటాడు. అట్లాగే మనకీ శరీరం ఇచ్చాడు. ఇచ్చి మనకు దీనికాధిపత్యం ఇచ్చాడు. ఇచ్చి, దీనిని పరిపాలించుకో అన్నాడు. అంటే మనకప్ప జెప్పేసాడన్నమాట. అప్పజెప్పే గుణం భగవంతుని దివ్యగుణాల్లో ఒకటి. మన దగ్గరున్నది ఇంకోళ్ళకి అప్పజెప్పినట్లయితే అది ఒక పద్ధతి. అంతా మనం పట్టుక్కూర్చుంటే అది ఇంకో పద్ధతి. ఇలా రెండు రకాలుగా మనం చూస్తూంటాం మనుషుల్లో. పట్టుకున్న వాడినల్లా అది పట్టుకుంటూంటుంది. సమర్థుడైనవాడు తనపని చేసుకుంటూ, తనతో పనిచేసే సమర్థుడైన వాడికి తనుచేసే కార్యక్రమం అప్పజెప్పగలగాలి. ఏ విధంగా మనకి భగవంతుడు అప్పజెప్పగలిగాడో ఆ విధంగా మనం కూడా అప్పజెప్పగలిగి వుండాలి. విత్తనానికి మొత్తం ప్రణాళిక అంతా అప్పజెప్పింది కదా ఆ చెట్టు. మళ్ళీ విత్తనం అప్పజెప్పింది కదా ఆ చెట్టుకి. ఇలా మనం కూడా మన దగ్గరకి వచ్చినవి ఎవరి దగ్గరనుండి మనకి వచ్చాయో, వాటికి సంబంధించిన వాళ్ళుంటారు. వాళ్ళు వస్తారు దాని దగ్గరకి. మన దగ్గర వచ్చిన వాటినన్నిటిని పొందడానికి మళ్ళీ మనుషులొస్తారు పొందడానికి. అది సృష్టిలో పెద్ద రహస్యం. రావణాసురు డంతటివాడు రాముడి వద్ద యుద్ధంలో ఓడిపోతుంటే, శుక్రుడి వద్దకు వెళ్ళి, 'నన్ను రక్షించు రహస్యవిద్య చెప్పు' అంటాడు. అంటే అప్పుడు శుక్రుడు రావణుడికి ఆ విద్య ఇవ్వాలా, ఇవ్వకూడదా? అదో పెద్ద ధర్మమీమాంస జరుగుతుంది. తన దగ్గరున్నది ఎవరైనా వచ్చి అడిగితే ఇవ్వడం ధర్మం. అందుకని శుక్రుడు ఇస్తాడు. ఇస్తే ఆంజనేయస్వామి కారణంగా, రాముడు దానిని భేదించి, మళ్ళీ రావణుణ్ణి జయించడానికి మార్గాన్ని కల్పించుకుంటాడు. కాబట్టి ఏది మన దగ్గరకి వచ్చినా, దాన్ని పట్టుకుపోడానికి వస్తారు. సంపద వస్తే పట్టుకుపోడానికి మనుషులొస్తారు. మన వద్ద విద్య వుంటే అది తీసుకోడానికే మనుషులొస్తారు. తన వద్దకు వచ్చేవారిలో శ్రద్ధ ఉండేవారికి అది అప్పజెప్పి, మొదలుపెట్టినప్పుడు ఏ విధంగా 'అలక్ నిరంజన్' అన్నట్లు ఎలా ఒక్కడే వచ్చాడో, అలాగే మళ్ళీ అందరికీ అన్నీ అప్పజెప్పి వెళ్ళగలిగే పద్ధతిలో ఉండడం 'స్థానదో' అనే నామంలో ఎక్కువ గోచరిస్తుంది. ఇంత తయారుచేసి, అంతా అప్పజెప్పేసాడు కదా!

ఎంత విశ్వాసంతో అప్పజెప్పాడు? ఎంత నమ్మకంతో అప్పజెప్పాడు? ఎంత ప్రేమతో అప్పజెప్పాడు? ఎంత అనురాగంతో అప్పజెప్పాడు? మనకి మనదైన ఓ గిన్నె లాంటిది ఇంకోళ్ళ కివ్వాలంటే ఎంత బాధగా వుంటుంది? వేసేసుకున్న బట్టలివ్వాలంటే బాధగా వుంటుంది. కానీ ఏదో రోజున ఇవన్నీ వదిలేసి వెళ్ళిపోవాలి కదా! వదిలేసి వెళ్ళేకన్నా ఎవరికన్నా అప్పజెప్పి వెళ్తే? రెంటికీ ఎంత తేడా వుంది? అందుకనే మనకి గరుడపురాణంలో ఒక చక్కటి విషయం చెప్తారు. ఉండగానే అన్నీ చేసుకోవాలని, చచ్చిపోయాక చదువుకోవడం జరుగుతుంది. ఎవరైనా ఒక వ్యక్తి చచ్చిపోయేప్పుడు షోడశదానాలు, దశదానాలు చేయిస్తాము. గోదానం, భూదానం, హిరణ్యదానం. అప్పుడు కూడా ఏవో మెలికలు వేసి కానిచ్చేస్తాం. ఇవన్నీ గరుడపురాణం చదువుకోమంటామే, ఆ పది రోజులు ఈ జీవుడు దేహం వదిలిన సమయంలో చదువుకుంటే ఏం తెలుస్తుందంటే, జీవించి వుండగా మనం ఏమేం చెయ్యాలో తెలుస్తుంది. అంటే అవన్నీ ఎవరికీ? వెళ్ళిపోయిన జీవులకోసం కాదు. చదువుకుంటున్న జీవులకోసం! దాని అర్థం ఏమంటే, మీరూ ఓ రోజు వెళ్ళిపోతారు. వెళ్ళిపోయే లోపల మీ సంపద నలుగురికీ పంచిపెట్టండని చెప్తుంది గరుడపురాణం. కాబట్టి ఆ విధంగా మనం అప్పజెప్పుతూండాలి. ఎంత ముసలివాడైనా ఒక్కో తండ్రి, కొడుక్కి ఏమీ అప్పజెప్పడు. ఎప్పుడు పోతాడా ఈ ముసలిపీనుగ అని కొడుకు ఎదురుచూసే పరిస్థితి రానీయకూడదు. వాడందుకోడానికి ready గా ఉండగానే వీడు అందించేసి హాయిగా దులిపేసుకోవాలి. ఎక్కడికక్కడ తుండు దులిపేసుకోడం మార్గంగా వుండాలి తప్ప, పట్టుకు వేలాడే మార్గంగా వుండకూడదు. అది 'స్థానదః' అనే నామంలో తెలుస్తుంది. మనం ఇల్లు కట్టుకున్నాం. Bed rooom వున్నది. ఇంట్లో పిల్లవాడు పెద్దయ్యాడు. వాడికి పెళ్ళి చేసాం. నీ bed room వాడికిచ్చేస్తావా? ఇవ్వవా? వాడికి వేరే bed room ఏర్పరుస్తావా? ఎంత ఇచ్చేస్తే అంత సుఖపడ్తావు. ఏదైనా అప్పజెప్పడంలో ధీరత్వం వుంది, మగతనం వుంది, దైవత్వం వుంది. అది దివ్యగుణంగా భావన చేయాలి. అన్నీ మనమే పట్టుకు వేలాడదామనుకుంటే అవదు. అవకపోగా దానివల్ల మనకి రకరకాల బాధలుంటాయి. అందుకని ఈ నామం మనము గుర్తుంచుకుని మనకున్న వాటిలో ఇచ్చేసేవి ఏమున్నాయో చూసుకుంటూండాలి ఎప్పుడూనూ. మనం ఏవి ఇచ్చెయ్యగలం? అని. ఎప్పుడిచ్చెయ్యాలి? బాధ్యతారహితంగా ఇచ్చెయ్యకూడదు. దానినందుకొనే వాడు మనకి తారసపడ్డప్పుడు అది విద్య కావచ్చు, సంపద కావచ్చు, బాధ్యతలు కావచ్చు, హక్కులు కావచ్చు. అన్నీ చక్కగా అప్పజెప్ప గలగాలి. Retire అయిపోయామండి అందుకే మానేసామండి, అని కాకుండా retire కాకముందే చక్కని వ్యక్తిని శిక్షణ నిచ్చుకొని వాడికప్పజెప్పి, ఆ బాధ్యత నుండి మనం మరొక బాధ్యత లోనికి

నియుక్తులం కావాలి. అది మనకి సృష్టిలో బాగా కనిపిస్తుంది. ఎక్కడా ఏదీ కూడా పట్టుక్కూర్చోదు. ప్రతీదీ కూడా తను చేసిన దానిలో ఫలం ఇంకొకళ్ళకి అందించడం కనిపిస్తుంది. అలా గురువు నుండి శిష్యుడు అందుకుంటాడు. శిష్యుడు మళ్ళీ గురువవుతాడు. ఇంకో శిష్యుడికి అందిస్తూంటాడు. శిష్యుడు గురువు ఎప్పుడయ్యాడంటే, ఈ శిష్యుడు వద్ద నేర్చుకునేవాళ్ళు, ఈ శిష్యుడు చెప్పినట్లు వినేవాళ్ళు తయారై, వాళ్ళందుకోడానికి ready అయినపుడు ఈయన గురువైనట్లు. ఒక మనిషి అంతకు ముందు కొడుకుగా వున్నవాడు తండ్రెప్పుడయ్యాడు? తననుండి ఒక కొడుకు ఉద్భవించినపుడు కదా! ఒక శిష్యుడు గురువెప్పు డయ్యాడంటే, వాడి నుండి ఒక దివ్యమైన కార్యక్రమాన్ని అదే స్ఫూర్తితో అందుకొని నలుగురికీ అదే పద్ధతిలో అందించేవాడు తయారైనపుడు శిష్యుడు, గురువవుతూంటాడు. ఈ విధంగా మనకి 'స్థానదః' అనే నామం నుండి చక్కటి వివరణ అందుతుంది. మనం ఎప్పటికప్పుడు చూసుకుంటూండాలి. మన చుట్టూ ఉండేవాళ్ళల్లో ఎవరైనా అప్పజెప్పించుకోడానికి ready గా వుంటే, వాళ్ళలో అర్హత వుంటే అందించడానికి మనం సంసిద్ధంగా వుండాలి. మనం ఏం చేస్తామంటే, బాధ్యతలను అప్పజెప్పేస్తాం. హక్కులు ఉంచేసుకుంటాం. హక్కులకి, బాధ్యతలకి అవినాభావ సంబంధం ఒకటి వున్నది. ప్రతి హక్కు బాధ్యతను అనుసరించి వస్తుంది. ఎంత బాధ్యత వుంటే అన్ని హక్కులు వస్తాయి. ఎంత బాధ్యత వహిస్తుంటే, అన్ని అధికారాలను సృష్టి ఇస్తూంటుంది. బాధ్యతలు లేని అధికారం సృష్టిలో లేదు. అధికారం ఎలా సంపాదించుకుంటాడు? బాధ్యత పడుతున్నకొలదీ అధికారం సంపాదించుకుంటాడు. ప్రతి జీవుడూ ఒక సూర్యుడు అవగలిగే ప్రణాళిక సృష్టిలో నున్నది. ప్రతి ఒక్కరు భవిష్యత్తులో సూర్యమండలం కాగలిగినంత ఉంచాడు. సృష్టి ఇంకెప్పటి కవుతుంది? ఎన్ని కోటానుకోట్ల జీవులున్నాయో అవన్నీ సూర్యమండలాలు కాగలవు. అంత మనలో వున్నది కాబట్టి అది మనలో విచ్చుకోవాలంటే, ముందు వ్యవసాయం అన్నది చేసుకుంటూ వెళ్తూంటే వ్యవస్థానం, సంస్థానం వస్తుంది. అక్కడ నుండి మనం అందించడంగా వుండాలి. అందించినందు వల్ల ఎప్పుడూ నష్టపోము గుర్తుపెట్టుకోండి. భగవంతుడు అందించి నష్టపోయాడా? అందుకని మన దగ్గరుండే హక్కులూ, బాధ్యతలూ కలిపి అందించాలి. హక్కులు నా దగ్గరుంచుకుంటాను, బాధ్యతలు మీ కందిస్తాననే వాడు దుర్మార్గుడు. రెండూ అందించాలి. ఇలా అందించుకుంటూ వెళ్తూంటే, ఆ ప్రణాళిక మననుండి వ్యక్తమై, మనం కూడా ఒక విత్తనం అవుతాం. అదీ మాస్టరు సి.వి.వి. గారి వాహిక కావాలి అనేదానికి అర్థం. దేనికి వాహిక అవాలి? మాస్టర్ అనే చైతన్యానికి. మాస్టర్ అంటే ఏమిటి? భగవత్తత్వమే! ఆ తత్వానికి నీవు వాహిక అయినపుడు నీనుండి ఆ ప్రణాళిక

వ్యక్తమవుతుంటే, నువ్వు అపరిమితంగా పెరుగుతూంటావు. నీవు వాహిక అవడం వలన నీలో స్పష్టత వస్తుంది. అందుకని 'పరమస్పష్టః'[1] అని తర్వాత నామం వస్తుంది. వాహిక ఎప్పుడవుతారయ్యా అంటే తన దగ్గరున్నవి పట్టుక్కూర్చోకుండా అందరికీ పంచేస్తున్నట్టి వాడు, తనలో జరిగే శక్తి ప్రవాహాన్ని తెలుసుకొనే అర్హత పొందుతాడు. పొంది ఏం చేసాడయ్యా అంటే తను చేసేదంతా ఇతరుల కోసమే అని తెలుసుకొని 'పరర్ధి' అయి జీవిస్తాడు. 'స్థానదో' అనే నామం నుండి ఇవ్వడం నేర్చుకుంటాడు కాబట్టి జీవులమేలు కోరడం ఎక్కువగా వుంటుంది. ఈ రోజు జీవులకు ఏ విధమైన మేలు కలిగించాలన్న భావనే ఎక్కువగా వుంటుంది. అంటే 'పరర్ధి' యై జీవిస్తూంటాడు. ఎంతసేపూ భగవంతుడు కూడా అలాగే వుంటాడు. అప్పజెప్పేసిన తర్వాత అందరి మేలు కోరుతూ, అందరూ బావుండాలనుకుంటూ, అందరిలోనూ వుండి, అందరికీ స్ఫూర్తినిస్తూ వుంటాడు కదా! అది భగవత్తత్వం! సాధకుడు కూడా పరర్ధియై, ఈ orientation ఎప్పుడైతే అందుకోవడం నుండి అందివ్వడానికి మరిందో, అప్పుడు నడక మారుతుంది. అప్పటి వరకూ నడక మారదు. అందుకున్నదల్లా అందివ్వడానికే అని గుర్తుండాలి. అందుకున్నప్పుడు ముఖం వికసించి, అందివ్వాల్సి వచ్చినపుడు ముఖం ముడుచుకుపోతే బావుండదు. అది సాధనకి సంబంధించి వుండదు.

*****

విష్ణు సహస్త్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు 'భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట' అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్థ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ధ పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్